# Valasanantara Bahujana Navalalu-Vimarsanatmaka Adhayanam

A Dissertation submitted to the University of Hyderbad in
partial fulfillment of the degree of
DOCTOR OF PHILOSOPHY
in
TELUGU
By

Ponugoti Ravikumar

DEPARTMENT OF TELUGU
SCHOOL OF HUMANITIES
University of Hyderabad
(P.O) Central University, Gachibowli
Hyderabad - 500046
Andhra Pradesh
India

January-2015

# వలసానంతర బహుజన నవలలు - విమర్శనాత్మక అధ్యయనం


పరిశోధన

**పొనుగోటి రవికుమార్**


పీహెచ్‌డీ పట్టా కోసం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి

సమర్పించిన సిద్ధాంతగ్రంథము


తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగము

హైదరాబాద్ విశ్వవిద్యాలయం



జనవరి–2015

# CERTIFICATE

This is to certify the dissertation entitled "*VALASANANTHARA BAHUJANA NAVALALU-VIMARSHANATHMAKA ADHYAYANAM*" submitted by RAVIKUMAR PONUGOTI bearing Reg. No. 05HTPH02 partial fulfillment of the requirement for the award of Doctor of Philosophy in TELUGU is a under my supervision and guidance.

The dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of degree or diploma.

Signature of the Supervisor

Head of the Department

Dean of the School

# DECLARATION

I Ravikumar Ponugoti hereby Declare that this Dissertation entitled "*VALASANANTHARA BAHUJANA NAVALALU-VIMARSHANATHMAKA ADHYAYANAM* " Submitted by under the guidance and supervision of Prof. G. Aruna Kumari, is a bonafide research work. I declare that it has not been submitted previously in part or full to this University or any other University or Institution for the award of any degree or diploma.

Date:

Name: Ravikumar Ponugoti
Regd.No.05HTPH02

## తొలిపలుకులు

'వలసానంతర బహుజన నవలలు–విమర్శనాత్మక అధ్యయనం' అనే అంశాన్ని నా పరిశోధనాంశంగా ఎన్నుకున్నాను. నా ఎం.ఫిల్ పరిశోధనలో 'దళిత కవిత్వంలో పురాణ ప్రతీకలు' అనే అంశం మీద పరిశోధన చెయ్యడం జరిగింది. ఆ పరిశోధన తరువాత భిన్నమైన అంశంలో పరిశోధన చెయ్యడానికి బహుజన నవలలను ఎన్నుకోవడం జరిగింది. దానిలో భాగంగా తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రప్రాంతాలనుండి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీల నవలలను ఎంపిక చేసుకున్నాను. తెలంగాణ ప్రాంతం నుండి వేముల ఎల్లయ్య 'కక్క'. భూతం ముత్యాలు 'సూర', కాలువ మల్లయ్య 'సాంబయ్య చదువు'లలో వ్యక్తమైన బహుజన ఆలోచన విధానాన్ని పరిశీలించడం జరిగింది. రాయలసీమ నుండి చిలుకూరి దేవపుత్ర 'పంచమం', కొలకలూరి ఇనాక్ 'అనంత జీవనం',బండి నారాయణ స్వామి 'మీరాజ్యం మీరేలండి' మరియు ఆంధ్రా ప్రాంతం నుండి జి.కళ్యాణరావు ' అంటరాని వసంతం', డా.వి.చంద్రశేఖరరావు ' నల్లమిరియం చెట్టు, ఏకుల వెంకటేశ్వర్లు ' ఎన్నెల నవ్వు', సలీం ' వెండి మేఘం' మొదలగు నవలల్లో వ్యక్తమైన బహుజన చైతన్య వ్యక్తీకరణను పరిశీలించడం జరిగింది. పైన పేర్కొన్న రచయితలు అందరూ బహుజన కులాలకు చెందిన వారే. అంటే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు చెందినవారు. ఈ బహుజనులు తమ గురించి తాము ఎలా అక్షరీకరించుకున్నారో వారి చైతన్యం ఆ అక్షరాలలో ఏ విధంగా వ్యక్తం చెయ్యగలిగారో పరిశీలించడం నా పరిశోధన లక్ష్యం.

మొదటి అధ్యాయంలో వలసానంతరవాదనిర్వచనం, ఆవాద నేపథ్యం గురించి వివరించాను. బహుజన పదం నిర్వచనం, బహుజన పద నేపథ్యం ఆ పదం యొక్క ప్రాముఖ్యతను విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగింది. తెలుగు సాహిత్యంలో వివిధ వాదాల నేపథ్యంలో వచ్చిన నవలా పుట్టుక, వికాసం తెలియజేస్తూ ఆయా వాదాల్లో బహుజన ఆలోచన, చిత్రీకరణ విధానాన్ని స్థూలంగా తెలియజేయడం జరిగింది.

రెండవ అధ్యాయంలో వలసానంతర బహుజన నవల విమర్శనాత్మక అధ్యయనంలో భాగంగా తెలంగాణ నవల పరిశీలించాను. వేముల ఎల్లయ్య తెలంగాణ మాండలికంలో రాసిన 'కక్క' నవల ప్రాముఖ్యతను విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగింది. ఆ నవలలో ప్రధానంగా దొరల ఆగడాలు, బహుజనులు ఎలాఎదుర్కున్నారో వివరించారు. గ్రామాలలో ఇప్పటికీ తెలంగాణ మాండలికం కింది కులాల్లో ఏ విధంగా నిలిచి ఉందో 'కక్క' నవల ద్వారా ఎల్లయ్య గారు నిరూపించడం జరిగింది. కక్క నవలలో ప్రవేశపెట్టిన భాష నల్గొండ జిల్లా మాదిగ గూడాలకు చెందినదని చెప్పవచ్చు. దానిలో ఉన్న సౌందర్యాన్ని తెలియజేశాను. బాలకార్మిక వ్యవస్థను గురించి, వారి బాల్యం గొడ్ల దగ్గరే గడిచిపోవడాన్ని గమనించవచ్చు. ఆ బాలలపై దొరల ఆగడాలు, హృదయవిదారకంగా వివరించారు. పంచాయతీరాజ్ ఎన్నికలలో అగ్రకుల రాజకీయాలను గురించి సవివరంగా చర్చింటం జరిగింది. ఆంధ్రాకమ్మ వలస వాదుల గురించి పరిశీలించడం జరిగింది.

భూతం ముత్యాలు 'సూర' నవలలో గ్రామల్లో బతకలేక వలసలు వెళ్తున్న వైనాన్ని చిత్రీకరించారు. పిల్లల చదువుల కోసం తల్లి దండ్రులు పడిన ఆవేదనను తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం కింది కులాలను ఎలా మోసం చేశారో చర్చించాను. సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో చదువుకొని ఎదిగిన సూర పల్లెల్లో కొనసాగుతున్న కులాధిపత్యాన్ని, మూఢాచారాలను ఎదుర్కోవడానికి ఉన్నత చదువులు చదివినప్పటికి పట్టణం నుండి గ్రామాలకు తిరిగి రావాలని రచయిత సూర పాత్ర ద్వారా పిలుపునిచ్చారు. అంతేగాక చదువు ద్వారానే సమాజంలో మార్పు అనేది సిద్ధిస్తుందని రచయిత కూడా నమ్మినట్లు మనం గమనించవచ్చు. ఎందుకంటే రచయిత కూడా ఉపాధ్యాయుడే. అందుకే కథానాయకుడైన సూర గ్రామంలో 'పూలే, అంబేద్కర్' పాఠశాలను మొదలు

పెడతాడు. అంతే గాక గ్రామ ప్రజల్లో ఉన్న మూఢాచారాలకు వ్యతిరేకంగా పనిచేసి గ్రామీణుల

మెప్పును పొందుతాడు. దొర కూతురు జయలక్ష్మిని కులాంతర వివాహం చేసుకుంటాడు. తనను అంతమొందించడానికి దాడి చేసినప్పుడు గరీబు నాగిరెడ్డిని అంతమొందించిన విధానాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగింది. ఈ నవలలో అంబేద్కర్ వాదాన్ని రచయిత ఎంతో చక్కగా కూర్పు చేశాడు. ఈ విషయాలన్ని కూడా బహుజన చైతన్య నేపథ్యం నుంచి పరిశోధన చేయడం జరిగింది.

కాలువ మల్లయ్య–సాంబయ్య చదువు నవలలో గ్రామాలలో దొరల పెత్తందారి తనంను బడుగు బలహీణ వార్గాలు ఎలా బలౌతున్నారో పరిశీలించడం జరిగింది. గ్రామీణ జీవన చిత్రాన్ని అందులో మానవ సంబంధాలు, భూస్వామ్య వ్యవస్థ స్వరూప స్వభావాలను, దాని వల్ల బాధలు పడే బహుజనులను గురించి కుల వ్యవస్థను గురించి విమర్శనాత్మకంగా పరిశీలన చెయ్యడం జరిగింది. కింది కులాల వారిని చదువుకు దూరం చెయ్యడం, పాఠశాలకు వచ్చిన కింది కులాల పిల్లలను రకరకాలుగా హింసించడం, భూస్వామ్య లక్షణంగా మనం చెప్పుకోవచ్చు. చదువు నేర్చుకోవడానికి వచ్చిన పిల్లలను దొరలు ఎగతాళి చెయ్యడం, గొడ్లను కాయడానికే పంపించమని చెప్పడం మొదలైన విషయాలను పరిశీలించడం జరిగింది. అందుకు భిన్నంగా చిలకయ్య తన కొడుకు సాంబయ్యను చదివించాలనుకోవడం, వ్యవసాయం ఎంత దండగగా మారిపొయ్యిందో చర్చించడం జరిగింది. కమ్యూనిస్టుల ప్రభావం, ఆప్రభావంతో వచ్చిన ఉద్యమాలను గురించి ప్రత్యేక తెలంగాణ పోరాట నేపథ్యాన్ని పరిశీలించడం జరిగింది. ఆ ఉద్యమాల నేపథ్యంలో ఎదురైన పర్యావసానాలు చర్చించడం జరిగింది.

మూడో అధ్యాయం రాయలసీమ ప్రాదేశిక నవల, బహుజన చైతన్యాన్ని పరిశీలించడం జరిగింది. చిలుకూరి దేవపుత్ర పంచమం నవల, దళితుల అభివృద్ధి, విముక్తికి ఏది మార్గమని పంచమం నవల అన్వేషిస్తుంది. పురుషోత్తమం, సురేష్ పాత్రల ద్వారా రచయిత వామపక్ష ఉద్యమాల పట్ల సానుభూతిగా ఉన్నట్లు మనకు తెలుస్తుంది. దళిత ఉద్యమం పట్ల కొన్ని అనుమానాలున్నట్లుగా మనం భావించవచ్చు. దళితులలో రాజకీయ అధికారమే అన్నిసమస్యలకు పరిష్కారమని చెప్పవచ్చు. ఉద్యోగవాదం అన్నింటికి పరిష్కారం కాదని ఈ నవలలో రచయిత తెలియజేశాడు. శివయ్య ఆర్డిఓ అయినప్పటికీ తన కులానికి ఎలాంటి న్యాయం చెయ్యలేకపోవడం రచయిత తెలియజేశాడు. చివరిలో నవల ముగింపులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా శివయ్య తండ్రి దంగోర వెయ్యడానికి సిద్ధపడతాడు. అలా సిద్దపడటం ఈ వ్యవలో జరిగే ఉద్యమాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తేనే పరిష్కారం లభిస్తుందని రచయిత సాంకేతిస్తున్నాడు. కాబట్టి రచయిత ప్రతిఘటనా రాజకీయాలవైపు అడుగులు వెయ్యమని సందేశం ఇస్తున్నాడని అనుకోవచ్చు. ఒక నిజం మాత్రం తప్పెట తనకు చేరవవుతున్నాకొద్ది బలపడుతుంది. స్పష్టమౌతుంది.... అదేమిటంటే తన జాతికి కేవలం ఆఫీసుల్లోను, విశ్వవిద్యాలయాలలోను, పరిపాలనల్లోను రిజర్వేషన్ ప్రకటించడం వలన రాజ్యాధికారం రాదనీ... శివయ్యకు కలిగిన అంతిమ సత్యాన్ని నవలలో తెలుపుతాడు. శివయ్య ఒక ఉద్యోగిగా తన నిస్సాహాయతకు పరిష్కారం రిజర్వేషన్‌లు కాదని భావిస్తాడు. కాబట్టి బహుజనుల విముక్తి సాధనంగా రాజ్యాధికారాన్ని చేపట్టడమే పరిష్కారమని రచయిత అభిప్రాయంగా చెప్పవచ్చు. ఈ నవలలోని విషయాలన్నీ విమర్శనాత్మకంగా పరిశీలన చెయ్యడం జరిగింది.

ఇనాక్‌గారి అనంతజీవనంలో భూస్వామ్య వ్యవస్థ, ముఠా తగాదాలను, గత వైభవాన్ని వికాసాన్ని, పతనాన్ని కళ్ళకు కట్టినట్లుగా రచయిత చిత్రీకరించారు. వర్షం తుఫానుగా మారడాన్ని చెప్పారు. ఎడారిగా మారుతున్న అనంతపురం తుఫానులో చిక్కుకోవడం ఆశ్చర్యకరమే. కానీ రచయిత అనంతపురంలో తుఫాను భీభత్సాన్ని మన కళ్ళముందు నిలపారు. వర్షం చైతన్యానికి ప్రతీక. ఎడారిగా మారటానికి, మనుషులు నైతికంగా పతనం కావడాన్ని సూచిస్తుంది. నైతికంగా పతనం అయ్యారుకాబట్టే అనంతపురంలో అడ్డదిడ్డంగా ఆక్రమణలు వెలిశాయి. వర్షం తుఫానుగా మారటం,

చైతన్యం ఉద్యమ స్థాయిని చేరుకోవడంగా చెప్పుకోవచ్చు. ఆ ఉద్యమంలో మాదిగలు మిగతా బహుజనులను కలుపుకుని పట్టణాన్ని వరదకు బలికాకుండా కాపాడగలిగారు. ఆ క్రమంలో పట్టణంలోని ధనవంతులు, సామాన్యులు ఏవిధంగా ఇబ్బందులు ఎదుర్కున్నారో కులాల వారిగా వారి వృత్తులు ఎలా ఇబ్బందులను ఎదుర్కుంటున్నారో పరిశీలించడం జరిగింది. నేలగల్లు రెడ్ల విశృలంకత్వానికి, హత్యారాజకీయాలకి, చట్టం ముసుగులో న్యాయదేవత కళ్ళకు గంతలు కట్టగల సమర్థులుగా రచయిత చిత్రీకరించారు. వారికి విశృలంకత్వం వారి పతనానికి దారితీసింది. తరతరాల ఆధిపత్యాన్ని కూల దొయ్యడానికి బహుజనులంతా వర్షంలా ఏకమై తుఫానుగా మారి రెడ్డి బంగ్లా నిట్టనిలువునా కూలిపోయేదాక ఉద్యమించారని ప్రతీకాత్మకంగా తెలియజేసిన విధానాన్ని పరిశీలించాను. రెడ్డి బంగ్లా కూలిపొయ్యినప్పటికి దానిలో పనిచేసే సాలమ్మ, ఉత్తప్ప వాడుకునే గదులు మాత్రం తలెత్తుకు నిలబడ్డాయి. ఇలాగే బహుజనులు సమిష్టిగా ఉద్యమిస్తే ఆధిపత్యాలన్నీ కూలిపోయి ఆత్మగౌరవంతోటి నిలబడగలరని రచయిత ప్రతీకాత్మకంగా తెలియజేసిన విధానాన్ని పరిశీలించాను.

స్వామి 'మీరాజ్యం మీరేలండి' అనంతపుర కమ్మ, రెడ్డి ఫ్యాక్షనిస్టుల మధ్య నలిగిపోయిన బహుజనుల జీవితాలను చిత్రీకరించారు. పండమేటి స్వామి నేపథ్యంగా కథ సాగుతుంది. రాయలసీమలో రెడ్ల ఆధిపత్యం వారికింద నలిగిపోయిన, మాదిగ, వడ్డెర, బోయ శాకల కులాల స్థితి గతులు పరిశీలించాను. రాయలసీమలో కుల వ్యవస్థ, విద్యావ్యవస్థ, స్వరూప స్వభావాలను చర్చించాను. కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య నడిచిన రాజకీయాలు పరిశీలించాను. కమ్యూనిస్టుల నుండి లంఫెన్‌లు తయారవ్వడం గురించి చర్చించాను. వడ్డెర కులంలోని విరూపాక్షి కిరాయి హంతకుడిగా మారడానికి గల కారణాలను చర్చించాను. చాకలి గోవిందు, కమ్యూనిస్టు గోవిందుగా ఎదగడం, దందాలు చెయ్యడం, డబ్బులు వసూల్లు చెయ్యడం, రాజకీయాలలోకి రాకముందు కిరాయి హత్యలు చేయించడ మొదలైన విషయాలను పరిశీలించడం జరిగింది. గ్రామాల్లో కులం, దానివల్ల వచ్చే గొడవలు, మాదిగ పిల్లల అమయకత్వం, రెడ్డమ్మ ఆ పిల్లలను దండించటం వివరించాను గంగుల రెడ్డి కబీరు భార్యను బలవంతంగా తీసుకుపోయి బంధించి అత్యాచారం చేస్తాడు. అంతకుముందు ఊరిలో కమ్యూనిస్టులు కబీరు భూమిని ఉద్యమం పేరుతోటి ఆక్రమించుకుంటారు. కబీరు తన భూమి గురించి అడిగినప్పుడు దున్నే వాడిదే భూమని భయపెట్టి పంపించి వేస్తారు. తెలుగుదేశం ఆవిర్భావం తరువాత కమ్యూనిస్టులు తెలుగుదేశంలోకి చేరిపోవడం, రెడ్ల ఆధిపత్యం తగ్గడం, అప్పటిదాక అణిగి ఉన్న కమ్మలు రాజకీయంగా ఎదగడాన్ని భాస్కర చౌదరి, మనోహరనాయుడు పాత్రల ద్వారా నిరూపించాడు. రెడ్ల దాడులను మాదిగ పండయ్య, బోయాల్ల మల్లయ్య సమిష్టి నాయకత్వంలో ఎదుర్కుని ఆ దాడులను తిప్పి కొడతారు. పండమేటి స్వామి భూమి విషయంలో భూమయ్యను భాస్కర చౌదరి కిరాయి హంతకులతో హతమారుస్తాడు. ఇది కమ్మకులాధిపత్యాన్ని తెలియజేస్తుందనవచ్చు. అన్నభూమయ్యను చంపిన విషయం తెలిసి మల్లయ్య కొండకు వెళ్ళి అన్నల్లో చేరిపోతాడు. మాదిగ పండయ్య మల్లయ్య గ్రూపు మద్దతుతో ఎన్నికల్లో నామినేషన్ వేస్తాడు. రచయిత ఎస్సీ, బీసి, మైనార్టీలు కలిసి పార్లమెంట్ ప్రజాస్వామ్య పద్దతులలో అధికారం చేజిక్కించుకోవాలని తెలియజేస్తూ బహుజన హితాయ, బహుజన సుఖాయ, ఈ రాజ్యం మీదేనండి, మీ రాజ్యం మీరేలండి అని నవల ముగిస్తారు. దీని అర్థం బహుజనులు కలిసికట్టుగా పోరాటం చేసి రాజ్యాధికారాన్ని సాధించాలని తెలియజేస్తున్నారని చెప్పవచ్చు.

నాలుగో అధ్యాయంలో ఆంధ్రారపాదేశిక నవల, బహుజన చైతన్య విశ్లేషణలో భాగంగా జి కళ్యాణరావు రాసిన అంటరాని వసంతం గురించి పరిశీలన చెయ్యడం జరిగింది. కొనసాగుతున్న దళితుల పోరాటం గురించి ఆ నవలలో రచయిత చర్చించడం జరిగింది. దళితులు చరిత్రలో ఎదుర్కున్న అవమానాలు, భూమికోసం వారు చేసిన పోరాటాలు, ఆ పోరాటాల క్రమంలో వారి

త్యాగాలు చర్చించడం జరిగింది. వారసత్వంగా దళితులు కళలనే కాక పోరాటాన్ని కూడా అందించారని ఈ నవల నేపథ్యంగా మనం చెప్పవచ్చు. కానీ ఆ పోరాటం ప్రజాస్వామ్య పద్ధతులలో బ్యాలెట్‌తో కాక బుల్లెట్‌తో చెయ్యాలని రచయిత భావించారు. అంటరాని వసంతంలో కుల వ్యవస్థ, విద్యావ్యవస్థ, క్రైస్తవ మత ప్రభావం, మాల మాదిగల యొక్క సంబంధాలు, కరువు విలయతాండవం గురించి విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగింది.

డాక్టర్ వి.చంద్రశేఖరరావు నల్లమిరియం చెట్టు, దండోర చైతన్యం గురించి పరిశీలించడం జరిగింది. దండోర నేపథ్యంగా ఈ నవల కొనసాగింది. రూమి, దండోర చైతన్యంగా మారిన క్రమాన్ని పరిశీలించాను. దళిత రాజకీయ నాయకులు అగ్రకులాల రాజకీయ పార్టీలకు ఎలా చెంచాలుగా మారబడుతున్నారో చర్చించాను. కమ్యూనిస్టు ఉద్యమాలకు దళిత యువకులు ఎలా ఆకర్షణకు లోనయ్యారో పరిశీలించడం జరిగింది. మాదిగలపై క్రైస్తవ మత ప్రభావం, మాదిగల ఆచార వ్యవహారాలు, స్త్రీలు, పిల్లలపై హింసా పద్ధతులు, దండోర నేపథ్యంలో జరిగిన ఆత్మహత్యలు, అవమానాలకు గురైన జడ్జి నాగభూషణం లాంటి ఉన్నత ఉద్యోగస్తుల ఆత్మహత్య గురించి పరిశీలన చెయ్యడం జరిగింది. దండోరా చైతన్యంతో మాదిగల్లో వచ్చిన మార్పులు దండోర ఉద్యమాన్ని ఆసరాగా చేసుకుని రాజకీయంగా ఎదగాలనే స్వార్థ రాజకీయనాయకుల స్వభావాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగింది.

షెడ్యుల్ తెగల నుండి రాసిన మొదట నవల 'ఎన్నెల నవ్వు' పరిశోధనాంశంగా తీసుకున్నాను. ఎస్టీల నుండి ఏకుల వెంకటేశ్వర్లు ఎన్నెల నవ్వు నవలతో మొదటి నవలా కారుడిగా గుర్తింపబడ్డాడు. అంతకముందు ఆదివాసేతరులు నవలలు రాయడం జరిగింది. ఐనప్పటికి యానాదుల జీవన చిత్రణను లోతుగా అధ్యయనం చేసి నవలను సృజనాత్మకంగా పూర్తి చేశారు. యానాదుల జీవన విధానం అందులో భాగమైన పుట్టుక, వివాహం, పండుగలు, ఆహారం, కళలు, యానాదులు ఇతరులతో వ్యవహరించే విధానాన్ని సమూలంగా పరిశీలించడం జరిగింది. వలసపాలనా కాలంలో యానాదుల జీవనస్థితి గతులు సిటి యాక్ట్‌లతో ఎస్టీలను వేధించటం గురించి పరిశీలించాను. కుల వ్యవస్థలో మార్పు వచ్చి అందరూ కలిసిమెలిసి ఆడుకుంటూ నవ్వుకునే రోజుల కోసం కథానాయకుడైన చెంచులు విప్లవం బాట పట్టాడు. అక్కడ కుల సమస్యకు పరిష్కారం దొరకదని,కుల నిర్మూలన కోసం అంబేద్కర్ సిద్ధాంతాలవైపు ప్రయాణించిన క్రమాన్ని విమర్శనాత్మకంగా పరిశీలన చెయ్యడం జరిగింది.

మైనార్టీలకు, బిసిలకు ప్రాతినిధ్యం వహించే నవలగా సలీం వెండిమేఘం నవలను పరిశోధనాంశంగా తీసుకున్నాను. అందులో మైనార్టీ స్త్రీల సమస్యలను పరిశీలించడం జరిగింది. అవిద్య వలన ముస్లింలలో కొనసాగుతున్న దురాచారాలను పరిశీలించడం జరిగింది. విద్య అన్నిటికి పరిష్కారమని రచయిత భావించి ముఖ్య పాత్ర అయిన అన్వర్ ద్వారా చదువు విలువను తెలియజేసిన క్రమాన్ని పరిశీలించాను. అందుకే ఆమె తాను నేర్చుకున్న చదువును తన చుట్టూ ఉన్న ముస్లిం బాలికలకు నేర్పడం కోసం పడిన తపనను పరిశీలించాను. కొడుకులిద్దరిని చదివించి వారు తమ కాళ్ళమీద తాము నిలబడేలా కృషి చేసింది అన్వర్, అలాగే దూదేకుల స్థితిగతులను వారు అంటరాని వారిగా చూడబడుతున్న విధానాన్ని పరిశీలించడం జరిగింది. వారు ఈదేశ మూలవాసులని పరిశోధనలో చెప్పడం జరిగింది. ఈ నవలలో ఆదాం దూదేకులందరికి ప్రతినిధి. ఆదాం ముస్లిం సమాజంలో దూదేకుల ఆత్మగౌరవం కోసం పోరాటం చేశాడు. ఆ క్రమంలో ఆ పాత్ర ఎదుర్కొన్న సాధక బాధకాలను గురించి వివరించడం, పరిశీలించడం జరిగింది. చదువుతో పాటు రచయిత వ్యవసాయ ప్రాముఖ్యతను గుర్తించిన విధానాన్ని పరిశీలించడం జరిగింది. మత కలహాల వెనుక మత కారణమే కాకుండా రాజకీయ,ఆర్థిక కోణాలను చర్చించడం జరిగింది. మత కలహాలకు ప్రజల అవిద్యే కారణమని భావించవచ్చని రచయిత అభిప్రాయపడ్డ విధానాన్ని తెలియజేశాను.

అంతేగాక బంధకాలుగా మారుతున్న మత ధర్మాలు, ఆధునిక జీవనానికి అనుగుణంగా చేర్పులకు, మార్పులకు అనుకూలంగా ఉండాలని ఆ విధంగా లేనప్పుడు యువత పోరాటం చేసి ఆ హక్కులను సాధించుకోవాలని రచయిత తెలియజేసినట్లుగా భావించవచ్చు. కింది కులాలతోటి ప్రధానపాత్ర సఖ్యంగా ఉండటమనేది మనం గమనించవచ్చు. సమిష్టిగా జీవనాన్ని కొనసాగించినప్పుడు ఒంటరిగా నైన ఏదైనా సాధించగలమని ఈ నవల ద్వారా రచయిత తెలియజేస్తున్నారని చెప్పవచ్చు.

ఐదవ అధ్యాయంలో వలసానంతర బహుజన నవల పరిణామం, పరిమితులను గురించి పరిశీలించడం జరిగింది. బహుజన నవల అత్యాధునిక రూపం. తెలుగు నవల తన పరిమితులు, పరిధులు గుర్తించక సంక్షోభంలో పడుతున్న సమయలో ఒక సైద్ధాంతిక సంఘర్షణ జరిగింది. ఆ సంఘర్షణలోంచి బహుజన నవల ఉద్భవించింది. ఆధునికత సంఘ సంస్కరణనవలకు మూలం అయితే ఆధునీకాంతర స్థితి బహుజనులకు మూలాభూతమయ్యింది. వలస పాలనాకాలంలో బ్రిటీష్ విద్యావిధానాన్ని అందించింది. అంటరాని వాళ్ళకు, స్త్రీలకు చదువు చెప్పడం, ధర్మవిరుద్ధ కార్యంగా బ్రాహ్మణులు భావించారు. ఈ భావనలు తెలుగు నవలల్లో మనకు కనబడుతూనే ఉంటాయి. ఇంగ్లీషు విద్యను వ్యతిరేకించడం సంఘసంస్కర్తల్లో ఎక్కువగా కనిపిస్తుంది. వసలసానంతర జ్ఞాన ం ఆలస్యంగా విస్తరించింది. బహుజన మహాపురుషులు వలసపాలనా కాలంలో మొదలు పెట్టిన సాంఘిక విప్లవం అనే భావన వలసానంతర కాలంలోగాని, తెలుగు సాహిత్యాన్ని చేరలేదు. సాహిత్య రంగం పూర్తిగా అగ్రవర్ణాల నియంత్రణలో ఉండటం దీనికి కారణం. గుర్రం జాషువా మొదలు ఇనాక్‌వరకు సృష్టించిన నవల సాహిత్యం వలసానంతర దళిత అవగాహనను చూపిస్తుంది. అయితే వలసానంతరం సుమారు నాలుగు దశబ్దాలకు గాను బహుజన చైతన్యం రూపొందలేదు. అంబేద్కర్ అనంతర సాంఘిక విప్లవకాలం ఒకటి మొదలైంది. కాన్షీరాం బహుజన చైతన్యాన్ని ఒక రాజకీయ చైతన్యంతో తీసుకురావడంతో బహుజన సాహిత్యం దేశవ్యాప్తంగా రూపొందిన విధానాన్ని పరిశీలించాను. బహుజన రాజకీయం, సాహిత్యంలో ప్రతిభింబించే అవకాశంలేదని కొంతమంది విమర్శకులు భావించారు. కానీ నిజానికి దళిత సాహిత్యం పేరుతో బహుజనులంతా కలిసి కవితా సంకలనాలు విరివిగా ముద్రించారు. ఆ కవిత్వంలో సారాన్ని మనం గమనించినట్లయితే మేమంతా మూలవాసులం అనే తత్వమే కనబడుతుంది. ఆతత్వమే బహుజన తత్వంగా చెప్పుకోవాలి. కథల్లో కూడా బ్రాహ్మణ ఆధిపత్య కులాలకు వ్యతిరేకంగా బహుజనులు చేసిన పోరాటం కనబడుతుందని చెప్పవచ్చు. బహుజనుల మధ్య ఉన్న వైరుధ్యాలకు మనువాదమే కారణం. మనువాదం బహుజన అనే పేరును కుట్రపూరితంగా వ్యాఖ్యానించడం జరిగింది. బహుజన మహాపురుషులైన పూలే, అంబేద్కర్ రచనలలో దళిత అనే పదం ఎక్కడా కనపడదు. బహుజనవాదం అధికారాన్ని దక్కించుకోవడానికి పనిచేస్తుంది. అధికారంతోటి కులనిర్మూలనే కాకుండా సమస్త సమస్యలకు తాళంచెవిలాంటిది రాజకీయ అధికారం కాబట్టి అందుకోసం బహుజనులు ఐక్యంగా ఉండి పోరాటాలు రాజకీయ శక్తిగా మారి ఓటింగ్ ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవడం. అందులో భాగంగా బహుజనవాదం అన్ని రకాల అధికార రూపాలను నిరాకరించదు. కుల గుర్తింపులనేవి మనువాదం కల్పించినవి. కాబట్టి అధికారం ద్వారా మాత్రమే ఆ తోకలను తొలగించగలము. కాబట్టి బహుజన వాదం గుర్తింపులకు వ్యతిరేకమైన ఉద్యమం. అస్తిత్వాన్ని నిలబెట్టాలని ఆరాటపడేది. అందుకోసం ఆధిపత్య కులాలను ధిక్కరించి వాటి పెత్తనాలను కూలదోసి ఒక సమతా వ్యవస్థను నిర్మించే ఉ ద్యమమిది. ఆదిశగా ప్రయాణిస్తున్న బహుజనవాదాన్ని ఆధిపత్య మేధావులు సులువుగా గుర్తింపు ఉద్యమమని ముద్రవేశారు. బహుజన నవల భాషా వైవిధ్యాన్ని ప్రదర్శించింది. ముఖ్యంగా తెలంగాణ బహుజన నవల అనేక విమర్శలకు గురైంది. వాటన్నింటిని విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగింది. బహుజన నవలల్లో కమ్యూనిస్టు రాజకీయాల వైఫల్యాలని ఎండగట్టడం జరిగింది. వాటిని కూడా విమర్శనాత్మకంగా పరిశీలించాను. బహుజన సాంస్కృతి చిత్రణను పరిశీలించడం జరిగింది.

బహుజన నవలలో ఉన్న బహులత్వాన్ని చర్చించాను. మనువాదం కులాల మధ్య శత్రు వైరుధ్యాలను నిర్మించింది. ఆ నిర్మాణాలను కూలగొట్టి మిత్ర సంబంధాలుగా చిత్రీకరించిన విధానాలను పరిశీలించాను. తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాలనుండి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రచనలు చేశారు. ఉత్తరాంధ్రానుండి బహుజనులు రాయలేదు. అందుకే ఉత్తరాంధ్ర సామాజిక, సాంస్కృతిక విషయాలు బహుజన నవలలో పరిశీలన చేయలేకపోయాను. కృత్రిమ యాంత్రికతలో ఆధిపత్యకులాల నవల ఆగిపోయిందనే చెప్పవచ్చు. వేలాది కులాల విశాలమైన అనుభవాన్ని, జీవన సారాన్ని వ్యక్తం చేసే బహుజనవాద నవల విరివిగా వచ్చే అవకాశం ఉందని తెలియజేశాను.

## ఇందుమూలంగా...

కనిపెంచి విద్యాబుద్ధులు నేర్పిన తల్లిదండ్రులను పొనుగోటి లీలమ్మ, కీ.శే. ఆనందరావులను మొదటగా గుర్తు చేసుకుంటున్నాను.

దళితసాహిత్యం మీద నాకున్న అభిమానం, అభిరుచి ఈ పరిశోధనకు మూల కారణం. దళిత సాహిత్యం అంబేద్కర్ దృష్టితో ప్రయోగించిన దళిత కవిత్వంలో పురాణ ప్రతీకలను ఎం.ఫిల్ పరిశోధనాంశంగా తీసుకున్నాను. తరువాత బహుజన దృక్పథంతో నవలను పరిశోధనాంశంగా తీసుకోవడం జరిగింది. వలసానంతర బహుజన నవలలు విమర్శనాత్మక అధ్యయనం అనే అంశంపై పరిశోధన చెయ్యడానికి అవకాశం ఇచ్చిన హైదరాబాద్ విశ్వవిద్యాలయంకి  కృతజ్ఞతలు.

ఈ పరిశోధనలో సంపూర్ణ, సహాయ సహకారాలు అందించి నన్ను ప్రోత్సహించిన మాతృసమానురాలు ఆచార్య జి అరుణ కుమారి గారికి...

తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఆచార్య శరత్‌జ్యోత్స్నరాణి గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. పరిశోధనకు సహకరించిన తెలుగు శాఖ అధ్యాపకులు ఆచార్య తుమ్మల రామకృష్ణ, ఆచార్య అర్ .వెంకటశాస్త్రీ, డా.దార్ల వెంకటేశ్వర్‌రావు, డా. పమ్మి పవన్‌కుమార్, డా.భుజంగరెడ్డి, డా. విజయలక్ష్మి, డా.జి. నాగరాజులకు కృతజ్ఞతలు.

ఎం.ఏ నుండి నేటి వరకు పరిశోధనలోనే కాక అన్ని విషయాల్లో సహాయ సహకారాలు అందిస్తూ నన్ను ప్రోత్సహిస్తూ సైద్ధాంతికంగా నన్ను తీర్చిదిద్దుతున్న ఆత్మీయమిత్రులు జిలుకర శ్రీనివాస్, కట్టెపోగు రత్న శేఖర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు.

నా ఎదుగుదల ఉన్నతిని కాంక్షించి చూడకుండానే కీ.శే.తాతలు పి.రాజరత్నం,ఆర్ .సుబ్బయ్య, నానమ్మలు మరియమ్మ, చిలకమ్మ, అమ్మమ్మలు దాసమ్మ, జి మరియమ్మలకు, పెదనాన్న పొనుగోటి సుబ్బరాయుడు, పెద్దమ్మ పి.సుశీలమ్మలను ఈ సందర్భంగా స్మరించుకుంటున్నాను.

నా ఎదుగుదలకు పూర్తి సహాయ సహకారాలందించి తోడ్పడిన చిన్నాన కాకి నారాయణరావు, చిన్నమ్మ కాకి సుమతి, మరియు జి పుష్పరాగం గార్లకు

నా చదువుతో పాటు కుటుంబానికి, ఆసరాగాఉంటూ తోడ్పాటును అందించిన అక్క బావలు, స్వరూపరాణి, రేణమాల మణి, అరుణ, గౌడపేరు కాంతారావు, జ్యోతి, చెల్లెలు డా. స్నేహలత, నిరంజన్, తమ్ముడు ప్రసాద్, మాతృకలకు...

ఈ పరిశోధనలో నిరంతరం తోడ్పడి సహాయ సహకారాలు అందించిన సతీమణి శిరీష నా కంటి పాపలు అసిత్‌కుమార్, అక్షరస్ఫూర్తిలకు ఏం చెప్పినా తక్కువే అవుతుంది.

ఈ సమయంలో అత్తామామలు కీ.శే.సుగుణమ్మ, నందిగం చార్లెస్‌లను జ్ఞాపకం చేసుకుంటూ వారి కుటుంబ సభ్యులందరికి  ధన్యవాదములు.

తమ్ముడు శరత్, మేనకోడలు సుధామౌనిక, మేనల్లులు సుధారోహిత్, ప్రజ్ఞాజ్వలిత్, ప్రజ్ఞాసాహు, ప్రత్యక్ష సమయాలకు ఆశీస్సులు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపక వృత్తిలో ఉండి పరిశోధన చెయ్యడం కష్టమేమి కాదు. కానీ కాలపరిమితి వల్ల పరిశోధన విషయాలలో పరిమితి విధించుకుని పరిశోధన పూర్తి చెయ్యవలసి ఉంటుంది. అయినప్పటికి నా పరిశోధనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన కళాశాల ప్రిన్సిపల్ డా.బి సుధాకర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు, తెలుగు శాఖ అధ్యాపక బృందం ఇన్‌చార్జ్ డా. బి. మాధురి గారికి, డా.జి. వెంకట్‌లాల్, డా. జరుపుల రమేష్. డా.జె. నీరజ గార్లు అందించిన సహాయ సహకారాలు మరువలేనివి...కళాశాలలో వెన్నంటితోడుండే ఎ.సాంబశివరావు (హిందీ),

కె. జాన్‌మిల్టన్ (చరిత్ర) గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రసన్న కుమార్, నర్సింగరావు, సుజాతగార్లకు, కళాశాల ఎస్సీ, ఎస్టీ అధ్యాపక బృందానికి, అడిగిన పుస్తకం లేదనకుండా సమయానికి అందించిన లైబ్రేరియన్ సతీష్ గారికి మరియు అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటి మిత్రులు భీమ్, చందయ్య, దిగుమర్తి సురేష్, గురజాల, గంగరాజు, జయరాజు, ప్రసాద్, భాస్కర్, రాజేంద్ర, జగదీశ్, ఇజ్రాయేల్, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహులు, కిరణ్, పసునూరి రవీందర్, ఆరూరి సుధాకర్,హరనాథ్, శ్యామ్, రాజు, విక్రమ్, సుధాకర్, గుండెమెడ శ్రీను, బండారు విజయ్, నాగరాజు, చిరంజీవి, సతీష్‌లకు,
కృపాకర్, జూపాక సుభద్ర, భూతం ముత్యాలు, బండినారాయణ స్వామి, గల్లా ప్రకాశరావులకు

చిన్ననాటి మిత్రులు, ఆదాం, శుభాకర్, ప్రసాద్, సాల్మాన్‌రాజు, తాటిపర్తి సుధాకర్, బ్రహ్మాజీ కుటుంబాలకు, నా ఉన్నతిని కాంక్షించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను జై భీమ్‌లతో....

# *విషయసూచిక*

**ఇందుమూలంగా...**

**తొలిపలుకులు**

## *అధ్యాయం-1*

**1. తెలుగు నవల-అస్తిత్వ ఉద్యమాల ప్రభావం** 1

1.0.వలసవాదానంతర సాహిత్యం 1

1.1.సంఘసంస్కరణ నవల 4

1.2. జాతీయోద్యమ నవల 7

1.3.అభ్యుదయ నవల 9

1.4.విప్లవవాద నవల 12

1.5.స్త్రీవాద నవల 14

1.6.దళితవాద నవల 16

1.7. బి.సి.వాద నవల 18

1.8. గిరిజన నవల 19

1.9. ముస్లింవాద నవల 20

1.10. బహుజన పద నేపథ్యం 20

## అధ్యాయం-2

**2.వలసానంతర బహుజన నవలలు - విమర్శనాత్మక అధ్యయనం** 24

2.0. *తెలంగాణ ప్రాదేశిక నవలలో - బహుజన చైతన్య ఆలోచన వ్యక్తీకరణ* 24

2.1.వేముల ఎల్లయ్య కక్క - భూ సమస్య 28

2.1.1. వేముల ఎల్లయ్య పరిచయం 28

2.1.2. కక్క నవల విశ్లేషణ 29

2 .1.3..మాదిగ సాహిత్యం 33

2.1.4. నయా క్షత్రియుల ఆధిపత్యం 35

2.1.5. బాల్యాన్ని హరించిన కుల వ్యవస్థ 38

2.1.6. భూస్వామ్యం - కుల బానిసత్వం 39

2.1.7..పంచాయితీ రాజ్ వ్యవస్థ - శూద్ర, అస్పృశ్య కులాల ప్రాతినిధ్యం 41

2.1.8 స్త్రీ బానిసత్వం 43

2.1.9.బ్రాహ్మణుల అనుపస్థితి 45

2.1.10. అంటరానితనం లేని నవల 45

2.1.11. ఆంధ్ర కమ్మ విస్తరణవాదం 46

2.1.12. తెలంగాణ భాషావాదం 48

*2.2. భూతం ముత్యాలు 'సూర'-విద్యాభివృద్ధి, కుల, మూఢాచారాల నిర్మూలన* 50

2.2.1.భూతం ముత్యాలు పరిచయం 50

2.2.2.సూర కథాపరిచయం 51

2.2.3.సూర పాత్రల విశ్లేషణ 56

2.2.4.అంబేద్కరిజం-సూర నవల 72

2.2.5.సూర నవల-తెలంగాణ భాష

*2.3.కాలువ మల్లయ్య సాంబయ్యచదువు -బహుజనులపై విద్య,ఉద్యమాల ప్రభావం* 78

2.3.1.కాలువమల్లయ్య పరిచయం 78

2.3.2. సాంబయ్య చదువు కథాపరిచయం 81

2.3.3. సాంబయ్య చదువు పాత్రల పరిచయం 83

2.3.4.సాంబయ్య చదువు నవలావిశ్లేషణ 89

2.3.4.1.మానవ సంబంధాలు 89

2.3.4.2.భూస్వామ్య వ్యవస్థ - స్వరూప స్వభావాలు 91

2.3.5 .గ్రామీణ జీవన చిత్రణ 93

2.3.5.1. కుల వ్యవస్థ 94

2.3.5.2 .దళిత జీవనము 96

2.3.6. విద్యా వ్యవస్థ 97

2.3.7.ఉద్యమాలు - ప్రభావం 99

2.3.7.1. కమ్యూనిస్టు ఉద్యమం 100

2.3.7.2. ప్రత్యేక తెలంగాణా ఉద్యమం 100

2.3.7.3.నక్సలైట్ ఉద్యమం 101

2.3.8 . వాస్తవిక చిత్రణ 102

2.3.9. మిశ్రమ భాష 103

2.3.10. నవలాశిల్పం 104

**అధ్యాయం-3**

**3. రాయలసీమ ప్రాదేశిక నవల - బహుజన చైతన్య పరివేదన** 105

*3.1. చిలుకూరి దేవపుత్ర పంచమం - కుల వ్యవస్థ* 107

3.1.2. చిలుకూరి దేవపుత్ర పరిచయం 107

3.1.3.పంచమము కథాపరిచయం 109

3.1.4.పంచమం పాత్రల విశ్లేషణ 111

3.1.4.1. శివయ్య-సామాజిక మనో విశ్లేషణ 111

3.1.4.2.సురేష్- కుల సమస్యకు పరిష్కారం మార్క్సిజం 115

3.1.4.3.నారాయణప్ప- దళితుల ఆర్థిక స్వావలంభన కోసం భూమి

3.1.4.4. పురుషోత్తం- ప్రగతిశీల మానవతావాదం 118

3.1.4.5. సీతారామప్ప, శంకరయ్య- ఆధునిక మనువాదం 120

3.1.4.6. పద్మ - మధ్యతరగతి ఆకాంక్షలు 121

3.1.4.7. విద్య - అగ్రకుల మహిళ చైతన్యం 122

3.1.5.పంచమం నవల-విశ్లేషణ 123

**3.2.అనంత జీవనం- అగ్రకుల ముఠారాజకీయాలు, బహుజన చైతన్యం**

3.2.1.రచయిత పరిచయం 126

3.2.2.అనంత జీవనం కథాపరిచయం 132

3.2.3..అనంత జీవనం పాత్రలు 136

3.2.3.1.యెద్దీరప్ప- నైతిక వ్యక్తిత్వం 136

3.2.3.2.గొర్ల అంకాలప్ప- అమాయకత్వానికి నిలువెత్తు నిదర్శనం 137

3.2.3.3.కట్టెల అడితి నాగన్న- పట్టుదలకు మారుపేరు 138

3.2.3.4. కుమ్మర ఉలిగప్ప - ఆత్మవిశ్వాసం కోల్పోనితనం 139

3.2.3.5. సాలమ్మ -కష్టాలకు ఎదురీదే వ్యక్తిత్వం 139

3.2.3.6. ఉత్తప్ప ఉత్తమ సేవకు చిరునామా 140

3.2.3.7. నారాయణప్ప- త్యాగమయి 141

3.2.3.8. ఇమాం, మాబు - మూర్తీభవించిన మానవత్వం 141

3.2.3.9.రాంపిరెడ్డి - ఆధిపత్యాప్రతీక 142

3.2.3.10.ఎలిజబెత్ - విదేశి సంస్కృతికి నిదర్శనం 146

3.2.3.11. వెంకటేశ్వర్‌రెడ్డి- మితిమీరిన విశృలంకత్వానికి నిదర్శనం 148

3.2.3.12.ఎ.ఎస్పీ. బజారన్న - బహుజన చైతన్యం 149

3.2.3.13. గోవింద రెడ్డి - పాలెగాళ్ల వ్యవస్థకు ప్రతీక 150

3.2.3.14. మూలింటి ముసలిది - వెలివాడల వెతలకు దర్పణం 154

3.2.3.15.ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు – వర్షభీభత్సానికి సజీవ సాక్షాలు 155

3.2.3.16. నేలగల్లు కోట–హత్యారాజకీయాలనిలయం 156

3.2.3.17. రాంపిరెడ్డి బంగ్లా – జమీందారి విలాసాలకు ప్రతీక 157

3.2.3.18. పారిశుద్ధ్యం పనివారు – వ్యవస్థను శుభ్రం చేసే హీరోలు 159

3.2.3.19. వాన – సామాన్యుల అగచాట్లు 160

3.2.4. పర్యావరణ పరిరక్షణ– ఆక్రమణలు 162

3.2.5. అనంత జీవనంలో మనిషి జీవనతత్వం 165

3.3. మీ రాజ్యం మీరేలండి–శూద్ర ఆధ్యాత్మిక వాదం 171

3.3.1.రచయిత పరిచయం 171

3.3.2 మీరాజ్యం మీరేలండి కథా పరిచయం 171

3.3.3.పాత్రల విశ్లేషణ 173

3.3.3.1.పండమేటిస్వామి – ఆధ్యాత్మికవాదం 173

3.3.3.2. ఉత్తపయి తిప్పన్న – నిర్వికల్ప ఆస్తిక వాదం 175

3.3.3.3. భూమయ్య – బోయల భూ పోరాటం 177

3.3.3.4. మల్లయ్య – భౌతిక వాద కమ్యూనిజం 180

3.3.3.5. జీతగాళ్ల దేవన్న, లాలెమ్మ –మాదిగ కుటుంబ జీవనం 182

3.3.3.6. పండయ్య – దళిత చైతన్యం 184

3.3.3.7. వెంకటలక్ష్మి – దళిత స్త్రీ దుస్థితి 186

3.3.3.8. వడ్డే విరుపాక్షి – లంపెన్ గుండాయిజం 187

3.3.3.9. రాజారెడ్డి – ఫ్యాక్షన్ రాజకీయాలు 189

3.3.3.10. కొండారెడ్డి–హింసావాదం 190

3.3.3.11. వీరప్పనాయుడు –కమ్మ ఫ్యాక్షనిజం 191

3.3.3.12. గరుడశేఖరనాయుడు – కమ్యూనిస్టు ఫ్యాక్షనిజం 192

3.3.3.13. భాస్కర చౌదరి – భౌతిక వాదం 193

3.3.3.14. గంగుల రెడ్డి – రెడ్డికుల హింసావాదం 194

3.3.3.15. కోనప్ప శాస్త్రి – మనువాదం 195

3.3.3.16. గొర్రెల తిరుపలు – అవకాశవాదం 196

3.3.3.17. గొర్ల తిరుపాలు చిన్న తాత కొడుకు – బహుజన వాదం 197

3.3.3.18. కమ్యూనిష్టు గోవిందు – లంపెన్ కమ్యూనిజం 197

3.3.3.19. మనోహర్ నాయుడు – భౌతిక వాదం 199

3.3.3.20. కబీర్ – దూదేకుల దుస్థితి 200

3.3.4. దళిత స్త్రీల దుస్థితి –అగ్రకుల స్త్రీల దాష్టికలు, పెత్తనాలు 201

3.3.5. నవలావిశ్లేషణ 204

## అధ్యాయం-4

**4. ఆంధ్ర ప్రాదేశిక నవల బహుజన చైతన్య విశ్లేషణ 206**

4.1.అంటరాని వసంతం–కొనసాగుతున్న దళితుల పోరాటం 207

4.1.1. జి. కళ్యాణరావు పరిచయం 208

4.1.1.1.కథాపరిచయం 208

4.1.2. అంటరాని వసంతం పాత్రల విశ్లేషణ 211

4.1.3.అంటరాని వసంతం–కులవ్యవస్థ 237

4.1.4.విద్యావ్యవస్థ 241

4.1.5. అంటరాని వసంతం–మాల మాదిగలపై క్రైస్తవ మత ప్రభావం 241

4.1.6. అంటరాని వసంతం– గాంధీ,అంబేద్కర్ 244

4.1.7. మాలామాదిగల జీవన చిత్రణ 247

4.1.7. అంటరాని వసంతం– కరువు చిత్రణ 247

*4.2.నల్లమిరియం చెట్టు – దండోరాఉద్యమం మాదిగ చైతన్యం* 252

4.2.1.డాక్టర్ వి. చంద్రశేఖరరావు పరిచయం 252

4.2.2. నల్లమిరియం చెట్టు కథాపరిచయం 253

4.2.3.పాత్రల విశ్లేషణ 256

4.2.4. దండోర నేపథ్యం 266

4.2.5. మాదిగ దండోరా ఉద్యమ ఆవిర్భావరా వికాసం 267

4.2.6. నల్లమిరియం చెట్టు –దండోర రాజకీయాలు 269

4.2.7. కరుణకుమార్ – విప్లవ, దండోరాల్లో నాయకుడైన క్రమం 276

4.2.8. నల్లమిరియం చెట్టు – మాదిగల కుటుంబ జీవనం 278

4.2.9..మాదిగల ఆచారాలు, నమ్మకాలు 281

4.2.9.1. మాదిగల మతం – పూజలు 282

4.2.9.2. మాదిగల ఆహారపు అలవాట్లు 284

4.2.10 . పిల్లలు, స్త్రీలపై హింస 286

4.2.11. విద్యావ్యవస్థ 287

4.2.11.1.పాఠశాల చదువులు 288

4.2.12. నల్లమిరియంచెట్టు – కులవ్యవస్థ 290

.4.2.13. దండోరా – ఆత్మహత్యలు 291

4.2.14. మాదిగ దండోరా ఉద్యమ క్రమం 295

4.2.11. ఎస్సీల వర్గీకరణ క్రమం 296

*4.3. ఎన్నెల నవ్వు– యానాది తెగ సంస్కృతి ,చైతన్యం* 297

4.3.1. ఏకుల వెంకటేశ్వర్లు పరిచయం 298

4.3.2.గిరిజనులు– పరిచయం 299

4.3.2.1.గిరిజన తెగలు 300

4.3.3. ఎన్నెల నవ్వు కథాపరిచయం 301

4.3.4. ఎన్నెల నవ్వు – పాత్రల పరిచయం 305

4.3.5. యానాదులు చారిత్రక నేపథ్యం 314

4.3.6. ఎన్నెలనవ్వు విశ్లేషణ 316

4.3.6.1.ఎన్నెలనవ్వు – కులవ్యవస్థ 316

4.3.6.2. చెంచులు – కులచైతన్యం 318

4.3.6.3. విద్యావ్యవస్థ 321

4.3.7. ఎన్నెలనవ్వు – యానాదుల సామాజిక, సాంస్కృతిక జీవన చిత్రణ 323

4.3.8. కళలు – యానాదుల ఆట పాట,వేషధారణ 329

*4.4. వెండి మేఘం –ముస్లిం సాంస్కృతిక జీవన పరిశీలన* 331

4.4.1.సలీం పరిచయం 332

4.4.2. వెండి మేఘం కథాపరిచయం 333

4.4.3. పాత్రల విశ్లేషణ 335

4.4.4. ముస్లిం సమాజంలో కుల వ్యవస్థ 350

4.4.5. వెండిమేఘం– విద్యావ్యవస్థ 353

4.4.6. వెండిమేఘం–ముస్లింల ఆచార వ్యవహారాలు 356

4.4.7. వెండిమేఘం – మతకలహాలు 360

## అధ్యాయం-5


**5. వలసానంతర బహుజన నవల పరిణామం - పరిమితులు** 365

5.1. వలసానంతర బహుజన సాహిత్యం- నవల 365

5.2. దళిత - బహుజన విభజన 367

5.2.1. బహుజన నవల - గుర్తింపువాదం 368

5.3. బహుజన నవల భాషావైవిధ్యం 370

5.4. బహుజన నవల - కమ్యూనిస్టు రాజకీయాల వైఫల్యం 373

5.5.బహుజన సంస్కృతి చిత్రణ 377

5.6 . బహుజన నవల బహుళత్వం 379

5.7. బహుజన నవల - మాదిగ, మాల చైతన్యం 380

**ముగింపు**

**ఉపయుక్త గ్రంథసూచి**

# 1. తెలుగు నవల - అస్తిత్వ ఉద్యమాల ప్రభావం

వలసానంతర బహుజన నవల ఒక సైద్ధాంతిక అంశం. వలసానంతరం వచ్చిన బహుజన నవల అని అర్థం. బహుజన నవల అనేక సమూహాల వ్యక్తీకరణ. పీడిత లేదా పాలిత సమూహాల/ కులాలు, తెగల, మతాల నుంచి వచ్చిన సాహిత్య అభివ్యక్తి బహుజన నవల. అయితే, బ్రిటీషు వలస పాలన ప్రభావం తెలుగు సాహిత్యం మీద ఎలావుంది? బ్రిటీషు వలస పాలన ముగిసిన తర్వాత ఎలాంటి మార్పులు తలెత్తాయనే విషయాన్ని అధ్యయనం చేయటం వలసానంతరవాదం యొక్క స్వభావం. హోమి కె.బాబా, గాయత్రీ స్పివాక్, పార్థచటర్జీ వంటి విదేశాల్లో స్థిరపడిన లేదా అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రవాస మేధావుల ఆలోచనల వల్ల ఈ వాదం రూపుదిద్దుకుంది. కాబట్టి ముందుగా వలసానంతరవాదాన్ని గురించి తెలుసుకుందాం!

**1. 0. వలసవాదానంతర సాహిత్యం:**

సాహిత్య విమర్శ పదాల డిక్షనరీలో ఎస్.ఎస్.నళిని వలసవాదానంతర సాహిత్యం గురించి విడమర్చి చెప్పారు. ఆమె ప్రకారం "వలసవాదుల పరిపాలనలో పెట్టుబడిదారీ సంస్కృతివల్లా, సాహిత్యంవల్లా ప్రభావితమైన వలసదేశాల సాహిత్యాన్నీ, సంస్కృతినీ వలసవాదానంతర సాహిత్యం అని ప్రస్తావిస్తూ ఉంటారు" (నళిని,ఎస్.ఎస్:2009.152). మన దేశంలో వలస జీవితం, సంస్కృతి బ్రిటీషు పాలనతో మొదలైంది. డచ్ కంపెనీ, ఫ్రెంచి కంపెనీ, ఈస్టిండియా కంపెనీలు ఈ దేశంలో వ్యాపారం కోసం వచ్చాయి. క్రమంగా దేశంలో కీలకమైన భూభాగాలను అవి ఆక్రమించాయి. ఆ కంపెనీల మధ్య జరిగిన పోటీ వల్ల యుద్ధం అనివార్యమైంది. ఈస్టిండియా కంపెనీ పైచేయి సాధించటంతో ఇండియా మొత్తం ఆ కంపెనీ వశమైంది.

ఈస్టిండియా కంపెనీ ద్వారా బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వం రూపొందించిన చట్టాలను ఇండియాలో అమలు చేయటం మొదలైంది. ఆ చట్టాల ప్రభావం అంతా ఇంతాకాదు. సంప్రదాయ బ్రాహ్మణీయ సామాజిక వ్యవస్థను కూల్చేసే చట్టాలవి. కింది కులాలకు చదువులు చెప్పటం, వితంతు పునర్వివాహం, బాల్యవివాహాల నిషేధం, అంటరానితనం నిషేధించటం, స్త్రీలకు చదువులు చెప్పటం వంటి విప్లవాత్మకమైన పనులు ఈస్టిండియా కంపెనీ చేపట్టింది. సామాజిక దురలవాట్లను, కట్టుబాట్లను ప్రజల నుంచి మాన్పించటానికి చట్టాలు చేసింది. తన పాలనలో పీడిత సమూహాలను రక్షించటం తన బాధ్యత అనుకున్న బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వం ఎన్నో మంచి పనులను చేపట్టింది. వీటిని అగ్రవర్ణ సంప్రదాయవాదులు 'జోక్యం' చేసుకోవటం అన్నారు. హిందూమత విషయాల్లో జోక్యం చేసుకోవటం వల్ల ఆచార, సంప్రదాయాలు దెబ్బతింటున్నాయనీ, పాశ్చాత్య సంస్కృతినీ, ముఖ్యంగా క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నారనీ, కింది కులాలవారిని మతమార్పిడి ప్రోత్సహిస్తారని, హిందూ సంస్కృతిని నాశనం చేస్తున్నారని ప్రచారం చేశారు. రాజ్యాలు కోల్పోయిన మొగలాయి బహదూర్ షా జాఫర్‌ను రెచ్చగొట్టి తిరుగుబాటుకు నాయకత్వం వహించేలా చేశారు. ఈస్టిండియా కంపెనీలో సిపాయిలుగా పనిచేస్తున్న హిందూ, ముస్లిం సైనికులను తిరుగుబాటుకు పురికొల్పారు. ఈ తిరుగుబాటు ఇతర ప్రాంతాల్లోని సైనికులకు ప్రేరణిచ్చింది. అది సామాన్య ప్రజల భాగస్వామ్యంతో పెద్ద తిరుగుబాటుగా మారింది. ఈ తిరుగుబాటును సావర్కర్ 'ప్రథమ

స్వతంత్ర సంగ్రామం' అన్నాడు. కానీ, ఈ తిరుగుబాటును బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వం అణచివేసింది. 1857 తిరగుబాటు తర్వాత ప్రత్యక్ష బ్రిటీషు వలస పాలన ప్రారంభమైంది. బ్రిటీషు వలస పాలనలో విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఒక క్రమబద్ధమైన విద్యావిధానం ఇక్కడ ప్రవేశపెట్టారు. ఇంగ్లీషు విద్యావిధానం వల్ల పాశ్చాత్య జ్ఞాన సమాజంలో వచ్చిన కొత్త సిద్ధాంతాలు, తత్వచింతనలతో ఇక్కడి సమాజం ప్రభావితమైంది. మెకాలే ప్రవేశపెట్టిన విద్యావిధానం ఇంగ్లీషు చదివిన సమూహాల సంస్కృతిని ప్రభావితం చేసింది.

"నవలా ప్రక్రియ బూర్జువా సమాజం ప్రపంచ సంస్కృతికిచ్చిన మహోన్నతమైన కానుక" అన్నాడు సుప్రసిద్ధ విమర్శకుడు రాల్ఫ్‌ఫాక్స్. ఈ భావాన్ని ఎలా అర్థం చేసుకోవాలో ఆలోచిద్దాం! పాశ్చాత్య దేశాలలో ఎలిజబెతన్ యుగంలోనే ఫ్యూడలిజం పట్ల నిరసన ప్రారంభమైంది. సుప్రసిద్ధ తత్వవేత్త ఎరాస్మస్ ఆ కాలంలోనే మానవతావాదాన్ని ప్రచారం చేయటం ప్రారంభించాడు. మానవతావాదమంటే బలవంతుడు బలహీనునిపట్ల చూపించే దయాదాక్షిణ్య దృక్పథం కాదు! సృష్టికి మానవుడే కేంద్రమన్న విశ్వాసం! ఈ విశ్వాసం తర్వాత కాలంలో చారిత్రకంగా గొప్ప పాత్రను నిర్వహించింది. సామాజిక వ్యవస్థను భగవంతుడు నిర్మించలేదనీ, మానవుడే నిర్మించుకున్నాడనీ, కాబట్టి దాన్ని మానవుడే సంస్కరించుకోవచ్చనీ విశ్వసించే తత్వశాస్త్రాలకు మానవతావాదం దారిచూపింది. సైన్సు, సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందటంతో పారిశ్రామిక విప్లవం వచ్చింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు ప్రారంభమయ్యాయి. ఈ పరిణామాలలో నుంచి క్రమక్రమంగా సమాజంలో మధ్యతరగతి ఉద్భవించింది. వారిలో అత్యధికశాతం మొదటితరం అక్షరాస్యులు. వీరికి సంప్రదాయ పాండిత్యం లేదు. అందుచేత వారికి తమకు సరిపోయే కొత్త సాహిత్యం కావలసివచ్చింది. ఆ కొత్త సాహిత్యం సమకాలీన జీవితంలోని కొత్తదనాన్ని ప్రతిబింబించాలని వారు ఆశించారు. ఆ పనిని హోమర్, వర్జిల్, టాసో, మిల్టన్‌లాంటి రచయితలు చేయలేరని కూడా వారు గుర్తించారు. ఈ ప్రజాస్వామిక భావనలో నుంచి యూరోపియన్ దేశాలలో నవల పుట్టింది" (వెంకట సుబ్బయ్య,వల్లంపాటి :2006 .84) అని పాశ్చాత్య సమాజంలో నవల పుట్టుక నేపథ్యాన్ని వల్లంపాటి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు.

తెలుగు సమాజానికి అలాంటి నేపథ్యం లేదు. తత్వశాస్త్రంలో ఎలాంటి మార్పులు రాలేదు. పారిశ్రామిక విప్లవం కనీసం మొగ్గతొడగలేదు. కొత్తగా ఏర్పడ్డ అక్షరాస్య సమూహం కొత్త వ్యక్తీకరణల కోసం ప్రయత్నించనూ లేదు. కానీ తెలుగు నేల మీద నవల ఉదయించింది. ఇదెలా సాధ్యమైందన్న ప్రశ్నకు వల్లంపాటి వెంకటసుబ్బయ్య "భారతదేశంలో– ఆంధ్రదేశంలో– ఈ ప్రభావాలు ప్రత్యక్షంగా నవల పుట్టుకను ప్రభావితం చేయలేదు. యూరోపియన్ దేశాల నుంచి ఈ ప్రభావాలు ఆంగ్లేయ పరిపాలన ద్వారా, ఆంగ్లభాష ద్వారా వచ్చాయి. ఆంధ్రదేశంలో ముఖ్యంగా మధ్య కోస్తా జిల్లాలలో అక్షరాస్యత పెరిగింది. గోదావరి (1852), కృష్ణ (1855) ఆనకట్టలు నిర్మింపబడి నీటి పారుదల సౌకర్యాలు ఏర్పడ్డ ఫలితంగా ఆ జిల్లాలు ఆర్థికంగా చాలా అభివృద్ధిచెందాయి. 1857లో ఏర్పడ్డ మద్రాసు, బొంబాయి, కలకత్తా విశ్వవిద్యాలయాలు ఆంగ్లసాహిత్యాన్నీ, సామాజిక శాస్త్రాలనూ భారతీయ సమాజానికి పరిచయం చేశాయి. అంతవరకూ చదువంటే వేదాలను స్వరయుక్తంగా నేర్చుకోవటమే! శాస్త్ర విద్య అంటే శిక్ష, ఛందస్సు, వ్యాకరణం, నిరుక్తం, జ్యోతిష్యంలాంటి వేదాంగాలను చదువుకోవటమే! ఇలాంటి విద్యావిధానంలోకి చరిత్ర, సామాజికశాస్త్రం, అర్థశాస్త్రం, సమాజ పరిణామశాస్త్రం లాంటి ఎన్నో కొత్త శాస్త్రాలు ప్రవేశించి విద్యకు కొత్త రూపాన్నిచ్చాయి. ఈ విద్యావిధానం ఆలోచించగల మధ్యతరగతిని సృష్టించింది. వారు సమాజాన్ని గురించి ప్రజాస్వామిక మానవతా దృక్పథం నుంచి ఆలోచించటం ప్రారంభించారు. ఈ దృక్పథంలో నుంచి సంస్కరణోద్యమాలు పుట్టాయి.

ఆ సంస్కరణ చైతన్యంలో నుంచీ, అందులో భాగమైన మూఢాచార నిరసనలోంచి తొలి తెలుగు నవల 'రాజశేఖర చరిత్రము' (1878)లో ఉద్భవించిందన్నది చాలామంది విమర్శకుల నమ్మకం" (వెంకట సుబ్బయ్య,వల్లంపాటి: 2006.85) అని తెలుగు నవల నేపథ్యాన్ని చెప్పారు. వల్లంపాటి దృష్టిలో నరహరి గోపాలక్రిష్ణమశెట్టి రాసిన 'శ్రీరంగరాజచరిత్రము' అనే నవల మొదటిది కాదు. కందుకూరి రాసిందే తొలినవల అని 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ' (2006)లో పేర్కొన్నారు.

వలస సంస్కృతి ప్రేరణతో వలస పాలనకాలంలోనే ఎన్నో సాంఘిక విప్లవోద్యమాలు తలెత్తాయి. కొత్తకొత్త భావాలు పురుడు పోసుకున్నాయి. సాహిత్యంలో వాటి సాంద్రత, తీవ్రత ఎక్కువ. సాహిత్యంలో వలస పాలన కాలం నాటి సంస్కృతిని మన విమర్శకులు 'ఆధునికత' అన్నారు. ఆధునిక విలువలతో తయారైన సాహిత్యాన్ని కొత్త సమాజం ఆహ్వానించింది. అయితే, ఆధునిక సాహిత్యాన్ని అంతే స్థాయిలో సంప్రదాయవాదులు ప్రతిఘటించాలని ప్రయత్నించారు. కానీ అది సాధ్యంకాలేదు. ముఖ్యంగా కందుకూరి, సామినేని, గురజాడ, గిడుగు వంటి సంఘసంస్కర్తలు ఆధునిక సాహిత్యాన్ని రచించారు.

విదేశీ ప్రయాణాలు, అంతర్జాతీయ పరిణామాలు, జాతీయ, రాజకీయ, సామాజికోద్యమాల తాకిడి వల్ల బ్రిటీషు పాలన అంతరించింది. 1947లో దేశానికి స్వతంత్రం వచ్చింది." గతకాలపు వలస సంస్కృతి నుంచి భిన్నమైన భావాల కోసం జరిగే సాహిత్యాన్వేషణను కూడా వలసవాదానంతర సాహిత్యం అంటారు" (అదేపుట). వలస సంస్కృతి ప్రభావంతో చాలా కొత్త విషయాలను సాహిత్యంలో వ్యక్తీకరించటం జరుగుతూనే ఉంది. అది ఈ దేశ సంస్కృతిని నడిపిస్తూనే ఉంది. ముఖ్యంగా తెలుగు భాషా సమాజం పెద్దయెత్తున ఆ ప్రభావానికి లోనైంది. తెలుగు సాహిత్య సృజన, విమర్శ రంగాల మీద వలస ప్రభావం చాలా ఉంది. అంతేకాదు, వలస ప్రభావంతో తొలినవల తెలుగులో రూపుదిద్దుకుంది. నవల నేటికీ అనేక ప్రయోగాలను చేస్తూనే ఉంది. నవలలో వ్యక్తమయ్యే అత్యాధునిక లేదా ఉత్తరాధునిక భావాలన్నీ ఆ వలస సంస్కృతికి కొనసాగింపేనని గాయత్రి స్పివాక్ అభిప్రాయం. తెలుగు సాహిత్యంలో గతకాలపు వలస సంస్కృతిని వ్యతిరేకభావంతో పాటు సానుకూల దృక్పథంతో చూడటం కనిపిస్తుంది. సంస్కరణ నవల, జాతీయోద్యమ నవల, నవ్యసంప్రదాయ నవల, అభ్యుదయ నవల, దళిత నవల వంటి అనేక రకాల ఉద్యమ సాహిత్యంలో విషయం స్పష్టమవుతుంది. అందుకే, "వలస పాలనా ప్రభావంవల్ల వలసదేశాలలో సంప్రదాయానికి భిన్నంగాగానీ, పూర్తి వ్యతిరేకతతోగానీ సృష్టించిన సాహిత్యాన్ని వలసవాదానంతర సాహిత్యం అని కొందరు అంటారు" **(అదేపుట).**

"వలసపాలన ప్రారంభం కావడానికి ముందు వున్న సాహిత్యమంతా సాంప్రదాయిక సాహిత్యమని ఒక అభిప్రాయం. బ్రిటీషు వలసపాలన కింద ఉండిన అన్ని దేశాల భాషా సాహిత్యాలలాగే భారతీయ భాషలలో, తెలుగులో కూడా 19వ శతాబ్దం మధ్య భాగం నుంచి వచ్చిన సాహిత్యాన్నంతా వలసవాదానంతర సాహిత్యం అనవచ్చు" (నళిని:2009.152). తెలుగు సాహిత్యాన్ని ఆధునిక, ప్రాచీన లేదా సంప్రదాయ సాహిత్యమని వర్గీకరిస్తారు. వలస పాలన ప్రారంభానికి ముందున్న సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యమని అంటారు. వలస పాలన కాలంలో వచ్చిన సాహిత్యాన్ని ఆధునిక సాహిత్యమంటారు. అయితే, ఆధునికత అన్నది కాలవాచి కాదనీ, అది గుణాన్ని సూచిస్తుందన్న వాదన కూడా వుంది. ఆధునిక భావాలని చెప్పుతున్న విలువలు ప్రాచీన కాలంలో కూడా వున్నాయనీ, ప్రాచీన లేదా సంప్రదాయ విలువలని చెప్తున్నవి ఆధునిక కాలంలో కూడా ఉన్నాయని వాదించేవారు వున్నారు. విలువల ప్రాతిపదికన లేదా కాలం ప్రాతిపదికన ఆధునికతను అంగీకరించేవాళ్లు కూడా ప్రాచీన

కాలంలోని రచనల్లో ఎంత ఉదాత్తమైన విలువలున్నా అవి సంప్రదాయ సాహిత్యం కోవలోకే చెందుతాయని అభిప్రాయ పడ్డారు. ఆధునికత అన్నది వలస పాలనలో పుట్టిన భావన కాబట్టి ఆధునిక సాహిత్యమంతా పాశ్చాత్య సాహిత్యానికి అనుకరణ లేదా అనుసరణ అనే ఆరోపణను సంప్రదాయవాదులు బలంగా చేశారు.

తెలుగులో వలసవాదానంతర సాహిత్యం విస్తృతంగా వచ్చింది. అది వలస పాలనాకాలంలో మొదలై నేటికీ కొనసాగుతూనే ఉందని విమర్శకుల అభిప్రాయం. ఈ కొనసాగింపు పట్ల వ్యతిరేకత కూడా ఉంది. గాయత్రి స్పివాక్ దృష్టిలో ఇది వాంఛనీయం కాదు. ఆమె ప్రకారం సొంత వ్యక్తీకరణ, ఉనికి లేని సాహిత్యం, సంస్కృతి వల్ల పరాయీకరణ జరుగుతుంది. ఇలాంటి వాదనంతా చివరికి సంప్రదాయవాదానికి ఒక పాయగా మారిపోతుందన్న విమర్శ కూడా వుంది.

వలస పాలన కాలంలో ఒక సామాజిక మార్పు జరిగింది. వలస పరిపాలనలో అందిన జ్ఞానంతో ఈ దేశంలోని కింది కులాలు బ్రాహ్మణీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆధునిక పద్ధతుల్లో రాయటం, మాట్లాడటం జరిగింది. ఈ పోరాటం కేవలం బ్రిటీషువాళ్ల రాకతో మొదలైందని చెప్పడానికి వీలులేదు. బుద్ధుడికి పూర్వం నుంచి బ్రిటీషువాళ్లు ఈ దేశాన్ని ఆక్రమించుకొన్న కాలం వరకు బహుజన తత్వవేత్తలు మనువాద వ్యవస్థను వ్యతిరేకిస్తూ వచ్చారు. వాళ్ళకు చార్వాకులు, లోకాయతులు, మీమాంసకులు, బుద్ధిస్టులు, జైనులు, సంతులని పిలిచారు. అయితే, బ్రిటీషు వలస పాలనలో మహాత్మజ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే, హరిచంద్ ఠాకూర్, గిరిచంద్ఠాకూర్, సాహూ మహారాజ్, బాబాసాహేబ్ అంబేద్కర్, నారాయణగురు, గాడ్గేబాబా, పెరియార్ వంటి ఎంతో మంది ఉత్తర, దక్షిణ, మధ్య, ఈశాన్య ప్రాంతాల్లోనూ, మేదరిభాగయ్య, అరిగెరామస్వామి, శ్యాంసుందర్, బి.యస్.వెంకట్రావ్ వంటి ఆదిహిందూ ఉద్యమకారులు దక్కన్ ప్రాంతంలోనూ కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. రచనలు చేశారు. ఈ చైతన్యం కలగడానికి వలసపాలన కాలంలో పరివ్యాప్తమైన హేతువాద దృష్టి, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే ప్రజాస్వామిక విలువల ప్రభావం కారణం. ఈ ఉద్యమాల కొనసాగింపుగా ఎన్నో సాహిత్య ఉద్యమాలు తెలుగులో పురుడుపోసుకున్నాయి. బహుజన దృష్టితో అన్ని విషయాలను వింగడించటం మొదలైంది. వలసానంతరవాద దృష్టితో వలస విముక్త సమాజాలను పరిశీలించినట్టే, బహుజన దృష్టితో వలసానంతర తెలుగు సమాజాన్ని, సాహిత్య వ్యవస్థనూ పరిశీలించాలి. తెలుగు సాహిత్య, సాంస్కృతిక వ్యవస్థల పరిణామ క్రమాన్ని, దాన్ని నడిపించిన సూత్రాలను వలసానంతర బహుజన దృక్పథంతో విమర్శించాలి. ముఖ్యంగా బహుజనులు రాసిన నవలలను పరిశీలించాలి. అలా చేస్తే సరియైన ఫలితాలు రావొచ్చు.

## 1. 1. సంఘసంస్కరణ నవల:

సంఘసంస్కరణ నవల బ్రిటీషు వలస పాలన వల్ల తయారైన కొత్త ప్రక్రియ. అప్పటి వరకు నవల అన్న భావన లేదు. ప్రబంధం, పద్యం, కావ్యం, ఇతిహాసం, శతకం వంటి ప్రక్రియలు మాత్రమే తెలుగులో వుండేవి. కావ్యంలో అడదడపా వచనాన్ని వాడారు. పద్యానిదే పైచేయి. కానీ, పద్యానికి సెలవుపలికి కేవలం వచనంలో కథను రాయటం నవలతో మొదలైంది. అందువల్ల, నవల సంఘసంస్కరణ అనే ఆధునిక భావనతో మొదలైంది. సంఘ సంస్కరణ నవల పునరుజ్జీవన సాహిత్యంలో భాగమని వాదించేవాళ్లు కూడా వున్నారు. పునరుజ్జీవన సాహిత్యమంతా ఒకప్పటి స్వర్ణ యుగాలను తిరిగి నిర్మించుకోవాలనే ఆదుర్దాలోంచి పుట్టింది. సనాతనధర్మపునరుద్ధరణ, చాతుర్వర్ణ సమాజ పునరుద్ధరణ రెండింటి మేళవింపు పునరుజ్జీవన సాహిత్యం. అయితే, సంఘసంస్కరణ దృక్పథం గతమంతా ఘనమైనదని పూర్తిగా నమ్మదు.

ఆధునిక కాలం ఆవిష్కరించిన అనేక పురోగామి పద్ధతులను, విలువలను జీవితంలోకి స్వీకరించాలని సంస్కరణవాదం తెలుపుతుంది. హేతువుకు విరుద్ధమైన లేదా మనిషి ఉనికిని అపహాస్యం పాలుచేసే సంప్రదాయాలను, మూఢనమ్మకాలను వ్యతిరేకించటం సంఘసంస్కరణ నవలలో కనిపిస్తుంది.

సంఘ సంస్కరణ ఉద్యమాన్ని అర్థం చేసుకొనేందుకు అనేక మంది విమర్శకులు ప్రయత్నించారు. కానీ బహుజన విమర్శకులు మౌలికమైన ప్రశ్నలు లేవనెత్తారు. సంస్కరణ ఉద్యమం ఎవరికోసం జరిగింది? దానికి నాయకత్వం వహించిన వాళ్లదే కులం? ఆ సంస్కర్తల రచనల్లో చిత్రితమైన వస్తువు ఏ కులానికి చెందినది? ఆ రచనల్లో కుల నిర్మూలన కోసం ఏమైనా ప్రతిపాదనలున్నాయా? ఇలాంటి అనేక ప్రశ్నలు దళిత విమర్శకులు లేవనెత్తారు. కందుకూరి వీరేశలింగం పంతులు "రాజశేఖర చరిత్రము" అనే నవల రాశారు. బ్రాహ్మణ సమాజంలోని మూఢనమ్మకాలు, స్త్రీల దైన్యస్థితిని అందులో చిత్రించారు. అనవసరపు ఖర్చులు, ఆచారాలు, సంప్రదాయాల పేరుతో బ్రాహ్మణ సమాజం నష్టపోతుందనీ, ఆధునిక జీవన పద్ధతులను అలవర్చుకోకుంటే ఆ సమాజం చాలా సమస్యలెదుర్కోవాల్సి వస్తుందన్నది కందుకూరి వీరేశలింగం పంతులు గారి అభిప్రాయం. మొత్తం రాజశేఖర చరిత్రము నవలలో ఎక్కడా బ్రాహ్మణిజాన్ని ప్రశ్నించటం కనిపించదు. కుల వ్యవస్థను ప్రస్తావించి, దాని దుష్ఫలితాలను చూపించే ప్రయత్నం ఎక్కడా ఆయన చేయలేదు. అదేవిధంగా, కందుకూరి రాసిన నాటకాలు, ప్రహసనాల్లో ఎక్కడా కింది కులాల ప్రస్తావన కనిపించదు. ఆయన రాసిన కథలు, నవల, నాటకాల్లో ఎక్కడా అస్పృశ్యులు, శూద్రులు, ఆదివాసుల ప్రస్తావన కనిపించదు. వితంతు వివాహాలు, బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, ఆచార వ్యవహారాలు వంటివి కులాన్ని బట్టి మారుతుంటాయి. కందుకూరి ఏ కులస్తుల ఆచార వ్యహారాలను సంస్కరించాలనుకున్నాడు? కచ్చితంగా బ్రాహ్మణ వర్ణానికి సంబంధించిన మూఢనమ్మకాలు, దురాచారాలను మాత్రమే సంస్కరించాలని ఆయన ఉద్దేశమని ఆయన రచనలే నిరూపిస్తున్నాయి.

పైగా, రాజశేఖర చరిత్రము తొలి నవల అని సాహిత్య చరిత్రకారులు నిర్ధారించారు. "పంతులుగారు ఇంగ్లీషులో ఆలివర్ గోల్డ్‌స్మిత్ 'వికారాఫ్ వేక్‌ఫీల్డు'కు అనుసరణగా రాజశేఖర చరిత్రను వ్రాశారు. అంటే ఇంగ్లీషు ప్రభావం ఆసాంతమూ కల తొలి తెలుగునవల రాజశేఖర చరిత్రమేనన్నమాట. ఇది 1878వ సంవత్సరంలో వివేకవర్ధిని అనే పంతులుగారి పత్రికలో ధారావాహికగా వెలువడింది" (తెలుగు నవల–నూరు సంవ్సతరాలు, పు.7). ఈ నవలలోని వాతావరణం, పాత్రలు, కథ అంతా బ్రాహ్మణ వర్గం గురించి వర్ణించినవి. చాతుర్వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ గురించిన విమర్శనాత్మక దృష్టి ఇందులో లేదు. అందువల్ల కందుకూరి రచనలేవీ ప్రత్యామ్నాయ దృష్టిని ప్రతిపాదించినవి కావు. అదేవిధంగా ఆయన చేపట్టిన కార్యక్రమాలేవీ కిందికులాలు నివశించే ప్రాంతాల్లో జరిగినవి కావు. అన్నీ పూజారి వర్గం నివసించే ప్రాంతంలో జరిగాయి. శూద్రులు, అతిశూద్రుల కోసం ఒక్క కార్యక్రమం ఆయన రూపొందించిన దాఖలాల్లేవు. ఆయన రచనల్లోని స్త్రీ పాత్రలన్నీ పూజారివర్గానికి చెందినవే. కథ, కథలోని వాతావరణం అన్నీ బ్రాహ్మణ కౌటుంబిక జీవితానికి చెందినవి. అందువల్ల, రాజశేఖర చరిత్రము అనే నవలకు సార్వత్రిక ప్రయోజనమేమీ లేదు. అది ప్రత్యేకించి విప్రవర్గం లక్ష్యంగా రూపుదిద్దుకున్నది. కందుకూరి వీరేశలింగం ఆధునికవాదని విమర్శకుల అభిప్రాయం. కానీ ఆయన ఆధునికత బ్రాహ్మణ్యం సరిహద్దులు దాటలేదు. అస్పృశ్యులు, శూద్రుల విషయంలో ఆయన ఆచరణ సనాతన ధర్మం ప్రకారమే నడిచింది. అత్యధిక సంఖ్యలోవున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల సమస్యలను ఆయన విస్మరించాడు. అందుకే, బహుజనవాదం కందుకూరి సేవలను గుర్తిస్తూనే, ఎవరి ఉద్ధరణ కోసం ఆయన పనిచేశాడన్న ప్రశ్నను సూటిగా వేస్తుంది?

బ్రాహ్మణేతర కిందికులాలను శాశ్వత బానిసత్వంలో వుంచే మనుధర్మాన్ని ఆయన వ్యతిరేకించకుండా, కిందికులాలతో కలిసి పనిచేయకుండా ఆయన నడిపిన ఉద్యమమంతా బ్రాహ్మణసమాజ సంస్కరణ కిందికే వస్తుందని చెప్పుకోవచ్చు.

నరహరి గోపాలకృష్ణమశెట్టి కందుకూరి కన్నా ముందే నవల ప్రచురించాడు. 'శ్రీరంగరాజ చరిత్రము' సోనాబాయి పరిణయం అనే పేరుతో ఆయన నవల రాశారు. ఇందులో రచయిత వర్ణ వ్యవస్థను సూటిగా నిలదీసాడు. బ్రాహ్మణాధిక్యతను నిరసిస్తాడు. వస్తువులో నవ్యత, శిల్పంలో సామాన్యత కనిపిస్తాయి. కులాంతర వివాహాలను సమర్ధిస్తుందీ నవల. లంబాడీలను శూద్రవర్ణంగా పరిగణిస్తుంది. నరహరి గోపాల క్రిష్ణమశెట్టి ఒక అధికారి. వైశ్యవర్ణానికి చెందినవాడు. సంఘంలో వైశ్యులను బ్రాహ్మణవర్గం చిన్నచూపు చూసేది. బ్రాహ్మణుల అహంకారం కింద వైశ్యులు కూడా నలిగిపోయారు. వలస పాలనాకాలంలో వైశ్యులకు, బ్రాహ్మణులకు మధ్య జరిగిన ఘర్షణలు మద్రాసు ప్రెసిడెన్సీలో రాజకీయ రూపం తీసుకున్నాయి. విద్యా, ఉద్యోగరంగంలో, రాజకీయరంగంలో బ్రాహ్మణులదే పైచేయి. ఈ పరిస్థితి బ్రాహ్మణేతర వర్గాలను కలవరపర్చింది. గోపాలక్రిష్ణమ శెట్టి ఒక పోటీకోసం ఈ నవల రాశాడు. అయితే, బ్రాహ్మణేతరులు రాసింది సాహిత్యం కాదనీ, గోపాలక్రిష్ణమశెట్టి రాసింది కూడా నవల కాదని బ్రాహ్మణీయ విమర్శకులు వాదించారు. కందుకూరి వీరేశలింగం రాసిన రాజశేఖర చరిత్రకు పెద్దపీటవేశారు. గోపాలక్రిష్ణమ శెట్టి రాసిన 'సోనాబాయి పరిణయము' స్త్రీలను లేచిపొమ్మని చెప్తుందనీ, చదువరుల బుద్ధిని చెడగొడుతుందనీ, అది సమాజహితం కాదనీ వాదిస్తూ, ఆ నవలను నిషేధించాలని కూడా బ్రాహ్మణవిమర్శకులు సిఫారసు చేశారు. చివరకు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య కూడా ఈ రచనను నవలగా అంగీకరించటానికి నిరాకరించాడు. నవలా నిర్మాణం, కథేతివృత్తంలో సోనాబాయి పరిణయం అనే శ్రీరంగరాజ చరిత్రము చాలా బలహీనంగా ఉందని వల్లంపాటి అభిప్రాయం. లంబాడీలు శూద్రులకన్న హీనమైన వారని గోపాలక్రిష్ణమ శెట్టి చెప్తున్నాడని వల్లంపాటి ఆగ్రహం. ఇది సత్యదూరమేమీ కాదు. గోపాలక్రిష్ణమశెట్టి రాయలసీమ ప్రాంతం వాడు. రాయలసీమ కర్నాటకను ఆనుకొని వుంటుంది. రాయలసీమలోని చాలా ప్రాంతం కర్ణాటక ప్రాంతం పరిధిలో ఉండేది. కర్ణాటకలోని లంబాడీలు ఎస్సీలు. అస్పృశ్యులన్న మాట. శూద్రులకన్న హీనంగా చూడబడేవారు. ఇది సామాజిక వాస్తవం. అలాంటప్పుడు గోపాలక్రిష్ణమ శెట్టి రాసిందెలా తప్పవుతుందో చర్చనీయాంశం. కానీ, ఈ నవలను తొలి తెలుగు నవల అని ఇప్పుడు విమర్శకులు అంగీకరిస్తున్నారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ ఈ నవలను పునర్ముద్రించారు.

ఆచార్య కొలకలూరి ఇనాక్ ఇలా అంటారు. "సంఘ జీవితానికి దూరంగా అడవుల్లో తాండాల్లో ఉండే లంబాడీల జీవితం – వాళ్ల సంప్రదాయాలు, ఆచారాలు చిత్రించి, సమాజానికి ప్రతిబింబంకాదగ్గ రీతిలో నవలను రూపొందించి, తరువాత రానున్న రాజశేఖర చరిత్ర వంటివాటికి మార్గదర్శకంగా నిలిచే నవల సృష్టించిన పుణ్యాత్ముడు నరహరి గోపాలకృష్ణమ శెట్టి ప్రశంసాపాత్రుడు. ఆ నవలా రచయిత సృష్టి అయిన శ్రీరంగరాజు చరిత్ర సామాజిక అవగాహనతో, దానికి దర్పణంగా, లంబాడీల జీవితం, ఆచారాలు, సంప్రదాయాలు, జీవనవిధానం చిత్రించి, గొప్ప సాహితీ వారసత్వం అనుగ్రహించింది. మొట్టమొదటి నవలే ఇంత విస్పష్ట సామాజిక, సాహిత్య మానవ స్వభావం జీవన నేపథ్యాలు పుణికి పుచ్చుకొన్న సందర్భం విశిష్ఠమయింది. మహాశ్వేత, శ్రీరంగరాజు చరిత్ర, రాజశేఖరచరిత్రలలో శ్రీరంగరాజు చరిత్ర స్వతంత్రమైన కారణాన, విశేష జీవితవృత్తం స్వీకరించిన ప్రతిబింబించిన కారణాన, అనువాదంకాని కారణాన, అద్భుత నవలాగుణ గణశోభితం కావటం కారణాన, అనంతర

నవలలపై తన ప్రభావం ప్రసరించిన కారణాన ప్రాథమ్యం పొందుతుంది. శ్రీరంగరాజు చరిత్ర తెలుగులో తొలినవల" (ఇనాక్,కొలకలూరి :2010. 58) అంటారు.

కందుకూరి వీరేశలింగం సామాజిక వర్గం కారణంవల్ల మాత్రమే తొలి నవలా రచయితగా విమర్శకులు స్థిరపరిచారు. వర్ణవ్యవస్థ అహేతుకతను బట్టబయలు చేసి, మానవులంతా సమానులే అన్న వాదాన్ని స్థాపించబూనినందుకు గోపాలకృష్ణమశెట్టికి అన్యాయం చేశారు. అయితే, గోపాలకృష్ణమ శెట్టి కూడా తన పరిమితుల్లో వస్తువును వ్యక్తీకరించే ప్రయత్నం చేశాడు. సోనాబాయి పూర్వజన్మలో అగ్రవర్ణానికి చెందింది కాబట్టి శ్రీరంగరాజు ఆమెను పెళ్లిచేసుకోవటం ధర్మవిరుద్ధమేమీ కాదని చెప్తాడు. ఇది ఈ నవలలోని పెద్ద లోపం. వర్ణధర్మాన్ని ధిక్కరిస్తున్నాడనే నెపం మోయలేక ఈ పలాయన మార్గం ఎంచుకున్నాడని అర్థమవుతుంది. నవల శిల్పం, శైలీవిన్యాసాల్లో, కథాకథనంలో ఎన్ని పరిమితులున్నప్పటికీ బ్రాహ్మణ్యాన్ని ఎదిరించిన మొదటి సాంఘిక నవల శ్రీరంగరాజు చరిత్రము. వలసానంతర బహుజన నవలకు మార్గం చూపిన నవలిది.

## 1.2. జాతీయోద్యమ నవల:

జాతీయోద్యమం రాజకీయ ఉద్యమం. బ్రిటీషు పాలన కాలంలో జాతీయోద్యమం తయారైంది. సంఘస్కరణ కోసం బ్రిటీషువాళ్లు తయారు చేసిన చట్టాల వల్ల సనాతన ధర్మం దెబ్బతిన్నదని బ్రాహ్మణ వర్గాలు భావించాయి. మనుధర్మాన్ని రక్షించుకోవటం కోసం బ్రాహ్మణ వర్గాలు చేసిన తిరుగుబాటును అణిచివేశారు బ్రిటీషువాళ్లు. అదే సమయంలో మహారాష్ట్ర కేంద్రంగా మహాత్మ జ్యోతిరావు పూలే ఆధునిక సాంఘిక విప్లవాన్ని ప్రారంభించాడు. శూద్ర, అతిశూద్రులకు విద్యాబోధన చేసి వాళ్లను సంఘటితం చేయటం ప్రారంభించాడు. 1873లో 'సత్యశోధక్ సమాజ్'ను ఆయన ప్రారంభించాడు. ఇది ఒక సాంఘిక విప్లవ సంస్థ. బ్రాహ్మణేతరులను రాజకీయంగా, సాంఘికంగా చైతన్యవంతులను చేయటం కోసం ఇది కృషి చేసింది. బ్రాహ్మణ వర్గాల ఆధిక్యతను నిర్మూలించడానికి, బహుజనులు విముక్తి కావడానికి బ్రిటీషువాళ్ల సహకారం తీసుకోవాలని పూలే స్పష్టం చేశాడు. బ్రిటీషు ప్రభుత్వం కూడా పూలే ఉద్యమానికి మద్దతివ్వటం ప్రారంభించింది. అదేవిధంగా, బెంగాల్ కేంద్రంగా నమోశూద్ర ఉద్యమం 1860లో తీవ్రమైంది. విద్యా, ఉద్యోగరంగంలో చండాల కులస్తులు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం అడుగుతున్నారు. మైసూరు, బరోడా, నిజాం సంస్థానాల్లో కింది కులాలకు విద్యా, ఉద్యోగ హక్కులు ఇవ్వాలని ఉద్యమిస్తున్న కాలం అది. దేశవ్యాప్తంగా ఆయా భాషా ప్రాంతాల్లో జరుగుతున్న బ్రాహ్మణేతర ఉద్యమాన్ని నిలువరించడానికీ, బ్రాహ్మణీయ వర్గాల ఆధిపత్యాన్ని వలస పాలకుల సహకారంతో స్థాపించడానికీ ఒక సంస్థ ప్రారంభించబడింది. 1885లో కాంగ్రెస్ పార్టీ స్థాపించబడింది. కేవలం బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియులు మాత్రమే ఈ పార్టీలో సభ్యులుగా ఉండేవాళ్లు. కొంతమంది అగ్రవర్ణ ముస్లింలు కూడా ఆ తర్వాత ఇందులో చేరటం మొదలైంది.

కాంగ్రెస్ పార్టీ బ్రాహ్మణుల రాజకీయ ప్రయోజనాలు కాపాడే సంస్థ. దానిలో బ్రాహ్మణేతరులకు ప్రవేశం లేదు. అందుకే, మద్రాసు ప్రెసిడెన్సీలో బ్రాహ్మణేతర రాజకీయ సంస్థ ఆవిర్భవించింది. 1916లో జస్టిస్ పార్టీ ఏర్పడింది. మద్రాసు ప్రెసిడెన్సీలో బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని ఈ రాజకీయ సంస్థ సవాల్ చేసింది. 1922లో జస్టిస్ పార్టీ మద్రాసులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో దేశరాజకీయాల్లో పెద్ద సంచలనం కలిగింది. మద్రాసు ప్రెసిడెన్సీలోని బ్రాహ్మణేతర కింది కులాల్లో పెద్ద చైతన్యం తలెత్తింది. పెరియార్ రామస్వామి నాయకత్వంలో ఆ పార్టీ పెద్ద రాజకీయ విప్లవాన్ని తీసుకొచ్చింది. మద్రాసులో బ్రాహ్మణ్యాన్ని రక్షించడానికి గాంధీ పర్యటనలు చేశాడు. పెరియార్ ప్రభంజనాన్ని తట్టుకొని నిలబడటం గాంధీకి కష్టమైంది.

ముఖ్యంగా వైకోం ఆలయ ప్రవేశ ఉద్యమం ద్వారా పెరియార్ ప్రముఖుడయ్యాడు. గాంధీ ట్రావెంకోర్ మహారాజు పక్షాన పెరియార్‌తో సంప్రదింపులు జరిపాడు. కానీ పెరియార్ రాజీపడలేదు. చివరకు ట్రావెంకోర్ పాలకులు దిగివచ్చారు. అదేవిధంగా దేశంలో కొత్త రాజకీయ శక్తిగా డా॥ అంబేద్కర్ ప్రవేశించాడు. 1917లో ఆయన అస్పృశ్యులను చైతన్యవంతులను చేస్తూ రాజకీయ పోరాటం మొదలుపెట్టాడు. గాంధీతో తలపడుతూ స్వతంత్ర అణగారిన వర్గాల ఉద్యమాన్ని నిర్మాణం చేశాడు. దీంతో గాంధీ సంఘసంస్కరణ పేరుతో ఆలయ ప్రవేశ ఉద్యమం, అస్పృశ్య నివారణ ఉద్యమం, హరిజనోద్ధరణ ఉద్యమం మొదలుపెట్టాడు. ఇవేవీ ఆయన ఇష్టంతో చేపట్టిన ఉద్యమాలు కావని డా॥ అంబేద్కర్ విమర్శ. అంటరానివాళ్ల రాజకీయ పోరాటాన్ని నీరుగార్చే కుట్రలు కాంగ్రెస్‌పార్టీ దేశవ్యాప్తంగా చేస్తూ వచ్చింది. అంబేద్కర్ మద్రాసు ప్రెసిడెన్సీలో విస్తృత పర్యటనలు చేశాడు. పెరియార్ నిరంతరం పర్యటనలు చేస్తూ బ్రాహ్మణేతర ఉద్యమానికి ఊపిరిపోసాడు. ఆ ఉద్యమంలో అస్పృశ్యులను, శూద్రులను అగ్రభాగంలో ఉంచాడు. స్త్రీలనే సభాధ్యక్షులుగా పెట్టి పెద్ద సభలు, సత్యాగ్రహాలు నడిపేవాడు. ఈ ఉద్యమాలన్నీ కాంగ్రెస్ పార్టీ అభిమానులైన అగ్రవర్ణాలను భయపెట్టాయి. అంబేద్కర్, పెరియార్ ఉద్యమాలకు తెలుగులో వచ్చిన ప్రతిస్పందన ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన 'మాలపల్లి' నవల. "స్వాతంత్ర్యానికి పూర్వం వెలువడిన 'మాలపల్లి' గాంధేయ దృక్పథంతో నాటి సామాజిక సమస్యలను ప్రధానముగా భూసమస్యలను చర్చించింది" (తుర్లపాటి రాజేశ్వరి. 2002: 100) అని డా. తుర్లపాటి రాజేశ్వరి పేర్కొంది. ఉన్నవ కాంగ్రెస్ పార్టీ నాయకుడు. విదేశాల్లో చదువుకున్నవాడు. కాస్త సామ్యవాద సిద్ధాంత ప్రభావం వున్న వ్యక్తి. అయితే, ఆయన గాంధీ దృక్పథం నుంచి మాత్రమే కుల సమస్యను అర్థం చేసుకున్నాడు. ఉదారవాద సామాజిక దృష్టి వల్ల కుల సమస్యను అంబేద్కర్ కోణం నుంచి చూడలేకపోయాడు. అంతేకాదు, అంబేద్కర్ ఉద్యమం వైపు నిమ్నవర్గాలు ఆకర్షితులు కావటం ఆయనకు ఇష్టం లేదు.

గాంధీ చెప్పిన హృదయ పరివర్తన సిద్ధాంతాన్ని కళాత్మకంగా ఈ నవలలో వ్యక్తీకరించాడు. కులాన్ని గురించిన చర్చను ఈ నవల చేసింది. కింది కులాల పట్ల సానుభూతిని చూపించింది. భూస్వామ్య వర్గాల్లో మార్పును ఆశించింది. అయితే, కిందికులాలకు రాజకీయ హక్కులు కల్పించకుండా అగ్రవర్ణాల దయాదాక్షిణ్యాల మీద బతకాలనే పరోక్ష సందేశం కూడా ఈ నవలలో ఉంది. అందువల్ల, ఉదారవాద గాంధేయ నవల 'మాలపల్లి' అగ్రవర్ణ విమర్శకులకు ఉదాత్తమైనదేకానీ బహుజనుల దృష్టిలో అది అంగీకరించలేనిది. జాతీయోద్యమ నవలలన్నీ గాంధీని కీర్తిస్తూ, ఆయన సత్యాగ్రహాల యొక్క అసలు రహస్యాలను ప్రజలకు తెలియకుండా చేస్తూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం పేరుతో ప్రజలను ఉద్రిక్తులను చేసేలా వున్నాయి. గాంధీ స్వరాజ్యం, సంపూర్ణ స్వరాజ్యం అంటే నిజంగానే స్వతంత్రం అని ప్రజలు నమ్మేలా కాంగ్రెస్ పార్టీ చేసింది. కానీ ఆ నినాదాలకు అర్థం బ్రిటీషు పాలనాధికారంలో వాటా అని మాత్రమే అర్థం. కానీ వాస్తవాలను తెలియకుండా చేశారు. అంబేద్కర్ అధికారంలో వాటా అడిగినందుకు దేశద్రోహి, బ్రిటీషు ఏజెంటు అని ముద్రలు వేశారు. ఈ వాస్తవాలను స్వతంత్ర పోరాటంలో తెలియనీయలేదు. స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా ప్రజలకు, పాఠకులకు తెలియనీయలేదు. అందుకు 1947లో వుప్పల లక్ష్మణరావు రాసిన 'అతడు–ఆమె' నవల సాక్ష్యం. స్వతంత్రం వచ్చిన తర్వాత రాసిన ఈ నవలలో గాంధీ గురించి, కాంగ్రెస్‌పార్టీ చేసిన సత్యాగ్రహాల గురించి అన్నీ అతిశయోక్తులే వున్నాయి. హిందూ, ముస్లింలు, పాకిస్తాన్ ఏర్పాటు వంటి రాజకీయ, మత విషయాలను కాంగ్రెస్ దృష్టి నుంచి చర్చించటం, ముస్లిం లీగ్‌ను శత్రువుగా చూపించటమే ఈ నవలలో కనిపిస్తుంది. కానీ, గాంధీకీ అంబేద్కర్‌కూ మధ్య జరిగిన పోరాటాన్ని ఎక్కడా ఈ నవల ప్రస్తావించదు.

అదేవిధంగా శ్రీ మహీధర రామమోహనరావు 'కొల్లాయిగట్టితేనేమి' నవల కూడా గాంధీ పోరాటాన్ని చిత్రించిందే. గాంధేయవాదం యొక్క ప్రభావాన్ని చిత్రించే నవల ఇది. 1919-1921 ప్రాంతం నాటి ఉద్యమ ప్రభావాన్ని, వ్యక్తిగత జీవితం మీద గాంధీ ప్రభావాన్ని ఈ నవల చూపిస్తుంది. పాలగుమ్మి పద్మరాజు రాసిన 'రామరాజ్యానికి దారి' నవల 1930 నుంచి 1943 వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని చిత్రించింది. నవలకు పెట్టిన పేరులోనే దాని స్వభావం తెలుస్తుంది. రామరాజ్యం అనే భావనను బహుజనులు అంగీకరించరు. అది మనువాద రాజ్యానికి మరోపేరు. శంభూకుడి తలను నరికి, వర్ణవ్యవస్థను స్థిరీకరించిన రాముడు దళిత బహుజనులకు ఆదర్శం కాదు.

జాతీయోద్యమాన్ని రగిలించటం కోసం చారిత్రక నవలలు వచ్చాయి. చరిత్రను మనువాద దృష్టితో చూసి వ్యక్తీకరిస్తే అవి చారిత్రక నవలలవుతాయి. ఈ చారిత్రక నవలల్లో నాయకులందరూ బ్రాహ్మణీయ అగ్రవర్ణాలకు చెందినవాళ్లు. ప్రతినాయకులు ముస్లింలు, లేదా తెల్లపాలకులై వుంటారు. "తెలుగు నవలా సాహిత్యములో చారిత్రక నవలలు ప్రారంభదినాలలోనే వెలువడినాయి. శ్రీ కందుకూరి వీరేశలింగం నడిపిన చింతామణి పత్రిక పోటీలకి శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం అనేక నవలలు వ్రాశారు. వారు రాసిన నవలలో హేమలత, అహల్యాబాయి, కర్పూరమంజరి పేర్కొనదగినవి. ఆ తర్వాత అనేకమంది చారిత్రక నవలలు రాశారు. భోగరాజు నారాయణమూర్తి, కేతవరపు వేంకటశాస్త్రి, దుగ్గిరాల రామచంద్రయ్యచౌదరి, శివశంకర స్వామి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చారిత్రక నవలలకెంతో స్ఫూర్తిని ప్రసాదించినవారే" (తుర్లపాటి రాజేశ్వరి 2002: 137). ముఖ్యంగా విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజులు రాసిన చారిత్రక నవలలన్నీ మనువాద దృష్టితో రాసినవి. విశ్వనాధ రాసిన ఏకవీర, బద్ధన్నసేనాని, కడిమిచెట్టు,ధర్మచక్రం నవలలు పూర్తిగా బ్రాహ్మణీయ సంప్రదాయాన్ని సుస్థాపితం చేసేవి. ఇతర మతాలపట్ల వ్యతిరేకతను చూపించేవి. అదేవిధంగా, బాపిరాజు రాసిన హిమబిందు, గోనగన్నారెడ్డి, అడవి, శాంతిశ్రీ నవలల్లో వ్యక్తమయ్యేదంతా భూస్వామ్య వ్యవస్థ తాలూకు రాజభక్తి. పాలేగాళ్ల వ్యవస్థ దుర్మార్గమైంది. దాని మర్మాన్ని తెలియనీకుండా గోనగన్నారెడ్డి నవల రాశారు. ఈ రకంగా జాతీయోద్యమ నవలలన్నీ అగ్రవర్ణాల నాయకుల గురించీ, వాళ్ల త్యాగపూరిత జీవితాల గురించి మాత్రమే చిత్రించాయి. కిందికులాల పాత్రలేవీ కనిపించవు. ఒకవేళ కనిపించినా, వాళ్లవి జాలిగొలిపే జీవితాలు. అప్రధానమైన పాత్రలుగానే ఉంటాయి. అగ్రవర్ణాల ఔదార్యాన్ని చిత్రించటం కోసం కల్పించిన సంఘటనలు, తయారు చేసిన పాత్రలు మాత్రమే ఉంటాయి. జాతీయోద్యమ నవలలన్నీ బ్రాహ్మణోద్యమ నవలలని వ్యాఖ్యానిస్తే పొరపాటేమీ కాదు. వాటి అంతిమ లక్ష్యం బ్రాహ్మణరాజ్యాన్ని స్థాపించటమే కాబట్టి అలా అనడం సమంజసమే! అని చెప్పొచ్చు.

## 1.3. అభ్యుదయ నవల:

వలస పాలనకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో ఉద్యమాలు వచ్చాయి. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చేసిన పోరాటం కూడా ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. 1917లో రష్యాలో బోల్షివిక్కు విప్లవం విజయవంతమైంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచం రెండు ధృవాలుగా చీలిపోయింది. పెట్టుబడిదారీ దేశాలు, సోషలిస్టు దేశాలని రెండుగా చీలిపోయింది. బ్రిటీషు పాలనలో వున్న ఇండియా నుంచి వెళ్లి విదేశాల్లో చదువుకున్న అనేక మంది మీద కమ్యూనిస్టు ఉద్యమం ప్రభావం ఉంది. ఉన్నవ మీద కూడా ఆ ప్రభావం ఉండేది. అంతేకాకుండా, ఎంఎన్.రాయ్ లెనిన్‌తో కలిసి పనిచేశాడు. కొమిన్‌టర్న్‌లో ఆయన ముఖ్యమైన నాయకుడు. 1920లో రష్యాలోని తాష్కెంటులో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఏర్పడింది. రాయ్ కుల వ్యవస్థ గురించి పట్టించుకోలేదు. లెనిన్ ఒకసారి

కులవ్యవస్థ సంగతేంటని అడిగితే, అది చాలా చిన్నసమస్య అన్నాడట. అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీలో పనిచేసే చాలామంది కమూనిస్టులు వుండేవాళ్లు.వాళ్లని సోషలిస్టు కాంగ్రెస్‌వాదులనేవాళ్లు.డాంగే,బిటి రణదివే, ఇయంయస్ నంభూద్రిపాద్, పుచ్చలపల్లి సుందరయ్య వంటి ముఖ్యనాయకులు కాంగ్రెస్ పార్టీలో పనిచేసేవాళ్లు.1946 వరకు కమ్యూనిస్టు పార్టీ నేరుగా పని చేసింది లేదు. ట్రేడ్‌యూనియన్ పోరాటాల్లో మాత్రమే వీళ్లు కనిపించేవాళ్లు. 1946 తర్వాత కమ్యూనిస్టులు తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం ద్వారా ప్రత్యక్షంగా పనిచేశారు.

"1936లో భారతదేశంలో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. ఆంధ్రదేశంలో ఇది 1943లో ప్రారంభమైంది. అప్పుడది సాహిత్యరంగంలో నూత్నోద్యమస్ఫూర్తిని ప్రసాదించి చైతన్యం కలిగించింది. ఆలోచనాపరులు, కవులు, రచయితలు కళాకారులు ఆలోచించే దృక్పథంగా అభ్యుదయోద్యమం వ్యాప్తిచెందింది. తెలుగులో అభ్యుదయ సాహిత్య ప్రవర్తకుడు శ్రీశ్రీ. దీనికి రాజకీయ బలం నాటి కమ్యూనిస్టు. కమ్యూనిజానికి ఆత్మదానం చేసింది మార్క్సిజం. ఏంగిల్స్ సహాయంతో రూపొందించిన సామాజిక దృక్పథం లెనిన్ వ్యాఖ్యానంలో రష్యాలో రాజకీయ దృక్పథమయింది. మార్క్సిస్టు దృక్పథంతో సాంఘిక, రాజకీయ రంగాల చైతన్యం సాహిత్య చైతన్యంగా పరిణామం చెందింది. శ్రీశ్రీ సాహిత్య మూలసూత్రాలు తనకు అవగాహన అయిన మేరకు మార్క్సిస్టు దృక్పథం నుంచి వచ్చిచేరాయి" (ఇనాక్, కొలకలూరి:2010. 74-75) అని ఆచార్య కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు.

"తెలుగులో అభ్యుదయ సాహిత్యంతో దృక్పథానికి, సామాజిక అవగాహనకు ప్రాధాన్యం వచ్చింది. భావకవిత్వోద్యమ కాలంనాటి వ్యష్టివాదం, పునరుద్ధరణ ధోరణులు, వ్యక్తిగత అనుభూతుల స్థానాన్ని దృక్పథం ఆక్రమించింది. పాశ్చాత్య దేశాలలో డాడాయిజం మొదలైన వ్యక్తివాద, అరాచక ధోరణులపైన తిరుగుబాటుగా 1932లో 'న్యూ సిగ్నేచర్స్' కావ్య సంపుటి, లండన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ మానిఫెస్టో వచ్చాయి. తెలుగు సాహిత్యంలో అభ్యుదయవాదం ఒక గుణాత్మకమైన మార్పు. అభ్యుదయవాదానికి పునాది అయిన ఆర్థిక, సామాజిక సమస్యలు ప్రపంచ దేశాలన్నిటికీ సమానమే. అందువల్ల ఇతర ధోరణులలాగా కాకుండా అభ్యుదయవాదానికి వేళ్లు అన్ని దేశాల లాగే భారతదేశంలో, తెలుగుదేశంలో కూడా ఉన్నాయి. అభ్యుదయోద్యమం అంతవరకు వచ్చిన అన్ని రకాల ధోరణులలోని అభ్యుదయకరమైన అంశాలను గుర్తించి ప్రచారం చేసింది. జాతీయోద్యమంలో భాగంగా పోరాడింది. కానీ సామ్యవాద సమాజ నిర్మాణమే దాని ముఖ్య ఆశయం. ఆధారభూతమైన దృక్పథం మార్క్సిస్టు దృక్పథం. మార్క్సిజం ప్రధాన లక్షణాలు భౌతికవాదం, గతితార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదం, దానికి వర్గ పోరాటం సాధనం, ఆకలి, అజ్ఞానం, దారిద్ర్యం- వీటికి ఉత్పత్తి, పంపిణీల్లోను, ఆర్థిక పరిస్థితుల్లోను ఉన్న అసమానతలు కారణం అన్న అవగాహన అభ్యుదయవాదానికి ముఖ్యం" (రంగనాధాచార్యులు, కె.కె: 1982(ముందుమాట) అని ఆచార్య కె.కె. రంగనాధాచార్యులు అభ్యుదయ సాహిత్యం నేపథ్యాన్ని తెలిపారు.

మార్క్సిజం సమాజాన్ని వర్గదృష్టితో చూస్తుంది. ఆస్తిపర వర్గాలు, ఆస్తిలేని వర్గాలన్న దృష్టి. సమాజాన్ని ఆర్థిక రంగమే నియంత్రిస్తుందని మార్క్సిజం చెప్తుంది. వర్గపునాదుల మీద సాహిత్యం, సంస్కృతి, కులం,మతం వంటి ఉపరితల అంశాలు నిర్మాణమవుతాయని మార్క్సిజం చెప్తుంది. వర్గసమాజంలో వర్గ సంస్కృతి ఉంటుందని, వర్గ సాహిత్యమే ఉంటుందని అంటుంది. కార్మికవర్గం లేదా పేదవర్గం యొక్క కళాత్మక వ్యక్తీకరణలన్నీ వర్గ సమాజానికి వ్యతిరేకంగా ఆవిష్కారమయ్యే చైతన్యమని మార్క్సిజం అంటుంది. పునాది-ఉపరితలం అనే రెండింటిలో పునాదిని మారిస్తేనే ఉపరితలం మారుతుందని మార్క్సిస్టు సిద్ధాంతం చెప్తుంది. బహుజన

దృక్పథం ఈ విశ్లేషణను అంగీకరించదు.

డా॥ అంబేద్కర్ పునాది–ఉపరితల సిద్ధాంతం గురించి వివరంగా చర్చించాడు. ఒక బిల్డింగ్‌ను ఉపమానంగా తీసుకొని ఆయన వివరిస్తాడు. పునాదిని కూల్చాలంటే ముందుగా ఆ పునాదిమీద నిర్మించిన బిల్డింగ్‌ను కూల్చేయాలి. ఆ తర్వాత మాత్రమే పునాదిని కూల్చేయగలవని ఆయన వివరిస్తాడు. కమ్యూనిస్టులు కులం అనేదాన్ని ఉపరితలం అని అనుకొంటే, కులం అనే ఉపరితలాన్ని కూల్చేయకుండా ఆర్థికపునాదిని మార్చేయలేరని ఆయన అంటాడు. ఒకవేళ లెనిన్ ఇండియాలో పుట్టివుంటే, ముందు కులనిర్మూలన పోరాటమే చేసేవాడని ఒక వ్యాసంలో అంబేద్కర్ పేర్కొన్నాడు.

ఇండియా కులసమాజం. కులం ప్రాతిపదికనే హక్కులు, అధికారాలు ఇక్కడ వుంటాయి. అగ్రకులాలకు హక్కులు, కిందికులాలకు బాధ్యతలు మాత్రమే వున్న సమాజమిది. కుల సమాజంలో కుల సంస్కృతే ఉంటుంది. కుల సాహిత్యం మాత్రమే పుడుతుంది. కులమే అన్నింటినీ నిర్ణయిస్తుంది. ఆర్థిక హోదా కూడా ఆ వ్యక్తి పుట్టిన కులం ఆధారంగానే నిర్ణయం అవుతుంది. మార్క్సిజం ప్రకారం మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే! ఇది యూరపులో నిజం. కానీ ఇండియాలో అబద్ధం. ఇండియాలో మాత్రం అన్ని మానవ సంబంధాలు కులసంబంధాలే! కులానికి తప్ప వ్యక్తికి విలువలేదు. కాబట్టి, వ్యక్తిగత చైతన్యం అతడి కులచైతన్యాన్ని అనుసరించి ఉంటుంది. బ్రాహ్మణీయ అగ్రకుల రచయితల చైతన్యం కులాన్ని గుర్తించలేదు. ఎందుకంటే దానివల్ల వాళ్లే ఎక్కువ లబ్ధిపొందుతున్నారు. పైగా, ఏదోఒక రూపంలో కులవ్యవస్థను బతికించే ప్రయత్నం చేశారు. ఒకవేళ కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాల్సివస్తే, ఆ పోరాటానికి బ్రాహ్మణీయ అగ్రకులాలే నాయకత్వం వహించి తిరిగి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నించాయి. అందుకే, సంఘసంస్కరణ సాహిత్యం సృష్టించినవాళ్లే భావకవిత్వాన్ని రాశారు. అదేచేత్తో అభ్యుదయ సాహిత్యం వెలువరించారు. ఆ తర్వాత మరోచేత్తో విప్లవ సాహిత్యం సృష్టించారు. అంబేద్కర్ ఉద్యమాన్ని అభ్యుదయ రచయితలు సమర్థించలేదు. గాంధీని సమర్థిస్తూ రచనలు చేశారు. ఉదాహరణకు శ్రీశ్రీ, కుందుర్తి వంటి కవులు గాంధీని కీర్తించారు. కానీ ఒక్కమాట కూడా అంబేద్కర్ గురించి రాయలేదు. శ్రీశ్రీకి పెరియార్ నాయకత్వంలో నడిచిన బ్రాహ్మణేతర ఉద్యమం పట్ల సానుభూతి లేదనీ, పైగా వ్యతిరేకించేవాడని డా॥ జిలుకర శ్రీనివాస్ పేర్కొన్నారు. భావకవిత్వం పారిశ్రామిక విప్లవం నుంచి పారిపోయి ప్రకృతి ఒడిలోకి చేరుకోవటం కాదనీ, కులవ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను సమర్థించలేక, అణగారిన కులాలు లేవనెత్తిన తాత్త్విక ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక కాల్పనికవాదంలోకి జారుకున్నారని ఆయన విమర్శించారు. అభ్యుదయ, విప్లవ సాహిత్యాలు కూడా అంబేద్కర్ ప్రారంభించిన సాంఘిక విప్లవం నుంచి పీడిత వర్గాలను తప్పించడానికే అగ్రవర్ణాలు తయారు చేసిన ఉద్యమాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వాదనతో మార్క్సిస్టులు ఏకీభవించకపోయినా, ఆయన వాదన తప్పని నిరూపించలేక పోయారు.

అభ్యుదయ నవలలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఆయన చెప్పిన విషయాలు వాస్తవమే అని తెలుతుంది. అభ్యుదయ నవలల్లో ఎక్కడా అంబేద్కర్ గురించిన ప్రస్తావన కనిపించదు. గాంధీగురించి గొప్పగా రాసిన అభ్యుదయ నవలలు కూడా ఉన్నాయి. కానీ అంబేద్కర్ కుల నిర్మూలనా పోరాటాల గురించిగానీ, లేదా అణగారిన వర్గాల రాజకీయ పోరాటాన్ని ఆయన నడిపిన తీరుగురించి గానీ ఎక్కడా ఒక్కమాటా ఉండదు. కాబట్టి ఎవరి అభ్యుదయం, ఎవరి విముక్తి, ఎవరికి సమానత్వం? అనే ప్రశ్నలు వలసానంతర బహుజన చైతన్యం వేస్తుంది.

తెలంగాణ రైతాంగ సాయుధపోరాటాన్ని చిత్రించిన నవలలు ఉన్నాయి. ఈ నవలలన్నీ పోరాటం ముగిసిన తర్వాత రాసినవే కావటం గమనార్హం! ఈ నవలల్లో కనిపించే కథావస్తువు,

కథాచిత్రణ, సంభాషణలన్నీ బ్రాహ్మణవాదాన్ని తలపిస్తాయి. నవలలకు పెట్టిన పేర్లు కూడా అలాగే వుంటాయి. వట్టికోట ఆళ్వారుస్వామి రాసిన 'ప్రజలమనిషి', 'గంగు' నవలలు తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చినవి. కథానాయకుడు వైష్ణవ బ్రాహ్మణ వర్గానికి చెందినవాడు. అదేవిధంగా, లక్ష్మీకాంత్ మోహన్ రచించిన 'రామరాజ్యం' (1945-51)లో వ్యవసాయ కూలీల సమస్య ఇతివృత్తం. సోషలిజం అంటే రామరాజ్యం అనే భావన ఈ రచయితది. కమ్యూనిస్టులు కోరుకొనే సామ్యవాద వ్యవస్థ రామరాజ్యాన్ని పోలివుంటుందట. మహీధర రామమోహనరావు 'రథచక్రాలు' (1946-48) కమ్యూనిస్టు ఉద్యమాన్ని చిత్రించింది. రథచక్రాలు అనే పేరును శ్రీశ్రీ చెప్పిన 'జగన్నాథ రథచక్రాలు' నుంచి తీసుకున్నాడు. జి.వి. కృష్ణారావు 'కీలుబొమ్మలు' నవల మహీధర రామమోహన్‌రావుకు కొనసాగింపులా వుంటుంది. గుంటూరు జిల్లాలోని ఒక గ్రామంలో జరిగిన కమ్యూనిస్టు పోరాటాల గురించి ఈ నవలలో చిత్రించారు. రావిశాస్త్రి నవలలు 'గోవులొస్తున్నాయి జాగ్రత్త', 'రాజు-మహిషి', 'మూడుకథల బంగారం', 'ఇల్లు', 'అల్పజీవి', 'సొమ్ములు పోనాయండీ', 'రత్తాలు - రాంబాబు' నవలలు అభ్యుదయ ఉద్యమానికి గొప్ప పేరు తీసుకువచ్చాయి. రావిశాస్త్రి రచనలను జాగ్రత్తగా అధ్యయనం చేయాల్సి ఉంది. ఆయన రచనలను ఇప్పటివరకు వర్గదృష్టితో మాత్రమే పరిశీలించారు. కానీ, రావిశాస్త్రి నవలల్లో అణగారిన వర్గాల జీవితం నిక్షిప్తమైవుంది. బహుజన దృక్పథం నుంచి పరిశీలిస్తే భూస్వామ్య అగ్రకులవర్గాల సామాజిక, ఆర్థిక దోపిడీని ఆయన చిత్రించారు. ఇంత స్పష్టంగా కిందికులాల బాధలను ఇతివృత్తంగాచేసుకొని, ఆ కులాలవారినే కథానాయకులుగా చేసుకొని రచనలు చేసిన ఇతర అభ్యుదయ రచయితలు చాలా అరుదు.

హిందూమత ప్రతీకలను కమ్యూనిస్టు ఉద్యమంలో విరివిగా ఉపయోగించారు. ఇప్పటికీ ఇలాంటి మనువాద ప్రతీకలు అభ్యుదయ, విప్లవ రచనల్లో కనిపిస్తాయి. ప్రత్యామ్నాయ సంస్కృతి గురించి సరైన అవగాహన లేకపోవటం, హిందూ సంస్కృతి అంటే బ్రాహ్మణీయ సంస్కృతనీ, అందులోని ప్రతీకలన్నీ కింది కులాలకు వ్యతిరేకమైనవనే స్పృహ కమ్యూనిస్టులకు లేదు. అందుకే డా. అంబేద్కర్ వీళ్లను 'హిందూ కమ్యూనిస్టులు' అని పిలిచేవాడు. పేరుకే వీళ్లు కమ్యూనిస్టులు కానీ హిందూమతంలోనే వీళ్లు జీవిస్తారని ఆయన విమర్శించే వాడు. అభ్యుదయ నవల ఉదారవాద విప్ర ప్రక్రియ. దానిలో ఈ సమాజం యొక్క నిజమైన స్వభావం వ్యక్తం కాలేదు. వర్గ దృష్టితో రచనలు చేయటమే దీనికి కారణం.

**<u>1.4. విప్లవవాద నవల:</u>**

అభ్యుదయ సాహిత్యం తర్వాత రాజకీయ, సాహిత్య స్తబ్ధత ఏర్పడింది. ఈ స్తబ్ధతను బద్దలుకొట్టడానికే తిరగబడు కవులు, దిగంబర కవులు, పైగంబర కవులు వచ్చారు. కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలిపోయింది. పార్లమెంటరీ పంథాను అనుసరించే పార్టీగా మారిపోయింది. అనేక మంది అభ్యుదయ రచయితల సంఘంలో వున్న బ్రాహ్మణీయ రచయితలు తమ గూటికి చేరుకున్నారు. వర్ణధర్మాన్ని, సనాతన వైదిక ధర్మాన్ని ప్రచారం చేస్తూ రచనలు చేయటం మొదలుపెట్టారు. కమ్యూనిస్టుపార్టీని వీడి కాంగ్రెస్‌పార్టీలో చేరిపోయారు. ఇందిరాగాంధీ నిర్బంధాన్ని తట్టుకొని నిలబడినవాళ్లు కూడా స్పష్టమైన కార్యక్రమం ఏదీ లేకపోవటం వల్ల నీరసపడిపోయారు. అదే సమయంలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రజలు సాయుధులుగా తిరగబడటం మొదలైంది. నక్సల్బరీ ప్రాంతంలో మొదలైన సాయుధ పోరాటం శ్రీకాకుళం, నల్లమల్ల, కరీంనగర్ వరకు వ్యాపించింది. సాయుధపోరాటానికి ప్రజలను సమాయత్తం చేస్తూ కవులు రచనలు చేయటం మొదలుపెట్టారు. దిగంబర కవులు, తిరగబడు కవులు విప్లవకవులుగా పరివర్తన చెందారు. విశాఖలో జరిగిన అరసం సభలో శ్రీశ్రీని యువకులు నిలదీశారు. దీంతో శ్రీశ్రీ అరసంకు రాజీనామా చేసి విప్లవ కవుల్లో చేరిపోయారు. శివసాగర్,

జ్వాలాముఖి, చెరబండరాజు, నిఖిలేశ్వర్, వరవరరావు వంటి ప్రముఖ రచయితలంతా విప్లవోద్యమాన్ని ప్రచారం చేస్తూ రచనలు చేశారు. అల్లంరాజయ్య, సాహు, పి.చంద్ వంటి రచయితలు నవలలు రాశారు. అలా విప్లవ నవల రూపొందింది.

విప్లవ నవల మన సమాజాన్ని కుల సమాజంగా అర్థం చేసుకుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే, పరస్పరం సంఘర్షించుకుంటున్న రెండు మిల్ట్రీ క్యాంపుల మాదిరిగా సమాజాన్ని అర్థం చేసుకుంది. అయితే, విప్లవ నవల ప్రతిపాదించిన మిల్ట్రీ పోరాటాలు నిజంగా ఈ దేశ ప్రజలను విముక్తి చేస్తాయా? ఒకవేళ చేస్తే ఎలాంటి విముక్తి లభిస్తుంది? కేవలం ఆర్థిక అసమానతలే తొలిగిపోతాయా లేదా సామాజిక అసమానతలు కూడా తొలిగిపోతాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు నేటికి స్పష్టంగా లేవు. ఆర్థిక అసమానతలు తొలిగించినంత తేలిగ్గా సామాజిక అసమానతలు తొలిగిపోవు. సామాజిక అసమానతలను రద్దుచేయడానికి కేవలం చట్టాలు మాత్రమే సరిపోవు. వాటినిర్మూలన కోసం మానసిక పరివర్తన జరగాలి. అలాంటి భావజాల పోరాటం విప్లవం వచ్చిన తర్వాత చేయటం వీలుకాదు. మొదటినుంచే జరగాలి. అలాంటి ప్రయత్నాన్ని విప్లవవాదం ఒప్పుకోదు. అన్నికులాల్లోని పేదలను సమీకరించే కార్యక్రమాన్ని పూర్తి చేయటానికిగాను బ్రాహ్మణీయ సంస్కృతి, ఆయా కులాల విశ్వాసాలను ప్రశ్నించే సాహసం చేయదు. అందుకే, హిందూమత ప్రతీకలైన రాముడు, కృష్ణుడు లేదా పండగలైన దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండగల హేతుబద్ధతను విప్లవవాదం ప్రశ్నించదు. పైగా ఆయా పండగలలోని సామూహికతను కీర్తిస్తుంది. అంటే, విప్లవ సంస్కృతిని రూపొందించటంలో విప్లవవాదం విఫలమైంది. అది విప్లవ నవలల్లో కనిపిస్తుంది. విప్లవ నవలల్లో హిందూపండగలను ప్రశంసించటం, ఆ పండగకు వచ్చిన బిడ్డను పోలీసులు అరెస్టు చేయటం లేదా పండగ జరుపుకుంటున్న ప్రజల మీదికి భూస్వాముల గూండాలు దాడి చేయటం వంటి దృశ్యాలు విప్లవ నవలల్లో కనిపిస్తాయి. బహుజనవాదం వీటిని అంగీకరించదు. బ్రాహ్మణీయ సంస్కృతిని నాశనం చేయకుండా ఈ దేశంలో భావవిప్లవం రాదు. భావవిప్లవం రాకుండా నిజమైన భౌతిక విప్లవం సాధ్యం కాదు. అల్లం రాజయ్య నవలల్లో కనిపించే భూస్వామ్య వ్యవస్థ తాలూకు దోపిడీ, రాజ్యం అమలు చేసే నిర్బంధం వాస్తవాలే! కానీ, వాటిని చిత్రించిన వాతావరణం, పాత్రల నిర్మాణం అంతా అగ్రవర్ణపూరితమై వుంటుంది.

విప్లవ నవలలో కనిపించే భూస్వాముల కులం ఏది? శ్రామిక వర్గంలో ఏఏ కులాలున్నాయి? శ్రామికులంతా ఏదో ఒక కులానికి చెందుతారు. భూస్వాములు కూడా ఏదో ఒక కులానికి చెందుతారు. కులాన్ని బట్టి శ్రమ, కులాన్నిబట్టి ఆలోచన, ప్రవర్తన ఉంటాయి. విప్లవోద్యమానికి నాయకత్వం వహించే కథానాయకుడుది ఏకులం? అతడు కుల వ్యతిరేక చైతన్యాన్ని పెంచటానికి ఎలాంటి వైఖరి అనుసరించాడు? ఇలాంటి సత్యాన్వేషణను విప్లవవాదం కనీసం వినడానికి కూడా సిద్ధపడదు. రాజ్యం యొక్క దుర్మార్గం గురించి మాట్లాడే విప్లవవాదం ఆ రాజ్యం యొక్క స్వభావాన్ని అంచనావేయటంలోనే విఫలమైంది. ఇది యూరపులాగే తెల్లవాళ్ల రాజ్యం. అమెరికా మొదలుకొని అనేక యూరపు రాజ్యాలు తెల్లజాతి అహంకారంతో వ్యవహరిస్తాయి. నల్లజాతి పట్ల తెల్లరాజ్యం వ్యవహరించే కఠినత్వం ఎలాంటిదో, అంతకన్న వందరెట్ల ఎక్కువ కఠినత్వం, హింసను ఇక్కడి బ్రాహ్మణరాజ్యం ప్రయోగిస్తుంది. ప్రజల మీద జరిగే ప్రత్యక్ష, పరోక్ష హింసకు, పీడనకు బ్రాహ్మణరాజ్యమే మూలకారణమనే విషయాన్ని విప్లవవాదం బహిర్గతం చేయదు. మౌలికమైన సిద్ధాంతపరమైన విషయాల దగ్గరే విప్లవవాద నవల డొంకతిరుగుడు వ్యవహారాన్ని కనబరుస్తుంది. అందుకే, విప్లవ నవల కుల సమస్యను చిత్రించలేకపోయింది. ఆ సమస్యను ఆర్థిక కోణం నుంచి తప్ప మరో సమగ్ర దృష్టి నుంచి

చూడలేకపోయింది. అందుకే, అదొక అసంపూర్ణ నవలగా మిగిలిపోయింది.

## 1.5.స్త్రీవాద నవల:

తెలుగులో స్త్రీవాదం అతిముఖ్యమైన మార్పు. తెలుగు సాహిత్య వ్యవస్థను వర్గేతర విషయాల గురించి ఆలోచించేలా స్త్రీవాదం చేసింది. విప్లవ సాహిత్యం తర్వాత వచ్చిన స్త్రీవాదం అభ్యుదయ, విప్లవ సాహిత్యాల పరిమితిని గుర్తుచేసింది. వర్గపోరాటాలు స్త్రీల సమస్యలను అప్రధానం చేశాయనీ, పితృస్వామిక దోపిడీ అనే ముఖ్యమైన విషయాన్ని వర్గ ఉద్యమాలు పట్టించుకోలేదని స్త్రీవాదం విమర్శించింది. స్త్రీల విముక్తి ప్రత్యేక అంశంగా అంతర్జాతీయ స్థాయిలో చర్చకు వచ్చింది. ఐక్యరాజ్య సమితి స్త్రీల స్థితిగతుల గురించి చేసిన అధ్యయనం అనేక విషయాలను వెలికితీసింది. ఆ అధ్యయనం స్త్రీవాదం తలెత్తడానికి కారణమైంది. కాత్యాయని విద్మహే స్త్రీవాద నేపథ్యం గురించి

"1975వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించి, దానిని మహిళా దశాబ్దిగా 1985వరకు పొడిగించింది. ఈ అంతర్జాతీయ ప్రేరణ దేశీయ స్థితిగతులను సమీక్షించుకొని స్త్రీల సమస్యలకు కారణాలను అన్వేషించేందుకు, అధ్యయనం చేసేందుకు గ్రూపులుగా సమీకృతమయ్యేందుకు స్త్రీల కెంతో ఉపయోగపడింది. 1975 నాటికి నక్సల్బరీ పోరాటపు వెలుగులో రగులుకొన్న శ్రీకాకుళ గిరిజన విప్లవోద్యమ జ్వాల ఉత్తర తెలంగాణా జిల్లాలకు విస్తరించింది. రాజకీయార్థిక సమానత్వాన్ని కాంక్షిస్తూ సాగిన ఈ ఉద్యమాలు పౌర ప్రజాస్వామిక హక్కుల గురించిన చైతన్యంలో గుణాత్మకమైన అభివృద్ధికి కారణమైనాయి. ఈ చైతన్యం మొత్తం మీద స్త్రీల సమస్యలను మూలాల నుంచి అన్వేషించటానికి, అర్థం చేసుకోవటానికి అనుకూలమైన వాతావరణాన్ని సమకూర్చింది. విప్లవకరశక్తులలో భాగం కావడానికి, పీడితులలోకెల్ల పీడితురాలిగా స్త్రీకి వున్న అవకాశాన్ని, అవసరాన్ని అర్థం చేసుకునే క్రమం ఈ కాలంలో బాగా అభివృద్ధి చెందింది" (కాత్యాయని 1994: 186) అని వివరించారు. కవిత్వంతో మొదలైన స్త్రీవాదం ఆ తర్వాత అన్ని ప్రక్రియలకు విస్తరించింది. నవలా ప్రక్రియ స్త్రీవాదంతో మరోదశకు చేరుకుంది.

స్త్రీవాదాన్ని బహుజన దృష్టి నుంచి పరిశీలించాలి. స్త్రీవాదం పితృస్వామ్యం మీద, వర్గవాదం మీద ఎన్నో విమర్శలు పెట్టింది. స్రీలు జన్మించరు. స్త్రీలుగా తయారు చేయబడుతారని చెప్పిన సైమన్ దిబొవాకు పాశ్చాత్య సమాజమే తెలుసు. ఇండియన్ సమాజం గురించి ఆమెకు తెలియదు. పురుషుల కోసం నిర్మించిన పురుష ప్రపంచంలో స్త్రీలు రెండవ శ్రేణి పౌరులుగా జీవిస్తున్నారని ఆమె 'ది సెకండ్ సెక్స్' అనే గ్రంథంలో వ్యాఖ్యానించారు. పురుషుడు అమూర్త పదార్థం కాదు. పురుషుడికి ఒక మతం, ప్రాంతం, కులం, రంగు వుంటాయని ఆమె గుర్తించడానికి సిద్ధంగా లేదు. ఏ పురుషుడు? ఏ స్త్రీ? అన్న ప్రశ్న తప్పకుండా వస్తుంది. తెల్లజాతి స్త్రీకీ, నల్లజాతి స్త్రీకీ చాలా తేడా వుంటుంది. అదేరకంగా తెల్లజాతి పురుషుడు, నల్లజాతి పురుషుడు ఒకటే కాదు. అందుకే, నల్లజాతి స్త్రీవాదులు ఈ విషయాన్ని గుర్తించారు. పితృస్వామ్యం, జాత్యహంకారం రెండూ తమకు శత్రువులని ప్రకటించారు. నల్లజాతి పురుషులు తెల్లవాళ్ల కింద నలిగిపోతున్నారనీ, నల్లజాతి పురుషుల పెత్తనంలో నల్లజాతి స్త్రీ పీడించబడుతుందన్న ఎరుకను స్పష్టం చేశారు. ఇలాంటి సైద్ధాంతిక స్పష్టతను ఇండియన్ ఫెమినిస్టులు వ్యక్తం చేయలేదు. స్త్రీలందరూ ఒకటే అన్న విషయాన్ని బలంగా చెప్పడానికి ప్రయత్నం చేశారు. ఇలా ప్రకటించటంలో ఒక కుట్రదాగివుంది. మన దేశంలోని కుల వ్యవస్థను వ్యతిరేకించే నిజాయితీ స్త్రీవాదులకు లేదు. కుల వ్యవస్థను గుర్తించి, దానివల్లనే స్త్రీలు దోపిడీకి గురవుతున్నారని చెప్పే సాహసం ఇక్కడి స్రీవాదులు చేయలేదు.

స్త్రీల బానిసత్వానికి బ్రాహ్మణిజమే కారణమని డా॥ అంబేద్కర్ స్పష్టం చేశారు. గాంధీలో

సుగుణాలు వెతికే అగ్రవర్ణ స్త్రీవాదులు అంబేద్కర్‌ను మాత్రం అర్థం చేసుకోలేకపోయారు. స్త్రీలకు రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన సమాన హక్కులు, అధికారాలను అంబేద్కర్ కల్పించారు. హిందూ కోడ్ బిల్లును రాసి స్త్రీలకు ఆస్తి హక్కు, రాజకీయ హక్కులు, విద్యా, ఉద్యోగ హక్కులు కల్పించేందుకు ఆయనెంతో శ్రమించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులైన నెహ్రూ, పటేల్ తదితరులు వ్యతిరేకించారు. చివరికి, కవికోకిల సరోజినినాయుడు కూడా వ్యతిరేకించింది. మనువును కీర్తిస్తూ అంబేద్కర్‌ను వ్యతిరేకిస్తూ ఆమె ఢిల్లీలో ధర్నా కూడా చేసింది. అయితే, సరోజిని నాయుడు స్త్రీవాది కాదు. కానీ, ఆమె ఎంతో మంది స్త్రీవాదులకు ప్రేరణ. ఆమె పట్ల గౌరవం చూపించే అగ్రవర్ణ స్త్రీవాదులు కూడా స్త్రీల బానిసత్వానికి బ్రాహ్మణవాదమే కారణమన్న సత్యాన్ని లోకం ముందు ఉంచడానికి సిద్ధపడలేదు. నస్త్రీ విద్యార్హతి అన్న మనువాదాన్ని విమర్శించకుండా కేవలం పితృస్వామ్యాన్ని మాత్రమే వ్యతిరేకించటం కనిపిస్తుంది. శూద్ర, అతిశూద్ర, ఆదివాసీ స్త్రీ, పురుషుల దైన్యానికి బ్రాహ్మణిజమే కారణం. కానీ స్త్రీవాదాన్ని చాలా సంకుచితమైన పరిమితుల్లో బంధించే ప్రయత్నం చేశారు. జండర్ వివక్ష, డొమెస్టిక్ లేబర్, విద్యా, ఉద్యోగాల్లో జనాభా ప్రాతిపదికన వాటా, స్త్రీలపై అత్యాచారాలు, అత్తింటి వేధింపులు, భర్త అనుమానాలు, లైంగిక సంబంధాలు, శరీర రాజకీయాలు, లైంగిక రాజకీయాలు వంటి అనేక అంశాలను స్త్రీవాదం చర్చకు పెట్టింది.

అగ్రవర్ణ స్త్రీవాదులు రాసిన నవలలు యూరపు సమాజంలోని సమాజానికి నఖలుగా ఉంటాయి. ఆ నవలల్లోని పాత్రల పేర్లు మొదలుకొని పాత్రల ప్రవర్తన, సంఘటనలు జరుగుతున్న దృశ్యాలు, సంభాషణలు అన్నీ మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి లేదా సంపన్నవర్గాల స్త్రీలకు చెందిన కథలుగా కనిపిస్తాయి. తొలినాళ్లలో వచ్చిన నవలల్లో స్త్రీ, పురుషుల మధ్య ఉండే సంబంధాలే ఎక్కువగా ప్రస్తావించారు. ఆంక్షలు లేని స్వేచ్ఛాయుత సంబంధాలను కోరుతున్న స్త్రీల సంఘర్షణను చిత్రించటం కనిపిస్తుంది. జండర్ రాజకీయాల పేరుతో శరీర రాజకీయాలే ఎక్కువగా చర్చకు వచ్చాయి. కానీ స్త్రీల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక విషయాలేవీ సీరియస్‌గా చర్చించ లేదు. ఇలాంటి తిరోగమనం ఎందుకు జరిగింది? దీనికి కారణం స్త్రీల సమస్యను వాస్తవిక కోణం నుంచి చూడక పోవటమే అందుకు కారణం. స్త్రీవాదంలో అనేక ధోరణులున్నాయి. ఉదారవాద స్త్రీవాదం, విప్లవ స్త్రీవాదం, మార్క్సిస్టు స్త్రీవాదం, కమ్యూనిస్టు స్త్రీవాదం వంటి విభజన కనిపిస్తుంది. స్త్రీవాద చర్చను రంగనాయకమ్మ వంటి కమ్యూనిస్టులే ఎక్కువ ఆక్రమించారు. వర్గ విముక్తిలోనే స్త్రీల విముక్తి ఉంటుందని ఆమె విశ్వాసం. ఆమె రాసిన 'స్వీట్ హోం' నవల సోషలిస్టు ఫెమినిజానికి ప్రతీక. రంగనాయకమ్మకు భిన్నంగా స్త్రీల గురించి రాసిన విమల చివరికి విప్లవ శిబిరంలోనే స్థిరపడిపోయింది. కానీ, ఓల్గా, కాత్యాయని విద్మహే, జయప్రభ, కొండేపూడి నిర్మల, కుప్పిలి పద్మ, సి. సుజాత వంటివాళ్లు స్త్రీవాదులుగానే మిగిలిపోయారు.

స్త్రీవాదంలోని అగ్రకుల తత్వాన్ని దళిత స్త్రీలు బహిర్గతం చేశారు. స్త్రీలందరూ ఒక్కటి కాదనీ, వాళ్లను కులం విభజిస్తుందని పేర్కొన్నారు. "సాహిత్యం సమాజానికి ప్రతిబింబం అని బలంగా వాదించి సాహిత్యం సృష్టించినవాళ్లు హిందూ బ్రాహ్మణ సంస్కృతినే ప్రతిఫలించారు. దళిత, స్త్రీవాదాలు వచ్చేదాక బ్రాహ్మణ భాషలోనే సాహిత్యం వచ్చింది. భాషకు కులం ఉందని అంగీకరించడానికి ఇప్పటికీ సంసిద్ధంగా లేనివాళ్లని మనం చూడవచ్చు. లింగం ఉంటుందని అంగీకరించిన స్త్రీవాదులు కూడా భాషకు కులం ఉందని ఒప్పుకోవటంలేదు. దళితవాదం తెలుగు సాహిత్యానికి నవీన విలువలద్దింది. మన సమాజంలోని మానవీయ విలువలన్నీ కుల విలువలని గ్రహించేలా చేసింది. కుల విలువలను తోసివేసి ఉ

న్నతమైన మానవ విలువలను వ్యవస్థీకృతం చేసింది. స్త్రీవాదం ప్రపంచమంతటా ఒకేవిధంగా లేదు. యూరప్‌లో తెల్లజాతి స్త్రీలు ఫెమినిజాన్ని ఆక్రమించుకున్నట్టు ఇక్కడ అగ్రకుల స్త్రీలు స్త్రీవాదాన్ని ఆధీనంలోకి తెచ్చుకున్నారు. నల్లజాతి స్త్రీల జీవితం మిగతా జాతుల స్త్రీల జీవితాల కన్న విభిన్నమైనవనే ఎరుక ఉండికూడా శ్వేతజాతి స్త్రీవాదం తన వర్ణ అహంకారం ప్రదర్శించింది. అలాగే, ఇక్కడి బ్రాహ్మణీయ స్త్రీవాదం కూడా కింది కులాల స్త్రీల సమస్యలు ప్రత్యేకమైనవనీ, లింగ దోపిడితోపాటు కుల దోపిడి అత్యంత ముఖ్యమని గుర్తించ సిద్ధపడలేదు. లింగ వివక్ష, దోపిడీల గురించి కుల స్వభావంతో సాహిత్య సృష్టికావించే వాళ్లు కింది కులాల స్త్రీలు చేస్తున్న వీరోచిత పోరాటాల పట్ల మౌనం వహించారు. సహజత్వంలో అంటబడని ఆడవాళ్ల జీవితాంతం దాకా సాహిత్యంలోకి రాలేకపోయాయి. ఉత్పత్తిలో వారి భాగస్వామ్యం తీసిపారేయలేనిదైనా ఎవరికీ పట్టింపు లేదు. వారి ఆకాంక్షలు అంత విలువైనవిగా అంగీకరించబడలేదు. కింది కులస్త్రీల మీద జరుగుతున్న లింగదోపిడీ సాపేక్షంగా మిగతా స్త్రీలతో పోలిస్తే చాలా దుర్మార్గమైంది. సాహిత్యంలో ఇప్పటికీ జెండర్ మాత్రమే చర్చనీయాంశం అవుతుంది. కానీ, జెండర్‌ను గుణాత్మకంగా నిర్ణయిస్తున్న కులం గురించి చర్చలేదు. ఈ దేశంలో స్త్రీలను ఒక సమాఖ్యగా రూపొందకుండా అడ్డుకుంటున్నది కులం. ఆధిపత్య కుల స్త్రీలను మర్యాదగా అవమానిస్తే కిందికులాల స్త్రీలను నీచంగా పరుషంగా అవమానిస్తారు" (గోగుశ్యామల, (ముందుమాట)2006). తెలుగు సాహిత్యంలో గోగుశ్యామల, బి.వినోదిని, జల్లి ఇందిర, షాజహాన, జూపాక సుభద్ర, జాజుల గౌరి వంటి దళిత స్త్రీవాదులు బ్రాహ్మణిజమే పితృస్వామ్యానికి మూలధాతువని గుర్తించారు. కులాన్ని నిర్మూలిస్తేనే స్త్రీలకు నిజమైన విముక్తి దొరుకుతుందని వీళ్లవాదన. దళిత స్త్రీల జీవితాలను రికార్డు చేసే అనేక రచనలు తీసుకొచ్చారు. జాజుల గౌరి రాసిన 'యిగురం' నవల తెలంగాణ మాదిగ స్త్రీల అవగాహనను వ్యక్తం చేస్తుంది.

**1.6.దళితవాద నవల:**

దళిత, స్త్రీ వాదాల్లో ఏది ముందన్నది చెప్పలేం. రెండూ ఒకే సమయంలో మొదలయ్యాయి. కంచికచర్ల కోటేశు హత్య 1970 దశకంలో జరిగింది. ఆ హత్య గురించిన చర్చ ముగియక ముందే 1985లో కారంచేడులో దళితుల ఊచకోత సాహిత్యకారులను రగిలించింది. 1995లో చుండూరులో దళితుల సామూహిక హత్యాకాండ తెలుగు సమాజంలో దళిత సాహిత్యానికి కారణమైంది. "70-80 దశకాల మధ్య దళితులు చైతన్యవంతులు కావడానికి, దళిత రచయితలు నిర్భయంగా రాయడానికి ఆంధ్రదేశంలోని వామపక్షాలు, ప్రజాపోరాటాలు కొంత స్ఫూర్తినిచ్చాయని చెప్పక తప్పదు. చెరబండరాజు, గద్దర్ రాసిన దళిత గీతాలు దళిత స్పృహకు, దళిత చైతన్యానికీ దోహదపడ్డాయి. అంతకుముందే దిగంబర కవులు తమ మూడో కవితా సంకలనాన్ని అగ్రవర్ణస్థుల చేతిలో సజీవ దహనానికి గురయిన కంచికచర్ల కోటేశుకి అంకితం ఇచ్చి దళితస్పృహను వాళ్లు బలంగా గుర్తించటం వల్ల ఈ సంఘటన సాహిత్య చరిత్రలోనూ, సామాజిక చరిత్రలోనూ ఒక కొత్త మలుపు తీసుకుంది. 1985లో జరిగిన కారంచేడులోని దళితుల హత్య మొత్తం దేశాన్ని కుదిపేసింది. సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకుంది. దళితులు ఏరకంగా ఎదిగినా, నాగరికంగా మారినా, సమానస్థాయిలో కనబడినా సవర్ణులకు దుర్భరంగా వుంటుంది. అణిగిమణిగి వుండవల్సిన వాళ్లు ఆత్మగౌరవంతో తలెత్తుకొని నడుస్తూ వుంటే అగ్రవర్ణస్థులకు కంటగింపుగా వుంటుంది. తమతో పాటు స్వేచ్ఛనీ, సమానత్వాన్నీ అనుభవించడం వాళ్లకు గిట్టదు. ఈ కారణాల వల్లే కారంచేడు, నీరుకొండ, పదిరి కుప్పం, చుండూరు, వార్తలకెక్కని ఇలాంటి ఎన్నో సంఘనలు దళితులను జాగృతం చేసి దళితవాదానికి పోరాట స్ఫూర్తిని కలిగించాయి. ఒకవైపు దళిత సాహిత్యాన్ని సృష్టిస్తూనే

మరోవైపు దళిత ఉద్యమాలకు బలమైన నాయకత్వాన్ని వహిస్తున్న కత్తిపద్మారావు, బొజ్జాతారకం, బి.యం.లీలాకుమారి మొదలైన వారి పాత్ర పరోక్షంగా దళిత సాహిత్య వికాసానికి దోహదపడింది" (సుధాకర్, ఎండ్లూరి. 1994: 203) అని ఎండ్లూరి సుధాకర్ పేర్కొన్నారు.

"1985 తర్వాత తెలుగు సాహిత్యాన్ని కుదిపేసిన మరో వాదం 'దళితవాదం'. స్త్రీలను అణచివేసినట్లే తరతరాల నుండి మన సమాజం దళితులను కూడా తీవ్రమైన అణచివేతకు గురిచేసింది. ఈ సమస్యను ఇతివృత్తంగా తీసుకొని దళితవర్గాలకు చెందిన రచయితలే తమ స్వానుభవంతో నవలల్ని రచించారు. స్పార్టకస్ రచించిన 'ఖాకీబతుకులు' నవలలో దళిత వర్గానికి చెందిన వాళ్లనే రచయిత ముఖ్యపాత్రలుగా తీసుకున్నాడు. దళితవర్గానికి చెందిన ఒక కానిస్టేబుల్‌ను ఇతర కానిస్టేబుల్, ఇతర పోలీసు ఆఫీసర్స్ ఎంతటి వివక్షకు, అణచివేతకు, అవమానాలకు గురిచేస్తారో ఈ నవలలో స్పార్టకస్ (మోహన్‌రావు) అద్భుతంగా చిత్రించాడు. యం.వి.తిరుపతయ్య రచించిన 'బతుకు' నవలలో కూడా పల్లెటూళ్లలో బతకలేక పట్టణానికొచ్చిన ఓ దళిత కుటుంబం ఎంతటి దోపిడీకి గురవుతుందో చిత్రితమైంది. మోయ జంగయ్య రచించిన 'గద్దలాడతండయి', జె.యస్.ఆర్.మూర్తి రచించిన 'వలసదేవర' మొదలైన నవలలు దళితుల సమస్యల్ని చిత్రించాయి. ఇంకా ఇటీవలనే వెలువడిన 'మాదిగపల్లె' (నారపరాజు), 'కక్క' (వేముల ఎల్లయ్య), 'నీలి', 'ఎల్లి' (అరుణ) మొదలైన నవలల్లో కూడా దళితుల సమస్య ఎంతో వాస్తవికంగా చిత్రించబడింది. డాక్టర్ కేశవరెడ్డి రచించిన 'అతడు అడవిని జయించాడు', ఇన్‌క్రెడిబుల్ గాడెస్, రాముడుండాడు – రాజ్యముండాది అన్న నవలలు కూడా దళితుల జీవితాలను పాఠకుల హృదయాలు ద్రవించేలా చిత్రించిన నవలలే" (నవీన్ అంపశయ్య:2012) అని అంపశయ్య నవీన్ పేర్కొన్నారు.

అంపశయ్య నవీన్ మరోసారి దీని గురించి ప్రస్తావిస్తూ "మొన్నమొన్నటి వరకు ఒక సామాజిక వర్గానికి చెందిన రచయితలే నవలలు రాస్తుండటం వల్ల ఆ వర్గపు కుటుంబ వాతావరణమే తెలుగు నవలల్లో కనిపిస్తూండేది. కానీ 80ల నుండి పరిస్థితి మారింది. ఇప్పుడు అన్ని సామాజిక వర్గాలకు ముఖ్యంగా దళిత బహుజన వర్గాలకు చెందిన రచయితలు కూడా తమ వర్గాల సమస్యలను చిత్రిస్తూ నవలలు రాస్తున్నారు. ఈ కారణం వల్ల ఈనాటి నవలల ఇతివృత్తాలలో గొప్ప వైవిధ్యం కనిపిస్తుంది" (నవీన్, అంపశయ్య: 2012.97) అన్నారు.

దళిత నవల వల్ల తెలుగు సాహిత్యం ఎంతో విస్తృతిని పొందింది. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి దళిత నవల వచ్చింది. మాదిగ, మాల కులాల నుంచి వచ్చిన నవలా సాహిత్యం అసలు సిసలైన సామాజిక వాస్తవికతను చిత్రించింది. దళిత నవలే రాకపోయుంటే నేటికీ నవలా ప్రక్రియ అసంపూర్ణంగా మిగిలిపోయి ఉండేదేమో! వైవిధ్యపూరితమైన, సంఘర్షణాత్మకమైన, కళాత్మకమైన నవలా సృజన యాంత్రికత వల్ల నీరసపడిపోయేది.

"తెలుగులో ప్రాచీన సాహిత్యంలోనూ సంప్రదాయ, నవ్య సంప్రదాయ సాహిత్యంలోనూ బ్రాహ్మణవాదం ఉంది. ఆధునికసాహిత్యంలో మాత్రమే దళితదృక్పథం గోచరమవుతుంది. సంస్కరణ సాహిత్యంలో అంటరానితనమన్న దురాచార నిర్మూలన దృష్టి ఉంది. భావకవితలో అస్పృశ్యతా నిరసనం కవితామయంగా ఉంది. అభ్యుదయ సాహిత్యంలో అందరికీ రాబోయే ఆర్థిక విముక్తి నుంచి పంచములకు ప్రయోజనం ఉంటుందన్న హితోక్తి ఉంది కానీ అస్పృశ్యతా సమస్య ప్రత్యేక సమస్యగా అది గుర్తించలేదు. విప్లవ సాహిత్యంలోని పీడితుల విముక్తి పోరాటం వల్ల అందరికీ కలిగే మేలు దళితులకు సంక్రమిస్తుందనటం ఉంది కాని, అస్పృశ్యతను దళితులకు మాత్రమే ఉన్న సమస్యగా విప్లవ దృక్పథం గ్రహించలేదు. స్త్రీ దళితవాదాలు

రెండూ ప్రత్యేక సాంఘిక విధానాలకు సంబంధించిన జీవిత దృక్కోణం వ్యక్తీకరిస్తున్నాయి. పీడితులందరికీ వచ్చే ఆర్థిక విముక్తితో పాటు దళితులకు కులపీడ నుంచి కూడా విముక్తి రావాలి. ఈ కుల సమస్య నిర్మూలన కాంక్షాభివ్యక్తే దళిత సాహిత్యం. తమకే ప్రత్యేకమయిన సమస్యల నుంచి పరిష్కారం సంఘంలోనే వెదుక్కోవాలి. ప్రాచీన ప్రమాదాలకు వర్తమాన సంఘం నుంచే తొలగింపు కలగాలి. ఆ కృషికి, అన్వేషణకు సాహిత్యం ఉత్తమ మాధ్యమం. అందువల్ల దళిత సాహిత్యం అనివార్యం" (ఇనాక్, కొలకలూరి:2010. 144-145) అని కొలకలూరి ఇనాక్ ఒక సందర్భంలో తీర్మానించారు.

దళిత సాహిత్యం నుంచే బిసీ సాహిత్యం, మైనార్టీ సాహిత్యం ఆవిర్భవించాయి. చిక్కనవుతున్న పాట, ఎరుపెక్కిన పాట, బహువచనం, చిత్తరవు వంటి సంకలనాల్లో సామూహికంగా ఉమ్మడిగా బ్రాహ్మణిజాన్ని వ్యతిరేకిస్తూ రచనలు చేసిన కవులు ఎవరు దళితులన్న చర్చ దగ్గర వేరుపడిపోయారు.

## 1.7. బి.సి.వాద నవల:

అస్పృశ్యులు మాత్రమే దళితులని, అస్పృశ్యతకు గురికానివాళ్లు దళితులు కారని ఒకవాదం బయల్దేరింది. బిసీలు, ముస్లింలు దళితులు కారనే వాదన ఒక వివాదంగా మారింది. దళిత కవులతో తెగదెంపులు చేసుకొన్న బిసీలు ప్రత్యేకంగా ఉద్యమాన్ని మొదలుపెట్టారు. కవిత్వంతో మొదలైన బిసీలు తమను తాము బహుజనులుగా ప్రకటించుకున్నారు. ఇక అప్పట్నించి దళిత సాహిత్యం, బహుజన సాహిత్యం అని రెండుగా చీలిపోయింది. అయితే, బహుజన అనే పదంలోకి అందరూ వస్తారు. కాబట్టి ఆ పదాన్ని కూడా ఆ తర్వాతి కాలంలో వదిలేసుకున్నారు. "తెలుగు దళిత సాహిత్య ఆవిర్భావ కాలంలో ఒక విశాల ప్రాతిపదికన సంఘటితమైన ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ కవులు ఆ తర్వాత దళిత సాహిత్యోద్యమానికి మేలే చేసింది. అయితే, ఎవరు దళితులు? ఎవరు రాసింది దళిత కవిత్వం? అనే విస్తృత చర్చల అనంతరం ఈ నిర్ధిష్టతలు ఏర్పడటం గమనించవలసిన అంశం. తెలుగులో తొలి దళిత కవితా సంకలనం 'చిక్కనవుతున్న పాట'కు జి. లక్ష్మీనరసయ్య ముందుమాట రాస్తూ 'కుల వ్యవస్థ, దానికి ఆలంబన అయిన హిందూయిజం, వీటివల్ల రోజువారీ జీవితంలోని పీడనను అనిశ్చితత్వాన్నీ అభద్రతనూ, అవమానాల్నీ ఎదుర్కొంటున్న పీడిత కులస్తుల నుంచీ, మైనార్టీ నుంచీ వచ్చిన కవులు రాసిన కవిత్వమే దళిత కవిత్వం' అని నిర్వచించారు. మరో రకంగా చెప్పాలంటే ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీలు రాసింది దళిత కవిత్వం అనే విశాలార్థం ప్రచారం జరిగింది. చిక్కనవుతున్న పాటలో ఎస్సీల ఊచకోతల మీద అనేక మంది బిసీ కవులు నిజాయితీగా స్పందించి కవిత్వం రాయడం గమనించవచ్చు. చిక్కనవుతున్న పాట, పదునెక్కినపాట, చిత్తరువువంటి సంకలనాలు దళిత కవిత్వం పేరుతోనే వెలువడగా, బహువచనం, మేమే, మొగి వంటి సంకలనాలు' దళిత బహుజన కవిత్వం పేరుతో వెలువడడం గమనించవచ్చు. అంటే అంతవరకూ ఎస్సీల సమస్యలను తమ గొంతుతో పలికించిన బిసీలు,ఎస్సీలకే కాదు, తమకూ సమస్యలు ఉన్నాయనీ, వాటి గురించి కూడా తాము గానం చెయ్యవలసిన అవసరాన్ని గుర్తించారు. దళిత సాహిత్యంలో కొంత చర్చ జరిగిన తరవాత ఈ గుర్తింపుకు రావటం విశేషం" (శిఖామణి:2012: 226) అని డా॥ శిఖామణి బిసీ సాహిత్య నేపథ్యాన్ని తెలుపుతారు.

బి.సి. రచయితలు నవలలు రాశారు. కవిత్వం, కథను దాటి నవలకు బి.సి.వాదం విస్తరించింది. కాలువ మల్లయ్య, బి.యస్. రాములు, శ్రీనివాస్ గౌడ్‌లు నవలలు రాశారు. బి.యస్. రాములు రాసిన 'బతుకుపోరు నవల' బి.సి. దృక్పథంతో కుల సమస్యను చర్చించిన నవల. నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' నవల గౌండ్లకులస్తుల జీవితాల్ని చిత్రించింది. "భిన్నవృత్తులకు సంబంధించిన నవలలు వెలువడటం ఈ దశకం యొక్క మరో విశేషం.

జి.ఎస్.చలం రాసిన 'రేవు', నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ రచించిన 'బతుకుతాడు', కాలువ మల్లయ్య రచించిన 'గువ్వలచెన్నా' నవలల్ని ఇందుకు ఉదాహరణగా చూపించొచ్చు" (నవీన్,అంపశయ్య 2012: 96) అని అంపశయ్య నవీన్ పేర్కొన్నారు. బి.సి.ల కుల వృత్తులు, రాజకీయ, ఆర్థిక రంగంలో బి.సి.ల వెనకబాటుతనం గురించీ ఈ నవలలో చిత్రించారు.

## 1.8. గిరిజన నవల:

గిరిజనులు రాసిన నవలలు 'ఎన్నెల నవ్వు' తప్ప మరోటి కన్పించటం లేదు. గిరిజన సాహిత్యం ఇప్పుడిప్పుడే వస్తుంది. గిరిజనుల పాటలు, కథలు, సంస్కృతి పేరుతో కొత్త పరిశోధన జరుగుతుంది. గిరిజనేతరులు ఆదివాసుల గురించి, యానాదుల గురించి, ఎరుకల జీవితాల గురించి రాయటం కనిపిస్తుంది. వాస్తవానికి ఎస్సీ, బిసీ, మైనార్టీ నవలల్లో గిరిజన పాత్రలు ఉండవు. ఆదివాసుల పాత్రలు చాలా తక్కువ. విప్లవ నవలల్లో కొద్దిగా గిరిజనుల పాత్రలు కన్పిస్తాయి. "1972 సంవత్సరంలో ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక ఉగాది నవలల పోటీలలో గంగాధరరావు గారి లంబాడోళ్ళ రాందాసు నవల మూడవ బహుమతి పొందింది. దీనిని ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సీరియల్‌గా ప్రచురించింది. ఈ కథకు ఆధారం అందరికీ తెలిసిన జానపద గేయమేననీ, ఆ రెండు మూడు చరణాల ఆధారంగా కథను, తన అభిరుచికి తగినట్లుగా మల్చుకున్నానని రచయిత నవల యొక్క పీఠికలో చెప్పుకున్నారు. పోలాప్రగడ సత్యనారాయణగారు ఈ నవలపై అభిప్రాయం, లంబాడోళ్ళ రాందాసు నవల మంచి నవలే కాదు. మంచి నవలల్లో మంచి నవల అని తెలిపారు" (వెంకట్‌లాల్.2011: 9) అని డా॥ జి. వెంకటలాల్ పేర్కొన్నారు. లండాడీల జీవితాన్నీ, సంస్కృతినీ ఈ నవలలో చిత్రించారు. కానీ రచయిత లంబాడేతరుడు. అల్లం రాజయ్య, సాహులు రాసిన కొమురంభీం నవలలో ఆదివాసీ పాత్రలున్నాయి. అరుణ రాసిన 'ఎల్లి' నవలలో ఎరుకుల జీవితం వుంది. కేశవరెడ్డి రాసిన 'మూగవాని పిల్లనగ్రోవి' నవలలో యానాదుల జీవితం ఉంది. గిరిజనేతర రచనలను గిరిజన సాహిత్యంగా చూడలేం. గిరిజన రచయితలు రాసిందే గిరిజన సాహిత్యం. ఏది గిరిజన సాహిత్యం?

"ప్రపంచ వ్యాప్తంగా వున్నా గిరిజనులకు కొన్ని ప్రత్యేక ఆచారాలు కొనసాగుతున్నాయి. తమ జీవన విధానానికి అవసరమైన ఒక ప్రత్యేక వ్యవస్థ ప్రతి గిరిజనులకు వుంటుంది. నాగరిక సమాజం నుండి గిరిజనుల ప్రత్యేక అస్థిత్వాన్ని గుర్తించేది ఆ ప్రత్యేక వ్యవస్థే. గిరజన సంస్కృతి ఆ ప్రత్యేక వ్యవస్థలో ఒక భాగం మాత్రమే. కనుక గిరిజన సాహిత్యాన్ని గిరిజన సంస్కృతి ఆ ప్రత్యేక వ్యవస్థలో ఒక భాగం మాత్రమే. కనుక గిరిజన సాహిత్యాన్ని చూడడం అంటే గిరిజన జీవన విధానాన్ని కొంత వరకూ చూస్తున్నట్లుగా భావించవచ్చు. సాధారణంగా గిరిజనులు సాదాసీదా, గోచి బట్టలతో జీవిస్తూ, కష్టపడి పనిచేసే లక్షణం కలిగి ఉంటారు. వీరిలో నిరక్షరాస్యత ఎక్కువ. ఎవరైనా నమ్మి ఇట్టే మోసపోతుంటారు. స్వయం సంపూర్ణ కారుణ్యంతో జీవిస్తూ, మార్పును, ప్రగతిని ఆహ్వానిస్తారు. పోరాట తత్వాన్ని కలిగి ఉంటారు. నమ్మిక వారి కోసం ప్రాణమివ్వడానికి సైతం వెనుకాడరు. అణిచివేత లేని సత్సంబంధాలను కొనసాగిస్తూ దోపిడీ రహిత జీవనం కోరుకుంటారు. గిరిజన సంస్కృతిలోని ప్రధాన లక్షణం ఉత్పత్తి, పంపిణి సమపాళ్ళలో ఉండటం, సమిష్టీకరణ, నిజాయితీని ఎక్కువ భాగం కలిగి ఉంటారు. మతం, సంప్రదాయాలు, సాంఘిక దృక్పథాన్ని కలిగి ఉంటారు. గ్రామ పెద్ద మొత్తం గ్రామానికి నిర్దేశనం చేస్తాడు. కులపెద్ద నిర్ణయానికి గ్రామం కట్టుబడి ఉంటుంది. వివాహాది కార్యక్రమాలకు అనుసరిస్తున్న ప్రపంచీకరణ, వినిమయ సంస్కృతి గిరిజన గ్రామాలు, గుంపులు, ప్రధానంగా పట్టణ శివారు గిరిజన గ్రామాలలో వ్యాపిస్తున్నది" ( రమేష్ ,జరుపుల.2011: 187-188) అని జరుపుల రమేష్ పేర్కొన్నారు.

**1.9. ముస్లింవాద నవల:**

బాబ్రీమసీదు విధ్వంసం తర్వాత ఒక్కసారిగా ముస్లింల భద్రత, లౌకిక వ్యవస్థ పరిరక్షణ అన్న విషయాలు చర్చకు వచ్చాయి. హిందూత్వపేరుతో ముస్లింల మీద సామూహిక దాడులు జరగడం తెలుగు దళిత, బహుజన కవులను కలవరపర్చింది. బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా దళిత, బిసీ కవులతో కలిసి రచనలు చేసిన ముస్లింలు తమ ప్రత్యేకతను, అస్తిత్వ రక్షణను కాపాడుకోవాల్సి వచ్చింది. దళిత, స్త్రీ, బహుజన (బి.సి) ముస్లిం వాదాలు తెలుగు కవిత్వంలో వేరు వేరు పాయలు, వేటి అస్తిత్వం వాటిదే కానీ వీటి మధ్య దండలో దారం వలె అస్తిత్వం, ఆత్మగౌరవం, సమానత్వం అదే సామ్యం ఉంది. అందుకే ఈ సారుప్యతను నిలబెట్టుకుంటూ కలిసి పోరాటం చేస్తున్నాయి. అంతకు ముందు ముస్లింలు కవిత్యవం రాసినప్పటికీ ముస్లింవాద ఛాయలు కనిపించవు. కానీ 1991 లో ఖాదర్ మొహిద్దీన్ పుట్టుమచ్చతో ముస్లింవాద స్వరం పుట్టుకతోనే బలంగా వినిపించింది. తమ అస్తిత్వాన్ని ప్రశ్నించే హిందుత్వను నిలదీసింది. అయితే అంతకు పూరం '1980లోనే హిందుత్వ శక్తులు బలపడే క్రమం మొదలై హిందు చాందసవాదం విస్తరించింది'. (వెంకటేశ్వర్లు గుడిపాటి .2012 :239). ఆధునిక సాహిత్యంలో తొలి తరం ముస్లిం కవులు తమ అస్తిత్వం గురించి రచనలు చేయలేదు.

అభ్యుదయ, విప్లవ సాహిత్యోద్యమంలో ముస్లింలకు జీవనచిత్రణ, మనోభావాల వ్యక్తీకరణ రికార్డు కాలేదు. ఆఉద్యమాల్లోని ముస్లిం సాహిత్యకారులు కూడా ముస్లింలు ఎదుర్కుంటున్న వివక్షతపై స్పందించలేదు. కానీ అస్తిత్వ ఉద్యమాలైన స్త్రీ, దళితవాదాల తీవ్రతతో ముస్లింల ఆలోచనలోఓ మార్పుకు బీజం వేశాయి. ముస్లింలు తమ గురించి తాము రాసుకోవలసిన అవసరాన్ని గుర్తించేలా చేసాయి. అందుకే మొదట ముస్లింలు దళిత చైతన్యంతో దళితకవిత్వంలో భాగంగా కొనసాగారు. కానీ ముస్లిం అస్తిత్వం ఒక వాదం రూపోందే క్రమంలో దళితవాదం నుండి వేరు పడి స్వయం ప్రతిపత్తి కలిగిన వాదంగా ముందుకు వచ్చింది. అలా ముందుకొచ్చిన ముస్లిం వాదం ప్రభావవంతంగా తమ సమస్యలను వివిధ కోణాలలో చర్చించింది. వాటిని మనం మూడు రకాలుగా చెప్పవచ్చు. 1) మైనారిటీలుగా తమపపై వివక్షను, అణిచివేతను నిరసించడం. 2) ఇస్లాం పేరిట మత పెద్దలు, మైనార్టీ నాయకులు అనుసరిస్తున్న అవకావాధ ధోరణిని వ్యతిరేకించడం. 3) ఇస్లాంలో మహిళల్ని అవమానపరిచే ధోరణిని తిరస్కరిస్తూ సంస్కరణల్ని ఆశించడం" (వెంకటేశ్వర్లు, గుడిపాటి, 2012. 241) మనే ఈ మూడు కోణాలు ప్రధానం. ముస్లిం వాద కవిత్వం కనిపిస్తాయి. అంటే ఒక వైపు హిందూత్వ శక్తుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించడం, మరో వైపు తమ మతంలో సంస్కరణలను బలం కోరుకోవడం ఏక కాలంలో రెండు గొంతుకలను బలంగా వినిపించడం కనిపిస్తోంది.

అయితే ఇదంతా కవిత్వంలోనే ఎక్కువ. కథలలో ఈ గొంతుక ఉన్నప్పటికీ కవిత్వంలో ఉన్నంత బలంగా లేదు. ముస్లిం వాదం నుండి కవిత్వం, కథలు, వ్యాసాలు వచ్చాయి. కానీ నవలలు రాలేదు. ముస్లిం పాత్రలు ఉన్న నవలలు అనేకం వచ్చాయి. కానీ అన్నింట్లోను ముస్లిం పాత్రలను కించపరుస్తూ, హీనపరుస్తూ రాసినవే. ముస్లిం జీవితాల్లోని లోటుపాట్లను చిత్రిస్తూ ఒక్క నవల కూడా తెలుగు సాహిత్యంలో రాలేదు.ఆలోటును పూడ్చడానికన్నట్లు సలీం 2003లో వెంటి మేఘం,పేరుతో నవల ప్రచురించారు. "పేద ముస్లిముల సాంఘీక జీవితాలను విస్తృతంగా చిత్రీస్తూ తెలుగులో వెలువడిన మొట్టమొదటి నవల ఈ ' వెండి మేఘం' అవుతుంది". (నవీన్, అంపశయ్య.2012:125) అని నవీన్ ప్రకటించారు.

**1.10. బహుజన పద నేపథ్యం:**

అస్తిత్వ ఉద్యమాలు 1960 దశకంలో ప్రారంభమైంది. 1848లో కుల వ్యతిరేక

బహుజనోద్యమాన్ని జ్యోతిబాపులే మొదలుపెట్టారు. బహుజనద్యమాన్ని కుల వాద అస్తిత్వ వాదంగా కుదించాలని ప్రయత్నించారు. సమస్త కుల పీడన దోపిడీల నుండి సమాజ విముక్తిని ప్రతిపాదించిన బహుజనోద్యమం రాజకీయ పోరాటానికి సమాజ సమూల పరివర్తనకు మార్గం చూపుతున్న విప్లవ ఉద్యమం అవుతుంది. తప్ప అస్తిత్వ ఉద్యమం ఎలా అవుతుందని(శ్రీనివాస్.జిలుకర.2012) జిలుకర శ్రీనివాస్ విమర్శకులు ప్రశ్నించారు.

అయితే బహుజన అనే పదాన్ని బుద్ధుడు నేపథ్యం నుండి పరిశీలించాలి. ఎందుకంటే 'బహుజన' అనే పదాన్ని మొట్టమొదటిసారిగా 'బహుజన హితాయ, బహుజన సుఖాయ'గా చెప్పాడు. అంటే బహుజనులు సుఖంగా ఉండాలని దానర్థం. అయితే తెలుగు సాహిత్యంలో ఎస్సీ, ఎస్టీ, బి.సిలను ఉద్ధేశించే పదాలు అంటరాని వారు, అస్పృశ్యలు, పంచములు, గిరిజనులు, ఆదివాసిలు, హరిజనులు, అల్పాదాయ వర్గాలు, బడుగు వర్గాలు, అట్టడుగు వర్గాలు, దళితులు వంటి పారిభాషిక పదమే 'బహుజనులు' అనే పదము కూడా వృత్తులను బట్టి కులాల పేర్లు ఉన్నాయి. వృత్తులు ఒకటే అయినా వీరిని ఒక రాష్ట్రంలో ఎస్సీలు, మరోరాష్ట్రంలో ఎస్సీలు, బి.సిలుగా స్థానిక ప్రభుత్వాలు గుర్తింపునిచ్చాయి. కాబట్టి కులాన్ని బట్టి ఫలానా వారు దళితులు, ఆదివాసీలు, వెనుక బడినవారు అని స్పష్టంగా చెప్పలేని స్థితి. అందుకే అందర్ని కలిపి 'బహుజనులుగా పిలవవచ్చు.

'బహుజన' అనే పదం 'బహుజన సమాజ్ పార్టీ' ఏర్పడిన (1984 ఏప్రిల్14)తర్వాత ప్రచారంలోకి వచ్చింది. మనువాద వ్యవస్థ వల్ల కష్టానష్టాలకు గురైన షెడ్యూల్ కులాలు, షెడ్యుల్ తెగలు, వెనుక బడిన తరగతులతో పాటు మత పరంగా అల్ప సంఖ్యకులంతా బహుజనులవుతారని బహుజన పార్టీ తన ప్రణాళికలో తెలియజేసింది. భారతదేశంలో అణగారిన కులాలు 6000 వరకు ఉన్నాయి. వీరంతా ఐక్యంగా పోరాటం చేసినప్పుడు కులవ్యవస్థ నిర్మూలించడం జరుగుతుంది. కానీ వీరంతా ఐక్యంగా లేరు కాబట్టి అల్ప సంఖ్యాకులుగా ఉన్నారు. కొందరు సంఖ్యలో అధికంగా ఉన్నారు. " వాళ్ళందరినీ కలిపితే ... వాళ్ళొక పెద్ద మెజారిటీ వాళ్ళు భారతదేశ జనాభాలోనే 85 శాతం హిందీలో ఈ అధిక సంఖ్యాకులను మేము బహుజనులు అంటున్నాము" (వరుణ్ కుమార్, ఎస్: 2011, పు.19) అని కాన్షీరాం ప్రకటించారు.

ఈ దేశంలో కుల వ్యవస్థ నిర్యాలించాలంటే బ్రాహ్మణ వాదుల కుట్రలను అర్థం చేసుకోవాలని మహాత్మాజ్యోతిరావు పూలే, సాహ మహారాజు, డా.బి.ఆర్ అంబేద్కర్ బహుజనులకు చాటి చెప్పారు. బహుజన విముక్తికి బుద్ధుడు, మహాత్మపూలే, డా.బిఆర్ అంబేద్కర్‌లు అందించిన తత్వసిద్ధాంతం ప్రజామోదం పొందింది. అలా పొందడాన్ని గమనించిన అగ్రకులాలు గాంధీ పే రుతో ప్రక్కదారి పట్టించాయి. హరిజనోద్యమం, అందులో భాగమై దేవాలయ ప్రవేశాలు, సర్వోదయ సిద్ధాంతం, హృదయపరివర్తన అనే అంశాలు గాంధీజీ స్వాతంత్రోద్యమంలో భాగంగా బలంగా ప్ర వేశపెట్టాడు. అయితే వాటిని అంబేద్కర్, పెరియారు సిద్ధాంతికంగా తప్పి కొట్టారు. కాని అంబేద్కర్ అనంతర కాలంలో బ్రాహ్మణవాదం విజయం సాధించింది. బహుజనులు కులాల పేరుతో విడివిడి చేసిన ఉద్యమాలు బ్రాహ్మణ ప్రాయోజికత ఉద్యమాలు అయ్యాయి. ఈ " బ్రాహ్మణ ప్రాయోజిత ఉద్యమాలు బహుజనులకు శాశ్వత బానిసత్వంలో మగ్గేలా చేసాయి. అలాంటి ఉద్యమమే దళిత పాథర్స్ ఉద్యమం. అస్తిత్వ ఉద్యమాలనే ఒక కాల్పనిక బ్రాహ్మణవాద పరిభాషను వేల సంవత్సరాలుగా ఈ దేశ భూమి పుత్రులు చేస్తున్న ఉద్యమాల్ని అవహేళన చేయడానికి ఆర్య బ్రాహ్మణులు ప్రచారం చేశారు. అమాయకంగా బహుజన మేధావులు ఆవలలో చిక్కుకొన్నారు. ఇప్పటికీ అస్తిత్వ ఉద్యమాలు బ్రహ్మణీయ స్వభావాన్ని అవగాహణ చేసుకోలేక పోతున్నార"ని జిలుకర శ్రీనివాస్

'బహుజన సాహిత్య ఉద్యమంలో సైద్ధాంతిక అస్పష్టత' అనే వ్యాసం విపులంగా చర్చించారు. (శ్రీనివాస్, జిలుకర:2012.8).

బహుజన విముక్తి ఉద్యమాన్ని అర్థం చేసుకోవడానికి పరిభాష విషయంలో స్పష్టత ఉండాలి. బహుజనులు, అంటరానివారు, శూద్రులు– అతిశూద్రులు, మూలవాసులు, దళితులు, హిందువులు వంటి పరిభాష తెలుగు సాహిత్యాన్ని గందరగోళ పరిచిందని అదే వ్యాసంలో జిలుకర శ్రీనివాస్ పేర్కొన్నారు. హిందూ శబ్దం గురించి దాని మూలాలు గురించి చర్చించారు. హిందూ శబ్దం పుట్టు పూర్వోత్తలు తార్కికంగా నిగ్గుతేల్చారు. పూలే రచనల్లో ఎక్కడా హి ందు శబ్ధం కనిపించదు. ఆర్య బ్రాహ్మణులు, బనియాలు, మహర్‌లు, మతంగ్, బామర్‌లు వంటి శబ్ధాలు మాత్రమే కనిపిస్తాయి. శూద్రులు, అతిశూద్రులనే స్పష్టమైన పరిభాష కనిపిస్తుంది. ఇంక స్పష్టంగా 'గులాంగిరి'లో 'అబొరిజిన్స్' (మూలవాసులు)గా పేర్కొంటాడు. అందుకే మూలవాసీ సిద్ధాంతాన్ని తయారు చేసిన గొప్ప దర్శానికుడుగా జోతిభాపూలేని చెప్పుకోవాలి. అలాగే 'దళిత అనే శబ్దం పూలే,సాహు, అంబేద్కర్ నడుపుతున్న ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు గాంధీజీ ప్రయోగించిన శబ్దం దళిత్." (శ్రీనివాస్,జిలుకర: 2012. 10) అన్నారు.

దళిత శబ్ధాన్ని అంబేద్కర్ మరణానంతరం బ్రాహ్మణవాదులు విస్తృతంగా ప్రచారం చేశారు. మహారాష్ట్రలో వచ్చిన దళితపాంథర్స్ ఉద్యమం దీనికి ఉదాహరణ" దళిత్ ఫాంతర్స్ ఉద్యమం అంబేద్కరిజం మీద జరిగిన అతిపెద్ద అత్యాచారం,దళిత్‌ఫాంథర్స్ మేనిపెసో ట్టమార్క్సిజాన్ని ప్రతిపలిస్తుంది. తప్ప అంబేద్కరిజాన్ని కాదు.. తెలుగు నేల మీద ప్రారంభమైన దళిత మహాసభ కూడా దళిత్ పాంథర్స్‌కు కొనసాగింపు... కారం చేడు, నరమేధం, సంఘటనల తరువాత కులం గురించి ప్రశ్నించారు.... వారిని మార్క్సిస్టు వాసనలు వదిలిపెట్టలేదు. అందేకే దళిత మహాసభల్లో వర్గస్పృహ కనిపిస్తుంది... 'చిక్కనవుతున్న పాట' సంకలనం... దళిత శబ్ధంతో పీడిత కులాల వ్యక్తీకరణ పరివ్యాప్తం చేయడం ద్రోహం కాగా, అంబేద్కరిజాన్ని మార్క్సిజంతో సంకరీకరణ చేసే ప్రయత్నం చేయడం మలి ద్రోహం. ఎస్సి, ఎస్టీ,బి.సి, మైనార్టీ కవులు నిరసిస్తూ కులరహిత సమాజం కోసం ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనార్టీలు ప్రత్యేక వ్యక్తీకరణ కొరకు చీలిపోవడానికి పునాదులు (చిక్కనవుతున్న పాటతో) జి.లక్ష్మి నరసయ్య, త్రిపురనేని శ్రీనివాసులు వేశారని" (పైదే.పు.10–11) జిలుకర శ్రీనివాస్ వ్యక్తం చేసిన అభిప్రాయం సరైనదేనని అనవచ్చు.

"బి.సీలు, మైనార్టీలు దళిత శబ్ధం పట్ల అభ్యంతరం పెట్టారు. ఎస్సి, ఎస్టీ, బి.సి, మైనార్టీలు ఒక్క కేటగిరిగా వ్యక్తీకరణ చేయాలని ప్రయత్నించారు. అదే'బహుజనం' తెలుగు సాహిత్యంలో జరిగిన ఏకైక మంచి సంఘటనగా నాకిది కనిపిస్తుంది. అయితే బి.సీ తత్వవేత్తలు చేసిన విశ్లేషనలు, సూత్రీకరణలు బ్రాహ్మణవాదానికి కొనసాగింపుగానే ఉన్నాయి. బి.సీలను సంకేతించడానికి బహుజనులు అనే కేటగిరిని వాడుకలోకి తెచ్చారు. దీనితో దళితబహుజన అనే భావనలు ఉనికిలోకొచ్చాయి. 'బహుజన' అనే శబ్ధాన్ని తొలిసారిగా బుద్ధుడు ప్రయోగించాడు. 'బహుజన హితాయ, బహుజన సుఖాయ' అని ఆయన సూత్రం. అంటే బహుజనులు సుఖంగా ఉండాలి అని అర్ధం చేసుకోవాలి. ప్రపంచానికి గొప్ప సిద్ధాంతం అందించిన బుద్ధుడు కేవలం బి.సీల గురించి మాత్రమే ఆలోచించాడని భావించాలా?... ఎస్సీ, ఎస్టి, బి.సిలు, మైనార్టీలు అనేవి రాజ్యాంగ సంబంధ పరిభాష, కాన్షీరాం ఈ రాజ్యాంగ సంబంధ పరిభాషను భావజాల పరిభాషగా మార్చి "బహుజన సాహిత్యం" అనే శబ్ధంతో సంకేతించారు. దళిత సాహిత్యం అనే బదులు 'బహుజన సాహిత్యం' అని ఉండాల్సింద'ని (శ్రీనివాస్,జిలుకర.2012.పు.12) జిలుకర శ్రీనివాస్ విశ్లేషణాత్మకంగా పరిశీలించి నిగ్గు తేల్చారు. దళిత పదం వెనుక ఉన్న కుట్రలను ఎరుక పరిచాడు. బహుజన పదం కిందికులాల్లో

చైతన్యం భావాన్ని కల్గిస్తూ రాజ్యాధికారం కలసి కట్టుగా పోరాడడానికి మార్గం సుగమం చేస్తుందని వివరణ ఇచ్చారు.

**ముగింపు:**

పై చర్చంతా ఎస్సీ,ఎస్టీ, బి.సి, మైనార్టీలను బహుజనులును కలిపి పిలుస్తారని తెలియజేస్తుంది. బహుజనులుగా కలిసి మెలిసి ఉన్నప్పుడే సహజీవనం చేయడానికి అవకాశం ఉంటుంది. అందుకే వలసపాలన తర్వాత బహుజనుల స్థితిగతులు తెలుగు ప్రాంతం ఏ విధంగా నవలల్లో వ్యక్తం చేశారో పరిశీలించాడో పరిశోదన చెయ్యడమే నా పరిశోధన ముఖ్యోద్దేశం.సంస్కరణోద్యమ సాహిత్యం నుండి విప్లవ సాహిత్యం వరకు వచ్చిన నవలలు ప్రధాన సాహిత్యస్రవంతి నవలలుగా పేర్కొనవచ్చు. ఆ తర్వాత వచ్చిన అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో దళిత,స్త్రీ వాదాలు బలంగా వచ్చాయి. దళిత వాదంలో మొదట కొనసాగిన బి.సి, గిరిజన,ముస్లిం రచయితలు క్రమంగా తల ఒక పాయగా విస్తరించారని చెప్పవచ్చు. వీరందరిని దండలో దారంలా కలిపి ఉంచేది బహుజన నేపథ్యం. కనుక ఆ బహుజన నేపథ్యంలో వచ్చిన దళిత బి.సి, ముస్లిం, గిరిజనులు తమ గురించి తాము స్వయంగా రాసుకున్న నవలలను బహుజన నవలగా పేర్కొనవచ్చు. బహుజనులైన వీరు తమ కులాల సాంస్కృతిక జీవనం, వారి సమస్యలను వాటి పరిష్కారాలను ఏ విధంగా చర్చించారో తరువాత అధ్యాయాల్లో ప్రాంతాల వారిగా పరిశీలించి విశ్లేషణ చేయటం జరుగుతుంది. అదే ఈ పరిశోధన ముఖ్యఉద్దేశం.

-0-

# 2.వలసానంతర బహుజన నవలలు - విమర్శనాత్మక అధ్యయనం

తెలంగాణ ప్రాదేశికత ఒక సాంస్కృతిక సాహిత్య వస్తువుగా రూపొందటం వల్ల తెలుగు నవల రూపం విస్తృతి పెరిగింది. తెలంగాణ అనే ఒక 'ప్రాదేశికత' ఒక రాజకీయ భావనగా, సామాజిక భావనగా పరివ్యాప్తమై సాహిత్య ఉద్యమ స్థాయిగా ఎదిగింది. తెలంగాణ ప్రాంత వైశిష్ట్యం, జీవన ప్రత్యేకతను స్థాపిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును కాంక్షిస్తూ దాదాపు అన్ని ప్రక్రియల్లో రచనలు వచ్చాయి. తెలంగాణ నుంచి వచ్చిన రచనలన్నీ ఎంతో వైవిధ్యాన్ని సాహిత్య రంగంలోకి మోసుకొచ్చాయి. తెలంగాణ నవల ఏకరూపీనమైంది కాదు. అనేక కోణాలు దానికి వున్నాయి. తెలంగాణ వ్యక్తీకరణ కూడా ఏకముఖీనమైంది కాదు. దానికి అనేక స్వరాలు వున్నాయి. అనేక వైభిన్య రూపాలు వున్నాయి. తెలంగాణ ప్రాదేశిక నవల కేవలం సామాజిక అంతర్వుల్లో అగ్రవర్ణ వ్యక్తీకరణగా మాత్రమే అది మిగిలిపో లేదు. అణగారిన వర్గాల నుంచి ఎంతో వైవిధ్యపూరితమైన రచనలు వెలువడ్డాయి. బహుజన దృష్టి నుంచి తెలంగాణ ప్రాదేశిక జీవితాన్నీ, తెలంగాణ ప్రాదేశిక సాంఘిక మూర్తిమత్వాన్ని గమనించినపుడు సారంలో తెలంగాణ నవల చేరుకొన్న శిఖర స్థాయి బోధపడుతుంది. అందుకే ఈ అధ్యాయంలో తెలంగాణ ప్రాదేశిక నవలలో బహుజన ఆలోచన వ్యక్తీకరణ పరిశీలిస్తాను.

## 2.0. <u>తెలంగాణ ప్రాదేశిక నవలలో – బహుజన చైతన్య ఆలోచన వ్యక్తీకరణ</u>

తెలంగాణ ప్రాదేశిక సాహిత్యం తొలుత కవిత్వంతో మొదలైంది. కవులే ముందుగా తెలంగాణలో స్పందించారు. కవులు ఏ నేపథ్యంలో తెలంగాణ సాహిత్య సృజన చేశారో గుడిపాటి వివరించే ప్రయత్నం చేశాడు. "1990ల మధ్యకాలంలోనే తెలంగాణ కవి ప్రాంతీయ స్పృహను ప్రబలంగా వ్యక్తం చేయడం కనిపిస్తోంది. ఎవరి అనుభవాల్ని వాళ్లే రాయాలన్న వాదం అప్పటికే వచ్చింది. స్త్రీలు, దళితులు, మైనార్టీలు తమ పరిధిలో తాము ఏకమవుతున్నారు. ఇదే సమయాన ప్రాంతీయ స్పృహ కూడా కొత్తగ రాసేవారికి ఊతమిచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక తెలంగాణ వివక్షకు లోనయింది. ఇది గత పది, పన్నెండేళ్ళ కాలంలో మరింత తీవ్రమైంది. కోస్తా నుంచి తెలంగాణాకు వలసవచ్చిన వారి సంఖ్య పెరిగింది. వారు తెలంగాణలో వేలాది ఎకరాల భూముల్ని కొనడం, పరిశ్రమల్ని స్థాపించడం, తెలంగాణాలో విద్యాలయాల్ని స్థాపించడం, రియల్ ఏస్టేట్ వంటి లాభదాయకమైన వ్యాపారాల్లోకి చొచ్చుకురావడం తొంభైల ఆరంభం నుంచి పెరిగింది. వారి చొరబాటు కారణంగా ఈ ప్రాంతవాసుల్లో అభద్రభావం నెలకొంది. తమ ఉనికి ప్రశ్నార్థకమైందన్న సంగతి వారు గ్రహించారు. మరోవైపున వ్యవసాయం లో వాణిజ్యధోరణులు ప్రబలాయి. ఇంకో వైపున భాషా సంస్కృతులు సైతం అపహాస్యానికి లోనయ్యాయి. మొత్తంగా ఈ ప్రాంత సామాజిక, సాంస్కృతిక జీవితం విచ్ఛిన్నమైంది. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యం, గ్లోబలైజేషన్ క్రమం తెలంగాణవాసుల్ని మరింత దెబ్బతీశాయి. వ్యవసాయా లు కుప్పకూలాయి. బతుక్కి భద్రత లేకుండా పోయింది. నిరుద్యోగం విశ్వరూపం ధరించింది. ఉపాధి అవకాశాలు క్షీణించాయి. ఈ వాస్తవాల్ని తప్పించుకోవటం ఏ కవికీ సాధ్యం కాదు" వెంకటేశ్వర్లు, గుడిపాటి ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వం, తెలుగులో కవిత్వోద్యమాలులో (వెంకటేశ్వర్లు, గుడిపాటి .2012: 246)గుడిపాటిది ఆర్థిక రాజకీయ దృష్టి.

అదేవిధంగా ప్రముఖ విమర్శకురాలు కాత్యాయని విద్మహే కూడా ప్రాంతీయ ఉద్యమాలు రాజకీయ ఆర్థిక దోపిడీల ఫలితమనే అంటుంది. ఆర్థిక దృక్పథంతో ఆమె చేసిన విశ్లేషణ తెలంగాణ ఉద్యమ కారణాలు తెలుపుతాయి. “సహజ వనరులను సక్రమంగా వినియోగంలోకి తాసుకొని రాకపోవట, వనరుల అక్రమ పంపిణీ తరలింపులు ఒక ప్రాంతం వెనుకబాటుతనానికి కారణం. అందుకే దేశీయ వనరుల దోపిడీ మీద ఆధారపిన బ్రిటీషు వలస పాలన ముగిసినా వనరుల దోపిడీ విధానం వంటబట్టిన ప్రాంతాల ప్రభుత్వాల అధికారంలో తెలంగాణా వంటి ప్రాంతాలు ఇంకా అనేకం అసమానతల అభివృద్ధి వలయంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. ఆ అంతర్గత వలస పాలన మీద తిరుగుబాటుగానే జాతి విముక్తి పోరాటాలు బలపడతున్నాయి. మార్కెట్ విస్తరణలో భాగంగా దేశీయ వస్తువుకి విలువ తగ్గిపోతుంది. గుర్తింపు లేకుండా పోతుంది. ఈ పరిస్థితి ప్రాంతీయ సాహిత్యాలకు కూడా వర్తిస్తుంది. తమ ప్రాంతపు వనరుల మీద తమకే హక్కు వుండాలన్న ఆలోచన ఫలితంగా చిన్న రాష్ట్రాల ఏర్పాటు ఒక ప్రజాస్వామిక ఆకాంక్షగా బయటకు వస్తున్నది” (కాత్యాయని విద్మహే 2013 :20) (తెలంగాణ సాహిత్య అధ్యయనం పరిచయం – పరిధి – పద్ధతి, ప్రాంతీయ చైతన్యం తెలంగాణ సాహిత్యం, కాత్యాయని విద్మహే, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్, 2013) అని అంటుంది. ప్రాంతీయ ఉద్యమాలను జాతి విముక్తి పోరాటాలతో పోల్చటం కాత్యాయని వాదనలోని ఒక ముఖ్యమైన అంశం. ప్రాంతీయ ఉద్యమాలను జాతి విముక్తి పోరాటాలు అనవచ్చా? అనే ప్రశ్న ఆమె వ్యాసంలో తచ్చాడ లేదు. ఒక ప్రాంతంలో అనేక జాతులు, ఉపజాతులు వుండొచ్చు. కానీ జాతి ఏకరూపీనమైంది. ఒకే రక్తం, ఒకే కుదురు కలిగి వుంటాయి. ఒకే భాష, సంస్కృతి వుంటుంది. కానీ ప్రాంతానికి అలాంటి లక్షణాలేవీ వుండవు. అనేక సమూహాలు, జాతులు, భాషలు కూడా ఒక ప్రాంతంలో వుంటాయి. స్వభావ రీత్యా ప్రాంత, జాతి భావనలు పోలిక లేనివి. అయితే, తెలంగాణ ప్రాంతం అంతా ఒకే రకంగా లేదనే ఎరుకను కాత్యాయని ప్రదర్శిస్తారు. సమాజం అనేక జాతుల సమ్మేళనమని ఆమె అదే వ్యాసంలో అంటూ “అంతమాత్రాన తెలంగాణ మొత్తాన్ని ఒకే ప్రజాసమూహంగా గుర్తించటం అశాస్త్రీయం అవుతుంది. తెలుగువాళ్లు ఒక ప్రధాన జాతి అనుకొంటే జాతుల పిరమిడ్‌లో కోస్తా ఆంధ్రులు పైన వుంటే క్రింద భాగంలో తెలంగాణా ప్రాంతీయులున్నారు. కానీ దళిత, వెనుకబడిన కులాలు, రైతులు, భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, కూలీలు, స్త్రీలు, పురుషులు మొదలైన ప్రజాసమూహాల అవసరాలు, ఆశలు, ఆరాటపోరాటాలు వేరువేరుగా వున్నాయి” (కాత్యాయని. 2013: 24) అంటుంది. అస్తిత్వంలోని విభిన్నతల మీద లోతైన చర్చ చేయాలని కూడా ఆమె ఇదే వ్యాసంలో అంటుంది. తెలంగాణ ఉద్యమ ప్రభావంలోకి దళితులు, గిరిజనులు, ముస్లింలు ఎందుకు రాలేకపోతున్నారో కూడా ఆలోచించాలని అంటుంది. ఆమె వాదన ప్రకారం అణగారిన వర్గాలు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం లేదు. తెలంగాణలోని దళిత రచయితలు ఏదో ఒక మేరకు ఉద్యమానికి దూరంగా వున్నారు. కానీ అనేక మంది తెలంగాణ దళిత రచయితలు ప్రత్యేక రాష్ట్రాన్ని కాంక్షిస్తూ రచనలు వెలువరించారు. వేముల ఎల్లయ్య, భూతం ముత్యాలు, గుండెపంగు వరకుమార్ వంటి రచయితలు నవలలు రాశారు. కవితా సంకలనాలు వెలువరించిన రచయితలు చాలా మంది వున్నారు.

తెలంగాణ సాహిత్యానికి ప్రేరణ ఏంటి? తెలంగాణ సాహిత్యానికి ప్రాణం ఏంటి? సాహిత్యానికి ప్రాంతీయత ప్రాణమన్న స్పృహకి అస్తిత్వవాదమే ప్రేరణ అని గుడిపాటి అంటారు. విప్లవ సాహిత్యోద్యమ కాలంలో ప్రజల భాషలో రాయాలన్న ధోరణి పెరిగింది. కనుకనే తెలంగాణా మాండలికంలో రాయడం డెబ్బయిల కాలంలోనే ఇక్కడ కనిపిస్తుంది. ఆనాడు

నిజామాబాద్‌కు చెందిన పంచరెడ్డి లక్ష్మణ మాండలికంలో కవిత్వం రాశారు. తరువాత దేవరాజు మహారాజు, తెలిదేవర భానుమూర్తి, టి. కృష్ణమూర్తి యాదవ్ మొదలైనవారు ఇక్కడి మాండలిక భాషను ఉపయోగించారని గుడిపాటి అభిప్రాయం. వీరి తర్వాత దళిత ఉద్యమ నేపథ్యంలో నల్లగొండ, కరీంనగర్, మెదక్ ఇతర జిల్లాల రచయితలు మాండలికంలో రాస్తూ వచ్చారని గుడిపాటి అంటాడు.

తెలంగాణ నవలలన్నీ తెలంగాణ మాండలికంలోనే ఉన్నాయి. గుడిపాటి తెలంగాణ వ్యవహారాన్ని మాండలికం అని అంటున్నప్పటికీ ఇతర విమర్శకులకు ఈ విషయంలో అభిప్రాయ భేదాలున్నాయి. తెలంగాణది మాండలికం కాదని, అది 'తెలంగాణభాష' డా॥ జిలుకర శ్రీనివాస్ అభిప్రాయం. కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రజల వ్యవహారాలన్నీ ప్రత్యేకమైన వ్యవస్థలని ఆయన అభిప్రాయం. "మాండలికం అన్న భావనలో ఒక విధమైన హైన్యత వ్యక్తం అవుతుంది. ఆధునిక విలువల కారణంగా భాష ఆత్మగౌరవ విషయమని గుర్తిస్తున్నాం. మాండలికాలను భాషలు అనడం పట్ల భాషావేత్తలకు భిన్న అభ్యంతరాలున్నాయి. సాంప్రదాయిక నిర్వచనాల పరిధిలో ప్రాదేశిక వ్యవహారాలు భాషలు కాకపోవచ్చు. భాష పునర్ నిర్వచించబడడమే దానికి మార్గం. నిర్మాణవాద భాషాశాస్త్రవేత్త ఫెర్డినాండ్ డి. ససూర్ ప్రకారం సంజ్ఞల వ్యవస్థ భాష. సంజ్ఞలు నిర్ధిష్ట సమాజంలోని సంస్కృతి ఉత్పత్తులు. అందువల్ల వాటి విభిన్నత ఆయా సంస్కృతుల మీద, ప్రాదేశికతల మీద ఆధారపడి వుంటుంది. భిన్న ప్రాదేశిక సంస్కృతులున్న చోట ప్రామాణిక భాష ఒక సౌకర్యం మాత్రమే తప్ప పరిష్కారం కాదు. మాండలికాలు ఒక భాష యొక్క ఉపాంగామని భావిస్తే మాండలికాలు అర్థం కావాలి. తెలంగాణ, రాయలసీమ భాషల్లో వున్న రచనలు అర్థం కాకపోవడం వల్ల వాటికి అనువాదాలు అవసరం అవుతున్న దృష్ట్యా అవి 'భాషలు' అవుతున్నాయి" (జిలుకర శ్రీనివాస్, 2012: 100) నిర్దేశాత్మక వ్యాకరణం ప్రాదేశిక భాషలులోయాస కూడా భాషే అన్న కాళోజీ మాటలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావిస్తారు.

తెలంగాణ నవలలన్నీ తెలంగాణ భాషాసంస్కృతితో పరిపుష్టమయ్యాయి. ముఖ్యంగా తెలంగాణ బహుజన రచయితలు పూర్తిగా తెలంగాణ భాషనే రచనా పనిముట్టుగా ఉపయోగించారు. దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి తెలంగాణ బ్రాహ్మణ రచయితలు నవలల్లోని పాత్రలు సంభాషణలు తెలంగాణభాషలో రాశారు. సన్నివేశ వర్ణన, కథనం అంతా కోస్తాంధ్ర గ్రాంధిక సమ్మిళితంగా రాశారు. కానీ దీనికి భిన్నంగా తెలంగాణలోని బహుజన నవలాకర్తలు పూర్తిగా తెలంగాణ భాషలే రచనాభాషగా స్వీకరించారు.

తెలంగాణ భాషలో కూడా అనేకత వుంది. మాదిగ, మాల కులస్తులు మాట్లాడే తెలంగాణ ఇతరులకన్న భిన్నంగా వుంటుంది. తెలంగాణ శూద్రులు మాట్లాడే భాష కొద్ది తేడాలతో తెలంగాణ వెలమ కులస్తుల భాషకు విభిన్నంగా వుంటుంది. తెలంగాణ గడి భాష అనే ఒక విభజన కూడా వుంది. గడీల భాషలో దొరల ఫ్యూడల్ పెత్తనాన్నీ, ఫ్యూడల్ గౌరవాన్నీ ప్రదర్శించేలా పదం చివర '–డ్రి' అనే ప్రత్యయం చేరుతుంది. 'రాండ్రి, చెప్పుండ్రి, పోండ్రి, చేయిండ్రి' అనే దకారానికి రకారం చేర్చటం గడీలతో సంబంధం వున్న చాకిరి కులాల్లో కనిపిస్తుంది. ఈ విధంగా ఇతర కులస్తులతో మాట్లాడరు. శూద్రులు, అస్పృశ్యులు మాట్లాడుకొనే భాష 'గడిభాష'కు భిన్నమైంది. కాబట్టి తెలంగాణ నవల భాషాశిల్పంలో ఎంతో ముందుచూపును ప్రదర్శించింది. తెలంగాణ మాదిగ, మాల నవలల్లో ఈ స్పష్టత వ్యక్తమవుతుంది. తెలంగాణ దళిత నవలల్లో వాడుతున్న భాష ఎవరికీ అర్థం కావటం లేదనే విమర్శ ఉంది. తెలంగాణ భాష ఒకటి వుందని అంగీకరించే విమర్శకులు సైతం తెలంగాణ దళిత నవలల్లో వున్న దళిత నుడికారాన్ని అంగీకరించటం లేదు. ఇదే రకమైన విమర్శ దళిత కవిత్వం

ప్రారంభమైనప్పుడు వచ్చింది. దళిత అభివ్యక్తిలోని భాషా ప్రయోగాల మీద అగ్రవర్ణ రచయితల విమర్శకు, వెటకారానికి జి. లక్ష్మీనర్సయ్య సరైన సమాధానమే ఇచ్చారు. "దళిత కవిత్వ భాష మీదా, అభివ్యక్తి మీదా ఇప్పటికే చాలా చర్చ జరిగింది. ఈ చర్చలో పాల్గొన్న ఎక్కువ మంది పాత కొలబద్ధలతో దళిత కవిత్వాన్ని కొలుస్తున్నారు. కొంతమంది దళిత కవిత్వం మీద దాడిచేసి దాన్ని బలహీనపరచడానికి భాషను సాకుగా చేసుకుంటున్నారు. దళిత కవిత్వంలో కసిత్వం తప్ప కవిత్వం లేదని కొంతమంది అంటున్నారు. ఇలాంటి దాడుల్నీ, పాతకొలబద్దల్నీ తిప్పికొడుతూ ఉరుములురులు మెరుపులతో వచ్చిన కవిత్వం 'పదునెక్కిన పాట'కు ఆయుధమయ్యింది. గొప్ప వాదనాపటిమతో అంతే గొప్ప వక్తీకరణతో ఈ కవులు ఎదురుదాడికి పూనుకున్నారు. ఒక సోషియో సైకలాజికల్ అప్రోచ్ నుండి దళిత కవిత్వభాషను చూడాల్సిన అవసరాన్ని సంప్రదాయ విమర్శకులకు సూచిస్తున్నారు. ప్రతి కొత్త కవిత్వానికీ తనదైన కొత్తభాష ఉంటుంది కనుక సంస్కృత భాషను దళిత కవిత్వం నుంచి పారదోలుతున్నామని చాటుతున్నారు. దళిత నోటితో సంస్కృతాన్ని పలికించటం సాంస్కృతిక బానిసత్వమవుతుందని వాదిస్తున్నారు. ఎన్నాళ్లినుంచో అలవాటుగా వస్తూ మనలో మనకవిత్వంలో ఇంకిపోయిన సంస్కృత పోకడలను వదిలించుకోవడం కష్టమయిన పనే. అయితే సంస్కృతీకరణను వదిలించుకుని దళితతనాన్ని సొంతం చేసుకోవడానికి కవులు ఎంత ప్రయత్నం పెడుతున్నారనేది వారి అవగాహనకూ, కమిట్‌మెంటుకూ చెందిన విషయం. ఈ పుస్తకంలోని చాలా మంది కవుల్లో దళితతనంతో కూడిన వ్యక్తీకరణ కోసం తపన కనిపిస్తుంది. సంస్కృత భాషను ధిక్కరించడం బ్రాహ్మణవాదాన్ని ఓడించడంలో భాగం అవుతుంది. ఈ అవగాహన వున్న ఏ దళిత కవయినా భాషలో దళితతత్వాన్ని దట్టించే ప్రయత్నం చేయక తప్పదు" (జి.లక్ష్మీనర్సయ్య, 1996,).

తెలంగాణలో ఏకరూపీణమైన సాంఘిక, సాంస్కృతిక వ్యక్తీకరణ కనిపించదు. తెలంగాణ నవలాభాష గడీల నుంచి తీసుకోవాలా? లేక వెలివాడల నుంచి తీసుకోవాలా? అనే ప్రశ్న దళిత రచయితల ముందు నిలబడింది. అప్పటికే దళిత కవిత్వంలో సంస్కృతాధిపత్యంలో వున్న తెలుగును కాదని దళితులు మాట్లాడుకొనే భాషను విజయవంతంగా ప్రవేశపెట్టారు. తెలంగాణ దళిత నవలలో కూడా మరింత నిర్ధిష్టతతో తెలంగాణ వెలిభాషను శక్తిమంతంగా అమలు చేశారు. తెలంగాణాలోని అంతర్వుల సామాజిక వ్యవస్థ నిర్మించిన భాషాపరమైన అంతస్తులను దళిత రచయితలు చాలా అద్భుతంగా వినియోగించారు. దీనికి ప్రధానకారణం తెలంగాణలోని సాంఘిక నిర్మాణమే దీనికి కారణం. అందువల్ల తెలంగాణ బహుజన చైతన్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఇక్కడి కుల వ్యవస్థ దోపిడీనీ, బహుజనుల ప్రతిఘటన రాజకీయాలను అర్థం చేసుకోవాలి. అంబేద్కర్ దృష్టితో చూస్తే తప్ప బహుజన నవల బోధపడదు.

బ్రిటీషు వలస పాలనకాలంలో తెలంగాణది ప్రత్యేకమైన చరిత్ర. అది పరోక్ష వలస పాలనలో వుంది. నిజాం నవాబు తెల్లవారికి కప్పం కడుతూ స్వతంత్ర రాజుగా కొనసాగాడు. బ్రిటీషు వాళ్లతో ఈ ఒప్పందానికి రావడానికి గాను నిజాం రాజ్యంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను బ్రిటీషు ప్రభువులకు దారాధత్తం చేశాడు. అందువల్ల ఆధిపత్య ప్రాంతాలని పేరుబడ్డ కోస్తాంధ్ర ప్రాంతాలు మద్రాసు ప్రెసిడెన్సీలో అంతర్భాగం కావటం వల్ల వలసాధునిక చైతన్యాన్ని పొందాయి. రోడ్లు, రైల్వేలు, తంతితపాల వంటి ఆధునిక వ్యవస్థలు ఆంధ్రలో ఏర్పడ్డాయి. అదే సమయంలో తెలంగాణలో కూడా ఈ ఆధునిక వ్యవస్థ ఏర్పడింది. నిజాం రాజ్యంలో పాలన నిజాం రాజుదే అయినా, హిందూ ఫ్యూడల్‌శక్తులైన అగ్రవర్ణాల పీడన కిందికులాల మీద ఎక్కువగా వుండేది. నిరక్షరాస్యత, ఫ్యూడల్ దోపిడీ వల్ల నిజాం రాజ్యంలోని పల్లెసీమలు తల్లడిల్లాయి. ముఖ్యంగా వెట్టిబానిసలుగా మాదిగ, మాలలు దాస్యం చేశారు. కానీ ప్రత్యక్షంగా నిజాం పాలనలో వున్న తెలంగాణలో దళితుల అభ్యున్నతికోసం రాజు

అనేక చట్టాలు చేశాడు. ఆ క్రమంలోనే నిజాం పట్టణ రాజకీయాల్లో దళితులు ఇతర సామాజిక వర్గాలతో సమానమైన పాత్ర పోషించారు. అంతేకాదు, మేదరి భాగయ్య, అరిగె రామసామి, బియస్ వెంకటరావు, శ్యాంసుందర్ వంటి దళితనేతలు సాంఘిక పరివర్తనా ఉద్యమాన్ని నడిపారు. తెలంగాణ దళితోద్యమం మీద అంబేద్కర్ ప్రభావం స్పష్టంగా వుంది. తెలంగాణ అగ్రవర్ణ సమాజం మీద గాంధీ ప్రభావం బలంగానే ఉండేది. గాంధీ అంబేద్కర్‌ల మధ్య జరిగిన తాత్విక సంఘర్షణ, రాజకీయ పోరాటం తెలంగాణ సమాజం మీద అనూహ్యమైన ఒత్తిడిని కల్గించింది. స్వతంత్ర పోరాటం ఎవరి కోసం అనే విషయంలో గాంధీ, అంబేద్కర్‌ల మధ్య విభేదాలున్నాయి. అగ్రవర్ణాలకు అధికారం బదలాయించాలనే ఎజెండాతో గాంధీ పోరాడి విజయం సాధించాడు. తన లక్ష్యం సాధించడానికి దేశవిభజనకు గాంధీ ఒప్పుకున్నాడు. ఫలితంగా పాకిస్తాన్, భారత్ అనే రెండు దేశాలు ఏర్పడ్డాయి. నిజాం రాజ్యం ఏ దేశంతో ఉండాలన్న విషయం పెద్ద ఘర్షణను సృష్టించింది. నిజాం రాజ్యంలోని అణగారిన వర్గాలు నిజాం రాజుకు మద్ధతుగా నిలిచాయి. అనేక మంది ఇస్లాంలోకి మారారు. అధికార మతం ఇస్లాంలో చేరితే కుల వ్యవస్థ నుంచి విముక్తి లభిస్తుందని నమ్మిన అనేక మంది దళితులు ఇస్లాం స్వీకరించారు. ఈ చర్యకు వ్యతిరేకంగా ఆర్యసమాజం, బ్రహ్మసమాజం, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పని చేశాయి. స్వతంత్రం తర్వాత అగ్రవర్ణాల నేతృత్వంలో జరిగిన నిజాం వ్యతిరేక పోరాటం వాస్తవానికి అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా జరిగింది. అంతిమంగా నిజాం రాజు ఇండియన్ యూనియన్‌లో విలీనమయ్యాడు. ఆ తర్వాత భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు పేరుతో తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. అప్పటి నుంచి తెలంగాణ ప్రాంతంలో దళిత రాజకీయాలు అంతరించాయి.

కారంచేడు, చుండూరు సంఘటనలు ఆంధ్రప్రాంతంలో జరిగిన తర్వాతే దళిత ఉద్యమం మొదలైనట్టు మేధావులు రికార్డు చేశారు. కానీ, 1970 దశకంలోనే అంబేద్కర్ యువజన సంఘం ఏర్పడి తెలంగాణ అంతటా దళిత రాజకీయాలను ప్రచారం చేయటం మొదలైంది. 1980 దశకంలో కారంచేడు హత్యాకాండ, 1995లో చుండూరు ఊచకోత జరిగిన తర్వాత దళిత ఉద్యమం తీవ్రమైంది. మహారాష్ట్రలోని దళిత్‌పాంథర్స్ ఉద్యమం ప్రభావం ఈ ఉద్యమం మీద ఉంది. అయితే, సాహిత్య, సాంస్కృతిక రంగంలో తెలంగాణ బహుజన దృక్పథం ఈ రెండు సంఘటనలతో బయటపడింది. చిక్కనవుతున్న పాట, పదునెక్కిన పాట, చిత్తరువు తొలి దళిత సంకలనాలైతే, వాటిలో అత్యధిక రచయితలు తెలంగాణ ప్రాంతం వాళ్లే కావటం గమనార్హం. ఎస్సీ, బిసీ, ముస్లిం రచయితలు చాలా మంది కుల వ్యవస్థ, మనువాద భావజాలానికి వ్యతిరేకంగా కవిత్వం, కథలు రాయటం కనిపిస్తుంది. ముఖ్యంగా వేముల ఎల్లయ్య కృషి గమనించదగినది. ఆయన గుంపు సాహిత్యం పేర ప్రచురించిన పుస్తకాలు తెలంగాణ దళిత చైతన్యాన్ని, బహుజన దృక్పథాన్ని పట్టిచూపుతాయి.

### <u>2.1.వేముల ఎల్లయ్య కక్క - భూ సమస్య :</u>

తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన దళిత నవలల్లో కక్క ప్రత్యేకమైనది. ఎందుకంటే వేముల ఎల్లయ్య ఈ నవలను పూర్తిగా తెలంగాణ భాషలో రచించారు. ఈ నవల 2000 సంవత్సరంలో మొదటి సారిగా ముద్రించడం జరిగింది. ఈ నవలలో మాదిగ సాంస్కృతిక జీవనం గురించి విస్తృతంగా చర్చించారు.

### <u>2.1.1. వేముల ఎల్లయ్య పరిచయం:</u>

రచయిత పేరు : వేముల ఎల్లయ్య,
తల్లిదండ్రులు: వేముల బుచ్చయ్య, చంద్రమ్మ,
పుట్టిన తేది. 06.07.1973 స్వగ్రామం లింగాల ఘనపరం, వరంగల్ జిల్లా, తెలంగాణ

రాష్ట్రం.
నవలలు 1. కక్క, 2. సిద్ధి. అనేక సాహిత్య సంకలనాలకు వేముల ఎల్లయ్యగారు సంపాదకత్వం వహించారు. వేముల ఎల్లయ్య ఆయన గురించి ఆయన మాటల్లోనే " అత్తగారిల్లు నల్లొగొండ జిల్లా జామామసీద్, గాదెపాక లింగయ్య, పానగల్ రావులమ్మల బిడ్డ యాదమ్మ నా ఆలి. పిల్లలిద్దరు స్వర్ణలత, జాంభవ్, గొల్లగూడ దోదాంల దగ్గర పని. సొంతూరు లింగాల ఘనపరం, వరంగల్జిల్లా. పరమపదించిన మా అయ్య వేముల బుచ్చయ్య, అవ్వ చంద్రమ్మకు ఆరో తారీఖు ఏడో నెల పందొమ్మిదొందల డెబ్బైమూడున నోటిలెక్కొంట పుట్టిన రోజు. మా వదిన లచ్చవ్వ. పెనిమిటి మల్లయ్య. నడిపన్న లచ్చువయ్య వొదినాదమ్మ. అక్క లచ్చవ్వ బా బుచ్చపతి మాదిగ వాడ.

ప్రజాపాతక జనులారా! నేనియాల ఉస్మానియా యూనివర్శిటిలా అంబేద్కర్ నర్మద హాస్టల్ రూమ్ నెంబర్ 78ల రిసెర్చ్ స్కాలర్‌గా గోసంగుల సాంస్కృతి, సాహిత్యంపై ప్రొఫెసర్ ననుమాస స్వామి వద్ద పరిశోదక విద్యార్థిగా మాట్లాడుతున్నానంటే మా బడి సపాయి, బైండ్ల ఈశ్వరమ్మ, విద్యార్థతలు పెద్దబాల శిక్షా ఈమె బతుకు బంగపడి ఇద్దరాడ పిల్లలెంటోస్కొని గట్టగల్ల నర్సయ్య మల్లవ్వ ఇంట్ల దిగి, ఆసాముల జీతగాల్లకు అక్షర ఆదరువు. ఆమె అనాటి బైండ్లీశ్వరమ్మ బడిగోడ తొంగిచూడని గోదల కాడి పిల్లలకు, నాకు రాత్రిబడి సారు నక్కపల్లి ప్రకాష్ పాట మాట ఆటల పంతులు 'రాత్రిబడికి పోయి రాత మార్చుకుందాం' నినాదగీతంతో ఆర్ట్స్ కాలేజి మెట్ల మీద ఆత్మగౌరవంగ నిలబడ్డియ్యాల." (ఎల్లయ్య ,వేముల :2011.70)

## <u>2.1.2. కక్క నవల విశ్లేషణ:</u>

తెలుగు దళిత సాహిత్యంలో 'కక్క' నవల ఒక మైలు రాయి. వేముల ఎల్లయ్య రాసిన ఈ నవల తెలంగాణ దళిత సాంస్కృతిక వాస్తవికతనూ కులాధిపత్య రాజకీయాలను అద్భుతంగా చిత్రించింది. "అది దళిత సాహిత్యం ఆగిపోయినట్టుగా కనిపిస్తున్నదన్న ఆరోపణ ఊపందుకున్న తరుణం. సరిగ్గా ఆ సమయంలోనే 'కక్క', 'అంటరాని వసంతం' వెలువడినాయి. ఇవి రెండూ వందేళ్ల దళిత సాహిత్యానికి వెయేళ్ల తెలుగు సాహిత్యానికి పరిపక్వ ఫలాలు. గడిచిన శతాబ్దం న్యాయంగానే శ్రీశ్రీది. కాకపోతే అది జరిగిపోయిన కథ కాదు. ఇంకా జరగాల్సిన కథ! అయితే, ఈ సారి ఈ శతాబ్దం ఏ ఒక్కరికో చెందదు. అందులో అందరికి జాగా ఉంటుంది. శ్రీశ్రీ మహదానందంగా అదే కరెక్టు అంటూ నేను సైతం అంటూ వంతపాడతాడు. ఆ అనామక శతాబ్దాన్ని చాటే మాదిగ డప్పు కక్క నవల" (శ్రీనివాస్,జిలుకర 2012: 120).

దళిత సాహిత్యం సాధించిన విస్తృతి నవల. తొలుత కవిత్వంతో ఆరంభమైన దళిత సాహిత్యం ఆ తర్వాత కథా ప్రక్రియను సుసంపన్నం చేసింది. అదే సమయంలో తీవ్రమైన విమర్శ కూడా ఆధిపత్య సాహిత్యం మీద చేసింది. దళిత సాహిత్య విమర్శ అన్నది సాహిత్యంలో ప్రధానమైంది. వేయేండ్ల తెలుగు సాహిత్యంలో బ్రాహ్మణవాదం ఎలా పరివ్యాప్తమైందీ విశ్లేషించింది. సాహిత్య చరిత్రలో కులం పోషించిన పాత్ర గురించి ప్రశ్నించింది. మనువాదాన్ని సమర్థించే ప్రబంధ యుగాన్ని తిరస్కరించింది. సంఘసంస్కరణలో కేవలం బ్రాహ్మణులే కేంద్రంగా వున్నారని విమర్శించింది. మానవీయమైన సమాజాన్ని తయారు చేసుకొనేందుకు అవసరమైన సాహిత్యం తెలుగులో రాలేదని దళిత విమర్శ తేల్చి చెప్పింది. ఈ క్రమంలోనే దళిత కళాతత్వ విచారణ వైపు అడుగులేసింది. ఆ క్రమంలో దళిత నవల విశాలమైన జీవితాన్నీ, దుర్భరమైన కుల వ్యవస్థను చిత్రించి నూత్న గవాక్షాలను తెరిచింది. దళిత నవల మరింత నిర్దిష్టను పొంది మాదిగ నవల వరకు పరివ్యాప్తమైంది. మాదిగల సామాజిక సాంస్కృతిక జీవన చిత్రణతో వచ్చిన నవల వేముల ఎల్లయ్య రాసిన 'కక్క' గొప్ప సంచలనాన్ని సృష్టించింది.

నవల అన్నది ఒక ప్రాసెస్. అది కేవలం ఒక ప్రక్రియ మాత్రమే కాదు. అది రూపం

మాత్రమే కాదు. నవల నిరంతరం చలనంలో వుండే, ఎప్పుడూ రూపొందుతూ వుండే మూర్తిత్వం. The "novel" as process rather than as form: such is the intuition to which apologists of this narrative structure have found themselves driven again and again, in an effort to characterize it as something that happens to its primary materials, as a specific but quite properly interminable set of operations and programming procedures, rather than a finished object whose "structure" one might model and contemplate. This process can be evaluated in a two fold way, as the transformation of the reader's subjective attitudes which is at one and the same time the production of a new kind of objectivity (*Realism and Desire, Balzac and the problem of the subject,* The Political Unconscious – Narrative as a Socially Symbolic Act, Fredric Jameson 1981:p151) అంటాడు ఫ్రెడ్రిక్ జేమ్సన్. పాఠకుడి ఆత్మాశ్రయ వైఖరిలో పరివర్తన, అదే విధంగా ఒక విధమైన నూత్న వాస్తవికతను ఉత్పత్తి చేయటంలో కూడా నవల ఒక ప్రాసెస్‌గా పని చేస్తుంది. కాని, వాస్తవికవాదం దాన్ని నిశ్చలమైనదిగానూ మార్పు లేనిదిగానూ మార్చేసింది. ఆధిపత్య నవల రచయితలు వస్తువును గడ్డకట్టిన అంశంగానూ, అందులోని పాత్రలు పరిణామ రహితమైన శిలాసదృశ్య నమూనాలుగానూ చిత్రిస్తూ వచ్చారు. ఇలాంటి కాల్పనిక పాత్రలు రవీంద్రుని నవలల్లో ఉంటాయని జార్జ్ లూకాచ్ తీవ్రంగానే విమర్శించాడు. వర్ణనల ద్వారా పాత్రలను సృష్టించడం కాకుండా, ఆయా సంఘటనలకు, సందర్భాలకు ప్రతిస్పందించే క్రమంలోనే పాత్రల వ్యక్తిత్వం రూపొందుతాయని లూకాచ్ పేర్కొన్నారు. అందుకు భిన్నంగా రవీంద్రుని నవలలు ఉన్నాయని ఆయన విమర్శించారు. ఇదే విమర్శ తెలుగులోని అనేక నవలలకు వర్తిస్తుంది. పాత్ర చిత్రణ పేరుతో అంద చందాలను, ఒడ్డుపొడుగులను వర్ణించడం, వాతావరణ సృజన పేరుతో అనవసరమైన వాటినంతా దృశ్యీకరించడం అనే పద్ధతి వాస్తవికవాదంలో ఎక్కువగా ఉంటుంది. తెలుగు నవల మీద నేటికీ ప్రబంధ రచనల ప్రభావం ఉండటం వల్ల వర్ణనలు ఇంకా అంతరించి పోలేదు. ఇది కేవలం రచనా శైలికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. అది దృక్పథానికి సంబంధించిన సమస్య. ఇతివృత్తం పట్ల మమకారం ఉండి, వస్తువు పట్ల నిజాయితీ లేని వారికి నవల నిర్మాణం ఒక సమస్యగా పరిణమిస్తుంది. ఆ సమస్యను పరిష్కరించుకొనేందుకు వర్ణనను ఆశ్రయిస్తాడు. ఇది కవిత్వంలో అస్పష్టత వంటిది. కవిత్వంలో అస్పష్టత ఎందుకు ఉంటుందో త్రిపురనేని చక్కగా సెలవిచ్చారు.

"శబ్దం మీద అధికారం లేని శబ్ద బానిసత్వం వల్ల కవిత్వంలో అస్పష్టత వస్తుంది. అధ్యయనం లేకుండా ఎవరికీ శబ్ద సంపద పెరగదు. తనంత తానే వచ్చేది ఏమీ లేదు. అనుభవం అనేది జ్ఞానానికి పాఠశాల వంటిది. అనుభవం నుంచీ ఉచిత శబ్దాల్లో భావనీకరించుకొంటే అస్పష్టత ఉండదు. జీవితంలో అస్పష్టత లేదు. మనస్సులో ప్రతిబింబించిన అనుభవాన్ని విశ్లేషించుకోవడంలో, ఆ విశ్లేషణకి పద చిత్రరూపం ఇవ్వడానికి అనువైన శబ్దాలను ఎన్నిక చేసుకోవడంలో శక్తి లేకపోవడం వల్ల కవిత్వంలో అస్పష్టత వస్తుంది" (సాహిత్యంలో వస్తు – శిల్పాలు, త్రిపురనేని మధుసూదనరావు, పే. 148). జీవితం అంటే సామాజిక సంబంధాలే. సమాజంలోని నియమాలు, కట్టుబాట్లు, సంప్రదాయాల పట్ల అందరికీ అనుభవం ఉంటుంది. సామాజిక సూత్రాలు కల్పించిన కృత్రిమ అంతర్వులు కూడా అనుభవంలో ఉంటాయి. వాటిని అందరూ జ్ఞానంగానే కలిగి వుంటారు. వాటి హేతుబద్ధతను నిలదీయటం అనే చైతన్యం లేని రచయితలు లేదా ఆయా అంతర్వుల శాశ్వతత్వాన్ని ఆకాంక్షించే సార్వత్రికవాదులు ఉద్దేశపూర్వకంగానే కవిత్వంలో అస్పష్టతను, నవలలో వర్ణనను ఆశ్రయిస్తారు.

వర్ణనను నవలాకారుడు ఆశ్రయించడం వెనక రచయిత భావజాలం కీలక పాత్ర పోషిస్తుంది. అతడి చైతన్యం ప్రధానమైంది. యూరోప్ సమాజంలో వలె ఇక్కడ వ్యక్తికి తన సొంత ఆలోచనలు, వ్యక్తిత్వం ఉండవు. అతడి చైతన్యం వ్యక్తిగతమైనది కాదు. అది కులం

వల్ల నిర్మాణం అవుతుంది. దళిత సాహిత్యం అస్తిత్వవాద పరిధిలోకి రాదనే వాదన సరైందే. అస్తిత్వ తాత్వికతను చాలా గొప్పగా చెప్పిన వాడు జీన్ పాల్ సార్త్రే. అస్తిత్వ ఉద్యమ ప్రభావంతో మార్క్సిస్టు అస్తిత్వ వాదాన్ని ప్రతిపాదించిన సార్త్రే అభిప్రాయం ఇక్కడి చైతన్య నిర్మాణానికి విరుద్ధంగా ఉంది. "చైతన్యాన్ని వ్యక్తిగతమైన అస్తిత్వమే నిర్ణయిస్తుంది. ఏది కావాలో ఎన్నుకొనే సంపూర్ణమైన స్వేచ్ఛ మనిషికి వుంది కాని ఏది కావాలో అనే దానికి హేతుబద్ధమైన ఆధారం లేదు. అందువల్ల మనిషి నిరంతరం ఆదుర్దా వైమనస్యాలతో (పరాయి వాడిననే లక్షణం) జీవిస్తాడు" (అస్తిత్వవాదం, ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, నిఖిలేశ్వర్, పే. 129) అని అస్తిత్వవాదాన్ని సార్త్రే నిర్వచించారు. గుర్తింపు లేదా అస్తిత్వవాదాల విషయాన్ని చాలా జాగ్రత్తగా గమనించాలి. ఎందుకంటే దళిత సాహిత్యాన్ని గుర్తింపు సాహిత్యంగా అస్తిత్వ వాదంలో ఒక అవిభాజ్య విషయంగా మాత్రమే పరిగణించారు. అయితే, అస్తిత్వవాదం పరిధిలోకి ఇది వస్తుందా రాదా అనే విచికిత్సను ఎవరూ చేయలేదు. అస్తిత్వవాదంలో వ్యక్తి, చైతన్యం రెండూ కీలకమైనవి. వ్యక్తి తన చైతన్యాన్ని తానే నిర్మించుకుంటాడు. వ్యక్తిని ఒక యూనిట్‌గా పరిగణించే పాశ్చాత్య సమాజంలో ఇది నిజమే. దీనికీ పరిమితులున్నాయి. అమెరికా, కెనడా, బ్రిటన్ వంటి దేశాల్లో వ్యక్తి యూనిట్‌గా కనిపిస్తాడు కాని, వాస్తవంలో జాతి ప్రాథమిక అంశం. బానిస వ్యవస్థను రద్దు చేసిన తర్వాత నేటికీ అమెరికా విధానాలు ఆఫ్రో అమెరికన్‌లకు వ్యతిరేకంగా, అమెరికాను శాసిస్తున్న యూదులకు అనుకూలంగా ఉంటాయి. కాబట్టి జాతి ప్రాతిపదికన అక్కడ చైతన్యం నిర్మాణం అవుతుంది. నల్లవాడు కావడం వల్ల అణచివేత, తెల్లవాడు కావటం వల్ల అనేక ప్రయోజనాలు పొందే సౌకర్యం నేటికీ అక్కడి సంఘ జీవితంలో వుంది. కాబట్టి సార్త్రే చెప్పిన నిర్వచనం వల్ల నల్లజాతి ప్రజల పోరాటాన్ని గుర్తింపు ఉద్యమమని గానీ, లేదా అస్తిత్వ ఉద్యమమని గానీ అనేందుకు వీలు లేదు.

ఇండియాలోని కుల సమాజంలో వ్యక్తి కనిష్ఠ అంశం కాదు. కులమే కనిష్ఠ అంశం. ఒక వ్యక్తి తన ప్రతిభ వల్ల కాక పుట్టిన కులం వల్ల మాత్రమే అనేక హక్కులు పొందుతాడు. ప్రతిభా, సామర్థ్యాల హైన్యం వల్ల కాక, పుట్టిన కులం వల్ల మాత్రమే అన్ని అవకాశాలు కోల్పోతాడు. వ్యక్తికి గుర్తింపు, విలువ అనేవి పుట్టిన కులం వల్ల సంక్రమించేవి. కులానికి బాహ్యంగా వ్యక్తికి జీవితం లేదు. అతడు పుట్టిన కులమే అతని స్పృహను, చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. వ్యక్తి ఇష్టాయిష్టాలకు ఎలాంటి సంబంధం లేదు. అందువల్ల వ్యక్తి నిర్మాణమనేది కుల సమాజంలో చాలా కష్టమైన విషయం. ఒక్కో వ్యక్తి ప్రవర్తన అతని సంస్కారం, విద్యా విజ్ఞానాల వల్ల కాకుండా, అతడు పుట్టిన కులాన్ని బట్టి ఉంటుంది. ఒక్కో కులం వ్యక్తులు ఒక్కో విధంగా ప్రవర్తించటం వెనక కులం నిర్దేశించిన సూత్రాలు వున్నాయి. అందువల్ల అస్తిత్వవాదం ఇక్కడి కుల వ్యతిరేకోద్యమాలకు అనువర్తింప చేయదగిన సిద్ధాంతం కాదు. కానీ, అస్తిత్వ రాజకీయాలు దళిత సాహిత్యాన్ని దాని పరిధిలోకి బలవంతంగా తీసుకున్నాయి. "అస్తిత్వ ఉద్యమాలు 1960 వ దశకంలో ప్రారంభమైనవి. అందులో ప్రధానమైంది స్త్రీవాద ఉద్యమం. 1848లో మొదలైన కుల వ్యతిరేక బహుజనోద్యమం అస్తిత్వ ఉద్యమ పరిధిలోకి ఎలా వస్తుంది? మౌలిక సమస్య కాదు, మౌలిక స్వభావానికి సంబంధించిన సమస్యని అంగీకరిస్తే సమస్త కుల పీడన దోపిడీల నుండి సమాజ విముక్తిని ప్రతిపాదించిన బహుజనోద్యమం రాజకీయ పోరాటానికి సమాజ సమూల పరివర్తనకూ మార్గం చూపుతున్న విప్లవ ఉద్యమం అవుతుంది తప్ప అస్తిత్వ ఉద్యమం ఎలా అయింది? దాని విప్లవకర స్వభావాన్ని తగ్గించి అస్తిత్వ పరిభాషలో ఇరికించిన కుదింపువాదం ఎవరి మేధోమధన జనితం? బ్రాహ్మణవాదమే దీనికి బాధ్యత వహించాలి" ( శ్రీనివాస్, జిలుకర . 2012. 117-118) అని జిలుకర శ్రీనివాస్ చేసిన విచారణ న్యాయమైందే.

రచయిత చైతన్యాన్ని అతని కులమే నిర్ణయిస్తుందనే కుల నిర్ణాయకవాదాన్ని అంగీకరిస్తే, నవల ఒక ప్రాసెస్‌గా కాక, ఒక రూపంగా కుదించుకు పోవడానికి కూడా కుల నిర్ణాయకవాద ప్రభావం నుండి తప్పించుకొనే రాజకీయాలే కారణం. 'కక్క' నవల ఒక ప్రాసెస్. అది నిరంతరం కదిలే ప్రవాహం. కుల వాస్తవికతను వేముల ఎల్లయ్య సమగ్రంగా అవగాహన చేసుకొన్నాడు కాబట్టి కాల్పనిక వర్ణనకు నవలలో చోటివ్వ లేదు. పాత్రల రంగు రూపులను గానీ, వారి మనో ప్రపంచాలను గానీ వర్ణనల ద్వారా చెప్పడు. ఆయా సంఘటనలకు ప్రతిస్పందించే క్రమంలోనే పాత్రల స్వభావం నిర్మాణం చేశాడు. ఇది ప్రతివాస్తవికత. అందుకే నిశ్చలమైన పాత్రలతో సాయుధ పోరాటం చేసే ఎర్ర రంగు మిలీషియా నవలకు భిన్నంగా కక్క నవల ఉంటుంది.

గుర్తింపు వ్యక్తిగతమైనది కాదనీ, అది కులానికి సంబంధించినదనే ఎరుక ఉంది కాబట్టే మాదిగల జీవితాలను చిత్రించాడు. "గుర్తింపు ఒక వ్యక్తికి గానీ సమూహానికి గానీ 'ఉండే' ఒక ధర్మం కాదు. గుర్తింపు ఒక సంబంధం. అందువల్లనే, అది వ్యక్తిగత లేదా ఆ బృందపు సొంత ఇష్టాయిష్టాలకి లోబడే విషయం కాదు. వ్యక్తులూ బృందాలూ తమని తాము ఫలానా అని నిర్వచించుకున్నంత మాత్రాన అది వారి గుర్తింపు అయిపోదు. సంబంధింత వ్యక్తులనో సమూహాలనో సంప్రదించకుండా అంటగట్టే లేబిళ్లు కూడా గుర్తింపులు కాబోవు. అలాగని గుర్తింపులు స్వాభావికమైనవి కావు. స్థిరమైనవి అసలే కావు. అవి, సంబంధాల ఫలితాలు. కాబట్టే, సంఘర్షణల పోరాటాల వేదికలు కూడా" (శ్రీనివాస్,జిలుకర:2012. ). గుర్తింపు వ్యవస్థల ద్వారా రూపొందించబడుతాయి. వాటిని వ్యవస్థలోని వ్యక్తులు, సమూహాలు ఆచరిస్తూ ఉంటాయి. అంచేత అది చాలా సార్లు సాంస్కృతికమైనదిగా కనిపిస్తుంది. కాని, అది స్వభావ రీత్యా రాజకీయమైనది. గుర్తింపు ఎలా నిర్మాణం అవుతుంది అన్న అంశం గురించి మాన్యువల్ క్యాజెల్స్ చాలా వివరంగా తెలిపారు.

»»By identity, as it refers to social actors, I understand the process of construction of meaning on the basis of a cultural attribute, or related set of cultural attributes, that is/are given priority over other sources of meaning. For a given individual, or for a collective actor, there may be a plurality of identities. Yet, such a plurality is a source of stress and contradiction in both self representation and social action. This is because identity must be distinguished from what, traditionally, sociologists have called roles, and roles-sets. Roles (for example, to be a worker, a mother, a neighbor, a socialist militant, a union member, a basketball player, a churchgoer, and a smoker, at the same time) are defined by norms structured by the institutions and organizations of society. Their relative weight influencing people's behavior depend upon negotiations and arrangements between individuals and these institutions and organizations. Identities are sources of meaning for the actors themselves, and by themselves, constructed through a process of individuationµµ అని ఆయన సోదాహరణంగా తెలిపారు. ఈ వివరణ కూడా మన కుల వ్యవస్థకు సరిపోదు. ఎందుకంటే గుర్తింపు కేవలం కులపరమైనది. వ్యక్తికి గుర్తింపు లేదిక్కడ. వ్యవస్థలతో వ్యక్తులు సంప్రదింపులు జరిపినా అతనికి ఆపాదించబడిన కులంలో ఎలాంటి మినహాయింపులు ఉండవు. వైయక్తీకృతం అనే భావన వల్ల గుర్తింపుల తయారీలో ఎలాంటి సడలింపులు మన సమాజంలో లేవు. ఆయనే ఇంకా ఇలా అంటారు. »»1) Although, as I will argue below, identities can also be originated from dominant institutions, they become identities only when and if social actors internalize them, and construct their meaning around this internalization (Identity and meaning in the Network Society, Manuel Castells, 2000: p.6-7, Blackwell Publishers, Uk) మాన్యుయెల్ క్యాజెల్స్ సూత్రీకరణ అర్థ సత్యమే అనిపిస్తుంది. సామాజిక శక్తుల ఇష్టాయిష్టాలకు క్యాజెల్స్ ప్రాధాన్యం ఇస్తున్నాడు. ఆధిపత్య వ్యవస్థలు ఇచ్చిన గుర్తింపులను వ్యక్తులు, బృందాలు స్వీకరించి

ఆమోదిస్తాయని అంటున్నాడు. కాని, కుల సమాజంలో పీడిత కులాల ఆసక్తులతో నిమిత్తం లేకుండానే గుర్తింపు వాటి మీద రుద్దబడింది. అయితే, గుర్తింపులను వాటి చరిత్ర నుండీ, వాటి సంస్కృతి నుండి, వ్యవస్థలు కల్పించిన నియమాల నుండి అర్థం చేసుకోవాలని ఆయన చేసిన సూచన చాలా ఉపయుక్తమైంది. కుల ఆధిపత్యం, వివక్ష, కుల భావజాలానికి వ్యతిరేకంగా వచ్చిన దళిత సాహిత్యాన్ని గుర్తింపు ఉద్యమమని ఒక లేబుల్ అంటించారు. అది దళిత అస్తిత్వాన్ని కాపాడుకోవాలని వాదిస్తుందని భావించారు. ఇది ఆధిపత్య సాహిత్య వ్యవస్థ పీడిత కులాల సాహితీ అభివ్యక్తి మీద రుద్దిన ఒక గుర్తింపు. దళితుల ఆ గుర్తింపును ఆశించకుండానే, గుర్తింపు చట్రంలో బంధించారు.

కులం ఒక గుర్తింపు. కులం అనే అమానవీయమైన వ్యవస్థను తయారు చేసింది మూలవాసులు కాదు. యురేషియా బ్రాహ్మణవాదులు వర్ణ వ్యవస్థను అనేక నియమాల ద్వారా కుల వ్యవస్థగా మార్చారు. గుర్తింపు కేవలం ఒక సంకేతం మాత్రమే కాదు. అది అధికార సంబంధాల ఫలితం. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో బ్రాహ్మణులతో ఇతర కులాలు ఎలాంటి సంబంధాన్ని కలిగి వున్నాయనే దాని ఆధారంగానే ఇండియాను అర్థం చేసుకోవాలని మాక్స్ వెబర్ పేర్కొన్నారు. కింది నుండి పైదాకా అసమాన హోదా, అసమాన హక్కులు, అసమాన బాధ్యతలు కులాల వారిగా వున్నాయి. ఏ రెండుకులాలు సమానం కాని దుర్మార్గమైన కుల వ్యవస్థను బ్రాహ్మణవాదులు తయారు చేశారు. బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, శూద్ర, అస్పృశ్య కులాలను మనుధర్మం నిర్మాణం చేసింది. బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియులు ఆర్యులు. వీరే యురేషియా ప్రాంత నుండి వలస వచ్చిన వారు. శూద్రులు, అతిశూద్రులని పిలువబడే వారు ఈ దేశ మూలవాసులు. విశాల ప్రజారాశిగా వున్న మూలవాసులు తిరిగి అధికారంలోకి రాకుండా వుండాలంటే వారిని విభజించాలనే సూత్రాన్ని బ్రాహ్మణవాదులు అమలు చేశారు.

అస్పృశ్యులుగా వెలివేయబడిన మూలవాసుల్లో మాదిగలు ఒకరు. దళిత సాహిత్యం విరివిగా వస్తున్న సందర్భంలోనే మాదిగ సాహిత్యం కూడా వచ్చింది. దళిత సాహిత్యంతో పాటు మాదిగ దండోరా ఉద్యమం సమానంగా రావటమే దీనికి కారణం. నిర్దిష్టత ప్రత్యేకతను సంతరించుకొన్నది. ఆ క్రమంలోనే మాదిగ సాహిత్యం ప్రత్యేకంగా రావటం మొదలైంది. తొలుత మాదిగ కవిత్వం, ఆ తర్వాత మాదిగకథ వచ్చాయి. అటు పిమ్మట మాదిగ నవల వచ్చింది. అలా వచ్చిన తొలి మాదిగ నవల 'కక్క'.

## 2 .1.3..మాదిగ సాహిత్యం:

నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలోని ఆఖరి మెట్టు మాదిగలు. ఎవరీ మాదిగలు? ఎలా అస్పృశ్యులయ్యారు? ఆధునిక రాజ్య వ్యవస్థలో కూడా మాదిగల పట్ల సమాజం మొత్త శత్రువైఖరిని ఎందుకు ప్రదర్శిస్తుంది? మాదిగలకు అన్ని రంగాల్లో అన్యాయం జరగడానికి గల భావజాల పరమైన, రాజకీయపరమైన కారణాలేమైనా ఉన్నాయా? వంటి ప్రశ్నలు తలెత్తుతాయి. మాదిగల గురించి అర్థం కావాలంటే సామాజిక చరిత్రను అర్థం చేసుకోవాలి.

యురేషియా వలసవాదులు ఇండస్ ప్రజల మీద దండెత్తారు. వారి నాగరికతను ధ్వంసం చేసిన యురేషియన్లు (ఆర్యులు) వర్ణ వ్యవస్థను తయారు చేశారు. ఇండస్ నాగరికతలో లభిస్తున్న ఆధారాలను బట్టి ఉత్పత్తిలో ఎంతో పరిణితిని సాధించింది. అంతే కాదు, స్వేచ్ఛ, స్వతంత్రం, సమానత్వం, బంధుత్వం, న్యాయం అనే విలువలు పునాదిగా ఒక మానవీయమైన సమాజం ఇండస్ సివిలైజేషన్‌గా రూపొందింది. అదే హరప్పా నాగరికత. శాస్త్ర సాంకేతిక రంగాల్లో గొప్ప పురోగతిని సాధించారనేందుకు అనేక ఆధారాలు దొరికాయి. అలాంటి నాగరికుల మీద అనాగరిక ఆర్య తెగలు దాడులు చేసి జయించాయి. ఓడిన వారిని దాసులు, దస్యులు, రాక్షసులు, ద్రావిడులని వర్గీకరించారు. ఆర్య తెగల్లో అప్పటికే వున్న సామాజిక

విభజన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య అనే మూడు వర్ణాలుగా మారింది. వైదిక తత్వం ఈ వర్ణ వ్యవస్థకు అంగీకారం తెలిపింది. అప్పటికింకా శూద్ర వర్ణం రూపొంద లేదు. కాని, మూలవాసులను బానిసలుగా చూశారు. బానిసత్వానికి దైవికాదేశాల పేరుతో యురేషియన్లు సమర్థించుకున్నారు. వైదిక తత్వాన్ని హేతుబద్ధంగా నిరసిస్తూ బుద్ధుడు విప్లవం తీసుకొచ్చాడు. సాంఖ్యసిద్ధాంతాన్ని మరింత విశాలం చేసిన బుద్ధుడు స్వర్గ, నరకాలను, దేవుని ఉనికిని నిరాకరించాడు. సమాజం నియమాల ఆధారంగా నడుస్తుందని, బహుజన హితాయ, బహుజన సుఖాయ అనే సూత్రంతో బుద్ధుడు మానవుడు కేంద్రంగా తన సిద్ధాంత బోధన చేశాడు. అనేక మంది రాజులు ఆయన బోధనలు అంగీకరించి బౌద్ధాన్ని స్వీకరించారు. ఆ రకంగా వర్ణ వ్యవస్థను కూల దోసి బౌద్ధ దమ్మం ప్రాతిపదికన బౌద్ధ రాజ్యం నిర్మాణం చేశాడు. అలా అనేక వందల యేళ్లు బౌద్ధం ఇక్కడ మానవులను తయారు చేసింది. వర్ణ వ్యవస్థను ప్రచారం చేసిన వైదికం కూలిపోయింది. కాని, బుద్ధుని మరణం తర్వాత అనేక వందల యేళ్లకు చివరి మౌర్య చక్రవర్తి బృహద్రదున్ని హత్య చేసి బ్రాహ్మణుడైన పుశ్యమిత్రుడు అధికారంలోకి వచ్చాడు. పుశ్యమిత్రుడు అశ్వమేధ యాగం చేసి బౌద్ధ రాజ్యాలను ఆక్రమించాడు. పెద్ద సంఖ్యలో బౌద్ధులను హతమార్చాడు. వర్ణ ధర్మాన్ని అంగీకరించని బుద్ధిస్టులను ఊచకోత కోశాడు. వర్ణ ధర్మాన్ని అంగీకరించిన విశాల సమూహంతో వర్ణ వ్యవస్థను పునరుద్ధరించాడు. అలా లొంగిపోయిన వారే శూద్రులు. తెలంగాణ భాషలో సూదరోల్లు. వర్ణ ధర్మాన్ని అంగీకరించకుండా, బౌద్ధ దమ్మంతో జీవించే వారు లొంగిపోలేదు. వారు వర్ణ బాహ్యులు. మ్లేచ్ఛులు, నిశాదులు వంటి పేర్లతో బ్రాహ్మణులు పిలిచే వారు. మనుధర్మంలో చండాలురు, మ్లేచ్ఛులు, నిశాదులు వంటి పేర్లు వర్ణ ధర్మాన్ని అంగీకరించని వారికి పెట్టారని ప్రఖ్యాత చరిత్రకారిని రొమిల్లా థాపర్ పేర్కొన్నారు. లొంగిపోయిన బుద్ధిస్టులను శూద్రులను చేసిన తర్వాత బ్రాహ్మణులకు పెద్ద సమస్య ఎదురైంది. వర్ణ వ్యవస్థ గుణ ప్రధానమైంది. గుణ ఔన్నత్యం వల్ల శూద్రుడు బ్రాహ్మణుడిగా మారే వెసులుబాటు ఉంది. గుణ హీనత వల్ల బ్రాహ్మణుడు శూద్రుడిగా మారే అవకాశమూ ఉంది. అందుకే, లొంగిపోయిన బుద్ధిస్టులు వర్ణధర్మం పరిధిలోనే వారి జ్ఞానం వల్ల, గుణం వల్ల పై వర్ణంలోకి రావడానికి అనేక ప్రయత్నాలు చేశారు. ఈ వెసులు బాటు వల్ల బ్రాహ్మణులు ఆధిక్యం కోల్పోతున్నారు. అందుకే, గుణం వల్ల కాక, పుట్టుక వల్ల సాంఘిక ధార్మిక హెూదా నిర్ణయించటం ప్రారంభించారు. విశాలమైన సంఖ్యలోవున్న శూద్రులను అనేక బృందాలుగా చీల్చారు. ఆ బృందాలను కులాలుగా గుర్తించి, పుట్టుక ఆధారంగా కులం సంక్రమించే సామాజిక వ్యవస్థను తయారు చేశారు.

వైదిక, వర్ణ ధర్మాన్ని అంగీకరించని బుద్ధిస్టులను అస్పృశ్యులుగా వెలేశారు. అంతేకాదు, బ్రాహ్మణులను అస్పృశ్యులు వెలేసిన దాఖలాలు వున్నాయని డా. అంబేద్కర్ సోదాహరణంగా వివరించారు. బౌద్ధం ఆచరించే వారి పట్ల బ్రాహ్మణులకున్న ద్వేషమే అస్పృశ్యతకు కారణమని ఆయన విశ్లేషించారు. "ఈ ద్వేషానికి కారణాన్ని ఒకలా ఊహించుకోవచ్చు. దళితులు బౌద్ధులైన కారణంగా వారు బ్రాహ్మణులను గౌరవించ లేదు. పూజారులుగా నియమించుకో లేదు. వారిని (బ్రాహ్మణులను) అపరిశుద్ధులుగా పరిగణించారు. మరో పక్కన దళితులు బౌద్ధులు కావటం చేత, బ్రాహ్మణులు వారి పట్ల అయిష్టతతో ద్వేషాన్ని, ధిక్కారాన్ని ప్రబోధించడంతో వారు అస్పృశ్యులయ్యారు" ( అంబేద్కర్, 1994: 294) అని పేర్కొన్నారు. కులం గురించి బాబాసాహేబ్ అంబేద్కర్ చేసిన విశ్లేషణలే చాలా కీలకం కనక మరింత ముందుకు వెళ్లి ఆలోచించాలి. మాదిగ, మాల తదితర అస్పృశ్యులు పూర్వం బుద్ధిస్టులు. బౌద్ధం 'బిక్కు' సంఘం ప్రాతిపదికన ప్రచారమైంది. సంఘంలో వున్న వ్యక్తి బౌద్ధ నియమాల ప్రకారం జీవించాలి. బహుజన హితాయ, బహుజన సుఖాయ అనే సిద్ధాంతాన్ని ప్రచారం చేసేందుకు

బౌద్ధ ప్రచారకుడు నిరంతరం సంచరిస్తూ ఉండాలి. బౌద్ధం స్వీకరించిన వారికి నిరంతరం ధమ్మ బోధన చేసే ప్రచారకులు పెద్ద సంఖ్యలోనే తయారయ్యారు. వర్ణ ధర్మాన్ని అంగీకరించని వారు అనేక గ్రామాలుగా స్థిరపడి వున్నారు. స్థిరమైన ఆవాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న బౌద్ధ అనుయాయులకు నిరంతరం సంచారంలో వుండే పూర్తికాల ప్రచారకులు వుండే వారు. స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న బుద్ధిస్టులను బ్రాహ్మణులు అస్పృశ్యులుగా వెలేయటం వల్ల వారికి ధమ్మ బోధ చేస్తూ వారి మీదే ఆధారపడిన పూర్తి కాల ప్రచారకులు కూడా అస్పృశ్యులుగా మారారు. సంఘ ధమ్మాన్ని ప్రచారం చేసే వారిని పోషించే బాధ్యత, కాపాడుకొనే బాధ్యత స్థిర నివాసం ఏర్పాటు చేసుకొన్న బుద్ధిస్టుల కర్తవ్యం. అందుకే సంచార భిక్కులను వారే పోషించే వారు. అయితే అస్పృశ్యులను మళ్లీ కులాలుగా చీల్చటం వల్ల, వారి మీద ఆధారపడిన సంచార ప్రచారకులు కూడా కులాలుగా మారిపోయారు. వారే సంచార కులాలు. అలా మాల మాదిగ కులాలను ఆశ్రయించే ఉపకులాలు తయారు చేయబడ్డాయి. మాల, మాదిగ ప్రధాన కులాలు కాగా, మిత్తుల, పంబాల, బైండ్ల, చిందు, దక్కలి, గోసంగి వంటి కులాలు ఏర్పడ్డాయి. వీరే ఒకప్పుడు బౌద్ధాన్ని ప్రచారం చేసిన వారు. ఆ తర్వాత బౌద్ధ చరిత్రను తెలిపే వీరు ఆయా కులాల చరిత్రను తెలిపే వారిగా విపరిణామం చెందారు.

ఆధునిక రాజ్యంలో కుల వ్యవస్థ మరింత సంక్లిష్టంగా మారింది. అధికార బదలాయింపు తర్వాత ఆధునిక రాజ్యం రూపంలో బ్రాహ్మణ రాజ్యం ఉనికిలోకి వచ్చింది. కుల అంతర్వులను నిర్మూలించాల్సిన రాజ్యం వాటి కొనసాగింపుకు అవసరమైన చర్యలనూ తీసుకుంది. ఆధునిక రాజ్యం రూపొందించిన అధికార వ్యవస్థలో మూలవాసులను అధికార వంచితులను చేయటం అందులో ఒక భాగం. పరిమితమైన అవకాశాల అనుకూలతను సృష్టించి, కులాల మధ్య సంఘర్షణ పెట్టే వ్యూహాలను రాజ్యం అమలు చేస్తుంది. పెద్ద సంఖ్యలో మాలలు వున్న చోట మాదిగలకు అవకాశాలు ఇవ్వటం, పెద్ద సంఖ్యలో మాదిగలు వున్న చోట మాలకులస్తులకు అవకాశాలు వచ్చేలా చేయటం అధికార రాజకీయాల ఫలితం. ఆ రకంగా రాష్ట్రంలో అత్యధిక సంఖ్యాకులైన మాదిగలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అణచివేయటం కోసం బ్రాహ్మణ రాజ్యం మాలలకు అధిక అవకాశాలు దక్కేలా చేసింది. దీంతో మాదిగలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన వాటా కావాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించారు. అదే దండోరా ఉద్యమం. మాదిగలు కేవలం రిజర్వేషన్ వర్గీకరణ అనే అంశం వరకే పరిమితం కాలేదు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో మాదిగల ప్రాతినిధ్యం ఏమిటనే ఆలోచన చేశారు. అంతేకాదు, సమాజ చలనాలను మాదిగ దృక్పథం నుండి చూడటం అనే పద్ధతిని అభివృద్ధి చేశారు. తెలుగు సాహిత్యాన్ని మాదిగ దృక్పథంతో చూసిన అనేక మంది రచయితలు కొత్త రచనలను తీసుకొచ్చారు. మాదిగ జీవితం, మాదిగ రాజకీయాలు, మాదిగ కళలు ప్రత్యేకమైన, నిర్దిష్టమైన అంశాలుగా తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. మాదిగ సాహిత్యంలో ఒక భాగంగా వచ్చిందే కక్క నవల.

### 2.1.4. నయా క్షత్రియుల ఆధిపత్యం:

కక్క నవల బ్రాహ్మణ వాస్తవికతకు విరుద్ధమైంది. అందుకే అది గ్రామీణ సమాజంలోని కుల వాస్తవికతను చాలా స్పష్టంగా చిత్రించింది. ఈ నవలలో ప్రతినాయకుడు కులం. రెడ్డి కులస్తులు గ్రామాల్లో ఎలాంటి ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారో చిత్రిస్తుంది. కుల వ్యవస్థను ఈ నయా క్షత్రియ కులం ఎలా ఉపయోగించుకొంటుందో తెలుపుతుంది. బ్రాహ్మణ పాత్రలేని మాదిగ నవల ఇది. వాస్తవానికి వైరుధ్యం బ్రాహ్మణులకు, మాదిగలకు మధ్య తరతరాలుగా కొనసాగుతుంది. కుల వ్యవస్థలో అత్యంత అగ్రభాగాన ఉన్నది బ్రాహ్మణులు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో అత్యంత ఆఖరి మెట్టులో వున్నది మాదిగలు. కుల వ్యవస్థను తయారు చేసింది

బ్రాహ్మణులు. ప్రతివిప్లవాన్ని తయారు చేసిందీ వాళ్లే. కానీ, ఈ నవలలోని కులాధిపత్య రాజకీయాలు రెడ్డి, ఆంధ్ర కమ్మ కులస్తుల చుట్టూ తిరుగుతాయి.

రెడ్డి, వెలమ, కమ్మ వంటి అగ్రకులాలుగా చెప్పబడుతున్న కులాలు వర్ణ వ్యవస్థలో శూద్ర వర్ణం పరిధిలోకి వస్తారు. మూలవాసులైన వారినే రెడ్డి, వెలమ, కమ్మ కులాలుగా చీల్చారు. శూద్రులైన రెడ్డి, వెలమ, కమ్మలు అగ్రకులాలుగా ఎలా ఎదిగారు? నిజంగా వారు అగ్రకులం అవుతారా? అనేవి ఆలోచించాలి. కుల వ్యవస్థలో శూద్రులైన ఈ మూడు కులాలు ఆధునిక రాజ్యంలో బ్రాహ్మణుల అధికార ప్రసరణకు దళారీ కులాలుగా ఉపయుక్తం అవుతున్నాయి. ప్రతివిప్లవం తర్వాత బ్రాహ్మణులు వర్ణకుల వ్యవస్థను నిర్మించడానికి ఒక పద్ధతిని అనుసరించారు. హిరణ్యగర్భ అనే యజ్ఞం చేయించి ఆర్యేతరులైన రెడ్డి, వెలమ, కమ్మ వంటి కులస్తులకు క్షత్రియ హోదా ఇచ్చారు. ఆ రకంగా వీళ్లు నయా క్షత్రియులయ్యారు. రెడ్డి, వెలమ, కమ్మ రాజ్యాలు క్రీ.శ. 14వ శతాబ్దం నుండీ వున్నాయి. దక్షిణ భారతంలోని చాలా వరకు రాజ్యాలు బ్రాహ్మణేతర రాజులు పాలించినవే. శాతవాహనులు, చాళుక్యులు, చోళులు, పాండ్యులు, కాకతీయులు, రాయల పాలకులు అందరూ బ్రాహ్మణేతరులే. కాకతీయులు గిరిజనులనే వాదన కూడా వుంది. కాకతీయుల రాజ్యం చివరి ప్రతాపరుద్రునితో అంతమైంది. ఆయనకు సామంతులుగా వున్న రెడ్డి, వెలమ, నాయుడు కులాల రాజులు ఆ తర్వాత మొగలాయిలకు సామంతులుగా వున్నారు. అనేక రాజకీయ పరిణామాల తర్వాత కొద్ది కాలం స్వతంత్ర రాజులుగా కూడా వున్నారు. అయితే ఔరంగ జేబు పాలనలోనూ అటు తర్వాత బహ్మనీ సుల్తానుల పాలనలోనూ వీరు సామంతులుగా మారారు. బ్రిటీషు వారి రాకతో సంపూర్ణంగా రాజ్యాలు కోల్పోయి, సామంత రాజులనే హోదాను కూడా కోల్పోయి జమీందారులుగా, భూస్వాములుగా మారారు. అయినప్పటికీ, బ్రాహ్మణ ధర్మం ప్రకారం వీరు శూద్రులే. వలస పాలన కాలంలో బ్రాహ్మణుల అధికార రాజకీయాల్లో రెడ్డి, వెలమ, కమ్మ, నాయుడు కులాలది రెండవ శ్రేణి పాత్ర మాత్రమే. వీరికి జాతీయోద్యమంలో పెద్ద ప్రాధాన్యం లేదు. హైదరాబాదు రాజ్యంలో కొంత మినహాయింపు ఉంది. సురవరం ప్రతాపరెడ్డి వంటి వారికి కొంత ప్రాధాన్యం ఉండేది. అది కూడా నిజాం రాజు ఆయన పాండిత్యానికి ఇచ్చిన గౌరవమే. అయితే, రెడ్లు, వెలమలు, కమ్మకులస్తులు నిజాం రాజ్యంలోనే భూస్వాములుగా వున్నారు. భూస్వామ్య కులాల స్థాయి అందువల్లే వచ్చింది. మద్రాసు ప్రెసిడెన్సీలో అంతర్భాగంగా వున్న ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో 1960 వరకు బ్రాహ్మణులదే ఆధిపత్యం. బ్రిటీషు వాళ్లు అధికారం బదలాయించిన తర్వాత బ్రాహ్మణులు ఈ దేశానికి పాలకులయ్యారు. కేంద్రాన్ని పాలించే బ్రాహ్మణ వర్గానికి ప్రజల్ని మేనేజ్ చేసే కులాలు అవసరమయ్యాయి. అవే దళారీ కులాలయ్యాయి. ఈ దళారీ కులాలు అధికారాన్ని రాష్ట్ర స్థాయిలో అనుభవించటం వల్ల ఆర్థికంగా బలపడ్డాయి. అధికారం, ఆర్థిక పుష్టి వల్ల రెడ్డి, వెలమ, చౌదరీ కులాలు అగ్రకులాలుగా పరిగణించబడుతున్నాయి. కానీ, బ్రాహ్మణ ధర్మం ప్రకారం ఇవి శూద్ర కులాలే. అంటే బానిస కులాలే అని అర్థం.

బానిసలైన శూద్రులకు బానిసలు మాదిగలు. బానిసల మధ్య అంతర్గత సంఘర్షణ జరుగుతుంది. అది కులం నిర్దేశించిన నియమాల ప్రకారం జరుగుతుంది. బ్రాహ్మణ, మాదిగల మధ్య జరగాల్సిన యుద్ధం బ్రాహ్మణులకు దళారులుగా వ్యవహరించే కులస్తులతో మాదిగలు చేయటమే ప్రతివాస్తవికత.

పాపిరెడ్డి, వెంకటరెడ్డి, కమ్మ రాములు ప్రతినాయకులు. కక్కడు మాదిగ కులస్తుడు. బాల్యంలో పాపిరెడ్డికి జీతం చేస్తాడు. పాపిరెడ్డి కొడుకు విప్లవరెడ్డి. పట్నంలో రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తాడు. పాపిరెడ్డి గ్రామ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించడు. పైగా పాపిరెడ్డికి

వెంకట్రెడ్డి పట్ల వ్యతిరేకత ఉంది. వెంకటరెడ్డి గ్రామ రాజకీయాలను నిర్దేశిస్తూ ఉంటాడు. ముస్లింలను చంపి, వారి వారసులను తరిమేసి రెడ్లు భూములు ఆక్రమించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో రెడ్లు ముస్లింలను చంపి భూములు ఆక్రమించారు. సాయుధ పోరు చేసిన నిజమైన సైన్నికులైన మాదిగ, మాల, ఇతర అణగారిన శూద్ర కులస్తులకు భూములేవీ దక్కలేదని విచారణ కోసం వచ్చిన ప్రభుత్వ అధికారులకు కక్కయ్య సాక్ష్యం చెప్తాడు. కక్కయ్య పెళ్లి కోసం పుట్టమన్ను తేవడానికి వచ్చిన మాదిగలను పటేండ్లు చితక బాదుతారు. అది మా భూమని హూంకరిస్తారు. ఆ భూమి తుర్కోళ్లదనీ, వాళ్లు ఊరిడిచి వెళ్లిపోయారు కాబట్టి అది అందరిదనీ, అందరూ మట్టి తీసుకొంటే లేని సమస్య ఇప్పుడే ఎందుకొచ్చిందని మాదిగలు అడుగుతారు. మాదిగలు ఆ గ్రామంలో పెద్ద సంఖ్యలో వున్న ఏకైక కులం వారు. మాదిగలను అణచివేసేందుకు పటేండ్లు గౌండ్ల, వడ్ల, కమ్మరి, గొల్ల తదితర కులాలను ఉపయోగించుకుంటాడు. కక్కయ్య పెళ్లి తర్వాత ఊరేగింపు చేస్తుంటే పటేండ్లు, సూదరోళ్లు కలిసి దాడి చేస్తారు. తెల్లారి పంచాయితీకి పిలిచి మళ్లీ దాడి చేసే ప్రయత్నం చేస్తే, మాదిగలు పటేండ్లను తరిమి కొడుతారు. పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టించి మాదిగలను వేధించటం, ఆ తర్వాత లస్మక్క తాత పకీరు ఆత్మహత్య చేసుకోవటంతో రెడ్ల రాజకీయం కొత్త మలుపు తిరుగుతుంది. పంచాయితీ సర్పంచి పదవి కోసం సూదరోళ్లు, మాదిగలు చేసే ప్రయత్నాలు, తెలివిగా వెంకట్‌రెడ్డి తన భార్య అండమ్మను సర్పంచిని చేయటం జరిగిపోతాయి. వెంకట్ రెడ్డి కొడుకు అమెరికా వెళ్లడంతో వెంకటరెడ్డి తన భూముల చేసే వాళ్లు లేక ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చిన కమ్మ రాములుకు అమ్ముకుంటాడు. కమ్మ రాములు వ్యవసాయం ఆధునిక పద్ధతుల్లో చేసి అధిక దిగుబడులు సాధిస్తాడు. కానీ, ఆంధ్ర కమ్మలు తెలంగాణ సూదరోళ్లను, మాదిగోళ్లను దోపిడీ చేస్తున్నారనే ఎరుక పెరుగుతుంది. కమ్మ రాములు, వెంకటరెడ్డి కలిసి గ్రామ రాజకీయాలను శాసిస్తారు. దాన్ని ప్రశ్నించిన కక్కయ్యను, మాదిగలను హింసకు గురి చేస్తారు. ఆక్రమంలోనే మైరావణ భాగోతం ఆడుతున్న కక్కన్ని ఎత్తుకపోయి పిక్కలు కోసి వదిలేస్తారు. కొంత మంది వేరే ఊరి యువకులు పోలీసుల మీద ఒత్తిడి తెచ్చి, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయిస్తారు. ఆ చట్టం ప్రకారం ఆర్డీవో విచారణ కొస్తాడు. అధికారులను వెంకటరెడ్డి, కమ్మ రాములు కొడుతారు.

అధికార బదలాయింపు సందర్భంగా అధికారాలను అన్ని ప్రాంతాలకు సమానంగా పంపిణీ చేసేటట్టు, కేబినెట్ మిషన్ ప్లాన్ స్పష్టం చేసింది. కానీ, అలా చేస్తే రాష్ట్రాలలో బ్రాహ్మణుల పెత్తనం సాగదు. అందుకే బలమైన కేంద్రం ఉండాలనే సాకుతో అధికారాలన్నీ బ్రాహ్మణుల వద్దే పోగేసుకున్నారు. సమాఖ్య ప్రభుత్వం అంటే అన్ని రాష్ట్రాలకు న్యాయమైన అధికారాలు ఉండటమనే సూత్రాన్ని తిరస్కరించారు. బ్రాహ్మణ పాలక వర్గం చేతిలో కేంద్రీకృతమైన అధికార వ్యవస్థ ద్వారా రాష్ట్రాలను నియంత్రించే వ్యూహాన్ని పాలక వర్గం అనుసరించింది. అప్పటి దాకా శూద్రులుగా వున్న రెడ్డి, వెలమ, కమ్మ కులాలను రాష్ట్ర స్థాయిలో పాలకులుగా పెట్టుకున్నారు. కేంద్రాన్ని పాలించే బ్రాహ్మణ వర్గమే నిజమైన పాలకులనే వాస్తవం శూద్ర అగ్రకులాలకు తెలుసు. కానీ, దేశాన్ని పాలించగలిగే సంఖ్యా బలం గానీ, శక్తి యుక్తులు గానీ ఈ కులాల దగ్గర లేవు. అందుకే రాష్ట్రంలోని ఇతర బానిస కులాల మీద అధికారం చలాయించడానికి బ్రాహ్మణులతో ఈ కులాలు కుమ్మక్కయ్యాయి. దాని ఫలితమే గ్రామాల్లో మాదిగ, ఇతర సూదరి కులాల మీద నయా అగ్రకులాల దాడి. భావజాల పరంగా మాదిగలకు, బ్రాహ్మణులకు పరోక్ష యుద్ధం జరుగుతుంది. కానీ, ప్రత్యక్షంగా నయా అగ్రకులాలకు, మాదిగలకు మధ్య భౌతిక యుద్ధం జరుగుతుంది. ఆ సామాజిక సంక్షోభాన్ని సమర్ధవంతంగా వేముల ఎల్లయ్య చిత్రించారు.

## 2.1.5. బాల్యాన్ని హరించిన కుల వ్యవస్థ:

పాపిరెడ్డి దుర్మార్గుడు. ఆయన భార్య కూడా అదే అహంకారంతో ప్రవరిస్తూ ఉంటది. చదువుకొనే వయసున్న కక్కన్ని పాపిరెడ్డికి జీతం ఉంచింది తల్లి కళమ్మ. బాలల హక్కులను ఐక్యరాజ్య సమితి గుర్తించింది. కానీ, ఈ దేశంలోని మూలవాసుల బాల్యం కులం వల్ల నాశనమైపోతుంది. కుల వ్యవస్థ వల్లే మాదిగలు పేదవాళ్లయ్యారు. వారికి చదువు లేదు. చదువుకోవాలనే స్పృహా లేదు. కక్క నవలలో చిత్రించిన ఊరిలో బడి లేదు. కేవలం భూస్వాములైన పాపిరెడ్డి, వెంకటరెడ్డి కొడుకులు మాత్రం పట్నంలో చదువుకుంటున్నారని నవలలో ఒక సారి ప్రస్తావించబడింది. బడి లేని వూరిలో పిల్లలు పొలం పనుల్లో కేంద్రీకరించబడి వుంటారు. లేదా ఏదో ఒక వ్యవసాయ అనుబంధ పనుల్లో పెట్టబడుతారు. కక్కడు పాపిరెడ్డి పసుల గాసే జీతగాడు. కక్కని స్నేహితులు కూడా జీతగాళ్లే. నవలలోని నాయిక లస్మక్క కూడా మేకలు మేపే పని చేస్తుంది. లస్మక్క స్నేహితురాలు దూదేకుల మాల్బి కూడా మేకలు కాస్తుంది. కక్క నవల బాల్యం అనే సుందరమైన అనుభవం లేని నవల. యజమానుల దాష్టీకం వల్ల శారీరక హింసకు గురయ్యాడు. వాళ్ళ తిట్ల వల్ల మనోవేదనకు గురయ్యాడు. ఆత్మగౌరవం దెబ్బతిని గాయపడ్డాడు. అగ్రకులాల పిల్లలు బాల్యాన్ని అనుభవిస్తే, కింది కులాల పిల్లలు మాత్రం బాల్యాన్ని ఒక శాపంగా ఎదుర్కొన్నారు. అయితే మాదిగ, సూదరి పిల్లలే కాదు, ధర్మపరివర్తి మూలవాసీల పిల్లలు కూడా కోల్పోయారు. దూదేకుల మాల్బీ లస్మక్క స్నేహితురాలు. కుల వ్యవస్థకు వెలుపల వున్న మాల్బీ కూడా బాల్యాన్ని కోల్పోయింది. ముస్లింలు ఎందుకు వెనకబడి వున్నారనే ప్రశ్నకు వేసుకొనే సమాధానమే మాల్బీ బాల్యాన్ని కోల్పోవడానికి కారణం తెలుపుతుంది. ఈ దేశంలోని ముస్లింలు ఈ దేశ మూలవాసులు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న బుద్ధిస్టులను అస్పృశ్యులుగా వెలేసారు. ఈ మూలవాసులే ఇస్లాం ఈ దేశంలోకి రాగానే బ్రాహ్మణులకు వ్యతిరేకంగా ముస్లింలుగా మారారు. అందుకే బీహార్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, బెంగాళ్, అస్సాం, హైదరాబాదు, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ముస్లింలు అధిక సంఖ్యలో వుంటారు. విశ్వాసం రీత్యా వారు ఇస్లాంను నమ్ముతారు. అందువల్ల వాళ్లు ముస్లింలు. కానీ జైవికంగా వారు ఈ దేశ మూలవాసులు.

"దేశ విభజనకూ, ముస్లింల అణచివేతకూ మతపరమైన కారణాల కన్న రాజకీయ కారణాలే క్రియాశీల పాత్ర పోషించాయి. మొదటిది, అత్యధిక ముస్లింలు ఎస్సీ, ఎస్టీ, బిసీ వర్గాల నుండి ముస్లింలుగా మారిన వారు. బ్రాహ్మణీయ సామాజిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన కులాలే ముస్లింలుగా మారారు. ఈ ధర్మపరివర్తన వల్ల సామాజిక అణచివేత నుండి విముక్తి పొందటమే కాదు, అగ్రకులాలతో సమానంగా అన్ని హక్కులు పొందారు. దీన్ని బ్రాహ్మణీయ కుల వ్యవస్థలోని అగ్రకులాలు సహించ లేకపోయాయి" (కనీజ్ ఫాతిమా, అధూరే 2011: పే. 21). అలా ధర్మపరివర్తన చెందిన మూలవాసులను అణచివేయడానికి అనేక కుట్రలు చేశారనీ, వలస పాలనలో వున్న ప్రత్యేక నియోజక వర్గాలను రద్దు చేయటం ద్వారా ముస్లింలను అణిచివేస్తున్నారని కనీజ్ ఫాతిమా చేసిన విశ్లేషణ సరైంది. అధికారాన్ని హస్తగతం చేసుకొనేందుకు బ్రాహ్మణవాదులు దేశ విభజనకు పాల్పడ్డారనీ, ఆ తర్వాత ముస్లింల రాజ్యాంగబద్ధమైన హక్కులను తొలిగించారని, దానివల్లే ముస్లింలు పేదరికం, ఆకలి వంటి వాటిని ఎదుర్కొంటున్నారని కనీజ్ ఫాతిమా వాదిస్తున్నారు. ముస్లింలను అన్ని రకాలుగా అణిచివేసిన కారణంగా గ్రామ సీమల్లోని దూదేకుల ప్రజలు విద్యా, ఉద్యోగాలకు దూరమయ్యారు. వారి పిల్లలు వ్యవసాయ పన్నులో కూలీలుగా మారిపోయారు. మేకలు మేపే దూదేకుల మాల్బీ తన బాల్యాన్ని కోల్పోయింది.

పశువుల కాసే పని పిల్లలకు నరకప్రాయంగా ఉంటుంది. పశువులను

నియంత్రించటమనే పని చాలా కష్టమైనది. అంతే కాదు, యజమాని చేసే భౌతిక హింస భయంకరమైంది. కుల అహంకారంతో ధూషించే పాపిరెడ్డి భార్యను కక్కయ్య తిడుతాడు. ఆమె బూతులు తిడితే తాను బూతులు తిడుతాడు. కుల సమాజంలో పై కులాలు తిడితే కింది కులస్తులు సహించాలి తప్ప తిరిగి తిట్ట కూడదు. కానీ పసివాడైన కక్కడు ఆత్మగౌరవం దెబ్బతిని తిడుతాడు. అది మనసులో పెట్టుకొని పాపిరెడ్డి కక్కన్ని దారుణంగా కొడుతాడు. సమయానికి జీతానికి రాలేదని తిడుతాడు. గొడ్లు ఎన్గు తొక్కాయని కొడుతాడు. పెద్దవాళ్లను కొట్టేంత తీవ్రతతో పిల్లలను కొడుతాడు. జీతం చేస్తూనే కక్కని బాల్యం గడిచి పోతుంది.

గ్రామంలోని అన్ని కులాల పిల్లలు బాల్యం కోల్పోతారు. కానీ, దేశంలో ఎక్కడా బ్రాహ్మణ, వైశ్యుల పిల్లలు బాల్యాన్ని కోల్పోరు. వారి బాల్యం దేవాలయాల్లో రూపొందుతుంది. కోమట్ల పిల్లల బాల్యం వ్యాపార దుకాణాల్లో రూపుదిద్దుకుంటుంది. శ్రామిక వర్గాన్ని దేవాలయాల్లోనూ వ్యాపార దుకాణాల్లోనూ పాలక వర్గం తయారు చేసుకుంటుంది. మరో వైపు బానిసలను గ్రామీణ కుల వ్యవస్థ ద్వారా మూలవాసుల నుండి తయారు చేస్తుంది. అందువల్ల కుల వ్యవస్థ బాల్యానికి వ్యతిరేకం. కుల వ్యవస్థ వల్లే బాల్యం అంతరించి పోతుందనే వాస్తవాన్ని బాధితులే గుర్తించ లేని దుస్థితి. కక్కనికి గానీ, తల్లి కళమ్మ గానీ లేదా ఇతరులకు గానీ బాల్యంలో జీతం ఉండటం నేరమని తోచదు. కింది కులస్తులు జీతం ఉండటం సహజమనే భావన కూడా వీరిలో వ్యక్తమవుతుంది. పటేల్లకు జీతం చేయకపోతే బతకడం కష్టమనే ఆర్థిక దృష్టి ఎక్కువగా కనిపిస్తుంది. కానీ, కులం వల్లే పేదరికం ఉందని కక్క నవలలోని పాత్రలు భావించవు.

### 2.1.6. భూస్వామ్యం – కుల బానిసత్వం:

భూమి అనేది అభ్యుదయ సాహిత్యంలోనూ విప్లవ సాహిత్యంలోనూ ప్రధానమైన వస్తువు. కమ్యూనిస్టు పార్టీలు గత అనేక సంవత్సరాలుగా కొనసాగిస్తున్న ఎజెండా ఇది. ఆర్థిక నిర్ణాయకవాదంలో వనరుల పంపిణీ ముఖ్యమైంది. వనరులను ప్రజాస్వామీకరించడం, వనరుల వికేంద్రీకరణ అనే భావనలు ఎర్ర రంగు పోరాటాలను చాలా కాలం పాటు సజీవంగా ఉంచాయి. కక్క నవల మాదిగ జీవితాలను చిత్రించింది. కుల నిర్ణాయకవాదం భూసమస్యను ఎలా అంచనా వేస్తుందో తెలుసుకొనేందుకు కక్క నవల ఒక తార్కాణం. భూస్వామ్యం నిజంగా ఆర్థిక పునాదుల మీద నిర్మాణమైందా? భూమి ప్రాకృతిక వనరే తప్ప ఎవరో తయారు చేసింది కాదు. భూమి మీద అధికారం, హక్కులు కల్పించే పద్ధతే ప్రకృతికి విరుద్ధమైంది. కానీ ఆస్తి అనే భావన మనుధర్మంలో వుంది. ఆస్తి అంటే భూమి, సంపద, స్త్రీలు, మగాళ్లు కూడా. సమస్త ప్రపంచం దైవాధీనం, దైవం మంత్రాధీనం, మంత్రం బ్రాహ్మణాధీనం, కాబట్టి బ్రాహ్మణుడే దేవుడనే భావనలో ఈ విశ్వంలోని ప్రతి దాని మీద బ్రాహ్మణునికే హక్కు వుందనే ఆదేశం ఉంది. కాబట్టే బ్రాహ్మణుడికే ఆస్తి ఉండాలి. ఈ ధర్మం కారణంగా బ్రాహ్మణేతరులకు భూమి మీద గానీ ఆస్తి మీద గానీ ఎలాంటి హక్కు లేదు. అందువల్ల పీడిత కులాలకు ఆస్తి అనేది లేకుండా పోయింది.

దక్షిణ భారతంలోనే బ్రాహ్మణేతరులు ఎక్కువగా భూస్వాములు వున్నారు. అందులో తెలంగాణాలో భూస్వాములు వున్నారు. వలస పాలనలో సీమాంధ్ర ప్రాంతంలో రైత్వారీ పద్ధతి అమలు చేయటం వల్ల భూస్వామ్య పద్ధతి వేరే విధంగా వుండేవి. ఉత్తరాంధ్రలోనూ కళింగాంధ్రలోనూ బ్రిటీషు వారి పాలనలో వున్న జమీందార్లు బ్రాహ్మణ కులాల వారే. తెలంగాణాలో నిజాం రాజు రెడ్డి, వెలమ కులాలకు జమీందారు హెూదా ఇవ్వటం, పరోక్ష పాలనలో తెలంగాణ ఉండటం వల్ల నయా శూద్ర కులాలు భూస్వాములుగా వుండే వారు. విస్నూరు దేశ్‌ముఖ్, మహబూబాబాద్ జమీందార్లు వేల ఎకరాల భూమికి హక్కు దార్లు. వీరి

కింద చిన్న చిన్న భూస్వాములు ఉండే వారు. దేశ్‌ముఖ్‌ల దోపిడీకి చిన్న భూస్వాములు కూడా బాధితులే. అందుకే చిన్న భూస్వాములైన నయా శూద్ర అగ్రకులాల నాయకత్వంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటం జరిగింది. ఈ పోరాటానికి నిజాం వ్యతిరేకత ప్రధాన కారణం. దీని రాజకీయ నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి. హైదరాబాదు రాజ్యం ఎంతో విశాలమైంది. చివరి నిజాం రాజు పాలనలో ఇండియా నుండి బ్రిటీషు వాళ్లు నిష్క్రమించడానికి సిద్ధపడ్డారు. అందుకోసం అధికార బదలాయింపు అనే అంశం మీద సంప్రదింపులు జరిపారు. భారత దేశానికి డొమినియన్ స్టేటస్ ఇవ్వడానికీ, స్వరాజ్యం నిర్మాణం చేసుకొనేందుకు బ్రిటీషు వాళ్లు కొత్త రాజ్యాంగం రాసుకొనేందుకు అంగీకరించారు. ఆ కొత్త రాజ్యాంగం పరిధిలోకి స్వతంత్ర సంస్థానాలు, రాజ్యాలు వాటి అభిమతం మేరకే వస్తాయని క్రిప్సు కమీషన్ సిఫార్సు చేసింది. ఆ సందర్భంగా నిజాం రాజు క్రిప్సు కమీషన్‌ను కలిసి హైదరాబాదు రాజ్యం కొత్త రాజ్యాంగానికి వెలుపలే ఉండేలా అవకాశం ఇవ్వమని కోరాడు. అందుకు బ్రిటీషు వాళ్లు అంగీకరించారు.

ఇది బ్రాహ్మణులకు నచ్చ లేదు. బ్రిటీషు వాళ్లు ఏర్పాటు చేసిన చట్టసభల వల్ల బ్రిటీషు ఇండియా అంతా బ్రాహ్మణుల పాలనలో ఉంది. సంస్థానాలు, స్వతంత్ర రాజ్యాలు మాత్రం బ్రాహ్మణ పాలకుల ఆధీనంలో లేవు. హైదరాబాదు రాజ్యం మొగలాయి రాజు చేతిలో వుండటం వల్ల బ్రాహ్మణులు రాజకీయంగా బలహీనమైన స్థానంలో వున్నారు. హైదరాబాదు కొత్త రాజ్యాంగ పరిధిలోకి వస్తే బ్రాహ్మణులే నిజమైన పాలకులుగా అవతరిస్తారు. కాబట్టి నిజాం గద్దె దిగాలి. బ్రాహ్మణ ధర్మం అనే దాన్ని హిందు మతం అనే మారు పేరుతో ఆర్య సమాజం, కాంగ్రెస్ పార్టీ, గ్రంథాలయోద్యమం ఉమ్మడిగా ప్రచారం చేశాయి. కమ్యూనిస్టు పార్టీకి ముందు తెలంగాణాలో రాజకీయాలు నడిపిన ఆంధ్ర మహాసభ నిజాం వ్యతిరేకతను, ముస్లిం వ్యతిరేకతనూ ప్రచారం చేసింది. కమ్యూనిస్టు పార్టీ చేతిలోకి ఉద్యమం వెళ్లిన తర్వాత ముస్లిం వ్యతిరేకతకు సాయుధ రూపం వచ్చింది. ఆ రకమైన పోరాటానికి మానసిక సంసిద్ధతను రూపొందించే రచనలను బ్రాహ్మణ పండిత వర్గం పకడ్బందీగా చేసింది. తెలంగాణాలోని వైష్ణవ బ్రాహ్మణ వర్గం నిజాం వ్యతిరేకతను ప్రచారం చేసే రచనలు చేసింది. నిజాం రాజ్యంలో బ్రాహ్మణులకు విశేష ప్రాధాన్యం లేదు. బ్రాహ్మణులకు మాత్రమే భూమి, వనరుల మీద అధికారం ఉండాల్సిన చోట నయా శూద్ర కులాలైన రెడ్డి, వెలమలకు భూమి వుంది. ఈ భూస్వాములు చేసే దోపిడీ, అన్యాయాలను ఆసరా చేసుకొని బ్రాహ్మణులు రెండంచల పోరాటం చేశారు. ఒకటి నిజాం రాజును గద్దె దించేందుకు ముస్లిం వ్యతిరేక భావజాల ప్రచారం, రెండు: నయా శూద్ర కులాలైన రెడ్డి, వెలమ దొరలకు వ్యతిరేకంగా కింది కులాలను సమీకరించడం, వారి ద్వారా దొరలను తరిమి రాజకీయంగా వారిని బలహీనపర్చటం అనేవి. ఈ విషయంలో బ్రాహ్మణులు విజయం సాధించారు. గ్రంథాలయోద్యమం పేరుతో గ్రామగ్రామాన రామాయణ, మహాభారతాలు, భగవద్గీతలను ప్రచారం చేయటం, ఆర్య సమాజం ప్రచారకుల పేరుతో బ్రాహ్మణ ధర్మ పరిరక్షణ గురించి ప్రసంగాలిప్పించటం చేశారు. ఈ రెండు ఎర్ర జెండా ఆధ్వర్యంలో సాయుధ పోరు జరుగుతున్నప్పుడు హింసాత్మక రూపానికి దారితీసింది. అమాయక ముస్లింలను ఎంతో మందిని ఊచకోత కోశామని కమ్యూనిస్టు నేతలే ఆత్మవిమర్శ చేసుకొన్నారు. గ్రామాల్లో వున్న అనేక మంది ముస్లింలను హతమార్చి లేదా వారిని అక్కడి నుండి తరిమేసి వారి భూములను ఆక్రమించుకున్నారు.

అధికారం బ్రాహ్మణులకు బదలాయించిన తర్వాత పాకిస్తాన్ పేరుతో దేశ విభజన జరిగింది. హైదరాబాదు రాజ్యాన్ని ఆక్రమించుకోకుండా బ్రాహ్మణులు దేశాన్ని పాలించడం కష్టం. అందుకే స్వతంత్రంగా వుంటానన్న నిజాం రాజ్యాన్ని నెహ్రూ సైన్యాలు వచ్చి

ఆక్రమించాయి. ఆ తర్వాత హైదరాబాదు రాజ్యం బ్రాహ్మణుల ఆధీనంలోకి వెళ్లింది. హైదరాబాదు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు అనే ఒక బ్రాహ్మణుడు అయ్యాడు. అధికారం బ్రాహ్మణులకు, భూములు చిన్న చిన్న భూస్వాములుగా వున్న రెడ్డి కులస్తులకు వచ్చాయి. సాయుధ పోరాటం చేసిన ఎస్సీ, ఎస్టీ, బిసీలకు ఎలాంటి ప్రయోజనం చేకూర లేదు.

కక్క నవలలో వెంకటరెడ్డి, పాపిరెడ్డిలకు భూములు అలా తెలంగాణ పోరాటంలో ఆ గ్రామ ముస్లింలను చంపటం ద్వారా, వారి భూములను ఆక్రమించుకోవటం ద్వారా వచ్చాయనే సంగతి కక్కని మాటల వల్ల తెలుస్తుంది. నాజరు అనే పాత్ర తెలంగాణ సాయుధ పోరు వల్ల తను ఎలా భూములు కోల్పోయిందీ, రెడ్లు బెదిరించి భూమి గుంజుకోవటం గురించీ సాక్ష్యం చెప్తుంది. ప్రభుత్వాధికారులకు కక్కడు వాంగ్మూలం ఇస్తున్న సందర్భంలో కూడా ఈ సంగతి తెలుస్తుంది. సాయుధ పోరాటంలో దళాలకు నాయకత్వం వహించిన రెడ్లు గుండ్ల సాటుకు దాక్కున్నారనీ, మాదిగలు మాత్రం తుపాకులకు ఎదురు నిలబడి పోరాడారని కక్కని మాటల వల్ల తెలుస్తాయి. గుండ్ల సాటుకు దాక్కునోళ్లకు భూములొచ్చాయనీ, తుపాకీ గుండ్లకు మరణించిన వారికి మాత్రం ఏమీ రాలేదని అంటాడు. మొత్తం నవలలో భూస్వామ్య వ్యవస్థకు పునాది అయిన కులం గురించే చర్చ జరుగుతుంది. ఆర్థిక దృక్పథం నుండి భూస్వామ్య వ్యవస్థను పరిశీలించే సంప్రదాయిక పద్ధతిని కక్క నవల తోసిపుచ్చింది. కులం కారణంగానే భూస్వామ్యం ఏర్పడిందనీ, ఆ కారణంగానే అది కొనసాగిందని కక్క నవల నిర్ధారిస్తుంది. అయితే, భూమి కూడా ఒక అధికార సాధనమే కానీ అదే అంతిమం కాదనేది అవగాహన. వెంకటరెడ్డి కొడుకు అమెరికాకు వెళ్లిపోతే తన భూమిని కమ్మ రాములు అమ్ముకున్నాడు. భూమి అమ్ముకున్న తర్వాత కూడా వెంకటరెడ్డి పెత్తనమేమీ తగ్గ లేదు. అతని కులమే అందుకు కారణం. రెడ్లు, కమ్మ కులస్తులు ఇద్దరూ కలిసి తమ కులాధిపత్యానికి అడ్డుగా వున్న బిసీల మీద, ఎస్సీల మీద అనేక ఒత్తిళ్లు తీసుకు రావటంలోనే ఆర్థిక నిర్ణాయకవాదంలోని పరిమితి బోధపడుతుంది.

**2.1.7..పంచాయితీ రాజ్ వ్యవస్థ – శూద్ర, అస్పృశ్య కులాల ప్రాతినిధ్యం:**

ప్రాతినిధ్య వ్యవస్థ ద్వారానే శాసన వ్యవస్థ రూపొందుతుంది. ప్రజలకు ప్రాతినిధ్యం వహించే చట్టసభలకు ఎంపిక ఎన్నికల విధానం ద్వార జరుగుతుంది. ప్రజలకు శాసక వర్గాన్ని నియంత్రించే అధికారం వుంటుంది. చట్టసభలకు శాసనాలు చేసే అధికారం వుంది. చట్టసభల్లోకి ప్రవేశించిన కులాలు మాత్రమే వాటికి అవసరమైన చట్టాలను చేసుకుంటాయి. ఆ రకంగా బ్రిటీషు పాలనలో చట్టసభలు ఏర్పాటు చేయటమే విప్లవాత్మకమైన చర్య. ధర్మం ద్వారా ప్రజలను పాలించిన బ్రాహ్మణులకు బ్రిటీషు వారు ఏర్పాటు చేసిన చట్టసభలు పెద్ద సవాలుగా నిలిచాయి. వాటిని ఆధీనంలోకి తీసుకోవటం ద్వారానే ఈ సమస్యను అధిగమించగలమని వారు భావించారు. ఓటు హక్కుకు కొన్ని అర్హతలు ఏర్పాటు చేయటం వల్ల, ఆ అర్హతలు బ్రాహ్మణవాదులకే ఉండటం వల్ల వారు మాత్రమే చట్టసభల్లోకి ప్రవేశించారు. మూలవాసులకు చట్టసభల్లో ప్రవేశించే అవకాశం బ్రాహ్మణ ధర్మం వల్ల లేదు. అధికార వికేంద్రీకరణ జరగాలంటే గ్రామ స్వరాజ్యం ఏర్పడాలనేది గాంధీ వాదన. అంటే గ్రామ పంచాయితీకి శాసన అధికారం వుండాలనేది బ్రాహ్మణుల వాదన. దీన్ని అంబేద్కర్ వ్యతిరేకించాడు. గ్రామం అనేది అంత ప్రజాస్వామికమైనదేమీ కాదనీ, అది అస్పృశ్యులకు బంధీఖానా అని ఆయన అన్నారు. గ్రామాలకు తీర్పులిచ్చే అధికారం లేదా నిర్ణయం చేసే అధికారం ఉంటే అంతిమంగా అస్పృశ్యులకు ప్రమాదం గా మారుతుందని ఆయన హెచ్చరించారు. చట్టసభలు చేసిన శాసనాలను అమలు చేసే అధికారం మాత్రమే గ్రామాలకు ఉండాలని అంబేద్కర్ ఆనాడు భావించాడు. అదే విధంగా రాజ్యాంగంలో అధికారాలు

పొందుపర్చాడు. రాజ్యాంగంలో గ్రామ పంచాయితీ ప్రాథమిక అంశం. గ్రామ పంచాయితీని గ్రామంలోని ఓటర్లు ఎన్నుకుంటారు. అయితే, అణగారిన కులాల జనాభా ఎప్పుడూ మైనార్టీగా ఉంటుంది కాబట్టి వారికి పంచాయితీ ఎన్నికలు గెలిచే వీలు వుండదు. మొత్తం శూద్రులు, బ్రాహ్మణులు అస్పృశ్యులకు వ్యతిరేకంగా పని చేస్తారు కాబట్టి ప్రత్యేక ప్రాతినిధ్య పద్ధతిని రాజ్యాంగం రూపొందించింది. అందులో భాగమే పంచాయితీ ఎన్నికల్లో రిజర్వేషన్. అయితే, పంచాయితీ స్థాయి రాజకీయాలలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలు చాలా కీలకం. జాతీయ రాజకీయాల్లో ఈ కులాలకు  పెద్ద ప్రాధాన్యం లేదు. జాతీయ స్థాయి దృష్టి రాకుండా వుండాలంటే స్థానిక రాజకీయాల్లోనే ప్రజలు నిమగ్నమై వుండాలి. అందుకే, పంచాయితీ ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీ, బిసీ, మహిళల రిజర్వేషన్ అనే దాన్ని అమలు చేశారు. గ్రామం మీద పెత్తనం గురించి ఆలోచించే నయా శూద్ర అగ్రకులాలు పంచాయితీని తమ ఆధీనంలో ఉంచుకొనేందుకు ప్రయత్నించాయి.

పంచాయితీ వ్యవస్థ మీద అవగాహన లేని కింది కులాలు రెడ్డి, వెలమ, కమ్మ కులాల మీద ఆధారపడ్డాయి. ఎవరు సర్పంచి కావాలి, ఎవరు ఉప సర్పంచి కావాలి అనే విషయాలను కులమే నిర్ణయిస్తుంది. అయితే, రిజర్వేషన్ వల్ల అలా నిర్ణయించే హక్కును అగ్రకులాలు కోల్పోయాయి. అంచేత రిజర్వేషన్ పొందిన కులాల్లో అమాయకులు, అజ్ఞానులను లేదా తమ చెప్పు చేతుల్లో వుండే వారిని పంచాయితీ సర్పంచి, ఉపసర్పంచి పదవులకు ఎంపిక చేసే ఎత్తులు వేస్తుంటారు. అయితే, కక్క నవలలో పంచాయితీ ఎన్నికలను రెడ్లు ఎలా నియంత్రిస్తారనే సంగతిని స్పష్టంగా చిత్రించబడింది. ఆ వూరి పంచాయితీ ఎస్సీలకు రిజర్వు చేయబడింది. ఆ సంగతి ఎస్సీలకు ఎవరికీ తెలియకుండా వెంకటరెడ్డి కుట్ర చేశాడు. గౌండ్ల, గొల్ల, వడ్ల, కమ్మరి తదితర కులాల పెద్ద మనుషులను పిలిచి రహస్య సమావేశం ఏర్పాటు చేసి ఫకీరు తాతను సర్పంచిగా గౌండ్ల సాయన్నను ఉపసర్పంచిగా ఏకగ్రీవం చేసి పంపారు. ఆ సంగతి మాదిగలకు ఫకీరు తాత ఆత్మహత్య చేసుకొనేంత వరకూ తెలియదు. కక్కని పెండ్లి మీద దాడి చేసిన అగ్రకులాలను, సూదరోళ్లను కొట్టిన తర్వాత ప్రతిదాడిని మాదిగలు చేశారు. అమీన్ సాహేబ్(యస్.ఐ) వచ్చి పోలీస్ స్టేషన్లో మాదిగలను కొడుతాడు. వెంకటరెడ్డి దగ్గర డబ్బులు తీసుకున్న యస్.ఐ మాదిగలను, ఫకీరు తాతను ధూషిస్తాడు. గ్రామంలో జరిగిన సంఘటన మీద విచారణకు వచ్చి సర్పంచి గురించి అడుగుతాడు. ఫకీరు తాతను నువ్వే సర్పంచివి, నువ్వే ఫిర్యాదు ఇచ్చావని తెలుపుతాడు. తాను సర్పంచి అనే సంగతి తనకే తెలియదు. వెంకటరెడ్డి తెల్లకాగితం మీద వేలిముద్ర వేయించుకున్నది గుర్తొస్తది.  తన వల్లే ఇన్ని కష్టాలొచ్చాయని మాదిగ స్త్రీలు దుర్భాష లాడారు. ఆ అవమానం భరించ లేని ఫకీరు తాత తన గుడిసెలో ఉరిపోసుకొని చనిపోతాడు.

పంచనామాకు వచ్చిన పోలీసులకు సర్పంచి సంతకం అవసరమైంది. చనిపోయిన ఫకీరుతాత సర్పంచి అనే సంగతి పోలీసుల మాటల వల్ల మాదిగలకు తెలుస్తుంది. ఫకీరు తాత తర్వాత సర్పంచి పదవి మాదిగలకే రావాలని అడుగుతారు. సూదరోళ్లతో వెంకటరెడ్డి రహస్య సమావేశం ఏర్పాటు చేసి సర్పంచి చనిపోతే ఉపసర్పంచికే ఆ పదవి వస్తుందని చెప్తాడు. సర్పంచి గౌండ్ల సాయిలు అయితే ఊరేగింపు వెంకటరెడ్డి చేసుకుంటాడు. అది సాయిలుకు అవమానమని తోస్తుంది. కానీ, పటేలు మీద ఆగ్రహం వ్యక్తం చేయ లేడు. తానే సర్పంచిని అని నిరూపించుకొనేందుకు గౌండ్ల సాయిలు గొల్ల అయిలయ్యను అకారణంగా కొట్టాడు. ఆ రాత్రి గౌండ్లోళ్లను ఉసిగొల్పి గొల్లవాండ్ల ఇండ్ల మీద దాడి చేయించాడు. మాదిగలను మొదట కొట్టించి, తిరిగి తన అధికారాన్ని నిలుపుకొనేందుకు సూదరోళ్ల మధ్యనే కొట్లాట పెట్టించాడు వెంకటరెడ్డి. ఈ క్రమంలో మాదిగలకు రావాల్సిన సర్పంచి పదవి

గురించి చర్చ ఆగిపోయింది. ఆర్నెళ్లకు మళ్లీ నోటిఫికేషన్ వచ్చింది. అందులో జనరల్ మహిళకు సర్పంచి పదవిని కేటాయించారు. దాంతో బీసీలకు పేరుకైనా వుండే సర్పంచి పదవి వెంకటరెడ్డి భార్య అండమ్మకు దక్కింది. మహిళకు రిజర్వు చేయకపోతే వెంకటరెడ్డే సర్పంచి అయ్యే వాడు. అండమ్మ పేరుకు స్త్రీయే గానీ ఆమెదంతా రెడ్డి కుల స్వభావమే. కింది కులాలంటే తీవ్రమైన వ్యతిరేకత. వెంకటరెడ్డికీ, అండమ్మకు పెద్ద తేడా ఏమీ లేదు.

తెలంగాణ గ్రామ రాజకీయాల్లో రెడ్లు చేసే కుల రాజకీయాలను కక్క నవల ప్రతిభావంతంగా చిత్రించింది. అధికార సంబంధాలన్నీ కుల సంబంధాలని నవల నిరూపించింది. కులమే అధికారానికి మూలమనే వాస్తవాన్ని చిత్రించింది. నయా అగ్రకులాలు, సూదరోళ్లు, మాదిగలు బ్రాహ్మణీయ వ్యవస్థలో బానిసలు. ఈ బానిసల మధ్య స్థానికంగా జరిగే సంఘర్షణే నవల. కుల వ్యవస్థలో ఆయా కులాలు వాటి స్థానాన్ని బట్టి ప్రవర్తించే తీరు, ఆధునిక బ్రాహ్మణ రాజ్యం ఏర్పాటు చేసిన అధికార వ్యవస్థలో వివిధ కులాలు ఎలాంటి అనుకూల, ప్రతికూల ప్రమేయా (ఫంక్షన్) న్ని కలిగి వుంటాయనే సంగతిని ఈ నవల చాలా స్పష్టంగా చిత్రించింది. పంచాయితీ అధికారం ఎవరి చేతిలో వున్నా, అది అగ్రకులాల అభీష్టానుసారం నడిచే వ్యవస్థను పూనా ఒప్పందం తయారు చేసింది. పంచాయితీ అధికారాలు నామమాత్రమే అయినప్పటికీ, వాటిని నియంత్రించే అధికారం అగ్రకులాలకే ఉండే విధంగా పూనా ఒప్పందం వల్ల ఏర్పడింది. అస్పృశ్యులకు బ్రిటీషు వాళ్లు ఇచ్చిన ప్రత్యేక నియోజక వర్గాలను గాంధీ వ్యతిరేకించడం వల్ల ఉమ్మడి నియోజక వర్గాలు లభించాయి. ఉమ్మడి నియోజక వర్గాలలో అగ్రకులాలదే పై చేయి. ఉమ్మడి నియోజక వర్గాలనే ఎన్నికల విధానం వల్లే పంచాయితీ వ్యవస్థ నయా అగ్రకులాల చేతిలో కేంద్రీకృతమైంది. ఈ పరిస్థితిని కక్క నవల కళాత్మకంగా చిత్రించింది.

### 2.1.8 స్త్రీ బానిసత్వం:

స్త్రీలు బానిసలకు బానిసలు. పితృస్వామిక వ్యవస్థ వల్లే స్త్రీలు బానిసలయ్యారని అగ్రకుల స్త్రీవాదులు వాదిస్తారు. యూరొపు సమాజంలోని పితృస్వామిక వ్యవస్థ వేరు. మన సమాజంలోని పితృస్వామిక వ్యవస్థ వేరు. స్త్రీని శూద్రురాలు అంది మనుధర్మం. అంటే స్త్రీ బ్రాహ్మణ కులంలో పుట్టినప్పటికీ ఆమె శూద్రురాలే. ఈ సమస్యను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. యురేషియా బ్రాహ్మణులు ఈ దేశంలోకి వచ్చినప్పుడు కేవలం పురుషులు మాత్రమే వచ్చారు. ఇక్కడి రాజ్యాలను జయించిన తర్వాత మూలవాసీ పురుషులతో పాటు స్త్రీలను కూడా బానిసలుగా మార్చారు. బానిసలైన స్త్రీలను వారి దైహిక అవసరాలకు ఉపయోగించుకున్నారు. వారితో కుటుంబాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ స్త్రీలకు కలిగిన పిల్లలను వారసులుగా చేసుకున్నారు. కానీ, వారిలో కేవలం మగబిడ్డలకు మాత్రమే అధికారం అంటగట్టారు. స్త్రీలు మూలవాసులు కాబట్టి వారికి అనేక ఆంక్షలు పెట్టారు. విద్యకు దూరం చేశారు. ఆస్తి హక్కు లేదు. కుటుంబంలో ఎలాంటి నిర్ణాయక పాత్ర లేదు. భర్త చనిపోతే భర్త చితిలో కాల్చి చంపే పద్ధతిని అమలు చేశారు. ఎందుకంటే స్వర్గంలో తనకు సేవకురాలు అవసరం. స్త్రీల దుస్థితికి బ్రాహ్మణులే కారణం. వారు కల్పించిన సాంఘిక కట్టుబాట్లు కారణం. Although Manu was later than the Buddha. He has enunciated the old view propounded in the older Dharma sutras. This view of the woman was both an insult and an injury to the women of India. It was an injury because without any justification she was denied the right to acquire knowledge, which is the birthright of every human being. It was an insult because after dying her opportunity to acquire knowledge she was declared to be as unclean as untruth for want of knowledge and therefore not to be allowed to take Sannyas, which regarded as a path to reach Brahma. Not only was she denied the right to realize her spiritual potentiality, she was declared to be barren of any spiritual potentiality by the Brahmans. This is a cruel deal with women. It has no parallel" (**Dr. BR. Ambedkar, W&S. Vol.17 (II) p.119**) అని

బాబాసాహేబ్ అంబేద్కర్ పేర్కొన్నారు. బుద్ధిజం స్త్రీ పురుషులకు సమానత్వాన్ని ఇస్తే, మనువు అసమానత్వాన్ని నిశ్చయించాడు. శూద్రులు, స్త్రీలే ఎక్కువగా బౌద్ధాన్ని స్వీకరించారనీ, పుశ్యమిత్రుని ప్రతివిప్లవం తర్వాత మనువు స్త్రీల మీద శాశ్వత బానిసత్వాన్ని రుద్దేందుకు అనేక సాంఘిక నియమాలను రాజ్యం అమలు చేయాల్సిన చట్టాలుగా క్రోడీకరించాడని ఆయన వాదించారు. వర్ణ వ్యవస్థను కుల వ్యవస్థగా మార్చిన తర్వాత లొంగని బుద్ధిస్టులను కూడా కుల వ్యవస్థలోకి పరిగణించిన తర్వాత బౌద్ధ స్త్రీలు కూడా అస్పృశ్యులయ్యారు. పూర్తికాల సంఘ ప్రచారకులను నిర్మూలించి, సంఘ వ్యవస్థను నాశనం చేసిన తర్వాత స్త్రీలకు మనువు ఏ సూత్రాలు నిర్దేశించాడో అవే అస్పృశ్య స్త్రీలకు వర్తించాయి. నిజానికి బ్రాహ్మణ వ్యవస్థలో బానిసలుగా వున్న స్త్రీలకు, ఆ వ్యవస్థకు వెలుపల వున్న శూద్ర, అతిశూద్ర స్త్రీలకు వర్తించే, ఆచరించే నియమాల విషయంలో చాలా తేడా వుంది.

స్త్రీని అవమానించే పద్ధతి బ్రాహ్మణవాదం. లైంగికత అనే దాని ప్రాతిపదికన స్త్రీలను హింసకు గురి చేయటం బ్రాహ్మణవాదంలో ఒక వ్యూహం. దాన్ని కింది కులాలకు కూడా అనుసరిస్తున్నాయి. బౌద్ధంలో చెప్పబడిన 'పంచశీల'లో వ్యభిచారం చేయకూడదు. నైతికత అనేది బౌద్ధంలో కేంద్ర బిందువు. అనైతిక చర్యలను సంఘం అంగీకరించదు. అందుకే, బౌద్ధంలో నైతికమైన జీవనం ఉంటుంది. కాల క్రమేణా బౌద్ధంలో కూడా తాంత్రిక బౌద్ధం వంటి వాటి ద్వారా లైంగిక చర్యలను నైతిక ఛత్రం నుండి తొలిగించారు. అయితే, లైంగికత స్త్రీ కేంద్రంగా వుండటమే బ్రాహ్మణవాదానికి వున్న మరో పార్శ్వం. బౌద్ధంలో అది ఇరువురికి సంబంధించిన విషయం. కానీ, మనుధర్మంలో అది కేవలం స్త్రీ స్వభావానికి సంబంధించిన విషయం.

అస్పృశ్యులు బ్రాహ్మణీకరణకు గురయ్యాక స్త్రీని లైంగికత పేరుతో అవమానించే అలవాటు పెరిగింది. అదొక ఆచారంగా మారింది. నిరపరాధినని నిరూపించుకొనే బాధ్యత స్త్రీ మీదే వేయటం బ్రాహ్మణవాద నీతి. దాన్ని అస్పృశ్యులు కూడా ఆచరిస్తున్నారు. మాదిగల్లో లైంగిక చర్యల మీద కాస్త ఉదారవాద వైఖరే ఉంటుంది. కానీ, అది కుటుంబ రాజకీయాల వల్ల చాలా ఇరుకుగా మారిపోతుంటుంది. కక్కని తల్లి కళమ్మ మీద తన బావ మోజు పడుతాడు. తనకు కొంగు పరువమని అడుగుతాడు. అందుకు కళమ్మ తిరస్కరిస్తుంది. దాంతో కళమ్మ బావ పగబట్టి మనవడి వరుస అయ్యే బర్రోళ్ల ఎల్లయ్యతో అక్రమ సంబంధం కట్టి పంచాయితీకి పిలిపించాడు. ఎర్రగ కాల్చిన గడ్డపార పట్టుకోని ప్రమాణం చేయాలని, సలసల కాగే నూనెలో చేతులు పెట్టాలని, ఒక వేళ తనకు ఏమీ కాకపోతే కళమ్మ తప్పు చేసినట్టు కాదని నిరూపణ జరుగుతుందని పెద్ద మనుషులు వాదిస్తారు. భయపడిన కళమ్మ నేను తప్పు చేస్తే నాకే అవమానం. మీకేంటి మధ్యలో అని ఎదురు ప్రశ్నిస్తది. పెద్ద మనుషులు కళమ్మదే తప్పని తీర్పిచ్చి తల్లిని, కొడుకును చితక బాదుతారు. కళమ్మ కుటుంబాన్ని వెలేసి ఇంటి చుట్టూ కంపగొట్టి, ఇంటి ముందు పాత చెప్పు వేలాడ దీస్తారు. అప్పటి నుండి కళమ్మను ఇతర శుభకార్యాలకు పిలవరు. ఇది సంఘ బహిష్కారం.

భర్త మరణించిన స్త్రీ తిరిగి వివాహం చేసుకోవటం మనుధర్మంలో లేదు. ఆమె లౌకిక విషయాలను పరిత్యజించి, పరలోకం గురించే ఆలోచించాలి. అంద విహీనంగానూ, ఎలాంటి కోరికలు లేనిదానిగానూ జీవించాలి. ముండరాలికి ఎలాంటి సామాజిక గౌరవం ఉండదు. కానీ, మాదిగల సంస్కృతి దీనికి విరుద్ధమైంది. భర్త చనిపోతే మరో వ్యక్తిని పెళ్లి చేసుకొనేందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. కొడుకు కక్కని కోసమే కళమ్మ జీవించింది. అత్తను జాగ్రత్తగా చూసుకోవాలనే ఆదర్శం కోసం మరో పెళ్లి ఆలోచన చేయలేదు. అత్త మరణించిన తర్వాతే కళమ్మకు కష్టాలు మొదలయ్యాయి. అందుకే, కక్కడు చాలా ఆలోచించాడు. పక్క వూరి వ్యక్తి

ఇచ్చిన సలహా మేరకు తల్లికి పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ సంగతిని తల్లికి చెప్పినప్పుడు కోపం చేసింది. కొడుకు పుట్టి తల్లికి పెళ్లి చేయటమేందని నలుగురు ఈసడించుకుంటారని భయపడింది. కానీ, తండ్రి లేకపోవటం వల్లే నీకు ఇన్ని కష్టాలు వచ్చినవి. కాబట్టి నీకు ఒక అయ్యను చేస్తానని కక్కడు అన్నప్పుడు కళమ్మ బోరున ఏడ్చింది. తల్లికి పెళ్లి చేసి కక్కడు సాగనంపాడు. ఆ తర్వాత మళ్లీ తిరిగి ఆమె ఎప్పుడూ తన దగ్గరికి రాలేదు. చివరికి కక్కని పెళ్లికీ రాలేదు.

నైతికత అనేది వ్యక్తుల నడవడికి చాలా అవసరమే. కానీ అది ఒకరిని బాధితునిగా చేసే పరిస్థితి ఉండకూడదు. నైతిక విషయాలను చాలా సున్నితంగా చెప్పే పద్ధతి ఆధిపత్య సాహిత్యంలో కనిపిస్తుంది. కానీ, దళిత నవల నైతిక విషయాలను నగ్నంగానే చిత్రిస్తుంది. వేముల ఎల్లయ్య లైంగిక సంబంధాలలోని కుల స్వభావాన్ని చాలా నేర్పుగా చిత్రిస్తాడు. అవి అధికార సంబంధాలని అంగీకరిస్తాడు. మాదిగలు లైంగిక విషయాల్లో ఎలా వ్యవహరిస్తారో, స్త్రీల పట్ల ఎంత ప్రేమగా వుంటారో కూడా చిత్రిస్తాడు. లస్మక్కతో కక్కని ప్రేమ వ్యవహారం, వాళ్ల సంసారం గురించి ఎంతో వాస్తవికతతో చిత్రిస్తాడు. నైతికత కేవలం వ్యక్తుల శారీరక సుఖాలకు సంబంధించినది కాదనీ, సహజాతాల వల్ల నిర్మాణమయ్యేది అసలే కాదని ఆయన భావన. నైతికత అనేది భావజాలపరమైనది. అది అంతర్వుల కుల సమాజంలో ఆధిపత్యాన్ని బట్టీ, కులం యొక్క సామాజిక స్థాయిని బట్టి నిర్ణయించబడుతుంది. చిందు, డక్కలి కులాల్లో ఒక స్త్రీని జన్నెకు వదలటం అనే ఆచారం ఉంది. అంటే ఆ స్త్రీ కేవలం మాదిగ స్త్రీలతో మాత్రమే లైంగిక కార్యకలాపాల్లో పాల్గొనాలి. అందుకు ప్రతిఫలం దక్కుతుంది. ఇది ఆమె వ్యక్తి గత ఇష్టాయిష్టాలకు సంబంధం లేకుండా కుల ధర్మం వల్ల రూపొందిన ఆచారం. కాబట్టి నైతికత అనేది కులాధారమైంది. ఈ సంగతిని కక్క నవల ప్రతిభావంతంగా చిత్రించింది.

**<u>2. 1. 9. *బ్రాహ్మణుల అనుపస్థితి:*</u>**

బ్రాహ్మణులు లేని దళిత నవల ఇది. ఎలా సాధ్యమైంది ఇది? తెలంగాణాలో బ్రాహ్మణుల ప్రాబల్యం చాలా తక్కువ. తెలంగాణా ప్రాంతంలో భూస్వామ్య వ్యవస్థ వల్ల రెడ్డి, వెలమ కులాలు మొదటి నుండి బలంగా వున్నాయి. వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాట కాలం నుండే తెలంగాణ ప్రాంతంలోని వైష్ణవ బ్రాహ్మణులు రాజకీయ శక్తిగా ఎదిగారు. పటేలు పట్వారీ వ్యవస్థ పూర్తిగా వారి ఆధీనంలోనే ఉండేది. అభ్యుదయ, విప్లవ నవలల్లో ఆ సంగతి నమోదు చేశారు. అయితే, అధికార బదలాయింపు తర్వాత హైదరాబాదు రాజ్యం బ్రాహ్మణ పాలక వర్గం చేతిలోకి వెళ్లింది. దీంతో బ్రాహ్మణులు పాలకులుగా మారారు. తెలంగాణ వైష్ణవ బ్రాహ్మణ వర్గం ప్రభుత్వ సంస్థల్లో కీలక స్థానాల్లోకి వెళ్లింది. కేంద్రంలో వున్న తన జాతితో సంబంధాలు పెట్టుకోవటం ద్వారా రాష్ట్ర రాజకీయాలను, అధికారాన్ని శాసించే శక్తిగా ఎదిగింది. గ్రామాల్లో వారి జనాభా చాలా చిన్నది. అల్పసంఖ్యాకులైన బ్రాహ్మణ వర్గం నిరంతరం నయా భూస్వామ్య కులాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బతకాల్సిందే. అదే కేంద్రంలోని పాలకులతో కలిసి పోవటం వల్ల భూస్వామ్య శూద్ర కులాలను నియంత్రించే వీలు మెండుగా ఉంది. అందుకే పల్లెలను విడిచి పట్టణాలకు చేరారు. కక్క నవల గ్రామ సీమల రాజకీయ చిత్రం. కాబట్టి అందులో బ్రాహ్మణ పాత్రలు లేవు.

***<u>2. 1. 10. అంటరానితనం లేని నవల:</u>***

తెలంగాణ గ్రామ జీవితంలో అంటరానితనం వుంది. కానీ కక్క నవలలో అంటరానితనం గురించి పెద్దగా ప్రస్తావించ లేదు. వ్యవసాయిక కులాల్లో అంటరానితనం గురించి అంత పట్టింపు లేవని కాదు. కానీ, అవి పాటిస్తే వ్యవసాయం చేయటం చాలా కష్టమైన పని. వరంగల్, నల్లగొండ జిల్లాల్లో అంటరానితనం వుంది. కానీ, మాదిగలతో

సన్నిహితంగా మెదిలే ఇతర కులాలు కూడా వున్నాయి. ముఖ్యంగా జీతగాళ్లను ముట్టుకోవటం అనేది వుంది. మాదిగల ఇండ్లల్లోకి ఇతర కులాలు రావడం జరుగుతూనే ఉంది. కక్కనికి యజమాని భౌతిక హింస అనుభవంలోకి వచ్చింది. కానీ, అంటరానితనం అనేది అనుభవంలో లేదు. నవలా రచయిత అంటరానితనం అనే ఆచారం గురించి స్పృహతోనే ఏమీ రాయలేదని తెలుస్తుంది. అంటరానితనం కన్న భూమి ప్రధాన సమస్య. అధికారం ప్రధాన సమస్య. రాజకీయ అణచివేత ప్రధాన సమస్యగా నవలా రచయిత భావించారు.

"తెలంగాణ జాతీయోద్యమాన్ని 'ప్రాంతీయ' చైతన్యమని పిలిచే అహంకారులూ దానిని బాంచెన్ అని నిర్విమర్శగా స్వీకరించే మందబుద్ధులూ మనకి చాలా మందే వున్నారు. దేశమంటే మనుషులే గానీ తెలంగాణా అంటే మాత్రం మట్టేనని వీరి భావం. వేముల ఎల్లయ్యకి మాత్రం తెలంగాణా అంటే నిరంతర చలనంలో ఉండే మనుషులు. వారి మధ్య మారుతూ ఉండే సంబంధాలు, వాటికి రూపాన్ని యిచ్చే సంస్థల, సంప్రదాయాల, చైతన్యాల, ఆస్తిసంబంధాల మూసలు. అంతేకాదు, ఎల్లయ్యకి తెలంగాణ అంటే మట్టికూడా. కాకపోతే అది నిర్దిష్టమైన 'ప్రాంతం' కాదు. అల్పమైన మట్టి కాదు, భూమి. స్థిరత్వానికి, సంప్రదాయానికీ, కరుడుగట్టుకు పోవడానికి, మార్పు లేనితనానికి, గిరిగీసిన తనానికి పేరుమోసిన 'గ్రామం'లో నిరంతర ప్రాయమైన చలనాలని ఈ నవల చూపిస్తుంది. గతం గమ్మున నిలుచుండి పోదనీ దానిని అలా నిలబెట్టాలనుకోవడానికి ఎంతో శక్తి వెచ్చించాల్సి వస్తుందనీ ఎల్లయ్యకి బాగా తెలుసు. కదలని నేలయే ఈ సమస్త సంచలనాలకి కుదుపులకీ కేంద్రంగా సాధనంగా ఆఖరురి లక్ష్యంగా కూడా వేముల ఎల్లయ్య చూపెడుతాడు" (శ్రీనివాస్,జిలుకర . 2012: 122). నేల కేంద్రంగా సాగిన మాదిగ నవల కావటం వల్ల తన దృష్టిని అంటరానితనం మీదికి మళ్లించ లేదు. అంతమాత్రాన దాని ఉనికిని గానీ దాని తీవ్రతను గానీ నిరాకరించటం కాదు.

**2.1.11. *ఆంధ్ర కమ్మ విస్తరణవాదం:***

కేవలం కుల చలనాన్ని మాత్రమే కక్క నవల పట్టించుకోలేదు. అన్ని రకాల చలనాలను అది ప్రతిఫలించింది. స్థానికత కక్క నవలలోని ప్రధాన లక్షణం. కాని, ఆ స్థానికతకు ఇతర ప్రాదేశికతలతో వున్న ఆర్థిక సంబంధాలను కూడా అది గుర్తించింది. ఆంధ్ర ప్రాంతం తెలంగాణ వనరులను కొల్లగొట్టడమనే వరకే ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం పరిమితం అయ్యింది. కానీ, వేముల ఎల్లయ్య ఆ పరిమితిని అధిగమించాడు. ఆంధ్ర ప్రాంత ఆధిపత్యం గురించి ఆలోచించటం అంటే అక్కడి పీడిత కులాలకు వ్యతిరేకంగా పోరాటడం కాదని కక్క నవల పరోక్షంగా బోధిస్తుంది. గుంటూరు, కృష్ణా జిల్లాల కమ్మ భూస్వాములు ఆధిపత్య స్వభావాన్ని కలిగి వున్నారనే ఎరుకను ఇది ప్రస్తావిస్తుంది. తెలంగాణ ప్రాంత పీడిత కులాలకు స్థానిక వెలమ, రెడ్డి భూస్వాముల పీడన ప్రధాన సమస్య. ఈ పీడనను మరింత బలపర్చే కమ్మ భూస్వాముల ఆధిపత్యం తోడు కావటం తెలంగాణ మూలవాసులకు పెద్ద సమస్యగా పరిణమించింది. ఆంధ్ర ప్రాంత ఆధిక్యాన్ని కమ్మ రాములు పాత్ర ద్వారా చిత్రించాడు. గుంటూరు నుండి వచ్చిన కమ్మ కులస్తులు తెలంగాణాలో భూములు తీసుకొని ఆధిపత్యం వహించటం కనిపిస్తుంది. తెలంగాణ రెడ్లతో కలిసి కింది కులాల మీద ఆధిపత్యం వహించటం కనిపిస్తుంది.

'వలస' (మైగ్రేషన్) అనేది ఎప్పుడూ ఒకే రకంగా ఉండదు. జీవన పోరాటంలో భాగంగా పేదలు వలస పోతుంటారు. దానికి ఆధిపత్య స్వభావం ఉండదు. వారితో పాటు వారి వారి కుల సంస్కృతులను, ప్రాంతీయమైన అభిమానాలను కూడా మోసుకెళ్తుంటారు. అయితే, అది వలస వెళ్లి స్థిరపడిన ప్రాంతాల ప్రజానీకంతో పెద్ద వైరుధ్యాన్ని కలిగివుండదు. ఆధిపత్యం కోసమే వెళ్లే మరో 'వలస' ఉంటుంది. అది స్థానిక వనరులను, స్థానిక సంస్కృతులను

అణచివేస్తుంది. స్థానికుల మీద రాజకీయ పెత్తనం చేయకుండా వారి ఆధిక్యతను నిలుపుకోలేరు. వలసోత్తర కాలంలో శూద్రులైన కమ్మ కులస్తులు నయా అగ్రకులాలుగా ఎదిగారు. అంటే దాని అర్థం బ్రాహ్మణ ధర్మం దాన్ని అగ్రకులంగా గుర్తించిదని కాదు. ఇతర బానిస కులాలు కమ్మ కులాన్ని అగ్రకులంగా భావిస్తున్నారని. బ్రాహ్మణ వ్యతిరేక పోరాటంలో ముందుండి నడిచిందీ, నడిపించిందీ కమ్మలే. త్రిపురనేని రామసామి చౌదరి ఈ పోరాటానికి ఆద్యుడు. మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా ఆంధ్ర ప్రాంతం వున్న కాలంలో పెరియార్ రామసామి బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంతో సంబంధాలు కలిగి వుండే వాడు. పెరియార్ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. బ్రాహ్మణుల ఆధిక్యతను నిరాకరించాడు. బ్రాహ్మణులు ఆర్యులనీ, బ్రాహ్మణేతరులు ద్రావిడులని ఆయన భావించారు. ద్రావిడుల మీద విదేశీ ఆర్యులు పెత్తనం చేయటమేమిటని ఆయన ప్రశ్నించారు. బ్రాహ్మణులకు ఆధిపత్యాన్ని కట్టబెడుతున్న ఇతిహాసాలు, పురాణాలను హేతుబద్ధంగా విమర్శించారు. పెద్ద సాంస్కృతిక ఉద్యమానికి నాంది పలికారు. అదే స్ఫూర్తితో త్రిపురనేని తెలుగులో రామాయణ, మహాభారతాలను విమర్శనాత్మక దృష్టి నుండి పరిశీలించారు. అనేక రచనలు చేశారు. వాటిని హేతువాద రచనలుగా విమర్శకులు పరిగణించారు. కానీ, అవి బ్రాహ్మణవాద వ్యతిరేక రచనలు. త్రిపురనేని తీసుకొచ్చిన సాంస్కృతిక విప్లవం బ్రాహ్మణుల ఆధిక్యతను దెబ్బతీసింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల అవతరణ తర్వాత వ్యవసాయిక విప్లవం వచ్చింది. నీటి వనరుల అభివృద్ధి, ఆధునిక వ్యవసాయ పద్ధతుల వల్ల కోస్తాంధ్ర ప్రాంతంలోని శూద్ర కమ్మ కులస్తులు ఆర్థికంగా చాలా అభివృద్ధి చెందారు. సంస్కృతి పరిశ్రమ (కల్చర్ ఇండస్ట్రీ) మద్రాసు నుండి హైదరాబాదుకు మారటం వల్ల నయా ఆర్థిక శూద్ర కులం సాంస్కృతిక ఆధిక్యతను ప్రదర్శించటం ఆరంభించింది. సినీ పరిశ్రమ అందుకు కేంద్రమైంది.

బ్రాహ్మణుల చేతిలో వున్న సినీ పరిశ్రమను పూర్తిగా కమ్మలే స్వాధీనం చేసుకున్నారు. సంప్రదాయిక సినిమాలకు భిన్నంగా సాంఘిక, రాజకీయ కథా వస్తువులతో కమ్మలు కేంద్రంగా సాగే సంస్కృతిని ప్రచారం చేశారు. భాషా జాతీయవాదం ఆ క్రమంలో రూపొందిందే. 1969లో వచ్చిన తెలంగాణ ఉద్యమం, అందుకు ప్రతిగా వచ్చిన జై ఆంధ్ర ఉద్యమం వచ్చింది. విశాలమైన ఆంధ్రప్రదేశ్ మీద ఆధిపత్యం వహిస్తేనే కమ్మలు అగ్రకులాలు ఎదుగుతారనే చైతన్యం వచ్చింది. అందుకే తెలుగు జాతీయత, భాషా జాతీయత అనే భావనలను శక్తిమంతంగా ముందుకు తెచ్చారు. కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కోవటంతో కమ్మలు మరింత బలపడ్డారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో అది పతాక స్థాయికి చేరింది. కాంగ్రెస్ పార్టీని ఓడించి తెలుగుదేశం పార్టీ అధికారం చేజిక్కించుకోవటంతో తెలంగాణ మీద కమ్మ భూస్వాముల పెత్తనం వ్యవస్థీకృతమైంది. వలస కేవలం జైవికమైందే కాదు. అది రాజకీయమైంది. కక్క నవలలోని కమ్మ రాములు గుంటూరు నుండి వచ్చి తెలంగాణాలో సేద్యం చేసింది బతుకు దెరువు కోసం కాదు. ఆర్థిక బలాన్ని సమీకరించుకొని, రాజకీయ అధికారం అనుభవించాలని. ఆ క్రమంలో భూమి నుండి తప్పుకొని సంప్రదాయికేతర రంగాలకు విస్తరించాలనే స్పష్టమైన అవగాహన లేని తెలంగాణ రెడ్లు గ్రామీణ రాజకీయాలను మాత్రమే కేంద్రంగా చేసుకున్న కాలం వారికి కలిసొచ్చింది. అందుకే కమ్మ రాములు రెడ్లతో కలిసి మాదిగల మీద దాడి చేశాడు.

కమ్మ రాములు నేపథ్యంలో కక్కని మీద దాడిని గమనించాలి. ఆంధ్రలోని కారంచేడులో మాదిగల మీద కమ్మలు దాడి చేశారు. మారణకాండ సృష్టించారు. ఆ సందర్భంగానే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం తీసుకొచ్చారు. కమ్మలు ఆంధ్రలో చేసిన దాడిని గుర్తు చేయటానికే కక్కని మీద దాడిలో కమ్మ రాములు పాల్గొన్నాడనే విషయాన్ని వేముల ఎల్లయ్య

పేర్కొన్నాడు. కమ్మ విస్తరణవాదానికి మరో రూపమే ఆంధ్ర విస్తరణవాదం. దానికి కుల స్వభావమే ఉంది. కులాధిపత్యానికి మరో రూపమే ప్రాంతీయ విస్తరణవాదం. ప్రాంతీయ అసమానతలను భౌగోళికమైనవని మాత్రమే భావించే దానికి వేముల ఎల్లయ్య దృక్పథం భిన్నమైంది. ఆర్థిక నిర్ణాయకవాద వైధానిక పద్ధతి నుండి రాజకీయాలను పరిశీలిస్తే అందరి లాగే వేముల ఎల్లయ్య కూడా పొరబడే అవకాశం ఉండేది. కానీ, అందుకు ప్రతివాస్తవికమైన పద్ధతిలో పరిశీలించటం వల్ల విభిన్నమైన విశ్లేషణ చేశారు. 'వలస'కు మూలం కులాధిపత్యమనే వాస్తవాన్ని కక్క నవల ప్రతిఫలిస్తుంది. భూమి కులాధిపత్యానికి ఒక సాధనం. భూమి కలిగి వుండటం వల్లనే ఆధిపత్యం చలాయిస్తారనేది ఆర్థిక నిర్ణాయకవాదం. అది అవాస్తవిక దృక్పథం. కుల వ్యవస్థలో కింది కులాలకు బాధ్యతలు, పై కులాలకు హక్కులు కల్పించటం అనే ధర్మం వల్లే 'ఆధిపత్యం' కొనసాగుతూ ఉంటుంది. భూమి అనుషంగిక విషయమే. అదే సర్వస్వం కాదు. కానీ, భూమి లేని పీడిత కులాలకు ఆత్మరక్షణ కొంచెం కష్టమైనదే. రాజ్యం కూడా శత్రు వైఖరిని అవలంభించటం వల్ల మాదిగలకు ప్రతిఘటన కష్టమవుతుంది. ప్రతిఘటన అనేది రక్షణ కోసమే తప్ప ఆధిపత్యం కోసం కాదు. అందుకే కక్కడు ప్రభుత్వ అధికారులతో మాకు రక్షణ కావాలని అడక్కుండా భూమి కావాలని అడుగుతాడు. అంచేత కులానికి భూమికి స్వాభావికమైన సంబంధం ఉన్నదని భావించరాదు.

**2.1.12. *తెలంగాణ భాషావాదం:***

తెలంగాణ సాహిత్య వక్తీకరణకు ఆంధ్ర భాష ఉపయుక్తం కాదు. భాషా ప్రాతిపదిక లేని ప్రాంతీయ ఉద్యమాలు విజయవంతం కావు. తెలంగాణ ఉద్యమంలో ఆర్థిక దోపిడీ ప్రధాన అంశంగా ఉంది. తెలంగాణ వ్యవహారాన్ని యాసకు సంబంధించిన భాషా సమస్యగా చూస్తున్న వారున్నారు. ఉద్యమం కూడా తెలంగాణాను తెలుగు భాషలో ఒకటిగా భావిస్తున్నారు. అందుకే కుటుంబవాదన చేస్తున్నారు. అన్నదమ్ములు విడిపోతే తప్పేంటి అనే కుటుంబ వాదన బలహీనమైంది. రాజకీయ సమస్యను కుటుంబ రూపకాలతో ముడిపెట్టడం వల్ల వచ్చే ప్రయోజనమేమీ లేకపోగా ఉద్యమాన్ని నిర్వీర్యం చేయటానికే దోహదం చేస్తుంది. తెలంగాణాలోని అగ్రకులాలు ఎక్కువగా తెలుగు భాష ప్రభావంలో పడటం ఈ ఆలోచనకు కారణం.

తెలంగాణ ఒక ప్రాదేశిక భాష. "మాండలికం అన్న భావనలో ఒక హైన్యత వ్యక్తమవుతుంది. ఆధునిక విలువల కారణంగా భాష ఆత్మగౌరవ విషయమని గుర్తిస్తున్నాం. మాండలికాలను భాషలు అనడం పట్ల భాషావేత్తలకు భిన్న అభ్యంతరాలున్నాయి. సాంప్రదాయిక నిర్వచనాల పరిధిలో ప్రాదేశిక వ్యవహారాలు భాషలు కాకపోవచ్చు. భాషను పునర్ నిర్వచించడమే దానికి మార్గం. నిర్మాణవాద భాషాశాస్త్రవేత్త ఫెర్డినాండ్ డి. ససూర్ ప్రకారం సంజ్ఞల వ్యవస్థ భాష. సంజ్ఞలు నిర్దిష్ట సమాజంలోని సంస్కృతి ఉత్పత్తులు. అందువల్ల వాటి విభిన్నత ఆయా సంస్కృతుల మీద ప్రాదేశికతల మీద ఆధారపడి వుంటుంది. భిన్న ప్రాదేశిక సంస్కృతులున్న చోట ప్రమాణిక భాష ఒక సౌకర్యమే తప్ప పరిష్కారం కాదు. మాండలికాలు ఒక ఉపాంగమని భావిస్తే మాండలికాలు అర్థం కావాలి. తెలంగాణ, రాయలసీమ భాషల్లో వున్న రచనలు అర్థం కాకపోవడం వల్ల వాటికి అనువాదాలు అవసరం అవుతున్న దృష్ట్యా అవి 'భాషలు' అవుతున్నాయి" ( శ్రీనివాస్,జిలుకర్. 2012: 99-100) అని జిలుకర శ్రీనివాస్ చేసిన విశ్లేషణ అంతిమంగా మాండలికాలను ప్రాదేశిక భాషలుగా నిర్ధారించేందుకు దారి తీసింది.

భాష అనేది ఒక ప్రాంతం నిర్మించుకొన్నది. ఆ ప్రాంతానికి వున్న చారిత్రక, రాజకీయ, సామాజిక, భౌగోళిక కారణాల వల్ల భాష రూపొందుతుంది. భాషకు మూలమైన నియమాలు, సంప్రదాయాలు, రూఢీ రూపొందుతాయి. ఒక సంకేతం లేదా సంజ్ఞ వ్యవహారంలో ఎలా

ప్రవర్తిస్తుంది? ఎలాంటి అర్థాన్ని బోధిస్తుంది? అనే అంశాలు ఆ ప్రాదేశిక సమాజం యొక్క చరిత్ర మీద ఆధారపడి వుంటుంది. శబ్ద రూపాలు, అర్థ వినిమయం ఆయా ప్రాదేశిక సంస్కృతుల మీద ఆధారపడి వుంటుంది. భాష ఒక రాజకీయ నిర్మాణమనే సంగతిని ఈ క్రమంలోనే గుర్తించాలి. భాషా రాజకీయాలు కీలకమైన సందర్భంలో తెలంగాణ వ్యవహారం మాండలికం కేటగిరిలోకి వేసి ఆనుషంగిక విషయంగా మార్చేశారు. తెలంగాణ సంస్కృతి సీమాంధ్ర సంస్కృతికి భిన్నమైంది. ఆంధ్ర, రాయలసీమ సంస్కృతులు కూడా భిన్నమైనవే. ఆ రెండు ప్రాంతాలు మాట్లాడుకొనే భాష కూడా భిన్నమైందే. వాటికి సంపూర్ణంగా వ్యతిరిక్తమైంది తెలంగాణ భాష.

తెలంగాణ వ్యవహారం ఇతర ప్రాంతాలకు అర్థం కావటం లేదు. తెలంగాణ వ్యవహారంలో రాసిన రచనలను ఇతర ప్రాంతాల పాఠకులు చదవ లేకపోతున్నారు. చదివినా అర్థం చేసుకోలేకపోతున్నారు. వారికి అనువాదకుడు లేదా వ్యాఖ్యాత అవసరం అవుతున్నాడు. అనువాదకుడు అవసరం అవుతున్నాడూ అంటేనే తెలంగాణ మాండలికం కాదనీ అదొక ప్రత్యేకమైన భాష అని రుజువు అవుతుంది. తెలంగాణ భాష అనే భావన రాజకీయ ఆమోదం పొంద లేదు. సాహిత్య, కళా రంగాల్లో మాత్రం తెలంగాణ భాషకు ఆమోదం లభించింది. తెలంగాణ భాషలో విరివిగా కవిత్వం, కథ, నవలలు వచ్చాయి.

తెలంగాణ భాష వేముల ఎల్లయ్య దృష్టిలో స్వాభావికమైంది. కింది కులాల నిత్య జీవితం తెలంగాణ భాషతో ముడిపడి వుంది. తెలంగాణ భాషకు వెలుపల మాదిగల జీవితాన్ని ఎల్లయ్య ఊహించలేడు. ఆంధ్ర మీడియంలో చదువుకొని తెలంగాణ భాషకు అగ్రకులాలు దూరమైతే, చదువు అనే చట్రంలోకి మాదిగలు పెద్దగా రాకపోవటం వల్ల మాదిగలకు తెలంగాణ మాతృభాషగానే ఉంది.

కావ్యభాషగా సంస్కృతాన్ని మాత్రమే స్వీకరించిన బ్రాహ్మణులు సంస్కృతాన్ని గ్రాంధిక రూపానికి వికృతీకరించారు. గ్రాంధిక భాషాధిపత్యానికి వ్యతిరేకంగా వ్యవహారిక భాషోద్యమం సాగింది. భాషను ఆధునిక విలువలతో ప్రజాస్వామీకరించాలనే గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ అప్పారావుల వాదన అంతిమంగా గెలిచింది. ఆధునిక పూర్వ సమాజానికి కూడా గ్రాంధికం ప్రాతినిధ్యం వహిస్తుందా అనే సంశయం ఉత్పన్నం అవుతుంది. కావ్యభాషకు గ్రాంధిక భాషకు చాలా తేడా వుంది. కావ్యం మధ్యలో అక్కడక్కడ రాసే వాక్యాలకు గ్రాంధికం అనే పేరు పెట్టడం వల్ల భాష తిరోగమనంలో ప్రవేశించింది. గ్రాంధికం ప్రజల భాష కాకపోవటం, అది బ్రాహ్మణ పండితుల రచనా భాష కావటం కూడా దాని పతనానికి కారణం. గురజాడ, గిడుగులు వ్యవహార భాష పేరతో వాడినది కూడా పూర్తిగా ప్రజల భాషేమీ కాదు. భాష ప్రాంతాన్ని బట్టీ, కులాన్ని బట్టీ మారుతుందని, భాషారూపాలు వేరుగా వుంటాయని గిడుగు, గురజాడలు అంగీకరించారు. వ్యవహార భాష కూడా ఆంధ్రలోని తెనాలీ, కృష్ణా జిల్లాల భాషలే. గిడుగు ఎక్కువగా జీవించింది కళింగాంధ్రలోనైనా ఆయన రాసింది తెనాలీ, కృష్ణా జిల్లాలదే. గిడుగు, గురజాడలు భాషా ప్రజాస్వామ్యం కోసం చేసిన పోరాటం ఫలించి చివరికి ఆ రెండు మండలాల వ్యవహారం మొత్తం ఇతర వ్యవహారాలను మింగేసేందుకు దారి తీసింది.

మాధ్యమిక భాషగా ఆంధ్ర భాషను ప్రభుత్వం ప్రవేశపెట్టడం వల్ల తెలంగాణ భాష ప్రమాదంలో పడింది. ఆంధ్ర మహాసభ పేరుతో సాగిన ఉద్యమంలో వచ్చిన రచనలు కూడా గ్రాంధిక వ్యవహారానికి దగ్గరగా వున్నవి. తెలంగాణ బ్రాహ్మణ పండితులు ముస్లిం వ్యతిరేకత, ఉర్దూ వ్యతిరేకత వల్ల గ్రాంధికాన్ని ఆశ్రయించారు. సుద్దాల హన్మంతు రాసిన పాటల్లో కూడా ఆ లక్షణాలు కన్పిస్తాయి. తెలంగాణా బ్రాహ్మణ పండిత వర్గం ఆంధ్ర బ్రాహ్మణ

వ్యవహార భాషను ప్రచారం చేసి సంస్కృతి వలసకు మార్గం వేశారు. తెలంగాణ భాష కావ్య స్థాయిని పొందక పోవడానికీ విద్యావిషయిక బోధనా భాషగా రూపొందక పోవడానికీ తెలంగాణ బ్రాహ్మణ పండితుల బాధ్యత కూడా వుంది.

పాత్రోచిత భాష పేరుతో కింది కులాల పాత్రలకు మాత్రమే వాడే భాషను వేముల ఎల్లయ్య స్వీకరించాడు. తెలంగాణ మాదిగలు మాట్లాడే భాష మరింత నిసర్గమైంది. అందులో లేషమైనా బ్రాహ్మణ, ఆంధ్ర ప్రభావం కనిపించదు. మాదిగల ఆత్మ ప్రదర్శనకు, స్వయం గౌరవానికి కారణమైన వ్యక్తీకరణ రూపమైన తెలంగాణ భాషలో నవల రాయటం గొప్ప విషయం. ఆ భాష వల్ల నవలకు అబ్బిన సొగసు అద్భుతమైంది. సున్నితమైన సంవేదనలనే కాదు, తీక్షణమైన భావోద్రేకాలను కూడా సంపూర్ణంగా వ్యక్తీకరించే సామర్థ్యం తెలంగాణ భాషకు ఉంది. ఆ సంగతిని వేముల ఎల్లయ్య గుర్తించాడు.

## 2.2. భూతం ముత్యాలు 'సూర'-విద్యాభివృద్ధి, కుల, మూఢాచారాల నిర్మూలన:

వేముల ఎల్లయ్య తర్వాత తెలంగాణ దళితుల జీవితాలను అద్భుతంగా చిత్రించిన మరో రచయిత భూతం ముత్యాలు. ఈయన రచించిన 'సూర' నవలాప్రక్రియలో విశిష్టమైనది. తెలంగాణలోని మాలల జీవిత సంఘర్షణ ఈ నవల ఇతివృత్తం. ఆధునిక ప్రపంచంలో అంటరానిజాతులు వికాసం చెందాలంటే విద్య ఒక అవకాశం. విద్యార్జన కోసం తపించే సూరడు ఎన్ని కష్టాలను ఎదుర్కొన్నాడో ఈ నవలలో చూపిస్తాడు. సూరడి కుటుంబంలోని రెండు తరాల జీవిత పోరాటాన్ని చిత్రించటం ద్వారా తెలంగాణాలోని రెడ్డి సామాజిక వర్గం యొక్క ఆధిపత్యాన్నీ, దుర్మార్గాన్నీ ఈ నవలలో చిత్రిస్తాడు. భూతం ముత్యాలు నల్లగొండ జిల్లావాస్తవ్యుడు. మాల కులంలో పుట్టిన ఉన్నత విద్యావంతుడు. తాను చూసిన అనుభవించిన అనేక విషయాలను ఆయన ఈ నవలలో నిక్షిప్తం చేశాడు.

### 2.2.1. భూతం ముత్యాలు పరిచయం

**రచయిత పేరు**: భూతం ముత్యాలు

**తల్లిదండ్రులు:** భూతం మల్లమ్మ, మల్లయ్య

**పుట్టిన తేది**: 10.06.1971

**కులం:** మాల

**స్వగ్రామం:** పట్టిపన్నూరు, తిరుమల గిరి, నాంపల్లి మండలం,
నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం

**విద్య:** పదవతరగతి వరకు దేవరకొండ ప్రభుత్వ వసతి గృహంలో ఉండి చదువుకున్నారు.
ఇంటర్మీడియట్: దేవరకొండలోనే పూర్తి చేశారు.
బిఎ.: న్యూగవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, చింతలబస్తీ, ఖైరతాబాద్, హైదరాబాద్
బిఇడి: గోకుల్ కళాశాల నల్గొండ,
( రెండు ఎకరాల పొలం అమ్ముకుని బిఇడి పూర్తి చేశాడు)
ఉద్యోగం: ఎస్జిటి టీచర్గా ప్రభుత్వ ఉద్యోగం (1996 ) అంతకు ముందు ప్రయివేట్ స్కూల్లో టీచర్గా ఒక స్కూల్లో పనిచేసి ఉన్నారు.

సాహిత్య ప్రయాణం: ఉపాధ్యాయ వృత్తి స్వీకరించే నాటికి సాహిత్యం చదవడమే అలవాటు. ఆ అలవాటు రచనలవైపు దారితీసింది. వేముల ఎల్లయ్య నవల కక్క ముత్యాలు సృజనాత్మక జీవితాన్ని మలుపు తిప్పింది. కక్క ప్రేరణతోనే సూర నవలను సృజించారు. ' రెండువేల సంవత్సరం నుండి సీరియస్గా రచనలు కొనసాగిస్తున్న పుష్కర కాలం తర్వాత

నున్న నీను ఎన్కకు మల్లి జూస్కుంటె సాహిత్యంలో సూరదు మైలురాయిలా నిల్సుండు.అని దళిత అంతర్మదనం పేరుతో ముత్యాలే స్వయంగా చెప్పుకున్నారు.

**<u>కవిత్వం:</u>**

దుగిలి (2003)

కథలు (సంకలనాలు):

1. బేగారి కథలు (2012)
2. బుగాడ (2014)

**<u>నవలలు:</u>**

1. సూర(2004)
2. పురుడు( 2007)
3. ఇగురం (2012)

**<u>ఇతర రచనలు:</u>**

1. మాండలీకం ( తెలంగాణ మాండళికం కుల వృత్తి పదకోశం 2013)
2. నియతి నా అటోబయోగ్రఫీ (2014)

**<u>2. 2. 2. సూర కథాపరిచయం:</u>**

సూర ముత్యాలు మొదటి నవల, ఆ నవల గురించి ఆయన మాటల్లో "సూర నవలని ఆత్మ, కథనాత్మక శైలిలో రాయాలని అనుకున్నా. నా చుట్టూ అల్లుకున్న జీవితాలు వలస బత్కులు, బతుకు దెరువు ఊగిసలాట, దళితుల అణచివేత, కుల వృత్తుల ద్వసం, సాంఘీక బహిష్కరణ మాజీవితాల్లో నిత్యకృత్యాలే. అలా జీవిత యథార్ధ గాదే ఈ నవల. అంబేద్కర్ ఆలోచన విధానం, గ్రామల్లో మార్పు రానంతవరకు రూపు దాల్చదు. అలాజరగాలంటే కులాంతర వివాహాల ప్రోత్సాహం, కుల నిర్మూలన, ఇతర మతాల స్వీకరణ, తమ అస్తిత్వాన్ని తెలపడం, నిలుపుకోవడం, అవాంతరాలనైన ఎదురొడ్డి నిలవడం ఇదే ఈ నవల సారం. ఐతే దళిత నవలల్లో కనిపించని ఒకే ఒక్క అంబేద్కర్ ఆశయం కులాంతర వివాహం ఈ నవలలో కనిపిస్తుంది." (భూతం ముత్యాలు : 2014)అని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలోని మాలల జీవితాల్లోని అనేక కొనాలను ఈ నవల చిత్రీకరించింది. ఆయన రచించిన సూర నవల ప్రత్యేకమైనది. ఎందుకంటే కాకతీయ విశ్వవిద్యాలయం ఈ నవలను ఎంఏ తెలుగు విద్యార్థులకు సిలబస్‌గా ఎంపిక చేయడం జరిగింది.

సూరలో రెండు తరాల వలస దళిత (మాల) జీవితాలను రచయిత ఆవిష్కరించాడు. మొదటి తరానికి చెందిన వారు చెన్నదు, అతని భార్య చంద్రి వీరు అక్షర జ్ఞానంలేని రెండవ తరానికి చెందిన వారు. తనకొడుకు సూరనికి నిరక్షరాస్యత వల్ల కలిగే బాధలు రాకూడదని తల్లి దండ్రులు భావిస్తారు . చెన్నదు హైదరాబాదులో పనికి వెళ్ళడానికి వేకువ జామున లేచాడు. ఖాసీం వచ్చి సామాన్లు సిద్దం చేసుకొమ్మని చెప్పి వెళ్ళాడు. పట్నం వెళ్ళే వారు చతుర్లాడుకుంటు ప్రయాణమయ్యారు.. మర్రిచెట్టు క్రింద ఆగి కల్లు తాగిన చెంద్రి పాలివోళు ్ళ తమను పెట్టిన బాధలు చెబుతుంటే అక్కడివారు ఓదార్చారు. చెంద్రి అయ్యా (దేవయ్య) కూటికి పేద కాదు. చెన్నును అయ్య కూడ పొలం సంపాదించాడు. చెన్నదు ఉన్నా పొలాన్ని కష్టపడి పండించేవాడు. అన్న వదిన కూర్చొని తినేవారు. పెళ్ళయినా వాడి తీరు మారలేదు. అందుకే భార్య బలవంతం మీద పట్నం వలస బయలుదేరారు. పట్నంలో గుడిసెలు వేసుకొని చెంద్రి పాచి పనులు చేసుకుంటూ చెన్నదు రిక్షా తొక్కుతూ బ్రతుకుతున్నారు. ఖాసిం నాలుగు డబ్బులు సంపాదించుకోని చీకటి గూడెం వెళ్ళిపోతూ బషీర్‌కి వీరి మంచి చెడ్డలు అప్పగించి

వెళ్ళాడు.

పట్నంలో చెన్నడి కొడుకు సూర  చదువుకుంటున్నాడు. పిల్లల స్నేహంతో ఆటలు ఆడుకుంటు బడికి వెళ్ళకుండా మొండికేశాడు. చెంద్రి సూరనికి కళ్ళలో కారం పెట్టింది. మధ్యాహ్నం కూటికి వచ్చి చెన్నడు విషయం తెలిసి చెంద్రిని చావబాదాడు. పోషవ్వ సూర చేస్తున్న పనులు వివరంగా చెన్నడికి వివరించింది. చెన్నడు వినకుండా సూరతో కల్లు దుకాణానికి వెళ్ళాడు. సూర పిల్లలతో కలిసి 'పాతాళ భైరవి' సినిమాకి వెళ్ళాడు. చెంద్రీ సూరని ఎతుక్కొంటు మల్లిని అడిగేసరికి సినిమాకి వెళ్ళిన సంగతి చెప్పింది. చెన్నడు సూర వచ్చిన తర్వాత రెండు దెబ్బలు తగిలించాడు. చెంద్రీ మేనవదిన కొడుకు కేశవరావు పట్నం కాలేజీలో చదువుతున్నాడు. కేశవులకు చదువు చెప్పమని సూరని అప్పగించారు. అతడు రోజు ఒక గంట సూరకి చదువు చెప్పేవాడు. మొదట్లో సరిగా సూర చదవలేదు. కేశవ రకరకాల శిక్షలు వేసి దారికి తెచ్చాడు.

చెన్నడికి ఉగాదికి ఊరికి వెళ్ళాలని గుబులు పుట్టింది. చెంద్రీతో చెబితే రంకు కట్టింది. ఇంతలో చెన్నుడి చెల్లెలు రంగమ్మ  చీకటిగూడెం నుండి వచ్చింది. అన్న చెల్లెళ్ళు ఊరి కబుర్లు చెప్పుకుంటున్నారు. చెంద్రి రంగిని తిట్టుకుంటు తన పని తాను చేసుకుంటుంది. రంగి వ్యక్తిత్వం మంచిది కాదు. భర్తను వదిలివేసి ఊళ్ళో ఇష్టమొచ్చినట్లు తిరిగేది. నాగిరెడ్డి ఖాసిం తమ్ముడు బురాన్, కాశిరెడ్డి పట్నం పనిమీద వచ్చారు. లాడ్జిలో ఎందుకని చెన్నడి గుడిసెను ఎదుక్కుంటు వచ్చారు. చెంద్రీ, రంగితో మాట్లాడుతుంటే  చెన్నడు వచ్చాడు.. చెన్నడు ఊరి సంగతులు కనుక్కొని రాత్రికి వంటలు తయారు చేయించాడు. బురాన్ తెచ్చిన మందు అందరు  త్రాగి తిన్నారు. నాగిరెడ్డి మాత్రం రంగి గుడిసెలో దూరి రాత్రంతా రంగితో గడిపాడు. కాశిరెడ్డి కన్ను చెంద్రిపై పడింది. వెళ్ళేముందు సూరని చదువు సంగతి విచారించారు. కాశిరెడ్డి సూరకు దేవరకొండలో చదువు చెప్పించి, హాస్టల్‌లో చేర్పిస్తానని తీసుకువెళ్ళి, ఇంట్లో పనులు చేయించుకునేందుకు పథకం వేశాడు కాశిరెడ్డి. మేం కూడ దేవరకొండకు వచ్చి హాస్టలు, బడి చూసి చేర్పించి వస్తామని చెన్నడు, చెంద్రికూడా బయలుదేరారు.

కాశిరెడ్డికి సంపాదన లేదు. వాళ్ళని వీళ్ళని మోసం చేసి పూట గడుపుకుంటాడు. అయినా భార్య జానకమ్మ (నాగిరెడ్డి చెల్లెలు) నా తలరాతని సర్దుకు పోతుంది. సూరని బడిలో చేర్పించి, చెంద్రీ వాళ్ళు పట్నం వెళతారు. కాశిరెడ్డి ఇంట్లో జరుగుబాటు లేక సూరని హాస్టల్‌లోనే ఉంచాడు. కాశిరెడ్డి సరదాలకు ఆస్తి హరించుకుపోయింది. జానకమ్మకు ఇంట్లో కూడ ఇబ్బందిగా ఉంది. ఈ విషయం గమనించిన సూర హాస్టల్ నుండి జానకమ్మకి అన్నం తీసుకువచ్చాడు. ఆమె సూరని గుండెలకత్తుకోని ఏడ్చింది. సూర ఆమెను ఓదార్చాడు. బడిలో లెక్కలు సార్ తన దగ్గరకు ట్యూషన్‌కి రాని పిల్లలను కొడుతుండేవాడు. సూర హాస్టల్‌లో పిల్లల స్నేహంతో సినిమాలకి వెళ్ళడం ఆదివారం సరదాగా బయట తిరుగటం అలవాటయింది. దసరా సెలవులకి కాశిరెడ్డి సూరని పట్నం తీసుకెళ్ళాడు.

చెంద్రీకి చెన్నడికి దేవరకొండ హాస్టల్‌లో ప్రభుత్వఉద్యోగమని ఆశజూపాడు. చెన్నడు ఊళ్లో పొలం అమ్మి ప్రభుత్వ కొలువు సంపాదించాలనుకున్నారు. ఉగాదికి ఊరికి వచ్చారు. చెంద్రీ తన సహవాసగత్తెలతో పట్నం గురించి మాట్లాడుతుంటే చాటుగా వినిన యారాలు గోల్కొండ, చార్మినార్ కథల గురించి అసూయ పడింది. స్నేహితులు కళమ్మ చంద్రయ్యను లేవదీసుకుపోయిందని చెప్పారు. తర్వాత నాగిరెడ్డి వాళ్ళను వెదికి, తీసుకువచ్చి కళమ్మను నానా చిత్రహింసలు పెట్టి ఊరినుండి వెళ్ళగొట్టిన విషయాలు చెప్పారు. పొలం అమ్మడానికి చెన్నడు వాటా విషయం నాగిరెడ్డికి చెప్పాడు. చెన్నడు అన్న పెద్దులు పటేలు మద్దతుతో తక్కువ ధరకు చెన్నడి అమ్మే పొలం కొనుక్కున్నాడు. చెంద్రీ దంపతులు వచ్చిన డబ్బులు

తీసుకోనివెళ్ళి దేవరకొండలో కాశిరెడ్డి చేతిలో పెట్టారు. కాశిరెడ్డికి వెతకబోయిన తీగ కాలికి తగిలినట్లయింది. చెన్నడికి బాగా బ్రాందీ త్రాగించి, కాశిరెడ్డి చెంద్రీ మీద అత్యాచారం చేశాడు. ఆ విషయం ఎవ్వరికి చెప్పలేక పొద్దున్నే హాస్టల్‌కి వెళ్ళి కొడుకు సూరనితో మాట్లాడుతుంది. చెంద్రిని వెతుక్కుంటూ సూరని  దగ్గరకి వచ్చిన చెన్నడు తనకు చెప్పాపెట్టకుండా వచ్చినందుకు ఆమెను తిడతాడు.

కాశిరెడ్డి ఇద్దర్ని హాస్టల్‌ల్లో టెంపరరీగా ఉద్యోగాల్లో చేర్పించాడు. కాశిరెడ్డి ఇంక అనేక మంది దగ్గర ఇలాగే డబ్బు వసూలు చేసి, తాను కొలువులో చోటు దక్కించుకున్నాడు. కాశిరెడ్డి మోసం అర్థమై చెన్నడు డబ్బుల కోసం నిలదీసే సరికి, ఉన్నప్పుడు ఇస్తానని చెప్పాడు. ఇక అక్కడ ఉండలేక ఊరికి తిరిగి వచ్చేశారు. ఈ  విషయం ఊళ్లో అందరికి తెలిసింది. పెళ్ళాం మాటలు  విని మా తమ్ముడు ఇలా తయారయ్యాడని అన్న 'పెద్దులు' అంటే వదిన రోషమ్మ నవ్వుకుంది. చెన్న, చెంద్రీలు బాధలను మర్చిపోయి పనులకు వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు. 3 సం॥ల తర్వాత సూర ఊరికి వచ్చాడు. చెన్నడు దిగులతో తాగుడికి బానిసయ్యాడు. జబ్బున పడ్డాడు. దానికి తోడు నడుము నొప్పి, ఎన్ని మందులు వాడిన తగ్గలేదు. ఊళ్ళో ముత్యాలమ్మ గుడి దగ్గర బంటు మల్లమ్మ (దేవుడమ్మ) పేరుతో పూజలు చేస్తుంది. చెన్నుడిని పిలిచి నరదిష్టి ఉందని పూజలు చేయాలని ఉన్నవి లేనివి చెప్పింది. ఏమి భయం లేదు నేను ఉన్నానని చెప్పింది. చెన్నడు అలాగే అన్నాడు. సూరకి తల్లిదండ్రుల మూఢనమ్మకాలు నచ్చలేదు. నచ్చచెబితే వినరని అక్కడ ఉండలేక కాలేజీకి వెళ్లిపోయాడు. చదువుల కోసం డబ్బులు  కావాలని ఇంటికి ఉత్తరం రాశాడు. కానీ తల్లిదండ్రులు డబ్బులు పంపలేదు.

కానీ సూర చదువు అయిపోయినాక (స్కూల్ చదువు) ఇస్మాయిల్‌తో హైదరాబాద్ పోయి, రిక్షాతొక్కి హోటల్‌లో పనిచేసి, దేవరకొండకు వచ్చి రూం తీసుకున్నాడు. అక్కణ్నించి ఊళ్ళో ఇంటికి వెళ్ళాడు. చెంద్రీ తోడి కోడళ్ళతో తగువు పెట్టుకుంటుంది. తండ్రి తాగి మత్తులో ఉన్నాడు. ఉత్తరం రాస్తే డబ్బులు పంపలేదని తండ్రిని అడిగాడు. చదువు ఆపమని అన్నాడు. చెంద్రీ చిన్నమ్మ వాళ్ళ ఊరికి వెళ్ళి డబ్బులు తీసుకురమ్మని పంపింది. ఊరి బస్టాండ్ దగ్గర అందరు దొరకి గౌరవంగా దండం పెడుతున్నారు. సూర పెట్టలేదు. ఖాసీమ్ వచ్చి దొరకు నమస్కరించి గౌరవించమని చెప్పాడు. పట్నంలో ఇలాంటివి ఏమి లేవని నేను అలాంటి మర్యాద ఇవ్వనని చెప్పాడు. చిన్నమ్మ ఊరికి వెళ్ళాడు. రాత్రికి భోజనం చేసి, పరందామయ్య తాతతో తమ పూర్వికుల పురాణాల గురించి చెప్పించుకున్నాడు. చిన్నమ్మ డబ్బులు లేవు బియ్యం తీసుకు వెళ్లమని ఇచ్చింది. వెళ్ళే ముందు తాత అంత్రం, తంత్రం ఏమి లేవని నమ్మకమే అన్నింటికి మందని చెప్పాడు.

చెన్నడికి వెన్నునొప్పితో పాటు కడుపునొప్పి మొదలైంది. దేవుడమ్మ దగ్గరకు వెళ్ళితే దగ్గరి వాళ్ళు చేతబడి చేయించారని చెప్పింది. చెంద్రీ యారాలు మీద అనుమానంతో తగువు పెట్టుకుంటుంది. దొర వారికి సర్ది చెప్పి ఇంక తగాదాలు ముందుగా ఎవరు పెట్టుకుంటారో వాళ్ళు వెయ్యి రూపాయలు పంచాయతీకి కట్టాలని కాగితాలు రాయించాడు. సూర ఇంటికి వచ్చి అమ్మతో చిన్నమ్మ డబ్బులు ఇవ్వలేదని చెప్పాడు. సూరని చదువుమాని అయ్యకు ఆసరాగా ఉండమని చెంద్రి చెప్పింది. కానీ సూర చదువుకోవటమే ముఖ్యమని అంటాడు. అయ్యకు ఆసరాగా ఏదో ఒక కూలిపని చేసుకోమనే తల్లి సూచనను తిరస్కరించాడు. అప్పటికప్పుడు దేవరకొండకు వెళ్లిపోతానని సూరడు అంటాడు. ఊరికి కీడుపట్టిందని, ఊళ్లోవాళ్లంతా వనవాసం చేస్తున్నారు కాబట్టి రెండు రోజులు ఉండిపొమ్మని బతిమాలింది చెంద్రి. అయిష్టంగానే సూరడు రెండు రోజులు ఊళ్లో ఉన్నాడు.

ఆ తర్వాత దేవరకొండకు వెళ్లి, కాలేజీలో ఇంటర్మీడియెట్ చేరాడు. దేవరకొండ జూనియర్ కాలేజీలోనే ఊరి దొర బిడ్డ జయలక్ష్మిని చేర్పించడానికి, కాశిరెడ్డి భార్య జానకమ్మ అక్కడికి వస్తుంది. కాలేజీలో కన్పించిన జానకమ్మను సూరడు పలకరిస్తాడు. జయలక్ష్మిని సూరనికి పరిచయం చేసింది జానకమ్మ. సూరడు ఎలా చదివిందీ, ఎన్ని కష్టాలు పడిందీ జానకమ్మకు బాగా తెలుసు. సూరని ప్రవర్తన, మాటతీరు నచ్చిన జయలక్ష్మి సూరని వృత్తాంతం జానకమ్మను అడిగి తెలుసుకుంది. సూరని వ్యక్తిత్వం తెలుసుకున్న జయలక్ష్మి అతనిపై మనసుపడుతుంది. కాలేజీలో సూర ఎదురుపడినప్పుడు చనువుగా మాట్లాడాలని ప్రయత్నిస్తుంది. సూరడు ఆమె అంతరంగం అర్థం చేసుకున్నాడు. కానీ కులాలు వేరు. ఊరి దొరబిడ్డతో ప్రేమ వ్యవహారాలు ప్రమాదమని సూరనికి తెలుసు. అందుకే, జయలక్ష్మీ కంటపడినప్పుడు కావాలని తప్పించుకు తిరిగేవాడు. అయితే, జయలక్ష్మీ మాత్రం పట్టుదల చూపించేది. సూరడు కిరాయికి వుంటున్న రూంకి ఆహ్వానించకుండానే ఆమె వెళ్లేది. జానకమ్మ సూరని పట్ల ఔదార్యం చూపేది. పగలు కాలేజీకి వెళ్లి, రాత్రిపూట ఏదోపనికి వెళ్లేవాడు. ఈ విషయం గమనించిన జానకమ్మ డబ్బులు పంపేది. కానీ సూరడు ఆత్మాభిమానంతో తీసుకొనేవాడు కాదు. సూరడి ఆత్మాభిమానం జయలక్ష్మిని మరింత ఆలోచనకు గురిచేసింది. ఆమెలో ప్రేమ పెరిగింది. కానీ ఆ విషయం సూరనికి చెప్తే కోపగిస్తాడని ఆమె ప్రేమను వ్యక్తం చేయలేదు. సూర కష్టాలు భరించి చదువు పూర్తి చేస్తాడు. తన చదువు పెరిగిన కొద్దీ విజ్ఞాన దృష్టి పెరిగింది. గ్రామీణుల్లో గూడుకట్టుకున్న మూఢనమ్మకాల పట్ల శాస్త్రీయమైన విమర్శ అలవడింది.

దేవరకొండ, హైదరాబాదు ప్రాంతాల్లో చాలాకాలం గడిపిన సూరడు తిరిగి సొంత వూరికి వచ్చాడు. అవిద్య, అజ్ఞానంతో వున్న తన గ్రామస్తులకు రాత్రిబడి మొదలుపెట్టాలనుకుంటాడు. నిజానికి సూరడు చదువుకోవడం నాగిరెడ్డికీ, దొరకు ఇష్టం లేదు. ఏదోఒక రోజు సూరని మీద అఘాయిత్యం చేయాలని వాళ్లు నిర్ణయించుకొనే వున్నారు. అలాంటి పరిస్థితిలో సూరడు ఏకంగా రాత్రిబడి తెరిచాడు. ఇది మరీ కోపం తెప్పించింది. అయితే, జయలక్ష్మికి సూరడు ఊళ్లోకి వచ్చిన విషయం తెల్సింది. ఆమె మాలపల్లెకు రోజూ వచ్చి సూరన్ని కలిసి వెళ్తుంటుంది. ఈ సంగతి తెల్సిన నాగిరెడ్డి దొరకు విషయం చేరవేస్తాడు. జయలక్ష్మి దొరబిడ్డ కాబట్టి జాగ్రత్త తీసుకొమ్మని చెప్తాడు. జయలక్ష్మిని దొర మందలించినా వినలేదు. సూరన్ని కలిసి తండ్రి బెదిరింపుల గురించి చెప్పి తనను పెండ్లి చేసుకోమని అడుగుతుంది. అప్పుడే పెళ్లికి తొందరేముందని సూరడు దాటేస్తాడు.

కానీ నాగిరెడ్డి, దొర సూరని చంపాలని పథకం వేశారు. కోటముందు నాటకం ఏర్పాటు చేస్తారు. నాటకం చూడ్డానికి అన్ని కులాలవాళ్లు వస్తారు. అక్కడికి సూరడు రాగానే పథకం ప్రకారం దాడి చేయిస్తారు. సూరన్ని కొడుతుంటే తల్లి చెంద్రి అడ్డుపడి దెబ్బలపాలైన కొడుకుని ఇంటికి తీసుకెళ్తుంది. ఈ సంఘటనతో మాల, మాదిగలు ఏకమయ్యారు. దొర కోటమీదికి దాడికి వెళ్లారు. దొర కూతురు జయలక్ష్మిని ఒకచోట దాచిపెట్టి పారిపోతాడు. ఈ దాడి జయలక్ష్మి వల్లే జరిగిందని ఆమెను అందరూ తిడుతుంటారు. కానీ ఆమె వచ్చి తనను పెళ్లి చేసుకోమని సూరని అడుగుతుంది. సూరడు కూడా అంగీకరిస్తాడు.

ఇద్దరూ హైదరాబాదులో పెళ్లి చేసుకుంటారు. పట్నంలో కాపురం పెడుతారు. సూర బతుకుదెరువు కోసం రిక్షా తొక్కుతుంటాడు. అయితే, చదువుకున్న నువ్వు రిక్షా తొక్కడం ఏంటి? స్కూలులో టీచరుగా పనిచేయమని జయలక్ష్మి భర్తకు సలహా ఇస్తుంది. దీంతో ఇద్దరూ స్కూళ్లో టీచర్లుగా పని చేస్తూనే చదువుకుంటారు. అయితే, తండ్రి చెన్నడు చనిపోతాడు. తండ్రి అంత్యక్రియలు పూర్తి చేసి ఊళ్లో వుండాలని నిర్ణయించుకుంటాడు. కానీ భార్య, తల్లి మాత్రం పట్నం వెళ్లిపోవాలని పట్టుపడతారు. సూరడు తన పట్టుదల విడువడు. వూళ్లో

'పూలే, అంబేద్కర్' పాఠశాల తెరుస్తాడు. మాలమాదిగలందరూ సూరడికి అండగా నిలుస్తారు. మూఢనమ్మకాలతో కుదేలైన వూరిని సమూలంగా మార్చాలన్నది అతని లక్ష్యం.

ఒకరోజు గౌండ్ల వెంకన్న కొడుకు సాయిలు బట్టలు చింపుకుంటు పరుగెత్తుతున్నాడు. సాయిలకు ఎవరో మంత్రాలు చేశారని జనం చెప్పుకుంటున్నారు. దేవునమ్మ వచ్చి మంత్రించి నోటిలో బండారు వేసి వెళ్ళింది. సూర వచ్చి సాయిని చూస్తే జ్వరమొచ్చింది. ఆసుపత్రికి తీసుకువెళ్ళమనగా సూరని తోడు రమ్మన్నారు. అప్పుడు బైండ్లరాములు ఎదురుగా వచ్చాడు. వాడి మీద వెంకడుతో ఊరి జనం దాడి చేయించి చెట్టుకు కట్టేసి కొట్టసాగారు. వారిని అడ్డం తీయడానికి సూర ప్రయత్నం చేస్తే ముందు వీడ్ని వేయండిరా బాగా పెద్దరికం చేస్తున్నాడన్నారు. సూర వారిని ఆపి మంత్రాలు, దెయ్యాలు లేవని, ఒక వేళ ఉంటే అవి నాకు చెయ్యమని చెప్పాడు. డాక్టర్ దగ్గరకు తీసుకుపోదాం అక్కడ తక్కువ కాకపోతే అప్పుడు ఈ రాములుని మీకు ఇష్టం వచ్చినట్టు చెయ్యండి. ఆసుపత్రికి తీసుకు వెళితే డాక్టర్ పరీక్షలు చేసి టైఫాయిడ్ జ్వరమని చెప్పాడు. సమయానికి తీసుకురాకపోతే చనిపోయేవాడని చెప్పాడు. సాయిలుకి తగ్గుముఖం పట్టిందని బైండ్ల రామన్నను విడిచిపెట్టారు. రాములు సూర కాళ్ళు పట్టుకోని దు:ఖించాడు. 10 రోజుల తరువాత సాయిని ఆసుపత్రినుండి ఊరికి తీసుకు వచ్చారు. జ్వరం తగ్గుముఖం పట్టింది. ఊర్లో జనం సూర చెప్పినట్లు వినాలని తీర్మానం చేశారు. సూర వాళ్ళతో మూఢనమ్మకాలు కుల, మతాలు  పోయేలా పోరాటం చేస్తామని ప్రమాణం చేయించాడు.

బైండ్ల పాపడు శక్తులు వస్తాయని నాల్గు రోడ్లు కలిసే దగ్గర ముగ్గువేసి, మనిషి బొమ్మ చేసి  పూజలు చేశాడు. పొద్దున్నే సాకలి వీరడు దాన్ని చూసి భయపడ్డాడు. పాపడుని జనం పట్టుకొని కట్టేసి పళ్ళు ఊడగొట్టారు. ఇది తెలిసిన సూరడికి ఏమిచేయాలో పాలు పోలేదు. దెబ్బలకు బయపడిన పాపడు తనకు మంత్రాలు వస్తాయని, పూజల విషయాన్ని ఒప్పుకున్నాడు. జనానికి సూరడు ఎంత నచ్చ చెప్పిన వినకుండా, నీ పని నీవు చూసుకొమ్మన్నారు. ఊరిలో కొన్ని కట్టుబాట్లు ఉంటాయి. ఇక్కడి మంచి చెడు గురించి నీకు తెలియదు. ఇబ్బంది పడకు అని సూరనికి చెప్పారు. జయ సూరనితో ఊరు మన మాట వినదు. 'నీవు మీ అమ్మ మాట, నామాట కూడ వినవు. ఇప్పుడు చూడు ఏమైందో' అని రుసరుసలాడింది. అప్పుడు సూరడు ఒక పని పూర్తి చేయడానికి నిరీక్షణ, ఓపిక ఉండాలని చెప్పాడు. అవి సరే నీ ఇష్టం మనకు ఏమి కాకుండా ఉంటే చాలు అంది. దానికి సూర అలా అనుకుంటే మనకి జంతువులకు తేడా ఏముంటుంది. చంద్రుడు గ్రహమని మనిషి విజ్ఞానంతో నిరూపించాడు. అలాగే వీళ్ళ నమ్మకాలు తప్పని మనం నిరూపించాలని చెప్పాడు. అయితే నీ ఇష్టమని జయ నిట్టూర్చింది.

నాగిరెడ్డి అందర్ని మోసం చేసి, బ్యాంక్ ఆఫీసర్లకు డబ్బులిచ్చి పొలాల మీద లోనులు తీసుకున్నాడు. ఈ విధంగా నాయకుడిగా ఎదిగి సర్పంచ్ అయ్యాడు. బ్యాంకు వాళ్ళు లోనులు తీసుకున్నవాళ్ళకి నోటీసులు పంపారు.  రైతులకు నోటీసులిచ్చే వరకు లోనుల విషయం తెలియలేదు. అడగడానికి వెళ్ళిన వారిమీదే పోలీస్ కేసులు పెట్టించి, కొట్టించేవాడు. ఆ నోటీసులకు నాగిరెడ్డికి సంబంధంలేదని రాయించుకునేవాడు. ఈ విధంగానే  గరీబును కొట్టించినందుకు వాడు కక్ష పెట్టుకున్నాడు. నాగిరెడ్డి సూరడ్ని చంపడానికి పథకం ప్రకారం దేశగురువును ఊళ్ళోకి తీసుకు వచ్చాడు. దేశ గురువు గూర్చి నాగిరెడ్డి గొప్పగా చెప్పాడు. అతడు రాత్రుళ్లు భజనలు చేయించాడు. ఆ భజనలకి మాలలు కూడ వెళ్ళారు. పూనకం నాటక ఆడించి మాలల వల్ల గుడి మైలపడిందని, గుడిని శుద్ధి చేయాలని సుదరోళ్ళ ఆమెతో చెప్పించారు. దాంతో మాలలు వెనక్కి వచ్చి జరిగిన సంగతి సూరనికి చెప్పారు. దానికి సూరడు వాళ్ళు మనల్ని కలుపుకోరని చెప్పాడు.

ఊళ్లో బొడ్రాయి వేస్తున్నట్లు చాటింపు వేశారు. ఈ ఊరు వాళ్ళు బయటికి, బయట ఊరి వాళ్ళు ఊళ్లోకి రావడానికి వీలులేదు. పొలిమేర మీద కాపలా కాయాలని చాటింపు వేశారు. బొడ్రాయి వేస్తే ఊరికి మంచిదని దేశగురువు చెప్పాడు. సూరని చంపడానికి బొడ్రాయి ప్రతిష్ఠ సమయాన్ని ఉపయోగించుకోవాలని నాగిరెడ్డి తన మనుషుల్ని సిద్ధం చేశాడు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఊరంతా భయంతో వణికిపోతుంది. పూనకంతో పూజలు చేస్తున్న జనానికి ఎలా చెప్పాలో సూరనికి అర్థం కాలేదు. బొడ్రాయి సంబరంలో డప్పుల మోత ఊరంతా మోగుతుంది. సూరని ఇంటి మీదకి వెళ్ళి దాడి చేశారు. జయ అరుపులు డప్పుల మోతలో కలసిపోయాయి. సూర ఒక్కడే పోరాడుతున్నాడు. జయ జనంలోకి వెళ్ళి సూరడ్ని చావగొడుతున్నారని చెప్పింది. కొంతమంది సూరడ్ని రక్షించడానికి వెళ్ళారు. రక్తం మగుడులో పడిఉన్న సూరడ్ని ఆసుపత్రికి తీసుకెళ్ళారు. నాగిరెడ్డి మీసాలు మెలేశాడు. గారీబుకు విషయం తెలిసి పండగ సంబరంలోఉన్న నాడిరెడ్డిని ఊరిలో మరెవ్వడు మోసపోకూడదని ఆలోచించి మసక చీకటిలో నాగిరెడ్డిని కసిదీర చంపి అదే రాత్రి పోలీసులకు లొంగిపోయాడు. కాటేసిన కాలానికి ఎదురు తిరిగి సమ్మతి చేశాడు గరీబు. జనం అంతా భయంతో వెళ్ళి పోయారు. నాగిరెడ్డి శవం అనాథలాగ మిగిలింది. నాగిరెడ్డి చావు కళ్లారా చూసిన దేశగురువు తోక ముడిచాడు. పండగ పీడ సూరని మీద పోతుంది అనుకుంటే వీడి మీదకి తిరిగిందని జనంలో ఎవరో అన్నారు. ఆసుపత్రిలో సూరడికి, నాగిరెడ్డిని గరీబు చంపాడని తెలిసి మదిలో వాడికి దండం పెట్టుకున్నాడు. అప్పుడప్పుడు ఎవరో ఒకరు త్యాగం చేయాలి లేకుంటే మనుగడ ఉండదనుకున్నాడు సూరడు. ఇది సూరలో స్థూలంగా కథ. ఇందులో ఇంకా అనేక ఉపకథలు ఉన్నాయి. కళమ్మ, చెంద్రం లేచిపోయిన కథ, ఉగ్రగిరిపాత్ర, బస్సు కండెక్టర్ యాదయ్య, రాంబాబు సార్‌లు, జయమ్మ పటేల్ గురించి చెప్పిన ఉపకథలు ఆసక్తికరంగా ఉన్నాయి.

**2. 2. 3. సూర పాత్రల విశ్లేషణ:**

సూర నవలలో దళితులు చదువుకోని సమాజంలోని రుగ్మతల నిర్మూలనకు కృషి చేయాలని రచయిత తెలియజేశారు. అప్పుడప్పుడు ఎవరో ఒకరు త్యాగం చేయాలని లేకుంటే మనిషి మనుగడ ఉండదని చెప్పారు. ఈ నవలలో పనుల కోసం పట్నం వలస వెళ్ళి వారు జీవిస్తున్న స్థలాలను ఆక్రమించుకోవడం, దళిత స్త్రీలమీద అత్యాచారం చేయడం, అగ్రవర్ణ స్త్రీలు ఇష్టపడి దళితులతో వెళ్ళిపోయినా వారిని వెదుక్కొని తీసుకు వచ్చి క్రూరంగా శిక్షించడం కనిపిస్తుంది. దళితులను ఉద్యోగాలపేరుతో, బ్యాంకులోనుల పేరుతో మోసం చేసి నాయకులుగా ఎదిగి పబ్బం గడుపుకుంటున్న క్రమాన్ని రచయిత తెలియ జేశారు. త్రాగుడికి బానిసై రోగాల బారినపడి, ఆసుపత్రికి వెళ్ళకుండా పూజలు, అంత్రాలు, మంత్రాలు చేయించుకుంటూ వారి మాటలకు మోసపోయి ప్రక్కవారితో తగాదాలు పెట్టుకుంటూ ఐక్యత లేకుండా పోట్లాడుకుంటున్న వైనాన్ని చిత్రించారు. ఇంకా చేతబడులు, మందులు కక్కించడం, నాటకాలు పేరుతో బొడ్రాయి ప్రతిష్ట మొదలగు విషయాలతో దళితుల మీద దాడులు చేసి హతమార్చాలని పథకాలు వేయడం, ఊరంతా ఐక్యంగా ఉన్న సమయంలో కుల,మత సంబంధాల పేరుతో కింది కులాలను వేరు చేయడం కనిపిస్తుంది.

**చెన్నడు:**

నవల ఈపాత్రతో మొదలవుతుంది. నల్గొండ జిల్లా చీకటి గూడెం నుండి హైదరాబాద్‌కి భార్యపిల్లలతో వలస కూలీగా వెళతాడు. అక్కడ రిక్షాకార్మికుడిగా జీవనం కొనసాగిస్తూ ఒక్కగానొక్క కొడుకును బడికి పంపిస్తూ ఉంటాడు. కాయకష్టం చేస్తాడు కానీ అమాయకుడు. అందరి చేతుల్లో మోసపోతుంటాడు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఉన్న పొలం అమ్మి కాశిరెడ్డి

చేతుల్లో డబ్బు పోస్తాడు. కాశిరెడ్డి చెన్నడికి ఫుల్‌గా త్రాగించి అతడి భార్యపై అత్యాచారం చేస్తాడు. ఆమె ఆ విషయం భర్తకు చెప్పదు. అక్కడ ఉండలేక చీకటి గూడెం వస్తారు. డబ్బు ఉద్యోగ విషయంలో మోసపోయినందుకు త్రాగుడికి బానిసై ఒళ్ళు హూనం చేసుకుంటాడు. ఆసుపత్రికి వెళ్ళకుండా దేవుడమ్మ దగ్గరకు వెళ్ళితే ఆమె దగ్గరివాళ్ళు మందుపెట్టారని, చేతబడి చేశారని చెబుతుంది. పూజలకు ఖర్చులు చూచి పెట్టుకొమ్మని చెబుతుంది.

సూరనికి అమ్మయ్య పీక్లాటకు, మూఢనమ్మకాలకు ఇంటికి రాబుద్ధికాక డబ్బులు పంపించమని ఇంటికి కార్డు వేశాడు. “కారటందుక్కన్న చెన్నడు అండ్ల ఉన్న ఇసయం తెల్సుకొని ఓపక్క ఇల్లు గడ్సక ఇబ్బంది పడ్తుంటే ఈన్కి పైసలు గావాల్నట పైసలు! సద్వి ఎవన్ని ఉద్ధరిస్తడట!” (పు. 46) అని కోపంతో చెంద్రీ మీద చిందులు తొక్కాడు. అందుకు చెంద్రీ ఇంత కోపమెందుకు వాడ్ని ఇంటికి రమ్మని పిలువమని చెప్పింది. కానీ “అసె ఆన్కి చెప్పంప, కారటెయ్య, తీటపాస్కుంట ఆడే ఉర్కోత్తడు” (పు. 46) అనుకుంట బైటికి వెళ్ళిపోయాడు. ఈక్రమంలో చెన్నడు చదువుకుంటున్న తన కొడుకు సూరని చదువు మానెయ్యమని చెబుతుంటాడు. అమాయకమైన ఈపాత్ర మొదటి తరానికి చెందినదిగా చిత్రీకరించబడింది.

<u>**చెంద్రి:**</u>

చెన్నడి భార్య, సూరని తల్లి. నోరు కలిగిన పాత్ర. పట్నం వలసపోయి కొడుకును చదివించడానికి తాపత్రయ పడుతుంది. కొడుకును హాస్టల్లో చేర్పించి చదివించుకుంటుంది. పాలివాళ్ళతో గొడవలు పెట్టుకుంటుంది. అమాయకుడైన భర్తకు తోడుగా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగానికి ఆశపడి “ఏమయ్య ఎట్లన్న జేసి కొల్వుల ఇర్కాలే అదృష్టం ఎత్కుంట మన గన్మతట్టింది. ఒక్కొక్కలు కొల్వులకు ఎంత తిప్పలు పడ్తరో సూస్తంలేం. పది కదు ఇరవై పోని అది దొరికితే సాల్గాని. చెనని చెవుల జోరీగలెక్క జొరవడదడి చెంద్రి” (పు. 33). పొలం అమ్మలంటే చెన్నడికి మనస్సు ఒప్పడం లేదు. “చెంద్రి పోరెక్వయింది. దొర, పటేలు, పెద్దమన్సులు గూడ చేతులెత్తెసిద్రు. దెష్టమ్మోరు నెత్తిన గూకొని ఉన్న శెల్కకు ఎంతకో అంతకు అని చెంద్రి అమ్మిచ్చింది” (పు. 41) భర్తతో పొలం అమ్మిచ్చి కాశిరెడ్డికి డబ్బులు ముట్ట చెబుతుంది. తన మీద కాశిరెడ్డి కన్ను పడిందని తెలియక అమాయకంగా అత్యాచారానికి గురి అవుతుంది. ఎవరికి చెప్పాలో తెలియక మదన పడి భర్తతో సొంత ఊరికి చేరి కష్టపడి బతుకుతుంది.

త్రాగుడికి బానిసైన తన భర్త రోగాలతో బాధ పడినప్పుడు దేవుడమ్మ చెప్పిన మాటలు నమ్మి, పాలి వాళ్ళతో గొడవ పెట్టుకుంటుంది. మూఢ నమ్మకాలను భర్తతో పాటు తాను నమ్ముతుంది. భర్త మరణం తర్వాత కొడుకు సూర దొరబిడ్డను పెళ్ళిచేసుకున్నాడు. తండ్రి చావువార్త తెలిసి ఊర్లోకి వచ్చాడు. ఊర్లోనే ఉండిపోవాలని తీర్మానించుకున్నాడు. దాంతో “చెంద్రికి బుగులు పట్టింది కొడ్కు ఇడ ఉంటె ఎప్పుడొచ్చి యిమునొల్లవెక్క మీద పడ్తరోనని. అరే సూర నువ్ మట్కు ఈడ ఉండకురా, నా బతుకు ఏనన్న తెల్లార్తది గాని” (పు. 76) అని భయపడి, కొడుకుని ఊరిలో ఉండవద్దని పట్నం వెళ్ళి బతకమని చెబుతుంది. తడి బట్టలతో గొంతులు కోసే కులాల్ని నమ్మవద్దని కొడుకును హెచ్చరిస్తుంది.

<u>**సూర:**</u>

చెన్న, చెంద్రమ్మల కొడుకు. పట్నం వలస పోయినప్పుడు మామ కేశవరావు చెప్పిన చదువుతో దారిన పడ్డాడు. కాశిరెడ్డి దేవర కొండ తీసుకుని వెళ్ళి బడిలో, హాస్టల్లో చేర్పిస్తాడు. కొన్నాళ్ళు కాశిరెడ్డి ఇంట్లోనే ఉండి బడికి వెళతాడు. కాశిరెడ్డి భార్య జానకమ్మ అభిమానానికి పాత్రుడు అవుతాడు. తన తల్లి దండ్రులను ఉద్యోగం పేరుతో కాశిరెడ్డి మోసం చేసినప్పటకీ, జానకమ్మతో ఆప్యాయంగా ఉంటాడు. చిన్న తనంలో అల్లరిగా తిరిగినా చదువు విలువ తెలుసుకుని తండ్రి డబ్బులు పంపించక పోయినా సెలవుల్లో పట్నం వెళ్ళి హొటల్లో పనిచేస్తూ,

రిక్షా తొక్కి డబ్బులు సంపాదించుకుని చదువుకుంటూ ఉంటాడు.

సూర చిన్నమ్మ దగ్గరకు వెళ్తూ బస్టాప్‌లో కూర్చున్నాడు. దొర నాగిరెడ్డి పటేలును చూసి లేవమని ఖాసిం సూరని అడిగితే పట్నంలో ఇలాంటి మర్యాదలు లేవని చెప్పాడు. కనగండ్లలో చిన్నమ్మ ఇంట్లో పరంధామయ్య తాత దగ్గర సృష్టి క్రమం, త్రిమూర్తుల పుట్టక, అరుంధతి, జాంబవంతుడు, చెన్నా పురాణం గూర్చి వివరంగా తెలుసుకున్నాడు. మాలల ఆశ్రిత కులాలు, గుర్రం మల్లయ్య మొదలగు విషయాలు తెలుసుకున్నాడు. సూర పరంధామయ్య తాత చెప్పిన విషయాలు విని ఈవన్ని నిజమేనా అని అడిగాడు "ఓ మనవడా ఏది నిజం, ఏది సతైం, ఎవడు సూపిండు ఏవడు సేర్పిండు..... అంతా కనికటే కథలేనాయె తాత చెప్తుండు, ఇగో మన్వడా గా బాపనోడు దక్కలోన్కి అద్కతిండటమరి. ఔ సూర, నీకు సత్తెం కావాల్నంటె చిందుగోసం గేషం గట్నప్పుడు చూడు నీకు తెల్సుద్ది" (పు. 56) అని సూరకు వివరించాడు. మంత్రాలు, తంత్రాలు వట్టివని నమ్మకం ఉంటే అన్ని తగ్గుతాయని చెప్పాడు.

ఇంటికి సూర ఎప్పుడు వచ్చిన అమ్మ పెద్దమ్మ వాళ్ళతో గొడవ పెట్టుకుంటుంది. తండ్రి తాగి పడిపోయి ఉంటాడు. ఇక ఇక్కడికి ఎప్పుడూ రాకుడదు అని అనుకుని కాలేజికి వెళ్ళిపోతాడు. కాలేజిలో మొదటి రోజు జానకమ్మతో దొర కూతురు జయలక్ష్మి వచ్చినప్పుడు ఆమెను పలకరిస్తాడు. జానకమ్మ దొరకూతురిని సూరనికి పరిచయం చేస్తుంది. జయలక్ష్మి సూరడి గురించి విని అతడంటే ప్రేమ పెంచుకుంటుంది. కాలేజిలో సూరనితో మాట్లాడాలని ప్రయత్నిస్తే సూర ఆమెతో ఎక్కువ మాట్లాడేవాడు కాదు. కాని ఆమె మాట్లాడుతుంటే ఇష్టంగా ఉండేది. సమయం తెలిసేది కాదు.

మందు కక్కించడం గురించి స్నేహితులతో చెబుతూ ఏదో చెట్టు పసరు చేతిలో పోసి అది గడ్డ కట్టగానే కడుపులో మందులున్నాయని నమ్మించింది. మా అయ్య "కక్క తాగిండు అట తాగిన గంటకు కడ్పుల గుడగుడలు మొదలైనై, నోట్ల ఇకారం అయ్యి నోటిగుంట, ముడ్డిగుంట దస్తులు జేస్కుండు,.... అండ్ల కోడిగుడ్డు ముక్కలు పడ్డయ్ అయి సూపిచ్చి ఇగ జూస్నావ్‌రా నేను జెప్పించి, నిజమని నమ్మిచ్చింది" (పు. 69) అని మిత్రులకు చెప్పాడు. మిత్రులు ఆశ్చర్యంతో అదెలా సాధ్యమని అడిగారు. చెట్టు పసరులో కోడిగుడ్డు ముక్కలు కల్పి తెలియకుండా తాగిస్తారు. అది తాగి విరోచనాలు అవుతాయి. దాంట్లో అవి బయట పడతాయని వివరించాడు. మిత్రులతో వెంకటేష్ ఊరికి వెళ్ళినప్పుడు బోనాల్లో శిగం ఊగడం ఎలా చేస్తారో, మందు పెట్టామని చెప్పి ఎలా కక్కిస్తారో మొదలగునవి మిత్రులకు చెప్పాడు. దేవుడు పేరుతో డబ్బులు ఎలా గుంజుతారో వివరిస్తాడు.

సూరడు సెలవులకి ఊరికి వచ్చి మాల, మాదిగల కుర్రోళ్ళకు చదువు చెప్పడం మొదలు పెట్టాడు. "సూరడు ఊల్యా మాల మాదిగల పోరల పోగుజేసి ఆళ్లకు నాతిటీల సద్వు నేర్చుకుంట, అంత ఒక తాటి మీద ఉండాల్నని రెండు గూడాలేకం జేయాలని చూసిండు. ఎప్పుడు అంటుంటె ఇనేదేగాని బల్లె సదువు ఆళ్లకు ఎర్కలే. ఎవరు చెప్పింది లేదు నేర్పింది లేదు సూరని జూస్న గుడిపోలందరూ అరె బిడ్డా మనూల్యా నువొక్కడివే గాడిన పడ్డ్వి. నీదారి నువ్ జూస్కోక మాకు నాల్గచ్చరాలు నేర్పుతంట్వి. నువ్ జెప్పినట్టే జేస్తం అని సూరని మాట ఇనసాగిరి. ఊల్యకు సూరడొచ్చిండని, మాపటీలి సద్వు నేర్పుతుండాని ఇసయం ఊరంత గుప్పుమంది" (పు. 71). సూరడు వచ్చిన విషయం తెలసి జయలక్ష్మి అతడ్ని రోజు కలిసేది. ఊళ్ళోవారు రకరకాలుగా మాట్లాడుకోసాగారు. నాగిరెడ్డి ఈవిషయం దొరకు చెప్పాడు. దొర జయను మందలిచ్చాడు కాని జయ పట్టించుకోలేదు. పెళ్ళి చేసుకుందాం నీదే ఆలస్యమని సూరనికి చెప్పింది. ఇప్పుడు వద్దని చెప్పాడు సూర.

ఊళ్ళో భాగవత నాటకం కోట ముందర జరుగుతుంటే అందరితో పాటు వెళ్ళిన

సూరని మీద నాగిరెడ్డి దాడి చేయించాడు. దాడి తర్వాత సూరడు జయను పెళ్ళి చేసుకుని పట్నం వెళ్ళిపోతారు. పట్నంలో కొన్ని రోజులు రిక్షా తొక్కి, స్కూల్లో టీచర్‌గా చేరి చదువు కొనసాగిస్తాడు. సూర తనతండ్రి చావు వార్త తెలిసి ఊరికి తిరిగి వస్తాడు. కర్మకాండలు పూర్తి అయిన తర్వాత ఊళ్ళో మార్పుకోసం ఇక్కడే బడిపెట్టి చదువు చెప్పాలని నిర్ణయించుకుంటాడు. దాంతో తల్లి చెంద్రికి భయం పట్టుకుంది. సూర ఇక్కడే ఉంటే నాగిరెడ్డి ఎప్పుడైననా దాడి చేసి ప్రాణాలు తీస్తాడని చెప్పింది. నేను ఎలాగో ఒక్కదాన్నే బతుకుతాను. మీరు పట్నం పొండి అని కొడుకును బతికిలాడింది.

అయినా సూర తల్లి, పెళ్ళాం మాట వినలేదు. "ఇట్ల భయపడ్కుంట బత్కేకంటె ఒక పాలి పాణమిడ్వడం మంచిది. అది కాదు సూరి సద్వుకున్నోళ్లంత పట్నాలు పడ్తుంటే నువిట్ల మొండికేస్తవేంది. అసలు ఈ ఊరోళ్లు గొర్రెసంటి మన్సులు. మనం జెప్పినా మనల్నే పిచ్చోల చేస్తరు. గిసోంటి కడ ఎట్టుంటయ్. జయ మనం పుట్టింది గీన్నే మర్సినాన్. సూరి నువెనన్న జెప్పు నాకు మట్కు ఇస్టంలేదూ. అది కదు జయా నువు ఇట్లంటే ఎట్ల నేననేది అమ్మకోస్రంగాదు, ఊరికోస్రం. మనసొంటి సద్వినోళ్లు అంతా పట్నాలల్ల మకాం బెడ్తే ఎప్పుడు, ఎన్నేండ్లు గడ్సినా ఊరు గింతే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉంటది. ఊరు ఎవరో ఒకరు ముందడ్గేస్తేనే ఊర్లె మార్పు. లేకుంటే మనమీరోజు ఇట్లా ఉంటోళ్లమా. గీళ్లంతా అమాయకులు, గీళ్లను అడ్డం పెట్కోని పూట గడ్పుకుంటోలెవరు. నీకుదెల్వదా. ఆళ్లకు సద్వురాదు. పురందాలు తెల్వదు. అందుట్ల ఏముందో తెల్వదు. పెద్ద కులపోడు, సద్వినోడు వచ్చి ఏది జెప్పినా గుడ్డిగ నమ్మెస్తరు. గాని గీ ఆచారాలు, కట్టడాలు కూడ ఎంతెల్వదు. ఎట్ల చెయంటె అట్ల చేస్తురు తపై వాల్లకెర్కలే. కాంది కలలు గన్నది గ్రామ స్వరాజ్యమే. దేశాన్కి ఎన్నెముక రైతన్నే. మరి ఆ రైతుకు ఇప్పుడు బువ్వకర్వైంది. పల్లె గోసదీస్తుంది. సుఖాలకు మర్గినోళ్లు పట్నాలకు పర్గు తీస్తుంటే ఇక్కడ పల్లెలు సాంఘిక దురాచారాలల్ల ముటాకచ్చలల్ల, గ్రూపు రాజకీయాలల్ల పల్లెనల్గుతుంది. మూడ నమ్మకాలల్ల పల్లెకంట కన్నీరొల్కుతుంది" (పు. 77).

కాబట్టి చదువుకున్నవారు పల్లెలకు తిరిగి రావాలని చెబుతూ "పల్లెల్ల తరతరాల్ల ప్రజల్ని భజించి ఎక్కడికక్కడ కులం కట్టుబాట్లతో కట్టెసిన ఆచారాలకు పట్న బూజుల్ని దుల్పాలి. పుండొకాడ ఉంటె మందొకాడ పెడ్తె ఎట్లా? ఆ పుండు పల్లెల్లనే ఉంది. దాన్కే పెట్టాలె మందు..... అది సరే మరి మనం ఎట్లా ఈళ్లను మారుస్తం సూరి. ఇగో జయా పట్నంలేం జేస్తున్నాం. సద్వుజెప్తున్నాం గదేదో గీడనే జెప్తెసరి. గట్ల ఆల్లకు కొంత కొంత ఆసరైనట్టు ఉ ంటది! ఆళ్లకు గిన సద్వొస్తే ఉన్న సంగతి ఆళ్లకు ఎర్కయితది" (పు. 78). ఊళ్ళోని మూఢచారాలు, మూఢ నమ్మకాల నిర్మూలనకు చదువు ఒక్కటే మార్గమని నమ్మాడు. మాటల్లో మన పిల్లలు ఏం చేయలేరు. కూలీవాడి పిల్లలు కూలీలుగానే మిగిలిపోతున్నారు. అధికార్ల పిల్లలు అధికార్లుగా మారిపోతున్నారని చెప్పాడు. అలా అవడం మనకు సాధ్యం కాదన్నాడు ఉగ్రగిరి. "మరి మనం గట్ల గావాల్నంటే మనవల్ల అయితదా', 'ఎందుగ్గాదే మనం సద్వాలే' 'ఎవడు సద్వియ్యాలే' వాన్కి ఉంటే కూసోని తేరగ తింటుండే, మన తాతలు, ముత్తాతలు అయ్యలు కూడ కూలోల్లేనాయె. మనం బాల్సింది లేదూ మంచిగ బత్కింది లేదూ ఏమంటవ్ సూరన్నా 'నేనేమంట గాళ్లుగట్ల రాస్కొచ్చుకుండ్రు ఎంజేస్తమ్' 'అట్లనకూ ఆడెట్ల పుట్టిండో మనం గట్లనే పుడ్తిమి' మరి వాన్కి ఆ సిరెక్కడిది' ఆళ్ల తాతలు సంపాదించింది' ఉగ్రగిరన్నా నీలాగ పిడివాదంతో రాద్ధాంతం చేయలేను. శ్రమను నమ్మినవాన్ని నీలాగ వాదనలతో కాలకేపం చెయ్యొచ్చునేమో, వేదికలెక్కి ఉపన్యాసాలు దంచొచ్చు, కాని వాస్తవంలోకి చూడాలి, మార్పుకోసం శ్రమించాలి. నాటి అంబేద్కర్, జోతిబా ఫూలేలను ఆదర్శంగా తీసుకొన్నవాన్ని 'జీవితం ఎక్కడ మొదలౌతుందో అక్కడే ముగుస్తుంది'. అని నమ్మినవాన్ని కనుకనే వారి

అడుగుజాడలో పయనించాలనుకొంటున్నా గంద్కనే ఊల్య 'జోతిబాపులె, అంబేద్కర్ ఆదర్శ పాఠశాల నెలకొల్పిన, మన సంఘంలో ఉన్న సాంఘీక దురాచారాలు, గోరాలు, నేరాలు, మూఢ నమ్మకాలు మొదలు పుట్టింది గ్రామంలో. గ్రామమే మనకు పట్టుగొమ్మ ఎక్కడ ఈ మహమ్మారులు నిచ్చెనమెట్ట సంస్కృతిని పుట్టిందో ఆచరించబడుతుందో అక్కడే దాని నిలుపు పారేయాలి. అంతేగాని, నీలా వేదించలేను,.... నీ గురించి ఆలోచించుకో..... వాదనలతో పబ్బం గడపడం ఎంతవరకు సమంజసం. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ఎంతవరకు సంఘంలోకి తీసుకు ఏదో విగ్రహంబెట్టి చేతులు దుల్పుకుంటె సరిపోతుందా పుట్టిన రోజులు చేస్తే బాధ్యత తీరిపోతుందా" (పు. 79–80). పాత మిత్రుడు ఉగ్రగిరి నల్గొండలో కలిసినప్పుడు వ్యర్థవాదనలు కాకుండా ఆచరణాత్మక ప్రణాళికతో అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఆచరించాలని చెప్పాడు. అందుకే తాను 'అంబేద్కర్–పూలే' స్కూల్ని ప్రారంభించానని చెప్పాడు.

బస్సులో కండక్టర్తో ఎస్.సి, ఎస్.టిల చదువు, ఉద్యోగాల గురించి చర్చ చేశాడు. ఎస్.సి, ఎస్.టిలు చిన్న ఉద్యోగం చేసిన అగ్ర కులాల వారు సహించలేరని చెప్పాడు. రామునికొండ ఊళ్ళో మధ్యాహ్న భోజన పథకంలో ఎస్.సిలు వంట వండితే మిగిలిన కులాల పిల్లలు తినకూడదని తీర్మానం చేశారు. అధికారులు వచ్చి చెప్పినా వినలేదు. యాదయ్య, రాంబాబు సార్ల గురించి కూడ కండక్టర్కూ చెప్పాడు. ఊరిలో బడి పెట్టి అందరి తలలో నాలుక అయ్యాడు సూర. అదునుకోసం నాగిరెడ్డి ఎదురు చూస్తున్నాడు. బైండ్ల రాములు మంత్రాలు చేస్తాడని అందుకే సాయిలుకి రాత్రి పూట జ్వరం వస్తుందని అతన్ని కొట్టారు. సూర మంత్రాలు లేవు ఒక వేళ ఉంటే నాకు చెయ్యమని చెప్పాడు. సాయిలును ఆసుపత్రికి తీసుకువెళ్ళి బాగు చేయించాడు. తర్వాత బైండ్ల పాపయ్య శక్తులు వస్తాయని పూజలు చేస్తే, చూసిన జనాలు పాపడ్ని కొట్టారు. అడ్డం తీయాలని వెళ్ళిన సూరడ్ని ఊరి సంగతి నీకు తెలియదు ఊరికి కొన్ని కట్టుబాట్లు ఉంటాయి. నీ పని నీవు చూసుకో అని జనాలు సూరని హెచ్చరించారు.

ఇదే సమయంలో సూరడ్ని చంపడానికి నాగిరెడ్డి ఊళ్ళో బొడ్రాయి ప్రతిష్ఠ కోసం దేశగురువును తీసుకు వచ్చారు. నాగిరెడ్డి జనాలను మోసంచేసి వారి పాస్ పుస్తకాలు తీసుకుని లోనులు తెచ్చుకున్నాడు. బ్యాంక్ అధికారులు నోటీసులు పంపేదాక ఎవరికీ విషయం తెలియదు. అడిగిన వారిని పోలీసులచేత ఎదురు కేసులు పెట్టించి కొట్టించాడు. అలాంటి వారిలో గరీబు ఒకడు. బొడ్రాయి స్థాపన సమయంలో సూర మీద దాడి జరిగింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా గరీబు నాగిరెడ్డి పటేల్ను హతమార్చి పోలీసులకు లొంగి పోతాడు. ఊరి పీడ విరగడయ్యిందని సూర సంతోషపడి గరీబుకు మనసులో కృతజ్ఞతలు తెలియజేస్తాడు.

**<u>జయలక్ష్మి:</u>**

దొర కూతురు. జానకమ్మతో కాలేజ్కి వచ్చి సూరనికి పరిచయం అవుతుంది. సూరని గురించి జానకమ్మ చెబుతుంటే కన్నీరు కార్చుతుంది. అయ్యోపాపం అనుకుంటు సూరని మీద జాలి కురిపించింది. తరువాత అదే సూరని మీద ఇష్టం పెరగడానికి కారణమయ్యింది. 'జయకు మన గురించి ఎవరు ఏమనుకుంటే ఏమిటని? మన బ్రతుకు మన ఇష్టం అనేది ఆమె పద్ధతి. జయ ముక్కుసూటి మనిషి. ఏదైనా వెంటనే కుండబద్ధలు కొట్టినట్లు మాట్లాడుతుంది. దొర కూతురైనా ఏమాత్రం గర్వంలేదు. మాటకారి, కలసిపోయే తత్వం కలది' (పు. 64).

ఊరికి సూర వచ్చాడని తెలిసి రోజు కలిసేది. తండ్రి వెళ్ళవద్దని మందలించినా ఆగలేదు. నాటకం మిషతో సూరమీద దాడి చేయించినప్పుడు వెళ్ళి "రె నాగిరెడ్డి మీర్ జెప్పిరు గద ఇగ నేన్ జూస్కుంట అని ఇంటకెల్లి జయమ్మను మందలిచ్చిండు దొర, మొండోనాతులు దండోడు పీకదేపన్నట్లు మొండి మీద పడ్డది జయలక్ష్మి. దొరతోని తెగేసి మరి

చెప్పింది, నేను ఏందో అన్కున్న గాని అందరు నన్ను అద్దుబద్దుంద్రు. ఇన్నొద్దులు తప్ప జర్గలేగాని, ఇగ చేసే తీర్త నువ్ నీ ఇష్టమొచ్చింది చెస్కో దీని ఎవని సాలు వద్దదిరా ఇట్ల మొండికేస్తుందీ దొర గుల్లసాగింది" (పు. 72). "బాజాస్త జయలక్మి సూరనింట్కి వొచ్చింది, అందరూ నోరెల్లబెట్టి చూడసాగిగ్రు. ఇగో సూర ఆల్బం ముచ్చటేలేదు. సోపతిజేస్త సచ్చిందాక ఉండాల్నంటు ఏమంటవ్ ఒత్తిడి చేయసాగింది" (పు. 74). సూరను పెళ్ళికి ఒప్పించింది.

పట్నంలో కష్టపడి పనిచేసుకుంటుంటే స్కూల్‌లో టీచర్‌గా చేద్దామని సూరనికి సలహా ఇస్తుంది. సూర తండ్రి చావుకి ఊరికి వస్తే, ఆ తరువాత అతనితో పల్లెలో వద్దు పట్నం వెల్దామని చెప్పింది. కాని చదువుకున్న వాళ్ళు పట్నం వెళితే పల్లెల్లో ఎవరు మార్పు తీసుకువస్తారని సూర చెబితే పల్లెలోనే ఉండటానికి ఇష్టపడుతుంది. చివరికి బొడ్రాయి ప్రతిష్ఠ సమయంలో సూర మీద దాడి జరిగినప్పుడు జనాలను తీసుకువస్తుంది. సూరని కాపాడి ఆసుపత్రికి తీసుకు వెళ్తుంది. ఈ పాత్ర సూర ఆశయాలను లక్ష్యాలను అర్థం చేసుకోని వాటికి అనుగుణంగా నడుచుకునే పాత్రగా తీర్చిదిద్దారు రచయిత.

**<u>జానకమ్మ:</u>**

కాశిరెడ్డి భార్య, నాగిరెడ్డి చెల్లెలు. "పిల్లా జెల్లా ఏదీ లేదూ..... ఏ జెన్మల ఏం పాపం జేసిన్నో, ఏ జెన్మల ఈన్కి రునమో ఈ జెన్మల ఈన్కి పెండ్లామైతినని బాధపడటం తప్ప. కడ్పునిండ తిన్నది లేదు, కంటినిండా కున్కు తీసిందిలేదు.... అయినా సంసారం గుట్టుగా చెయ్యాల్నని ఆమె నమ్మకం" (పు. 29). కాశిరెడ్డి జల్సాలకు ఉన్నదంతా ఊడ్చుకుపోతే పూట గడవడం కష్టమయ్యేది. ఆ సమయంలో సూర హాస్టలు నుండి గెస్ట్ వచ్చాడని, ఒక్కసారి అన్నం తీసుకు వస్తే, వాడిని గుండెలకు హత్తుకొని బావురుమంది. దొర కూతురిని దేవరకొండ కాలేజిలో చేర్పించడానికి తీసుకు వచ్చినప్పుడు జానకమ్మను సూరడు పలకరిస్తాడు. అప్పుడు ఆమె "ఏంరా సూర పెద్దోనివైనవ్ నీమాట బంగారమాయ్, నీ రూపు బంగారమైత్వి, కండ్ల కనరావైత్వి పటేల్మీన కోపమారా, మా మీద అల్గినవా ఏందీ? ఎన్నాళ్లైంద్రా నిన్ను జూసి, అమ్మయ్య బాగుంద్రా" (పు. 62) అని ప్రేమతో విచారించింది. అప్పుడప్పుడు సూరని కష్టం తెలిసి జానకమ్మ డబ్బులు ఇచ్చేది. కానీ సూర డబ్బులు తీసుకునేవాడు కాదు. జానకమ్మ పాత్ర సార్థక నామధ్యేయురాలిగా ఈ నవలలో చిత్రీకరించబడింది.

**<u>రంగమ్మ:</u>**

చెన్నడి చెల్లి. చంద్రీకి రంగి అంటే పడదు. "ఒక్కింట్కొస్తే సంసారం ఎల్లబెట్టింది జాలదన్నట్టు, ఊల్య బోగం కోడెలెక్క తిర్గి కనపడొనల్ల అర్సుకుంట ఇగ పాసి బువ్వ ఎవడొల్లక ఈడ్కి తయారైంది. ఇదే మనిషో, ఎందుక్ బత్కుండో," (పు. 21) అని వదిన చంద్రీ అంటుంది. రంగికి నాగిరెడ్డితో అక్రమ సంబంధం ఉంది. పట్నం వచ్చినప్పుడు కూడా దానిని కొనసాగించింది. కళమ్మ, చంద్రయ్యలు లేచిపోయారు. వాళ్ళను ఎదికే పనిమీద పట్నం వచ్చి చెన్నడి గుడిసె ఎదుక్కొంటూ నాగిరెడ్డి, కాశిరెడ్డిలను బురాన్ తీసుకు వచ్చాడు.
అక్కడ చెన్నడు నాగిరెడ్డి వాళ్ళకు భోజనం చేయించి, అందరు కలిసి తిన్నారు. మందు త్రాగారు. ఆ సందర్భంలో నాగిరెడ్డిని రంగమ్మ తన గుడిసెకు తీసుకువెళ్ళింది. "ఏమే రంగి ఈడ్కొచ్చినంక మంచి రంగుదేల్నవే.... సూస్తనే కస్కున కోర్కెయ బుద్ధైతుంది.... అబ్బ అట్లనకు పటేలా మీరంటుంటే ఆ మాటలు నాగుండెల సుల్కు సుల్కున దిగుతున్నయ్ ఒక్కసారి నీన్ను రుచి సూడనియ్యె. ఇప్పుడొద్దు పటేలా నాతిర్కి సుద్దం...." (పు. 25) అందరు నిద్రపోయాక పటేలు మట్కు రంగి గుడ్సెలో జొరవడ్డడు. "మాపంతా రంగి చేను తెగమేసి యాడికాడ్కి తొక్కిడ్సి పెట్న పటేలు ఓ పరక దాని మొఖం మీనకొట్టి మీసం వాడిదిప్కుంట కనుసైగ చేస్తూ" (పు. 26) అని అక్కడ నుండి కదిలాడు. పట్నంవచ్చి అన్న దగ్గర ఉంటూ నాలుగిండ్లు

చూచుకోని ఉండసాగింది. అన్న వదిలిపోయిన గుడిసెను తన పేరుమీద రాయించుకోని, వాళ్ళకు తెలియకుండా జాగ్రత్త పడుతూ జీవిస్తూంటుంది.

**<u>కళమ్మ:</u>**

నాగిరెడ్డి పటేల్ తమ్ముడు రామిరెడ్డి భార్య. 'కళమ్మ కొద్దో గొప్పో చదివింది. జర సోకుల వద్కుంట ఉంటది. ఓ పిల్లకు తల్లయినా పిల్ల చేతలు పోలేదు. రామిరెడ్డికేమో బాయి, పొలం గిలం అన్కుంట ఉంటడు. ఇదర్కి ఎడామొఖం పెడమొఖం అన్నట్లు ఉంది. సంసారమైతే సాగుతుంది కాని ఇష్టంలేని యవ్వారమైంది. రామిరెడ్డి మొరటోడు. అచ్చటా ముచ్చటా ఎర్గడ్క ఏదో నారితికాడ పసరం లెక్కా పొర్లడిపోతడు తప్పె కళమ్మ గురించి పటిచ్కునేటోడు కడు" (పు. 37). కళమ్మ చెంద్రంనితోని తన కొర్కె తీర్చుకోవాలన్కుంది. ఎవరు లేని ఒకరోజు పొలంలో చంద్రునితో కొరిక తీర్చుకుంది. సమయం చూసి కళమ్మ చంద్రుని లేపుకుపొమ్మని అడిగితే పట్నంకి లేపుకుబోతాడు. అంగుళం అంగుళం గాలించి ఇద్దర్ని దొరకబుచ్చుకోని మంచి మాటలు చెప్పి ఊరికి తీసుకువచ్చారు. మా పిల్లను మాకివ్వండి అని అడిగారు. కళమ్మ నేను పోనని తీరొక్క తీరుగా ఏడవ సాగింది. పెద్ద మనుషులు కళమ్మను కాపువాళ్లకు అప్పగించారు. గూడెం దాటగానే నాగిరెడ్డి చీర ఊడబెరికి పిర్రలమీద పశువును కొట్టినట్లు కొట్టి గుండుకొట్టి సున్నంబొట్లు పెట్టి, మళ్లీ ఊరిమొకం చూస్తే చంపి బొందపెడతానని తరిమేశాడు. చంద్ర కళమ్మను వెతుకులాడుకుంటూ ఊరు విడిచి వెళ్లిపోయాడు.

**<u>రోషమ్మ:</u>**

చెన్నుడి అన్న పెద్దులు భార్య. చంద్రి యారాలు, ఎప్పుడూ చంద్రీ రోషమ్మతో గొడవ పడుతుంది. పట్నం నుంచి ఊరికి వస్తున్న చెంద్రీని చూసిన యారాలు రోషమ్మ "వామ్మో దీన్ సోకు పాడ్గాను యమ కండబట్టిందేమో" (పు. 34) అని పలకరించింది. చంద్రీ పట్నం గురించి ఊరిలో స్నేహితులకు చెబుతున్నప్పుడు కుళ్ళుకుంది. పట్నం విషయాలు చెబుతుంటే "సాట్కుండి ఇంటున్న యారాలు నాల్కెకర్సుకుంది. దీని బడాయి పాడ్గాను ఏం వొగలు పొతుంద్రా నాయినా ఎట్నో తుర్కోని పుణ్యాన పట్నంల పడ్డేది. అన్కుంట ఏరాలు మతిల గుల్ల సాగింది" (పు. 36). ఉద్యోగం రాలేదని ఊరికి చంద్రీ వాళ్ళు తిరిగి వచ్చినప్పుడు రోషమ్మ సంతోషపడింది. కాశిరెడ్డి చేతిలో మోసపోయి ఉద్యోగం రాక తెచ్కుండని, దాన్కి ఎవలెం జేస్కరని ఎవని కర్మ ఆడే అన్భవించాలని పెడ్లాంతోటి అంటుంటే రోషమ్మ పగులబడి నవ్వసాగింది" (పు. 43- 44). ఈమె భర్త పేరు పెద్దులు. తెలివైన వాడు. తమ్ముడి పొలాన్ని తానే తక్కువ రేటుకు పటేల్‌తో మాట్లాడి కొనుక్కుంటాడు. వీరి బిడ్డపేరు ఎల్లమ్మ. కొడుకుపేరు యాదయ్య. ఇంకో కొడుకు కూడ ఉన్నారు. ఎవరూ చదువుకోవడం లేదు. గొడ్లు కాచుకుంటూ, కూలీ పనులు చేసుకుంటు బతుకుతున్నారు.

**<u>నాగిరెడ్డి:</u>**

చీకటిగూడెంలో పటేలు. పెద్దగా భూములు లేకపోయినా "పూర్వికులు చెల్కరెడ్డైనా తను మట్కు మోటాటిగగానే చెలామని అయితుండు! ఉన్నది రెండెకరాలు కాడి పట్టింది లేదు, అర్కదున్నింది లేదు! మీసాల బిరైతే మెండు, తెల్లగా మాయని బట్టలేస్కొని దోతి అంచు నేల నడుస్తుంటె, అంచు చేతిల పట్కోని ఓ చేత కరీదైన సిగరేటు దమ్ము పీల్చుకుంట ఊల్యా నుంచి ఎప్పుడు శివరస్త మల్లెపల్లికి ఎల్లెవాడు! ఆడపని పాటలేకున్నా లీడరు లెక్క ఆపిసుల సుట్టు తిరిగి చిన్న చిన్న పనులు చేపిచ్చెటోడు! ఇక పటేలు లీడరన్నట్టు ఊరోళ్లు గింత దాన్కి గంతదాన్కి నాగిరెడ్డి తాన్కి వొచ్చి వాళ్ల గోడెళ్ల బోస్కునేవాళ్లు!" (పు. 99).

క్రమంగా నాగిరెడ్డిపై గౌరవం పెరిగింది. "ఊల్యా జనాలు రాజిరెడ్డిని కదని నాగిరెడ్డినే సర్పంచిగ గెల్పిచ్చిరి. ఇగ పటేలు ఇల్వ పెరిగింది. ఇల్లుండంగనే సక్క దిద్దుకోవాలన్నట్టు

అందిన కాడ్కి దండ్క తినసాగిండు. ఊర్కి బాటేంట ఉన్న పదెకరాల రేగడి మీద పటేలు కన్నువడ్డది. కన్ను పడ్డదే తడవుగ ఆలోచనకు పదును పెట్టిండు. 'ఆ శెల్క మాదిగల మాన్యాల కింద ఉంది. అది పట్టా భూమికాదు. పైగా అది సీలింగుభూమి'. ఇసయాలు సేకరించి మాదుగులకు నల్గురు పెద్దమన్సుల పిల్సి మస్తుగ తిన్పిచ్చుడు, తాగిపిచ్చుడు చేయసాగిండు. లోగుట్టెర్గని వాళ్లు పటేలు బలెమంచోడని తెగ ముర్సుతుండ్రు. ఒకనాడు తాగిన మైకంల వాళ్లతోని దస్తావేజుల అంగోటినిషాన తీస్కుండు, ఆశెల్క అమ్మినట్ల కాగితాయి రాస్కుండు. ఇంకేముంది కుడ్తిల వడ్డటైంది వాళ్లు. ఇదొక్కటేనా ఆయన లీల చెప్కుంట పోతే సాటబారతమైద్ది" (పు. 100). ఇక నాగిరెడ్డి లీడర్ అన్నట్టు ఊరిలో అందరు అతడి దగ్గరకే వచ్చేవారు. ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలిచాడు. అందిన కాడికి దండుకుతిన్నాడు.

మాదిగ పెద్దలకు బాగా మందుపోయించి, తాగిన మైకంలో ఉన్నవారి దగ్గర నుంచి సంతకాలు తీసుకోని మాదిగమాన్యం ఆక్రమించుకున్నాడు. సర్పంచ్ కాక ముందు ఊళ్లో వాళ్లకి లోనులు ఇప్పిస్తానని, అందరి దగ్గర డబ్బులు వసులు చేసి అధికారులకిచ్చి వచ్చిన డబ్బులో ఎక్కువ తాను తీసుకోని ఎంతో కొంత లబ్ధిదారులకు ఇచ్చేవాడు. కొంత మందికి అవికూడా ఇచ్చేవాడు కాదు. వారికి బ్యాంకునుండి నోటీసులు వచ్చేవరకు తెలియదు. 'ఏంది పటేలా బ్యాంక్‌నోటీసులు అంటే నేను చూచుకుంటాలే' అనేవాడు. బ్యాంకువాళ్లు నోటీస్‌లు ఇచ్చినవారి ఆస్తులు వేలం వేసేవారు. ఏమిటీ అన్యాయం అనేవారిపై ఎదురు కేసులు పెట్టించి, పోలీసులచేత చితక కొట్టించాడు.

ఊరిలో కిందికులాల వారు చదువుకుంటే ఓరువలేడు. ఎలాగైనా వారిని ఊరినుండి పంపించాలని అనుకునేవాడు. కుదరకపోతే వారిని చంపించేందుకు సాంస్కృతిక మత కార్యక్రమాలు అడ్డుపెట్టుకోని చంపడానికి కూడా వెనుకాడేవాడు కాదు. దళిత స్త్రీలను ఆకర్షించి అనుభవించేవాడు. అదే సమయంలో దళితుల ఆకర్షణకు లోనై వచ్చే, అగ్రకుల స్త్రీలను (కమ్మ) భయానకంగా చిత్రహింసలకు గురి చేసేవాడు. దొర కూతురు సూరనితో స్నేహం చేసిందని తెలిసింది. వీడిని ఇలాగే వదిలివేస్తే ఏకు మేకు అవుతాడని అనుకున్నాడు. సూరడు చదువుతున్నాడని తెలుసుకోని, మొగ్గలోనే తుంచి వేయాలనుకున్నాడు. నాటకం పేరుతో సూరని మీద దాడి చేయించాడు. కాని సూరనికి ఏమి కాలేదు.

బొడ్రాయి బాటల మునిగింది. అది ఎక్కడ ఉందో బయటకు తీయడానికి దేశగురువును నాగిరెడ్డి తీసుకువచ్చాడు. "పటేలు నల్గురు నమ్మిన బంట్లని బిల్సి ఆల్లను సాట్కు దీస్కపోయి, ఇదే ఆదును అక్కడ మషమ్మ పండ్గకు దున్నపోతు తల తెగాలే, బొడ్రాయి మీద్కి లేపాలే ఊల్య బలి జల్లాలే అదే సమయాన ఆన్ని ఆయం తెల్వకుండ మాయం జెయ్యాలే. తెల్లార్తాల్కె ఎక్కడ్దక్కడ ఇపోవాలే అన్కుంట సూరన్మీద్కి పుర్మాయించాడు నాగిరెడ్డి కొడ్కు అప్పుడంటె తప్పించ్కుండు, ఇప్పుడెట్ట తప్పించ్కుంటడు" (పు. 102) అని సూరని మీద దాడి చేయించాడు. సూరని మీద పటేల్ దాడి చేయించాడని తెలిసిన గరీబు పండుగ సంబరంలో ఉన్న నాగిరెడ్డి పటేల్‌ను ఖతం చేశాడు. ఈ విధంగా పటేల్ కథ ముగిసింది.

**<u>దొర:</u>**

చీకటిగూడెంకి దొర. జయలక్ష్మి తండ్రి. రచయిత ఈ దొర పేరు చెప్పలేదు. గ్రామంలో ఎవరేమి చేస్తున్నారో తెలుసుకుంటూ ఉంటాడు. నాగిరెడ్డి ఊరిలో జరిగే విషయాలు ఎప్పటికప్పుడు దొరకు చేరవేస్తుంటాడు. సూరడు కొండలో చదువుకుంటున్న విషయం బంటు బిక్షం ద్వారా తెలుసుకోని "ఈ ఊల్య కడజాతిల ఒక్కడు ఇగురేస్తున్నాడు అన్కుంట ఆన్ని నెమరేయసాగిండ్రు" (పు. 67). దొర కూతురు సూరని కోసం మాల పల్లెకు రోజు వెళ్తున్న విషయం దొరకు చేరవేశాడు నాగిరెడ్డి. ఇంటికి వెళ్ళి జయను మందలించాడు. జయ దొర

మాట వినలేదు. సూరడిని పెళ్ళి చేసుకుంటానని దొరకు చెప్పింది. తరువాత దొర, నాగిరెడ్డి కలిసి కోట గుమ్మం ముందు నాటక ప్రదర్శన వేయిస్తూ సూరని మీద నమ్మిన బంట్లచేత దాడి చేయించాడు. సూరడు జనంలోకి వచ్చి తృటిలో తప్పించుకున్నాడు.

గూడెం జనం ఒక్కటై గడిమీదకు వెళ్ళి "ఆరే ఇయ్యాల ఈన్ని గొట్టిరు. రేపు ఇంకోని గొడ్తరు బైటకీడ్వురా దొరను అంటుంటే దొర లోపలికెల్లండు. జయలక్ష్మి బైట్కెల్తుంటె లోపల అర్రల తొలి తాలమేసిండు దొర" (పు. 73). రాను రాను "దొరల పెద్దిర్కం దిగజారింది. పటేండ్ల సాగుబడి పెర్గ సాగింది" (పు. 72). జయను సూర పెళ్ళి చేసుకున్న విషయం దొరకు తెలిసిన దొర సిగ్గుతో "పెద్దిర్కం సంప్కొని తల దించ్కుండు, పోయిన పర్వు ఎట్లాపోయింది. మల్ల ఎత్కి ఎంద్కు తలగోకోవడం అని గప్పుప్పున కామ్‌యిండు దొర" (పు. 75). ఈ నవలలో దొరల దొరతనం అంతమై రెడ్లు పటేళ్లుగా చలామణి అవుతూ ఏలుబడి పెంచుకున్నట్లుగా కనబడుతుంది. తెలంగాణ ప్రాంతంలో వెలమ దొరలది ఆధిపత్యం. అయితే, నల్లగొండ జిల్లాలో మాత్రం రెడ్డి సామాజిక వర్గానిదే పెత్తనం. అక్కడక్కడా వెలమదొరలున్నా, రెడ్డి కులస్తుల నీడలోనే పెత్తనం సాగించాల్సి వుంటుంది. అందుకే, నాగిరెడ్డి ఆలోచనలకు అనుగుణంగా దొర ప్రవర్తించటం కనిపిస్తుంది. తన కన్నకూతురు మాల యువకుడిని పెళ్ళి చేసుకున్నా ఏమి చెయ్యలేని పరిస్థితిని రచయిత చిత్రీకరించాడు.

**కాశిరెడ్డి:** నాగిరెడ్డి చెల్లెలు భర్త. దేవరకొండ గ్రామ నివాసి. నమ్మించి మోసం చేసే వ్యక్తి "కాశిరెడ్డి నిజాన్కి రాకాసి రెడ్డి. అంతోఇంతో సద్వినా ఉజ్జోగం సజ్జోగం ఏదీలేదూ, రోజూ ఇంట్లనుంచి టికుట్రాకున బైట్కిఎల్తడు. కాశిరెడ్డిని జూస్తే పెడమొఖపోడు పెండ్లికెదూర్జాస్నట్క ఉంటడు. ఊల్య వద్దన్న పంచతీలైతే దొరిర్కంజేసి కాయితాలుకత్వలు రాసి పదో పర్కో రాబట్టి ఆపుటకు మీసాలకు సంపెంగ రాసే బాపతు. ఊల్య కంట్లవడ్డదాన్ని పోనియ్యడు.... కాశిరెడ్డి పిల్లా పీసు లేకున్నా లేరన్న బెంగ గింతన్న లేదతన్కి" (పు. 29). భార్య కడుపునిండా తినింది లేదు. కంటినిండా కునుకు తీసింది లేదు. నాగిరెడ్డితో హైదరబాద్‌కు వచ్చి చెన్నడి గుడిసెలకు వచ్చినప్పుడు సూరని తల్లి చెంద్రీమీద కన్ను వేస్తాడు. ఏలాగైనా చంద్రిని అనుభవించాలి అనుకుంటాడు. సూరని చదువు సంగతి తెలుసుకోని ఇంట్లో చేతికింద పనిపిల్లలు దొరకలేదు. సూరన్ని తీసుకెళ్తే చేతికింద ఆసరవుతాడని ఆలోచించాడు. పిల్లోడిని దేవరకొండ బడి, హాస్టల్‌లో చేర్పిస్తానని చెప్పి తీసుకెళ్లి చేర్పించాడు.

సెలవల్లో హైదరాబాద్‌కు సూరన్ని తీసుకు వెళ్ళి చెన్నడు చంద్రీకి ప్రభుత్వ ఉద్యోగం ఆశ చూపిస్తాడు. వాళ్ళు ఆశ పడి ఊరిలో ఉన్న పొలం పదివేలకు అమ్మి కాశిరెడ్డికి డబ్బులు ఇవ్వడానికి బయలు దేరారు. కాశిరెడ్డి "అప్పటికే తాగుడ్కి లంజలకి మర్గి ఉన్నదంతా ఊడ్సకపోయింది! పూట గడ్వడం మహా ఇదైంది. బత్కు భారమై సీట్కి మాట్కి జానకమ్మ మీద చిందులు తొక్తు కోపడ్తావుండు..... "డబ్బులు సూస్తాల్కి కాశిరెడ్కి కండ్లు బైర్లు కమ్మినయ్. మస్తుగా ఖుషి పడ్తు ఓ ఫుల్ బాటిలు దెప్పించి చెన్ననికి పీకల్దాకా తాపిచ్చిండు" (పు. 41). మద్దేరేతిరి కాడ లేచి కాశిరెడ్డి అదును కోసం ఎదురు చూసి, చెంద్రిని పాడు చేశాడు. తరువాత కాశిరెడ్డి చెంద్రీని హాస్టల్‌లో బువ్వ వండటానికి, చెన్నడిని సపాయికొలువుల, టెంపరరీగా కుదిర్చాడు. "కాశిరెడ్డి పటేలు మట్కు వీరికి చెప్పినట్టే ఊరిలో ఆళ్లనీల్లను నమ్మిచ్చి అందినకాడ్కి దోర్కుచ్కొని పట్వారి కొల్వు దొర్కించ్కుండు..... కొల్వు లేదు. గిల్వు లేదు మోసపోతిమని ఎర్కైంది! చెంద్రికి" (పు. 43). కాశిరెడ్డిని కొలువు గురించి నిలదీస్తే డబ్బులు ఉన్నప్పుడు ఇస్తానని తెగేసి చెప్పాడు. ఇలా కాశిరెడ్డి జనాలను మోసగిస్తూ, జల్సా చేసుకుంటూ బతికేవాడిలా ఈ నవలలో చిత్రీకరించడమైంది.

**ఖాసీమ్:**

చీకటి గూడెం నివాసి. ఊరిలో పనిలేనప్పుడు పట్నం వలస వెళ్ళేవాడు. తనతోపాటు మనుషులను తీసుకువెళ్ళి నాలుగు డబ్బులు సంపాదించుకోని, అదునులో ఊరికి వెళ్తుంటాడు. చెన్నడు, చంద్రిని పట్నం తీసుకెళ్ళాడు. వాళ్ళను గుడిసే వేసుకొమ్మని మంచి తావు చూపిస్తాడు. ఊళ్లో దొర నాగిరెడ్డికి విషయాలు సేకరించి చెబుతుంటాడు. (ఖాసీమ్ తమ్ముడు బురాన్, నాగిరెడ్డి ఖాసిరెడ్డిలను పట్నం వచ్చినప్పుడు చెన్నని గుడిసెవద్దకు తీసుకోని వస్తాడు). సూరడు దొర, నాగిరెడ్డిలకు గౌరవం ఇవ్వటంలేదని వాళ్ళకు నమస్కారం పెట్టమని, అడుగుతాడు. సూర చెప్పిన మాట విని "వామ్మో ఏమో అనుకున్న నువ్ తక్వోనివిగాద్రో అయినా నీ యిష్టం నాకేంద్రా ఏదో పెద్దలకింత ఇవ్వియ్యాలని అన్నగాని వొస్తర పిల్లా దొరకాయి నడ్సిండు ఖాసీం దొరతాన్కి పోయి సలాంబెట్టి చేతులుగట్కోని నిలవడ్డడు. దొర ఖాసీంను ఊరి ఇసయాలు అడ్గసాగిండు" (పు. 49– 50).

**<u>బషీర్:</u>**

పట్నం గుడిసెలలో ఉంటాడు. ఖాసీమ్ చీకటిగూడెం వాళ్ళని బషీర్ ఉండే గుడిసెల్లోకి తీసుకోని వెళ్తాడు. ఖాసీమ్ ఊరికి వెళ్తు తను తీసుకు వచ్చిన వారిని బషీర్కి ఒప్ప చెప్పి బాగా చూసుకోమ్మని చెబుతాడు. "నువ్వు పికర్ చేయక్ ఆళ్ళు నా జిమ్మతే ఆళ్లకు ఏ ఇరుకు ఇబ్బందొచ్చిన నేన్ జూస్కుంటా" (పు. 12). అని చెప్పాడు. బషీర్ ఉండే స్థలం మాదని వచ్చిన ఆక్రమదారులు ఖాళీచేయమంటే ఎక్కడికి పోవాలే మేమే ఖాళీ చేయమని గట్టిగా చెప్పాడు. గుడిసె జనానికి నాయకత్వం వహించి, అందరికి ఎల్బినగర్లో స్థలాలు ఇప్పించాడు. రంగమ్మకు చెన్నడి పేర స్థలం వస్తే ఆ స్థలాన్ని ఆమె పేర మార్పించి ఇచ్చాడు. గుడిసెల వారికి అండగా ఉన్నాడు.

**<u>నర్సమ్మ,నర్సింహ:</u>**

చంద్రి చిన్నమ్మ కూతురు. సూరకు, నర్సిమ్మ చిన్నమ్మ. నర్సింహ భర్త. ప్రభుత్వ ఉ ద్యోగం చేస్తున్నాడు. అందుకే డబ్బులకోసం వాళ్ళ వద్దకు సూరన్ని పంపింది చంద్రి. రాకరాక సూరడు వచ్చాడని "ఏమయ్య అట్ల గౌండ్లింట్కి పోయిగింత మాపటిల్లు పట్కరారాదు..... నర్సయ్య గౌండ్లిండ్కి పోయి గింత మాపటి పట్కోచ్చె. తలాగింత పట్టిచ్చిరు" (పు. 51). కానీ నర్సమ్మ డబ్బులు ఇస్తే మల్లా మల్లా వస్తారని "ఇగో సూరయ్య మాకే సాన ఇబ్బందుంది బిడ్డా. నాల్దినాలు పోయినంకరా మొన్ననే రెండేలు పెట్టి నాట్లేపిచ్చిన, నాగలి దున్నిచ్చిన, వానాకాలం కోతలు గోస్నంక రాబిడ్డా గప్పుడైతే ఎట్లన్న సుత్లాయించుత" (పు. 57) అని పైసలకు కప్పదాటేసింది నర్సమ్మ. నవలలో ఈ పాత్రలు లౌక్యంగా తమసుఖమే తాము చూసుకునే పాత్రలుగా చూడవచ్చు. ఉద్యోగాలు చేస్తూ దళితుల్లో చదువుకుంటున్న వాళ్ళకు సహాయం చేయకుండా తప్పించుకోవడానికి ప్రయత్నించడాన్ని చిత్రీకరించాడు.

**<u>పరంధామయ్య తాత:</u>**

నర్సింహ తండ్రి, ముసలివాడు. కుల పురాణాలమీద మంచి పట్టున్నవాడు. సూర అడిగిన పురాణ విషయాలు వివరించాడు. సృష్టి క్రమం, శక్తి పుట్టుక, జాంబవంతుని పుట్టుక, త్రిమూర్తుల పుట్టుక, అరుంధతి, మాతంగుడు, వశిష్టుడు, చెన్నుడి కథ, మాలకీడి కథ, మాలల గురువు, వారి కులవృత్తి (నేత) కథ, గుర్రం మల్లయ్య కథ, బంతి మల్లయ్య కథ (బంతితో మొదటి ఆకు వేయడం), అశ్రిత కులాలగురించి, సూరడి ఊరికి బయలు దేరుతుంటే తాత కూడ సూరనితో బయటకు వచ్చాడు రాత్రి చెప్పిన పురాణ విషయాలతోపాటు మరికొన్ని విషయాలు చెప్పాడు. "అయ్యకు పాణం బాగలేదన సంగతి చెప్పిండు సూరడు. ఇగో మన్వడా మాటవే మంత్రాలు, చెట్లే క్రియలు, దేవుండ్లతాన దొర్కేది గదే దేంట్లయినా నమ్మకం కుదురాలే లేకుంటే అనుమానమే పెద్దరోగం. అంత్రం తంత్రం గట్టెటోళ్ళ మోసాలను చెప్పిండు సూరన్కి"

(పు. 57). మంత్రగాళ్లు చేసే కనికట్టు విద్యలు, మందులు కక్కించడం మొదలైన విషయాలు సూరనికి వివరించి చెప్పే చైతన్యవంతుడ్ని చేసే ముఖ్యమైన పాత్రగా నవలలో కనబడుతుంది.

**ఇస్మాయిల్, వెంకటేష్:**

సూరతో పాటు బడి, హాస్టల్‌లో చదువుకున్నారు. చిన్నతనం నుండి స్నేహితులుగా ఉన్నారు. కాలేజీలో కూడా వీరందరూ ఒకే రూమ్‌లో ఉండి చదువుకున్నారు. సినిమాలకు, సెలవుల్లో పనులకు కలసి వెళ్ళేవారు. ఇస్మాయిల్ ముస్లిం. వెంకటేష్ గొల్ల. శ్రావణమాసంలో పెద్దమ్మ పండుగకు వెంకటేష్ ఊరికి వెళ్ళారు. "సూర కొప్పడకురా నీనొక మాట చెబుతా. ఎందిరా మా వోళ్ళకు గనుక మాలోనివాని తెలిస్తే నామీద గరమైతరు అందుకని జర నూవు ఏదైన మారు పేరు పెట్టుకోరా" (పు. 67). వెంకటేష్ బోనం దగ్గర డప్పులు దరువులకు ఊగుతున్న ఆమె నడుము గిల్లాడు. "ఎంకన్ని చూసిన ఆమె ఊకో పిలగా నీకు ఇప్పుడే సందయినది మంది చూస్తరు అనుకుంటా మల్ల శిగంలా పడ్డది" (పు. 68). 'ఆమె మీద దేవుడు ఉంటే నువ్వు పిసుకగానే ఆమెకు ఎట్ట ఎరుకయ్యిందిరా.. ఏమోరా సూర నిజమే.. రా! నాకు ఎలాగా లేదేందిరా.... అరే ఇస్మాయిల్ ఇనురా ఇంక నువ్వుగూడా విను. మనోళ్ళకు దేవుల్లంటే బలే పిచ్చిరా అమ్మ ఆకలంటే ఏకానిఇయనోడు దేవుడి పేరు చెబితే అంత ఇస్తాడు' (పు. 69). అలా హేతు వాద చర్చలు వీళ్ళ మధ్య జరిగాయి. ఇంకా కాలేజ్‌లో జయలక్ష్మి గురించి వీల్లే ఆరాతీసి సూరన్ని ఆమెకు పట్టించేవాళ్ళు సూరతో కలసి మెలసి ఉండేవారు.

**కేశవరావు:**

చంద్రి మేనవదిన కొడుకు. పట్నంలో చదువుకుంటున్నాడు. చదువుకోకుండా తిరుగుతున్న సూరను చదువు మీదకు దృష్టిని మల్లించాడు. "ఇగో అల్లుడా ఏమన్నగానీయ్ గాని నీబామ్మర్దికి నీలెక్క సద్వేటట్టు తర్వీదు చెయ్యాలె ఆడు మమ్ముల గింతన్న శంక చెయడ" (పు. 17) లేదు. రోజు ఓ గంట సూరనికి ట్యూషన్ చెప్పేవాడు. ఒక పట్టానా సూర చదువు వల్లు అబ్బుతలేడు. 'ఇక లాభంలేదని గుంజీలు తీపియ్యడం, తొడపాశం పెట్టడం, చెవులు పిండటం, అది సాలదన్నట్లు వొంగబెట్టి మోకాళ్ల మజ్జెల ఇర్కించి చెవులు పట్టుకోవడం చేస్తుంటే సూరన్కి శెరాలు తప్పవన్నట్లు రోజు పొద్దున లేసి, సద్వి బుర్రకు సానబెట్టి, చెప్పిన పాటమల్ల అప్ప జెప్పి గాడినపడ్డాడు' (పు. 19). ఈ విధంగా సూరనికి చదువు విలువ తెలిపి సూరడిని దారిలో పెట్టే పాత్రగా చిత్రీకరించాడు.

**బంటు మల్లమ్మ (దేవుడమ్మ):**

చీకటి గూడెంలో దేవుడమ్మ పేరుతో జనానికి లేనిపోనివి చెప్పేది. వాళ్ళ వద్దనుండి డబ్బు గుంజి, అమాయక ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తుంటుంది. ఏదో రోగంతో వచ్చిన వారికి దేవునమ్మ ఉన్నది లేనిది చెప్పేది. 'గుడ్డెద్దు చేల వడ్డట్టు గురికి తాకినవాన్ని తిక్క చెన్నడు ఔతల్లి నిజమేనమ్మా... అని తలాడించసాగాడు' (పు. 45). ఇంకోసారి సర్దుబాటు, (చేతబడి) చేశారని లేని పోనివి చెప్పి పాలెవాళ్ళ మీద అనుమానం వచ్చేలా చేసింది. ఇలా చెన్నని చావుకు ఒక కారణమైంది.

**యాదయ్య సార్:**

రాజిరెడ్డిపల్లి బడి పంతులు. దళితుడు. 'రాజిరెడ్డి గూడాన్కి కపక్కనున్న చిన్నరాం గూడేనికి చెందినోడు. తండ్రి జీతం చేసాడు. పంతులు నల్గొండలో చదువుకొని ఈ మధ్యనే పంతులు కొలువులో అదలీ పక్కుర్లలోనే టీచర్‌గా చేరిండు. ఆవూరందరికి ఎర్క ఉన్నోడైనా, కుల పరంగా దళితుడైనా చేసేది పంతులు కొల్వు కాబట్టి ఆ కొల్వుకు ఇలువనిచ్చేవారు' (పు. 86). అంగన్‌వాడీ టీచర్ జయమ్మ పటేల్ ఇంటికి పోతే యాదయ్య సార్‌కి స్టీల్ గ్లాస్‌లో విడిగా ఉంచిన నీళ్ళు ఇచ్చేవారు. రాంబాబు సార్ మాదిగకులమని జయమ్మకు చెప్పేసరికి

"ఔసార్ గిప్పుడు యాడ జూస్న మీరే ఏ కొల్వుల జూస్నా మీరే అసలు గిప్పుడు మీదాంట్ల పుట్టాలంటరు" (పు. 87) అని వెటకారంగా అన్నది దానికి బదులుగా రాంబాబు సరైన సమాధానం ఇచ్చాడు. దానితో ముఖం చిన్నబుచ్చుకోని అక్కడ నుండి ఇంటి బాట పట్టింది.

"యాదయ్యకు మట్కు ఆమె మాటలు ముల్లులా సుల్కు సుల్కున పొడుస్తూనే ఉండయ్. మనం ఎంత గొప్పగ సద్వినా కులం పేర ఎంట్కెలెక్క తీసేస్తురు. ఏం జేస్తమ్ కర్మగాలి పుట్నందుకు కులం బర్వు మోయాల్సిందే!" (పు. 88) అని బాధ పడ్డాడు. ఈ విషయం సూర నల్గొండ నుండి బస్సులో వస్తున్నప్పుడు కండక్టర్ సూరకి చెబుతాడు. ఈ విధంగా ఊరుల్లో దళిత పంతుల్లకు ఏలాంటి అనుభవాలు ఎదురవున్నాయో, వాటిని ఎలా ఏదుర్కొవాలో ఈ పాత్ర తెలియజేస్తుంది. సున్నిత మనస్కులుగా ఉండి బాధ పడకుండా సిద్ధాంత పరంగా విషయాల్ని ప్రజలకు తెలియజేసేలా ఉండాలని రచయిత అభిప్రాయం.

**<u>రాంబాబు సార్:</u>**

రాజిరెడ్డిపల్లెలో బడి పంతులు. "ఆ వూర్కి మట్కు ఎంటోడో తెల్వదు. రంగు జూస్తే దొరబాబులా కన్పిస్తడు. అందుకు తగ్గట్టుగా ఆంధ్ర కలగలిసిన అతని మాటతీరు, నడక, నగత చూసేవారికి ఇట్టె అన్పిస్తుంది. అతడు ఏదొరింటి బిడ్డోనని. అతడు దళితుడంటె ఎవరూ పోల్చుకోలేరు, కలల కూడ ఊహించుకోలేరు" (పు. 86– 87). పల్స్ పోలియో డ్యూటి గురించి చెప్పడానికి జయమ్మ పటేల్ (అంగన్‌వాడీ టీచర్) ఇంటికి వెళ్ళినప్పుడు రాంబాబుకి చెంబులో నీళ్ళు ఇచ్చి యాదయ్య సార్‌కి పక్కన గూటిలో పెట్టిన స్టీల్ గ్లాస్‌లో నీళ్ళిచ్చింది.

పల్స్ పోలియో డ్యూటి సమయంలో రాంబాబు సారు కులం అడిగింది. "ఏమాత్రం తడబడని సారు ఒక్కసూటిగా మేము మాదుగులం అని బదులిచ్చాడు. అవక్కాయిన జయమ్మ ఔ సారు గిప్పుడు యాడ జూస్నా మీరే ఏకొల్వుల జూస్నా మీరే అసలు గిప్పుడు మీ దాంట్లో పుట్టాలంటరు అట రాశి పుట్కొనొచ్చిరు" (పు. 87) అని వెటకారంగా అన్నది. మీరు చదువుకోగానే ఉద్యోగాలు దొరుకుతాయి. మాకులంలో ఎంత కష్టపడి చదివిన కాలేజీలో సీటే దొరకదని అన్నది. దానికి రాంబాబు "అసలు మా మీద ఇంత ఎడుస్తుంద్రుగానీ మాకు సద్వులనైనా, కొల్వులనైనా దొర్కెది పదిహేను శాతమే... మా ఖాళీసీట్లల్లనే మేం బర్తీ అయితున్నాం గాని మీదేం గుంజుక్కుంటులేం. అంతెందుక్క ఊల్య దళితులు ఎంతమంది సద్వింద్రు, ఎందరు కొల్వుల జేస్తుంద్రు సూపియి. అదే మీరైతేనా ఇంటో బిడ సద్వుతుంద్రు, రెండిండ్ల కోడు కొల్వు జేస్తుంద్రు. మరి నువ్వన్నది ఎట్ల నిజం, ఊకనే మందిమీద ఏడ్వద్దు నిజాలు తెల్సుకోవాలే" (పు. 88) అని చెప్పగానే జయమ్మ అక్కడి నుండి ఇంటి బాట పట్టింది. ఈ నవలలో రాంబాబు పాత్ర ద్వారా రిజర్వేషన్‌ల మీద సమాజంలో ఉన్న భ్రమలను తొలగించి, వాస్తవ పరిస్థితులు వివరించాడు.

**<u>జయమ్మ పటేల్</u>:**

అంగన్ వాడీ టీచర్. అగ్రకుల అహంకారం నరనరాన జీర్ణించుకొంది. కుల పట్టింపులు ఎక్కువ. బడి పంతుల్లు అయిన అంటు ముట్టు చూసుకుంటుంది. దళితులంటే చిన్న చూపే. తాను అంగన్ వాడీ టీచర్ అయిన పల్స్ పోలియో డ్యూటి గురించి చెప్పడానికి వెళ్ళిన యాదయ్య పంతులికి స్టీల్ గ్లాస్‌లో నీళ్ళు ఇస్తుంది. రాంబాబు పంతులు దళితుడు కాదనుకోని చెంబులో నీళ్లు ఇస్తుంది. తరువాత రోజు డ్యూటీ సమయంలో రాంబాబు సార్ కులం మాదిగ అని తెలుసుకొంటుంది. ఇప్పుడు ఎక్కడ చూసినా మీరే, ఉద్యోగాలన్నీ మీవే, అందుకే ఇప్పుడు మీ కులంలో పుట్టాలని వెటకారంగా మాట్లాడింది. దానికి రాంబాబుసార్ మాకు పదిహేనుశాతం రిజర్వేషన్‌కు తగ్గట్టుగా తక్కువగానే మేము కొలువులో ఉన్నాము. మీరు 50

శాతం రిజర్వేషన్ పొందుతున్నారని జవాబు చెప్పగానే అక్కడి నుండి జయమ్మ ఇంటి దారి పట్టింది. ఈ పాత్ర ద్వారా రచయిత సమాజంలో ఉన్న భ్రమలను ఆవిష్కరించాడు. ఆమె అడిగిన వాటికి రాంబాబు పంతులు ద్వారా సహేతుకమైన సమాధానాన్ని చెప్పించి వాస్తవికతను ఎరుకపరిచాడు.

**<u>బైండ్ల రాములు / సాయిలు / గౌండ్ల వెంకడు:</u>**

గౌండ్ల వెంకన్న కొడుకు సాయిలు బట్టలు చింపుకుంటు పరుగెత్తుతున్నాడు. అమ్మ, అయ్యా, ఊరిజనం వాడి వెనుక పరుగెత్తుతున్నారు. కుంటలోకి వెళ్ళి నీళ్ళలో మునిగాడు. దగ్గరకు వస్తున్న వారిమీద రాళ్ళను విసురుతున్నాడు. ఎలానో కుర్రాళ్ళు ఒడ్డుకు తీసుకు వచ్చారు. తాళ్లతో కట్టి బట్టలు వేసి ఇంటికి తీసుకు వచ్చారు ఎన్నడు లేంది ఏమైందాన్కి "అది కాద్రా ఆన్కి మాపటీల మాపటీల జ్వరమొస్తుందట, ఆన్కి ఎవడో మంత్రాలు జేసిండు.... ఎవడుండొంచటవ్, ఇంకెవడువొస్తాది. అదిగాక గిసోంటి పాపిష్టి చేతలు చేసేది వాడొక్కడే" (పు.91) అని బైండ్ల రాములు మీద అనుమానం వెల్లబుచ్చారు. దేవుడమ్మ వచ్చి వొళ్ళు మంత్రించి బండారు నోట్లో వేసి పోయింది. అయ్యగారి దగ్గరకు పట్టుక పోరడానికి ఆడీడ డబ్బులు చూచుకొన్నారు.

బయలుదేరే సమయానికి సూర వెళ్ళి, సాయిలును పరీక్షించగా ఒళ్ళు వేడిగా కాలిపోతుంది. ఆసుపత్రికి తీసుకెళ్ళమనగా వాళ్ళు సూరన్ని కూడా తోడు రమ్మన్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన బైండ్ల రాముల్ని చూసిన జనం ఎంకడ్ని వాడి మీదకి ఊసిగొల్పారు. ఎంకడి దెబ్బలకు రాములు సూర స్కూల్‌లోకి పరుగు తీసాడు. సూర అడ్డం పోయాడు. వీడె మావాడికి మంత్రాలు చేశాడని పట్కోని చెట్టుకు కట్టేసి కొట్టసాగారు. సూర అడ్డం పోయి మంత్రాలు, తంత్రాలు అంత వొట్టిదే. దెయ్యం, భూతం లేదు. అవి ఎవరో కావించినవి, మంత్రాలు ఉంటే నాకు చెయ్యమను అన్నాడు. ముందు సాయిలును ఆసుపత్రికి తీసుకు వెళ్దాం అని చెప్పి ఆసుపత్రికి తీసుకు వెళ్ళాడు. డాక్టర్ సాయిలుకి టైపాయిడ్ జ్వరమని సమయానికి తీసుకు వచ్చారు. లేక పోతే మీకు సాయిలు దక్కేవాడు కాదని చెప్పాడు.

సాయిలుకి జ్వరం తగ్గుముఖం పట్టిందని బైండ్ల రాముల్ని విడిచి పెట్టారు. "రాములు వచ్చి సూరని కాళ్లు పట్కోని ఏడ్వసాగిండు. ఇగ పో నీకేం కాదని బరోసా ఇచ్చిండు సూరడు" (పు. 94). ఆసుపత్రి నుండి సాయిలును తీసుకు వచ్చారు. సమయానికి సూరడు వచ్చి ఆసుపత్రికి తీసుకు వెళ్ళాడు కాబట్టి సాయిలు బతికాడు. లేకపోతే చనిపోయేవాడని ఎంకడు జనాలకు చెప్పాడు. "ఆ మాటలిన్న గుడ్డి జనం జర కండ్లు దెర్సిండు. మనం సూరన్ని మాటలతోని బాద పెట్నంగాని ఆ ఆలోచన గింతన్న లేదాయె గదంత సద్వుకుంటే మన్న గానియ్ అందరం కూడ సూరన్ని కాడ్కి పోయి మాది పొరపాటయిందని" (పు. 94) చెప్పడానికి ముందుకు వచ్చారు. "చిన్నా పెద్దా అంతా ఒక్కమాటై సూరన్కి దంఆలు బెట్టింద్రు. ఆళ్లమన్సుల ఉన్నమాటలు పల్కితాల్కి సూరన్కి కొండంత సంతోషం వొచ్చింది. మీ అండ ఉంటే కొండను డీకొనగలను మూడ నమ్మకాల్ని కూకటివేళ్లతోని పారద్రోలగలను కులం కుల్లును, మతం మత్తును పోగొట్టెండ్కు అందరం కంకణ గట్కోవాలే. అందరి చేత పెమానం చేయించిండు! లేననుకున్న లక్యం వైపు ముందడుగేసిండు" (పు. 94). ఈవిధంగా సూర ఊరి జనాల్లో మార్పు తేవడానికి కృషి చేశాడు.

**<u>బైండ్ల పాపడు:</u>**

శక్తులు వస్తాయని "నద్యాల నాల్గు తొవ్వలు కల్సిన కాడ మడిసబొమ్మ రతిగీసి దానిమీద కొబ్బరికాయలు గొట్టి, గుండె మీన, పొట్టమీన ఉంచింద్రు" (పు. 94) బైండ్ల పాపడు. మితి మీరిన మూఢభక్తితోని బరివత్తల నడి రాతిరి ఊరు తిర్గి పూజలు జేస్తే శక్తులు అబ్బుతయని

బైండ్లపాపిగాన్కి నమ్మకం. ఈతంతును గమనించిన పోరలు పాపిగాన్ని పట్కోని పండ్లు ఊడబీకారు. ఊరంతా తిప్పి చెట్టుకు కట్టి చిత్క బాదారు. "గిదంతా జూస్తున్న సూరడు 'వాని మూఢభక్తికి – ఊరిజనం తెల్వితక్వతనాన్కి ఎంజెయాల్నో పాలుపోలేదాన్కి" (పు. 95). ఊర్లో జరిగే అన్ని అనర్థాలకు పాపడె కారణమని వాటన్నించి తిరిగి మంచిగా చేయమని లేకపోతే నరికి పారేసి తూడ్చి బొందవెడ్తమని భయపెట్టారు. దాంతో "దెబ్బల మంటకు ఎం చెయాల్నో తోయక సంప్తరేమోనని బయపడ్డ పాపడు 'ఊల్య ఇదంత నేనే జేస్న నాకు మంత్రాలొస్తయ్' అని ఒప్కుండు. సూరడు ఇదంత తిక్క జోలిగ మీ మీద నమ్మకంగా కొట్టి పారేస్తూ జర్గుతున్న తతంగాన్ని మజ్జెల పెద్దిర్కం జేయబోయిండు. ఎమ్మటే సూదర్లు' అరే సూర నీదేదో నువే జూస్కో పోరలకు నార్గచ్చరాలు నేర్పో, గంతేగని అయిందాన్కి కాందాన్కి ముంగల వడకు" (పు. 95). సూరడు చెప్పిన వాళ్ళు వినలేదు. ఊరికి కొన్ని కట్టుబాట్లు ఉంటాయి. నీకు తెలియదని చెప్పి పంపించారు.

ఏం చేయాలో తెలియక సూర ఇంటికి వచ్చాడు. దిగులుగున్న సూరన్ని చూసిన జయ "ఇగో సూర నేను ముందే జెప్న, ఇది ఊరు, ఈడ మన మాట బేకాతర్ నువ్వేమో నా మాటినక ఏదో ఎల్లబెడ్తని మంకు పట్టు బట్టి ఈడ మకాం బెట్టిస్తివి. మీ అమ్మ చెప్పినా ఇనవైత్వి. నీ మాటింటరని నువ్ పెద్దిర్క జెయ్యబోతే ఇప్పుడేమైంది' సూరన్మీద రుసరుసలాడింది" (పు. 95). ఎందుకు అలా చిటపటలాడ్తవ్ ఒక పని చేయాలంటే నిరీకణ ఉండాలి. ఘోరి భారతదేశం జయించడానికి ఎన్నోసార్లు దండయాత్ర చేశాడు. ఓటమి గెలుపుబాట మలుసుకోవాలి. పాపడు "పిచ్చోడు, వీళ్లు అంతే గిట్లనే ప్రాణాలు తీస్కునేది, తీసేది" (పు. 96) మార్పుకోసం ఒక్కో అడుగు ముందుకు వెయ్యాలి. ఒకేసారి కొండ ఎగబాకలేం గదా. సరేలే ఎవరేమైతే నాకేంది మన కుటుంబం చల్లగుంటే చాలంది జయ. "అట్లంటే ఎట్ల జయ మరి మనం, మనకా విచకణా జానం, వివేకం ఉంది. సృష్టిలో దేనికీ లేని జానం మనకే ఉంది. వాటిలాగే ... చేస్తే... కంప్యూటర్ యుగంల అడ్గుపెట్టెదా? ఇగో చంద్రుడు దేవుడన్కునే ఎన్కటోళ్లకు, మన్సి చంద్రుని మీన కాలుబెట్టి చంద్రుడు దేవుడు కాదు గీ భూమెల్గెనే అదో గ్రహమని నిరూపించిండు గదా.... గిదంత ఎట్ల సాధ్యం" (పు. 96) అని సమాజ మార్పుకు ఓపిక, నిరీకణ ఉండాలని అందుకు పట్టుదలతో పని చేయాలని వివరించి చెప్పాడు. ఈ ఘటనతో సూరనిలో ఇంకా పట్టుదల పెరిగింది. ఊరు మార్పు కోసం ప్రయత్నించసాగాడు.

**<u>దేశ గురువు:</u>**

నాగిరెడ్డి దేశగురువును తీసుకుని వచ్చాడు. దేశగురువు ఊరి బాగు కోసం వచ్చాడని "ఊల్య అప్పుడప్పుడు కీడు జర్గినా ఎవల్కి ఏమైనా, పాణం బాగలేకున్నా సరే ఎవర్కి ఎసోంటి అవుసరమైన గీ గురువుగారు బాగు చేస్తడు. ఎవల్కైనా చెయ్ జూసి జాత్కం జెప్తడు. ఎదన గాలి దూలి ఉంటె తీసేస్తడు. వొందిళ్లుంటె మందేస్తడు. గినితోని సూపిచ్చొరని" (పు. 96) దేశగురువును ఊరికి పరిచయం చేశాడు. "దేశగురువు, పటేలు గూడుపుటానిగ పావులు కదుపసాగిర్రు. అనుమానం ముందుబుట్న జెనాలు బారులుతీరి దేశగురవు కాడ్కి బాట పట్టింద్రు" (పు. 96). దేశగురువు రూపు "సాదు బట్టలు, మెడల రుద్రాక్షలు, చేతిల కమండాలం, మరచెంబు, నొష్టిన బూది, నెత్తి జుంపాలు, పొట్టకాంతున్న గడ్డం, కాట్క కండ్లు, కాళ్లకు చెక్క చెప్పులు, సంకన జోలె, ఒంట్కి ఇభూది" (పు. 96) రాసుకుంటాడు.

జాతకం చూస్తానికి, బాగుచేస్తానికి మటుకు వేలుకువేలు గుంజుకున్నాడు. రాత్రిళ్ళు భజన కీర్తనలు పాడించడం మొదలుపెట్టాడు. ఆ భజనకు మాలలు వస్తే నాగిరెడ్డి చెప్పినట్లు సూదరోల్ల ఆమెకు శిగ మూగసాగింది. "మన గుడికాడ మాలలు రావదూ, దేవుడు మైల వడ్డడు శుద్ధి చెయ్యాలే" (పు. 97) అని చెప్పించాడు. ఊరిలో బొడ్రాయి దారిలో

మునిగిపోయిందని దానిని కనుక్కొని పున: ప్రతిష్ట కార్యక్రమంలో సూరడిని హత్యచేయించాలని నాగిరెడ్డి పథకం వేస్తే దేశగురువు సహకారం అందించాడు. సూరడి మీద దాడి చేశారని అంతకముందే మోసం చేసిన విషయంలో కక్ష పెంచుకోని, గారీబు నాగిరెడ్డిని హత్యచేశాడు. దీంతో దేశగురువు ఊరిలోంచి తోక ముడిచి పారిపోయాడు.

**<u>గారీబు:</u>**

నాగిరెడ్డి బ్యాంకులో జనాల పట్టాదారు పాసు బుక్కులతో లోన్‌లు తీసుకోని వారికి ఎంతో కొంత ముట్ట చెప్పి ఎక్కువ శాతం తానే తీసుకునేవాడు. ఈ జనాల్లో గారీబు ఒక్కడు, బ్యాంకులో లోను తీసుకున్న విషయం నోటీసు వచ్చేవరకు గారీబుకు తెలియదు. సూరడికి చూపిస్తే నోటీసులోని విషయం చెప్పాడు. ఆ విషయం నాగిరెడ్డిని అడగటానికి వెళ్ళారు. లోనుల నోటీసు గురించి చెప్పగా నేను చూసుకుంటాలేరా అని చెప్పగానే "ఔ పటేలా మేం ఈసమల్లి మీ అసోంటి పెద్దలే గిట్లయితే మా గతేం గావాలే ఏ మాత్రం తడబడకుండ ఎదురడ్గె గారీబుగాడు" (పు. 101). దాంతో పటేలు గారీబుతో పాటు వచ్చిన వాళ్ళను బెదిరించాడు పటేలు. "ఎట్నో మాట్లాడ్తుండు రెడ్డి మాటల్కి, గారీబుకు పుర్రె తిర్గింది. ఆ పటేలు మాటల్కు ఇట్లైతే పప్పులుడ్కవని బరాబరిగ పంచితి చేసిండు" (పు. 101). దాంతో "మీ పాసుబుక్కులకు సోంటి సంబందం లేదు. ఆటి గురించి నాకేమెర్కని బుకాయించి" (పు. 101) పోలీసులతో గారీబుని అరెస్ట్ చేయించి, ఉల్టాకేసు బనాయించాడు. పసినాడు తాగిన ముర్రుపాలు కక్కించాడు. మాదే తప్పయ్యిందని రాజీ పడి, పటేలు జోల్కి పోమని కాగితాలు రాసి ఇచ్చారు. కానీ పటేలు మీద కక్ష పెంచుకున్న గారీబు అదును కోసం ఎదురు చూశాడు. బోడ్రాయి పున:స్థాపన సమయంలో సూర మీద నాగిరెడ్డి హత్యాప్రయత్నం చేయించాడని తెలిసి "నిప్పులు గక్కుకుంట... పండ్గ సంబురంల ఉన్న పటేల్ను ఖతం చేసిండు గారీబు.... ఊరిపీడ విరగడైందన్కుంట సరాసరి పోలీసు నాకలకు నడ్సిండు" (పు. 103) గారీబు.

**<u>బస్సు కండక్టర్:</u>**

లంబాడి కులస్తుడు. సర్వేల్ గురుకుల పాఠశాల విద్యార్థి. మెరిట్‌లో ఉద్యోగం సంపాదించుకొన్నాడు. బస్సులో టిక్కెట్స్ ఇస్తూంటే "ఓ లంబాడి లాచ్చిమి ఎక్కిందిగామెకు తెల్గుసరిగ రాక ఇనాంపల్లికి ఒకటయ్యిరయ్యా అనంగనే కాయిచెడోడు, కాయితక్ జానోచ్చు" (పు. 81) కండక్టర్ భాష చూసి ఆమె లంబాడి భాషలోనే మాట్లాడి టిక్కెట్ తీసుకుంది. అంతలో ఓ పెద్దాయన (ఏదో ఊరికి దొర) "మీరు లంబడోల్లా ఎంది కండకుటరా అనడ్గిండు. ఔసారూ.... మీ గిరిజండ్ల, హరిజండ్లు రాసి పెట్కురయ్యా అట పది సద్వంగనే ఏదో కొల్వు దొర్కుద్ది'' (పు. 82) అని వెటకారంగా అని దిగిపోయాడు. కండక్టరు మనస్సులో బాధపడుతున్నాడు. ప్రక్క న్ను సూర వాళ్ళ సంభాషణ గమనీస్తూనే ఉన్నాడు. కండక్టర్ ప్రక్క సీటు ఖాళీ అయితే కూర్చోన్నాడు. "చూడు బై నువు స్టూడెంట్ లెక్క ఉన్నవ్ గాడు సూడు లంబడోడని ఎంత చులకనగ మాట్లాడ్తుండు.... పూకె పుకట్కుం దొర్కినట్లు మాట్లాడ్తరు..... గింతే బై గీ కొడ్కులు ఎంతసేపూ హరిజనులు, గిరిజనులు మీదనే ఎడుస్తరు ఊళ్యల్ల పెత్తనాలు గీల్లయ్య ఊర్నిండ భూములు గీల్లయ్య, పెద్దపెద్ద కోల్కులు గీల్లయో, లీడర్లు వాళ్లె వాలె నాకొడ్కులు గాల్లె గాని మనం చిన్న చెప్రాసి పని జేసినా ఓర్వరు" (పు. 82) అని కండక్టర్ని ఓదారుస్తూ మాట్లాడాడు.

"మనం ఇంత సద్ని ఆ కులం రంగుపూసి, చులకన జేసి, ఎదిస్తనే ఉంటరు. ఆల్లముంగల మనం ఎప్పుడు ఎన్కటోళ్ల లెక్క చేతులు గట్కోని ఊడిగం జేస్తే బాగుండబు మనం సద్వి సూటు బూటిస్తాల్క కొడ్కుల్కి మింగుడవడదు. ఎంతసేపు ఎల్తికాలం అని హీనంగా జూస్తరు" (పు. 82) ఈ గడ్డలో పుట్టినందుకు అనుభవించాలని కండక్టర్ బాధ పడ్డాడు. "గట్లంటే

ఎట్లబై కొడ్కుల గిట్ల మాట్లాడ్తోల్ల ఎమ్మటే వాళ్లను నిలదీయాలే సూద్రా మా ప్రతిభ అని లోకానికి చాటవే అంబేత్కర్ ఎవడు గాయిన పుణ్యమే గద ఈ రాజ్యాంగం గీ కొడ్కులకు చేతగాకనే గా పురాణకాలం జాంబవంతుని ముంగల నడ్పిచ్చి నిచ్చెనమెట్ల సంస్కృతి తెచ్చింద్రు. గియాల్ల అంబేత్కర్‌ను ముంగలబెట్టి రాజ్యాంగం రాపిచ్చి నీకే న పెత్తనం ఇస్తున్న అని మనలెవరు పడకుండ జేసిద్రు. ఆశ జూపిచ్చిద్రు. గిన్నేండ్లు మనల బానిసలుగ జూసిద్రు. గియ్యాల తెల్లపుల్లగ కంగనే కండ్లు మంతున్నయ్ కొడ్కులకి, ఏదో మీద్కి అట మాట్లాడ్తరు గాని ఆళ్ల కడుపుల అంతా ఇసమే అంతెందుక్ ఆయన మనింట్కివొస్తే దొరొచ్చిండని కుర్చిదెచ్చేస్తం, అదే మనం పోతే గాని గుమ్మంల నిలవడాల.... అందరమొకటి ఎన్నడైతమో.... గీ మనువాదులు ఎప్పుడో ఒకనాడు ఏకంగాక తప్పదు.... ఎక్వతక్వలు కాల ప్రవాహంలో కొట్కపోక తప్పదు" (పు. 83) అని సూరడు కండక్టరుకి ధైర్యం చెప్పి, ఊరటనిచ్చాడు.

**<u>సూర నవల:</u>**

దళిత సాహిత్యోద్యమ ప్రభావం ఇంకా ప్రసరిస్తూనే ఉన్నదనడానికి దళిత నవల 'సూర'ని నిదర్శనంగా పేర్కొనాలి. పరాశ్రయ రీతిలో రచన సాగినా, ఆత్మాశ్రయ రీతిలో రచనసాగినా నవల రచన ముమ్మూర్తులా సమకాలీన దళిత జీవితానికే అద్దం పడుతోంది. ఉన్నూళ్ళో దొర, పటేండ్ల పీడనుంచి విముక్తం కావడానికి పట్నం వలస వచ్చినప్పటికీ దళిత కుటుంబాలు ఏదో ఒకరకంగా దోపిడీకి గురి అవుతూనే ఉన్నాయి. అక్షరం ఇప్పుడు దళితునికి అందుబాటులోకి వచ్చిందని, అక్షరాన్ని ఆసరా చేసుకొని తమ బతుకులు మెరుగు పర్చుకోవచ్చుననే ఆశయం రచయిత భూతం ముత్యాలుది. మారుతున్న కాలంలో దళితులు అభ్యుదయం వైపుగా పయనించకుండా దొరలు, పటేండ్లు అడ్డుకుంటున్నారంటాడు. నూతన ప్రజాస్వామ్యం పథంవైపు దళితుల్ని అడుగులు వేయకుండా గుదిబండలవుతున్నారని నవలలో చూపించారు. అన్నింటికంటే మిన్నగా వర్ణాంతర వివాహం కల్పించడాన్ని అగ్రవర్ణాల వాళ్ళు జీర్ణించుకోలేకపోయారు. ఫలితంగా దాడులు, బెదిరింపులు ఇలాంటి గడ్డు సమయంలో కథానాయకుడు సూర(డు) దొరల, పటేండ్ల బారినుండి తమ జాతిని రక్షించాలని ప్రయత్నించాడు. 'పూలే అంబేద్కర్' పాఠశాల పెట్టి దళితుల్ని చైతన్యవంతుల్ని చేశాడు. మూఢనమ్మకాల నుంచి తనజాతి ప్రజల్ని బయట పడేయకలిగాడు. దానితో కళ్ళు తెరిచిన దళితులు సూర(ని) నేతృత్వంలో ఒకటై పెత్తందార్ల పనిపట్టారు. నాగిరెడ్డి పటేలును నరికి తమ ఆగ్రహాన్ని వెల్లడించుకుంటారు. రచయిత భూతం ముత్యాలు సూర(ని) సంస్కరించి, దళిత సూరీడును తలపించే నాయకుడుగా.

'గో బ్యాక్ టుది విలేజెస్'ని సమర్థించే దిశగా నవలా రచన సాగడం కథావస్తువుకు బలాన్ని చేకూర్చింది. అలాగే వర్ణాంతర వివాహం నవలకంతటికీ హైలెట్‌గా మారుతుంది. మా జాతివాళ్ళు అవిద్యావంతులయినందువల్లే దోపిడీకి గురి అవుతున్నారని గ్రహించిన సూర(డు) తన గూడెంలోనే పూలే – అంబేద్కర్ పాఠశాలను పెట్టి అందరినీ చదువుకునేట్టు చేశాడు. మూఢనమ్మకాల్ని పారద్రోలేందుకు శాయశక్తులా ప్రయత్నించాడు. వస్తువు స్వభావానికి తగిన రచనా శీర్షిక 'సూరి'.

సామాజికపరంగా అగ్రవర్ణాల – దళితుల నడుమ కొనసాగుతున్న ఆధిపత్య పోరాటం చివరికి హత్యలు, ఖూనీలతో నవల కథ ముగుస్తుంది. నిజానికి శ్రమ దోపిడీతోపాటు దళితుల ధనం కూడా దోచుకోబడడం వల్లే పగ తీర్చుకోవాలనే నిర్ణయానికొచ్చారు దళితులు. నాగిరెడ్డి భూస్వామి ఏమీకాదు, తెల్లబట్టలు వేసుకుని తిరుగుతూ ఆఫీసుల్లో పైరవీ చేస్తూ ధనం సంపాదించాడు. కాశిరెడ్డి పట్వారీతనం ఉంది కాబట్టి దళిత దంపతుల్ని మోసం చేయగలిగినాడు. అంటే కేవలం పెద్దకులపోల్లు కావడం చేతనే నాయకులుగా తిరగడం, పలుకుబడిని ఉపయోగించుకొని పనులు చేయించుకోవడం, ఆ దర్పంతో దళితుల్ని దోచివేయడం ఇదీ నల్గొండలోని దొరల పటేండ్ల

సంగతి. పటేండ్ల ఇండ్లలోని స్త్రీలు వ్యభిచారం చేయడం, పటేండ్లు దళిత స్త్రీలతో తొడ సంబంధాలు పెట్టుకోవడం సామాన్యంగా కనిపించే అంశం. కానీ సూర(ని) విజయలక్ష్మిల వర్ణాంతర వివాహం సామాన్యం కాలేకపోయింది.

ఇదీగాక నాగిరెడ్డి వూర్లో ఉన్న దళితుల పాసుబుక్కులు బ్యాంక్‌ల్లో పెట్టి వాళ్ళకి అప్పులు ఇప్పిస్తానని సంతకాలు చేయించి వచ్చిన డబ్బులన్నీ తానే కాజేశాడు. ఇక చెన్నని చెల్లెలు రంగిని వివాహేతరంగా ఉంచుకోవడం కూడా నాగిరెడ్డి అవగుణాల్నే తెల్పుతున్నాయి. అంతేగాదు నాగిరెడ్డి తమ్ముడు రామిరెడ్డి భార్య కళమ్మ చెంద్రం అనే దళితునితో అక్రమ సంబంధం పెట్టుకొని వానితోనే లేచిపోయింది. నాగిరెడ్డి బావమరిదేమో చెంద్రిమీద కన్నేసి సూరని చదువని, హాస్టల్ ఉద్యోగమని తనింటికి తీసుకుపోయి శీలాన్ని దోచాడు. పటేండ్లు పక్కా క్రిమినల్స్‌గా సూర నవలలో కనబడతారు. చెన్నడు, చెంద్రి దళిత దంపతులు మొదటి తరానికి చెందినవారైతే, సూర(డు), జయలక్ష్మిలు రెండో తరానికి చెందిన దళిత దంపతులు, రెండు తరాల నడుమ సామాజిక చైతన్యంలో భేద సాదృశ్యాలున్నాయి. కాశిరెడ్డి పట్వారితనం చేతిలో పెట్టుకొని చెంద్రి శీలాన్ని అపహరించగలిగాడు. దళిత దంపతుల నుంచికాని, దళిత ప్రజల నుంచి కానీ ప్రతి ఘటన ఏమీ రాలేదు. అగ్రవర్ణాలు తలుచుకుంటే అనుకున్నవి నెరవేర్చుకుంటారు గదా! అలాగే దొర కూతురు జయమ్మ సూరని చుట్టూ తిరగడమేగాదు వాణ్ని కొంగుకు చుట్టేసుకొంది. రచయిత పరోక్షంగా ప్రతీకారం తీర్చే విషయంగా ఈ సంఘటనలని కల్పించాడేమో అనిపించేలా ఉందీ కథనం.

దళితుల విద్య, ఉపాధుల విషయంలో రచయితకు తనకంటూ కొన్ని అభిప్రాయాలున్నాయి. పై చదువులు చదివిన వాళ్ళంతా ఐఎఎస్, ఐపిఎస్‌లు కావాలనుకోవడం లేదు. వ్యక్తిగత జీవితానికీ ప్రాధాన్యన్ని ఇవ్వాలని లేదు. అలాగే వివాహాల విషయంలో పాతపద్ధతినే కోరుకోవాలనుకోవడం లేదు. అందుకే సూరని జీవితాన్ని మలుపుతిప్పి, పట్నంలోంచి పల్లెటూరికి రప్పించి, అంబేద్కర్ సిద్ధాంతం అనుసరించి పాఠశాలని పెట్టించాడు. పాఠశాల పెట్టిన తొలిరోజుల్లో తన జాతి వాళ్ళే సహాయ నిరాకరణ చేస్తే సహించడు. తన ధ్యేయాన్ని నెరవేర్చుకోవడానికి అవమానాలు భరించాడు. తనపై జరిగిన దాడుల్ని సహించాడు. మూఢనమ్మకాల్లో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్న దళితుల కళ్ళు తెరిపించాడు. ఇదంతా నవలా రచయిత కోరుకున్నదే. నల్గొండ మాండలికంలో ఇదివరలో వచ్చిన తెలుగు నవల 'కక్క'కు సరసన నిలబెట్టగల నవల 'సూర'.

"నవలాకారుడు రూపొందించిన పాత్రల్లో విభిన్న మనస్తత్వాలు కనిపిస్తాయి. చెంద్రి పాత్రకు రంగి పాత్రకు బోలెడంత వ్యత్యాసం కనబడుతుంది. ఒకరు శీలాన్ని ప్రాణప్రదంగా చూసుకుంటే మరొకరు మంచినీళ్ళ ప్రాయంగా శీలాన్ని పటేండ్లకు అర్పిస్తారు. కళమ్మ జారకాంతయితే అదే వర్గానికి చెందిన జయలక్ష్మి శీలవతియై మగనాలిగా సంసారం చేసింది. నాగిరెడ్డి, కాశిరెడ్డి ఫక్తు వ్యభిచారులు. చెన్ననిలో ఏ వికారాలు కనిపించవు. కాని భార్య చెంద్రి ప్రోద్బలంతో మూఢనమ్మకాల్లో కురుకుపోయాడు." (ననుమాస స్వామి 2014: ) సూర నవల ముందు మాటలో విశ్లేషణ చేశారు.

**<u>అంబేద్కరిజం – సూర నవల:</u>**

అంబేద్కర్ సిద్ధాంత ప్రభావం ఈ నవల మీద స్పష్టం అవుతుంది. సమాజాన్ని అంబేద్కర్ దృష్టితో పరిశీలిస్తే దాని స్వభావం అర్థం అవుతుంది. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను విశ్లేషించడానికీ, వ్యాఖ్యానించడానికీ ఆర్థిక విధానం తగిన పద్ధతి కాదు. సూర నవలలో ఆర్థిక నిర్ణాయకవాదం యొక్క ప్రభావం శూన్యం. పునాది, ఉపరిత విధానం పద్ధతిలో నవలా రచయిత భూతం ముత్యాలు సమాజాన్ని వింగడించలేదు. కులం అనే ధాతువు సంఘశరీరంలో ఎలాంటి చలనాలకు కారణమవుతుందో తెలుసుకొనే కృషి ఆయన చేశాడు. 'ఫూలే – అంబేద్కర్

పాఠశాల' ఏర్పాటు చేయటం ద్వారా నవలలోని ప్రధాన నాయకుడు తన ఆలోచనా విధానాన్ని, లక్ష్యాన్ని స్పష్టం చేశాడు. అంబేద్కర్ ప్రారంభించిన సాంఘికవిప్లవ ఉద్యమాన్ని సూరడు కొనసాగించాలని సంకల్పించాడు. నవల ఇతివృత్త కూర్పులోనూ, ప్రధాన కథా కథనంలోనూ, ఆనుషంగిక కథల ప్రస్తావనలోనూ అగ్రకులస్తుల ఆలోచనలకు, వాదనలకు సరైన సమాధానం చెప్పాలనే ఆలోచన వ్యక్తం అవుతుంది.

సూరడు సంఘపరివర్తన తన ఆశయమని చెప్పుకుంటాడు. కులాల మధ్య రక్తసంబంధం ఏర్పడాలని సూరడు ఆశిస్తాడు. రక్తసంబంధాలకు మార్గం వేసేది ప్రేమ. కళమ్మ చంద్రాన్ని ప్రేమించే సంఘటన ఇందుకు ఉదాహరణ. కళమ్మ నాగిరెడ్డి తమ్ముడి భార్య. చంద్ర జీతగాడు. చంద్రతో లైంగిక సంబంధం పెట్టుకొన్న కళమ్మ ఒకరోజు చంద్రను తీసుకొని లేచిపోయింది. నాగిరెడ్డి ఈ విషయాన్ని తీవ్రంగా పట్టించుకున్నాడు. కళమ్మను వెతికిపట్టుకొని చిత్రహింసలుపెట్టి వెలేశాడు. కళమ్మకు గుండుగీయించి, సున్నంబొట్లుపెట్టి హింసించటం, ఆమె పిరుదుల మీద వాతలు తేలేలా కొట్టడం అంతా రక్త సమ్మిశ్రణం కాకుండా హింసను ఆయుధంగా ఎంచుకొనే క్రమమే. నాగిరెడ్డి అగ్రకుల స్త్రీలు దళితులతో సంబంధం పెట్టుకోకుండా చూడాలని ప్రయత్నించాడు. కానీ ఆపడం అసాధ్యం.

సూరడు చదువుకుంటున్న సమయంలోనే జయలక్ష్మి ప్రేమలో పడింది. వెలమ దొర కూతురైన జయలక్ష్మి మాలకులస్తుడైన సూరన్ని ప్రేమించటం నాగిరెడ్డి సహించలేకపోయాడు. కానీ జయలక్ష్మి ప్రేరణ, పట్టుదల వల్ల సూరడు ఆమెను కులాంతర వివాహం చేసుకున్నాడు. కులాంతర వివాహాలు, కులాంతర భోజనాలు కుల వ్యవస్థను మార్చే అనేక సాధనాల్లో ఒక రెండు మార్గాలు. పట్నంలో ఉన్న చెన్నను ఎతుక్కొంటూ సూరని ఇంటికి నాగిరెడ్డి, కాశిరెడ్డి రావటం, కాశిరెడ్డి తన ఇంటికి తీసుకెళ్లి సూరని తల్లిమీద అత్యాచారం చేయటం అన్నీ ఒక విషయాన్ని సంకేతిస్తున్నాయి. అంటరానితనం పెద్ద సమస్యగా ఈ నవల చర్చించటం లేదు. రెడ్లు, వెలమ, అగ్రకులాలు మాలమాదిగలను ముట్టుకుంటారనీ, వారితో కలిసి భోజనం చేస్తారని ఈ నవల చెప్తుంది. అయితే, రాజకీయ పెత్తనం మాత్రం ఆ రెండు కులాల చేతిలో వుండాలని ప్రయత్నించటం కనిపిస్తుంది. అందుకే, అగ్రకుల పెత్తనం ధ్వంసం కావాలంటే ఎస్సీ, బీసీల మధ్య ఐక్యత తీసుకురావటం అవసరం. సూరడు బీసీలను కూడా కలుపుకురావటం కనిపిస్తుంది. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సూరడు పనిచేసి బీసీలను ఒప్పిస్తాడు. అదేవిధంగా ముస్లింలు కూడా సూరనికి సహకరిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యత ద్వారా రాజకీయ అధికారాన్ని వికేంద్రీకరించాలన్న ఎత్తుగడ సూరనిది.

అందుకే, సూరన్ని చంపాలని నాగిరెడ్డి ఆలోచించాడు. ఈ పన్నాగాన్ని అర్థం చేసుకొన్న గరీబు నాగిరెడ్డిని నరికిచంపాడు. ఈ మొత్తం అంతటా అంబేద్కర్ ఆలోచన కనిపిస్తుంది. అంబేద్కర్ హింసను ప్రతిపాదించలేదు. అంతమాత్రాన ఆయన హింసకు వ్యతిరేకం కాదు. సమతా సైనిక్‌దళ్ ఏర్పాటు చేసి అగ్రవర్ణాలు చేసే భౌతికదాడులను ప్రతిఘటించే శిక్షణను అంబేద్కర్ అందించారు. ఆయన సుదీర్ఘ పోరాటంలో ఎంతో మంది కార్యకర్తలు హత్యగావించబడ్డారు. సమతా సైనిక్ వీరుల చేతిలో అనేక మంది పరాజయం పాలయ్యారు. అయితే, నాగిరెడ్డిని గరీబు చంపటం అనివార్యమైన సంకేతమని చూడాలి. రచయిత ఆలోచన పరిమితి ఇది. నాగిరెడ్డిని రాజకీయంగా హత్యచేయాల్సింది. అంటే, ఎన్నికల వ్యవస్థ కల్పించిన ఓటు ఆయుధం ద్వారా నాగిరెడ్డిని అధికార హీనున్ని చేయాల్సింది. కానీ మొత్తం నవలలో ఎక్కడా పార్లమెంటరీ రాజకీయాల గురించిన చర్చ రాలేదు. అంబేద్కరిజం అంటేనే పార్లమెంటరీ పాలిటిక్స్. అగ్రవర్ణాల ఆధిపత్య రహస్యం అధికారం. సూరని ఆలోచనా విధానం శాస్త్రీయ దృష్టితో రెడ్డి, వెలమ ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడటం వరకే పరిమితమైంది. రాజ్యాధికారం

వైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చైతన్యవంతులను చేస్తే నాగిరెడ్డి కోరలు పీకిన పాములా మారిపోయేవాడు. అటువైపు భూతం ముత్యాలు ఆలోచించలేదు. అందుకే, సూరని చైతన్యం అసమగ్రమైంది. అది పార్లమెంటరీ విధానంలో అంతిమ పరిష్కారం కనుక్కోలేకపోయింది. నాగిరెడ్డిని చంపిన గరీబును ప్రశంసించటంతో ముగిసింది. అయితే జ్ఞానం ద్వారా సంఘాన్ని మార్చాలనే అంబేద్కర్ ఆలోచనకు సూరని పాత్రను తార్కాణంగా తీర్చిదిద్దడంలో రచయిత విజయవంతమయ్యాడు.

**2.2.4. తెలంగాణ భాష - సూర నవల:**

తెలంగాణ జిల్లా నల్లగొండ నవలలోని కథా ప్రదేశం. నల్లగొండ జిల్లావాసులు మాట్లాడుకొనే వ్యవహార భాషనే రచనాభాషగా రచయిత ప్రయోగించాడు. **భాషా**శైలిల విషయంలో ఎంత మెచ్చుకున్నప్పటికీ నల్గొండ మాండలికం సాఫీగా సాగనివ్వదు. అందులో నవల సూటిగా సాగినా, సన్నివేశాలు దళితుల్లో ఒక వర్గానికి చెందిన సూర(న్ని) కేంద్రంగా చేసుకొని, సంస్కృతిని వర్ణిస్తే మరింత నిండుతనం వచ్చేది. ఇక పాత్రల మనస్తత్వాల్ని ప్రవర్తనా సౌలభ్యం, సానుకూలతలను బట్టి చిత్రించినట్లయితే దళితుల ఆలోచనా విధానం బహిర్గతమయ్యేది. తెలంగాణ మాండలికంలో కథలు, నవలలు హెచ్చుస్థాయిలో రావాల్సింది అని కోరుకునే అభిమానులకు ఈ నవలకొంత ఊరటని కలిగి**స్తుంది**. వేముల ఎల్లయ్య ఇలా అంటాడు “సూర దళిత నవల. రచయిత ఇందులో గో బ్యాక్ టు విలేజ్ సిద్ధాంతాన్ని బలపరుస్తూ రచన సాగించటం వలన నవలకు బలం చేకూరింది. సంభాషణల్లో యధాతథంగా శుద్ధ గ్రామీణ మాండలిక భాష వాడుకోవడం విశేషం. తెలంగాణ మాండలిక భాషలోని పదజాలం, సామెతలు, సొబగులు ముత్యాలు రచనలో విరివిగా కనువిందు చేసి చదువరులను ఆకట్టుకుంటాయి. తెలంగాణ మాండలికంలో అందునా నల్లగొండ మాండలీకంలో ఈ రచన సాగుతుంది” (తెలంగాణ మాండలికంలో కొత్త ముత్యాలు, వివిధ, ఆంధ్రజ్యోతి, సోమవారం 7 ఏప్రిల్, 2014) అని వివరిస్తాడు. సన్నివేశ వర్ణణతో పాటు సంభాషణలు కూడా తెలంగాణ భాషలోనే నడుస్తాయి. నల్లగొండ జిల్లాలోని విద్యావంతులైన మాలలు మాట్లాడుకొనే భాషా విశేషాలు కనిపిస్తాయి. వేముల ఎల్లయ్య ఉపయోగించే భాష కన్న కాస్త సరళమైన భాష భూతం ముత్యాలు ప్రయోగించాడు. తెలంగాణ దళిత భాషను శక్తిమంతంగా భూతం ముత్యాలు ఈ నవలలో వినియోగించాడు.

**కొన్ని పదాలు గమనిద్దాం:**

దత్రాలోడ = పిరికివాడు (పు. 2)
పాయిదా = లాభం (పు. 2)
దూప = దాహం (పు. 4)
పావురం = ప్రేమ (పు. 7)
ఎగుసం = వ్యవసాయం (పు. )
మచ్చం = కొంచెంకూడా, ఏమాత్రం (పు. 13)
ఇగురం = వివరం
ఆయితారం = ఆదివారం (పు. 14)
వొయ్యిలు = పుస్తకాలు(పు. 19)
మెత్లాయ్ = కలిసిపోవటం, సన్నిహితం
సోపతి = స్నేహం (పు. 31)
శెరలు = కష్టాలు (పు. 30)
గెండెల = గుండెలు (పు. 30)

చింతబర్గెలు = చింతబెత్తులు (పు. 30)
బత్తీలు = చాడీలు, అబద్దాలు (పు. 31)
గన్మ = గడప (పు. 33)
యారాలు = తోడి కోడలు (పు. 34)
గావు = గాబు, నీళ్లగోళెం (పు. 34)
కమ్మలు = తాటిఆకులు (పు. 35)
ఇజ్జర మజ్జర = ఇయ్యరమయ్యర,చితక్కొట్టడం (పు. 38)
ఆష్కలు, బుష్కలు = తిమ్మినిబమ్మినిచేసి (పు. 43)
ఈతంగ = రుచిగా (పు. 44)
బండారు = పసుపు (పు. 44)
పయ్య = చక్రం (పు. 50)
పురండం = పురాణం (పు. 50)
జోలి = సంభాషణ, మాటలు (పు. 51)
కాయిసి = ప్రేమ, ఇష్టం (పు. 51)
పొతం = మంచి, చెడ్డలను వేరుపర్చటం (పు. 25)
ఊకుంచ = సముదాయించటం (పు. 61)
గీములాడు = ఘర్షణపడుట, బతిమాలుట (పు. 61)
బందిని = బంధించబడిన
నవిసినవిసి = అనారోగ్యంతో క్షీణించటం (పు. 63)
చెర్దుబాటు = చేతబాడి (పు. 64)
పెయి = శరీరం (పు. 64)
శామడ మాసం = శ్రావణమాసం (పు. 67)
దస్తులు = విరోజనలు (పు. 69)
మన్సు = మనస్సు (పు. 81)
పోదాం = ప్రాణం (పు. 94)
పుద్వాం = పుణ్యం (పు. 94)
గౌర్తం = గర్వం (పు. 64)
రేకల వారక ముందే = తెల్లవారక ముందే (పు. 73)
ఇనయం = విషయం (పు. 75)
మెల్తామ్ = పరిచయం వున్న వ్యక్తి సిఫార్సు (పు. 75)
ఇగురం = పద్దతి(పు. 8)
మండి = సంత (పు. 9)
సుతార్ పని = తాపీపని (పు. 11)
మాపడ్కి = రాత్రికి (పు. 17)
నాక్రేం బట్టిండు =నాశనమయ్యాడు (పు. 19)
పడావు బడే = పాడుబడడం (పు. 20)
జిమ్మ = ఆలోచన (పు. 27)
మూడు రోకుల = ముప్పూటల(పు. 38)
శెల్కలు = పొలాలు (మెట్ట) (పు. 40)
ప్రక్కల దొర్లడం = ప్రక్కన పడుకోవడం (పు. 43)

బొంకడం = అబద్ధాలు చెప్పడం (పు. 43)
పెద్దింటోళ్ళు = మాదిగోళ్ళు (పు. 45)
58) తిర్మనిదార్లు, నిల్వునామాల వారు = మాలలు (పు. 45)
59) బాజతి = బాధ్యత (పు. 45)
60) శిగం = పూనకం (పు. 45)
61) పీక్లాట = గొడవలు (పు. 46)
62) కారటు ముక్క = కార్డుముక్క (పు. 46)
63) జమిడీకె గట్టింది = గొడవ గొడవ చేసింది (పు. 47)
64) కులిర్తి = కులవృత్తి (పు. 56)
65) సుత్లాయించుత = చూసి ఇస్తాను, సహాయం చేస్తాను (పు. 57)
66) కీసం = కొంచెంలో (పు. 58)
67) ముచ్చిర్కాలు = (అకరాలు) కాగితాలు రాయించడం (పు. 59)
68) తాశిల్ది =దరిద్రపుది(పు. 60)
72) గున్సుకుంట =గొనుక్కుంటూ (పు. 63)
73) అమాసపున్నం = అమావాస్య, పౌర్ణమి (పు. 64)
74) ఎచ్చిడి చేయడం = ఎగతాళి, ఆటపట్టించడం (పు. 65)
75) ఆష్కంగ (వాదనలు) =పరిహాసం, వేళాకోలం(పు. 65)
76) సుతార =కష్టం (పు. 66)
77) పుర్గం బువ్వ =పులిహోర అన్నం(పు. 68)
78) పల్హాడం = ఫలహారం (పు. 68)
79) యాపరిల్లలు = వేపరెమ్మలు (పు. 68)
80) వొర్సకు = వరసకు (పు. 68)
81) ముర్క = వాసన (పు. 68)
82) నోటాయిరి = (పు. 69)
83) కిరాస్తాన పోళ్లు = క్రైస్తవులు (పు. 70)
84) నాతిటీల = రాత్రిపూట (పు. 71)
85) ఇంటి ముంగల ఆలింది = ఇంటి ముందు వాలింది (పు. 71)
86) ఎచ్చిడైంది =ఎగతాళి(పు. 72)
87) పొల్ల =అమ్మాయి(పు. 72)
89) టక్కయిన = ఆశ్చర్యం (పు. 72)
90) దుడ్డెగాండ్లు = కుర్రోళ్ళు (పు. 72)
91) డిల్లకి పాటలు = హాస్యపు పాటలు(పు. 72)
92) అసుంట = దూరంగా (పు. 72)
93) దుల్సాయిచ్కోని = తప్పించుకొని (పు. 73)
94) మండిలకాయి = మనుష్యుల దగ్గరకు (పు. 73)
96) మత్లావ్ = మతలబులు (పు. 76)
97) ఎమ్మటి = వెనుక, తోడు (పు. 76)
98) రగుతం = రక్తం (పు. 76)
99) బుగులు = భయం (పు. 76)
101) సట్టుపట్టడం = పట్టుపట్టడం (పు. 76)

గోస =బాధ (పు. 77)
వూకె = ఉచితం (పు. 82)
పుక్కటం = ఉచితం(పు. 82)
ఆరాజు పొట = వేలంపాట (పు. 89)
తొవ్వ = త్రోవ, దారి (పు. 94)
అంగోనిషాన = వేలిముద్ర (పు. 100)

**<u>సామెతలు :</u>**

సామెతలు సాంస్కృతిక నిర్మాణాలు. సంస్కృతి కులభూయిష్టం. అందుకే, సామెతలు కుల వ్యవస్థలోని ఆధిపత్య విలువలను ప్రదర్శిస్తాయి. కులపీడన, కులపరమైన హేళన స్పష్టంగా కనిపిస్తాయి. సాధారణీకరించిన అనుభవాలను ఒక సూత్ర రూపంలో వ్యక్తం చేయటమే సామెత. అయితే, అన్ని కులాల మీద నిందాపూర్వకమైన సూత్రీకరణ ఉంటుంది. అలాంటివి ఈ నవలలో సందర్భానుసారం రచయిత భూతం ముత్యాలు సామెతలు ప్రయోగించాడు. మచ్చుకు కొన్ని ఇక్కడ ప్రస్తావిస్తాను.

1) మాలోన్ని మందలీయకనే కొట్టాలి. (పు. 3)
2) తుర్కోడెంతో తుమ్మముల్లు అంత. (పు. 3)
3) ఏడ పొందనోడు పొయ్‌కాడ పొందినట్లు. (పు. 3)
4) మూడు రూపాయల ముండ పులుసు, పది రూపాయల పచ్చి పులుసు. (పు. 18)
5) మా అత్త ముడ్ల పుణ్యాన దోరోళ్ళ వడ్ల పుణ్యాన తిన్నాను. (పు. 18)
6) సంగీతానికి చింత కాయలు రాలవు. (పు. 18)
7) పెసర చేలో పోగొట్కోని, పప్పుట్కల దెవులాడె ఎట్ల (పు. 33)
8) దేనికైన సమయం రావాలి. ఉర్కుర్కులాడి పస్లగాస్తే పొదుక్తాదీ. (పు. 33)
9) బతికి చెడ్డోని భాగ్యం చూడు, చెడి బతికి నోడి చెంపలు చూడు (పు. 34)
10) ఆడిల్లు న్నోన్కి ఆ కర్వు, ఊల్యున్నోన్కి పూ కర్వు. (పు. 35)
11) కోర్కె రేగితే బ్రహ్మకైనా తప్పలే రిమ్మతెగులు (పు. 36)
12) నిండా ముగ్గితే సలొదుల్తది. (పు. 37)
13) సావసం జేస్తె సచ్చిందాక ఉండాలి. (పు. 39)
14) ఎదుర్జూసిన పొద్దు రానే వచ్చింది. (పు. 41)
15) ఎదుర్జూసి ఎత్కపోయిన తీగ కల్గి తర్గల్నటు (పు. 41)
16) గొర్రె కసాయిని నమ్ముతుంది. (పు. 42)
17) ముందల ముర్సినమ్మ పండ్గ గుర్తెర్గంటే గిదేమరి. (పు. 44)
18) పుక్కిట్ల పుట్టింది పురాణం, పూకుతో నొచ్చింది కలియుగం. (పు. 53)
19) ఒకరి మొఖం సూసై పెట్టబుద్దైతది, ఒకరి మొఖం సూస్తే తిట్ట బుద్దైనట్లు (పు. 57)
20) అల్గి అత్త గారింట, చెడి చెల్లెంట్కి పోగూడదు. (పు. 60)
21) లోకంతో పాటు లోట లోట అనాలే (పు. 61)
22) డిల్లికి రాజైన తల్లికి కొడుకే (పు. 70)
23) మొండోనాతులు దండోడు పీకలేడు. (పు. 71)
24) సూరు కాలి వగడెడుస్తుంటే సుట్టకు నిప్పులేక ఒకడేడుస్తుంటట. (పు. 6)
25) ఎక్కడ ఏసిన గొంగలి అక్కడే అన్నట్లు. (పు. 77)
26) ఒంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు సచ్చినట్టు. (పు. 90)

**<u>సూర కథాకథనం:</u>**

రచయిత కథను చాలా వ్యూహాత్మకంగా నడిపాడు. కథ చలనంలో వుంటుంది. ఒకేచోట మొదలై అక్కడే ఆగిపోదు. కథ ఎదుగుతూ పోతుంది. కథలోని పాత్రలు కూడా కాలానుగుణంగా ఎదుగుతూ లేదా పతనమవుతూ పోతాయి. ఒక పరిణామక్రమం కథలో కనిపిస్తుంది. ఆ పరిణామక్రమం పాత్రల ప్రవర్తనలో, ఆలోచనలో కనిపిస్తూ వుంటుంది. సూరని తల్లిదండ్రులతో కథ మొదలవుతుంది. సూరడు అగ్రకులస్తులతో ఘర్షణపడే వయసుకీ, చైతన్యానికీ ఎదిగిన ఒక క్రమాన్ని తెలుపుతాడు. సర్వసాక్షి కోణంలో కథనం సాగుతుంది. రచయితే అన్నింటినీ పాఠకుడికి తెలుపుతాడు.

**<u>సూర నవలాశిల్పం:</u>**

ప్రధాన కథను బలపర్చే అనేక ఉపకథలను రచయిత అల్లుకుంటూ పోతాడు. ఆ కథలన్నీ ప్రధాన పాత్రలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ముడిపడివుంటాయి. సూరడి ప్రేమాయణం, వూళ్లోని అనేక సంఘటనలు, కాశిరెడ్డి ప్రవర్తన, చంద్రి మీద జరిగిన అత్యాచారం, జానకమ్మ కథ అన్నీ పూలదండలో దారంలో కలిసిపోతాయి. సన్నివేశాన్ని ప్రత్యేకంగా వర్ణించే పని చేయడు. సంఘటన చోటు చేసుకొనే తీరే తప్ప ప్రత్యేక వర్ణనలంటూ వుండవు. అత్యంత దారుణమైన సన్నివేశాన్ని కూడా ఒక్క మాటలో చెప్పి ఎంత ఘోరం జరిగిందో పాఠకుడికి స్ఫురింప చేస్తాడు. చంద్రిమీద జరిగిన దాడిని చెప్తూ "ఏటకాని బాణం దెబ్బ తిన్న దుప్పిలా గిలగిలలాడింది చెంద్రి. దుల్పాయించుకోలేక వలలో చిక్కిన చేపలా తన్కులాడింది చెంద్రి. కసాయిని నమ్మిన గొర్రైంది చెంద్రి. దొంగ పస్రంలా జొరవడ్డ కాశిరెడ్డి కసిదీర తొక్కి కడుపార మేసి గెట్టుదాటిండు" (పు.42). దొంగ గొడ్డు చేనులో జొరబడి మేసే సందర్భంలో దాని ప్రవర్తన భయంకరంగా వుంటుంది. దాని బీభత్సం వల్ల అది తినటం వల్ల జరిగే నష్టం కన్న అది తొక్కటం వల్ల ఎక్కువ నష్టం జరుగుతుంది. అలా కాశిరెడ్డి చంద్రిమీద బలాత్కారం చేశాడని రచయిత ఈ మాటల ద్వారా స్ఫురింప చేస్తాడు.

**<u>ముగింపు:</u>**

ఇక సూర పాత్ర ఆరంభం నుంచి ముగింపు వరకు ఆదర్శపాత్రగానే కనిపిస్తున్నది. తాను చిన్ననాడు దోస్తులతో తిరిగి చదువును ప్రక్కకు పెట్టిన సంఘటన మినహా ఎప్పుడూ అతనిలో అవలక్షణ గుణాలు కనిపించవు. అందుకే దళిత సూరీడు అంబేద్కర్‌ని దృష్టిలో పెట్టుకొని భూతం ముత్యాలు 'సూర' పాత్రని ఉదాత్తంగా చిత్రించాడు. ఏది ఏమైనా తెలుగు నవలా సాహిత్యాన్ని సుసంపన్నం చేసే ప్రక్రియకు తనవంతు చేయూత నిచ్చింది 'సూర' నవల అనడంలో ఎలాంటి సందేహం లేదని డాక్టర్ ననుమాస స్వామి అభిప్రాయం సరైనదే అనవచ్చు.

**<u>2.3.కాలువ మల్లయ్య సాంబయ్యచదువు-బహుజనులపై విద్య,ఉద్యమాల ప్రభావం:</u>**

ఈ నవలలో కాలువ మల్లయ్య కరీంనగర్ ప్రాంతంలోని రైతుల జీవన పరిస్థితులు తెలియజేస్తూ విద్య ఉద్యమాల గురించి చర్చించారు.

**2.3.1.కాలువమల్లయ్య పరిచయం:**

కాలువ మల్లయ్య కరీంనగర్ జిల్లా జూలపల్లి మండలంలోని తెలుకుంట గ్రామంలో 12-1-1953 సంవత్సరంలో కాలువ ఓదేలు, శ్రీమతి పోచమ్మ గార్లకు జన్మించారు. కాలువ మల్లయ్య కథకులుగా, నవలాకారుడిగా ఎదిగారు. ఆయనకు చిన్నతనం నుండే తెలుగు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు చదవడం అలవడింది.

కాలువ మల్లయ్య తండ్రికి జానపద సాహిత్యంతో విడదీయరాని అనుబంధం ఉంది. జానపద కథలోని కాటమరాజు కథలు, భాగవతుల కథలు, శారదకాళ్ళ కథలు, తోలుబొమ్మలాటలు, పులివేషాలు మొదలగు కళలను దగ్గరుండి జానపదులతో ప్రదర్శింపజేసేవారు. ఊరి పంతులు వెంకటయ్యతో కలిసి ఉగ్గుకథలు రాయడానికి

సహకరించేవారట. మల్లయ్య వాటిని దగ్గరుండి ఆసక్తిగా వినేవారట. అంతేగాక శతక పద్యాలను, వాటి అర్థ, తాత్పర్యాలను కంఠస్థం చేయించేవారు. తండ్రి ఓదేలు గారి ప్రభావం మల్లయ్య సృజనాత్మక సాహిత్యంపై విశేషంగా కనిపిస్తుంది. కేవలం తండ్రిగా మాత్రమే కాక మల్లయ్యకి విద్యా గురువయ్యారు. కేవలం చదువు మాత్రమేకాక సమకాలీన రాజకీయాల పట్ల మంచి అవగాహన కలగడానికి కూడా తోడ్పడ్డారు.

కాలువ మల్లయ్య విద్యార్థి దశనుంచే వర్డ్స్‌వర్త్, కీట్స్, ఆలీవర్ గోల్డ్‌స్మిత్, జాన్ మిల్టన్, షేక్స్‌పియర్, ఆర్కే నారాయణన్ లాంటి వారి రచనలు చదివేవారు. తరువాతి కాలంలో టాల్‌స్టాయ్, గోర్కీ, ప్రేమ్‌చంద్, ఠాగూర్, శరత్‌బాబు మొదలగు వారి రచనలు తెలుగు అనువాదాలు చదివేవారు. ఇంగ్లీష్ పుస్తకాలు చదివేవారు. ఇంగ్లీష్ పుస్తకాలు చదివినా ఇంగ్లీష్ లిరిక్‌పై శ్రద్ధ చూపించినా తన సృజనాత్మక సాహిత్యంపై ఆంగ్లప్రభావం లేదని అంటారు.

**<u>బాల్యం – చదువు – వ్యవసాయం:</u>**

కాలువ మల్లయ్య కుటుంబానికి పాడిపంటలతో విడదీయాని అనుబంధం ఉంది. వ్యవసాయం, గొర్రెల పెంపకం వారి జీవనోపాధి. చదువుకోవటం అంటే అందరానిదని భావించే వారి కుటుంబంలో మొదటిసారిగా బడికి వెళ్ళి చదవుకున్నది కాలువ మల్లయ్యగారే. వారి నాన్న ఇచ్చిన ప్రోత్సాహంతో వారి ఊళ్ళోని సర్కారు బడిలో విద్యాభ్యాసాన్ని ప్రారంభించారు. కొన్ని సందర్భాల్లో తోటి వాళ్ళు నిరుత్సాహ పరిచినా, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో తన చదువు ముందుకు సాగించారు. మల్లయ్యది వ్యవసాయ కుటుంబం కావడం చేత ఇంటిల్లిపాది పని చేయాల్సి ఉండేది. కాని వీరికి చదువుకోవడం అంటేనే చాలా ఇష్టం. అలాగని పనిని ఏనాడూ నిర్లక్ష్యం చేయలేదు. చదువుకు, పనికి విడదీయరాని సంబంధం ఉందని అంటారు. అందుకే వ్యవసాయ పనుల్లో సహాయ పడుతూనే తెల్లవారు జామున లేచి మోటగొట్టి చేను పారించిన తరువాతనే బడికి వెళ్ళేవాడు. ప్రతి క్లాసులో ఫస్టురావడంతో అతని చదువు ఎక్కడా ఆగకుండానే సాగింది. స్వగ్రామమైన తెలుకుంటలో హైస్కూల్ చదువును పూర్తిచేశారు. పి.యు.సి. చేశాక బి.యస్సి. కరీంనగర్‌లో చదివారు. డా// బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుండి 1988లో పి.జి.డి.ఆర్.పి పూర్తిచేశారు. 1988 నుండి 1993 మధ్యకాలంలో ప్రగతిశీల కథా సాహిత్యంపై డా// పి.వి. చలపతిరావు పర్యవేక్షణలో పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాపొందారు.

**<u>వృత్తి – ప్రవృత్తి:</u>**

కాలువ మల్లయ్య నిజామాబాద్ జిల్లా మావలూరులో కొంతకాలం ఉపాధ్యాయులుగా పనిచేశారు. తరువాత (ఎఫ్.సి.ఐ) ఫర్టిలైజర్ కంపెనీలో చీఫ్ కెమిస్ట్ ఆఫీసర్‌గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేశారు. వృత్తిరీత్యా ఫర్టిలైజర్ కంపెనీలో ఉద్యోగస్తులైనప్పటికీ ప్రవృత్తిలో భాగంగా వచన ప్రక్రియలకు సంబంధించిన సాహిత్య రచనలు చేశారు.

**<u>కథా రచన నేపథ్యం:</u>**

'నాదేశం నాయొక్క శ్రేయస్సు గ్రామాల్లో ఉంది. నేను అటువంటి గ్రామాల్లో పుట్టటం వల్ల ఆ పల్లె ఋణం తీర్చుకోవడానికి రాస్తున్నానంటారు కరడుగట్టిన అజ్ఞానం, మూఢనమ్మకాలు, మూర్ఖపు బ్రతుకులు, ఆకలి, పేదరికం, అనారోగ్యం బురదలోకి కూరుకుపోతున్న ఈ ప్రజానీకపు అభివృద్ధికి మార్గం ఏమిటి? అని ప్రశ్నించుకొనేటట్లు రాయడం రచయిత దృక్పథం. తెలుగు కథా సాహిత్యంలో భూస్వాముల దౌర్జన్యపు కథలు, మధ్య తరగతి వ్యక్తుల కథలు ఎక్కువ సంఖ్యలో రాసిన స్త్రీల గురించి, ఆ ప్రాంతపు నిరుపేద ప్రజల సాధక బాధకాలను కథావస్తువుగా గ్రహించారు. ఈ రచయిత అట్టడుగు వర్గపు బహుజన ప్రజల జీవితపు లోతులను స్పృశించారు.

గ్లోబలైజేషన్‌లో భాగంగా మృగ్యమవుతున్న మానవ సంబంధాలు, జీవితాన్ని

గెలుచుకోవడానికి నిరంతరం సాగుతున్న పోరాటాలు, దినదిన గండంగా బ్రతుకుతున్న, కార్మికులు, నిరుద్యోగానికి గురిచేస్తున్న చదువులు, జీవచ్ఛవాలై బ్రతుకుతున్న మనుషులు, అనునిత్యం రణక్షేత్రాలుగా మారుతున్న తెలంగాణా గ్రామాలు, బ్రతుకును శాపంగా భావించి తరతరాలుగా సంఘంలో వివక్షకు గురవుతున్న దళితులు తమ లక్ష్యసాధనకై చేస్తున్న పోరాటాలు, ఎంతచేసినా 'ఏడే మాన్కలన్నట్లు' రెక్కలు ముక్కలుగా చేసుకుంటున్నా, డొక్కలు నిండక తమకు తెలియని కుట్రకు బలవుతున్న రైతులు, ఈ దేశ సమస్యల గురించి పట్టించుకోని మేధావులు అనునిత్యం జరుగుతున్న సంక్షోభం, సంఘర్షణ ఇవన్నింటిని చూస్తూ, పక్కనే పేలిపోతున్న బాంబు ధ్వనులు వింటూ రాయకుండా ఎలా ఉండగలనని అంటారు రచయిత.

తనలో నిరంతరం జరుగుతున్న అంతర్మథనానికి, నన్ను నేను తెలుసుకోవడానికి రాస్తున్నానంటారు మల్లయ్య. ఇంకా నేను సాహితీవేత్తను అయివుండకపోతే ఆత్మహత్య చేసుకునేవాణ్ణి అంటారు. ఈ మాటలతోనే రచయిత ఉద్దేశం అర్థమవుతుంది. సాహిత్యం నాకు మానవ జీవితాన్ని ప్రేమించటం నేర్పింది. నన్ను కర్తవ్యోన్ముఖునిగా చేసింది. నన్ను మనిషిగా తీర్చిదిద్దిన సాహితీ ఋణం తీర్చుకోవడానికి నేను రాస్తున్నానంటారు.

**కవిత్వం దిశగా...**

కాలువ మల్లయ్య అభ్యుదయవాది. శ్రీశ్రీ ప్రేరణతో, మొదట కవిత్వం రాయడం ప్రారంభించారు. 'కవితా సౌరభం', 'కవితాఝరి' అనే కవితా సంపుటాలను శ్రీశ్రీ ప్రేరణతో వెలువరించారు. తన రచనలకు తన చుట్టూ జరుగుతున్న సంఘటనలు, సంఘర్షణ మయమయిన జీవితమే ప్రేరణ అంటారు. కథా రచయితకు ఆవేశంతో వచ్చేది పద్యం, ఆలోచనతో వచ్చేది వచనం అంటారు మల్లయ్య. సహజమైన ఆలోచన ప్రవృత్తి ఆయన సహజ గుణం. ఆ విధంగా వచన రచనలోకి దిగారట. మల్లయ్య తొలికథ 'కృష్ణయ్య ప్రేమ పెళ్ళి'. ఇది 1982 సంవత్సరం సృజన పత్రికలో ప్రచురించబడింది. ఇలా రాసిన పదిహేడు కథలను 'కట్నం కథలు' అనే పేరుతో ఒక సంపుటిగా వెలువరించారు.

మల్లయ్య సాహిత్యాన్ని సీరియస్‌గా తీసుకొని, తనకంటూ ఒక దృక్పథం ఏర్పరుచుకొని, తను ఎవరికోసం రాయాలి? అని ప్రశ్నించుకొని 1983 నుండి రాయడం జరిగింది. ఆ తరువాత వెలువరించిన 'వెలి' అనే కథ తన మొదటి కథగా చెప్పుకుంటారు. ఈ కథ సృజన పత్రికలో 1983 జనవరి సంచికలో ప్రచురించబడింది. ఈ విధంగా వారు కథా రచన ప్రారంభించారు.

మానవ జీవితాన్ని, సంస్కృతిని ప్రతిబింబించే రచనలన్నా, రచయితలన్నా అభిమానమే అంటారు. భారతీయ కథకు అభ్యుదయ పరిమళం అద్ది, హిందీ ప్రాంత జీవన సంస్కృతిని, సంప్రదాయాలను విస్తృతంగా చిత్రించిన ప్రేమ్‌చంద్, మొట్టమొదటి స్వతంత్ర రచన చేసి తెలంగాణ జన జీవన సంస్కృతిని సంప్రదాయాలను దేశీయ ఛందస్సులో అక్షరబద్ధం చేసిన పాల్కురికి సోమనాథుడన్నా పురోగమన దిశలో పయనింపజేసే ఏ రచయితనయినా అభిమానించడం ఈ రచయిత సహృదయతకు నిదర్శనం. కొడవటిగంటి కుటుంబరావు, కా.రా., రావిశాస్త్రి, దాశరథి రంగాచార్య రచనలను అమితంగా అభిమానిస్తారు.

**నాటికలు, నవలలు, వ్యాసాలు:**

పాఠశాల, కళాశాల స్థాయిల నుంచి చిన్న చిన్న కథలు రాసి లోకల్, కాలేజ్ మాగజైన్‌లకు పంపేవారట. ఆ విధంగా సాహితీ క్షేత్రంలోకి తొంగిచూడడం ప్రారంభించారు. ఈ రచయిత కథలు నేడు తెలుగులో ఉన్న అన్ని పత్రికల్లోను, మాగజైన్‌లలోను ప్రచురితం అయ్యాయి. ఈ రచయిత ఇప్పటి వరకూ సుమారు 600 కథలు ప్రచురించారు. సామాజిక, సాహిత్య విషయాలపై 100కు పైగా వ్యాసాలు రాశారు. ఆంధ్రభూమిలో 'సహితం' అనే శీర్షిక కింద ప్రతి సోమవారం

తెలుగు కథా సాహిత్యంపై, సామాజిక విషయాలపై వ్యాసాలు రాశారు. ఇప్పటి వరకూ 10 నవలలు, 2 కవితా సంపుటాలు వెలువరించడమే కాక ఏకపాత్రాభినయాలకు డైలాగ్స్ రాశారు. సుమారు 6 నాటకాలు రాసి ప్రదర్శింపజేశారు.

**2.3.2. సాంబయ్య చదువు కథాపరిచయం:**

కుల అంతర్వుల వ్యవస్థలో శూద్రులు (తెలంగాణ భాషలో సూదరోళ్లు) దళితుల నెత్తిమీద నిలబడిన వాళ్లు. వర్ణ వ్యవస్థలో శూద్రులు నాలుగో వర్ణం. తెలుగు సాహిత్యంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా దళితులతో పాటు రచనలు చేశారు. కాలువ మల్లయ్య బిసీ సాహిత్య నేపథ్యాన్ని ఈ విధంగా తెలియచేస్తారు. "తెలుగు దళిత సాహిత్య ఆవిర్భావకాలంలో ఒక విశాల ప్రాతిపదికన సంఘటితమైన ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ కవులు ఆ తర్వాత కాలంలో నిర్ధిష్టతల వైపు విడిపోయి చైతన్యాలవైపు సొంత అస్తిత్వాల వైపు మళ్లాయి. ఇది మొత్తం దళిత సాహిత్యోద్యమానికి మేలే చేసింది. అయితే, ఎవరు దళితులు? ఎవరు రాసింది దళిత కవిత్వం అనే విస్తృత చర్చల అనంతరం ఈ నిర్ధిష్టతలు ఏర్పడటం గమనించవలసిన అంశం. తెలుగులో తొలి దళిత కవితా సంకలనం 'చిక్కనవుతున్న పాట' కు జి.లక్ష్మీనర్సయ్య ముందుమాట రాస్తూ "కుల వ్యవస్థా, దానికి ఆలంబన అయిన హిందూయిజం, వీటివల్ల రోజువారీ జీవితంలోని పీడనను అనిశ్చితత్వాన్నీ అభద్రతనూ, అవమానాల్నీ ఎదుర్కొంటున్న పీడిత కులస్తుల నుంచీ, మైనార్టీల నుంచీ వచ్చిన కవులు రాసే కవిత్వమే దళిత కవిత్వం అని నిర్వచించారు. మరోరకంగా చెప్పాలంటే ఎస్సీ, ఎస్టీ,బిసీ, మైనార్టీలు రాసింది దళిత కవిత్వం అనే విశాలార్థం ప్రాచుర్యం జరిగింది. చిక్కనవుతున్న పాటలో ఎస్సీల్లో ఊచకోతల మీద అనేక మంది బిసీ కవులు నిజాయితీగా స్పందించి కవిత్వం రాయడం గమనించవచ్చు. చిక్కనవుతున్న పాట, పదునెక్కిన పాట, చిత్తరువు వంటి సంకలనాలు దళిత కవిత్వం పేరుతోనే వెలువడటం గమనించవచ్చు. అంటే అంతవరకూ ఎస్సీల సమస్యలను తమ గొంతుతో పలికించిన బిసీలు ఎస్సీలకే కాదు, తమకూ సమస్యలున్నాయనీ, వాటిని గురించి కూడా తాము గానం చెయ్యవలసిన అవసరాన్ని గుర్తించారు" ( శిఖామణి, 2013: 226 *బి.సి.వాదకవిత్వం*, తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమీ, హైదరాబాదు) అని బిసీవాదం రూపొందిన నేపథ్యం తెలిపారు. బిసీలు దళితులుగా చలామణి కావడాన్ని కొంతమంది విమర్శించారు. అంటరానివాళ్లు మాత్రమే దళితులని, మాలమాదిగలు తప్ప ఇతరులెవరూ దళితులు కాలేరనీ, ఇతరులు రాసింది దళిత కవిత్వం కాదనీ, అది దళిత సానుభూతి కవిత్వమని సతీష్ చందర్ వాదించారు. బిసీలు బహువచనం, పొక్కిలి, వెంటాడే కలలు వంటి సంకలనాలతో పాటు అనేక వ్యక్తిగత సంకలనాలు వచ్చాయి. కవిత్వంతో మొదలైన బిసీ సాహిత్యం ఇతర ప్రక్రియలకు విస్తరించింది. నవల, కథలు అనేకం వచ్చాయి. కాలువ మల్లయ్య, బియస్ రాములు వంటి చాలా మంది నవలలు రాశారు. కాలువ మల్లయ్య రాసిన 'సాంబయ్య చదువు' బిసీల్లో విద్యార్జన పట్ల కల్గిన చైతన్యాన్ని చూపుతుంది. వర్ణ వ్యవస్థలో నాలుగో వర్ణమైన శూద్రులకు ఆస్థి, విద్యార్జన, ఆయుధధారణ, రాజ్యపాలన హక్కులు లేవు. కానీ మహాత్మ జోతిరావు పూలే మనువాదానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక తాత్విక పోరాటం నడిపాడు. ఆయన శూద్రకులస్తుడు. విద్యార్జన, విద్యాబోధన రెండూ శూద్రులకు కల్పించాలని పోరాడిన తొలి ఆధునిక విప్లవకారుడు మహాత్మ పూలే. అయితే, ఆయన తర్వాత రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక హక్కులు కల్పించాలని డా॥ అంబేద్కర్ పోరాడాడు. అందుకే, బిసీ కవులు మహాత్మ జోతిరావు పూలే, డా॥ అంబేద్కర్ స్ఫూర్తితో కుల దోపిడీకి వ్యతిరేకంగా రచనలు చేయటం మొదలైంది. ఈ నేపథ్యంలోనే బిసీలు జ్ఞానవంతులు కావాలంటే చదువు ఒక్కటే మార్గమని గ్రహించారు.

గ్రామీణ శూద్రులు చదువు పట్ల ప్రత్యేక ఆసక్తిని కనబరిచారు. అగ్రకులాలు ఎంత నిరుత్సాహ పర్చినప్పటికీ శూద్రుల్లో కొన్ని కులాలు చదువుపట్ల ప్రత్యేక శ్రద్ధను కనబర్చారు. కాలువ మల్లయ్య రాసిన 'సాంబయ్య చదువు' శూద్రుల విద్యా దృష్టిని తెలుపుతుంది. కాలువ మల్లయ్యది కరీంనగర్ జిల్లా. తెలుకుంట గ్రామం. గొల్లకులస్తుడు. కరీంనగర్‌లో దొరల పెత్తనం అధికం. ఎస్సీ, ఎస్టీ, బిసీలను అగ్రకులస్తులు బానిసలుగా చూసేవాళ్లు. చదువు సంధ్యలు లేని అజ్ఞానులుగా వుంచాలనే ప్రయత్నించేవాళ్లు. ఈ పరిస్థితిని అధిగమించటం కోసం కాలువ మల్లయ్య ప్రయత్నించాడు. ఎంతో మంది శూద్రులు అలా ప్రయత్నించారు. ఆ ప్రయత్నమే నవలేతివృత్తం.

ఈ నవలల్లో కథానాయకుడు సాంబయ్య. ఇందులోని కథా భాగానికంతటికి సాంబయ్య కేంద్ర స్థానం కావడం చేత రచయిత ఈ నవలకు సాంబయ్య చదువు అని నామకరణం చేశాడు. నవలేతివృత్తంలో సాంబయ్య పాత్ర బాల్యదశ నుంచి క్రమ పరిమాణం చెందేపాత్ర. బాల్యం నుంచి కష్టపడి చదువుకొని ప్రయోజకుడై ఉద్యోగము సంపదించుకోవడం, పెళ్లి చేసుకొని పిల్లలు పుట్టాక, వారి చదువు గురించి తాపత్రయం పడటం వరకు కథ అంతా సాంబయ్య పాత్ర చుట్టే ప్రవర్తిస్తుంది. అందువల్ల సాంబయ్య పాత్ర యొక్క సమగ్ర స్వభావం వెల్లడవుతుంది.

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన రైతు కుటుంబంలోని దంపతులకు మొదటి జనరల్ ఎన్నికల రోజున సాంబయ్య జన్మించాడు. తండ్రి బడిలో చేర్చిన నాటి నుండి పట్ట భద్రుడయ్యే వరకు తెలివైన విద్యార్థిగా పేరు తెచ్చుకుంటూ, ఫస్టుక్లాస్‌లో ఉత్తీర్ణడవుతూ ఉద్యోగంలో స్థిరపడ్డాడు. తల్లి దండ్రులు తనపై పెట్టుకున్న ఆశల్ని వమ్ముచేయని కార్యసాధకునిగా సాంబయ్య పాత్రను చిత్రీకరించారు.

విద్యార్థిగా సాంబయ్య అన్ని దశల్లోనూ ఉత్తముడిగా కన్పిస్తాడు. బాల్యం నుంచి కల్గిన అభిరుచియే అతడు ఉన్నత చదువులు చదవడానికి ప్రేరేపించాయి. తెలివైన విద్యార్థిగా పేరు తెచ్చుకోవడం వల్లనే సర్పంచ్ కొండల్‌రెడ్డి తన కొడుకు కిషన్‌రెడ్డిని సాంబయ్యతో స్నేహాన్ని ప్రోత్సహించాడు. పాఠశాలలో ఉపాధ్యాయుల ఆదరణాభిమానాలకు పాత్రుడైన సాంబయ్య పాఠ్యాంశాలే కాకుండా పాఠ్యేతర విషయాలను కూడా తెలుసుకుంటూ వచ్చాడు. హైస్కూల్ చదువుతున్న రోజుల్లోనే యుక్తాయుక్త వివేచన, తార్కికశక్తిని అలవర్చుకున్నాడు. పాఠాలలో ఉన్నదానికి సమాజంలో జరుగుతున్న దానికి పొంతన లేకపోవడం గ్రహించాడు. మల్లేశం సారువల్ల హేతువాద దృక్పథం అలవర్చుకున్నాడు. పాఠశాలలో నిర్వహించే సహపాఠ్య అంశాల్లో కూడా అందరి విద్యార్థుల కంటే ముందుండి ప్రతిభను నిరూపించుకున్నాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ రోజుల్లో హెచ్.యస్.సి. చదువుతున్న సాంబయ్య ఆ ఉద్యమ పరిణామాల వల్ల విద్యాసంత్సరం నష్టపోయినందుకు చింతించాడు. ఆ యేడు మాస్ కాపియింగ్ జరిగి పరీక్షా ఫలితాలు వెలువడినప్పుడు స్వతహాగా ప్రతిభావంతుడైన సాంబయ్య ఫస్టుక్లాసులో పాసైనా ఆనందించలేదు. ఫెయిల్ అవుతారనుకున్న వారంతా ఫస్టుక్లాస్‌లో పాసుకావడమే అతని బాధకు కారణము.

సాంబయ్యకు ఉన్నత విద్యపట్ల అభిలాష క్రమంగా బలపడుతూ వచ్చింది. కాలేజీ చదువులకయ్యే ఖర్చు భరించే శక్తి తనకు లేదని, చదువు మానుకోమ్మని తండ్రి హఠాత్తుగా చెప్పడంతో క్రుంగిపోయాడు. అ సందర్భంలో 'బాపూ! నేనెప్పుడైనా ఫెయిలయ్యానా? అన్నిట్లో మంచి మార్కులే తెచ్చుకున్నాను. నన్నెందుకు బందు జేస్తానంటన్నావు ? నువ్వు చదివించకున్న నేనొక్కనే చదువుకుంటా. సాయంత్రాల్లో ఏదైనా దుకాండ్లో పనిచేసుకుంట చదవుకుంట' (పు. 90) అని సాంబయ్య పలుకడాన్ని బట్టి అతనికి చదువుపట్ల ఉన్న శ్రద్ధ వ్యక్తమవుతుంది.

తాను చదువుకోవడానికి చేయని ప్రయత్నం లేదు. భూమయ్యసారుతో కూడా చెప్పించి ఒప్పించే ప్రయత్నం చేశాడు. చివరకు తల్లి తనకు అనుకూలంగా మాట్లాడంతో సాంబయ్య తండ్రికి ఒప్పుకోక తప్పలేదు. తండ్రి సమ్మతితో కరీంనగర్ కాలేజీలో పి.యు.సి లో చేరాడు. సాంబయ్య అద్దె గదిలో ఉంటూ చదువే లక్ష్యంగా పెట్టుకున్నాడు. కాలేజీలో చేరిన సాంబయ్య కొత్త వాతావరణంలో కొత్త స్నేహితులతోనూ అద్దెగదిలో ఉంటు ఆత్మనిగ్రహంతో చదివి పి.యు.సి.లోను ఆ తర్వాత బి.యస్సి లోనూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. సినిమాలు, షికార్లు, గొడవలు, విద్యార్థి ఉద్యమాలు వంటి ప్రలోభాలకు దూరముంటూ తన దృష్టినంతా చదువుపైనే కేంద్రీకరించి, మంచి విద్యార్థిగా నిలిచాడు. ఉద్యమాలు అంటూ చదువును నిర్లక్ష్యం చేసిన ఈశ్వర్ లాంటి వారికి దూరముంటూ చివరకు అలాంటి వారే తన మార్గంలో నడుచుకునేటట్లుగా సాంబయ్య ప్రవర్తించాడు.

సాంబయ్యకు కుటుంబం పట్ల అనురాగం ఉంది. కష్టపడి చదివించిన తల్లిదండ్రులంటే ప్రేముంది. కట్నం సరిపోలేదంటూ మాటి మాటికి బావ చెల్లిని ఇంటికి పంపిస్తే, ఆమె పట్ల సానుభూతి ఉంది. తాము కష్టాల్లో ఉన్న అంతో, ఇంతో డబ్బు సర్దుబాటు చేసి పంపించే తండ్రిని ఏనాడూ కాదనలేదు. తండ్రిని మరింత కష్ట పెట్టడం ఇష్టం లేకనే ఇంజనీరింగ్‌లో సీటు వచ్చినా వదలుకొని డిగ్రీలో చేరిపోయాడు. సెలవురోజుల్లో తల్లిదండ్రులకు తోడుగా వ్యవసాయం పనుల్లో సహాయ పడ్డాడు.

ఉద్యోగం వచ్చిన తరువాత సాంబయ్య తల్లిదండ్రులకు దూరమయ్యాడు. తల్లిదండ్రుల పోషణాభారం వహించే విషయంలో సగటు మనిషిలాగే ప్రవర్తించాడు. తనకు ఉద్యోగం వచ్చిన తర్వాత తల్లిదండ్రుల్ని తన వద్దకు తీసుకెళ్ళి ఏ కష్టం రాకుండా పోషిస్తానని పదే పదే చెప్పుకుంటూ వచ్చిన సాంబయ్య ఆ తర్వాత ఆ ప్రయత్నమే చేయలేదు. తాను గిరిగీసుకున్న కుటుంబంలో భార్యా పిల్లల ఆలనా పాలనా చూడడమే తప్ప వృద్ధాప్యంలో వ్యవసాయం చేసుకుంటూ బతుకీడుస్తున్న తల్లిదండ్రులకు అందుబాటులో లేకుండా పోయాడు.

ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనే అభిరుచి సాంబయ్యలో కల్గడం వల్లనే ఇంజనీరింగ్ సీటు వదలుకున్నాడు. డిగ్రీ తర్వాత హాఫ్ ఏ మిలియన్ స్కీమ్ క్రింద ఉపాధ్యాయుడు కావడంతో సాంబయ్య జీవితాశయం నెరవేరుతుంది. అయితే గ్రామస్థులు సాంబయ్య చేస్తున్న ఉద్యోగం గురించి చులకనగా మాట్లాడం భార్య మరో ఉద్యోగం వెతుక్కోమని పోరుపెట్టడం వల్ల, ఎరువుల కంపెనీలో ఉద్యోగిగా స్థిరపడవలసి వచ్చింది. డబ్బు ముందు ఆదర్శాలు నిలువవని సాంబయ్య ప్రవర్తన ద్వారా వ్యక్తమవుతుంది.

సామాజిక అవరోధాల్ని అధిగమించి, ఉన్నత చదువులు పూర్తి చేసి, తండ్రి కోరికను తీర్చడమే కాకుండా తన పిల్లల చదువుల పట్ల, ప్రత్యేక శ్రద్ధ చూపడానికి, సాంబయ్య జీవితంలో చదువు ఉపకరించింది. సాంబయ్య పాత్ర చిత్రణలో రచయిత తన జీవితానుభవాల్ని వ్యక్తం చేశాడు. సాంబయ్య పాత్రలో రచయిత కాలువ మల్లయ్య గారే దర్శనమిస్తారు. ఈ పాత్ర మధ్యతరగతి జీవితానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ నవలలోని పాత్రలను సంక్షిప్తంగా పరిచయం చేస్తాను.

### 2.3.3. సాంబయ్య చదువు పాత్రల పరిచయం:

ఈ నవలలో కాలువ మల్లయ్య గ్రామీణ వాతావరణాన్ని ఇందులోని వ్యక్తులను, వారి అమాయకత్వాన్ని చదువులేని తనన్నా ఆసరగా చేసుకొని దొరలు, దోపిడీ చేస్తున్న విధానాన్ని చిత్రించారు. కింది కూలల్లోని పిల్లల ,చదువుని దొరలు ఎగతాళి చేస్తున్న వైనాన్ని తెలియజేశారు. ఈ నవలలోని పాత్రలను పరిశీలించినట్లయితే....

**చిలుకయ్య:**

ఈ నవలలో సాంబయ్య పాత్ర తర్వాత ప్రాధాన్యత గలది చిలుకయ్య పాత్ర.

కథానాయకుడైన సాంబయ్య తండ్రి చిలుకయ్య. వృత్తి రీత్యా సామాన్య రైతు. నిరాక్షరాస్యుడైనందువల్లనే అతనికి చదువన్నా, చదువుకున్న వారన్న ఎనలేని గౌరవం. నిరక్షరాస్యునిగా తాను పడిన పాట్లు తన కొడుక్కి రాకూడదని భావించి ఆరేళ్ళు నిండిన సాంబయ్యను బడికి పంపాడు. ఈ విషయంలో వెంగళరావుదొర చిలుకయ్య నిర్ణయాన్ని కాదన్నను ఏ మాత్రం లక్ష్య పెట్టలేదు. ఆనాడు చిలుకయ్య దొరమాటను కాదని తీసుకున్న నిర్ణయమే సాంబయ్యను ప్రయోజకుడిని చేసింది.

చిలుకయ్య పాత్ర సామాన్య రైతుకు ప్రతీక. రెక్కాడితే కాని డొక్కాడని రైతు జీవనంలో పిల్లల్ని చదివించడమంటే తలకు మించిన భారం కొడుకు ఉన్నత చదువులు చదవడానికి ఆర్థిక పరిస్థితులు అనువుగా లేకపోయిన చిలుకయ్య మాత్రం భూమినే నమ్ముకొని కొడుకుని కష్టపడి చదివించాడు. సామాజిక అవరోధాల్ని అధిగమించి రైతు జీవనంలోని కరువుకాటకాలు, అప్పులు, కుటుంబ సమస్యలతో సతమతం అవుతూనే సాంబయ్య భవిష్యత్తుకు బంగారు బాట వేశాడు. సగటు రైతు జీవనంలో ఎదురయ్యే సమస్యలను చిలుకయ్య అనుభవించాడు.

చిలుకయ్య నిరక్షరాస్యుడైనా విచక్షణా జ్ఞానం కలవాడు. వెంగళరావు దొర యొక్క దుర్మార్గ స్వభావాన్ని కొండల్ రెడ్డిలోని ఉపకార స్వభావాన్ని అర్థం చేసుకోగలిగాడు. వెంగళరావు దొర పట్ల చిలుకయ్యకు సదాభిప్రాయం లేదు. అయితే కొండల్ రెడ్డి అందుకు భిన్నంగా ప్రవర్తించడంతో అతనితో చనువు పెంచుకున్నాడు. చిలుకయ్య కొండల్ రెడ్డితో కలిసి కాశీయాత్రకు కూడా వెళ్ళివచ్చాడు.

చిలుకయ్య కలుపుగోలు మనిషి. కులంలో పెద్దమనిషిగా ఎన్నుకోబడిన ఏనాడు పెద్దరికం చేసింది లేదు. స్నేహితులతో ఊరివాళ్ళతో ఆత్మీయంగా పలకరిస్తాడు. నర్సయ్యతో గాని, కాపు శంకరయ్యతోగాని మాట్లాడే సందర్భంలో ఆత్మీయంగా వరసలు పెట్లుకోని మాట్లాడం కన్పిస్తుంది. పెద్దల యెడల గౌరవం. ఉపాధ్యాయులంటే పూజ్యభావం ఉన్న వ్యక్తి చిలుకయ్య. సాంబయ్యను అకారణంగా దండించిన ఉపాధ్యాయునిపై కోపం వచ్చినా, తన పిల్లవాని క్షేమం కోరే కదా అని సమాధాన పరచుకున్నాడు.

చిలుకయ్య కుటుంబ యాజమానిగా వ్యవహార దక్షత కలవాడు. అనుకూల వతియైన భార్య రాజమ్మ అండతో కుటుంబాన్ని పరువుగా సాగించాడు. కూతురు సుశీలకు చిన్నతనంలో పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించినా, అల్లుని మూలాన అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. కూతురు ఇంటికి వచ్చిన ప్రతిసారి అంతో యింతో డబ్బు సర్దుబాటు చేసి పంపించాడు. ఈ విషయంలో కొడుకు సలహాకూడా తీసుకున్నాడు. పట్టభద్రుడైన కుమారున్ని పెళ్ళి చేసుకొమ్మంటూ ప్రోత్సహించాడు. ఖాళీగా ఉన్న సాంబయ్యను ఉద్యోగం సంపాదించుకునేటట్లు ప్రేరేపించాడు.

ఉద్యోగం దొరికిన తరువాత కొడుకు తమను తీసుకెళ్ళి పోషిస్తాడని చెప్పుకుంటు వచ్చిన చిలుకయ్య మాత్రం అతనిపై ఆశలు పెట్టుకోలేదు. కొడుకు పంచన చేరక వృద్ధాప్యంలో కూడా రెక్కల కష్టాన్నే నమ్ముకొని ఒంటి నాగలి వ్యవసాయం చేస్తూ ఊర్లోనే ఉండిపోయాడు. ఈ విధంగా పల్లెల్లో వృద్ధాప్యంలో ఉండి భూమినే నమ్ముకొని బతుకుతున్న ఎందరో రైతులకు ప్రతీకగా చిలుకయ్య పాత్ర నిలుస్తుంది.

## వెంగల్‌రావు దొర:

వెంగళరావు దొర పాత్ర భూస్వామ్య వర్గ ప్రతినిధి. నవలేతి వృత్తంలోని సంఘటనలు, సన్నివేశాలు ఈ పాత్ర ప్రవర్తించిన తీరును తెలియపరుస్తున్నవి. స్వాతంత్ర్యానంతరం భూస్వామ్య వ్యవస్థ అంతరించినా, చెరిగిపోని ఫ్యూడల్ భావాలకు వెంగళరావు దొర ప్రతీక. వ్రేళ్ళు

పెకలించిన భూస్వామ్య వ్యవస్థకు ఊడలు పాతుకొనిపోయిన మహావృక్షం లాంటివాడు వెంగళరావు దొర. ఉవ్వెత్తున లేచిన తెలంగాణ సాయుధ పోరాటం వల్ల ఊరోదిలి పారిపోయాడు. స్వాతంత్ర్యానంతరం మొదటి జనరల్ ఎన్నికల కాలం నాటికి ఊళ్ళోకి తిరిగి వచ్చి యథేచ్ఛగా పూర్వపు పెత్తనాన్ని చలాయించాడు. దొరా! బాంచెను కాల్మోక్తా! అనే సంస్కృతి చెరిగిపోకుండా ఊళ్ళో అధికారాన్ని నిలుపుకున్నాడు. ఉపాధ్యాయుడైన వెంకటయ్య పంతుల్ని ఎద్దేవా చేసి మాట్లాడటం, తనకు తెలియకుండా ఏ పని చేసినా ఆగ్రహించడం, బడిలో హరిజన పిల్లవాడిని లేపి దురుసుగా మాట్లాడటం ఇవన్ని వెంగళరావు దొర కౄరత్వాన్ని తెలుపుతాయి.

వెట్టి పనులను చేసే మంగలి, చాకలి వారిని తన అదుపాజ్ఞలో ఉంచి వెంగళరావు దొర పెత్తనం చెలాయించాడు. సామాజిక కట్టుబాట్లు నిలిచి ఉండేటట్లు వ్యవహరించాడు. రచ్చబండ పంచాయతీలు నిర్వహించి కులాచారాలు హద్దు దాటకుండా చూశాడు. చాకలి బక్కమ్మ కొమరయ్యలు చేసిన తప్పును విచారించి కుల బహిష్కరణకు గురి చేశాడు. ఆ తీర్పును వ్యతిరేకించిన కోమురయ్యను చెట్టుకు బంధించి దండించాడు. ఈ సంఘటనలో వెంగళరావు దొర మానవత్వము లేని మృగంలా వ్యవహరించాడు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో కూడా వెంగళరావు మాట చెల్లుబాటు అయ్యింది. చాకలి బక్కమ్మ కొడుక్కు ఏదైనా ఆధారం చూపమని మడేలు బాలయ్య ప్రాధేయపడితే పంచాయతీ ఆఫీసులో తాను పనిలో పెట్టిన కర్రెమల్లుగాడిని కాదని మరొకరికి పని ఇప్పించలేనని అంటాడు వెంగళరావు దొర.

భూస్వామిననే అహంకారంతో వెంగళరావు దొర అడ్డు అదుపు లేకుండా ప్రవర్తించాడు. పోరంబోకు భూమిని ఆక్రమించడమే కాకుండా ఊరికంతటికి జీవనాధారమైన చెరువు నీళ్ళను ప్రక్క ఊరికి అమ్ముకుంటూ వచ్చాడు. ఎప్పుడైతే గ్రామంలో యువజన సంఘాల స్థాపన జరిగిందో అప్పటి నుండి వెంగళరావు దుర్మార్గం పట్ల వ్యతిరేఖత నెలకొంది. నక్సలైట్ కార్యకలాపాలు గ్రామాలకు విస్తరించడంతో యువకులు వెంగళరావును నిలదీశారు. గ్రామంలో ఉండలేని పరిస్థితి నెలకొనడంతో వెంగళరావు దొర తన నివాసాన్ని పట్టణంలోకి మార్చాడు. ఇట్లా గ్రామంలో ఫ్యూడల్ భావాలతో అధికారం చెలాయించిన భూస్వామ్య వర్గ ప్రతినిధిగా వెంగళరావు పాత్రచిత్రణ జరిగింది.

**కొండల్ రెడ్డి:**

కొండల్ రెడ్డి కూడా భూస్వామ్య వర్గ ప్రతినిదే, కానీ వ్యవహారదక్షుడు. వెంగళరావు దొర స్వభావానికంటే వైవిధ్యంగా కొండల్ రెడ్డి ప్రవర్తించడం కన్పిస్తుంది. ఉన్నత వర్గంలో జన్మించిన కొండల్‌రెడ్డికి అణగారిన కులాలంటే స్వతహాగా ఉండే చులకన భావం చాకలి బక్కమ్మ పంచాయితీ సందర్భంగా స్పష్టం అవుతుంది. 'గీ చాకలోల్లకు గిదోలెక్క తియింఁడ్రి' (పు. 26) అని కొండల్ రెడ్డి మాట్లాడటం అతనిలోని దొరతనపు మనస్తత్వాన్ని బయట పెడుతుంది.

పంచాయతీ ఎన్నికల్లో ఆ ఊరి మొట్టమొదటి సర్పంచ్‌గా ఎన్నికై ఆ పదవిలో దీర్ఘకాలం కొనసాగాడు. వెంగళరావులా నేరుగా దుర్మార్గాలు చేయకుండా వ్యవహారాల్ని చాపకింది నీరులా చక్కబెట్టుకున్నాడు. 'కొండల్ రెడ్డి భార్య ఇంట్లో లేని సమయంలో కొందరాడవాళ్ళు గంగొడి ముసుగులేసుకోని దొంగతనంగా అతని గదికి పోవడం రెండు మూడు సార్లు చూశాడు సాంబయ్య' (పు. 50) అని చిత్రించడాన్ని బట్టి కొండల్ రెడ్డి స్త్రీ లోలుడనే విషయం స్పష్టమవుతుంది., సర్పంచ్‌గా ఉంటూ బంజరు భూముల్ని ఆక్రమించుకున్నాడు. గొర్రెలు, మేకలు తిరగడానికి చోటు లేకుండా పోయిందని గొల్లలు వచ్చి నిలదీసినప్పుడు అంతవరకు పోరంబోకు భూముల్ని ఆక్రమించుకున్న మరికొందరి పేర్లను ప్రస్తావించి తెలివిగా

తప్పించుకున్నాడు.

కొండల్ రెడ్డి తన ఇద్దరు ఆడపిల్లల్ని ఊళ్ళో ఉన్నంత వరకు చదివించి వివాహాలు చేశాడు. కొడుకు కిషన్ రెడ్డిని ఎం.ఏ వరకు చదువుకునే పరిస్థితులు కల్పించాడు. చదువు విషయంలో తెలివైన వాడని పేరున్న సాంబయ్యతో కిషన్ రెడ్డి స్నేహంగా ఉండేటట్లు బాల్యం నుంచి పరిస్థితులు కల్పించాడు. సాంబయ్యను చదివించడానికి చిలుకయ్య ఇబ్బంది పడితే ఆర్థిక సహాయం చేయడానికి తానున్నానని ధైర్యం చెప్పాడు. పెద్దమనుషుల్ని తన గుప్పిట్లో పెట్టుకొని దీర్ఘకాలం సర్పంచ్‌గా కొనసాగాడు.

సర్పంచ్‌గా కొండల్‌రెడ్డి గ్రామానికి అంతోయింతో సేవచేసినట్లు అతని మాటల్ని బట్టే తెలుస్తుంది. 'నేనేం తక్కువ చేశానూరికి? బడితెప్పించిన, గుడికట్టించిన, బస్సువేయించిన, మొన్న మొన్ననే కరెంట్ తెప్పించిన, చెరువుకు పెద్దమత్తడి శాంక్షన్ చేయించిన, అయినా నన్ను కూడా అడిగెటోల్లయింద్రు జనాలు' (పు.116) ఊళ్ళో ఉద్యమాల ఫలితంగా యువజన సంఘాల స్థాపన జరిగిన తర్వాత యువకులు కొండల్ రెడ్డి దుర్మార్గాన్ని నిలదీయడంతో తానాక్రమించుకున్న పోరంబోకు భూమిని వదులుకున్నాడు. పదవి కూడా లేకపోవడంతో ఇదివరకే కట్టుకున్న కరీంనగర్‌లోని ఇంటిలోకి శేషజీవితాన్ని గడపడానికి వెళ్ళిపోయాడు. ఇట్లా స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య బద్ధంగా పదవులు చేపట్టి ఊళ్ళో అధికారం చెలాయించిన ధన భూస్వామ్యవర్గ ప్రతినిధిగా కొండల్ రెడ్డి పాత్ర చిత్రితమయ్యింది.

**<u>కిషన్ రెడ్డి:</u>**

కిషన్ రెడ్డి కొండల్ రెడ్డికి ఏకైకపుత్రుడు, సాంబయ్యకు మంచి స్నేహితుడు. సాంబయ్యతో స్నేహం కుదరడానికి కొండల్ రెడ్డి ప్రోద్బలమే కారణం. ఉన్నత కులంలో పుట్టాననే అహంభావానికి లోనుకాకుండా సహాధ్యాయి అయిన సాంబయ్యతో చిన్నప్పటి నుంచి కలసి చదువుకున్నాడు. విద్యార్థిగా సాంబయ్య తర్వాత మంచిపేరు సంపాదించుకున్నాడు. కాబట్టే రాంచంద్రం సారు ప్రత్యేక శ్రద్ధ కనబరిచాడు. బాల్యంలో సామాజిక కట్టుబాట్ల మూలంగా అందరు పిల్లలా వీధుల్లో తిరిగే స్వేచ్ఛ కొంతవరకు లేకపోయినా సాంబయ్యతో స్నేహం వల్ల పరిసర వాతావరణం పట్ల కొంత అవగాహన కల్గింది. సాంబయ్యతో కలిసి చేలలో తిరిగినప్పుడు క్రొత్త అనుభూతికి లోనయ్యాడు.

హెచ్.యస్.సి. తర్వాత కరీంనగర్‌లోని అక్క ఇంట్లో ఉంటూ పి.యూ.సి చదివాడు. అనంతరం హైదరాబాద్ నిజాంకాలేజీలో డిగ్రీ చేరాడు. కిషన్ రెడ్డి హైదరాబాద్ వెళ్తూ సాంబయ్య (ఇంటర్) పి.యూ.సి ట్రూ కాపీలను వెంట తీసుకెళ్లి ఉస్మానియాలో ఇంజనీరింగ్ సీటుకు దరఖాస్తు చేశాడు. సాంబయ్యకు సీటు రావడంతో హైదరాబాద్ వచ్చి ఇంజనీరింగ్‌లో చేరమంటూ ఉత్తరం రాశాడు. సాంబయ్య తాను చేరబోనని ఉత్తరం పంపగా మిత్రుని నిర్ణయానికి నొచ్చుకున్నాడు. ఆ తర్వాత ఎం.ఏ పూర్తి చేశాడు. అయితే బాల్య స్నేహితుడైన సాంబయ్యను ఏనాడు వదులుకోని మిత్రుడు కిషన్ రెడ్డి. ఉన్నత వర్గంలో పుట్టిన వారికి సహజంగా కలిగే అహంభావపు పోకడలకు తావివ్వకుండా తనదృష్టినంతా చదువుపైనే కేంద్రీకరించి కృతార్థుడైన పాత్రలో కిషన్ రెడ్డి కనిపిస్తాడు.

**<u>ఈశ్వర్:</u>**

కళాశాల విద్యనభ్యసించే విద్యార్థుల బాధ్యతారాహిత్యం ప్రలోభాలకు లొంగి చదువుపట్ల నిర్లక్ష్యం వహించే యువకులకు ప్రతినిధి ఈశ్వర్ పాత్ర. సాంబయ్య డిగ్రీ చదువుతున్నప్పుడు అతని రూమ్మేట్‌గా ఉన్నాడు. ఈశ్వర్ సాంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన వాడు, టౌనులో పుట్టి పెరిగాడు. అతని తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. పల్లె జీవితం అతనికి పరిచయం లేదు. ఒక సందర్భంలో సాంబయ్యతో ఈశ్వర్ ఊళ్ళో దొరలు బాగా సాగించుకుంటున్నారంటే 'శూద్రులకు

పెద్దకులాల వాళ్ళంటే మంట. అందుకే వాళ్ళమీద ఏవేవో చెబుతారు' (పు. 102) అని కొట్టి పారేస్తాడు. తాతగారి, బామ్మగారి భావాలకు దాసుడైన ఈశ్వర్, లోకం తెలియని అమాయకుడని భావించబడిన ఈశ్వర్ కళాశాలలో వామపక్ష పార్టీల ప్రేరణతో హఠాత్తుగా మారిపోతాడు. చదువును నిర్లక్ష్యం చేస్తాడు. 'ఈ చదువులు గుమాస్తాలను తయారు చేయడానికి పనికొచ్చేది మాత్రమే' (పు. 108) అని చెప్పే స్థాయికి ఎదిగాడు.

పార్టీ రహస్య కార్యకలాలపాల్లో పాల్గొన్నాడు. కరపత్రాలు పంచడం, వాల్‌రైటింగ్ చేయడం పనిగా పెట్టుకున్నాడు. ఆగష్టు 15న పోలీస్ గ్రౌండ్‌లో కలెక్టర్ ఉపన్యసిస్తున్న వేళ పార్టీ కరపత్రాలు పంచినందుకు అరెస్టు అయ్యాడు. ఆ తర్వాత విడుదలై వచ్చి మొక్కుబడిగా పరీక్షలురాసి ద్వితీయ శ్రేణిలో గట్టెక్కాడు.

ఈ విధంగా ఉద్యమాల పట్ల ఆకర్షితులైన విద్యార్థులకు ప్రతినిధిగా ఈశ్వర్ పాత్ర రూపకల్పన జరిగింది. విద్యార్థులు ఉద్యమ ప్రలోభానికి గురై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లు ఈశ్వర్ ప్రవర్తన వల్ల స్పష్టమౌతుంది.

**. వేణు:**

వేణు పి.యు.సిలోను, డిగ్రీలోను సాంబయ్యకు సహాధ్యాయి. డిగ్రీ చదువుతుండగా సాంబయ్య ప్రక్కగదిలో ఉంటూ చదువుకున్నాడు. సాంబయ్య, సారథి, చక్రపాణిలతో స్నేహంగా ఉన్నాడు. కళాశాలలో చదువు తప్ప మరోపని పెట్టుకోలేదు. తనకంటూ ఓ లక్ష్యం నిర్ధారించుకున్నాడు. బాధ్యతతో నడచుకున్నాడు. 'వేణుకివేవి పట్టవు. తల్లి దండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారు. తాను మంచి మార్కులతో పాసై మంచి ఉద్యోగం సంపాదించుకొని కుటుంబాన్ని ఆర్థికంగా నిలదొక్కుకునేట్టు చేయాలి. చెల్లెండ్ల పెళ్ళిళ్లు చేయాలి. సమాజం గూర్చో, మరి దేన్ని గూర్చొ పట్టించుకునే తీరికా ఓపికా తనకు లేవు. తను ఊరిబళ్ళో చదువుకున్నప్పుడు తన మనసెప్పుడూ వ్యవసాయం పైనే ఉండేది. బడికి కొంచెం దూరంలో ఉన్న పొలానికి ఏమాత్రం సమయం దొరికినా పరుగెత్తుకొని వెళ్లి నీళ్లు పెట్టి వచ్చేవాడు. అతనికిప్పుడు చదువొక్కటే ధ్యేయం' (పు. 102) అని వర్ణించడాన్ని బట్టి వేణు పరిస్థితులకు అనుగుణంగా నడుచుకునేవాడని తెలుస్తుంది.

బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించిన ఈశ్వర్‌ను గదికి రాకూడదని మందలించడాన్ని బట్టి అతనికి చదువును నిర్లక్ష్యం చేస్తున్న వారిపట్ల ఉన్న అసహ్యత కన్పిస్తుంది. ఎన్నికల, గ్రూపు తగాదాల వల్ల క్లాసులు నష్టపోవాల్సి వచ్చినప్పుడు అతడు సాంబయ్యతో పలికిన మాటలు చదువుపట్ల అతనికున్న శ్రద్ధను స్పష్టం చేస్తాయి. అలా కష్టపడి చదవడం వల్లనే సాంబయ్యతో పాటు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఒక ఉత్తమ విద్యార్థి లక్షణాలు కలబోసిన పాత్ర వేణుది.

**రాంచంద్రం సారు:**

ఆదర్శవంతుడైన ఉపాధ్యాయునిగా చిత్రితమైంది. స్వంత ఊరిలో ఉద్యోగం చేసిన రాంచంద్రం సారు విద్యార్థులలో సమగ్రాభివృద్ధికొరకై పాటుపడ్డాడు. బడిలో విద్యార్థుల మధ్య ఎలాంటి పొరపొచ్చాలు రాకుండా శ్రద్ధ వహించాడు. తన ప్రవర్తనతో విద్యార్థులను ఆకట్టుకున్నాడు. తానంటే భక్తి, గౌరవాలు పెంపొందేటట్లు నడుచుకున్నాడు. సెలవుల్లో స్వంత పనులు చూసుకుంటూ విద్యార్థుల బాగు కోసం పాటుపడ్డాడు. వీధుల్లో ఆడుకునే పిల్లలు రాంచంద్రం సారు కనబడగానే పరిగెత్తేవారు. చదువుపట్ల ఆసక్తి కనబరిచే పిల్లలకు ప్రత్యేక తరగతులు తీసుకున్నాడు. అందువల్లే సాంబయ్య, కిషన్ రెడ్డి వంటి వారికి ఆరాధ్యుడయ్యాడు.

వృత్తినే దైవంగా, విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా పెట్టుకొని పనిచేసిన రాంచంద్రం సారుకు భంగపాటు తప్పలేదు. దీర్ఘకాలంగా అదే ఊరిలో పనిచేయడం వల్ల, అతని సేవల్ని

పరిగణలోకి తీసుకోకుండా పనిగట్టుకోని కొందరు బదిలీ చేయించారు. బదిలీ జరిగాక రాంచంద్రం సారులో వ్యాపార ధోరణి అలవడింది. ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే కర్రషాపు పెట్టుకోని ఆర్థికంగా పుంజుకున్నారు. రాంచంద్రం సారు ఆదర్శానికి తగిన గుర్తింపు రాకపోవడం వల్లనే వ్యాపారం వైపు దృష్టి సారించాడు. ఆదర్శంతోపాటు ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి ప్రయత్నించిన పాత్రగా కనబడతాడు.

**మల్లేశం సారు:**

సాంబయ్య హైస్కూల్‌లో చదువుతున్న రోజుల్లో మల్లేశం సారు తెలుగు పండితునిగా ఆ ఊరు వచ్చాడు. అతను విద్యార్థులను ఆకట్టుకునే విధంగా పాఠం చెప్పేవాడు. విద్యార్థులకు సంఘ సంస్కర్తల గురించి వివరించి మూఢనమ్మకాల్ని తొలగించే ప్రయత్నం చేశాడు. అతని బోధనల వల్ల సాంబయ్య ప్రభావితుడయ్యాడు. మల్లేశం సారు హేతువాద దృక్పథాన్ని సాంబయ్య గ్రహించాడు. అతని శ్రద్ధ వలనే సాంబయ్యలాంటి విద్యార్థులకు పద్య పఠన, సాహిత్య పఠనతో ఆసక్తి కలిగింది. కులాల పుట్టుకను గురించి చంద్రగ్రహణాదులు ఏర్పడే తీరును గురించి హేతువాద దృక్పథంతో విద్యార్థులకు ఉన్న సందేశాలు తీర్చాడు. ఇలా విద్యార్థుల పురోభివృద్ధికి బాటలు వేసిన ఆదర్శనియమైన పాత్రగా మల్లేశంసారు ప్రవర్తన చిత్రితమైంది.

**వెంకటేశ్వర రావు పంతులు:**

వెంకటేశ్వర రావు పంతులు ఉన్నత వర్గానికి చెందిన కరణం కులస్థుడు. భూస్వాములకు అనుగుణంగా నడుచుకుంటూ వచ్చిన పట్వారి ఊళ్లో అంతో ఇంతో చదువుకున్న వారిలో మొదటి తరానికి చెందిన వాడవడం వల్ల ఉత్తరాలు, కాగితాలు అతడే చదివేవాడు. తన తెలివితేటలతో తిమ్మిని బమ్మిని చేసి నూర్ల ఎకరాలు సంపాదించుకున్నాడు. ఊళ్లో పెద్ద మనిషిగా చెలామణి అవుతూ వచ్చాడు. ఊళ్లోకి మొదటి సారిగా టార్చిలైట్, గడియారం లాంటి వస్తు సామాగ్రిని తెచ్చి పరిచయం చేశాడు. అందరితో పరాచికాలాడటం, ఆడవాళ్ళతో అసభ్యంగా మాట్లాడటం, అసభ్యంగా ప్రవర్తించడం అంటే అతనికి సరదా.

కుల భేదం చూసేవాడతను. శూద్రులు చదువుకొని ఎదగడం అతనికేమాత్రం నచ్చేది కాదు. సాంబయ్య పట్వారి లెక్కలు నేర్పమని వస్తే తనను మించి పోతాడనే భయంతో కాలక్షేపంచేసి పంపాడు. అయితే తన కొడుకుల్ని అదుపాజ్ఞలో పెట్టి పెంచడంలో మాత్రం విఫలమయ్యాడు. కళ్ళముందే కొడుకులు దుర్మార్గులై తాను సంపాదించినదంతా హారతి కర్పూరంలా ఖర్చుచేయడంతో పూలమ్మే చోట కట్టెలమ్ముకునే పరిస్థితిని ఎదుర్కొన్నాడు. ఇట్లా గతమెంతో ఘనంగా బతికిన వారు వర్తమానంలో బతికి చెడుతున్న పరిస్థితికి నిదర్శనంగా వెంకటేశ్వర రావు పంతులు పాత్ర చిత్రితమయ్యింది.

**రాజమ్మ:**

చిలుకయ్య భార్య రాజమ్మ. సాంబయ్య, సుశీల వారి సంతానం. గొడ్రాలిగా అత్త సూటిపోటి మాటలను అనుభవించింది. సాంబయ్య పుట్టిన తర్వాతే ఆమెకు అత్తపోరు తప్పింది. పిల్లల్ని అత్తవద్ద వదలి భర్తకు వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా నిలిచింది. సామాన్య మధ్యతరగతి గృహిణిగా కుటుంబ భారాన్ని భర్తతో సమానంగా పంచుకుంటుంది. పిల్లల్ని అపురూపంగా, అత్తమామల్ని ఆత్మీయంగా చూసుకుంది. కొడుకు బాగా చదివి వృద్ధిలోకి వస్తే తమ కష్టాలు గట్టెక్కుతాయని విశ్వసించింది.

సామాన్య మధ్యతరగతి గృహిణి పడే ఇబ్బందులన్నింటిని అధిగమిస్తూనే ఉన్నంతలో పిల్లల అవసరాలు తీర్చింది. పదేళ్ళు నిండిన కూతురు సుశీలకు పెళ్ళి జరిపించిన తర్వాత తమ బరువు బాధ్యతలు తీరాయనుకుంది. ఆ పెళ్ళికి చిలుకయ్య తన ఒంటిమీది బంగారం అమ్మేసినా కూతురు సుఖం కోసం మిన్నకుండిపోయింది.

కొడుకు చదువులో హుషారున్నాడని తెలిసి సంబరపడిపోయింది. ఉన్నత చదువులు చదివించే స్థోమత తమకు లేదని తేల్చి చెప్పిన చిలుకయ్యను కొడుకు మీద ఉన్న మమకారంతో ఒప్పించింది. పట్నంలో కాలేజి చదువులకు వెళ్తున్న సాంబయ్యకు అన్ని విధాల జాగ్రత్తలు చెప్పింది. కూతుర్ని అల్లుడు కొట్టి పంపించిన ప్రతిసారి ఇల్లు చేరే కూతురుని ఆదరించింది. ఉద్యోగం దొరికాక తమను వెంట తీసుకెళ్ళి ఆదరిస్తాడనుకున్న కొడుకు అంటీముట్టనట్టు వ్యవహరించడంతో రెక్కల కష్టాన్నే నమ్ముకొని భర్తతో పాటు ఊళ్ళోనే ఉండిపోయింది.

ఈ విధంగా సాంప్రదాయాలకు కట్టుబడి భర్త అడుగుజాడల్లో నడిచే ఇల్లాలుగా, మూఢవిశ్వాసాల్ని పాటించే అమాయకురాలిగా, పెద్దల పట్ల గౌరవం అణకువ గల గృహిణిగా, పిల్లలపై మమకారమున్న మాతృమూర్తిగా, అంతకు మించి సామాన్య మధ్యతరగతి రైతు కుటుంబంలోని స్త్రీకి ప్రతీకగా రచయిత కాలువ మల్లయ్యగారు రాజమ్మ పాత్రను చిత్రీకరించారు.

**కొంరమ్మ:**

నవలేతివృత్తంలోని సన్నివేశాలు, సంఘటనలు కొంరమ్మ పాత్ర చిత్రణ జరిగిన తీరు విశద పరుస్తున్నది. కొంరమ్మ చిలుకయ్య తల్లి. పాత కాలపు మనిషి. నిజాం కాలంలో కష్టాలు, కడగండ్లు అనుభవించి లసుమయ్య భార్యయైన కొంరమ్మ తన ఏకైక కుమారుడు చిలుకయ్యకు వంశాంకురం కలిగే వరకు కోడల్ని గొడ్రాలు అంటూ ఆడిపోసుకుంది. సాంబయ్య జన్మించాక కోడలుతో సఖ్యత పెంచుకుంది. కోడలు పనికి వెళ్తే పిల్లల ఆలనా పాలనా చూసేది. మనుమడిపై కొంరమ్మకు ప్రేమ అధికం. మనుమడిని ఉపాధ్యాయుడు కొట్టాడని తెలిసి నోటికొచ్చినట్లు తిట్టిపోసింది. దొరల కాలం నడుస్తున్నదంటూ ఆవేదన చెందింది. తాను బ్రతికి ఉన్నంత వరకు మనుమని పైనే ఆశలు నిలుపుకుంది. తన మనుమడు బాగా చదివి గొప్ప ఉద్యోగం చేస్తాడని కలలు కనేది. తానుకన్న కలలు ఫలించకముందే లోకం విడిచి వెళ్ళిపోయింది. ఇట్లా పాత తరం వ్యక్తుల ప్రవర్తనకు నిలువుటద్దంలా కొంరమ్మ పాత్ర రూపుదిద్దుకుంది.

**2.3.4.సాంబయ్య చదువు నవలావిశ్లేషణ:** ఈ నవలలో కాలువ మల్లయ్య గారు గ్రామీణ జీవన చిత్రణ సజీవంగా చిత్రీకరించారు. గ్రామాల్లో రైతులు వ్యవసాయం చేస్తూ పడే బాధలు దొరల ఆగడాలు, మానవ సంబందాలు, కుల వ్యవస్థ, వివిధ ఉద్యమాల ప్రభావంతో విద్యార్థులు చదువుకోవడానికి పడిన ఇబ్బందులు చర్చించారు. ఆ అంశాలను కింద విశ్లేషణ చెయ్యడం జరుగుతుంది.

**2.3.4.1.మానవ సంబంధాలు :**

సాహిత్యం మనుష్యుల మధ్య సంబంధాలను, వాటిలో వస్తున్న మార్పులను చిత్రిస్తూ తద్వారా సామాజిక సంబంధాల పరిణామక్రమాన్ని అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది. నవల మానవ జీవితాన్ని ప్రతిబింబించేది కావున, నవలాకారులు నవలల్లో మానవ సంబంధాల్ని ప్రతిఫలింపజేస్తారు. సాంబయ్య చదువు నవల కూడా వివిధ స్థితిగుతలలో రకరకాల సంబంధాల్ని కథావస్తువుగా చేసుకుంది. ఇందులో మానవ సంబంధాలెట్లున్నాయో విశ్లేషించి చూడటం ద్వారా నిజాం కాలం నుంచి సమకాలీనం వరకున్న సామాజిక మూల స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణ గ్రామీణ సమాజంలో అనాదిగా ప్రజల మధ్య వైరుధ్యాలు కొనసాగుతూనే వచ్చాయి. అగ్రవర్ణాలకు చెందిన వారు బలహీన, నిమ్నజాతుల వారిని తమ కంటే తక్కువ వారనే భావనతోనే చూస్తూ వచ్చారు. నిజాం పాలనలో ఉన్నత వర్గానికి చెందిన జమీందారులు, భూస్వాములు గ్రామాల్లో దొరలుగా చెలామని అవుతూ సామాన్యజనులకు అతీతులమన్నట్లు

ప్రవర్తించడం కనిపిస్తుంది. వారి వల్ల సామాన్య ప్రజలు పడిన కష్టాలు నవలేతివృత్తంలో చిత్రితమయ్యాయి. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం అంటరానితనపు నిరోధక చట్టాన్ని అమలు చేసి మానవ సంబంధాల్ని మెరుగుపరచే ప్రయత్నాలు చేపట్టినా, అగ్రవర్ణాల వారు సహకరించకపోవడంతో వర్గభావన బలపడడానికే దోహదం చేసిందని భావించవచ్చు.

నవలేతివృత్తంలో వెంగళరావు దొర ప్రవర్తన, కొండల్‌రెడ్డి, నారాయణరెడ్డి, పట్వారీ వెంకటేశ్వరరావు పంతులు, ఆగయ్య షావుకార్ల స్వభావము ఉన్నత వర్గ భావనను స్పష్టం చేస్తుంది. దొరసాని వెంకటయ్య పంతుల్ని మొహం వాచేలా తిట్టడం కూడా ఆభావనతోనే బలహీన, దళిత కులాల వారి సేవల్ని వినియోగించుకుంటూ, వెట్టి పనులు చేయించుకుంటూ వచ్చిన భూస్వాములు యజమాని – బానిస సంబంధాలు నిలిచి పోయేటట్లు ప్రవర్తించారు. సాటి మనుష్యుల పట్ల చూపవలసిన జాలి, దయ అణుమాత్రమైన చూపకపోవడం వల్ల మానవత్వ విలువలు మంటగలిసాయి. రాజారావు దొర పాలేరు దుర్గయ్యను ఆవుపొడిచి చావు బతుకుల్లో కొట్టుమిట్లాడుతున్నప్పుడు రాజారావు ప్రవర్తించిన తీరు మానవత్వానికే మచ్చగా నిలుస్తుంది. పరోక్షంగా దుర్గయ్య చావుకు కారకుడైన రాజారావు ప్రవర్తన యజమాని – బానిస సంబంధాల్ని స్ఫురింప చేస్తుంది.

'ఒకే రకమైన సామానిక హోదా కల్గిన వెనుకబడిన కులాల్లో వరుసలు పెట్టుకొని పిలుచుకునే ఆప్యాయత గ్రామీణ జీవనంలో కనిపిస్తుంది. వెనుకబడిన కులానికి చెందిన చిలుకయ్య మంగలి నర్సయ్య మధ్య జరిగిన సంభాషణ,చిలుకయ్య కాపు శంకరయ్యతో జరిపిన సంభాషణ వెనుకబడిన కులాల్లో వైరుధ్యం లేని మానవ సంబంధాలకు దృష్టాంతాలుగా నిలుస్తాయి. నవలేతి వృత్తంలోని పలు సన్నివేశాలు ఒకే రకమైన జీవిత ప్రమాణాలు కల్గిన వ్యక్తుల మధ్య మానవీయ సంబంధాలు దృఢంగా ఉన్నట్లు నిర్ధారిస్తున్నవి. భూస్వామ్య వ్యవస్థ యొక్క సంప్రదాయంగా మొన్న మొన్నటి వరకు కొనసాగిన ఉద్యోగి వ్యవస్థ నవలేతి వృత్తంలో కనిపిస్తుంది. పతన్‌దార్లుగా ఉన్న పట్వారీ, పోలీస్‌పటేల్, తాహసీల్దార్, సుంకర్లు మున్నగు ప్రభుత్వోద్యోగులు నెరపిన సామాజిక సంబంధాలు అవగమవుతాయి.

తాహసీల్దారు గ్రామాల్లోకి వచ్చి నియంతగా వ్యవహరించడం, భూమిశిస్తు కట్టని వారిని నిర్దాక్షిణ్యంగా శిక్షించడం, ప్రజల ఆస్తుల్ని దోచుకెళ్ళడం,పట్వారీ అధికారాన్ని అడ్డంగా పెట్టుకొని దుర్మార్గంగా వ్యవహరించడం,సుంకర్లు పన్నులు చెల్లించని వారింట్లో చొరబడి వస్తువులు తీసుకెళ్ళడం బ్యాంకు ఉద్యోగులు సర్కారు బాకీలు వసూలు చేయడానికి ఆస్తి పాస్తుల్ని వేలం వేయడం మున్నగు చిత్రణలు ఉద్యోగి వ్యవస్థ ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పడంలో విఫలమైనట్లు స్పష్టం చేస్తున్నాయి. ఉద్యోగి వ్యవస్థ కూడా విధి నిర్వహణలో యజమాని – బానిస సంబంధాలనే అనుసరిస్తున్నట్లు ధృడపడుతుంది. ఈ నవలేని వృత్తంలో తండ్రి కొడుకుల మధ్య సంబంధాలు పరిశీలించినట్లయితే, సామాజిక జీవనంలో వస్తున్న మార్పులు అవగతమౌతాయి. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదరించలేని కొడుకుల బాధ్యతారాహిత్యానికి సాంబయ్య దృష్టాంతంగా నిలుస్తాడు. తండ్రి కష్టార్జితంతో ఎదిగిన సాంబయ్య ఉద్యోగరీత్యా పరాయి ఊళ్ళో ఉండాల్సి వస్తుంది. వృద్ధాప్యంలో ఉన్న తండ్రి ఊళ్ళో వ్యవసాయాన్ని కొనసాగించుతూనే ఉండగా, సాంబయ్య అప్పుడప్పుడు ఊరెళ్ళి చూసిరావడం మినహా తాను ఉద్యోగం చేసే చోటికి తీసికెళ్ళి పోషించలేకపోయాడు అయితే చదువులు వ్యక్తుల మధ్య పరాయీకరణకు కారకమవుతుందని సాంబయ్య ప్రవర్తన ద్వారా వ్యక్తమవుతుంది.

నవలేతి వృత్తంలో స్త్రీ – పురుష సంబంధాల్ని విశ్లేషించి చూసినట్లయితే, భూస్వామ్య వ్యవస్థలో సమాజంలో స్త్రీకి ఏమాత్రం గౌరవం లేకపోవడం కన్పిస్తుంది. సమర్తయి నాడిది

మొదలు దొరల దగ్గరకే పోవన్నాయో' అనే జనం మాటల్లో స్త్రీ భోగ – విలాస వస్తువుగా పరిగణింపబడుతూ వచ్చినట్లు సుస్పష్టమవుతుంది. నవలేని వృత్తంలో జగిత్యా వెలమదొర ప్రస్తావన, నర్సిరెడ్డి దొర నిర్వాకం తెనుగు నర్సయ్య బిడ్డ ప్రస్తావన, కొండల్ రెడ్డి రాచలీలలు మున్నగునవి స్త్రీల పట్ల దొరలు చూపిన అమానుసానికి ప్రబల నిదర్శనాలుగా నిలుస్తాయి. భార్యాభర్తలు పనిలో, కుటుంబ బాధ్యతలో చెరిసగం అన్నట్లుగా ప్రవర్తించడం నవలేతివృత్తంలో చిలుకయ్య, రాజమ్మల పాత్రల ద్వారా వ్యక్తం అవుతుంది. చిలుకయ్య భార్య కుటుంబ భారాన్ని మోయడంలో తనవంతుగా భర్తతో పాటు వ్యవసాయ పనులు చేస్తుంది. కూలీపనులకు వెళు తుంది. కొడుకును బాగా చదివించడానికి గాను భర్తకు తగిన సమయంలో సలహా ఇస్తుంది. సాధారణంగా గృహిణిగా కనబడే రాజమ్మ కొడుకు ఉన్నత చదువులు చదివి ఎదగడానికి పరోక్షంగా కారకురాలవుతుంది.

సమాజంలో బాల్య వివాహాలు స్త్రీ పురుషుల మధ్య విబేధాలు తలెత్తడానికి కారకమయ్యాయని భావించడానికి చిలుకయ్య కూతురుకు జరిపిన బాల్య వివాహం దృష్టాంతంగా నిలుస్తుంది. చిలుకయ్య కూతురు సుశీలను భర్త మాటి మాటికి కొట్టి పంపిస్తాడు. అలా పుట్టింటికీ చేరిన ప్రతీసారి చిలుకయ్య పంచాయతీ పెట్టో, మరింత డబ్బు సర్దుబాటు చేసో అత్తవారింటికి సాగనంపుతాడు. ఇట్లా కుటుంబాలలో మానవీయ సంబంధాలు డబ్బు, అవసరాల చుట్టూ పరిభ్రమిస్తున్నట్లు ప్రస్ఫుటమవుతుంది. సామాజిక జీవనంలో ప్రజలు ఎన్ని ఒడిదొడుకుల్ని ఎదుర్కొంటున్నా, ఆప్యాయంగా పలుకరించుకునే గ్రామీణుల ఆత్మీయత, మానవ సంబంధాలు క్రమంగా విఘాతమవుతున్నట్లు నవల్లో సూచితమైంది. నక్సలైట్ ఉద్యమ పరిణామాల వల్ల గ్రామాల్లో యువజన సంఘాల స్థాపన, కుల సంఘాల ఏర్పాటు సమాజ జాగృతిలో ఒక భాగంగా నిలిచినా, వీని ఫలితాలు పరోక్షంగా మానవీయ సంబంధాలపై ప్రభావాన్ని చూపాయి. వర్గ శత్రుత్వ భావన ఏర్పడిన గ్రామాల్లో అగ్రవర్ణ ప్రతినిధులు ఊర్లో నిలవలేని పరిస్థితి వచ్చింది.

ఈ విధంగా నిజాం కాలం నుండి సమకాలీనం వరకు మానవ సంబంధాలలో వచ్చిన మార్పుల్ని నవల్లో రచయిత ప్రతిబింబింపచేసి సామాజిక మూల స్వభావాన్ని ఆవిష్కరించారు.

**<u>2.3.4.2. భూస్వామ్య వ్యవస్థ – స్వరూప స్వభావాలు :</u>**

'సాంబయ్య చదువు' నవల కూడా నిజాం కాలంలోని ఫ్యూడల్ దౌర్జన్యాల్ని మొదలుకొని నక్సలైట్ ఉద్యమ పరిణామాల వరకు అప్రతిహతంగా కొనసాగిన భూస్వామ్య వ్యవస్థ స్వరూప స్వభావాన్ని అంతర్భాగంగా చేసుకుంది. తెలంగాణ పల్లెల్లో నిజాం కాలంలో పాదుకొని యున్న భూస్వామ్య వ్యవస్థ క్రమక్రమంగా ప్రజల్ని పట్టి పీడిస్తూ, ఎలా అణగద్రొక్కిందో రచయిత ఈ నవల్లో సమగ్రంగా చిత్రించారు. పెద్దపల్లి దేశ్‌ముఖ్ వతన్‌గా సిద్ధించిన పట్వారీ విధులు నిర్వహించినట్టి వెంకటేశ్వరరావు పంతులు కూడా నూర్లకొద్ది ఎకరాలను తెలివిగా సంపాదించుకున్నాడు. భూస్వామైన ఆ ఊరి దొర వెంగళరావు కూడ ఒక్కడు 'చుట్టూ నాలుగైదూళ్ళకు జమీందారుగా, దొరగా పేరున్న వెంగళరావంటే అందరికీ భయమే. అతనికి ధనబలంతో పాటు అన్ని బలాలున్నాయి. అతనికెదురుగా మాట్లాడటానికందరూ జంకుతారు''దొరా బాంచెన్ నీ కాల్మొక్తా' అని జనం చేత నీరాజనాలందుకున్నాడు. వెంగళరావు దొర దేవిడిలో ఉంటూ కచ్చీరింట్లో షేరిదారుచేత పనులు చేయించుకునేవాడు. బయటికి వెళ్ళాల్సివస్తే సవారెడ్ల బండిలో వెళ్ళేవాడు. అట్లే, కొండల్‌రెడ్డి భవనం మరో లోకాన్ని తలపించేది. దొర నివసించే ఇండ్లు సామాన్య మధ్య తరగతి ఇండ్ల కంటే పూర్తి వైవిధ్యం గలవని స్పష్టమవుతుంది.

మన దొరలు పెద్ద పెద్దోల్లంత నైజాం నవాబుకే మద్దతిచ్చింద్రు అని అక్కడ గుమిగూడిన జనంలోంచి ఒకరు అనడం బట్టి నైజాం పాలన కొనసాగితేనే పల్లెల్లో తమ అధికార పీఠం కదలకుండా ఉంటుందనే భావన నాటి దొరల్లో ఉండి ఉంటుంది. దొరల అండదండలు వల్లనే రజాకార్లు పల్లెల్లో చెలరేగారు. అంగబలం అర్థబలం కలిగిన దొరలు రజాకార్లు సల్పిన దౌర్జన్యాలను చూస్తూ ప్రేక్షక పాత్ర వహించారు. 'నీవయ్య గా రజాకార్లు నాశినెంగాను. గా నల్గొండ దిక్కైతే ఆడోల్లను బట్టలిడిపిచ్చి బతుకమ్మ లాడిచ్చింద్రట. మానం బోయినంత బతుకుడెందుకని కొందరు నూతిల పడి సచ్చింద్రట అనడం బట్టి తెలంగాణలో ఖాసీం రజ్వీ నాయకత్వాన జరిగిన రజాకార్ల దమనకాండ మాన, ప్రాణాల్ని హరించే నరరూప రాక్షస చర్యగా మారడానికి గ్రామాల్లోని దొరలు, వారి చర్యలకు అడ్డుచెప్పక పోవడం వల్లననే **భావ** కల్గుతుంది.

సామాన్యజనులు చదువుకొని పైకి రాకుండా శాయశక్తులా అడ్డుకున్నారు. అప్పుడు చదువులు గూడా తురకంలనేనాయె. ఊల్లెకు 'అక్‌బర్' వత్తే అదో తప్పు. అప్పుడు చవువు కున్నోల్లెవలు? ఇప్పటికి గూడ ఊరంత గొడితె పదిగేనిరువై మందయితరేమో? ఊల్లెకు కారటత్తె, ఇంకేదన్న కాయిదమత్తె పట్వారీ దగ్గర్నే చదివించుకునేటోల్లు. ఒక్క కొండల్‌రెడ్డింటికి ఎప్పుడన్నోసారి గోల్కొండ పత్రికచ్చేది. అని తెలుపడాన్ని బట్టి ఆనాటి దొరలు ఊళ్ళోకి పత్రికలు రాకుండా అడ్డుకున్నట్లు, విద్యను నిర్లక్ష్యం చేసినట్లు స్పష్టమవుతుంది. స్వాతంత్ర్య పోరాట కాలంలో పత్రికలు, గ్రంథాలయ ఉద్యమం జన జాగృతికి వారధిగా నిలిచాయి. గ్రామాల్లో దొరలుగా చెలామణి అయింది ప్రధానంగా వెలమ, రెడ్డి కులస్థులు. వీరికి 'దొర' అనే సామాజిక హోదాను నాటి వ్యవస్థ కట్టబెట్టింది. నవలేతివృత్తంలో వెంగళరావు దొర, రాజారావు దొర, రంగారావు దొర, నర్సిరెడ్డి దొర, కొండల్‌రెడ్డి దొర, రాజిరెడ్డి దొర వీరంతా జనంచేత దొరలని పిలిపించుకోవడం బట్టి చూస్తుంటే వెలమలు, రెడ్లు దొరలుగా వ్యవహరించబడ్డట్లు స్పష్టమవుతుంది.

దొరలు స్త్రీలపై అత్యాచారం చేయడం తమ గొప్పతనంగా భావించేవారు. పేదోనికి మంచి పెండ్లాముండదంటారు. సూడు గట్లుండేది దొరల సంగతి. నైజాం కింద ఉండి మస్తు ఘోరాలు చేసేటోల్లు సమర్తయినాడిది మొదాలు దొరల దగ్గరికే పోవన్నాయె అనడాన్ని బట్టి దొరలు స్త్రీలపై జరిపే లైంగిక దోపిడిని కట్టుబాటుగా నిర్ణయించడం తెలిసివస్తుంది. తొలి సమర్త తర్వాత యువతి మొదట దొరల పక్కలోకి చేరాలనే ఒక అనాగరిక ఆచారాన్ని, ఒక పథకం ప్రకారం అమలు జరిపినట్లు స్పష్టమవుతుంది. ఎంత మంది అబలల జీవితాల్ని బుగ్గిపాలు చేస్తే అంత గొప్ప అని భావించడం భూస్వామ్య సంస్కృతిలో కన్పిస్తుంది. ఇప్పుడు మాత్తురం వెలమ దొరలు, రెడ్డిదొరలు తక్కువ సాగించు కుంటుంద్రా గా జగిత్యాల దగ్గెరో వెలమ దొరున్నడట. అయినె ఆడోల్లు ముంతు పట్టుకొని పోయేకాడికి మనిషిని తెలిత్తడట అండ్ల నుంచి ఎవ్వలను రమ్మంటే ఆ ఆడామె దొరింటికి ముంతతోనే పోవాలె. గట్లెంతో మందిని పాడు జేసిండటాయినె. అట్ల తెచ్చిన ముంతలన్ని ఓ అర్రలేస్తే అర్రె నిండిందట అనే ఈ చిత్రణను బట్టి దొరల కామదాహానికి అంతులేదని విదితమవుతుంది.

స్వాతంత్ర్యానంతరం తెలంగాణ పల్లెల్లో భూస్వాములు తమ పూర్వ వైభవాన్ని కొనసాగించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడి పౌరులంతా సమానమనే విధి విధానాలు అమల్లోకి వచ్చినా భూస్వాములు యథేచ్ఛగా తమ పెత్తనాన్ని కొనసాగించారు. నవల్లోని కథా జనరల్ ఎన్నికలకు వారం రోజుల ముందు ప్రారంభమవుతుంది. ఆకాలంలోని భూస్వామ్య వ్యవస్థ స్వరూపాలు విశదమవుతున్నాయి. 'ఆ ప్రాంతంలో మొన్న మొన్నటి వరకూ కమ్యూనిస్టుల ప్రభావముండేది. దొరలు వాళ్ళకు భయపడేవారు. వెంగళరావుదొర పెద్ద పల్లికి పారిపోయాడు.

మూడేళ్ళక్కడే ఉండి ఏడాది క్రితమే తిరిగొచ్చాడు. అలాగే ఎంతోమంది అని చిత్రించడాన్ని బట్టి, తెలంగాణ సాయుధ పోరాటకాలంలో ఊరు వదలి, ఆ తర్వాత అనుకూల పరిస్థితి ఏర్పడటంతో దొరలు ఊరు చేరినట్లు తెలుస్తుంది. గత జీవితపు తాలూకు అధికార దర్పాన్ని కొనసాగిస్తూనే పోయారు.

భూస్వామ్య వ్యవస్థలో రచ్చబండ తీర్పులు సర్వసాధారణం భూస్వాములే సర్వం తెలిసిన న్యాయ నిర్ణేతలు. గ్రామాల్లోని అన్ని కులాల వారి తగాదాలు, పంచాయితీలు పరిష్కరించేది వీరే. వీరు చెప్పే తీర్పుకు శిరసావహించాలి. భూస్వాములు చెప్పే తీర్పును ఎదిరిస్తే ఫలితం అనుభవించవల్సిందే.సాంబయ్యకు ఆరేళ్ళు నిండగానే చదివించాలనే సంకల్పంతో దొర అనుమతిని కోరాడు చిలుకయ్య.వెంగళరావు దొర ఎంతగా ప్రలోభపెట్టినా లొంగలేదు. చివరకు సరే నీ ఇష్టమున్నది చేసుకో అని దొర అనగలిగాడు.చదువుకున్నట్లయితే కుల వృత్తులకు దూరమై పనిపాటలు చేయడానికి అందుబాటులో ఉండకుండా పోతారనే ఆలోచనతో, జనాన్ని చదువులకు దూరంగా ఉంచడానికే యత్నించారు. 'మనం చదువుకుంటె తెలివికత్తమని చదువుకోనియ్యరాల్లు.

ఇంకమానూల్లె కొంచెం నయంగా కొండల్‌రెడ్డి చెయ్యవట్టి బడచ్చె. కొందరు దొరలు బడిగూడ రానియ్యరు. మనం తెలివికత్తె ఆల్ల సంగతెట అనే మంగలి నర్సయ్య మాటల్ని బట్టి భూస్వాములు చదువుపట్ల విముఖ చూపినట్లు విదితమవుతుంది. తమ స్వార్థ ప్రయోజనాల కోసం పాలబుగ్గల పసివాళ్ళను పాలేర్లుగా పెట్టుకొని గొడ్ల కాయించుకోవడానికి యత్నించారు. అట్లా నిర్దయతో వ్యవహరించి వారి బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసారు.భూస్వామ్య వ్యవస్థలో వెట్టి గురించి చెప్పనక్కర్లేదు. దళిత, బహుజన కులాల వారందరు దొరకు వెట్టిచేయాల్సిందే, నవలేతివృత్తంలో చాకళ్లు, మంగల్లు, దళితులు, అధికార్లకు, దొరలకు విధిగా వెట్టిచేయడం, పోలీసు పటేలు కూతురు పెళ్లికి గొల్లలు పదిగొర్లను ఉచితంగా ఇవ్వడం, పట్వారీ ఇంట్లో బోయమల్లయ్య వెట్టిపనులు చేయడం, సమయానికి చెప్పులు తేలేదని మాదిగ నర్సయ్యను దొర చెప్పులు విరిగేలాకొట్టడం ప్రస్తావించడాన్ని బట్టి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దకాలం గడిచినను వెట్టి ఎలాంటి తీవ్రరూపంలో ఉందో స్పష్టమవుతుంది.

### 2. 3. 5 .గ్రామీణ జీవన చిత్రణ :

సాంబయ్య చదువు నవల తెలంగాణ గ్రామీణ జీవితంలో ప్రబలిన మార్పుల్ని ప్రతిఫలింపజేస్తుంది. స్వాతంత్ర్యానికి పూర్వం నైజాం పాలనలోని తెలంగాణ గ్రామీణ పరిస్థితులను మొదలుకొని నవలా రచనా కాలం నాటికి ఉన్నటువంటి సమకాలీన పరిస్థితుల వరకు రచయిత నవల్లో ప్రతిఫలింపజేసారు.

రచయిత స్వీయ జీవితాన్ని తలపింపజేసే నవలేతివృత్తంలో తాను పుట్టిపెరిగిన ఊరినే కథకు వేదికగా చేసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోని తేలుకుంట నవల్లో ఆవిష్కరించబడి తెలంగాణా గ్రామీణ సామాజిక వ్యవస్థ స్వరూప స్వభావాల్ని ప్రతిఫలింపజేసింది. పల్లెలో పుట్టిపెరిగిన రచయిత కాలువ మల్లయ్య గారు నవల్లో గ్రామ జీవనాన్ని చిత్రించిన వైనం పరిశీలిస్తే, అతనికి పల్లెలపై ఉన్న మమకారం తెలిసివస్తుంది. స్వాతంత్ర్యానికి పూర్వం 40వ దశకపు గ్రామీణ జీవన చిత్రణను మొదలుకొని నవలా రచనా కాలం 1995 వరకు మారిన పరిస్థితులు నవల్లో నిక్షిప్తం చేసి దాదాపు అర్ధ శతాబ్దపు గ్రామీణ సామాజిక జీవన చరిత్రను మనముందు ఉంచారు.

### గ్రామం-కనీస సౌకర్యాలు:

మొదటి జనరల్ ఎన్నికల రోజున ప్రసవ వేధనపడుతున్న భార్యను కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లాలనుకున్నాడు. చిలుకయ్య, కాని, బస్సు సౌకర్యం లేకపోవడంతో భారాన్ని దేవునిపై

మోపాడు .ఆరోజుల్లో ఎన్నిమైళ్లైనా కాలినడకన వెళ్ళడం గ్రామీణులు అలవాటు చేసుకున్నారు. జిల్లా కేంద్రానికి ముప్పై కిలో మీటర్ల దూరంలో ఉండే ఆ ఊరునుంచి కొమురెల్లి క్షేత్రానికి వెళ్లాలంటే నడిచేవెళ్ళే వారు.వైద్య సౌకర్యాలు గ్రామీణ ప్రాంతాలలో మృగ్యమైనందువల్లనే శిశుమరణాలు ఎక్కువగా సంభవించేవని చిలుకయ్య మాటల వల్ల స్పష్టమవుతుంది. 'నాకు పిల్లలు లేరు పంతులు నాల్గు కాన్పులైనా ఒక్కలు గూడ దక్కలేదు. ఏ జన్మలో ఏ పాపం జేసిన్నో. ఇట్లా విద్య, వైద్య, ప్రయాణాది సౌకర్యాలు గ్రామీణ సమాజానికి చాలా కాలం వరకు అందుబాటులోకి రాకపోవడం నవల్లో గమనించగలము.

**విద్యుత్:** ఆనాడు గ్రామాలకు విద్యుద్దీకరణ జరగలేదు. గ్రామాల్లో సంపన్నులు కూడా ఇళ్లలో కిరోసిన్ దీపాల్నే వినియోగించారు. పిల్లలు వాటి వెలుతుర్లోనే చదువుకోవాలి. సాంబయ్య (ఎక్క) దీపం, వెలుతుర్లోనే చదువుకున్నాడు. అందులో కందీల శ్రేష్టమైనదిగా కనబడ్తుంది. కొండల్‌రెడ్డి ఇంట్లో అట్లాంటివి మూడున్నాయి. కందీల కొనివ్వమని సాంబయ్య తండ్రినడిగాడు. 'ఇగ... మనకు కందీలత్తయ్‌తియ్యి అని అమవాస్య రోజుల్లో పెట్టేవారని తెలుస్తుంది. అయ్యో గాలైట్లు తెలువయానె నాయిన్నవ్వ, బజార్ల దీపాలె వెట్టింద్రుద: అమాసప్పుడు ఇమామ్ సాబ్ నూనెవోత్తదండ్ల అనే సాంబయ్య మాటలు స్వాతంత్ర్యానంతరం కూడా కొన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం అందలేదని స్పష్టం చేస్తున్నాయి. దీపాల నుండి విద్యుత్ సౌకర్యాల వరకు తెలంగాణ సమాజం ఎలా క్రమంగా మారుతూ వచ్చిందో ఈ నవల తెలియజేస్తుంది.

**గ్రామీణ సజీవ దృశ్యాలు:** గ్రామీణ జీవనంలో కన్పించే సజీవ దృశ్యాలలో – పశువుల పేడకోసం తట్టపట్టుకొని పిల్లలు తిరగడం, పశువులపై ఎక్కి స్వారీ చేయడం గ్రామీణ సమాజంలో తటస్థించడం మామూలే, అట్లే నిరక్షరాస్యులు సూరు నీడలు చూచి సమయాన్ని అంచనా వేయడం పొయ్యంటు పెట్టడానికి గృహిణులు పడే ఇబ్బందులు అన్నీ గ్రామీణుల జీవన సంస్కృతిని ప్రతిబింబింప చేసే విషయాలన్ని నవలలో వర్ణించాడు.

**రైతుల దినచర్య:** గ్రామీణ జనుల దైనందిన కార్యక్రమాలు ప్రకృతితోనే ముడిపడి ఉంటాయి. తెల్లవారకముందే నిద్రలేచిన చిలుకయ్య కొట్టం దగ్గరికి వెళ్ళి గడ్డి గుంజి ఎడ్ల ముందు వేసి, పెండతీసి పెంటబొందలో వేసాడు. చేతులు కడుకున్నాడు. వేపపుల్లతో పండ్లుతోముకుంటూ చెరువు దిక్కెళ్ళాడు. దొడ్డికి పోయాడు చెర్లో ముఖం కడుక్కొని ఇంటికొచ్చాడని చిత్రించడాన్ని బట్టి రచయిత రైతుల దినచర్య ఎట్లా ప్రారంభమవుతుందో స్పష్టం చేశారు.

**దండోర:** గ్రామీణ దృశ్యాలలో తారసిల్లేది దండోరా,గ్రామాల్లో ప్రభుత్వ, పాకుల సమాచారం ప్రజల మధ్యకు వెళ్ళడానికి దండోరా ప్రచార మాధ్యమం, పేరయ్య వేసిన చాటింపును రచయిత చిత్రించి గ్రామీణ వాస్తవికతకు అద్దం పట్టారు.

**విందులు వినోదాలు:**గ్రామీణులలో సామాన్య మధ్యతరగతి వారికి విందు – వినోదాల్లో కల్లు గుడాలు, అన్నము, పొట్టేలు మాంసం ప్రియమైనవి. ఉన్నత వర్గాలకు మినహా అధిక సంఖ్యాకులైన వారికి జొన్నగడుకే ప్రధానాహారంగా ఉన్న ఆ రోజుల్లో ఇలాంటి విందు ఘనమైనదిగా చెప్పుకోబడేది. సాంబయ్య పురుడు రోజున కల్లు, గూడాలు, పొట్టేలు మాంసంతో విందు జరిపించాడు చిలుకయ్య . సాంబయ్య చెల్లెలు పెళ్లిచూపుల సందర్భంలోను పెళ్ళిలోను ఇలాంటి విందే ఇవ్వబడింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువ నీరు విడుదలయ్యేంత వరకు గ్రామీణులకు జొన్నగడుకే ప్రధానాహారంగా ఉందని స్పష్టమవుతుంది.

### 2.3.5.1. కుల వ్యవస్థ

సాంబయ్య చదువు నవల్లో రచయిత కుల వ్యవస్థ మనుగడను సూచింపజేశాడు. స్వాతంత్ర్యానికి పూర్వము నుంచి మొదలుకొని సమకాలీనం వరకు గ్రామీణ సమాజంలోని కుల వ్యవస్థ పరిణామ క్రమాన్ని నవల విశ్లేషిస్తుంది.నవలేతివృత్తంలో ప్రస్తావనకు వచ్చిన

కులాల సంఖ్య 22 ఉన్నాయి. వెలమతో పాటు రెడ్లు కూడా గ్రామాలలో అధికారం చెలయించడానికి పోటీదారులయ్యారు. వీరు కూడా దొరలుగా చెలామణి అవుతూ వచ్చారు. కొండల్ రెడ్డి స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన గ్రామ పంచాయితీకి సర్పంచ్‌గా ఎన్నికై సుదీర్ఘకాలం పదవిలో కొనసాగాడు.

గ్రామ పాలనలో రెడ్ల ప్రమేయం అధికమవుతూ వచ్చింది. పోలీసు పటేలుగా చంద్రారెడ్డి, కారోబారిగా రాజిరెడ్డి పదవుల్లో కొనసాగి ఆధిపత్యం చెలాయించడం కన్పిస్తుంది. అట్లే, నారాయణరెడ్డి, నర్సిరెడ్డి, లింగారెడ్డిలు భూములు సంపాదించుకొని ఆర్థికంగా బలపడి తాము ఉన్నత వర్గానికి చెందిన వారి మన్నట్లే ప్రవర్తించారు. 'దార్ల లచ్చయ్య బిడ్డను నర్సిరెడ్డి దొర కొడుకు నాశనం జేత్తే ఎవ్వలేం జేసిండ్రు అనే జనం మాటల వల్ల రెడ్లు దొరలుగా సామాజిక హోదా కల్గి ఉన్నట్లు తెలిసివస్తుంది. కొండల్ రెడ్డి, నారాయణ రెడ్డిలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, పరంపోగు భూముల్ని ఆక్రమించుకోవడం కన్పిస్తుంది. అయితే పదవుల్లో ఉన్న వెలమలు, రెడ్లు తమ అధికార దర్పాన్ని మరింత చాటుకునేందుకు పేరు చివర తగిలించుకున్న రావు, రెడ్డి పదాలు దోహం చేశాయని భావించ వీలున్నది.

**కరణాలు–అధికార దుర్వినియోగం:**కరణాల విషయానికస్తే గ్రామీణ సమాజంలో వారికి ఒక ప్రత్యేక స్థానమున్నది. వంశపారంపర్యంగా సిద్ధించిన పట్వారీ పదవుల్లో కొనసాగుతూ వచ్చారు. గ్రామ పాలనలో జమీందారులు, దొరలకు అండగా ఉంటూ వచ్చారు. వెంకటేశ్వరరావు పంతులు అలా పబ్బం గడపడం నవల్లో కన్పిస్తుంది. కర్నపోడి పగ కాట్లెకు పోయినా తీరది తను ఉన్నప్పుడు జుట్లు ముడేసి బతికిన కర్నపయినె చచ్చిపోయేటప్పుడు పొలిమేర రోడ్డుమీద కాలేయ్యమన్నడు. దాంతో రెండూర్ల నడుమ కొట్లాట అని చిత్రించడాన్ని బట్టి కరణాలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రజల మధ్య భూతగాదాలు పెట్టడానికి కారకులయ్యాలరనే విషయం స్పష్టమవుతుంది. కాలక్రమేణ గ్రామీణ సమాజంలో వచ్చిన మార్పుల వల్ల కరణాలు తమ పూర్వవైభవాన్ని కోల్పోవడం నవలేతివృత్తంలో కన్పిస్తుంది. ఆడంబరాలకు, చెడు తిరుగుడులకు అలవాటు పడిన వెంకటేశ్వరరావు పంతులు కొడుకుల మూలాన అతనికి పూలమ్మిన చోటే కట్టెలమ్ముకునే పరిస్థితి దాపురించింది. తెలంగాణ గ్రామీణ సమాజంలో కరణాలకు ధీటుగా పటేండ్ల ఆధిపత్యం కొనసాగడంతో కరణాలకు ప్రాధాన్యత తగ్గిపోయిందని భావించవచ్చు. పట్వారీ వ్యవస్థను ప్రభుత్వం ఎప్పుడైతే రద్దుపరచిందో అప్పట్నుంచి గ్రామీణ సమాజంలో కరణాలు తమ పూర్వపు స్థితిని క్రమంగా కోల్పోతూ వచ్చారు.

**కోమటుల వ్యాపారం:**కోమట్లు గ్రామీణ సమాజంలో ఉన్నత వర్గాల్లో ఒకరుగా నిలచి పోవడానికి వారి వృత్తిలోని నైపుణ్యత వల్లనేనని భావించవచ్చు. 'షావుకార్లు చాలు గాల్లుంటరు అడవికి అందుగు చెట్టు మెత్తన ఊరికి కోమటయిన మెత్తన' అనున్నా వీళ్ళు దొరలను, ఊరి పెద్దోల్లను చేతులపెట్టుకొని అయ్య అయ్య అనుకుంటనే ముంచుతరు. వడ్డీలకు, వడ్డీలు గట్టి మస్తు సంపాయిత్తరని చిత్రించడాన్ని బట్టి కోమట్లు సంపాదించుకోవడంలో చూపించిన నేర్పు స్పష్టమవుతుంది.

గ్రామీణ జీవనంలో వెనుకబడిన కులాల వారి స్థితిగతుల్ని గమనించినట్లయితే కులవృత్తినాశ్రయించి మనుగడ సాగించుకుంటూ రావడం కన్పిస్తుంది. నవల్లోని కథానాయకుడు సాంబయ్య కులమేమిటో రచయిత నవల్లో ఎక్కడా ప్రస్తావించలేదు. అతని తాత,తండ్రి ప్రవర్తించిన తీరును బట్టి ఇతడు వెనుకబడిన కులానియికి చెందినవాడని భావించవచ్చు. ఉన్నత వర్గీయులు చులకగానే చూడడం కన్పిస్తుంది. ఆ ఊరికి కొత్తగా వచ్చిన పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటయ్య పంతులు గొల్ల కులస్థుడు.

'అంబటాల్ల కాగనే ఊరి చాకల్లు 'చాకల్దాన్నవ్వా'అంటూ ఊరు తిరగడం నేటికి గ్రామీణ ప్రాంతాలలో కన్పించే నిత్యదృశ్యం. గ్రామీణ సమాజంలో చాకళ్ళ జీవితం ఎలా గడిచిందో రచయిత నవలేతివృత్తంలో చిత్రించారు. కులకట్టుబాట్లను గౌరవిస్తూ, దొరలకు, భూస్వాములకు చాకిరి చేస్తే గడిపిన జీవితం కనిపిస్తుంది. చాకలిస్త్రీలకు గ్రామీణ సమాజంలో దొరలవల్ల రక్షణ లేకుండా పోయింది. చాకలి వారితో పాటు మంగలి కులంవారు కూడా వెట్టి పనులు చేయాల్సి వచ్చేది. దొరలు,భూ కామందుల ఇళ్లకు వెళ్ళి క్షౌరం చేయడం,వారి శుభకార్యాలకు తోరణాలు కట్టడం శుభ కార్యాలకు ఇల్లిల్లు తిరుగుతూ అతిథుల్ని ఆహ్వానించడం మొదలైన పనులు చేసే వారని తెలుస్తుంది. గ్రామీణులకు క్షౌరం చేసినందుకు ప్రతిఫలంగా ధాన్యం స్వీకరించడం ఆనవాయితీగా వస్తున్నదే. మంగలి స్త్రీలు మంత్రసానులుగా పురుళ్ళుపోయడం సంప్రదాయంగా వచ్చినదే. చిలుకయ్య కొడుకు పుట్టినప్పుడు మంగలి సాయమ్మ మంత్రసానిగా వచ్చినదే. చిలుకయ్య కొడుకు పుట్టినప్పుడు మంగలి సాయమ్మ మంత్రసానిగా వ్యవహరించింది.

ఊళ్ళో వర్షాలు లేక పచ్చగడ్డి కరువైనపుడు గొర్రెల్ని దూరప్రాంతాలకు తోలుకెళ్ళడం జరుగుతుంది. దీన్నే మన్నెం వెళ్లడంగా వ్యవహరిస్తారు. గొర్రెల కాపరులు తమ గొర్రెలను బతికించుకోవడానికై అడవి ప్రాంతమైన మంథిని దిక్కు మన్నెం పోయారు. అక్కడే మూడు నెలలున్నారు. ఇట్లా గొల్లలు తమ వృత్తిలో ఎదుర్కొంటున్న సాధక బాధకాలు వర్ణించారు. గంగపుత్రులు, తెనుగు వాళ్ళ వాడకెళితే చేపల కంపొస్తుంది. శాకాహారులైతే అటువెడితే ముక్కులకడ్డంగా బట్టలు పెట్టుకొని పోతున్నారని చిత్రించారు.

మేర కులస్థులు బట్టలుకుట్లడం గౌడకులస్థులు కల్లు అమ్మడం ప్రస్తావించడం జరిగింది. మిగతా కులాలైన తురక, దూదేకుల, అయ్యవారు, బెస్త, పద్మశాలి, అవుసుల, కమ్మరి, బుక కులాల ప్రస్తావన తెచ్చి నవలేతివృత్తంలో సామాజిక వాతావరణాన్ని రచయిత సృష్టించాడు. ఉద్యమ పరిణామాల వల్ల కులవ్యవస్థలో మార్పులు చోటు చేసుకున్నాయి. వెనుకబడినకులం వారు గడిపే జీవనాన్ని రచయిత నవలేతివృత్తంలో ప్రతిఫలింపజేశారు.

**2.3.5.2 .దళిత జీవనము**

గత అర్ధశతాబ్ది నుంచి సమకాలీనం వరకు దళిత జీవనంలో వచ్చిన మార్పుల్ని రచయిత నవల్లో ప్రతిఫలింజేసారు. విద్యార్థులంతా సమానమనే భావనతో వెంకటయ్య పంతులు పెద్ద మాదిగ లింగయ్య కొడుకును పిల్లల మధ్య కూర్చోబెట్టగా, అది గమనించిన, వెంగళరావు దొర 'అయితే దూరం కూచో బెట్టక నడుమనే కూచండ బెట్టిన వేంది? మాదిగోల్లు చదువుకునుడే ఎక్కువంటే అందర్ని ముట్టుకునేడేనా' అని వెంకటయ్య పంతుల్ని కోపించడం అగ్రకులాల వారు అణగారిన కులాల్ని ఏవిధంగా అణగద్రొక్కుతూ వచ్చారో తెలిసి వస్తుంది. అట్లే 'చచ్చెటోడు చావక గాంధీ వాళ్లకో హరిజనులని పేరుపెట్టి పోయాడు. అంటరాని తనమద్దని అంత గజిబిజి చేసిపోయిండని విసుక్కోవడాన్ని బట్టి చూస్తే దళితుల అభివృద్ధి అగ్రకులాలకు మింగుడు పడటం లేదని అవగతం అవుతుందని చెప్పవచ్చు.

సాంబయ్యకు తాత లచ్చుమయ్య. అతని తరంవారిలో ఈ భావన మరింత హేయంగా ఉన్నట్లు కనిపిస్తుంది. లచ్చుమయ్య మాదిగిండ్లల్లకెళ్ళితే కాలికి బట్టపేలిక తగిలిందని బావి వద్ద స్నానం చేసి ఇంట్లోకి వచ్చాడు. అతని దృష్టిలో మాల, మాదిగలు, అంటరానివాళ్ళు 'వ్వలిట్ట మాల్లు... ఆడెవడు తప్పనుటానికి? మా నాయిన్నయితె వాళ్ళ వాడకు పోతే నోటికడ్డం బట్టగట్టుకునెటోడు. ఆల్లెవ్వలన్న ఇంటికత్తె బజార్లకే పొయ్యి మాట్లాడెటోడు.... ఆల్లు ఆకిట్ల అడుగుపెడితే ఆల్లు పోయినంక నీల్లు చల్లందెవ్వలను నడువ నియ్యకపోవు అనే లచ్చుమయ్య మాటల్ని బట్టి స్వాతంత్ర్యానికి పూర్వం అంటరానితనం ఎంత అమానుషంగా ఉండేదో అర్థమవుతుంది.

చెప్పులు సమయానికి తేలేదని మాదిగ దుర్గయ్యను చెప్పులు విరిగేట్టు కొట్టాడు దొర అని చిత్రించడాన్ని బట్టి అణగారిన కులాలపై దౌర్జన్యాలు ముఖ్యంగా మాదిగలపై దౌర్జన్యాలు కొనసాగుతున్నట్లు స్పష్టమవుతుంది. అయితే సమాజం నిర్మించుకున్న అంటరానితనమనే అడ్డుగోడ తొలగకపోవడంతో దళితులు అనేక అవమానాల్ని, ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వచ్చింది. మంగలి వారితో క్షౌరం చేయించుకోవాలంటే, మంగలి తాను కట్టుకున్న ధోవతిని వదిలేసి గొంగడి చుట్టుకొని వచ్చేవాడు. ఉన్నికి ముట్టుడు లేదనే విశ్వాసం ఆనాటి గ్రామీణులది. చివరకు ఊళ్ళోని హోటల్లో టీ త్రాగాలన్న వారికోసం పెట్టిన ప్రత్యేక గ్లాసులోనే త్రాగాల్సి వచ్చేది. మాదిగోల్లంటే చెప్పులుగుడుతరు. చీపుర్లు ముట్టుడు(అంటరానితనం) ఎలా ఆపాదించబడిందనేది, అసలు 'ముట్టుడు అంటే ఏమిటి? అనే దానికి సమాధానం ఎవరివద్ద లేదు. 'ముట్టుడంటేంది బావు? అవ్వతాపకోసారి ముట్టుకోకంటంది. ఎందుకంటే ఓరకున్ననంటది. తానంజేసి ఇంట్లకచ్చినంక ముట్టుడు లేదంటది. మరాల్లు తానం జెయ్యరా అని సాంబయ్య అడిగిన ప్రశ్నకు చిలుకయ్యకు ఎలా సమాధానం చెప్పాలో అర్థం కాక ఏమీ చెప్పలేదు.

గ్రామ పంచాయతీ మెంబర్ అయినటువంటి దానయ్య పంచాయతాఫీసులో క్రిందనే కూర్చోవడం, మంచి కీర్తనలు పాడగల సామర్థ్యం ఉండీ కూడా ఎవరికి తాకకుండా దూరంగా కూర్చొని పాడటం గ్రామాల్లో ఆనాడు సమసిపోని అంటరాని తనానికి నిదర్శనాలని చెప్పవచ్చు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానంతరం గ్రామీణ సమాజంలో కొంత మార్పు వచ్చింది. దళితులు చదువుకొని ఉద్యోగాల్లో స్థిరపడటం కన్పిస్తుంది. ప్రభుత్వం అందించిన స్కాలర్‌షిప్పు, హాస్టల్ తదితర విద్యా సౌకర్యాలను సక్రమంగా వినియోగించుకొని కష్టపడి చదివి ఉద్యోగాల్లో చేరిపోవడం జరిగింది. ఆ విధంగా పైకొచ్చిన వారిలో భూమయ్యసారు ఒకరు. ఇట్లా గ్రామీణ సమాజంలో విద్యావంతుల సంఖ్య పెరగడంతో కొంతవరకైనా అంటరానితనపు భావన సమసిపోవటానికి దారులు ఏర్పడ్డాయని భావించవచ్చు.

## <u>2.3.6. విద్యా వ్యవస్థ</u>

'సాంబయ్య చదువు' అన్న నవల పేరే నవలేతివృత్తి పరిణామంలో చదువుకున్న ప్రాధాన్యతను తెల్పుతుంది. తెలంగాణా ప్రాంతంలో నిజాం పాలన వల్ల ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చదువెట్లా అందుబాటులో లేకుండా పోయిందో స్వాతంత్ర్యానంతరం క్రమంగా చదువుల వల్ల ఆయా వర్గాలలో ఎలాంటి మార్పు ఏర్పడిందో నవల స్పష్టం చేస్తుంది. ముఖ్యంగా మొదటి జనరల్ ఎన్నికలు 1952 నుండి నవల ప్రచురణ కాలం 1995 మధ్యకాలంలో విద్యా వ్యవస్థలో వచ్చిన వివిధ పరిణామాల్ని నవల విశ్లేషిస్తుంది.

ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంములో పుట్టీ అడుగడున అవంతరాల్ని అధిగమిస్తూ డిగ్రీ వరకూ చదివి ప్రయోజకుడిగా ఎదిగిన కథానాయకుడు సాంబయ్య దర్శనమిస్తాడు. చదువు వల్ల వెనుకబడిన, దళిత వర్గాల ప్రజలు బాగుపడడం కన్పిస్తుంది. తెలంగాణ ప్రాంతంలో నిజాం కాలంలో ఉన్న విద్యా సదుపాయాలు మొదలుకొని స్వాతంత్ర్యానంతరం కొనసాగిన ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యా విధానాలు, సామాజిక పరిస్థితులు నవలేతివృత్తంలో చోటు చేసుకున్నాయి. వాస్తవంగా చెప్పాలంటే రచయిత కాలువ మల్లయ్య గారు చదువు కొనసాగించిన కాలం నాటి పరిస్థితుల్ని నవలేతి వృత్తంగ స్వీకరించారు. ఈ నవల్లోని కథానాయకుడు సాంబయ్య ప్రవర్తించిన తీరుకు, రచయిత జీవనానికి అసలు తేడా అన్నది లేకపోవడం వల్ల ఇది రచయిత కాలువ మల్లయ్యగారి స్వీయానుభవ కథనంగా భావించవచ్చు.

స్వాతంత్ర్యానంతరం రాజకీయ పరిణామాల వల్ల తెలంగాణ విముక్తమై భారత ప్రభుత్వ

ఆధీనంలోకి వచ్చింది. నిరక్షరాస్యత వల్ల తెలంగాణ ప్రాంతం వెనుకబాటు తనానికి దారితీసింది. దానిని గుర్తించిన ప్రభుత్వం విద్యావ్యాప్తికై గ్రామాల్లో పాఠశాలల్ని నెలకొల్పింది. ఆక్రమంలో మొదటి జనరల్ ఎన్నికలు నాటికి ఆ గ్రామానికి బడి మంజూరైంది. ఆ ఊరికి పాఠశాల భవన సౌకర్యం లేకపోవడంతో దొరకచ్చిరింట్లో నిర్వహించవలసి వచ్చింది. ఎప్పుడైతే పాఠశాలలు అందుబాటులోకి వచ్చాయో కొద్ది మందిలోనైనా పిల్లల్ని చదివించాలన్న ఆలోచన కల్గింది. గ్రంథాలయోద్యమం చదువు ఆవశ్యకత చాటి ప్రజల్ని ప్రేరేపించింది. ఈ అభిప్రాయం లసుమయ్య మాటల్లో వ్యక్తమవుతుంది. ఎవ్వడేల్తే మనకేమచ్చే? కాని చదువుకున్నోడెట్లయిన తెలివి కల్లోడుంటడు. అందరికి రెండు కండ్లుంటే చదవచ్చినోల్లు నాల్గుకండ్లతోని చూస్తరు. మన సాంబయ్యని బాగా చదివియ్యాలె అనే నిర్ణయానికి వస్తాడు. వెంగళరావు దొర విద్యా వ్యవస్థను కూడా తమకు అనుకూలంగా మలచుకొని ఆధిపత్యాన్ని కొనసాగించారు. వెంగళరావు దొర ప్రవర్తించిన తీరు, అతని మాటల్ని బట్టి భూస్వామ్య వ్యవస్థ విద్యా వ్యవస్థను నిర్వీర్యము చేయడానికి పూనుకోవడం స్పష్టమవుతుంది.

వెంగళరావు దొర వెంకటయ్య పంతులు గొల్లవాడని తెలుసుకొని చదువెట్ల అబ్బిందని ప్రశ్నించి ఎద్దేవా చేయడం, హరిజన పిల్లవాడు తరగతిలోని పిల్లల మధ్య కూర్చోవడం చూసి కేకవేయడం. సాంబయ్యను చదివించాలని చెప్పడానికి వచ్చిన చిలుకయ్యతో 'మా చదువు తండ్రు తియ్యి. చాకలోడు, మంగలోడు అందరు చదువుతే దానికేం విలువుంటది? అని పలుకడాన్ని బట్టి చూస్తే దళిత, బహుజనులు చదువుకోవడానికి అనర్హులు అనే భావంతో దొరలు వ్యవహరించినట్లు స్పష్టమవుతుంది.

దొరల కొడుకులనేమొ ముంగట కూసుండ వెడతండ్రు మమ్ములనేమొ ఎనుక కూసుండ వెడతండ్రు. ఆల్లకే మంచిగ చెప్పుతుండ్రు. హాజరప్పుడాల్ల పేర్లే ముందుగాల పిలుత్తరు అని సాంబయ్య తండ్రికి చెప్పడాన్ని బట్టి సమాజంలోని అసమానతల ప్రభావం విద్యావ్యవస్థపై ప్రభావాన్ని చూపినట్లు స్పష్టమవుతుంది. వెంగళరావు దొర చిన్నకొడుకు పక్కూరి నుండి వచ్చే విద్యార్థికి తనకంటె ఎక్కువ మార్కులు వచ్చాయని కొట్టడం. పక్కూర్లో దొర పిల్లలు చదువులో హుషారున్న కుమ్మరోల్ల పిల్లవాన్ని ఈతకు తీసుకెళ్ళి చెరువులో ముంచడం వంటి సన్నివేశాలు విద్యా వ్యవస్థను కుంటుపడేటట్లు చేయడానికి పూనుకున్న భూస్వామ్య కుటిల నీతికి దృష్టాంతాలుగా నిలుస్తాయి. మగ పిల్లల్ని చదివించడానికి భూస్వామ్య వ్యవస్థ నుండి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొవలసి వచ్చిన దళిత,బహుజన కులాలు ఆడపిల్లల చదువుల గురించి ఆలోచననే చేయలేరు. ఫ్యూడల్ పెత్తనానికి విరుద్ధంగా కొడుకును మాత్రమే చదివించిన చిలుకయ్య, కూతురు విషయంలో ఆ ఆలోచనే చేయలేదు.

ఈ నవల్లో చదువుకొని ఎదిగిన ఒక్క స్త్రీ పాత్ర కూడా ప్రస్తావించబడకపోవటాన్ని బట్టి తెలంగాణలో స్త్రీ విద్య పట్ల వివక్షత ఉన్నట్లు బోధపడుతుంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం దాని ప్రభావం విద్యా వ్యవస్థలో మార్పులకు నాంది పలికింది. పల్లెల్లో పుట్టిపెరిగిన వారికి పల్లెల సంస్కృతి తెలియకుండా పెంచి పరాయీకరణకు గురి చేస్తున్నామనే సూచన నవల ముగింపులో కన్పిస్తుంది. పిల్లలకు నాగలి, మోటల బొమ్మలు వేసి ఇది నాగలి ఇది మోట అని ఇంగ్లీషులో సాంబయ్య అర్థం చేయిస్తున్నాడు. సాంబయ్య పిల్లలు రోజూ బోలెడంత హోం వర్క్ క్లాస్‌వర్క్ చేస్తున్నారు. వాళ్ళకు ఇంగ్లీషు మాట్లాడటం నేర్పించడానికి సాంబయ్య విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. తన పిల్లల్లో ఒకర్ని కలెక్టర్, మరొకర్ని డాక్టర్ చేయాలని కలలు గంటున్నాడని చిత్రించడాన్ని బట్టి విద్యార్థులు నేర్చుకునేందుకు సహజ వాతావరణ పరిస్థితులు లేవని స్పష్టమవుతుంది. అసహజ వాతావరణంలో కృత్రిమ సన్నివేశ కల్పనలో విద్యనభ్యసించే విద్యార్థుల మీద తల్లిదండ్రులు విపరీతమైన నమ్మకాన్ని, ఆశల్ని పెట్టుకోవడం కూడా కన్పిస్తుంది.

నవల్లో కథానాయకుడైన సాంబయ్య ప్రత్యేక తెలంగాణ ఉద్యమానంతరం హెచ్.యస్.సి. పూర్తిచేసి కరీంనగర్‌లోని కళాశాలలో పి.యు.సి చదివాడు. గ్రామీణ విద్యార్థులు వెళ్ళి చదువుకోవాలంటే ఆర్థికభారంతో కూడిన విషయం అవుతుంది. 'ఇకనానుంచి గాదు... ఊళ్ళనంటే ఎట్లనో వెళ్ళింది. కరీంనగర్ పంపి చదువించుడుగాదు. రొండేండ్ల నుంచి కరువు. తిండి దినుసులు దొరుకుడే కష్టమైతుంది.... ఇంక నీకు చదువుకున్నేంచి తేవాలే? పదకొండయిపోయింది గద. ఏదన్నా నౌకరి మాదొరుకుతది. నౌకరి జూసుకో... నౌకరి దొరకుంటే ఇంట్లుండు. నువ్వు పనిచేయకున్న మంచిదే... నానుంచైతే చదివించుడు గాదు. అనే చిలుకయ్య మాటలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి కళాశాల విద్య ఆర్థికభారంతో కుడుకున్నదనే విషయాన్ని ధృవపరుస్తుంది.

ప్రత్యేక తెలంగాణా ఉద్యమం వల్ల కళాశాల విద్యపై రాజకీయ ప్రభావం చోటుచేసుకుంది. విద్యార్థి యూనియన్ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారడం జరిగింది. ఎన్నికల వల్ల విద్యార్థులు గ్రూపులుగా విడిపోవడం, గొడవలు, విభేదాలు, సమ్మెలు బంద్‌లు చోటు చేసుకోవడం కన్పిస్తుంది. వీని మూలాన కాలేజీలు సరిగ్గా నడవలేని పరిస్థితులు నెలకొన్నాయి. సంప్రదాయమైన డిగ్రీ చదువులకు మినహా, వృత్తిపరమైన విద్యలకు అర్హతలతో పాటు పోటీ పరీక్షగా అన్ని కోర్సులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. ఎంసెట్ అర్హత పరీక్ష లేనిరోజుల్లో మెరిట్ ప్రతిపాదితన చదువుకోవడానికి సీటు కేటాయించేవారు. పి.యు.సి లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైన సాంబయ్యకు ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది. ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాల్లో చేరమని కిషన్‌రెడ్డి సాంబయ్యకు లేఖ రాశాడు. చదువు ప్రాముఖ్యత తెలియని సాంబయ్య అందులో చేరక బి.యస్సీలో చేరిపోయాడు. ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి కోర్సులకు ఈనాడున్నంత డిమాండ్ ఆ రోజుల్లో లేదని స్పష్టమవుతుంది.

కాలేజి చదువులకొచ్చే విద్యార్థుల్లో కొందరు ఏదో కాలక్షేపానికి, అలంకారం కోసం వచ్చినట్లు ప్రవర్తించడం కన్పిస్తుంది. 'కొందరు చదువుతుంటే కట్నం పెరుగుతుందని వస్తారు. కొందరికేమో కాలేజంటే ఓ ఎంజాయ్‌మెంట్ కేంద్రం. తాజెడ్డ కోతి వనమెల్ల చెరిచిందన్నట్లు వీళ్ళు చెడిపోవడమే కాకుండా ఇతర్ల చదువులకూ నష్టం చేస్తారు. వీళ్ళందర్నీ మనం పట్టించుకోవద్దు. మనమెందుకొచ్చామో గుర్తించుకొని చదువుకోవాలి. ఈ వయసులో ఇక్కడ చెడిపోవడానికి అన్ని అవకాశాలూ ఉంటాయి. సినిమాలు.... షికార్లు.... రౌడియిజం...... ఇంకా ఎన్నో... ఎన్నో' అని పలికే వేణు మాటల్లో కొందరు విద్యార్థులు కాలేజి విద్యపట్ల శ్రద్ధ వహించక పోవడం కన్పిస్తుంది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమానంతరం కళాశాలల్లో రాజకీయ పార్టీల ప్రమేయం పెరుగజొచ్చింది. తెలంగాణ ఉద్యమంలో ముఖ్య భూమికను నిర్వహించిన విద్యార్థులు, ఆ తర్వాత రాజకీయ పార్టీలతో సంబంధం కొనసాగించారు. వామపక్షాల వారు విద్యార్థులను ఆకట్టుకోగలిగారు. ఫలితంగా తీవ్రవాద ధోరణులు సమర్థించడం ప్రారంభమైంది. విప్లవ సాహిత్యం అందుకు తోడ్పడింది. నక్సలైట్ ఉద్యమ కార్యకలాపాల పట్ల ఆకర్షితుడైన ఈశ్వర్ కరపత్రాలు పంచి అరెస్ట్ కావడం, కాలేజి విద్యపై ఉద్యమాలు చూపిన ప్రభావానికి నిదర్శనం. విప్లవ భావాలు వంటబట్టించుకున్న విద్యార్థులు కళాశాల విద్యపట్ల విశ్వాసం కోల్పోవడం గమనించగలము. 'ఈ చదువులు కేవలం గుమాస్తాలను తయారు చేయడానికి పనికొచ్చేది మాత్రమే. ఇది చదివితే ఒరిగేదేంలేదు. అసలు చదువులు సమాజాన్ని గూర్చి చెప్పేవి. అది మన విశ్వవిద్యాలయాల్లో చెప్పరు. మనకు కావల్సింది శాస్త్రవిధానం' అనే ఈశ్వర్ మాటలు సంప్రదాయ కళాశాల విద్యపట్ల అభద్రతాభావం చోటు చేసుకున్నట్లు స్పష్టం చేస్తాయి.

**2.3.7. ఉద్యమాలు – ప్రభావం :**

నిజాం కాలం నాటి నుండి సమకాలీనంలో వచ్చిన ఉద్యమాలను, వాని ప్రభావ పర్యవసానాల్ని సాంబయ్యా చదువు నవల చిత్రించింది. నవలేతివృత్తము ప్రవర్తించిన కాలంలో ప్రబలిన ఉద్యమాలను రచయిత కాలువ మల్లయ్యగారు నవలలో నిక్షిప్తము చేశారు.

**2.3.7.1. కమ్యూనిస్టు ఉద్యమం:**

నవలలో కమ్యూనిస్టు ఉద్యమ పరిణామాలను సూచించే సంఘటనలను, పాత్ర సంభాషణ ద్వారా రచియిత వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యానికి ఏడెనిమిది సంవత్సరాల పూర్వమే కమ్యూనిస్టుల ప్రభావమున్నట్లు నవలేతి వృత్తంలో స్పష్టమవుతుంది. మొదటి జనరల్ ఎన్నికల నాటికి కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని విరమించి ఎన్నికల్లో పోటికి సిద్ధపడింది. నవలేతివృత్తంలో కమ్యూనిస్టులు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడినట్లు, ఆ పార్టీ చేపట్టిన ప్రజాహిత కార్యాలే కమ్యూనిస్టుల పట్ల ప్రజల్లో అభిమానము పెరగడానికి దోహం చేశాయనే జనం తలంపు నవల్లో స్పష్టమైంది. నవలేతివృత్త విషయానికి వస్తే మొదటి జనరల్ ఎన్నికల నాటికి కరీంనగర్ జిల్లాలోని పల్లె ప్రాంతాలలో కమ్యూనిస్టు పార్టీ ప్రజాజీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపినట్లు విదితమవుతుంది. దొరలు అప్పటికే ఓ సారి ఊరొదిలి వెళ్ళాల్సి వచ్చింది. అలాంటి ఊళ్ళలో ఆ ఊరి దొర వెంగళరావు ఒకరు. ఆ ప్రాంతంలో మొన్న మొన్నటి వరకు కమ్యూనిస్టుల ప్రభావముండేది. దొరలు వాళ్ళకు భయపడేవారు. మూడేళ్ళక్కడే ఉండి ఏడాదిక్రితమే తిరిగొచ్చాడని చిత్రించడాన్ని బట్టి కమ్యూనిస్టులు జమీందారులపై ప్రభావాన్ని చూపినట్లు తెలిసివస్తుంది.

కమ్యూనిస్టులు దొంగలు వాళ్ళు మనుషులను చంపుతరు. పైసలు దోచుకు పోతరు. మన దేశానికి స్వతంత్రం తెచ్చింది కాంగ్రెస్, రజాకార్లు లేకుంట చేసింది, కాంగ్రెస్. కాంగ్రెస్‌కే ఓటెయ్యాలి అనడాన్ని బట్టి దొరలకు కమ్యూనిస్టుల పట్ల ఉన్న వివక్షత తెలిసివస్తుంది. ఉన్న వాన్ని దోచి లేని వానికి పెట్టాలనే ఆశయంతో కమ్యూనిస్టులు దోపిడీలు చేసింది దొరలనే. అందుకే 'రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడింది – కమ్యూనిస్టులు. ఎంతోమంది ప్రాణాలు వదిలారు. వాళ్లకే ఓటెయ్యాలి అని సమర్థించే వర్గం కూడా ఉంది. మొదటి జనరల్ ఎన్నికలు రోజున గుమిగూడిన జనం మాట్లాడుకునే మాటల్లో కమ్యూనిస్టు ఉద్యమంలో మమేకమైన కరీంనగర్ ప్రాంత నాయకుల ప్రస్తావన వస్తుంది. మురళయ్య దొరే కాక శ్యాం సుందర్‌సింగ్ రాజారాం సింగ్, అనభేరి ప్రభాకర్, ఎస్.కె. పిళ్ళే పని చేసింద్రు మనదిక్కు అయితే వీరిలో మురళయ్యను ప్రస్తావించడం కన్పిస్తుంది. 'రాజాకార్ల కెదురుగా మన దిక్కు నుంచి ఆయనే మస్తు పోరాటం చేసిండని జనం మాట్లాడుకొనే మాటల్లో స్థానిక కమ్యూనిస్టు నాయకుల ప్రభావమున్నట్లు తోస్తుంది.

పటేలు సైనం పంపింది రజాకార్ల నణిచే పేరుమీద కమ్యూనిస్టోల్లను చంపడానికి, అప్పటికే వీళ్ళు భూములు పంచింద్రు. అట్లనే ఉంటే దొరల పట్టు పోతుందని వాళ్ళనణచేసింద్రు ఎంతమంది దొరలు ఊళిడిసిపోలేదనీ,ఏమైనా కమ్యూనిస్టులతోనే మనకు రజాకార్ల పీడపోయింది. మనమాల్లకే ఓటేయ్యాలే అనే అభిప్రాయం జనంలో ఉంది. కాబట్టే ఎన్నికల్లో నాడు కాంగ్రెసుకు దీటుగా కమ్యూనిస్టు పార్టీ నిలువగలిగిందని భావించవచ్చు.

**2.3.7.2. ప్రత్యేక తెలంగాణా ఉద్యమం :**

ప్రత్యేక తెలంగాణా ఉద్యమంతో రచయిత కాలువ మల్లయ్య గారికి ప్రత్యక్ష సంబంధం ఉంది. ప్రత్యేక తెలంగాణా ఉద్యమ కాలంలో కాలువ మల్లయ్య గారు విద్యార్థిగా ఉండి తాను పొందిన అనుభవాలు, అనుభూతుల్ని నవల్లో ప్రతిఫలింపజేశారు.

ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమంగా రూపుదాల్చుడానికి గల కారణాలు నవలలో ప్రస్ఫుటమైనాయి. చాలా కాలంగా తెలంగాణకు అన్యాయం జరుగుతోంది. మొదట్నుంచీ

అభివృద్ధి చెందిన ప్రాంతం కోస్తా.... వీళ్ళే రాజకీయాధికారం చేతుల్లో పెట్టుకొని వాళ్ళ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. మనకు రావల్సిన నిధులను అటు మర్లించుకుంటున్నారు. ఉద్యోగాల్లోను మనకన్యాయమే జరుగుతుంది. కోస్తానుంచి ఎంతోమంది వచ్చి మన దగ్గర ఉద్యోగాలు చేస్తున్నారు. అందువల్ల మన వాళ్ళకుద్యోగాలు దొరకడం లేదు. ఈ ప్రాంతం కాని వాళ్ళను ఇక్కణ్ణుంచి తరిమివేయాలి. అదే ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పడినప్పుడే సాధ్యమవుతుంది అని చిత్రించడాన్ని బట్టి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమం ప్రబలడానికి దారితీసిన పరిస్థితులు అవగతమవుతాయి. ఈ మధ్య జై తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. మొదట్లో పట్టణాలకే పరిమితమైన ఉద్యమం క్రమ క్రమంగా గ్రామాల్లోకి వ్యాపించింది. పాఠశాలలు మూసివేయాలని అల్లరి ప్రారంభమైంది. ఇందులో లాయర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు, డాక్టర్లు అంతా పాల్గొంటున్నారు. పట్టణాలలో విద్యార్థుల పాత్రే ప్రధానంగా ఉంది. విద్యార్థులను రెచ్చగొడుతున్నారు నాయకులు. ఎప్పుడైతే రాజకీయ నాయకుల మద్దతు ఉద్యమానికి తోడైందో, ఉద్యమం మరింత ఊపందుకుంది. విద్యార్థుల్లో విధ్వంస ధోరణి అలవడింది. ప్రశాంత జీవనం కరువైంది.

ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో పోలీస్ కాల్పులు, నలుగురు విద్యార్థుల మృతి... ఇంజనీరింగ్ విద్యార్థి మరణం. ఖమ్మంలో ఇద్దరు విద్యార్థుల మృతి... వరంగల్‌లో కాల్పులు మెడికల్ విద్యార్థి చావు...ఇట్లా ఉద్యమానికి విద్యార్థుల బలిపర్వం మొదలైనట్లు స్పష్టమవుతుంది. విశ్వ విద్యాలయాల పరిధిలోని కాలేజి విద్యార్థుల నుండి హైస్కూలు విద్యార్థుల వరకు ప్రభావితులయ్యారు. తెలంగాణ ప్రాంతంలోని వివిధ జిల్లాల్లో జరిగిన సమావేశాలకు విద్యార్థులే ప్రత్యేక ఆకర్షితులయ్యారని విశదమవుతుంది. సాంబయ్య కూడా రెండుమూడు సార్లు తోటి విద్యార్థులతో పాటు కరీంనగర్, వరంగల్ పోయొచ్చాడు ఇలా తెలంగాణా ఉద్యమంలో విద్యార్థులు పాల్గొని సంవత్సర కాలం చదువుకు దూరమయ్యారు. ఈ సందర్భంగా ఒక విద్యా సంవత్సరం నష్టపోవాల్సి వచ్చింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పేర్కొన్న నాయకులు మాట నిలుపుకోలేకపోయారు. 'కోస్తా ముఖ్యమంత్రి మారి తెలంగాణ వ్యక్తి ముఖ్యమంత్రయ్యాడు. తర్వాత సంవత్సరానికి జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజాసమితికి పద్నాలుగులో పదమూడు సీట్లొచ్చాయి. అయితే వాళ్ళంతా త్వరలోనే అధికార పార్టీలో చేరి కొందరు మంత్రులు కూడా అయ్యారని రచయిత ప్రస్తావించడాన్ని బట్టి తెలంగాణ ప్రజల ఆశల్ని వమ్ముచేసి, అధికార పార్టీలో ఆశ్రయం పొందిన నాయకుల పదవి వ్యామోహం ఉద్యమాన్ని నీరు గార్చిందనే భావన గోచరిస్తుంది.

### 2.3.7.3. నక్సలైట్ ఉద్యమం :

సాంబయ్య చదువు నవలేతివృత్తంలో నక్సలైట్ ఉద్యమం యొక్క ప్రభావ పర్యవసానాలు చిత్రితమయ్యాయి.

ఈ నవల్లో కాలేజి విద్యార్థులు, ముఖ్యంగా యువకులు నక్సలైట్ ఉద్యమానికి ప్రభావితమైనట్లు సూచితమైంది. నవల్లోని కథానాయకుడు సాంబయ్య డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండగా మొదటిసారిగా నక్సలైట్ అనే పదాన్ని విన్నాడు. సాంబయ్య హెచ్.యస్.సి. చదువుతున్నప్పుడు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. ఆ తర్వాత రెండేళ్ళకు నక్సలైట్ ఉద్యమంలో విద్యార్థుల ప్రాతినిధ్యం పెరుగుతూ వచ్చినట్లు తెలుస్తుంది.

కరీంనగర్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న సాంబయ్య మొదటి సారిగా 'నక్సలైట్' అనే పదాన్ని విన్నాడు. నక్సలైట్ అన్నపదం వింటేనే సాంబయ్య వెన్నులోంచి వణుకులాంటిది పుట్టుకొస్తుంది. ఒళ్ళంతా భయంతో వణికిపోయింది. మధ్యతరగతి ఆలోచనలకే పరిమితమైన చదువేదో ఒరగబెడ్తుందని భావిస్తున్న సాంబయ్యకు విపరీతంగా భయమేసింది.

తన చదువెక్కడ పాడైపోతుందేమోనని, తానెక్కడ తన వారికి దూరమైపోతానోనని ఆందోళన కల్గింది. అని చిత్రించడాన్ని బట్టి ఉద్యమ ప్రభావం విద్యార్థుల జీవితాలపై ప్రభావాన్ని చూపుతూ ఆందోళన కలిగింప జేసిందని స్పష్టమవుతుంది.

సాంబయ్యా! బొడ్లె వరాలు పోసుకొని పుట్టిన్ననుకున్నడు వెంగళరావుదొర. ఎప్పటికీ తనదే సాగుతుందన్నడుగా పడుసు పోరగాండ్లు యువజన సంఘం వెట్టింద్రుగద. గాల్లు దొర నడిగెటోల్లయింద్రు. అనే చిలుకయ్య మాటలు ఊళ్ళో వచ్చిన మార్పుల్ని తెల్పుతున్నాయి. ఊరి చెరువును స్వంత ఆస్తిగా భావించి, చెరువు నీళ్ళను పొరుగూరి వాళ్ళకు అమ్ముకుంటూ వచ్చిన వెంగళరావు యువకులు నిలదీయడంతో తోక ముడిచాడు. అట్లే కొండల్‌రెడ్డి తాను ఆక్రమించుకున్న బీడు భూముల్ని వదలుకున్నాడు. యువకుల్లో ఇంతటి స్ఫూర్తికి నక్సలైట్ ఉద్యమం కారకమైనట్లు స్పష్టమవుతుంది. విప్లవ సాహిత్యం, విప్లవ కవుల ప్రభావం విద్యార్థులపై ప్రగాఢంగా పనిచేస్తూ వచ్చింది. సాంబయ్య మహాప్రస్థానం చదవడం వల్ల తీవ్ర అలజడికి గురయ్యాడు. అట్లే శ్రీశ్రీ, వరవరరావు, చెఱబండరాజులను కలుసుకోవడం సాంబయ్యకు గొప్ప అనుభూతిని మిగిల్చింది. కళాశాలలో మిత్రుల సహచర్యం వల్లనో, సాహిత్య ప్రభావం వల్లనో ఉద్యమ మార్గం పట్టిన యువత లేకపోలేదు. యువతకు విప్లవ సాహిత్యం పట్ల, కవుల పట్ల ఆదరణ ఉన్నట్లు స్పష్టమవుతుంది.

**2.3.8 . వాస్తవిక చిత్రణ:**

కాలువ మల్లయ్య నవలలు పూర్తిగా వాస్తవిక వాదానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. అగ్రకుల రచయితలకు భిన్నంగా వాస్తవికతను ఈయన చిత్రిస్తాడు. “జీవిత వాస్తవాన్ని చిత్రించడం అనే ఆశయానికి రచయితలు కట్టుబడి ఉండాలని భావించే ధోరణి. కాల్పనిక వాదానికి ప్రతిస్పందనగా వచ్చిన వాదాల్లో వాస్తవికవాదం ముఖ్యమైనది. వ్యక్తి జీవితంలోగానీ, మొత్తం సంఘంలోగానీ ఉన్న విషయాలను ఉన్నట్టు రాయాలి అని చెప్పేవాదం. నిత్యజీవితంలోని వ్యక్తులలో, సంఘటనలలో, సంభాషణలలో సగటువాటిని (ఎక్కువ కనిపించేవాటిని) చిత్రించాలనేది వాస్తవికవాదుల లక్ష్యం. తర్వాత, పాఠకుల ఆలోచనల మీదా, జీవితాలమీద ప్రభావం చూపాలనీ వాస్తవికవాద రచయితలు భావిస్తారు. కళ్లముందు కనిపించేవాటిని విడివిడిగా చిత్రించడం ఒక రకమైన వాస్తవికత వాదమైతే, విషయాల మధ్య ఉండే అంత:సంబంధాలతో సహా చిత్రించడం ఇంకో రకం వాస్తవికవాదం. సమాజంలోని వాస్తవికతను ప్రతిబింబిస్తూనే, మెరుగైన జీవితం కోసం మనుషులు ఎలాంటి ప్రయత్నాలు చేస్తారో, చేయాలో ఆ ప్రయత్నాలు ఎంత కష్టమైనవో, వాటిని ఎలా అధిగమించారో, అధిగమించవచ్చునో అనే విషయాలను రచయితలు చిత్రించాలని వాస్తవికవాదులు చెప్తారు. వాస్తవాన్ని మరుగుపరుస్తూ, సమస్యల నుంచి దృష్టి మరల్చే రచనల్నీ, వాస్తవానికి దూరంగా ఉండే ప్రేమకథలతో నిత్య జీవిత సమస్యలు పట్టించుకొని సాహిత్యాన్ని తిరస్కరించే వాదం వాస్తవికవాదం. సాహిత్యంలో చాలావరకు రచనలు వాస్తవికతను ప్రతిబింబించేవిగానే ఉంటాయి. వ్యాపార దృక్పథంతో రాసే రచనలు తప్ప. అయితే వీటిలో రచయిత చేసే కల్పనలు కూడా వాస్తవానికి దగ్గరగా ఉన్నట్టూ, జరగవచ్చూ అని అనిపించేలా, సందర్భానుగుణంగా వున్నాయి అనిపించేలా ఉండాలి” (నళిని,ఎస్.ఎస్. 2009:156). తెలంగాణ నుంచి వచ్చిన నవలల్లో అత్యధికం వాస్తవికవాదానికి సంబంధించినవి. కాలువ మల్లయ్య రాసిన నవలలన్నీ జీవన వాస్తవికతను దర్శింప చేసేవి. సామాజిక వాస్తవికతను పట్టి చూపించే సాంబయ్య చదువు గ్రామ సాంఘిక జీవితంలోని వైరుధ్యాలను, ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా చలనంలో వున్న పీడిత వర్గాలను చాలా స్పష్టంగా వ్యక్తం చేసింది.

సాంబయ్య చదువు శూద్రులు కేంద్రంగా సాగింది. రచయిత సాంబయ్యది గొల్లకులం.

దొరలకు గొల్లలంటే చాలా చిన్నచూపు. వెంకటయ్య బడిపంతులు. గొల్లకులస్తుడు. వెంగళరావు మీదే కులమని అడిగితే యాదవులమని చెప్పాడు. గొల్లోలమని చెప్పమనీ, యాదవులమని గర్వంతో చెప్పాల్సిన పనిలేదని వెంగళరావు రుసరుసలాడుతాడు. నర్సిమ్మ అనే మాదిగ పిల్లవాడు అందరి మధ్య క్లాసులో కూర్చుంటే వెంగళరావుదొర టీచర్ వెంకటయ్యను తిడుతాడు. మాదిగలు చదవటమే పెద్ద విషయమంటే, ఇతరకులస్తుల మధ్య మాదిగలను కూర్చుండపెట్ట వద్దని మందలిస్తాడు. అదేవిధంగా సాంబయ్య తండ్రి చిలుకయ్యకు కులం పట్టింపు లెక్కువ. మాదిగ వాడ నుంచి నడిచివస్తుంటే ఏదో గుడ్డపేలిక కాలికి తాకి, మైలపడ్డానని చిరాకుపడుతూ స్నానం చేస్తాడు. అలాగే, దళితులకు మంగలివాళ్లు తలగొరగాలంటే శరీరానికి ఉన్ని సంచులు చుట్టుకుంటారు. వూళ్లో భజన కార్యక్రమం వుంటే దళితుల్లో బాగా పాడగలిగేవాళ్లు దూరంగా వుండి పాడాలి తప్ప ఇతర కులస్తులతో కలిసి కూర్చోకూడదు. ఇలా ఈ నవలలో దళితుల దుస్థితిని చిత్రించాడు. కానీ ఇవన్నీ సంఘటనలు మాత్రమే. ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తిస్థాయి దళిత పాత్రలేదన్నది మాత్రం నిజం.

యాదవులమని చెప్పుకుంటే శూద్రులు అనేక కులాలుగా చీలిపోయి వున్నారు. ప్రతి శూద్ర కులం తనదైన ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలు కల్గివుంది. అంతేకాదు, ప్రపంచం పట్ల, సమాజం పట్ల తనదైన దృష్టిని కల్గివుంటుంది. ఇతర కులాలతో దాని అనులోమ, విలోమ సంబంధాలు కుల వ్యవస్థలో దాని స్థానాన్ని అనుసరించి వుంటాయి. సాంబయ్య స్నేహితులంతా అగ్రవర్ణాలే కావటం యాదృశ్చికం కాదు. శూద్రులు తమకన్న పైకులం వాళ్లతో స్నేహం చేస్తారు. తమకన్న కింది కులం వాళ్లపట్ల అసూయ, ద్వేషంతో వుంటారు. ఇది కుల వ్యవస్థ యొక్క సహజ గుణం. అందువల్ల రెడ్డి, వెలమ, కాపు కులస్తులతో కల్సిపోయే శూద్రులు మాదిగ, మాల కులస్తులతో అంతగా కల్సిపోలేరు. సాంబయ్య అగ్రవర్ణాల దోపిడీ పీడనల గురించి తెలుసుకున్న వాడు. కానీ ఆయన అస్పృశ్యులతో ఎలాంటి సంబంధం పెట్టుకోలేదు. అంతేకాదు, అగ్రవర్ణాల్లో కూడా కొంతమంది సున్నిత హృదయులు, సానుభూతిపరులు వుంటారని నమ్ముతాడు. కిషన్‌రెడ్డిని సాంబయ్య అందుకే చాలా యిష్టపడతాడు.

అయితే, కుల వ్యవస్థ వల్ల శూద్రులు అనేక కట్టుబాట్లకు లోనవుతారు. న్యాయవిచారణలు, శిక్షలు కూడా వుంటాయి. సామాజిక స్థితిగతులను ఉన్నతవర్గం అనుకూలంగా మార్చుకుంది. కులాల మధ్య విభేదాలు, అడ్డుగోడలు సృష్టించి మానవ సంబంధాలకు విఘాతం కల్పించింది. వారి అధికారం నడచినంత కాలం కుల వ్యవస్థ నీడన మానవసంబంధాలు కొనసాగేట్టు చూశారు. చాకలి బక్కమ్మ, కొమురయ్యలకు వెంగళరావు దొర కులతప్పు విధించటం , ఇట్లాంటి కట్టుబాట్లు సామాజిక జీవనంలో మానవ సంబంధాలపై ప్రభావాన్ని చూపుతున్నట్టు స్పష్టం చేస్తున్నాయి. సాంబయ్య చదువు నవల దాదాపు అన్ని విషయాలను చిత్రికపట్టింది. అంటరానితనం, దొరల ఆధిపత్యం, శూద్ర కులాల ఆర్థిక జీవనం, ప్రభుత్వ యంత్రాంగం యొక్క పనితీరు, నూతన ఆర్థిక విధానాల వల్ల మారిపోతున్న మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాల్లో నెలకొంటున్న వైయక్తిక ధోరణులు అన్నింటినీ ఈ నవలలో కాలువ మల్లయ్య ప్రతిఫలింప చేశారు.

**2.3.9. మిశ్రమ భాష:**

కాలువ మల్లయ్య తెలంగాణ భాష బాగా తెలిసిన రచయిత. 'చతుర'లో నవంబర్, 1995లో ఈ నవల ప్రచురించబడింది. నవలాపోటీల్లో ఈ నవల బహుమతి పొందింది. తెలంగాణ ఉద్యమం ఆవిర్భవిస్తూ ఒక రూపుదిద్దుకుంటున్న కాలమది. అప్పటికింకా తెలంగాణ భాష పట్ల రచయితలకు గట్టి అభిప్రాయాలు ఏర్పడని కాలం కూడా. అందుకే, రచయిత

పూర్తిగా తెలంగాణ భాషను ఉపయోగించ లేదు. మిశ్రమ భాషను ఉపయోగించాడు. కథనంలోనూ, వర్ణనలలోనూ ప్రామాణిక భాషను ప్రయోగించాడు. పాత్రల సంభాషణల్లో మాత్రం తెలంగాణ భాషను శక్తిమంతంగా వాడుతాడు. అందుకే, ఇది మిశ్రమభాష అనవచ్చు. ఇతర ప్రాంత పాఠకులకు ఇది సౌకర్యం కూడా. నవలను ఆసక్తికరంగా చదవడానికి ఇది ఉపకరిస్తుంది. తెలంగాణ స్థానికతను ఇతరేతర పాఠక ప్రపంచానికి అర్థం చేయించడానికి ఈ పద్ధతి బాగా ఉపకరిస్తుంది.

## 2.3.10. నవలాశిల్పం:

కథను చెప్పే ఎత్తుగడ, కథను ముగించే వ్యూహం రెండూ నవలాశిల్పంలో చాలా ముఖ్యమైనవి. ఆరంభ, వికాసాలు, ముగింపు కథ లక్ష్యానికి అనుగుణంగా వుండాలి. కథాంగాల మధ్య చక్కని సమన్వయం వుండాలి. పాత్రల వ్యక్తిత్వ నిర్మాణం, వాటి ప్రవర్తన, ఎదుగుదల, పతనాలు అన్నీ సహజంగా వుండాలి. నవలాశిల్పం విషయంలో పరిణితి కనిపిస్తుంది. సాంబయ్యా చదువు కథ ప్రారంభంతోటే రచయిత తన లక్ష్యం సంకేతిస్తాడు. తెలుగు వర్ణమాల ఉచ్చరించే క్లాసు రూం దృశ్యంతో మొదలవుతుంది. "అ.. ఆ..ఇ..ఈ.. దిద్దుబాబు దిద్దు…" (పు. ) అంటూ మొదలవుతుంది. వెంగళరావు దొర కొడుకు శ్యాంరావుకు దొర దేవిడీకచ్చేరింట్లో పాఠాలు చెప్తున్నాడు వెంకటయ్య పంతులు. అలా మొదలైన కథ సాంబయ్యా చదువుతో ఎదుగుతుంది. సాంబయ్య తన పిల్లలకు ఇంగ్లీషు నేర్పించడానికి చేస్తున్న ప్రయత్నంతో ఆఖరిదృశ్యానికి చేరుకుంటుంది. చదువుతో పట్టణాలకెళ్లిపోయిన కొడుకు సాంబయ్యా నిరాదరణకు గురైన తల్లిదండ్రులు రాజమ్మ, చిలుకయ్యలు వ్యవసాయం చేస్తూనే వున్నారనీ, వాళ్ల రెక్కల కష్టంతోటే బతుకుతున్నారని చెప్పే వాక్యంతో నవల ముగుస్తుంది.

## ముగింపు:

తెలంగాణ సమాజం యొక్క బహుముఖీనమైన చిత్రాన్ని ఆవిష్కరించిన నవల ఇది. శూద్రుల్లో చదువు పట్ల పెరిగిన అవగాహనను ఈ నవల చూపుతుంది. దళితుల పట్ల దొరల హీనభావనను, వారికి చదువులేకుండా చేసే దొరల కుట్రలను చూపుతుంది. శూద్రులు వ్యవసాయ రంగాన్ని విడిచి విద్యారంగంలోకి ప్రవేశించి, ఉద్యోగాలు చేసి స్థిరపడటం, తద్వారా ఆధునిక జీవితంతో పాటు, ప్రపంచీకరణ యుగంలో పోటీపడడానికి తగిన ఇంగ్లీషు విద్యను తర్వాతి తరాలకు అందించే కృషిని ఈ నవల చూపిస్తుంది. పాత తరం కొత్త వ్యవస్థలో ఇమడలేక వ్యవసాయానికి కట్టుబడిపోయే పరిణామాన్ని కూడా ఈ నవల చూపిస్తుంది. "తెలంగాణ ప్రజలు నిజాం పరిపాలనలో ఎదుర్కొన్న కష్టాలు, పడిన చెప్పరాని కష్టాలు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రజాకార్ల హింస తొలిగినప్పటికీ బడుగు బలహీన వర్గాల బ్రతుకులు బాగుపడలేదనీ, దొరల దౌర్జన్యానికి, హింసకు ఇంకా బలిపశువులవుతున్నారనే వాస్తవం, కరువుకాటకాలు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఆ ప్రభావంతో ప్రజల్లో కలిగిన రాజకీయ చైతన్యం, రాజకీయ నాయకుల స్వార్థం కారణంగా ఉద్యమం నీరుగారిన తీరు మొదలైనవి ఈ నవలలో కండ్లకు కట్టినట్టు వర్ణించడం జరిగింది" అని 'కాలువ మల్లయ్య నవలలు' గ్రంథానికి రాసిన ముందుమాటలో ఆచార్య ఎన్ గోపీ వ్యక్తం చేసిన అభిప్రాయం సరైనది.

# 3. రాయలసీమ ప్రాదేశిక నవల - బహుజన చైతన్య పరివేదన

రాయలసీమ ప్రాదేశికవాదం కొత్త భావం. తెలంగాణవాదం బలంగా వస్తున్న సందర్భంలో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు ప్రత్యేకంగా ఆయా ప్రాంతాల చరిత్రను, సాహిత్య సాంస్కృతిక గత వైభవాన్నీ అన్వేషించుకొని పునర్నిర్మించే ప్రయత్నం చేయటం జరిగింది. వల్లంపాటి వెంకటసుబ్బయ్య రాయలసీమ సాంఘిక సాంస్కృతిక చరిత్రను నిర్మించే కృషి చేశాడు. ఆయన తర్వాత బండినారాయణ స్వామి నిర్మాణాత్మక కృషి చేశాడు. రాయలసీమ ప్రాదేశిక చరిత్రలో సంస్కృతిపరమైన విషయాలు ముఖ్యపాత్ర పోషించాయి. నిజానికి సాంఘిక జీవనంలో గుణాత్మకమైన మార్పును కోరుతూ మధ్య యుగాల కాలం నుంచీ అక్కడ అనేక సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాలు జరిగాయన్నది నిజం. అన్నమయ్య, త్యాగరాజు, క్షేత్రయ్య వంటి వాగ్గేయకారులు, పోతులూరి వీరబ్రహ్మం, సిద్ధయ్య, కక్కయ్య, వేమన వంటి అనేక మంది సంస్కరణవాదులు రాయలసీమ ప్రాంతంలో పుట్టిపెరిగిన వాళ్లే.

వలస పాలన కాలంలో బ్రిటీషు ఆధునికత రాయలసీమ మీద ప్రభావం చూపింది. వలసాధునిక ప్రగతిశీలత రాయలసీమలో సంస్కరణవాద భావాలను వ్యాపించేలా తోడ్పడింది. ఆధిపత్యానికి వ్యతిరేకంగా పీడిత వర్గాలు నిరంతరం సంఘర్షిస్తాయి. భౌతిక, బౌద్ధిక స్థాయిల్లో జరిగే ఈ సంఘర్షణ ప్రత్యామ్నాయ సాహిత్యాన్ని సృష్టించే వాతావరణాన్ని కల్పిస్తుంది. బండి నారాయణస్వామి ఇలా అంటారు. “11వ శతాబ్దిలో నన్నయ యుగంలోని సంస్కృత భాష ఆధిపత్యాన్ని 12వ శతాబ్దంలోని శివకవులు సవాలు చేసినారు. జానుతెనుగు, దేశిరచన, ద్విపద ప్రక్రియ అనే ప్రత్యామ్నాయ సాహితీ విలువల్ని ప్రవేశపెట్టినారు. 17వ శతాబ్దంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, వేమన ఒక సామాజిక వర్గానికే పరిమితమైన పాండిత్య సాహిత్యానికి భిన్న ధృవంగా నిలిచినారు. సాహిత్యాన్ని సామాన్యునిపరం చేసే ప్రత్యామ్నాయ విలువకు తెలుగునాట అంకురార్పణ చేసినారు. 20వ శతాబ్దాన్ని పరిపాలిస్తున్న గ్రాంథికానికి ప్రత్యామ్నాయంగా కథలో శిష్టవ్యవహారికాన్ని నాటకంలో మాండలికాలన్నీ ప్రవేశపెట్టినవాడు గురజాడ. ఒక్కమాటలో చెప్పాలంటే ఆధునికతే అతని ప్రత్యామ్నాయ సాహితీ లక్షణం. చలం రచనలు స్త్రీ వివక్షకు ప్రత్యామ్నాయమైనవి. కొలకలూరి ఇనాక్ రచనలు కుల వివక్షకు ప్రత్యామ్నాయమైనవి. గురజాడ, చలం రచనల్లోని జండర్ వివక్ష సానుభూతి చెందినది. అదే స్త్రీ రచయితల్లో స్వీయానుభవానికి యెదిగి 80–90 దశకంలో స్త్రీవాదంగా విస్తృతి పొందింది. చలం, శ్రీపాద రచనల్లోని కుల సమస్య వ్యక్తిగత అభిప్రాయాలకు చెందినది. అదే సామూహికంగా ఎదిగి 90వ దశకంలో దళితవాదంగా విస్తృతి పొందింది. స్త్రీవాదం, దళితవాదం మాదిరే ప్రాదేశిక సాహిత్యం కూడా రాయలసీమలో ప్రత్యామ్నాయ సాహిత్యంగా ఎదిగింది. ప్రాదేశిక నేపథ్యం గల రచనలకు ప్రాదేశికతే కావ్యాత్మగా రూపొందిన రచనలకు తేడా గమనిస్తే తప్ప ప్రాదేశిక సాహిత్యాన్ని నిర్వచించలేము” (బండినారాయణ స్వామి, రాయలసీమలో ప్రత్యామ్నాయ సాహిత్యంగా ప్రాంతీయ నవల, వివిధ, ఆంధ్రజ్యోతి, ఆగస్టు12, 2013). రాయలసీమ ప్రాదేశిక సాహిత్యం ఆధిపత్య సాహిత్యానికి ప్రత్యామ్నాయంగా ఎదిగింది.

ప్రాదేశికతను ఆత్మగా తొలుత రాయలసీమ రచయితలే గ్రహించారని ఆయన అంటారు. “ప్రాదేశికతకు దాని భౌగోళిక పరిస్థితి ఆత్మ వంటిది. ఈ ఆత్మను నేరుగా పట్టుకున్న సాహిత్య సందర్భం మొదటగా రాయలసీమలోనే సంభవించింది. ప్రాదేశిక తత్వమే రచనా వస్తువుగా రూపొందిన ప్రక్రియ రాయలసీమలో విద్వాన్‌విశ్వం పెన్నేటి పాటలోని జరిగింది”

(బండినారాయణ స్వామి, వివిధ, ఆంధ్రజ్యోతి, ఆగస్టు12, 2013) అంటాడు. నిజానికి, ప్రాదేశికత అనే భావం సాహిత్యంలో ప్రచారంలోకి రావటం అనేక రాజకీయ పరిణామాల వల్ల జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ప్రాదేశికతను ఒక సైద్ధాంతిక చర్చగా ముందుకు తెచ్చింది. ఆ చర్చలోంచి అనేక సాంస్కృతిక, సాహిత్య విషయాలు ప్రాదేశికత వల్ల ఎలా నిర్మించబడుతాయో, ఎలాంటి ప్రభావం వేస్తాయో అధ్యయనం చేయటం మొదలైంది. ఈ తెలంగాణ ప్రాదేశిక సాహిత్యం ఇతర ప్రాంతాల రచయితలను కూడా ప్రభావితం చేసింది. ఆ క్రమంలోనే కోస్తాంధ్ర, రాయలసీమ రచయితలు తమ స్థానికతను ఒక సాహిత్య భావనగా స్వీకరించటం మొదలుపెట్టారు. రాయలసీమ రచయితలు ఈ ప్రభావానికి ఎక్కువ లోనయ్యారు. నిజానికి, తెలంగాణ, కోస్తాంధ్ర ప్రాంతాల కన్న ప్రత్యేకమైన చరిత్ర, సామాజిక, రాజకీయ పరిస్థితులు అక్కడే వున్నాయి. భౌగోళిక నిర్మాణం రీత్యా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలతో సరిహద్దులు కలిగిన ప్రాంత. తమిళ, కన్నడ భాషా ప్రభావం వుంది. అదేవిధంగా, తురుష్కులు, మొగలాయిలు పాలించటం వల్ల ఉర్దూ ప్రభావం కూడా చాలా ఎక్కువే వుంటుంది. అన్ని రకాల దోపిడీలకు గురై, ప్రకృతి అననకూలతల వల్ల కూడా ప్రత్యేకమైన సంస్కృతి, జీవనవిధానం, ఆలోచనావిధానం రాయలసీమలో కనిపిస్తుంది. అందుకే, రాయలసీమ రచయితలు తమ ప్రత్యేక అస్తిత్వాన్నీ, వ్యక్తీకరణను ఆకాంక్షించారు. రాయలసీమ ప్రాంత చారిత్రక అవగాహన లేకుండా అక్కడి రచయితల సాహిత్యాన్ని మనం అర్థం చేసుకోలేం.రాయలసీమ ప్రాదేశిక తత్వం రూపొందడానికి అనేక విషయాలు దోహదమవుతాయి. చరిత్ర, సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాల మేళవింపు వల్ల ఒక ప్రాంతానికి ప్రత్యేకమైన తత్వం లేదా స్వభావం ఏర్పడుతాయి. రాయలసీమ ప్రాంతానికి అలాంటి ప్రత్యేకత వుంది. రాయలసీమలోని బహుజన సమాజానికి ప్రత్యేకమైన చరిత్ర వుంది. రాయలసీమలోని భూస్వామ్య కులాలు ఏర్పడటం వెనక అనేక చారిత్రక కారణాలు వున్నాయి.అగ్రవర్ణాలు మనువాదాన్ని విశ్వసిస్తున్నారు. బహుజనులు సమానత్వాన్ని కోరుతున్నారు. దళితులు కుల సమాజాన్ని కూలదోయాలని ఆశిస్తున్నారు. అగ్రకుల భూస్వాములు కులవ్యవస్థను నిలబెట్టాలని చూస్తున్నారు.

బౌద్ధం, జైనం మతాలు అనుసరించిన వాళ్లంతా చరిత్రలో అంటరానివాళ్లుగా మనువాద వ్యవస్థ చేత వెలివేయబడ్డారు. మౌర్యచంద్రుడు, అశోకుడు మొదలు బృహద్రజుని వరకు ఈ దేశాన్ని మౌర్యచక్రవర్తులు పాలించారు. మౌర్యచంద్రుడు శ్రావణబెళగళలోనే మరణించాడు. అశోకుడు వేయించిన శాసనాలు రాయలసీమలో లభించాయి. పూర్వ బౌద్ధులే అంటరానివాళు ్లఅని డా॥ అంబేద్కర్ పేర్కొన్నాడు. ఒకప్పుడు బౌద్ధాన్ని అనుసరించి, మనువాదులతో జరిగిన యుద్ధంలో ఓడిపోవటం వల్ల శూద్రులు ఏర్పడ్డారు. మౌర్య సామ్రాజ్యం పతనం జరిగిన వెంటనే రాయలసీమ శాతవాహనుల పాలనలోకి వచ్చింది. శాతవాహనులు కూడా బౌద్ధ, జైన మతాలను అనుసరించారు. అటుతర్వాత నుంచి సుమారు 14వ శతాబ్దం వరకు తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు, తమిళ, కన్నడ ప్రాంతాలు బౌద్ధంతో తులతూగినవి. ముఖ్యంగా రేనాటి చోళులు, పాండ్యులు క్షత్రియులు కారు. అదేవిధంగా, రాయలసీమ ప్రాంతాన్ని పాలించిన పాలకులెవ్వరూ క్షత్రియులు కారు. మధ్య యుగాల కాలంలోని శ్రీకృష్ణదేవరాయలుతో సహ ఎవరూ క్షత్రియులు కారు. క్షత్రియేతరులు రాజ్యం ఏర్పాటు చేసే వాతావరణం కేవల బౌద్ధం వల్ల మాత్రమే ఏర్పడుతుంది. అయితే, బౌద్ధాన్ని అంతం చేసే పని క్రీ.శ.8వ శతాబ్దంలో మొదలై 14వ శతాబ్దం నాటికి పూర్తయింది. ఇక్కడి సమాజాన్ని బ్రాహ్మణీకరించటం కోసమే పదవ శతాబ్దంలో మహాభారాతాన్ని అనువాదం చేయించారు. నన్నయ, తిక్కన్న, ఎర్రన్నల కాలంలో బౌద్ధం మీద దాడులు జరిగుతున్నాయి. మల్లికార్జున పండితుడు జైనులను తన

శిష్యుల చేత హత్య చేయించాడు. బౌద్ధాన్ని నిర్మూలించి శైవాన్ని, వైష్ణవాన్ని నిలబెట్టేందుకే 15వ శతాబ్దంలో ఉద్యమాలు జరిగాయి. ఈ ఉద్యమాలన్నీ రాయలసీమనే కేంద్రంగా చేసుకున్నాయి. రామానుజుడు, శంకరాచార్యుడు, మధ్వాచార్యుడు రాయలసీమనే లక్ష్యంగా చేసుకున్నారు. చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు, ఒంగోలు ప్రాంతాలు బౌద్ధం వ్యాపించిన ప్రాంతాలు.

చిత్తూరు కేంద్రంగా అన్నమయ్య, త్యాగయ్య వంటి వాగ్గేయకారులు భక్తి ఉద్యమాన్ని నడపటంలోని ఆంతర్యం గ్రహించాలి. అన్నమయ్యది సంఘ సంస్కరణ దృష్టి. రాయలసీమ మీద లింగాయత్ ఉద్యమం ప్రభావం కూడా బలంగా ఉండేది. వేమన్న, పోతులూరి వీరబ్రహ్మం, కక్కయ్య, సిద్ధయ్య, దున్న ఇద్దాసు వరకు అందరూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఆలోచనలు ప్రచారం చేశారు. అందువల్ల అనేక తాత్విక ఉద్యమాలకు, సాంస్కృతిక ఆందోళనలకు రాయలసీమ ప్రాంతం కేంద్రంగా ఉండేది. కాబట్టి రాయలసీమ ప్రజల్లో కన్పించే అనేక భావోద్వేగాలకు లోతైన అర్థాలు ఉంటాయి. పాళేగాళ్ల వ్యవస్థలోకి రెడ్డి, కమ్మ కులాలు ప్రవేశించక పూర్వం బోయ, మాదిగలే పాళేగాళ్లనీ, కలెక్టర్‌కు సమానర్థకమైన పాళేగాళ్ల వ్యవస్థను అగ్రకులాలు ప్రవేశించటంతో స్వార్థ ప్రయోజనాల కోసం ఆ వ్యవస్థను భ్రష్టు పట్టించారని నాగప్పగారి సుందర్రాజు పేర్కొన్నాడు. రెడ్డి, కమ్మ కులాలు ఫాక్షనిస్టు కులాలుగా అవతరించాయి. ఆధిపత్య అగ్రకుల వ్యవస్థను గట్టిగా ఎదిరించిన కిందికులాలు బోయ, మాదిగ వంటి కులాలు కూడా చివరికి ఫ్యాక్షన్ గొడవల్లో కూరుకుపోయే స్థితి వచ్చింది. అయితే, అప్పటికీ, రాయలసీమ సాహిత్యం, రాజకీయాలు అగ్రకులాల చుట్టూ తిరుగుతున్నాయి. ఈ పరిస్థితిని నిరసిస్తూ దళిత, బిసీ కులాలు రచనలు చేస్తున్నారు. ఈ చైతన్య కలగడానికి ఆచార్య కొలకలూరి ఇనాక్ ఎంతో కృషి చేశారు. స్పష్టమైన మాదిగ దృక్పథంతో నాగప్పగారి సుందర్రాజు కవిత్వం, కథలు వెలువరించారు. చిలుకూరి దేవపుత్ర, కొలకలూరి ఇనాక్, బండినారాయణ స్వామి వంటి ప్రఖ్యాత రచయితలు నవలలు, కథలు, కవిత్వం, విమర్శ వెలువరించారు. ముఖ్యంగా నవలా సాహిత్యాన్ని రాయలసీమ రచయితలే విశాలం చేశారు. తెలుగు నవలా ప్రక్రియలోకి రాయలసీమ బహుజన రచయితలు అనేక కొత్త విషయాలను ప్రవేశపెట్టారు. పాఠకలోకాన్ని సరికొత్త ఆలోచనలకు గురిచేశారు. ఈ నేపథ్యంలోనే రాయలసీమలో వచ్చిన మూడు నవలలను ఈ అధ్యాయంలో పరిశీలిస్తాను.

**<u>3.1. చిలుకూరి దేవపుత్ర పంచమం – కుల వ్యవస్థ:</u>**

చిలుకూరి దేవపుత్ర మొదటి నవల అద్దంలో చందమామ, దానిలో 'లీలగా కనిపించిన రచనా సామర్థ్యం అనుభవ విశ్లేషణం తరువాత నవల పంచమంలో భాగా రాటు దేలాయి. పంచమంలోని కథావస్తువులు అద్దంలో చందమామలా చిత్రించిన భూ సంస్కరణ మాయా జాలమూ, హరిజన సమస్యా అన్నవే. కానీ చిల్కూరి దేవపుత్ర వాటి పట్ల అవగాహనా వాటిని మానవ సంబంధాల దృక్పథం నుంచీ చిత్రించటంలో నైపుణ్యం ఎంతగానో పెరిగాయి. భావాలను చారిత్రకముంగా పరిశీలించగల ఆలోచనా శక్తి పెరిగింది. వీటినికి తోడు పాత్ర పోషణలో కథానిర్మాణంలో తెలుసుకోవాలసిన సూక్ష్మ విషయాలు తెలిశాయి' ( వెంకటసుబ్బయ్య వల్లంపాటి: 2006. 114) అని అభిప్రాయ పడ్డారు.

**<u>3.1.2. చిలుకూరి దేవపుత్ర పరిచయం:</u>**

**<u>రచయిత పేరు:</u>** చిలుకూరి దేవపుత్ర

**<u>తల్లిదండ్రులు:</u>** సరోజమ్మ, ఆశీర్వాదం

**<u>పుట్టిన తేది:</u>** ఏప్రియల్ 24, 1952

**<u>స్వగ్రామం:</u>** కాలువ పల్లె, బెళుగప్ప మండలం, అనంతపురం జిల్లా. ఆంధ్రప్రదేశ్

**బాల్యం:** కర్నూలు జిల్లా ఆలూరు, ద్రోణాచలం, నందికొట్కూరు, నంద్యాల మొదలైన ప్రాంతాల్లో గడిచింది.

ప్రాథమిక, మాధ్యమిక విద్య: కర్నూలు జిల్లానే (తండ్రి సర్వేయర్ ఉద్యోగం వల్ల) సాగింది. 9వ తరగతిలో తండ్రి ఉద్యోగరీత్యా అనంతపురం బదిలీ కావడంతో 9, 10వ తరగతులు, తర్వాతలో చేరిన 2 సంవత్సరాలకే ఉద్యోగం రావడంతో చదువు మధ్యలోనే ఆపివేశారు.

**ఉద్యోగం:** 1983 సంవత్సరంలో జైళ్ళశాఖలో ఉద్యోగం. 1984 సంవత్సరంలో రెవెన్యూ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా (అనంతపురం)ఉద్యోగంలో చేరి అదే శాఖలో కొనసాగుతున్నారు.

**వ్యక్తిత్వం:** 1977 సంవత్సరం నుండి రచనలు మొదలుపెట్టారు. వీరి మొదటి కథ 'మానవత్వం'. ఈ కథ ప్రజా సాహితిలో అచ్చయింది. ఈ కథల ద్వారా సమాజం వికృత రూపమైన కులం, దాని మూలంగా తయారైన మూఢనమ్మకాలు, వాటి వికృత రూపం, లోపభూయిష్టమైన పరిపాలన పద్ధతులు, అగ్రకులాల పెత్తనం మొదలైన వాటిపై నిరసన తెలియజేస్తూ మానవత్వ విలువలను పొందుపరచారు.

**కథలు:** 1. ఆరుగ్లాసులు కథల సంపుటి (1988). దీనికి 1990లో నూతలపాటి సాహితీ సత్కారం లభించింది. 1986 'ఆరుగ్లాసులు' కథకు మయూరి పత్రిక మొదటి బహుమతి వచ్చింది.

2. ఏకాకి నేక చప్పుడు (1995)

'విడుదల' (ఇది హిందీ, మరాఠీ భాషల్లోకి అనువాదం అయింది), 'మన్నుతిన్న మనిషి' (1986) ,ఆరుగ్లాసులు, దొంగైతే బాగుండు, జుర్యాన, మేం మనుష్యులం మొదలగునవి కన్నడం భాషలోకి అనువాదమయ్యాయి. ఈయన కథలు రాయలసీమ మాండలికంలో రాశారు. కథలలో ఎక్కువగా మానవతా విలువలు ఎలా పతనమౌతున్నాయో తెలియజేశారుఈ కథను చదువుతున్న పాఠకులకు హృదయం ఆర్ద్రతతో నిండి బరువెక్కుతుంది.

**నాటకాలు, నాటికలు:** మంత్రి మండలి (నాటకం), మట్టిగాజులు, చిట్కా, పెళ్లానికో ప్రేమలేఖ, దొంగయితే బాగుండు (రేడియో నాటికలు).

**నవలలు:** 1. అద్దంలో చందమామ
2. పంచమం
3. కక్షశిల (ఈ మూడు నవలలు దళిత నేపథ్యం నుండి వచ్చినవి)
4. చీకటిపూలు (ఈ నవల బాల నేరస్తుల జీవితాలను వివరిస్తుంది)

చిలుకూరి సున్నిత మనస్కుడు. ఎవరొచ్చిన చిన్న పెద్ద తేడా లేకుండా ఆప్యాయంగా ప్రేమగా మాట్లాడతారు. సంగీతమంటే ప్రాణం. చిలుకూరికి మాతృభాషంటే ప్రాణం. అందుకే సాధ్యమైనంత వరకు తెలుగులోనే మాట్లాడతారు.

**అవార్డులు – సత్కారాలు:** దేవపుత్ర రచనలు మెచ్చిన వారు ఇచ్చిన అవార్డులు, సత్కారాలు స్వీకరించారు.

1. నూతలపాటి సాహితీ సత్కారం (1990)
2. హిమబించు అవార్డు (1996)
3. అమెరికా తెలుగు అసోసియేషన్ (అటా) (1998)
4. హైదరాబాదు వారి ఉండేల సాహితీ పురస్కారం (1998)
5. తెలుగు విశ్వవిద్యాలయం – ధర్మనిధి పురస్కారం (2000)
6. విజయనగరం 'చాసో స్ఫూర్తి' సాహితీ పురస్కారం (2000)
7. విశాలాంధ్ర స్వర్ణోత్సవ సాహితీ పురస్కారం (2003)
8. అధికార భాషా సంఘం అవార్డు (2004)

9. నిత్య శ్రీ సాహితీ అవార్డు (2004)

దేవపుత్ర రాసిన 'ఇరుకు' అనే కథ 'మంచుతెర' అనే పేరుతో దూరదర్శన్ లో సీరియల్ ప్రచారం అయింది.'బందీ' అనే కథ, పంచమం (నవల)లను శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ (తెలుగు) విద్యార్థులకు సిలబస్‌గా ఎంపిక అయ్యాయి.

### 3. 1. 2. పంచమము కథాపరిచయం:

అనంతపురం జిల్లాలో ఒక గ్రామంలోని దళిత జీవితాన్ని చిత్రించిన నవల 'పంచమం' చిలుకూరి దేవ పుత్ర పల్లెల్లో దళితుల జీవితాన్ని యీ నవలలో వాస్తవికంగా చిత్రించారు. గ్రామాన్ని అభివృద్ధి చేయాలనుకునే దళిత ఉద్యోగులు ఎదుర్కొనే చిక్కులు ఆ చిక్కుల్ని పరిష్కరించుకోలేక పోవటాన్ని గల కారణాలు చర్చించారు. ఆధిపత్య అధికార కులాలు కింది కులాలను చెంచాలుగా తయారు చేసుకొని వారి ద్వారా పెత్తనం ఎలా చెలాయిస్తారో రచయిత చర్చించారు.

పల్లెల్లో విద్యార్థులు, కొందరు పెద్దలు రచ్చబండ దగ్గర రిజల్ట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. బస్సులో పేపర్ వచ్చింది. ఊళ్లో చాలా మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఒకడు థర్డ్ క్లాస్‌లో, కరణం గారి అబ్బాయి సెకండ్ క్లాస్‌లో పాస్ అయ్యారు. శివయ్య (మాదిగ) ఫస్ట్ క్లాస్‌లో ఫాస్ అయ్యాడు. ఈ నిజాన్ని అగ్ర వర్ణ రైతులు జీర్ణించుకోలేక పోయారు. శివయ్య పట్టణంలోని ప్రభుత్వ (యస్సీ) హాస్టల్‌లో ఉండి చదువు కున్నాడు.

ఇంటి ముందు వేప చెట్టు కింద చెప్పులు కుడుతున్న తండ్రి నారాయణప్పకు శివయ్య తాను ఫస్ట్ క్లాస్‌లో పాసైన విషయం చెప్పాడు. తండ్రి చాలా సంతోషించాడు. కాని ఆయనకు ఫస్ట్‌క్లాస్, సెకండ్ క్లాస్ అంటే ఏమిటో తెలియదు. తల్లి, మామకి చెప్పమని తండ్రి శివయ్యకు చెప్పాడు. పొలంలో (వరి) కలుపు తీస్తున్న తల్లికి ఫస్ట్ క్లాస్ సంగతి తెలిపాడు. ఆమెకు చదువు సంగతి ఏమీ తెలియదు. కాని బిడ్డ ఆకలి తెలుసు. అందుకే సంగటి తిను పొమ్మన్నది. ఇంకోకామె ఉద్యోగం వచ్చిన తరువాత అమ్మ నాన్నను బాగా చూసుకొమ్మని చెప్పింది.

నారాయణప్పకు సొంత పొలం సేద్యం చేసుకోవాలనేది తీరని కోరిక. కొన్నాళ్లు ఇతరుల పొలాన్ని కౌలుకి చేశాడు. కాని కౌలు గింజలు కొంగులోకి రాకపోవడంతో మానుకున్నాడు. తనకు ఎవరైన బంజరు భూమికి పట్టా యిప్పిస్తారని ఆశ. పేంటు షర్ట్ వేసుకున్న వాళ్ళువస్తే పొలం ఇప్పించమని బతిమాలుతాడు. క్రిష్టపురంలోని శంకరయ్య దళారి. 30 ఎకరాల పొలాన్ని లాండ్ సీలింగ్ యాక్ట్ క్రింద వెనక్కు ప్రభుత్వానికి ఇవ్వాలని శంకరయ్య పథకం దళితులగు ఆ భూమికి పట్టా ఇప్పిస్తామని చెప్పి వాళ్ళ దగ్గర డబ్బులు వసులు చేయాలని రెవిన్యూ వారి ఉద్దేశం. ఈడిగ కులం వెంకటమ్మ శివయ్యను ఆప్యాయంగా పలకరించి తన కూతురు పద్మకు లెక్కలు, ఇంగ్లీష్ చెప్పమన్నది. ఆ ఊర్లో అభ్యుదయ భావాలు గల పురుషోత్తం శివయ్యను ప్రోత్సహిస్తాడు. ఆ ఊరిలో కులాల పట్టింపు ఎక్కువే. హోటల్ దుర్గన్న సత్తులోనే దళితులకు కాఫీ ఇస్తాడు. కోమటిలో దూరం నుంచే చేటలో డబ్బులు వేయించుకొని సరుకులు అందులోనే వేస్తారు. కులాల కట్టు బాట్లను కాదని కమ్మవారి అమ్మాయి రుక్మిణి చాకలి ఓబన్నతో లేచిపోయింది. చాకలి ఓబన్నను వెతికి పట్టుకొని అగ్రవర్గాల వారు తిరుపతి కొండల మాటున వేట కొడువండ్లతో నరికి వేశారు. రుక్మిణిని ఇంటికి తీసుకువచ్చి కొన్నాళ్ళ తరువాత తమ కులం వాడికే ఇచ్చి పెళ్ళి చేశారు.

అనంతాపురంలో శివయ్య తన క్లాస్ మెంట్ క్రిష్ణ శాస్త్రి ఇంట్లో కుల భేదాలను పట్టించుకోకపోవడాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. కుల భేదాలను పాటించేది, ఈ భేదాలను కాదని సంస్కరణలకు పూనుకున్నది ఈ బ్రాహ్మణులేనని క్రికెట్‌లో బాటింగ్, బౌలింగ్, రెండూ వాళ్లవేనని బంతి దళితులని శివయ్య తలచాడు. పద్మ తనను ప్రేమిస్తుందని తెలిసి శివయ్య

ఆమె ప్రేమను కాదని మనం స్నేహితులుగానే మిగిలిపోదామన్నాడు. నారాయణప్ప శివయ్య తండ్రి కొద్ది పొలానికి పట్టా సంపాదించుకొని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

క్రిష్ణాపురం వీధిలో ఆసాముల ఇండ్ల ముందు సైకిల్ తొక్కడాన్ని మాలపిల్లవాడు నాగన్నను బూతులు తిట్టి చెంపమీద కొట్టాడు. రాజారెడ్డి మాల యువకులు ఏకమై అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని ఎదిరించాలనుకున్నారు. ఒక్కొక్క సైకిల్ మీద ఇద్దరుగా ఇరవై సైకిల్‌లతో ర్యాలీ జరుపదలిచారు. ఈ ర్యాలి వజ్రకరూర్ మాలయువకుడు నాయకత్వం వహించాడు. మాదిగ వాళ్ళ శవాన్ని ఊల్లోంచి శవాన్ని తీసుకుపోవడానికి వీల్లేదని అగ్రవర్ణాల వారు అడ్డుకున్నారు. వారిని మాదిగలు ఎదిరించలేక శవాన్ని వెనక్కి మళ్ళించారు. ఆసాములు ఇళ్ళు తగల బెట్టించారు. ప్రభుత్వం బాదితులకు పక్కా ఇళ్ళు కట్టించింది.

సురేష్ మార్క్సిస్టుగా మారి విప్లవవాదులతో చేరి 'యూజి' కి వెళ్ళిపోయాడు. సురేష్ మాటల వల్ల శివయ్యకు మార్క్సిజం గురించి కొన్ని విషయాలు తెలుసుకున్నాడు. శివయ్య పోటీ పరీక్షలు పాసై గ్రూఫ్ 1 ఆఫీసర్ అయ్యాడు. మాల మాదిగల రిజర్వేషన్ విషయంలో రెండుగా చీలిపోవడం శివయ్యను బాధించింది. క్రైస్తవ మతంలోనికి మారిన దళితులకు ఓరిగిందేమి లేదని శివయ్య తెలుసుకున్నాడు. మతం మారుతున్నా కూడా కుల వివక్ష తొలగిపోలేదు.

ప్రదీఫ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ కొడుకు. దళితుడైన డబ్బు పుష్కలంగా ఉంది. స్కూటర్, మారుతీ కార్ ఉన్న ఎస్సీ స్కాలర్ షీఫ్ కోసం విలవిల లాడుతాడు. ఆ డబ్బుతో తాగి తందనాలు ఆడుతాడు. తన కులం వాళ్ళంటే అతనికి హస్యంజ ఈయన పెళ్ళంటు చేసుకుంటే బ్రాహ్మణ స్త్రీనే పెళ్ళి చూసుకుంటాను అంటాడు. ప్రదీప్ శివయ్యతో స్నేహం చెయ్యాలని అనుకున్నా, శివయ్య వైఖరి నచ్చక వద్దనుకుంటాడు.

శివయ్య ఇన్స్‌పెక్టర్ డిప్యూటి కలెక్టర్ అనంతపురంలో జాయిన్ అయ్యాడు. ఆఫీసులో సూపరిండెంట్ ఇంగ్లీష్ చదువులు వచ్చాక ఎంత మార్పు వచ్చిందో చూడండి. ఎక్కడో ఉ ండవలసిన చెప్పులు కుట్టుకునే వాళ్ళు ఆఫీసర్‌లు అయి వస్తారు. పంచాంగం చెప్పుకునే పేదలు, చదువుకునే బ్రాహ్మణులు గుమస్తాలుగా చేరి నెమ్మదిగా ఒక్కొ మెట్టు ఎక్కుతూ మహా అయితే ఆఫీస్ సూపరిండెంట్‌లు అవుతారు. అప్పుడు విరక్తిగా క్రిష్ణాపురం ఊరిపెద్ద సీతారామప్ప సర్పంచ్ శంకరయ్యలు శివయ్యను అతని బంగ్లాలో కలుసుకున్నారు. తమ ఊరికి రమ్మని ఆహ్వానించారు. చీనీ నిమ్మతోటలో విందు ఏర్పాటు చేశారు. శంకరయ్య భూమిని రీసర్వే చేసి శంకరయ్యకి వచ్చేలాగా చేయమన్నారు. మాల మాదిగల ఇండ్లు తగల పెట్టిన కేసు మాఫీ చేయి అని కోరారు. చూడండి గొంచి కాడా! నేను బాధ్యత గల ఆఫీసర్‌ను ఏది న్యాయం, ఏది అన్యాయం అనేది పరిశీలించి విచారణ జరిపి తీరతానన్నారు. శివయ్య దృఢంగా 50,000/- వేల రూపాయలు ఇవ్వ బోయాడు. నేను పేదోళ్ళ నోర్లు కొట్టను యస్సీల మీద ఎట్రాసిటీస్‌ను సహించను అని శివయ్య ఖండితంగా చెప్పేశాడు.

ఉప ముఖ్యమంత్రి అనంతరపురం వస్తే శివయ్య వెళ్ళి కలుసుకున్నాడు. తన పదవి నామమాత్రమే నని తాను అగ్రకులాల చేతిలో పావును, కీలు బొమ్మనని తాను దళితులకు ఏవిధంగానూ తోడ్పాటు లేకపోతున్నాని ఉపముఖ్యమంత్రి తన ఆశక్తతను తెలియజేసి వాపోయాడు.

శివయ్య ట్రాన్స్‌ఫర్‌ను దళిత సంఘం వాళ్ళు అడ్డుకున్నారు. ఎంత ప్రయత్నించిన శివయ్యను ట్రాన్స్‌పర్ చేయించడం కుదరలేదు. సీతారామప్ప శివయ్యపై కుట్ర చేసి అతన్ని లంచం కేసులో ఇరికించి సస్పెండ్ చేయించాడు. రెవెన్యూ ఉద్యోగులకు లంచం ఇచ్చి శివయ్య భూమిని తిరిగి ఇప్పించుకున్నాడు. భూమిని కోల్పోయిన పేదలంతా కలిసి కట్టుగా

ప్రభుత్వ ఉత్తర్వును ధిక్కరించదలచుకున్నారు. పద్మ శివయ్యతో ఉండి పోవడానికి మాదిగ పల్లెకు వచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వు ధిక్కరించడానికి నారాయణప్ప కూడా సిద్ధం అయ్యాడు.

## 3.1.3.పంచమం పాత్రల విశ్లేషణ:

చిలుకూరి దేవపుత్ర ఈ నవలలో 1975 కాలం నుండి ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన ఉద్యమాలను రాజకీయ పరిణామాలను నేపథ్యంగా తీసుకుని రచించారు. దానికి అనుగుణంగా పాత్రలు సందర్భానుసారం ప్రవర్తిస్తుంటాయి. ఆ ప్రవర్తనను బట్టి మనం ఆ పాత్రలను అంచనా వేసుకోవచ్చు.

### 3.1.3.1. శివయ్య–సామాజిక మనో విశ్లేషణ:

పంచమం నవల కథానాయకుడు శివయ్య ఈ పాత్రను రచయిత సముచితమైన లక్షణాలతో చిత్రీకరించాడు. స్వచ్ఛమైన ప్రవృత్తి, నిర్మలమైన మనుస్సు, ఆత్మగౌరవం, స్వాభిమానం కలిగిన పాత్ర శివయ్యది. మంచితనానికి నిజాయితీకి మారు పేరు శివయ్య. సామాజిక, సాంస్కృతిక చైతన్యమే వ్యక్తుల మానసిక స్థితిని నిర్ణయిస్తుంది. దళితుల మానసిక ప్రవృత్తి వేరుగా ఉంటుంది. వ్యక్తుల మానసిక ప్రపంచం ఇతర దేశాల్లో మాదిరి ఇక్కడ నిర్మాణం కాదు. వర్గ సమాజంలో వ్యక్తుల మనోప్రపంచం వర్గపూరిత నిర్మాణం. కుల సమాజంలో వ్యక్తుల మనోప్రపంచం వేరుగా నిర్మాణం అవుతుంది. వాస్తవానికి వ్యక్తులకు విడిగా ఒక మానసిక ప్రపంచం ఉండటాన్ని కుల సమాజం అంగీకరించదు. కుల సమాజంలో ఆ కులం యొక్క స్థానం, హోదా అనుసరించి ఆ కులం యొక్క ఆలోచన, మనో ప్రవృత్తి ఉంటాయి. మనోవైజ్ఞానిక శాస్త్రం మన దేశంలో పూర్తిగా నిర్మాణం కాలేదు. వ్యక్తుల ప్రవర్తన ఇక్కడ విడిగా ఉండదు. అది ఆ కులం యొక్క ప్రవర్తనలో అంతర్భాగం. వ్యక్తులకు స్వతంత్రమైన మానసిక ప్రపంచం ఉండకపోవడానికి కుల సమాజమే ప్రధాన కారణం.

కుల సమాజాన్ని అర్థం చేసుకోకుండా వ్యక్తుల ఆలోచనలు, ప్రవర్తనను సరిగా అర్థం చేసుకోలేం. దళితులు, బిసీలు, ఆదివాసుల మనోవైజ్ఞానిక విషయాలను అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే సజీవ పాత్రల సృష్టి సాధ్యమవుతుంది. 'పంచమం' నవలలో ప్రధాన కథానాయకుడైన శివయ్య చిత్తప్రవృత్తి, ప్రవర్తన చాలా సంక్లిష్టంగా ఉంటుంది. శివయ్య సామాజిక ప్రవర్తనను అతని కులానికి సమాజంలో వున్న గుర్తింపు, విధి నిషేధాలే నిర్ణయించాయి. తన చుట్టూ శత్రుపూరితమైన సమాజం వుంది. కానీ దాన్ని ఎదుర్కొనే ధైర్యం అతనికి లేదు. తనకు, తన జాతికి అన్యాయం జరిగినా పురుషోత్తం, సురేష్‌ల వలే తీవ్రంగా స్పందించలేదు. శివయ్య పాత్రను సామాజిక, మానసిక దృక్పథంతో పరిశీలించాలి. కథానుమాత్రం దృష్టిలో చూసినప్పుడు "పంచమం" శివయ్య అన్న హరిజన యువకుని ఉత్థాన పతనాలను చిత్రిస్తుంది. ఈ రెండు బిందువుల మధ్య రచయిత అనుభవం ఈ నవలలో విస్తృతంగా చోటుచేసుకుంది. భూసంస్కరణలలోని బూటకం, రెవిన్యూశాఖ మాయోపాయాలు, హరిజనోద్యమం, పార్టీ రాజకీయాలూ–అన్నిటికంటే ముఖ్యంగా వివిధ కులాలకు చెందిన పాత్రల మధ్య మానవ సంబంధాలూ ఈ నవలలో సహజంగా ఒదిగిపోయాయి. వాటిని ఆధారం చేసుకుని రచయిత ఉన్నత వర్ణాల వారూ, ఉన్నత వర్గాలవారూ మాలమాదిగలను సామాజికంగా, సాంస్కృతికంగా ఎంతహీనంగా చూస్తారో బలంగా ప్రదర్శించాడు.

చిలుకూరి దేవపుత్ర ఒక కాలాన్నీ, ఒక ప్రాంతాన్నీ, ఒక చరిత్రను సంస్కృతినీ ఇచ్చి శివయ్య పాత్రకు రక్త మాంసాలు ఇచ్చి ప్రాణం పోసి సజీవంగా నిలిచిపోయేటట్లు పంచమంలో చిత్రించారు. ఈ పాత్ర నవలలో మొదటి నుండి చివరి వరకు కన్పిస్తుంది. ఇందులో కథానాయకుడైన శివయ్య మీదే కథ అంతా కేంద్రీకృతమై అతని వెంటే కథ జరుగుతుంది.

రచయిత శివయ్య పాత్రను అచేతన దశ నుండి హక్కుల కోసం ఉద్యమాలు చేయాలని ఆలోచన వచ్చే వరకు శివయ్య జీవితం సాగిపోయే విధంగా చిత్రీకరించారు. దళితుడైన శివయ్య జీతగాడి జీవితం నుండి గ్రూప్ వన్ ఆఫీసర్ వరకు ఎదుగుతాడు. కులం గోడలు నిచ్చెన మెట్లు వలె ఉన్న పల్లె టూరునుంచి అనంతపురంలో ఆఫీసర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి అక్కడ తాను ఎదుర్కునే ఆత్మ న్యూనతా నీడనుండి బయట పడటానికి శివయ్య చేసిన ప్రయత్నాలు, ఆ ప్రయత్నంలో ఎదురైన అనుభవాలు, ఆ అనుభవాల ఆధారంగా అతడి జీవితానికి ఇచ్చుకున్న అర్థం స్థూలంగా ఈ నవలలో కన్పిస్తుంది. కుల వ్యవస్థా దానికి ఆలంబనైనటువంటి హిందూ మత సిద్ధాంతాలు, వాటివల్ల రోజూ వారి జీవితంలో పీడనాన్ని అనిశ్చితత్వాన్ని, అభద్రతను, అవమానాన్ని ఎదుర్కుంటూ ముందుకు పోయే పాత్రగా ఈ నవలలో శివయ్య మనకు కనిపిస్తాడు. అందుకే శివయ్య పాత్రని వివిధ కోణాల నుండి చూడవలసి ఉంది.

మాదిగ నారాయణప్ప కొడుకు శివయ్య, శివయ్య పిరికివాడు. తన గురించి తనకే సరైన అంచనా లేనివాడు. అందుకే భూస్వాముల కుతంత్రాలకు బలై పోయాడు. ప్రతి విషయానికి పురుషోత్తం మీదనే ఆధారపడతాడు. పురుషోత్తం గనుకే లేకపోతే శివయ్య ఎదిగేవాడు కాదు. అలాగే తన చిన్న మామ నెట్టికళ్ళ కూడా శివయ్య పాత్రకు జీవం పోస్తాడు. నెట్టికళ్ళ లేకపోతే శివయ్య శంకరయ్య ఇంటిలో జీతగానిగానే మిగిలిపోయేవాడు. నెట్టికళ్ళ శివయ్యను తీసుకెళ్ళి స్కూల్‌లో చేరిపిస్తాడు. అదే అతడి జీవితంలో తొలి మలుపు శివయ్యకు చదువంటే ప్రాణం, అందరు జీవించడం కోసం చదువుతారు. కానీ శివయ్య చదువే జీవితం అన్నట్లుగా చదువుతాడు.

శివయ్య పిరికి వాడిలాగా కనిపిస్తాడు. ఈ పిరికితనం కులవ్యవస్థవల్ల అలవడింది. పద్మ ఒక సారి స్టీలు గ్లాసులో కాఫీ ఇస్తే తీసుకోవడానికి భయపడతాడు. శివయ్యలో ముక్కు సూటిగా మాట్లాడే మనస్తత్వం కనిపిస్తుంది. అందుకే పద్మ శివయ్యను ప్రేమిస్తున్నానని చెప్పినప్పుడు "సారీ పద్మ నేను నిన్ను ఇష్టపడిన మాట వాస్తవమే కాని నా కులం నిన్ను ప్రేమించే దానికి ప్రోత్సహించలేదు. లోకమంతా హీనంగా చూసే కులంలో పుట్టాను'(పు . ) అని సమాధానం చెపుతాడు. శివయ్యలో తన పిరికితనానికి ప్రధాన కారణం సమాజం తన కులానికి రుద్దిన పిరికితనం కావచ్చు. శివయ్యకి సహనం ఎక్కువ, మార్పును త్వరగా స్వీకరించడు. ఏ మార్పు రావడానికైె కొంత సమయం పడుతుందని విశ్వసిస్తాడు. శివయ్యలో ఎన్నో ఉద్యమాలు చేయాలని ఉంటుంది. కాని ఏమి చేయలేడు. శివయ్యలో బానిస లక్షణాలు ఎక్కువగా కన్పిస్తాయి. శివయ్య గ్రూఫ్ వన్ ఆఫీసర్ అయినా శంకరయ్య, సీతారామప్పలను గొంచికాడా అని పిలుస్తుంటాడు. ఒక్కొసారి పరివర్తన చెందిన వాడివలే కనిసిస్తాడు. శంకరయ్య సీతారామప్పలు సీలింగ్ క్రింద ప్రభుత్వం తీసుకున్న భూమిని తిరిగి ఇప్పించమని శివయ్యను అడిగినప్పుడు " చూడండి గొంచికాడా ! నేను బాద్యతలు గల ఆఫీసర్‌ని ఏది న్యాయం అని పరిశీలించి విచారణ జరిపితీరతాను. విచారణలో నేరం ఋజువైతే దోషులకి దండన తప్పదు. దానిలో ఏటువంటి మొహమాటములు లేవు" (పు. ). అని నిర్భయంగా మాట్లాడతాడు. "పాత భావాలు కరుడు కట్టిన చాదస్తాలు, సనాతన సంస్కృతిని తన రక్తంలో నింపుకొని ఉన్న గొంచికాళ్ళతో ఫ్యూడల్ భూస్వాములతో అటు దేశంలోనూ, ఇటు రాష్టంలోనూ నిరంతరం అధికారం చేబడుతున్న కులాలతో మనం ఏమాత్రం అజాగ్రత్తగా అడుగు వేసినా మన అడుగు జాడల్ని కనపడనీయకుండా చేయగలిగిన అహంకారాలతో ఎదిరించి జీవించడం" ( పు:155) కష్టమంటాడు.

పురుషోత్తానికి శివయ్యకు మధ్య ఎంతో అన్యోన్య సంబందం ఉంటుంది. శివయ్య గ్రూఫ్ వన్ ఆఫీసర్ అయ్యాడంటే అది పురుషోత్తం ప్రోత్సాహం వల్లనే. శివయ్యకి ఏప్పటికప్పుడు

కర్తవ్యాన్ని బోధిస్తు ఉంటాడు. అందుకే ఒక సారి పురుషోత్తంతో శివయ్య " ఒక ప్రేగులోంచి పుట్టకపోయినా నాకు సొంత అన్నయ్య కంటే ఎక్కువ, కొందరికి మానస పుత్రులు ఉన్నట్లు చెబుతారు. నేను నీకు మానస సోదరున్ని" అని అంటాడు. ఏవిషయాన్నైన పురుషోత్తంతో చర్చిస్తాడు. శివయ్య గాంధీ సిద్దాంతాలను, క్రైస్తవ సిద్ధాంతాలను నమ్మినట్టు కనిపిస్తాడు. హరిజనులు ఇంతగా అభివృద్ధి చెందారంటే అది గాంధీ వల్లేనని శివయ్య నమ్మకం. సురేష్ ప్రపంచంలో జరిగే ఏన్నో విషయాలను గురించి మార్క్సిజం, అంబేద్కరిజంను గురించి చెప్పినప్పుడు ఊ... బాగుందన్నా! నీ వాదం.... నాకు ఎదో అర్దం అయినట్టు, కానట్లు ఉ ంది..... అని అంటాడు. శివయ్య పాత్రలో ఇన్‌ఫియారిటీ కాంప్లెక్స్ అందులోంచి జనించిన ఆత్మనూనత భావం, దాని ఫలమైన అంతర్ముఖీనత కనిపిస్తుంది. "ఎక్కడో తనలో న్యూనతభావం మేల్కొంటుంది తను దేన్నుంచి బయటికి రావాలని కోరుకుంటున్నాడో అదే తన మీద కూర్చుంటున్నట్లుగా అనిపిస్తుంది" ( పు. 194) అని శివయ్య అనుకుంటున్నాడు. పద్మని, విద్యల విషయంలో అదే భావనలకు లోనవుతాడు. పద్మని, విద్యని మొదటిలో ప్రేమిస్తున్నట్లుగా ఊహించుకుంటాడు. కానీ సమాజానికి భయపడతాడు. దానికి కారణం న్యూనతా భావం. అదే శివయ్య మనస్సులో పెనుగులాటకి దారితీసింది. "అగ్రకులాల దగ్గర అడుగడుగునా తన కుల న్యూనతా భావాన్ని మోస్తూ ఎంతో జాగ్రత్తగా అడుగడుగున తన ఒంటి కదలికల్ని సైతం బంధించుకునే" (పు. 101) ప్రయత్నం చేస్తాడు. చివరికి పద్మే దైర్యం చేసి తన ప్రేమ విషయం చెప్పినప్పుడు " మేము కూటికి లేని వాళ్ళము మాత్రమే కాదు, పద్మా ! కులానికి కూడా తక్కువ వాళ్లం. మాదిగ వాళ్ళం" (పు. 125) అని తాను కులం తక్కువ వాడిననే న్యూనతా భావంతో కనిపిస్తాడు. పద్మ టీ.బి రోగిని వివాహం చేసుకుందని తెలిసి చిన్న పిల్లాడి లాగా ఏడుస్తాడు. విద్యకు వివాహం జరిగిందని తెలిసి కూడా ఎంతో బాధ పడతాడు. ఆ విషయాన్ని గురించి పురుషోత్తం శివయ్యతోటి " ఏమైతే నేం జీవితంలో అదృష్టాన్ని జారవిడుచుకున్న అర్భకుడివి నీవు!" (పు. 130) అని అంటాడు.

మొదటిలో శివయ్యకు దేవుడి మీద నమ్మకం ఉన్నట్లుగా కనిపిస్తాడు. అందుకే సురేష్‌తో దేవుడు లేకపోతే మనుషులు, సమాజమే లేదని వాదిస్తాడు. మార్క్సిజంని గురించి తెలుసుకొని హేతువాదిగా మారడానికి ప్రయత్నిస్తుంటాడు. శివయ్య గ్రూఫ్ వన్ ఆఫీసర్‌గా చేరే సమయంలో అక్కడి డిఆర్‌వో మంచి మూహూర్తం చూపి ఆరోజు చేరండి అని చెపుతాడు. శివయ్య అప్పుడు అతనితో అబ్బే నాకు అటువంటి పట్టింపులు ఏవి లేవు సార్ అంటాడు. మొదటిలో దేవుడిని నమ్మే శివయ్య కాల క్రమంలో హేతువాదిగా మార్పు చెందుతాడు. శివయ్య అడుగడుగునా ఎన్నో అవమానాలను భరించాడు. అలాంటి వాటిలో తనను కులంపేరుతో అగ్రకులాల వారు పెట్లే నానా ఇబ్బందులు ఎదుర్కొంటూ ముందుకు పోతాడు. ఇలాంటి సమయంలో పద్మ, విద్య, కృష్ణశాస్త్రీల స్నేహం ఎంతో ఊరటనిస్తుంది. తన చిన్ననాటి స్నేహితుడు ప్రదీప్ కలిసినప్పుడు ఎన్నో కొత్త విషయాలను చర్చించుకుంటారు. శివయ్యలో ఊహాత్మక శక్తి ఎక్కువగా ఉన్నట్లు ఈ నవలలో మనకు కనిపిస్తుంది. ప్రతి విషయాన్ని ముందుగానే ఆలోచిస్తుంటాడు. సంఘంలో జరిగే వివిధ సంఘటనలను గురించి అవగాహన చేసుకునేందుకు, తన పరిదిని విస్తరించుకునేందుకు పురుషోత్తంతో, స్వచ్ఛంద సంస్థలతో బయట తిరగడం వలన ప్రాపంచిక దృక్పథం ఏర్పడుతుంది. అలాంటి విషయాలలో కొత్తపట్నం లాకప్ డెత్ కేసు, క్రిష్టాపురంలో దళితుల ఇళ్లు తగల పెట్టడం గురించి తెలుసుకోని బాధపడతాడు. ఉ ద్యోగం వచ్చిన తరువాత తన జాతికి ఎన్నో మంచి పనులు చేయాలని అనుకుంటాడు. కానీ ఏమిచేయలేని నిస్సహాయత. శంకరయ్య, సీతారామప్పలు ఒక ప్లాన్ ప్రకారం తన ఉద్యోగం పోయేటట్లు చేసినప్పుడు ఏమి చేయలేని పరిస్థితి. శివయ్య దళితుడైన ఆర్‌డివో అయినా తన

జాతికి ఏమి చేసాడు? వాళ్ళకి ఏం న్యాయం చేయగలిగాడు? తనకు ఒక సామాన్య దళితుడికి ఏం భేదం? తన చదువు, ఉద్యోగం, అధికారం, చైతన్యం ఆ క్షణం శివయ్యను ఏం చేయగలిగాయి? అలా ఏం చేయలేక పోవడాన్నే అగ్రవర్ణాలు తమకు అనుకూలంగానే వినియోగించుకుంటున్నాయి. శివయ్యకి అప్పుడు గాని అర్థంకాలేదు. ఈ దేశంలో దళితుడు ఎంత పెద్ద పదవి చేపట్టిన అగ్రవర్ణాల చేతిలో కీలు బొమ్మలుగా మారిపోవలసిందే. అని ఉపముఖ్యమంత్రి కృపారావు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. శివయ్యలో చివరివరకు పోరాడే పటిమ ఎక్కడా కనిపించదు. శంకరయ్య, సీతారామప్పలకు తన ఇంటర్ రిజల్ట్ దగ్గర నుండి చివరకు తన ఉద్యోగం పోయేంతవరకు కూడా వారిని ఏనాడు ధైర్యం చేసి ఎదురు తిరగలేదు. శివయ్యకు ఎదురు తిరిగే ఆలోచనే రాలేదు.

ఈ నవలలో శివయ్యకి చింతమాను చెట్టుకి ఎంతో సంబంధం ఉంది. ఎన్నో సార్లు ఈ చెట్టు దగ్గరే చదువుకున్నాడు. అక్కడే ఎన్నెన్నో పాఠాలు మననం చేసుకున్నాడు. శివయ్య ఎంతో ఎత్తుకి ఎదిగి ఏం లాభం? తాను నిస్సహాయుడైపోయాడు. తన చదువు, అంతా వృధా అయిపోయింది. కన్న కలలు రాలిపోయాయి. శివయ్యకు ఇప్పుడు అర్థం అయ్యింది. 'కుందేటి గూటికి సింహం వెళ్లినా, సింహం గుహకి కుందేలు వెళ్ళినా పర్యావసాణం ఒక్కటే' నని అర్థం అయ్యింది. తన వాళ్ళ భవిష్యత్‌ను కాలరాస్తు తన ఆత్మాభిమానాన్ని దెబ్బ తీస్తున్నా ప్రేరణ ప్రతీకారం లేని న్యూనతా భావంగల జడుడిలా నీరుగారి పోయాడు శివయ్య. ఒక దశలో పద్మ ఊహాలని, కలలని, ఆశలని భగ్నం చేశాడు. తన లక్ష్యం కోసం ఎన్నో కష్టాలని, ఎన్నో బాధలని భరిస్తూ ముందుకు పోయాడు. శివయ్య పరమ పద సోపాన పటంలోని నిచ్చన మెట్లన్నీ ఎక్కగలిగాడు. కానీ పరమపదం' చేరుకునే లోపుగానే పెద్ద పాము నోటికి చిక్కి కిందకి దిగజారాడు. ఈ పరిస్థితిలోనే శివయ్యలోని మార్పును స్పష్టంగా మనం గమనించగలం. ఇంత కాలం నుంచి న్యూనతా భావంతో బాధ పడుతున్న శివయ్య తనను తాను ఉన్నతీకరించుకున్నాడు. "ఇక తప్పదు తాను తన కులం అంటరాని తనం మీద నిలబడక తప్పదు. తన పట్ల కనబరిచే న్యూనత మీద నిలబడక తప్పదు. అణచబడిన అంచుల మీద నుంచి ఆలోచించక తప్పదు" (పు. 272) అంటు కొత్త ఆలోచనలను తెచ్చుకుంటాడు.

శివయ్య పాత్రను రచయిత సందేశంతోటి ముగిస్తాడు. ఈనాడు దళితుడు ఎంత అభివృద్ధి సాధిస్తున్నా తరతరాలుగా తాము తక్కువ కులంలో పుట్టామని ఆలోచనను నరాల్లో జీర్ణించుకొనిని న్యూనతా భావంతో బాధ పడటం వల్ల శివయ్య లాగ మారిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి దళితులంతా అలాంటి న్యూనతా భావం నుండి బయట పడాలనే ప్రధానమైన విషయాన్ని తీసుకొని శివయ్య పాత్రకు జీవం పోశాడు. అందుకే శివయ్య మొదటి నుండి చివరి వరకు అణచివేసినట్లుగానే చిత్రీకరించ బడ్డాడు. దళితుల సంస్కృతిని శివయ్య ద్వారా కనబరుస్తాడు. పద్మకు వివాహం జరిగినా కాని శివయ్య ఆమెను వివాహం చేసుకోవడానికి ముందుకు వస్తాడు. చివరి వరకు కూడా నిజాయితీగానే జీవిస్తాడు. శివయ్య ఎన్నో ఆటు పోటులను ఎదుర్కుంటూ తన వాళ్ళ భూములను అగ్రకులాల వారు ఆక్రమించుకున్నప్పుడు ఆ విషయాన్ని తండ్రి చాటింపు వేస్తున్నప్పుడు శివయ్యలో పౌరుషం మేల్కుంది. ఇన్నాళ్ళుగా ఏ తిరుగుబాటు చేయని శివయ్యలో తిరుగుబాటు చేయాలనే తత్వం బయటికి వచ్చింది. అప్పుడు కానీ శివయ్యకు అర్థం కాలేదు. "తన జాతికి కేవలం ఆఫీసుల్లోనో, విద్యాలయాల్లోనో, పరిపాలనల్లోనో, రిజర్వేషన్‌లు కల్పించడం వలన రాజ్యాధికారం రాదనీ.... శక్తి వంతం కాదని" (పు: 175) ఇన్నాళ్ళ నుండి తనలో నీడలా దాగి ఉన్న న్యూనతా భావం అదే "శివయ్యకి భూమి మీద స్తబ్ధంగా బరువుగా నిలిచినట్లు అనిపించే భావన అదృశ్యమైంది" (పు. 275). తనను ఇన్నాళ్ళు అవమాన పరిచిన అగ్రకులాలపై దాడి చేసి శివతాండవం చేయాలని

అప్పుడు అనిపించింది. అందుకే తన జాతినంతా ఒక్కటి చేసి ముందుకు పోతూ ఉంటే “ భవిష్యత్ అంతా ఒకే తాటి మీద కదులుతూ ఉంటే పదునెక్కిన నిర్భయత్వం ప్రవహిస్తున్నట్లు” (పు. 275) శివయ్యకి అనిపించింది.

ఈ విధంగా శివయ్య పాత్రను రచయిత తరతరాల, యుగయుగాల రాపిడిలో, దోపిడిలో రాటు దేలిన జీవితాలకి ప్రతీకగా చిత్రీకరించాడు. ఇతివృత్తం అంతటా ఒకే విధమైన గుణాలతో ఉండే పాత్ర చివరకు ఎన్నో సంఘర్షణలు ఎదుర్కొంటూ మౌళికమైన సహజ స్వభావాన్ని వదులుకొని జీవితంలో ఆటుపోటులను బట్టి పరివర్తన చెందుతూ చివరకు సామాజిక అవగాహన వల్ల సమాజాన్ని చైతన్యవంతం చేయాలనే స్పృహతో ముందుకు వెళ్తాడు. ఈ నవలలో శివయ్య ఆత్మ గౌరవం ఉన్న దళితుడిగా ఓడిపోయాడు. వేల సంవత్సరాలుగా దళితులు ఓడిపోతూనే ఉన్నారు. బహుషా ఇది గెలవడానికి ముందు జరిగే ఓటమి కావచ్చు.

**3.1.3.2.సురేష్ – కుల సమస్యకు పరిష్కారం మార్క్సిజం:**

సమాజంలో అన్యాయాన్ని ఎదుర్కోవడానికి మార్క్సిజమే సాధనమని భావించేవాళ్లు వున్నారు. వర్గ సమాజం నిర్మించిన ఉపరితల అంశమే కులమని కమ్యూనిస్టులు చెప్తారు. పేదలంతా ఏకమై పీడకులకు వ్యతిరేకంగా పోరాడాలని కమ్యూనిస్టులు పిలుపునిస్తారు. దళితులు, శూద్రులు పేదవాళ్లు. భూస్వాములు ఈ పేదలను దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఈ దోపిడీదారులకే మద్ధతుగా ఉంది. కాబట్టి, ఈ దోపిడీ నుంచి విముక్తి కావాలంటే దళితులు, శూద్రులు భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమించాలనీ, సమసమాజం నిర్మించాలని కమ్యూనిస్టులు చెప్తారు. సాయుధ పోరాటం ద్వారా, హింసాయుత పద్ధతుల ద్వారా మాత్రమే ఆధిపత్య వర్గాలను ఎదుర్కోగలమని కమ్యూనిస్టులు భావిస్తారు. కుల సమస్యను పరిష్కరించుకోవడానికి వర్గపోరాటం చేయాలని కమ్యూనిస్టులు సూచిస్తారు. కుల సమస్యకు మార్క్సిజమే అసలైన విరుగుడని నమ్మే అతివాద కమ్యూనిస్టులకు సురేష్ పాత్ర ప్రతినిధి.

‘పంచమం’ నవలలో సురేష్ పాత్ర చాల ముఖ్యమైన పాత్ర. ఈ పాత్ర మెరుపు వలె మెరిసి మాయమౌతుంది. రచయిత ఈ పాత్ర సృష్టించడంలో ఎంతో నేర్పును కనబరిచారు. సురేష్ పాత్రను క్షణ్ణంగా పరిశీలిస్తే పంచమం నవలలో ఉన్న పాత్రల అన్నింటిలో ఈ పాత్ర తక్కువ సమయమే కనిపించినా ఎన్నో విజయాలను సాధిస్తుంది. శివయ్య, పురుషోత్తం చేయలేని పనులను రచయిత సురేష్‌తో అమలు చేయిస్తాడు. తాను అనుకున్నది అమలు చేసి విజయం సాధించే వరకు సురేష్ పాత్ర నిద్రపోదు. ముల్లును ముల్లుతోనే తీయాలన్నది సురేష్ సిద్ధాంతం. క్రిష్టాపురంలో భూస్వాముల కర్కశత్వం, వారి దౌర్జన్యాలు చూసి చలించిపోతాడు. అందుకు తన జాతిని చైతన్యవంతం చేయాలని నిర్ణయించుకుంటాడు.

ఈ నవలలో సురేష్ కష్టపడే మనస్తత్వం కలవాడిగా కనిపిస్తాడు. గవర్నమెంట్ ఉ ద్యోగం కొరకు ఎదురు చూడక స్వచ్ఛంద సంస్థలో చేరి క్రిష్టాపురంలో పనిచేస్తాడు. అక్కడ సమస్యలను చూసి చెలించిపోతాడు. ముఖ్యంగా హనుమంతు తండ్రి మరణించినప్పుడు ఆ శవాన్ని గ్రామంలోనికి రానివ్వనప్పుడు పెత్తందారులను ఎదురించాలనుకునే మొండి ధైర్యం కలవానిలా కనబడతాడు. వారిని ఎదురించడానికి దళితులందరినీ చైతన్యవంతం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తాడు. ఏ నిర్ణయం తీసుకున్న దానిని అమలు చేసే చిత్తశుద్ధి గల మంచి వ్యక్తిగా కనిపిస్తాడు. అందుకే క్రిష్టాపురంలో సైకిల్ ర్యాలీ, దుర్గన్న హోటల్‌లలో రెండు గ్లాసుల పద్ధతికి వ్యతిరేఖంగా పోరాడాలని నిర్ణయం తీసుకుంటాడు. ఈ సందర్భంగా దళితులకు నష్టం వాటిల్లినప్పుడు యుద్ధ ప్రాతిపాదికపై వారికి ఇండ్లు కట్టించేటట్లు నష్టపోయిన వారికి తమ సంస్థ తరపున ఆర్థిక సహాయం వచ్చే విధంగా చేస్తాడు.

అణగారిన కులాల ఆర్తిని బాధితుల గుండెల్లో రగిలే ఆక్రోశాన్ని, జాతి దైన్యాన్ని

గుర్తెరిగిన సురేష్ తన జాతిని ఎన్నో విధాలుగా చైతన్యవంతం చేస్తాడు. అగ్రకులాల ఈసడింపులకు గురైతున్న తన జాతికి నైతిక బలాన్ని, ఆత్మస్థైర్యంతో ముందుకు పురోగమించే చైతన్యాన్ని సురేష్ ఇస్తాడు. దళితుల్లో ఆత్మగౌరవం, చైతన్యం తీసుకురావడానికి అగ్రకులాల వారిని ఏవిధంగా ప్రతిఘటించాలో తెలియ జేస్తాడు. పంచమం నవలలో దళితులపై నిజమైన ప్రేమ ఉన్న నాయకుడిగా, నాయకత్వ లక్షణాలు మూర్తిభవించినట్లుగా సురేష్ కనిపిస్తాడు. ' ఎక్కడ పీడన ఉంటుందో అక్కడ ప్రతిఘటన ఉంటుంది'. అన్నది కమ్యూనిష్టుల సూత్రం అయితే అది సురేష్‌కి వర్తిస్తుంది. సురేష్‌కి గాంధీ సిద్ధాంతాలంటే ఇష్టం ఉండదు. అందుకే శివయ్యతో ఒకసారి సురేష్ "నీ దంతా గాంధీగారి మతం, యేసు క్రీస్తు సిద్ధాంతం.... ఈ కాలానికి అవి పనికి రావు" (పు. 149) అంటాడు. సురేష్ నాస్తికుడిగా కనిపిస్తాడు. అందుకే శివయ్య "ఒకసారి సురేష్‌ని ఏమన్న నీవు దేవుడిని నమ్మవా!" (పు. 176) సురేష్‌కి నచ్చిన సిద్ధాంతం మార్క్సిజం, ఇంకా సూటిగా చెప్పాలంటే నక్సలిజం. ఇక్కడ రచయిత మార్క్స్ అంబేద్కర్ సిద్ధాంతాలను సురేష్ పాత్ర చేత చెప్పిస్తాడు. సురేష్‌తో నువ్వు నక్సలైట్‌వా అని అడిగినప్పుడు కమ్యూనిష్టుల సిద్ధాంతాన్ని అతనికి వివరిస్తాడు. "అమాయకపు .జనాన్ని నోరెత్తకుండా మసిపూసి మారేడు కాయ చేసిన కర్మ సిద్ధాంతానికి మూలం ఆస్తికత్వమే! అందుకే నాకు దేవుడంటే మంట! ప్రజలంతా సమాన స్థాయిలో సుఖశాంతులతో బ్రతుకుతూ ఉంటే ఏ దేవుడైనా ఎందుకప్పా!" (పు. 177) అని శివయ్యతో అంటాడు.

ఫ్యూడలిజం, అస్పృశ్యతల నివారణకు మార్క్సిజం అవసరమని సురేష్ భావిస్తాడు. తన జాతిని చైతన్యవంతం చేయాలంటే ఇలాంటి స్వచ్ఛంద సంస్థలలో ఉండకూడదనుకొని దళిత విముక్తికి నక్సలిజమే సరైన మార్గమని భావిస్తాడు. అందుకే శివయ్యతోటి "పేదల రాజ్యం కోసమే నా జీవితం అర్పించేస్తున్నాను. దళితులకు రాజ్యాధికారాన్ని ఇవ్వగలిగేది ఒక్క మా సిద్ధాంతమేనయ్య!" (పు. 179) అని దళిత సమస్య పరిష్కారానికి మార్క్సిజమే మార్గమని సురేష్ నక్సలైటుగా మారి అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోతాడు. ఈ నవలలో రచయిత దళిత సమస్యల పరిష్కారానికి అంబేద్కరిజంతోపాటు మార్క్సిజాన్ని ఏకం చేసి దళిత మార్కిజంతో ముందుకు వెళ్ళాలని సురేష్‌పాత్ర ద్వారా తెలియజేశాడు.

ఈ పాత్రను రచయిత వివిధ కొణాలనుండి ఎంతో నైపుణ్యంతో నేర్పుతో చిత్రీకరించాడు. తక్కువ నిడివితో కనిపించిన తాను అనుకున్నవని కార్యరూపంలో పెట్టి విజయం సాధిస్తాడు. సురేష్ పాత్ర ఈ నవలలో లేకపోతే వెలితిగా అనిపించి ఉండేదేమో. ఈ పాత్ర కృషి వల్ల దళితులకు గుడిసెలు పోయి పక్కాగృహాలు ఏర్పడ్డాయి. సురేష్ భాష గాని, అతని వేషధారణగాని చూడముచ్చటగా ఉంటుంది. శివయ్య మనస్సును మూడుగంటలలోనే మార్చగలిగినంతా మాటల చాతుర్యం కలిగినవాడు సురేష్, అందుకే పురుషోత్తం శివయ్యతో "నిజంగా గొప్పవాడేరా సురేష్ కొన్ని గంటలు నీతో మాట్లాడి కమ్యూనిజం అంటే ఆశక్తి చూపని నిన్ను కొన్నిగంటల్లోనే తన వైపుకు తిప్పుకున్నాడంటే బలే అసాధ్యుడురా" (పు. 181) అని అంటాడు. సురేష్ పీడిత, అణగారిన కుటుంబంలో పుట్టాడు. అతనిలో ప్రతిఘటించే అంతటి స్థాయికి ఎదిగాడంటే కులపీడనే అసలు కారణం. అదే తన ఆస్తిత్వాన్ని నిలబెట్టుకోవడం కోసం ఉద్యమించడానికి ప్రేరణ అయ్యింది. తన మానసిక వికాసాన్ని పెంపొందించుకోవడానికి దోహద పడింది. అణగారిపోతున్న తన జాతికి నైతిక బలాన్ని ఇచ్చేట్లుగా ఆత్మ విశ్వాసంతో పురోగమించే చైతన్యాన్ని ఇచ్చింది. దళిత సమస్యకి, అభ్యుదయ మార్గానికి మధ్య మార్గం విప్లవమని సురేష్ పాత్ర ద్వారా రచయిత తెలియజేస్తాడు.

**3.1.3.3.నారాయణప్ప – దళితుల ఆర్థిక స్వావలంభన కోసం భూమి:**

'పంచమం' నవలలో నారాయణప్ప పాత్రను రచయిత బిన్నమైన దృక్పథాలనుంచి

చిత్రించాడు. ఈ పాత్ర ప్రత్యేకమైనది. నవల మొదటినుండి చివరి వరకు కనిపించేపాత్ర. నారాయణప్ప కుల వివక్షత, అస్పృశ్యత, పేదరికం, మత మైఢ్యం వల్ల పడే బాధలకు, ఈసడింపులకు భయంకరమైన బానిసత్వానికి ఆగని అగచాట్లకు ప్రతీకగా నారాయణప్ప పాత్రకి జీవం పోశారు రచయిత. తరతరాల పీడనలో అణగారినతనంను అనుభవించినట్లుగా ఈ పాత్ర ద్వారా తెలియజేస్తుంది. నారాయణప్ప దళితుల కులపెద్దగా కనిపిస్తాడు. కథానాయకుడైన శివయ్యకు తండ్రి, భార్య పెద్దక్క తన కొడుకును అనంతపురంలో చదివిస్తాడు. ఆరె, రంపి తీసుకొని చెప్పులు కుట్టుకుంటూ జీవిస్తాడు. భూమి అంటే నారాయణప్పకి ఎంతో ప్రాణం. అందుకే ప్యాంటు షర్ట్ వేసుకొని ఎవరు కనిపించిన తనకు భూమి ఇప్పించమని ప్రాధేయపడుతూ ఉంటాడు. ఒకసారి మలేరియా డిపార్ట్‌మెంట్ ఉద్యోగితో 'సార్ మాకీ తరతరాలనుంచి జానెడు భూమికూడా లేదు సారు. ఆ భూమి పట్టా ఇప్పించి పుణ్యం కట్టుకొండి' (పు. 12) అని అడుగుతాడు. నారాయణప్పకి రైతు కావాలని ఎంతో ఆశ, వ్యవసాయమంటే ఎంతో మోజు. మాదిగోడంటే చెప్పులు కుట్టుకోవడమే జీవితంగా ఎందుకు ఉండాలి. మేము రైతులమయితాం అంటుంటాడు. కాబట్టి నారాయణప్పకి భూమంటే ఎంత ఇష్టమో అర్థం చేసుకోవచ్చు. ఇక నారాయణప్ప తప్పెట ఎంతో లయబద్ధంగా వాయిస్తాడు. ఎంత త్రాగినా తప్పెట వాయించుటలో లయతప్పదు. ఏ విధంగానైనా భూమి పట్టా సంపాదించాలనే పట్టుదల నారాయణప్పలో చివరి వరకు కనిపిస్తుంది. శంకరయ్య భూమిని దళితులకు పంచి ఇచ్చినప్పుడు ఆ భూమి పట్టాను చూసి మురిసి పోతాడు. తన తాతలకు, తండ్రులకి లేని భూమి తాను సంపాదించినప్పుడు అతడు చెప్పలేనంత ఆనందాన్ని పొందుతాడు. ఆ భూమి విషయం శివయ్యకు చెబుతూ ఇద్దొరా! భూమి పట్టా... ఇదేరా నేను సంపాదించిన ఆస్తి! నువ్వేరా దీనికి వారసుడివి అంటూ గర్వంతో ముసిముసి నవ్వులతో చెబుతాడు. అయితే ఆ ఆనందం ఎంతో కాలం ఉండదు. ఆ భూమి మీద మక్కువతోనే శివయ్యకు ఉద్యోగం వచ్చినప్పుడు అంతపురంలోని బంగ్లాకి రమ్మని నారాయణప్ప దంపతులను పిలిస్తే "తరతరాలుగా లేని భూమి వచ్చినప్పుడు దానిని విడిచి రాలేనని చెబుతాడు. దీనిని బట్టి దళితులకి భూమి మీద ఎంతటి మక్కువ ఉన్నదో రచయిత నారాయణప్ప పాత్రద్వారా తెలియజేశాడు.

నారాయణప్పలో కనిపించే మరో లక్షణం బానిసత్వం. భూస్వాముల పట్ల వినయ విధేయతలు కలవాడిగా, చాతుర్వర్ణ జీవన వ్యవస్థలో పంచముల జీవనానికి అణగారిన పీడన స్థితిని కనబరుస్తాడు. తమ కులం ఎలాంటిదన్న దానిగురించి చెబుతూ మేం హరిజనులము.... మేం తక్కువ కులమోళ్లమే గొంచికాడా! అని దీనంగా భయంగా మాట్లాడతాడు. అగ్రకుల భూస్వాములు మాలా మాదిగల ఇండ్లు తగల బెట్టి నానా విధాలుగా దళితులను హింసిస్తూ ఉంటే వారిని ఎదిరించే శక్తి ఉన్నా ఎలాంటి ధైర్యం లేక భయకంపితమైన స్వరంతో మీకు సేతులెత్తి మొక్కుతాను దేవుళ్ళారా! ఈడా అంతా మీ పున్నెమూ, కూలీ జేసుకొని, సెప్పులు కుట్టుకుంటూ ఇంతటి సంగటో సారికో తింటూ ఉంటాం. మీరు కన్నెర్ర జేయద్దండి సాములు! మీరు సూసేసూపులకే మాడి మసూపోయేవాళ్ళం. అని గద్గదమైన కంఠంతో దీనాతిదీనంగా మాట్లాడుతాడు. దీనిని బట్టి నారాయణప్పలో తరతరాల బానిసత్వ లక్షణాలు ఉన్నట్లుగా స్పష్టమవుతుంది. మరో విషయంలో హనుమప్ప తండ్రి మరణించినపుడు శవాన్ని ఊళ్ళోనుండి తీసుకెళ్తుంటే అగ్రకులాల వారు శవాన్ని ఊళ్ళోకి రానియ్యకపోతే నారాయణప్ప ఇలా అంటాడు. ' గొంచికాడా ! మీరు పెద్దోల్లు, మీరు అనాల్సిందే, మేము పడాల్సిందే! మీ కాళ్ళ దగ్గర పడి బతకందే మా బతుకు తెల్లారదు." ( పు.147) అని దీనంగా, వినయంగా, అణగారిన తనంతో ప్రాధేయపడతాడు.

శివయ్య ఉద్యోగం పోయినప్పుడు నారాయణప్ప ఎంతో బాధపడతాడు. అగ్రకుల

భూస్వాములు దళితులకి భూమిని ఇచ్చినట్లే ఇచ్చి ఆ భూముల్ని వెనక్కి తీసుకున్నారని తెలిసి ఎంతో కుమిలిపోతాడు. అప్పుడు కానీ నారాయణప్పకు అర్థం కాలేదు – ఈ దేశంలో ఎలాంటి ప్రభుత్వాలు వచ్చిన అగ్రకులాల వాళ్ళ గుప్పెట్లోనే సామాజిక వ్యవస్థ ఉంటుందనే విషయం అర్థమయ్యి అంతా ఉన్నోళ్ళకే నప్పా జరిగేది. ఈ రాజ్యంలో, లేనోళ్ళకు ఏందిలే. భూముల్ని తిరగదిప్పుకొనే దానికి ఎన్ని గొంతులన్నా కోత్తారు. ఎందరి ఉద్యోగాలన్నా ఊడగొడతారు అంటూ వాపోతాడు. చివరకి నారాయణప్ప వేదనల్లోంచి తన కుమారుడికి జరిగిన విషాద పరిణామాలు, భూమిపోయిన కన్నీటి రాపిడిలోంచి ఎన్నొ విధాల ఘర్షణాత్మక అనుభావాలనుంచి సాత్వికుడైన నారాయణప్ప ఒకప్పుడు భూములు పంచుతారన్న దండోర వేసిన ఆ డప్పుతోనే మార్పుకు సాంకేతికంగా దండోర వేసి దళితుల్లో భవిష్యత్ మీద ఆశ కల్పిస్తాడు. ఎట్టి ఎల్లప్ప భూములు దళితులు వదిలిపెట్టాలని దండోరా వేయాలని నారాయణప్పని అడిగినప్పుడు ఎంటికి రావల్లరా! మాకిచ్చిన భూముల్ని తిరిగి వెనక్కి తీసుకునేందుకు నేను దండోరా వేయాలా నేను రానని ఆర్.ఐ సార్‌కి చెప్పుకో పో! అంటూ ధైర్యంగా చెబుతాడు. ఇన్ని రోజులు అణగి మణగి, ధీనాతి ధీనంగా ఉన్న నారాయణప్పలో ఎదిరించే ధైర్యం వచ్చింది అందుకే తన డప్పు తీసుకోని దళితులందరిని చైతన్యవంతం చేయడానికి దళితులందరు ఒకటిగా పోరాటాలు చేయాలని నారాయణప్ప "మహాజనులారా! మీకు తెలిపేదేమిటంటే పొద్దున్నే శివలింగం కింద గవర్నమెంటోళ్ళు తీసుకోని పేదోళ్లకి పంచి పెట్టుండే భూమిని తిరిగి శంకరప్ప గొంచికానికే సోదీనం జేసినారని ఉత్తర్వులు ఇచ్చినారు. ఆ భూమిని పొందిన పేదోళ్లంతా దాన్ని ఒక్కటిగా బేఖాతరు చేయండహో!" (పుట. 274) అంటు నారాయణప్ప అణగిఉన్న నిస్సహాయత్వంలోంచి తిరుగుబాటుని ఎన్నొ సంవత్సరాలుగా దళితులపై జరిగే అన్యాయానికి ఆక్రోశంగా తిరుగుబాటు చేయాలని వీధి వీధినా తిరిగి తప్పెటతో దండోరా వేస్తూ తన జాతి యావత్తు చైతన్యంతో ఉత్తేజితులను చేయడానికి నారాయణప్ప ముందకు పోతున్నాడు.

చిలుకూరి దేవపుత్ర నారాయణప్ప పాత్రని తరతరాలు పీడనలో మగ్గి అణగి మణగి ఉన్న పాత్రగా చిత్రించి తాను అనుభవించిన అణగారినతనంలోని న్యూనత నుండి బయటపడి తిరుగుబాటు తత్వాన్ని అలవరచుకోని తన జాతి గుండెల్లో బానిసత్వాన్ని రూపుమాపడానికి తప్పెట మోగించే విప్లవ శక్తిగా నారాయణప్ప పాత్రను మలచటంలో రచయిత ఎంతో నేర్పును కనబరిచారు.

### <u>3.1.3.4. పురుషోత్తం – ప్రగతిశీల మానవతావాదం:</u>

మానవతావాదం మనిషిని గుర్తించి, అతనిపట్ల సానుభూతిని చూపుతుంది. ప్రగతిశీల మానవతావాదం సమసమాజాన్ని ఆకాంక్షిస్తూ, పేదలతో కలిసి పనిచేస్తుంది. పేదల కోసం పోరాడుతుంది. మనిషి అనే గుర్తింపు కోసం పాకులాడటం కాకుండా, తనకు మానవ హోదా లేకుండా చేసిన ఆధిపత్యవర్గం మీద పోరాటానికి దిగుతుంది. చివరకు తాను జన్మించిన వర్గం మరియు కులాన్ని కూడా ధిక్కరించే గుణాన్ని కలిగివుంటుంది. అయితే, ప్రగతిశీల మానవతావాదం అతివాద ధోరణులకు దూరంగా ఉంటుంది. పరోపకారం, నిస్వార్థం, త్యాగం వంటి ఉత్తమ గుణాలతో పేదల కోసం పోరాడే ఒక పాత్ర 'పురుషోత్తం'. తన పరోపకారమే జీవనంగా కలిగి, ధనం కన్న ప్రేమాభిమానాలు గొప్పవని చాటిచెప్పి స్నేహానికి, సహాయానికి కులం అడ్డురాదని నిరూపించిన పాత్ర పురుషోత్తం. లెక్చరర్‌గా తన వృత్తి ధర్మాన్ని అనుభవిస్తు మానవతా విలువలతో మంచివ్యక్తిత్వం ఉన్న వ్యక్తిగా కనిపిస్తాడు. పురుషోత్తం పాత్రను పూర్తిగా పరిశీలిస్తే అతను ప్రదర్శించే చైతన్యం, అతనిలో ఉండే సంఘసంస్కరణల భావాలు తెలియవస్తాయి. ఈ పాత్ర అభ్యుదయ భావజాలానికి ప్రతీక. వానిదంతా అభ్యుదయ మార్గం

కదేమప్పా అని ఒకసారి సీతారామప్ప అంటాడు. ఈ పాత్ర అతిముఖ్యమైన సన్నివేశాలలో కనబడుతుంది. బడుగు బలహీన వర్గాలలో మానసికి చైతన్యాన్ని, ధైర్యాన్ని, సమైక్య పోరాటాలను నేర్పించే పాత్రగా పురుషోత్తం కనిపిస్తాడు. పోరాటాలు దాని శక్తి సామర్ధ్యాలను వివరించి వారిలో ఉండే న్యూనతా భావాలను తీసివేసి వారికి సహాయం చేస్తుంటాడు. కుల మతాల మధ్య ఉండే అంతరాలు తొలగించడానికి వారిలో పోరాట మటిమను పెంపొందించడానికి కృషి చేస్తాడు.

కిష్టాపురంలో పురుషోత్తం కూడా ఒక అగ్రకులస్తుడే. పురుషోత్తం రెడ్డి కులస్తుడైనా అతనిలో ఎటువంటి కులాధిక్య భావం కనిపంచదు. దానికి కారణం హైస్కూల్ చదివే రోజుల్లోనే శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు ఎన్నో ప్రాపంచిక విషయాలు బోధించాడు. అవి పురుషోత్తాన్ని మార్చి వేసి అతని భావాలు కూడా విశాలమవుతాయి. శివయ్య గ్రూఫ్ వన్ ఆఫీసర్ అవ్వడానికి ఎంతో ప్రోత్సాహం ఇచ్చాడు. ఒక రకంగా చెప్పాలంటే శివయ్య జీవితాన్ని తీర్చిదిద్దాడు. దళితులు న్యూనతా భావాన్ని విడనాడితే తమను తాము ఉద్ధరించుకోగలుగుతారని అతని అభిప్రాయం. పురుషోత్తం అంటే శివయ్య దృష్టిలో ఎన్‌సైక్లోపిడియా. అతనికి తెలియని విషయాలు ఈ ప్రపంచంలో ఉండవని శివయ్య దృఢ అభిప్రాయం. అందుకే ఒకసారి సీతారామప్ప శివయ్యను తిడితే తన లోతైన మాటలతో కులవ్యవస్థ గురించి వివరిస్తాడు. మంచి ఎక్కడ ఉన్నా చైతన్యం ఏ రూపంలో ఉన్నా దాన్ని టక్కున పసిగట్టి, తనవంతు సహాకారాన్ని అందించడంలో పురుషోత్తం ముందుంటాడు. అందుకే శివయ్యకు తనకు ఎటువంటి సంబంధం లేకపోయిన ఉద్యోగ పరీక్షల ఫీజులు కడుతూ పుస్తకాలు కొనిస్తూ, తిండి తిప్పలకు సహాయం చేస్తాడు. వీరిద్దరి మధ్య స్నేహానికి ప్రేమకి అతీతమైన ఆత్మబంధుత్వం ఉంటుంది. పురుషోత్తం ఆధునిక భావజాలానికి ప్రతీకగా కనిపిస్తాడు. కుల, మత, వర్గ, లింగ బేధాలు లేకుండా అందరు కలసి మెలసి జీవించాలని భావిస్తాడు. చాకలి ఓబన్న సీతారామప్ప మనవరాలిని ప్రేమించాడని చంపిస్తే చూడటానికి వాళ్ళ దగ్గరకు వెళ్ళినప్పుడు ఎక్కడా నేను ఎక్కువా కాదు. మీరు తక్కువా కాదు. గౌరవిస్తే నన్ను గౌరవించండి గానీ నా కులాన్ని గౌరవించవద్దు అంటాడు.

పురుషోత్తానికి వివిధ ప్రజా సంఘాలతోటి పరిచయం ఉంటుంది. ఈ పాత్రను రచయిత వివిధ కోణాలనుండి చిత్రీకరించాడు. హక్కుల రక్షణ సమితికి మూల స్థంబాల్లాంటివాళ్ళు. శంకర్, ఆనందబాబు, వలీకి హోటల్‌లో పురుషోత్తం పరిచయం అవుతారు. భావసామ్యం ఉండటం వల్ల అతితక్కువ కాలంలోనే వీరు మంచి మిత్రులౌతారు. వీళ్లంతా మార్క్సిజం మీద మంచి పట్టు ఉన్న వాళ్ళు. చాకలి ఓబన్న హత్య గురించి నిశ్చితంగా పరీశీలింపచేసి చాకలి వారితో ధర్నాలు చేయించి ఓబన్న కేసుకు పరిష్కార మార్గాన్ని చూపిస్తారు. అదే విధంగా కొత్తపల్లి లాకప్ డేత్ కేసులో ఎల్లప్ప మరణానికి కారణం అయినవాడిని సస్పెండ్ చేయిస్తారు. ఎల్లప్ప కుటుంబానికి లక్షరూపాయలు ఎక్స్‌గ్రేషియా వచ్చే విధంగా చేస్తాడు. పురుషోత్తం పాత్ర చైతన్యానికి ప్రతిరూపంగా ఉంటుంది. సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి చివరివరకు ప్రయత్నించినట్లుగా కనిసిస్తాడు. రచయిత ఈ పాత్ర ద్వారానే మైనారిటి వాదం, స్త్రీవాదం, దళితుల ఉరిశిక్ష కేసులు మొదలైన విషయాలు చర్చల రూపంలో వివరిస్తాడు.

ఒకసారి శివయ్య సురేష్ చెప్పిన మాటలను విని నక్సలైట్‌గా మారతానంటే పురుషోత్తం ఆశ్చర్యపోయి ఒరేయ్ శివా! నువ్వు అటు ఉద్యమంలోకి వెళ్ళినా సరే లేదంటే బాగా చదువుకుని నీ జాతికి తోడ్పడినా నేను సంతోషిస్తాను. ఎటూకాకుండా పోతే నీను ఊరుకోలేను అని బాధ పడతాడు. శివయ్య గ్రూఫ్ వన్ ఆఫీసర్ అయినప్పుడు మనస్ఫూర్తిగా అభినందిస్తాడు. నువ్వు అనుకున్నది సాధించావురా! అయితే నాకు అంత తృప్తిగా ఏం లేదు. నువ్వు ఐ.ఏ.యస్

ఆఫీసర్ కావాల్ల. అదే నీకు లక్ష్యం కావాల్ల. ఇది నీకు మొదటి మెట్టు అని కర్తవ్యాన్ని బోధిస్తాడు. సీతారామప్ప, శంకరయ్యల మోసాన్ని ఎప్పటికప్పుడు బయట పెట్టడానికి ప్రయత్నిస్తూంటాడు. వీరి విషయంతో జాగ్రత్తగా ఉండాలంటు శంకరయ్య భూమిని రీకన్వే కేసు, దళితుల ఇళ్ళు తగల బెట్టిన కేసునని మాఫీ చేసే విషయం నువ్వు రాజీ పడొద్దు.... ఒక వేళ వ్యతిరేకించాల్సి వస్తే మాత్రం నిర్మొహమాటంగా వ్యతిరేకించు అని చెబుతాడు. చివరకి శివయ్యను సస్పెండ్ చేసిన విషయం తెలిసి కదలిపోతాడు. సీతారామప్ప శంకరయ్యల మీద మండిపడతాడు. శివయ్యను ఓదార్చి కొండంత ధైర్యాన్ని ఇస్తాడు. ఈ నవలలో శివయ్య పాత్రలో ఉన్న న్యూనతను తొలగించడానికి అడుగడుగున అతనికి కర్తవ్యాన్ని బోధించే వ్యక్తిగా పురుషోత్తం పాత్ర కనిపిస్తుంది.

### 3.1.3.5. సీతారామప్ప, శంకరయ్య – ఆధునిక మనువాదం:

మనువాదం ఆధునిక సమాజంలో అన్ని సాధనాలను ఉపయోగించుకుంటుంది. తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అది చట్టాన్ని అవహేలన చేస్తుంది. రాజ్యాంగ యంత్రాంగాన్ని తనకు అనుగుణంగా మలుచుకుంటుంది. మనువాద వ్యవస్థలోని అగ్రకులాలకు చెందినవారికే రాజ్యాంగ యంత్రాంగంలో కీలక స్థానాలను అప్పగిస్తుంది. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలోని కిందికులాలకు రాజ్యాంగం వల్ల కొన్ని హక్కులు లభిస్తే, వాటిని ఆయా వర్గాలకు దక్కకుండా చేస్తుంది. హక్కులు, అధికారాలే కాదు, కనీస గౌరవం, భద్రత,గుర్తింపు వంటివి కిందికులాలకు ఉండరాదని ఆధునిక మనువాదం నమ్ముతుంది. అలాంటి భావాలకు ప్రతినిధులే సీతారామప్ప, శంకరయ్య పాత్రలు. అగ్రకులమనే అహంకారం, అధికారం తమదేనన్న గర్వం. అడుగడుగున పెత్తందారితనంతో దళితులని తమ పాదాల కింద తొక్కి వేటాడి, వెంటాడి అణచివేసే పాత్రలుగా పంచమం నవలలో వీరిద్దరు కనిపిస్తారు. దళితుల పట్ల భారతీయ సమాజానికి అలవాటు అయిన ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థను తమ శరీరంలో జీర్ణించుకున్న తత్వానికి ప్రతీకలు వీరు. కులాధిక్యతను కలిగి ఉండటంలో ఏవరికి ఏవరు తీసిపోరు. భూస్వాముల పెత్తందార్లు కుటిల రాజకీయాలతో దళితులను ఏవిధంగా అణగ ద్రొక్కుతున్నారో తెలియజేసే పాత్రలు.

కిష్టాపురంలో పలుకుబడి ప్రధానంగా సీతారామప్ప, శంకరయ్య చేతిలో కేంద్రీకృతమై ఉంటుంది. సమాజాన్ని విభజించి గ్రామాన్ని కులాలుగా విడదీసి వీరు శాసిస్తుంటారు. అక్కడ వాళ్ళు చెప్పిందే వేదం, చేసేదే న్యాయం. వారిని ప్రతిఘటించే వారిని ఏమైనా చేయడానికి వెనకాడని పాత్రలుగా కనపడతారు. సీతారమప్ప, శంకరయ్యలు ఒకరిని మించినవారు ఒకరు. సీతారామప్ప బొట్టు పెట్టుకొని వేదాంతిలాగ కనిపించే పరమ క్రూరుడు. శంకరయ్య వంటి మనుషులని నమ్మడం కష్టమని పురుషోత్తం అభిప్రాయం. సీతారామప్ప అన్నా, అతని మాటన్నా శంకరయ్యకి ఎంతో నమ్మకం. ఎంతో మందిని మోసం చేసి సంపాధించిన భూమిలో 30 ఎకరాలు ల్యాండ్ సీలింగ్ క్రింద ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంపమని ఆర్డర్ వస్తుంది. అప్పుడు ఏదో కోల్పోయినట్టు దేనినుంచో దూరం అయిపోయినట్టు తన భూమి తన కల్లముందే అదృశ్యం అయిపోయినట్టు బాధపడి మాల మాదిగల పట్ల ఈర్ష్యా ద్వేషాలతో నిండిపోతాడు. అందుకే ఒకసారి " అసలు మీరంటే ఎవ్వర్రా! ఆ గవర్నమెంట్ నా కొడుకులకి దత్త పుత్రులు రా.... దేశంలో ఏ మేలన్నా జరగనీ, ఏ న్యాయమన్నా జరగనీ మీ మాల మాదిగ నాయండ్లకేరా జరిగేది" (పు. 38) అని అంటాడు.

పేదలకి భూమి పట్టాలు ఇచ్చినప్పుడు ల్యాండ్ సీలింగ్ ట్రిబ్యునల్‌కి పోయి ఆ భూమిని వెనక్కి తీసుకునే ప్రయత్నాలు చేస్తారు. అంతేకాక దళితుల దగ్గర కొంత డబ్బునుకూడా తీసుకుంటారు. ఈ పాత్రలు మొదటినుండి చివరి వరకు దళితులని అణచివేసినట్లుగానే

కనిపిస్తాయి. అధికార పార్టీ అండదండలతో శంకరయ్య గ్రామ సర్పంచ్‌గాను, సీతారామప్ప మండల ప్రెసిడెంట్‌గాను దొంగ ఓట్లతో ఎన్నికవుతారు. సీతారామప్ప మనవరాలు రుక్మిణిని చాకలి ఓబన్న ప్రేమించాడని తెలిసి సీతారామప్ప వయస్సుతో పాటు సల్లబడిపోతున్న అతని నెత్తురు సలసల మరిగిపోయి కుల అహంకారంతో పేటనుండి మనుషులను తెప్పించి ఓబన్నను చంపిస్తాడు. మాల మాదిగలు హోటల్‌ల్లో స్టీలు గ్లాసులలో 'టీ' అడిగారని తెలిసి వారిపై నిప్పులు కక్కి, వారిని కొట్టించి, వాళ్ళ ఇండ్లు తగలపెట్టిస్తారు. హనుమంతు తండ్రి శవాన్నికూడా ఊరిలోకి రానివ్వకుండా అడ్డుకుంటారు. ఈ ఘోరాలన్ని అధికార బలంతోనే వాళ్ళు చేస్తుంటారు. ఇలా ఎన్ని ఘోరాలు చేసిన అధికారపార్టీ అండతో అరెస్ట్ కాకుండా బయట పడతారు. ఇలా ఎలా జరిగిందని పురుషోత్తం ప్రశ్నించినప్పుడు సీతారామప్ప మన మాట ఎవరింటారురా! అంతా ఇది పిల్లనాయాళ్ళ గలాటా అని గొడ మీద పిల్లిలా మాట్లాడతాడు.

అగ్రకులానికి చెందిన శంకరయ్య, సీతారామప్పలకు కింది కులాలను అణచివేయడమే ధ్యేయం. రచయిత భూస్వామ్య వ్యవస్థలో కనిపించే అవలక్షణాలన్నీ వీరిలో కనిపించేటట్లుగా చిత్రీకరించాడు. శివయ్యను అణచివేసిన, సురేష్‌ను ఆ ఊరినుండి బయటకి పంపడానికి ప్రయత్నం చేసినా వీరే ప్రధానంగా కనిపిస్తుంటారు. శివయ్య ఆఫీసర్ అయినప్పుడు తమ పలుకుబడితో అతను అడగకుండానే అనంతపురం డివిజన్‌కి పోస్టింగ్ ఇప్పిస్తారు. శివయ్య దళితుడు కాబట్టి తమ కాళ్ళ క్రింద అణగిమణగి ఉంటాడనుకొంటారు. వారు చేసే పనులకు ఎటువంటి అడ్డంకులు ఉండవని, తమపై ఉన్న కేసులన్ని మాఫీ చేయించుకోవచ్చని అనుకుంటారు. కానీ శివయ్య వారి మాట వినకపోయే సరికి రూ. 50వేలు లంచం తీసుకున్నాడని ఏసీబి అధికారులకు పట్టించి అతని ఉద్యోగంనుండి సస్పెండ్ అయ్యేటట్లుగా చేస్తారు. తర్వాత కొత్త ఆర్డీవోని వేయించుకోని తమ పై ఉన్న కేసులను ఎత్తివేయించి, దళితులకి పంచిన శంకరయ్య భూమిని రీకన్వే చేయించుకుంటారు. వీరి యొక్క కులహంకారం, మితిమీరిన ధనాశ, విపరీతమైన స్వార్థం వల్ల ఎంతటి ఘోరానికైన వెనుకాడని ఇలాంటి పాత్రలు అన్ని కాలాల్లోను కనిపిస్తాయి. కులం, డబ్బే సర్వస్వం. వాటితో ఏమైనా సాధిస్తామనే ధోరణి కలిగి అధికారాన్ని, పదవులను సహితం తమ సొంతం చేసుకొగలిగిన పాత్రలుగా రచయిత చిత్రీకరించారు.

### <u>3.1.3.6. పద్మ – మధ్యతరగతి ఆకాంక్షలు:</u>

కుల వ్యవస్థలో కూడా మధ్యతరగతి ఒకటి పుట్టుకొచ్చింది. మధ్యస్తకులాలే మధ్యతరగతిగా పరిణామం చెందాయి. శూద్రులలో పురుడుపోసుకున్న ఈ మధ్యతరగతి ఆలోచనలన్నీ అవకాశాలు అందిపుచ్చుకోవటం, సుఖంగా బతకీడ్వటమనే ఆశలతో జీవిస్తుంటుంది. జీవితం మీద ఎన్నో ఆశలుంటాయి. వాటిని నిజం చేసుకొనే కృషి కూడా వుంటుంది. అయితే, వ్యవస్థలోని దోపిడీ వల్లనే మధ్యతరగతి ఆశలు నెరవేరట్లేదనే సత్యం చాలా ఆలస్యంగా బోధపడుతుంది. యధాస్థితి వ్యవస్థతో తలపడే శక్తులుంటే, ఆ శక్తులతో కలిసిపోతాయి. అవసరమైతే, అలాంటి ఉద్యమాలకు నాయకత్వం వహించేంత ఆసక్తినీ, ఘర్షణా వైఖరినీ చూపిస్తాయి. అలాంటి ప్రత్యేకమైన పాత్ర పద్మ.

'పంచమం' నవలలో పద్మ పాత్ర ప్రత్యేకమైనది. ఈ పాత్ర నవలలో తక్కువ నిడివిలో ఉన్నప్పటికీ మొదటి నుండి చివరి వరకు కనిపిస్తూనే ఉంటుంది. మధ్యతరగతి యువతుల మానసిక ప్రవృతికి, వారి ఆలోచన విధానాలకు, సామాజిక కుటుంబ కారణాలు ఏ విధంగా విఘాతం కలిగించి వారిని సంక్షోభానికి గురి చేస్తాయో పద్మ పాత్ర ద్వారా తెలియజేశారు. రచయిత పద్మ పాత్రను గౌరవ ప్రదంగా తీర్చిదిద్ది ఆత్మవిశ్వాసం గల వనితగా రూపొందించి మానవతా విలువలు కలిగిన పాత్రగా చిత్రీకరించి ఒక విశిష్ట లక్షణాలు కలిగిన మధ్యతరగతి

మహిళగా చిత్రీకరించాడు. పద్మ పాత్ర మార్పుని స్వీకరిస్తున్నట్లుగా తోస్తుంది. మొదట్లో కుటుంబం, పెరిగిన వాతావరణ పరిస్థితుల ప్రభావంతో మూఢనమ్మకాలు అస్పృశ్యతను పాటించిన పాత్రగా కనిపిస్తుంది. అందుకే మొదటిలో శివయ్యను వాళ్ళ ఇంటిలోకి రానిచ్చేది కాదు. వాళ్ళ అమ్మ సత్తు గ్లాస్‌లో కాఫీ ఇస్తుంటే "వాడు మాదిగోడు ఆ సిల్వర్ గ్లాసులో గంగ ఎందుకియ్యాల. మల్లా ఆ గ్లాసుని ఇంట్లోకి తెచ్చుకునేదేనా" (పు. 128) అని వాళ్ళ అమ్మతో అంటుంది. ఆ తర్వాత పట్నంలో చదువుకోవటం వల్ల తన ఆలోచనలో మార్పు వస్తుంది. మంచి సౌశీల్యానికి, మంచితనానికి, మర్యాదకు, ప్రతీకగా మలిచాడు. తనలో వచ్చిన మార్పుతో వాళ్ళ అమ్మ శివయ్యకు సత్తు గ్లాసులోను, పద్మకు స్టీలు గ్లాసులో కాఫీ ఇస్తే "మా యమ్మ ఎప్పటికి మారుతుందో ఏమో నప్పు! ఇంకా కులాలు, మతాలు అనుకుంటే ఎట్లా శివయ్యా!" (పు. 28) అని అంటుంది. కానీ వాళ్ళ ఇంటి వాతావరణాన్ని, వాళ్ళ  అమ్మను మార్చాలనే ప్రయత్నం చేయలేదు.

పద్మ ముఖ్యమైన సన్నివేశాలలో విలువైన నిర్ణయాలు తీసుకుంటుంది. ఏ నిర్ణయం తీసుకున్నా తాను స్వతంత్రంగానే తీసుకుంటుంది. పద్మ మంచి తెలివి కలిగినది. చదువంటే పద్మకి ఎంతో ఇష్టం. వాళ్ళ నాన్న స్కూల్ మానిపించినప్పుడు ఎంతో బాధ పడుతుంది. శివయ్యకి స్టీలు గ్లాస్‌లో కాఫీ ఇచ్చి తాగమంటే శివయ్య తాగకపోతే "శివయ్య .... నువ్వు నిజంగా మాదిగ కులంలో పుట్టినాను అనిపించుకున్నావప్పా! తరతరాలుగా అణగారిపోయిన జాతి లక్షణాలు ఉన్నాయి పాపం నీలో, నువ్వైనా ఏం చేస్తావ్?" (పు. 58) అంటూ దెప్పి పొడుస్తుంది. పద్మ తనకంటే తక్కువ కులస్థుడైన శివయ్యను ప్రేమిస్తుంది. తన ప్రేమను శివయ్య అంగీకరించకపోతే చాలా బాధపడుతుంది. తన ప్రేమను స్వీకరించకుండా శివయ్య తనకు అన్యాయం చేశాడన్న బాధకంటే శివయ్య పిరికితనమే బాధించింది. సమాజం హీనంగా చూడబడుతున్న తక్కువ కులానికి చెందిన శివయ్యను ప్రేమించడానికి ఆస్థి, అందం చూడలేదు. మంచి మనస్సుఉన్నశివయ్యను ప్రేమించింది. అతను తన ప్రేమను అంగీకరించకపోయినా శివయ్య ప్రవర్తనతో లోకం యొక్క తీరు తెన్నులను కొంత వరకు అంచనా వేసుకోగలిగింది. అందుకే పద్మకి ఇష్టం లేకపోయిన తల్లిదండ్రుల ఇష్ట ప్రకారం టి.బి. రోగిని పెళ్ళాడింది.

పద్మపాత్ర ఒక రకంగా మానవులలో అణగారిపోయిన విలువలకు, మానవతకు, ప్రేరణగా నిలుస్తుంది. శివయ్య తన ప్రేమను కాదనినా, తనను ఆదరించకపోయినా, శివయ్య గౌరవంగా చూచే ఆదర్శ పాత్రగా రచయిత చిత్రీకరించాడు. తన భర్త మరణించినప్పుడు చిన్న పిల్లలాగా దు:ఖిస్తుంది. శివయ్యకి ఉద్యోగం పోయిందని తెలిసి ఎంతో బాధపడుతుంది. అందుకే శివయ్యను ఓదారుస్తూ ఏంది శివయ్య నువ్వే ఇంత డీలా పడిపోతే  ఎట్లా? అంటుంది.

నవల  ముగింపులో పద్మ శివయ్య దగ్గరకి రావడం ద్వారా త్వరలోనే వీరు ఒకటవుతారనే విషయం సూచన ప్రాయంగా రచయిత తెలియజేశాడు. చివరిలో పద్మ మాదిగ గేరి శివయ్యతో కలిసి వస్తుంది. అక్కడ భూమి పోగొట్టుకున్నారని తెలిసి వారంతా బాధపడుతుంటే ఎట్టి ఎల్లప్ప నారాయణప్పని దండోరా వేయడానికి రమ్మని పిలుస్తుంటే పద్మ చూస్తూ ఉ ండలేకపోయింది. అందుకే "పోప్పా, రాదుపో, ఏం జేసుకుంటాడో చేసుకోమను మీ ఆరై సారుని.. ఆ భూమిని బీదోళ్ళెవరూ ఇడిచిపెట్టరని చెప్పుపో!" (పు. 273) అంటుంది. అలాంటి సమయంలో అణగారిపోయి ధీనంగా ఉన్న దళితుల గుండెల్లో ఆక్రోశాన్ని, తిరుగుబాటు తత్వంతో ఉండాలని అంటుందీ పాత్ర.  మొదట్లో సాంప్రదాయ బద్ధంగా ఉండి, చివరిలో సాంప్రదాయాలను బద్దలు కొట్టుకోని ఎదిగిన పాత్రగా కనపడుతుంది.

**3.1.3.7. విద్య – అగ్రకుల మహిళ చైతన్యం:**

ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని గురజాడ అన్నాడు. ఆధునిక అగ్రకుల స్త్రీ ఆ పని చేయటానికి సిద్ధపడింది. అగ్రకుల మహిళ తన చైతన్యాన్ని స్పష్టంగా వ్యక్తీకరించే సందర్భాలున్నాయి. ఆధునిక సమాజ పోకడలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, ఇతర కులాలకు చెందిన స్త్రీలకు నాయకత్వం వహించటమనే బాధ్యతను మోస్తూ ఉంటారు. అలాంటి గుణాలున్న పాత్ర 'విద్య'. ఉదారవాద గుణంతో అందరి గురించి బాధ్యతగా ఆలోచించి, పనిచేసే పాత్ర విద్య. పంచమం నవలలో విద్య పాత్ర మధ్యలోనే వచ్చి మధ్యలోనే మాయం అవుతుంది. అయినా ఈ పాత్ర చాలావరకు పాఠకులని కదలిస్తుంది. స్వచ్ఛమైన ప్రవృతి, ఆత్మగౌరవం, స్వాభిమానం కలిగిన పాత్రగా కనిపిస్తుంది. ఈ నవలకు ఆకర్షణ కేంద్రం, ఆదర్శం, విద్య పాత్ర. జీవితంలో తీపి జ్ఞాపకాలు, చేదు నిజాలు, అవమానాలు, మన్ననలు, అందుకున్న పాత్ర. విద్య అగ్రకులంలో పుట్టినా ఎలాంటి పట్టింపులు లేని పాత్ర. క్రిష్ణశాస్త్రీకి తన చెల్లి అంటే ప్రాణం. నిత్య చైతన్యంతో తనదైన పద్ధతిలో ప్రవర్తించే ఆధునిక మహిళకు ప్రతిరూపం. విద్యకు సంగీతమన్నా, ఆధునిక సాహిత్యమన్నా ఇష్టం. విద్యకు ఆక్యూప్రెషర్ వైద్యం అంటే ప్రాణం. స్త్రీలు చైతన్యంతో ముందుకు రావాలంటూ ఎప్పుడు స్త్రీలను గౌరవిస్తుంది. ఈ మగజాతి అంటూ ఉంటుంది. శివయ్యతో స్నేహంగా ఉంటూ, ఆయన ఇంటికి వచ్చినప్పుడల్లా గలగలా మాట్లాడేది. మహిళలకు ఆదర్శ ప్రాయమైన స్నేహితురాలు పాత్రలో విద్య ఈ నవలలో కనిపిస్తుంది. విద్య పాత్రను రచయిత స్త్రీల అణచివేతలకు ప్రతీకగా చిత్రించాడు. మొదట్లో ఎన్నో తెలివి తేటలుండి, ఎంతో చలాకీగా, లేడిపిల్లలా గంతులు వేసే విద్య పెళ్ళైన తరువాత ఆమెలో ఎంతో మార్పు వచ్చింది. అందుకే శివయ్యతో 'ఈ దేశంలో ఆడది ఆడదే ఎన్ని మాట్లాడినా' అని అంటుంది.

స్త్రీల మనోభావాలను గమనించకుండా పెద్ద వాళ్ళు ఇష్టం లేని సంబంధాలు తీసుకురావడం, ఆ సమయంలో వారి మనో భావాలు గాయపడటం అనేది తరతరాలుగా కొనసాగుతూనే ఉంది. దళితులతో పాటు స్త్రీలు కూడా అణచివేయడుతున్నారన్న సామాజిక అంశాన్ని చెప్పడానికి రచయిత ఈ పాత్రను ఎన్నుకున్నారు. విద్య పెళ్లి కాకముందు ఎంతో సంతోషంగా ఉండేది. పెళ్ళి అయిన తరువాత పురుషాధిక్యతతో ఆమె జీవితం పూర్తిగా మారిపోయింది. పురుషులు పెళ్లి కాకముందు బాగానే ఉంటారని శివయ్యకు చెబితే "ఆయనకు అనుమానం పిచ్చి... దేశంలో ఉన్న మగవాళ్ళు అందరూ నన్ను కావాలని తాపత్రయ పడుతుంటారని ఆయన నమ్మకం. పెళ్లియ్యే వరకు ఎంతో బాగున్న మనిషి పెళ్ళయిన మరుసటి రోజునుండే ఇలా తయారయ్యాడు." (పు. 198) అని అంటుంది. రచయిత విద్యను ఆధునిక స్త్రీగా చిత్రించి, వివాహ బంధంవల్ల, సాంప్రదాయ కుటుంబ పరిస్థితుల వల్ల గృహిణిగా విద్య పాత్రను కుదించారు. ఎన్నో ఆశయాలు, ఎన్నో సిద్ధాంతాలు, ఎన్నో నమ్మకాలు ఉన్న విద్య చివరకు ఏమి చేయలేని నిస్సహాయతలో పడిపోతుంది. అందుకే ఎంతో అభివృద్ధి చెందుతున్న దేశంగా చెప్పుకుంటున్న మన దేశంలో నేటికి స్త్రీలు అణచివేయబడుతున్నారని విద్య పాత్ర ద్వారా రచయిత తెలియజేశాడు.

### 3.2.3. పంచమం నవలా విశ్లేషణ:

దళితుల అభివృద్ధి, విముక్తికి ఏది మార్గం అని పంచమం నవల అన్వేషిస్తుంది. శివయ్య పాత్ర ద్వారా రచయిత దళితుల్లో వస్తున్న మార్పును చిత్రించాడు. అయితే, తన సమస్యకు పరిష్కారం ఏమిటో శివయ్యకు కూడా బోధపడలేదు. శివయ్యకు ప్రగతిశీలవాది అయిన పురుషోత్తం, కమ్యూనిస్టు భావాలతో పనిచేసే సురేష్ పట్ల ఎంతో గౌరవం. ఈ రెండు పాత్రలను చైతన్యానికీ, ప్రతిఘటనకు ప్రతినిధులుగా రచయిత చిత్రించాడు. నిజానికీ, రచయితకు వామపక్ష ఉద్యమాల పట్ల ఎంతో సానుభూతి వుంది. దళిత ఉద్యమాల పట్ల కొన్ని

అనుమానాలున్నాయి. అందుకే, రచయిత దృష్టి అంబేద్కరిజం వైపు వెళ్లలేదు. శివయ్య ఉన్నతోద్యోగి అయినా ఎందుకు నిస్సహాయుడయ్యాడో రచయితకే ఎరుకపడలేదు. ఉపముఖ్యమంత్రి దళితుడైనప్పటికీ తన ప్రజలకు ఎలాంటి ఎపయోగం లేదని రచయిత ఆ పాత్ర చేతనే చెప్పిస్తాడు. రచయిత రెండు ముఖ్యమైన విషయాలను చర్చకు పెట్టాడు. దళితులు విద్యావంతులైతే సమస్య పరిష్కారం సిద్ధిస్తుందనే వాదన నిజమే అయితే, శివయ్య ఉన్నత విద్యావంతుడైనప్పటికీ తన సమస్యకు తానే పరిష్కారం కనుక్కోలేకపోయాడు. దళితులు ఉద్యోగాల్లో చేరితే అది దళిత సమాజానికి ఉపయోగపడుతుందని మరోవాదం. ఇదే నిజమైతే, ఉన్నతోద్యోగం ఆర్డీవో అయినప్పటికీ తన జాతి ప్రజలకే తానేమీ చేయలేకపోయాడు. కాబట్టి, ఉద్యోగవాదం సరైనది కాదు. రాజకీయ అధికారమే అన్నింటికీ పరిష్కారమైతే ఉపముఖ్యమంత్రి పాత్ర తన నిస్సహాయతను వ్యక్తం చేసి బాధపడుతుంది. కాబట్టి రాజకీయాధికారం అన్నింటికీ పరిష్కారం కాదని రచయిత సంకేతిస్తున్నాడు. మరి పంచముల సమస్యకు పరిష్కారం ఏమిటి? ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించటమే పరిష్కారం. భూమి కోసం తపనపడిన నారాయణప్ప కూడా భూమిని కాపాడుకోవడానికి ప్రతిఘటనకు సిద్ధపడమని చాటింపు వేస్తాడు. చివరికి శివయ్య కూడా ప్రతిఘటన రాజకీయాల వైపు అడుగులేస్తాడు. “ఒక్క నిజం మాత్రం తప్పెట తనకు చేరువవుతున్న కొద్దీ బలపడుతోంది. స్పష్టమవుతుంది. అదేమిటంటే.. తన జాతికి కేవలం ఆఫీసులలోనో, విద్యాలయాల్లోనో, పరిపాలనల్లోనో రిజర్వేషన్లు కల్పించటం వలన రాజ్యాధికారం రాదనీ... శక్తిమంత కాదనీ..” (పు.275) అని శివయ్యకు మదిలో కలిగిన అంతిమ సత్యాన్ని నవలలో తెలుపుతాడు. ఈ వాక్యాన్ని నిరూపించటం కోసమే రచయిత ఈ నవల రాశాడు. శివయ్య ఒక ఉద్యోగిగా తన నిస్సహాయతకు పరిష్కారం రిజర్వేషన్లు కాదని భావిస్తాడు.

కానీ, దళిత విద్యావంతులను, ఉద్యోగులను, రాజకీయ ప్రతినిధులను నిస్సహాయులను చేసిన విషయం ఏది? ఇంతటి బలమైన వ్యక్తులు కూడా ఏ కారణం వల్ల నిస్సహాయులయ్యారు? ఈ విషయాలను అర్థం చేసుకోవాలంటే గాంధీకీ, అంబేద్కర్‌కు మధ్య జరిగిన పోరాటాన్ని తెలుసుకోవాలి. మౌర్య సామ్రాజ్యాన్ని పుశ్యమిత్ర శృంగుడు క్రీ.పూ.185లో ఆక్రమించుకున్నాడు. ఎలాంటి అసమానతలు లేని బౌద్ధరాజ్యాన్ని పుశ్యమిత్రుడు వర్ణ, కుల అసమాన సమాజంగా మార్చేశాడు. ఆస్తిహక్కు, ఆయుధంపట్టే హక్కు, చదువుకొనే హక్కు, రాజ్యం పాలించేహక్కులు శూద్ర, అతిశూద్రులకు లేవని మనుధర్మశాస్త్రం పేరుతో శాసనం చేశారు. ఈ సామాజిక శాసనం వల్ల దళితులకు ఆ నాలుగు హక్కులు వేలాది సంవత్సరాలు లేవు. జ్ఞాన వ్యవస్థ నుంచి బహిష్కరించటం వల్ల దళితులు అజ్ఞానంలో కూరుకుపోయారు. కాబట్టి, జ్ఞాన వ్యవస్థలోకి తిరిగి దళితులు ప్రవేశిస్తేనే ఈ సంఘాన్ని మార్చే శక్తిని పొందగలరు. చదువుకున్న విద్యావంతులకు ప్రభుత్వ యంత్రాంగంలో చోటివ్వటం వల్ల అగ్రకుల పీడన నుంచి తమ జాతిని దళిత విద్యావంతులు కాపాడుకోగలుగుతారు. కాబట్టి, చదువుకొనే హక్కు, రాజ్యపాలనా యంత్రాంగంలో ఉద్యోగహక్కులు రావాలంటే ఆ హక్కును నిర్ణయించే శాసన వ్యవస్థలోకి ప్రవేశించాలి. శాసనసభల్లో దళితులు లేకుండా ఎలాంటి చట్టాలు, ఆదేశాలు దళితులకోసం అగ్రవర్ణాలు తయారు చేయవు. చట్టసభల్లో ప్రవేశించే రాజకీయ అధికారం కోసం డా॥ అంబేద్కర్ ఉద్యమించాడు. ఆయన బ్రిటీషు పాలకులతో అనేక పోరాటాలు చేశాడు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం దళితులకు ఇవ్వాలని కోరాడు. దళితులను ఇతరుల మీద ఆధారపడకుండా జీవించేలా, స్వతంత్ర అధికారం గల సమూహంగా తయారు చేయటానికి గాను ఆయన నాలుగు హక్కులను డిమాండ్ చేశాడు. వయోజన ఓటు హక్కు, రెండుఓట్లు, ప్రత్యేక నియోజకవర్గాలు, జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం. ఈ నాలుగు

ప్రధానమైన హక్కులతోపాటు విద్యా, ఉద్యోగ రంగాల్లో జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కావాలని ఆయన డిమాండ్ చేశాడు.

ఈ విషయాలను గాంధీ వ్యతిరేకించాడు. కాంగ్రెస్ పార్టీ, గాంధీ ఈ నాలుగు హక్కులను వ్యతిరేకిస్తే అంబేద్కర్ తీవ్రంగా ప్రతిఘటించాడు. లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో అంబేద్కర్‌కు వ్యతిరేకంగా గాంధీ వాదించాడు. అంటరానివాళ్లకు ఈ హక్కులిస్తే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని గాంధీ బెదిరించాడు. ప్రత్యేక నియోజకవర్గాల వల్ల అంటరానివాళు స్వతంత్రులవుతారు. ఇతర కులాల ఓట్లతో అవసరం లేదు కాబట్టి వాళ్లకు నిజమైన ప్రాతనిధ్యం లభిస్తుంది. అంతేకాకుండా అంటరానివాళ్లను నియంత్రించే అవకాశం అగ్రవర్ణాలు కోల్పోతారు. అగ్రవర్ణాలు అంటరానివాళ్ల మీద ఆధారపడేలా చేయటానికి గాను అంబేద్కర్ రెండుఓట్లు అడిగాడు. ఒక ఓటు దళిత ప్రతినిధికి, రెండో ఓటును అగ్రవర్ణ ప్రతినిధికి దళితుడు వేస్తాడు. దళితుల ఓట్ల కోసం అగ్రవర్ణాలు రావాల్సి ఉంటుంది. చట్టాలు చేయాల్సి ఉంటుంది. దళితులకు ఇతర కులస్తులు ఓటు వేయరు కాబట్టి అగ్రవర్ణాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి దళిత ప్రతినిధి పోటీ చేయాల్సిన అవసరం ఉండదు. వీటన్నిటి వల్ల దళితులు స్వతంత్రులైపోతారు. అదే జరిగితే, అగ్రవర్ణాలు నిర్మించిన కులవ్యవస్థ కూలిపోతుందని గాంధీ భయపడ్డాడు. అందుకే, అంబేద్కర్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఈ హక్కులు అడిగినందుకే అంబేద్కర్‌ను దేశద్రోహి, బ్రిటీషువాళ్ల ఏజెంటు అని గాంధీ అనుచరులు, కమ్యూనిస్టులు ప్రచారం చేశారు.

అందరి బెదిరింపులు లెక్కచేయకుండా ఆగష్టు17, 1932 తేదీనాడు బ్రిటీషు ప్రభుత్వం కమ్యూనల్ అవార్డును ప్రకటించింది. ఆ అవార్డు వల్ల దళితులు స్వతంత్రులయ్యారు. కానీ గాంధీ అంటరానివాళ్ల కిచ్చిన హక్కులను వ్యతిరేకిస్తూ గాంధీ ఆమరణ నిరాహార దీక్ష చేశాడు. ఎరవాడ జైలులో ఆయన చేసిన నిరాహార దీక్ష వల్ల పెద్ద ఎత్తున దళితుల మీద హింస జరిగింది. ఎమోషనల్‌గా, ఫిజికల్‌గా అంబేద్కర్ మీద ఒత్తిడి తెచ్చారు. అంతర్జాతీయ, జాతీయ ఒత్తిడికి తలొగ్గి గాంధీతో పూనా ఒప్పందం చేసుకున్నాడు డా. అంబేద్కర్. ఈ ఒప్పందం వల్ల ప్రత్యేక నియోజకవర్గాలకు బదులు ఉమ్మడి నియోజకవర్గాలు వచ్చాయి. వయోజన ఓటు హక్కు మాత్రమే లభించింది. రెండో ఓటును కోల్పోయాం. దళితేతరులు దళితుల ప్రతినిధికి ఓటేసే అవకాశం ఈ ఒప్పందం వల్ల లభించింది. దీనివల్ల దళిత ప్రతినిధులు గెలుపు కోసం అగ్రవర్ణాల మీద ఆధారపడాల్సి వచ్చింది. జనాభాలో 15శాతం మాత్రమే వున్న దళితుల గెలుపు, ఓటములు 85శాతంగా వున్న ఇతర కులాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే స్థితి గాంధీ కల్పించాడు.

అంతేకాదు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను నిర్ణయించే అధికారం ప్రజల చేతిలో ఉండాలని డా॥ అంబేద్కర్ ప్రతిపాదించాడు. కానీ, అభర్థులకు టిక్కెట్లిచ్చి పార్టీలే నిర్ణయించే పద్ధతిని గాంధీ ప్రవేశపెట్టాడు. దీని వల్ల నిజమైన ప్రతినిధులు కాక, అగ్రవర్ణాల మీద ఆధారపడే నాయకులు తయారయ్యారు. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో దళితులు కేవలం అలంకారంగా మారిపోయారు. ఎలాంటి అధికారంలేని వాళ్లుగా మారిపోయారు. పంచమం నవలలోని ఉపముఖ్యమంత్రి కృపాకర్‌రావు నిస్సహాయుడిగా మారిపోవడానికి పూనా ఒప్పందమే కారణం. అధికారం ఎవరి చేతిలో వుంటే వాళ్లదే సమస్త భూమి, ఇతర వనరులవుతాయి. అధికారంలో అగ్రవర్ణాలే వున్నారు కాబట్టి కింది కులాలకు సంబంధించిన ఉన్నత ఉద్యోగులను, సాధారణ ఉద్యోగులకు రక్షణ లేదు. అగ్రవర్ణాలకు సంబంధించిన అధికారులే మెజార్టీగా ఉంటారు కాబట్టి ఆఫీసుల్లో దళితులు నిస్సహాయులు. అంతేకాదు, అవినీతి పేరుతో చాలా తేలిగ్గా కిందికులాల అధికారులను సస్పెండ్ చేయటం జరుగుతుంది. అలా శివయ్య కూడా ఉద్యోగం కోల్పోయాడు. దళితులు అధికార వంచితులు కాబట్టి వాళ్లకు భూమి లేదు. అగ్రవర్ణాలు

అధికారంలో ఉంటే కిందికులాలకు భూమి పంచుతారని ఎలా ఆశిస్తారు? రాజ్యాంగం రాసింది కులం వల్ల అన్యాయానికి గురైనవాళ్లకోసం. కానీ అదే రాజ్యాంగం మీద అగ్రవర్ణాలు కూర్చొని హక్కులు, అధికారాలు కాలరాస్తున్నారు. కాబట్టి రాజ్యాంగాన్ని అమలు చేసే అధికారాన్ని దళితులు చేజిక్కించుకోవాలని అంబేద్కర్ సందేశం. ఆ సందేశాన్ని నిజం చేయటానికే మాలమాదిగలు ఏకమవుతున్నారని రచయిత ప్రతీకాత్మకంగా చెప్పారు.

**<u>ముగింపు:</u>**

"మహాజనులారా! మీకు తెలిపేదేమంటే. . . గవురుమెంటోళ్ళు తీసుకొని పేదోళ్ళకు పంచి పెట్టుండే భూమిని శంకరప్ప గొంచి గానికే సోదీనం చేసినారని ఉత్తరువులు ఇచ్చినారు. ఈ భూమిని పొందిన పేదోళ్ళంతా కలిసి ఒకటిగా దాన్ని బేఖాతరు చెయ్యడహో"! అంటూ డంగోరు వేస్తూ అన్ని వీధులూ తిరుగుతాడు. జంగ్‌నకీ. . .ఠాంగ్‌నకీ. . .అన్న దరువు అందరి గుండెల్లో ప్రతిధ్వనించటం ప్రారంభిస్తుంది. భవిష్యత్తు ఒక తాటి మీద కదులుతున్నట్టూ, పదునెక్కిన నిర్భయత్వం ప్రవహిస్తున్నట్టు శివయ్యకు అనిపిస్తుంది. ఇలా "అద్దంలో చందమామ"లో లేని చైతన్య సూచన "పంచమం"లో కళాత్మకంగా తప్పెట దరువుగా నినదించింది.

## <u>3.2.అనంత జీవనం – అగ్రకుల ముఠారాజకీయాలు, బహుజన చైతన్యం:</u>

అనంత జీవనం అనంతపురంలో వచ్చిన తుపాన్ బీభత్సాన్ని కళ్లకు కట్టినట్లుగా ఇనాక్ గారు చిత్రించారు. ఫ్యాక్షన్ స్వరూన్ని, దాని ఎదుగుదలను చిత్రిస్తూ దాని పతనాన్ని సూచిస్తూ వర్షాన్ని ప్రతీకగా తీసుకుని వర్ణించడం జరిగింది. వర్షం ఇక్కడ నిరంతర చైతన్యానికి ప్రతీక. "రాయలసీమలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడిచినా గ్రామ సీమల్లో ప్రజా జీవితంలో ఎ మార్పులు రాలేదు. రాజులు, జమీందారులు అంతరించినా నిరంకుశత్వానికి, రాచరిక అరాచకత్వానికి చివరి అనవాల్లుగా పాలిగాల్లు రాయలసీమలో ముఖ్యంగా అనంతపురంలో అక్కడక్కడా నిలిచి ఉన్నాయనడానికి సాక్షంగా గంగారెడ్డి వారికుమారులు గోవిందరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాంపిరెడ్డి పాత్రలను తీసుకుని వారి అకృత్యాలను, మూర్ఖత్వాలను వివరిస్తూ మొక్కలు మొలిచినా యదగనివ్వని వట వృక్షంగా వారి ఆగడాలను వర్ణించారు. అలాగే భూస్వాములు, వారి కులాల తగువులాటలో అమాయక ప్రజల ప్రాణాలతో, జీవితాలతో ఆడుకుని వారికి సరౌన నిలువ నీడను కూడా లేకుండా చేశారు.అందువలనే అనేక మంది బడుగు, బలహీణ వర్గాల వారు పట్టణాలకు వలస వెల్లి చాలి చాలని ఆదాయంతో దుర్భర జీవితాన్ని ఇనాక్‌గారు. దళితులు, కోయ, కురమ, సాలెజంగం, చాకలి, మంగళి, బోయ, మాల, మాదిగ మొదలైనవారు పట్టణాలకు వలస వెల్లడానికి గల కారణాలను వారు బతుకు దెరువు మార్గాలకోసం కుల వృత్తులు మానుకుని పట్టణాలకు అవసరమైన వృత్తులను ఎన్నుకోవడం గురించి చర్చించారు" ( మాధవి,బి.టి: 2011.280).

### <u>3.2.1.రచయిత పరిచయం:</u>

ఆచార్య కొలకలూరి ఇనాక్ ప్రఖ్యాత రచయిత. కేంద్ర ప్రభుత్వం 2014లో ఆయన విద్యారంగానికీ, భాషారంగానికీ చేసిన సేవలను గుర్తించి 'పద్మశ్రీ' బిరుదు ఇచ్చి సత్కరించింది. గుంటూరు జిల్లాలో అతిసాధారణ మాదిగ కుటుంబంలో పుట్టిన ఇనాక్ సామాజిక వివక్షను ఎదుర్కొని అత్యున్నత శిఖరాలకెదిగారు. ఆయన కథలు, నవలలు, కవిత్వం, నాటకం, నాటిక, విమర్శ, పరిశోధనం మొదలైన అన్ని ప్రక్రియల్లో రచనలు చేశారు. ముఖ్యంగా దళిత జీవనం ఇతివృత్తంగా ఆయన రాసిన కథలు తెలుగు సాహిత్యాన్ని ఒక స్థాయికి చేర్చాయి. 'ఊరబావి', తలలేనోడు, అస్పృశ్యగంగ, కాకి, కథసంకలనాలు, కన్నీటిగొంతు, ఆదిఆంధ్రుడు, జైహింద్

వంటి కావ్యాలు, 'మునివాహనుడు' నాటకం ఎంతో ప్రసిద్ధిచెందిన రచనలు. ఆయన సృష్టించిన మరో క్లాసిక్ నవల 'అనంతజీవనం'. రాయలసీమ నేపథ్యంలో సామాజిక, సాంస్కృతిక జీవితాల్ని ఈ నవల చిత్రించింది.ఒక రచయిత రచనలను అధ్యయనం చేయడానికి కొంత అతని జీవిత విశేషాలను కొంతవరకైనా తెలుసుకోవలసి ఉంది. అందువలన ఇనాక్ గారి రచనలను పరిశీలించడానికి ముందు స్థూలంగా అతని జీవిత విశేషాలను తెలుసుకోవాలి.

నిరుపేద ఇంట్లోపుట్టి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులు వంటి ఉన్నత పదవికి చేరినవారు ఇనాక్‌గారు. సాహిత్యంలో తన వ్యక్తిగత ముద్రతో పాటు ప్రగతిపథంలో రచనలు చేస్తూ సాహిత్యంలో వస్తున్న ప్రతి మంచి మార్పుకు స్పందిస్తున్నవారు వీరు. ఈ క్రమంలోనే అనేక రచనలు చేశారు. ఒక రచయిత నవలా కారుడిగానో, నాటక రచయితగానో లేక కవిగానో సాహిత్యంలో ఉండడం పరిపాటి. కానీ ఇనాక్‌గారు కథ, నవల, నాటకం, కవిత్వం ప్రక్రియలలో సమర్ధవంతంగా రచనలు చేశారు. అంతేకాకుండా విమర్శ రంగంలోనూ తన స్థానాన్ని నిలుపుకున్నారు.ఆచార్య కొలకలూరి ఇనాక్ రాసిన 'అనంత జీవనం' (2007) రాయలసీమలోని ఫ్యాక్షనిస్టు సంస్కృతినీ, రాజకీయాలను చిత్రించింది. ఫ్యూడల్ వ్యవస్థ లక్షణమైన ఫ్యాక్షనిజం ఎలా పుట్టిందీ, ఎంత హింసకు కారణమైందీ, ఎలా పతనమైందీ వంటి విషయాలను ఈ నవలలో చిత్రించాడు. ఫ్యూడల్ వ్యవస్థ శిథిలావస్థకు చేరుకుంది. ఆ శిథిలమైపోతున్న ఫ్యాక్షనిస్టు ఫ్యూడలిజం కూలిపోవాలి. రెడ్లు ఫ్యాక్షనిస్టులుగా అణగారిన వర్గాలను హింసిస్తున్నారు. బహుజనులు చైతన్యవంతులైతే ఆ తుఫానులో ఫ్యాక్షనిజం కొట్టుకపోవాలని రచయిత ఉద్దేశం. అందుకే, అనంతపురంలో కురిసిన తుఫానును ఒక ప్రతీకగా తీసుకుని ఆచార్య కొలకలూరి ఇనాక్ ఈ నవల రాశాడు.

అనంత జీవనం నవలలో అనంతపురం పట్టణ ప్రజల జీవితపు వెలుగు నీడల చిత్రణ ఉన్నది ఇంకా అనంతపురం అక్కడి కరువు కాటకాలు పాలెగాల్ల సంస్కృతి కాలంతో పాటు పట్టణ విస్తరణ పెరిగి నాగరికత దానివలన వచ్చిన ఇక్కట్లు మరియు ముఖ్యంగా అక్కడ అణగారిన అట్టడుగు వర్గాల కష్టాలు, కన్నీల్లు ఉన్నాయి. రాయలసీమలో కరువు జిల్లాల్లో అనంతపురం మొదటిది. అలాంటి అనంతపురంలో భారీ వర్షమా ! ఊరువాడ మునిగిపోయే వర్షమా ఆశ్చర్యం, సహాయక చర్యలు చేయలేక ప్రభుత్వం చేతులు ఎత్తేసింది. ఆ వరద బీభత్సంలో త్రాగడానికి గుక్కెడు నీళ్ళు కరువయ్యాయి. ఇళ్లకూలి మనుషులు చనిపోయే వర్షంలో కోటీశ్వరుడినుండి సామాన్యుడి వరకు ఏలాంటి జీవనం గడిపారో అనంత జీవనం నవలలో ఇనాక్ తెలియ జేశారు."అనంతపురంలలో 9.11.1996న వచ్చిన తుఫాను సృష్టించిన బీభత్సంలో సంపన్నులు సామాన్యులు ఎదుర్కొన్న ఆత్యయిక పరిస్థితిని, సంపన్నుల పూర్వాపరాల సంఘర్షణను, సామాన్యుల జీవన పోరాటాలను 'అనంతజీవనం'లో చిత్రించాను" (సింహావలోకనం, 2010)లో రచయిత స్వయంగా పేర్కొంటాడు. ఆచార్య కొలకలూరి ఇనాక్ ప్రసిద్ధ కవి, కథకుడు, నాటకం, నవలాకారుడు, పరిశోధకుడు. కేంద్రప్రభుత్వం గత సంవత్సరం ఆయనకు పద్మశ్రీ బిరుదిచ్చి సత్కరించింది

**<u>పుట్టుక – విద్యాభ్యాసం:</u>**

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు 12 కి.మీటర్ల దూరంలో ఉన్న వేజెండ్ల వీరి జన్మస్థలం. ఇనాక్‌గారు వీరమ్మ, రామయ్యలకు మొదటిబిడ్డగా 1930, జులై నెల ఒకటవ తేదిన జన్మించారు. ఇనాక్ గారికి ఒక చెల్లెలు, తమ్ముడు ఉన్నారు. చిన్న వయసులో క్రైస్తవ మతబోధకులు పెట్టిన పేరు హానోకు. దీనికి శరీరంతో దైవసన్నిధికి చేరిన భక్తుడని బైబిల్ గ్రంథంలోని అర్థం. క్రమంగా ఈ పేరు అందరినోళ్లపడి నూకాలుగా, ఆపై ఇనాక్‌గా మారింది.

ఇనాక్ గారి బాల్యం వేజెండ్లలోనే గడిచింది. వీరు మూడవ తరగతి వరకు వేజెండ్లలోని ఏ. బి. యం. ప్రైమరీ స్కూల్లో చదివారు. (1944-48) తల్లిదండ్రులు రైతుకూలీలుగా ఉ

ండడంచేత మూడవ తరగతి వరకు చదివిన పిల్లవాడ్ని కుటుంబ పరిస్థితులవల్ల కొంతకాలం జీతానికి ఉంచారు. తర్వాత ఆంధ్ర లూథరన్ క్రిష్టియన్ మిషన్ స్కూల్లో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలు రాసి యస్.యస్.యల్.సి వరకు అక్కడే చదివారు. ఆరవ తరగతికి ప్రవేశ పరీక్ష రాస్తున్నప్పుడు రోజూ వేజెండ్ల నుండి గుంటూరుకు పోవలసి వచ్చేది. ఒకసారి టిక్కెట్టుకొనే డబ్బుల్లేక రైలు ఎక్కలేకపోయారు. కానీ రైలుపట్టాలపై పరిగెత్తుకుంటూ వెళ్ళి పరీక్ష రాశారు. ఈ సంఘటనే ఇనాక్ గారికి చదువుపట్ల ఉన్న పట్టుదలను తెలియజేస్తుంది.

ఇనాక్ గారు తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు తండ్రి మరణించాడు. అప్పటినుండి తల్లి అనేక కష్టాలకు ఓర్చి కూలిపనులు చేస్తూ పిల్లలను చదివించింది. కొలకలూరి ఇనాక్ గారు, వారి చెల్లెలు, తమ్ముడు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉండి చదువుకున్నారు. ఇనాక్‌గారు గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు (1954–56). ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. పట్టభద్రులయ్యారు. బి.ఎ.లో ఉన్నప్పుడే వీరు చిన్నచిన్న కథలు, కవితలు రాయటం ప్రారంభించారు. 1957 – 59లో ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి వీరు ఉత్తమ కథ, నాటిక, పద్య రచయితగా బహుమతులు పొందారు. 1958లో ఆకాశవాణి నాటక పోటీలలో వీరి 'దృష్టి' నాటకం ద్వితీయ బహుమతి పొందింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ (తెలుగు) పూర్తిచేశారు. 1968 నుండి 72 వరకు 'తెలుగు వ్యాస పరిణామం' అనే అంశంపై పరిశోధన చేసి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు.

**<u>ఉద్యోగం – వివాహం:</u>**

ఇనాక్ గారు ఇరవయ్యవ ఏటనే (1959) గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరారు. ఆ తరువాత 1961 వరకు చిత్తూరు ప్రభుత్వ కళాశాలలో, 1962 కాకినాడ సి.ఆర్. కళాశాలలో, 1962 నుండి 72 వరకు అనంతపురం ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. 1972 నుండి 77 వరకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కళాశాల, తిరుపతిలో అధ్యాపకుడిగా పనిచేశారు.

1977లో అదే విశ్వవిద్యాలయం స్నాతకోత్తర కేంద్రం, అనంతపురంలో రీడర్‌గా నియామకం పొందారు. 1982లో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆంధ్రాచార్యులుగా చేరారు. అక్కడే ప్రిన్సిపాల్‌గా, డీన్‌గా వివిధ గౌరవస్థాయిలలో పనిచేశారు. ఆ తరువాత 1998లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులైనారు. ప్రస్తుతానికి పదవీ విరమణచేసి తమ పూర్తి కాలాన్ని రచనా వ్యాసాంగానికి వినియోగిస్తున్నారు.

ఇనాక్‌గారు అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో పనిచేస్తున్నప్పుడు భాగీరధి అనే ఉద్యోగిని పరిచయమయ్యారు. ఆమె శిశు సంక్షేమ శాఖలో లైజన్ ఆఫీసరుగా పనిచేసేవారు. వీరి పరిచయం చివరకు వివాహానికి దారితీసింది. వీరిది వర్ణాంతర వివాహం. పెద్దలు ఇష్టపడకపోయినప్పటికి 1963 మే 2న వీరి వివాహం జరిగింది. వీరికి నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరి సంతానమైన శ్రీకిరణ్, సుమకిరణ్, ఆశాజ్యోతి, మధుజ్యోతిలు నలుగురూ ఉన్నత విద్యనభ్యసించి ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు.

**<u>పదవులు – హోదాలు – గౌరవాలు:</u>**

వీరు ఉద్యోగరీత్యా అయినా, సాహిత్యం వలన అయినా అనేక ఉన్నత పదవులను అలంకరించారు. వీటి వలననే ఆయన నిరంతర కృషి అర్థం అవుతుంది.

**<u>వ్యక్తిగత హోదాలు:</u>**

శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా, డీన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, యస్.కె.ఐ.డి. డైరక్టర్‌గా, పి.యి.టి.సి. సెక్రటరీగా, భాషాశాస్త్ర శాఖకు

అధ్యక్షుడిగా, అకడమిక్ కౌన్సలర్‌గా, ఎన్నో పదవులు నిర్వహించారు. అంతే కాకుండా గుల్బర్గా, బెంగుళూరు, మైసూరు, నాగార్జున, ఆంధ్రా మొదలైన విశ్వవిద్యాలయాలలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులుగా ఉన్నారు. ఈయన 1992లో టి.వి. అవార్డుల కమిటీ సభ్యులలో ఒకరు. హైదరాబాద్ టాంక్‌బండ్‌పై వీరి చేత కవయిత్రి మొల్ల విగ్రహం ఆవిష్కరించబడింది. 1975, 1981, 1991 లలో ప్రపంచ తెలుగు మహాసభలకు వెళ్ళారు. 1990లో అఖిల భారత తెలుగు మహాసభలకు బెంగుళూరు వెళ్లారు. 1988లో దక్షిణ భారత సాంస్కృతిక సంస్థ త్రివేంద్రంలో, 1991లో ఇదే సంస్థ మరొకసారి నాగపూర్‌లో గౌరవించింది. ఎస్.సి., ఎస్.టి. రిజర్వేషన్ పాలసీ సభ్యుడిగా, అంతర్జాతీయ ఉపాధ్యాయ సంఘ ఎగ్జిక్యూటివ్ సభ్యుడుగా, ఆచార్య ఎన్.జి. రంగా విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడిగా, ఎ.పి.ఆర్.ఇ సొసైటీ బోర్డు సభ్యునిగా, తెలుగు అకాడమీ పాలకమండలి సభ్యునిగా అనేక పదవులను అలంకరించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘ సభ్యులుగా కొంతకాలం, తెలుగు విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులుగా కొంతకాలం ఉన్నారు. హైదరాబాదు కళావేదిక వారిచే 1985లో 'కళా సరస్వతి', హైదరాబాదు కళారాజ్యం వారిచే 'సాహితీ సామ్రాట్' బిరుదులను పొందారు. విశ్వవిదాయలయ స్థాయిలలో, ప్రభుత్వం నిర్వహించిన కవిసమ్మేళనాలలో, సభల నిర్వహణలో పాల్గొన్నారు. 1978 హైదరాబాదులో జరిగిన అఖిల భారత బి.సి. సమావేశంలో పాల్గొన్నారు.

1969 నుండి 1974 వరకు అనంతపురం జిల్లా రచయితల సంఘం ఉపాధ్యకులుగా, 1980 నుండి 85 వరకు అధ్యక్షులుగా ఉన్నారు. 1974 నుండి 78 వరకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులుగా, 1983 నుండి 84 వరకు సాధారణ సభ్యులుగా ఉన్నారు. కొంతకాలం కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులుగా కూడా ఉన్నారు. వీరు 1987 జనవరిలో కార్యదర్శిగా 15వ జాతీయ ద్రావిడ భాషాశాస్త్ర వేత్తల గోష్ఠి నిర్వహించారు. ఈ విధంగా అనేకమైన సాహిత్య సంబంధమైన పదవులతోపాటు, ఉన్నత గౌరవాలనుకూడా పొందారు. అనేక సాహితీ సంస్థలతో వీరికి పరిచయాలు ఉన్నాయి. ప్రముఖ కవులు, విమర్శకులు, రచయితలతో స్నేహ సంబంధాలున్నాయి.

**<u>సాహిత్య గౌరవాలు - పురస్కారాలు:</u>**

వీరి రచనలకు బహుమతులు వచ్చాయి. మునివాహనుడు నాటకానికి 1987లో తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహిత్య అకాడమి అవార్డు, ఊరబావి కథల సంపుటికి 1986లో తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహిత్య అకాడమీ అవార్డు వచ్చాయి. 1965లో వీరి జైహింద్ నాటకానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే, 1958లో దృష్టి నాటకానికి ఆకాశవాణి వారిచే, 1961లో అనాథ నవలకు ఆంధ్రప్రభ వారపత్రిక వారిచే బహుమతులు వచ్చాయి. 1993లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 1994లో అఖిల భారత అంబేద్కర్ సంస్థచే ఉత్తమ విద్యావేత్తగా గౌరవింపబడ్డారు. 1977లో శ్రీ కళానికేతన్ హైదరాబాదువారి జూలూరి నాగరాజారావు సాహిత్య పురస్కారాన్ని, 1997లో జాతీయ దళిత సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ వారి జాతీయ అంబేద్కర్ సాహిత్య పురస్కారాన్ని పొందారు.

జాతీయ కవిగా 1999న ప్రభుత్వంచే గుర్తింపు పొందారు. 1998లో న్యూఢిల్లీ వారి ఢిల్లీ తెలుగు సంస్థచే ఉత్తమ విద్యావేత్తగా, అదే సంవత్సరం హైదరాబాదు రసమయి వారి పైడి లక్ష్మయ్య సాహిత్య గౌరువాన్ని పొందారు. 2000లో మద్రాసు తెలుగు సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందారు. 1994లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ వ్యక్తిగా (National Integration Award) గుర్తించింది.

**<u>సాహిత్య పరిచయం:</u>**

ఆచార్య కొలకలూరి సాహితీ వ్యక్తిత్వం అపార వైవిధ్య విలసితం. కథ, నవల, కవిత,

నాటకం, విమర్శలాంటి విభిన్న క్షేత్రాల్లో సమర్థంగా సంచరించిన ప్రతిభ ఆయనిది. ఏ ప్రక్రియను చేపట్టినా సామాజికాభ్యుదయం ఇనాక్ రచనకు చరమ లక్ష్యం.

ఇనాక్ వ్యక్తిత్వం, సాహిత్య వ్యక్తిత్వం, అవిభాజ్యంగా ఉన్నాయి. నిమ్నోన్నత వర్గాల మధ్య అనేక తరాలుగా సాగుతున్న సంఘర్షణలను, ఆ సంఘర్షణల పరిణామాలను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూ ముందుకు సాగిపోయిన వ్యక్తి కాబట్టే వాటిని అంత బలంగా తన రచనలలో చిత్రీకరించాడు.

వీరి రచనలకు నేపథ్యం కొంతవరకు వీరి జీవితమని చెప్పవచ్చు. అందువల్లే రచనలు వాస్తవికతను ప్రతిబింబిస్తాయి. ఎక్కడా వస్తువులో కల్పనలు, అద్భుత విశేషాలు కనపడవు. పాత్రలన్నీ నేటి సామాజిక మూలాల నుండి ఏర్పడినవే. అందువల్లే ఇవి అభ్యుదయ మార్గాన్ని చూపుతాయి. వీరు ఏ ప్రక్రియలో రచన చేసినా సామాజిక దృక్పథాన్ని మరచిపోరు.

**<u>కవిత్వం:</u>**

ఇనాక్ గారు 1954 నుండి కవిత్వం రాస్తున్నారు. కొన్ని కవితలను ఆకాశవాణి ప్రసారం చేసింది. వివిధ పత్రికలు ప్రచురించాయి. అనేక కవి సమ్మేళనాలలో వీరు పాల్గొన్నారు. ఆయా కవితలను వీరు 5 కవితా సంపుటాలుగా ప్రచురించారు.

1. ఆశాజ్యోతి (1972).
2. షరామామూలే (1979).
3. కులం – ధనం (1985).
4. నన్ను కలగననివ్వండి (1999). ఈ కావ్యం పది భారతీయ భాషలలోకి అనువాదం జరిగింది.
5. ఎశీఱఖెవ శీట ంఱశ్రీవఅఛెవ (2001).

**<u>నవలలు:</u>**

వీరు రాసిన తొమ్మిది నవలలు ప్రచురింపబడ్డాయి. వీటిలో కొన్ని సీరియల్స్‌గా పత్రికలలో కూడా వచ్చాయి.

1. సమత (1959).
2. అనాథ (1959).
3. సౌభాగ్యవతి (1966).
4. సౌందర్యవతి(1968).
5. ఎక్కడుంది ప్రశాంతి (1969).
6. రెండు కళ్ళు – మూడు కాళ్ళు (1972).
7. ఇరులలో విరులు (1972).
8. సర్కారు గడ్డి (2001).
9. అనంత జీవనం (2006).

'అనాథ' నవల ఆంధ్రప్రభ పోటీలో (1961)బహుమతి పొందింది. 'సౌందర్యవతి' సాహితీప్రియ పత్రికలో ధారావాహికంగా వెలువడింది.

**<u>నాటకాలు – నాటికలు:</u>**

ఇనాక్‌గారు స్వయంగా నటులు. వీరు నాటకాలను దర్శకత్వం కూడా వహించేవారు. భువనవిజయంలో తిమ్మరుసుగా, శ్రీకృష్ణదేవరాయలుగా నటించి ప్రతిభను చాటుకున్నారు. అంతేగాక ప్రదర్శనకు, ప్రసారానికి యోగ్యంగా ఉండే నాటకాలను, నాటికలను రాశారు. వీరి నాటకాలు, నాటికలు కొన్ని ఆకాశవాణిలో ప్రసారం అయ్యాయి.

**<u>నాటకాలు:</u>**

1. మునివాహనుడు (1983).
2. జైహింద్ (1963).
3. కీ (1968).
4. సాక్షి (1988).

**నాటికా సంపుటాలు – నాటికలు**

1. ఆశాజ్యోతి (1984)
2. దృష్టి (1960)
3. అభ్యుదయం (1999)
4. అమ్మ (1999)

**కథలు:**

ఇనాక్ గారి కథలు కథాసాహిత్యంలో ముఖ్యమైనవిగా గుర్తించబడ్డాయి. 'తలలేనోడు', 'ఊరబావి' లాంటి కథలు కథాసాహిత్యం చదివే ఏ పాఠకుడు మర్చిపోలేడు. ఇవి వివిధ పత్రికలలో వెలువడ్డాయి. వీరి కథలు ఆరు సంపుటాలుగా ముద్రించబడ్డాయి.

1. గులాబి నవ్వింది (1960):
2. భవాని (1969):
3. ఇదాజీవితం (1976):
4. ఊరబావి (1983):
5. సూర్యుడు తలెత్తాడు (1989):
6. అస్పృశ్యగంగ (1999):

**పరిశోధన గ్రంథాలు – వ్యాసాలు:**

అభ్యుదయ భావాలతో రచనలు చేస్తున్న ఇనాక్ గారు ఆ దృష్టితోనే వ్యాసాలు కూడా రాశారు. వీరి సృజనాత్మక, విమర్శనాత్మక వ్యాసాలు వివిధ పత్రికలలో వెలువడ్డాయి. సాహిత్య సభలు, సమావేశాలలో అనేక వ్యాసాలను సమర్పించారు. వీటిలో కొన్నిటిని ఎనిమిది సంపుటాలుగా ముద్రించారు.

1. తెలుగు వ్యాస పరిణామం (1980).
2. తెలుగు వ్యాసాలు (1974).
3. సాహిత్య దర్శిని (1984).
4. సమీక్షణం (1987).
5. ఆధునిక సాహిత్య విమర్శా సూత్రం.
6. సూద్రకవి – భట్టుమూర్తుల వసుచరిత్ర ఔశిష్ట్యం (1996).
7. సాహిత్య సందర్శణం (1999).

'తెలుగు వ్యాస పరిణామం' వీరు డాక్టరేటు పొందిన పరిశోధనాగ్రంథం. వీరి 'ఆధునిక విమర్శా సుత్రాని'కి సాహిత్య విమర్శలో ఉత్తమమైనదిగా గుర్తింపు వచ్చింది.

పై విమర్శ గ్రంథాల పరిశీలనను, పరిశోధనా వ్యాసాలను వస్తువు దృష్ట్యా విభజించి చివరి అధ్యాయంలో ఇవ్వడం జరిగింది.

**అనువాదాలు:**

వీరు బైబిలును ఆధునిక ఆంధ్రభాషలోనికి అనువాదం చేశారు. దీనిని ఇంటర్నేషనల్ బైబిల్ ట్రాన్స్ లేటర్స్, టెక్సాస్, యు.యస్.ఏ వారు 1985 సంవత్సరంలో ముద్రించారు.

**అనువాదం పొందిన రచనలు ఇనాక్ గారి రచనలు:**

వీరి రచనలు ఇతర భాషల్లోకి అనువాదాలయ్యాయి. వాటి వివరాలు కింద సూచించాను.

1. నన్ను కలగననివ్వండి – (22 భాషలలోకి అనుమానం పొందింది. 1999).
2. ఊరబావి – కన్నడ, ఆంగ్లం, తమిళం, హిందీ భాషల్లోకి అనువాదం పొందింది. 1993.
3. అస్పృశ్యగంగ – హిందీ భాషలోకి అనువాదం పొందింది.
4. మునివాహనుడు – ఆంగ్లం, హిందీ, కన్నడ, తమిళం భాషల్లో కి అనువాదం పొందింది. 2002

1. 'సూర్యుడు తలెత్తాడు' కథా సంపుటాన్ని కె.యస్. శర్మగారు ఇంగ్లీషులోకి 'The Sun Lefts up his Head' అని అనువదించారు.
2. 'ఊరబావి' కథను ప్రొ. వై. వెంకట రమణారావు గారు హిందీ భాషలోకి 'గామ్ కా కువా'గా అనువదించారు.
3. 'తలలేనోడు' కథను డా.కృష్ణ గారు హిందీ భాషలోకి అనువదించారు.
4. 'కులం' కవితను కుల్ గా శ్రీ వై.సి.పి. వెంకటరెడ్డి గారు హిందీ భాషలోకి అనువదించారు.

**3.2.2.అనంత జీవనం కథాపరిచయం:**

'అనంత జీవనం' నవలలో అనంతపురం పట్టణ ప్రజల జీవితపు వెలుగు నీడల చిత్రణ ఉంది. ఇంకా అనంతపురం అక్కడి కరువు కాటకాలు పాలెగాళ్ళ సంస్కృతి కాలంతో పాటు పట్టణ విస్తరణ పెరిగి నాగరికత దాని వలన వచ్చిన ఇక్కట్లు మరియు ముఖ్యంగా అక్కడ అణగారిన అట్టడుగు వర్గాల కష్టాలు, కన్నీళ్ళు ఉన్నాయి. రాయలసీమలో కరువు జిల్లాల్లో అనంతపురం మొదటిది. అలాంటి అనంతపురంలో భారీ వర్షమా ! ఊరువాడ మునిగిపోయే వర్షమా ఆశ్చర్యం, సహాయక చర్యలు చేయలేక ప్రభుత్వం చేతులు ఎత్తేసింది. ఆ వరద బీభత్సంలో తాగడానికి గుక్కెడు నీళ్ళు కరువయ్యాయి. ఇళ్ళు కూలి మనుషులు చనిపోయే వర్షంలో కోటీశ్వరుడినుండి సామాన్యుడి వరకు ఎలాంటి జీవనం గడిపారో అనంత జీవనం నవలలో ఇనాక్ తెలియ జేశారు.

బళ్ళారి జిల్లాను పరిపాలకులు రెండుగా చీల్చి, అనంతపురం జిల్లాను ఏర్పరచినప్పుడు నేలగాళ్ళు, పాలెగాల్లు, వంశంలో మిగిలిన గంగారెడ్డికి రాజ్యాధికారం ఏమిలేదు, కాని అతడు భూ కామాంధుడు. 12 గ్రామాల భూములకు శిస్తు కట్టే మోతుబరి రైతు పూర్వపు జమీందారీ దర్పం లేదు గ్రామాల్లో ప్రజలు కష్టపడి భూమి సాగు చేసి చేనుకింత, తరికింత, అని కోరు కడతారు. పది ఎకరాల విస్తీర్ణంలో నేలగాళ్ళు కోట రైతులు కట్టే డబ్బు వల్ల ఎల్లప్పుడు కళకళలాడుతూ ఉండేది. ఐతే గత పాతిక సంవత్సరాలుగా కోట పాడుపడింది. మునుపటి కళాకాంతులు లేవు.

అనంతపురం జిల్లా కేంద్రం అయ్యాక గంగిరెడ్డి కుటుంబం కోట లాంటి దివ్య భవనం కట్టుకున్నారు. అది జిల్లా కలెక్టర్ ఎస్పీ బంగ్లాల కంట పెద్దది. గంగిరెడ్డి కుటుంబానికి అనంతపురంలో నాలుగు నూర్ల తరిభూమి ఉండేది దాన్ని కాపాడుకోవడానికి అనంతపురంలో దివ్యభవనం కట్టారు అనంతపురం నుండి, బల్లారికి వెళ్ళే దారిస్థలం, ఉన్న ఖాళీ బాట బండ్ల బాట, కంకర రోడ్డుగా మారి తరిభూమిని తీర్చింది. రైలు మార్గం ఏర్పడి రైలు కట్టల వల్ల పడమటి భూములకు నీరు పారక బీడు భూములు అయ్యాయి. బంగ్లాల చుట్టు ఉన్న తరి భూమి ఇండ్ల స్థలాలుగా మారి కమలానగర్ ఏర్పడింది. బంగ్లాలో గంగిరెడ్డి కొడుకు రామపరం ధామరెడ్డి భార్యతో కాపురం ఉంటున్నాడు. ఇంగ్లాండ్‌లో బార్ ఎట్‌లా చదువుకునేటప్పుడు ఆయన తన పేరును రాం.పి.రెడ్డిగా మార్చుకున్నాడు. చుట్టు పక్కలవారు ఆయన్ని రంపిరెడ్డి, రంపురెడ్డి, రొంపిరెడ్డి అంటారు.

రాంపిరెడ్డి పేరు మోసిన క్రిమినల్ లాయర్ అతను కేసు చేపట్టాడంటే గెలిచినట్టే. ఒక వేళ ఓడిపోతే ఓటమికి కారణం అయినవాడిని చంపిస్తాడు. ఆ ఊరిలో ఇంపోర్టెడ్ కారు

అతనికి ఒక్కడికే ఉంది. రెండు చేతుల సంపాదించి, నాలుగు చేతుల ఖర్చు పెడతాడు. అతని భార్య ఎలిజబెత్ బ్రిటిష్ వనిత. వాళ్లకు పిల్లలు పుట్టలేరు.

ఇదంతా రాంపిరెడ్డి గతవైభవమే. ఇప్పుడు ఆయన వయస్సు 95, భార్య వయస్సు 90. లాయర్‌గా ప్రాక్టీస్ మాని పాతికేళ్లు అయ్యింది. బంగ్లా పాడుబడింది. దాన్ని అందరు బూతు బంగ్లా అంటున్నారు. ఇంటి పనులు చేసి పెట్టే ఉత్తప్ప, వంటచేసే సాదమ్మ తప్ప వాళ్ళ ఇంటికి ఎవ్వరు రారు. అనంతపురంలో తుఫాను అంటే ఎవ్వరికైనా ఆశ్చర్యమే! అయితే నిజంగానే తుఫాన్ వచ్చి, 09-11-1996న కుంభవృష్టి కురిసింది. అనంతపురం చెరువును బుక్కరాయ సముద్రం అంటారు. అది నిండితే సింగనమల చెరవుకు నీరు వస్తుంది. రామగిరి కొండల్లో వర్షపు నీరు వస్తుంది. పేరురు మీదుగా పండమేరు పారుతుంది. రాంపిరెడ్డి బంగ్లామీద నీరునిలిచి గదులన్ని కారుతున్నాయి. పందిరి మంచంతో సహా అన్ని తడిచిపోతే పందిరి మంచంకింద పొడిగా ఉన్న చోట చెరొక పొడి దుప్పటి కప్పుకొని భార్య భర్తలు పడుకున్నారు.

తెల్లవారినా సూర్యోదయం కాలేదు. వాన కుంభవృష్టిగా కురుస్తనే ఉంది. వానను చూచి జనం ఆనందిస్తున్నారు. పిల్లలు తడిచిపోయిన చెడ్డీలు విప్పేడి ఉత్తబిత్తలతో ఎగుర్లాడుతున్నారు. ప్రజలు పట్టరాని ఆనందంతో ఉన్నారు .

కాలువలోకి పోవలసిన నీరు ఊరిని ముంచెత్తింది. రాప్తాదు ఇంజనీరింగ్ కాలేజ్ యస్‌బిఐ కాలనీ, కృపానందంనగర్, జిజెస్‌నగర్, రాంనగర్, శాంతినగర్, రజాక్‌నగర్, అరవిందనగర్, కమలనగర్ అన్ని జలమయం అయ్యాయి. అనంతపురం అంతా మునిగిపోయిన కోవ్వురు నగర్, అందులో సంజీవరెడ్డి ఇల్లు మునగవు ఎందుకంటే అది కొండమీద ఉంది.

గొర్రెల కాపరి అంకాలప్ప మందను మళ్ళించలేక సతమతం అవుతున్నాడు. మందను పల్లంలోకి తోలాడు. రోడ్డు మీదకు తోలే ప్రయత్నం చేశాడు. ఒక్కసారిగా ఉధృతంగా వచ్చిన వరదనీటిలో మంద కొట్టుకుపోతుంది. అంకాలప్ప వాటిని ఆపలేకపోయాడు.

రాత్రి వానకపై పెంకుపడి తల పగిలి ఉత్తప్ప భార్య మూలుగుతున్నది. ఆమెకు పరిచర్యలు చేస్తు అతను బయటకు రాలేకుండా ఉన్నాడు. రాత్రి వానలో సాలమ్మ కాలు బట్టలుఉతికే బండ క్రిందపడి నలిగింది. కదలలేకుండా ఉంది. ఉత్తప్ప రాలేని స్థితి. సాలమ్మకు ఆమె కదల్లేని స్థితి ఉత్తప్పకు తెలియదు. ఇద్దరు రారని రాంపిరెడ్డికి తెలియదు. ఈ తెలియని తనమే జీవితం. బ్లాక్ కాఫీ కావాలి. భార్య వంట గదిలోకి రాలేదు. తానెప్పుడు వంటగదిలోకి పోయి ఎరుగడు. హోటల్ వాడికి ఫోన్ చేయాలని చూశాడు. అది పని చేయడం లేదు. ఫోన్ డెడ్. కొట్టాలు, మిద్దెలు, తీరుబండా ఇళ్ళు తుఫాన్ ధాటికి తట్టుకోలేకపోయాయి. కమలానగర్ ఇండ్లలో తొడలోతు నీరు చేరాయి. తాపీ మేస్త్రీ ఎద్దీరప్ప ఐదవ భార్య ఇల్లు పడిపోయింది. మనుషులకేం కాలేదు. అంబేద్కర్ నగర్‌లో మున్సిపాలిటి పనివాళ్ల ఇండ్లు ఉన్నాయి. వాళ్ళు దళితులు, ఎక్కువగా మాదిగలు గాలి వానకు మూలింటి ముసలిదాని ఇళ్ళు పడిపోయింది. ఆ ఇంట్లో ముసల్ది నిర్జీవంగా పడి ఉంది. వాన గాలికి ఇల్లుపడి నిర్జీవంగా పడిఉంది. ఇరుగుపొరుగు ఆమెను వేపచెట్టు క్రింద అరుగు మీద చాప వేసి వానలో పడురకోబెట్టారు. పైన ఏమిలేదు, శవం వానలో తడుస్తూనే ఉంది. శవం తడవకూడదు. కురవకుండా ఉన్న ఇండ్లలోకి మాదిగ శవాన్ని రానివ్వరు. సంపన్నులుండే శాయినగర్, అరవింద నగర్, మారుతినగర్, రామచంద్రనగర్ క్షేమంగా ఉన్నాయి. కొవ్వురునగర్ అతి సురక్షితం. కపెప వ్యాపారి నాగన్న నిలువున మునిగిపోయాడు. కలుప తడిస్తే ఏమీకాదు. చిన్నవాన అయితే భయంలేదు. వాన నీళ్ళు ఉధృతంగా అరుగు మీదకు రావడంతో ముందుగా చిన్న కట్టెలు కొట్టుకుపోయాయి. కొంత సేపటికి వరద ప్రభావం ఉధృతమై కలుపు అడితి ఖాళీ అయ్యింది. నాగన్న నిలువుగుడ్లు వేసుకోని చూస్తున్నాడే కాని, కలుపను కాపాడుకోలేక పోయాడు. ఎడతెరిపి

లేకుండా కురిసిన వానకు పండమేరు పొంగింది. బుక్కరాయల సముద్రం నిండింది. ఫాదర్ పెర్రర్ సేవాసామ్రాజ్యం నీళ్ళమీద తేలిఆడుతూ ఉంది. టౌన్ బ్యాంకులో పనిచేసే ఉద్యోగి ప్రతిరోజు రాప్తాడు నుండి డ్యూటీకి వచ్చిపోతుంటాడు. నీటి ప్రవాహానికి మోటర్ సైకిల్ పత్తా లేకుండాపోయింది.

ప్రభుత్వ బాలుర హాస్టల్ పిల్లలు వానలో కేరింతలు కొట్టి ఆడి తిరిగి వచ్చే సరికి హాస్టల్ కడిగినట్లుగా ఉంది. పెట్టెలు లేవు. ఎవరి బటలూ లేవు. ఎవరి తట్టలు గ్లాస్‌లు లేవు, టెక్స్టుబుక్‌లు లేవు. నోట్‌బుక్‌లు లేవు అన్ని కొట్టుకుపోయాయి. ఆటోరిక్షాతోలే యువకుడు తన కొట్టంలో బియ్యంమూట తడువకుండా బయటకి తీసుకురాబోయాడు. కొట్టం పెళపెళలాడింది. క్షణాల్లో కొట్టం మీద పడింది. వర్షం కుంభవృష్టిగా కురుస్తుంది. బుక్కరాయ సముద్రం చూడ్డానికి నిజంగా సముద్రంలాగానే ఉంది. కుమ్మరి ఉలిగప్ప రోడ్డువారా కుండల్ని అందంగా పేర్చి అమ్ముకుంటుంటాడు. వాన నీటి వేగానికి కుండలు కొట్టుకుపోతున్నాయి. కొట్టుకు పోకుండా ఆపగలిగిన వాటిని ఆతని భార్యా పిల్లలు ఆపారు. పోయింది మట్టే అనుకున్నాడు ఉలిగప్ప. పోయింది రెక్కల కష్టమే అనుకున్నది అతని భార్య.

ఉత్తప్ప ఎలాగో ఓపిక చేసుకోని రాంపిరెడ్డి ఇంటికి వచ్చాడు. అతను పెట్టి ఇచ్చిన సూప్ తాగి రాం.పి.రెడ్డి అతని భార్య కాస్త తేరుకున్నారు. రెడ్డి బంగ్లా భద్రంగాలేదని మీ ఇంటికి తీసుకు వెళ్ళమని రాంపిరెడ్డి స్నేహితులకు ఫోన్ చేసే ప్రయత్నం చేశాడు ఉత్తప్ప. ఫోన్  పలకలేదు. వాన తెరిపిచ్చాక చూద్దామన్నాడు రాంపిరెడ్డి.

వానకు కూడా దళితులంటే అలుసే. చెప్పులు అమ్ముకునే ఆకులప్ప కొడుకులు, కొత్త చెప్పులు. పాత చెప్పులు కొన్నవి. రిపేర్‌కి తెచ్చినవి. అన్ని కొట్టుకుపోతుంటే, వాటిని కాపాడలేకపోయాడు. రాంపిరెడ్డి బంగ్లాలో తూర్పువైపు గోడ నాని రెండుగా చీలి విరిగి పడింది. ఏ వైపు గోడలు ఆ వైపు విరిగి పడిపోయాయి. మొదటి అంతస్తు అంతా గ్రౌండ్ ఫ్లోర్ మీద ఉన్నది. బంగ్లా పడిపోతున్న శబ్దానికి జనం పరుగున వచ్చారు. రాంపిరెడ్డి, అతని భార్య శిథిలాల క్రింద ఎక్కడ ఉన్నారో తెలియదు.

వాన నీటి ఉరవడి తగ్గింది. పండమేటి ప్రవాహంలో వేగం తగ్గింది. డ్రైవర్‌ల కాలనీలో పడిపోయిన ఇంటి నుంచి తల్లిబిడ్డల శవాలు వెలికి తీసి రోడ్డు మీద పడుకోబెట్టారు. భర్త ఇంకా రాలేదు. ఏడ్చేవారు ఎవరు లేరు. ఎవరిపనుల్లో వారు ఉన్నారు. హాస్టల్ విద్యార్థుల్లో సగం మంది జాడ తెలియదు. ఏమయ్యారో, ఎక్కడ ఉన్నారో? తెలియదు.

అనంత జీవనంలో వరద బీభత్సం రాళ్ళకరిగిస్తుంది. గంగిరెడ్డి ముగ్గురు నాకొడుకులు ముగ్గురు కొడుకులు దుర్మార్గులే గోవిందరెడ్డి నేలగల్లు కోటలో ఉంటాడు. శత్రువును నామ రూపాలు లేకుండా చేయడంలో ఆరితేరిన సమర్థుడు. నేలగల్లు కోట నేలమాళిగల్లో వందలాది శవాల అస్థిపంజరాలు ఉన్నాయని జనం చెప్పుకుంటారు. అవన్నీ అతనికి అడ్డు వచ్చిన వాళ్ళవే తమ్ముడు రాంపిరెడ్డి ప్రియురాలు ఎలిజిబెత్ అతని కాళ్ళకు నమస్కరించకపోవడంతో ఆమె అతనికి నచ్చలేదు. అతన్ని, అతని భార్యను కోటకు ఎప్పుడూ ఆహ్వానించలేదు.

గోవిందరెడ్డి భార్య ఉరి వేసుకోని చనిపోయిన తరువాత అతను మళ్లీ పెళ్లి చేసుకోలేదు. ఏ స్త్రీతో సంబంధం పెట్టుకోలేదు. అతను ఎవరిని చంపినా కేసు ఉండదు. ఉంటే రాంపిరెడ్డి అతని అంతు చూస్తాడు. మరొక తమ్ముడు వెంకటేశ్వర రెడ్డి పెళ్ళి చేసుకోలేదు. కానీ స్త్రీలోలుడు. వెంకటేశ్వర్‌రెడ్డి మితిమీరి స్త్రీలతో తిరిగితే గోవిందరెడ్డి మితిమీరి ప్రాణాలు తీయగా, రాంపిరెడ్డి మితిమీరి హంతకులను కాపాడేవాడు. మితీమిరడం అన్నదమ్ముల్లకు వారసత్వపు హక్కు ఫ్యాక్షన్ రాజకీయాల్లో కోట గోడ కూలింది. నేలమాళిగ బయటపడింది. అస్థి పంజరాలు బయటపడ్డాయి. పిల్లి లేవలేనప్పుడు ఎలుక ఎక్కిరించినట్లు ఎ.ఎస్పీ బజారన్న పోలీస్ డ్రస్‌తోనే

కోటలోకి ప్రవేశించాడు. అస్థి పంజరాల్తో తనకు సంబంధం లేదని స్టేట్‌మెంట్ ఇస్తే ఫైల్ క్లోజ్ చేస్తానన్నాడు ఆఫీసర్.

గోవిందరెడ్డి పొగరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి నేను జమీందారిని అంటే పాలెగాణ్ణి అంటే దేవుణ్ణి, దుష్టులను చంపాను, చంపించాను అని ఏవేమొ చెప్పి రాయించి సంతకం చేశాడు. అతడి పాపం పండింది. ఎ.ఎస్పీఓ బజారన్నకు డ్రస్ ఇచ్చిన బలం, అహంకారం, అధికారం ఉంది. గోవిందరెడ్డి గుండెలమీదతన్నాడు. మూడు రోజులు ఆరు పోలీస్ స్టేషన్‌లలో చిత్రహింసలుపెట్టారు. నోటికి ప్లాస్టర్ వేశారు. కనపడకుండా గోనె సంచిలో మూట గట్టారు. గుండు చేయించారు. మీసాలు తీయించారు రోడ్డుపై ఊరేగించారు. గోవిందరెడ్డి తాను చంపిన వాళ్ళెవరిని ఇంత సజీవంగా చంపలేదు. బేయిల్ మీద బయటకు వచ్చిన గోవిందరెడ్డి ఇక కోటలో ఉండాలనుకోలేదు. రైతుల్ని పిలిచి వారు సాగుచేస్తున్న భూముల్ని వాళ్ళకు రాసి ఇచ్చారు. బెంగుళూర్‌కి మకాం మార్చాడు. తనపై కేసు విచారణ జరుగుతుండగానే చనిపోయాడు. అతని చావుకు ఎవరు దు:ఖించలేదు. వెంకటేశ్వర్ రెడ్డి చెయ్యెత్తు మనిషి, మహారాజుకళ, చదువు అబ్బలేదు. ఇల్లు పట్టలేదు. తండ్రి లెక్కలేదు. దేశదిమ్మరి ఆడపిచ్చితో పాటు తాగుడు వ్యసనం కూడా ఉంది. అధికార పార్టీ అతన్ని పార్లమెంట్‌కు పోటీ చేయమని కోరింది. పార్టీ బలంతో ఆరు సార్లు ఎన్నికయ్యాడు. పేపర్లు చదవడం రాలేదు. పార్లమెంట్‌లో ఏమి జరుగుతుందో తెలియదు. బుద్ధి పుడితే ఢిల్లీకి పోయేవాడు.

రాంపిరెడ్డి ఒక బ్రిటిష్ ఎస్పీని హత్య చేయించాడు. వెంకటేశ్వర్ రెడ్డి తన తమ్ముడి మీద వచ్చిన హత్యకేసు మాఫీ చేయడానికి తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించాడు. ఒకనాడు త్రాగిన మత్తులో వెంకటేశ్వర్ రెడ్డి చనిపోయాడు. అతనితోపాటు అతని శరీరం మీద ఇద్దరు అందమైన యువతులు కూడా చచ్చిపడిఉన్నారు. అది హత్యో, ఆత్మ హత్యో కూడా తెలియదు. సహజమరణం అని సరిఫికేట్ పుట్టించారు. అనంతపురంలో గంగిరెడ్డి, అతని ముగ్గురు కొడుకులు జరిపిన ఘోరాలు అబద్ధాలు కావు. అతిశయోక్తులు కావు, ఇనాక్ పాలెగాళ్ళ చర్యలను, చిత్త వృత్తిని వివరంగా తెలియజేశారు. కానీ గ్లోరీపై చేయలేదు.

'అనంత జీవనం' నవలలో అనంతపురం పట్టణ ప్రజల జీవితపు వెలుగునీడల చిత్రణ వున్నది. ఇంకా చరిత్రలో అనంతపురం, ఇక్కడి కరువు కాటకాలు, పాలెగాళ్ల సంస్కృతి, కాలంతోపాటు పట్టణ విస్తరణ పెరిగిన నాగరకత దానివలన వచ్చిన ఇక్కట్లు – ముఖ్యంగా అక్కడి అణగారిన అట్టడుగు వర్గాల కష్టాలు, కన్నీళ్లు వున్నాయి"(ఇనాక్ ,కొలకలూరి 2011: 242) అని డా॥ కడియాల రామమోహనరాయ్ పేర్కొన్నారు.

శ్రీమతి బి.టి మాధవి ఈ నవలలోని ముఖ్యమైన విషయాలను పట్టుకున్నారు. యద్దీరప్ప ఐదవ భార్య ఇల్లు ఆ వర్షం వల్ల కూలిపోతే పక్కింటి ఖలందర్ ఆదుకున్నాడు. "అనంత జీవనం నవలలో ఇనాక్‌గారు నాగన్న పాకీమనిషి పాత్రల ద్వారా మన సమాజంలో బాగా వ్రేళ్ళూనిన కులవ్యవస్థను అందులోని దుర్మార్గాలను కళ్లకు కట్టినట్టు చిత్రీకరించారు. రాయలసీమలోని అన్ని ప్రాంతాలలో ముఖ్యంగా కడప, కర్నూలు, జిల్లాలో అనేకమంది నాగన్నలను మనం చూడవచ్చు. ప్రతీకగా గొర్లమందను కాపాడే అంకాలప్ప పాత్రను, అలాగే అక్కడి ప్రజలు తాము చేస్తున్న పనిలో నిబద్ధతతో, నిజాయితీతో ఉంటారన్న దానికి సాక్ష్యంగా యెద్దీరప్ప, ఉత్తప్ప, సాలమ్మల పాత్రలను రచయిత తీసుకొని వారిని వర్తమాన జీవిత ప్రతిబింబాలుగా చూపారు. అలాగే వటవృక్షం నీడలో పుట్టినా పెరిగి వచ్చిన గట్టిపిండాలుగా బజారన్న పాత్రను వీరోచితంగా వర్ణించారు''రాయలసీమ జనజీవనాన్ని చిత్రించిన 'అనంతజీవనం'(ఇనాక్,కొలకలూరి.2011: 282) అని చక్కని పరిశీలన చేశారు. వర్షం సమానత్వానికి ప్రతీకనీ, దానికి రాజు, పేద అనే తేడా వుండదని శ్రీ అకుల శ్రీకృష్ణ 'వర్షంలో

అనంతపురం' అనే వ్యాసంలో పేర్కొన్నారు. జమీందారుల కబంధహస్తాల్లో అణచివేతకుగురై సమానత్వంకోరే పీడిత వర్గాల ఆశయం. ఇదే ఈ నవలా సందేశమని ఆయన భావించారు.

వర్షం సమానత్వానికి ప్రతీక. అదేవిధంగా అది చైతన్యానికి ప్రతీక. రాయలసీమ ప్రజలను దోపిడీ చేస్తున్న, పీడిస్తున్న అగ్రకుల రెడ్ల ఆధిపత్యానికి ప్రతీక ఆ పాత బంగ్లా. అది పీడిత ప్రజల చైతన్యం వల్ల కూలిపోవాలని రచయిత ధ్వని. అనంతపురంలోని మాదిగ, మాల, బీసీకులాలు, ముస్లిం మైనార్టీలంతా రెడ్డికుల ఫ్యాక్షనిజంవల్లా, వాళ్ల పెత్తనం వల్ల బాధితులయ్యారు. అందుకే, ఈ బహుజనులంతా ఏకమై శిథిలస్థితిలో వున్న ఈ ఆధిపత్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమిస్తే కూలిపోతుందనీ, పీడితులంతా సమానులవుతారనీ ఆయన సంకేతిస్తున్నాడు. పోలీసు, న్యాయవ్యవస్థ, రాజకీయ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకొని, పాలెగాళు ఏమైనా చేయొచ్చునే అహంకారంతో రెడ్డి వర్గం రాయలసీమ సామాజిక జీవితాన్ని దుర్భరం చేసింది. వయసుడిగిన రాం.పి.రెడ్డి తన ఇంగ్లీషు భార్యతో కలిసి ఆ వర్షంలో ఒంటరిగా కోటలో భయంభయంగా ఉండటం, చివరికి చనిపోవడం అంతా సహజంగా జరిగిపోతుంది. అదేసమయంలో వర్షం వల్ల అణగారిన కులాలు కూడా ఇబ్బందిపడుతాయి. కానీ అది ప్రధానం కాదు. నీతి, నైతిక విలువలులేక గోవిందరెడ్డి, రాం.పి.రెడ్డి పతనమైపోయిన తీరును రచయిత అద్భుతంగా చిత్రించాడు. రచయిత ఎక్కడా అక్కర్లేని సందేశాలిచ్చే పనిని చేయలేదు. పాత్రలు, సందర్భాలే కథను నడిపిస్తాయి. పాత్రలు, కథలోని వాతావరణం రెండూ వేర్వేరుగా ఉండవు. పాత్ర ప్రవర్తనే వాతవరణంగా, వాతావరణమే చాలాసార్లు ఒక పాత్రగా మారిపోవటం ఈ నవల ప్రత్యేకత. శిల్పపరంగా, కథాకథనం, ఎత్తుగడల రీత్యా ఈ నవల చాలా గొప్పదని విమర్శకుల అభిప్రాయం.

**<u>3.2.3..అనంత జీవనం పాత్రలు</u>**

అనంత జీవనంలో ఇనాక్‌గారు ఫ్యాక్షనిస్టుల జీవితాలను, వారిజీవితాల్లోని విలాసాలను, కింది కులాల జీవితాల మధ్య ఉన్న వ్యత్యాసాలను వర్ణించారు. ఇద్దరు అనుకోని తుపాన్‌లో చిక్కుకుని ఏ విధంగా ప్రవర్తించారో తెలియజేశారు. పారిశుద్ధ్య కార్మికులైన మాదిగలు ప్రముఖ పాత్ర వహించి నగరంలో ఉన్న చెత్తను తొలగించడానికి బహుజన కులాలను కలుపుకుని ఐక్యంగా ఉండి అనంతపురాన్ని వరద ముంపు నుండి  కాపాడుకుంటారు. ఈ సందర్భంగా ఆయా పాత్రల ప్రవర్తనను కింది విశ్లేషణ తెలియజేస్తుంది.

**<u>3.2.3.1.యెద్దీరప్ప – నైతిక వ్యక్తిత్వం:</u>**

బేలుదారి మేస్త్రీ మాదిగ కులస్తుడు. అతనికింద పాతిక మంది కట్టుబడి బేలుదారులు, పది మంది పనివాళ్ళు, నలభై మంది ఆడవాళ్ళు, పాతిక మంది పిల్లలు పనిచేస్తుంటారు. ఏ పని ఎవరు చేయాలి, ఎక్కడ చేయాలని పనులు పురమాయిస్తుంటాడు. యెద్దీరప్పకు పని అప్పగిస్తే తాము నిశ్చింతగా ఉండవచ్చునని యజమానుల నమ్మకం. అతని దగ్గరపనిచేస్తే సుఖశాంతులు ఉంటాయని పనివాళ్ళ భావన.  మిగిలిన ఇంటిపనిచేసే ఇసుక, చెక్క వాళ్ళు ఇంటి యజమానితో మాట్లాడరు. యెద్దీరప్పతోనే మాట్లాడతారు. ఇంటి యజమానితో మాట్లాడి వాళ్ళకు బట్వాడా ఇప్పిస్తాడు. పనులు చేసేవాళ్ళకు, యజమానులకు మధ్య వారధిగా ఉండి అందరి నమ్మకాన్ని, విశ్వాసాన్ని చూరగొన్నాడు.

యెద్దీరప్ప ఎవరిని తిట్టడు. మాట తూలడు. కోపం తెచ్చుకోడు. 65 ఏళ్ళుగా బేలుదారి పనిలో రాటు దేలాడు. 15 ఏళ్ళ వయస్సులో ఈ పనిలో చేరాడు. కాని అతనికి ఆడవాళ్ళ బలహీనత. అంతా బేలుదారి పనికి వచ్చే ఆడవాళ్ళే. అలా పరిచయమై వదలకుండా వున్న వాళ్ళను పెళ్ళాలన్నాడు. వారికి వేరు వేరుగా ఇండ్లు కట్టించాడు. అలాంటి వారు ఐదుగురు భార్యలు ఉన్నారు. "యెద్దీరప్పకి 80 యేళ్ళుంటాయి. అయినా మాట ఖంగున మోగుతుంది.

చిన్న శబ్దం కూడా వినపడుతుంది. కంటి చూపు తగ్గలేదు. కాళ్ళ నడక సజావుగా ఉంది. కీళ్ళ నొప్పులు లేవు. ఇప్పటికి తిండి పుష్టి తగ్గలేదు. కాయ పారు మనిషి, కష్ట జీవి. కండలు తిరిగిన శరీరం, పదేళ్ళ కిందట ఐదవ ఆమెను చేరదీశాడు. ఇల్లు కట్టాడు. ఇద్దరు పిల్లలు.... పెద్ద వాళ్ళు నలుగురూ (భార్యలు) బ్రతికే ఉన్నారు. వాళ్ళకి పిల్లలు ఉన్నారు. మనవళ్ళు, మనవరాళ్ళకు కొందరికి పెళ్ళయి పిల్లలున్నారు. నాగలచ్చుమ్మకు నలభై ఏళ్ళు దాటి ఉ ండవు.....ఇప్పుడూ పనికి పోతూనే ఉంటుంది. బేల్ దారి కూలీ" (ఇనాక్ కొలకలూరి: 2007. అనంత జీవనం. జ్యోతి గ్రంథాలయం, హైదరాబాద్. పు. 28,29) గా పనిచేస్తున్నారు. ఆమెకు ఇల్లు కట్టించడానికి ఎక్కడా స్థలం దొరకక వంక పోరంబోకులో స్థలం ఆక్రమించి మెరకపోసి బండరాయితో గట్టుకట్టి దానిపై ఇళ్ళు కట్టాడు. వరద ఉధృతికి ఆ ఇల్లు పడిపోయింది. చిన్న భార్యకు, పిల్లలకు ఏమి కాలేదు. భార్య పిల్లలను కలప పనిచేసే ఖలందర్ ఇంట్లో పెట్టాడు.

అనంతపురంలో ఏభై ఏళ్ళనుంచి కట్టిన వాటిలో పదవ వంతు యెద్దీరప్ప కట్టినవే. తాను కట్టిన ఇళ్ళ పరిస్థితి ఎలా ఉందోనని నలుగురు మేస్త్రీలను వెంట పెట్టుకొని వానలో ఊరంతా తిరిగాడు. గతంలో కట్టిన, ప్రస్తుతం కడుతున్న ఇంళ్ళకు ఎటువంటి ప్రమాదం లేదు. వానలో యెద్దీరప్ప వచ్చి ఇండ్ల యోగ క్షేమాలు కనుక్కోవడం యజమానులకు ఆనందంగా ఉంది. మిగిలిన నలుగురు భార్యల ఇల్లు భద్రంగానే ఉన్నాయి. ఐదవ భార్య ఇంటికే అవస్థ. "మాదిగోడు, మొగోడా మొనగాడా! ఐదుగురు పెళ్ళాలా (పు.31) అని ఎవరెవరో తూలనాడారు. అంత మంచి వాడికి ఆ బలహీనతే లేకపోతే వంకలో ఇళ్ళు కట్టేపనే పడేది కాదు. అది కూలి పోయేదే కాదు. "యెద్దీరప్ప సొంత ఇళ్ళే పడిపోయింది, ఇంక మన యిల్లు ఏం కట్టించగలడని ఇంళ్ళు కట్టించుకోదలసిన వాళ్ళు సందేహించే అవకాశం వచ్చేస్థితి రాకుండా ఉండేదని" (పు. 31) కొంత మంది అనుకున్నారు.

కానీ యెద్దీరప్ప తాను కట్టిన ఇల్లు పడిపోయినందుకు క్షణ కాలం బిత్తరపోయాడు. అయితే తనయిల్లే పడిపోయినందుకు దు:ఖించలేదు. వంకలో ఇల్లుకట్టడం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా తప్పే అని నిర్ధారించుకున్నాడు. మళ్ళీ గట్టి ఇళ్ళు కట్టిస్తాతెమ్మని ఐదవ భార్య నాగలచ్చుమ్మకు వాగ్దానం చేశాడు. యెద్దీరప్ప తప్పకుండా మాట నిలబెట్టుకునే మనిషి. ఎందుకంటే వంకలో ఇళ్ళు కట్టడం తప్పని తెలుసుకున్నాడు. ఇళ్ళు కట్టే పనిలో తన శక్తి సామర్థ్యాల మీద విశ్వాసం సడలలేదు. కానీ జనంలో అవిశ్వాసం కలుగుతుందేమోనని శంక పట్టుకుంది. నాగలచ్చుమ్మ ఇల్లు ముందు గట్టిగా కట్టాలి. ఆ పైన ఒప్పుకున్న పనులు మరింత శ్రద్ధగా పూర్తిచేయాలి. వయస్సు పై బడుతుండగా ఈ పని మానుకోవాలని యెద్దీరప్ప ఆలోచనలో పడ్డాడు. కానీ ఈ పనిలేకపోతే ఇంకొక పనిచేయలేడు. వేరొక పనిచేసి బ్రతుకలేడు. అందుకే యెద్దీరప్ప తన మేస్త్రీలతో ఎక్కడికక్కడ తన అవసరం ఉందో అక్కడ పనులు చేయడానికి సిద్దంగా ఉన్నాడు. ఈ పాత్ర నైతికంగా ఎంతో ఉన్నతమైనదిగా రచయిత చిత్రీకరించాడు. గృహ నిర్మాణం అంటే పట్టణాన్ని కొత్తగా నిర్మించడమనే అర్థం. తాను నిర్మించిన ఇల్లులు తుఫాన్‌లో కూలిపోయాయేమో గమనించారు. అంటే ఇది తానను తాను పరిశీలన చేసుకోవటమే. ఇక్కడ ఇల్లు కట్టడం అంటే ఉద్యమాన్ని నిర్మించటంగానే భావించాలి. ఆ ఉ ద్యమ క్రమంలో తన ఇల్లే కూలి పోవటాన్ని తనను తాను ఆత్మ పరిశీలన చేసుకుని నైతికంగా ఎదగడానికి కృషి చేశాడని చెప్పవచ్చు.

### 3.2.3.2.గొర్ల అంకాలప్ప- అమాయకత్వానికి నిలువెత్తు నిదర్శనం :

సాకె అక్కులప్ప మొదటి కొడుకు. జంగాల పల్లి స్వగ్రామం. బుడిగెజంగం కులం, చదువు అబ్బలేదు. పని పాట చేతకాదు. కాళ్ళు చేతులు బాగానే ఉన్నాయి. తెలివే పిసరంత

కొదవ సుబ్బారాయుడనే గొర్రెల యజమాని మందల కాపర్లలో ఒకడు. తిండికి నిద్రకు ఏ భంగం రానివ్వడు. కాలికొద్దీ నడువ గలడు. యజమానితో గొర్లు తోలుకొని అనంతపురం వచ్చాడు. అతనికి పట్నం అంటే భయమే! ఇప్పుడే వస్తానని, ఇక్కడే ఉండమని యజమాని ధర్మవరం వెళ్ళాడు. వాన ఎక్కువయ్యింది. వానలో చిక్కుకున్నాడు యజమాని సుబ్బారాయుడు. రోడ్డు వార పాతూరు బ్రిడ్జి చెట్టుకింద ఇరవై పోటేళ్ళ మందతో ఉన్న అంకాలప్ప మాట మీద నిలబడే మనిషి. అందుకే అక్కడే యజమాని కోసం నిలబడ్డాడు. యజమాని సుబ్బారాయుడు వారం వారం అనంతపురం సంతలో గొర్లు అమ్ముతాడు. పొట్టేలు మాంసానికి అనంతపురంలో మంచిగిరాకీ. ఎంత లేదన్న రాయుడి సంపాదన నెలకు లక్ష. సంతలో అమ్మే పనిమీద గొర్లు అంకలప్ప తోలుకు వచ్చాడు. వరద ఉధృతి ఎక్కువైంది. యజమాని రాలేదు. గొర్లు వరదలోకి పోతున్నాయి. తాళ్ళతో కట్టివేయాలంటే తాళ్ళు లేవు. ఎదికాడు. దొరకలేదు. నిన్న మధ్యాహ్నం తిన్న ముద్ద. వానలో ఆకలి,దాహం,మంద అలివి కాకుండా ఉంది. ఆపడం తనవల్ల కావడం లేదు. అంకాలప్పకు ఏడుపు వచ్చింది. ఒక్కసారిగా వరద ఎక్కువగా వచ్చింది. గొర్రెలు కొట్టుకుపోతున్నాయి. ఆపడానికి నీళ్ళలో వాటి వెనకే వెళ్లాడు. నాలుగు పొట్టేళ్ళను పట్టుకోని ఆగిపోయాడు. పొట్టేళ్ళను పట్టుకొమ్మంటే వాటి వెనుక పడ్డారు జనం.వాటిని పటుకొని తనకు అప్పగిస్తారని, అనంతపురం జనం మంచివాళ్ళని ఆశతో ఏదురు చూస్తున్నాడు. ఎవరు పొట్టేళ్ళను తీసుకువచ్చి ఇవ్వలేదు. ఎవరో పొట్టేళ్ళతో వెళుతుంటే అన్న ఆ పొట్టేలు నాది అన్నాడు. నాకు వంకలో దొరికిందని ఆ యువకుడు వెళ్ళిపోయాడు. యజమాని వచ్చి నేను ఉండమన్న చోట ఉండక ఎక్కడికి వెళ్ళావంటే ఏం చేయాలో తెలియక భోరున ఏడ్చాడు.

నాలుగు గొర్రెపోతులతో నిలబడ్డ అంకాలప్ప సుబ్బారాయుడిని చూడగానే బావురుమన్నాడు. వరద ఉధృతిలో గొర్రెలు ఏలా కొట్టుకుపోయాయో వివరించాడు. దానితో పోనీలేరబ్బా! నీవు సావలేదు బతికుండావంతే సాల్ సాల్ రబ్బా అన్నాడు. తోపుడు బండి వద్ద వేడి వేడి ఇండ్లీలు కడుపు నిండా తినిపించాడు. అంకాలప్ప అమాయకుడు. అతని అమాయకత్వం వల్లనే పెళ్ళికి పిల్లని ఎవరు ఇవ్వలేదు. గొర్లు వరదలో కొట్టుకుపోతున్న సమయంలో కొట్టుకు పోతున్న గొర్లలో దొరికిన వరకు చేజిక్కించుకున్నాడు. మిగిలిన గొర్లను వాటికోసం వెళ్ళిన జనాలు తీసుకు వచ్చి ఇస్తారని, ఆశపడ్డాడు. అనంతపురం వాసులు అంత నిజాయితీ పరులైతే ఆ వరద వచ్చి ఉండేది కాదు. అనంతపురంలో వంకల్ని, డొంకల్ని, మెరువ కాలువలను జనాలు ఆక్రమించారు. అనంతపురంలో వానరాదని వచ్చినా తమకేం కాదని పూర్తి నమ్మకంతో ఉన్నారు. కాలువలు మేరువలు ఆక్రమణ కాకముందు ఇంతే వర్షానికి అంతకుముందు ఎలాంటి ప్రమాదాలు జరుగలేదు. అంకాలప్ప పాత్ర కష్టాలకు కారణమైన అనంతపుర ప్రజలు పర్యావరణానికి చేసిన కీడును స్పష్టంగా రచయిత తెలియజేశాడు.

**3.2.3.3.కట్టెల అడితి నాగన్న- పట్టుదలకు మారుపేరు:**

నార్పల రెడ్లు, కమ్మలు నరుక్కు చస్తున్నప్పుడు ఫ్యాక్షనిజానికి బలికాలేక పసితనంలో పారిపోయి అనంతపురం వచ్చాడు. రంపపు పొట్టు రాసులు అమ్మే పనివాడిగా పసి నాగన్న చేరాడు. ఏ మిల్లులో కూలీగా చేరాడో ఆ మిల్లు వారసుడై యజమాని అయ్యాడు. సామిల్లు అతని భార్య తండ్రిది. ఒక్కటే కూతురు, మామ గతించాడు. భార్య పిల్లల తల్లి అయ్యింది. సామిల్లు నాగన్న సొంతం అయ్యింది. అతనికాడ షాపులో అరువు బేరంలేదు. లెక్క కట్టు! కలప ఎత్తు! సామిల్లులో అన్ని పనులు అతనికి తెలుసు. అక్టోబర్ నుండి ఇల్లు కట్టుబడి పనులు మొదలౌతాయి. ఇండ్లకు కలప అమ్మడానికి నల్లమల్ల అడవులనుండి కొనుగోలు చేస్తాడు. కొన్ని బిల్లులు చెల్లించి, కొన్ని చెల్లించకుండా దొంగదారిలో తీసుకొస్తాడు. పెద్ద మొద్దులను సైజులుగా కోసి అమ్ముతాడు. కొయ్యగా వచ్చిన రద్దును పొయి కట్టెలుగా అమ్ముతాడు.

అది సైదు బిజినెస్సు. అప్పటికే అనంతపురంలో చెట్లు క్రమక్రమంగా కనుమరుగయ్యాయి.

ఆగకుండా కురుస్తున్న వాన అడితి పాలిట శాపంలా మారింది. వరద ఉధృతికి ప్రవాహంలో తేలి కొట్టుకుపోసాగాయి. వాటి వెనుక నాగన్నతో పనివాళ్ళు బయలుదేరారు. అంతకు ముందు ఆరు నెలల క్రితం నార్పుల రైతులు అరువుకి కలప అడిగారు. నాగన్న ఇవ్వనన్నాడు. "మాదిగోనికెంత మంకు! మరేదే లేదు. మాదిగ ముండాకొడిక్కి (పు. 43) అన్నారు. మాట మాట పెరిగింది. రైతులు కొట్టబోయారు. వర్కర్లు చేయి చేసుకున్నారు. నలుగురు విడదీశారు. కానీ మే నెలలో రైతులు అడితికి నిప్పుపెట్టారు. అడితిని ఆర్పడానికి ఫైరింజన్‌లు లేవు. రెండురోజులు పట్టింది. ఆరిపోవడానికి నాగన్న బిచ్చెమెత్తుకుంటా డనుకున్నారు. కాని ఎలాగో కొలుకోని వానకు కొట్టుకుపోయిన సరుకు తీసుకురావడానికి నాలుగు నెలలు పట్టింది. అప్పుడు అగ్గి ఆర్పే నీరు లేదు. ఇప్పుడు నీరు పోయే మార్గంలేదు. వరద అడితిని రెండు గంటల్లో ఖాళీ చేసింది. నాగన్న మురుగు కాలువలో దుంగలకోసం వెతుకులాట ప్రారంభించాడు. చిన్నవి దొరకలేదు. పెద్ద పెద్ద దుంగలు దారి దాపుల్లోనే కంప చెట్లకు తగులుకొని ఆగిపోయాయి. నీటి ప్రవాహం తగ్గాక గానీ వాటిని తీయలేదు. అందాకే అవి అక్కడే ఉంటే తెచ్చుకోవచ్చు. నాగన్న పరిస్థితి ఏమిటనేది మనిషి ప్రవర్తన మీదే ఆధారపడి ఉంటుంది. ప్రకృతికి ఎదురు తిరిగితే ప్రళయం సృష్టిస్తుంది. దానికి కాలమే సమాధానం చెబుతుంది. అడితి నాగన్న పట్టుదలకు మారుపేరు కాబట్టి ఎలాగైన కష్టపడి తాను అనుకున్నది సాధించగలడు.

**<u>3.2.3.4. కుమ్మర ఉలిగప్ప – ఆత్మవిశ్వాసం కోల్పోనితనం:</u>**

భార్య పిల్లలతో కుండలు అమ్ముకొని జీవనం చేసేవాడు. "కుల వృత్తి ఊళ్లో కూడ ఉండకుండా చేసింది. అనంతపురం అన్నం పెడుతుందని వస్తే వర్షం పట్టుకుంది" (పు. 114). వర్షం రాకపోతే అనంతపురంలో ఎండాకాలంలో కుండలకు, కడవలకు పూజలకు మంచి గిరాకీ. అందుకే నవంబర్‌లో వచ్చి జూన్ వరకు కుండలు అమ్ముకుంటాడు. పది రోజుల కిందట రకరకాల మట్టి పాత్రలు తీసుకువచ్చాడు. ప్లాస్టిక్ కవర్‌తో పాక వేసుకున్నాడు. రాత్రి తోలిన గాలికి ప్లాస్టిక్ పాక పడిపోయింది. అప్పటికే పాకలోకి నీరు వచ్చింది. నీరు తాకిడికి భార్య, పిల్లలు లేచి కూర్చున్నారు. వాన ఉరువడికి నీటి కుండలు కదిలాయి. రోడ్డు కాలువలాగ మారింది. అన్ని పాత్రలు ప్రవాహ వేగంలో కొట్టుకుపోసాగాయి. రిపబ్లిక్ నాడు కవాతు చేసే సరంజామాలాగా కుండలు వరుస క్రమంలో గొప్ప క్రమశిక్షణతో ఒకదాని వెనుక ఒకటి డ్యాన్స్‌వేస్తు సొగసుగా తరలిపోతున్నాయి. కొట్టుకుపోతున్న కుండలను చూసి జనం ఇండ్లనుండి బయటికి వచ్చి వానకు లెక్కచేయకుండా దొరికినవి పట్టుకుపోతున్నారు. ఉలిగప్ప కుటుంబం చేతులతో పట్టుకోగలిగినన్ని పట్టుకోని బావురుమన్నారు. అతన్ని చూసి భార్య పిల్లలు ఏడ్చారు. "పోయింది మట్టే కదా అనుకున్నాడు ఉలిగప్ప. పోయింది రెక్కల కష్టమే అనుకుంది భార్య" (పు. 115). బతికి ఉంటే భూమితల్లి ఎంత మట్టినైన ఇస్తుంది. రెక్కల కష్టం ఎప్పుడు ఉండేదేనని ఓదార్చుకున్నాడు. ధైర్యం కూడదీసుకున్నాడు. వాన తగ్గిన తరువాత పగిలిన పాత్రలు ఏమైన దొరుకుతాయేమోనని ఉలగప్ప వెతకడానికి వెళ్ళాడు. పగలక పోయిన పాత్రలు ఎందుకు దొరుకుతాయి. ఎవరో ఒకరు ముందే పట్టుకొని పోయి ఉంటారు. కుండలను వెతుకుతూ వెళ్ళి ఉత్త చేతులతో వచ్చాడు ఉలిగప్ప. అనంతపురం ప్రజల నిజాయితీని, లేమిని తెలియజేయడానికి కుమ్మరి ఉలిగప్ప పాత్రను రచయిత సృష్టించాడు.

**<u>3.2.3.5. సాలమ్మ –కష్టాలకు ఎదురీదే వ్యక్తిత్వం:</u>**

రాం.పి.రెడ్డి బంగళాలో వంట మనిషి. సాలమ్మ తల్లి దండ్రులకు పదోపిల్లకూడా ఆడపిల్లే పుట్టిందని ఇక చాలు అని సంతానం ప్రసాదించే దేవతకు మొక్కుకున్నారు. అంతటితో పిల్లలు పుట్టడం ఆగిపోయింది. ఆడ పిల్లలను చూసి తల్లి దండ్రులు తల్లడిల్లి పోయేవారు.

రాం.పి.రెడ్డి పనిపాప కావాలంటే తక్షణం పంపింది తల్లి. అప్పుడు సాలమ్మకి పదేళ్ళు, నలభై ఏళ్ళనుండి పనిచేస్తుంది. వాళ్ళకు ఏం కావాలో తెలుసు. వాళ్ళకు తలలో నాలుక అయ్యింది. దేశ విదేశీ వంటకాలలో రాటు తేలిపోయింది. సాలమ్మ భర్త బిళ్ల బంట్రోత్‌గా పదవీ విరమణ చేశాడు. నలుగురు పిల్లలకు పెళ్ళిళ్ళు అయిపోయాయి. పిల్లలు పుట్టారు. రాం.పి.రెడ్డి దంపతుల కంటే సాలమ్మ దంపతులే వృద్ధులుగా కనపడుతున్నారు. అయిన సాలమ్మ పొద్దున్నే ఆలస్యం లేకుండా పరుగున బంగ్లాకు వెళ్తుంది. ఆరుగంటలకే ఇద్దరికి బెడ్ కాఫీ ఇవ్వాలని, టిఫిన్ మధ్యాహ్నం జావ లాంటిది ఇస్తుంది. వర్షంలో సాలమ్మ దొడ్డిలోకి వెళ్ళినప్పుడు కాలుబంద క్రిందపడి బెనికింది. కేకపెడితే భర్తవచ్చి లేపి లోపలికి తీసుకువెళ్ళాడు. తరువాత ఎముకల డాక్టర్ వద్దకు సాలమ్మను భర్త తీసుకువెళ్ళాడు. అందువల్ల సాలమ్మ రెడ్డి బంగ్లాకు పనికి రాలేదు. ఎప్పుడైన సాలమ్మ రాకపోతే ఊతప్ప వచ్చేవాడు. ఊతప్ప రాకపోతే సాలమ్మ వచ్చేది. కానీ ఈ రోజు ఇద్దరు ఒకేసారి పనికి రాలేదు. ఇలా అనుకోని విధంగా పని మానేస్తే ఎలాంటి ప్రభావం ఉంటుందో యజమానికి అవగతం అయ్యేలా ఈ పాత్ర చిత్రీకరించడమైనది.

**<u>3.2.3.6. ఉత్తప్ప ఉత్తమ సేవకు చిరునామా:</u>**

ఉత్తప్ప తల్లిదండ్రులు నేలగల్లు కోటలో పనిచేసేవారు. వారికి ఒక్క గానొక్క కొడుకు ఉత్తప్ప. అతనికి డ్రైవింగ్ రావడంతో రాం.పి.రెడ్డి ఏరి కోరి తీసుకువచ్చాడు. మర్యాదస్తుడు, మంచివాడు, పని మానడు. పొద్దు పొడవకముందే పనికి వస్తాడు. మిట్ట మధ్యాహ్నం సూర్యుడిలా రాం.పి.రెడ్డి మండుతున్న సమయంలో బంగ్లాలో పనిలో చేరాడు. అతనికిప్పుడు అరవై ఏళు ్ళ. లేక లేక పుట్టిన పిల్లోడు కావడంతో ఉత్తప్ప అని పేరు పెట్టాడు. గట్టప్ప అయితే యముడి కన్ను పడుతుంది. ఉత్తప్ప అంటే యముడు పట్టించుకోడని వాళ్ళ విశ్వాసం. అలాగే యముడు పట్టించుకోలేదు. మొదట్లో బంగ్లాలో ఉండే ఉత్తప్ప పెళ్ళి కాగానే కొట్టం వేసుకొని దూరంగా వెళ్ళిపోయాడు. అప్పట్లో ఉత్తప్పకు ఇద్దరు కొడుకులు. ఇద్దరు కొడుకులు ఆటోలు నడుపుతున్నారు. పెళ్ళిళ్ళయి వెళ్ళిపోయారు. కొట్టంలో భార్యభర్తలే ఉంటున్నారు. రాత్రి వానకు ఇంటిపై పెంకుపడి ఉత్తప్ప భార్యకు తల పగిలింది. కుయ్యో మొర్రో అంటుంటే ఆమెకు సపర్యలు చేస్తూ ఉన్నాడు. సాలమ్మ రాలేక ఉందని ఉత్తప్పకు తెలియదు. ఉత్తప్ప భార్యకు బాగా లేక రాలేకపోతున్నాడని సాలమ్మకు తెలియదు. ఒకేసారి ఇద్దరు బంగ్లాలోకి పనికి రాలేక పోయారు.

పొద్దున్నే లేచిన రాంరెడ్డికి బ్లాక్ కాఫీ తాగందే పూట మొదలుకాదు. బ్లాక్ కాఫీ తయారు చేసుకోవడం కోసం రెడ్డి స్టవ్ వెలిగించడానికి ప్రయత్నం చేశాడు. కాని స్టవ్ వెలగలేదు. తనకంటే బ్రిటిష్ వనిత ఎలిజబెత్‌కి బ్లాక్ కాఫీ కావాలి. ఆమె వచ్చేసరికి బ్లాక్ కాఫీ తయారు చేసివ్వాలని రాంపిరెడ్డి ఆరాటపడుతున్నాడు. కానీ కాఫీ చేయలేక పోయాడు. ఉత్తప్ప భార్యను ఆసుపత్రికి తీసుకు వెళ్ళాడు. కనుక బంగ్లాకు వెళ్ళడం ఆలస్యమయ్యింది. ఉ త్తప్ప వచ్చి హాల్లో లైట్ వేశాడు. ఉత్తప్పతో పాటు బంగ్లాలోకి వెలుతురు వచ్చింది. ఉత్తప్పను చూడగానే రెడ్డికి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లు ఉంది. టెన్నిస్ ఆడే యువకుడి మాదిరి ఉ త్తప్పకు ఎదురు వెళ్ళాడు. ఎదురొచ్చిన రెడ్డికి తనెందుకు రాలేక పోయాడో చెబుతుంటే రెడ్డి వినడం లేదు.దేవుడు ప్రత్యక్షమైనా, రెడ్డి అంతగా ఆనందించడు. ఉత్తప్ప క్షమాపణ కోరుతుంటే రెడ్డి పట్టించుకోవడం లేదు. రెడ్డి ఉత్తప్పను పట్టుకునే పరిస్థితి ఎప్పుడూ రాదు.

ఎప్పుడైన షేక్‌హేండ్ ఇచ్చి ఉండవచ్చు. ఎదురు వచ్చిన ఉత్తప్పను దగ్గరకు తీసుకుని కౌగిలించుకున్నాడు. ఉత్తప్ప ఊహించని ఆచర్యకు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. “స్వర్గం దిగి కాళ్ళ దగ్గరకు వచ్చినట్లు పొంగిపోయాడు. ఉత్తప్ప భుజం మీద ఉన్న రాం.పి.రెడ్డి కళ్ళలోంచి నీళ్ళు పడుతున్నాయి. .....తడుస్తున్న ఇంటి నీళ్ళు కాదు. కురుస్తున్న కంటి నీరు. ఉత్తప్ప వణికి పోయాడు. రాం.పి.రెడ్డి ఉత్తప్ప మెడ మీద నుంచి లేవలేదు. ఉత్తప్ప లేపలేదు.

కన్నీరు కురుస్తూనే ఉంది. ఇద్దరికీ సుఖంగా ఉంది" (పు. 86). మొదటిసారి రెడ్డి మనిషిని గుర్తించాడు. మనిషికి మనిషి ఎంత అవసరమో చనిపోయే ఒక్కరోజు ముందు రెడ్డికి అవగాహన అయ్యింది. అందుకే రెడ్డి గతాన్ని తలుచుకుని కన్నీరు కారుస్తూ ఉన్నాడు.

ఉత్తప్ప స్నూకర్- బిలియర్డ్స్ హాల్‌లో టేబుల్ కింద ఊడ్చాడు. టేబుల్ కిందకు నీళు ్ళ రాకుండా చుట్టూ దుప్పట్లతో ఆనకట్టలా కట్టాడు. బంగ్లా పైన ఎలా ఉందోనని చూడడానికి వెళ్ళాడు. ఉత్తప్ప ఒకటి, రెండుసార్లు కాలిజారి పడబోయాడు. తమాయించుకుని కిందకు వచ్చాడు. బంగ్లా కదులుతున్నట్లు అనిపించింది. కిందసామాను గదిలో పొడి బట్టలు మార్చుకున్నాడు. ఉత్తప్ప బంగ్లా భద్రంగా లేదని, మిత్రుల ఇళ్ళకు పోదామన్నాడు. కానీ రెడ్డి శరణు కోరి మిత్రుల ఇళ్ళకు వెళ్ళి దేహి అనడం ఇష్టంలేదు. ఫోన్ నెంబర్లు తీసుకుని దయల్ చేశాడు ఉత్తప్ప . కానీ ఫోన్‌డెడ్. ఉత్తప్ప ప్రయత్నం చూసిన రెడ్డి "అతణ్ణి ఓదార్చడానికి వాన ఆగి, నీరు తగ్గి, తెరపి ఇచ్చిన తరువాత చూద్దాంలే కంగారు పడకు" (పు. 120) అన్నాడు. కానీ ఉత్తప్ప భయశంక దృష్టితోనే ఉన్నాడు. బంగ్లా ఏ క్షణమైనా కూలిపోవచ్చని అతనికి అనుమానం. ఉత్తప్ప రాత్రి పది గంటలకు రాం.పి.రెడ్డిని, దొరసానిని వదిలి వెళ్ళిపోయాడు. రాత్రి తాను వెళుతూ వేసినప్పుడు భద్రంగా ఉన్న బంగ్లా ఉదయం వచ్చి చూసే లోపల కనిపించకుండా పోయింది. ఉత్తప్ప గుండే గుబేలు మంది. రెడ్డి దొరసాని ఎలా ఉన్నారో? బ్రతికి ఉన్నారా? ఉంటే ఎలా బయటకుతీయడం. నిలువ నీటిలో శిథిలాలు తొలగించడం కష్టం. శిథిలాలు తొలిగించడానికి క్రేనో, బుల్ డోజరో కావాలి. రెడ్డి దంపతులను ఎలా బయటకు తీయడం. ఉత్తప్పకు పిచ్చిపట్టినట్లయ్యింది. ఏమి చేయాలో పాలు పోవడం లేదు.

**3.2.3.7. నారాయణప్ప- త్యాగమయి:**

అనంతపురంలో సిమెంట్ ఖాళీ సంచులు చిల్లరగా కొని టోకుగా బెంగుళూరులో అమ్ముతుంటాడు. సంచి రూపాయికి కొంటాడు. ఐదు వందల సంచులు కొన్నాడు. ఐదు రోజులు తిరిగి కొన్నాడు. ఆ సంచుల్ని బయట ఇంటి ముందు గుట్టలుగా వేశాడు. అవి వానలో తడవకుండా చేయాలని, అతని తాపత్రయం. తడిస్తే నాని, చివికి పాడయి పోతాయి. అప్పుడు వాటిని ఎవరు కొనరు. ఐదురోజులు తిరిగి కొన్నందుకు ఐదు వందలు, ఆ సంచులు అమ్మితే మరో ఐదువందల రూపాయలు లాభం వస్తుంది. కాని సంచులు వానలో తడుస్తున్నవి. తడవకుండా దాయడానికి సరిపడనంత ఇల్లు దళితుల్లో ఎవరు కట్టించుకుంటారు? "దళితుడి ఇల్లు ఎంత ఉంటుంది.? వానకు కూడా దళితుడంటే అలుసే" (పు. 133). నారాయణప్ప సంచులు దాయడానికి చోటులేక బయటే వానలోనే ఉంచాడు.

పోతులయ్యగుడి దగ్గర నీరు పొర్లుతూ ఉందని ఎవరో అనగా జనం అక్కడకు వచ్చారు. నారాయణప్ప గోనెసంచులను ఎవరో చూశారు. వాటిల్లో ఇసుక, నింపి పల్లంలో వేశారు. ఇటుకలు పెట్టారు. నీటి ప్రవాహం ఆగి పోయింది. కొన్న సంచులు చెల్లా చెదురై అయిపు లేకుండా పోతుంటే చూస్తూ నిలబడ్డాడు. కానీ ఎవర్నీ ఏమీ అనలేదు. చెరువు కట్ట తెగకుండా తన సంచులు ఉపయోగపడ్డందుకు నారాయణప్ప బాధపడలేదు. తన సంచులు ఊరిని కాపాడినందుకు నారాయణప్ప తనకు నష్టం వచ్చినా, ఆమొత్తం తనకు పెద్ద మొత్తమయిన సంతోషంగానే భరించాడు.

**3.2.3.8. ఇమాం, మాబు - మూర్తీభవించిన మానవత్వం:**

ఇమాం సాహెబు, మహబూబ్ బాషాలు అన్నదమ్ములు పూల వ్యాపారం చేస్తారు. అమ్మనాన్నలు పెట్టిన మంచి పేర్లతో కాకుండా అడ్డపేర్లతో పిలుస్తున్నారని బాధపడుతుంటారు. కాని పూలకు రోజు వారి జీవితంలో యమగిరాకి దానికి పెళ్ళిళ్ళు సీజన్, రాజకీయ నాయకులు వస్తే అమ్మకాలకు కొదవలేదు. అన్నదమ్ములు పొదుపు చేసుకున్న సొమ్ముతో ఇంటికి శ్లాబు

వేశారు. శ్యాబు క్యూరింగ్ దశలో ఉంది. వానపడితే మంచిదే. తమ ఇంటికి ఇబ్బంది లేదు. ఇంటి చుట్టూ ఇసుక, ఇటుక, మన్ను తోలించి పెట్టారు. పోతులయ్య గుడి దగ్గరకు నీరు పొంగుతుందంటే జనాలు అక్కడికి చూడడానికి వచ్చారు. వచ్చిన జనాలకు సిమెంట్, ఇటుకలు, ఇసుక కనిపించాయి. వాటిని నారాయణప్ప ఖాళీ సంచుల్లోకి నింపి నీళ్ళకు అడ్డుగా కట్ట వేశారు. అవి సరిపోలేదని అంకాలప్ప చెప్పులను కూడ కట్ట మీద వేసి నీళ్ళు కట్టను తెగకుండా నివారించారు. తమ ఇటుక, ఇసుక, మన్నుతో ఇమాం, మాబు సోదరులు తమకు తెలియకుండానే అనంతపురం చెరువుకు గండి పడకుండా సహాయం చేశారు. జనాలు ఇసుకను, మట్టిని తీసుకుపోతుంటే అన్నదమ్ములు అడ్డుకోలేదు. సంతోషంగా తీసుకుపోనిచ్చి వరద నీటిని అడ్డుకోవడానికి సహాయ సహకారాలు అందించారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ కేసు వీడి పోలేదు. సంజీవ రెడ్డి కుట్రలతో కేసు తిరగ దోడించడని రెడ్డి అనుమానం. చిన్నన్న వేంకటేశ్వర రెడ్డి రాజకీయ పలుకుబడితో సుప్రీం కోర్టులో కేసునుండి తప్పించుకున్నాడు. గోవిందరెడ్డికి ఒక విషయంలో పబ్లిక్‌ప్రాసిక్యూటర్ కోర్టు సమన్లు స్వయంగా ఇవ్వడానికి నేరగాల్లును కోటకు తీసుకువచ్చాడు. రెడ్డి ముందు కాలు మీద కాలు వేసుకుని అమర్యాదగా ప్రవర్తించాడు. దాంతో గోవింద రెడ్డి పి.పిని బహిరంగంగా చంపించాడు. ఆ కేసులు రెండు రాం.పి.రెడ్డి ఆచూకి లేకుండా కేసులు కొట్టేయించాడు. చివరగా నేలగల్లు కోట నేల మాళిగ కూలి అందులో అస్థిపంజరాలు బయటపడ్డాయి. గోవిందరెడ్డి నేను పాలెగాడ్ని, కాబట్టి నేనే దేవుడ్ని. దేవుడు ఎవరికైన శిక్ష వేయవచ్చు. నామాట వినని వాడికి శిక్షలు వేశానని స్టేషన్‌లో వాగ్మూలం ఇచ్చాడు. ఏఎస్పీ బజారన్న గోవింద రెడ్డిని అరెస్టు చేసి తుక్కుతుక్కుగా కొట్టించాడు. ఈ కేసులో అన్నకి రాం.పి.రెడ్డి బెయిల్ ఇప్పించి, చివరకు సాక్ష్యాలు లేవని కేసు కొట్టేయించాడు. ఇలా రెడ్డి తన క్రిమినల్ బుర్రతో అనేక కేసులు గెలిశాడు. డెబ్బై సంవత్సరాల వయస్సులో తన ప్రాక్టీసు మానేశాడు.

అనంతపురంలో రాం.పి.రెడ్డి బంగ్లాను మించినది ఆ రోజుల్లో, ఈ రోజుల్లో ఏమి లేదు. బంగ్లా రాం.పి.రెడ్డి తాత, తండ్రి కట్టించాడు. రాం.పి.రెడ్డి ఎలిజబెత్‌ను తీసుకురావడం అన్న గోవిందరెడ్డికి ఇష్టంలేదు. అందుకే నేలగల్లు కోటలో కాకుండా అనంతపురం బంగ్లాలోనే ఉండిపోయాడు. గంగారెడ్డికి ముగ్గురు కొడుకులు త్రేతాగ్నులు ఉన్నారు. వారిలో" ఒక వెలుగు వెలిగిన రాం.పి.రెడ్డి ఇప్పుడు కొడిగట్టిన దీపం. కాదు అస్తమిస్తున్న సూర్యుడు . కాదు బూడిదలో నిప్పు రవ్వ. కాదు బూడిదలో వెచ్చదనం . కాదు , బూడిదే!" (పు. 4) నని జనం అనుకుంటారు. ఇప్పుడు రాంపి రెడ్డి ఒకప్పుడు ఇంగువ కట్టిన గుడ్డే. కేసుల పేరుతో లక్షలు సంపాదించాడు. మందు పార్టీలు, జల్సాల పేరుతో కోట్లు ఖర్చు చేశాడు. క్రిమినల్ లాయర్‌గా " బాగా సంపాదించి, బాగా తాగి, తాగించి, సుఖపెట్టి, సుఖపడి తన సంపాదన తాత ముత్తాతల నిల్వ సంపద హారతి కర్పూరంలా వెలిగించి, కరిగించి, తాను కరిగి పోయి, నలిగి పోయి, కదల్లేని, లేవలేని దశలో 95 ఏళ్ళ వృద్ధుడిగా బ్రతుకుతున్నాడు రాంపిరెడ్డి" (పు. 5). కోటలాంటి బంగ్లా కూడ 150 సంవత్సరాలు వచ్చి అవసాన దశలో వుంది. అనంతపురంలో ఎడతెగని వాన కురుస్తుంది. అప్పటి వరకు ఉన్న చెత్తా చెదారం, ఆక్రమణల వలన పట్టణాన్ని వరద ముంచివేసింది. కనివిని ఎరుగని రీతిలో వర్షం పడుతుంది. ఆ వర్షానికి బంగ్లా అంతా కురుస్తుంది. ఎప్పుడు కిందకు రాని రాం.పి.రెడ్డి తన సహచరితో కిందకి వచ్చాడు.

**3.2.3.9.రాంపిరెడ్డి – ఆధిపత్యప్రతీక:**

గంగారెడ్డి కొడుకు. కోటిరెడ్డి మనమడు. అసలు పేరు రామ పరంధామ రెడ్డి. బారెట్లా చదవడానికి ఇంగ్లాండ్‌కి వెళ్ళిననప్పుడు, రాం.పి.రెడ్డిగా అక్కడివాళ్ళు కుదించారు. అయితే కొంత మంది రంపిరెడ్డి ,రంపురెడ్డి , రొంపిరెడ్డిగా పిలిచేవాళ్ళు. ఆకుదింపు పేరుతోనే

అనంతపురంలో సివిల్, క్రిమినల్ కేసులు ఒంటి చేతితో జంటగా గెలిచాడు. క్రమంగా క్రిమినల్ లాయర్‌గా పేరు మోశాడు. రెడ్డి వకాల్తా పుచ్చుకున్నాడంటే కేసు గెలిచినట్లేనని ప్రజల నమ్మకం. తాను కేసు చేపడితే సాధారణంగా గెలుస్తాడు. ఒకవేళ ఓడితే, ఓటమికి కారణమైన వాడు చనిపోతాడు. క్రిమినల్ లాయర్‌గా రెండు చేతులా సంపాదించాడు. నాలుగు చేతులా ఖర్చు చేసేవాడు. భార్య ఖర్చు మనిషి, ఖరీదైన మనిషి. ఇంగ్లాండ్ వనిత. బారట్ 'లా' చదివేటప్పుడు పరిచయమైంది. ఆమె పేరు ఎలిజబెత్. రాంపిరెడ్డి ఆమెకు తాళిబొట్టు కట్టలేదు ఆమెను పెళ్ళి చేసుకోవడం తన పెద్ద అన్న గోవిందరెడ్డికి ఇష్టంలేదు. "ఎలిజబెత్ నాకు భార్య కాకపోతే,నేనెవరికి భర్తను కాను" (పు. 44) అని ప్రకటించి, అనంతపురం బంగ్లాలో ఎలిజబెత్‌తో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. గోవింద రెడ్డి కూడ తమ్ముని బంగ్లా దగ్గరకు వెళ్ళలేదు.తమ్ముడి తెలివి తేటలు చూసి గర్వపడేవాడు. తమ్ముడు ఏమి అడిగినా, తలకు మించినా పంపించేవాడు.

రాంపిరెడ్డి ఏ కేసు ఓడిపోలేదు. తిమ్మిని బమ్మినిచేసి, కేసు ఎలాగైనా గెలిపించేవాడు. స్వతంత్ర్యసమరంలో పాల్గొంటున్న సమరయోధుడ్ని తెల్లదొరైన ఎస్పీ కాల్చి చంపాడు. ఆత్మరక్షణార్థం కాల్చినట్లు ఎఫ్.ఐ.ఆర్ పకడ్బందీగా రూపొందించాడు. జడ్జి కూడ ఆంగ్లేయుడే. ఈ కేసు రాం.పి.రెడ్డి చేపట్టాడు. ఆ వాదనలు వినడానికి జనం విరగబడి వచ్చారు. "బుద్ధి బలంలో అపరచాణుక్యుడు. యుక్తిలో అపర నారదుడు. శక్తిలో అపర ఇంద్రుడు. సంపదలో అపర కుబేరుడు. పార్టీలివ్వడంలో పరమ లౌకికుడు" (పు. 55) అయినా ఏది పని చేయలేదు. చివరకు రెడ్డి ఓడిపోతాడని కేసు వదులుకోమని, తెల్లజడ్జి, ఎస్పీ ఇంగ్లీష్ వాళ్ళు ఎలిజబెత్‌ను ఆశ్రయించి , అర్థించి, ఆరాటపడ్డారు. కానీ రెడ్డి కేసు వదులుకోలేదు. కేసు ఓడి పోయాడు. దాంతో తెల్లఎస్పీని రెడ్డి చంపించాడు. ఈ హత్య బ్రిటన్‌లో, భారతదేశమంతా సంచలనం సృష్టించింది. దీంతో రాంపిరెడ్డి కొంతమందికి న్యాయద్రోహిగా కనబడ్డాడు. యువకులకు మాత్రం విచిత్రంగా దేశభక్తుడుగా కీర్తించారు.

వాన రాం.పి. రెడ్డిని క్రిందకు దించింది. పనివాళ్ళు ఇద్దరు ఆ పూట వ్యక్తిగత కారణాలతో రాలేకపోయారు. ఎప్పుడూ ఇంట్లో పనిచేయని రెడ్డి ఆరోజు బ్లాక్‌కాఫీ కోసం గ్యాస్ స్టౌ దగ్గర తంటాలుపడ్డాడు. కానీ స్టౌ వెలగలేదు. ఏలాగైనా తన సహచరికి లేచేలోపు కాఫీ పెట్టివ్వాలని అతని ప్రయత్నం అందుకే ఉడిపి హోటల్ వాడికి ఫోన్ చేశాడు. కానీ ఫోన్ డెడ్ అయ్యింది. పని వాళ్ళకు కబురు చేయాలని బయటకు వచ్చాడు. అంత వానలో బయట ఒక యువకుడు కనపడితే "మనిషిని సాటి మనిషి ఎట్లా సంబోధిస్తాడో అతడికి గుర్తు రావడం లేదు.... ఎవడో తోవన పోయేవాడిని తెలియని వాడిని పాపోడా అని పిలిచే కర్మ తనకేం పట్టింది? .... ఆమె కాఫీ అడిగితే లేదనే దౌర్భాగ్య స్థితిలో తానుండకూడదు. అందుకోసం... పాపోడా! అన్నాడు బారెడ్ల" (పు. 52). ఆమాట ఆ యువకుడికి వినపడలేదు. ఇంట్లో రెడ్డి ఇంగ్లీష్‌లోనే మాట్లాడేది. తెలుగులో మాట్లాడే పనిలేదు. తను చిన్ననప్పుడే తెలుగుతల్లి పాలు తాగడం మానేశాడు. ఇంగ్లీషు పెంపుడు తల్లి మందు పానీయం సేవిస్తున్నాడు అందువల్ల తెలుగు తనకు నోరు తిరగదని, సర్ధించుకోవాలని చూశాడు. రెడ్డి పిలుపు ఆ యువకుడు విన్నాడు, చూశాడు. "పాపోడా పని ఉణ్యాది ఇట్టారా" (పు. 53) అని అనంతపురం మాండలికంలో పిలిచాడు. అప్పటికే రాం.పి. రెడ్డి బంగ్లాని బూతు బంగ్లాగా యువకులు పిలుస్తున్నారు. ఆ ఆలోచనకు ఆ యువకుడు ప్రతినిధి. అందుకే ఆ యువకుడు పారిపోయాడు. అలా పారిపోవడం శిక్షే అంటాడు రచయిత. "పిలిస్తే పలికే మనిషి కంటే ఏం పెద్ద శిక్ష కావాలి ఎవరికైనా?.... ఎవరు కలవని, ఎక్కడికీ పోలేని శిక్ష కంటే పెద్ద శిక్ష ఏముంటుంది?" (పు. 56) అందుకే అసహాయంగా రాం.పి. రెడ్డి వాకిట్లో నిలబడి పోయాడు.

రాంపి రెడ్డి ఎవరికి పనికిరానివానిగా ఎందుకు మారాడు. తాను ఎంతమందికి సహాయం చేశాడు. ఇప్పుడు తనకెవరు ఎందుకు సహాయం చేయడంలేదు. ఎందుకని "తాను పదేళ్ళవాడిగా ఉండగా ప్రథమ ప్రపంచసంగ్రామంగా ముగిసిపోయింది. తానుబారెట్లా అయ్యేసరికి ప్రపంచ ఆర్థికమాంద్యం అంతరించింది. భారత స్వాతంత్ర్యసమరం తీవ్రదశకు చేరుకుంది" (పు. 5). ఇప్పుడు తాను 95 సంవత్సరాల వృద్ధుడిగా ఉన్నాడు. తాను మనుషుల్ని ప్రేమించలేదా? తనను తానే ప్రేమించుకున్నాడా? " రాం.పి.రెడ్డికి బాల్యం విస్పష్టంగా కనిపిస్తుంది. ఎంత మంది ఎత్తుకునేవాళ్ళు, లాలించేవాళ్ళు! ఆడించేవాళ్ళు...... తల్లి పక్కలో నిద్ర ఎంత సుఖంగా ఉండేది. తండ్రి చేయి పట్టుకొని కోటలో తిరగడం ఎంత సంతోషంగా ఉండేది. కమ్మని బాల్యం! ఏమైపోయిందో.... ఎలిజిబెత్ స్నేహ మాధుర్యం, వీధుల్లో నడకలు, లైబ్రరిలో దొంగ చూపులు, షేక్‌హాండ్‌లో తన్మయత్వం బోటు షికారులు, గుర్రపు స్వారీలో శరీరాల రాపిడి, బార్లలో విలాసం, బజారుల్లో గస్తీ, రాత్రీ పగలు పార్కుల్లో ఏకాంతం ఏమయింది బ్రిటన్ జీవితం... యౌవనం ప్రారంభంలోని తుళ్లింతలు ఏమయిపోయాయి. లండన్ నుండి బారెట్లాతోపాటు, భార్యతో వస్తే ప్రియురాలు మాత్రమే అని ఇల్లు తీర్పు ఇచ్చినా లెక్క పెట్టకుండా బ్రతికిన దొర పొగరు రోజులు ఎటుపోయాయి" (పు. 83) అని అలోచిస్తుంటే శరీరం అలసిపోయి, ఆలోచన ముసలిది కాకపోతే భరించలేని, శరీరానికి ఉండే బాధ తనను పిండి పిప్పిచేస్తుండేది. తన స్థితిని తలుచుకొంటే ఏడుపు వచ్చింది. తాను ఎందుకు పనికి రాకపోవడం, తాను దేనికీ శక్తుడు కాకపోవడం రెడ్డికి బాధాకరంగా ఉంది.

ఆ సమయంలో పనివాడు ఉత్తప్ప వచ్చాడు. వాడిని చూసి " దేవుడు ప్రత్యేక్షమైన రెడ్డి అంతగా ఆనందించడు . వస్తున్న ఉత్తప్పకు ఎదురుగా వెళ్ళిన రాంపిరెడ్డి బెదురుతున్న అతని రెండు భుజాలు పట్టుకోని దగ్గరగా తీసుకొని గుండెలకు హత్తుకోని మెడకు మెడ ఆనించి, వీపు మీద చేతులు బిగించి మెడ మీద తల ఉంచి, అలాగే ఉండిపోయాడు... ఉత్తప్ప భుజంమీద ఉన్న రాం.పి.రెడ్డి కళ్ళలోంచి నీళ్ళు పడుతున్నాయి" (పు. 85). రెడ్డి కన్నీరు చూసి ఉత్తప్ప రెడ్డిని తన మెడ మీదనుంచి లేపలేదు. రెడ్డి లేవలేదు. ఇద్దరికి అదే సుఖంగా ఉంది. రాం.పి. రెడ్డికి చివరిరోజు శ్రమ విలువ, పని వాళ్లమీద గౌరవం కలిగింది. ఉత్తప్ప ఆ రోజు రెడ్డికి దేవుడి కన్న విలువైన వాడిగా కనిపించాడు. రెడ్డిలో మానవత్వం మేల్కొంది. అందుకే అతడు ఎప్పుడు కౌగిలించుకొని ఊతప్పను మనసారా గుండెలకు హత్తుకొని ఏడ్చి తన దు:ఖ భారాన్ని తీర్చుకున్నాడు. మనిషిని మనిషిగా గుర్తించాడు. ఎన్నో ఏళ్ళ సేవకు ఉత్తప్పకు దక్కిన గౌరవమిది. దానితో ఉత్తప్పకు తన యజమానిపై ఇంకా గౌరవం పెరిగిపోయింది. బంగ్లా వానకు పడిపోయే స్థితికి చేరుకుందని యజమానిని సురక్షితమైన చోట చేర్చాలని ప్రయత్నం చేశాడు. బంగ్లా భద్రంగా లేదంటే "రెడ్డి నవ్వాడు ఆ మిత్రుల ఇళ్ళా తాము పొదగ్గ ఇల్లు కావు.... శరణు కోరి మిత్రుని ఇళ్ళకు వెళ్ళి దేహీ అని ప్రాధేయ పడటమా. అసాధ్యం" (పు. 119) అని అనుకున్నాడు. ఉత్తప్ప ప్రయత్నం చూసిన "రాం.పి.రెడ్డి అతడిని ఓదార్చడానికి వాన ఆగి నీరు తగ్గి, తెరిపి ఇచ్చిన తరువాత చూద్దాంలే కంగారు పడకు" (పు. 120) అని చెప్పాడు. అంతకు ముందే ఉత్తప్ప స్నూకర్ బిలియడ్స్ టేబుల్స్ క్రింద శుభ్రం చేసి, పాడి దుప్పట్లు పరిచి, చుట్టు ఆనకట్టలాగా దుప్పట్లతో కట్టలు కట్టి నీళు ళ్ళ రాకుండా ఏర్పాటు చేశాడు. ఉత్తప్ప రాత్రికి గంజి కాచి ఇచ్చి, పండుకో బోయే ముందు తాగమని చెప్పాడు. భార్యకు అనారోగ్యంగా ఉందని తాను ఇంటికి పోక తప్పదని, పొద్దున్నే వస్తానని చెప్పి, రాత్రి పది గంటలకు వెళ్ళి పోయాడు.

అప్పటికే నేలగల్లు కోట వైభవం పతనమయ్యింది.గొవింద రెడ్డి బెంగుళూరు ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ విషయం మూడు నెలల తరువాత తెలిసింది. అంతకు ముందు

వేంకటేశ్వరరెడ్డి మితిమీరి తాగడం, అమ్మాయిలతో గడపడంతో ఆస్తి హరించుకుపోయి ఆత్మ హత్యో, హత్యో తెలియని విధంగా చనిపోయాడు. గోవిందరెడ్డి మితిమీరి ప్రాణాలు తీశాడు. రాం.పి.రెడ్డి మితి మీరి హంతకుల్ని కాపాడాడు. మితిమీరడం అన్నదమ్ములకు వారసత్వపు హక్కులా పరిణమించింది. అయితే గోవిందరెడ్డి భార్యను అర్ధాంతరంగా చంపాడు. కానీ రాం.పి.రెడ్డి భార్యను కాపాడుకున్నాడు. ఏకపత్నీవంతుడుగా మిగిలిపోయాడు. అందుకే నాలుగు కాలలపాటు బ్రతకగలిగాడు. కానీ " జమీందార్లు రాజులని, రాజులు దేవుడి అవతారమని నేలగల్లు జమీందార్లు నమ్మేవారు. శివుడి బాధ్యత, ధర్మ నిర్వాహణ ఎందరినో చంపవచ్చు... యముడిది ప్రాణాలు తీసే ఉద్యోగం, ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించేవాడికి ఏ పాపం అంటదు" (పు. 106) అని "దుష్టుల్ని శిక్షించడం, శిష్టుల్ని రక్షించడం దుష్టులనుకొన్న శిష్టుల్ని శిక్షించడం, శిష్టులనుకొన్న దుష్టుల్ని రక్షించడం న్యాయమని నమ్మిన రాం.పి.రెడ్డి హంతకుల్ని కాపాడాడు. దైవకార్యం నిర్వహించానని అంతులేని ఆనందం పొంగుతూ వచ్చాడు" (పు. 107). చివరకు ఆ శిష్టులు ఎవరు అతడికి సహాయం చేయడానికి రాలేదు. ఉత్తప్పే అతనికి దొరికిన ఓదార్పు అతని కౌగిలిలో రెడ్డి ఓదార్పు పొంది, చిన్న పిల్లవాడిలా ఏడ్చి దు:ఖభారాన్ని దించేసుకున్నాడు.

వాన తగ్గలేదు. అంతకంతకు పెరుగుతూ ఉంది. ఈ రెండురోజులు వాన భార్యాభర్తలకు చాలా మేలుచేసింది. ఇద్దరు కలిసి చాలారోజుల తర్వాత పడుకున్నారు. ఎన్ని అకృత్యాలు చేసిన అతడు ఎలిజిబెత్ నోముబలంవల్ల ఇంతకాలం జీవించాడని ఆడవాళ్ళు అనుకుంటున్నారు. లండన్ నుండి ఇక్కడికి వచ్చి స్థిరపడిన దేశం ముఖం చూడకుండా బ్రతికిన ఆమె సమర్పణ గుణం చూసి మగ వాళ్ళు ముక్కు మీద వేలేసుకునేవారు. ఇప్పుడూ వాళ్ళు పండుముసలివాళ్ళు, కదలడమే కష్టం. పసిపిల్లల్లా నిద్రపోవడమే ఇష్టం. కానీ బంగ్లా ముసలిదై కదలడానికి సిద్దంగా ఉంది. వాన దానిని కదిలించి వేసింది. బంగ్లా కూడా నిద్రించడానికి సిద్ధం అయ్యింది. " రాం.పి.రెడ్డి ఎలిజిబెత్ ఒకరినొకరు వాటేసుకొని పడుకున్నారు. చాలా కాలం అయ్యింది. అలా ఒకరి చేతుల్లో మరొకరు పడుకొని నిద్రపోయారు" (పు. 148). ఏమి చేయాలన్నా ఉత్తప్ప రావాలి. "తెల్లవారిందని వాన తగ్గుముఖం పట్టిందనికూడా వాళ్ళకు తెలియదు. రెడ్డి బంగ్లా కదులుతున్న జాడ, ఆచూకీ వాళ్ళకు అర్థంకాదు. తెలియనితనం నిజంగా ఎంత అదృష్టమో" (పు. 149) నాని ఉన్న గోడలు అవకాశం వస్తే పడిపోదామని, అదును కోసం వేచిచూసి వాన కారణంగా బంగ్లా కుప్పకూలింది. "వంట గది, సామాను గది, పూజ గదులు పడిపోకుండా నిలబడ్డాయి" (పు. 150). ఈ గదులను రాం.పి.రెడ్డి ఎప్పుడు ఉపయోగించుకోలేదు వంట గదిలో సాలమ్మ వంట చేసేది. వంట గదిలోకి ఎలిజిబెత్ ఎప్పుడు రాలేదు. వంటలు చేయలేదు. పూజ గదిని ఆమె ఎప్పుడు వాడలేదు. సాలమ్మ పూజగదిలో తన వస్తువులు పెట్టుకునేది. సామాను గదిని ఉత్తప్ప వాడుకునేవాడు. ఇలా శ్రామికుల గదులు ఆ బంగ్లాలో కూలిపోకుండా తలెత్తుకు నిలబడ్డాయి.

ఉదయాన్నే వచ్చిన ఉత్తప్ప కనిపించకుండా పోయిన బంగ్లాను చూసి అతని గుండె గుభేలుమంది. రెడ్డి, దొరసాని ఎలా ఉన్నారో తెలియక ఒకవేళ బతికి ఉంటే ఎలా బయటికి తీయాలో తెలియక అల్లాడిపోసాగాడు. రెడ్డి బంగ్లా నేలగల్లు జమీందార్ల అన్యాయానికి నిలువెత్తు నిదర్శనం. విశాల వటవృక్షం లాంటి భవనం. దాని నీడన ఏ మొక్క చెట్టు కాలేదు. మనిషి విముక్తికి అడ్డుగోడకు సంకేతంగా ఉన్న చెట్టుకూలింది. కానీ మొక్కలు ఎక్కడా పత్తాలేవు. ఒక పురావైభవానికి, ఒక ప్రాచీన సంప్రదాయానికి ఒక దుష్టసంస్కృతికి ఒక చరిత్ర అవశేషానికి చరమ చిహ్నామైన రెడ్డి బంగ్లా కూలి పోయింది. కానీ నూతన చైతన్యం, నూతన సంప్రదాయం, నూతన చరిత్ర, అంకురాలు వంకర పోకుండా పెరగాలని చూసేవాళ్ళకు నిరాశ కలుగకపోతే అదృష్టమని" (పు. 152) అలా కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత బహుజనుల మీదే ఉ

ందని రచయిత ఈ నవల ద్వారా తెలియజేశారు.

**3.2.3.10.ఎలిజబెత్ – విదేశి సాంస్కృతికి నిదర్శనం:**

రాం.పి. రెడ్డి సహజీవనచరి, బ్రిటిష్ వనిత ఇంగ్లాండ్‌లో రెడ్డికి పరిచయమై అనంతపురం వచ్చింది. "తనను నమ్ముకొని వచ్చింది. నమ్మి జీవించింది. బంధు మిత్రుల్ని వదులుకొంది. ఇరవై ఏళ్ళ వయస్సులో భారతదేశం, ఆంధ్రరాష్ట్రం అనంతపురం పోదాం రమ్మంటే వచ్చింది. మళ్లీ ఇంగ్లాండ్ అనలేదు. లండన్ అనలేదు. థాంప్సన్ ఎవెన్యూ అనలేదు" (పు. 57). లండన్ నుంచి ఎలిజబెత్‌ను భార్య తీసుకువస్తే, ప్రియురాలు అని ఇల్లు తీర్పు ఇచ్చింది. రాం.పి.రెడ్డి రమ్మంటే వచ్చి నందుకు ఆమె పొందిన ఆశ్చర్యం, ఆనందం, ఆత్మీయత, అనురాగం ఎంతో అద్భుతంగా ఉండేలా చూసుకున్నాడు. అంతటి సుకుమారి గుర్రపు స్వారీ నేర్పేమనిషి రాం.పి.రెడ్డి అన్న గోవిందరెడ్డికి నచ్చలేదు.

గోవిందరెడ్డి తమ్ముడు ఇంగ్లాండ్ నుండి బారెట్లాతో వస్తున్నారని తెలిసి ఘనస్వాగతం చెప్పాడు. తమ్ముడు రైలు దిగి అన్న పాదాలకు నమస్కరించాడు. ఎలిజబెత్ నమస్కరించలేదు. పరిచయం చేస్తే 'గ్లేడ్ టూ సి యు' అనింది. కానీ రెడ్డి కాళ్ళకు మొక్కలేదు అది ఆయనకు అవమానమని భావించాడు. ఇంటికి బయలుదేరే సమయంలో దొరసాని గుర్రం దగ్గరకు పోయి దానిని మచ్చికగా దువ్వింది. దొరసాని జీను మీద చేయి వేసింది. తూనీగ లాగ లేచింది. మరుక్షణం గుర్రం మీద కూర్చుంది. తక్షణం ఆమె వెనుక కూర్చున్నాడు రాం.పి రెడ్డి. కళ్లెం పట్టుకుంది.... గుర్రం గాలిలోకి లేచింది. ఆకాశంలో ప్రయానించింది" (పు. 35). అలా చేయడం కూడా గోవిందరెడ్డికి నచ్చలేదు. ఆమెను పెళ్ళి చేసుకోవడం తమకు ఇష్టంలేదని రాం.పి.రెడ్డితో చెప్పాడు. ఆమెను కాకుండా మరొకరిని పెళ్ళి చేసుకోనని చెప్పాడు. "డెభై ఏళ్ళు తనకు సహధర్మచారిని ఆయిన ఎలిజబెత్ రాంపిరెడ్డి ఇంతదాకా తాళిబొట్టు కట్టలేదు. తాను మరో పెళ్ళి చేసుకోలేదు" (పు. 35). భార్యకంటే ఎక్కువగా చూసుకున్నాడు. "ప్రేమే ముఖ్యం కాని పెళ్ళి కాదని నమ్మిన ఎలిజబెత్ రాం.పి.రెడ్డి అనురాగంలో దాంపత్య సౌందర్యం సంపూర్ణంగా అనుభవించింది" (పు. 44). రాం.పి.రెడ్డికి అంతే ప్రేమను పంచింది. రాం.పి.రెడ్డి కోసం తన అలవాట్లను మార్చుకుంది. "ఆమె త్రాగుతున్న సిగరెట్టు నోట్లోంచి తీసి పారేస్తే ఏమి అనకుండా నవ్వి ...... మళ్ళీ సిగరెట్టు ముట్టుకోకపోవడం" (పు.32) రెడ్డికింకా ఆశ్చర్య పరిచింది. పార్టీల్లో "ఆమె సుతారంగా తాగుతుంది. ఫిల్టర్ పేపర్ నీటి చెమ్మను అద్దినట్లు తాగుతుంది. డ్రింకు చెమ్మ పెదాలమీద నిలువదు. తాగినట్లు నోరు సాక్ష్యం పలుకదు... రెండు రౌండ్‌ల కంటే తాగరాదు... తాగితే మూడు రౌండ్లు ఆరు గంటలు తాగాలనేది. అది డ్రింకును అనుభవించడమనేది" (పు. 32). దీనికి భిన్నంగా ఉండేది రాం.పి.రెడ్డి తాగుడు ప్రవర్తన.

పార్టీ సంస్కృతిని బంగ్లాలో ఇద్దరు తారాస్థాయికితీసుకువెళ్ళారు. జీవితాన్ని తృప్తిగా అనుభవించారు. అనంతపురం బంగ్లాలో పార్టీల కోసం ప్రత్యేకంగా ఒక హాలును కేటాయించారు. దానినే 'రంహాల్' అంటారు. అక్కడ రమ్ము తాగుతారు. రమ్మి ఆడతారు. స్నూకర్ హాలు, బిలియర్డ్ హాలులో రోజు ఆమె రెండు గంటలు ఆడుతుంది. అది ఆమెకు చాలా ఇష్టమైన హాలు. అక్కడే లాయర్ ఆయన భార్య సంగీత సాధన చేసేవారు. అలాంటి జీవితం ఇప్పుడు సంక్షోభంలో పడింది. ఎందుకంటే బంగ్లా లాగే తాము వయస్సు మీరిపోయారు. మితిమీరి పోయిన వయసులో యవ్వనంలో లాగా పోటి పడలేక పోయారు. అనంతపురం జోరు వానలో చిక్కుకుంది. బంగ్లా పాడు పడి బూతు బంగ్లాగా కుర్రోళ్ళు పిలుచుకుంటున్నారు. వానకి బంగ్లా అంత కారుతుంది. తడవకుండా దుప్పట్లు కప్పుకుంటున్నారు. దుప్పట్లన్ని తడిచి నాని పోయాయి. ఏమి చేయలేక మంచం కింద పొడిగా వెచ్చగా ఉంటే పడుకున్నారు

చలికి ఒకరినొకరు కౌగిలించుకోని పడుకున్నారు. మాగన్నుగా నిద్ర పట్టింది. నీళ్ళు మంచం క్రిందకు కూడా వచ్చాయి. భార్యతో కిందకు పోదామన్నాడు. చేయి పట్టుకోని చిన్నగా కిందికి తీసుకువచ్చాడు. రాం.పి.రెడ్డితో ఎలిజబెత్ అక్కడే ఆ రాత్రి గడిపారు.

పొద్దున్నే ఆమె నిద్ర లేవక ముందే రెడ్డి నిద్రలేచాడు. పని వాళ్ళు రాలేదు. బ్లాక్ కాఫీ తాగనిదే ఇద్దరికి రోజు మొదలు కాదు. ఆమె లేచే సమయానికి బ్లాక్ కాఫీ తయారు చేయాలని వంట గదిలో ప్రయత్నం చేశాడు. కానీ స్టౌ వెలుగలేదు. ప్రయత్నం సఫలం కాలేదు. వాళు ్ళ "బంగ్లాపైకి వెళ్ళి ఆకాశంలోకి చూసి ఎండను. చలిని, గాలిని అనుభవించి పదేళ్ళు దాటిపోయింది. ప్రాక్టీస్ మాని పాతికేళ్ళు దాటింది. ఓపికలేక వీలులేక విందులు వినోదాలు తగ్గిపోయాయి. బంగ్లా బోసి పోతూ ఉంది. చిల్లర మల్లర పనులు చేసి పెట్టే ఉత్తప్ప వంట చేసే సాలమ్మ తప్ప .... ఇంట్లో మరోతోడు లేదు రారు. రెడ్డికి తొంభై ఐదేళ్ళు, దొరసానికి తొంభై ఏళ్ళు. వాళ్ళు ఎంత ఆరోగ్యంగా ఉండగలరో అంత ఆరోగ్యంగా ఉన్నారు వాళ్ళు... ఎంతో మందు సేవించిన వాళ్ళు ఇప్పుడు ఏమి తినలేకుండా ఉన్నారు. గంజి మాత్రం తాగుతున్నారు... వాళ్ళు బంగ్లాలో ఉన్న, ఉన్నట్లు కాదు... అంత పెద్ద భవనానికి గుండె కాయలాంటి వాళ్ళు బలహీనంగా ఆడుతున్నట్లు ఉన్నారు" (పు. 5). ఏ పనులు చేసుకోలేక పోతున్నారు. "బయట కురుస్తున్న వానకు ఈదురు గాలికి ఎముకలపోగు అయిన భార్య మునగర దీసుకొని పడుకొంది. కప్పుకొన్న రగ్గులో ఆమె శరీరభాగాలు ఎక్కడ ఏవి ఉన్నాయో గుర్తు తెలియడం లేదు ఒకప్పుడు ఎంత ఉత్సాహంతో ఉర్రూత లూగిన శరీరమది! ఇప్పుడు ప్రాణముండి కూడా పలకలేని బదులాడలేని బలహీనమైన ఎముకల మోపు. మోపు గట్టిన బట్టలాగా చర్మం" (పు. 32)తో ఉంది. మరణం కోసం ఎదురు చూస్తున్నారు.

ఉత్తప్ప వచ్చి వారికి బ్లాక్ కాఫీ తయారు చేసి ఇచ్చాడు మధ్యాహ్నం టిఫిన్ చేశాడు. రాత్రికి గంజి కాచి ఫ్లాస్కులలో పోసి పడుకునే ముందు తాగమని చెప్పాడు. రాత్రి పది గంటలకు అత్యవసరమని ఇంటికి వెళ్ళాడు. వెళ్లే ముందు వాళ్ళకోసం బిలియర్డ్స్ టేబుల్ కింద శుభ్రంచేసి పడకవేశాడు. ఆ రాత్రి దంపతులిద్దరు అక్కడే కౌగిలించుకొని వెచ్చగా, హాయిగా నిద్రపోయారు. బంగ్లా ప్రమాదకరంగా ఉంది. స్నేహితుల దగ్గరకు వెళ్దామని ఉత్తప్ప రెడ్డిని బ్రతిమలాడాడు. రెడ్డి వేరే వాళ్ళ వద్దకు వెళ్ళి దేహి అనడం ఇష్టం లేక వాన తగ్గిన తరువాత చూద్దాంలే అని ఉత్తప్పకు సర్దిచెప్పాడు. అదే వారి జీవితంలో చివరి రాత్రి అని తెలియకుండానే చాలా రోజులకు వాళ్ళు దగ్గరయ్యారు. "ఆమె కోసం అతను, అతడి కోసం ఆమె ఎంతగా మారారో వాళ్ళిద్దరికే బాగా తెలుసు. వాళ్ళను ప్రేమ పక్షులన్నా తప్పులేదు. ఆదర్శ దంపతులన్న అభ్యంతరం లేదు. ఒకరి కోసం ఒకరు పుట్టారు అన్న పేచీలేదు. వాళ్ళు ప్రేయసీ ప్రియులే, భార్య భర్తలుగా, అని ఎవరు వితర్కించుకోరు. కానీ ప్రేయసీ ప్రియులే భార్య భర్తలుగా, భార్య భర్తలే ప్రేయసీ ప్రియులుగా జీవించారంటే అర్థంచేసుకోవడానికి ఆర్ద్ర హృదయం కావాలి... రాం.పి రెడ్డి కోసం తనను తాను లండన్ నగరంలో ఊడబెరక్కొని అనంతపురంలో నాటుకొని కొత్త నేలలో బతికి, పెరిగి, పూలు పూసి పరిమళం మాత్రమే పంచిన ఎలిజబెత్‌లోని సమర్పణ చూసి... రెడ్డి బంగ్లాని, భూత్ బంగ్లాగా.... పిలిచే జనం ఈ మధ్య 'దొరసాని బంగ్లా' అని పిలుస్తున్నారు. ఎండ కన్నెరగకుండా నీడపట్టున సర్వసుఖ సంతోషాలు పొందిన ఎలిజబెత్ లండన్ నగరం మాటే మరచిపోయింది. అనంతపురం వచ్చిన తరువాత ఒక్క సారి కూడా ఇంగ్లాండ్ వైపు తొంగిచూడలేదు" (పు. 149). అంతగా రెడ్డిని ప్రేమించింది. రెడ్డి కూడా ఆమె నమ్మకాన్ని వమ్ముచేయలేదు.

కానీ ఇప్పుడు బయట ఏం జరుగుతుందో వాళ్ళకు తెలియదు. గాఢ నిద్రలో ఉన్నారు. రెడ్డి బంగ్లా అలియాస్ దొరసాని బంగ్ల ఎన్నో ఆటుపోటులను తట్టుకొని తలెత్తుకు నిలబడి,

ఇప్పుడీ వానకు కుప్పకూలిపోయింది. దాంతో పాటు ఎలిజబెత్ దొరసాని కూడా మరణించింది. ఒక పురాతన వైభవంతో కూడిన బంగ్లా ఆ వైభవంతో జీవించిన దొరసాని మట్టిలో కలిసిపోయారు.

**3.2.3.11. వెంకటేశ్వర్‌రెడ్డి– మితిమీరిన విశృలంకత్వానికి నిదర్శనం:**

కోటి రెడ్డి మనుమడు. నేలగల్లు జమీందారు. రంగారెడ్డి రెండవ కొడుకు. మనిషిది మహారాజు కళ, చేయెత్తు మనిషి, చదువు అబ్బలేదు. ఇల్లు పట్టలేదు. తండ్రి లెక్క లేదు. నేలగల్లు అక్కరలేదు. జమీందారి అవసరం లేదు. దేశదిమ్మరి ఊరూరు తిరిగేవాడు. పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళంటే చేసుకోలేదు కానీ పెళ్ళాలు లేకుండా లేదు. పెళ్ళామంటే తాళికట్టిన మనిషి కాదు. అతడు ఎంతమంది ఆడవాళ్ళను అనుభవించాడో అతడికే లెక్కలేదు. ఆడవాళ్ళకి ఈ అర్హతలు ఉండాలని ఏమి నియమాలు, అర్హతలు ఏమిలేవు. వెంకటేశ్వర్‌రెడ్డిని చూడగానే 'ఆ' అనే అద్భుత రూపం. తనను చూస్తే ఆడవాళ్ళు పడిచస్తారని గొప్పలు చెప్పుకుంటాడు. "నల్లవాళ్ళు, దొరసానులు ఎవరైనా ఒక్కటే! చదువుకున్న, చదువుకొనక పోయినా... అందగత్తె అయిన, కాకపోయినా... కూలీ మనిషి. పనిపిల్ల, రోడ్లు ఊడిచే ఆడ మనిషి అయినా ఒక్కటే" (పు. 61). ఎవరైన ఆడదిఅయితే చాలు, ఆ నిమిషానికి అవసరం తీరితే అంతే చాలు అనుకుంటాడు. ఆడపిచ్చితోపాటు తాగుడు రోగం ఉంది. ఆడవాళ్ళ లాగే మందు కూడా పాలానా బ్రాండ్ కావాలని ఏమి లేదు. విదేశీ మద్యమైన, కల్లు అయిన సర్దుకు పోతాడు.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి బెంగుళూరులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని మందులు, పొందులతో ఆనందంగా ఉన్నాడు. కాంగ్రెస్ పార్టీ ఎంపిల కోసం ఎదుకుతూ నేలగల్లు దగ్గర ఆగిపోయారు. అన్న గోవిందరెడ్డికి ఓట్లు అడుక్కోవడం ఇష్టం లేదు. తమ్ముడు రాం.పి.రెడ్డికి రాజకీయాల మీద శ్రద్ధ లేదు. అందుకే ఇద్దరు కలిసి వెంకటేశ్వర్ రెడ్డి దగ్గరకు ఒప్పించడానికి వచ్చారు. అన్నదమ్ములు  వచ్చే సమయానికి ఇద్దరు అమ్మాయిలతో తాగి తూగుతూ ఉన్నాడు. అంత మత్తులోను అన్న పాదాలకు నమస్కారం, తమ్ముడికి షేకాండ్ ఇచ్చాడు.పార్లమెంట్‌కు పోటి చేయడానికి కాంగ్రెస్ వాళ్ళకు మనం కావాలట. మా ఇద్దరికీ కుదరదు. నీకే వీలు, నువ్వు సరే అనాలన్నారు. పొందు, మందు ఉంటాయని అంటే సరే నన్నాడు. అంతే కాక ఎవరిదగ్గరకు ఓట్లు అడగనన్నాడు. పోటి చేసిన ప్రతిసారి గెలిచాడు. ఆరుసార్లు ఎంపి అయ్యాడు. చివరకు కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోయిన ఎమర్జన్సీ తరువాత ఎన్నికల్లో కూడా ఎంపిగా గెలిచాడు. చాలాసార్లు గెలిచాడని నెహ్రూ మంత్రి ఇస్తానంటే వద్దన్నాడు. ఇందిరాగాంధీ అతడిని అడుగకుండానే మంత్రిపదవి ఇచ్చింది. వెంకటేశ్వర రెడ్డి ప్రమాణస్వీకారానికి రాకుండా మందు తాగుతూ కూర్చున్నాడు. దాంతో మంత్రి పదవిని తిరస్కరించిన వాడిగా పత్రికలు కొనియాడాయి. జమీందారీలు రద్దు, కౌలు దారీ చట్టం, రాజాభరణాల రద్దు, బంజరు భూముల పంపకాలకు చట్టం చేస్తున్నప్పుడు వాటికి అనుకూలంగా చేయి ఎత్తాడు. పై చట్టాలతో జమీందారులు భూములపై హక్కులు కోల్పోతుంటే వెంకటేశ్వర్ రెడ్డి మత్తులో జోగుతున్నాడు.

వెంకటేశ్వర్‌రెడ్డి ఎవరు ఏ పని అడిగిన చేసిపెట్టే వాడు. లైసెన్స్‌లు, గ్రాంట్‌లు, ఉద్యోగాలు ఇప్పించేవాడు. కోటీశ్వరులకు, కూటికి లేని వాళ్ళకు సంపాదించుకునే మార్గాలు చూపేవాడు.... దానికి ప్రతిగా పొందు, మందులను కోరుకునేవాడు. భక్తులు కూడా అతని అంతరంగానికి తగ్గట్టుగా ప్రవర్తించేవారు. రాం.పి.రెడ్డి కూడా దానికి మినహాయింపు కాదు. ఎస్పీ హత్య కేసునుండి విముక్తి పొందడానికి చిన్నన్నకు మందు, మగువలను బహుమతిగా తీసుకువచ్చాడు. అన్నదమ్ములు ముగ్గురు ఎప్పుడైనా కలుసుకునేది వెంకటేశ్వరరెడ్డి ఇంట్లోనే " ఎస్పీ హత్యకేసులో గోవిందరెడ్డి ధన బలంగా వెంకటేశ్వర్‌రెడ్డి రాజకీయ బలంగా పనిచేయడం

వల్ల రాం.పి.రెడ్డి బతికి పోయాడు" (పు. 90). ఎమర్జన్సీ తరువాత ఎన్నికల్లో వెంకటేశ్వర రెడ్డి ఎం.పి.గా గెలిచాడు. కానీ తన కుటుంబంతో తరతరాలు వైరమున్న సంజీవరెడ్డి రాష్ట్రపతి అయ్యాడు. దాంతో సంజీవరెడ్డి రాష్ట్రపతిగా ఉన్నంత కాలం పార్లమెంట్‌కు రానని ప్రతిజ్ఞ చేశాడు. ప్రతిన నెరవేర్చుకున్నాడు. జమీందారి ఆదాయం తగ్గి, పార్లమెంట్ పనుల ఆదాయం లేక, రోజువారి ఖర్చులకు బ్యాంకు నిలువలు కరిగిపోయాయి. వేంకటేశ్వరరెడ్డి మరణించాడని అన్నదమ్ములకు కబురు వచ్చింది.

వేంకటేశ్వర్ రెడ్డి మరణవార్త విన్న అన్నదమ్ములిద్దరు ఆగమేఘాల మీద బెంగుళూరు చేరారు. పడక గదిలో మంచం మీద మృతదేహం పడి ఉంది. రాజ పీనుగు వంటరిగా పోదన్నట్లుగా అతడి మీద ఎడమ, కుడి వైపున ఇద్దరు అమ్మాయిలు నిర్జీవంగా పడి ఉన్నారు. రాత్రి తాగిన మద్యం సీసాలు ఒద్దికగానే పడిఉన్నాయి. బలన్మరణంలాగ లేదు. సహజ మరణంలాగే ఉంది. "మారిన పరిస్థితులలో జీవం మీద విరక్తి పుట్టి, ఆర్థిక సమస్యలు బయటపెట్టుకోలేక వెంకటేశ్వరరెడ్డి తన ప్రాణం తాను తీసుకొని ఉండవచ్చు" (పు. 92) నని అనుకున్నారు. అంతే కాక "లౌకిక వాంఛలంపట్ల పరాకాష్టగా కనపించసాగాడు. అతను శరీర వాంఛల చరమాంకంగా ఉన్నాడు. స్వార్థ భూతం వికృత రూపంగా కొందరికి కనిపిస్తుంటే, కొందరికి వెంకటేశ్వర రెడ్డి అటు శ్రీదేవి, ఇటు భూదేవి, తాకి, తగిలి, తరించి ఉండగా వెంకటేశ్వర స్వామిలాగా" (పు. 93). చూసే దృష్టిని బట్టి కనిపించాడు. వెంకటేశ్వర రెడ్డి సహజమరణంగా సర్టిఫికేట్ తీసుకొని అన్నదమ్ములు అంతిమ సంస్కారాలు ముగించి, ఎవరి ఇండ్లకు వారు చేరుకున్నారు. నేలగల్లు జమీందారులకు మితిమీరి పనులు చేయడం అలవాటు. వెంకటేశ్వరరెడ్డి మితిమీరి మద్యం, మగువలతో తిరిగాడు. ఆ అలవాట్లే అతడిని బలి తీసుకున్నాయి.

**<u>3.2.3.12.ఎ.ఎస్పీ. బజారన్న – బహుజన చైతన్యం</u>:**

ఎ.ఎస్పీ నిరుపేద కుటుంబంలో పుట్టాడు. వారాలు చేసి చదువుకున్నాడు. బాల్యం నుంచి నేలగల్లు జమీందారుల దౌర్జన్యాలు కొల్లగా భయభక్తులతో విన్నాడు. బీదల్ని, నిర్భాగ్యుల్ని మరింత పేదలుగా, బిచ్చగాళ్ళుగా చేసే జమీందారుల్ని గురించి కథలు కథలుగా విన్నాడు. నేలగల్లు జమీందారులంటే ప్రాణాలు తీసే పరమ కిరాతక యమధర్మ రాజులని విని భయంతో బతికాడు. అలాంటి బజారన్న నేలగల్లు కోటకు జీవులో బయలు దేరాడు. గోవింద్‌రెడ్డి దర్బారు మందిరంలో కూర్చోని ఉన్నాడు. నేలగల్లుకోట నేల మాళిగలో అస్తిపంజరాల గురించి దర్యాప్తు రిపోర్టుకోసం వంటరిగా వెళ్ళాడు. " బజారన్న పిట్టమనిషి ఎత్తులేడు. డ్రెస్ లేకపోతే పోలీస్ ఆఫీసర్ అని ఎవరు అనుకోరు. ఐపిఎస్ అయి, ట్రైనింగ్ పొందుతూ నేలగల్లుకోట ఆకృత్యాలు, అరాచకాలు ఉన్న పైలు కంఠోపాఠంగా చదివి, గోవిందరెడ్డి దర్శనం చేసుకోవాలనుకున్నప్పుడు, కోట గోడ, నేల మాళిగ, మిద్దే కూలి, అస్థి పంజరాలు బయట పడి, ప్రయాణం వేగవంతం చేశాయి" (పు. 124). అలా వచ్చిన బజార్ రెడ్డి దర్శనం కోసం వచ్చానని అన్నాడు. " అస్థి పంజరాలతో నాకు సంబంధంలేదని స్టేట్ మెంట్ ఇస్తే ఫైల్ క్లోజ్" (పు. 125) అని గోవిందరెడ్డితో చెప్పాడు. గోవిందరెడ్డి వాటితో నాకు సంబంధం ఉ ంది అన్నాడు. 'ఉందని మీరు స్టేట్ మెంట్ ఇవ్వకూడదు' అంటే తప్పు సంబంధం ఉందని రాసుకోండి నేను సంతకం పెడతానన్నాడు. మీరు దేవుడి లాంటి వాళ్ళు మీ కీర్తి ప్రతిష్టకు భంగం వాటిల్లకూడదు. నేను దేవుడ్నే ఎన్ని ప్రాణాలైన తీయవచ్చు అంటే బజారన్న బిత్తరపోయి దిక్కులు చూడసాగాడు. రైటర్ రాసుకోవడానికి లేడు. పోలీస్‌స్టేషన్‌కు మిమ్మల్ని రమ్మనే ధైర్యం నాకు లేదు. మీకు నాకు లాగే భయం అయితే రావద్దు అన్నాడు. నాకు భయమేంటి పద పోలీస్‌స్టేషన్‌కు అన్నాడు. జీవు ఎక్కి కూర్చున్నాడు. పోలీస్ స్టేషన్‌లోకి తీసుకు వెళ్ళి

రిపోర్టు మీద సంతకం పెట్టించుకున్నాడు. సంతకం పెట్టే వరకు రెడ్డితో మర్యాదగా మాట్లాడాడు. సంతకం పెట్టిన తరువాత వెళదామా? అన్నాడు. ఎందుకు లేచావ్ అన్నాడు బజారన్న. నాకు చెప్పేంత మగవాడివా అని రెడ్డి దూషించాడు. హత్యనేరం క్రింద నిన్ను అరెస్ట్ చేస్తున్నాను అన్నాడు ఎ. ఎస్పీ. అరెస్ట్ చేయడానికి ముందుకు వచ్చిన కానిస్టేబుల్స్‌ను
తోశాడు.గోవిందరెడ్డి కానిస్టేబుల్స్‌ను తోసి లెక్క లేకుండా వెళ్ళిపోతుంటే ఆగు, అని పెద్దగా ఎ.ఎస్పీ గర్జించాడు. ఆ గర్జన వెనుక "జమీందరీ దౌర్జన్యం ఇంకా ఎంతకాలమని ప్రశ్నించేవాడనీ కష్టనష్టాల కన్నీటి కాపురాల మీద జాలి, దయ ఉన్నవాడనీ, జమీందారు మీద కోపం ద్వేషం పెంచుకున్నవాడనీ, గోవిందరెడ్డికి తెలియదు. దౌర్జన్యానికి బలైపోయి, తనను బాల్యంలోనే అనాథను చేసిన తండ్రి జ్ఞాపకం మాసిపోక, గుండెను రగిలిస్తూనే ఉందనీ తెలియదు. గుండెల మంటలో పడి కాలిన బజారన్న ఆ మంట తరిమితేనే నేలగల్లు కోటకు వచ్చాడని" (పు. 129) గోవిందారెడ్డికి తెలియదు. " పిరికి వాడికైన, పిచ్చివాడికైన, పిట్ట మనిషికైన, పేదకైన, తక్కువ కులమని జనం అనుకునే వాడికైన ఉద్యోగం హోదా, అధికారం, దర్పం, బలం ఇస్తాయని బజారన్నకు తెలుసు" (పు. 130). ఆ బలంతోనే గోవిందరెడ్డి గుండెల మీద తన్నాడు కోట కూలినట్లు గోవిందరెడ్డి కూలిపడ్డాడు. పోలీసులు బేడీలు వేసి అరెస్ట్ చేసి లాకప్‌లో నడువమంటే నడువలేదు ఎ.ఎస్పీ మరలతన్నాడు. ఆ దెబ్బకు లాకప్ గోడలకు తల తగిలి పగిలి నెత్తురు వచ్చింది.

మూడు రోజులు ఆరు పోలీస్ స్టేషన్‌లకు తిప్పి తుక్కు తుక్కుగా థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. అరవకుండా నోటికి ప్లాస్టర్ వేశారు. కనపడకుండా గోనెసంచుల్లో మూటగట్టారు. నాలుగవ రోజు గుండు చేయించి మీసాలు తీయించి ఓప్‌న్ జీపులో అనంతపురం వీధుల్లో ఊరేగించారు. కోర్టులో గోవిందరెడ్డికి బెయిల్ మంజూరు అయ్యింది. బజారన్న త్వరగా ఎక్కడికి వెళ్ళిన హత్యకు గురౌతాడని చెప్పుకున్నారు. నేలగల్లు దౌర్జన్యాలకు తెరపడిందని ఇక స్వాతంత్ర్యం వచ్చిందని జనం బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. రాం.పి.రెడ్డి ఆ కేసు కొట్టేయించాడు. కానీ అప్పటికే గోవిందరెడ్డి చనిపోయాడు. బజారన్న ప్రమోషన్‌లు పొందుతూ ఎస్పిగా అనంతపురం వచ్చాడు. వచ్చిన రోజే నేలగల్లు కోటకు వెళ్ళాడు. శిథిలమైన కోటను చూసి ఎస్పీ బజారన్న కళ్ళు తడిసి నీళ్ళుకారాయి. ఒక దోపిడి వ్యవస్థ గతించింది. మనిషి విముక్తుడవుతున్నాడని, ఒక దౌర్భాగ్య శకం ముగిసిందని ఆనందాశ్రువులు కార్చాడు.

### 3.2.3.13. గోవింద రెడ్డి - పాలెగాళ్ల వ్యవస్థకు ప్రతీక:

గంగారెడ్డి పెద్ద కొడుకు. జమిందారీకి యువరాజు. కోట పాలకుడు మంది మార్బలంతో సంచరిస్తూ ఉంటాడు. ఛండ్ర శాసనుడు. అతడంటే అటు అరవై ఆమడ, ఇటు అరవై ఆమడ దూరం హడలు భయపడి చచ్చేవాళ్ళు. ఇద్దరు తమ్ముళ్ళులో ఒకడు విలాసపురుషుడు, ఇంకొకడు బారెట్లా. గోవిందరెడ్డి ఇద్దరు కొడుకులు అమెరికాలో చదువుతూ అక్కడి వారినే వివాహం చేసుకున్నారు. అందువల్ల ఇంట్లో నుండి తరిమేశాడు. కొడుకులు వచ్చినప్పుడు తండ్రి అరాచకాలు కొడుకులకు తెలియజేసిందని భార్యను ఉరివేసి చంపాడు. నేల మాళిగ శవాలలో కలిపివేశాడు. ఆ తర్వాత మరో స్త్రీ జోలికి వెళ్ళలేదు. ఏకపత్నీవ్రతుడుగానే ఉండిపోయాడు. తన కోటలో మగవారిని మాత్రమే పనిమనుషులుగా నియమించుకున్నాడు. తన వంశ ప్రతిష్ట నిలుపుకోవడం కోసమే పరితపించేవాడు. తన తమ్ముళ్ళు అంటే అమిత ప్రేమ. వారి కోసం ఎంత ఖర్చు అయిన పంటి బిగువున భరించడానికి సిద్ధం అవుతాడు.

గోవిందరెడ్డి బెంగుళూరు పోవాలంటే అతడు వచ్చే వరకు రైలు ఆపాలి. ఒక రోజు గోవిందరెడ్డి రైలును ఆపమని స్నానం చేసి తీరుబడిగా వెళ్ళే సరికి "ఉదయ ధర్మవరం స్టేషన్‌లో ఇడ్డెన్లు తిన్న ప్రయాణీకులు మధ్యాహ్నం భోజనాలు చేసి రైలెక్కి కూర్చున్నారట"

(పు. 33). అప్పటికీ తాను ఎక్కక ముందే రైలు కూత వేసిందని డ్రైవర్‌ని కొట్టాడంట. ఫస్ట్ క్లాస్‌లో ఎక్కి అక్కడున్న తెల్ల దొరలను వేరే క్లాసులో ఎక్కమని తానొక్కడే కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేశాడు. అమెరికా నుండి తమ్ముడు బారెట్ల అయి వస్తున్నాడని తెలిసి ఘన స్వాగతం ఏర్పాటుచేశాడు. కానీ తమ్ముడు తెల్ల దొరసానిని వెంట తీసుకు వచ్చి భార్యగా పరిచయం చేశాడు. కానీ గోవిందారెడ్డికి ఎలిజబెత్ ప్రవర్తన నచ్చలేదు. తమ్ముడు తన కాళ్ళకు మొక్కితే, ఆమె మొక్కలేదు. గౌరవంగా కారులో రాకుండా గుర్రం ఎక్కి వెనుక తమ్ముడిని ఎక్కించుకొని తన వంశపు పరువు తీసి, అమర్యాదగా ప్రవర్తించిందని భావించాడు. అందుకే నేలగల్లు కోటలో రాం.పి.రెడ్డి ఉండడని అనంతపురం బంగ్లాలో ఉంటారని నిర్ణయించుకున్నాడు. ఎలిజబెత్ నాకు నచ్చలేదు. ఆమెను పెండ్లి చేసుకోవద్దని తమ్ముడికి చెప్పాడు. కానీ తమ్ముడు తనను నమ్ముకుని ఇంగ్లాండ్ నుండి వచ్చిన ఎలిజబెత్‌నే తన జీవిత భాగస్వామిగా నిర్ణయించుకున్నానని చెప్పాడు. "తన తమ్ముడ్ని మహావిద్యావంతుడ్ని తెల్లతోలుతో వశీకరించుకొని బానిసను చేసుకొని వాడి మీద పెత్తనం వెలగబెట్టి, తమ వంశం మీద అధికారం చెలాయించే స్థాయికి వచ్చి, నేలగల్లు పాలెగాళ్ళ పరువు, మర్యాదలు అటేడు, ఇటేడు తరాలు నట్టేట ముంచిన దొరసానిని తాను క్షమించలేదు. తమ్ముడి ప్రియురాలు కాబట్టి బతికి పోయింది...శిక్ష...నేలగల్లు కోట బహిష్కారం" (పు. 43-44).

గోవిందరెడ్డి అంటే చుట్టూ పది పరిగణాల్లో గౌరవమర్యాదలు, భయభక్తులు ఉండేవి. శత్రువు నామరూపాలు లేకుండా చేయడంలో ఆరితేరిన సమర్థుడు. తనకోటకు ఎవరైన రావచ్చు. అడుక్కుంటే ఇస్తే తీసుకోవచ్చు. అలా కాకుండా అధికారం చూపించి, పెత్తనం చెలాయించి , జులుం చూపితే మాత్రం అస్థిపంజరం కూడ దొరకదు. ఒకసారి పొట్లికూర కావాలని అడిగినప్పుడు పనివాళ్ళు జులం చేసి మందలో నుండి పది బలిచిన పొట్టేళ్ళను తీసుకువచ్చారు. కూర వండితే తృప్తిగా తిన్నాడు రెడ్డి.ఆ రోజు మధ్యాహ్నం గొర్రెల కాపరి వచ్చి నా మందలో పది పొట్టేళ్ళను నీపేరు చెప్పి, ఎవరో తీసుకు వెళ్ళారు. మీరు కబురు చేస్తే నేనే స్వయం తెచ్చే వాడ్ని. ఇదేదో మోసమని, మీరు వాళ్ళను అరికట్టక పోతే, మీకు అపఖ్యాతి వస్తుందని మనవి చేసుకున్నాడు. గొర్రెల కాపరి తెలివికి, ధైర్యానికి రెడ్డికి ముచ్చటేసింది. గొర్రెలు తెచ్చిన వాళ్ళు నా మనుష్యులేనని తెలిసి కూడ వాడు నాటకమాడుతున్నాడని అనుమానం వచ్చింది. కానీ వాడికి అన్ని తెలివి తేటలు లేవనుకున్నాడు. పొటేళ్ళను నేను తెప్పించానని రెడ్డి చెప్పగానే గొర్రెల కాపరి నిలువు గుడ్లు వేశాడు. రెడ్డి లోపల నుంచి లెక్క తెప్పించాడు. తీసుకోమన్నాడు. వాడు వద్దు దేవర అన్నాడు. ఏడ్చాడు, కాళ్ళు పట్టుకున్నాడు. దండం పెట్టాడు. "లెక్క కావల్లా? సావు కావాల్లా అన్నాడు.... గొర్రెల మనిషి ఏడుస్తూనే ఉన్నాడు.... డబ్బు ఇచ్చి పంపనయినాన పంపండి, లేకపోతే డబ్బు మీరు తీసుకుని వాణ్ణి చంపనయినా చంపండి. వాడి ఏడుపు నేనింక వినను" (పు. 45) అని చెప్పాడు. దాంతో వాడు దండం పెట్టి డబ్బు తీసుకుని మొక్కుతూ వెనక్కి వెనక్కి వెళ్ళి పోయాడు. దాంతో చుట్ట ప్రక్కల పది పరగణాల్లో రెడ్డి ఎంతో ధర్మపరుడని జనం చెప్పుకున్నారు.

జిల్లా ఎస్పీ ఆంగ్లేయుడి హత్య విషయంలో కోర్టు సమన్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీసుకువచ్చాడు. రెడ్డి ముందు అమర్యాదగా వ్యవహరించాడు. వీడ్ని బహిరంగంగా చంపండని తన సేవకులకు ఆజ్ఞాపించాడు. దాంతో పి.పి పిస్తోలు తీసాడు. కాని రెడ్డి సేవకులు పి.పిని కొట్టుకుంటూ, తరుముకుంటూ, వీధుల్ని తిప్పి జమీందరు చూస్తుండగా తీరు బడిగా, ప్రశాంతంగా, సుఖంగా చంపేశారు. అలాగే శవాన్ని ప్రకృతికి వదిలి వేశారు. ఆ సంఘటన తర్వాత గోవింద రెడ్డి శిస్తు కట్టడం మానివేశాడు. రెవాన్యూ వాళ్ళు కానీ, పోలీసు వాళ్ళు కానీ, కోర్టు వాళ్ళు కానీ, నేలగల్లు కోటలోకి ప్రవేశించడం మానివేశారు. కేసుల్ని తమ్ముడికి

పంపించేవాడు. తమ్ముడు ఆ కేసుల్ని మాఫీ చేయించేవాడు. ఏదైనా కార్యంలో కలుసుకున్నప్పుడు మాట్లాడుకొని వెళ్ళి పోయేవారే కాని ఇంటికి రమ్మని అన్న, తమ్ముళ్ళు పిలుచుకునే వారు కాదు. కాంగ్రెస్ వాళ్ళు రాజకీయాల్లోకి రమ్మని అడిగితే "జనం దగ్గరకు పోయి, దేహి అని ఓట్లు అడుక్కోవడం ఇష్టంలేదు. మీసమున్న మొగోడు దిక్కు మాలిన ఓట్ల కోసం దేబరించడం చిన్న తనంగా భావిస్తాడని" (పు. 62) గోవింద రెడ్డి నమ్మకం. అందుకే తన తమ్ముడు వేంకటేశ్వరరెడ్డిని ఎం.పి.గా పోటీ చేయడానికి ఒప్పిస్తాడు. అతడు కూడ ఓట్లు అడుక్కోను అనే షరతుమీద ఎన్నికల్లో పోటీచేయడానికి ఒప్పుకున్నాడు. అందుకు గోవింద రెడ్డి సరే నంటాడు.

భారత ప్రభుత్వం చేసిన జమీందారి, రాజాభరణాలు రద్దు, భూ సంస్కరణల చట్టాలతో గోవింద రెడ్డి పూర్వ వైభవాన్ని నిలుపుకోవడం కోసం అసహాయశూరుడిగా ఒంటరి పోరాటం చేస్తూనే ఉన్నాడు. భూములన్ని రైతుల పేరిట మార్పించి, భూమిపైన హక్కులు తానే నిలుపుకున్నాడు. నేలగల్లు కోట ఆదాయం తగ్గిపోయింది. అన్నదమ్ముల ఖర్చులకు కోట నిలువ ఖజానా అడుగంటింది. తమకు మిగిలిఉన్న భూముల మీద ఆదాయం, పూర్వ వైభవంతో బతకడానికి సరిపోదు. తమ పత్యర్థి సంజీవ రెడ్డి రాష్ట్రపతి కావడంతో ఇంకా ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఖర్చులు తగ్గించడానికి సేద్యగాళ్ళను, పనివాళ్ళను తగ్గించడంతో కోట హీన స్థితిలో ఉందని బయట ప్రపంచానికి అర్థమైంది. ఎన్ని ఆర్థిక బాధలు ఉన్న పంటి బిగువున భరించాడు. కాని ఎలిజబెత్ తెల్లముండ శనిలా పట్టుకుందని ఆమె ఇక్కడ కాలు పెట్టినప్పుడే నేలగల్లు కోట రెండుగా చీలింది. ఆమె దరిద్రమైందని, ఆమె చచ్చి పోతేనే మాకు విముక్తని, లేకపోతే తాము చావడం ఖాయమని మదనపడేవాడు. బెంగుళూరులో తమ్ముడు మరణం గోవింద రెడ్డిని మరింత కుంగదీసింది.

ఒక రాత్రి నేలగల్లు కోటలో రెండు సార్లు బాంబుల మోత మోగి కోటగోడ, నేలమాళిగ కూలిపోయాయి. వందల సంఖ్యలో అస్థిపంజరాలు బయటపడ్డాయి. ఉదయాన్నే గోవింద రెడ్డి వచ్చి చూసి, మొఖం మాడ్చుకుని వెళ్ళిపోయాడు. పోలీసులు వచ్చి వాటిని గుట్టగా పోశారు. పత్రికలు వార్తలు రాశాయి. ప్రజలుగుంపులుగా వచ్చి అస్థిపంజరాలను చూసి పోతున్నారు. ఇందతా సంజీవరెడ్డి కుట్ర అని గోవిందరెడ్డి ఆరోపించాడు. కేసులు అవుతాయని భయపడుతున్న పని వాళ్ళకు "తానే నేరస్తుడని వాళ్ళు (పోలీసులు) భావించితే, చంపే హక్కు తనకు ఉందని తాను ఋజువు చేస్తానని" (పు. 108) వారికి ధైర్యం చెప్పాడు. రోజు వారీ పనులు నిశ్చింతగా చేసుకుంటూ ధైర్యంగా ఉన్నాడు. బజారన్న స్టేట్‌మెంట్ కోసమని పోలీసు డ్రస్సుతో కోటలోకి అడుగు పెట్టాడు. అస్థిపంజరాలతో సంబంధం లేదని స్టేట్ మెంట్ఇచ్చి సంతకం పెట్టమన్నాడు. గోవింద రెడ్డి నాకు సంబందం ఉంది. కాబట్టి ఉందనే చెబుతాను. మీరు అలా చెప్పరాదు. మీరు దేవుడు లాంటి వాళ్ళు మీ కీర్తికి భంగం కలుగ రాదన్నాడు. "దేవుడు లాంటి వాడిని కాదు. దేవుణ్ణే! దేవుడు ఎన్ని ప్రాణాలయినా తీయవచ్చు" (పు. 125) అని బదులు చెప్పాడు. నాకు సంబంధం ఉందని స్టేట్‌మెంట్ రాసుకో, సంతకం చేస్తానన్నాడు. రైటర్ లేడు. స్టేషన్‌కు రమ్మని మిమ్మల్ని పిలవాలంటే నాకు భయంగా ఉంది. మీకు స్టేషనంటే భయం లేకపోతే రండి అన్నాడు. నాకేమిభయం అని స్టేషన్‌కి పోలీసు జీపులో బయలుదేరాడు. దారిలో కనిపించిన కానిస్టేబుల్లను జీపు ఎక్కమన్నాడు. రైటర్ జీపులను చూసి లేచాడు. జమీందారును చూసి అవునా? కాదా? అన్నట్లుగా చూశాడు. ఏంరా చూస్తున్నవ్ అంటే ఉలిక్కి పడి దండం పెట్టాడు. అందరు దండం పెట్లారు. ఎస్సైని అడిగాడు. పిలవమంటే,బయటకు వెళ్ళి, వచ్చి డ్యూటిమీద బయటకు వెళ్లాడని చెప్పారు.

రైటర్ గోవిందరెడ్డిని కూర్చోమని కాళ్ళవేళ్ళ పడుతున్నాడు. ఎస్సై సీటును తుడిచి

స్టేషన్ లోపల కూర్చోపెట్టారు. స్టేట్‌మెంట్‌లో "నేను చంపిన, చంపించిన మనుషుల శవాల అస్థిపంజరాలు కూడ ఆ అస్థిపంజరాల రాశిలో ఉన్నాయి. నేను జమిందారుని అంటే పాలేగాణ్ణి అంటే సామంతరాజుని అంటే రాజుని అంటే దేవుణ్ణి అంటే దుష్టశిక్షణ చేసేవాణ్ణి కాబట్టి దుష్టుల్ని చంపాను. చంపించాను. అది దేవుడుగా నాబాధ్యతే" (పు. 128) అని రాయించి సంతకం చేసాడు. గోవిందరెడ్డి లేచి ఇక వేళదామా అని కుర్చీలో నుండి లేచాడు. నేను లేవమనక ముందే ఎందుకు లేచావు అన్నాడు ఎ.ఎస్.పి. నోరు ముయ్యరా పిల్ల సన్యాసి చచ్చిపోతావు జాగ్రత్త అని రెడ్డి హెచ్చరించాడు. హత్యానేరం కింద నిన్ను అరెస్టు చేస్తున్నాను అన్నాడు బజారన్న. ఐదు నిమిషాలు నవ్వాడు రెడ్డి.లేచి వెళుతుంటే కానిస్టేబుళ్ళు బేడిలతో అడ్డం వెళ్ళారు. వారిని రెడ్డి నెట్టివేశాడు. బజారన్న పిరికి సన్యాసి అని రెడ్డి నమ్మకం. కాని బజారన్న జమిందారు మీద చిన్నప్పటినుండి కక్ష్యతో ఉన్నాడు. 'ఆగు' అన్నాడు. ఆగలేదు. యాక్షన్ తీసుకోవలసి వస్తుందన్నాడు. అయినా ఆగలేదు. బజారన్న అధికార బలంతో గాలిలోకి ఎగిరి గుండెపై తన్నాడు. గోవింద రెడ్డి పైకి చూపిస్తున్న మేకపోతుగాంభీర్యం, బింకం సడలి పోయాయి. నేలమీద పడ్డాడు. ఏమిచేయలేక ఏడ్చాడు. మూడురోజులు ఆరు స్టేషన్‌లు తిప్పుతూ థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. విలాసవంతంగా బతికిన రెడ్డికి ఆ మూడురోజులు తిండి, నిద్ర లేదు. నాలుగో రోజు అనంతపురం తీసుకెళ్ళి గుండు, మీసాలు తీసివేసి వీధుల్లో 'నేలగల్లు జమిందారు నేరాలకు శిక్ష' అని జీపుకు బోర్డు కట్టి ఊరేగించారు. త్వరలో బజారన్న హత్యకు గురి అవుతాడని పుకార్లు వ్యాపించాయి. నేలగల్లు ప్రజలకు విముక్తి కలిగిందని బహిరంగా ప్రజలు చెప్పుకోసాగారు.

"మూడు రోజులు, మూడు చెరువుల నీళ్ళు తాగినట్లు ఆరుపోలీసు స్టేషన్లలాకప్పులో ఉచ్చ కంపుల్లో, ఉమ్మిరొచ్చుల్లో ముక్కు మూసుకుని మునగర దీసుకుని, కూర్చుని, అన్నమూ,నీళు ్ళ ముట్టని మనిషి నాలుగో రోజు పౌరుష చిహ్నమయిన మీసం పోయి, నెత్తి జుత్తూ పోయి గుండు వచ్చి పోలీసు అధికారుల ఎదుట, జెడ్జి ముందు బోనులో నిలబడి సంజాయిషీ ఇచ్చుకోని జామీను మీద తమ్ముడు రాం.పి.రెడ్డి ఇప్పించిన బెయిల్‌తో ఊపిరి పీల్చుకొని నేలగల్లుకోటకు శవంలాగే వచ్చాడు గోవిందారెడ్డి, ఎవరూ ఎదురెళ్ళలేదు. ఎవరూ స్వాగతం పలకలేదు. ఎవరూ హారతి పట్టలేదు. ఎవరూ దిష్టితీయలేదు.... జుత్తు మీసం లేకపోయేసరికి మనిషి ఆకారమే మారిపోయింది.... దెబ్బల కంటె జరిగిన అవమానం ప్రాణం తీసినంత బాధగా ఉంది" (పు. 137). తాను చాలా మందిని చంపాడు. కానీ ఎవ్వరిని ఇంత సజీవంగా చంపలేదు.

బజారన్నను తన మీదకు ఎవరో ఉసిగొల్పారని, వాడి తెగింపు వెనుక ఎదో ప్రబలమైన శక్తే ఉంది. తరతరాల తమ విరోధి ఢిల్లీకోటలో పాగ వేయడం తనకు పరాభవం జరుగడం సంబంధంలేని సంఘటనలు కావనిపించింది రెడ్డికి జరిగిన అవమానికి " తిండి సహించడంలేదు. నిద్ర పట్టడం లేదు. ఉండుండి ఏడుపు వస్తుంది. ఆపుకుందామన్నా ఆగకుండా కన్నీరు కారిపోతూనే ఉంది..... ఒళ్ళంత నొప్పులు, ఏ మందులా నొప్పులు తగ్గించడం లేదు" (పు. 138). అందరూ ఉన్నా ఎవరి దగ్గరకు వెళ్ళలేదు. వాళ్ళు తనకు వద్దు. తనకి వాళ్ళు వద్దు, కోటలో తన బతుకు శిథిలమౌతుంది. నెల రోజులకు కోలుకున్నాడు. జుట్టు మీసం మొలకెత్తడంతో రెడ్డికి గత రూపు వచ్చింది. నమ్మినబంట్లు బజారన్న హత్యకు అనుమతి కోరారు. "వద్దన్నాడు గోవిందరెడ్డి, క్షమించావా అని అడిగారు వాళ్ళు. క్షమించను దు:ఖిస్తూనే ఉంటాను. ఆ దు:ఖంలో నేను కుమిలి కుమిలి వాడి వత్తనై పోతూనే ఉంటానని చెప్పాడు. జమీందారు ఈ కేసు సొంతంగా నడుపుతారని వాళ్ళు తీర్మానించుకున్నారు" (పు. 139). కానీ బెంగుళూరులో తమ్ముడున్న బంగ్లాను శుభ్రం చేయించాడు. చుట్టు పన్నెండు గ్రామాల

రైతులను పిలిచి ఎవరి పత్రాలు వారికి ఇచ్చివేశాడు. కోటలో పనిచేసేవారికి తన భూములు, సొమ్ములు ఇచ్చాడు. కోటను ఎవరెవరికి ఏ భాగమో రాసి ఇచ్చాడు. వెళ్ళే ముందు అందరినీ పేరు పేరునా పలకరించి, వాళ్ళ సేవల్ని కృతజ్ఞతతో మెచ్చుకున్నాడు. జమీందారు. అలా దీనంగా మాట్లాడుతుంటే జనం (స్త్రీలు, పిల్లలు) ఏడ్చారు.

గోవిందరెడ్డి బెంగుళూరు వెళ్ళేరోజు తమ్ముడు రాం.పి.రెడ్డి వీడ్కోలు చెప్పడానికి వచ్చాడు. ఆరోజు రెడ్డి ఏమీ తీసుకొని పోలేదని జనం అనుకున్నారు. కానీ "డబ్బు, దసకం, వెండీ, బంగారం, మణులు, మాణిక్యాలు, రాజలాంఛనాలు, చాలా వస్తువులు పెద్ద పెట్టెల్లో... బీరువాల్లో, సూటీకేసుల్లో, గుర్రబగ్గీలమీద, లారీల మీద, కార్లలో... రెండు ఫర్లాంగుల దూరం నిలబడ్డ ప్రయాణ వాహనాలు కదిలిపోగా గోవిందరెడ్డి ప్రవాసయాత్ర మొదలైంది" (పు. 40). కానీ బెంగుళూరులో ఎక్కువ కాలం బతుకలేకపోయాడు. 'ఇంత బతుకు బతికి ఇంటివెనుక సచ్చినట్లు' గోవిందరెడ్డి బెంగుళూరు బంగ్లా పనివాళ్ళను మూడు నెలలు రావద్దని ముందే జీతాలు ఇచ్చి పంపేశాడు. " మూడు నెలలకు గూర్ఖా, పనిమనిషి.... తిరిగి వచ్చి చూస్తే తలుపులు అన్ని తీసి ఉన్నాయి. విలువైన వస్తువులు ఏమి కనపడటం లేదు" (పు. 141). రాం.పి.రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాళ్ళు బెడ్‌రూమ్ తలుపులు తీసి చూస్తే గొవిందరెడ్డి దిక్కులేని చావు చచ్చి ఉన్నాడు. పందిరి మంచం మీద పరిశుభ్రమైన రెడ్డి అస్తిపంజరం ఉంది. అనేక మందిని అస్తిపంజరాలుగా మార్చిన గోవిందరెడ్డి చివరకు తానే అస్తిపంజరం అయ్యాడు. అధికారం, డబ్బు లేకపోవడంతో జమీందారులు గాలిఆడని పరిస్థితిలో ఇద్దరు రెడ్లు ఆత్మహత్యో, హత్యకో గురై చనిపోయారు. అస్థిపంజరాల కేసు జిల్లా కోర్టులో ఎక్కువ కాలం సాగలేదు. సాక్ష్యం లేక కేసు కొట్టివేశారు. అప్పటికే గోవిందరెడ్డి కాలం చేశాడు. కోటలో ఉంటున్న దళితులు కోటను శుభ్రం చేసుకోలేక వదిలివేశారు. కోటలో జిల్లేడ్లు మొలిచాయి. కోట క్రమంగా శిథిలమైపోయింది.

**3.2.3.14. మూలింటి ముసలిది – వెలివాడల వెతలకు దర్పణం:**

మాదిగ కులానికి చెందినది అనంతపురం అంబేద్కర్ నగర్‌లో అందరూ పాకీ వాళు ్ళ, పారిశుద్ధ్యం పనివాళ్ళు. ముసలామెకు 80 సంవత్సరాలు ఉంటాయి. ఆమె పారిశుద్ధ్యపనిలో ఉన్నప్పుడు అనంతపురాన్ని తుడిచిన అద్దంలా ఊడ్చింది. భర్త పాయిఖానా గంపలు లారీకి మోసేవాడు. ఆమె కంటే భర్త ముందు చనిపోయాడు. ఒక్కగానొక్క కొడుకు మున్సిపల్ ఉ ద్యోగిగా చేరినప్పడు దంపతులు ఎంతో ఆనందించారు. కోడలు కూడా వీధులు ఊడ్చే పనిలో చేరినప్పుడు, వాళ్ళ సంతోషానికి అంతేలేదు. భర్త చనిపోయినా కొడుకు కోడలు బాగానే చూచుకుంటున్నారు. మనవడు, మనవరాలు ఆమె పెంపకంలోనే పెద్దవాళ్ళు అవుతున్నారు. నేడో, రేపో వీళ్ళు కూడా వీధులు ఊడుస్తారు. వీధులు ఊడ్చే పని ఎప్పుడూ ఉంటుంది. కనుక భుక్తి గడుస్తుంది. కనుక వీళ్ళు బాగానే బతుకుతారని ముసలామె నమ్మకం. అంతకంటే బాగా బతకవచ్చునని ఆమెకు తెలియకపోలేదు. మరోమార్గంలో కూడా బతుకవచ్చునంటే ముసలమ్మకు చావకపోయిన అర్ధంకాదు. దానికి పెట్టి పుట్టాలి. దానికి ఎంతో దుడ్డు ఉ ండాలి. సొమ్ములేనివాడు ఎందుకు పనికిరాడు. లెక్కఉంటేలోకం స్వర్గం, లేకపోతే నరకం. లెక్కలేదు, రాదు. సంపాదించే తప్పుడు మార్గాలు తెలియవు. మంచి మార్గాలూ తెలియవు అందువల్ల మరోలా బతకడం కంటే ఇలా బతకడమే శ్రేయస్కరమని తల్లిదండ్రులు పిల్లలిద్దరినీ చదువు మానిపిస్తే తోడు ఉంటారులెమ్మని ముసలమ్మ మనసు స్థిమితం చేసుకుంది" (పు. 112). కష్టంలోనే సుఖాన్ని వెదుక్కుంటారు. కానీ వాళ్ళకు ఎప్పుడు సుఖం దక్కలేదు.

ఊహకు అందని విధంగా అనంతపురం తుఫాన్‌లో చిక్కుకుంది. అనావృష్టికి విలవిలలాడిన అనంతపురం అతివృష్టికి అతలాకుతలం అయింది. ముందుగా వానకు దళితుల

ఇండ్లు ఎక్కువగా నష్టపోయాయి. రోజుకంటే ముందే పారిశుద్ధ్యం పనివారు లేచి వీధుల మీదకు వెళ్ళారు. ఇండ్ల వద్ద పిల్లలు, వృద్ధులే ఉన్నారు. వానకు ఇల్లు పడిపోతున్నాయి. మూలింటి ముసిలిది చవుడులో కూరుకుపోయి ముఖమంతా నానిన చవుడు మలాం వేసినట్లు కాగ, ఊపిరాడగ గుండెల గాలివాన గాలికి దానం చేసి నిర్జీవంగా పడి ఉంది. వాన నీరు ఆమెపయి (శరీరం) కడిగినా అమె కదలలేదు, మెదలలేదు. జనం ముసలమ్మను కదిపి చూశారు. ఆమెలో ఏ చలనమూ లేదు. ఎనభై ఏళ్ళ ముసలిదామె అన్నీ చాపమీదే! ఏ క్షణాన అయినా చనిపోతుంది. బంధుమిత్రులేకాదు. కొడుకూ కోడలు కూడా ఆశలు వదులుకున్నారు. వాళ్ళిద్దరూ ఇంట్లో లేరు. నిష్టూరం వాన మీదకు రావలసి ఉంది.... సుఖమైన చావు అన్నారు. విముక్తి పొందిందన్నారు. కొడుక్కీ, కోడలికి కబురు చేశారు. ఆమెను వేప చెట్టుకింద అరుగు మీద చాప వేసి పడుకోబెట్టారు. పైన ఏమీలేదు. శవం వానలో తడుస్తూనేఉంది. కురవని ఇళ్ళు అంబేద్కర్ నగర్‌లో లేదు. కురవని ఇండ్లలోకి ముసలి మాదిగ శవాన్ని రానీరు" (పు. 37). ఎందుకంటే అది అంటరానిశవం, కులం పుట్టినా చచ్చినా బతుకుతుంది. ఆత్మలకు కులం ఉంటుందో లేదో తెలియదు కానీ ఇంట్లోకి నిర్జీవ శవానికి తప్పకుండా కులం ఉ ంటుంది. అందుకే మాదిగల్ని బతికున్నప్పుడే ఇంట్లోకి రానివ్వరు. చచ్చిన శవాన్ని ఇంట్లోకి ఎలా రానిస్తారు. ఇక్కడ ఇలా ఉంటే మున్సిపాల్టీ వరద తీవ్రత గుర్తించింది.

ఎస్పీ అత్యవసర పరిస్థితిని ప్రకటించాడు. మూలింటి ముసలమ్మను సమాధి చేయడం సాధ్యం కాలేదు. శవాన్ని అగౌరవ పరచరాదు. మంచం మీదనయినాపడుకో బెట్టాలి. అదేమి చేయలేరు. మట్టి మిద్దె కూలిపోయింది. ఇనుప మంచం లోపలే ఉంది. శవం దగ్గర ఎడుస్తూ కూర్చోడానికి జనం లేరు. మున్సిపల్ కమీషనర్ అందరిని పనికి తీసుకు వెళ్ళారు. చెరువు పడమటి గట్టు తెగితే ముందుగా అంబేద్కర్ నగరే మునుగుతుంది. వేపచెట్టు కింద ముసలమ్మ ఉన్నా వానలో ఉన్నా తడుస్తూనే ఉంటుంది. అరుగు మీద శవం పక్కన కూర్చున్న మనవడు, మనవరాలికి ఏడుస్తున్నారో లేదో వాన వల్ల తెలియడం లేదు. ఆకలి, దు:ఖంలో దేని వలన వారు ఏడుస్తున్నారో తెలియడం లేదు. అరుగు మీద వాన తగ్గిన తరువాత నిద్రపోతున్న ఇద్దరు పిల్లలకు శవం కాపలాగా పడుకొని ఉన్నట్లు ఉంది. వరదల నుండి పారిశుద్ధ్య కార్మికులు పురాన్ని  కాపాడి వస్తున్నారు. కానీవీరికి ఇంకా పనిఉంది. ముసలమ్మ శవం వీళ్ళకోసం ఎదురుచూస్తూ ఉంది. పడిపోయిన కొట్టాలు, మిద్దెలు బాగుచేసుకోవాలి. ఈ కష్ట జీవులకు దాంతోనే కష్టాలు ఇప్పుడేతీరవు.

**<u>3.2.3.15.ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు – వర్షభీభత్సానికి సజీవ సాక్షాలు:</u>**

ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు పిల్లలున్నారు. అక్కడ నాలుగు హాస్టళ్ళ విద్యార్థులు ఉన్నారు. ఒక్కొ గృహంలో వందమంది పిల్లలున్నారు. వాళ్ళంతా ఆ జిల్లా అంతటినుంచి వచ్చారు. వారి స్కూళ్ళు వేరు. కానీ హాస్టల్ ఒక్కటే. హాస్టలు గోడలు రాతితో కట్టి స్లాబు వేశారు. అయివానకు కారుతూ ఉంది. అయిన కిటికీలు ఉన్న పనిచేయడం లేదు. పై నుండి వచ్చే నీరు హాస్టల్ పై నుండి వెళ్ళి పోతుంది. రాత్రంతా వాన నిండిన హాస్టళ్ళలో కూర్చున్నారు. గ్లాసులు, ప్లేట్‌లు కొట్టుకు పోతున్న వస్తువులను చూసి, చిన్న పిల్లలు తినడానికి ప్లేట్‌లు ఉండవని ఏడుస్తున్నారు. వీరికి వండిపెట్టడానికి వంట వాళ్ళు రాలేదు. కాపలావాళు ్ళ వానమూలంగా ఎక్కడో తలదాచుకున్నారు. పిల్లల్ని పరామర్శించడానికి వార్డెన్‌లు రాలేదు.

పిల్లలు వానలో ఏడుస్తూ ఆ రాత్రంతా నిద్రలేక మూలలు చూచుకొని మునగర దీసుకోని పడుకున్నారు. పెద్ద పిల్లలు వానలో తడుస్తూ ఆడుకుంటున్నారు. హాస్టల్ లోపల ఉ న్న, బయట వానలో ఉన్న తేడా లేదు. కాబట్టి పిల్లలు వానలో ఆడుకుంటున్నారు. "వాన నీటిలో కొట్టుకుపోతున్న తట్టలు, గ్లాస్‌లు, బట్టలు, పెట్టెలు పడవలై తెరచాపలెత్తుకొని పోతుంటే

తెచ్చుకోవడానికి బయటికి వెళ్ళిన వాళ్ళు దొరికిన వాటిని వెనక్కు తెచ్చుకొని, దొరకని వాటిని వేగంగా కొట్టుకుపోతున్న వాటిని పట్టుకోవడానికి పరుగులు తీస్తున్నారు" (పు. 71). అలా నాలుగు హాస్టల్లో వస్తువులు వరదపాలయ్యాయి. పిల్లలు వీధుల పాలు అయ్యారు. వస్తువులు వెదుక్కుంటూ తిరుగుతున్న పిల్లలు చేపలు పడుతున్నట్లు కనిపిస్తున్నారు. పిల్లలు ఆకలి మరిచారు. బడిమాట మరిచారు. నీళ్ళలో ఆటలు మొదలయ్యాయి. ఆ వీధి తమ సామ్రాజ్యంగా భావించి ఇష్టానుసారంగా ఆడుకుంటు పిల్లలు రోడ్డెక్కారు. నీటికి పిల్లలకు భేదం లేకుండా తమకు నచ్చిన రీతిలో ప్రవర్తిస్తున్నారు. అంతా ఒకరిని ఒకరు అనుచరిస్తూ గొర్రెదాటుగా పోతున్నారు. అప్పటివరకు కలసి వచ్చిన వారు ఎవరి ఇష్టమొచ్చినట్లు వాళ్ళు ఎటు పడితే అటు వెళ్లిపోయారు. ఆ పిల్లలందరికీ ఇది అరుదైన అనుభవం. ఈ అందమైన అనుభవాన్ని వాళ్ళు తనివితీరా అనుభవిస్తున్నారు. "అందం శృతి మించితే, మితిమీరితే ప్రాణాంతకం కావడం, పెద్దలకు పరిచయం కానీ.... పిల్లలకు అపరిచితమే" (పు. 72)

అయితే అర్థం కాని భయం అలవిదూలిన ఆనందం ఈ ఆకర్షణ, అందం, అద్భుతం, కలగలసి పిల్లలు పిచ్చివాళ్ళమాదిరి ఎగురుతున్నారు. మంత్రముగ్దులుగా పొర్లుతున్నారు. శాప గ్రస్తుల్లా దొర్లుతున్నారు. ఎనుదిరిగి వచ్చిన కొంతమంది పిల్లలకు వాన తగ్గిన తరువాత హాస్టళ్ళు కడిగిట్టుగా సామాన్లు ఏమి లేకుండా ఖాళీగా దర్శనమిచ్చాయి. పసి పిల్లలు ఏమయ్యారో తెలియదు. వంటగాల్లు వచ్చిన ఆచూకి లేదు. వాచ్‌మెన్‌లు వచ్చిన దాఖాలాలు లేవు. వార్డెన్‌లు వచ్చిన నిదర్శనాలు లేవు. హాస్టళ్ళలో ఏమీ లేకుండా క్లీన్‌గా ఉన్నాయి. నాలుగు నూర్ల విద్యార్థులు ఎక్కడెక్కడ ఏ యే దశల్లో ఉన్నారో కానీ... కనిపించడం లేదు" (పు. 73). వాన తగ్గి వాచ్‌మెన్‌లు, వంట వాళ్ళు, వార్డెన్ వచ్చి హాజరు తీసుకుంటే సగం మంది విద్యార్థులు లేరు. ఎవరు గల్లంతు అయిన తల్లిదండ్రులకు గుండెకోతే! వార్డెన్‌కూ గవర్నమెంట్‌కు మాటే! కాబట్టి వాళ్ళకోసం వెతుకులాట మొదలైంది. కానీ ఎంత మంది దొరుకుతారో చెప్పడం కష్టం.

**3.2.3.16. నేలగల్లు కోట –హత్యారాజకీయాలనిలయం:**

నేలగల్లుకోట గ్రామం మేజర్ పంచాయతీ, గ్రామం నడిబోడ్డున పెద్దమిట్ట ఉంది. దాన్నే కొండ అంటారు, కల్లు అంటారు, నేలగల్లు కొండ అంటారు. ఆ కొండ మీద విశాలంగా వలయంగా కోట గోడ ఉంది. దానిలో భవనాలు ఉన్నాయి. పెద్ద ఎత్తులేని కొండ కావడంతో దానిని నేలగల్లు అని పిలిచేవారు. జమీందారీ నివాసం మొదటి అంతస్తు నుండి చూస్తే ఎవరు వస్తూంది, పోతుంది కనబడుతుంది. కోట పైనుండి చూస్తే నాలుగు వైపులా నేలగల్లు వీధుల్లో తిరుగుతున్న జనం స్పష్టంగా కనిపిస్తారు. నేలగల్లు జమీందార్లు అంటే భయం, భక్తి, వారికి ప్రజలు అందరు అణిగి మణిగి ఉండేవాళ్ళు నేలగల్లు జమీందార్లకు నమ్మిన బంటులైన మాదిగోల్లు బోయోల్లు, కురుబోల్లు, కోటలో ఎక్కువమంది ఉన్నారు. కూటికి జరగని పేదలు నేలగల్లునిండా ఉన్నారు. వారిలో గుర్రపు బండితొలే సాయిబు విశ్వాసపాత్రుడు. కారుడ్రైవర్ మాదిగ తల తీసుకురమ్మంటే తీస్తాడు. తల ఇవ్వమంటే ఇస్తాడు. నాగప్ప బట్టలు ఉతికేవాడు. నాగలింగం మంగలి, పిరికివాడు. వంట చేసే బాయన్న వీళ్ళందరూ నమ్మదగిన పనివారు.

బజారాన్న గోవిందరెడ్డిని అరెస్టు చేశాక కోట పతనం వేగవంతమైంది. రెడ్డి అక్కడ ఉండటానికి ఇష్టపడలేదు. తన ఆస్తిని, రైతుల భూములను, కోటను పనివాళ్ళకు, రైతులకు అప్పగించి తాను బెంగుళూరు బంగ్లాకు వెళ్ళిపోయాడు. నేలగల్లు సంపదనంతా బెంగుళూరు తరలించుకు వెళ్ళాడు. కోటను శుభ్రం చేయలేక పనివాళ్ళు వదిలేశారు. కోట శిథిలమై జిల్లేళ్ళు మొలిచిన ప్రదేశాలు, గడ్డీ, గాదం విస్తారంగా మొలిచింది. దెయ్యాలున్నాయని పనివాళ్ళు కోటనుండి నివాసం పల్లెలోకి మార్చుకున్నారు. తెచ్చుకోగలిగే సామాన్లు తలుపులు కిటికీలతో

సహా తెచ్చుకున్నారు. అనంతపురం జిల్లాలో అంతరించిన చివరి జమీందారి కుటుంబం యొక్క అవశేషం ఈ శిథిల నిర్మాణం, ఆదోపిడి వ్యవస్థనుండి మనిషి విముక్తుడయ్యాడు. ఒక దౌర్భాగ్య శకం ముగిసింది. కానీ దోపిడి వ్యవస్థ రూపం మార్చుకొని ఫ్యాక్షన్ రూపం దాల్చింది. వీటిని అణచడానికి అన్నలు, అడవుల్నే కాదు. నేలగల్లు కోటను కూడా ఆక్రమిస్తున్నారు. ఎంత గొప్పకోటలు కూడా కాలం తాకిడికి కలకాలం నిలువవు. నేల గల్లు కోటకూడా అలాగే శిథిలమైంది.

**3.2.3.17. రాంపిరెడ్డి బంగ్లా – జమీందారి విలాసాలకు ప్రతీక:**

అనంతపురంలో రాంపిరెడ్డి నివసించే కోటవంటి భవనం నేలగల్లు, పాలెగాళ్ళు కట్టించారు. గంగారెడ్డి ఆ బంగ్లాకు అన్ని హంగులు ఏర్పాటు చేయించాడు. అనంతపురం ఉత్తరభాగంలో కొన్ని ప్రభుత్వ బంగ్లాలు (వాటిలో కలెక్టర్ భవనాలు, ఎస్పీ భవనాలు) మిషనరీ భవనాలు రెండే ఉండేవి. దక్షిణ భాగంలో ఒకే ఒక్క కోటలాంటి భవనంఉండేది. దానినే రెడ్డి బంగ్లా అనేవారు. ఆరోజుల్లో ఈ రోజుల్లో కూడా దానిని మించిన బిల్డింగ్ అనంతపురంలో లేదు. ఆదిలో గంగారెడ్డి తండ్రి కోటి రెడ్డికి, గంగారెడ్డికి తరువాత కొడుకైన గోవిందరెడ్డికి వెంకటేశ్వర్ రెడ్డి విలాస, వినోద మందిరంగా ఉపయోగపడింది. రాం.పి.రెడ్డి ఇంగ్లాండ్ నుంచి దొరసానితో వచ్చి శాశ్వత నివాసం ఏర్పరుచుకున్నాడు. అప్పటి నుండి అన్నదమ్ములెవరు ఆ బంగ్లా వైపు రాలేదు, చూడలేదు.

నేలగల్లు జమీందార్లకు అనంతపురంలో నాలుగువందల ఎకరాల తరిభూమి ఉండేది. దానిని కాపాడుకోవడానికి బంగ్లా కట్టారు. బంగ్లా గోడలు కొండరాయితో కొట్టారు. పునాదిలో గోడ వెడల్పు ఐదుఅడుగులు కాగా అసలు గోడ మూడు అడుగుల వెడల్పు, పాతిక అడుగల ఎత్తు ఎకరంవెడల్పు భవనం కిందెంత భవనముందో పైన అంతుంటుంది. ఆ బంగ్లా గోడల పట్టులో సిమెంట్ గోడలు పోటీకి నిలువవు. "తీరు మిద్దేకానీ అవి తీరులు కావు మొద్దులు పైదిగాపకప్పు ఆ ఇళ్ళు ఏ మూలయినా ఎంత చల్లగా ఉంటుందంటే ఎన్ని ఏసీలు పెట్టినా ఆ చల్లదనం రాదు. ఎండకాలంలో కూడా చలిదేశాలలో నివసించినట్టుంటుంది" (పు. 5). ఆ బంగ్లాలో పది బాత్‌రూంలు ఉన్నాయి అంటే కొందరికి అర్థం కాదు అలాంటి వాళ్ళకు పది బెడ్ రూమ్‌లు. నాలుగు హాల్‌లు, నాలుగు వరండాలు ఉన్నాయి అంటే కొంత అర్థం, అవుతుంది. ఒక బెడ్ రూంలో నాలుగు డజన్ల మంది పడుకోవచ్చంటే వాటి వైశాల్యం తెలుస్తుంది.

ఈ బంగ్లా కట్టకముందు ఆరువందల సంవత్సరాల పూర్వం మూడు వైపుల మట్టి పోసి కట్టలు కట్టి నీటిని నిలపగా పెద్ద చెరువు అయ్యింది. అప్పట్లో వానలకు కొదువ ఉండేది కాదు. ఆ నీరు అనంతసాగరం అనే చెరువులోకి వచ్చేది. అక్కడ ఆరువందల ఇళ్ళు, 3వేల మంది జనాభాతో అనంతమ్మ పేరుతో పురం ఏర్పడింది. ఆ చెరువు బుక్కరాయ సముద్రం పేరుతో పిలువబడింది. ఆ చెరువుకి పడమట మెరువ పారుతే నాలుగు వందల ఎకరాలకు నీరు అందేవి. పుష్కలంగా పంటలు పండేవి ఆ పంట పొలాలన్ని క్రమంగా కరిగిపోయి ఇండ్ల స్థలాలుగామారి పట్టణంగా మారింది. అంతకుముందు నేలగల్లుకోట పాలనలో కదిరి పెనుగొండ, ధర్మవరం, అనంతపురం మధ్యభాగం అటు, ఇటూ చుట్టు పక్కలా భూములు ఉండేవి ఆ గ్రామాల కరణాలు పన్నులు వసూలు చేసి కోటలో జమచేసేవారు. నేలగల్లు రాజులను ప్రజలు దేవుళ్ళుగా వాళ్ళమాటలను వేద వాక్కులుగా ప్రజలు పూజిస్తూ గౌరవిస్తుండేవాళ్ళు కానీ నేడు ఆ బంగ్లాను చూస్తే భయం, గౌరవం, మర్యాద ఇప్పుడు అవేమి లేవు. ఆ బంగ్లాను బూతు బంగ్లాలుగా పిలుస్తున్నారు. నేల గల్లు కోట అప్పటికే శిథిలమయ్యింది. దాని ప్రతినిధి అయిన రాంపి రెడ్డి బంగ్లా గతానికి ప్రతీకలా నిలబడ్డాడు. గతంలో రం హాల్, స్నూకర్, బిలియర్డ్స్ హాలు, సంగీత కచేరీలతో, పార్టీ కల్చర్‌లతో కళకళలాడిన

బంగ్లా నేడు శిథిలావస్థకు చేరుకుంది. బంగ్లా గోడల నిండా మొక్కలు మొలిచి చెట్లు అయ్యాయి. గోడలు బీటలు బారాయి. వానలు రావడం లేదు కాబట్టి సరిపోతుంది. వర్షం పడితే బంగ్లా భద్రత తక్కువే ఏమైన జరుగవచ్చు తేది.9.11.1996లో అనంతపురంలలో తుఫాన్ మొదలయ్యింది.

వర్షపు నీరు బంగ్లాపైనుండి కిందకు రాకుండా ఆకులుఅడ్డంపడ్డాయి. నీరు పోయే మార్గం లేక బంగ్లా కురువసాగింది. మొదటి అంతస్తు కార సాగింది. రెడ్డి కిందకు దిగి వచ్చి తలుపులు తీస్తే గబ్బిలాల కంపు కొడుతుంది. బెడ్‌రూంలో దోమ తెర తొలగిస్తే సాలెగూళ్ళు నిండా కనిపించాయి. నేలమీద మంచంమీద శీలమండలం దాకా దుమ్ము పేరుకొంది. బంగ్లాలో పని మనిషి ఉత్తప్ప వచ్చి దుమ్ము దులిపి శుభ్రం చేశాడు. మొదటి అంతస్తులో నీరు నిలువకపోతే గ్రౌండ్ ఫ్లోర్‌లో నీరు కారడం తగ్గుతుందని టెర్రస్ మీదకు వెళ్ళి శుభ్రం చేయడానికి బయలు దేరాడు. కానీ రెండు, మూడుసార్లు కాలు జారి పడిపోయాడు. పడకుండ పట్టుకోబోయిన గోడ పడిపోయింది. బంగ్లా పడిపోతున్నట్లు అనిపించింది. బంగ్లా పడకుండా సాధ్యమా, వాన తగ్గితే మరమ్మతు చేయించి పడకుండ ఆపవచ్చు.

గతంలో బంగ్లా ఎంతో వైభవం అనుభవించింది. నేలగల్లు జమీందార్ల గర్వం, అతిశయం, పొగరు లాగా తలెత్తి అనంతపురం అన్ని వైపులా పరకాయించి చూసినట్లు ఉండేది."తెల్ల దొరలమీద నల్ల రాజులు తిరుగబడుతున్న రోజుల్లో తమ తిరుగుబాటుకు విజయంగా" (పు.118) కట్టించిన బంగ్లా 150 సంవత్సరాల పూర్వంది. రాం.పి.రెడ్డి తండ్రి, అన్నలిద్దరు ఆ బంగ్లాకు శృంగార క్రీడలు రుచి చూపించారు."రాం.పి,రెడ్డి బంగ్లాకి దొరసాని శృంగారం రుచి చూపించాడు. రమ్మీ ఆట నేర్పించాడు. రమ్మీ వంటి మద్య ప్రపంచం సేవించి ఊగి, తూగి, రేగి పోవడం అలవాటు చేశాడు. సుకుమార సుందరాంగులు బిలియర్డ్స్ ఆడుతుంటే ఆదమరిచి నోరు తెరిచి చూడటం ఆచారం చేశాడు. రెడ్డి బంగ్లా రాత్రులంతమేల్కొని తెల్లవారు జామున నిద్రపోయేది. మధ్యాహ్నం లేచి కాలకృత్యాలు తీర్చుకునేది. ఇప్పుడు.... ఆ వైభవం... ఆనందంలేదు.... రెడ్డి బంగళా బతికినంత కాలం మిడిసిపాటుతో బతికింది. అంతులేని సంపదను.భోగాన్ని, ఆనందాన్ని, సుఖసంతోషాలను రెండు చేతులతో తాగించి ఇప్పుడింత నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉండాలంటే కష్టంగా ఉంది. అంత బతుకు బతికి ఏమిటీ? దిక్కుమాలిన బతుకని చికాకు పడుతూ ఉంది. చచ్చినా మేలే అని భావించుకోసాగింది" (పు. 118-119). బలోన్మరణం చెందడానికి సిద్ధంగా ఉంది. వాన అందుకు రంగం సిద్ధం చేసింది.

పనిమనిషి ఉత్తప్ప బంగ్లా పరిస్థితి రాం.పి.రెడ్డికి చెప్పాడు. సురక్షిత ప్రాంతానికి వెళ్ళమని చెబితే రెడ్డి నవ్వాడు. ఆ రాత్రికి రెడ్డి, దొరసాని ఒకరినొకరు కౌగిలించుకొని ప్రశాంతంగా బంగ్లాలో నిద్రపోయారు. బంగ్లాకూడా శాశ్వత నిద్రకు సిద్ధం అయ్యింది. "నాని ఉన్న గోడలు, అవకాశం వస్తే పడిపోదామని అదునుకోసం ఎదురు చూస్తున్నాయి" (పు. 150). తూర్పు వైపు గోడలు పిట్టగోడను పడగొట్టింది. ఆ గోడ పడగానే దాని మీద ఉన్న మొద్దులు జారికింద పడ్డాయి. దానితో పాటు పడమటి పిట్ట గోడ పడి కప్పు గోడను కుమ్మింది. " అవకాశం రావడం ఆలస్యం ఏ వైపు గోడలు ఆ వైపు విరగదీసుకొని పడిపోయాయి.... రం హాల్, బాల్ హాల్, బిలియర్డ్స్ హాల్,..... కుప్పకూలి మూసుకుపోయాయి. చిన్నదైన వంటగది, సామాను గది, పూజ గది పడిపోకుండా నిలబడ్డాయి. ఒకనాడు రెడ్డి బంగ్లా ఆకాశంలోకి చొచ్చుకుపోయి ఉండేది ఇప్పుడు నేల మీద ఉంది" (పు. 150). దొర అహంకారానికి నియంతృత్వానికి నిదర్శనమైన గదులన్ని కూలి పోయాయి. శ్రమ సంస్కృతికి ప్రతీకలుగా బంగ్లాలో వంటగది, సామానుగది, పూజ గదులు పడకుండా నిలిచాయి. రెడ్డి,

దొరసాని ఎప్పుడు ఆ మూడు గదుల్లోకి అడుగు పెట్టలేదు. వంట గదిలో సాలమ్మ వంట చేసేది. సామాను గదిని ఉత్తప్ప వాడుకునేవాడు. పూజ గదిలో ఆ బంగ్లాలో ఎప్పుడు పూజ చేయలేదు. సాలమ్మ అక్కడే తన తాట్టా, బుట్టా సామాన్లు పెట్టుకునేది. అందుకే ఆ మూడు గదులు బహుజనతత్వంతో తలెత్తుకోని నిలబడ్డాయని రచయిత ప్రతీకాత్మకంగా తెలియజేశాడు.

"రెడ్డి బంగ్లా విశాల వటవృక్షం లాంటి భవనం దాని నీడన ఏ మొక్క చెట్టు కాలేదు. మనిషి విముక్తికి అడ్డుగోడగా సంకేతంగా ఉన్న చెట్టు కూలింది. కానీ మొక్కలు ఎక్కడ పత్తాలేవు. ఒక పురావైభవానికి ఒక ప్రాచీన సాంప్రదాయానికి ఒక దుష్ట సంస్కృతికి ఒక చరిత్ర అవశేషానికి చరమ చిహ్నమయిన బంగ్లా కూలిపోయింది. కానీ నూత్నచైతన్యం, నూత్న సాంప్రదాయం, నూత్నసాంస్కృతి, నూత్న చరిత్ర అంకురాలు వంకరపోకుండా పెరగాలని, చూసే వాళ్ళకు నిరాశ కలుగకుండా" (పు. 152) బహుజనులు చైతన్యవంతం కావాలని రచయిత కాంక్షించాడు. అనంతపురంలోని ఆక్రమణలను, ఆగ్రకులాల ఆధిపత్యానికి ప్రతీకాత్మకంగా తెలియజేశాడు. ఆ ఆక్రమణలన్నీ కొట్టుకుపోయే విధంగా వాన, వరదలను బహుజనుల చైతన్యానికి ప్రతీకగా తీసుకున్నారు. కాలువల్లో అడ్డమొచ్చి కొండలాగా గట్టి పడిన చెత్త చెదారాన్ని పాకీ పనివాళ్ళు ప్రక్షాళన చేసి అనంతపురాన్ని కాపాడారు. అంటే బహుజనులు అధికారంలోకి వచ్చినప్పుడే కుళ్ళు, చెత్తా చెదారాన్ని తొలగించి వేస్తారని, అందరికి సమన్యాయం జరిపిస్తారని చెప్పారు.

### 3.2.3.18. పారిశుద్ధ్యం పనివారు – వ్యవస్థను శుభ్రం చేసే హీరోలు :

అంబేద్కర్ నగర్‌లో పారిశుద్ధ్యం, పాకీ పనివాళ్ళు ఉంటారు. వారిలో మాదిగలు ఎక్కువ. చెరువు గట్టు దిగువున, మొరవ ప్రవహించే లోతట్టు ప్రాంతంలో కాలువ ఒడ్డున ఉంది. పల్లెలనుంచి వచ్చిన దళితులు అక్కడ కొట్టాలు వేసుకున్నారు. వర్షానికి కూలిన కొంపలు ఎవరివిరా అంటే దళితులవి, జోరు వర్షంలో కూడా వాళ్ళు ఇళ్ళలో ఉండే పరిస్థితిలేదు. రోజు కంటే ముందే లేచి వీధుల మీద విరజిమ్ముకున్నారు. బ్రిడ్జీల కింద గడ్డ కట్టిన ప్లాస్టిక్ బ్రిడ్జీని తొలగిస్తున్నారు. నీటికి సందుచేస్తున్నారు. సందులు ఏర్పడి, నీళ్ళు ప్రవహిస్తే యుద్ధంలో జయించిన సైనికుల్లా ఆనందంతో కేకలు పెడుతున్నారు. మరొక బ్రిడ్జి కింద ప్లాస్టిక్ బ్రిడ్జీని బద్దలుకొడుతున్నారు. "ఈ పనిలలో వాళ్ళు నేల మీద నిలబడి పట్టు చిక్కించుకొని చేయడానికి వీలు లేదు. నీటి మీద తేలుతూ పనిచేయాలి. ఈద గలిగిన సమర్థులు తమకు తోచిన పని..... చేస్తున్నారు. ఈత రాని వాళ్ళు పాతూరు వంతెన మీద నిలబడి గెడబెంగులతో...., కర్రలతో.... గడారులతో..... కుళ్ళబొడుస్తున్నారు. పాతిక మంది సమర్థులైన యువకులు పారిశుద్ధ్యం పనివారు అర్ధగంట తిప్పలు పడగా.... ప్లాస్టిక్ పర్వతం బద్ధలయ్యింది" (పు. 50). ప్లాస్టిక్ పర్వతాన్ని గుట్టలుగా విడగొట్టిన యువకుడు అచేతనంగా పడి ప్లాస్టిక్ భాగాలపై కొట్టుకుపోతున్నాడు. అతడ్ని యువకులు రక్షించారు. బతికినందుకు ఆ యువకుడు సంతోషంతో ఏడవటం మొదలు పెట్టాడు. రక్షించిన యువకులు ఆనందంతో కేకలు వేశారు.

పారిశుద్ధ్యం పనివాళ్ళు కాలువలు శుభ్రం చేస్తున్నారు. వర్షంలో చెత్త తీసివేస్తే మరల చెత్త కొట్టుకువస్తూనే ఉంది. అంతకు ముందు కొట్టుకుపోయిన యువకుడు అలుపు తీరి గెడ బొంగుతో రావడం "రావడం శత్రు సైన్యం మీదకు లంఘించినట్లు తమకు ప్రియమైన నీటిని అడ్డుకుంటున్న ప్లాస్టిక్ గుట్టల మీదకి దూకారు" (పు. 67). మురుగు మేటను తొలగించే పనిలో మునిగిపోయారు. అలసిపోయి ఒక ముసలి పాకీ మనిషి నిలబడితే గట్టుననిలబడి తెల్ల బట్టలు వేసుకున్నాడు. "కానీ కానీ నిలబడితే పని జరుగల్లా వొద్దా? అంటూ కసురుకొన్నాడు.

దాంతో "నువ్వురా! వచ్చి వానలో నిలబడు సాలు. మొగోడు ఎల్లు కొచ్చినాడు. సెబటం కాదప్ప సెయ్యల్ల,...... అందరూ సెప్పే నాకొడుకులే! సేసే నా కొడుకు లేకపాయె! అని గొణిగినాడు. పాకీ పౌరుడు అనంతపురం హక్కుదారుడు భావిభారత భాగ్యనేత. మాదిగోడే పాకీ పనిసెయ్యాల్లా! మరేమాను భావులు రారీ పనికి, రమ్మను సేతయితదేమో సూడమను" (పు. 68) అని ఎగిరి, కోపంతో పనిలో మునిగిపోయాడు. భావి భారత భాగ్య నేతగా రచయిత పాకీ వాన్ని తెలియజేశాడు. భారతదేశానికి పట్టిన అసమానత అనే మకిలిని తొలగించి సమన్యాయం చేసే వారు మూలవాసులేనని రచయిత తెలియజేశాడు. ఈ పనిలో పారిశుధ్ధ్య పనివాళ్ళు, పాకీ వాళ్ళు అసలు కథ చెప్పేడి వీళ్ళు అప్రధాన భాగస్వాములు, వంతగాళ్ళు, చిల్లరమల్లర హీరోలు, విలన్‌లు ప్లాస్టిక్ మిట్టలు" (పు. 67) గా రచయిత వర్ణించారు.

ప్లాస్టిక్ పర్వతానికి రంధ్రం చేస్తున్న నలుగురు ఒకేసారి నీటి ఉరువడికి కొట్టుకుపోసాగారు. అయితే సర్కారు కంపకు చిక్కుకొని బతికి బయటపడ్డారు. అనంతపుర ప్రజలది బ్రతుకు పోరాటం అయితే పాకీవాళ్ళది ఆకలి ఆరాటం, చెరువు కట్టకు గండి పడకుండా లాకులు ఎత్తడానికి ప్రయత్నం చేశారు. కానీ వీలు కాలేదు. పాకీ వాళ్ళను పిలుమన్నారు. వాళ్ళు రోజంత పనిచేసి అలసిపోయి ఉన్నారు. రాలేరు. " కానీ తప్పదు రాకపోయే వీళ్ళేదు. ఏమయినా వాళ్ళు పనిచేయాల్సిందే!" (పుట. 102) అత్యవసర పరిస్థితి ఎస్పీ ప్రకటించారు. మున్సిపాలిటి వరద తీవ్రతను గుర్తించింది. తమ పని వాళ్ళను పిలిపించింది. రెవెన్యూ ఉద్యోగులందరు కట్టమీదకు వచ్చారు. "మున్సిపల్ కమీషనర్, సూపర్ వైజర్ అంత వానలో వచ్చి డ్యూటీకి రమ్మన్నారు. అంబేద్కర్ నగర్‌లోని మగవారు, ఆడవాళు ్ళ అందరు మున్సిపల్ కార్మికులే అంత పెద్ద ఉద్యోగులు వచ్చి రమ్మంటే రాకుండా ఉండటానికి లేదు. చెరువు గట్టు పడమటి పక్క తెగితే ముందుగా మునిగేది అంబేద్కర్ నగరే! డ్యూటీ గానే కాక, మనుషులుగా కూడా వాళ్ళకు చెరువు గట్టు తెగకుండా చూసుకోవలసిన అవసరం ఉ ంది. స్వార్థం ఉంది. పరార్థం ఉంది. వ్యథ ఉంది. విధి ఉంది" (పు. 111).

అందుకే మనసున్న మంచి మనుషులుగా ముందుకు వచ్చారు. తమకు అప్పగించిన పని చిత్తశుద్ధితో పూర్తి చేశారు. మానవత్వానికి పెద్ద పీట వేశారు. ఇంట్లో శవాన్ని పెట్టుకొని, దు:ఖాన్ని కడుపులో పెట్టుకొని సమాజం కోసం పనిచేశారు. అంబేద్కర్‌నగర్‌కి పనిముట్లు చేతబట్టుకోని వస్తుంటే రంభా బ్రాందిషాపు యజమాని పావు రమ్ము సీసా బహుమతిగా ఇచ్చాడు. నిర్విరామంగా పాటుపడ్డ వాళ్ళకు ఈ ప్రోత్సాహం అవసరమే. దాంతో పాటు ఇంటి వద్ద ముసలమ్మ శవాన్ని పూడ్చాలి. పడిపోయిన ఇళ్ళను బాగు చేసుకోవాలి. అయినా ఈ కష్టజీవుల కష్టాలు ఇప్పుడే తీరేవి కావు. వారికి రెండు చేతులు తప్ప వేరే ఆస్తి పాస్తులు లేవు. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు వారివి.

**3.2.3.19. వాన – సామాన్యుల అగచాట్లు :**

అనంతపురంలో ఎప్పుడు లేంది అనుకోకుండా వర్షం మొదలై తుఫాన్‌గా మారింది. ప్రపంచీకరణలో భాగంగా పట్టణాలకు వలసలు ఎక్కువయ్యాయి. అందులో భాగంగా గిరిజనులు, దళితులు అనంతపురానికి బతుకు దెరువుఎదుక్కొంటూ వచ్చారు. కాలువల, చెరువుల ఒడ్డున లోతట్టు ప్రాంతంలో గుడిసెలు వేసుకోని జీవనం సాగిస్తున్నారు. అంబేద్కర్ నగర్‌లో ఎక్కువ మంది మాదిగలు ఉన్నారు. వాళ్ళంతా మున్సిపాలిటిలో పనిచేస్తున్నారు. పనికి వెళ్ళిన వారు వెళ్ళగా ముసలి వాళ్ళు, పిల్లలు ఇంటి వద్ద ఉన్నారు. వర్షానికి వారి ఇళు ్ళ నాని పడిపోయాయి. ఆ శిథిలాల కింద ఎనభైఏళ్ళ ముసలిది పడి చనిపోయింది. ఆమె కొడుకు, కోడలు పారిశుధ్యం పనికి వెళ్ళారు. ఆమెకు అందరూ ఉండి అనాథ శవంలా పడి ఉంది. మనవడు, మనవరాలు ఆమె శవం దగ్గర కూర్చొని ఏడుస్తున్నారు. డ్రైవర్ కాలనీలో

ఇళ్ళు కూలి నిండు గర్భిణి, ఇద్దరు పిల్లలు కప్పుకింద పడి చనిపోయారు. రాణీనగర్ పద్మవ్యూహంలా ఉంది. " అవి పేదల ఇళ్ళు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కుటుంబాలు అక్కడ లేవు. కమ్మ, రెడ్డి, ఇళ్ళు తక్కువ. దళితులు, సాయిబులు, కుమ్మరి, కమ్మరి, చాకలి, మంగలి, బోయ, కురబ, సాలె, జంగం కుటుంబాలు ఎక్కువ" (పు.37). వాళ్ళలో సిమెంట్ గోడలు, పిల్లర్లు, శ్లాబు ఉన్న ఇళ్ళు చాలా తక్కువ. గతంలో అది చెరువు కింద ఆయకట్టు భూమి. ఎవరికీ పట్టాలేదు. పంటలు లేక మురుగు చేరింది. మునిసిపాలిటీ వ్యర్థా పదార్థలు పడేస్తుంటే మెరక అయింది. అయినా అక్కడ నీరు నిలువ ఉంటాయి. కప్పులు, కూలిపోతుంటే అందరూ రోడ్ల మీదకు వచ్చారు.

సంపన్నులు అధికంగా ఉండే కమలానగర్‌లోకి వరద ఉధృతి ప్రవేశించింది. ఇళ్ళలో సామాన్లు కొట్టుకుపోతున్నాయి. నీళ్ళలో కొట్టుకుపోతున్న వస్తువుల్ని పిల్లలు పోగు చేసుకుంటున్నారు. అడితి నాగన్న కొట్లో చెక్కలు, మొద్దులన్ని వరదకు కొట్టుకుపోయాయి. సినిమా హాళ్ళ దగ్గర మురికి కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ కాలువ ఒడ్డునే అలవాటు ప్రకారం కూర్చోడానికి వచ్చిన ఆరేళ్ళ పిల్లవాడు తల్లి కళ్ళముందే కొట్టుకు పోయాడు. అంబేద్కర్ నగర్ పారిశుద్ధ్యం, పాకీ పనివారు బ్రిడ్జీల కింద ప్లాస్టిక్ పర్వతాల్ని బద్దలు కొట్టే పనిలో తీరిక లేకుండా శ్రమిస్తున్నారు. రోడ్డుమీద నిలబడి ఉచిత సలహాలు ఇచ్చే వారి మీద కోపంగా ఉన్నారు. వరద నీళ్ళలో నిలబడి పనిచేస్తున్న పనివాళ్ళు వరదలో కొట్టుకుపోతూ ప్రాణాలతో బయట పడ్డారు. మరల అలుపు తీర్చుకొని, ప్లాస్టిక్ వ్యర్థాల మీద పోరాటం చేస్తున్నారు. రాప్తాడు బ్యాంకు ఉద్యోగి ఎవరి మాట వినకుండా మోటర్ సైకిల్‌తో బ్రిడ్జిపై నుండి ప్రవహిస్తున్న నీటిలోకి వెళ్ళాడు. ప్రవాహ వేగంలో కొట్టుకుపోయాడు.

ప్రభుత్వ వసతి గృహంలోని పిల్లలు నీటిని చూచి బయటికి వచ్చారు. నీటికి వారికి భేదం లేదు. నీరులా వాళ్ళు పరుగులు తీస్తున్నారు. విద్యానగర్ దిగువన కొట్టాలు ఉన్నాయి. ఆ కొట్టాల్లో వాళ్ళు చిన్నా చితక పనులు చేసుకుంటూ బతికేవారు. అర్ధరాత్రి నుంచే వాళ్ళు ఇళ్ళు ఖాళీ చేసి విద్యానగర్‌లోని వీధుల్లోకి వచ్చారు. హండే రాజ వంశంలో మిగిలిన వారసుడు రాజ్యాలు ఎప్పుడో పోయి, ఆటోడ్రైవర్‌గా బతుకుతున్నాడు. తాను రాజవంశీయుడ్ని అని ఆ యువకుడణ్ణి తెలియదు. తండ్రి ఫ్యాక్షన్ గొడవల్లో బలయ్యాడు. తల్లి భయపడి పిల్లవాడికి గతం తెలియకుండా అనంతపురం తీసుకువచ్చి పెంచింది. ఆమె వృద్ధాప్యంలో కొట్టంలోనే ఉంది. యువకుడు తల్లికి ఎలా ఉందోనని కంగారుగా కొట్టంలోకి వెళ్ళాడు. తల్లిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చి మెరక మీద నిలబెట్టాడు. మళ్ళి కొట్టంలోకి పోయి వస్తువులన్ని ఆటోలోకుప్పపోశాడు. మళ్లీ పోతుంటే జనాలు వద్దన్నారు, పట్టుకున్నారు. విదిలించి, కొట్టి కొట్టంలోకి వెళ్ళి బియ్యం మూట, సరుకుల సంచి నెత్తి మీద పెట్టుకున్నాడు. రెండు అడుగుల నీటి ఉరవడి ఎక్కువయ్యింది. కొట్టాం పెళ పెళమని యువకుడి మీద పడి విరిగిపోయింది. యువకుడు కదలలేక అక్కడే చిక్కుకుపోయాడు.

పేదవారి ఇళ్ళలో, వీధుల్లో నీటి మట్టం పెరిగి వారికి నిద్రహారాలు లేవు. కానీ "ఇళ్ళు బాగున్నవాళ్ళు, వాన నీటి ముప్పు, ముంపు లేనివాళ్ళు ఇళ్ళలో నుంచి బయటకు రాలేదు. వండుకున్నారు. తిన్నారు. పండుకొన్నారు. సుఖంగా ఉన్నారు... నీళ్ళలో తిరగలేరు! జలుబు చేస్తుంది. జ్వరం వస్తుంది. తోటి వాళ్ళకు సహాయం చేయాలని ఉంటుంది..... ఏం సహాయం చేసినా ప్రకృతి చేయాలి గాని తామేం చేయలేమని మంచం వేసుకొని కిటికీలు తీసి, దుప్పట్లు కప్పుకొని చీకట్లో వెచ్చగా పడుకొన్నారు. వాళ్ళకు భయం లేదని చెప్పటం కుదరదు" (పు. 113). అయినా సంపన్నులు సుఖంగా కాలం వెళ్ళదీస్తున్నారు. వాన ప్రవాహ ఉధృతికి ఉలిగప్ప కుండలన్నీ కొట్టుకుపోయాయి. పోయింది మట్టే అనుకున్నాడు. పోయింది రెక్కల

కష్టమే అనుకుంది ఉలిగప్ప భార్య.

అప్పటిదాక చీమకుట్టినట్లు కూడా లేని జనం ప్రమాదం గుర్తించారు. నీటి పీడ విముక్తి చెందాలంటే ప్రవాహగతికి దారిచూపాలి. చెరువుకు గండి పెడితే ఎగువ, దిగువ నీరు కొట్టుకుపోతుంది. గండి కొట్టడానికి ఎగువ వాళ్ళు, గండి పడితే పూడ్చడానికి దిగువ వాళ్ళు వచ్చారు. వారిని వారించి తగువు నుంచి సర్దుబాటు చేశారు ఉద్యోగస్తులు. ముసలమ్మ కట్ట మీద, పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. ఎగువ, దిగువ అనంతపురం వాళ్ళకి ఒకళ్ళ మీద ఒకళ్ళకి నమ్మకంలేదు. ఒకరి వెనుక ఒకరు తిరుగుతున్నారు. ఇళ్ళలోకి నీరు రాకుండా ఉండడానికి మార్గాలు ఏర్పాట్లు చేస్తున్నారు జనం. ఈ పని ఎగువ దిగువ అనంతపురం వాళ్ళు కలసి కట్టుగా పనిచేస్తున్నారు. పోతులయ్య గుడి వద్ద నీరు పొంగి పొర్లుతుందని తెలిసి అందరు అక్కడికి వెళ్ళారు. గుడి దగ్గర కట్ట తెగకుండా దొరికిన వస్తువులతో అడ్డుకట్ట వేస్తున్నారు. వర్షం వద్దని కట్ట మీద అన్ని మతాలవారు గుడుల్లో పూజలు, ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

జనాలు తగినంత వర్షం కావాలని కోరుకుంటున్నారు. ఇది తగినంత వర్షమే. కానీ అనంతపురంలో ఇక వర్షం రాదని కాలవలు, చెరువులను ఆక్రమించి ఇళ్ళు కట్టుకున్నారు. కుచించుకొని పోయిన కాలువల్లో ప్లాస్టిక్, వ్యర్థాలు, ముళ్ళ చెట్లు అడ్డదిడ్డంగా పెంచి పోషించారు. దాంతో తగినంత వానకే అనంతపురం ముంపుకు గురయ్యింది. ప్రకృతికి విరుద్ధంగా పనిచేసి, అనంతపురాన్ని ఎడారిగా మార్చాలని శతవిధాల ప్రయత్నం చేశారు. కానీ ప్రకృతే మనిషి మీద విజయం సాధించింది. వాన ఆగిపోయింది. మెల్లగా నీరు తగ్గు ముఖం పట్టింది. జనం బతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. యేద్దిరప్ప లాంటి బేలుదారీ మేస్త్రీ వంకలో ఇళ్ళు కట్టడం తప్పేనని తెలుసుకున్నాడు. ఇక ముందు అలా చేయకూడదని అనుకున్నాడు. అలాగే అనేక మంది సామాన్యులు తమ ఇళ్ళు, వాటితో పాటు సామాన్లను వర్షం తనలో కలిపేసుకుంది. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. హాస్టల్ విద్యార్థులు చదువు, సంధ్యలు వదిలి పత్తా లేకుండా పోయారు. అంకాలప్ప, నారాయణప్ప, ఇమాం, మాబు సాహెబ్‌లు తమతమ వస్తువులు కోల్పోయారు.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో కట్ట తెగినచోట, ముసలమ్మ ప్రాణత్యాగం చేసిన చోట కట్ట బలహీనంగా ఉంటే అటూ, ఇటూ ఉన్న చెట్ల కొమ్మలు, రెమ్మలు, సాధ్యం అయినంత మేర పరిచి వాటి మీద వేసి ఆ పైన రాళ్ళు రప్పలు, బండలు, చిదువులు, దొరికిన గడ్డి, గాదం, పీచు నాచూ వేసి అక్కడ కట్ట తెగకుండా జనం చూశారు. “జనం ఇప్పుడు అన్నదమ్ములు, ఆత్మీయులు సోదరులు. ఒకరికొకరు అండ... ఇపుడందరూ అనంతపురం పౌరులు. ఎగువ, దిగువ ప్రాంతాల వాళ్ళు కారు.... ... ఉన్నోళ్ళు, లేనోళ్ళు, కాదు. వీళ్ళిప్పుడు మనుష్యులు మాత్రమే! తేడాలు లేవు. మానవ సంబంధమే మానవత్వం మాత్రమే” (పు. 136). అందరిదీ ఒకటే చూపు. చెరువు భద్రంగా ఉండాలి. చెరువునిండా నీరుండాలి. తమ బ్రతుకులు బాగుండాలి. అనే నిరంతర ప్రేమ, స్నేహం, ఐకమత్యం, ఆత్మీయత వర్ధిల్లును గాక.

### <u>3.2.4. పర్యావరణ పరిరక్షణ– ఆక్రమణలు:</u>

అనంతపురంలో ఊహించని విధంగా వాన మొదలై తుఫాన్‌గా మారింది. రాత్రంతా కుంభవృష్టి కురుస్తూనే ఉంది. ఇంత పెద్ద వాన ఈమధ్యలో వారు చూడలేదు. వానతో ముసలివాళ్ళకు కూడ పండుగగా ఉంది. పిల్లలు ఉత్త బిత్తలతో వానలో ఎగురుతున్నారు. నీరు చూస్తే దాహం తీరుతుంది. ఆకలి కూడ కాదు. అది అన్నం ఉన్నంత ఆనందం. ఈవాన్న నీరే పంటై ఆకలి తీరుతుంది. ఇళ్ళు కడుతున్నారు. కమలానగర్ ఇంతకుముందు పంట పొలాల నేల. చెరువు ఉన్నచోట యధేచ్ఛగా సినిమా హాళ్ళు , ఆర్.టి.సి బస్సు డిపో

బస్టాండ్ వచ్చాయి. ఇక్కడే వాననీరు వరదనీరు మురుగు ముప్పేటన కమ్ముకొని మున్నీరుగా మారి, కన్నీరు తెప్పిస్తున్నాయి. మామూలు సమయంలో అది మురుగు కాలువ మునుపు ఫర్లాంగ్ వెడల్పున ఉండేది. పది గజాలు కూడా లేకుండా ఇప్పుడు కుచించుకుపోయింది. వరద ఉధృతి గురించి తెలియని ఆరు ఏళ్ళ పిల్లవాడు అలవాటు చొప్పున కాలువ ఒడ్డున కూర్చున్నాడు. దూకుడుగా వచ్చిన నీటిలో కొట్టుకు పోయాడు. వాడిని నీరు తనలో కలిపేసుకోని తీసుకుపోవడం చూసి తల్లి బోరు మంది.

అనంతపురం ప్రపంచపటంలో ప్రసిద్ధం కావడానికి కారణం త్వరలో ఏడారిగా మారిపోతుందని ప్రపంచ నిపుణుల సంఘం ప్రకటించింది. క్షామ పీడిత ప్రాంతంగా ఉన్నా ఫర్వాలేదు. ఏడారి కాకుడదని పాదర్ ఫెర్రర్ సత్యసాయి బాబా, నీలం సంజీవరెడ్డిలు నీటి ఏర్పాటుకు చేయుతనందించారు. పండమేరు కిలోమీటర్ వెడల్పుతో ఉంటుంది. ఇసుక మేట పడి మెరక భూమి అయింది. వర్షం బాగా పడితే పండమేటిలో నీళ్ళు వస్తాయి మరీ ఎక్కువగా పడితే పాయగా ప్రవహిస్తుంది. ఎంత వాన, వరద వచ్చిన నీరు ఇసుకలో ఇంకి పోతుంది. కానీ రాత్రి వానకు పండమేరు కిలోమీటర్ వెడల్పున ప్రవాహంగా మారింది. నది మధ్యలో ఎవరో ప్లాట్‌లు వేశారు. యూనివర్శిటీ ప్రొఫెసర్లు ఆరుగురు ప్లాట్‌లు కొని ఇల్లు కట్టారు. ఆ ఇళ్ళ చుట్టూ నీరు చేరాయి. వాటికి తూర్పు పక్కన కేంద్ర ప్రభుత్వం టి.వి టవరు కట్టింది. ఇంకెక్కడి నది అని చులకన భావనతో దాని చుట్టు కట్టిన భవనాలు నీటిలో తేలియాడుతున్నాయి. ఎవరైన నీటిలో ఎందుకు కట్టారని అడిగితే అది ఎప్పుడైన నదికావడం నీవు చూశావా? ఎదురు ప్రశ్నించేవారు. ఈ కట్టడాల వెనుక నిర్భయం, నిశ్చయం దేనిని ఖాతరు చేయని లక్షణం ఆశ్చర్యం కలిగిస్తాయి.

పొలాలను ఆక్రమించి ఇళ్ళు కట్టుకోవడం ఇళ్ళకు కావలసిన చెక్క కోసం అనంతపురంలో చెట్లు విచ్చలవిడిగా నరికేశారు. చెట్లుంటే వానొస్తుందని, మొక్కలు పెంచుతుంటే, నీళ్ళు లేక ఎండిపోతున్నాయి. అందుకే అనంతపురానికి కావలసిన మొద్దులు నల్లమల్ల అడవినుండే వస్తుంది. మురికి కాలువలన్ని ఆక్రమణకు గురయ్యాయి. కొద్దో గొప్పో మిగిలిన మురికి కాలువలు "వానలు లేని కాలంలో కాలువ చెత్త కుండీగా మారిపోయింది. మనిషికి అక్కరలేని మలినమంతా పేరుకుపోయింది" (పు. 48). దాంతో బ్రిడ్జీల కింద ప్లాస్టిక్ బ్రిడ్జీలు ఏర్పడ్డాయి. వరద ఉధృతి కూడా వాటిని ఛేదించలేకుండ ఉంది. దానితో కాలువ నీరు గట్లెక్కి ప్రక్క తోవలు చూస్తుంది. బ్రిడ్జీ క్రింద ఉన్న ప్లాస్టిక్ బ్రిడ్జీని గెడ బొంగులతో పారిశుద్ధ్యం పనివారు పొడవసాగారు. దాంతో రంధ్రం పడక గడారులు, పికాసీలు, పారలతో ప్లాస్టిక్ కొండ ఎక్కి బద్దలు కొట్టారు. దాని నుండి సన్నగా నీరు ప్రవహించింది. ఈ వ్యర్థమంతా మరొక బ్రిడ్జి కింద ఏర్పడ్డ ప్లాస్టిక్ బ్రిడ్జీదగ్గర ఆగిపోయాయి. మరల దానిని పాకీ పనివారు బద్దలుకొట్టారు. నీరు చిన్నగా తోవ చేసుకొంది.

ఊరు పెరగక ముందున్న కాలువ వెడల్పు అలాగే ఉండి ఉంటే ఎంత వ్యర్థమైనా కొట్టుకుపోయేది. అనుమతి లేకుండానే అన్ని కొట్టాలు, మిద్దెలు, పెద్ద భవనాలు ఎలా పుట్టుకువచ్చాయో తెలియదు. కాలువలు పూర్తిగా దురాక్రమణకు గురయ్యాయి. దానికి తోడు కాలువలలలో సర్కార్ కంప, ప్లాస్టిక్ కొండలు  బండలుగా, గుట్టలుగా తయారయ్యాయి. దాంతో వాటిని తొలగించే పనిలో పారిశుద్ధ్యపనివాళ్ళు ప్రధానభాగస్వాములు. "అసలు కథ చెప్పేది వీళ్ళు ఆ ప్రధాన భాగస్వాములు వంతగాళ్లు, చిల్లరమల్లర హీరోలు, విలన్‌లు ప్లాస్టిక్ మిట్టలు" (పు. 67). ప్లాస్టిక్ విలన్‌లను ఎదుర్కోడానికి హీరోలైన పాకీవాళ్ళు సిద్ధపడ్డారు. కానీ కుండపోత వర్షంలో వ్యర్థాలను తొలగించడం కుదరడం లేదు. నీటిఉధృతికి కొంత మంది కొట్టుకుపోతున్నారు. దాంతో వాన నీటికోసం ప్రార్థనలు, యజ్ఞాలు చేసే ప్రజలు నీరు

వెళ్ళి పోవాలని మొక్కుకుంటున్నారు.

ఇదినిజంగా వైపరిత్యమే ఈ పరిస్థితి ఎందుకు దాపురించింది. వానలు రాక, చెరువులు నిండక, మొరువలు పారక, వాటిని ఖాళీ జాగాలుగా భావించి, ఆక్రమించారు. ఇళ్లు కట్టుకున్నారు. చివరకు చెరువు కట్టల మీద కూడా గుళ్ళ పేరుతో నిర్మాణాలు వచ్చాయి. ఆ గుడులలోనే వాన ఆగిపోవాలని పూజలు, ప్రార్థనలు చేస్తున్నారు. ప్రాణ భయం, ఆస్తి నష్టాలతో వాన వద్దనుకుంటున్నారు. కోరుకున్నంత వానే కురవాలి. తక్కువ ఉండరాదు. ఎక్కువ కురవరాదు. అసలు లేకుండా పోరాదు. అనేది వారి ప్రార్థన, కానీ "చెరువు పూడిక తీసి ఉంటే అది దురాక్రమణకుగురి కాకుండా ఉంటే మొరవ కాలువలు పూర్వంలాగే ఉండి ఉంటే అవి అన్యాక్రాంతమయి కుచించుకొనిపోయి ఉండకపోతే, ఆయకట్టు అంతా వాన నీటికోసం నిరీక్షిస్తూ ఉండి ఉంటే వరి పండే తరి భూములు ఇళ్ళ స్థలాలుగా మారకుండా ఉండి ఉంటే ఇళ్ళు ఆనకట్టల్లా అడ్డం కాకుండా ఉండి ఉంటే చెరువు నిండుగా మిగులు నీరు ప్రవహించి పోయే జలమార్గాలు దిగ్బంధం కాకుండా ఉండి ఉంటే ఈ వాన తగినంత వానే! ఎక్కువ వాన కాదు" (పు. 143). గతంలో వానలు లేక చెరువు నిండక ఆయకట్టు పండలేదు. పంటలు లేని భూమిని రైతులు అమ్ముకున్నారు.

రైతులు అమ్ముకున్న భూమిలో కొన్నవారు ఇళ్ళు కట్టుకున్నారు. వర్షాలు లేక వలస వచ్చిన వాళ్ళను పట్టణం చేరదీసింది. అడవులు ఎడారులవుతుంటే కొండల్లో ఉన్న గిరిజనులు కడుపు చేత పట్టుకొని పట్టణం వైపు పరుగు తీశారు. గ్రామాల్లో బతుకలేక అడుక్కు తినైనా బతుకుదామని పట్టణం వచ్చిన దళితులను ఎవరు ఆపగలరు. వీరంత ఎక్కడ ఉండాలి. వారంత మురుగు కాలువల గట్లను ఆక్రమించుకోని ఇళ్ళు కట్టుకున్నారు. వాళ్ళను మించి సంపన్నులు అద్భుత భవనాలు నిర్మించారు. పేదలు ఈ వానకు నిరాశ్రయులు అయ్యారు. అనంతపురానికి సాగునీరు ఇవ్వాలనుకున్న ఫెర్రర్, తాగు నీరు ఇవ్వాలనుకున్న సత్యసాయిబాబా బిల్డింగ్‌ల వంక పోరంబోకులు ఎందుకు నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ భూమి చాలానే ఉంది. అక్కడ కాకుండా ప్రభుత్వం ఎందుకు చెరువులోనే నిర్మాణాలు చేపట్టింది. వాన రాదని, వంకలు, కాలువలు ఏరు ప్రవహించవని వీళ్ళు నిర్ధారణకు వచ్చాయని అనుకోవాలా? "ఈ భూమి గొడ్రాలే అని శపించడం వీళ్ళు లక్ష్యమా?" (పు. 146). నిర్మాణాల సమయంలో చేసే పూజలో వాన రాకూడదని వీరంతా కోరి ఉండవచ్చు. ప్రకృతిని, వరుణ దేవుడిని, వానను త్యాగం చేయాలని సంకల్పించి ఉంటారా. వీరి ఉద్దేశం ఏమిటి? వాన పడితే క్షేమం, వానలు వద్దంటే క్షామం, వాన దైవ దానం, మనిషి దైవ ప్రసాదం తిరస్కరించరాదు. ఇంత సంస్కృతి, నాగరికత, ఇంత మానవవికాసం, ప్రజా చైతన్యం ఈ ప్రమాదం అరికట్టలేదా? ప్రకృతి అనంతపురాన్ని ఎడారి చేస్తుందా? మనిషి చేస్తాడా? "ప్రకృతి అనంతపురాన్ని ఎడారి కాకుండా చూడాలని తాపత్రయ పడినా మనిషి దాన్ని ఓడించి అనంతపురాన్ని ఎడారిగా మార్చాలని కంకణం కట్టుకున్నాడా! దీక్షా పూనాడా! తీవ్ర సంకల్పంతో కాలి, మాడి బూడిదై పోతున్నాడా?..... అనంతపురం ఎడారికాకుండా ఎట్లా ఉంటుందో చూస్తాను దీన్ని నెడారి కాకుండా ఏ శక్తి కాపాడుతుందో చూసాను. ఏ ప్రకృతి ఆదుకుంటుందో చూస్తాను..... పంచ భూతాలు మూకుమ్మడిగా ఎగబడినా సరే అనంతపురాన్ని రడారి చేసి తీరుతాను. మనిషి లేని, ప్రాణి లేని, చెట్టు చేమా లేని విశాల శూన్యంగా మారిస్తే కాని నేను విశ్రమించను...... ఇంత సంస్కృతి, నాగరికత, చరిత్ర మంట కలసి పోవాల్సిందే మనుషులుండరాదు, చెట్లు చేమా ఉండరాదు" (పు. 147). మనిషి కంకణం కట్టుకున్నాడు.

అటువంటి మనుషులకు ఈ వాన వరద, కళ్ళు తెరిపించింది. చెట్లు జీవనాధారమని చెట్ల మూలంగా వర్షం వచ్చి ప్రకృతి పులకిస్తుందని తెలుసుకున్నారు. వానతో వాగులు,

వంకల ద్వారా చెరువులోకి నీరు చేరి పంటలుగా మారుతుందని ఆ నీటికే అడ్డుకట్టలు కడితే మనిషి మనుగడ కష్టమని గుణపాఠం నేర్చుకున్నారు. అలా గుణపాఠం నేర్చుకోకుండా ప్లాస్టిక్ పర్వాతాల్లా మారి నీటి ప్రవాహానికి అడ్డుపడితే కొట్టుకుపోతారని చెప్పారు. నేలగల్లు కోట రాం.పి.రెడ్డి బంగ్లాలు ప్లాస్టిక్ కోటల్లా మారి ప్రకృతికి ఎదురు నిలిచాయి. అలా ఎదురు నిలిచిన వ్యర్థాలను దళితులు ఐక్యమై గెడ కర్రలతో, గడారులతో కుల్లబోడిచారు. ప్లాస్టిక్ కోటలను బద్దలుకొట్టారు. వరదనీటికి దారీ చూపారు. అలాగే బంగ్లా ఆధిపత్యాన్ని వరద ప్రశ్నించింది. నిరంకుశంగా, గర్వంగా తలెత్తుకు నిలుబడిన బంగ్లాను నేల కూల్చింది. అదే భవనంలో వంట, సామాను గదులు మాత్రం చెక్కుచెదరలేదు. ఎందుకంటే అందులో శ్రామికులు నివశించారు. వాన నేర్పిన గుణ పాఠంతో ఇక చాలు అని అన్ని మతాల దేవుళ్ళకి ప్రార్థనలు చేస్తున్నారు. పశ్చాత్తాప పడుతున్నారు. "మనిషి వెర్రివాడా! మేలుకో! గొంతు పిసుక్కోవద్దు. ప్రాణం తీసుకోవద్దు..... మనిషీ నీకో  నమస్కారం. దేవుళ్ళారా! తెలియక చేసిన నేరాలు క్షమించండి. ఈ జనాన్ని కాపాడండి. ఇప్పటికీ వాన ఆపండి" (పు. 148) అని కనిపించిన దేవుళ్ళందరిని వేడుకుంటున్నారు.

"నీటితత్త్వం ప్రాణమివ్వడమే అయినా, నీరు వరదైతే, విలయతాండవం చేస్తే, ప్రాణం తీస్తుంది. ఇక్కడ నీరు ఏకకాలంలో అశేష ప్రజానీకానికి, కాలగతికీ, పరిణామక్రమానికీ మెటఫర్. పాత్రల చిత్రీకరణలో వాతావరణ కల్పనలో, సంఘటనల కూర్పులో కథను నడిపించే నేర్పులో, నవలను ఒక చారిత్రక వాస్తవిక దృశ్యకావ్యంగా మలచడంలో కొలకలూరి ఇనాక్ తన అద్భుత ప్రతిభను కనబరిచారు. ప్రతి ఒక్కరూ చదవదగిన నవల ఇది" (అద్భుత చిత్రణ 'అనంతజీవనం' (వ్యాసం), ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యంపై విమర్శనం, 2009: 115) అని బిక్కి కృష్ణ అభిప్రాయపడ్డారు.

### 3.2.5. అనంత జీవనంలో మనిషి జీవనతత్వం

మనిషి జీవితం అనంతమైనది. మనిషి ఆలోచనలాగా మనిషి ఆకలిలాగా, మనిషి ఊపిరిలాగా సుదీర్ఘమైనది ఈ జీవనపోరాటం. ఏ ఇద్దరి ఆలోచనలు ఒకే విధంగా ఉండనట్లు, ఏ ఇద్దరి జీవన గమ్యం ఒకే రకంగా ఉండదు. దీనికి కారణాలు అనేకం.

'అనంత జీవనం' నవలలో మనిషి వివిధ జీవిత కోణాలను, సమాజ పోకడలను, పేదలు ధనవంతుల జీవిత అవసరాలను విలాసాలను పాఠకులకు అవలోకనం అయ్యేవిధంగా చక్కని పదాల అల్లికద్వారా, పాత్రచిత్రణ ద్వారా తెలియజేశారు.

**జీవితమంటే:** జీవితమంటే నిరీక్షణ. మనిషి పుట్టినప్పటినుంచి గతించే వరకు దేనికోసమో నిరీక్షిస్తూనే ఉంటాడు. ఈ నిరీక్షణకు అంతం ఉండదు. ఈ నిరీక్షణ కొనసాగుతూనే ఉంటుంది. రేపటి గురించి ఆలోచిస్తూ, కలలుగంటూ, ఆందోళన చెందుతూ రేపు ఏమి జరుగుతుందో తెలియకుండా మనిషి చేసే జీవిత ప్రయాణాన్ని చక్కగా తెలియజేశారు ఆచార్య కొలకలూరి ఇనాక్.

నవలలో ఉత్తప్ప భార్యకు ఇంటిపెంకు పడి తలకు గాయమైంది. రాం. పి. రెడ్డి ఇంటికి వెళ్ళలేదు. ఈ విషయం సాలమ్మకు తెలియదు. సాలమ్మ కాలు బట్టలుతికే బండకింద మడతపడి బరువు చేసింది. ఉత్తప్ప, సాలమ్మకు తన ఇంటికి రాలేని స్థితిలో ఉన్నారని రాం.పి.రెడ్డికి తెలియదు. ఈ తెలియని తనమే జీవితమంటూ జీవన తత్వాన్ని రచయిత ఈ విధంగా తెలియజేశారు."ఉత్తప్ప రాలేని పరిస్థితిలో ఉన్నాడని సాలమ్మకు తెలియదు. సాలమ్మ కాలి కష్టంతో ఉందని ఉత్తప్పకు తెలియదు. నేను కాకపోతే తాను అని ఇద్దరూ అనుకొంటూ ఎవరు రారని రాం.పి.రెడ్డికి తెలియదు. ఈ తెలియని తనమే జీవితం. అయినా జీవితం కొనసాగుతూనే ఉంటుంది. కాలం ఆగదు. ఏ పనీ ఆగదు. ఆకలీ ఆగదు" (పు. 23)

జీవితంలో మనిషిచేసే ప్రతిపనివెనుక ఏదో ఒక తెలియని శక్తి పనిచేస్తుందని కొందరి నమ్మకం. దీనినే కొందరు దైవేచ్ఛ, విధి, కర్మ సిద్ధాంతం, కర్మఫలం అంటారు. ఈ కర్మ సిద్ధాంతం తెలిసినా, తెలియకపోయినా మనిషి జీవన పోరాటం ఆగదు. మనిషి జీవితాంతం దేనికోసమో ఆరాటపడుతూనే తన జీవిత ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ ప్రయాణం మరణం వరకు ఆగదు.

"రాం.పి.రెడ్డి ఎవరినైనా పంపినా వాళ్ళు వెళ్ళినా, ఇళ్ళదగ్గర వాళ్ళులేరని విని చూసి తిరిగివచ్చి చావు కబురు చల్లగా చెబుతారు. అయినా తానొక మనిషిని చూడాలి. పనిచెప్పాలి. అంతే నాపని, విని అందుకు అంగీకరించాలి. పోవాలి, రావాలి అందుకు నిరీక్షించాలి. నిరీక్షించటం తప్పదు. జీవితం అంతా ఎందుకో ఒక దానికోసం నిరీక్షిస్తూ ఉండటమే లక్ష్యం. నిరీక్షణే జీవితం. వృద్ధాప్యం కోసం, మరణం కోసం కూడా మనిషిది నిరీక్షణే. నిరీక్షణ ఆగిపోవటం అంటే మనిషి మాయం కావటమే, చనిపోవటమే! సమాధి కావటమే! సంస్కారం పొందటమే! (పు. 53).

**<u>మానవ సంబంధాలు:</u>**

సమాజంలో ఉన్న వ్యక్తి ఇతరులతో కలవకుండా బ్రతకటం అసాధ్యం. మనిషి ఎంత సంపన్నుడయినా ఎంత పలుకుబడి అధికారం కలిగి ఉన్నా మనుషులతో కలవకుండా, సమాజానికి దూరంగా బ్రతకలేదు. ఇటువంటి వ్యక్తుల వద్దకు ధనం, అధికారం ఉన్నంత కాలమే మనుషులు వెళ్తారు. ఇవి నశించిన నాడు మనుషులు అదే విధంగా దూరమవుతారు. అందుకే మనిషి తన మీద తాను ఆధారపడాలి. అధికారము, ఆస్తిపాస్తులు శాశ్వతం కాదనే విషయం తెలుసుకోవాలి. కష్టాల్లోనైనా, సుఖాల్లోనైనా తమ వెంట ఉండే ఆత్మీయులను సంపాదించుకోవాలి. అధికారం పలుకుబడితో తమ వెంట తిరిగే జనం అవి కనుమరుగైనప్పుడు ఏ విధంగా దూరమవుతారో అనే విషయాన్ని రచయిత ఈ విధంగా చెబుతారు.

"జనంలో ఇంత పేరు ప్రఖ్యాతులున్న తనకు పిలిస్తే పలికే మనిషి లేకపోవడం అంతుబట్టటం లేదు, జీర్ణం కావటం లేదు, అసాధ్యంగా ఉంది" (పు. 82). ".... ఏమయింది తొంభై అయిదేళ్ళ జీవిత సారాంశం ఎవరికి కానివాడుగా కాబట్టని వాడుగా ఎందుకు మారాడు? ఇందరికి విందు వినోదాలు ఇచ్చినా ఉప్పుతిన్నా కృతజ్ఞత లేనివాళ్ళుగా ఇంతమంది ఎందుకు మారిపోయారు? తాను మనుషుల్ని ప్రేమించలేదా? తనను తానే ప్రేమించుకొన్నాడా? ఇంతమంది జనం తనవాళ్ళుకారా? తానెవరి మనిషీ కాడా?" (పు. 83). మానవ సంబంధాల్లోని అంత్యాన్ని అవగాహన చేసుకోవచ్చు ఈ నవల్లో. మనిషికి అనుభవమే మంచి గురువు. తనసౌకర్యాలు తీర్చే పనివాళ్ళు తనచుట్టూచేరి తన అవసరాలు తీర్చుతుంటే వారి విలువ గుర్తించలేని రాం.పి.రెడ్డి తన అవసరాలు తీర్చే పనివాళ్ళు ఒకరోజు లేకపోయినా తన జీవితం ఎంత అగమ్యగోచరంగా తోచిందో అనుభవంలోకి వచ్చింది. వారి విలువ తెలిసింది వారి అభిమానం గుర్తుకు వచ్చింది.

సంపన్నులకు పనిచేసిపెట్టే పని వాళ్ళమీద ప్రేమాభిమానాలు ఉండటం అరుదు. ఎందుకంటే సంపన్నులు వారికి పని కల్పించామనే దృష్టితో, లేదంటే వాళ్ళు పనిచేయడానికే పుట్టిన వాళ్ళలాగా భావిస్తారు. సంపన్నుల సౌకర్యాలు తీర్చిన పనివాళ్ళకు వెల కడతారు కానీ సేవాదృక్పథంతో చూడరు. నిత్య సౌకర్యాలు తీర్చేపనివాళ్ళు ఒకరోజు లేకపోయినా, సంపన్నుల జీవితాలు ఏ విధంగా ఉంటాయి అనే విషయం వృద్ధుడైన రాం.పి.రెడ్డికి తెలిసి వచ్చింది. మనుషులు ఒకరిపై మరొకరు ఆధారపడి బ్రతుకుతున్నామనే స్పృహ మనిషిని మనిషిగా జీవించేలా ఆదరించేలా, అభిమానించేలా, ప్రేమించేలా చేస్తుందని రచయిత ఆ భావాన్ని ఈ విధంగా తెలియజేశారు.

"ఉత్తప్ప తనకష్టం ఏదో చెప్పుకుంటుంటే రాం.పి.రెడ్డి వినటంలేదు. ఆనందంతో పొంగిపోతున్నాడు. దేవుడు ప్రత్యక్షమయినా రెడ్డి అంతగా ఆనందించడు. ఉత్తప్ప క్షమాపన కోరుతుంటే రెడ్డి పట్టించుకోవటంలేదు. రాం.పి.రెడ్డికి ఉత్తప్పను పట్టుకొనే పరిస్థితి ఎప్పుడూ రాదు. ఎప్పుడయినా మెచ్చుకోలుగా షేక్‌హాండ్ ఇచ్చి ఉంటే ఉండవచ్చు. వస్తున్న ఉత్తప్పకు ఎదురుగా వెళ్ళిన రాం.పి.రెడ్డి బెదురుతున్న అతణ్ణి రెండు చేతులా పట్టుకొని, రెండుభుజాలు పట్టుకొని దగ్గరకు తీసుకొని గుండెలకు హత్తుకొని, మెడకు మెడ ఆనించి వీపు మీద చేతులు బిగించి మెడ మీద తల ఉంచి ఆదరంగా అలాగే ఉండిపోయాడు.

ఉత్తప్ప ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. రెడ్డి తనను ఆదరంగా అక్కున చేర్చుకోవటం ఊహించని ఉత్తప్ప స్వర్గం దిగి కాళ్ళదగ్గరకు వచ్చినట్లు పొంగిపోయాడు. ఉత్తప్ప భుజం మీద ఉన్న రాం.పి.రెడ్డి కళ్ళల్లోంచి నీళ్ళు పడుతున్నాయి. వర్షంనీళ్ళుకాదు/తడుస్తున్న ఇంటి నీళ్ళు కాదు/కురుస్తున్న కంటి నీళ్ళు/ఉత్తప్ప వణికిపోయాడు.

రాం.పి.రెడ్డి ఉత్తప్ప మెడమీద నుంచి లేవలేదు. ఉత్తప్ప లేపలేదు. కన్నీరు కురుస్తూనే ఉంది. ఇద్దరికి సుఖంగా ఉంది" (పు. 85-86). ఈ విధంగా మనిషి జీవితంలోని అంతర్ముఖమైన మార్పును కళ్ళకు కట్టినట్లు చూపిస్తారు ఆచార్య కొలకలూరి ఇనాక్.

**పట్టణ ప్రజల జీవనం:**

పట్టణాల్లోని వివిధ వర్గాల్లో పేదల, సంపన్నుల, వ్యాపారుల, కార్మికుల జీవనాన్ని సహన సిద్ధంగా తెలియజేశారు రచయిత. పల్లెల్లో పనిలేక పొట్ట చేతపట్టుకొని, పట్టణాలకు వలసలు వచ్చిన పేదలు జీవనం దుర్భరంగా ఉంటుంది. వీరు పొద్దస్తమానము కష్టించి పనిచేసినా రోజుకు రెండుసార్లు తినడానికి కష్టమైతే, ఇతర అవసరాలు ఏ విధంగా సమకూర్చుకోగలరు? వారి పిల్లలకు చదువులు ఎలా చెప్పించగలరు? ఇళ్ళ స్థలాలు ఎలా కొనగలరు? ఇళ్ళు ఎలా కట్టించుకోగలరు? ఇలాంటి వారి యదార్థ జీవితాలను గ్రహించి మన కళ్ళముందుంచుతారు ఆచార్య కొలకలూరి ఇనాక్.

అనంత జీవనంలో అనంతపురం పట్టణంలోని పేదల జీవనానికి నిదర్శనంగా వీళ్ళ ఇళ్ళు నిర్మాణాలను, నిర్మాణ రీతులను తెలియజేశారు రచయిత. "కొట్టాలు సాధారణంగా నిలువునా పాతిన కడప బండలు గోడలుగా, మంగళూరు పెంకులు, కప్పుగా ఏర్పడతాయి. ఇవి వానకు ఇళ్ళుకావు, గాలిఎండల నుంచి కాపాడేఇళ్ళు" (పు. 26).

ఈ విధంగా పేదల ఇళ్ళు సాధారణంగా ఉంటాయి. ఇటువంటి సాధారణ ఇళ్ళు సామాన్యంగా దళితులవి. వెనుకబడిన కులాల వాళ్ళవి. వీరు పట్టణాలకు కడుపు నింపుకోవటానికి వచ్చిన వాళ్ళు. పట్టణాల్లో ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్ళ స్థలాలను కొని ఇళ్ళు నిర్మించుకోలేరు. వీరికి ప్రభుత్వ సహాయం నామమాత్రంగానే ఉంటుంది. అందుకే వీరి ఇళ్ళన్నీ పట్టణాలకు లోతట్టు ప్రాంతాల్లోనే ఉంటాయి. ఇక్కడికి ధనవంతులు ఇళ్ళ స్థలాలను కొనడానికి రారు. ఎవరు నివసించడానికి అంతగా ఇష్టపడని ప్రాంతాలలో ఇళ్ళు అనబడే చిన్న చిన్న కొట్టాలు వేసుకొని జీవనం సాగిస్తుంటారీ పేదవాళ్ళు.

పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలలో జీవిస్తున్న పేదల బ్రతుకులను 'అనంతజీవనం'లో రచయిత ఈ విధంగా చిత్రిస్తారు. "చెరువుగట్టు దిగువన, మొరవ కాలవ ఒడ్డున అంబేద్కరు నగర్ ఉంది. స్వాతంత్ర్యం రాక పూర్వం అది పుట్టలేదు. అప్పుడా నేల మొరవ ప్రవహించే లోతట్టు భూమి. పట్టణ పారిశుద్ధ్యం పనివాళ్ళు పెరుగుతూ ఉన్నప్పుడు పల్లెలనుంచి వచ్చిన దళితులు అక్కడ కొట్టాలు వేసుకున్నారు. మిద్దెలు కట్టుకున్నారు. అవి ఎండకు, గాలికి అండదండలే కాని వానకు కాదు. కొట్టాలు, మిద్దెలు తడుస్తాయి. వానకు కురుస్తాయి" (పు. 36). ఈ విధంగా పేదలు పట్టణాల్లో ఎంత దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారనే విషయాన్ని

ఆవిష్కరిసారు రచయిత.

**పట్టణాల్లో సంపన్నుల జీవనం:**

ఈ నవలలో సంపన్నుల విలాసవంతమైన జీవనానికి ప్రతీకగా నేలగల్లు పాలెగాళ్ళను చెప్పవచ్చు. అందులో గోవిందరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాం.పి.రెడ్డి ముఖ్యులు. వీరు ఒక్కొక్కరు ఒక్కోరకమైన విలాస జీవితానికి ప్రతీకలు. గోవిందరెడ్డి నేలగల్లు భూకామాందు. హత్యలు చేయించడం, తనను ఎదిరించిన వాళ్ళను జాడలేకుండా చేయడంలో ఆరి తేరినవాడు. గంగారెడ్డి రెండో కొడుకు వెంకటేశ్వరరెడ్డి విలాస పురుషుడు. మందు పొందు జీవిత పరమార్థంగా జీవించినవాడు. ప్రతిరోజు మందులేనిదే పొద్దుపొడవదు. పొందులేనిదే నిద్దురపోడు. వెంకటేశ్వర రెడ్డి విలాసాలను రచయిత ఈ విధంగా తెలియజేశారు.

"అతడికి ఆడపిచ్చితోపాటు తాగే రోగం బాగాఉండేది. ఖరీదయిన మందయితే మేలు. కల్లు ఇష్టమే. సారాయి ఇష్టమే! తమ్ముడిలాగా రమ్ము ఇష్టమే. బ్రాందీ, విస్కీ, జిన్ను, బొన్ను ఏదైనా ఇష్టమే. వోడ్కని సారాయి అనేవాడు. విదేశీ మద్యం అతడికి మరింత ఇష్టం. ఏదీ లేకపోతే సారాయి అయినా సరే! దొరసాని, విదేశీ మద్యంకానీ, కల్లు, పని పిల్లకానీ రెడ్డి అనుభవించే ఆనందం ఒకటే. ఒకే రం ఒకే భార్య – ప్రియురాలు, దొరసాని, ఏంటని తమ్ముణ్ణి చిన్నచూపు చూసేవాడు రెడ్డి" (పు. 62).

ఈ విధంగా మందుతోనూ, మగువలతోనూ విలాసవంతమైన జీవితాన్ని అనుభవించేవాడు వెంకటేశ్వరరెడ్డి. రాం.పి.రెడ్డి బారెట్ల క్రిమినల్ లాయరు, జమిందార్ల దర్పం వంటబట్టించుకున్నాడు. హత్యలు చేయించడం వెన్నతో పెట్టిన విద్య. తన వృత్తిలో గాని, ప్రవృత్తిలోగాని తనను ఎదిరించిన వాళ్ళను కనబడకుండా చేయడంలో ఆరితేరినవాడు.

రాం.పి.రెడ్డి ప్రత్యేకతలను గూర్చి ఆచార్య కొలకలూరి ఇనాక్ ఈ విధంగా తెలియజేశారు. రాం.పి.రెడ్డికి రెండు ప్రత్యేకతలున్నాయి. తాను కేసు సాధారణంగా గెలుస్తాడు. ఒకవేళ ఓడిపోతే ఓటమికి కారణమైన వాడు చనిపోతాడు. రెడ్డి కోర్టుకు సామాన్యంగా పోడు. జూనియర్లను పంపేవాడు. అతడు కేసు తీసుకుంటే వాది కేసయినా, ప్రతివాది కేసయినా గెలుస్తామని నమ్మకం. ఆ నమ్మకం నిలబెట్టుకొనే వాడు రెడ్డి. ఈ విధంగా జమిందార్లు చేసే అక్రమణలను విలాసాలను, అధికార దర్పాన్ని నవలలో గమనించవచ్చు.

సంపన్నుల విలాసాలను దుబార ఖర్చులను సౌకర్యాలను, ఖరీదైన జీవన విధానాలను రచయిత ఈ విధంగా తెలియజేస్తారు. క్రిమినల్ లాయర్‌గా రెండు చేతులా సంపాదించాడు. నాలుగు చేతులా ఖర్చు చేసేవాడు. భార్య ఖర్చు మనిషి. ఖరీదైన మనిషి. సంపాదించిన సొమ్మేకాదు, జమీందారీ సొమ్ముకూడా దుబారా చేసేవాడు. రాం.పి.రెడ్డి చేతికి ఎముక లేదనే వాళ్ళు, పేదలు కాదు, సంపన్నులనే వాళ్ళు.

ఈ విధంగా విలాసవంతమైన జీవనాన్ని అనుభవిస్తున్న వాళ్ల జీవితాలను ప్రత్యకంగా చూస్తున్న అనుభవాన్ని కలిగిస్తారు రచయిత.

**పట్టణాల్లో చిన్న వ్యాపారుల జీవనం:**

పూల వ్యాపారం, చెప్పుల వ్యాపారం, ఖాళీ సంచుల వ్యాపారం మొదలైన చిన్న చిన్న వ్యాపారాలు చేసే వారి జీవనాన్ని పాఠకులకు కళ్ళతో చూసిన అనుభవాన్ని కలిగిస్తాడు రచయిత. "ఖాళీ సిమెంట్ సంచులు ఐదు నూర్లు దాకా ఉన్నాయి. వాటిని మూటలు కట్టి ఇంటిముందు పేర్చి ఉంచాడు. వాటిని వానలో తడవకుండా చేయాలని తాపత్రయం తడిస్తే నాని చివికి పాడయిపోతాయి. వాటిని ఎవరూ కొనరు.

తాను సంచి రూపాయికి కొన్నాడు 500 రూపాయలు నష్టం. ఐదురోజులు తిరిగి కొన్నాడు. మరో అయిదు నూర్లు కూలీ చెడుపు. అమ్మితే మరో అయిదునూర్లు లాభం వస్తుంది

అదీ నష్టం."చిన్నప్రాణం బక్క బతుకులు అంతసొమ్ము నారాయణప్ప పాలిటికి పెద్ద మొత్తమే! కానీ ఏంచేస్తాడు?" (పు. 133). ఈ విధంగా చిన్న వ్యాపారుల జీవనాన్ని అనంతజీవనం నవల్లో అవగాహన చేసుకోవచ్చు. అదే విధంగా పట్టణాల్లోని వివిధ వర్గాల జీవన నేపథ్యాన్ని బహుముఖ కోణాల్లో ఆవిష్కరింపచేశారు.

**<u>చేతివృత్తుల వాళ్ళ జీవనం:</u>**

చేతి వృత్తుల కార్మికులకు వాళ్ళ రెక్కల కష్టమే జీవనాధారం. వీళ్ళు జీవితంలో సర్వం కోల్పోతే, బాధ, కన్నీళ్ళు ఎప్పుడు ఉండేవే, రెక్కల కష్టం ఎప్పుడు ఉండేదే అని ధైర్యాన్ని కూడగట్టుకొని జీవిత గమనంలో ముందుకు వెళ్ళేతత్వాన్ని ఈ నవలలో గమనించవచ్చు.

ఉలిగప్ప కుమ్మర పనివాడు, మట్టిపాత్రలకు మంచి గిరాకి ఉంటుందని ఉలిగప్ప నాలుగు బళ్ళనిండా మట్టిపాత్రలు అనంతపురం తీసుకెళ్ళాడు. అవి అమ్మి తన కుటుంబంతో ఉన్నంతలో బ్రతకాలని ఉలిగప్ప ఆశ. కాని అనంతపురంలో ఉధృతంగా వాన కువరడం వలన కుండలన్నీ ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయాయి. చేతులతో ఆపగలిగినన్ని పాత్రలు పట్టుకున్నాడు ఎన్నని ఆపగలడు తన కష్టార్జితం ప్రవాహ ఉధృతికి కొట్టుకొని పోతుంటే ఏమి చేయలేని అసహాయస్థితిని అంత దు:ఖములోను ధైర్యాన్ని కోల్పోని మనస్తత్వాన్ని రచయిత ఈ విధంగా చెబుతారు. చేతులతో ఆపగలిగినన్ని పాత్రల్ని ప్రవాహంలో కొట్టుకుపోకుండా ఆపి పట్టుకొన్న ఉలిగప్ప భార్యనూ పిల్లల్ని చూస్తూ బావురుమని ఏడ్చాడు. అతన్ని చూచి వాళ్ళు బావురుమన్నారు. పోయింది మట్టే అనుకొన్నాడు ఉలిగప్ప. పోయింది రెక్కల కష్టమే! అనుకొంది భార్య. బ్రతికుంటే భూమితల్లి ఎంతమట్టి అయినా ఇస్తుంది. తనను తాను ఓదార్చుకున్నాడు ఉలిగప్ప. రెక్కలకష్టం ఎప్పుడూ ఉండేదే! ధైర్యం కూడగట్టుకొన్నారు. పడిపోయిన ప్లాస్టిక్ పాకకు ఆనుకొని కూర్చున్నాడు ఉలిగప్ప భార్యతో పిల్లలతో. వాళ్ళు ఏడవటంలేదు వానలో తడుస్తున్నారు" (పు. 115). చేతి వృత్తుల కార్మికుల బ్రతుకులను, కన్నీళ్ళను సహజసిద్ధంగా తెలియజేశాడు రచయిత. ఈ విధంగా అనంతజీవనంలో మనిషి జీవితంలోని వివిధ కోణాలను వివిధ వర్గాల మనుషుల జీవితాలను సమాజ పోకడలను తెలియజేశారు.(వరప్రసాద్.బి :2011) పట్టణంపై వున్న మమకారంతో ఆ నేలలో వసించినందుకు, ఆ నీళ్ళు త్రాగినందుకు, అనంతపురం రుణం తీర్చుకోవాలనుకున్నాడు. వృద్ధాప్యాన్ని లెక్కచేయక వీధి వీధి తిరిగి స్థితిగతులు తెలుసుకొని అనంతపురం పూర్వ వైభవాన్ని జోడించి అనంత జీవనం అనే సహజ సుందర గ్రంథ రాజాన్ని మన హస్తాల్లో పెట్టాడు.

అనంతపురం జీవన చిత్రణ కోసం మూలాలను వెదికాడు. 600 ఏళ్ళ పూర్వం చిక్కప్ప వడయారు అనే అతను అనంతమ్మపేర ఒక చెరువును కట్టించాడు. చెరువుకు ఎగువున కట్టిన ఆనాటి ఇళ్ళకే అనంతపురని పేరు వచ్చింది. నేడు లకల ఇళ్ళు చోటుచేసుకున్నాయి. దీనిని ఎవరెవరు పాలించారని ఆరాతీశాడు. హండేవంశ ప్రభువులు, నేలగల్లు ప్రభువులు పాలించారని బళ్ళారి నుండి అనంతపురం విడివడిందని తెలుసుకున్నాడు. నేలగల్లు ప్రభువుల దురహంకారాలకు, దురాగతాలకు ఆలవాలమైన నేలగల్లుకోటను ఆ కోటలో నివాసం ఉండిన గోవిందరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాం.పి.రెడ్డి జీవితాల వుత్థాన పతనాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. ఒక పురావైభవానికి, ఒక ప్రాచీన సంప్రదాయానికి, ఒక దుష్ట సంస్కృతికి, ఒక చరిత్ర అవశేషానికి చరమ చిహ్నమైన రెడ్డి బంగ్లా వరదధాటికి కూలిపోయింది. కోట కూలడంవల్ల అందరూ సజీవ సమాధి చెందారు.

అనంతపురంలో తుఫాను ఒక ఆశ్చర్యకరమైన విషయం. అది విలయతాండవం చేసింది. వాగులు వంకలు ఏకమై పారాయి. చెరువులు దొరువులు నిండి పొంగిపొర్లాయి. వీధులు నగర్లు జలమయమయ్యాయి. అందరికీ నిలువ నీడలేకుండా పోయింది. రాం.పి.రెడ్డి

వారి లాంటి వాడు కూడా మంచంక్రింద నక్కి పడుకోవలసి వచ్చింది. ఆ కుంభవృష్టికి, ఆ వర్షధాటికి గొర్రెల మందలు కొట్టుకుపోయాయి. అంకాలప్ప యజమాని సుబ్బరాయుడికి ఏమిచెప్పాలో తెలియక అల్లాడిపోయాడు. కూలిన ఇళ్ళను చూడడానికి ఇళ్ళుకట్టే బేల్దారి యద్దీరప్ప స్వయానా బయలుదేరాడు. నాగన్న కట్టెలఅడితి పూర్తిగా నీటమునిగింది. సంబులపూలకుంటలో కుమ్మరి ఉలిగప్ప కుండలు పగిలిపోయాయి. చేతులకష్టం నీటిపాలైంది. నారాయణప్ప ఖాళీ సంచులు, సమాంమాబూల సిమెంటు ఇటుకలు, అక్కులప్ప చెప్పుల మూటలు నీటతేలాయి. వారందరి బ్రతుకు బజారునపడింది. హాస్టలు విద్యార్థులు లోపలున్నా ఒకటే, బయటున్నా ఒకటే అని వానలోనే ఆటాడు కుంటున్నారు.

ఆ వర్షధాటికి కలరా ప్రబలింది. సామూహిక మరణాలు, సామూహిక జలసమాధులు చోటుచేసుకున్నాయి. నీలం సంజీవరెడ్డి, పుట్టపర్తి సాయిబాబా, ఫాదర్ ఫెర్రర్ వారి సేవా కార్యక్రమాలు మొదలయ్యాయి. నేలగల్లు జమీందారులు సామాన్య ప్రజానీకం వర్షంలో దిక్కులేనివారయ్యారు. ప్రజలంతా వర్షం ఆగడానికి దేవుళ్ళను ప్రార్థించారు. హిందూదేవుళ్ళారా! ఇస్లామ్ దేవుళ్ళారా! క్రైస్తవ దేవుళ్ళారా! ఈ మనిషి తెలియక చేసిన నేరాలు కమించండి. ఈ జనాన్ని కాపాడండి. ఇప్పటికి ఈ వాన ఆపండి అని ప్రార్థించారు. చివరికి అతివృష్టి తగ్గింది. అనంత జీవనం ప్రశాంత సుందరమైంది. రాజు పేదలు సమానమయ్యారు. ఇది వర్షం తెచ్చిన సమానత్వం. ఈ ప్రకృతి విజృంభణ, బీభత్సం ఈ గ్రంథంలో సహజంగా రచించబడింది. కరువు నిలయతాండవం చేసే అనంతపురంలో తుఫాన్ రావడమంటే ఎవరూ నమ్మకపోవచ్చు. కానీ అది నిజం. వర్షం కురుస్తూ ఉంది. రాత్రి నుండి పడుతున్న కుంభవృష్టికి కాలువలు, చెరువులు నిండిపోయాయి. పదేళ్ళుగా మొరవలు పారకపోవడంవల్ల చెరువులు, కాలువలు ఆక్రమణకు గురై కుంచించుకుపోయాయి. వరదనీరు పోయే మార్గాలు మూసుకుపోవడంవల్ల బుక్కరాయ సముద్రం నుండి నీరు వెనక్కు మళ్ళి కాల్వలను ముంచెత్తుతూ బీభత్సాన్ని సృష్టించింది. చెరువు కింది భూములన్నీ నీళ్ళతో నిండిపోయాయి. చెరువు లాకులు ఎత్తుదామంటే పదేళ్ళనుండి తీయక అవి బిగుసుకుపోయాయి. బలాశయాలచుట్టూ జనసంస్కృతి పెరుగుతుందని అందరికీ తెలుసు. అలాగని ముందు చూపులేకుండా జలాశయాలను విచ్ఛిన్నం చేసుకుంటే ఎలా? ఎప్పుడో కాని చెరువు నిండకపోవచ్చు. మొరవ పారకపోవచ్చు. అలా అని వాటిని ఆక్రమిస్తే ఏమవుతుందో ఈ వాన తెలియజేసింది. ముందుగా పేదల నివాస ప్రాంతాలన్నీ ఆ వానలను ఎదుర్కొంటాయి. ఏమీలేని వాళ్ళకుండే ఏకైక ఆస్తి ఇళ్ళు, అవి వరద నీటిలో మునిగిపోయి, కూలిపోయి ఉన్నాయి. పల్లపు ప్రాంతాల జీవితాలను, బడుగు జీవుల వెతలను, కష్టజీవుల – చిల్లర వ్యాపారుల జీవనాన్ని వరద ఎలా దెబ్బతీసిందో హృదయ విదారకంగా రచయిత కళ్ళకు గట్టినట్లుగా వివరించారు. అనంతపుతం జిల్లా అభివృద్ధి ఎలా అస్తవ్యస్తంగా వ్యాపించిందో తెలియజేసే ఈ నవల ఇంకోవైపు అనంతపురం జిల్లా చరిత్రను కూడా తెలియజేస్తుంది. పాళెగాళ్ళు జమిందారులుగా మారిన క్రమం నుమడి ప్రజాస్వామ్యం–ఫ్యాకనిజంవైపు పురోగమించిన చరిత్ర కూడా ఇందులో కన్పిస్తుంది. పాలెగాడు గంగారెడ్డి పోయిన రాజ్యం పోగా, ఉన్నదానితో ఎలా నిరంకుశంగా వెలిగిపోయాడో ఇందులో చెబుతారు. అతని తర్వాత గోవిందారెడ్డి కర్కోటకుడిగా మారి ప్రజలను ఎలా వేదించుకుతిన్నాడు. రెండవవాడు రాంపిరెడ్డి క్రిమినల్ లాయర్‌గా వెలగబెట్టిన రాజకీయాలను, మూడవవాడు వెంకటేశ్వరరెడ్డి విషయలోలుడుగా ఎలా జీవితాన్ని గడిపాడో తెలిసినా–చివరకు వారి జీవితాలు ఎంత దయనీయంగా ముగుస్తాయో తెలియజేస్తారు. వరద బీభత్సం అనంతపురం జీవితాన్ని ఎలా అల్లకల్లోలం చేసిందో ఒకవైపు– మరోవైపు గంగారెడ్డి కుటుంబ సభ్యుల ఉత్థాన పతనాలను ఆసక్తికరంగా చిత్రీకరించిన విధానం బాగుంది.

## 3.3. మీ రాజ్యం మీరేలండి-శూద్ర ఆధ్యాత్మిక వాదం

ఈ నవలను 2006లో ప్రచురించారు. ఈ నవల ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, అప్పాజ్యోషుల విష్ణు బొట్ల పౌండేషన్ (యుఎస్ఎ) సంయుక్తంగా నిర్వహించిన దీపావళి నవలల పోటీలో 25 వేలు గెలుచుకుంది. ఈ నవలలో అనంతపురం ప్యాక్షన్ ఎదుగుదలతో పాటు రాజకీయాలను చర్చించాడు.

### 3.3.1. బండి నారాయణ స్వామి పరిచయం:

**రచయిత పేరు:** బండి నారాయణ స్వామి

**కలం పేరు:** స్వామి

**పుట్టిన తేది:** 03-06-1952

**స్వస్థలం:** అనంతపురం

**చదువు:** ఎం.ఏ (తెలుగు) (1974-76), శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటి. పి.జి. సెంటర్. అనంతపురం.
బి.ఎడ్ (1980), నెల్లూరు.

**ఉద్యోగం:** మొదట మెడిటేషన్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేశారు.
గుడిపల్లి, పులికట్టు గ్రామాలలో అ,ఆ లు నేర్పుతూ పదమూడు సంవత్సరాలు సింగిల్ టీచర్‌గా పనిచేశారు.

అనంత అక్షర విజయానికి డిప్యూటేషన్ మీద ఐదు సంవత్సరాలు పల్లె పల్లెకు తిరిగి ప్రజలను చైతన్యం చేశారు.

ఉన్నత పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలుగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు.

**రచనలు:** కవిత్వంలో సాహిత్య ప్రయాణం మొదలుపెట్టారు. ముప్ఫై ఐదు సంవత్సరాల వరకు కవిత్వమే రాశారు. తర్వాత నుండి వచన రచనలు చేయడం ప్రారంభించారు.

**కథలు:** 'పరుగు' మొదటి కథ. 1987లో ఆంధ్రప్రభలో వార పత్రికలో అచ్చయింది.

ఇప్పటి వరకు ముప్ఫై కథలు రాశారు.

1. వీరగల్లు (తొలి కథా సంచిక)
2. రంకె (పెద్దకథ)

**నవలలు:**

1. గద్దలాడతాండాయి
2. మీరాజ్యం మేరేలండి
3. రెండు కలల దేశమ్
4. నిసర్గమ్ (అముద్రిత నవల)

**పురస్కారాలు - సత్కారాలు:** స్వామి రాసిన రచనలను వివిధ పురస్కారాలు, సత్కారాలు లభించాయి.

1. అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్
2. కథా కోకిల
3. కొలకలూరి
4. ఎన్టీఆర్ పురస్కారాలు అందుకున్నారు.

### 3.3.2 మీరాజ్యం మీరేలండి కథా పరిచయం:

అనంతపురం జిల్లాకు అతిసమీపాన ఉన్న పండమేరు గ్రామం ఈ నవల కథా స్థలం. 30, 40 ఏళ్ల నుండి ఆ గ్రామంలో వచ్చిన సాంఘిక, రాజకీయ పరిణామాలను వివరించిన

నవల ఇది. గ్రామంలో కులవివక్ష, అంటరానితనం, దోపిడి బలహీనులపై పెత్తందారుల దౌర్జన్యం, ఫ్యాక్షనిజం, ఎన్నికలు, నక్సల్స్ దాడులు. అవకాశ వాద రాజకీయాలు ఇంకా ఎన్నో అంశాలు ఈ నవలలో ఉన్నాయి.

పండమేరు గ్రామంలో పండమేటి స్వామి సమాధి ఉంది. ఊర్లో చాలా మందికి (అన్ని కులాలకు) పండయ్య పేరున్నది. పండమేటి స్వామి ఆలయానికి పూజారులు బోయలు. ఆ గుడికి 150 ఎకరాల మాన్యం ఉంది. ఆ మాన్యం ప్రభుత్వం వారి ఆధీనంలో ఉంది. అయితే ఆ మాన్యం పై ఫలసాయాన్ని పూర్తిగా ఆ వూరి మోతుబరి రాజారెడ్డి అనుభవిస్తున్నారు. ప్రభుత్వం జరిపే కౌలు వేలం పాటలో రాజారెడ్డికి ఎదురు నిలిచి వేలం పాడే ధైర్యం ఎవ్వరికీ లేదు. బోయలు తమలో తాము మాట్లాడుకొని, గుడి మాన్యం వేలంపాటకు రాజారెడ్డిని రావద్దని తమకు వదిలిపెట్టమని వేడుకున్నారు. ఆయన ఒప్పుకోలేదు. వాళ్ళు దిగులుగా వెనుదిరిగారు.

పండమేటి స్వామి గుడిపూజారి భూమయ్య చాలా పేదవాడు. అతని తమ్ముడు మల్లయ్య. మాదిగ  పండయ్యతో స్నేహం చెయ్యడం భూమయ్యకు ఇష్టం లేదు. తమది మాదిగల కంటే పెద్దకులమని ఆయన ఉద్దేశం భూమయ్య పినతల్లి, పినతండ్రి ఆకలి బాధతో, దారిద్ర్య బాధతో మరణించారు. తిండికి జరుగుబాటు లేకపోయిన తమకులమే గొప్పదనేది భూమయ్య అతని భావన.మల్లయ్య స్కూల్‌లో చదువుకునేటప్పుడు కులవివక్ష వల్ల చాలా అవమానాలు పొందాడు. మల్లయ్య మాదిగ పండయ్యతో కులం, వర్గం గురించి చాల విషయాలు చర్చించాడు. వడ్డెర లో కప్పతో ఆ వూరి మోతుబరి (రెడ్డి) భార్య లేచిపోయింది. లోకప్ప భార్య పాలమ్మ నిస్సహాయురాలంది. ఒకరి తరువాత మరొకరికి ఆమె ఉంపుడు గత్తె అయ్యింది. ఆమె కొడుకు (విరుపాక్షి) మొదట దొంగగా ఆ తరువాత కిరాయిహంతకుడిగా మారాడు.

చాకలి గోవిందు కుల అవమానాలు భరించలేక మొదట స్టూడెంట్ ఫెడరేషన్‌కు తరువాత కమ్యూనిష్టు పార్టీకి దగ్గరయ్యాడు. కమ్యునిష్టు గోవిందు క్రమంగా స్వార్థపరుడై, మోసగాడయి చాలా డబ్బు సంపాదించాడు. ఆ తరువాత అధికార పార్టీలో చేరాడు. కానీ ఫ్యాక్షన్ రాజకీయాల మూలంగా వేటకొడవళ్లతో నరికి చంపివేయబడ్డాడు. రాజారెడ్డి కురుమ తిరుపాలు లాంటి వాళ్ళని చేరదీసి కింది కులాల వారి మధ్య చీలిక తేగలిగాడు పండమేటిలో లింకుల చౌదరి బీదవాడే అయితే అతడు స్వార్థపరుడు తన బాగుకోసం ఎవ్వరినైన ఆశ్రయిస్తాడు. ఎంత నీచానికైన దిగజారుతాడు.

రాయలసీమకు వ్యాపించిన కమ్యూనిష్టు పార్టీ పీపుల్స్‌వార్ గ్రూఫ్ వారు దున్నేవాడిదే భూమి అని నినాదంతో దూదేకుల కబీర్ అనే పేదవాడి భూమిని ఆక్రమించారు. థామస్ రెడ్డి కళాశాలలు పెట్టి విదేశ మిషనరీల సహాయంతో చాలా డబ్బు సంపాదించాడు. అతని కొడుకు కొండారెడ్డి రాజకీయాల్లో రాటుతేలాడు. ఫ్యాక్షన్ నాయకుడు అయ్యాడు. అతని ప్రత్యర్థి వీరప్పనాయుడు వీళ్లిద్దరు బోయ, కురమ, వడ్డెర లాంటి బడుగుకులాల వారికి డబ్బు సహాయం చేసి, వాళ్లను తమ అనుయాళ్ళులుగా హంతకులుగా తయారు చేశారు. వాళ్ళ దుర్మార్గం వాళ్లనే బలితీసుకుంది. ఇద్దరు ముఠాకక్ష్యలకే బలయ్యారు.

మల్లయ్య, పండయ్యలకు గురువైన మనోహర్‌నాయుడు లెక్చరర్. మార్క్సిజాన్ని అధ్యయనం చేసి కమ్యూనిష్టుగా మారాడు. పీపుల్స్‌వార్ గ్రూప్‌కి సన్నిహితుడయ్యాడు. కాని కొద్దికాలంలోనే ప్రాణభీతితో పార్టీకి దూరమయి వడ్డీవ్యాపారిగా, ఆస్తులు పెంచుకునేవాడిగా తయారయ్యాడు.

కొండారెడ్డి కొడుకు గంగుల రెడ్డి. వీరప్పనాయుడి కొడుకు గరుడశేఖరనాయుడు. తమ తల్లిదండ్రుల ఆస్తులకే కాక రాజకీయాలకు, దుర్మార్గాలకు వారసులయ్యారు. కొండారెడ్డి

భార్య, వీరప్ప నాయుడి భార్య కూడా భర్త ఆశయాలను కొనసాగిస్తున్నామని ఆ దుర్మార్గాలను కొనసాగిస్తున్నారు.

రాజారెడ్డిని ప్రత్యర్థులు నరికి చంపేటప్పుడు పండమేరులో బదుగుకులాల వారు పండగ చేసుకున్నారు. పండమేటి స్వామి మాదిగని తెలిసి మాదిగలు సామూహికంగా గుడిలో ప్రవేశించారు. ప్రతీకారంగా రెడ్లు బదుగు కులాల ఇండ్లను తగులబెట్టారు. పూజారి భూమయ్యను చంపివేశారు. పూజారి మల్లయ్య అండర్ గ్రౌండ్‌కు వెళ్ళిపోయాడు. బదుగు కులాలవారు ఏకమై గుడి మాన్యం వేలంపాటను వాయిదా వేయించగలిగారు. మాదిగ పండయ్య, లింకుల చౌదరి మీద ఎన్నికల్లో పోటీకి దిగారు. ఎన్నికల్లో పండయ్య గెలుస్తాడని, గెలవాలనికోరుతూ మీరాజ్యం మీరేలండి అని రచయిత ఈ నవలకు ముగింపు ఇచ్చారు.

### <u>3. 3. 3. పాత్రల విశ్లేషణ:</u>

ఈ నవలలో గ్రామీణ కుల జీవితం అవి ఎదురుకొనే రోజు వారి ఇబ్బందులు విపులంగా చర్చించారు. అగ్రకులాలు కింది కులాలను ఎలా తమ చెప్పు చేతల్లో ఉంచుకుంటాయో వివరించారు. ఇది గుడి మాన్యం కేంద్రంగా ఈ నవలలో చర్చించబడింది. కమ్మ, రెడ్డి ఫ్యాక్షన్ రాజకీయాలు, ఆ రాజకీయ వలలో చిక్కుకున్న కొన్ని పాత్రలు మనకు దర్శనమిస్తాయి. 1975 నుండి తెలుగు ప్రాంతంలో రాజకీయాలల్లో వచ్చిన మార్పులు గురించి స్పష్టంగా తెలియజేశారు.

### <u>3. 3. 3. 1. పండమేటి –ఆద్యాత్మికవాదం:</u>

ఆధ్యాత్మిక భావనలేకుండా నారాయణ స్వామి రచన ఉండదు. పండమేటి స్వామి కేంద్రంగా నవల కథ సాగుతుంది. పండమేటి స్వామి పూజారి ఒక బోయ కులస్తుడు. పండమేటి స్వామి దేవుడిగా మారిన తీరుగురించి చెప్తాడు. పండమేటి గ్రామంలో స్వామి పండమేరు ప్రక్కనే ఆయన సమాధి ఉంది. మూడు వందల సంవత్సరాల క్రితం జీవించి ఉండేవాడు. ఆ ఊరిలో సగం మందికి పండయ్య అనే పేరు ఉంటుంది. అంతగా ఆ ఊరి ప్రజలు ఆయన్ని నమ్మారు. “పండమేటి స్వామి ఒకప్పుడు పండమేటి గ్రామపు తిక్కోడు మాత్రమే! ఎక్కడ నుంచో వచ్చి ఆ గ్రామంలో ఉండి పోయి తిక్కోని మాదిరి తిరిగేవాడు. నోరు విప్పి మాట్లాడే వాడు కాడు. ఏదీ కావాలని చెయ్యి చాచేవాడు కాదు. గడ్డమూ, మీసాలు పెరిగుండేటివి, తల వెంట్రుకలు జడలు కట్టి ఉండేటివి. అన్నమూ నీళ్ళు లేవు, స్నానం లేదు తైల సంస్కారం లేదు. గ్రామ వీధుల్లో ఊరికే తిరిగేవాడు. అప్పుడప్పుడు కొండపైన కనిపించేవాడు. ఏటి పక్కన చిట్టడవిలో కనిపించేవాడు. ఎవరైనా పలకరిస్తే వాళ్ళముఖంలోకి కన్నార్పకుండా చూసేవాడు” (పు. 12). అలాంటి వాడు ఒక్కసారి పండమేరు వరదలో కొట్టుకుపోయాడు. వరదలో కొట్టుకుపోతుంటే ప్రాణంలేని కట్టె మాదిరి కొట్టుకుపోతున్నాడు. ఒడ్డున ఉన్న వాళ్ళు అతడ్ని బయటకు తీసుకువచ్చారు. “ఇంతసేపు పట్టింది, ఇంకేం బతికి ఉంటాడులే ఈ తిక్కోడు ! నీళ్ళు తాగి తాగి ఎప్పుడో గుటుక్కుమని ఉంటాడు! అనుకున్నారంతా!” (పు. 12) కానీ ఒక్క చుక్క నీరు కూడా తాగలేదు. తడిచిన శరీరంతో మామూలుగా చూస్తూ కుర్చున్నాడంటా. ఒక్క చోట కాలు నిలువని తిక్కోడు వరద నుండి బయటపడిన తరువాత ఆ జాగవిడిచి కాలు బైటకి పెట్టలేదు. అక్కడే ఆ జాగాలోనే కూర్చునీ, నిలబడి, పడుకునీ పదహారు ఏండ్లు జీవించి, చివరకు ఆ జాగాలోనే సమాధి అయిపోయాడు.

అయితే ఇరవై సంవత్సరాలుగా ఉంటున్న మాట్లాడని వాడు వరదలో నుండి బయట పడిన మూడో రోజు నుండే చక్కగా మాట్లాడటం మొదలు పెట్టాడు. ఆయన పై విశ్వాసంతో మొక్కుకుంటే వాళ్ళ కోరికలు తీరేవి. అప్పటి నుండి జనాలు ‘సామీ సామీ’ అని భక్తితో పిలిచేవారు. ఆ విషయం విని గొప్ప జిజ్ఞాసువా అని పండితులు వచ్చి చూసి ఆయన్ని

జ్ఞానిగా ప్రకటించారు. అవధూత కాకపోతే వరద నీటిలో కొట్టుకుపోయి ప్రాణాలతో బయట పడటం సాధ్యం కాదని, ఒక చోటే ఏండ్లకు ఏండ్లు ఎలా కూర్చోగలడని స్వామి సత్తాని తమ శరీర జ్ఞానపు స్కేలు ఉపయోగించి, కనుక్కున్న వాళ్ళే ఎక్కువ. ఆయన బోధనల కంటే ఇదే జనాన్ని ఎక్కువ ఆకర్షించింది.

కానీ ఏ మహిమల్ని పండమేటి స్వామి ఒప్పుకోడు. మహిమలు అనేటివి లేనే లేవు అనేవాడు. “వాటిని నువ్వు నీ బుద్ధితో కొలుస్తావు. నీ బుద్ధికి అవి అందకపోయేసరికి వాటికి మహిమలు అని పేరు పెడ్తావు. ఆ మహిమలు ప్రకృతికి అతీతమైనవి అనుకుంటావు. నిజానికి అవి ప్రకృతిలో భాగమే అని తెలుసుకుంటే వాటిని మీరు మహిమలు అనరు” (పు. 11) అని చెప్పేవాడు. సామీ మీరు నన్ను చేతితో తాకగానే నా నొప్పి తగ్గిపోయిందంటే ‘నాకొక శరీరమా దానికొక చెయ్యి!’ అని నవ్వేవాడు.

పండమేటి గ్రామానికి “ఒక బైరాగి మాదిరి తిరుగుతూ, ఆ ఊరికి వచ్చినాడే కానీ అక్కడికి వచ్చేటప్పుడు తన వెంట తన పేరు తెచ్చుకోలేదు. తన ఊరు తెచ్చుకోలేదు. తన కులాన్ని కానీ, వంశాన్ని కానీ వెంట తెచ్చుకోలేదు” (పు. 8). పండమేటి స్వామి తిక్కోని మాదిరిగా తిరుగుతుంటే బోయ కుటుంబంలో ఒక తల్లికి ప్రేమ పొంగి బిడ్డగా ఆయన్ని తలచి తలంటి స్నానం చేయించి, అన్నం బలవంతంగా తినిపించింది. ఆమె రోజూ ఆయనకు అన్నం తీసుకు వచ్చేది. పంచభక్ష్య పరమాన్నాలు ఎవరైనా తెచ్చినా తినేవాడు కాదు.

ఒక రోజు ఆమె బిచ్చగాడు ఇంటికి వస్తే బిక్ష వేయకుండా స్వామికి నైవేద్యం పెట్టిన తరువాత రాపో ! అని స్వామికి అన్నం తీసుకు వచ్చింది. ఆరోజు ఆయన దాన్ని ముట్టలేదు. “ఏమి మా? ఈ ఒక్క శరీరంలో ఉండేవాడు మాత్రమే అయితే వీడు పండమేటి స్వామి ఎందుకయితాడు? నీ ఇంటి ముందుకొచ్చిన అడుక్కుతినే వానిలో మాత్రం ఉండేది ఎవరనుకున్నావు? ఈ పండమేటి స్వామి కాడా” (పు. 14) అని ఆమెకు జ్ఞానోదయం చేశాడు. దానితో ఆమె పశు పక్ష్యాదులను కూడా మనుష్యులతో సమానంగా చూసేది. అందర్ని నా పిల్లలే అని చెప్పేదంట. అంతగా ఆయన బోధనలు ఆమెను ప్రభావితంచేశాయి. ఇలాగే ఆయన బోధనలు అనేక మందిని ప్రభావితం చేశాయి.

పండమేటి స్వామి చనిపోయిన తర్వాత ఆయన సమాధి దగ్గర ఆ అమ్మ పిల్లలే దీపం పెట్టేవాళ్ళు. ఆ విధంగా బోయల కుటుంబం వాళ్ళకి అక్కడే పూజారితనం మొదలైంది. పండమేటి స్వామి మహిమలతో సమాధే గుడిగా రూపాంతరం చెందింది. “అది పండమేటి స్వామి సమాధి! సమాధి మీద ఎప్పటికాలంలో ప్రతిష్ఠించిన పండమేటి స్వామి విగ్రహముంది.... విగ్రహం నుదిటి మీద విభూది రేఖలు దిద్దినారు. పూజ చేస్తుండగా చప్పున కళ్ళు విప్పి చూస్తాడేమో అనిపించే అరమోడ్పు కన్నులు పండమేటి స్వామివి! అతని దక్షిణ హస్తం ఆశీర్వచనముద్ర తొడిగింది.... పాదాలకు కుంకుమ బొట్లు పెట్టినారు... అతని సమాధికి కూడా పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టినారు” (పు. 7).

భక్తుల ముడుపులు, చందాలతో పండమేటి స్వామికి భూములు ఏర్పడ్డాయి. ఈ మహిమల మీద విశ్వాసం వల్ల భక్తులు సమర్పించిన ముడుపులోనే విగ్రహం దాని చుట్టు గుడి, గుడికట్ట ఏర్పడినాయి. ఆగుడి కింద దేవుని మాన్యం నూటా ఇరవై ఎకరాలకు పెరిగిపోయింది. అప్పటినుండి బోయకులం వాళ్ళే దాన్ని సాగుచేసుకోని బతుకుతున్నారు. ఇందిరాగాంధీ ఆ భూముల్ని స్వాధీనం చేసుకుంది. అప్పటినుండి బోయ కుటుంబాలు, కూలోల్ల స్థాయికి దిగజారాయి. అయినా పూజారి భూమయ్య నాయకత్వంలో ఆ భూమి కౌలుకి అనుభవిస్తున్న రాజిరెడ్డిని వేలం పాటలో ఈ సారికి పాల్గొనవద్దని కోరారు. కానీ రాజిరెడ్డి వాళ్ళను తిట్టి పంపించాడు. భూమయ్య ఆ భూమికోసం పోరాటం చేస్తూ చివరకు అదే భూమిలో హత్యకు

గురవుతాడు. ఒక రకంగా ఈ నవలలోని అన్ని పాత్రలను పండమయ్యస్వామి గుడి, గుడి మాన్యం కలుపుతుంది. గుడి ప్రవేశం కోసం బోయలు, మాదిగల మధ్య ఘర్షణ జరుగుతుంది. అయితే ఇవి కుల ఘర్షణలుగా రూపు దిద్దుకోలేదు. కేవలం వ్యక్తి గత స్థాయిలోనే ఆగిపోయాయి. తర్వాత కిందికులాలు ముఖ్యంగా బోయ, మాదిగ కులాలు ఐక్యంగా రెడ్లను ఎదుర్కొన్న తీరు చిత్రించబడింది. మల్లయ్య పండమేటి స్వామిని నమ్మేవాడు. పండయ్య ఆ స్వామి పేరు పెట్టుకున్న దేవుడి మీద నమ్మకం లేనివాడిగా నాస్తికవాదిగా చెప్పబడ్డాడు.

అయితే పండమేటి స్వామి గుడిలో ఉత్తపయ్యి తిప్పయ్యకు ప్రదక్షణ సమయంలో శక్తి ప్రసారణ జరుగుతుంది. తిప్పయ్యని అందరూ తిక్కోడు అని పిలుస్తుంటారు. కానీ పశు పక్ష్యాది, మనుషులు మరియు సమస్త జీవరాశుల పట్ల తిప్పయ్య ఆదరణ భావంతో ఉంటాడు. పండమేటి స్వామి కూడా అలాగే ఉండేవాడు. ఆ స్వామికి ఊరు, పేరు లేదనే అందరు అనుకున్నారు. పండమేటి గ్రామానికి తూర్పున వంద మైళ్ళ దూరంలో ఒక కుగ్రామంలో తాళపత్రాలు దొరికాయి. వాటిలో స్వామి గురించిన శతకపద్యాలున్నాయి. ఆ కుగ్రామానికి చెందిన బ్రాహ్మణ పండితుడి ఇంటిలో బయటపడ్డాయి. ఆ పండితుడు తన ఊరులో తిక్కోడుగా పండమేటిలో 'స్వామి'గా చూసి అబ్బురపడ్డాడు. తర్వాత పండమేటిస్వామి వృత్తాంతాన్ని శతకంగా రాసాడు. ఆ శతకంలో "పండమేటి స్వామి పుట్టిన ఊరు చిత్రబేడు, అతని పూర్వనామం కేశన్న" (పు. 165) అయితే పండమేటి గ్రామ ప్రజలు స్వామి, ఊరూ పేరూ చూసి ఆశ్చర్యపోలేదు. కులం వారిని ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే "అతడు మాదిగ! అతని గోత్రం మందల!" (పు. 165) అది విని మాదిగోళ్ళు కిర్రెక్కి అరిచారు. మేం స్వామి గుళ్లోకి వస్తాం. ఎవడు అడ్డుకుంటాడో చూస్తామని ఘీంకరించారు. మాదిగలు గుడి ప్రవేశం చేశారు. బోయలు, మాదిగలు కలిసి గుడిమాన్యం కోసం పోరాటం చేశారు. ఆ క్రమంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయడానికి సమాయత్తమయ్యారు.

### 3.3.3.2. ఉత్తపయి తిప్పన్న- నిర్వికల్ప ఆస్తిక వాదం:

ఆస్తిక, నాస్తికవాదాల మధ్య సంఘర్షణ ఉంది. ఆస్తికవాదం అంటే బ్రాహ్మణ్యాన్ని అంగీకరించటమని అనుకోరాదు. బ్రాహ్మణీయ సామాజిక నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూనే దేవుడున్నాడని నమ్ముతూ, మనుషుల ఈర్ష్యానురాగాల పట్ల నిర్మమకారం పొందే ఒక ఉన్నత స్థాయికి చేరుకొనే ఒక క్రమం ఉంటుంది. ఒట్టి అమాయకుడిగా కనిపించే ఉత్తపయి తిప్పన్న నిర్వికల్ప ఆస్తికవాదిగా, ఎలాంటి వ్యక్తిగత అనుబంధాలు, ఉద్వేగాలు లొంగదీయని మానసిక స్థితికి చేరుకుంటాడు. ఈ నవలలో తిప్పన్నది ప్రధానమైన పాత్ర. అందరు ఇతడిని తిక్కోడని వేళాకోళం చేస్తూ ఉంటారు. చివరకు పసిపిల్లలుకూడ అతడ్ని ఆట పట్టిస్తుంటారు. కథాగమనంలో ప్రత్యక్షంగా మిగతా పాత్రలకి పెద్దగా సంబంధంలేని పాత్ర ఇది. తిప్పన్నకు పండమేటి స్వామికి గల సంబంధ, బాంధవ్యం ఆధారంగా కథ వెనుక కథ ఆధారంగా నవల మొత్తంగా సాగుతూ ఉంటుంది. నవల తిప్పన్న కథలో మొదలవుతుంది. చివరిలో మల్లయ్య రాడికల్స్‌లో కలిసిపోయి అన్యాయంగా ప్రవర్తించే వాళ్ళను చంపడానికి తిప్పన్న అభిప్రాయం అడగడంతో పతాకస్థాయికి చేరుకుంటుంది. నవల ప్రారంభంలో తిప్పన్న అమాయకంగా కనిపించిన చివరి అంకంలో తిప్పన్న ఒక పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో మనకు దర్శనమిస్తాడు.

తిప్పన్నకు ఉత్తపయ్య తిప్పన్న అని పేరు ఎందుకు వచ్చిందంటే "బుద్ధి తెలిసనప్పటి నుండీ సల్లాడం తప్ప పై మీద బట్టలు వేసుకునేది ఎరగడు" (పు. 2). పెళ్ళాం 'పెద్దక్క' నెత్తి నోరు కొట్టుకొని చెప్పిన వినలేదు. ఇప్పుడతనికి అరవై సంవత్సరాల వయస్సు. అడవికి గొడ్లను తోలుకపోతాడు. అక్కడ పిల్లలకు పిల్లనగోవి ఊదడం, పండమేటి స్వామి పదాలు నేర్పుతాడు. ఈత కూడా నేర్పుతాడు. పిల్లలు తమకు ఉన్నంత రాగిగింజంత జ్ఞానంతోనే

తిప్పన్నను 'నీకిప్పుడు ఎన్నేండ్లు ఉంటాయి?' అంటే 'ఇరవై ఉండవేంరా?' అని ఎదురు ప్రశ్నించేవాడు. వాళ్ళు ఆశ్చర్యకరంగా అన్ని ఉండవులే పద్దెనిమిదో, పంతొమ్మిదో ఉంటాయంటే " ఏమో ఉంటాయేమో? తెలీదు అంటాడు అమాయకంగా" (పు. 3) అంతే కాదు తిప్పన్నకు లెక్కలు రావు, డబ్బులు లెక్కపెట్టడం, దానితో వ్యవహారమే తెలీదు. ఎక్కువ మాట్లాడడు. భార్య పెద్దక్క కూడా భర్తను తిక్కోడుగానే చూస్తుంది. అల్లుళ్ళు, కోడళ్లు వచ్చారు. కష్టనష్టాలలో మొగుడ్ని సలహా కూడ అడగాలని అనుకోదు. తిప్పన్న కూడా అంతే గాడిద కష్టం చేస్తాడు. బీడీలు భార్య తీసుకు వస్తేనే లేకపోతే డబ్బులు తీసుకోని బీడీలు కొనడు. జంతువులు వాటి ప్రవర్తనలు క్షుణ్ణంగా తిప్పన్నకి తెలుసు. తనను వాళ్ళు తిక్కోడు అంటే అదంతా తనకేం తెలుసు మల్ల ? అనుకుంటాడు. అంతే కానీ, వాళ్ళ జ్ఞానం నాకు లేదు, నా జ్ఞానం వాళ్ళకు లేదని వాళ్ళతో వాదించడు. వాళ్ళతో ఏకీభవిస్తాడు. భార్య తీర్థయాత్రకు వెళ్తే "ఆ మూడు రోజులు తిప్పన్న నాభార్య తీర్థయాత్రలకు పోయింది... ఊర్లో అందరితో చెప్పి సంతోషపడినాడు.... పెద్దక్క మహానంది నుంచి తెచ్చిన విభూది పండునీ, శ్రీశైలం నుంచి తెచ్చిన ప్రసాదాన్ని, అహోబిలం నుంచి తెచ్చిన నరసింహస్వామి పటాన్ని పిల్లోడు చూసినట్లు అబ్బురంగా చూసినాడు" (పు. 5). తన భర్త తీర్థయాత్రల గురించి ఊర్లో అందరికి చెప్పి సంతోషపడిన విషయం తెలిసి భార్య పెద్దక్క ఏడిచింది. అందుకే పండమేటి స్వామి కూడా "మనుషుల్లోని మంచితనమే ఏడ్పిస్తుందని" (పు. 5) చెప్పేవాడు. అలాంటి అమాయకమైన ఉత్తపయి తిప్పన్నకు పండమేటి స్వామి గుడి వద్ద ఒక విచిత్రమైన అనుభవం కలిగింది. దసరా పండుగ నాడు శుభ్రంగా తలంటు స్నానం చేసి, భోజనం తరువాత ఒక నిద్దుర తీసి భార్య పెద్దక్క బలవంతం మీద గుడికి వెళ్లాడు.

గుడిలో పూజారి భూమయ్యతో పూజ చేయించుకుని తీర్థం, ప్రసాదం తీసుకొన్నాడు. "పండమేటి స్వామి చుట్టు ప్రదక్షిణ చేస్తున్నాడు. చేస్తూ చేస్తూ ఒక్క గంతులో గుడిబైటకొచ్చి పడినాడు....భూమయ్య....అడిగాడు. ఏంది ? తిప్పన్నా ! ఏంది అట్ల ఎగిరొచ్చినావు? కరెంటు శాకురా! కరెంటు షాకు కొడుతుంది?" (పు. 6) అని బదులు చెప్పాడు. అక్కడే కూర్చొన్న వారు. మేం ఇప్పుడే తిరిగొచ్చినాం అదేం లేదే! మరొక్కసారి తిరిగి చూడమన్నారు. "సామీసామీ .... అని చేతులు జోడించి ఒక చుట్టు తిరిగి తిరగకుండానే మళ్ళీ గుడి బైటికి దూకినాడు" (పు. 7). "నిజంరా ఇక్కడ చుట్టూ షాక్ కొడుతుంది. మీరు కూడా చూడండి. నేను చెప్పేది అబద్ధమేమో!" (పు. 7) వాళ్లను గుడి చుట్టూ తిరగమన్నాడు. వాళ్ళు భయపడుతూ మూడు చుట్లూ తిరిగి అలాంటిదేమి లేదన్నారు. ఆ విషయం కొన్నాళ్లు మాట్లాడుకొని మరిచి పోయారు. తిక్కన్న కూడ తర్కించలేదు. ఏమోలె! స్వామి మహిమలు మనకేం తెలుస్తాయని ఊరికే ఉండి పోయాడు. పూజారి మల్లయ్య తిప్పన్నను "నిజంగా చెప్పు చిన్నాయనా! సమాధి దగ్గర నీకు కరెంటు షాక్ కొట్టిందా గుర్తుకు తెచ్చుకో! లేకపోతే ఇంకొక సారి సమాధి చుట్టు తిరిగి చూడు. అప్పుడు నీకాళ్ళు తిమ్మిరెక్కి ఉన్నాయేమో! ఏదైనా చిత్తభ్రమ కమ్మి నెట్టు తప్పి పోయినావేమో?" (పు. ) అని గుచ్చి గుచ్చి అడిగినప్పుడు "నిజ్జెంరా మల్లీ! నీకు అబద్ధం చెప్తే నాకేమొస్తుంది" అని మల్లయ్యను ఒప్పించే ప్రయత్నం చేశాడు.

పండమేటి స్వామి మాదిగని తెలిసి మాదిగలు గుడిలోకి ప్రశేశించారు. అక్కడ మాదిగలు టెంకాయలు, తీర్థం, ప్రసాదం తీసుకున్నారు. ఆ సమయంలో తిప్పన్న పిల్లోడి మాదిరి ఎగురుకుంటూ "లావెమ్మా! నాకు ప్రసాదం పెట్టవా? కొల్లమ్మా నాకు ప్రసాదం పెట్టవా! అని అందరిని అడిగి ప్రసాదం పెట్టించుకుని తిన్నాడు" (పు. 170). కుల, జాతి, బేధాలు లేకుండా తిప్పన్న అందరితో కలిసి ఉండేవాడు. ఊరంతా రాజకీయ హత్యలతో ఏం జరుగుతుందో తెలియక బిర్రుగా బిగుసుకుపోయి ఉంటే తిప్పన్న మొగం మాత్రమే నవ్వుతూ ఉంది.

రాజారెడ్డి సారాయి జీపుకింద పడి తల్లి కుక్క చనిపోగా మిగిలిన రెండు కుక్క పిల్లలకు పాలు తాపి, ఎవరైనా పెంచుకుంటారేమోనని ఊరంతా తిరిగి అడిగాడు. అందరూ మాకొద్దు మాకొద్దు అని తప్పుకొన్నారు. పెద్దక్క కుక్క పిల్లలను చూసి మొకం చిట్లించుకుంది. తిప్పన్న పొద్దున్నే కుక్క పిల్లలకు పాలు తాపి, "ఆ కుక్క పిల్లలకు మధ్యాహ్నం ఒకసారి, సాయంత్రం ఇంకొకసారి పాలు తాపు" (పు. 184) అని భార్యను హెచ్చరించి అడవికి వెళ్ళాడు. అన్నల్లో చేరిన మల్లయ్య తిప్పన్నను కలుసుకొన్నాడు. ఊరిలో సంగతులు అడిగి తెలుసపుకున్నాడు. తిప్పన్న మల్లయ్యతో అడవికి వచ్చిన మిగిలిన బోయోల్లను అడిగాడు. తెచ్చిన ముద్దను ఇద్దరు తిన్నారు. మజ్జిగ త్రాగారు. నాకు కొంత మందిని చంపాలని ఉందని మల్లయ్య అంటే అదంతా ఎందుకురా మల్లి, ఊరు బాగుపడుతుందనా లేక నీ మనస్సు నిదానం అవుతుందనా? అని అడిగాడు. రెండూ అంటే సరే అలాగే చంపన్న "ఉత్తపయి తిప్పన్న ముఖంలో అదే నిర్లిప్తత. అదే ప్రశాంతత" (పు. 186) తప్పురా, వద్దు అంటావేమో అనుకున్నా చిన్నాయన ! అంటే "మన పండమేటి స్వామి ఏమన్నాడు. తప్పొప్పులు మనం చేసే పనుల్లో ఉండవు ఆ పనులు చేసే చిత్త శుద్ధిలో ఉంటాయి" (పు. 187) అన్నాడు. వాళ్ళను చంపడం తప్పుకాదంటావా? అంటే "పాపము లేదు, పుణ్యమూ లేదు . వాళ్ళ చావులు నీచేతిలో రాసి పెట్టి ఉంటే దానికి నువ్వేం చేస్తావు పాపం?" అని మల్లయ్య చర్యలను సమర్థించాడు. ఇంకా ఏమైన చెప్పు చిన్నాయనా అని మల్లయ్య అడిగితే " నువ్వేం చేస్తున్నా నీలోకి తొంగి చూసుకో? సాలు!!" (పు. 187) అని పండమేటి స్వామి తత్వాన్ని చెప్పాడు. అంతలో కోతుల దండు అక్కడకి వచ్చింది. ఆ దండు నాయకుడ్నే తిప్పన్న పెంచి పెద్ద చేసి వదిలివేశాడు. అది తన వైభవమంతా తిప్పన్నకు చూపించుకోవాలని తాపత్రయ పడడాన్ని తిప్పన్న మల్లయ్యకు వివరించాడు.

తిప్పన్న 'మీరాజ్యం మీరేలండి' లో ముఖ్యమైన పాత్ర. తిప్పన్న కథను ఆశ్రయించుకుని మిగిలిన కథలు అంతాసూత్రంగా నడుస్తాయి. తిప్పన్న ఈ నవలలో ఆది అంత్యాలలో ఉండి కథకు బిగువును తీసుకువచ్చాడు. మొదట్లో తిక్కోడిగా పరిచయమై, చివరి అంకానికి ఒక పరిపూర్ణ వ్యక్తిత్వంతో కనబడతాడు. అన్న భూమయ్యను చంపినవాళ్ళను చంపేందుకు మల్లయ్య కొండకు వెళ్లి రాడికల్స్‌లో కలిసిపోతాడు. రాడికల్స్‌లో కలిసిన మల్లయ్య కొంత మందిని చంపాలని ఉందని తిప్పన్న అభిప్రాయం కోరతాడు. ఎందుకురా చంపడం అని అడిగి, ఊరుబాగు కోసం, నీ మనస్సు నిదానమవుతుందంటే అలాగే చంపమని చెబుతాడు. అందరూ తిక్కోడు అనుకుంటున్నా తిప్పన్న నుండి పాఠకుడు అలాంటి సమాధానం వస్తుందని ఊహించడం కష్టం. కానీ తిప్పన్నకు ఊరు,ఊరులో మనుష్యులు, వారు చేసే పనుల మీద పూర్తి అవగాహన ఉందని మనం అర్థం చేసుకోవాలి. అలా అర్థం చేసుకున్నప్పుడే తిప్పన్న తిక్కోడు కాదని పరిపూర్ణ మానవతా వాదిగా గుర్తిస్తాం.

### 3. 3. 3. 3. భూమయ్య-బోయల భూ పోరాటం:

పండమేటి స్వామి గుడిలో పూజారి. ఇది అతనికి వంశ పారపర్యంగా సంక్రమించింది. బోయకులానికి నాయకత్వం వహించాడు.భార్య తిలకమ్మ. భర్త చాటు ఇల్లాలు. భర్తకు చేదోడు వాదోడుగా ఉంటుంది. భూమయ్యకు తమ్ముడు మల్లయ్య అంటే ప్రేమ. అతడ్ని పేట కళాశాలలో బి.ఏ సాహిత్యం చదివిస్తాడు. భూమయ్య మొదట సంప్రదాయ వాదిగా ఉండి, నవల కొనసాగింపులో అభ్యుదయ భావాలుగల పాత్రగా రూపాంతరం చెందుతాడు.

భూమయ్య భార్య పేరు తిలకమ్మ "ఆ యప్పకు నలభై ఏండ్లూ, ఈయమ్మకు ముప్పై మూడేండ్లు!...బడికి పోయే కూతురుంది.... గుడిమాన్యం పోయినా గుడిని మాత్రం వదిలి పెట్టలేదు" (పు. 15). గుడికి సేవ చేస్తే తనకేం లాభమని ఎప్పూడు అనుకోలేదు. "గుడి

మాన్యం ఉన్నా పోయినా గుడిని కాపెట్టుకుని ఉండేది. తన వంశాచారం అనుకున్నాడు. అది తన కుటుంబానికి గౌరవమనుకున్నాడు... పొద్దున లేస్తూనే తన ఇంటి దేవుడు పండమేటి స్వామి గుడివైపు తిరిగి చేతులెత్తి మొక్కుతుంటాడు....సంగటి తినేది, గుళ్ళోకి పోయి కూర్చుండేది... గుడి గుడి గుడి... పూలహారంలో దారం మాదిరి భూమయ్య దిన చర్యల్లో గుడి తొంగిచూస్తుంటుంది. గుడి మాన్యం కూడా అంతే! ఆ భూమిని తలచుకున్నప్పుడల్లా భూమయ్యకు మరిచి పోలేని విచారం కలుగుతుంది. ... గుడి చుట్టూ అల్లుకున్న తన తండ్రి, తాతల బతుకుల గురించి కథలు కథలుగా చెప్పి మురిసిపోయే భూమయ్యే వయసు ఎక్కివచ్చినంక గుడి మాన్యంలో తాను మడక కట్టి దున్నినప్పుడు పైకి లేచి ముంచేసిన మట్టి వాసనలు గుర్తొచ్చి మనసు మనసులో లేకుండా అయిపోతాడు" (పు. 16). అప్పుడాతనికి గుడి మాన్యాన్ని స్వాధీనం చేసుకొన్న ప్రభుత్వం గుర్తుకు వస్తుంది. ప్రభుత్వం అంటే ఎవరో కాదు. ఊరు సర్పంచ్ రాజారెడ్డి అతను ప్రభుత్వ వేలంలో గుడి మాన్యాన్ని తక్కువ రేటుకు కౌలుకు పాడుకొని ఎక్కువ కౌలుకు మరొకరికిస్తాడు.

బోయకులం వాళ్లు గుడి మాన్యం వేలం పాట గురించి గుడి కట్ట దగ్గర సమావేశం అయ్యారు. ఎవరు మాట్లాడక పోయేసరికి సన్న ముసలివాడు లేచి రాజిరెడ్డితో మాట్లాడమని చెప్పాడు. కానీ ప్రతి సంవత్సరం రాజారెడ్డిని అడగడం వాడు ఉత్త చెయ్యి చూపించడం మామూలే. కాని తన కులం వాళ్ళతో రాజారెడ్డి దగ్గరకు వెళ్ళి ఈ సంవత్సరం పాటలో పాల్గొనకుండా వేలం పాట మాకు వదిలిపెట్టమని అడిగారు. కష్టపడి సంపాదించుకున్న భూమిని వదిలేది లేదని రాజారెడ్డి వెళ్ళిపోయాడు. రాజారెడ్డి ఏవిధంగా పొలాలు కష్టపడి సంపాదించుకున్నాడో బోయకులం వాళ్ళకు తెలుసు. తమ తాత ముత్తాతల చాకిరితో అభివృద్ధి చెంది, సంపాదించుకొని ఇప్పుడు తమనే నీచంగా చూస్తున్నాడని "మన రక్త మాంసాల్ని పీల్చి పిప్పి చేసి ఇంతవాడై ఈ పొద్దు తనేదో మహా కష్టపడి భూములు సంపాదించుకున్నట్లు మాట్లాడతాడు. దేవుని సత్యం పూజారికి తెలీదా?" (పు. 46) అన్నాడు భూమయ్య ఈ కాపోల్లకు భూములు ఎలా వచ్చాయంటే రాజుల కాలంలో పొలాల మీద బాపనోళ్లకు పెత్తనం ఉండేదట. ఇంగ్లీష్ వాళ్ళు రాజ్యానికి వచ్చినాక బాపనోళ్ళు వాళ్ళ ఆఫీసుల్లో చేరిపోయారు. అప్పుడు భూముల మీద అధికారం కాపువాళ్ళకు వచ్చేనంట "కరణాలు చెరువులు రాసుకుంటే, రెడ్లు తమ అధికారంతో ఊర్లకు ఊర్లు మింగేసినారన్న సంగతి ఎవరికి తెలీదు?" అన్నాడు ఒక ముసలాయన "ఓ చిన్నాయనా! నూ నూర్లు ఎకరాలు కట్టుకోని ఇదంతా మా తాత ముత్తాతలు చెమటోడ్చి సంపాదించిన ఆస్తి అని వినే కాలం పోయింది. దున్నే వానిదే భూమి అనే కాలం వచ్చింది. అసలు మన రెడ్డి మేడి పట్టి దున్నగా నువ్వు చూసినావా? ఆయన తన కొడుకుల్ని పట్నాల్లో పెట్టి బట్టలు నలగకుండా చదివించుకుంటాడు. కట్టలు కట్టలు దుడ్లు ఖర్చు పెట్టి డాక్టర్లనీ, ఇంజనీర్లనీ చేస్తాడు. మనకూ మన పిల్లలకూ ఇంత కూలీ మాత్రం పారేసి సేద్యమంతా చేయించుకుంటాడు. చేతుల కష్టం చేసే మనబోటి వాళ్ళకు భూముల్లేవు. చేతులకు మట్టి అంటుకోని వాళ్ళకు మాత్రం దండి భూములు అని ముగించాడు భూమయ్య" (పు. 47) అలా మాట్లాడుతున్నప్పుడు అతని ముఖం కందగడ్డలా మారిపోయింది. ఆ చర్యను ఆసక్తికరంగా వింటున్న పూజారి మల్లయ్య అన్న భూమయ్య ముఖాన్ని ఉత్సాహంగా చూస్తుండిపోయాడు.

భూమి విషయంలో విప్లవాత్మకంగా మాట్లాడిన భూమయ్యకు కుల పట్టింపులు ఎక్కువే తన తమ్ముడు మాదిగ పండయ్యతో తిరిగితే నలుగురిలో చులకనైపోతామని "ఓలే! మాదిగోల్లతో సావాసమేందిరా ? బోయోల్లతో తిరుగు, వడ్డెవాల్లతో తిరుగు, గోల్లోలతో తిరుగు పోయి పోయి మాదిగొల్లతో మాలోల్లతో తిరుగుతావేంటిరా!... ఈ పొద్దు నాలుగు అక్షరాలు

సదువుకున్నావో, లేదో కులం లేదు, గిలం లేదు అని వితండవాదం చేస్తావా? అసలు కులాలు పెట్టిందె ఎవఁడ్రా? దేవుడు! దేవుని కంటే నీకు ఎక్కువ తెల్సా?“ (పు. 21) అని తమ్ముడు మీద విరుచుకుపడేవారు. చదువుకున్న మల్లయ్య జ్ఞానాన్ని తిరస్కరించి తన అజ్ఞానాన్ని తమ్ముడికి అంటగట్టే ప్రయత్నం చేసేవాడు.

కానీ నవల కొనసాగింపులో భూమయ్యలో సాంప్రదాయభావాల్లో స్పష్టమైన మార్పు గోచరిస్తుంది. దీనిలో భాగంగానే మాదిగ (జీతగాళ్ళ) దేవన్న కూతురు వెంకటలక్ష్మి తమ్ముడు పసివాడు పండమేటి స్వామి గుడిలోకి వస్తాడు. అక్కడ వున్న పిల్లలు మాదిగోళ్ళ పిల్లోడు గుడిలోకి వచ్చాడని నానాయాగీ చేస్తారు. అక్కడ కొచ్చిన భూమయ్య “ఆ ఏడ్చే పిల్లోని పక్క చూసి, కాకుల మాదిరి అరిచే పిల్లోల్లతో పోనీంఁడ్రా..... పసిపిల్లోడు! తెలీదు పాపం... ” (పు. 90) అన్నాడు ఉదాసీనంగా. అప్పుడే అక్కడికొచ్చిన లింకులు చౌదరి, శూద్రోల్లు పూజారులుగా ఉంటే ఇంతే జరిగేదని ఎత్తి పొడిచినాడు. లింకుల చౌదరీకి సమాధానం చెప్పలేని నిస్సహాయ స్థితిలో ఉన్న భూమయ్యను చూసి భార్య తిలకమ్మ వెంకటలక్ష్మిని రెండు దెబ్బలు వేసింది. ఆ పిల్ల ఏడుస్తూ ఇంటికి వెళ్ళి అమ్మ లాలెమ్మకి చెప్పింది. ఆమె గుడి దగ్గరకు విస విసా నడిచింది. ఆమె వెనుకే దేవన్న కూడా పరుగెత్తాడు. మా పిల్లోన్ని ఎందుకు కొట్టారని లాలెమ్మ వాళ్ళను నిలదీసింది. దానికి తిలకమ్మా “మాదిగోళ్ళు గుళ్ళోకి దూరితే కొట్టకుండా ముద్దుపెట్టుకుంటారా?” (పు. 93) అని నోరు పారేసుకుంది.

భూమయ్య కూడా కొట్లాటకు దిగాడు. లింకుల చౌదరి మాటలతో అభిమానం దెబ్బ తిన్న భూమయ్య దేవన్న నెత్తి మీద కట్టెతో ఒక్క ఏటు వేశాడు. నెత్తురు కళ్ళబడే సరికి భూమయ్య మెత్తబడ్డాడు. పాపం జీత గాళ్ళు దేవన్న ఉత్తముడు అన్నారు బోయలు. పూజారి భూమయ్య కూడా అంత తీసివేసే మనిషి కాదని మాదిగలు అన్నారు. అది రెండు కులాల కొట్లాటగా మారకుండా రెండు కుటుంబాల కొట్లాట గానే మిగిలిపోయింది.

పెద్దభారీకాయులు ఆ ఊరిలో నలుగురు ఉన్నారు. వారిలో భూమయ్య ఒక్కడు. ఉట్లమాను పండుగ వచ్చిందంటే వీళ్ళను తీసుకెళ్ళి కంబాన్ని (బుడం) నిలుచోపెట్టేవారు. భూమయ్య యువకునిగా ఉన్నప్పుడు ఉట్ల మాను ఎక్కి దేవుని సొత్తును తెచ్చుకున్నాడు. అలాగే తమ్ముడు మల్లయ్య కూడా గెలుచుకున్నాడు. పండమేటి స్వామి ఊరు చిత్రబేడుని, కులం మాదిగని తెలిసిన తర్వాత మాదిగ వాళ్ళు గుడిలోకి కురుమెల్ల మద్దతుతో ప్రవేశించారు. మాదిగోల్ల గుడి ప్రవేశాన్ని అడ్డుకొమ్మని వచ్చిన కోనప్ప శాస్త్రితో భూమయ్య చేతులు జోడించి “ఇన్నాళ్ళూ నా కళ్ళు పూడుచుకు పోయినాయి స్వామీ! బ్రహ్మతత్వం కనుక్కున్న పండమేటి స్వామికి కులమేంది? గోత్రమేంది? మాదిగోళ్ళు గుళ్లలోకి వస్తానంటే రావద్దనే దానికి నేనెవరిని?” (పు. 168) అని జవాబు ఇచ్చాడు. గుడిలోకి వచ్చిన మాదిగలకు భూమయ్య దగ్గరుండి పూజ చేయించి తీర్థం, ప్రసాదాలు పెట్టాడు. గుడిమాన్యం వేలం పాటను గరుడ శేఖర్ నాయుడి మద్దతుతో లింకుల చౌదరి ( భాస్కర చౌదరి) పాడుకోవాలని అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. బోయ కులం వారిని ఒప్పించడానికి ప్రయత్నిస్తే వారు ఎదురు ప్రశ్నించి, ‘ఈ సారి గుడిమాన్యం పాటను మేము జరుగనివ్వం అని తెగేసి’ చెప్పారు. భూమయ్య ఇంత కాలం రాజారెడ్డితో ఉండి మా ఇల్లులు కాల బెట్టినావు. వడ్డే విరుపాక్షిని పట్టుకోని గరుడ శేఖర నాయినితో లింకులు పెట్టుకున్నావు. “ఆ వడ్డేవాళ్లకు ఆశ పెట్టి దువ్వినావు. గొర్ల తిరుపాలుకు బేరం పెట్టినావు..... లోలోపల అన్నీ చేసేదీ, బయటికి నంగనాచి మాదిరిగా మాట్లాడేది! ఇంక మేము చేతులు ముడుచుకు కూర్చునేది లేదు! గుడి మాన్యానికి పాట జరుగనిచ్చేది లేదు” (పు. 177) అని తెగేసి చెప్పాడు.

గుడి మాన్యం వాయిదా వేయాలని బోయలు, మాదిగలు కలిసి కలెక్టర్‌కు అర్జీ పెట్టడానికి

అనంతపురం వెళ్ళారు. అదే అనుకూల సమయమని లింకుల చౌదరి పూజారి భూమయ్యపై దాడి చేయించాడు. భూమయ్య ప్రాణభయంతో గుడిమాన్యానికి అడ్డంపడి పరుగెత్తాడు. కొండకు దగ్గర పడ్డాడు. కొండకు ఆనుకొని ఉండే ఆ గుడి మాన్యం చెక్క ఒకప్పుడు భూమయ్య కుటుంబానిదే ! అక్కడే తాత, తండ్రులు, అవ్వ, తల్లులు, కష్టపడి పనిచేశారు. భూమయ్య వంశం వాళ్ళు సుఖమూ, దు:ఖమూ ఆ చేనుతోనే ముడిపడి ఉండేవి. వాళ్ళ జీవితమూ, చావూ ఆ చేనుతోనే అల్లుకుపోయాయి. ఆ చేనులోనే పూర్వీకుల సమాధులు బారులు తీరాయి. భూమయ్య ఒక్కడిని నిరాయుధుడిని చేసి పదిమంది చుట్టుముట్టారు. పూర్వీకులు చెమటతో తడిచినా భూమి ఇప్పుడు భూమయ్య రక్తంతో ఎరుపెక్కింది. భూమయ్య గరుడశేఖరనాయుడి అనుచరుల చేతిలో గుడి మాన్యాన్ని వేలం ఆపించే ప్రయత్నం చేసినందుకు దారుణంగా చంపించబడ్డాడు.

**3. 3. 3. 4. మల్లయ్య కమ్యూనిజం:**

పూజారి భూమయ్య తమ్ముడు. అభ్యుదయభావాలు గల వ్యక్తిగా రచయితగా తీర్చిదిద్దాడు. పండయ్య స్నేహితుడు. బి.ఏ తెలుగు సాహిత్యం చదువుతున్నాడు. కమ్యూనిజ సిద్ధాంతాన్ని నమ్ముతాడు. చివరకు కమ్యూనిజ పాఠాలు నేర్పించిన గురువుకే పాఠాలు నేర్పించేలా కమ్యూనిజాన్ని అధ్యయనం చేశాడు. గుడిమాన్యం తగాదాలో అన్న భూమయ్య హత్య తరువాత రాడికల్స్‌లో చేరి పోరాటాలు చేయడానికి సిద్ధం అవుతాడు.

మల్లయ్యకు మూడు సంవత్సరాలప్పుడు తల్లీ తండ్రి చనిపోయారు. వాళ్ళకు పెద్ద వయస్సులో మల్లయ్య పుట్టేడు. అప్పటికింకా అన్న భూమయ్యకు ఇంకా పెళ్లికాలేదు. తమ్ముడి పెంపకం కష్టమైంది. పిన్ని మల్లయ్యను పెంచుకుంటనంటే ఇచ్చాడు. ఆమె మల్లయ్యను పేటకుతీసుకు వెళ్ళి అల్లారుముద్దుగా పెంచింది. బడిలో చేర్పించి చదివించసాగారు. చిన్నాయన కూడా మల్లయ్య బుజాల మీద ఎక్కించుకొని పెంచాడు. చదువుకునేటప్పుడు బడిలో మాదిగ పండయ్య పరిచయమై, స్నేహం మొలకెత్తింది. మల్లయ్య పిన్ని, బాబాయిల ఆరోగ్యం క్షీణించింది. కాయ కష్టంచేయలేక పని మానివేశారు. ఇంట్లో గడవక మల్లయ్యను పనికి వెళ్ళమనేవారు. పనికి వెళుతూ ఒక సంవత్సరం బడికి మల్లయ్య వెళ్ళలేదు. “ఇంట్లో అన్నం లేని రోజు మల్లయ్య పండయ్య హాస్టల్లోకి పోయేవాడు. పొద్దున పండయ్య టిఫిన్‌లో భాగం పెట్టేవాడు. మధ్యాహ్నం అన్నంలో భాగం పెట్టేవాడు. రాత్రి మళ్లీ తన అన్నంలోనే భాగం పెట్టేవాడు. అట్లా మల్లయ్య ఎస్.సి హాస్టల్‌లో పండయ్య భాగం తినేది. తన గుడిసెకు వచ్చి పడుకునేది. ఎప్పుడైనా హాస్టల్ వార్డెన్ అటకాయిస్తే ఉత్త కడుపుతో తిరిగి వచ్చి కడుపు నిండా నీళ్ళు త్రాగి పడుకునేవాడు” (పు. 25). ఆనోట ఈ నోట విషయం తెలుసుకున్న అన్న, వదినలు మల్లయ్యను పేట నుండి పండమేటికి తీసుకెళ్లారు. పండమేటి కొండ మీదకి మల్లయ్యను పండయ్యలు వెళ్ళి దేవుడు, మతం, కులం కమ్యూనిజం గురించి చర్చలు చేసేవారు.

మల్లయ్య మాదిగ పండయ్యతో స్నేహం చేయడం భూమయ్య చిన్నతనంగా భావించేవాడు. మాదిగ వాళ్ళతో స్నేహం చేయవద్దని చెప్పేవాడు. “ అన్నా! ఈ కులాలు పెట్టింది. దేవుడని నీకు ఏ నాకొడుకులు చెప్పినారు. వాళ్ళను ఇక్కడికి నా దగ్గరకి పట్టకరా, చెప్తాను... మన బాపనయ్య వార్లు ఏం చెప్తే దానికి గంగిరెద్దు మాదిరి తల ఊగించేది కాదు తెలివంటే! ఆలోచించల్లె! అర్ధం చేసుకోవల్లె! నీది ఏకులమంటే పండమేటి స్వామి ఏం చెప్పినాడు...శుక్ల శోణిత మాంసాలది ఏ కులమో అదే నా కులమని చెప్పినాడు...... ఆ పదాలు కూడా పాడతావు. భజన అయిపోగానే లేచి పిర్రలు దులుపుకుంటావు చూడు... అప్పుడు దాంతో పాటే ఆ పదాల్లోని సారాన్ని కూడా దులుపుకుంటావు. కులాలు, మతాలు, మడీ, మైలా, ఆచారాలూ ఇవన్నీ దేవుడు పెట్టిండేటివి కాదు. మనం.. మనుషులు

పెట్టుకోనుండేటివి అన్నా! నిజానికి ఈ కులాలూ మతాలూ ఇవేవి లేవని మన అంతరాత్మకు తెలుసు. కానీ ఒప్పుకోరే. ఒప్పుకుంటే మాదిగోల్ల మీదా, మాలోల్ల మీదా మన పెత్తనాన్ని ఇడిచిపెట్టుకోవల్ల కదా! వాల్లను మనతో సమానంగా చూస్తిమే అనుకో! మన కాళ్ల కింద కుక్కిన పేనుల మాదిరి పడి ఉండే దానికి మరోకరు ఏవరు దొరకు తారు? మన పుట్ట గోచీ నా కొడుకులక్కూడా వీరత్వముందని రుజువు చేసుకునే దానికి ఇంతకన్నా బలహీనులు ఇంకెవ్వరు దొరుకుతారు? అదీ మన బాధ! మన ఇండ్లలోకి కుక్కలు రావచ్చు, పిల్లులు రావచ్చు, పశువులు రావచ్చు, మాదిగోళ్లు వస్తే మాత్రం మైల పడిపోతాం. జంతువుల కంటే తీసిపోయినారా, అన్నా, మాదిగోల్లు? మనం వాళ్లని మనుషులుగా చూడకపోతే వాళ్ళు మాత్రం మనల్ని ఎందుకు మనుషుల్లా చూడల్ల" (పు. 22) అని అన్నకి బ్రాహ్మణిజం గురించి వివరిస్తాడు.

గుడిమాన్యం సమస్య మాములు మాటల్తో తీరదని, రాడికల్స్‌లో చేరడమే దీనికి విరుగుడని మాటల సందర్భంలో పండయ్యతో చెబుతాడు. పండయ్య దేవుడిని నమ్మడు, నాస్తికుడు. మల్లయ్య పండమేటి స్వామిని నమ్ముతాడు. నాస్తికుడు, పండమేటి స్వామి నేనే దేవున్ని అని అన్నాడంట కదా అని పండయ్య అడిగితే "నేనే దేవున్ని అని పండమేటి స్వామి అంటే మరొకరుకాదని అర్థంకాదు. నువ్వుకూడా అదేఅని అర్థం... అందుకే ఎవరైనా తన కాళ్లు మొక్కేదానికి వస్తే నీ కాళ్ళు నువ్వు మొక్కుకో, పో! అనేవాడంట. భారతీయ తత్వదర్శనానికి అద్వైతం పరాకాష్ట అంటారు. మన దురదృష్టం ఏమిటంటే – మనిషి నుంచీ దేవున్ని విడదీసి ఇద్దరి మధ్యా సాధ్యమైనంత దూరాన్ని పెంచేసి, ఆ మధ్యలోకి బాపనఅయ్య వాళ్ళు వచ్చి కూర్చుని, కాలం చెల్లిన కులవ్యవస్థకు, మనుధర్మాలకు, లేని శాశ్వత సత్యాన్ని ఆరోపించి దగా చేస్తున్నారు. దాన్ని మనం తిప్పి కొట్టాల్సిందే" (పు. 41) నని తన మార్గాన్ని చాలా స్పష్టంగా తెలియజేస్తాడు. అంతేగాక దేవుడ్ని చూడకుండా దేవుడ్ని నమ్మడం ఆశ్చర్యకరమంటే " ఉన్న దానిని ఋజువు చేయడమే సైన్సు పని అంతేగానీ ఒక విషయం తన పరిమిత పరిశోధనలను అందనప్పుడు తటస్థంగా ఉండకుండా అది ఉందని గానీ, లేదని గానీ నిర్ధారణకు రావడం సైన్సు చేయాల్సిన పనికాదు. అది శాస్త్రీయ విజ్ఞానము కాదు" (పు. 42) వివరిస్తూ "విజ్ఞానశాస్త్రం ఎప్పుడు, ఏమేరకు ఎదుగుతుందో, దాని మీద ఆధారపడి ఆ మేరకు మాత్రమే అభివృద్ధి అవుతుంది మార్క్సిజమ్. మార్క్సిజానికి బలమూ ఇదే, బలహీనతా ఇదే!" (పుట.41) నని మార్క్సిజం గురించి తన అవగాహనను ఎరుకపరుస్తాడు.

పండయ్య చెల్లెలు, తమ్ముడు గుడిలోకి వచ్చారని అన్నా వదినలు కొట్టడం, తర్వాత అడగడానికి వచ్చిన పండయ్య తండ్రి దేవన్న తల పగలగొట్టడం తెలిసి అతనికి అన్నావదినలమీద పట్టరాని కోపంతో గుడిలోకి కుక్కలు, కోతులు, జంతువు వస్తాయే "జంతువుల కంటే తీసిపోయినారా మాదిగ కులస్థులు? అప్పటికి మీదేదో పెద్దకులమైనట్లు ఆ జీతగాళ్ళ దేవన్న ఎవరు? పండయ్య ఎవరు? నా స్నేహితుడు నేను పస్తులుండే దినాల్లో వాడు తన అన్నంలో నాకు భాగం పెట్టినాడు. ఏం? మాదిగోల్లు గుళ్లోకి వస్తే మైలపడతాం కానీ, మనం పోయి ఆ మాదిగ హాస్టల్లో అన్నం తింటే మైలపడమా? నన్నూ వెలివేయండి..... గుళ్లో ఉండేది దేవుడు కాదు. మీ అహంకారం" (పు. 95) మని పండయ్యకు ముఖం చూపించలేక పేట వెళ్ళిపోతాడు.

మల్లయ్యకి పేటలో పండయ్య ఎదురుపడిన తలతిప్పుకోని వెళ్ళిపోతారు. వీరప్ప నాయుడి హత్య వార్తతో మల్లయ్య మనోహర్ నాయుడి ఇంటికి వెళ్ళారు. బౌద్ధం గురించి మనోహర్ నాయుడు బుద్ధవాదని, మార్క్స్ కంటే వెనుకబడిపోయాడని అన్నారు. మనోహర్ వాదనను తిరస్కరిస్తూ మల్లయ్య భావ వాదమా? భౌతికవాదమా అనే ద్వంద్వాలు పాశ్చాత్యుల కల్పన అవి రెండూ సమన్వయించ బడిన అధ్యాత్మిక వాదం బుద్ధునిది అన్నారు. బుద్ధుడు భౌతిక

ప్రపంచ పరిణామాన్ని చెబుతూనే తన తాత్వికాన్వేషణను తనలోకి నడుపుకొని నిర్వికల్పం చెందాడు. రాజకీయ సిద్ధాంతమైన మార్క్సిజానికి అవసరం లేకపోవచ్చు. అంత మాత్రాన బుద్ధుని భావవాదిగా చిత్రించి మార్క్స్ ఆ అస్తిత్వానుభవమైన నిర్వికల్పం, సామాజం కంటే వెనుకపడ్డాడని తాత్వికులు చెయ్యాల్సిన పని కాదనివాదించాడు" (పు. 135). భౌతిక శాస్త్ర అధ్యాపకుడిని ఒప్పించే ప్రయత్నం చేశాడు.

కొండారెడ్డి మరణంతో రాజారెడ్డి బలం తగ్గిపోయిందని బోయలు పండుగ చేసుకున్నారు. దాంతో రెడ్లు బోయవాళ్ళ ఇండ్లవాములు తగల బెట్టారు. బోయల మీద రెడ్లు దాడిచేశారు. విషయం తెలిసిన మల్లయ్య ఊరికి వచ్చి అక్కడే ఉంటున్నాడు. మల్లయ్య పరామర్శిద్దామని పేట నుండి సైకిల్ తొక్కుకుంటు వస్తున్న పండయ్యను రెడ్ల యువకులు చితక్కొట్టారు. ఈ విషయం తెలిసి మల్లయ్య పరుగున వచ్చాడు. మాట్లాడుకున్నారు. మునుపటి స్నేహం వారిగుండెల్లో తొణికిసలాడింది. మాదిగ యువకుల ఊపు చూసిన మల్లయ్య 'నువ్వు ఊ.. అనరా.. రెడ్ల కదేదో ఇప్పుడే తేలుస్తా' అన్నాడు. దీంట్లో నీ సమస్యే కాదు. మా సమస్య కూడా ఉంది. నలుగురు మాదిగ యువకులు, పదిమంది బోయ యువకులు కలసి రెడ్ల ఇండ్లపై పడి దొరికిన వాళ్ళను దొరికినట్లు ఈడ్చి ఈడ్చి తరిమి తరిమి కొట్టారు. ఊహించని దాడులకు రెడ్లకుదిమ్మ తిరిగి పోయింది.

శ్రీరామనవమి పండుగరోజు ఉట్లమాను కొడతారు. మల్లయ్య అప్పటికే రెండుసార్లు ఉట్లమాను కొట్టి దేవుడి సొమ్ము గెలుచుకున్నాడు. పండుగ సమయంలో మాదిగలను ఆ ఉత్సవాలలో పాల్గొననివ్వరు. ఉట్టిమాను ఎక్కుతుంటే పండయ్య చూడటానికి అక్కడికి వచ్చాడు. కొద్దిలో మల్లయ్య పోటీని చేజార్చుకున్నాడు. ఇప్పుడు ఊరి బయట బావిలోమునిగి రాముల వారి భజనచేస్తూ ఊర్లోకి రావాలా పండయ్య అన్నాడు "నాకు రాముడంటే భక్తి లేదు. ద్వేషమూ లేదు. నాకు గురికుదిరిందల్లా పండమేటి స్వామిలోనే" (పు. 164) నని చెప్పి మిత్రుడి మీద సరదాగా బురదచల్లాడు. "ఒక బోయోల్ల పిల్లోడు ఒక మాదిగోల్ల పిల్లోన్ని ఉట్లమాను పండుగలో కలుపుకునే దాన్ని వాళ్లు జీర్ణం చేసుకోలేక పోయారు" (పు. 164) మల్లయ్య ఎవరిని పట్టించుకోలేదు.

మాదిగలు పండమేటి స్వామి కులం మాదిగని తెలుసుకొన్నారు. గుడిలోకి రావడానికి సిద్ధం అవుతున్నారని తెలిసి రెడ్లు  అడ్డుకోవడానికి ముందుకు వచ్చారు. పూజారి భూమయ్య మాదిగలు గుళ్ళోకి రావడానికి మద్దతు ఇచ్చాడు. మల్లయ్య సహకారంతో మాదిగలు గుడిలోకి ప్రవేశించి పూజలు చేశారు. గుడి మాన్యంవేలం పాటను ఆపితీరుతామని భాస్కరాచౌదరి (లింకుల చౌదరి)తో మల్లయ్య తెగేసి చెప్పాడు. భూమయ్య కూడా అదే మాటమీద నిలబడ్డాడు. వేలంపాటను ఆపమని మల్లయ్య, పండయ్య కలెక్టర్‌కు అర్జి పెట్టడానికి అనంతపురం వెళ్ళారు. అదునుకోసం ఎదురుచూస్తున్న లింకులచౌదరి భూమయ్యను  దారుణంగా గుడిమాన్యంలో హత్య చేయిస్తాడు. ఆ విషయం తెలిసిన మల్లయ్య యెల్లతో కలిసి కొండకు వెళ్ళి రాడికల్స్‌లో కలిసిపోతారు. నవల ముగింపులో మల్లయ్య తిప్పన్నను ఎదుక్కొంటువస్తాడు. తిప్పన్న తీసుకు వచ్చిన ముద్ద ఇద్దరు తింటారు. తరువాత ఊరి బాగుకోసం, తన మనశ్శాంతి కోసం భాస్కరాచౌదరి, విరుపాక్షిని చంపాలనుకుంటున్నాడని తిప్పన్నను మల్లయ్య సలహా అడుగుతాడు. తిప్పన్న చంపమనే చెబుతాడు. పండయ్య, మల్లయ్య మద్దతుతో భాస్కర (లింకుల) చౌదరిపై పోటీగా నామినేషన్‌వేస్తాడు. మల్లయ్య అడవిలోఉండి పోరాటం మొదలుపెడితే పండయ్య మాత్రం సమాజ ం మార్పుకోసం అంబేద్కరిజం మార్గంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు వెళ్ళడంతో నవల ముగుస్తుంది.

**3.3.3.5. జీతగాళ్ల దేవన్న, లాలెమ్మ – మాదిగ కుటుంబ జీవనం:**

దేవన్నది జీతగాళ్ళ వంశం. వీరి వంశగోత్రం పేరు మీనుగుల. వీళ్ళకి మొదట పుట్టిన సంతానం పండమేటిస్వామి పేరుపెట్టుకోవడం వారి వంశాచారం. భార్య పేరు లాలెమ్మ, కొడుకు పేరు పండయ్య, కూతురు వెంకటలక్ష్మి, తర్వాత ఇంకొక కొడుకు ఉన్నారు. వీళ్ళు నాలుగైదు తరాలుగా రాజిరెడ్డి వంశం వాళ్ళ దగ్గర జీతగాళ్ళుగా పనిచేశారు. కనుక వీళ్ళకి జీతగాళ్ళు అనేది పేరు ముందు తోకలా గుర్తుకోసం తగిలించి పిలుస్తారు. జీతగాళ్ళ దేవన్న వంశం వాళ్ళు రాజా రెడ్డి వంశానికి చేసిన సేవలు వీరగాథలుగా చెప్పుకుంటారు. మా ముత్తాత ఆజాను బాహుడు. రెడ్డి పెళ్ళాం కోరికతో పిలిస్తే నీవు నాకు తల్లి వంటిదానివని, నీకు నేను బిడ్డతో సమానమని తప్పించుకున్నాడు. మా తాత చాలా చాకచక్యంగా ఉండేవాడు. ఎందుకో రెడ్డికి ఒకసారి కోపమొచ్చి తిట్టితే బ్రాందీ సగం తాగి మిగిలిన సగంలో ఉచ్చపోసి తీసుకువచ్చాడు. మరో తాత యాభై బస్తాల వడ్లు ఒక్కడే వేసేవాడు. మూడో తాత బానకడుపోడు మూడు దుత్తాల కల్లును సగం యాటను తినేవాడని, ఇంకో తాత కళాకారుడు, సారాతాగి పద్యాలు పాడేవాడు. డ్రామాలో వేషం కట్టిన దాన్ని తగులుకొని ఎటో వెళ్ళి పోయాడని వారి తాత ముత్తాతల గురించి కథలు, కథలుగా చెప్పుకొని దేవన్న సంతోషపడేవాడు.

ప్రభుత్వం వెట్టిని రద్దు చేసినా రాజిరెడ్డి దగ్గర ఐదు వేలు అప్పు తీసుకున్నాడని దేవన్నకి వెట్టినుండి విముక్తి కలిగించలేదు. రాజిరెడ్డి దగ్గర కట్టుబానిసగా ఉండేవాడు. అతను చేసిన పనికి జీతంవడ్డీ కింద రెడ్డి జమచేసుకునేవాడు. దేవన్నది తడికల కొట్టం. రెడ్డి ఇంట్లో తిని వారి భూముల్లో పనిచేసి, వారి పశువుల కింద చాకిరి చేసి రాత్రి పండుకుండేదానికి మాత్రం ఇల్లు చేరేవాడు. ఇది వ్యవసాయ పనులు లేని రోజుల్లో మాత్రమే. వంట్లో బాగు లేకపోయిన పనిలోకి రాను అనేదానికి లేదు. "ఇంట్లో భార్యా కొడుకూ ఉన్నా వారి జీవికతో దేవన్నకు ఏ సంబంధమూ ఉండేది కాదు. కట్టుబానిసలకు పెండ్లాం, పిల్లల పోషణ భారం వహించే అవకాశముండదు. దేవన్న రెడ్డి ఇంట్లో తిని తన పొట్టకోసం తాను బతుకుతుంటే లాలెమ్మ కూలీనాలికి పోయి పిల్లోన్ని పెంచుకుంటూ నానాతంటాలు పడింది" (పు. 31) ఐనప్పటికి లాలెమ్మ ఇంట్లో గడిచేది కాదు. రెండు మూడు రోజులు తినడానికి ఉండేది కాదు. రెడ్డి ఇంట్లో పెట్టిన సంగటి ముద్దలు దాచిపెట్టుకొని తీసుకువచ్చి భార్య పిల్లలకు పెట్టేవాడు. లాలెమ్మ ఎప్పుడైన మాంసం కూర వండితే దేవన్నకు పిలుచుకువచ్చి పెట్టేది. దేవన్న అన్న పెద్ద పండయ్య అనంతపురం మున్సి పాలిటీలో ఉద్యోగం చేసేవాడు. దేవన్న కొడుకు పండయ్యను బడిలో చేర్పించి చదివిస్తానని తీసుకు వెళ్ళాడు.

దేవన్నకు పెద్దతండ్రి ఆస్తి కలిసి వచ్చింది. దాన్ని తెగనమ్మి రాజా రెడ్డి బాకీ తీర్చాడు. ఇప్పుడు దేవన్న "ఎవరన్నా కూలీకి పిలిస్తే పోతాడు. లేకపోతే కాళ్ళు నిగడదన్ని పడుకుంటాడు..... ఉంటే తినల్ల! పస్తులుండి చావల్ల అంతేగాని ఈ రెడ్ల దగ్గర ఇంక బుద్ధుంటే అప్పు చేయకూడదని" (పు. 34) చెంపలు వాయించుకున్నాడు. దేవన్నకు పండమేటి స్వామి అంటే చాలా భక్తి దేవన్నకు తాత పండమేటి స్వామి మహిమల గురించి చెప్పేవాడు. ఆ స్వామి పదాలు మైమరచి పాడేవాడు. గుళ్ళో ఆయన విగ్రహం ఎలా ఉందో చూడాలని అతని కోరిక, మాదిగ దేవన్న తిరుపతి, శ్రీశైలం దైవదర్శనానికి వెళితే ఆటంకంలేదు. అందుకే దేవన్నకు ఒక ధర్మ సందేహం ఉంది. " మాదిగోల్లు గుళ్ళోకి పోతే తిరుపతిలో అడ్డు చెప్పరు. శ్రీశైలంలో అడ్డుచెప్పరు. కానీ మన పల్లెలో మాత్రమే గుళ్ళో ఎందుకు అడ్డు పడతారు? అని దానికి జవాబు చెప్పే నాధుడు లేడు" (పు. 93) అని మదన పడేవాడు.

తన కూతురు వెంకట లక్ష్మి గుడిలోకి తన తమ్ముడ్ని తీసుకువెళ్ళిందని పూజారి భూమయ్య భార్య పిల్లల్ని రెండు దెబ్బలు వేసింది. ఏడుస్తూ ఇంటికొచ్చిన కూతుర్ని చూసి దేవన్నకు అసహనం పెరిగిపోయింది. లాలెమ్మ గొడవకు వెళ్తుంటే ఏంపోయి ఏం వస్తుందోనన్న భయంతో

మిన్నకుండి పోయాడు. కానీ భార్య లాలెమ్మ గుడివద్దకు వెళ్ళి పూజారి కుటుంబంలో వాదనకు దిగింది. ఆమె వెనుకే దేవన్న వచ్చాడు. పూజారి భూమయ్య దేవన్నతో తలపడి కట్టెతో తల పగలకొట్టాడు. ఇది కుటుంబ తగాదాగానే ఇరు కులాలు భావించాయి. అందుకే కులాల తగాదాగా మారలేదు. కొండారెడ్డి చావు తర్వాత బోయలు పండుగ చేసుకున్నారు. ఇది తెలిసి రెడ్లు బోయల మీద దాడులు, ఇళ్ళు, వాములు తగలబెట్టారు. ఊరంతా భయపడిపోయింది. రెడ్లు కూలీల రేట్లు తగ్గించారు. ఎవరికి మాట్లాడే ధైర్యం లేదు. దేవన్న కొన్ని రోజులు పనికి పోయి కూలీ గిట్టదని మానుకున్నాడు. దీంతో రెడ్లు దేవన్నపై కోపంగా ఉన్నారు. ఆ కోపంతో ఊళ్లోకి సైకిల్ తొక్కుకుంటూ వస్తున్న పండయ్యని ఆపి రెడ్లు చితకొట్టారు. రెడ్లు కొడుకు మీద దాడి చేసిన ఏమి చేయలేకపోయాడు.

కానీ పండమేటి స్వామి కులం మాదిగని తెలిసిన తర్వాత గుడిలోనికి ప్రవేశించడానికి శతవిధాల ప్రయత్నించాడు. బోయ మల్లయ్య సహకారంతో గుడిలోకి ప్రవేశించారు. ఇలా ప్రవేశించే ముందు "దేవన్న ముందుండి పండమేటి స్వామి తత్వాలు పాడుకుంటూ నడుస్తూంటే అందరూ అతని వెనుక గుడి ముందుకు వచ్చారు" (పు. 168). గుడి ముందు రెడ్లు బానా కర్రలు పట్టుకొని నిలబడి మాదిగలను అడ్డుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. మాదిగోల్ల గుంపు నుంచీ పండయ్య ముందుకు వచ్చాడు. పండయ్య వెనుక దేవన్న నిలబడ్డాడు. బోయ కులం నుండి మల్లయ్య ముందుకు వస్తే, భూమయ్య తమ్ముడి వెనుక చేరాడు. మాదిగ, బోయ కులాలు ఏకమవ్వడంతో రెడ్లకు తెలిసి వెనక్కి తగ్గారు. మాదిగలు గుడి ప్రవేశం చేశారు. మల్లయ్యతో పండయ్య స్నేహం చేస్తుంటే దేవన్న, లాలెమ్మ సంబరంగా చూచేవారు. ఉ ట్టిమాను పండుగరోజు మల్లయ్య పండయ్య మీద బురద చల్లితే పండయ్య తల్లి లాలెమ్మ తన కులమోళ్ళతో గొప్పగా చెప్పుకుంది. పండయ్య ఎన్నికల్లో నామినేషన్ వేస్తే "మనకెందుకు నాయనా ఈ రాజకీయాలు" (పు. 190) అని చెప్పి నామినేషన్ ఉపసంహరించుకోమని చెప్పాడు.

దేవన్న పాత్రను మొత్తంగా చూసి నప్పుడు మొదటి తరం దళితులకి నమూనా పాత్ర రెడ్ల దగ్గర చాకిరి చేసేటప్పుడు అణగి మణగి ఉండేవాడు. వెట్టినుండి డబ్బులు కట్టి విముక్తి పొందిన తర్వాత స్వేచ్ఛాజీవి అయ్యాడు. గుడికి వెళ్ళిన కూతుర్ని, కొడుకును దండించినప్పుడు భార్య లాలెమ్మ విచారించడానికి వెళ్తున్నప్పుడు ఏం పోయి ఏం వస్తుందోనన్న భయంతో ఆమె వెనుకే వెళ్ళాడు. ఆ సమయంలో భూమయ్య దేవన్న తలను పగలకొట్టాడు. ఆ ఘటన నుండి దేవన్నకు కొంత మార్పు కనపడుతుంది. కొడుకు పండయ్యను రెడ్లు కొట్టినప్పుడు ఏమి మాట్లాడడు. పండమేటి స్వామి గుడి ప్రవేశం అప్పుడు మాత్రం మాదిగలకు నాయకత్వం వహించి ముందుండి నడిపిస్తాడు. చివరికి పండయ్య ఎన్నికల్లో నామినేషన్ వేసినప్పుడు మనకెందుకు ఈ రాజకీయాలని కొడుకును నిరుత్సాహపరుస్తాడు. దేవన్న పాత్ర మధ్యలో కొంత చైతన్యం కనబరిచినా చివరకు యథాతద స్థితిలోనే కొనసాగుతుంది. దేవన్న పాత్ర నవలలో కొన్ని సంఘటనలను ఆధారంతో, తన ప్రవర్తనను మార్చుకొని ముందుకు నడిచింది. మొదటి తరం దళితుల్లోని భయ, శంక లక్షణాలు దేవన్న పాత్రలో పుష్కలంగా ఈ నవలలో చిత్రించబడ్డాయి.

### 3.3.3.6. పండయ్య–దళిత చైతన్యం:

జీతగాళ్ళ దేవన్న లాలెమ్మల కొడుకు. నాస్తికుడు, పేటలో బి.ఏ తెలుగు సాహిత్యం మూడవ సంవత్సరం చదువుతున్నాడు. చిన్నప్పటి నుండి బోయ మల్లయ్యతో స్నేహం. ఎంత స్నేహమంటే ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునేంతగా వాళ్ళు ఊర్లో ఉంటే రోజు కొండకు పోయి సమాజంలోని విషయాలు చర్చించుకునేవాళ్ళు. పండయ్య మల్లయ్యతో కలిసి

కొండకు పోతుంటే దేవన్న, లాలెమ్మా ముచ్చటపడి చూస్తూ నిలబడి పోయేవాళ్ళు తండ్రి దేవయ్య వెట్టిగా చేస్తున్న సమయం ఇంట్లో జరుగుబాటు లేక ఐదోతరగతితో పండమయ్య చదువు మానేశాడు. రెడ్డింట్లో పశువులు కాయడానికి వెళ్లమంటే ఉత్తపయ్యి తిప్పన్నతో జీవాలు కాసేదానికి పోతానన్నాడు. ఒక సంవత్సరం తిప్పన్నతో కలిసి మేకలు కాసాడు. పీర్ల పండక్కి దేవన్న అనంతపురంలో మున్సిపాలిటీ ఉద్యోగం చేసే అన్న పెద్ద పండయ్యను ఇంటికి పిల్చాడు. ఆయన చిన్న పండయ్యను దగ్గరకు తీసుకోని "ఒరే చినపండయ్య! నువ్వు బాగా చదువుకోవాల్లరా! మనది జీతగాళ్ల వంశం అనే పేరును మార్చి పారేయాల్ల...." (పు. 32) అని చదువు మాని పశువుల్లోకి వెళ్తున్నాడని తెలిసి అనంతపురం బళ్లో చేర్పించాడు. అక్కడే పండయ్య ఆరు, ఏడో తరగతులు  పూర్తి చేశాడు.

మాదిగ కులాన్ని అంటరానిదిగా చూసే సమాజం వల్ల పండయ్య నాస్తికుడయ్యాడు. చిన్నప్పుడు బడిలో తోటి పిల్లలతో తరగతిలో కూర్చోనివ్వకపోవడం, కుండలో నీళ్ళు త్రాగినందుకు పంతుళ్ళు తిట్టడం మొదలైన ఘటనలపై ద్వేషం నాస్తికత అనే తాత్వికరూపం పండయ్యకు ఇచ్చింది. టౌన్‌లో ఆరోతరగతిలో పరిచయమైన సైన్స్ లెక్చరర్ కొడుకు జయధీర్ తీర్థతో కారమ్స్ ఆడేవాడు. ఒకరోజు వాడు 'కొట్టాల్లో' ఉండే వాళ్ళతో మా ఫాదర్ మాట్లాడ వద్దన్నాడు అని తమ స్నేహాన్ని అర్ధాంతరంగా తుంచేశాడు. తర్వాత ఏడవ తరగతిలో డాక్టర్ కొడుకు చంద్రశేఖర్ గుప్తాతో స్నేహం, వాడితో చదరంగం, క్రికెట్ ఆడేవారు. వాడు నీతో తిరగడం మా అన్నకు ఇష్టం లేదన్నాడు. ఒక రోజు ఇంటికి భోజనాలకు పిలిచి బాత్‌రూమ్‌లో అన్నంపెట్టాడు. వదిలి వెళ్ళితే గుప్తా స్నేహం, గుప్త తల్లి పట్ల అగౌరవంగా ప్రవర్తించినట్లు అవుతుందని పండయ్య తిన్నాడు. మీరు ఛీప్ మనుషులని నిరూపించడానికే బాత్ రూమ్‌లో అన్నం పెడితే తినవని, తింటే నీ స్నేహం మానివేస్తానని పందెం పెట్టుకున్నాను. ఛూ! ఇంకెప్పుడు నాతో మాటాడొద్దని అన్నాడు. అందుకే పండయ్య కుల వివక్షత వల్ల దేవున్ని కూడా నిరాకరించాడు. బ్రాహ్మణ వాదులందరూ అతనికి శత్రువులయ్యారు. నాస్తికవాదానికి, మార్క్సిజానికి చేరువవ్వడానికి కుల వివక్షత దోహదపడింది.

పండయ్య చెల్లెలు తమ్ముడితో గుడిలోకి వెళ్ళినందుకు మల్లయ్య వదిన ఆ అమ్మాయిని కొట్టింది. ఆ విషయం అడగడానికి వెళ్ళిన దేవయ్య తల భూమయ్య పగలకొడతాడు. పరామర్శించడానికి మల్లయ్య రాలేదని పండయ్య కోపంగా ఉంటాడు. ఇద్దరూ కాలేజీలో ఎదురు పడినా మాట్లాడుకోలేదు. కొండారెడ్డి  హత్యతో బోయలు పండుగ చేసుకున్నారు. దాంతో రెడ్లు బోయలపై దాడి చేశారు. మల్లయ్య కుటుంబక్షేమాన్ని తెలుసుకుందామని పండయ్య సైకిల్‌పై ఊరికి బయలు దేరాడు. రెడ్ల ఇండ్ల ముందర నుండి సైకిల్ తొక్కుతున్నాడని పండయ్యను రెడ్డియువకులు బాగా కొట్టారు. ఆ విషయం తెలిసిన మల్లయ్య పండయ్య దగ్గరకు వచ్చాడు. పండయ్య అనుమతితో మాదిగ, బోయ యువకులు కలిసి మల్లయ్య నాయకత్వంలో రెడ్డి మీద దాడి చేసారు. దాడి తర్వాత ఇక మాజోలికి రావద్దని హెచ్చరించి వచ్చారు.

శ్రీరామనవమి ఉట్లమాను పండుగ చూడడానికి పండయ్య తమ్ముడితో గుడి వద్దకు వెళ్ళాడు. మిత్రుడు మల్లయ్య ఉట్లమాను ఎక్కుతుంటే చూడడానికి వచ్చాడు. కానీ "పండయ్యకు దేవుడంటేనే గురిలేదు. రాముడు అంటే ద్వేషం కూడా! రాముడు తపస్సు చేసుకునే శంభూకుని శిరస్సు నరికినాడ (పు. 161)ని అతని ఆరోపణ చేశాడు. మల్లయ్య  కొంచెంలో ఉట్లమాను కొట్టేది చేజారిందని చెప్పుతున్న  సందర్భంలో పండయ్య బట్టల మీద మల్లయ్య బురద నీళు ్ళ జల్లాడు. ఉత్సవంలో మాదిగకులం వాడిని కలుపుకోడం బోయకు ఇష్టంలేదు. బురద బట్టలతో ఇంటి కొచ్చిన  కొడుకును చూసి దేవన్న, లాలెమ్మ గొప్పగా చెప్పుకున్నారు.

పండమేటి స్వామి మాదిగని తెలిసి మాదిగోళ్ళు గుడిలోకి వెళ్ళడానికి ప్రయత్నం చేశారు. దానిని రెడ్లు ఆపడానికి ముందుకొచ్చారు. పండయ్య మాదిగోల్లకు, మల్లయ్య బోయలకు నాయకత్వం వహించి ఐక్యంగా రెడ్లను ఎదుర్కొన్నారు. దానితో రెడ్లు తోక ముడిచారు. గుడిలోకి ప్రవేశించిన మాదిగలకు పూజారి భూమయ్య దగ్గర నుండి పూజలు చేయించి తీర్థ, ప్రసాదాలు ఇచ్చాడు. అంతా సద్దు మణిగాక పండయ్య గుడిలోపలకి వెళ్ళి పండమేటి స్వామి విగ్రహం ఎదురుగా నిలబడి " నువ్వు యోగివంట! దేవున్ని తెలుసుకున్నావంట, అసలు నువ్వే దేవుడంట! ఊరూ, పేరూ, కులమూ, గోత్రమూ అన్ని విడిచిపెట్టినావంట! నువ్వు జ్ఞానివా? లేక పిచ్చివానివా? పండమేటి స్వామి మాట్లాడలేదు. రాతి బొమ్మ అని నవ్వుకొని గుడిబైటికి వచ్చేసినాడు" (పు. 170) పండయ్య.

గుడి మాన్యం వేలం పాట వాయిదా వేయమని పండయ్య, మల్లయ్యలు కలెక్టర్‌కి అర్జీ రాశారు. మాదిగ, బోయ కులం వాళ్ళతో కలిసి కలెక్టర్‌కి అర్జీ ఇచ్చి వచ్చే లోపు భాస్కరచౌదరి పూజారి భూమయ్యను హత్య చేశాడు. మల్లయ్య ఊరికి రాకుండా అటునుండే కొండకు పోయి, రాడికల్స్‌లో చేరుతాడు. పండయ్య ఊర్లోకి వెళ్ళి ఎన్నికల సమయంలో భాస్కర చౌదరికి పోటీగా నామినేషన్ వేస్తాడు. మార్క్సిజంలో ఓనమాలు నేర్పించిన భౌతిక శాస్త్ర లెక్చరర్, మనోహర్ నాయుడు భాస్కర చౌదరి మీద పోటీ చేయవద్దని ఎంతో నిష్ఠూరమాడాడు. తండ్రి జీతగాళ్ళ దేవన్న "మన కెందుకు నాయనా ఈ రాజకీయాలు" (పు. 190) అని చెప్పి నామినేషన్ వెనక్కి తీసుకొమ్మనమని చెప్పి చూశాడు. తల్లి లాలెమ్మ "మనకెందుకు నాయనా ఈ కొట్లాటాలూ ఖూనీలు!" (పు. 191) అని చెప్పి చూసింది. అప్పుడు జీతగాళ్ళు పండయ్య వాళ్ళతో "కర్ణుడికి కిరీటం వచ్చినంక తప్ప అతని శక్తి సామర్థ్యాలు ప్రపంచానికి తెలిసి రాలేదు. ఈ సమాజంలో మన మాదిగోల్ల భవిష్యత్తు కూడా అంతే" (పు. 191) అని ప్రజాస్వామ్య వ్యవస్థ మీద నమ్మకం ఉంచడం అనేది అంబేద్కరిజ పంథా. ' రాజకీయాధికారం అన్ని తలుపులు తెరిచే తాళం'మని అంబేద్కరిజం చెబుతుంది. దానిని సాధించినప్పుడే మాదిగల అభివృద్ధి సాధ్యమని నవలాంతంలో పండయ్య నమ్మాడు. ఆ నమ్మకాన్ని నిజం చేసుకునేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు వెళ్ళడానికే నిర్ణయం తీసుకున్నాడు.

**3.3.3.7. వెంకటలక్ష్మి-దళిత స్త్రీ దుస్థితి:**

దేవన్న, లాలెమ్మల కుమార్తె, పండయ్య చెల్లెలు. పంచాయతీ సమితి ప్రాథమిక పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతుంది. కొనప్ప శాస్త్రి, కళ్ళతో ఉరిమితే చాలు సింహం నోట పడినట్లు భయపడి ఏడుస్తుంది. ఆమె తర్వాత వాళ్ళు, ఒక్కడు రెండోతరగతి, ఇంకొకడికి రెండు సంవత్సరాలు. వెంకటలక్ష్మి "నల్లగా, బొద్దుగా, అమాయకంగా ఉంటుంది. చెంపకు చేరడేసి కళ్ళు ఆ పాపవి ! ఆ పాప ఆలోచనలో పడితే అది ఆ పాప కళ్ళలో ప్రతిఫలిస్తుంది. ఆ పాప చాలా మెతక" (పు. 85). ఆ పిల్ల కులం, కుల స్వభావము అర్థం చేసుకోలేకపోయింది.

ఒకటో తరగతిలో ఉన్నప్పుడు ఒక ఘటన జరిగింది. అంతకు ముందు "నేను మాదిగను, నేను అంటరాని దాన్ని చెప్పులు కుట్టే వంశం మాది. చెమట వాసన కొట్టే బతుకు మాది. ఊరిబైట శ్మశానం, ఊరిబైటే మాఇళ్ళు, మేము తక్కువ వాళ్ళం, తలెత్తితే చాలు మొట్టికాయ వేస్తారు. మేం తుమ్మినా కష్టమే, చీదినా కష్టమే! మా బతుకునే తప్పుపడతారు. అనే తన కుల స్వస్వరూప జ్ఞానం ఆ ఒకటో తరగతి వెంకటలక్ష్మికి ఇంకా పూర్తిగా అలవడలేదు" (పు. 86)

ఒక రోజు రాజిరెడ్డి భార్య బొడ్రాయికి కన్నె పిల్లల్తో నీళ్ళు పోయించాలి ఆడపిల్లలను పంపించమంటే కోనప్ప శాస్త్రి పంపించాడు. వారితో వెంకటలక్ష్మి కూడా వెళ్ళి, బొడ్రాయిమీద నీళ్ళు పోసింది. అది చూసిన రెడ్డమ్మ ఎంత పనిచేశావే మాదిగ ముండా అని కొట్టింది. ఆ దెబ్బకు కింద పడిపోయిన రెడ్డమ్మ ఎందుకు కొడుతుందో ఆ పిల్లకు అర్థం కాక భయంతో

బ్యారుమంది. కార్తీకమాసంలో పండమేటి గ్రామంలో ఆడపిల్లలందరు చక్కగా ముస్తాబు అయి, గౌరమ్మలు అవుతారు. పాటలు పాడుతూ గ్రామంలో తిరుగుతుంటారు. అది చూసిన వెంకటలక్ష్మి "నేనూ గౌరమ్మ బిడ్డను అవుతాను" అంది. ఆ మాట వినిన మాదిగ పిల్లలు అయ్యో! తిక్కముండా! మనం మాదిగోళ్లమే... గౌరమ్మ బిడ్డలు కాకూడదే అని బోధించారు. అయిన వినలేదు. అమ్మ దగ్గరకు వెళ్ళి అదే మాట చెప్పింది. ఆమె అలా మనం కాకూడదని బుజ్జగించింది. కానీ వినలేదు. ఆమెకు కోపం వచ్చి "ఏం నువ్వు రెడ్లకు పుట్టినాననుకున్నావా? మాదిగోల్లకు పుట్టినావే" (పు. 89) అని నాలుగు దెబ్బలు వేసింది. అప్పటికి గానీ జీతగాళ్ళు వెంకటలక్ష్మికి మనషులంతా ఒక్కటి కాదనే భ్రాంతి తొలిగి పోలేదు.

వెంకటలక్ష్మికి దేవుడు అంటే అమితభక్తి మనుషులందరు ఒక్కటి కాదు. కానీ దేవళ్లందరు ఒకటేనంట! చిన్నప్పటి నుండి బయట నుండే దేవుడ్ని చూస్తుంది. గుళ్లో దేవుడు ఎలా ఉంటాడో తెలుసుకోవాలని కుతూహలంతో పెద్దకులం పిల్లలను గుళ్ళో పటాలు ఉంటాయా అని అడిగింది. వాళ్ళు ఆమె వైపు ఆశ్చర్యంగా చూస్తు గుళ్లో పటాలు ఉండవు, విగ్రహం ఉంటుందని చెప్పారు. విగ్రహం అంటే అని అడిగింది. వాళ్ళు ఆమె అమాయకత్వానికి చిరాకు పడి వెళ్ళిపోయారు. మరోసారి తమ్ముడ్ని చంకనేసుకొని గుడి దగ్గరకు వెళ్ళి ఆడుకునే పిల్లలను చూస్తుంది. అప్పుడే నడక నేర్చిన పసివాడు గుళ్ళోకి వెళ్ళాడు. గుళ్లోకి వెళ్ళిన పిల్లోడ్ని చూసి ఆడుకునే పిల్లలందరూ గుళ్లోకి మాదిగోళ్ళ పిల్లవాడు వచ్చాడని కాకి గోల చేశారు. పూజారి భూమయ్య పోనీంద్రా పసిపిల్లోడు! తెలీదు పాపం అన్నాడు. అదేసమయానికి అక్కడికి వచ్చిన భాస్కర చౌదరి ఎంతైన బాపనోల్లు బాపోల్లే! శూద్రులు పూజారులుగా ఉంటే ఇంతే జరుగుతుంది. మడీ మైలా పాటించకపోతే గుళ్లో విగ్రహంలో సత్యమేముంటుంది అన్నాడు. ఆ మాటలు విని అటుగా వచ్చిన పూజారి భూమయ్య భార్య తిలకమ్మ వెంకటలక్ష్మిని రెండు దెబ్బలు వేసింది ఆ పిల్ల ఏడ్చుకుంటూ తల్లికి చెప్పింది. ఆమె రోషంతో గుడి దగ్గరకు వెళ్ళి గొడవ పెట్టుకుంది. ఆమె వెనుకే వచ్చిన దేవన్నతో భూమయ్య తల పడ్డాడు. భూమయ్య, భాస్కర చౌదరి మాటలతో వేడెక్కి వున్నాడు. దేవన్న తలపై కట్టెతో కొట్టాడు.

ఈ నవలలో వెంకటలక్ష్మి పాత్ర ద్వారా పసిపిల్లలు కులవ్యవస్థ ద్వారా ఎలా కుల వివక్షత ఎదుర్కుంటున్నారో చిత్రీకరించారు. పిల్లలు మనస్సు వికాసం చెందే సమయంలో గ్రామాల్లో కుల కట్టు బాట్లు మానసిక, శారీరక ఎదుగుదలకి ఎలా ఆటంకంగా పరిణమించాయో వివరించారు. బొద్రాయి మీద నీళ్ళు పోసి నప్పుడు రాజారెడ్డి భార్య ఎందుకు తిడుతుందో ఎందుకు కొట్టిందో అర్థం కాక ఏమి చేయాలో తెలియక ఏడ్చింది. కుండలో నీళ్ళు తాను ఎందుకు తాగకూడదో కూడ అర్థమయ్యే వయస్సుకాదు. అందుకే ఆడపిల్లలతో పాటు తానెందుకు గౌరమ్మ వేషం వేయకూడదో తెలియదు. గుళ్లో విగ్రహం ఉంది అంటే విగ్రహం అంటే ఏమిటి అని ప్రశ్నించేంత అమాయకత్వం ఉన్న పాత్ర వెంకటలక్ష్మిది, దేవన్నకు ఉన్న సందేహాలకే జవాబులు తెలియవు. అడిగినా చెప్పేవారే లేరు. అలాంటిది వెంకటలక్ష్మి ప్రశ్నలకు జవాబు ఎవరు చెబుతారు.

**<u>3.3.3.8. వడ్డే విరుపాక్షి–లంపెన్ గుండాయిజం:</u>**

వడ్డే లోకప్ప, పాలమ్మల కొడుకు. గోనబావి గ్రామం ఆ ఊరంటే బావులు తవ్వడానికి ప్రసిద్ధి. వేదవతి నదికి ఎగువ భాగాన ఆ గ్రామం ఉంది. విరుపాక్షి సంవత్సర పిల్లోడుగా ఉన్నప్పుడు ఒక రెడ్డి ఇంట్లో బావి తవ్వడానికి ఒప్పుకున్నారు. రెడ్డి భార్య బావి తవ్వేటప్పుడు 'ఉక్కుకడ్డి మాదిరి' ఉన్న లోకప్పను చూసి మోహించి లోకప్ప కౌగిట్లో ఊటలై పొంగింది. ఇద్దరూ ఒక రాత్రి ఊరిడిచి వెళ్ళిపోయారు. పాలమ్మ నెత్తి నోరు కొట్టుకుంది. రెడ్డి పాలమ్మను చేరదీశాడు. విరూపాక్షికి బడి ఈడు రాగానే రెడ్డి పాలమ్మను విడిచిపెట్టాడు. తర్వాత ఇంకో

రెడ్డి ఆమెను ఉంచుకున్నాడు. వాడు విడిస్తే ఇంకొకడు తగులుకున్నాడు. పాలమ్మ మాత్రం ఏ రెడ్డి కోసం వెంపర్లాడలేదు. పాలమ్మకు డబ్బు లెక్కలు తెలియదు. అందుకే మగ దిక్కు కోసమే రెడ్ల మీద ఆధారపడింది. ఆమెను ఏ రెడ్డి మోసం చేయలేదు. ఆమె కూడా ఒక రెడ్డితో ఉండగా మరొకరి వంక చూసేది కాదు. పాలమ్మను చూస్తే ఎడారిలో పారేసిన మొలకెత్తే విత్తనం జ్ఞాపకమొస్తుంది.

విరూపాక్షి మొదట అమాయకంగా ఉండేవాడు. వయస్సు పెరిగే కొద్ది తన ఇంటి వాతావరణం, మరొక ఇంటికి ఉన్న తేడా స్పష్టంగా తెలియవచ్చింది.ఎనిదేళ్ళకు అదంతా అవమానంగా అన్పించి ఇంటికి వచ్చిన వాళ్ళు సిగరెట్లు తీసుకురమ్మన్న మీరే తెచ్చుకొండి అని వెళ్ళిపోయేవాడు. బడికి వెళ్ళడం మానివేసి ఉచ్చులు వేసి తొండలను పటుకొని వాటితో ఆడుకొని చంపివేసేవాడు. అప్పటినుండి విరూపాక్షికి తొండా బిక్కిలోడు అనే పేరు వచ్చింది. విరుపాక్షికి పదిహేను ఏండ్లకు చిన్న చిల్లర దొంగతనాలు అలవాటయ్యాయి. వచ్చిన సొమ్ముతో జల్సా చేసుకోని ఊరికి వచ్చేవాడు. అమ్మ పక్కన ఏ రెడ్డినో చూడగానే మళ్లీ రెడ్డి మీద కోపంతో, ద్వేషంతో ఊరు వదిలి తిరిగి రాలేదు.

విరూపాక్షి తోటల్లో కాపలాపనికి కుదిరాడు. యాజమానికి తనకు ఎప్పుడు కుదరదో అప్పుడు అక్కడ అందుబాటులో ఉన్న సామాన్లతో వెళ్ళి పోయేవాడు. విరూపాక్షి దొంగే కాని వ్యవసాయక దొంగతనాలు మాత్రమే చేసేవాడు. మాదిగ ముత్యాలు ఒక రోజు రాత్రి ఎవర్నో హత్య చేసి విరూపాక్షి కాపలా ఉన్న తోటకి వచ్చి, వాడికి పరిచయమయ్యారు. అప్పటి నుండి విరూపాక్షి జీవితం పూర్తిగా మారిపోయింది. ప్రక్కతోట కోమటిది. బీడు భూమిలో వ్యవసాయం చేసి బాగా నష్టపోయాడు. అందుకే ఆ శెట్టిని నట్టుశెట్టి అని పిలుస్తారు. ఆ తోటలో పని చేస్తున్న ముసలి జీతగాడ్ని మందు కొట్టే మిషన్ విరూపాక్షి అడగడానికి వెళ్ళాడు. ముసలాయన విరూపాక్షిని యోగ సమాచారాలు అడిగాడు. రవంత మందేసుకొని, ఈ పొద్దు నాకాడనే భోంచేయ్ అన్నాడు. సారాయి తాగిన తర్వాత ఇరువురు మాటల్లో పడ్డారు. ముసలాయన తనిది పెద్ద కథని, రెడ్డి భార్యను లేపుకు వచ్చి ఊర్లు పట్టుకొని తిరుగుతున్నానని చెప్పాడు. రెడ్డమ్మ మొదట్లో బాగుండేది. తర్వాత నా పాలిట శనిలా నువ్వెక్కడ దాపురించావురా అని శాపనార్థాలు పెట్టి నిమ్మలం లేకుండా చేసి, పోయిన సంవత్సరమే చనిపోయిందని చెప్పాడు. విరూపాక్షి నేను పాలమ్మ కొడుకునని ఆమెకు నీవు వెళ్ళిపోయిన తర్వాత రెడ్లే మిండగాల్లు అయ్యారని చెప్పాడు. లోకప్ప కొడుకును చూసి సంతోష పడ్డాడు. నేను నీతోనే ఉంటాను, ఈ ముసలి తనంలో నీవే దిక్కు అన్నాడు. అట్లే కాని అన్నాడు విరుపాక్షి. కోడి కూసే జామున లోకప్ప నిశ్చింతగా నిద్రపోయాడు. లేచి చూస్తే విరుపాక్షి పత్తాలేడు. గుడిసెలో ఉన్నదంతా ఊడ్చుకుపోయాడు. లోకప్ప 'తిననీ... తిననీ! నా సొత్తు నా కొడుకు కాకపోతే ఇంకెవరు తింటారని' అనుకున్నాడు. కొడుకును ఇంకోసారి కళ్లారా చూసుకోక పోతినే, చేతుల్తో మనసారా తడుముకోలేక పోతినేనని మా తప్పులు సెమించుకో తండ్రీ! అని కూలబడి ఏక్కిళ్ళు పట్టి ఏడ్చినాడు.

విరూపాక్షి తర్వాత మాదిగ ముత్యాలు గ్యాంగులో చేరాడు. ముత్యాన్ని పోలీసులు ఎన్‌కౌంటర్ చేసే సమయంలో విరూపాక్షి తప్పించుకున్నాడు. కమ్యూనిస్టు గోవిందు గ్యాంగ్‌లో చేరాడు. గోవిందు హత్యానంతరం విరూపాక్షిపై పోలీసులు మర్డర్ కేసులు బనాయించినారు. కమ్యూనిస్టు సానుభూతిపరుడు విజయ చంద్రారెడ్డి వాదనతో విరూపాక్షి శిక్ష నుండి గట్టెక్కించినాడు. ఆ క్రిమినల్ లాయర్ సూచనల ప్రకారం వీరప్పనాయుడు పంచన చేరాడు. వీరప్ప నాయుడు రెడ్లకి వ్యతిరేకం. నాయుడికి రాడికల్స్ మద్దతు. రెడ్ల ప్రాబల్యం ఉన్న పండమేటిలో వీరప్ప నాయుడి వర్గాన్ని తయారు చేసేందుకు విరూపాక్షి ఆ గ్రామం వచ్చాడు.

రాజా రెడ్డి దగ్గరకు గుడిమాన్యం వేలం గురించి వెళ్ళిన పూజారి కుటుంబాలను తిట్టి పంపించాడు. ఆ విషయం తెలిసి విరూపాక్షి  భూమయ్యతో వీరప్ప నాయుడు వర్గంలో చేరమని అర్ధరాత్రి గుడివద్దకు వెళ్ళి అడిగాడు. భూమయ్య చూద్దాంలే అన్నాడు. ఊర్లో వడ్డే కుటుంబాలకి డబ్బులు ఇచ్చి తన వైపుకు తిప్పుకున్నాడు. విరూపాక్షి వీరప్పనాయుడి ముఖ్య అనుచరుడిగా ఉన్నాడు. వీరప్ప నాయుడి హత్యానంతరం అతని కొడుకు గరుడశేఖరనాయుడికి అనుచరుడు అయ్యాడు. పండమేటి స్వామి భూముల వేలం ఆపడానికి కలెక్టర్‌కి అర్జీ పెట్టించాడని పూజారి భూమయ్యను లింకులచౌదరి, విరూపాక్షిలు కలిసి దాడి చేసి చంపుతారు. ఇలా ఈ నవలలో విరూపాక్షి రెడ్ల మీద కక్షతో దొంగగా మారి, తర్వాత కిరాయి హంతకుడిగా మారతాడు. మనిషి ప్రాణాన్ని తొండ ప్రాణంతో సమానంగా చూసేవాడిగా చిత్రీకరించబడ్డాడు. ఈ నవలలో విరూపాక్షి బలాన్ని అగ్రకులాలు తమ రాజకీయ ఎదుగుదలకి ఉపయోగించుకున్న తీరు రచయిత చిత్రీకరించారు.

**3. 3. 3. 9. రాజారెడ్డి – ఫ్యాక్షన్ రాజకీయాలు:**

పండమేటి గ్రామానికి సామంతరాజు మాదిరి రాజారెడ్డికి యాభై ఐదేండ్లు పొట్టిగా, లావుగా, చామన ఛాయ రంగుతో ఉంటాడు. వెంట్రుకలు నెరిసిపోయి ఉంటాయి. అతని పెదాలు ఎప్పుడూ నవ్వుతున్నట్లే ఉంటాయి. కానీ ఎదుటి మనిషిని ఎగతాళి చేసినట్లే ఉంటుందా నవ్వు. అతనికి నూరు ఎకరాల చేనుంది. ముప్పై ఎకరాల తోటుంది. రెండుట్రాక్టర్లు ఉన్నాయి. కొండారెడ్డి నడిపే సారాయి వ్యాపారంలో పదిపైసల భాగముంది. రాజారెడ్డి భూమే అతని పొగరు. జనాన్ని బెదిరించి చెప్పు చేతల్లో పెట్టుకునేది అతనికి కులతత్వమే నేర్పింది. అన్ని కులాల మీద ఆధిపత్యం చూపించడానికి అనువైన వృత్తి వ్యవసాయం. ఆ వృత్తి  అతనికి తరతరాలుగా వస్తుంది. రాజారెడ్డి “తనకున్న నూరెకరాల భూమిని కాదని, ఇంకో నూటారవై ఎకరాల గుడి మాన్యాన్ని సొంతం చేసుకున్నాడు.... ఆ నూట ఇరువై ఎకరాలను కట్టుగుత్తకు ఇచ్చినాడు... ఎవరైతే తన అడుగులకు మడుగులొత్తుతారో ఆ మధ్య తరగతి రైతులకూ, చెంచాగిరీ చేసే కులాలకూ!” (పు. 79) ఇచ్చాడు.  వాళ్ళే వేలం పాట డబ్బులు కట్టుకోవాలి. దాంతో పాటు సంవత్సరానికి అరవై వేలు రాజారెడ్డికి కట్టాలి.

గుడి మాన్యం వేలం పాట గురించి మాట్లాడటానికి భూమయ్యతో పూజారి కుటుంబాల వాళ్ళు రాజారెడ్డి దగ్గరకు వచ్చారు. ఈ సంవత్సరం పాటు మాకు వదిలివేయమని దీనంగా ప్రాధేయ పడ్డారు. కష్టపడి సంపాదించుకున్న వాళ్ళ భూములు చూసి అక్కసు వెళ్ళబోసుకుంటారని కింది కులాల బుద్ధి యాడికి పోతుందిరా పొండిరా ఇక్కడ నుండి అని చీమిడి చీదేసినట్లు మాట్లాడి పంపించాడు. ఆ విషయం తెలిసి గుడిమాన్యం సాగు చేసుకుంటున్న గొర్ల తిరుపలు  రాజిరెడ్డి ఇంటికి వచ్చాడు. గుడి మాన్యం గురించి రాజారెడ్డిని అడిగితే “ఉత్త తిక్క కురువోనివిరా నువ్వు !.... నాకు ఇంత విశ్వాసంగా ఉండే వాళ్లను కాదని ఇంకొకరికి గుడిమాన్యం కోరు కిస్తానా” (పు. 83) అని మందలించాడు. పండమేటి గ్రామంలో రాజారెడ్డికి వార్తలు మోసే వ్యక్తుల్లో ప్రథముడు లింకుల చౌదరి గుడిలోకి మాదిగ దేవన్న కొడుకు (పసివాడు) వెళ్ళాడనే  విషయం పై గొడవ జరిగి దేవన్న తల భూమయ్య పగల కొట్టిన విషయం రాజారెడ్డికి చేరవేశాడు. “ఎవర్రా అంత, బరితెగించిన మాదిగోళ్ళు.... ఏం చేస్తున్నార్రా మీరంతా,... ఏదో చిన్న పిల్లోల్లు.... ఈ పొద్దు పిల్లోల్లు వస్తారు. రేపు పెద్దోల్లు వస్తారు. ఊరి కట్టడి ఏం కావల్ల” (పు. 98) అని మండిపడ్డాడు. దేవన్న భూమయ్య కొట్టుకునేలా చేసానని లింకుల చౌదరి అంటే “మన చేతులకు మట్టి అంటుకోకుండా చేయాల్సిన పని చేసినావు. అదేరా అప్పయ్య రాజకీయం.... గుడి మైల పడుతుంటే మల్ల చూస్తూ ఊరుకుంటామా...” అని లింకుల చౌదరి అంటే “ మాదిగోళ్ళు గుళ్లోకి వస్తే మైల పడేదేందిరా ఎర్రి నాగన్న!...

మైలా గియ్‌లా అన్నీ బాపనోల్లకి మనకేముంది.... గుడి మైల పడేది అట్లుండనీ! ఆ మాదిగోల్లు గుల్లోకి వస్తే మనకెంత నష్టం? ... రేపు మనిళ్లలోకి వస్తామంటారు. మన ఇళ్లలోకి రానిస్తే మన పక్కన కూర్చుంటామంటారు. మనతో సరిసమానంగా కూర్చునేవాడు మనకు భయపడతాడా? మనకు తల ఒగ్గుతాడా? మనం కాల్తో చూపించిన పని చేతుల్తో చేస్తాడా? వాడు మన కింద అణగిమణిగి పడుండి పని చెయ్యకపోతే ఈ నూర్లు నూర్లు ఎకరాల వ్యవసాయాన్ని మనం తూగించుకోగలమా? అదీ, అదేరా నా బాధ.. ఊర్లో కట్టడి ఉండల్ల, కట్టడి ఉన్నంత వరకే ఊరిలో మన కిరీటాలు నిలిచేది. అది రవంతా తప్పితే ఇంకేముందీ.. ఈపొద్దు గుళ్లోకి అడుగు పెట్టిన మాదిగోడు రేపు పొద్దున సర్పంచు కూడా అవుతానంటాడు. వానికి ఉచ్చనీచాలు ఇంకేం తెలుస్తాయి" (పు. 99) అని తన రాజకీయాల వెనుక ఉన్న అగ్రకులతత్వాన్ని వివరిస్తాడు.

రాజారెడ్డి దగ్గర ఎంత నమ్మినబంటుగా పని చేసినా తన అక్కర వాళ్ళకే గానీ వాళ్ళ అక్కర తనకేం లేదు అన్నట్లుగా ఉంటాడు. తనను నమ్ముకున్న వాళ్ళు ఆర్థిక పరిస్థితి మెరుగు పడేలాగ సహాయం చేయడు. తనను నమ్ముకుని బతికేలాగ మాత్రమే సహాయం చేస్తాడు. రాజారెడ్డి కొండారెడ్డి అండతో రాజకీయాలు చేస్తున్నాడు. కొండారెడ్డి మరణంతో రాజారెడ్డి పీడ విరగడై పోయిందని బోయలు పండుగ చేసుకున్నారు. దాంతో బోయల మీద రాజారెడ్డి దాడి చేయించాడు. అతడికి రెడ్లకి మర్యాద హెచ్చింది. రెడ్ల వీధిలో సైకిల్ తొక్కుతున్నాడని రెడ్ల యువకులు పండయ్యను తుక్కుతుక్కుగా కొట్టారు. అది తెలిసిన రాజిరెడ్డి యువకుల్ని పిలిచి "ఒరే పనికి మాలిన నా కొడకల్లారా! ఏం చేయాలన్నా ప్రతిదానికీ టైమ్ ఉంటుంది. ఆ టైమ్ తప్పించి చేస్తే ఏదైనా బెడిసికొడుతుంది. ఇప్పుడు చూడండ్రా! మాదిగోల్లూ, బోయోల్లూ ఒకటైనారు. గుడ్డెద్దు చేన్లో పడినట్లు పోవడం కాదురా! ఆ పక్కా ఈ పక్కా చూసుకొని పోవల్ల, రాజకీయం తెలియదురా మీకు! అంతా పాడు చేసినారు. "పొండిలే పొండి! ఇంకెప్పుడూ నాకు తెలియకుండా ఇట్లాంటివి చేయొద్దండి మొరటు నా కొడకల్లారా!" (పు. 144)అని హెచ్చరించి పంపేశాడు. గ్రామంలో పరిస్థితులు చేజారనీయని రాజారెడ్డి గంగుల రెడ్డి వద్దకు వెళ్ళాడు. గంగుల రెడ్డి నవ్వి మనం ప్రజలను ఓట్లు వేయనిస్తే కదా ఓడిపోయేది అని అభయమిచ్చాడు. ఈ లోపు గరుడశేఖరనాయుడు పోలీసులకు లొంగిపోయి, తెలుగుదేశం పార్టీలో చేరాడు. దాంతో లింకులచౌదరి రాజారెడ్డిలో అవసరం తీరిపోయిందని తెలుగుదేశం పార్టీలో చేరిపోయాడు. ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీకి ఓట్లు ఎక్కువ పడుతున్నాయి. ఆ వార్త తెలిసినప్పటి నుండి రాజారెడ్డి ఒళ్ళు కంపరమెత్తింది. ఈ రోజు చేయి దాటిన ఓట్లు రేపు సర్పంచ్ ఎన్నికల్లో మాత్రం తిరిగి వస్తాయని నమ్మకం ఏముంది. రాజారెడ్డి రిగ్గింగ్ చేయడానికి పది మందితో పోలింగ్ బూత్‌లోకి దూసుకువెళ్ళాడు. విరూపాక్షి రాజారెడ్డిని అడ్డుకున్నాడు. రాజారెడ్డి సైగతో అనుచరులు బ్యాలెట్ బాక్స్ ఎత్తుకొని పరుగెత్తారు. "గుంపులో గోవింద అన్నట్లు రాజారెడ్డిని వేట కొడవలితో నరికిపారేసినాడు. ఆ వడ్డే విరుపాక్షి" (పు. 156) ఇలా రాజారెడ్డి వడ్డే విరూపాక్షి చేతిలో దారుణంగా హతమార్చబడ్డాడు. తమ రాజకీయ ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కోసం రాజారెడ్డి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. మరొక అగ్రకుల రాజకీయ భవిష్యత్తు వడ్డే విరూపాక్షి లాంటి బహుజనులను వాడుకోవడంకూడ రాజకీయమేనని రచయిత తెలియజేశారు.

### 3.3.3.10. కొండారెడ్డి-హింసావాదం:

కడుపునిండితే చాలు అనుకునే కులాలు కొన్ని. కానీ కొన్ని కులాలు అలా బతకలేవు. తాము మనుషుల్లో పుట్టినా, మనుషుల మధ్య బతకాలనుకోవు. మనుషుల మీద స్వారీ చేస్తూ మాత్రమే బతకాలనుకుంటాయి. అట్లాంటి కులం కొండారెడ్డి కులం. యాభై ఏండ్ల కిందటి

మాట! కొండారెడ్డి వంశం వాళ్ళు చానా సామాన్య కుటుంబీకులు. కొండారెడ్డి పెద్దనాన్న తిమ్మారెడ్డి క్రైస్తవమతంలో చేరి థామస్‌రెడ్డి అయ్యాడు. ఇంగ్లాండులోని స్పాన్సర్లనుండి వేలకు వేలు డబ్బులు వచ్చాయి. ఆ డబ్బులతో సీమ పందులు పెంచి, తన ఆర్థిక స్థాయిని పదింతలు పెంచుకున్నాడు. తర్వాత ప్రైవేట్ కళాశాలలు, బాలికల అనాధశరణాలయాలు పెట్టాడు. విద్యను వ్యాపార వస్తువును చేసి బాగా సంపాదించాడు.

థామస్ రెడ్డి తమ్ముడి కొడుకు కొండారెడ్డి, థామస్‌రెడ్డి రాజకీయాల్లో చేరి మంత్రి స్థాయికి ఎదిగి మంత్రి కాకుండానే చనిపోయాడు. సంతానం లేని థామస్ రెడ్డి తమ్ముడి కొడుకు కొండారెడ్డికి వారసత్వం వచ్చింది. రాజకీయాల్లో వీరప్ప నాయుడు కొండారెడ్డి శత్రువు తెలంగాణ నుంచి రాడికల్స్ చింతర్ల పల్లి గ్రామం చుట్టు ప్రక్కల కొండల్లోకి వచ్చారు. రెడ్లు ముందునుండీ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఆ పార్టీ రాడికల్స్‌కు ప్రథమ శత్రువు. అందుకు కొండారెడ్డి ప్రభుత్వం దృష్టిలో పడ్డాడు. దాంతో కొండారెడ్డి కొండలా ఎదిగిపోయాడు. రాడికల్స్‌ను బహిరంగంగా ఉరితీయించాడు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా కొండారెడ్డి చేతిల్లోకి వెళ్ళిపోయింది. సెటిల్ మెంట్లు కూడా మొదలు పెట్టాడు. ప్రభుత్వం నిరుద్యోగులకు సబ్సిడి మీద లారీలు ఇస్తే బినామీ పేర్లతో డెబ్బై లారీలను కొండారెడ్డి స్వంతం చేసుకున్నాడు. అతడు ప్రైవేటు సైన్యానికి రోజుకు వేలల్లో ఖర్చు అవుతుంది. కొండారెడ్డి గ్రూపులు గ్రామ గ్రామానికి మహమ్మారిలా విస్తరించాయి.

కొండారెడ్డికి వ్యతిరేకంగా రాడికల్స్ మీద వీరప్ప నాయుడ్ని ఎంపిక చేసుకున్నారు. అతడు బి.డి.వో తో మాట్లాడి (తన గ్రూపుకి) బీదరైతులందరికి విత్తనాలు, యూరియా మూటలు ఇప్పించాడు. కొండారెడ్డికి ఒక ఫిలాసఫి ఉంది. “పలానా వాడు మనల్ని చంపే అవకాశం ఉందని తెలిసిందనుకో. వాడు మనల్ని చంపేదాక ఎదురు చూస్తుంటామా? ఆ చంపేదేదో మొట్ట మొదట మనమే చేసి పారేస్తాం” (పు. 121) అని అంటాడు. కాబట్టి కొండారెడ్డీ లాంటి వాళ్ళే ప్రభుత్వ కళ్యాణం కోసం హింస చేస్తారు. కాబట్టి కొండారెడ్డికి ప్రాణభయం ఉంటుంది. అందుకే రెండు సంవత్సరాలలో తొంభై కార్లు మార్చాడు. తన దగ్గరకు వచ్చే అందర్నీ సోదా చేయిస్తుంటాడు. కుడి ఎడమల దాల్‌కత్తులు మెరయగ అన్నట్లు రెండు ప్రక్కల గన్‌మెన్‌లో స్టేట్‌ఫైనాన్స్ కార్పోరేషన్ ఆఫీసుకు కొండారెడ్డి వెళ్ళాడు. ఎక్కడ భయముండునో అక్కడ గౌరవముండును. అన్నట్లుగా బ్యాంక్ అధికారి ట్రాక్టర్ లోనులకు నోటీసులు పంపినారా అని అడిగితే ఇక పంపం లెండిసార్ అని జవాబు ఇచ్చాడు.

కొండారెడ్డి వీరప్పనాయుడి ఎదుగుదల చూసి ఉరవకొండలో రామన్న చౌదరి కొడుకు పెళ్ళిలో హత్య చేయించాడు. వీరప్పనాయుడు కొడుకు గరుడశేఖర నాయుడు అండర్ గ్రౌండ్‌కి వెళ్ళి రాడికల్స్‌లో చేరిపోయాడు. రాడికల్స్‌ని పట్టుకొని అరెస్ట్ చేయకుండా ఎన్‌కౌంటర్లు మొదలుపెట్టారు. ఒక రోజు చింతర్లపల్లికి వెళ్తున్న కొండారెడ్డి జీపు ఒక్క రిమోటు కంట్రోల్ నొక్కుడుకు పేలిపోయి తునాతునకలైపోయింది. కొండారెడ్డి చనిపోయాడు. “ఇంక కొండారెడ్డి బాధలేదు. కొండారెడ్డి అనుచరుల బాధ లేదు. కొండారెడ్డి మనుషులు వసూళ్ళకు రారు. తమ భూముల్ని వాళ్ళ భూముల్లో కలుపుకోరు. తమమీద లేనిపోని కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పరు. తమ ఆడపిల్లల చేయి పట్టుకోరు. ఇక్కడ మాట అక్కడా, అక్కడి మాట ఇక్కడ చెప్పరు. ఎంతో విశ్వాసంతో బతికే తమ ఇరుగు పొరుగు మధ్య పుల్లలు పెట్టరు. రాజకీయాలు నడపరు. ఇంక గ్రామంలో కొట్లాటలు ఉండవు. ఖూనీలు ఉండవు. అందరూ అన్నదమ్ముల మాదిరి ప్రశాంతంగా బతకొచ్చు” (పు. 139-140) అని అంతా ఆనందపడిపోయారు ఆ ప్రాంత ప్రజలు. అంటే ఎంతగా కొండారెడ్డి ప్రజలను బాధపెట్టినారో మనం అర్థం చేసుకోవచ్చు.

**3.3.3.11. వీరప్పనాయుడు-కమ్మ ఫ్యాక్షనిజం:**

వీరప్ప నాయుడు 'మర్రిమాకులపల్లి'లో ఒక చిన్న భూస్వామి. కాంగ్రెస్ ప్రభుత్వం రాడికల్స్‌ని ఏరిపారేయడానికి కొండారెడ్డిని చేరదీస్తే తమ ఉనికికై రాడికల్స్ వీరప్ప నాయుడ్ని చేరదీశారు. విప్లవకారులు భూస్వాముల వ్యతిరేకులు, కానీ వీరప్పనాయుడు విప్లవం వర్ధిల్లాలి అని అరిచినవాడే. కానీ దున్నేవాడిదే భూమి అని ఎప్పుడు అరువలేదు. వీరప్ప నాయుడి వెనుక కమ్మకమ్యూనిస్టులైన పెద్ద భూస్వాములు గ్రూపు కట్టారు. కొండారెడ్డికి వీరప్పనాయుడికి మధ్య ఉండేది నిజానికి కుల శత్రుత్వమే అందుకే విరూపాక్షి లాంటి వాళ్ళను చేరదీసి ఊరుల్లో గ్రూపులు తయారు చేస్తుంటాడు. బీద బిక్కి రైతులందరికి అంటే తన గ్రూపు వాళ్ళకి విత్తనాలు, యూరియా మూటలు బి.డి.వో.తో వాదనకు దిగి నాయుడు ఇప్పించాడు. ఎప్పుడు ఎవరితో ఒకరితో వాదనకు దిగేది, తగువు పెట్టుకునేదీ వాళ్ళ వంశ చరిత్ర. కొండారెడ్డి మాదిరి డబ్బుల బలం లేదు. ప్రజా బలముంది. ఆ ప్రజా బలాన్ని డబ్బుగా మార్చుకునే విద్య వీరప్పనాయుడికి కొంచెం తెలుసు. వీరప్ప నాయుడి కొడుకు గరుడ శేఖర నాయుడు బెంగుళూరులో డాక్టర్ కోర్సు చదువుతున్నాడు. ఫీజులకు డబ్బు అవసరమై రామన్న చౌదరి అనే కాంట్రాక్టర్‌కు డబ్బులు పంపించమని విరూపాక్షితో కబురు చేశాడు. అలా చీటి పంపించినప్పుడల్లా అతను డబ్బులు పంపుతుంటాడు. వీరప్పనాయుడు ఇలా వసులు చేసి నప్పటికి రైతు నాయకుడిగా ఎదుగుతుంటాడు. పల్లెలో పట్టు సంపాదించుకొని నాయుడు తనకు పక్కలో బల్లెంలా మారడం కొండారెడ్డికి నచ్చడం లేదు. అందుకే వీరప్పనాయుడ్ని హత్య చేయడానికి వ్యూహం పన్నుతాడు. కాంట్రాక్టర్ రామన్న చౌదరి కొడుకు పెండ్లికి వచ్చిన వీరప్ప నాయుడ్ని పెళ్ళి పందిరిలోనే దారుణంగా హతమార్పించాడు. కొండారెడ్డి అలా ఈ నవలలో వీరప్ప నాయుడి కథ ముగించింది.

**3.3.3.12. గరుడశేఖరనాయుడు– కమ్యూనిస్టు ఫ్యాక్షనిజం:**

వీరప్ప నాయుడి కొడుకు బెంగుళూరులో డాక్టర్ కోర్సు చేస్తున్నాడు. తండ్రి హత్య వార్త విని "ఏమి ఆలోచించినాడంటే – మా నాయనను చంపిన కొండారెడ్డి నన్ను మాత్రం బతుకనిస్తాడని ఏముంది? కాబట్టి నేను చచ్చేలోగ వాన్ని చంపేయల్ల. ఆ తర్వాత నేను బతుకుతానో, చస్తానో కాలం చెప్తుంది అని ఆలోచించినాడు చదువుతున్న డాక్టర్ కోర్సును మధ్యలోనే విడిచి పెట్టి అండర్‌గ్రౌండ్" (పు. 137)కు వెళ్ళి పోయాడు. "కొండారెడ్డి జీపు ఒక్క రిమోటు కంట్రోలు నొక్కుడుకు పేలిపోయి తునాతునకలైపోయింది" (పు. 139). రాడికల్స్ సహాయంతో తన కక్ష తీర్చుకున్నాడు. గరుడ శేఖరనాయుడు డబ్బు వసూలు చేయడం మొదలు పెట్టాడు. "ఎలక్షన్లకు నిలబడే రాజకీయవ్యవస్థకే కాదు కావల్సింది డబ్బు.... ఆ డబ్బు లేకపోతే సాయుధ పోరాటాలు కూడా జరుగవు" (పు. 153) అని తెలియజేశాడు.

ఒక రోజు గరుడశేఖరనాయుడు తుపాకితో వచ్చి లొంగిపోయాడు. తనను ఎన్‌కౌంటర్ చేయకుండా పై అధికారులకు డబ్బులు వెదజల్లాడు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే టికెట్ గ్యారంటీ తీసుకునే జనజీవన స్రవంతిలో కలిసిపోయాడు. దాంతో కమ్మ కమ్యూనిస్టులందరూ ఆ పార్టీలో చేరారు. దాంతో గంగుల రెడ్డికి గొంతులో పచ్చివెలక్కాయ పడింది. రిగ్గింగుకు అవకాశం లేకుండా పల్లెలో నాయుడికి గ్రూపులున్నాయి అవి రాడికల్స్‌వి. పండమేటిలో లింకుల చౌదరి రాజారెడ్డితో అవసరం తీరి భవిష్యత్తును తెలుగుదేశం పార్టీలో వెతుక్కుంటూ వెళ్ళాడు. పండమేటిలో ఎన్నికల సమయంలో రిగ్గింగ్ చేయడానికి వచ్చిన రాజారెడ్డిని విరూపాక్షితో హత్యచేయించాడు. ఎన్నికల్లో గరుడశేఖరనాయుడు గెలిచాడు. మంత్రి అయ్యాడు. అనుచరులు ఎమ్మెల్యేలు అయ్యారు. వాళ్ళను తన గుప్పిట్లో పెట్టుకున్నాడు. ఏ పని టెండరు అయిన తనకు, తనవాళ్ళకే. వేరేవారు పోటీ పడటానికి లేదు. ఇన్నేండ్లూ రెడ్లు అనుభవించారు కదా! ఇప్పుడు తామే అంతా అనుభవించాలి.మున్సిపాలిటీలు భూమి వేలం వేస్తే పాడడానికి

వచ్చిన వారిని బెదిరించి తామే పాడుకుంటారు. తర్వాత వాటిని తిరిగి ప్రజలకు అమ్ముకుంటారు. ఆ విధంగా గరుడశేఖర నాయుడు బాగా బలిసిపోయాడు.

అయితే ఇలా కోట్లు గడించిన నాయుడికి రూపాయి మీద మక్కువ లేదంట. ఆ డబ్బు అంతా ఏదో విప్లవ పార్టీకి మోస్తున్నాడని గుసగుసలు వినిపిస్తాయి. పండమేటి స్వామి గుడిమాన్యం వేలం పాడుకుంటానని నాయుడు దగ్గరకు వెళ్ళి లింకుల చౌదరి ఒప్పించుకొని వచ్చాడు. గొర్ల తిరుపాలుకు, వడ్డే కులంలో నలుగురికి భూమి కౌలుకిస్తానని ఆశ చూపి వారిని ఒప్పించాడు. అడ్డం తిరిగిన బోయ కులం వారిని భయపెట్టి ఒప్పించేందుకు వెళ్ళాడు. కానీ బోయలు, మాదిగలు కలిసి గుడి మాన్యం వేలం  పాట వాయిదా వేయమని కలెక్టర్‌కి అర్జీ పెట్టారు. దాంతో పూజారి భూమయ్యని గుడిమాన్యంలోనే వేటకొడవళ్ళతో దారుణంగా తన అనుచరులతో హతమార్చాడు. తర్వాత తాను చేసే ధర్మయుద్ధంలో భూమయ్యలాంటి అమాయకులు చనిపోతుంటారని అవన్ని పట్టించుకుంటే రాజకీయాలు లేవని, లోక కళ్యాణం ఉండదని చెబుతాడు. ఆ హత్య అనంతరం పండమేటి గ్రామంలో పూజారి భూమయ్య తమ్ముడు రాడికల్స్‌లో మరొక వర్గంలో చేరతాడు. భూమిలేనివారికి గుడి మాన్యం దక్కేలా చూడాలని కలెక్టర్ అనుకుంటాడు. కానీ లింకుల చౌదరి, గరుడశేఖరనాయుడితో ఆ ప్రయత్నాన్ని ఆపిస్తాడు. సర్పంచ్ ఎన్నికల్లో లింకుల చౌదరికి పోటీగా ఎవరూ నామినేషన్ వేయడానికి వీల్లేదని గరుడ శేఖర నాయుడు తన మనుషుల్తో పండమేటి గ్రామస్తులకు చెప్పిస్తాడు. కానీ లింకుల చౌదరికి పోటీగా జీతగాళ్ళ మాదిగ పండయ్య పూజారి మల్లయ్య మద్దతుతో నామినేషన్ వేస్తాడు.

ఈ నవలలో గరుడ శేఖర నాయుడు ప్రాణభయంతో చదువు మధ్యలో ఆపి రాడికల్స్‌లో చేరాడు. తన కక్ష తీర్చుకున్నాడు. తర్వాత రాజకీయాల్లోకి వచ్చి యిష్టానుసారంగా అక్రమంగా సంపాదించుకున్నాడు. అడమొచ్చిన అమాయకులను హతమార్చాడు. కానీ కింది కులంలో చదువుకున్న ఇద్దరు యువకులు సాహిత్యం చదువుకొని, సమాజం పట్ల సరైన దృక్పథంతో ఉండి, మార్క్సిజాన్ని అర్థం చేసుకున్నారు. ఆ క్రమంలో తమకు జరిగిన అన్యాయాలను ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. ఏం జరుగుతుందో కాలమే నిర్ణయించాలని రచయిత చెప్పారు.

**3.3.3.13. భాస్కర చౌదరి–భౌతిక వాదం:**

అందరు లింకుల చౌదరి అని పిలుస్తారు. ‘పేరుకు బీదోడు అయిన  రాజకీయాలకు బీదోడు కాడు. అతడు రాజకీయాల్లో నాయకులందరితో లింకులు పెట్టుకుంటాడు. ముఖ్యమంత్రితో కూడా పరిచయం ఉంటుంది. కమ్మవాళ్ళ దగ్గర తన కులాన్ని వాడుకుంటాడు. రెడ్డు దగ్గర కొండారెడ్డి పేరు చెప్పి పనిచేయించుకుంటాడు. కర్ర విరగకుండా, పాము చావకుండా మాట్లాడి వ్యవహారం చక్కదిద్దుతాడు. భాస్కరచౌదరి ఏమి మాట్లాడినా, ఏమి చేసినా దానికొక లింకు ఉంటుంది. ఎవర్నీ దూరం చేసుకోడు. అలాగని ఎవర్నీ దగ్గరకు రానివ్వడు, రాజారెడ్డి గ్రూపులో పండమేటిలో నాయకుడిలా తిరుగుతుంటాడు. రాజారెడ్డికి కోపమొస్తే ఒరే లింకులోడా!’ అని తిడుతుంటాడు.

గుడిలోకి మాదిగ దేవన్న పిల్లోడు వెళ్ళాడని తెలిసి ఇరుకుటుంబాల మధ్య గొడవపెట్టి తలలు పగలకొట్టిస్తాడు. ఆ విషయం రాజారెడ్డికి చేరవేస్తాడు. అతడికి విషయం చెప్పి రెడ్డి డబ్బు సహాయం అడుగుతాడు. రాజారెడ్డి పేరు చెప్పుకొని ఊర్లో తిరుగుతూంటాడు. “ చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకునే బాపతు... ఆర్థికంగా ఎంత  అట్టడుగు స్థాయిలో ఉన్నప్పటికి అట్టడుగు వర్గాలలో కలవరు పైగా తమ అగ్రకులం పేరు చెప్పుకునో, తమ గ్రూపు రాజకీయనాయకుణ్ణి చూసుకొనో వీళ్ళు మీసాలు దువ్వుకుంటారు” (పు. 99) అని లింకుల చౌదరి పాత్రల లాంటి వ్యక్తుల వ్యక్తిత్వం తెలుస్తుంది.

భాస్కర్‌చౌదరి డిగ్రీ పూర్తి చేసి, రిజర్వేషన్‌లని తిట్టుకుంటూ ఇంటి దగ్గరే ఉన్నాడు. తమ కొడుకు ఎంతో ప్రయోజకుడని చౌదరి తల్లిదండ్రులకు బాగా నమ్మకం. రాజారెడ్డికి రాజకీయంగా నమ్మిన బంటు, లింకుల చౌదరికి ప్రస్తుతం ఆస్తిపాస్తులు లేకపోయినా రాజకీయాల్లో రాణించాలనే కోరిక. నేడు లింకుల చౌదరి పాలు అమ్ముకొని జీవించే బీద కుటుంబమైనా ఒకప్పుడు వాళ్ళది గొప్ప భూస్వామ్య కుటుంబమే భూమిని నిలబెట్టుకునే చాతుర్యం అతని వంశీకుల్లో లోపించింది. బ్రిటిష్ హయాంలో గింజలు ఉండేవి. కానీ శిస్తు కట్టడానికి డబ్బులేక భూములు అమ్ముకున్నారు. అలా భూమి తరిగిపోయింది. కరువులో ఆడవాళ్ళు ఒక్కళ్లకు తెలియకుండా మరొకరు దాతృత్వం చూపించారు. మిగిలిన భూమి ల్యాండ్ సీలింగ్‌లో దగ్గరి బంధువులు మోసం చేశారు. చివరకు నాలుగు ఎకరాలు మిగిలాయి. "ఆర్థికంగా ఒక స్థాయికి వచ్చిన తరువాత ఆస్థాయిని కాపాడుకోవడానికి కొంచెం క్రౌర్యమూ, కొంచెం రాజకీయపు అండా తప్పనిసరి! ఈ లక్షణాలను విస్మరించడం భాస్కర చౌదరి భూస్వామ్యపు కుటుంబం పతనం కావడానికి కారణం అయ్యింది. తన తాతల, ముత్తాతల లక్షణాలు ఎలా ఉన్నా లింకుల చౌదరికి మాత్రం బతుకనేర్చిన లక్షణాలు బాగా వంటపట్టాయి. డబ్బుంటే హైదరాబాద్ లెవల్లో చక్రం తిప్పేవాడే. చివరికి కులమనే ఆయుధంతో తిప్పలు పడుతున్నాడు.

బానుకోటలో చెల్లెలికి సంబంధం వద్దన్నాడు. తల్లితో బానుకోటలో అందరూ రాడికల్సే అని కబీర్ అనే దూదేకుల సాహేబ్‌తో వెళ్ళినపుడు తెలిసిందని చెప్పాడు. రాడికల్స్‌లో చేరడానికి మన వాళ్ళకేం కర్మరా అని తండ్రి అన్నాడు. "నీకు తెలీదేలే! రాడికల్స్‌లో కూడా మన కమ్మోల్లు ఉండల్ల, మనకు ఎప్పుడు ఎవరితో అవసరం పడుతుందో తెలియదు కదా! అదే రాజకీయం" (పు. 110) అని నవ్వుతాడు. గరుడ శేఖరనాయుడు తెలుగుదేశం పార్టీలో చేరాకా రాజిరెడ్డితో అవసరం తీరిపోయిందనిపించింది. కాంగ్రెస్ కంటే తెలుగుదేశం పార్టీలోనే తనకు భవిష్యత్తు ఉందని నిర్ధారణ అయిపోయింది. వడ్డే విరూపాక్షితో చేయి కలిపినాడు. ఆ చొరవ లింకులచౌదరికి వాళ్ళ కులమే నేర్పింది. అందుకే పండమేటి గ్రామంలో తెలుగుదేశం భవిష్యత్తుకు లింగుల చౌదరి నాయకుడయ్యాడు. సాధారణ ఎన్నికల్లో లింకులచౌదరి గరుడ శేఖరనాయుడి తరపున ఏజెంట్‌గా ఉన్నాడు. అప్పుడే రాజారెడ్డిని విరుపాక్షి చంపేశాడు.

గుడిమాన్యం వేలం పాట ఈ సారి నేను పాడుకుంటానని గరుడశేఖరనాయుడిని అనుమతి లింకుల చౌదరి తీసుకున్నాడు.గొర్రెల తిరుపాలు, వడ్డేవాళ్ళను ఆ భూమిలో కొంత కౌలుకి ఇస్తానని బుజ్జగించాడు. బోయ కులం వారికి గరుడశేఖర నాయుడు వేలం పాట పాడుకుంటాడని చెప్పాడు. ఈ సారి గుడిమాన్యం వేలం పాటను మేము జరుగనివ్వమని బోయలు చెప్పారు. గరుడ శేఖరనాయుడితో పెట్టుకునేది తెలివైన పనికాదు అని బోయలను భయపెట్టచూశాడు. కానీ బోయలు, మాదిగలు గుడి మాన్యం పేదలకు ఇవ్వాలని కలెక్టర్ గారికి అర్జీ పెట్టారు. బోయలకు రాజిరెడ్డి లేడనే ధైర్యంతో కళ్ళు నెత్తికెక్కాయని నేనంటే భయం ఉండాలంటే ఎలాగైనా ఈ పాటను నేను దక్కించుకోవాలి. లేకుంటే సర్పంచ్ ఎన్నికల్లో తనకు సీటు ఇవ్వరని, ఈ ఛాన్స్ వదిలితే మళ్ళీ రాదు. బోయలను భయపెట్టాలి. "మంచిమాటలకు చింతకాయలు రాలవు, కానీ మనిషిని చంపడమా? చంపాల్సిందే!.... లేకపోతే రాజకీయాల్లో పైకి రాలేం ఏసేయ్ నాకొడుకుని! ఆ తర్వాత గరుడ శేఖర నాయుడు చూసుకుంటాడు" (పు. 178). పూజారి భూమయ్యను దారుణంగా హత్య చేయిస్తాడు. దానిలో తాను పాల్గొంటాడు. ఇలా రాజకీయ భవిష్యత్తు కోసం హత్యా రాజకీయాలకు వెనుకాడని వాడు, లింకుల చౌదరి అనే భాస్కరచౌదరి.

**3.3.3.14. గంగుల రెడ్డి-రెడ్డికుల హింసావాదం:**

కొండారెడ్డి కొడుకు. కొండారెడ్డి చనిపోవడంతో గంగుల రెడ్డి తెరమీదకు వచ్చాడు. చిన్నప్పటి నుండి ఇంట్లోనే పోలీసులను చూసి చూసి వాళ్ళతో పనిచేయించుకొని పోలీసులు అంటే, ప్రభుత్వం అంటే సమాజం అంటే లెక్కలేకుండా గంగులరెడ్డి పెరిగాడు. గంగుల రెడ్డి పొగరుబోతు. అదంతా రెడ్ల పౌరుషమేనని కొండారెడ్డి సంబరపడ్డాడు. "ఊర్లో ఒక దున్నపోతును దేవరకు విడిచిపెడతారు. చూచి... అది కుమ్మవచ్చు. అడ్డమైన చేన్లో పడి మేయొచ్చు" (పు. 146) అట్లాంటి వాడు గంగులరెడ్డి. గంగులరెడ్డికి నూనూగుమీసాలు రాగానే ఆడదాని మీదకు గాలి మళ్లింది. ఒకసారి ఇంటి పనిమనిషి 'ముద్దక్క' మీద పడ్డాడు. సర్కస్ పిల్ల మీద మనుషపడి భుజం మీద వేసుకొని వెళ్ళాడు. సినిమా హాల్‌లో టీ కప్పులు కడిగే పిల్లమీద మనసుపడి జీపులో వేసుకొని వెళ్ళి పోయాడు. ఇదంతా పత్రికల్లో వస్తే నా ఎదుగుదల చూసి ఓర్వలేని వారు చేసే ప్రచారమని కొండారెడ్డి చెప్పాడు. కొడుకు చేజారిపోతున్నాడని కొండారెడ్డి పెండ్లి చేశాడు. ఇరువై రెండు సంవత్సరాలకే గంగుల రెడ్డి యూత్ కాంగ్రెస్ సభ్యుడయ్యాడు. యూత్ కాంగ్రెస్ సభ్యులంత ఇతడికి మద్దతుదారులే.

కొన్ని రోజులకు గంగుల రెడ్డికి పెళ్ళాంమీద మొకంమొత్తింది. తన అనుచరులు అమ్మాయిల అడ్రసులు చెప్పేవారు. గంగుల్ రెడ్డి వాళ్ళను పాడు చేసేవాడు. అలా ఆ ఊరిలో రాత్రి 8 గంటలు దాటితే ఆడ పిల్ల బయటికి వచ్చే పరిస్థితి లేదు. కబీర్ భార్య నూర్జా బేగంను ఎత్తుకుపోయి చింతర్లపల్లిలో కోటలాంటి ఇంట్లో బంధించి ఉంచాడు. కొన్ని రోజుల తరువాత నూర్జాహా బేగంను వదిలివేశాడు. అప్పటికే కబీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. బేగం కూడా తరువాత ఆత్మహత్య చేసుకుంది. దాంతో దూదేకులతో పాటు దాదాపు అన్ని కులాల వారు గంగులరెడ్డికి వ్యతిరేకం అయ్యారు ఆ విషయం తెలిసి ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి గెలువాలనుకున్నాడు. కానీ ఎన్నికల ముందు గరుడ శేఖరనాయుడు అండర్ గ్రౌండ్‌నుండి బయటికి వచ్చి తెలుగుదేశం పార్టీలో చేరి గంగులరెడ్డి ఆధిపత్యానికి సవాలు చేశాడు. ఎన్నికల సమయంలో రిగ్గింగ్ చేయడానికి అవకాశం లేదని కొండారెడ్డి భార్య తన కొడుకు గంగుల రెడ్డితో కలిసి పోలింగ్ బూతుల మీద బాంబులు వేయించింది. గంగుల్ రెడ్డి బాక్స్‌లో ఇంకు పోయించాడు. పోలింగ్‌ను అడ్డుకున్నారు. రీ పోలింగ్ జరిగింది. గరుడ శేఖరనాయుడు ఎన్నికల్లో గెలిచాడు. దీనితో గంగుల రెడ్డి ఆధిపత్యం సన్నగిల్లింది.

**3.3.3.15. కోనప్ప శాస్త్రి-మనువాదం:**

పంచాయతీ సమితి ప్రాథమిక పాఠశాలలో ఏకోపాధ్యాయునిగా పండమేటి గ్రామంలో పనిచేశాడు. ఉంచ వృత్తిని గౌరవప్రదమైన స్థానంలో నిలబెట్టాడు. మంచి ముహూర్తం చూసి గోనె సంచి తీసుకోని శెనక్కాయి కల్లాల మీదకు వెళతాడు. తాను మనసు పడిన వాటిని నోరు తెరచి అడుగుతాడు. బ్రాహ్మణులకు పెడితే పుణ్యం వస్తుందని హితోపదేశం కూడా చేస్తాడు. చుట్టు పక్కల ఊర్లలో పెళ్ళిళ్ల చేస్తాడు. తనతో పెళ్ళిళ్లు చేయించుకోని వాళ్ళంటే అనాగరికుల కింద లెక్కిస్తాడు. మాదిగ వాళ్ళు పూజిస్తున్న పెద్దమ్మ గుడిని శ్రీదేవి ఆలయంగా మార్చి తన తమ్ముడ్నే పూజారిగా నియమించుకున్నాడు. ఊర్లో పిల్లలకు నక్షత్రం చూసి పేర్లు పెడుతుంటాడు. సత్యనారాయణ వ్రతాలు, జాతకాలు చెబుతుంటాడు. కష్టపడకుండా చేసే పనులను చేస్తుంటాడు. ఈడు వచ్చిన చెల్లెలు పెళ్ళి సమస్యను తీర్చేందుకు సమాజం ముందుకు వచ్చింది. కోసప్ప తన చెల్లెలికి పెళ్ళి చేస్తున్నానని ప్రతి గడపకు రాగి చెంబు పట్టుకొని తిరిగాడు. అతనికి చందాలు ఇచ్చిన వారిలో మాదిగలు ఉన్నారు. కానీ బడిలో మాత్రం మాదిగ పిల్లలను అంటరాని వాడిగానే కూర్చోబెట్టాడు. అంతేగాక పండమేటి స్వామి మాదిగ వాడని తెలిసి "మాదిగోల్లు గుడికి వస్తానంటే ఏదో అనర్థం జరిగిపోతున్నట్లు ఎక్కువగా తల్లడిల్లిపోయినవాడు. కోనప్ప శాస్త్రి" (పు. 165) వెంటనే పూజారి భూమయ్య దగ్గరకు పోయి మాదిగోల్లు పండమేటి

స్వామి గుడిలోకి వస్తే ఎట్లా అని ఆందోళన పడినాడు. భూమయ్య చేతులు జోడించి మాదిగలు గుడిలోకి వస్తానంటే రావద్దనడానికి నేనెవరిని అన్నాడు. కోనప్ప లింకుల చౌదరి దగ్గరకు పరుగెత్తాడు. "ఛత్ నేనుండగా మాదిగలు గుడిలోకి అడుగుపెట్టడానికి వీళ్ళేదు" (పు. 168) అన్నాడు. కానీ అడ్డుకోలేదు. రాజారెడ్డి బతికి ఉన్నప్పుడు రోజు అతని కొలువుకుపోయి హాజర్ చేయించుకునేవాడు. ఒక రోజు "మన ఊల్లో అప్పర్ ప్రైమరీ స్కూలు లేకపోవడం వల్ల మన ఊరి పిల్లల చదువులు అయిదో తరగతిలోనే ఆగిపోతున్నాయన్నా!" (పు. 167) అని అడిగాడు. దానికి రాజారెడ్డి ఈ ప్రజలు చదువుకుంటే మన మాట వింటారా స్వామీ! తెలివి మీరి పోరా? నెత్తికి ఎక్కి కూర్చోరా? కాబట్టి ఎక్కడ పెట్టే వాణ్ణి అక్కడే పెట్టాలి అని దూర దృష్టితో ఆలోచించాడు. కోనప్ప మాత్రం స్కూల్ వస్తే తన పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని వ్యక్తిగత కీర్తి కోసం ఆశ పడ్డాడు. ఇలా కోనప్ప శాస్త్రి వ్యక్తిగత లాభం కోసం మాత్రమే తన కులాన్ని అడ్డుపెట్టుకొని ఆనందంగా జీవితాన్ని గడుపుతుంటాడు.

**3.3.3.16. గొర్రెల తిరుపలు-అవకాశవాదం:**

తిరుపాలు కురుమకులం వాడు, అతి జాగ్రత్తపరుడు. అది తనకి కుల వృత్తి అయిన గొర్లు కాసేటప్పుడు అలవడింది. కాల క్రమంలో అది పిరికితనంగా మారింది. ఈ పిరికి మందు పెద్దలు నూరిపోశారు. "నాయనా తిరుపాలు! కొట్లాడేటప్పుడు మనం ముందూ వెనక చూచుకోవల్ల. ఊర్లో నువ్వు ఎవ్వరితోనైనా కంట్టుకంట్టున్నావనుకో!. వాళ్ళు రాత్రికి రాత్రి ఏభై గొర్రెలు మళ్ళించుకొని పోతే నువేం చేస్తావు. ఒక పెద్ద బండరాయితో మోది చంపుతే ఏంచేస్తావని" (పు. 81). పిరికి వాడిగా మార్చేశారు. కమ్మోల్లను అయ్యా అంటాడు. రెడ్లను దేవరా అంటాడు. అదంతా పెద్దోల్ల మీద భయభక్తులని చెబుతాడు. తిరుపాలకి అక్షర జ్ఞానం ఉంది. తన దగ్గర ఉన్న గొర్లు ఎంత ధరో తెలుసు. పండమేటి గ్రామంలో గొర్లు కాసే కురువోల్ల దగ్గ ర ఉన్న డబ్బు రెడ్ల దగ్గర కూడా లేదని చెబుతుంటారు. కమ్మ, రెడ్డి కులాలు శ్రమకు దూరమై, రాజకీయాలకు దగ్గరై భూములు అమ్ముకున్నారు. అలా లింకుల చౌదరి దగ్గర తిరుపాలు పది ఎకరాల భూమిని కొనుకున్నాడు. దాంతో పాటు మరో నలభై ఎకరాలు గుడి మాన్యాన్ని రాజారెడ్డి దగ్గర కౌలుకు తీసుకున్నారు. గుడిభూమికి కట్టే కౌలుతోపాటు రాజారెడ్డికి సంవత్సరానికి అరవైవేలు కౌలుగా కడతాడు.

తిరుపాలు బోయ కుటుంబాలు గుడి మాన్యం గురించి రాజిరెడ్డిని కలిశారని తెలిసి ఉరుకులు, పరుగుల మీద రెడ్డి దగ్గరకు వెళ్ళాడు. "మా తండ్రి తాతల కాలం నుంచీ నీకు విశ్వాసంగా ఉన్నాము కదా రెడ్డీ? నీ గుడి మాన్యాన్ని కోరుకు తీసుకోని ఒక సంవత్సరం పండినా, ఒక సంవత్సరం పండకపోయినా నీకు మాత్రం పైసా దుడ్లు తగ్గకుండా కట్టు గుత్త కట్టుతున్నాం" (పు.83) అని రెడ్డిని బుజ్జగిస్తూ తనెంత విశ్వాస పాత్రుడో తెలియజేశాడు. నిన్ను కాదని ఇంకొకరికి కౌలుకు ఎందుకు ఇస్తాను, నీకే ఇస్తానని రెడ్డి చెప్పే దాక ఎదురు చూసి ఊపిరి పీల్చుకున్నాడు. "గొర్ల తిరుపాలు ఎట్లంటే రెడ్డికి వంగి వంగి సలాములు కొట్టల్ల, రెడ్డి భోంచేస్తాంటే కింద పడిన నాలుగు మెతుకులన్నా తను దక్కించుకోవల్ల. అంతే! గొర్ల తిరుపాలు కులానికి, రెడ్లన్నా, కమ్మలున్నా చానా ప్రభుభక్తి! ఆ ఊర్లో రెడ్లు ఉంటే రెడ్లకు సలాము కొడతాడు. కమ్మోల్లు ఉంటే కమ్మోల్లకు సలాములు కొడతాడు. ఆ ఊర్లో ఏ కులం వాడైతే పైచేయి అనిపించుకుంటాడో వానికి రాజకీయంగా లొంగి ఆర్థికంగా బాగుపడాలనుకుంటారు. సమితి ప్రెసిడెంటుగా నేనే ఎందుకు ఉండకూడదు అనుకోరు... ఆ సమితి ప్రెసిడెంట్ తమను ఆదుకుంటే చాలు" (పు. 83) అని తిరుపాలు, తోటి కురుమ కులమోల్లు కూడా అలాగే ఆలోచిస్తారు.

కానీ కురుమ తిరుపాలను గుడిమాన్యం వేలం పాట గురించి లింకులచౌదరి కదలిస్తే

"ఆ పక్క చూస్తే నువ్వు! ఈ పక్కకు పోతే నీకు కోపం, నీ పక్కకు వస్తే (బోయలకు కోపం) మీ ఇద్దరిలో ఎవరి పక్కకు వచ్చిన ఆ రెడ్లకు కోపం, నాకు ఆ భూమి వద్దు, ఈ రాజకీయాలు వద్దు, మీరు మీరు ఏమైన చేసుకోండి" (పు. 176) అని జారుకో చూస్తాడు. సరే నీవు నాకు అండగా నిలిస్తే అంటే ఇరవై ఐదు వేల రూపాయలు అప్పుగా ఇవ్వాలి. గుడి మాన్యం నాకే వస్తే నలభై ఎకరాలు నీకు కౌలికిస్తానన్నాడు లింకుల చౌదరి. సరే అట్లే కానీ అన్నాడు తిరుపాలు. అదే బోయ కుల వాళ్ళు అడిగితే ఏ గ్యారెంటీ లేకుండా ఇచ్చేవాడు కాదు. లింకులచౌదరికి డబ్బులేదు. కానీ డబ్బులాంటి కులముంది. కులంతో ముడిపడిన రాజకీయ బలం ఉంది. అందుకే అప్పుఇచ్చాడు. ఏదైన పనిపడితే లింకుల చౌదరి ద్వారా చేయించుకోవచ్చు అన్నట్లుగా అప్పుఇచ్చాడు. గొర్ల తిరుపాలు లాంటి వాళ్ళ పాత్రల ద్వారా చేయించుకోవాలన్నట్లుగా అప్పుఇచ్చాడు. గొర్ల తిరుపాలు లాంటి వ్యక్తులు మనకు కింది కులాలలో అనేక మంది కనిపిస్తారని, అధికారం కోసం రాజకీయాలు చేయకుండా తక్షణావసరాలకు అగ్రకులాలకు అన్ని విధాలుగా చెంచాలుగా వ్యవహరిస్తూ వారి ఎదుగుదలకు నిచ్చెనమెట్లుగా ఉ పయోగపడతారని రచయిత తెలియజేశాడు.

### <u>3.3.3.17. గొర్ల తిరుపాలు చిన్న తాత కొడుకు- బహుజన వాదం:</u>

గొర్ల తిరుపాలు స్వభావానికి మినహాయింపు గొర్లతిరుపాలు చిన్నతాత కొడుకుది. ఊరందరిది ఒక దారైతే ఉలిపిరి కట్టెది ఒకదారి అన్నట్లుగా ఉండేది ఆయన తీరు. కురుమసంఘంలో మాట్లాడుతూ కురుగ, గొల్లలు పెళ్ళిళ్ళు చేసుకొని కలిసి పోవాలని అప్పుడే గుంపు బలం పెరిగి మనం రాజకీయంగా బలపడతామనేవాడు. మన తాత ముత్తాతలను చదువులేకుండా చేసింది బాపనోల్లని తిడతాడు. మన పెళ్ళిలకు రెడ్డి, కమ్మా, రాజకీయ నాయకులు రాకపోతే మన పెంళ్ళిళ్లు నిలిచి పోతాయా? వాళ్ళకు బానిస గిరి ఎందుకు చేస్తారని తిట్టేవాడు. వాళు ్ళ ఓట్ల కోసం మన దగ్గరికి వస్తారు, కానీ మన కోసం కాదు. రెడ్లు, కమ్మలు మన గూటి వాళ్లే ఈ పొద్దు కోకిలై పోయారని ఒకప్పుడు బాపన్ల మనల్ని అణిచి వేస్తే, ఈ పొద్దు రెడ్లు, కమ్మలు రాజకీయంగా అణగదొక్కుతున్నారు. రాజకీయాల్లోకి వచ్చేందుకు ధైర్యం లేకపోతే రెడ్లకు బదులు బోయలను, లేకపోతే ఈడిగోళ్ళకు ఓట్లు వేయండిరా!.. కురువలు సంఘాలను కట్టుకొని ఏదో ఒక్క రెడ్డికి ఓటుబ్యాంక్‌గా ఎందుకు మారిపోతున్నారు. జనాభాలో నూటికి రెండు శాతం కూడా లేనివాళ్ళు మనల్ని పరిపాలిస్తున్నారు. "కొంతకాలం మనం కూడా పరిపాలిస్తాంటే తప్పేమి? ఈ రెడ్లు పాలేగాళ్ళా? మనల్నీ, మన కులాల్నీ, వంశాన్ని గుత్తాకు తీసుకున్నారా? పదండ్రా! ముందుకు.... రాజకీయంగా అభివృద్ధిలోకి వస్తే ఆర్థికంగా వద్దు వద్దు అన్నా పైకి వస్తాము. ఇంకా ఎంతకాలం ఈ రెడ్ల క్రింద పడింటారు? ఆ పనికీ, ఈ పనికీ ఇంకా ఎంత కాలం వీళ్ళ ముడ్డి చుట్టూ తిరుగుతారు" (పు. 84) అని బహుజనుల ఐక్యత, రాజకీయాలలో అధికారం సాధించాలంటాడు. అధికారంతోనే అభివృద్ధి జరుగుతుందని పూలే, అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రచారం చేస్తుంటాడు.

### <u>3.3.3.18. కమ్యూనిష్టు గోవిందు-లంపెన్ కమ్యూనిజం:</u>

చాకలి గోవిందే కమ్యూనిస్టు గోవిందుగా రూపుదాల్చాడు. తల్లి దండ్రులు చాకలి వాల్లు, వాళ్ళతో పాటు రేవుకి వెళ్ళి ఆడుకునేవాడు. ఇస్త్రీ చేసేటప్పుడు గోవిందుకు చూడటం ఇష్టం. తండ్రికి కమ్మ, రెడ్ల ఇండ్లలో ఇస్త్రీ బట్టలు తీసుకెళ్లడం ఆలస్యమైనప్పుడు వాళ్ళు ఇష్టానుసారంగా తిట్టినప్పుడు మాత్రం ఆ వృత్తి మీద అయిష్టం కలిగేది. తను మాత్రం ఏ పనైనా చేస్తాను కానీ ఈ పని మాత్రం చేయకూడదనుకున్నాడు. పండగలప్పుడు ఇంటింటికి తిరిగి అమ్మ తినుబండారాలు తీసుకువచ్చేది. బాపనోల్లు సంవత్సరికం చేసిన, ఎవరైనా చనిపోతే శవం కింద దుప్పటి గోవిందు వాళ్ళకు ఇచ్చే వాళ్లు. దేవుడి ఊరేగింపులో చాకలివారే

కాగడాలు పట్టేవారు. అవి తమ కులానికి ఒక గుర్తింపుగా భావించేవారు. ఊరిలో బట్టలు ఉతికితే రైతులు ధాన్యం, శెనక్కాయలు కొలిచి ఇచ్చేవారు. బ్రాహ్మణులు, వైశ్యులు సంవత్సరానికింత అని డబ్బులు ముట్టజెప్పేవారు.

కాలేజీ డే సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ఉపన్యాసాన్ని ఎగతాళి చేశాడని వాళ్ల కొడుకులు తుక్కుతుక్కున గోవిందుని తన్నారు. ఒరే చాకలి నా కొడకా నిన్ను చంపితే మాకు అడ్డు వచ్చేదెవర్రా? అని హెచ్చరించారు. గోవిందుకు అది నిజం అనిపించింది. ఆ సమయంలో గోవిందుకు స్టూడెంట్ ఫెడరేషన్ మద్దతు ఇవ్వడం గోవిందు జీవితాన్ని మలుపు తిప్పింది. గోవిందుది ఎడమ చేతివాటం. అందుకే గోవిందకు చాకలి కుల స్వభావానికి వ్యతిరేక గుణాలు అలవడ్డాయి. మనిషిఐదుఅడుగుల ఎనిమిదిఅంగులాల పొడవు, బక్క పలుచగా ఉంటాడు. కానీ కొట్లాటలో దిగితే అతని బుద్ధి పాదరసం మాదిరి పనిచేస్తుంది. తమకు నచ్చిన వాడిని కొట్టేవాళ్ళు తర్వాత రాజీకి మనిషిని పంపించి క్షమాపణ చెప్పేవారు. వాళ్ళ దెబ్బలుతిన్న వారు అయ్యారు. వీళ్ళు కొట్టిన వాళ్ళు అయ్యేవాళ్ళు. పార్టీలో తెలివైన వాళ్ళు ఏం ప్రతిపాదిస్తే దానినే బలపరిచేవాడు. కమ్యూనిస్టులు చెప్పిన "పుస్తకాలు ఏవీ చదివిన ఓపిక లేకపోయేది. దోపిడీదార్లూ, బూర్జువాలూ, అర్ధవలస, అర్ధబానిస సమాజాలూ కార్మిక నియంతృత్వమూ, సోషలిస్టు సమాజమూ, వగైరా పదాల్ని మాత్రం వల్లిస్తూండేవాడు" (పు. 66). ఫలాన బంద్ జరుగల్ల అంటే గోవిందు చేసేవాడు. గోవిందుకు మూక బలం మంచి కిక్కు ఇచ్చేది. గౌరవంగా బ్రతికేవారు ఎంత పిరికి వారో గోవింద్‌కు అర్థం అయ్యింది. పార్టీ కూడా గోవింద్‌కు ఉపయోగపడింది. గోవిందు ఎదుగుదలకు పార్టీని ఉపయోగించుకొనీ? కానీ తమ పార్టీ ముద్ర ఉంటే చాలు అనుకుంది పార్టీ.

కాలేజి జీవితం తరువాత గోవింద్ పార్టీకి పూర్తి కాలం కార్యకర్త అయ్యాడు. పెళ్ళి చేసుకున్నాడు. అవసరాలు పెరిగాయి. గోవింద్ మెల్లగా సంపాదన మార్గంలోకి అడుగేశాడు. అప్పటిదాకా ఏ ప్రభుత్వం మీద వ్యతిరేకంగా ఉన్నాడో ఆ ప్రభుత్వ రాజకీయ నాయకులంతా మిత్రులయ్యారు. రాజకీయ గ్రూపే వారి స్నేహం. ఎవరికి అధికారం ఇచ్చిన వాడు కోట్లు సంపాదించుకునేందుకు ఉపయోగించుకుంటాడు. అందరిది ఏకత్వం ఇక్కడే లేని పోని సిద్ధాంతాలతో కొట్టుకోవడం ఎందుకు? గోవింద్‌కు అధికార పార్టీ ఉపయోగపడుతుంది. గోవిందు అధికార పార్టీకి ఉపయోగపడతాడు. డబ్బులకు మనుషుల ప్రాణాలు తీసే కాంట్రాక్ట్‌లు ఒప్పుకున్నాడు. విరూపాక్షి లాంటి వారు ఆ ముఠాలో చేరారు. కమ్యూనిస్టు పార్టీ గోవిందును బహిష్కరించి చేతులు దులుపుకుంది. పార్టీ చర్య భూస్వామ్య స్వభావంగా ఎండగట్టి గోవిందు బయటకు వచ్చాడు.

టౌన్‌లో వార్డుకు పది మంది చొప్పున గోవింద్‌కు అనుచరులు తయారయ్యారు. చెడు వ్యసనాలకు అలవాటై ఇంటికి భారంగా మారినవాళ్ళే ఎక్కువ. గోవింద్ పేరు చెప్పి, అమ్మాయిల్ని పాలవాడి మరదల్ని ఏడిపించడం చేశారు. అలా ఎందుకు చేశారని అడిగిన పాలవాడి తల నరికివేశారు. తరువాత సిగరెట్ కాల్చుకొని తీరుబడిగా మాట్లాడుకుంటూ వెళ్ళిపోయారు. పోలీసులు వారిని అరెస్ట్ చేస్తే ఎమ్మెల్యే, మంత్రి నుండి వారిని విడిచిపెట్టమని ఫోన్లు చేశారు. ఇలా కమ్యూనిస్టు గోవిందు లక్షాధికారిగా మారాడు. ఎవరో పది మంది కాపు కాసి కత్తులతో చకచకా పొడిచేసి పారిపోయారు. ఆసుపత్రిలో ప్రాణాపాయంతో బయట పడ్డ గోవిందును చూడటానికి ఎంపీలు మొదలు రాజకీయ నాయకులందరు పరామర్శించడానికి క్యూ కట్టారు. అట్టడుగుకు కులం నుండి వచ్చిన గోవిందుకు భయపడి ఇచ్చిన గౌరవమది. తర్వాత సంవత్సరం గోవింద్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. అయిన ప్రజలు అతడిని కమ్యూనిస్టు గోవిందుగానే గుర్తించారు. పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షునిపేర్లలో గోవిందు పేరుకూడా పరిశీలనలలో

ఉంది. మరోసారి గోవిందుమీద దాడి జరిగింది. ఈ సారి మొండెం నుండి గోవిందు తలను వేరు చేసి తమ వెంట తీసుకెళ్ళారు. "ఆ విధంగా ఎంతో రాజకీయ భవిష్యత్తు కలిగిన ఒక అట్టడుగు నిమ్నకులస్తుని జీవితం ఎంతో సహజాతి సహజంగా పరిసమాప్తం అయ్యిందని" (పు. 73) అని చెప్పవచ్చు.

**3.3.3.19. మనోహర్ నాయుడు-భౌతిక వాదం:**

వ్యవసాయదారులైన కమ్మకులంలో అంతో ఇంతో చదువుకున్న ఇంటిలో పుట్టాడు. బ్రిటీష్ వాళ్ళ పుణ్యమని మొదట చదువుకు నోచుకున్న శూద్రులైన వీళ్ళు హీనవృత్తుల వాళు కాకపోవడం, వ్యవసాయ దారులు కావడంతో సామాజికంగా, ఆర్థికంగా కలిసి వచ్చిన అంశాలు. మనోహర్ నాయుడు ఇంగ్లీస్ జ్ఞానంతో మార్క్సిజం చదువుకున్నాడు. కానీ అవగాహనలోనే తేడా ఉంది. "వర్గాలు మాత్రమే ఉన్న పాశ్చ్యాత్య సమాజంలో మార్క్సిజం పుడితే ఆ మార్క్సిజాన్ని కులాలుతప్ప వర్గాలులేని భారతీయులుగా సమాజంమీద ఆరోపించాలని చూసినాడు" (పు. 131). మార్క్సిజం చదువుకున్న ప్రతివాడు నాస్తికుడే కావాలని అతని రూల్ మనోహర్ నాయుడు పల్లెకుపోతే నాస్తికుడుగా తప్ప అతని పేరు లేదు. తాను హేతువాదిని అంటాడు. "హేతువాదాన్ని అతడు దేవుని వైపు గురిపెట్టిన విధంగా తన కులం వైపు ఎప్పుడూ గురిపెట్టలేదు" (పు. 132). డిగ్రీ పిల్లలకు భౌతికశాస్త్రం బోధిస్తాడు. కులం పేరు చెప్పుకొని ఉద్యోగం తెచ్చుకున్నాడు. అలా తెచ్చుకోవడం తప్పేంటే అంగీకరించక "సమాజం అట్లుంది ఏం చేస్తాం? సమాజమంతా మారిననాడే మనిషి మారతాడు'' (పు.132) అని తాత్వీకరించుకుంటాడు. దేవుని పేరుతో కింది కులాలను దోచుకున్న బ్రాహ్మణ కులాన్ని చీల్చి చెండాడి తన అభ్యుదయ భావజాలాన్ని ప్రదర్శిస్తాడు. పల్లెలో అగ్రకులాల భూస్వామ్యాల దోపిడి గురించి చెప్పమంటే కులాలు, గిలాలు నాన్సెన్స్ అంటూ మార్క్సిజం ముసుగులోకి వెళ్ళిపోతాడు. తన కమ్మకులాన్ని బాగానే విమర్శిస్తుంటాడు. కాకపోతే అప్పుడు గొంతులో బలం ఉండదు. తల్లి కొడుకును దండించవచ్చు. కానీ వేరేవాళ్ళు దండిస్తే తట్టుకోలేదు. అలాంటిదే తన కులం మీద తన ప్రేమ. మనోహర్ నాయుడు కవి. మొదట్లో పెన్ను, గన్నులకు సంబంధించిన రెండూ పనులను చేయగలననుకున్నాడు. "కమ్యూనిజం వస్తుందనే ఆశ హఠాత్తుగా సన్నగిల్లి పోయి, ఇళ్ళు కట్టుకోవడంలోను, డబ్బు వడ్డీలకు తిప్పుకోవడంలోనూ తీరిక లేకుండా మునిగిపోయినాడు" (పు. 133). భారతీయ కమ్యూనిస్టులాగే ప్రవర్తించాడు.

వీరప్పనాయుడి హత్య అనంతరం మనోహర్‌నాయుడు ఆయన మీద మాత్రా ఛందస్సులో ఒక గేయం రాసాడు. మల్లయ్యకు వినిపించి ఎలా ఉందని అడిగాడు. అంతలో పండయ్య రావడంతో మల్లయ్య అక్కడినుండి వెళ్ళిపోయాడు. పండమేటిలో గుడి ప్రవేశం గురించి పండయ్య చెబుతాడు. "గుడి మిమ్మలని వెలివేయడం కాదు. మీరే గుడిని వెలివేశాము అనుకోండి! గుళ్ళకూ, గోపురాలకూ దూరంగా ఉంటే సరి అదే వివేకమైన పని" (పు.13) అని సలహా ఇస్తాడు. కాని పండయ్య దేవుని మీద నమ్మకం లేకపోయిన గుడి ప్రవేశం ఆత్మగౌరవ విషయమని పోరాడి మరి సాధించుకుంటాడు. గరుడశేఖరనాయుడు తెలుగుదేశం పార్టీలో చేరడంలో మనోహర్‌నాయుడు ఆ పార్టీలో చేరాడు. అతని ఇంటిల్లపాది తెలుగు ఆవేశంతో ఊగిపోయారు. పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో ఏ కమ్మవీరుడు టికెట్ గెలుసుకుంటాడోనని కళ్ళలో వత్తులు వేసుకొని ఎదురుచూశాడు. ఇంట్లో వాళ్ళతో టిడిపి గురించి ఎంత మాట్లాడినా, బయటి మేధావి స్నేహితుల మధ్య నింపాదిగా, నిలకడగా, నిగ్రహంగా మాట్లాడతాడు. మనోహర్ నాయుడు పాత్ర భారతీయ కమ్యూనిస్టులకు నమూనా పాత్ర. వారు 'చెప్పేయి శ్రీరంగ నీతులు దూరేయి దూరేయ్ దొమ్మరిగుడిసెలు' అనే సామెతలో రచయిత మనోహర్ నాయుడు లాంటి వాళ్ళ వ్యక్తిత్వాన్ని నగ్నంగా బయటపెట్టారు. తమ వ్యక్తిగత ప్రయోజనాల

కోసం మాటలు కోటలు దాటించి చేతలు మాత్రం వట్టివి చూపిస్తారని ఈ పాత్రలో నిరూపించారు.

**3.3.3.20. కబీర్– దూదేకుల దుస్థితి:**

బానుకోట గ్రామం. చిన్నప్పుడు భానుకోట నుండి తల్లిదండ్రులు వచ్చేశారు. అక్కడ ఉన్న ఐదు ఎకరాల భూమి రాడికల్స్ ఆక్రమించారు. ఆ భూమి నాది అని అడగడానికి లింకుల చౌదరితో వెళితే ఈ ఊర్లోనే ఉండి వ్యవసాయం చేసే వారికే భూమి ఇస్తామన్నారు. కబీరుది దూదేకుల కులం ముస్లింలలో హీనంగా చూడబడుతుంది. దూదేకులను ఆధాముస్లింలుగా ముస్లింలు ఎగతాళి చేస్తుంటారు. ఎందుకంటే దూదేకులకు ఉర్దూ రాదు. మాతృభాష తెలుగే! బ్రహ్మంగారి తత్వాలు పాడతారు. వెంకటేశ్వర స్వామిని పూజిస్తారు. హిందూ పండగలు, ఆచారాలు పాటిస్తారు. ఒకసారి బాడుగకు ఇల్లు ఇచ్చిన ముస్లింలు కబీర్‌ది దూదేకుల కులమని తెలిసి తక్షణం ఖాళీ చేయించారు. కబీర్ దూదేకుల సంఘ సమావేశానికి వెళ్ళేవాడు. వాళ్ళు తమ ఉపన్యాసాలతో ఆ సంఘం వారు ఉర్దూ నేర్చుకోవాలని మసీదుకు రోజు వెళ్ళాలి. హిందూ దేవుళ్లను, సాంప్రదాయాలను పాటించకూడదని చెప్పారు. వారు చెప్పిన సలహాలన్ని కబీరు మనసు మీద బాగా పనిచేశాయి. కబీరు భార్య పేరు నూర్జహ బేగం. ఆమెది గొప్ప అందం, ఆమె ఒడ్డూ పొడవు శరీరాకృతి, ఒక రాణీకి ఉండే హూందాతనం వచ్చింది.

గంగులరెడ్డి అచ్చోసిన ఆంబోతులా ఊరిమీద పడ్డాడు. అందమైన ఆడవాళ్ళను పాడు చేస్తున్నాడు. నూర్జహాన్ అందాన్ని అనుచరులు గంగుల రెడ్డికి చేరవేశారు. ఒక రోజు కబీర్ భార్య పిల్లలతో సినిమాకి వెళ్ళి ఆటోలో ఇంటికి బయలుదేరతారు. మోటర్ వ్యాన్‌ను ఆటోకు అడ్డంపెట్టి కబీరును కొట్టి భార్య నూర్జహాబేగంను తీసుకువెళ్ళారు. పిల్లలతో పాటు కబీరు ఏడ్చాడు. కబీరు నలుగురిలో తలెత్తుకోలేక పోయాడు. వారం రోజులు అయిన నూర్జహాను వదలలేదు. నూర్జహాను గంగులరెడ్డి చింతర్లపల్లిలో కోటలాంటి ఇంటిలో పెట్టుకున్నాడు. కబీర్ చింతర్లపల్లి పోయి నూర్జహాను పంపించమని గంగులరెడ్డి తల్లిని అడిగాడు. ఆమె మాములు ఆడది కాదు ఇప్పుడు పంపించను. మరో వారం రోజులు ఉంటే నీ భార్య అరిగిపోతుందా అని తిట్టి కబీరును పంపించింది. ఇంటికొచ్చిన కబీరు పిల్లలను పట్టుకొని ఏడ్చి రైలు క్రింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. పదిరోజుల తర్వాత ఇంటికి వచ్చిన నూర్జహా పిల్లలను పట్టుకొని ఏడ్చి వాళ్ళను పుట్టింటిలో వదిలివేసి వచ్చి ఉరివేసుకొని చనిపోయింది. దీంతో నియోజకవర్గంలో దూదేకులందరు గంగులరెడ్డికి వ్యతిరేకమయ్యారు. ఇతర కులాల్లోని ఆడవాళ్ళందరు రెడ్లకు ఓటెయ్యకూడదనే నిర్ణయానికి వచ్చారు.

కబీరు పాలిటెక్నిక్ చేసి పంచాయతీ సమితి వాటర్ వర్క్సులో జూనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించాడు. తర్వాత బి.టెక్ కూడా పూర్తి చేశాడు. ప్రమోషన్ పొందాడు. "మూడు గదుల అద్దెఇల్లు అతనిది. భార్యతో పండంటి బిడ్డల్తో గుట్టుగా సంసారం చేసుకునే సామాన్యకుటుంబీకుడు.... తన పనేదో తను చూసుకోవడం తప్ప ఇతర్ల విషయాలలో వేలు అద్దే వాడు కాదు. తల్లి ప్రేమ, భార్య ప్రేమ, బిడ్డల భవిష్యత్తు, స్నేహితుల పట్ల అభిమానం... అతనిది ఒక చిన్న సైజు ప్రపంచం ఎవరికి కీడు తలపెట్టని మనిషి, సమాజానికి, ప్రభుత్వానికి ప్రమాదరహితుడైన మనిషి ఒక నల్లిని చంపాలన్న నాలుగు నిమిషాలు ఆలోచించేవాడు. తన ఇరుగు పొరుగుతో సహజీవనం సాగించడం తప్ప ఏ రాజకీయాలు తెలియనివాడు" (పు. 148)గా చిత్రింపబడ్డాడు.

కబీరును రచయిత సృష్టించాడంలో అర్ధమేమిటంటే దూదేకులు, ముస్లింలు బహుజనులలో భాగమని చెప్పడానికే ముస్లింలు ఒకప్పుడు రాజ్యాలు పరిపాలించి ఉండవచ్చు.

కానీ వాళ్ళు ఇప్పుడు మైనారిటీలు, కనుక ఎస్సీ, ఎస్టీ,బీసిలలో ముస్లింలు కలిసి కట్టుగా ముందుకు వస్తేతప్ప రాజ్యాధికారం సాధించలేరని చెప్పడానికి కబీరు నమూనా పాత్ర మన ముందుంచారు. ముస్లింలు, దూదేకులు మీద జరిగే అన్యాయాల అంతానికి రాజ్యాధికారమే మార్గమని తెలియజేశాడు.

**3.3.4.మీరాజ్యం మీరేలండి – స్త్రీల పాత్రలు:**

మీరాజ్యం మీరేలండి నవలలో స్వామి దళిత బహుజన అగ్రకుల స్త్రీలను గురించి, వారి జీవన సరళి గురించి వివిధ కోణాల్లో చర్చించాడు. కింది పాత్రల ప్రవర్తనను గమనిస్తే రాయలసీమలో స్త్రీల స్థితిగతులను అర్థం చేసుకోవచ్చు.

**దళిత స్త్రీల దుస్థితి– అగ్రకుల స్త్రీల దాష్టికలు పెత్తనాలు:**

'మీరాజ్యం మీరేలండి' నవలలో స్త్రీల పాత్రలు ఉన్నాయి. కొన్ని పాత్రలు పేర్లుతో ఉంటే, మరికొన్ని పాత్రలు ఫలానా వాడి భార్య లేక వరసలతో తెలియజేయబడ్డాయి. ఒక ప్రక్క స్త్రీల పాత్రలే కాకుండా పురుషుల పాత్రలు కూడా ఫలానా వ్యక్తి తమ్ముడని, చినతాత కొడుకని కూడా రచయిత తెలియజేశారు. కింది కులాల స్త్రీలను పేర్లతో పరిచయం చేస్తు వారి వ్యక్తిత్వాన్ని వర్ణించాడు. అగ్రకులాల స్త్రీల పాత్రలను మాత్రం ఫలానా రెడ్డి భార్య అని తెలియజేస్తాడు. ఆ పాత్ర చేసే ఆరాచకాలు వర్ణిస్తాడు. కింది కులాల స్త్రీల శ్రమను, పని తనాన్ని వివరిస్తాడు.

**లాలెమ్మ:**

మాదిగ దేవన్న భార్య. దేవన్న రాజారెడ్డి దగ్గర వెట్టి చేస్తుంటే ఇంటి భారాన్ని తానొక్కతే మోస్తుంది. ఇంట్లో తినడానికి లేకపోతే పస్తులు ఉంటుంది. కొడుగును ఐదో తరగతి తర్వాత చదివించలేక బడి మాన్పిచింది. పశువుల కాపల కోసం పంపిస్తుంది. కూలీ నాలికి పోయి పిల్లల్ని పెంచుకుంటూ నానా తంటాలు పడుతుంది. కూతురు వెంకటలక్ష్మిని పూజారి భార్య తిలకమ్మ కొట్టింది. ఆ విషయం తెలిసి లాలెమ్మ అడగడానికి వెళ్ళింది. "ఏం మేం దొంగతనం చేసినామా? ఎవరి కొంపలన్నా ముంచినామా?" (పు. 93) అని చిన్న పిల్లలను కొట్టడానికి నీకు మనస్సు ఎలా వచ్చిందని నిలదీసింది. జుట్లు జుట్లు పట్టుకొని కొట్టుకున్నారు. తర్వాత మరో ఘటనలో కొడుకు పండయ్యను రెడ్డి యువకులు కొట్టారని తెలిసి లాలెమ్మ ఏడుస్తూ రెడ్లని తిడుతుంటే, జీతగాళ్ళ దేవన్న రెడ్లు వింటారన్న భయంతో భార్యను గదమాయించాడు. ఉట్లమాను పండగకు వెళ్ళి, బురద కొట్టుకున్న బట్టలతో వచ్చిన కొడుకును చూసి తోటి కులమోళ్లకి గొప్పగా చెప్పుకుంది. ఇలా లాలెమ్మ పాత్రను నవలలో రచయిత చిత్రీకరించాడు.

**తిలకమ్మ:**

పూజారి భూమయ్య భార్య, భర్తకు చేదోడు వాదోడుగా ఉంటుంది. భూమయ్య తమ్ముడు మల్లయ్యను తల్లిలా ప్రేమగా చూసుకుంటుంది. గుళ్లోకి మాదిగ దేవన్న కూతురు, కొడుకు వచ్చారని లింకుల చౌదరి నిష్టూరమాడుతుంటే భరించలేక ఆ పిల్లను దండిస్తుంది. ఇది తెలిసి అడగడానికి వచ్చిన లాలెమ్మతో "మాదిగోళ్ళు గుళ్లోకి దూరితే కొట్టకుండా ముద్దు పెట్టుకుంటారా?" (పు. 93) అని నోరు చేసుకుంది.

**మల్లయ్య పిన్ని:**

మల్లయ్యకు మూడు సంవత్సరాలప్పుడు తల్లిదండ్రులు కాలం చేశారు. మల్లయ్య పిన్ని పేటలో ఉంటుంది. పిల్లలు లేరు. మల్లయ్యను అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. చివరకు రక్త హీనత వచ్చింది. భర్తకు ఉబ్బసవ్యాధి సోకింది. పనులు చేయక ఇంట్లో జరుగుబాటు లేక మల్లయ్యను పనికి పంపించి, పూట గడుపుతున్నారు. ఈ విషయం తెలిసి మల్లయ్య అన్నవదినలు పండమేటికి తీసుకువెళ్ళారు. పని చేసే ఓపిక లేక, తిండికోసం "ఒలే! ముండ మోపి నా

బట్టా! రోగిష్టి మొగినివి నువ్వెక్కడ దాపురించినావురా నాకు?.... లెయ్యారా, దరిద్రపు ముండాకొడకా, లెయ్యి! అప్పుడే కోడి కూడా కూసింది. పెండ్లాని కింత కూడు పెట్టి సాకలేనోడివి నువ్వేం మొగనివిరా పనికిమాలినోడా!" (పు. 25) అని భర్తను నిల దీసింది అతడు నాకు జబ్బు చేసి చస్తుంటే కూడో కూడో అని అరుస్తావని తిట్టుకునేవారు. ఇలా బతుకు వెళ్ళదీస్తు మల్లయ్య వెళ్ళిపోయేటప్పుడు "అయ్యో! మల్లిని చూడకుండా నేను బ్రతుకలేను. నాయనా.... వాణ్ణి పూవుల్లో పెట్టుకొని పెంచుకొచ్చినాము. మా తల్లీ కొడుకుల బంధాన్ని విడదీయొద్దు, నాయనా! అని మల్లయ్యను పటుకొని ఏడ్చింది" (పు. 27). మల్లయ్య వెళ్ళిన ఆరు నెలల్లో ఇద్దరు తిండిలేక మరణించినారు.

**<u>పాలమ్మ:</u>**

వడ్డెలోకప్ప భార్య. విరూపాక్షి తల్లి. వడ్డెలోకప్ప బావితవ్వించుకుంటున్న రెడ్డి భార్యను తీసుకువెళ్ళిపోవడంతో పాలమ్మకు కష్టాలు మొదలవుతాయి. ఆ రెడ్డి పాలమ్మను లోబరుచుకున్నాడు. లోకప్ప మీద కోపం పాలమ్మ మీద చూపించేవాడు. అప్పటికే ఆమె విరూపాక్షికి జన్మనిచ్చింది. పిల్లాడికోసం రెడ్ల లైంగిక హింసలను భరించింది. ఏ పిల్లాడి కోసమైతే రెడ్లకు ఉంపుడిగత్తెగా మారిందో ఆ పిల్లాడే ఆమెను వదిలిపోతాడు. విరూపాక్షి ఇంట్లోనుండి వెళ్లిపోయిన తరువాత పాలమ్మ బాధను రచయిత ఎక్కడ తెలియపరచలేదు. పాలమ్మ ఎప్పుడు మగవాళ్ళకోసం వెంపర్లాడలేదు. ఒక రెడ్డితో సంబంధం ఉన్నప్పుడు మరో మగవాడిని చూసేది కాదు. పాలమ్మకు డబ్బు లెక్కలు తెలియవు అవి చూచేందుకు మగవారి తోడు కావాలనుకొంది. అంతేగాని శరీరవాంఛల కోసం మగతోడు ఆమె కోరుకోలేదు.

**<u>నూర్జహా బేగం:</u>**

దూదేకుల కబీర్ భార్య, రాచరికం ఉట్టిపడే అందం ఆమెది. ఆ అందమే ఆమె పాలిటి శాపంగా మారింది. కబీర్ తన మానాన తను బతుకుతున్నాడు. నూర్జహా అందానికి ముగ్ధులైన గంగుల రెడ్డి అనుచరులు ఆమెను ఎత్తుకెళ్ళి రెడ్డికి అప్పగిస్తారు. గంగుల రెడ్డి నూర్జహాన్‌ను తన ఇంటిలో బంధించి అనుభవిస్తాడు. నా భార్యను పంపమని వచ్చిన కబీర్‌ను కొండారెడ్డి భార్య మరో వారం రోజులు ఉంటే నీ భార్య (గంగుల రెడ్డి తల్లి) అరిగిపోతుందా అని మందలించి పంపిస్తుంది. అక్కడి నుండి వచ్చిన కబీరు రైలు క్రింద పడి ఆత్మహత్య చేసుకుంటాడు. మరో పదిరోజుల తరువాత నూర్జహాను విడిచి పెడతారు. ఆమె తన ఇద్దరి పిల్లలను పుట్టింట్లో వదిలి ఒక రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటుంది.

**<u>బోయొల్ల తల్లి:</u>**

పండమేటి స్వామిని తీసుకు వచ్చి తలంటు స్నానం చేయించి అన్నం పెట్టింది. పండమేటి వరదలో కొట్టుకొని పోతుంటే ఊరిజనం కాపాడారు. వరద నుండి ప్రాణాలతో బయటపడ్డ తరువాత మొదటగా బోయొల్ల తల్లిని అమ్మా అని పిలిచాడు. ఆమె రోజు ఆ స్వామికి ఆహారం పెట్టేది. ఆ స్వామికి ఆహారం పెట్టే వరకు ఎవరికి ఏమి పెట్టేది కాదు. ఒక సారి బిక్షగాడు బిక్ష అడిగాడు. స్వామికి నైవేద్యం పెట్టిన తరువాతే పెడతానని వెళ్ళమనింది. స్వామి దగ్గరకు వెళ్ళితే ఆయన ఆరోజు అన్నం తినలేదు. "ఏమిమా? అని అడిగితే ఏమమ్మ ఈ ఒక్కరోజు శరీరంలో ఉండే వాడు మాత్రమే అయితే వీడు పండమేటి స్వామి ఎందుకయితాడు" (పు. 14). అడుక్కుతినే వాడిలో ఉండేది మాత్రం ఈ పండమేటి స్వామి కాదా? అని ప్రశ్నించాడు. అప్పటినుండి ఆమె పశుపక్షాదులను కూడా తన పిల్లలుగా భావించేది. ఆ యమ్మకు వీళ్ళు నాపిల్లలు, వాళ్ళు నా పిల్లలు కాదు అనేది లేదు. మీరంతా నా పిల్లలే అనేదంట, స్వామిని ఆయమ్మ పిల్లలే సమాధి చేశారు. వాళ్ళే దీపం పెట్టేవారు. అలా మొదలైంది బోయకుటుంబంలో పూజారితనం.

**రాజారెడ్డి భార్య:**

పండమేటి గ్రామం పెత్తందారి రాజారెడ్డి భార్య వానలకోసం బొడ్రాయి మీద నీళ్ళు పోయడం కోసం కన్నె పిల్లలకోసం బడికి వచ్చి పంతులు కోనప్ప శాస్త్రిని అడిగింది. ఆయన పిల్లల్ని పంపించాడు. బొడ్రాయి పక్కన నిలబడి ధర్మం గురించి చెబుతుంది. కలికాలంలో ధర్మం కుంటి కాలితో కుంటుతూ నడుస్తుందని పక్కన నిలబడ్డ వాళ్ళకు చెబుతుంది. మాటల్లో పడి బోడ్రాయి మీద నీళ్ళు పోస్తున్న దేవన్న కూతుర్ని చూసి గావు కేక పెట్టింది. "ఎంత పనిచేసినా మాదిగ ముండా" (పు. 87) అని ఒక్క ఏటు వేసింది ఆ దెబ్బకు వెంకటలక్ష్మి కిందపడింది. చుట్టు పక్కల నోర్లు తెరుచుకోని నిలబడ్డ ఆడవాళ్ళ మీద రెంకెలు వేసింది. పొండి పొండి బడి పిల్లలకు "మాదిగ దానితో మైల పడిపోయినంక ఇంక ఎన్ని నీళ్ల బిందెలు గుమ్మరిస్తే ఏం ఫలితమొచ్చె" (పు. 87) అని పంపించింది. వెంకటలక్ష్మిని ఇంకొక ఏటు వేసింది. ఆపిల్లను కట్టడి లేకుండా పెంచుతున్నారని ఆ పిల్ల తల్లిదండ్రులను, వంశాన్ని తిట్టి శాపనార్థాలు పెట్టి వెళ్ళిపోయింది.

ఈ పాత్రలో స్వామి భూస్వాముల భార్య దాష్టికాలను చిత్రీకరించారు. వారు కుల మతాల పేర చిన్న పిల్లలపై కూడా కనికరం లేకుండ ప్రవర్తించే తీరు సహజంగా తెలియజేశాడు.

**గోనబావి రెడ్డి భార్య:**

గోనబావి ఊరిలో రెడ్డి వడ్డే లోకప్పతో బావి తవ్విస్తున్నాడు. రెడ్డి లేనప్పుడు రెడ్డమ్మ బావి పని ఎంతవరకు పూర్తి అయ్యిందో చూసేది. అలా చూసే సమయంలో ఉక్కుకడ్డీ లాంటి శరీరంతో నల్లగా నిగనిగలాడుతున్న లోకప్పను చూసి మోహించింది. అతనితో శారీరక సంబంధం పెట్టుకుంది. రెడ్డి దగ్గరికంటే లోకప్ప కౌగిట్లో ఊటలై పొంగింది. కోర్కె కెరటమై భల్లున బద్దలైపోయింది. బావి పని పూరైన తరువాత ఒక రాత్రి యిద్దరు ఊరు వదిలి వెళ్ళి పోయారు. లోకప్పతో అనుభవం రెడ్డమ్మకి పాతదైపోయింది. రెడ్డి దగ్గర ఉండే వైభవం, రాజసం లోకప్పదగ్గర ఏమి కనిపించలేదు. అవన్నీ గుర్తుకు వచ్చి "లోకప్పను చీటికి మాటికి కస్సు బుస్సులాడి నా పాలిటికి శని మాదిరి నువ్వెక్కడ దాపురించానావురా" (పు.61) అని శాపనార్థాలు పెట్టింది. ఊరికే కండలు పెంచితే సరిపోయెనా... మనిషై పుట్టినంక రోషముండాల్ల" (పు. 61) అని ఎత్తి పొడిచేది. ఏమైనా ఎదురు మాట్లాడితే ఎక్కడ రెడ్డిది తన్నుతుందోనని లోకప్ప భయంతో నవ్వి తలదించుకునేవాడు. దానితో లోకప్ప మరింత లోకువయ్యాడు. ఇప్పుడు ఏ మగవాడినైనా తనకోసం చూస్తే ఆమె అతని రంగు రూపం చూసేది కాదు. అతనిది ఏ కులమో విచారించేది. అతని ముఖం దీనంగా ఉందో దర్పంగా ఉందో గమనించేది. "ఏ మగ వాని ముఖంలోనైనా నిర్లక్ష్యమూ, నిర్భీతీ, పచ్చి అహంకారమూ కనిపించినప్పుడల్లా ఆమె ఆడతనం రహస్యంగా ద్రవించిపోయేది. ఆ విధంగా రెడ్డి భార్య జీవితంలో ఒకటి కావాలనుకొని, దానికోసం ఇంకొకటి వదులుకొని ఆ వదులుకున్న దానిని గురించి జీవితమంతా చింతించి, చింతించి తన యాభయ్యే ఏటనే దేహ విముక్తి" (పు. 63) చెందింది.

**కొండారెడ్డి భార్య:**

ఆమె అబల కాదు, సబల. రెడ్డమ్మ చదువుకోలేదు. కొండారెడ్డిని పెళ్ళి చేసుకొని పిల్లలని కనింది. ఆమెకు స్త్రీ సహజమైన సిగ్గు, మాట తీరు ఏమి లేదు. ఆమె రెడ్డికులంలో పుట్టకపోతే, కొండారెడ్డికి భార్యకాకపోతే ఆమె ఇప్పుడంతా పరమ భీకరంగా తయారయ్యేది కాదు. మగ కూలోళ్లను బండ బూతులు తిడుతుంది. ఆ తిట్లకు సర్పంచ్‌లూ, ఎమ్మెల్యేలూ ఆమె ఎదుట ప దేదానికి జంకుతారు. కొండారెడ్డి సంతాపసభలో తన భర్త గొప్ప రాజకీయ నాయకుడు, దేశం కోసం ప్రాణాలు అర్పించి అమరవీరుడయ్యాడు. నాభర్త ఈ సమాజానికి

చేయాల్సిన మేలు మిగిలిపోయింది. ఆయన ఆశయాల్ని నేను కొనసాగిస్తానని పిడికిలెత్తి ప్రతిజ్ఞ చేసింది.

కొడుకు గంగులరెడ్డి కబీర్ భార్యను బలవంతంగా ఎత్తుకువచ్చాడు. ఆమె జాడ తెలుసుకొని వచ్చిన కబీర్‌ను చూసి "ఇంకో వారం దినాలు ఉంటే నీ భార్య అరిగిపోతుందా?" (పు. 150) అని వెళ్ళగొడుతుంది. కొడుకు దుర్మార్గాలకు మురిసి పోతుంది. గంగుల రెడ్డి ఆకృత్యాలకు ప్రజలు విసికిపోయారు. అందరు టిడిపీ వైపు మొగ్గు చూపుతున్నారు. అందుకని కాంగ్రెస్ పార్టీ రెడ్డమ్మకు టికెట్ ఇస్తామంది. రెడ్డమ్మ ససేమిరా అంది. "ఆయమ్మ తన జీవిత లక్ష్యం ఒక్కటే! తన భర్త రాజకీయ వారసత్వాన్ని తన కొడుకులో చూసుకోవల్ల! అప్పుడే తన భర్త హత్యకు తన కొడుకు బదులు తీర్చుకోగలుగుతాడు..... తను ఉండగానే తన కొడుకు స్థానం కాంగ్రెస్ రాజకీయాల్లో పదిలం కావల్ల" (పు. 151) అనుకుంది.

సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటర్లు మొగ్గుచూపారని తెలిసింది. రెడ్డమ్మా జీపు వేసుకోని తిరుగుతూ రిగ్గింగ్ చేయించింది. రిగ్గింగ్‌కు వీలు కాని బూతులపై వేలు పెట్టి చూపించి, బాంబులు వేయించింది. కొడుకు రాజకీయ భవిష్యత్తుకోసం సర్వవిధాల కృషి చేసి రెడ్డమ్మ అబలకాదు సబల అని నిరూపించుకుంది. కొడుకు రాజకీయ భవిష్యత్‌కోసం సర్వవిధాల కృషి చేసి రెడ్డమ్మ అభలకాదు సభల అని నిరూపించుకుంది. మనకు అనంతపురం రాజకీయాల్లో రెడ్డమ్మ లాంటి పాత్రలని కొన్ని కోణాలు గల వ్యక్తులు తారస పడతారని గమనించవలసిన అంశం.

**3.3.5.నవల విశ్లేషణ:**

'మీ రాజ్యం మీరేలండి' నవల రాయలసీమ సాహిత్య చరిత్రలో ఒక అద్భుతం. ఫాక్షన్ రాజకీయాలను ఇంత ప్రతిభావంతంగా చిత్రించిన నవల మరోటి లేదు. అందుకే వల్లంపాటి వెంకటసుబ్బయ్య ఈ నవల గురించి రాస్తూ కళాకారులకు, సాహిత్యకారులకు భద్రతలేని సమాజంలో బండి నారాయణస్వామి ఇలాంటి నవల రాయడానికి ఎంతో ధైర్యం వుండాలంటాడు. మీ రాజ్యం మీరేలండిలో పటిష్టమైన కథ ఉంది. "కథలో వాస్తవికత ఉంది. కథలోని ప్రతి అంశాన్ని గురించి రచయితకు ఉండవలసినంత పరిజ్ఞానం ఉంది, అనుభవం ఉంది. రాయలసీమ జీవితాన్ని ప్రభావితం చేస్తున్న అనేకాంశాల ప్రస్తావన ఉంది. కానీ జీవితం మాత్రమే సాహిత్యం కాదు. సాహిత్యానికి జీవితం ప్రధానమైన ముడిసరుకు మాత్రమే. జీవిత పునాది లేకుండా గొప్ప సాహిత్యం మరీ ముఖ్యంగా గొప్ప నవల రూపొందే అవకాశం లేదు. కానీ జీవితం గొప్ప సాహిత్యంగా – గొప్ప నవలగా – రూపొందే క్రమం మీద ఈ నవలలో ఉండవలసినంత శ్రద్ధ కనిపించదు" ( వెంకటసుబ్బయ్య,వల్లంపాటి .2006.129).

నవలలో ప్రధాన ఇతివృత్తం ఫ్యాక్షనిజం గురించి ఉంది. అయితే, రచయిత భావవాదాన్ని, భౌతికవాదాన్ని రెంటినీ సమన్వయం చేసే ప్రయత్నం చేస్తాడు. ఈ వైఖరి పాఠకులను కాస్తా కంగారుపెడుతుంది. వాస్తవానికి కమ్యూనిస్టు ఉద్యమాలకీ, ఫ్యాక్షనిజానికా మధ్య అనుకోని సంబంధం ఏర్పాటు చేశారు. రెడ్డి కుల ఫ్యాక్షనిజాన్ని ఎదుర్కొనే క్రమంలో కమ్మకులస్తులు విప్లవకారులతో జతకట్టారు. ప్రత్యేక దళాలు ఏర్పాటు చేసుకొని తమను వ్యతిరేకిస్తున్న ఫ్యాక్షన్ గ్రూపులను నిర్మూలించే కృషి చాలా జాగ్రత్తగా చేశారు. అందువల్ల, ఈ వైరుధ్యం చర్చనీయాంశమైంది. రచయిత బండినారాయణస్వామికి మార్క్సిజమన్నా, వివేకానందుడి ఆధ్యాత్మికవాదమన్నా చాలా యిష్టం. శాస్త్రీయత గురించి ఎంత ఆలోచిస్తాడో, శాస్త్రానికి అందనిదాన్ని అసత్యం అనుకోవడాన్ని కూడా అంతే స్థాయిలో ఖండిస్తాడు. బైరాగి తత్వానికి రాయలసీమ సాహిత్యంలో చాలా ప్రాధాన్యత ఉంది. కేశవరెడ్డి రాసిన 'ఇన్‌క్రెడిబుల్ గాడెస్'తో మొదలు బండినారాయణ స్వామి రాసిన 'మీ రాజ్యం మీరేలండి' నవల వరకు ఏదో ఒక

రూపంలో బైరాగి పాత్ర కన్పిస్తుంది. నారాయణ స్వామికి యోగులు, రుషులు, స్వాముల్లో కన్పించే ఆధ్యాత్మికవాదం పట్ల చాలా సానుభూతి ఉంది. దేవుడికి కులభేదాలు లేవని స్వామి అభిప్రాయం. అయితే, ప్రతి సమూహానికి, సమాజానికీ తనదైన ఒక ఆధ్యాత్మికత విధానం ఉంటుందని ఆయన నమ్మకం. అందుకే, కమ్యూనిస్టులు ఆధ్యాత్మిక విషయాలను వ్యతిరేకిస్తే రచయితకు నచ్చదు. కమ్యూనిస్టులకు కులం లేదనే వాదనను ఆయన ఒప్పుకోడు.

కమ్యూనిజాన్ని కమ్మకులస్తులు వలస పాలనా కాలం నుంచి అబ్బిన చదువులతో నేర్చుకున్నారని చారిత్రక విశ్లేషణ చేస్తాడు. "కుటుంబ పరిజ్ఞానం లేకుండా అడవుల్లో బతికినవాన్ని తెచ్చి సమాజంలోకి ఏస్తే, వాడు సమాజాన్ని ఎట్లా అర్థం చేసుకుంటాడు? అదే జరిగింది – మార్క్సిజం మహాతత్వాన్ని చదివి కళ్లు బైర్లు కమ్మిన భారతీయ మేధావుల్లో కూడా! మనోహర్ నాయుడు అట్లాంటి మేధావి. అతడు మార్క్సిజాన్ని; తన సామాజిక జ్ఞానంలోకి ఒక భాగంగా స్వీకరించలేదు. దాన్నే సర్వస్వంగా స్వీకరించాడు. వర్గాలు మాత్రమే ఉన్న పాశ్చాత్య సమాజంలో పుడితే, ఆ మార్క్సిజాన్ని కులాలు తప్ప వర్గాలు లేని భారతీయ సమాజం మీద ఆరోపించాలని చూసినాడు" (పు. 131). ఇలా రచయిత కమ్యూనిస్టుల గురించి చాలా లోతైన విమర్శ చేస్తాడు. మనోహర్ నాయుడు, మల్లయ్యల మధ్య చాలా సార్లు అనేక విషయాల మీద చర్చ జరిగింది. ఒకరకంగా మనోహర్ నాయుడి దగ్గరే మల్లయ్య మార్క్సిజం గురించి నేర్చుకున్నాడు. కానీ, అనేక రోజులు గడిచిన తర్వాత మల్లయ్యకు నేర్చుకోవాల్సిందే మనోహర్ నాయుడి దగ్గర లేదని గ్రహించాడు. బుద్ధుడు భావవాదని, కాదనీ ఇద్దరి మధ్య చర్చ జరిగింది. భావవాదం అనే మాట భారతీయ సమాజంలోని సూఫీల్ని, భక్తికవుల్నీ, యోగుల్నీ వాళ్ల తాత్వికాన్వేషణల ఫలాల్నీ తెలుసుకునేదానికి ఉపకరించే దృష్టి భావవాదంలో లేదని మల్లయ్య భావన. ఈ భావాలన్నీ నిజానికి రచయితవి. ఇలాంటి విషయాలన్నీ కథకు ప్రతిబంధకంగా మారిపోయాయి. వల్లంపాటి వెంకటసుబ్బయ్య ఈ నవలను విమర్శిస్తూ ఇలాంటి ప్రస్తావనలన్నీ అసందర్భంగా వున్నాయని అంటాడు.

"స్వామికి మార్మికత మీద నమ్మకం ఉండకూడదని చెప్పే అధికారం ఏ సాహిత్య విమర్శకునికి లేదు. వాటిని స్వామి తాత్విక గ్రంథాలు రాసుకోవచ్చు, కరపత్రాలు రాసుకోవచ్చు. కానీ ఒక నవలలో దాని వస్తువుతో ఎలాంటి సంబంధమూ లేనప్పుడు వాటిని ప్రస్తావించటం, వాటిని నమ్మరని తాను భావించే వారి మీద విరుచుకుపడటం అనవసరం. అది కళలో భాగం కాదు. పండమేటిసామి సమాధివద్ద కలిగిన ఆధ్యాత్మికానుభూతి (కరెంటు షాకు కొట్టినట్టు అన్పించటం) కూడా కథావస్తువుతో ఎలాంటి సంబంధమూలేదు. సామాజిక పరిణామాలను అర్థం చేసుకోవడానికి సామాజిక చలన సూత్రాలు మాత్రమే ఉపయోగపడుతాయి. ఈ అంశాన్ని గురించి స్వామి ఐడియేషనల్ లెవెల్‌లో మరింత లోతుగా ఆలోచించవలసిన అవసరం ఉంది. దానికంటే ముందు మానసిక గందరగోళాన్ని తగ్గించుకోవలసి ఉంది" (పు. 130–131) అని తీవ్రంగా విమర్శించాడు. కమ్యూనిస్టు గోవిందు పాత్రను లంపెన్ పాత్రగా చిత్రించటం ద్వారా గొప్ప త్యాగధనులను కూడా అవమానించినట్టు వల్లంపాటి వెంకటసుబ్బయ్య భావించాడు. కథాకథనంలో చూపించిన కళాప్రతిభ నిరుపమానం. ఫ్యాక్షన్ రాజకీయాల్లో మాదిగ, బోయ కులస్తులు బలిపశువులవుతున్నారని ఎంతో చక్కగా కథను చూపించాడు. శూద్ర ఆధ్యాత్మికవాదానికి ఈ నవల మంచి సాక్ష్యం. రాయలసీమ ప్రాదేశికత్వాన్ని అద్భుతంగా చిత్రించిన శూద్ర రాజకీయ నవల.

–0–

# 4. ఆంధ్ర ప్రాదేశిక నవల - బహుజన చైతన్య విశ్లేషణ

ఆంధ్ర ప్రాదేశిక నవల తెలుగు సాహిత్యంలో ప్రధానమైంది. తెలుగు నవల అనగానే ఆంధ్రప్రాంతం నుంచి వెలువడిన నవలలే గుర్తొస్తాయి. తొలినవల రాయలసీమ నుంచి వెలువడింది. అదేకాలంలో కందుకూరి వీరేశలింగం రాసిన 'రాజశేఖరచరిత్రము' వెలువడింది. చిలకమర్తి, పానుగంటి మొదలు ఉన్నవ లక్ష్మీనారాయణ, విశ్వనాథ సత్యనారాయణ, పిలకాగణపతిశాస్త్రి, గుడిపాటి వెంకటాచలం, శ్రీపాద, మొక్కపాటి, మునిమాణిక్యం, నోరి, గోపీచంద్, కొడవటిగంటి కుటుంబరావు, ఓల్గ ఆనంతర నవలారచయితల వరకు ఎంతో మంది ప్రఖ్యాత రచయితల వరకు ఆంధ్రప్రాంతంనుంచి వచ్చినవారే. అందువల్ల తెలుగు నవల వికాసంలో ఆంధ్రప్రాంతం చేసిన కూర్పు అసమానమైంది.

ఈ ప్రాంతం నుంచే సంఘసంస్కరణోద్యమ నవల, జాతీయోద్యమ నవల, చారిత్రక నవల, ఆధ్యాత్మిక నవల, విప్లవనవల, స్త్రీవాద నవల, దళితనవలలు విరివిగా వచ్చాయి. ఆంధ్రప్రాంతంలో జరిగిన రాజకీయ, సాంఘిక ఉద్యమాలు, కమ్యూనిస్టు పోరాటాలు వైవిధ్యపూరితమైన నవలలు రావడానికి దోహదపడ్డాయి. నిరంతరం భావజాల సంఘర్షణలు జరగడం వల్ల విభిన్నమైన వాదోపవాదాలు కూడా జరిగాయి. ఆధునికత ప్రభావం వల్ల నవల కొత్తపుంతలు తొక్కింది ఇక్కడే. చలం నవలలు పాఠకలోకాన్ని ఉద్వేఘ్నులను చేశాయి. కొడవటిగంటి కుటుంబరావు నవలలు సమాజాన్ని వర్గదృష్టితో చూడటం ఎలాగో తెలుపుతాయి. మానవజీవన సంవేదనలను పట్టించిన త్రిపురనేని రచనలు, మనోవైజ్ఞానిక నవలలు రాసిన బుచ్చిబాబు ఇక్కడివాడే. దళితుల జీవితాలను చిత్రించిన స్పార్టకస్, జి.కల్యాణ్‌రావు, డా. వి.చంద్రశేఖర్‌లు కూడా ఇక్కడివారే. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ్ కూడా ఈ ప్రాంతంవాడే. పద్మశ్రీ గుర్రం జాషువా, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, పద్మశ్రీ బోయిభీమన్న జన్మస్థలం కూడా ఆంధ్రప్రాంతమే. తెలుగు నవలకు లక్షణాలను, సొగసులను ఆంధ్రప్రాంతం నుంచే అందించటం జరిగింది.

అణగారినవర్గాల జీవితాల విముక్తి సమస్యను ఉన్నవ 'మాలపల్లి'లో చర్చించటం జరిగింది. గాంధీ సిద్ధాంత ప్రభావం, అభ్యుదయ రచయితల ప్రభావం ఆంధ్రనవల రచయితల మీద ఎక్కువగా ఉండేది. కానీ, స్వతంత్రోద్యమ కాలంలోను, స్వతంత్రానంతర కాలంలోను వచ్చిన నవలలు కుల సమస్యను చర్చింటం ఆపేశాయి. విశ్వనాథ సత్యనారాయణ వైదిక సంప్రదాయం పేరుతో వర్ణధర్మాన్ని సమర్థిస్తూ రచనలు చేశాడు. ఆ రచనల అంతిమ లక్ష్యం వర్ణ, కుల వ్యవస్థలను పునరుద్ధరించటం. అయితే, ఆ నవలలకు ప్రతిస్పందనగా అభ్యుదయ, విప్లవ రచనలను ముందుకు తెచ్చారు.

కానీ, వర్ణధర్మ నవలలకు ప్రతిఘటన దళితనవల. అభ్యుదయ సాహిత్యం విరివిగా వస్తున్న కాలంలోనే 1948లోనే మహాకవి గుర్రం జాషువా 'చిన్నా నాయకుడు' అనే నవల రాశారు. ఆ తర్వాతి కాలంలో ఆచార్య  కొలకలూరి ఇనాక్ నవల రచన 1950 దశకం నుంచి మొదలైంది. ఆయన రాసిన నవలల్లో తొలినాళ్లలో అభ్యుదయం, స్త్రీసమానత్వం, విద్యాభివృద్ధి, సంఘసంస్కరణ కనిపించేవి. అన్ని నవలల్లో కుల సమస్యను అంతర్లీనం చేయటం ఇనాక్ రచనల్లో కనిపిస్తుంది. 1960 దశకంలో దళితవాదం మొదలైంది. దళితవాదానికి ప్రారంభసూచకంగా ఇనాక్ రచనల్లో కుల సమస్యను ప్రధాన వస్తువుగా చేసుకోవటం కనిపిస్తుంది. విప్లవ సాహిత్యం విరివిగా వస్తున్న కాలంలో కూడా ఇనాక్ సాంఘిక సమస్యలను

చర్చించాడు. ఆ కొనసాగింపుగా స్పార్టకస్ 'ఖాకీబతుకులు' రచించాడు. పోలీసుశాఖలో వున్న కుల వివక్షను, కులం ఎలా ఆ శాఖను నియంత్రిస్తుందో తెలియ చేస్తాడు. స్పార్టకస్ కన్న మరింత స్పష్టంగా దళితవిముక్తి సమస్యను డా॥ వి.చంద్రశేఖర్‌రావు చర్చించాడు. మ్యాజికల్ రీయలిజం ప్రక్రియను సమర్ధవంతంగా ప్రయోగించాడు. 'ఐదు హంసలు' నవలలో దళితవాదం, విప్లవవాదంల మధ్యవున్న వైరుధ్యాన్ని ఎంతో కళాత్మకంగా చిత్రించాడు. ఆయన తర్వాత విప్లవ రచయిత జి.కళ్యాణరావు 'అంటరానివసంతం' నవలను వెలువరించాడు. నిర్దిష్టతను రచయిత పట్టించుకోవటం మొదలైంది. అస్తిత్వాన్ని పరిశీలించుకోవటం, వ్యక్తీకరించుకోవటం మొదలైంది. ఆ క్రమంలోనే సంచారతెగ యానాది కులస్థుడైన ఏకుల వెంకటేశ్వర్లు 'ఎన్నెల నవ్వు' రచించాడు. యానాదుల జీవితమే వస్తువుగా కుల నిర్మూలనకు మార్క్సిజం సరిపోదనీ, అంబేద్కరిజం మాత్రమే పరిష్కారమని కథానాయకుడు ఈ నవలలో గ్రహిస్తాడు. తొలిముస్లిం నవల 'వెండిమేఘం' రాసిన సలీం కూడా ఈ ప్రాంతంవాడే. ముస్లిం సమాజంలో అంతర్గత సంస్కరణలు రావాలంటే ముస్లింలు చదువుకోవాలని, భూమికలిగివుండటం, విద్యావంతులు కావటం వల్లే ముస్లిం సమాజం అభివృద్ధిచెందుతుందని సలీం ఈ నవలలో చెప్తాడు.

కులాన్ని గుర్తించ నిరాకరించీ, కేవలం అగ్రవర్ణ సమాజంలోని కుటుంబ, కులసంబంధాలను మాత్రమే చర్చించి, అగ్రవర్ణ సమాజాన్ని సంస్కరించుకొనే కుహానామేధావుల జీవితాలను ఇతివృత్తంగా చేసుకొనే ఆంధ్రనవలను అణగారిన కులాల వాడల్లోకి, సంచారతెగల సంగం తోపుల్లోకి దళిత రచయితలు నడిపించారు. ఈ నవలా పరిణామక్రమం సామాజిక పరిణామక్రమాన్ని ప్రతిబింబిస్తుంది. ఆధిపత్య భావజాలంతో బహుజనవాదం తలపడుతున్న దృశ్యాన్ని ఈ నవలలు చూపిస్తాయి. నవలా శిల్పంలో ఈనవలలు ఎంతో పరిణితిని సాధించాయి. అంటరానివసంతం నవలా చిత్రణకు కొత్తమార్గాలు చూపింది. నల్లమిరియం చెట్టు మ్యాజికల్ రియలిజం శైలితో నడుస్తుంది. నవలా నిర్మాణ పద్ధతులను ఈ బహుజన దృష్టి అనేక మార్గాలను తెరిచాయి. అగ్రవర్ణ సమాజం యొక్క మెప్పును, విమర్శకుల ప్రశంసలను ఈ నవలలు పొందాయి. అయితే, ఈ నవలలను మరింత లోతుగా అధ్యయనం చేయాల్సివుంది.

## 4.1.అంటరాని వసంతం-కొనసాగుతున్న దళితుల పోరాటం

అంటరాని వసంతం రచించి ఇప్పటికి 14 సంవత్సరాలైంది. యావత్తు తెలుగు ప్రాంతంలో ఉన్న దళితుల స్థితిగతులను తెలియజేయటానికి ప్రతీకాత్మకంగా అంటరాని వసంతం అనే పేరును ఎన్నుకున్నారు. సమాజంలో దళితులంటే అందరికి చిన్న చూపే. 150 సంవత్సరాల దళితుల స్థితి గతులను తెలియజేసి, వారు ఆత్మగౌరవం కోసం జానెడు భూమికోసం ఏవిధంగా మదనపడ్డారో, దానికోసం ఏవిధంగా పోరాటం చేశారో వారి మానసిక, శారీరక స్థితిగతులను లోతుగా ఈ నవలలో కళ్యాణరావు చిత్రీకరించాడు. అంటరాని వసంతం ఏడు తరాల జీవితాన్ని దగ్గరగా చూపిస్తుంది. అంటరాని వసంతంలో శ్రమజీవుల బతుకుపోరు, దానితో పాటు ఆటా, పాట, వాస్తవిక జీవితచిత్రణ సృజనాత్మకంగా చెప్పటంతో ఈ నవల కవితాత్మక కావ్యంగా ఆవిష్కరణ జరిగింది. అయితే కళ్యాణరావు ఈ నవలను విరసం దృష్టినుంచి దళిత సమస్యకు పరిష్కారం చెప్పారు.

### 4.1.1. జి. కళ్యాణరావు పరిచయం:

రచయిత పేరు: జి కళ్యాణరావు

స్వగ్రామం : ఆలకూరపాడు, టంగుటూరి మండలం, ప్రకాశం జిల్లా.

రచనలు : నేనేమడిగానని (కథలు)అంటరానివసంతం(నవల)ఈ నవలలు ఆంగ్లములోనికి అన్‌టచబుల్ స్ప్రింగ్ అనే పేరుతో అనువాదం

చేశారు. ఈయన విప్లవ రచయిత సంఘంలో ప్రధాన కార్యదర్శిగా చేశారు. మార్క్సిజాన్ని అనుసరించి రచనలు చేశారు.

**4.1.1.1. అంటరాని వసంతం-కథా పరిచయం**

ప్రకాశం జిల్లాలో అంటరాని వారు అనుభవించిన కష్టాలను, క్రైస్తవ మతంలో చేరిన తరువాత వారి జీవితాలలో కలిగిన మార్పులు కమ్యూనిస్టు ఉద్యమం నేపథ్యం నుండి, రచయిత ఈ నవలలో వివరించారు. దళితుల కళా ప్రావీణ్యాన్ని అగ్ర వర్ణాలే కాక చరిత్రకారులు కూడ అణచివేశారని రచయిత భావించాడు. దళితులను ఆర్థిక దోపిడి నుండి సామాజికమైన అణచివేతల నుండి విముక్తి కలిగించాలంటే వారికి సాయుధ పోరాటమే శరణ్యమని కళ్యాణరావు భావించాడు.

అంటరాని వసంతంలో కథను రూబేను తన భార్య రూతుకు తన పూర్వికుల కథను వివరంగా చెబుతాడు. చెప్పేటప్పుడు ఆయా సంఘటనలను తలుచుకోని కన్నీళ్ళు పెట్టుకున్నాడు. రూబేను తాత ముత్తాతల కథ ఇందులో ఉన్నది. వీళ్ళ కథకు పురాణాలతో కూడా సంబంధం ఉంది. దేవతల శాపం వల్ల జాంబవంతుని వారసులు చచ్చిన గొడ్లను తింటూ, చెన్నయ్య వారసులు వీధులు ఊడుస్తూ బ్రతుకుతున్నారు.

అంటరాని వసంతం కథా స్థలం ఎన్నెలదిన్ని ఎల్లన్న నటుడు, గాయకుడు, కవి. అంటరానితనం కలిసి గుండెల్ని పిండే రాగం అతని గొంతులో వినిపిస్తుంది అక్కడే అన్ని కులాల వారితో పాటు మాదిగల ఇరువై ఇల్లు, దరిదాపు అంతే సంఖ్యలో మాలలు కూడా ఉన్నారు. బ్రాహ్మణుని ఇల్లు ఒక్కటే అది కరణంది. అతనే ఆ ఊరిలో భూస్వామి. ఊళ్లో వివిధ వృత్తుల వారి పేరిట ఉన్న మాన్యాలన్ని అతడే అనుభవిస్తున్నాడు. కాదనే ధైర్యం ఎవరికి లేదు. లింగాలు, ఎర్రెంకడు, ఎల్లన్న, తల్లి దండ్రులు, ఎల్లన్నను మేనత్త భూదేవి పెంచింది. ఆమెకు పిల్లలు లేరు. ఆమె అతనికి కథలు చెప్పింది. ఆట పాటలు నేర్పింది. ఊళ్ళో జరిగిన ఎర్ర గొల్లల నృత్యం చూసి పరవశుడయ్యాడు ఎల్లన్న వాళ్లను చూడాలని వెళ్లిన ఎల్లన్నను మాలోడా అని అతడు తమ మధ్యకు వచ్చాడని అగ్ర వర్గాల వారు కొట్టారు. వాళ్ళ దెబ్బలకు ఆగలేక ఎల్లన్న పరుగెత్తాడు. ఏరు దాటి వెళ్ళాక చూసుకుంటే తన మొల మీద గుడ్డలేదు.. నడవగా నడవగా అతని ఎదుట కొందరు మాలలు చేస్తున్న ఉరుముల నృత్యం కనిపించింది. ఎల్లన్న వెన్నెల దిన్నె మాలోడని తెలిసి ఉరుముల నాగన్న చేరదీశాడు. ఒకప్పుడు నాగన్న ఎన్నెల దిన్నివాడే. అతని నేత్రం, గాత్రం, నాట్యం గొప్పవి.

ఈ దేశంలో కళ కన్న కులం గొప్పది. కళ ఎంతదైన అది అంటరాని వారిదైతే దాన్ని నిరాదరించారు. దళితులు అన్ని పనులతోపాటు చెయ్యరాని పనులు కూడా చేశారు. అయినా అర్ధాకలితో డొక్కలో కాళ్ళు పెట్టుకొని పండుకున్నారు. ఎల్లన్న కోసం భూదేవి దిగులు పడింది. కరణానికి అచ్చిరెడ్డి తల్లితో అక్రమ సంబంధం ఉంది. అతనొక్కనాడు ఆమెను రాత్రిపూట కలవడానికి వెళ్ళినప్పుడు మాదిగ మాతయ్య కరణాన్ని గొడ్డలితో నరికి చంపాడు. అంతక ముందు కరణం ఉరుముల నాగన్న తండ్రి నారిగాన్ని చంపాడు. అందుకు నారిగాడి స్నేహితుడైన మాతయ్య కరణాన్ని నిలువునా గొడ్డలితో నరికి చంపాడు. తన కూతురితో అక్రమ సంబంధం పెట్టుకున్న పంతుల్ని కూడా చంపించాడు. కరణం చచ్చినందుకు దళితులు సంతోషించారు.

నాగన్న, ఎల్లన్న భూదేవి చెంతకు చేర్చాడు. నాగన్న కూడా ఎన్నెల దిన్నెలోనే ఉండిపోయాడు. పిట్టోడు చిన్నమ్మికి పుట్టిన బిడ్డకు నాగన్న సుభద్ర అని పేరు పెట్టాడు. సుభద్ర అందమైనది. పిట్టొడు బాడిస పని చేస్తాడు. పిల్ల చెవికి దిద్దులు, కాళ్ళకి గొలుసులు చేయించాడు. సుభద్ర ఎల్లన్నను మూడు రూపాయల ఆరణాల బలితో పెళ్ళి చేసుకున్నారు. వాళ్ళిద్దరు తన

వద్దే ఉంటారన్నది భూదేవి. ఎర్రెంకడు సరేనన్నాడు. వ్యాపారమంటు వెంకట నరసు, ఆటలంటు ఎల్లన్న ఊర్లు తిరుగుతున్నారు. ఇంటిలో భూదేవి సుభద్ర ఇద్దరే, కొన్నాల్లకు సుభద్ర ఎల్లన్నలకు కొడుకు పుట్టాడు. ఆ పిల్లాడికి శివయ్య అని పేరు పెట్టాడు నాగన్న.

చెంచు లక్ష్మి నాటక ప్రదర్శనలో నాగన్న సూత్రధారుడై అరె సేవకా! ఘనత వహించిన పెద్దమాల అంతే ఘనత వహించిన మాదిగ పెద్ద వచ్చి ఆసనాలు అలంకరించారాటరా! అని అడుగుతాడు. ఆతర్వాతే పెద్దమాల, పెద్దమాదిగ వస్తారు. అది దళితుల ఆత్మగౌరవాన్ని తెలిపే మార్పు, ప్రదర్శన రక్తి కట్టింది చుట్టు ప్రక్కల ఊళ్లో  వాళ్ళు తమ వాడల్లో గూడ ఈ ఆట ఆడమని ఆహ్వానించారు.

మాలోడిదిబ్బను మాల మాదిగలు సాగులోకి తెచ్చారు. తలా కొంత పంచుకున్నారు. ఆ దిబ్బలో నారిగాడు, మాతయ్యలు చిందించిన రక్తం ఉన్నది. ఆపాలని ప్రయత్నించి, అచ్చిరెడ్డి, పిల్లకరణం ఏమి చేయలేక ఊరుకున్నారు. దిబ్బలమిట్టలో నాగన్న, ఎల్లన్న ఆడుతున్న ఆటను అచ్చిరెడ్డి మామ ఆపమని చెప్పాడు. ఆడాలంటే మాల, మాదిగల పెద్దలను గౌరవంగా ఆహ్వానించ కూడదని చెప్పాడు. కాదని ఆడితే, మాల మాదిగ పల్లెలు బూడిద అవుతాయని హెచ్చరించాడు. ఆత్మగౌరవం కోసం నాగన్న ఎల్లన్న కోరికమేరకు ఆటను ఆపివేశాడు. కానీ ఆ దిగులుతో నాగన్న మరణిస్తాడు. వెన్నెలదిన్నె చరిత్రను ఎల్లన్న వీరగాథగా మలిచాడు. ఆ గాథను అల్లిన తర్వాత ఎల్లన్న ఊరొదలి వెళ్ళాడు.

బ్రౌన్ దొర వేమన పద్యాలను వెలుగులోకి తెచ్చిన రోజులవి.  ఆరోజుల్లోనే కుమ్మరి పెద్ద కోటేశ్వరుడు పోతులూరి వీరబ్రహ్మం చరిత్రను ద్విపదల్లో రాశాడు. ఎల్లన్న మాల బైరాగిగా ప్రసిద్ధి పొందాడు. దాలిగుంట వెలుగులో మాల బైరాగి పాటలు పాడితే వాటిని పెద్దకోటేశ్వరుడు రాశాడు. అగ్రకులాల వారు దాడిచేసి పెద్దకోటేశ్వరుణ్ణి చంపేశారు. ఎల్లన్న పాటల ప్రతిని మంటల్లో కాల్చేశారు. పెద కోటేశ్వరుడి చితికి ఎల్లన్న నిప్పు పెట్టాడు. సమాధి కట్టాడు. ఎల్లన్న ఊర్లు తిరుగుతున్నాడు. కొడుకును చూడాలని కల్వరించిన ఎర్రెంకడు దిగులుతో కన్నుమూశాడు.

మాలోడి దిబ్బకు మాల మాదిగలు రాత్రిపూట కాలువ తవ్వి అగ్ర కులాల వారికి తెలియకుండా రహస్యంగా నీరు పెట్టుకున్నారు. మాల చంద్రాయిని అచ్చిరెడ్డి మనుష్యులు కట్టేసి కొడితే, వాడు నిజం చెప్పేశాడు. వాళ్ళు కర్రలతో దాడి చేసి పిట్టోణ్ణి, పోలడిని గాయపరిచారు. సుభద్ర సాహసించింది. నడుం బిగించింది పారతో నీటి జాలుగకు అడ్డంగా వున్న కట్టను తొలగించింది. రెడ్లు నిర్ఘాంత పోయారు. సుభద్ర 'దేవత బిడ్డని' ఊళ్ళో తలిచారు. సుభద్ర మీద పాటలు కట్టి పాడారు. ఎల్లన్నను వెతుకుతూ వెళ్ళిన సుభద్రకు కోడలు శశిరేఖ దొరికింది. శివయ్యకు శశిరేఖతో పెళ్ళి చేసింది.

ఎన్నెల దిన్నె కరువు కోరల్లో చిక్కింది. క్రైస్తవం ప్రవేశించింది. చావు బతుకుల్లో ఎల్లన్న సుభద్ర కోసం ఎన్నెల దిన్నె వచ్చాడు. సుభద్రను కలిసి ఎల్లన్న కన్నుమూసాడు. సుభద్ర కూడ అప్పుడే కన్నుమూసింది. వారిద్దరిని శివయ్య పూడ్చివేసి, బకింగ్‌హాం కాలువ పనుల కోసం బయలుదేరాడు. శివయ్యను చితకగొట్టారు. క్రిష్టమస్ ముందురోజు ఈ దారుణం చేశారు. మార్టిన్ శవాన్ని శివయ్య ఎత్తుకొని వలసపాడు వచ్చాడు. వలసపాడులో అగ్రకులాలు అంతకు ముందే మారణకాండ సృష్టించి మార్టిన్ భార్యను, శివయ్య భార్యను హత్యచేశారు. శివయ్య కొడుకు రూబేని మిషనరీ హాస్టల్లో చేర్చి చనిపోతాడు. రూబేను అక్కడ పెరిగి బోధకుడుగా మారతాడు. తన పూర్వీకుల గూర్చి తెలుసుకోవడానికి హనుమకొండ వస్తాడు. హనుమకొండలో రూతు ఇంటికి వస్తాడు. శివయ్య క్రైస్తవుడయ్యాడు. శివయ్య సియోను అయ్యాడు. అన్ని కులాల వారు క్రైస్తవంలో కలిశారు. అయినా కులాన్ని వదులుకోలేదు. వేలాది

మంది దళితులు ఒకేరోజు బాప్తీసం తీసుకున్న సందర్భాలు కూడ ఉన్నాయి. మతం మారిన క్రైస్తవులను హిందువులు హింసించారు.

కనిగిరిలో నడి బజార్లో మాదిగ క్రైస్తవుల్ని అర్ధనగ్నంగా తిప్పారు. చేతిలోని బైబిల్‌ను కాల్చివేశారు. కరణం అల్లుడు క్రైస్తవుడయ్యాడు. పేరులో శాస్త్రి మాత్రం అలాగే వుంది. క్రీస్తుబోధకుడు మార్టిన్‌ను అగ్రకులాలు హత్యచేశాయి. సియోనును చావచితక గొట్టారు. శారమ్మను, శశిరేఖను చంపేశారు. సియోను( శివయ్య) కొడుకు పేరు రూబేను. ఆస్పత్రిలో బోధకుడయ్యాడు. ఈసంఘటనలన్ని 1920 నాటివి. మత బోధకుడు ఫ్రాన్సిస్ కూతురు రూతు. ఫ్రాన్సిస్ భార్య మరియ, తమ ఇంటికి వచ్చిన రూబేను చూసి తన కూతురు రూతును అతనికిచ్చి పెళ్ళి చేయాలనుకున్నది. వాళ్ళ పెళ్ళి చర్చిలో గొప్పగా జరిగింది.

రూతు నర్సు ట్రైనింగ్ చేసి మిషనరీ ఆసుపత్రిలో నర్సుగా చేరింది. మాల మాదిగలు క్రైస్తవులైన అంటరానితనం పోలేదు. లింగారెడ్డి గాంధీ శిష్యుడయ్యాడు. హరిజన సేవా సంఘంలో చేరాడు. యిమ్మానియేలు మేరి సువార్తను పెళ్ళి చేసుకున్నాడు. 'పందిళ్ళ మాలపల్లి' ఆవలపాడులో వుంది. ఆ గ్రామంలోకి కమ్యూనిస్టు పార్టీ ప్రవేశించింది. ఊరి చెరువు నీళ్ళను వాడుకోవడానికి మాలలు ప్రయత్నించారు. అగ్రకులాలువారు మాలలపై దాడిచేశారు. ఆవలపాడు కమ్యూనిస్టుల రక్తంతో తడిసింది. క్రైస్తవులలో ధనకాంక్ష పెరిగింది. మిషన్ ఆస్తుల పంపకంతో మిషనరీలో పాలక వర్గం రాజకీయాధికారం వున్న రెడ్లు, చౌదర్లు మిషన్ ఆస్తుల మీద రాబందుల్లా వాలారు. ఆ దారుణంలో అల్లుడు (వందనం), కూతురు(రోజీ) భాగమైనందుకు రూతు తట్టుకోలేకపోయింది. ఇద్దరు పిల్లల్ని మద్రాసు కాన్వెంట్‌లో చేర్పించారు. పెద్దవాడు విక్టర్, చిన్నది రూబి. రూబేను కూతురు అల్లుడితో సంబంధాలు తెంచుకున్నారు. ఇస్కరియేతు యూదాకు వీల్లకు తేడా లేదన్నాడు రూబేను.

యిమ్మానియేలు ప్రజల పోరాటంలో అరెస్ట్ అయ్యాడు. అతనిని చూడటానికి వచ్చిన రూబేనుతో పోలీస్ సి.ఐ. 'అట్లాంటి బిడ్డను కన్నందుకు రూబేను క్రైస్తవుడిగా నువ్వు సిగ్గుపడటం లేదు?' అని అడిగాడు. 'గర్వపడుతున్నాను అలాంటి బిడ్డ నాకడుపున పుట్టినందుకు యేసయ్య కన్నా గర్వపడుతున్నాను'. మేరీ కన్న రూతు అదృష్టవంతురాలు. క్రీస్తు నా విశ్వాసం. పోరాటం నా అవసరం శతాబ్దాల సంఘర్షణకు ప్రతిరూపం నా బిడ్డ. పోరాటం ఓ మాల వాడికి మాదిగవాడికి అలంకారం కాదు, ఆదర్శం కాదు, అవసరం. అంటరానివాడిగా పుట్టాను. సెంటు భూమిలేని వాడిగా పుట్టాను, విసిరివేయబడ్డాను. వెలివేయబడ్డాను. నీ మెడలో ఆ శిలువ తీసేయి. నీవు యేసు వైపు లేవు. శిలువ వేసేవాళ్లకి కాపలా ఉన్నావు. నా బిడ్డను కలువడానికి వచ్చాను. నీ ప్రసంగం వినడానికి కాదు అని రూబేను సి.ఐ.కి స్పష్టంగా చెప్పాడు.

విప్లవకారులు ఏం చేస్తారో యిమ్మానుయేలు అదే చేశాడు. దోపిడి మీద తిరుగుబాటు చేశాడు. శ్రీకాకుళ పోరాటంలో చేరాడు. నాగావళి నడకలోకి, వంశదార వంకల్లోకి, సువర్ణముఖి సందడిలోకీ హృదయంతో చూశాడు. పోరాటంలో ప్రాణాలు వదిలివేశాడు. యిమ్మానియేలు అంతిమ యాత్రకు జనం పోటెత్తారు. రూబేను, రూతు కొడుకుకు జోహార్లు అర్పించారు. జెస్సీతో ఆటలు ఆడుకుంటూ రూబేను కుటుంబం కాలం గడుపుతుంది. కాలంతో పాటు జెస్సీ పెరిగి పెద్దవాడు అయ్యాడు. జెస్సీకి గతాన్ని పాటల ద్వారా తెలియజేశారు. కూతురు బిడ్డ రూతు, జెస్సీ అంటే ఇష్టపడింది. జెస్సీ ఇంట్లోచెప్పి ప్రజా ఉద్యమంలోకి వెళ్ళాడు. వెళ్ళేముందు రూబీ, జెస్సీలు ఎన్నెలదిన్నెలో వివాహం చేసుకున్నాడు. జెస్సీ అండర్ గ్రౌండ్‌లోకి వెళ్ళిపోయాడు. రూబీ మహిళల సమస్యలపై బయట వుండి పోరాటం చేస్తుంది. కారంచేడు కంచికచెర్ల, పదిరిపుకుప్పం మరికొన్ని చోట్ల దళితుల పై అగ్రకులాల వారు దాడి చేశారు.

కొన్ని చోట్ల దళితుల్ని చంపి వేశారు. అంటరానివారు నూతన మానవుడిని కల కంటున్నారు. నూతన సమాజం కోసం ఎదురు చూస్తున్నారు.

### 4.1.2.1. అంటరాని వసంతం పాత్రల విశ్లేషణ:

**భూదేవి:**

ఎల్లన్న కూతురు, ఎర్రెంకడి చెల్లెలు, ఎల్లన్నకు అత్త. ఎర్రెంకనికి చెల్లెలంటే అమితమైన ప్రేమ. భూదేవి మాటకు ఎదురు చెప్పడు. ఎన్నెల దిన్నెలో నాకు నువ్వు, నీకు నేను అంటూ పెరిగారు. ఎన్నెల దిన్నిలో ఉన్న అరకుంట బాడవ చేను కాపుగారి కమతంలో కలిపి ఎంకటనర్సుతో భూదేవి పెళ్ళి చేసాడు. ఎంకటనర్సు గుడ్డలు అమ్మే వ్యాపారి. భూదేవికి "ఇంట్లో గింజకు కరువు లేదు, కొత్తా, పాత సందుల్లో యిబ్బంది పడ్డా మొత్తం మీద నెట్టుకు రావచ్చు. బొడ్లో రూపాయలు కాకపోయినా అణాలు, బేడలు వుండేది. తమలపాకు, వక్కా ఒకరికి పెట్టాల్సిందే గాని యింకొకరు కొరికిన వక్క పలుకు నోట్లో వేసుకొని ఎరుగదు భూదేవి. దానికేమమ్మ మొగుడు వూళ్ళెంట వెళ్ళి తెస్తాడు. ఇది నట్టింట మంచమేసు క్కూర్చుంటుందని గిట్టని వాళ్ళు అయిష్టంగా గిట్టిన వాళ్ళు యిష్టంగా అనుకుంటారు" (పు. 14).

భూదేవికి అల్లుడు ఎల్లన్న అంటే ప్రాణం."భూదేవికి కడుపు కాయలేదు. అల్లుడే బిడ్డ అనుకుంది" (పు. 16 ). "అల్లుడ్ని ఆటల్తో వాడిని పెంచింది. పాటలల్తో పెంచింది" (పు. 15). ఎల్లన్నను ఊరివాళ్ళు కొట్టి తరిమి వేయగా వాడు ఎటో పారిపోయాడు. ఎల్లన్న మీద ప్రేమతో భూదేవి తిండి తినలేదు. ఎర్ర గొల్లల గుడారాల దగ్గర జరిగిన సంఘటన భూదేవికి తెలిసి భూదేవి తట్టుకోలేకపోయింది. వాళ్ళ అంతు తేలుస్తానని బయలుదేరింది. వాళ్ళ బతుకులు బూడిద చేస్తానంది. పెద్దలు వారించారు. సాటి వయస్సు వాళ్ళు అడ్డుపడ్డారు. "భూదేవి తెగించిందంటే ఎంతైనా చేస్తుంది. తర్వాత ఏం జరుగుతుందో పట్టించుకోదు" (పు. 46). "పెద్దమాల ఎంకటనర్సుతో దాని నోరు అదుపులో పెట్టరా" (పు. 46).అన్నాడు పెద్దమాల హెచ్చరికతో ఎంకటనర్సు బెంబెలెత్తాడు. భూదేవి మాత్రం అల్లుడిమీద దాడిని భరించలేక నోరు అదుపు తప్పింది. పెద్దమాల మాటలు తెలిసి ఆయన ఇంటి మీదకు వెళ్ళింది. ఇలా అయితే మాలపల్లి బూడిదే అన్నాడు. భూదేవి మాటకు మాట రెట్టించింది. "యిట్టాంటి పెద్దమాలలుంటే పల్లె బూడిదే అవుతుందని, అంతటితో ఆగలేదు. ఎల్లన్నని కొట్టిన వాళ్ళని పేరు పేరునా తిట్టింది.... ఊళ్ళో వాళ్ళను తిట్టితే పెద్ద మాలకు భయం పట్టుకుంటుంది" (పు. 46). ఎంకటనర్సు భూదేవిని కొట్టాడు. ఎల్లన్న తల్లి లింగాలు అడ్డుపడింది. భూదేవి తన బిడ్డకోసం పల్లెను, ఊరిని ఎదిరించిన ధీశాలి.... భూదేవి "ఏది మాట్లాడిందయ్యా నా ఆడబిడ్డ... మగాళ్ళంతా పిరికి గొడ్లయితే నా బిడ్డ మాట్లాడింది. నా బిడ్డకాదు, నేను మాట్లాడుతున్న.... నన్నూ సంపండి. అది ఎల్లడి కూతురు, సుబ్బడి మనవరాలు పిరికి గొడ్డుకాదు...." (పు. 47) అని. ఎర్రెంకడి భార్య లింగాలు కూడా భూదేవి స్ఫూర్తితో ఎదురు తిరిగింది. ఎన్నెల దిన్ని మాలపల్లిలో ఏ వొక్క మగాడైనా బూదేవిలా మాట్లాడుంటే ఎట్లా వుండేదో తెలీదు కాని భూదేవి వాళ్ళందరి కంటే గొప్పది" (పు.47). అదే విషయం పై మాలపల్లిలో రచ్చ జరుగుతుంటే పిట్టొడు "బిడ్డ కనపడలేదని భూదేవి నెత్తినోరు కొట్టుకున్న సంగతి గుర్తు చేశాడు.... కడుపు కాలి ఆడ కూతురు అట్టా చేసినవాళ్ళని తిట్టి పోస్తే అది తప్పుఎట్టా అవుతుందని నిలదీశాడు" (పు.48). పై విధంగా పల్లెలో భూదేవి ఒక స్ఫూర్తిని రగిలించింది. ఊరికి, పల్లెకు ఎదురు తిరిగి నిలిచింది. జరిగిన ఘటన పల్లెలో మాములు విషయమైన ఆమె అలా తీసుకోలేదు. తమ కుటుంబానికి జరిగిన అన్యాయానికి ఎదురు నిలిచి పల్లెలో ఒంటరి పోరాటం చేసింది. ఈ పోరాట స్ఫూర్తి మనకు సుభద్ర పాత్రలో

కొనసాగింపుగా సాగింది. తన అల్లుడు ఎల్లన్నకి పిట్టోడు కూతురిని ఇచ్చి పెళ్ళి చేసి, తన ఇంటిలోనే ఉంచుకుంది. మొగడు, అల్లుడు ఊర్లు తిరుగుతున్న ధైర్యంగా కుటుంబాన్ని నెట్టుకు వచ్చింది. అల్లుడి కోసం ఎంతో ఎదురు చూసింది. మనవడు శివయ్య కోసం కష్టపడింది. చివరికి డొక్కల కరువు దెబ్బకు భూదేవి చనిపోయింది. ఈ విథంగా భూదేవి పాత్రను మొదటి తరం స్త్రీ పాత్రగా రచయిత తీర్చి దిద్దాడు. దళిత స్త్రీల పోరాట పటిమను, పల్లెలో పెద్దలు పురుషాధిక్య సమాజం ఎలా నిలువరిస్తుందో నవలలో ఈ పాత్ర తెలియజేస్తుంది.

**ఎల్లన్న:**

ఎర్రెంకడు, లింగాలు కొడుకు. చిన్న సుబ్బడి మనవడు. భూదేవి, ఎంకటనర్సు మేనల్లుడు. అత్త భూదేవి వడిలో ఆటపాట నేర్చినవాడు. ఉరుముల నాగన్న చేతిలో ఆట, పాటకు మెరుగులు దిద్దుకొని అగ్రకులాల కళలకు సవాల్‌గా నిల్చి దళిత కళలతో ప్రధాన స్రవంతి కళకు ఎదురు నిలిచినవాడిగా ఒక ఆత్మ గౌరవ పతాకగా ఎదిగినవాడు. పల్లెల సాహసాన్ని వీరగాథగా గానం చేసినవాడు. భార్య సుభద్రను చరణంగా దేశమంతా పాడాడు. కుల, మతాలకు సవాలుగా మారి ఆట లల్లాడు పాటలల్లాడు, మాల భైరాగిగా మారి చివరకు తన ముగ్గుచుక్కల కర్ర సుభద్ర ఓడిలో చేరి శాశ్వతంగా కన్ను మూశాడు.

ఎన్నెల దిన్నెలో మాల కులంలో ఎల్లన్న పుట్టాడు. ఎర్రెంకడు ఎల్లన్న పుట్టిన రోజు కుల పెద్దకు కల్లు తాగించి సంబరపడ్డాడు. కూత మా దొడ్డదంది మంత్రసాని. పిల్లాడు మేనత్త ముక్కుతో వూడిపడ్డాడని భూదేవిని చూస్తూ అంది. నీళ్ళు పోసిన రోజు బిడ్డకు మేనత్త ఎల్లన్న అని తన అయ్యా పేరు పెట్టింది. వీడు అయ్యచాటు, అమ్మ చాటు బిడ్డ కాదు, అత్త చాటు బిడ్డ భూదేవి. అల్లుడిని ఆటలతో, పాటలతోనే పెంచింది. “ఎదిగే ఎల్లన్న అత్త ఏ రాగం తీస్తే ఆ రాగం తీశాడు. ఏ పాట పాడితే ఆ పాట పాడాడు. అత్త చంకలో కూర్చొని తోలుబొమ్మలాట చూసేవాడు” (పు. 16). ఊళ్ళో ఎర్ర గొల్లలు నాటకం వేస్తుంటే కనిపించలేదంటే “ఎత్తుకొని నిలబడితే కాపుల కంట పడొచ్చు.... అయినా అల్లుడి కోసం బరితెగించి నిలబడేది. ఆట తెల్లవార్లూ వుండేది. ఆటతో పాటు ఎల్లడూ నిద్ర కాసేవాడు” (పు. 17).

ఎల్లన్నకు కులపెద్ద మేనమామ సాంగ్యం చేయమన్నాడు. మేనమామ సాంగ్యం అంటే పంచె పెట్టడం “పంచె అంటే పట్టు పీతాంబరం కాదు. నల్లటి గోసి గుడ్డ” (పు. 15). ఎర్రగొల్లల డేరాల వైపు వెళ్తానంటే వద్దంది అత్త. అయిన వెళ్ళి జనాల మధ్య దూరాడు. ఎల్లన్నను జనాలు మాలోడిగా గుర్తు పట్టి కొట్టడం మొదలు పెట్టారు. దానితో ఎల్లన్న పడుతు లేస్తూ ఊరు కనిపించనంత దూరం పరుగు తీస్తునే ఉన్నాడు. ఏరు అవతలిగట్టుకు చేరాడు. చూస్తే మొలకి గుడ్డలేదు. చుక్కల్ని చూస్తు ఉండేవాడు. “ఆకలి గుర్తొచ్చింది. ఆకలితోపాటు అత్త గుర్తొచ్చింది.... అత్త ఎందుకు వద్దన్నదో యిప్పుడు అర్థమౌతుంది. కాని ఎందుకు వెళ్ళకూడదు. లేత మనస్సులో అలజడి రేపిన ప్రశ్న అది” (పు. 21). ఏడ్పు ముంచుకొచ్చింది. తన ఊరికి ఎంత దూరంలో ఉన్నాడో అంతు చిక్కడం లేదు. ఈ రాత్రంతా యిక్కడే గడిపి తెల్లారి వెళ్లాలనుకున్నాడు. దూరంగా (పక్కల దిన్ని) గంగ జాతర వెలుతురు తొంగిచూస్తు కన్పించింది. ఎల్లన్న అక్కడికి బయలుదేరి వెళ్ళాడు. అది మాలల ఉరుముల నృత్యం. ఆ లయబద్ధమైన సంగీత, నృత్యాలకి “ఎల్లన్న ఆగలేకపోతున్నాడు. ఎన్నెలెదిన్ని గుర్తులేదు. భూదేవి గుర్తుకు రాలేదు. తాటిబద్దలు, దెబ్బలు గుర్తులేవు. చీకటి.... ఆకలి.... అత్త... చుక్కలు ఏవి గుర్తుకులేవు” (పు. 24). ఎల్లన్నకు అంతగా ఉరుముల నృత్యంతో మమేకం అయి ఆడుతూ హారోం హర హర” అన్నాడు, శబ్దం ఆగింది. ఉరుముల నాగన్న అరిచిన వైపు చూశాడు. దిసమొల శివుడు, ఎల్లన్న “బాలశివుడి పాదాల చూశాడు. తీర్చిదిద్దినట్లు అద్భుతంగా, అందంగా, నాట్యం కోసం పుట్టినట్లు.... అట్టాగే చూస్తూ ఉరుముల వాళ్ళకేసి సైగా చేశాడు. శబ్దం

లయబద్ధమైంది. నాట్యం బాల శివుడి రూపమైంది. భూమిని తాకుతో, ఎగురుతో, అందమైన పాదాలు, ఊగుతున్న నడుము స్పందనలని పంచుతోన్న విశాలమైన కళ్ళు సూటిగా గీత గీసినట్టు ముక్కు..." (పు. 25). నాగన్న ఎవర్రా నువ్వు బిడ్డా అన్నాడు. ఎన్నెల దిన్ని మాలోన్నని ఎల్లన్న చెప్పాడు. దాంతో నాగన్న తన గతం గుర్తు చేసుకున్నాడు.

ఎల్లన్న నాగన్న గుండెలపై నిద్రపోయాడు. నిద్రలేచిన ఎల్లన్న అత్త తనకోసం ఏడుస్తాందని,కన్నీళ్ళుఎట్టుకున్నాడు. ఎన్నెలదిన్నిలో భూదేవి ఎల్లన్నను తరుముకున్న విషయం తెలిసి అగ్గిబరాట అయ్యింది. తరిమిన వాళ్ళ సంగతి చూస్తానంది. కుల పెద్దను తిట్టింది. దాంతో భర్త ఎంకటనర్సు భూదేవిని కొట్టాడు. ఎల్లన్న తల్లి లింగాలు అడ్డుతీసింది. ఉరుముల నాగన్న ఎల్లన్నను ఎన్నెలదిన్ని తీసుకువచ్చి అక్కడే ఉన్నాడు. ఎల్లన్న పెరిగి పెద్దవాడయ్యాడు. పిట్టోడు, చిన్నమ్మి అల్లారుముద్దుగా పెంచుకున్న సుభద్ర ఎల్లన్నను ఇష్టపడింది. వెన్నెల రాత్రుల్లో ఒకరి కోసం ఒకరు ఎదురు చూసి కలుసుకునేవారు. అలా కలుసుకునే సమయంలో ఒకసారి మేనత్త భూదేవి చూసింది. ఎల్లన్న సుభద్రను చుక్కల ముగ్గుకర్ర అని పిలిచేవాడు. ఎల్లన్న. "మూడు రూపాయల ఆరణాల ఓలి, కాళ్ళకి గొలుసులు, చెవులకి కమ్మలు పిల్లకి పెట్టేటట్టు మాట్లాడుకున్నారు. ముహూర్తం పెట్టుకోవడం, పెళ్ళి జరగడం రోజుల్లోనే జరిగిపోయింది. ఎల్లన్న సుభద్ర తన దగ్గరే ఉంటారని అంది భూదేవి. అట్టాగేనన్నాడు ఎర్రెంకడు" (పు. 67). ఆటలంటూ ఎల్లన్న ఊళ్ళు తిరుగుతున్నాడు. సంసారం హాయిగా సాగిపోతూంది. మగబిడ్డ పుడితే ఎల్లన్న శివయ్య అని పేరు పెట్టాడు. ఎల్లన్న "చిన్నవాడుగానే నాగన్న దగ్గర పాటకున్న పట్టు నేర్చుకున్నాడు. అడుగుల కున్న లయ క్రమబద్ధం చేసుకున్నాడు. పెద్దయ్యాక చెంచు నాటకం నేర్చుకోవాలని పట్టుబట్టాడు" (పు. 68). నాగన్న ఆధ్వర్యంలో జట్టుకి నాటకం నేర్పబడింది. జట్టుగా "మొదట ఎల్లన్నని చెంచులక్ష్మి పాత్ర వేయ్యమన్నాడు నాగన్న. కాని నరసింహస్వామి పాత్రకి మనిషి దొరకలేదు. అందుకని ఆ పాత్ర ఎల్లన్నే నేర్చుకున్నాడు. ఆతర్వాత ఆపాత్రే ఎల్లన్న పేరుతో చుట్టు పట్ల మారు మ్రోగింది" (పు. 70). ఇలా నాగన్న ఆధ్వర్యంలో ఎన్నెలదిన్ని మాలపల్లిలో నాటకాన్ని స్వేచ్ఛగా మాలమాదిగలు చూశారు. కానీ మొదటి సారిగా అంటరానివాళ్ళ "ఆత్మగౌరవం ఆకాశానికి ఎత్తి పట్టే మాట సాంప్రదాయాన్ని మరో మలుపు తిప్పిన మాట ఆరెసేవకా, అయ్యా ఘనత వహించిన పెద్దమాల, అంతే ఘనత వహించిన మాదిగ పెద్ద వచ్చి తమ స్థానాలను అలంకరించారంటరా" (పు. 72) అని నాగన్న అడిగాడు. ఈ మాటే కథను మలుపు తిప్పింది. ఎల్లన్న జీవితాన్ని మరో కోణంలో ఆవిష్కరించడానికి సాధ్యపడింది. ఈ మాట అన్నప్పుడు నాగన్న, ఎల్లన్నలు ఆ మలుపును ఊహించలేదు. "ఎల్లన్న సహజనటుడు. సామాన్యుడు కాదు... "చూస్తే ఎన్నెలదిన్ని ఆ టెల్లడి ఆటే చూడాలనే మాట చుట్టుపక్కల విన్పిస్తోంది. తర్వాత ప్రహ్లాద నేర్చుకున్నారు... నాగన్న చివరి రోజుల్లో వీరబ్రహ్మంగారి నాటకం మొదలు పెట్టారు. మరోవైపు ఓ విచిత్రమైన వాతావరణం అగ్రకులాల్లో మొదలైంది..... ఆ చుట్టు ప్రక్కల ప్రతి ఊళ్లో ఆ వాతావరణం వాళ్ళకే మింగుడు పడని పద్ధతిలో మొదలైంది. ఎన్నెలదిన్ని ఊరి పెద్దలకైతే అదో తల కొట్టేసిన సమస్యగా ముందుకొచ్చింది" (పు. 74).

ఆ సమస్య ఎందుకు వచ్చిందంటే "ఆటెల్లడి పేరు యితర కులాల్లో కూడా విన్పిస్తోంది.... చాకల్లు, మంగలి వాళ్ళు, కమ్మర్లు పక్కూరికి ఏదో పనిమీద పోయినట్టు పోయి చూశారు. తర్వాత ఆటకే వెళ్తున్నట్టు వెళ్ళారు. అంతటితో ఆగలేదు. ఎన్నెలదిన్నె పల్లెకే వెళ్ళడం మొదలు పెట్టారు. అయినా సరే అది పెద్ద పట్టింపు కాదు.. సహజంగా ఆటకు ముందు 'కరణంగారు వచ్చారా, కాపులు వచ్చారా,' అని సూత్రదారుడు అడగడం వాళ్ళు వచ్చిన తర్వాతే ఆట మొదలు కావడం ఆనావాయితీ" (పు. 74) కాని నాగన్న మాల, మాదిగ పెద్దలను పిలవగా

వారు ఇద్దరు కరణాల్లాగా వచ్చి కూర్చుంటున్నారు. అదే పెద్ద సమస్య అయ్యింది. "నాగన్న, ఎల్లన్నలు పెద్ద దుర్మార్గుల్లా కన్పించారు. మాలాణ్ణి, మాదిగాణ్ణి కరణాలస్థాయిలో, కాపులస్థాయిలో పొగిడే దుర్మార్గం సహించ కూడదనుకున్నారు. ఆయిద్దరికి బుద్ధి చెప్పాలనుకున్నారు" (పు. 75). దానికి రంగం దిబ్బలమిట్టలో సిద్ధంచేశారు. అచ్చిరెడ్డి మామ బుక్కిరెడ్డి వూరది. బుక్కిరెడ్డి దిబ్బలమిట్టలో నాటకం ముందురోజు మాల మాదిగ పెద్దల్ని పిలిపించాడు. ఆటఆడితే రెండుపల్లెలు బూడిద అవుతాయన్నాడు. ఆట ఆడాలనుకుంటే పెద్దమాలని, మాదిగ పెద్దని కరణాల్ని, కాపుల్ని పిలిచినట్టు పిలవకూడదని చెప్పాడు. ఆ విషయం మాల మాదిగలు నాగన్నకు తెలియజేశారు.

ఎల్లన్న నాగన్నకేసి చూశాడు. రంగం మరో మలుపు తిరుగుతుందనుకున్నారు. సూత్రధారుడు మాల మాదిగ పెద్దలను అలా పిలవడం అంత తీవ్రమైందిగా పరిగణించబడుతుందని వాళ్ళు అనుకోలేదు. తమకు తెలియకుండానే తమజీవితాలు మరోవైపు నెట్టబడుతుందనుకున్నారు. నాగన్న ఎల్లన్నకేసి చూశాడు. "ఎల్లన్న జాలు చేప కాదనుకున్నాడు. జాలుకు ఎదురీదే చేప అనుకున్నాడు. అట్టా ఈదుతున్నట్టు ఈ చేపకు తెలీదనుకున్నాడు" (పు. 76). తెలియజేయాలనుకున్నాడు. మాల మాదిగ పల్లెలల్లో పెద్దలకు దిబ్బలమిట్ట విషయం చెప్పారు. అందుకు అందరు ఆట ఆడల్సిందేనని అన్నారు. కాని "మమ్మల్ని పిలవకుండా ఆట ఆడండి" (పు. 82) అని దిబ్బలమిట్ట పెద్దలు చెప్పారు. సమస్యల్లా ఆట ఆడడం దగ్గరకాదు. పెద్దల పిలుపు దగ్గరే. అలా పిలిచి ఆడించుకునే తెగింపు పల్లెల్లో లేదు. అందుకే "ఎల్లన్న ఆట ఆడకుండా వుండటమే ఆత్మగౌరవం మిగుల్చుకుపోవడం అనుకున్నాడు. కనీసం అదన్నా మిగలాలనుకున్నాడు. ఆ మాటే నాగన్నతో అన్నాడు..... ఆట యిప్పుడొద్దు. యింకోసారి ఆడుతామనుకున్నాడు. అంతా నిరాశపడ్డారు. ఆట కన్నా ఆత్మగౌరవం ముఖ్యమనుకొన్నాడు. ఎల్లన్న... ఆమాటే నాగన్నతో అన్నాడు. ఆనిర్ణయం కోసమే నాగన్న ఎదురు చూస్తున్నాడు. ఎల్లన్న కళాకారుడు స్పందించడం కళాకారుడి గుండె కుండే ప్రత్యేకత" (పు. 84). అటువంటి గుణాన్ని సహజంగా కలిగి ఉన్నాడు ఎల్లన్న. అక్కడ నుండి వచ్చిన తర్వాత నాగన్న కొత్త పాటలు పాడుతుంటే వాటిని మనసులో బంధిస్తూ కూర్చొన్నాడు. ఆ రాత్రి నాగన్న ఓటమిని అంగీకరించలేక పాడి పాడి మరణించాడు.

నాగన్న ఆ రాత్రి పాడిన పాటలకు ఎల్లన్నకు అర్థం తెలియడంలేదు. ఇంకా ఎంతమంది బలి అవ్వాలి? ఈ ప్రశ్నకి జవాబు కావాలనుకున్నాడు. జవాబు కోసమే అక్కడ ఉ ండకూడదనుకున్నాడు. ఎక్కడికో వెళ్ళాలనుకున్నాడు. ఎక్కడికో తెలియదు. వెళ్ళేముందు వారం రోజులు కొడుకు శివయ్యతో ఆడాడు. భూదేవితో పాడాడు. అందరూ కలసి తిన్నారు. జీవితమంత ఉధృతమైన వాగు పొంగులా వుంటుందనుకోలేదు సుభద్ర. ఓ రాత్రి నేస్తాల మధ్య కూర్చోని కొత్త పాట, చాల పెద్ద పాట మాల మాదిగ పల్లె సాహసాన్ని ఒక వీరగాథగా ఎల్లన్న అల్లాడు. దాన్నే కథగా పల్లెలో చెప్పించుకున్నారు. కాస్త పనుంది వెళ్ళొస్తానన్నాడు. ఆ కాస్త పని సంవత్సరాల ఎడబాటు అనుకోలేదు సుభద్ర. ప్రకృతిలో ప్రతివస్తువులోను అల్లిక అల్లాడు. అల్లిన ప్రతి పాటలో సుభద్రను ఉంచాడు. అతని పాటకి పల్లవి సుభద్ర. అల్లికకు అసలైన దారం... అట్టా.. జీవితం ప్రతి అంచునా తన పల్లవి సుభద్ర. ఎవరీ సుభద్ర అంటే ఏదీ మాట్లాడడు. నవ్వి వూరుకొంటాడు. ఆ నవ్వే అతన్ని మాలభైరాగిని చేసింది. నెల్లూరు ప్రాంతంలో ఎల్లన్న పదాలు పలకని మాదిగ, మాల పల్లెలు లేవు.

కుమ్మరి పెద్ద కోటేశ్వరుడు ద్విపదలో కవిత్వం రాసేవాడు. ఎల్లన్నను కలుసుకోవడానికి బయలుదేరాడు. కలుసుకున్నాడు. ఎందుకో తెలియదు కానీ అతనికి గురుస్థానం యివ్వాలనుకున్నాడు ఎల్లన్న. యానాది రమణయ్య గురించి ఎల్లన్న చెబుతూ "ఇల్లో దిలి

చాలా ఏళ్లయింది. ఎఱ్ఱగొల్లల ఆట చూశా. కొత్త యిండ్లు కోట కొండవాళ్ళ ఆటలు చూశా. చిందువాళ్ళ చిన మాదిగల చిలకల వాళ్ళ ఆటలు చూశా. జంగం వాళ్ళ జంగాలి పల్లి వాళ్ళ ఆటలు చూశా. దాసరి వాళ్ళ పిచ్చిక గుంటల వాళ్ళ ఆటలు చూశా. సరే మాలవాళ్ళ ఆటలు ఆడా కాని యానాదుల ఆటల్లో వున్న వొడుపు నాకు ఎక్కడా కనబడలా. ఆ గొప్పతనం వీళ్ళ నడుములో వుంది. అంత అందమైన నడుము మరే కులానికీ లేదు. ఆట కోసం పుట్టిందా నడుము. ఆ తిరుగుడు తిరుగొచ్చు. కాని అంత అచ్చు గుద్దినట్టు అందరికీ వుండదు" (పు. 93) అని పెదకోటిశ్వరుడికి చెప్పాడు. ఎల్లన్నను "కుమ్మరి పెదకోటీశ్వరుడు వింతగా చూస్తున్నాడు. పండితుల్లో వుండే ఈర్ష్య, పీఠాధిపత్యం కోసం చేసే కుట్ర యితన్లో లేదనని పించింది" (పు. 93). ఈ రాత్రంతా పాడు. నువ్వు పాడిన పాటలన్ని రాస్తానని రాసాడు. చివర్లో పేరు అడిగాడు. ఆటెల్లడు, పాటెల్లడు అన్నాడు. ఎన్నెల పిట్ట రోద చేస్తూ దూసుకుపోయింది. "ఏం విన్పిస్తుంది దాని రోదల్లో నీకు" అంటే "అంటరానివాడి గుండె గొంతుక" అన్నాడు. "గుండె గొంతుక! ఎట్టా అల్లావు ఆ పదాన్ని నేను కాదు బతుకు అల్లింది... ఆట, పాట, నాయింట పుట్టాయి. ఆట నా బతుకులో లయ నేర్చుకుంది. అందుకే వాళ్ళు నన్ను ఎంత విసిరేసినా అవి నా యింటికే పరుగాతీశాయి... నువ్వు వేదాంతివి అది పండితుల కిరీటం. నాకొద్దు ఆ పదం. నాది బతుకు మనిషి బతుకు, మట్టి బతుకు. శబ్దం నీ పాదాల దగ్గరుంది. తప్పు, నా గుండెల్లో ఉంది" (పు. 95). అలా సాగింది. యిద్దరి మధ్య సంభాషణ రెండు జాముల దాకా. రాత్రి రాసిన రాతంతా పొద్దున్నే ఎల్లన్న చేతిలో పెట్టాడు. వద్దు నీదగ్గర ఉంచమన్నాడు. వీడ్కోలు చెప్పి వెళ్తుంటే ఆ ఊరి వాళ్ళు పెదకోటేశ్వరుడ్ని హత్య చేశారు. ఎల్లన్న పాటల రాత ప్రతులు తగులబెట్టారు. తర్వాత ఎల్లన్నే పెదకోటీశ్వరుడి చితికి నిప్పు పెట్టాడు. అస్తికలమీద సమాధి కట్టాడు. సంపెంగ మొక్క నాటాడు. చుట్టు గంగిరేగి చెట్లు నాటాడు. యానాది రమణయ్య చెట్లకి నీరు పోస్తూ వుండేవాడు. కుమ్మరి పెద్దకోటీశ్వరుడి సమాధి మాల మాదిగ, యానాది మొ॥ అలగ జనానికి సందడి స్థలమైంది.

కాలంతో పాటు దేశంలో (ఎన్నెలదిన్ని) చాలా మార్పులు చాలా స్పష్టంగా కనబడుతున్నాయి. వలస కూలీలుగా వచ్చిన శశిరేఖ పాడిన పాట సుభద్ర చెవిన పడింది. ఆ పాట ఎల్లన్న పాటే అనుకుంది. ఆ విషయం గురించి అడగడానికి వెళ్ళి ఎల్లన్నను గురించి తెలుసుకుంది. ఆ పాట పాడిన శశిరేఖను కోడలిగా తెచ్చుకుంది. దేశాన్ని కరువు పట్టి పీడిస్తుంటే ఎల్లన్న సుభద్రకోసం ఎన్నెలదిన్నికి బయలుదేరాడు.

"ఎవరో వ్యక్తి తూలిపడుతూ యిటే వస్తున్నట్టనిపించింది..... ఆ వ్యక్తి దగ్గరయ్యాడు. యిప్పుడో, ఈ క్షణమో చచ్చేలా ఉన్నాడు. వచ్చినవాడు అంత కన్నా ఏ మాటా మాట్లాడలేనన్నట్లు సుభద్ర... సుభద్ర... ఒకే మాట పదే పదే అంటున్నాడు. శివయ్య ఆమాటతో ఉలిక్కి పడ్డాడు... తన తండ్రే'' (పు. 119)నని అనుకున్నాడు. ''శివయ్య అయ్యని పట్టుకున్నాడు. భుజానికెత్తుకున్నాడు. వడివడిగా అడుగులు వేస్తున్నాడు. అయ్య అక్కడి దాకా బతకాలి. అమ్మ చేరిందాకా బతకాలి" (పు. ). ఎల్లన్న పాటలు అల్లాడు. శివయ్యకి అవన్ని అక్కరలేదు. ముంగిట అడుగులు ఆగాయి. సుభద్ర అట్టాగే ఆగి చూసింది. తనవాడే ఎట్టా వెళ్ళాడు వీడు. ఎట్టా వచ్చాడు యిప్పుడు. ఎక్కడెక్కడో తిరిగిన ఈ పాట తీరా దగ్గర కొచ్చే వేళకి ఎందకిట్టా అలిసిపోయింది. "యిట్టా ఈరా బిడ్డని, శివయ్య ఎల్లన్న తలని ఆమె చేతుల్లో వుంచాడు. సుభద్ర.. సుభద్ర.. సుభద్రకు మాట రావడంలేదు. ఎల్లన్న తలని పయిటతో కప్పింది. గుండెలకు హత్తుకుంది. చేతుల్లో ఎల్లన్న తల నిమురుతుంది. ముంచుకొచ్చిన నిద్ర మళ్ళీ మేలుకువరాని నిద్ర. నిశ్శబ్దం. అంతే పిలిచేందుకు అతనులేడు. వినేందుకు ఆమెలేదు" (పు. 120). ఇద్దరు కలసి మరణించారు. వారిని శివయ్య అలాగే కలిపి సమాధి చేశాడు.

ఎల్లన్న జవాబుల కొరకు దేశ సంచారం చేసి తన పాట, ఆట ద్వారా బడుగు జనాలను చైతన్యవంతం చేశాడు. చివరకు తనపాటకు పల్లవైన సుభద్రను చేరి ఆమె ఒళ్ళో శాశ్వతంగా విశ్రమించాడు. ఎల్లన్న మరణించిన ఆయన ఆట, పాటకు మరణం లేదు. తర్వాతి తరాలకు అది అందించబడి తమ పూర్వీకుల పోరాట గాథను తెలుసుకొని తరతరాలుగా మాల, మాదిగలు ఎలా పోరాడారో క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతిరూపంగా ఎల్లన్న ఈనవల ఆద్యంతం కనబడతాడు.

<u>సుభద్ర</u>:

ఎల్లన్న భార్య, పిట్టోడు, చిన్నమ్మిల ముద్దుల కూతురు. శివయ్య తల్లి, శశిరేఖ అత్త. ఎల్లన్నను ప్రేమించి పెళ్ళిచేసుకుంది. చిన్నతనం నుండి అల్లారు ముద్దుగా పెరిగినా సుభద్ర తన కొడుకు శివయ్య కొరకు కష్టపడిపనిచేసింది. నవలలో ఎల్లన్న ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అయితే ఆ పతాకాన్ని శిఖరం మీద ఎగురవేసింది. నాగన్న ప్రశ్నలకు జవాబు దొరకక ఎల్లన్న దేశాటనం చేస్తే సుభద్ర అగ్రకులాలకు గుండెలపై కాలు మోపి, వారి పెత్తందారీ తనాన్ని ఎలుగెత్తి ప్రశ్నించింది. కడప్రాణం వరకు ఎల్లన్న కోసం ఎదురు చూసింది. చివరికి ఎల్లన్నను ఒల్లోకి తీసుకోని తృప్తిగా కన్నుమూసింది. అంతకుముందు అగ్రకులాలవాళ్ళు సుభద్రను దేవతగా భావించారు. చాకలి వెంకాయి సుభద్రను దేవత అవతారమని ప్రచారం చేసింది.

"పిట్టోడు సుభద్రని మాలపల్లెలో అందరి పిల్లలా పెంచడం లేదు. కాళ్ళకి గొలుసులు తీశాడు. చెవులకి దిద్దులు తీశాడు. ముక్కు పుడక పెట్టుకుంటానంటే ఎరుకల లచ్చిమిని పిల్చి దగ్గరుండి మరీ కుట్టించాడు. ముక్కుకు ముక్కు పుడక చేయించాడు. ఆ చుట్టు పక్కల మాలా మాదిగ పల్లెలో మోకాళ్ళ కిందకి కోక కట్టింది సుభద్రే. అదో విడ్డూరంగా ఊళ్ళో చెప్పుకున్నారు" (పు. 66). ఇంకొకసారి బిట్రగుంట తిరునాళ్ళో ఆ సాముల సులోచనమ్మ సుభద్రను చూసి తెగ ముచ్చటపడింది. ఆ విషయం తెలసి పిట్టోడు దిష్టిలన్ని తీయించాడు. అట్టా పెంచాడు సుభద్రని. "నాగన్న గుండెల మీద, పిట్టోడి మురిపాల్లో, ఎట్టా నడకలు నేర్చుకుంది.... బూదేవిని అడిగితే అంటుంది అది మురిపాలు మూట కట్టుకోని ఎదిగిందని లింగాలు అయితే రెప్ప కొట్టకుండా ఆ పిల్లకేసి అట్టాగే చూసేది" (పు. 65). ఎల్లన్న సుభద్ర మీద పాట కట్టి ఎప్పుడంటే అప్పుడు వినిపించాడు. పాటలో చుక్కల్ని పేర్చాడు. ముగ్గుల్నీ గీశాడు. ఎండాకాలం ఒక రాత్రి ఎల్లన్నను చేయి పట్టుకొని లాగుతున్నప్పుడు పిట్టోడు చూశాడు. "కోళ్ళదిన్ని సంబంధం చూశాడు పిట్టొడు. పప్పుకూటికి రేపు వస్తారని యింట్లో అన్నాడు. అప్పుడు కుండ బద్దలు చేసినట్టు చెప్పింది సుభద్ర. చేసుకుంటే ఎల్లన్ననే చేసుకుంటానంది...... పెళ్ళి జరగడం రోజుల్లోనే జరిగిపోయింది" (పు. 67). పెళ్లై సంసారం హాయిగా సాగిపోతున్నది. సుభద్ర శివయ్యకి కనింది.

ఎల్లన్న ఊళ్ళు తిరగడం. ఎన్నెల దిన్నిలో నాగన్నతో కలసి నాటకాలు నేర్చుకొని ప్రదర్శించేవారు. చెంచులక్ష్మి నాటకంలో ఎల్లన్న నరసింహాస్వామి వేషం వేసి చెప్పే సంభాషణలకు సుభద్ర ఎగతాళి చేసేది. నాగన్న చనిపోయిన తర్వాత ఎల్లన్న దేశాటనం వెళ్ళిపోయాడు. అగ్రకులాలు మాలోడి దిబ్బకు నీళ్ళు రాకుండా ఆపివేశాయి. మాల మాదిగలు అర్ధరాత్రి కట్ట తెగొట్టి మాలోడి దిబ్బకు నీళ్ళు మళ్ళించారు. ఆ విషయంలో ఊళ్ళో తెలసి మాల మాదిగల పల్లెలపై దాడి చేసిన అచ్చిరెడ్డి మనుష్యులు "పిట్టోడ్ని, పోలడ్ని పట్టుకున్న వాళ్ళని పట్టుకొన్నట్టు కింద పడేసి కర్రల్తో కొట్టారు.... పిట్టోడికి చెయ్యి విరిగింది. పోలడి నడుం మీద బలమైన దెబ్బే తగిలింది" (పు. 105). పోలడి గాయం నుండి రక్తం కారుతుంది. మాలా మాదిగల కళ్ళు కన్నీళ్ళు కారుస్తున్నాయి. "ఆనెత్తుటి మధ్య సుభద్ర ఉంది. ఆ కన్నీటి మధ్య సుభద్ర ఉంది పక్కనే ఉన్న పార తీసుకొంది. అంతా చూస్తునే వున్నారు. కోక బిగదీసి

గోచి పెట్టింది. యాడకే సుభద్ర. ఆ గొంతు.. చాల మంది అంటరాని వాళ్ళది" (పు.105) "సుభద్ర ఆగింది. అచ్చిరెడ్డి మడవ దగ్గర. మడవ అంచున కాలు పెట్టింది... మడవ మీద బలంగా పారని దింపింది.... మట్టి లాగి పక్కకు తోచింది. గండి పడ్డ నీళ్ళు పార ఎత్తి అట్టాగే నిలబడింది.... హతాశులై చూస్తున్న అచ్చిరెడ్డి మనుషుల కేసి కాళిలా చూస్తోంది. ఆ క్షణానికి అచ్చిరెడ్డి వచ్చాడు" (పు.106). అన్ని కులాలు సుభద్రను చూస్తున్నాయి. 'దేవ తెలిసిందే' అని చాకలి వెంకాయి అంది. ఇంకా "...గడపదాటి ఎరుగదు. మాల్దె. మా రాజు బిడ్డలా పెంచేడు పిట్టోడు. మొగుడు ఆటలెల్లడు, దేశాలు వట్టి ఆటలాడతా పోయేడు. యదవ కాని ఎదవ. ఎట్టా పోయ్యేడు, దాని బతుకు అట్టా కాలింది. బిడ్డకోసమే బయ్యారపోళ్ళ కోడలా అది సేలగట్ల తొక్కింది" (పు.106) అని సుభద్రను గురించి చెబుతుంది. అంతలో చుక్కిరెడ్డి సుభద్ర పూనకం వచ్చిందని దేవత పూనిందని లేకపోతే ఇలా చెయ్యదని చుక్కిరెడ్డి చెబుతూనే ఉన్నాడు. గండి కోట్టడం నేను సుభద్రగానే చేశానని ఆమె స్వయంగా చెప్పిన రెడ్లు నమ్మేలాగ లేరు. ఎందుకంటే వాళ్ళ ఆధిపత్యాన్ని నిలుపుకోడానికి ఎవరికైన దేవత పూనిందని, దెయ్యం పట్టిందని గండం గడిచేలా చూస్తారు. తర్వాత కొత్త కొత్త వ్యూహాలతో తమ ఆధిపత్యాన్ని నిలుపుకుంటారు. అందుకే అచ్చిరెడ్డి వెనక్కి తగ్గాడు.

"అచ్చిరెడ్డి భార్య వెంకాయిని దొడ్లోకి లాక్కెల్లి జరిగిందంతా చెప్పమంది... సుభద్రలోకి దేవతే చొరబడింది. సుభద్ర మాలింట పుట్టినా పెరిగిన పద్ధతే వేరు. తిరిగిన తీరే వేరు. ఎప్పుడూ మందిలోకి రాని సుభద్ర ఆ రోజు అట్టా చేసిందంటే అదంతా దేవత పనే. ఖచ్చితంగా పనే... ఇంకాస్త కథ కలిపింది. అచ్చిరెడ్డి భార్య అప్రయత్నంగా చేతులెత్తి మొక్కింది" (పు. 109). తర్వాత అచ్చిరెడ్డి మాలుచ్చమ్మ చెట్టు దగ్గర సద్ది పెట్టాడు. మాలా మాదిగలు తిన్నారు. "యిప్పుడు బాడవలో పారే నీళ్ళు బండ్ల బాటలో పారటం మొదలు పెట్టాయి. అక్కడ ఏతాం దొక్కడం మాలాడి దిబ్బ తడవడం మళ్ళీమొదలైంది" (పు. 109). సుభద్ర పొలంలో పనులు చేస్తుంటే పిట్టోడు చూడలేకపోతున్నాడు. నువ్వు కష్టపడొద్దే అంటే వినదు. వలస కూలీల్లో ఒక పిల్ల పాడిన పాట అచ్చు ఎల్లన్న పాడినట్టే పాడింది. ఎల్లన్న ఆచూకీ కోసం సుభద్ర పాట పాడిన పిల్ల దగ్గరకి వెళ్ళింది. పాట గురించి, నేర్పిన వాళ్ళగురించి వాకబు చేసింది. ఆ పిల్ల మాల భైరాగి పాటలు నేర్పాడని చెప్పింది. సుభద్ర ఎవరూ అని అడిగితే చెప్పలేదు. 'సుభద్ర అత్తసేరా' అని ఎల్లన్నను అడిగిందని చెప్పారు. దాంతో తలెత్తి చూడు ఎట్టుంది అత్త అంది.

సుభద్ర శశిరేఖను శివయ్యకిచ్చి పెళ్ళి చేసింది. కరువులో ఎల్లన్న ప్రాణాలు అరచేతిలో పెట్టుకోని సుభద్రను కలవరిస్తూ ఎన్నెలదిన్నికి వచ్చాడు. శివయ్య ఎల్లన్నను గుర్తు పట్టి ఇంటికి మోసుకు వచ్చి తల్లిని పిలిచాడు. ఎల్లన్నను చూసి సుభద్ర కూలబడింది. "యిట్టా ఈరా బిడ్డని, శివయ్య ఎల్లన్న తలని ఆమె చేతిలో వుంచాడు. సుభద్రకు మాటలు రావడం లేదు. ఎల్లన్న తలని పవిటతో కప్పింది. గుండెలకు హత్తుకుంది. చేతుల్తో ఎల్లన్న తల నిమురుతోంది. ముంచుకొచ్చిన నిద్ర. మళ్లీ మెలుకువరాని నిద్ర. నిశ్శబ్దం. అంతే పిలిచేందుకు అతను లేడు. వినేందుకు ఆమె లేదు. శివయ్య ఏడుపు ఒక్కటే మిగిలింది. శశిరేఖ రోదన దానితోడుగా నిలిచింది" (పు. 120) ఇద్దరిని కలిపి పూడ్చి పెట్టాడు శివయ్య.

**<u>. శివయ్య:</u>**

సీమోనుగా పేరు మార్చుకున్నాడు. ఎల్లన్న, సుభద్రల కొడుకు. శశిరేఖ భర్త, రూబేను తండ్రి. ఎన్నెలదిన్ని మాలా మాదిగ పల్లెల్లో పెరిగాడు. ఎన్నెలదిన్నిలో పెరిగి తన వాళ్ళందరిని కరువు కభలిస్తే మట్టి చేసి, బతుకు దెరువుకు వలస బయలుదేరాడు. బతుకు పోరాటంలో ప్రాణాలు నిలుపుకోవడానికి బకింగ్ హాం కాలువ పనులకు భార్యతో శశిరేఖ, బయలు దేరి కుల విషనాగుల దెబ్బలకు భయపడి పరుగెత్తినవాడు. మార్టిన్ ప్రేమతో ఆదరిస్తే కరిగిపోయాడు.

మార్టిన్ సహచర్యంతో క్రైస్తవ మతంలోకి మారి సీయోను అయ్యాడు. భూసమస్యలో మార్టిన్‌ను అగ్రకులాలు చేసిన హత్యను కళ్ళారా చూశాడు. వలస పాడులో శశిరేఖను శారమ్మ హత్య చేసి, ఇళ్లను దహనం చేయడం చూసి కొడుకు రూబేన్‌ను 'యాకోబు' అనే మనిషికి అప్పగించి ఎటో పత్తాలేకుండా వెళ్ళి పోయాడు.

ఎల్లన్న దేశటనం బయలుదేరే ముందు శివయ్యతో ఆడుకొని వెళ్ళాడు. కానీ శివయ్య భూదేవి, ఎంకటనర్సు, పిట్టోడు, చిన్నమ్మి, మాదిగ పోలయ్య, అతడి భార్య ఆటలు ఆడుకుంటు పెరిగాడు. "శివయ్య ఆ ముగ్గురి నెరిసిన గడ్డాల్లోకి వేళ్ళు పెట్టి రుద్దుతూ వాళ్ళు చేస్తున్న పని చూస్తూ ఉండేవాడు. 'తోలు అట్టా ఎట్టా వలుత్తావే తాతా' అని పోలడ్ని అడిగేవాడు... దాన్ని చెరోవైపు శివయ్య, పోలడు పెళ్ళాం పట్టుకుంటే ఓ వైపు పోలడు పట్టుకోని లాగి నేల మీద పరిచి యింకా లాగి మడుచుకుపోకుండా నాలుగువైపులా నాలుగు మేకులు కొట్టేవాడు... చర్మం ఎండాక తుమ్మచెక్క నీళ్ళతో వేసి నాన బెట్టడం కూడా దగ్గరుండి చూసేవాడు. పిట్టోడు బొంగరానికి తరిణ పట్టడం చిత్రంగానే ఉండేది... దాని ముక్కుకి ముల్లు కొట్టి ఆడుకోరా శివ అంటే ఆ బొంగరం తీసుకోని ఎంకటనర్సు దగ్గరకు పరుగు తీసేవాడు. ఎంకటనర్సు బొంగరానికి తాడు పేనేవాడు. తాడు ముడి దగ్గర చిన్న మువ్వ కట్టి ఎట్టా వుంది రా శివ అంటే ఎగిరి భుజం మీద కూర్చొనేవాడు.... అక్కడ తీసిన పరుగుతో మాదిగ పల్లె చేరేవాడు. పోలడి ఇంటి ముందు బొంగరం తిప్పి పోలడి నెరసిన గడ్డాం రాస్తూ... రెండు చిన్ని చర్మం ముక్కల్ని తీసుకునేవాడు పోలడు పట్టీలు వేసేవాడు. శివయ్య కాళ్ళకి తొడిగేవాడు. శివయ్య సంబరం శివయ్యకే తెలుసు" (పు. 100) ఇలా మురిపంగా పెరిగి పెద్దవాడయ్యాడు. వలస పనులకు వచ్చి ఎల్లన్న పదాలు పడిన శశిరేఖతో సుభద్ర శివయ్య పెళ్లి జరిపించింది.

కరువు వెన్నెలదిన్నిను తాకింది. "శివయ్య చాకిరి చాకీరిగానే మిగిలిపోతుంది" (పు. 116). కరువు తన వాళ్ళను పొట్టన పెట్టుకుంది. చివరి క్షణాల్లో వచ్చిన ఎల్లన్నను శివయ్య సుభద్రతో కలిపాడు. మరణించిన వాళ్ళను అలాగే కలిపి సమాధిచేసి బతుకు పోరాటంలో వలస బయలు దేరాడు. బయలు దేరి మాలోడిదిబ్బ దాటుతూ "తన రక్తమంతా ఈ మట్టిలోనే యింకివుంది. తిరిగి రావాలి. తప్పకుండా తిరిగి రావాలి" (121) అని అనుకొంటు భార్యతో "అయ్యా పాటలన్ని వచ్చుగా నీకు శానా వచ్చు దాచివుంచు రాయించి పెడదాం" (పు. 121) అని ముందుకే నడిచారు. దారి మధ్యలో జింకోడు మూగామెతో కలిశాడు. జింకోడు కూడు దొంగతనం చేయడానికి శివయ్యను తీసుకు వెళ్ళాడు. దొంగతనం చేసిన కూడు జింకోడు మూగమెకే ఇచ్చారు. దారిలో మూగామో చనిపోతే పూడ్చడానికి జింకోడు ఆగిపోయాడు.

బకింగ్ కాలువ దగ్గర పనులు చేయిస్తున్న పెద్ద మనిషిని పనికోసం బతిమిలాడితే సరేనన్నాడు. శివయ్య కులం తెలిసి "గుండ్రని మనిషి కళ్ళు ఎర్రబడుతున్నాయి. వెర్రిపుట్టిన వాడిలా అరవడం మొదలు పెట్టాడు. ఈ మాల కొడుక్కి యిక్కడ పని కావల్ట... పని ఆపిన కూలీలు ఆయిద్దరి మీద మట్టిగడలు విసరటం మొదలు పెట్టారు" (పు.126). అక్కడే ఉంటే ప్రాణాలు దక్కవని శశిరేఖ చెయ్యిపట్టుకోని పరుగు తీశాడు. తమ వెంట ఆకలి ఒక్కటే కాదు. అంటరాని తనం కూడా తోడుంటుంది. తమ మీద దాడిచేసింది కూలీలే, కూలీలకు కూడా అంటరాని తనం ముందని వాళ్ళు అలాగే చెట్ల మధ్య ఉండిపోయారు. శివయ్యను ఎవరో తట్టి లేపుతున్నారు. కళ్ళు తెరిస్తే ఎదురుగా మార్టిన్ నవ్వుతూ కనిపించి వాళ్ళకు తాగేందుకు నీళ్ళు, తినేందుకు జొన్నరొట్టె ఇచ్చాడు. తమ గురించి చెప్పారు. ఇలా తరిమిన ప్రతి మాల మాదిగలను బాప్టిస్టు మిషన్ వాళ్ళు ఒంగోలు రాజుపాలెంవద్ద తీసుకున్న నాలుగుమైళ్ళ పొడవు కాల్వ తవ్వడం కోసం ప్రత్యేకంగా తీసుకున్నారు. శివయ్యను మార్టిన్ అక్కడికి తీసుకుపోయాడు. మార్టిన్ భార్య వాళ్ళను ఆదరణగాచూసింది. ప్రార్థన చేయడం నేర్పింది. పిల్లలు లేని శారమ్మ

శశిరేఖను బిడ్డగా భావించింది. శివయ్యకు మార్టిన్ బాప్తిసం ఇప్పించింది. సియోనుగా పేరు మార్చి, ఎల్లన్న కొడుకని తెలిసి అతడ్ని సువార్త ప్రచారం కోసం తన వెంట తిప్పుకున్నాడు. శశిరేఖకు మగబిడ్డ పుడితే వాడు తమ కోసమే పుట్టాడని మురిసిపోయారు. శశిరేఖ కాదనలేదు.

కాలంలో మార్పుతో పాటు అగ్రకులాలు, మతం మారాయి. కానీ కులతోకలు అలాగే తగిలించుకున్నాయి. దళిత క్రైస్తవుల మీద దాడులు ఎక్కువయ్యాయి. ఆ దాడులను మార్టిన్ ఖండిస్తున్నాడు. అధికార్లకు ఆ విషయం చెప్తున్నాడు. సియోను (శివయ్య)కు మార్టిన్ ఎంతో గొప్పగా కన్పిస్తున్నాడు. మార్టిన్ భూమి గురించి అగ్రకులాలకు వ్యతిరేకంగా దొరని కలిశాడు. అగ్రకులాలు కోర్టులో కేసు వేశారు. వారి తరుపున కరణం అల్లుడు యిమ్మానియేలు శాస్త్రి వాదించాడు. భూమి కలిగిన వారు కూడా క్రైస్తవులేనని శాస్త్రి చెప్పినాడు. "అతనికి తెలియకుండా ఏమీ జరగలేద" (పు. 153)ని సియోను మార్టిన్ తో చెప్పాడు. చివరిగా మార్టిన్ సియోనులు 30 కుటుంబాలని చిన్న పిల్లలతో సహా తీసుకొని వెళ్ళి దొర బంగళాలో కూర్చొన్నారు. భూమి దళితుల సొంతమైంది. చౌదర్లు, రెడ్లు ఏకమయ్యారు. క్రిస్టమస్ ముందురోజు ఊర్లు తిరిగి వస్తున్న మార్టిన్‌ను సియోను కళ్ళ ముందే చంపివేశారు. సియోనును చంపినా బాగుండేదన్నంత విపరీతంగా కొట్టారు. మార్టిన్ శవాన్ని మోసుకు వెళ్ళమని కొట్టారు. అలా మోసుకొని వలసపాడు వెళ్ళితే అక్కడ వల్ల కాడు దృశ్యం, శారమ్మ, శశిరేఖల శవాలు పడిఉన్నాయి. వారి మధ్యలో "ఆక్రందన, వెర్రికేకలు, పసివాడి కేకలు, ఆ బిడ్డను చూసి సియోను వీడన్నా బతకాలని తన వంశం ఈ భూమ్మీద ఈ బిడ్డతోనైనా బతికి వుండాలని బిడ్డను తీసుకొని పరుగు తీశాడు" (పు. 156). అలా పరుగు తీసిన సియోను ఎక్కడికి వెళ్ళారో తెలియదు. కొడుకు రూబేను మాత్రం అనాధశరణాలయంలో చేర్పించమని యాకూబు చేతిలో పెట్టి ఎటో వెళ్ళిపోయాడు.

**<u>శశిరేఖ:</u>**

సినసుబ్బయ్య కూతురు, శివయ్య భార్య. సుభద్ర కోరి చేసుకున్న కోడలు. శశిరేఖ ఉత్తరాదినుండి ఎన్నెలదిన్ని పనులకు వచ్చారు. తండ్రి చిన సుబ్బయ్య నాటకాల్లో బలరాముడి వేషం కట్టేవాడు. అందుకే కూతురికి శశిరేఖ అని పేరు పెట్టుకున్నాడు. ఎల్లన్న నేర్పిన పాటలు శశిరేఖ పొలం పనుల్లో పాడింది. ఆ పాటలో పల్లవి సుభద్ర పేరుతో ఉంది. ఆ పాట ఎల్లన్న పాడిందేనని రాత్రికి ఆ పిల్లని ఎదుక్కొంటు సుభద్ర వెళ్ళి, ఎల్లన్న వివరం అడిగింది. ఎల్లన్న కాదు మాల బైరాగి పాట నేర్పాడని శశిరేఖ చెప్పింది. సుభద్ర ఎవరు అని ఎంత అడిగిన ఎల్లన్న చెప్పలేదని చివరకు ' సుభద్ర అత్త వేరా' అని శశిరేఖ ఎల్లన్నను అడిగిందని సినసుబ్బుడు చెప్పాడు. సుభద్ర శశిరేఖ కేసి మరోసారి చూసింది. ఆ పిల్ల తలదించుకొనే ఉంది. తలెత్తు సుభద్ర అంది. యిట్టా సూదు ఎట్టుందీ అత్త అని అడిగింది ఎల్లన్న జాడ తెలియలేదు గాని కోడలు మాత్రం దొరికింది. అత్తా కోడళ్ళు బాగా కలిసిపోయారు. శశిరేఖ అమ్మచాటు బిడ్డ కాదు. అత్త చాటు బిడ్డ. సుభద్ర, శశిరేఖలు అత్తా కోడళ్ళు కావడం వింతగానే ఉంది. ఊరి జనాలకు. శశిరేఖ సుభద్రతో పొలం పనులకు వెళుతుంది.

కరువులో ఊళ్ళో అందరు చనిపోతున్నారు. చివరకు సుభద్ర ఎల్లన్నను చివరిసారి చూచుకొని మరణించింది. వారిద్దరిని పూడ్చి ఊరిడిచి వెళ్తున్న శశిరేఖకు అత్త సుభద్ర గుర్తుకు వచ్చి ఏడ్చింది. వారిద్దరిమధ్య అనుబంధం బలంగా పెనవేసుకుపోయింది. కరువు దెబ్బతో ప్రజలందరూ బకింగ్‌హాం కాల్వ పనులకు వె ళ్తుంటే, శశిరేఖ దంపతులు వాళ్ళతో బయలు దేరారు. దారిలో జింకోడు, మూగామె మధ్య ప్రేమ ఆప్యాయతను చూశారు. ఏమికాని మూగమో కోసం జింకోడు కూడు దొంగతనాలు చేశాడు, ఆమె చనిపోతే సమాధి చేయడం మొ॥నవి మాల మాదిగల ప్రేమతత్వాన్ని తెలియజేస్తాయి. భర్త శివయ్య పాటు బకింగ్‌హాం కాలువ తవ్వకం పని అడిగినందుకు దెబ్బలు తిని మార్టిన్ ఆదరణతో కోలుకుంటారు. మార్టిన్

వేషభాషలు వాళ్ళకి కొత్తగా ఉన్నాయి. కానీ మార్టిన్, శారమ్మ, ఆదరణ వాళ్ళని ఆకర్షించింది. శారమ్మ వీళ్ళ కోసం ప్రార్ధన చేసింది. అన్నం తినేముందు కూరల గురించి వాళ్ళు మాట్లాడుకుంటు తునకల, గోంగూర, రొయ్యల కారం, శారమ్మ కొడితే బాగుంటుందని అంటే శశిరేఖకు సుభద్ర గుర్తొచ్చింది. "రోట్లో రొయ్యల కారం యింత వుంచి 'శశిరేకా' అని పిలిచేది. వుట్టి మీద వాసన కట్టిన నేతి బొట్టు పిడత నిప్పుల మీద వుంచేది. నేతి బొట్టు కరిగాక రోట్లో నేతిబోట్టు పోసేది. శశిరేఖ 'సాలు, సాలు' అంటూ వుంటే నవ్వుతూ రాగి సంగటి ముద్ద రోట్లో వేసి కలిపేది. ఆ ముద్ద అట్టాగే కోడలు కిచ్చేది. శశిరేఖ ఆత్రంగా తినేది" (పు. 135). అందుకే శశిరేఖ "ఈ భూమ్మీద తన అత్తకన్నా ఏ వక్కరూ గొప్పకాదు" (పు. 135) అని అనింది. అత్త గుర్తుకు వచ్చి ఏడుస్తుంది. శారమ్మ శశిరేఖను బయటికి తీసుకెళ్ళి ఓదార్చింది. శివయ్య ఎల్లన్న కొడుకని తెలిశాక శివయ్యను తన దగ్గరే ఉంచుకోవాలని మార్టిన్ అనుకున్నాడు. శివయ్య, శశిరేఖ అక్కడే ఉండిపోయారు. శారమ్మ పిల్లలు లేరని శశిరేఖను బిడ్డగా భావించింది. పిల్లాడు పుడితే తన కోసమే పుట్టాడని అనుకొంది. శశిరేఖ కూడ ఏమి మాట్లాడలేదు. శారమ్మ తన ప్రేమతో శశిరేఖ సుభద్రను కలవరించడం మానేసేలా చేసింది. పుట్టిన బిడ్డలో అత్త ముఖం చూసేది. శశిరేఖ అత్తకు దక్కకుండా ఏ భాగం లేదు అంటే ఒప్పుకోటానికి సిద్ధంగా ఉండదు. శారమ్మకు శశిరేఖ అంటే అందుకే అంత ఇష్టం. జీవితం హాయిగా సాగిపోతున్న సమయంలో భూసమస్యతో అగ్రకులాలతో పోరాడి బంజర్ భూమిని మార్టిన్ సాధించాడు. మార్టిన్‌తో ఓటమిని అంగీకరించడానికి సిద్ధంగా లేని అగ్రకులాలు వలసపాడు పై దాడి చేసి మారణహోమం సృష్టించారు. శశిరేఖ, శారమ్మతో పాటు దాదాపు అందరిని హత్య చేశారు. ఇళ్ళు తగలబెట్టారు. పిల్లాడు రూబేను మాత్రం వదిలిపెట్టారు. దారిలోనే మార్టిన్‌ను అగ్రకులాలు హత్య చేస్తే శివయ్య మోసుకు వచ్చాడు. వలసపాడు వల్లకాడుగా మారి శశిరేఖ, శారమ్మ శవాల మధ్య ఏడుస్తున్న రూబేన్‌ను తీసుకోని శివయ్య వెళ్ళిపోయాడు. ఈ విధంగా ఈ నవలలో శశిరేఖ పాత్ర అత్త చాటు కోడలుగా, ఆమె ప్రేమను గుర్తు చేసుకొని విలపించేదిగా ఉంది. ఎల్లన్న పాటలను ఉత్తరాదినుండి దక్షణాదికి మోసుకొచ్చి ఎన్నెల దిన్నికి మరోసారి ఎల్లన్నను గుర్తు చేస్తుంది. ఎల్లన్నను కలిసినప్పుడు సుభద్ర ఏవరూ అత్తా ! అని ఎల్లన్నను అడిగి చివరకు ఆ అత్తకు కోడలై ఆమె ప్రేమకు పాత్రురాలు అవుతుంది. అందురు పిల్లలు అమ్మచాటు పిల్లలు అయితే శశిరేఖ మాత్రం అత్త సుభద్ర చాటు పిల్లని పిలుపించుకుంటుంది. చివర వరకు ఆ మాటకు కట్టుబడి ఉంటుంది. ఎల్లన్న ఇంటి కోడళ్ళు అత్త చాటు పిల్లలుగా వుండడానికి ఒక రకంగా తానే కారణంగా ఉ ంటుంది. శశిరేఖ తర్వాత రూతు, మేరి సువార్త, రూబిలు అత్త చాటు కోడల్లుగా ఈ నవలలో మనకు కనపడతారు.

**<u>రూబేను:</u>**

శివయ్య (సిమోను), శశిరేఖల కొడుకు. శశిరేఖ హత్య తర్వాత యాకోబు అనే పెద్దమనిషికి అప్పజెప్పి ఎక్కడికో వెళ్ళి పోయాడు. అతడు రూబేనును అనాధ శరణాలయంలో చేర్చాడు. అక్కడే పెరిగి ఆసుపత్రిలో బోధకుడిగా చేరాడు. చేరిన నెల రోజులకు తన తల్లి దండ్రుల వివరాలు యాకూబ్, ఫ్రాన్సిస్‌ల ద్వారా తెలుసుకున్నాడు. నాన్న ఏ వూరు నుండి వచ్చిందో యాకూబ్ తెలియదన్నాడు. రూబేను సొంత ఊరు తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేశాడు. మార్కాపురం, దొనకొండ కూడ తిరిగాడు. అక్కడ వలసపాడు మారణకాండ గురించి ఎంకటేసు చెప్పాడు. జింకోడు కలసి చాల విషయాలు చెప్పాడు. యిప్పుడు ఎన్నెల దిన్నెలో నాన్న తాలుకా ఎవరున్నారో తెలియదు. ఎన్నెలదిన్ని వెళితే ఎల్లన్న సుభద్రల మనువడు గానే రూబేనును గుర్తించారు. తాత ఎల్లన్న గొప్ప కళాకారుడని తెలుసుకొని "నేను యింతకాలం ఓ గొప్ప

వారసత్వానికి దూరంగా ఉన్నానని కన్నీళ్ళు ఆగలేదు" (పు. 159). రూబేను అన్వేషణ మొదలై, 1920 నవంబర్ 17న మొదలై 1924 డిసెంబర్ వరకు సాగింది. మాలాడి దిబ్బ వీరగాథ పూర్తిగా పాడగలిగిన వ్యక్తి దిబ్బయ్య కొడుకు సాంబయ్య హనుమకొండలో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళ్ళాడు. "అక్కడ జీవితం అనుకోని మలుపే తిరిగింది. తాత రాసిన వీరగాథ వినడమే కాదు, తన తోడు రూతును కూడా అక్కడే పొందగలిగాడు" (పు. 159). రూబేను, రూతు పెళ్ళికి శివయ్య, శశిరేఖ తరపు బంధువులనిద్దరిని పిలిచాడు."భోజనాల దగ్గర వాళ్ళతో కలిసి తినాలనుకొన్నాడు రూబేను. వాళ్ళ మధ్య రూతు కూర్చొని వుంది. వాళ్ళలో వక మనిషిగా కలిసిపోయి నవ్వుతుంది... వాళ్ళ దగ్గర కెళ్ళాడు. నవ్వులు ఆపి అతనికేసి చూశారు. వింతనిపించింది. తన కన్నా రూతే వాళ్ళకి దగ్గరలా అన్పిస్తోంది" (పు. 162). గుండెల నిండా ఆనందంతో ఈ జీవితానికి ఇది చాలు అనుకొన్నాడు.

రూతు రూబేను గుర్తు చేసుకొని " రూబేను బోధకుడి కన్నా తిరుగుబాటు దారుడే ఎక్కువ. బహుశ తన పూర్వీకుల జీవితలోతులు అతన్ని అట్టా మార్చి వుండొచ్చు. తనని తాను తెలుసుకోవడానికి తాను గొప్ప శ్రమ పడ్డాడు. జీవితాన్ని సమాజాన్ని చదివాడు. సాహిత్యాన్ని కళని చదివాడు" (పు. 164). ఈ విధంగా రూబేనును రచయిత ఆవిష్కరించాడు. రూతు ఇష్ట ప్రకారం ఎన్నెలదిన్నిలో యిల్లు కట్టారు. ప్రతి ఎండాకాలం అక్కడే జీవితాన్ని గడిపేవారు. అక్కడ పిట్టలతో సహవాసం చేశారు. రూతు రూబేనును "నా అందమైన అంటరానివాడా" అని పిలిచేది. అతని అందమైన నవ్వును ఇష్టపడేది. తమ పిల్లలకు యిమ్మానియేలు, రోజీ అని పేర్లు పెట్టారు. రూబేను తమ పూర్వీకులూ తను పోగొట్టుకున్నది తెలుసుకున్నాడు. "నా పూర్వీకులు పోగొట్టుకున్నదాన్ని వెతుకుతున్నాను. నాతో పాటు నా వాళ్ళంతా వెతకడం మొదలుపెట్టారు. వెతగ్గా వెతగ్గా భూమంతా వెతగ్గా ఆ అంచు నుంచి ఈ అంచు కొచ్చాక నావాళ్ళు పోగొట్టుకున్న భూమి లెక్కతేలింది. బతుకు లెక్క తేలింది" (పు. 173). ఇది రూబేను రాసుకున్న డైరీ. అది పాస్టర్ డైరీలా లేదు, దాన్నిండా ఆత్మగౌరవం తాలుకు పదాలు – భూమి, తాలుకూ అన్వేషణలు మనకు కనబడతాయి. రామానుజంతో గాంధీ, హరిజనపదం, హరిజన దేవాలయ ప్రవేశాల మొ॥ వాటిపై చర్చ చేస్తాడు.

దొరల వద్ద పనిచేస్తున్న రూబేనుకి వాళ్ళ మీద ఆలోచనలు వేరు. "తిరిగి దొరల మధ్య, తాను వుండే చర్చిలో దొరలు, తిరిగే హాస్పిటల్‌లో దొరలు.. కాని ఆంగ్లేయుల పాలన మీద అతని అభిప్రాయాలు వేరు. క్లైదొర మీద తప్ప తక్కిన వాళ్ళ మీద రూబేనుకు గొప్ప ప్రభావంలేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో, కోర్టుల్లో, ఆస్పత్రుల్లో, బ్రాహ్మణుల ఆధిక్యతని రూబేను సహించలేకపోతున్నాడు. తన తండ్రి సిమోను భయాలే రూబేను వెన్నాడుతున్నాయేమోననిపించేది. మతం మార్చుకున్న అగ్రకులాలంటే మరీ ద్వేషించేవాడు" (పు. 177). తన పూర్వీకుల నుండి తమకు జరుగుతున్న అన్యాయాలకు అగ్రకులాలే కారణమన్నాడు. మతం మారితే బతుకు బాగుపడుతుందని అనుకున్నాడు. కానీ మళ్ళీ అక్కడికి అగ్రకులాలు చొరబడ్డాయి. తమ అవకాశాలన్ని తన్నుకు పోయాయి. అందుకే రూబేను దొరతో "వాడు క్రీస్తు కోసం రాలేదు పెత్తనం చెయ్యటానికొచ్చారు. మిషన్ స్కూళ్ళలో ఒకదానికి రెడ్డిని ఉపాధ్యాయుడుగా పెట్టినప్పుడు ఏం మాల క్రిష్టియన్ దొరకలేదా వీళ్ళకి, మాదిగ క్రిష్టియన్ కనిపించలేదా వీళ్ళకి, రెడ్డి క్రిష్టియన్ కావాల్సి వచ్చాడా అంటూ ఎగిరిపడ్డాడు... అట్టా అన్నందుకు మిషన్ పెద్దలు రూబేనును కలిసి అట్టా అనొద్దన్నారు. రూబేను వొప్పుకోలేదు. అట్టాగే అంటానన్నాడు. అతను క్రిష్టియన్, కాదు రెడ్డి. మిషనరీ పెద్దలు యిక మాట్లాడటం అనవసరమనుకొన్నారు. ఒక్కోసారి కులం కోసం తన పాస్టరీ పనినే వదులుకుంటాననేలా వుండేవాడు" (పు. 178). ఇలా రూబేనులో తనకు తెలియకుండానే తరతరాలుగా అణిచివేతలను ఎదుర్కొవాలనే తపన

కనబడుతుంది.

ఒకరోజు కొడుకు యిమ్మానియేలు దగ్గరకు ఆవలపాడు రూబేను రూతు వచ్చారు. మనమడు జెస్సీతో ఆటలు ఆడుకుంటున్నారు. యిమ్మానియేలు బయటకు వెళ్ళాడని భార్య మేరిసువార్త చెప్పింది. కొడుకు వచ్చిన తర్వాత అడిగి కోడలు, మనుమడ్ని ఒంగోలు తీసుకు వెళ్ళారు. కొడుకు నక్సలైట్ అయ్యాడని నీవు సిగ్గు పడడం లేదా అని సి.ఐ చార్లిస్ రూబేనును అడిగితే యిమ్మానియేలు నక్సలేట్ అయినందుకు "గర్వపడుతున్నాను. అట్టాంటి బిడ్డ నా కడుపున పుట్టినందుకు యేసేబు కన్నా మిన్నగా గర్వపడుతున్నా ను మేరి కన్న రూతు అదృష్టవంతురాలు" (పు.110) అని ఇంకా "క్రీస్తు నా విశ్వాసం. పోరాటం నా అవసరం. శతాబ్దాల సంఘర్షణకి ప్రతిరూపం నాబిడ్డ. నా బిడ్డ పోరాటం. ఓ మాలాడికి, మాదిగాడికి అది అలంకారం కాదు. అది ఆదర్శం కాదు. అవసరం. అంటరానివాడిగా పుట్టాను. సెంటు భూమి లేనివాడుగా పుట్టాను. విసిరేయబడ్డాను. వెలివేయబడ్డాను. అన్నిటికీ నా బిడ్డ జవాబులు వెతికి ముందుంచాడు. నీ మెడలో శిలువ తీసేయ్. నువ్వు సిలువ మోసేవాళ్ళ వైపు లేవు. సిలువ వేసే వాళ్ళ కాపలాలలో వున్నావు. నా బిడ్డని నేను కలవటానికొచ్చాను. నీ ప్రసంగం వినడానికి కాదు" (పు.211)అని తరతరాల దాస్యానికి అణచివేతలకి విముక్తి మార్గం విప్లవమేనని తెలియపరిచాడు. అందుకే కొడుకు యిమ్మానియేలు నక్సలైటుగా మారాడు. కొడుకును ఎన్‌కౌంటర్‌లో చంపివేశారు. మనుమడు జెస్సీలో రూబేను కాలం గడుపుతున్నారు. జెస్సీ పెద్దవాడై ఇంట్లో చెప్పి నక్సలైట్ ఉద్యమంలోకి వెళ్ళాడు. మొదట్లో అప్పుడప్పుడు జెస్సీ ఇంటికి వచ్చేవాడు. తర్వాత రావడం మానేసి తాతకు ఉత్తరాలు రాసేవాడు. పదేపదే రూతు, రూబేను వాటిని యిష్టంగా చదువుకునేవారు. ఉత్తరాలు పక్కన పెట్టుకోని జెస్సీని, రూబీని అడిగి, అడిగి రూబేను మరణించాడు.

అంటరాని వసంతంలో రూబేను పాత్ర పాత తరానికి, కొత్త తరానికి వారధిలాంటిది. తన పూర్వీకుల కోసం తపన పడి వాళ్ళ ఆనవాళ్ళు తెలుసుకొని, గొప్ప వారసత్వానికి వారసుడనని గర్వపడ్డాడు. ఎన్నెలదిన్ని వీరగాథ చెప్పే సాంబయ్య హనుమకొండలో ఉ న్నాడంటే అతడ్ని కలుసుకొని ఆ గాథ విన్నాడు. అక్కడే ఫ్రాన్సీస్ కూతురు రూతును పెళ్ళి చేసుకున్నాడు. మాల మాదిగలు క్రైస్తవం ఒక మార్పును ఉద్దేశించి తీసుకున్నారని నమ్మాడు. ఆ మార్పు రాకుండా అగ్రకులాలు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికీ మతం మారారని దొరలతో వాధించేవాడు. తన వృత్తి బోధకుడు అయిన అందుకు భిన్నమైన ప్రవృత్తిలో ఉ ండేవాడని అతని డైరీల ద్వారా మనకు తెలుస్తుంది. మాలా మాదిగ కులాలకు జరుగుతున్న ఆన్యాయాలను నిలదీసేవాడు. అందుకోసం పాస్టర్ ఉద్యోగం వదులుకునేందుకు కూడ సిద్దపడేవాడు. తన కూతురు (రోజీ), అల్లుడు (వందనం) దొంగ రిపోర్టులతో క్రైస్తవ సంస్థలనుండి డబ్బులు సంపాదిస్తూంటే వాళ్ళను యూదా యిస్కారియేతులో పోల్చి వాళ్ళతో సంబంధాలు తెంచుకున్నాడు. తన కొడుకును పోలీసులు అరెస్ట్ చేసినప్పుడు 'క్రీస్తు నా విశ్వాసం పోరాటం నా అవసరం' మని సి.ఐతో స్పష్టంగా చెప్పాడు. కొడుకు ఉద్యమంలో మరణించటానికి ముందు మనుమడు జెస్సీ ఉద్యమంలోకి వెళ్ళినప్పుడు వారిని ఎందుకు అని ప్రశ్నించలేదు. సరైన మార్గంలో వెళ్ళరని అనుకున్నాడు.

ఈ నవలలో రూబేను తన అనుభవాన్ని డైరీ రూపంలో రాసాడు. మరి కొంత రూబేను రూతుకి చెప్పిందే. దాన్నే రూతు గుర్తు చేసుకుంటు వుంటుంది. ఈ నవలలో రూబేను పాత్ర ప్రధానమైనది. తన పూర్వీకులు దేని కోసం పోరాటం చేశారో దాన్ని కనుగొన్నాడు. ఆ కనుగొన్న పోరాటాన్ని వారసత్వాన్ని ముందుతరాలకి అందించేవాడు. రూబేను వారసులు భూ సమస్య పరిష్కారం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాటం చేసినప్పుడు

రూబేను గర్వించాడు. పోరాటమే దళితుల సమస్యకు పరిష్కారమని నమ్మాడు. ఆ నమ్మకంతో జీవించాడు, మరణించాడు.

**రూతు:**

ఫ్రాన్సీస్, మరియల కూతురు. స్వస్థలం హనుమకొండ తెలంగాణ ప్రాంతం. రూబేను భార్య, యిమ్మానియేలు, రోజీల తల్లి. మేరి సువార్త అత్త. ఈ నవలంతా రూతు జ్ఞాపకాలను మనకు తెలియజేస్తుంది. ప్రతి పాత్రను రూతు ద్వారానే వింటాం, కంటాం. ఈ నవల రూతు పాత్రతో మొదలై, రూతు పాత్రతోనే ముగుస్తుంది. ప్రతి అక్షరం, పదం కవితత్మాకంగా సాగిపోతూ వుంటుంది. "గతం వెళ్ళి పోతుంది. వర్తమానం ముందు నిలుస్తుంది. వెళ్ళిన గతంలో గూడు కట్టుకొని కూర్చుంటే వర్తమానం కూడా గతమౌతుంది. కాని తన జ్ఞాపకం గతం కాదంటుంది.... నిజానికది జ్ఞాపకం కాదు. ప్రవాహం. ఎట్టా దాచుకోవడం ఆ ప్రవాహాన్ని" (పు. 7) అంటుంది రూతు. రూబేను తన తాత తండ్రుల గురించి రూతుకు చెప్పేవాడు. రూబేను చెప్పడం కాదు. ఆయా ప్రదేశాలకు రూతును తీసుకెళ్ళాడు. వాటిని గురించి వివరించి చెప్పేవాడు.

రూతు ఎప్పుడు ఆకాశంలో చుక్కలు చూస్తువుంటుంది. "పైకి చూస్తే ఒంటరి చుక్క. కిందకి చూస్తే మిషన్ కాంపౌండ్ శిధిలాలు. ఆ శిధిలాల మధ్య పడకుండా వుండడానికి నిరంతరం శ్రమిస్తున్న సగం విరిగి నిలబడ్డ సిలువ మోసే క్రీస్తు తైలవర్ణ చిత్రం గోడ. ఆ మధ్య వీచిన తుఫాను గాలికి అది పడిపోతుందనుకొంది.
కాని అది పడిపోలేదు. తనతో పోటి పడుతోంది.... ఈ వర్ణ చిత్రం గోడ మాత్రం తన తర్వాతే పడిపోయ్యేలా వుంది. కేవలం తన కోసమే అట్టా మిగిలివుంది" (పు. 164) అనుకుంటు గతాన్ని జ్ఞాపకం చేసుకుంటుంది. మిషన్ ఆసుపత్రి జనాలకు సేవలందించి శిధిలమైంది. తాను అదే సమయంలో ఆసుపత్రిలో రోగులకు సేవ చేసి వృద్ధురాలైంది. ఆసుపత్రి, రూతు ఇద్దరు శిథిలమయ్యేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రతీకాత్మకంగా చెప్పారు.

ఎన్నెల దిన్నిలో రూతు కోరిక ప్రకారం ఇల్లు కట్టారు. ప్రతి ఎండాకాలంలో ఆక్కడికే వెళ్ళి గడిపేవాళ్ళు. మొదటి కాన్పు ఎన్నెలదిన్నిలో చేసుకుంది. రూబేను ప్రతి కదలికలో రూతు తప్పక ఉంటుంది. రూబేను, రూతు దంపతులు తమ పూర్వీకులు మౌఖిక చరిత్రను తర్వాత తరానికి అందించారు. ఒక ప్రవాహ జరీలో కులమనేది కొట్టుకు పోకుండా, కాలంతోపాటు మనుష్యులలో మార్పులు వచ్చిన అంటరానితనంలో మార్పురాలేదన్న విషయాన్ని స్పష్టంగా గుర్తించిన పాత్రలుగా వీరు కనబడతారు. ఆ వలసపాడులో రామానుజం, సిన సుబ్బారాయుడు మొదలైన పాత్రలు కమ్యూనిస్టు ఉద్యమంతో గ్రామంలోని పెత్తందార్లను ఎదిరించి పోరాటం చేస్తారు. ఈక్రమంలో తన కొడుకు యిమ్మానియేలు నక్సలైట్‌గా మారి అమరుడవుతాడు. "బిడ్డ అమరత్వం గుండెల్ని తాకుతుందనుకోలేదు. వస్తాడనుకొన్న బిడ్డ వక్కడే రాలేదు. వందలాదిమందిని తోడు పెట్టుకొని వచ్చాడు" (పు. 211). "మేరి సువార్తను ఓదార్చే శక్తి లేదు. అసలు రూతు తనని తాను వోదార్చుకోలేదు" (పు.212). అలాంటిది మిగతా వారిని ఎలా ఓదార్చగలదు. తన గతాన్ని జ్ఞాపకంగా మనకు తెలియజేసింది.

**యిమ్మానియేలు:**

రూతు, రూబేనుల కొడుకు. మేరిసువార్త భర్త. యిమ్మానియేలు టీచర్ ట్రైనింగ్ చేస్తానన్నాడు. చేయమన్నారు. పల్లెటూరిలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వస్తే వెళ్తానన్నాడు. అట్లాగేనన్నారు. ఓ ఎండల్లో మేరి సువార్తంటే తనకిష్టమన్నాడు. మేరి సువార్త రూతు పెద్దనాన్న కొడుకు కూతురు.... యిమ్మానియేలు యిష్టాన్ని వాళ్ళెప్పుడూ కాదనలేదు. పెళ్ళి మేరి సువార్తతోనే జరిపించారు" (పు. 68). ఇలా అతడు ఇష్టమైన మార్గాన్ని ఎంచుకునే స్వేచ్ఛను తల్లిదండ్రులు

ఇచ్చారు. చివరకు భార్య కూడ అతని ఇష్టానికి భిన్నంగా ప్రవర్తించలేదు. అతను మార్క్సిజానికి ఆకర్షితుడై తరతరాల దళిత సమస్యలైన అంటరానితనం, భూ సమస్యలు మొదలైన వాటి పరిష్కారం కోసం అడవి బాట పట్టిన అతని రాకకోసం మేరి ఎదురు చూసింది. ఆమెకు ఆ ఎదురుచూపే దక్కింది. ఆ ఇంటి కోడళ్ళకి మొదటి నుండి ఎదురు చూపే దక్కింది. అదే మేరి సువార్తకు దక్కింది. రూతు "ఓ జాముకాడ ఎందుకో మెలుకువ వస్తే అట్టాగే కూర్చొని ఉన్న మేరి కన్పించింది. 'రోజూ యింతేనా' మేరి ఉలి క్కిపడి ఆ మాట అన్న అత్తకేసి సూసింది. తిన్నావా అన్న అత్తకేసి చూస్తూవుండిపోయింది. మాట్లాడలేదు. ఎదురుచూడడం ఈ ఇంటి కోడళ్ళకే చెల్లింది.... సుభద్రా ఎదురు చూసింది. శశిరేఖ ఎదురుచూసింది. మేరి సువార్త అంతే ఒక్క నేనే మినహాయింపు" (పు. 204) అని ఆ కుటుంబ కోడళ్ళతో తనకే మినహాయింపు అని రూతు, మేరికి వివరించింది. యిమ్మానియేలు రాసుకొన్న పుస్తకాలు చూస్తుంటే, గుర్తుకోసం రాసుకొన్న వర్తమాన చరిత్రని రాసుకొన్న గుర్తులు. 'ఓ పోరాటం గాయాల పోరాటం గుండె గాట్లా పోరాటం నక్సల్‌బరీ పోరాటం అదో నిప్పు రవ్వ వీచిన పోరాట గాలి" (పు. 205) అలా కొత్త ప్రపంచాన్ని ఆ రాతల్లో యిమ్మానియేలు ప్రపంచాన్ని చూసింది.

అంతకుముందు రామానుజంతో రూబేను మాట్లాడేటప్పుడు మధ్యమధ్యలో యిమ్మానియేలు మాటలు అందిస్తున్నాడు. రామానుజానికి తేదిలతో సహా గుర్తుచేస్తున్నాడు. అది రూతు రూబేనులను ఆశ్చర్యపరిచింది. ఇంకా ఆశ్చర్యపరిచిన అంశం ఆవలపాడులోని పిన సుబ్బారాయుడు. యిమ్మానియేలును "శానా మంచోడు. నక్సలైట్' అన్నాడు. కుటుంబారాధనలో చాలా వినయంగా కూర్చునే యిమ్మానియేలు పాట పాడిన వచనం చదివినా, ప్రార్థన చేసినా అంకితమయ్యే" (పు. 207) వాడని అలాంటివాడు ఎలా నక్సలైట్ అయ్యాడని ప్రశ్నించుకొంటే "ప్రకృతిలో ఉన్న రుతువులు కాక తన బిడ్డల కోసం మరో రుతువు కవాలని అడిగి ఉంటుంది. చరిత్ర నిప్పుల కొలిమిని రాజేసి కణికలు ఎగదోసి వుంటుంది. ఆ కణికల వెలుతురులో మాల మాదిగలు గూడు లేదు, నేలలేదు. పనిలేదు, కూడులేదు. పెత్తనం అంతా అగ్రవర్ణాల పెత్తనం.... రుతువు మారింది. పేరు మారింది. శిశిరం, వసంతం, గ్రీష్మం, అట్టాకాదు. దోపిడి రుతువు. దొంగల రుతువు. దౌర్జన్యాల రుతువు, నెత్తుటి వాసన రుతువు" (పు. 205) కాక మరొక రుతువు యిమ్మానియేలుతో మాట్లాడి శ్రీకాకుళ ఉద్యమంలోకి ఆహ్వానించి ఉంటుంది. అంతకు ముందు యిమ్మానియేలు "చాలా మెతక, జాలిగుండె; వర్షించే కళ్ళు, స్పందించే గుండె. మరిగే నెత్తురు, మొత్తంగా గొప్ప ప్రేమికుడు. ఓ అందమైన అద్భుతమైన ప్రేమికుడు" (పు.207)గా తెలుసు.

శ్రీకాకుళం ఉద్యమంలో వెళ్ళే ముందు తరతరాలుగా తమ జాతి పడిన బాధల విముక్తి "ఏడ్చుంటాడు.... భూమిని వాటేసుకుని చిన్నప్పుడు పాలకోసం ఏడ్చినట్లు కన్నీళ్ళ రాత్రులు గడిపి వుంటాడు" (పు.207). తన వారి విముక్తికి సాయుధ పోరాటమే అవసరమని నమ్మి ఉద్యమంలోకి నడిచాడు. అంతకంటే తనకున్న ముందు తరాల వాళ్ళు పడిన బాధలు మరిచిపోకుండా ఒక తరం నుండి మరొక తరానికి మౌఖికంగా పాటల రూపంలో అందించబడింది. రూబేన్ నుండి, యిమ్మానియేలు నుండి జెస్సీకి పాటలు ఆస్తిగా అందజేయబడ్డాయి. ఆ పాటలంటే యిమ్మానియేలుకు చాలా యిష్టం. అవే తనను ఉద్యమంలో నడిపించాయి. ఈ విషయంలో తల్లిదండ్రులకు సూచన ప్రాయంగా ఉత్తరం ద్వారా తెలియజేసి, తన భార్య పిల్లలను నేను వచ్చే వరకు నీ వద్దే ఉంచమన్నాడు. నెల దాటినా అతని నుండి కబురు రాలేదు. పోలీసులు అరెస్ట్ చేశారు. అందరూ పాస్టర్ కొడుకును అరెస్ట్ చేశారని, రూతు, రూబేనుతో అన్నప్పటికీ వాళ్ళు లెక్కచేయలేదు. యిమ్మానియేలు శ్రీకాకులం ఉద్యమంలోకి వెళ్ళడాన్ని "ఏటికి ఎదురీదడం అన్నడు. అలా ఈదడం తన వంశంలోనే వుందన్నాడు. తన

వంశం పెనవేసుకొన్న స్నేహాల్లోనూ వుందన్నాడు. అది ఎన్నెలదిన్ని వారసత్వం అన్నాడు. ఆవలపాడు ఓ యవ్వనుడికి ఇచ్చిన జీవితమన్నాడు" (పు. 200). చివరకు యిమ్మానియేలు అమరుడై శ్రీకాకుళం యిమ్మానియేలుగా, కామ్రేడ్ యిమ్మానియేలుగా శవమై తిరిగి వచ్చాడు. అంతిమ యాత్రలో వేలాది మంది పాల్గొన్నారు. "జెస్సీ చేతిలో జెండా, రూబీ చేతిలో జెండా, జెండా లేనిది కొద్దిమంది చేతుల్లో చర్చికొచ్చే చాలామంది చేతుల్లో జెండలు" (పు. 203). ఇలా ఒక జెండాగా ఎగిరి అనేక జెండాలుగా యిమ్మానియేలు ఈ నవలలో కొనసాగాడు.

**మేరిసువార్త:**

యిమ్మానియేలు భార్య. రూతు పెద్దనాన్న కొడుకు కూతురు. యిమ్మానియేలును ఇష్టపడి పెళ్లి చేసుకున్నాడు. యిమ్మానియేలు పాడే పాటలు ఆమెకు ఎంతో ఇష్టం. ఆ పాటలు కొడుకైన జెస్సీకి నేర్పించింది. భర్త జాతి విముక్తికోసం సాయుధమైనప్పుడు అతనికొరకు ఎదురు చూసింది. అందుకు అత్త రూతు ఈ ఇంటి కోడళ్ళకు మొదటి చూపే దక్కిందని "ఓ జాము కాడా ఎందుకో మేలుకువ వస్తే అట్టాగే కూర్చోని వున్న మేరి కన్పించింది. రోజూ యింతేనా, మేరి ఉలిక్కిపడి ఆ మాట అన్న అత్తకేసి చూసింది. తిన్నావా.... అత్తకేసి చూస్తూ వుండిపోయింది. మాట్లాడలేదు. ఎదురుచూడడం ఈ ఇంటి కోడళ్ళకే చెల్లింది.... సుభద్ర ఎదురు చూసింది. శశిరేఖా ఎదురు చూసింది. మేరి సువార్తా అంతే ఒక నేనే మినహాయింపు" (పు. 204) అని ఆ కుటుంబ కోడళ్ళలో తనకే మినహాయింపని చెప్పింది. మేరి తిండి తినకుండా యిమ్మానియేలుకోసం ఎదురు చూస్తున్నప్పుడు అలా ఎందుకు చూడటం ఎందుకు? "అన్నం పళ్ళెంలో రూతే పెట్టింది. కూరలు వడ్డించి ఎదురగా కూర్చొంది. తిను తిను మేరి సువార్త వాకిట్లోకి చూస్తోంది. తిని చూడోచ్చు" (పు. 204) అని రూతే కలిపి పెట్టింది. నవలలో చెప్పుకోవలసింది అత్తాకోడళ్ళ సంబంధం గురించి, సుభద్ర నుండి రూబీ వరకు ఆ సంబంధాలు ఎంతో ఆత్మీయంగా కొనసాగాయి. యిమ్మానియేలు ఉద్యమంలోకి వెళ్ళిన పరిస్థితులపై మేరికి అవగాహన ఉంది. ఎందుకంటే ఎన్నెలదిన్నిలో జరిగిన పోరాటమంతా యిమ్మానియేలు పాటల రూపంలో ఆమెకు నేర్పాడు. ఆ పోరాట స్ఫూర్తినే కాక సమకాలీన సమాజ పరిస్థితుల్లో నెగ్గాలంటే దళితులకు పోరాటం అవసరం. పోరాటం త్యాగాన్ని కోరుతుంది. అటు ఉద్యమంలోకి వెళ్ళిన భర్త అమరుడై వచ్చేవరకు ఆమెకు ఎదురు చూపే మిగిలింది. తరువాత దాదాపు మౌనంగా మారిపోయింది. తన కోడలు రూబీ, తల్లి రోజీని నాయింట్లో ఏడ్వవద్దంది. "రూబీ తల్లిని అలా అనడం మేరి సువార్తకు నచ్చినట్టు లేదు. అందుకే రోజీ దగ్గరకు వెళ్ళి ఆ పిల్ల మాటలు పట్టించుకోకు అని అంది. మేరి సువార్త ఎట్టాంటిదో రోజీకి తెలుసు. అందుకే మౌనంగా వుండిపోయింది" (పు. 224). ఈ నవలలో మేరిసువార్త పాత్ర తక్కువ నిడివిలో ఉన్నా అది కీలకమైన సమయం. ఆ సమయంలో దళితులు తమ హక్కులను అవహగన చేసుకొని చేస్తూ ఒక దశనుండి మరొక దశకు సమాయత్తమవుతున్నారు.

**జెస్సీ, రూబీ:**

జెస్సీ యిమ్మానియేలు మేరి సువార్త కొడుకు. రూబీ వీరి మేనకోడలు, యిమ్మానియేలు చెల్లి రోజీ, వందనం కూతురు రూబీ. వీళ్ళు ఇద్దరు బావమరదళ్ళు ఆధునిక భావాలు కలిగిన వారు. జేస్సి తండ్రి యిమ్మానియేలు మార్గాన్ని కొనసాగిస్తూ అడవి బాట పడితే భార్య రూబీ భర్తను అనుసరించి అదే మార్గంలో జనారణ్యంలో బాధితుల పక్షాన నిలబడుతుంది. రూబీ తల్లిదండ్రులు రోజీ వందనంలు బతుకనేర్చినవారు. క్రిష్టియన్ సంస్థలను మోసం చేసి, డబ్బులు సంపాదిస్తారు. అలా సంపాదించడం తల్లిదండ్రులైన రూతు రూబేన్‌లకు నచ్చదు. మనవరాలైన రూబీ అందుకు భిన్నంగా ఉంటుంది. జెస్సీకి పాటల ద్వారా తమ ముందు తరాల పోరాటాలను తెలియజేశారు. "కాలం. అంటే.... ఒక మహాప్రస్థానం..... ఆ ప్రస్థానంలో

మాతయ్యలు, నారిగాళ్ళు, ఎల్లన్నలు, మార్టిన్‌లు శివయ్యలు ఎవరి.... అడుగులు వాళ్ళు వేశారు..... యిమ్మానియేలు ఆ అడుగుల్ని సాయుధం చేశాడు. జెస్సీ అంతే. ఆ సాయుధ పోరును కాస్త ముందుకు, యింకాస్త ముందుకు... ఆకలి, అంటరానితనం, దోపిడి, దౌర్జన్యం ఎల్లన్న మొదలు యిమ్మానియేలు దాకా, సుభద్ర మొదలు మేరి సువార్త దాకా చూడాల్సిన పదాలు, కారణాలు, వెతకాల్సిన పదాలు తన తండ్రి పాఠాలు చెప్పేవాడు. తాను చెప్పే పాఠాల్లో ఆ పదాల్ని వివరించలేననుకొని వుండొచ్చు. ఆ పదాలు పాఠాల పరిధి దాటి వున్నాయని ఆయనకనిపించి వుండొచ్చు. అందుకే కావచ్చు పాఠశాల వదిలాడు.... అట్టా నడిచాడు. ఆయన నడక ఆగకూడదు.... జెస్సీలో అవే ఆలోచనలు అవే సంఘర్షణలు...., మిత్రుల్తో మాట్లాడుతూనే వుండేవాడు. మాటలు, ఆలోచనలు, సమావేశాలు. అంతా దాహమే, అంతా ఆకాంక్షే, అంతా కదిలికే, అంత ఆందోళనే తిరగబడటానికి సంసిద్ధతే. అట్టాకనిపించేవాడు" (పు. 215-216) ఇలా తన తాత తండ్రులు ఎదికిన దాన్ని సాధించేందుకు జెస్సీ ఆలోచనల పరంపర సాగిపోతూ వుంది.

జెస్సీ స్నేహితులతో పాటు రూబీ కూడా చర్చల్లో పాల్గొనేది. జెస్సీ ఉద్యమంలోకి వెళ్ళాలని నిర్ణయం తీసుకొని "నేను మీకు చెప్పే వెల్దామనుకొంటున్నాను. ముగ్గుర్లో ఎవరూ మాట్లాడలేదు. రూబీ కూడ అక్కడికి వచ్చింది. "నాన్న మీకు దూరమయ్యాడు. నాకు తెలుసు, నన్ను చూసి మీరు ఆయన్ని మరచిపోయే ప్రయత్నం చేస్తున్నారని, మీరు కాదనరనే నమ్మకంతోనే మీతో మాట్లాడుతున్నాను. ఎల్లన్న దేనికోసం తపించాడో, శివయ్య దేనిగురించి భయపడ్డాడో, రూబేను ఎందుకోసం అంత అన్వేషణ చేశాడో, యిమ్మానియేలు దేనికోసం ప్రాణాన్ని యిచ్చాడో అది నెరవేర్చాల్సి ఉంది. యిమ్మానియేలు మట్టిలో కలిసి పోలేదు. మొక్కగా మొలిచాడు. అదీ మీ పెరట్లోనే మొలిచాడు" (పు. 218) అని చెప్పి జెస్సీ ముసురులోనే గుడ్డల సంచి బుజాన వేసుకొని వెళ్ళాడు. "కలల్ని మూట కట్టుకొని పోరాటం చేసేందుకు, తన ప్రజల్ని విముక్తి చేసేందుకు బయలుదేరాడు" (పు.218). "వీరుడి బిడ్డ వీరుడిలా వెళ్ళాడు. వెళ్ళి దూరం కాలేదు. దగ్గరయ్యాడు" (పు.219) అలా దగ్గరైన జెస్సి వస్తే బాగుండన్పిస్తుంది.

రూబీ జెస్సీని ప్రేమించింది. అందుకోసం తల్లిదండ్రులు తెచ్చిన సంబంధాన్ని తిరస్కరించింది. "చేసుకుంటే జెస్సీనే చేసుకుంటానంది". రూబీకి చిన్నప్పటి నుండి రూబేన్ సపోర్ట్. అందుకే (రూబేను అల్లుడి) వందనం, (రూబేను కూతురు) రోజీ కలిసి రూబేన్‌ను నిలదీశారు. అప్పుడే రూబీ చెప్పింది. జెస్సి తను ఎన్నెలదిన్నెలో పెళ్ళి చేసుకొన్నామని "మా ముందు వో గమ్యం వుంది. అక్కడికి చేరడానికి నడవాలనుకొన్నాం". పెళ్ళి చేసుకొని వారం రోజులు కలిసి వుండి "ఎన్నెలదిన్ని పోలిమేరల వద్ద వాడు అటు వెళ్ళాడు. నేను యిటు వచ్చాను.... జెస్సీ లోపల, రూబీ బయట.... అట్టా అయ్యారు వాళ్లు, వాళ్ళ జీవితాన్ని కఠినంగా మార్చుకొన్నారు" (పు. 225). జెస్సీ రూబీ మాటల్లో గాఢత, పద్ధతిలో స్పష్టత ఉంది. వాళ్ళు యుద్ధం చేస్తున్నారు. జెస్సీ జన నాట్య మండలిలో రూబీ మహిళా మండలిలో పనిచేస్తుంది. దళితుల మీద దాడులు జరుగుతున్న ప్రతి చోట జెస్సీ పాటలు పాడుతున్నాడు. కారంచేడు పోరాట కథను పాడుతున్నాడు. "ఎల్లన్నలా ఒంటరిగా కాదు. తనలాగే పాడే పదిమందితో తిరుగుతున్నాడు... ఎల్లన్న జావాబు దొరకక ఎన్నెలదిన్ని వదిలి వెళ్ళాడు. జెస్సీ అట్టాకాదు జవాబుతోనే వెళ్ళాడు. కారంచేడు శిబిరం నుండి తిరిగి వచ్చాక జెస్సీలో చాలా మార్పు వచ్చింది. ఇంత చిన్న వయస్సులోనే జీవిత గమ్యం గుర్తించినట్లు ప్రవర్తిస్తున్నాడు" (పు.223) ఇలా ఎల్లన్న నుండి మొదలైన అన్వేషణ జెస్సీ తరానికి ఒక స్పష్టత వచ్చింది. రూబీ, జెస్సీలు కలిసి తమదైన మార్గంలో తమ జాతి విముక్తి కోసం ప్రయాణం కొనసాగిస్తున్నారు.

**<u>రామానుజం:</u>**

ఎన్నెలదిన్నిలో రూబేనుకు పరిచయం. "రామానుజం ఎన్నెలదిన్నికి చదువు చెప్పడానికి మాత్రమే రాలేదు. చదువు బతకటానికే వచ్చాడు. చదువుకున్న వాడివి కాబట్టి పిల్లలకు చదువు చెప్పమన్నారు. రామానుజంకు పెళ్ళి కాలేదు. చేసుకోవాలని అభిప్రాయం కూడా లేదు. కళ్ళు ఎప్పుడు కలలు కంటున్నట్టుగానే కన్పించేవి" (పు.169). ఒకసారి హరిజన పదం గురించి రూబేన్‌ను అతని అభిప్రాయం అడిగాడు "మాల, మాదిగల పదాల కన్నా ఎందులో గొప్ప ఆ పదం..... బ్రాహ్మణీయ సమాజం మాలా మాదిగల్ని అంటరాని వాళ్ళని చేసింది. హరిజనపదంతో గాంధీగారు అనాధల్ని కూడా చేస్తున్నాడని" (పు. 169) చెప్పాడు. కనుక ఆ పదం తనకు బొత్తిగా ఇష్టం లేదని చాలా స్పష్టంగా తెలియపరిచాడు. యిమ్మానియేలు పెళ్ళిలో రూబేను మళ్ళీ కలిశాడు. ఆవలపాడులో హరిజన సంఘాల పేరుతో లింగారెడ్డి మొదలైన వాళ్ళు దళితుల రోడ్లు ఊడవటం, వాళ్ళు ఇచ్చిన మంచినీళ్ళు తాగటం, దేవాలయం ప్రవేశం గురించి చెప్పాడు. ఆ సమయంలో రామానుజం పాడుపడిన శివాలయ ప్రవేశం కాకుండా ఊరి మధ్యలో ఉన్న విష్ణాలయంలోకి ప్రవేశం కల్పించమన్నాడు. అగ్రకులాల తెలివిగా దళితులను దేవాలయ ఆవరణంలోకి ప్రవేశం కలిపించి, అక్కడికే హారతి, ప్రసాదం తెప్పించి గందరగోళం మధ్య దేవాలయ ప్రవేశాన్ని ముగించారు. తరువాత లింగారెడ్డి దగ్గరుండి దేవాలయ శుద్ధి కార్యక్రమాలు చేశారు. వారిలో వెంకటాద్రి అనే హరిజనుడు భరించలేక రామానుజానికి విషయం తెలియజేశాడు. "నాకు తెలుసు మాలా మాదిగలను హిందూ చట్రంలో బిగించే కార్యక్రమంగానే ఈ హరిజనోద్ధారణ జరుగుతుంద" (పు. 176)ని ఈ విషయాన్ని వైకం సత్యాగ్రహంలో పెరియార్ కాంగ్రెస్ సనాతనవాద నాయకుల కపటత్వాన్ని ఎండ గట్టడాన్ని తెలియజేశారు. వెంకటాద్రికి ఇంకా పూలే సత్యశోధక్ సమాజ్ తమాషా బృందాల గురించి చెప్పాడు.

ఆవలపాడు మాలపల్లి కథ రామానుజాన్ని యిమ్మానియేలును కలిపింది. ఆ ఊరి చెరువులో త్రాగునీటికోసం పథకం ప్రకారం ముందుకు వెళ్ళారు. పథకం విజయవంతం కావడానికి ముఖ్య కారకుడు రామానుజం. కమ్యూనిస్టులైన చాకలి వాళ్ళు, రామిరెడ్డి కూడా మాలపల్లికి మద్దతుగా నిలబడ్డారు. ఆవులపాడు సంఘటన పక్క ఊరిలో పెద్ద సంచలనం. పక్కఊరి మాల మాదిగలకు స్ఫూర్తిగా నిలిచింది. రామానుజం సిన సుబ్బారాయుడు పేర్లు వినబడుతున్నాయి. వెంకటచౌదరి కేసులో కానిస్టేబుల్ పల్లెలోకి వచ్చారు. వాడిని కొట్టి క్రింద పడిన తుపాకీని 'పెంచలి' గడ్డివాములో దాచిపెట్టి మేనమామ ఊరిలో దాక్కున్నాడు. తుపాకీకోసం వచ్చిన పోలీసులు బడిలో పాఠాలు చెబుతున్న రామానాజాన్ని అరెస్ట్ చేశారు. ఆ తరువాత రామానుజం శ్రీకాకుళం పోరాటంలో నక్సలైట్‌గా మారిపోయాడు. ఆ ప్రభావంతో యిమ్మానియేలు కూడా రామానుజాన్ని అనుసరించినట్లుగా రచయిత తెలియజేశాడు.

**<u>సిన సుబ్బారాయుడు:</u>**

సిన సుబ్బారాయుడికి తండ్రి లేదు, తల్లి ఉంది. "ఒంటరిగాడు, చిన్నప్పుడు నాయుడి దగ్గరే జీతానికి ఉన్నాడు. కాస్త పెద్దవాడయ్యాక మానేశాడు. మట్టి పని దొరికితే మట్టి పనికి వెళతాడు. వామి వెయ్యడంలో మంచి పేరుంది. వడ్ల పాతర్లు తిరిగియ్యడం ఉంటే సుబ్బారాయుడిని పిలుస్తారు.......... చుట్ట తాగడు, బీడీ తాగడు. పనులు లేకపోతే బిల్లకోడు ఆడతాడు" (పు. 186). అలాంటి సుబ్బారాయుడికి తల్లి పెళ్ళిచేయాలని తొందపడుతుంది. కోడలుకు ముక్కు బేసర ఇస్తానని చెబుతుంది. తన అత్త గురించి గొప్పగా చెబుతుంది. సూట్టిల్లు కోటేసు కూతురు, ఎంకాయి చినసుబ్బడు ఇద్దరూ ఇష్టపడ్డారు. ఈ విషయం తెలిసి ఆమె అన్న దమ్ములు సిన సుబ్బడిమీద కర్రతో దాడిచేశారు. ఆ దాడి తరువాత ఎంకాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఎంకాయి అన్నదమ్ముల బలంలో సుబ్బారాయుడు మాలపల్లికి

కమ్యూనిష్టులను మొదటగా ఆహ్వానించాడు. పెద్ద నర్సింహను చౌదర్లు తీవ్రంగా కొట్టడంతో మాలపల్లెలో యువకులు జొన్నచేనును మధ్యలో అంతా పీకివేశారు. బాలకోటడు మామిడికాయల దొంగతనం చేస్తుంటే, చౌదరీ కోటయ్యా చూసి నెత్తురు ముద్దలాగ కొట్టాడు. దానికి బదులుగా చౌదరి తోటయ్యా దున్న కుర్రను విప్పేశాడు. పంచాయతీలో మాలపల్లిపై అనుమానం అన్నాడు. ఎట్టా అనుమానం తెలపాలని కమ్యూనిస్టు (రామిరెడ్డి) మాల పల్లిని వెనుకేసుకు వచ్చాడు. దొంగతనంగా గడ్డి కోస్తున్న ఆడవాళ్ళను పట్టుకోని చౌదరి యాలం దగ్గర ఆడవాళ్ళను కట్టివేసే పల్లె మొత్తం ఆడ, మగ ఐక్యంగా వెళ్ళింది. చాకలి పాలెం నుండి చాకలి వాళ్ళు కూడా వచ్చారు. ఆవలపాడు చెరువులో నీళ్ళకోసం పోరాటం ముఖ్యమైంది. దీంతో అందరితోపాటు సిన సుబ్బారాయుడు ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఊరి పెద్దలపై తానే మొదటి దెబ్బ వేశాడు. దానితో బిత్తరపోయిన ఊరు పరుగులు తీసింది. వెంకటచౌదరి పోలీస్‌కేసు పెట్టాడు. చెత్తోడు (చాలా క్రూరుడు) పోలీస్ అధికారిగా వచ్చాడు. పోలీసులు వస్తున్నారని తెలిసి కుర్రోళ్ళంత సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోయారు. సిన్న సుబ్బారాయుడిని పట్టుకోవడానికి పోలీసులు అతని ఇంటికి వెళ్ళారు. పోలీసులపై ఎవరో రాళ్ళు వేశారు. వాడు భయంతో తుపాకీ వదిలి వెళ్ళిపోయాడు. పెంచలి ఆ తుపాకీ తీసుకోని ఏం చేయాలో తెలియక గడ్డివాములో దాచిపెట్టి మేనమామ ఇంటికి వెళ్ళిపోయాడు. తుపాకీ కోసం చెత్తోడు మాలపల్లెను, ఊర్లో కమ్యూనిస్టులను సతాయించాడు. అతి క్రూరంగా ప్రవర్తించి పల్లెను భయ పెట్టాడు. తుపాకీ ఉన్న తావును సిన సుబ్బారావు వెంకటాచారికి తెలియ జెప్పించాడు. పల్లెలో యాభై మంది అరెస్ట్ అయ్యారు. "సిన్న సుబ్బారాయుడ్ని, రామిరెడ్డిని యిది జరిగిన వారం రోజులకి అరెస్ట్ చేశారు. కాల్చెయాలనే ఆలోచన కూడా పోలీసులు చేశారు" (పు. 198). కానీ ఎందుకో వెనకడుగు వేశారు. రూతుతో సిన సుబ్బడు తన గతాన్ని "ఏదో మోటోడ్ని మోటి మాటల్తో చెబుతున్నాను. నలభై ఎనిమిదిలో కంనిస్టయ్యా. 52 దాకా పోరాటం మాటలే. కాని మారింది. ఎలచ్చన్లలో పడ్డాకే అంతా మారింది. మా వూరు మాలపల్లి సెర్లొకి యాభైరెండు ముందే దిగింది. తర్వాతైతే అట్టా కుదిరేది కాదు.... నాయన్ని మోటి మాటలు, మోటాలోచనలు" (పు. 201) అని చెబుతాడు. ఈ నవలలో సిన్న సుబరాయుడి పాత్ర ప్రధానమైనది. మాలల పోరాటాన్ని ముందుకు నడిపించిన వాడుగా శ్రీకాకుళ పోరాటానికి లింకు చేసిన వాడిగా మనకు కనిపిస్తాడు.

**<u>నారయ్య మాతయ్య:</u>**

నారయ్య మాల, మాతయ్య మాదిగ. ఇద్దరు సాహసగాండ్లు, ఎన్నెల దిన్నిలో గొప్ప పోరాట యోధులు. మాల మాదిగలలో చైతన్య స్ఫూర్తిని రగిలించినవారు. తమ జాతిని కాపాడుకోవడం కోసం తన ప్రాణాల్ని సైతం పణంగా పెట్టాడు. "నారయ్యకు మడి చెక్కలేదు. ఉందల్లా చెట్టు కొట్టే గొడ్డలే. తాటి చెట్టు పది దెబ్బల్లో కొట్టేవాడు....... చెట్టు ఎప్పుడు ఎక్కేవాడో. ఎప్పుడు ఆకుకోసి దిగేవాడో అంతు పట్టదు. తాటి చెట్టుతో ముడి పడ్డ జీవితం" (పు. 27) ఏమిలేకపోయినా పల్లె మునకలో బతుకు పోరులో, ముందుండి నడిపించాడు. తన వారిని నడిపించాడు. వాన గాలిలో మునిగిపోతున్న సమయంలో మాల మాదిగల పల్లెలు రెండు కలిశాయి. ఆ సమయంలో "దిబ్బమీదుకి ఎల్తోన్నా వచ్చే వాళ్ళు రావచ్చు" అన్నాడు.(పు. 33) అంత అయోమయంగా నారయ్యని చూశారు. నారి పిల్లాడిని , భార్యని తీసుకొని బయలు దేరగా మాతయ్య కూడా కదిలాడు. "బతకాలనుకొంటే రండి. ఎవుడు అడ్డొచ్చినా గొడ్డలికి బలౌతాడు..... బతకాలనుకొన్నోళ్ళు రండి ఎట్టాగో సత్తాం" (పు. 34) అని చెప్పి అగ్రకులాల ఇళ్ళ మధ్యనుంచి అంటరాని తుఫాన్ దాటి పోయింది. దాని దెబ్బకు దేవాలయాలు, "ధ్వజస్థంభం పెళపెళమంటూ విరిగిపడిన శబ్దం. కరణం పెంకుటి, కొట్టం కూలిన శబ్దం"

(పు. 34)తో మాల మాదిగలు దిబ్బమీదకు ఎక్కి ప్రాణాలు దక్కించుకునేలా చేశాడు. నారయ్య మాతయ్యలు కలిసి సావుకారి కొట్టులోకి పోయి దొంగతనంగా బియ్యం పట్టుకువచ్చి జనం ప్రాణం కాపాడారు. ఎవరైన చూసి వుంటే "అంటే మనం సావడానికే పుట్టాలా.. సంపడానికి కూడా పుట్టినాం" (పు. 37). నారయ్య, మాతయ్యలు కలిసి కూడ బలుక్కొని చెప్పారు. రెండోరోజు గుడిసె కర్రల కోసం వెళ్ళారు. మాతయ్య, నారయ్య శవాన్ని భుజంపై మోసుకొని వచ్చాడు. నేను ఆకులు చూస్తానని వెళ్ళాడు. నారయ్య పుల్లలకోసం వెళ్ళి ఎంత చూసినా రాలేదు. "చిట్టడివి కేసి ఎత్తే అడవి మలుపు దార్లో వెత్తుటి మడుగులో పడున్నాడు" (పు. 37) అని చెబుతుంటే జనం గొల్లుమన్నారు. ఎవరు చంపిందో అందరికి తెలుసు కాని "ఎవరూ మాట్లాడరు. మాట్లాడే శక్తి లేదు. శక్తి ఉన్న నారిగాడు చచ్చాడు. శక్తి వున్న మాతయ్య ఆడు సావలా.. ఆడు సావలా... అంటూ తిరుగుతూనే ఉన్నాడు" (పు. 38). నారయ్య 'కర్మ' అందరూ కలిసే చేశారు. మాతయ్య మాత్రం నారయ్య గొడ్డలితో మాయమయ్యాడు. ఎంత వెతికినా కన్పించలేదు. మాల పెద్దకి "నారిగాడు ఎప్పుడూ గుర్తొస్తాడు. సాహసివాడు. మొండి పట్టు వాడిది. మాతయ్యది అదే పట్టు. అదేవూపు" (పు. 49) అని గుర్తుచేసుకొంటున్నాడు. ఎన్ని సంవత్సరాలు అయిన మాదిగ మాతయ్యకి కరణం మీద కక్ష తగ్గలేదు. తన మిత్రుడ్ని చంపినందుకు బదులుగా " ఎన్నెలదిన్ని పేరు గ్రామ గ్రామాన పాకిన సంఘటన.... మాదిగ మాతయ్య గొడ్డలికి తెగిపడ్డ పెద్ద కరణం తల సంఘటన, రంగాయి సాక్షిగా, చీకటి మర్రి సాక్షిగా ... ఈడు నారిగాణ్ణి సంపాడు. యిప్పుడు నా సేతుల్లో సచ్చాడు. చెబుదామనుకొన్నాడు" (పు. 53). కానీ ఏదీ చెప్పొద్దను కొన్నాడు. రెండు పల్లెలు కళ్ళముందు నిలిచాయి. అందుకే చెప్పొద్దనుకొన్నాడు. తన పని ఎంత వేగంగా పూర్తి చేశాడో అంత వేగంగానే వెళ్ళి పెద్ద మాలకి చెప్పాడు. "మాతయ్య జరిగిందంతా. పెద్దమాల అంతా విన్నాడు. మాతయ్య మాటలు భయపెట్టాయి. మాతయ్య మాటలు ఉద్రేకపర్చాయి. మాతయ్య మాటలు నరాల్ని లాగి వొదిలినట్టు అన్పించాయి. ఎందుకో తెలియదు. పెద్ద పెట్టున ఏడ్పు తెప్పించాయి. మాతయ్యని గుండెలకిగుండెలకి హత్తుకొని ఏడ్చాడు" (పు. 54). మాల మాదిగలకి విన్పించేలా "పెద్దకరణాన్ని మన మాతయ్య చంపేశాడు. వీరుడు నా ప్రక్కనే ఉన్నాడు. నిద్రలేసి రండి" (పు. 54) అని అరవాలనుకున్నాడు. కానీ పల్లెలు గుర్తుకువచ్చాయి. మాతయ్య "ఎల్లొత్తారా" అంటే కాదనలేకపోయాడు. మాతయ్య రేవు దాటుతూంటే "వెలుగంతా ఎన్నెలదిన్ని ఏటి ఆవలగట్టు మీద నడిచినట్టనిపించింది. వీరుడు అట్లాగే నడుస్తాడు. ఆకాశంలో మెరుపు తారాడినట్లు, భూమ్మీద సూరీడు పరుచుకొన్నట్లు పెనుతుఫాన్ రెండు క్షణాల్లో తన పని తాను పూర్తి చేసినట్లు" (పు. 55). మాతయ్య తన పని తను పూర్తి చేసుకొని వెళ్ళిపోయాడు. ఈ నవలలో నారయ్య తిరుగుబాటు క్రమాన్ని మొదలు పెట్టి అగ్రకుల కుట్రలకు అన్యాయంగా తాను బలై తన జాతిని నిలబెట్టాడు. బతికించాడు. ఆ వీరుడి హత్యకు మాతయ్య బదులు తీర్చుకున్నాడు. అలా బదులు తీర్చుకోవడం అంటే గొప్ప సాహసం ఆ సాహసాన్ని నాగన్న ఎల్లన్న నుండి యిమ్మానియేలు, జెస్సీ రూబీల వరకు కొనసాగింది. ఆ పోరాట క్రమంలో నారయ్య, శివయ్య, యిమ్మానియేలు నేలకు ఒరిగారు. అయినా ఆ పోరాట క్రమాన్ని తరువాతి తరం అందిపుచ్చుకొని జవాబులతో సహా ముందుకు సాగుతూనే ఉంది.

**<u>పెద్ద కరణం:</u>**

ఎన్నెల దిన్ని కరణం బ్రాహ్మణుడు, "అతి క్రూరుడు, అతనికి జాలి లేదు, దయ లేదు. దానం చేసే గుణం అసలే లేదు. ఒకే ఒక్క కొడుకు. వాడికి ముందు కూతురు" (పు. 30) వితంతువైన కూతురుతో అక్రమ సంబంధం పెట్టుకున్న కోళ్ళదిన్ని పంతుల్ని హత్యచేయించాడు. కూతుర్ని చంపి ఉరివేశాడని ఊరిలో పుకారు ఉంది. అక్కని దారుణంగా చంపినందుకు

పిల్లకరణనికి కోపం రాలేదు. అక్క వెండి బిళ్ళలు లెక్కపెట్టుకుంటున్న కొడుకును చూసి తన కడుపున రత్నం పుట్టిందని పొంగిపోయాడు పెద్ద కరణం.

ఎన్నెలదిన్ని కరణం మాటంట మాటే ఆ మాటకోస్తే ఆ చుట్టు పక్కల పల్లెల్లో ఆయన మాటకు ఎదురు లేదు. "ఎన్నెలదిన్ని బతుకంతా పెద్ద కరణం కనుసన్నల్లో ఉంది. ఆయన గీచిన గీతల మధ్య తిరుగుతుంది. ఎన్నెలదిన్ని విశాలమైన భూముల్లో ఎక్కువ భాగం ఆయన చేతిల్లోనే ఉంది. అతి తక్కువ భాగం మిగిలిన కులాలకుంది. రెడ్డికి కొద్దిపాటి పొలం వున్నా మొత్తంగా అతని పాలెకాపులే" (పు. 29). కరణం పొలాలు గట్లు లేనివి మాల మాదిగల ఇండ్లలో ప్రతి ఒక్కరు ఆయన పొలంలో కూలీ లేకుండా కూటి కావిళ్ళేకూలీగా పనిచేయాలి. ఆ కూటి దగ్గరే మాల మాదిగలు తన్నుకునేవారు. ఆ కొట్లాట అక్కడినుండి మొదలై కల్లాం గింజల దాకా కొనసాగేవి. "ఒక్కోసారి పెద్ద కరణమే తీర్పు చెప్పేవాడు. అయ్యో పాపమని కల్లాం గింజలు వదిలితే తన్నుకొని చస్తారత్రా అలగా గాడిదల్లారా అని తిట్టడం. ఒక్కోసారి కొట్టించడం కూడా చేసేవాడు...... వీళ్ళ మధ్య (ఐక్యతను) శాశ్వతంగా గండి కొట్టడానికి సర్వప్రయత్నాలు చేసేవాడు. పరిష్కారాన్ని వాయిదా వేసేవాడు" (పు. 31). మాదిగల్ని కరణం మీ కులం అంత గొప్పది, యింత గొప్పదని ఉబ్బేసేవాడు" (పు.32). మాల

మాదిగలు తన్నుకు చచ్చేవాళ్ళు వరద సమయంలో దిబ్బ మీదకు నడిపించిన నారయ్యని కరణం చంపేశాడు. ఇలా రంగాయి భర్త అచ్చిరెడ్డి తండ్రిని డబ్బులు లెక్కచూడమన్నందుకు బలి చేశాడు. రంగాయిని లొంగదీసుకున్నాడు. ఆమెతో అక్రమ సంబంధాన్ని గుట్టుగా జడల మర్రిదగ్గర గొడ్ల కొట్టంలో సాగించేవాడు. ఆ విషయం తెలుసుకున్న మాదిగ మాతయ్య గొడ్డలితో కరణాన్ని నరికేశాడు. నరికివేసిన మాతయ్య రంగాయికి దేవుడిలా కనిపించాడు. ఆవిషయాన్ని పెద్దమాలతో చెప్పింది. ఈ నవలలో అనేక దారుణాలకు మూలకారకుడిగా పెద్ద కరణం చిత్రీకరించబడ్డాడు.

**<u>పిల్ల కరణం:</u>**

పెద్దకరణం కొడుకు. ఆయనకు ఏమి తీసి పోలేదు. అయితే పెద్దకరణంలా పెద్దరికం నిలుపుకొలేక మార్పులోకి తలొగ్గాడు. పెద్దకరణం మరణించేనాటికి అచ్చిరెడ్డిని ఊళ్ళో జనాలు పెద్ద మనిషిగా అంగీకరించారు. మాలోడి దిబ్బలో మాల మాదిగలు సేద్యం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పుడు పిల్లకరుణం వాళ్ళను రచ్చలోకి పిలిచాడు. పెద్ద కరుణం హత్యమీద పిల్లకరణంకు ఉండే అనుమానాలు అతనికి ఉన్నాయి. అచ్చిరెడ్డి తన తల్లి బయటకి తీసుకురావద్దని కాళ్ళా వేళ్లా పడ్డాడు. అంతేకాక ఎన్నెలదిన్నిలో మార్పును గమనించాడు. ఆరోజుల్లో రచ్చలో మాల మాదిగలు కలిసి కట్టుగా ఐక్యంగా కూర్చున్నారు. పెద్ద కరణం అయితే రెండు కులాల మధ్య గొడవలు పెట్టి ఐక్యతకు విఘాతం కలిగించేవాడు. కాని పిల్ల కరణానికి వారి మధ్య ఐక్యతను విడదీసేంత నైపుణ్యం లేదు. అచ్చిరెడ్డి కరణం పక్కనే కూర్చున్నాడు. అలా అతడు కూర్చోడం పిల్ల కరణంకు ఇష్టంలేదు కాని అచ్చిరెడ్డి ఎదుగుదలను నివారించలేని నిస్సాహాయత. చివరకు ఆ రచ్చలో నాగన్న పిల్ల కరణం పెద్దరికం నిలబెట్టే మాట అన్నాడు. అచ్చిరెడ్డి మాటలకు నాగన్న ఏమి సమాధానం చెప్పలేదు. అందుకే పిల్ల కరణానికి సంతోషంగా ఉంది. "అచ్చిరెడ్డి నోట బూతులు వస్తున్నప్పుడు పిట్టోడి కళ్ళని గమనిస్తున్నాడు. ముసలయ్య చూపులని చదువుతున్నాడు. యిబ్బందిగా కదిలే పోలయ్యను ఆలోచిస్తున్నాడు. ఆ చూపుల్లో అసహనాన్ని, ఆ కదలికలో ఆరాటాన్ని కరణం లెక్కలతో సరిచూసుకుంటున్నాడు...... అచ్చిరెడ్డి ప్రవర్తన కూడికల్లోకి వచ్చింది. ఆ భూమి వాళ్లకి చెందుతేనే మంచిదనుకొన్నాడు" (పు. 80). చెట్టు కొట్టేముందు అచ్చిరెడ్డికి చెబితే బాగుంటుందని

అయినా “దెయ్యాలదిబ్బ దెయ్యాల్నే తిన్నీ అచ్చిరెడ్డీ” (పు. 81) అని లేచాడు. మాలాడి దిబ్బను వొదులుకోవడం వల్ల పిల్ల కరణం తేలిగ్గా తీసుకున్నాడు. కానీ మాలలు ఆటల్లో మాల మాదిగల పెద్దల్ని కరణం స్థాయిలో ఉంచడం తీవ్రమైన ధిక్కారమని భావించాడు. మట్టి తన చేతికి అంటకూడదనే ఆలోచనలో ఉన్నాడు. ఆరోజు నీ మాట విని ఉంటే బాగుండేదని అచ్చిరెడ్డిని రెచ్చగొట్టి కూతురి దగ్గరకు వెళ్ళాడు. గ్రామాల్లో రెడ్లు బలం పుంజుకున్నారు. కరణం తన భూముల్ని కొన్ని రెడ్లకి అమ్మేశాడు. తను పట్టణానికి వలస వెళ్ళాడు. వెళ్ళే ముందు బాడవను మాలా మాదిగలకు ఇచ్చేశాడు. అట్లా ఇవ్వడానికి వీళ్ళేదన్నాడు. అచ్చిరెడ్డి, అచ్చిరెడ్డి కరణాన్ని ఏమి అనలేక మాల మాదిగల మీద తన కోపాన్ని చూపించాడు. కరణానికి కావలసింది కూడా అదే. అచ్చిరెడ్డికి మాల మాదిగలకు మధ్య ఎప్పుడు ఏదో ఒక రగడ జరుగుతూ ఉండాలి. ఎన్నెలదిన్నిలో అదే జరిగింది. ఇలా పిల్లకరణం ఏది ప్రత్యక్షంగా జరుపకుండా పరోక్షంగా తన పని పూర్తి చేసుకునేవాడు. పట్టణంలో స్థిరపడిన కరణం కూతురు, అల్లుడు క్రైస్తవ మతం పుచ్చుకొన్నారు. ఇలా కరణం కుటుంబం పల్లెలో, పట్టణంలో తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడం కొరకు ఎంతకైన వెనుకాడరని ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది.

**<u>అచ్చిరెడ్డి:</u>**

పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి. రంగాయి కొడుకు. అచ్చిరెడ్డిని చంకనేసుకోని ఎన్నెలదిన్నికి వచ్చారు. కరణం దగ్గర పనికి కుదిరారు. సుబ్బిరెడ్డి జీతం కరణం దగ్గర దాచుకునేవాడు. ఆ డబ్బులు అడిగినందుకు సుబ్బిరెడ్డిని హత్యచేయించాడు. అప్పటినుండి అచ్చిరెడ్డి తల్లిని భయపెట్టి లొంగదీసుకున్నాడు. పెద్ద కరణం హత్యకు ముందునుండే అచ్చిరెడ్డికి ఊరిలో పలుకు బడి పెరిగసాగింది. కొడుకు పలుకుబడి పెరిగిన తరువాత రంగాయి ఎన్నెల దిన్నిని వదిలేసింది. “ఊళ్ళో ఏ జాతర జరిగినా, చివ్వరికి పందారం జరిగినా, సద్ది జరిగినా, అచ్చిరెడ్డి..... కఱ్ఱ తీసుకోని అదమాయిస్తాండేవాడు. అదో పెద్దరికం, అదో పెత్తనం'' (పు. 71) చెలాయిస్తుంటాడని మాల మాదిగలు అనుకుంటు ఉండేవాడు.

కాల ప్రభావంతో ఆ ఊరిలో మార్పులు చోటు చేసుకున్నాయి. కౌలు రైతులకు ఎన్నెలదిన్నె పొలంలో కొంత భాగం పిల్ల కరణం అమ్మేశాడు. కొన్న వాళ్ళు రెండు అరక ఆస్వాములయ్యారు. జాతరప్పుడు కాస్త ముందు భాగాన నిలబెట్టడం మొదలైంది. కానీ మాల మాదిగలు మరో రకమైన మార్పు జరిగింది. కరణానికి ఎట్టి చేయడంతో పాటు.... ఫలానా రెడ్డి గోరిమాలోడు, మాదిగోడు అని పిలవబడటమే కాదు, విభజింపబడ్డారు” (పు. 51). వారు వారి పొలాల్లోనే పనిచేయాలి. కరణం పొలాలు కౌలు తీసుకోవడం, ఇవ్వడం కూడా అచ్చిరెడ్డి చేస్తున్నాడు. “పిల్ల కరణం తర్వాత ఆ వూళ్ళో అచ్చిరెడ్డి పేరే ముందు పలుకుతోంది..... ఈ పరిణామం ఒక్కోసారి వింతగా ఉంటుంది. ఒక్కోసారి గర్వంగా ఉంటుంది. పెద్దకరణం, పిల్లకరణం వెళ్తుంటే లేచి నిలబడే రైతులు యిప్పుడు అచ్చిరెడ్డి వెళ్తున్నా లేచి నిలబడుతున్నారు” (పు. 51). అంతగా అచ్చిరెడ్డి ఎదిగిపోయాడు.

మాలోడి దిబ్బను సేద్యం చేసుకోవడానికి మాల మాదిగలు ప్రయత్నించినప్పుడు పిల్ల కరణం రచ్చకు పిలిచాడు. ఉరుముల నాగన్న పిల్లకరణం పెద్దరికం నిలిపే మాటలు చెబుతున్నాడు. అచ్చిరెడ్డికి కోపం వచ్చింది. కరణం లేకపోతే మేము లేమా మాతో చెప్పొచ్చుగా కడుపులో మాట దాచుకోలేక అన్నాడు. ఈ రచ్చతో అచ్చిరెడ్డి స్థాయి బహిరంగ పరచబడింది. రచ్చకి అన్ని కులాల వాళ్ళు వచ్చారు. “అరుగుమీద పిల్ల కరణం కూర్చున్నాడు. అచ్చిరెడ్డి పక్కనే కూర్చున్నాడు. వెనుక వరుసలో మిగతా రెడ్లు కూర్చున్నారు” (పు. 79). అచ్చిరెడ్డి ఎదుగుదలను ఓరువలేని పిల్ల కరణం మాలోడిదిబ్బను మాల మాదిగలకే ఇచ్చివేశాడు. కానీ మాలలు వేసే నాటకంలో గౌరవ పిలుపులు ఇద్దరిని యిబ్బంది పెట్టింది. మాలోడి దిబ్బను

మాల మాదిగలకు ఇవ్వకుంటే బాగుండేదని, ఆరోజే అడ్డు పడాల్సిందని పిల్లకరణం అన్నాడు. దానితో అచ్చిరెడ్డి రెచ్చగొట్టినట్లు మాట్లాడేడు. దిబ్బలమిట్టలో మామ సహాయంతో నాటకాన్ని ఆపు చేయించాడు. పిల్ల కరణం పట్నం వెళ్ళిపోతూ మాల మాదిగలకు బంజర భూమిని దానంగా ఇచ్చేశాడు. దాంతో అచ్చిరెడ్డికి మాల మాదిగలకు మధ్య నిరంతరం ఘర్షణ వాతావరణం నెలకొంది. నీళ్ళ దగ్గర కులాల వారిగా నీళ్ళు పొలాలు తడిపే పద్దతి ఆ ఊళ్ళోకొనసాగుతుంది.

**<u>ఉరుముల నాగన్న:</u>**

నారయ్య, లచ్చిమిల కొడుకు, ఉరుముల చంద్రప్ప శిష్యుడు. ఎల్లన్నకు గురువు. నాగయ్య బాల్యం తండ్రి బతికి ఉన్నంత కాలం ఎన్నెలదిన్నిలో హాయిగా గడిచింది. ఎంద్రకాయలు పట్టుకుంటూ, తాటి సాలు, తాటి ముంజలు, నత్తగుల్లల మాంసం తింటూ, తుమ్మచెక్కలు చెక్కడం తాటి చెట్ల మధ్య, చేల గట్ల మీద తుమ్మతోపు నీడలో హాయిగా గడిచింది. ఏటికి వరద రావడంతో మాల, మాదిగ పల్లెలకు ముప్పు వచ్చింది. చావు నుండి తప్పించుకోవడానికి "ఊరవతల గుట్టకేసి ఎల్దాం, ఊళ్ళో పెద్దలు సంపేత్తారు. వరద ముంచేత్తుంది... దిబ్బ మీదకి ఎల్తోన్నా, వచ్చే వాళ్ళు రావచ్చు" (పు. 34) అని నారయ్య "అడుగు ముందు కేశాడో లేదో జనం వరదలా లేచింది. వరద తరుముతుంటే వరద కన్నా ముందు పరుగెత్తుతున్నారు... అంటరాని ఉప్పెన ఊరి మీద పడింది మొదటి సారి. నిజంగా తుఫానే అది. దేవాలయం ధ్వజస్థంభం పెళపెళమంటూ విరిగి పడిన శబ్దం... కరణం పెంకుటిల్లు కొట్టం కూలిన శబ్దం. నాగన్న బాల్యం ముద్ర వేసుకున్న బాల్యం" (పు. 34) మాల మాదిగలను ఎత్తైన మాలాడి దిబ్బమీదకి నారయ్య నడిపించాడు. వారి ఆకలి కోసం కోమటి కొట్లో దొంగతనం చేశాడు. ఊళ్లోకి వెళ్ళి ఇళ్ళునుచూసి వస్తున్న నారయ్యను కరణం హత్యచేయిస్తాడు.

తండ్రి హత్య తర్వాత తల్లి ఉత్తరాది కోతలకు చిన్న పిల్లవాడు నాగన్నను వెంట తీసుకు వెళ్ళింది. ఆ పసిప్రాయంలో ఎన్నెలదిన్నిను నాగన్న వదిలాడు. ఉత్తరాది కోతలతో లచ్చిమికి ఉరుముల చంద్రప్పతో పరిచయం అయ్యింది. ఆ పరిచయం నాగన్నను తల్లితో ధర్మవరం చేర్చింది. ఉరుముల చంద్రప్ప నాగన్నకి ఉరుముల నృత్యాన్ని నేర్పాడు. దాంతో పాటు పురాణ రహస్యాలన్ని నేర్పాడు. "బాపనోళ్ళు యివ్వన్ని అట్టా చెప్పలేదు. యిట్టా సెప్పారు అంత తప్పులు సెప్పారు...... నాగన్నకి బతుకునిచ్చాడు. ఉరుముల నాగన్నగా ప్రపంచానికి పరిచయం చేసి వెళ్ళిపోయాడు" (పు. 27) కానీ చంద్రప్ప నిజంగా నాకు ఏమౌతాడు. అని తల్లి లచ్చిమిని అడిగితే "ఆడు నీకు సిన్నబ్బరా నాగా అంది. అట్టాగే పిల్చాడు... చంద్రప్ప బతికి వున్నంత కాలం సిన్నబ్బ అని మాత్రమే పిలిచాడు. కాని చంద్రప్ప చచ్చిపోయే రోజుమాత్రం నన్ను అప్పా అని పిలువరా నాగా అన్నాడు" (పు.27). అలాగే పిలిచేందుకు నాగన్న గొంతెత్తాడు. కానీ వినేందుకు చంద్రప్ప లేడు.

ధర్మవరం ఉరుముల నాగన్న అంటే అనంతపురం ప్రాంతాల్లోనే కాదు. కోస్తాలో కూడా పెద్ద పేరుంది. నాగన్న జట్టు లేందే, ఉరుముల మోత లేందే గంగమ్మ తనకి జాతరే వద్దంటుంది. ఎందుకంటే ఉరుముల నాగన్న నేత్రం గొప్పది. గాత్రం గొప్పది. తన జ్ఞానంతో ఎంతటి పండితుణ్ణయినా అట్టాగే కూర్చోబెడతాడు. నాగన్న ధర్మవరంలోనే పెరిగి, పెద్దవాడు అయ్యాడు. రాములు అనే అమ్మాయని ఇచ్చి నాగన్నకు పెళ్ళి చేశారు. పెళ్ళి తర్వాత కొడుకు, కొడలిని చూచి తల్లి లచ్చిమి సంతోషంగా, తృప్తిగా కన్నుమూసింది. నాగన్న భార్య "రాములు నీళ్ళోసుకుంది. ఆడప్లిల పుడితే లచ్చిమి పేరు పెడదామనుకున్నాడు చంద్రప్ప. మగ పిల్లాడు పుడితే అని నాగన్న అన్నాడు. నారయ్య పేరు పెడదామన్నాడు చంద్రప్ప. జీవితం తనని

వంటరి వాడిని చెయ్యడానికే నిర్ణయించుకొంది. చంద్రప్ప కాలం చేశాడు. కనలేక రాములు కాలం చేసింది. తల్లితోపాటు బిడ్డకూడా" (పు. 39) మరణించింది. ఆ బాధలను మర్చిపోవడానికి ఇంత కాలం ఉరుములు శబ్దాల మధ్యనే గడిపాడు. ఖాళీగా ఉంటే "అమ్మ, అయ్య, చందప్ప, రాములు, ప్రాణం లేకుండా పుట్టిన బిడ్డ వెన్నాడేవారు. అందుకే కదిలేకాళ్ళకి, మోగే ఉరుముకి పాడే నోటికి విరామం యివ్వలేదు.... ఎల్లన్నను చూసాక ఎందుకో.. వాడితో మాట్లాడాలనిపిస్తోంది. చంద్రప్ప చెప్పిన పురాణం రహస్యాలు ఎల్లన్నకి చెప్పాలనిపిస్తోంది. చంద్రప్ప నేర్పిన అడుగుల కదలికలు ఎల్లన్నతో కలిసి పంచుకోవాలని వుంది" (పు. 39) అని నాగన్నకు అనిపించడమే కాక ఎల్లన్నను ఎన్నెలదిన్నె తనకోసమే తరిమిందని అనుకొన్నాడు.

నాగన్నకు ఎల్లన్న ఎన్నెలదిన్నె వాడినని చెప్పినప్పుడు నాగన్నకు గతం జ్ఞాపకం వచ్చింది. ఎన్నెలదిన్ని పొలిమేర తాకగానే నాగన్నకు బాల్యం గుర్తొచ్చింది. ఊరు వదిలేటప్పుడు అమ్మతో బాల్యాన్ని మూట కట్టుకోని వెళ్ళాడు. వచ్చేటప్పుడు ఎల్లన్నకి తోడుగా వచ్చాడు. బాధని, ఒంటరి తనాన్ని వెన్నంటుకొని వస్తున్నాడు. ఎన్నెలదిన్ని మాలపల్లి నాగన్నను మొదట వింతగా చూసింది ఉరుముల నాగన్నగా కొందరు గుర్తుపట్టారు. మరికొందరు నుదుటిన విభూది కేసిచూస్తు 'గురువులోరు' అన్నారు. భూదేవి మాత్రం నాగన్న ఎల్లమ్మ తల్లి పంపిన వాడిగా చూస్తోంది. ఎన్నె దిన్నె నాగన్నను ఎవరూ గుర్తు పట్టలేదు. నాగన్న ఎన్నెల దిన్నిలో ఒక్కొక్కరిని గుర్తు చేసుకుంటున్నాడు. మాతయ్యను గుర్తు చేశాడు. దాంతో పెద్దమాల ముఖంలో మార్పు వచ్చింది. నాగన్నను అలాగే చూశాడు. నారిగాడు కొడుకునని చెప్పాడు. ఆ మాటకు నారాయి మామ కొడుకు అని పదేపదే పిట్టోడు అనుకున్నాడు. కళ్ళు కనిపించని, సినరంగయి తవుడుకుంటు వొడుపు మీద ముందుకువచ్చి యాడ్రా నారిగాడు కొడకు అన్నాడు. "భూమ్మీద త్యాగానికి వున్నంత విలువ దేనికీ లేదు. అది ఎంత చిన్నదైనా కావచ్చు. దాన్ని ఎంత చిన్నవాడైనా చెయ్యొచ్చు. దాని శక్తి దానిదే" (పు. 60)నని నాగన్నకు అవగతమైది. పిట్టోడు భార్య చిన్నమ్మి నాగన్న పెద్దయ్య కొడుకు బిడ్డే, చిన్నమ్మి నాగన్నను "ఈడ్నే వుండిపో అయ్యా" (పు.61) అంటే ఆగిపోయాడు.

చిన్నమ్మి చంకలో బిడ్డ నాగన్న భుజాల కెక్కింది.  నాగన్న ఇప్పుడు ఒంటరివాడు కాదు. చిన్నమ్మి, పిట్టోడు, ఎల్లన్న, భూదేవి అంతా తన వాళ్ళు. పిట్టోడి కుతూరికి నాగన్నే సుభద్ర అని పేరు పెట్టాడు. నాగన్న ఎల్లన్నకు పాటకున్న పట్టు అడుగుకున్న లయ క్రమబద్ధం చేయడం నేర్పాడు. ఎల్లన్న పెద్దాయ్యాక చెంచులక్ష్మీ నాటకం నేర్పాడు. ఉరుముల నృత్యమే కాదు. రాయలసీమ బయలాట కూడ పరిచయం చేశాడు. చంద్రప్ప నేర్పిన జానపద కళారూపాలన్ని ఎల్లన్నుకు నూరి పోశాడు. చంద్రప్ప తనకు చెప్పినవన్నీ ఎల్లన్నుకు చెబుతూ వాటికి ఆట, పాటలు జత చేశాడు. "మరాటోడు,  మనోడే, తోలుబొమ్మల్తో పురాణాన్నీ చెప్పాడు. వాడు తయారు చేసిన కేతుగాణ్ణి, బంగారంక్కను చెయ్యమను ఈ పండితుల్ని వాళ్ళ రాధ, వాళ్ళ కృష్ణుడు, మన బంగారక్క, కేతుగాళ్ళ ముందు ఎందుకు పనికొస్తారు" (పు. 68) అని చెప్పేవాడు. జాన పదుల కళా రూపాల విలువను తెలియజేశాడు. ఇలా తవ్వితే చాలా ఉంది. పూద్చగలిగితే ఎంతో లోతుంది. అని పురాణాల నిర్మాణాలను ఎలా వినిర్మాణం చేయాలో చెప్పాడు.

గంగమ్మ ఉరుములోలతన్నని చెప్పాడు. బయలాటలు అనే వీధి నాటకాలు జనం మధ్య నుండి ఎలా దూరమయ్యాయో కథలు ద్వారా వివరించాడు. పండితులు, రుషులు, చేసే పాడు పనులకు గంగ పిల్లలతో పొంగి పొరలింది. రుషులను తరిమిన బిడ్డలు తల్లి దగ్గరకు వచ్చారు. వాళ్ళను చూసి గంగ పొంగి పొరిలింది. చేలన్నీ తడిపింది. సముద్రంలో కల్పింది. గంగ శాంతించింది. బ్రహ్మ రాసిన నాటకం వెయ్యడానికి గంగ బిడ్డలు తరిమిన

పండితులు కూడబలుక్కొన్నారు. "నాటకానికి తెరలు కట్టారు. తెరల చుట్టే డేరాలు కట్టరు. దేవాలయం గేట్టు మూసి సురాసుర పురాణం ప్రదర్శించారు... జనం మధ్య ఆడే దమ్ములేదు. ఆళ్ళకి మనం అట్టా కాదు. మన ఎగురుడు జనం మధ్యే బంగారక్క తెలర మీద చిందేసినా ఆలిసిగాడు ఆస్యం చెప్పినా నరసింహస్వామి వెళ్ళినా అంత జనం మధ్యే" (పు. 69) నని జనం పద కళరూపాలు దమ్మును తెలియజేశాడు.

ఒక రోజు నాగన్న ఇసుక తిన్నెల మీద భాగోతం జట్టును కూర్చోబెట్టాడు. అందరికి అన్ని పాత్రలు నేర్పించాడు. మాలల నాటకం గురించి చుట్టు ప్రక్కల ఊళ్ళలో తెల్సింది. ఎన్నె దిన్నిలో అదో నవ్వలాటగా ఎగతాళి అయింది మొదటి ప్రదర్శన ఎన్నెలదిన్నిలో జరిగింది. ఆరోజు ఆటను "నాగన్నే నడిపించాడు. సూత్రదారుడు మొదలుకొని అవసరమైన ప్రతి పాత్ర చేశాడు" (పు.71). ఆట మొదలు ముందు ఒక వింత జరిగింది. ఆటకంటే అదే పెద్ద చర్చ అయింది. గణనాథుని ప్రార్థన, పోతులూరయ్య పై గీతం అయినాక సూత్రధారుడిగా నాగన్న ఆత్మగౌరవాన్ని ఆకాశానికి తాకే మాట  అన్నాడు. సంప్రదాయాన్ని మరో మలుపు తిప్పిన మాట "అరె సేవకా, అయ్యా ఘనత వహించిన పెద్దమాల, అంతే ఘనత వహించిన మాదిగ పెద్ద వచ్చి తమ స్థానాలను అలంకరించారంటరా... మాటాడవేంరా సేవకా... వచ్చుచున్నారు స్వామి. జనం వెనక్కి చూశాడు. ఆ మాట అనే దాకా రావద్దని నాగన్న పెద్ద మాలకి, మాదిగ పెద్దకి ముందే చెప్పాడు" (పు.72). తెల్లవారిందాకా సాగింది ఆట. తృప్తిగా చూశారు. స్వేచ్ఛగా చూశారు. నాగన్న, ఎల్లన్నల మాల మాదిగ పల్లెల్లో ఆడిస్తున్నారు. వారితో పాటు అతి శూద్రులు కూడ అగ్రకులాలకు తెలియకుండా దొంగచాటుగా చూస్తున్నారు. రానురాను బహిరంగంగానే చూస్తున్నారు. ఇలా చూడడం పిల్ల కరణాననికి, అచ్చిరెడ్డికి బాధ అనిపించలేదు. కానీ ఆట ముందు మాల, మాదిగ పెద్దలను ఆహ్వానించడం వాళ్ళకి అవమానకరంగా వాంది. తమ గుర్తింపు ఆ మాటలు రద్దు చేస్తున్నట్లుగా భావించారు. అందుకే భరించలేకపోయారు. అదను కోసం ఎదురు చూస్తున్నారు. ఎదురు చూస్తున్న సమయం రానే వచ్చింది.

అచ్చిరెడ్డికి దిబ్బలమిట్టలో ఆట ఉందని మామ బుక్కిరెడ్డి ద్వారా తెలిసింది. ఏమి చేయమంటావు అల్లుడు అని కబురు పెట్టాడు. మామకి నేను చెప్పేదేంటి ఆయన ఎట్టా అనుకుంటే అట్టా చయ్యమన్నాడు. బుక్కిరెడ్డి మాల మాదిగ పెద్దలను పిలిపించి ఆట ఆపమని చెప్పాడు. లేదా మాల, మాదిగ పెద్దలను ఆటకు ముందు సగౌరవంగా పిలవడం ఆపమని చెప్పాడు. నేను చెప్పినట్లు చేయకపోతే రెండు పల్లెలు బూడిద అవుతాయని హెచ్చరించాడు. ఈ విషయం పల్లెవాసులు నాగన్నకు తెలియజేశారు. ఇలా జరుగుతుందని నాగన్న ఊహించలేదు. తన ప్రమేయం లేకుండానే తన జీవితం ఎటో వెళ్ళిపోతుందని అనుకున్నాడు. ఎన్నెలదిన్ని మాల మాదిగలను, నాగన్న ఏటి గట్టుకు తీసుకపోయి నలుగుర్ని కూర్చోబెట్టి ఆ విషయం వివరించాడు. వాళ్ళుతప్పకుండా ఆట ఆడాలని అన్నారు. ఆరాత్రే దిబ్బలమిట్ట వెళ్ళారు. అక్కడి పెద్దలతో మాట్లాడి ఒప్పించే ప్రయత్నం చేసారు. కానీ ఆ ఊరు మాల, మాదిగలు రెడ్డికి భయపడ్డారు. నాటకం ఆడడం గురించి నాగన్న ఎల్లన్న నిర్ణయం అడిగాడు. మాల మాదిగల పెద్దలను నాటకం ఆరంబానికి ముందు పిలవకుండా ఆడడం కుదరదని తెల్చి చెప్పాడు. మాల మాదిగల ఆత్మగౌరవాన్ని ఆకాశంలోనే ఉంచాలని ప్రయత్నం చేశాడు.

అంతకుముందు. నాగన్న మాలోడిదిబ్బలో వ్యూహం ప్రకారం చెట్లు నరికించాడు. సేద్యాన్ని అనువుగా ఆ భూమి తయారు చేయాలని నాగన్న తలంపు. అప్పటికే గ్రామ స్వరూప స్వభావాలు మార్పులకు గురౌతున్నాయి. కరణాల పెత్తనం సన్నగిల్లుతూ ఉంది. అచ్చిరెడ్డి ఎన్నెలదిన్నిలో క్రమం బలపడుతూ ఉన్నాడు. ఇది కరణానికి ఇబ్బందిగా మారింది. అందుకే

భూమి కోసం నాగన్న పథకం గీశాడు. క్రమంగా మూడో రోజుకు సగం దిబ్బ మాల మాదిగలు కలిసి చెట్లు కోట్టేశారు. అప్పటివరకు ఊరు ఈ విషయం పట్టించుకోలేదు. ఆలోచించి వాటికి

మాలోడిదిబ్బలో చెట్లు పూర్తిగా కొట్టేశారు. అదిచూసి ఊరు మాలా మాదిగలను రచ్చకు పిలిచారు. చివరి గెముడు చెట్టు కిందికి రమ్మన్నారు. ఊరి మధ్యలో మాలా మాదిగలను రచ్చకు పిలవరు. అది నామోషి. గవిటి చెట్టు రచ్చ ఎప్పుడో గాని జరగదు. జరిగిన ఎంత రమ్మన్నా ఇంత మంది మాలా మాదిగలు రారు. నాగన్నతో

మాల మాదిగలు కలిసి వచ్చారు. ముందుగా నాగన్నే "మాలాడిదిబ్బ ఎట్టికి పండింది. బాగు చేసుకుందా మనుకొన్నాం" (పు.79) అని చెప్పాడు. గతంలో ఏదైనా అడిగితే ఒకరి మీద ఒకరు చెప్పుకునేవాళ్ళు కానీ నేడు నాగన్నే చెప్పడం మొదలు పెట్టాడు. గతంలో ఎప్పుడూ లెంది. మాలా మాదిగలు కలిసి గయిటి చెట్టువద్దకు వచ్చారు. వారి చూపుల్లో తేడా కనబడుతుంది. ఇది పిల్లకరణం గమనించాడు.

అచ్చిరెడ్డి కరణం ప్రక్కనే కూర్చొన్నాడు. అచ్చిరెడ్డి తన పక్కన కూర్చోకుండా, వెనక వరసల కూర్చొంటే బాగుండేదనుకుంటున్నాడు. ఈ మార్పు పిల్ల కరణాన్ని మరోవైపు ఆలోచించేలా చేశాయి. ఈ మార్పులను నాగన్న గమనించాడు. "చెట్లు కొట్టాక మీతో చెబుదామనుకొన్నాం.... ముందే చెబుదామనుకుంటే మీరు నెల్లూరు పోయారని తెలిసింది" (పు. 79-80) అని పిల్లకరణం పెద్దరికాన్ని నిలబెట్టే మాటలు అన్నాడు. అబద్ధం చెబుతున్నాడని తెల్సినా నాగన్న తన పెద్దరికం నిలబెట్టే మాట అన్నందుకు సంతోషించాడు. అచ్చిరెడ్డికి ఆ మాట నచ్చలేదు. తనను గుర్తించే మాట అనకపోవడంతో ఆయన లేకపోతే మాతో చెప్పొచ్చుగా అన్నాడు. కానీ నాగన్న ఏమి మాట్లాడలేదు. దాంతో అచ్చిరెడ్డి బూతులు అందుకున్నాడు. పిట్టోడి చూపుల్లో పోలయ్య కదలికల్లో తేడాలు కరణం గమనించాడు. ఆ భూమి వాళ్ళకు చెందడమే మంచిదనుకున్నాడు. 'అచ్చిరెడ్డి చెబితే బాగుండేదని' తేలికగా చిన్నగా రెండు, మూడు సార్లు అన్నాడు. "అయినా దెయ్యాల దిబ్బను, దెయ్యాల్నే తిన్నీ అచ్చిరెడ్డి" (పు. 81) అని లేచాడు. పిల్లకరణం అచ్చిరెడ్డిల మధ్య ఉన్న ఎడమను ఆసరగా చేసుకోని సమస్యను తేలికగా పరిష్కారం అయ్యేలాగ చేసాడు. మాల మాదిగలు ఆ దిబ్బను సాగులోకి తెచ్చారు. సేద్యం పాతబడిపోయింది. బాడవ నీళ్ళు ఏతాంతో మాలోడిదిబ్బకు కాలువల ద్వారా వెళ్ళేలా నాగన్న ఏర్పాటు చేయించాడు.

నాగన్న మాట, ఎల్లన్న ఆటలో దాగిన ఆత్మగౌరవం కరణం, అచ్చిరెడ్డిని ఇబ్బంది పెట్టింది. మాలాడిదిబ్బను కరణం తేలికగా వదిలివేశాడు. కానీ ఆట సమయంలో కరణం స్థాయిలో మాల, మాదిగల పెద్దలను సగౌరవంగా పిలవడం సహించలేకపోయాడు. తన చేతికి మట్టి అంటకూడదనే ఆలోచనలో కరణం ఉన్నాడు. అచ్చిరెడ్డిని రెచ్చ గొట్టి, కూతురి దగ్గరకు వెళ్ళాడు. ఆటను ఆడడం సమస్య కాదు. పెద్దలను పిలవడేమ సమస్య. పిలవకుండా ఆడడం అంటే ఆత్మగౌరవాన్ని చంపుకున్నట్లేనని నాగన్న, ఎల్లన్న భావించారు. ఆ నిర్ణయం నాగన్న ఊపిరి మీద ప్రభావం చూపుతుంది. తెలియని ఇబ్బంది గుండెల్లో సుడులు తిరుగుతుంది. అందరూ ఎన్నె దిన్నికి భారంగా నడుస్తున్నారు. నాగన్నకు నడవడం కూడా కష్టంగా ఉంది. ఆట ఆడలేకపోవడం ఓటమిని అంగీకరించడమేనని అనుకున్నాడు. తవ్వాల్సింది, పూడ్చాల్సింది చాలానే ఉందని చెప్పే చంద్రప్పకు చెప్పిన పురాణ రహస్యాలు "నాగన్న అవసమొచ్చినప్పుడల్లా మాట్లాడిన మాటలు తాను తన వాళ్ళు తక్కువ వాళ్ళు కాదు. అని చెప్పడానికే. అక్కడ అతనిలో కనిపించేది తిరుగుబాటు" (పు.44) తత్వాన్ని తెలియజేస్తుంది. నాటకం ఆగిపోవడంతో

అచ్చిరెడ్డి దిబ్బల మిట్టనుండి ఎన్నెలదిన్నికి దుమ్ము రేపుకుంటూ ఎద్దులబండిలో వెళుతున్నాడు. అప్పుడు వెలువడిన ఎద్దుల గంటల మోత 'అతని ఎద మీద ఎవడో శత్రువు తన్ని వెళ్ళినట్టనిపించింది'. ఆ ఎద్దుల గంట మోత నాగన్న ఓటమిని, అచ్చిరెడ్డి విజయాన్ని చాటి చెప్పినట్లుగా తోచింది. నాగన్న మాలోడిదిబ్బ మీదగా వెళ్దామన్నాడు. మాలోడి దిబ్బలో ఆగుదాం బిడ్డ అన్నాడు. మాలోడి దిబ్బ తైదంతా పాలకంకి కాసింది. అంతా చీకట్లో కూడా "పంట బాగా వచ్చింది.... కూటికి దుల్లేదు" (పు.   ) అన్నాడు. దూరంగా అచ్చిరెడ్డి పొలం కనబడుతుంది. మాలోడిదిబ్బకు అచ్చిరెడ్డి పొలానికి మధ్య బాడవ అడ్డంగా ఉంది. మాలోడిదిబ్బ గట్టు బాడవ దాటి అచ్చిరెడ్డి పొలం దగ్గర పడాలని నాగన్న చెప్పాడు.

మాలోడిదిబ్బ నుండి ఎన్నెలదిన్ని వచ్చే "దారంతా మాట్లాడుతూనే వున్నాడు. బలవంతంగా మాట్లాడుతున్నట్టనిపించింది. గొంతు చాలా బలహీనంగా విన్పిస్తోంది. రాత్రంతా మాట్లాడుతూనే ఉన్నాడు. ఆట మారాలన్నాడు. పాట మారాలన్నాడు. రెండు, మూడు పాటలు పాడాడు. ఆ పాటలు కొత్తగా అన్పించాయి. ఆకలి, భూమి, మాలాళ్లు, మాదిగాళ్లు ఆ పాటల నిండా నిలిశాయి. ఎల్లన్న ఆ రాత్రి నాగన్న దగ్గరే వుండి పొయ్యాడు. నాగన్న కొత్త పాటలు పాడుతుంటే వాటిని మనసులో బంధిస్తూ కూర్చోన్నాడు. గంగపాట వినరా బిడ్డా అన్నాడు. పాడాడు. గంగని భూమ్మీదికి తెచ్చింది భగీరథుడు కాదు. ఉరుములోళ్ళు. భగీరథుడు అబద్ధం. ఉరుములోల్లు నిజం. ప్రళయం ఉరుముల శబ్దంలో పుట్టింది. ఈ భూమ్మీద మొదటి నీటి కయ్యలు కట్టింది మాదిగోళ్ళు, మాలోళ్ళు. యానాదోళ్లు గిరుల గుండెల్లో నిద్రోయే గిరిజనులు. నిప్పు చేశారు. నీళ్ళు తెచ్చారు. భూమి దున్నారు. బువ్వ వండారు. ఆ తర్వాతే ఎవరొచ్చినా. నోటికాడ కుడ కొట్టేయ్యడానికి ఎవరొచ్చినా ఆతర్వాతే వచ్చారు. అట్టా పాడుతూ పోయ్యాడు. ఓజాము దాకా పాడాడు. తొలికోడి కూసింది. నిద్రోస్తుంది రా బిడ్డ అన్నాడు. రోజు ఆ జాము లేసేవాడు. ఈ రోజు నిద్రొస్తుందన్నాడు. కన్ను మూసాడు" (పు. 84-85). మరణంలో ఎవరూ తోడు రారని విసుర్రాయి పాట నాగన్న పాడేవాడు. "కట్టెలే సుట్టాలు. కాడే బంధువులు పాడె బద్దెలు బావామరదళ్లు. గుప్పెడు మట్టి గుండెల్లపోత. సుట్టాలు, బంధువులు సుట్టుకోసుంటారు. కన్నీరు తీస్తారు. ఆ తర్వాత ఎవడికి వాడు తొలగిపోతాడు" (పు. 85) అని పాడేవాడు. కానీ నాగన్న వెంట ఎవ్వరూ వెళ్ళకపోయినా నాగన్న ఎన్నెలదిన్ని మాల మాదిగల మనసుల్లో నిలిచిపోయాడు. నాగన్న మరణం తర్వాత ఎల్లన్నకు ముందంతా శూన్యంలా తోచింది.

అంతేగాక "రూతు జ్ఞాపకాల్లో నాగన్నకి ప్రత్యేక స్థానముంది. రూబేను ఎల్లన్నని గూర్చి చెప్పేటప్పుడు ఎంత ఉద్రేకానికి గురయ్యేవాడో అంతే ఉద్రేకానికి నాగన్నని చెప్పేటప్పుడు గురయ్యేవాడు... ఆ అంటారాని శరీరం ఎంత అద్భుతమైన సజీవ కళకు నిలయం అని. అట్టా అనుకున్నప్పుడు వర్షించేది కళ్ళు కాదు. ఆమె గుండె ఆమె జీవితం మొత్తం" (పు. 27). మూడు తరాల తర్వాత కూడా నాగన్నను గుర్తు చేసుకుంటున్నారు. నాగన్న ఎన్నెలదిన్నిను ఆత్మగౌరవంతో తలఎత్తుకునేలా చేశాడు. మాల మాదిగలకు తల ఇంత పొలాన్ని సంపాదించాడు. తన ఆట పాటల ద్వారా పెత్తందారులకు ఎదురు నిలిచి వారికి ఊపిరాడకుండా చేశాడు. దిబ్బలమిట్ట ఆటను అచ్చిరెడ్డి అడ్డుకున్నప్పుడు, ఆట ద్వారా వారికి సవాలు విసరాలనుకున్నాడు. కానీ దిబ్బలమిట్ట మాల మాదిగలు భయపడి వెనక్కి తగ్గారు. స్పందించడం కళాకారుల నైజం. నాగన్న సహజ కళాకారుడు, అందుకే నాగన్న హృదయం స్పందించింది. స్పందించి, స్పందించి తట్టుకోలేక ఆగిపోయింది. గుండె ఆగిపోయే ముందు కూడా భూమి, భుక్తి కోసం పోరాటాలు చేయమనే పాటలు పాడాడు. ఈ భూమిని సృష్టించింది, సృష్టిస్తుంది. మూలవాసులేనని చాటి చెప్పాడు. అందుకే అంటరాని వసంతం నవలలో ఉరుముల నాగన్న

పాత్ర కీలకమైన పాత్ర. తండ్రి నారయ్య, మాదిగ మాతయ్యల పోరాటాన్ని ముందుకు తీసుకు వెళ్ళే పాత్ర. మాలమాదిగల పోరాటానికి సృజనాత్మకతను జోడించి, వ్యూహాత్మకంగా వ్యవహరించిన పాత్రగా నాగన్న కనబడతాడు. అలాగే ఎన్నెలదిన్ని ప్రజలు నాగన్నను స్మరించుకుంటారు.

**4. 1. 3. అంటరాని వసంతం-కులవ్యవస్థ:**

భారతీయ సమాజం కులసమాజం. వందల సంవత్సరాలుగా నిమ్నజాతులు తీవ్ర వివక్షలను ఎదుర్కోన్నాయి. ఎదుర్కుంటున్నాయి. గాయపడిన గొంతుకలు పాటలు పాడటం ఎలా సాధ్యం కాదో అలాగే లణివేతలకు గురవుతున్న గనం దాన్నితిప్పికొట్టలేకపోయారు. అంటరాని వసంతం నవలను జి. కళ్యాణరావు ఎంతో నేర్పుతో రాశాడు. అ నేలపై ఎస్సీలు పడిన కష్టాన్ని ఈ నవల రచన సమయంలో ఆయన కూడా పడివుండవచ్చు. ఎందుకంటే సాహిత్య సృజన అనేది అనుభవనేపథ్యం నుండే వస్తుంది. అలా వచ్చిన సాహిత్యమే పాఠకుల హృదయాలను తాకి సహృదయాల మెప్పును పొందించి. దళిత సాహిత్యంలోనే కాకుండా తెలుగు సాహిత్య చరిత్రలో ఈ నవల చిరస్థాయిగా నిలిచి పోతుందని చెప్పవచ్చు.

అంటరాని వసంతం నవల అంతటా కులవ్యవస్థ వికృత స్వరూపం కళ్ళఖు కట్టినట్లుగా చిత్రీకరించాడు రచయిత. ఈ నవల కవర్‌పేజీ నుండే మొదలవుతుంది. విరసం వారి ప్రచురణ అంటేనే ఆర్థం చేసుకోవాలి. తప్పకుండా విప్లవ నవలే అవుతుందని. కానీ ఈ నవలలో దళితులు భూమి కోసం చేసిన పోరాటం స్పష్టంగా ఉంది. కానీ అంబేద్కరిస్టు పరిష్కారాలు ఈ నవలలో ఎక్కడా కనబడవు. అలా కనబడతాయని ఆశించడం పాఠకుడి ఆత్యాశ. ఎందుకంటే ఈ నవల అస్తిత్వవాదాల ప్రశ్నల స్పందనలకు ప్రతి స్పందన అందుకే దళిత ఉద్యమాలు ఉవ్వెత్తున లేచి పడుతున్న తరుణంలో మరియు కమ్యూనిస్టులు అగ్రకుల స్వభావంలో దళిత నాయకుల పట్ల వివక్షత చూపుతున్నారని విషయాల్ని బహిరంగ పరిచి, బయటకు వచ్చి ఉద్యమాలు చేస్తున్న సమయంలో ఈ నవల రాయబడింది. కానీ కారంచేడు. చుండూ దాడులను పేర్కొన్నప్పటికి దళిత ఉద్యమాల ప్రజాస్వామిక పోరాటాల గురించి కప్పదాటు వైఖరిని అవలంభించింది. భూమి కేంద్రంగా ఈ నవల కొనసాగుతుంది. దాన్ని సాధించుకోవడానికి మొదట తరం నుండి ఆధునిక కాలం వరకు మాలలు చేసిన పోరాటం చిత్రీకరింపబడింది. ఆదరణతో కూడిన ఆత్మగౌరవం కోసం క్రైస్తవమతాన్ని పుచ్చుకున్నారు. కానీ అక్కడ కూడా అగ్రకులాలు చొరబడ్డాయి. ప్రధానమైన వనరులను చేజిక్కించుకున్నాయి. కమ్యూనిజం పదల విముక్తి నినాదంతో వచ్చినప్పుడు వారిని ఎస్సీలు అనుచరించారు. కానీ వారు కుల నిర్మూలనను పట్టించుకోకుండా వదిలివేశారు. కులం గురించి మాట్లాడిన వాడి కులతత్వవాదిగా విదిలివేశాయి. దాంతో తెలుగు ప్రాంతంలో అస్తిత్వ ఉద్యమాలు మొదలయ్యాయి.

అంటరాని వసంతం నవలలు కులవ్యవస్థ వేళ్ళు ఎలా చొచ్చుకు వెళ్ళాయో తెలియజేశాడు. ఎన్నెల దిన్నికి మకుటం లేని మహారాజు పెద్ద కరణం. మనుక మరొకరూపం అతడు. తన కులాధిక్యతను ఎవరు అడ్డువచ్చిన హత్యారాజకీయాలకు కూడా వెనుకాడడు. తన పనులకు అడ్డు వచ్చారని నారయ్యను, తన కూతురితో అక్రమసంబంధం పెట్టుకున్నాడని కొళ్ళదిన్నె పంతుల్ని, తన కూలీ డబ్బులు లెక్కచూమన్నందుకు అచ్చిరెడ్డి తండ్రి చంపిస్తాడు. ఇతను బ్రతికి ఉన్ననాళ్లు కులవ్యవస్థ చెక్కు చెదరలేదు. ఆ ఊరి చుట్టూ ఉన్న భూములన్ని కరణానియే, రెడ్లు కూడా ఇతని కింద ఉన్న పొలాలు కౌలు తీసుకుని వ్యవసాయం చేసుకునేవారు. (పు. 29). కరణ: పొలంలో మలామాదిగలు పనిచేయాలి. దానిని అనే కంటే వెట్టి అనడమే సరైనది . ఎందుకంటే పిన చేసినందుకు వారికి ఎలాంఇ ప్రతిఫలం ఉండేది

కాదు. మధ్యాహ్నం కూటి కావిళ్ళే కూలి. ఆ కూటిదగ్గర కూడా తన్నులాట పెట్టి చోద్యం చూసేవాడు. అది అయినా తర్వాత కల్లాం గింజల దగ్గర మాల మాదిగల మధ్య తగాదాల కోసమే ఆగింజలను వదిలే వేసేవాడు. వారు తన్నుకు చస్తే మధ్యలో దూరి ఇద్దర్ని మందలించేవాడు. మాల మాదిగలు ఎప్పటికీ కలవకుండా మనువులాగా మధ్య ఎపు&ఓపడు విభన గీతలు కనబడకుండా గీసేవాడు. ఇదే మనువాదం బ్రాహ్మణీయ భావజాలం విభజించి పాలించడం, ఒక కులం కంటే మరో కులం గొప్పదని నిచ్చెనమెట్ల కులవ్యవస్థ స్థిరీకరించుకుని అగ్రభాగాన కూర్చోడం. తమ అధిపత్యానికి ఎలాంటి సవాలు చేసిన వ్యక్తులను చంపడం, ఇంకెవరు అలాంటి ఆలోచన చేయకుండా జాగ్రత్త వహించడంలో భాగమే నారయ్య హత్యని చెప్పవచ్చు. కరణంను మాతయ్య చంపే సమయానికి ఎన్నెలదిన్ని రాజకీయ, ఆర్థికాంశాలు మూర్పులకు గురవుతున్నాయి. అందులో భాగంగా రెడ్డు ఆర్థికంగా బలపడుతున్నారు. ఇలా బలపడడంతో పిల్ల కరణం మాలలు, రెడ్ల మధ్య పొలం గట్లు వద్ద శాశ్వతంగా చిచ్చు పెట్టి పట్టణం వలస వెళ్ళిపోయాడు. పట్టణం జీవితంలో తమ అధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. కుల భావన లేని క్రైస్తవంలో కులభావన ప్రవేశపెట్టి ఆ మతాన్ని భారతీకరించారు. మిషనరీలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సీయాను, మార్టిన్, రూబెనులు తీవ్రంగా నిరసించారు. మార్టిన్ అగ్రకుల క్రైస్తవులకు వ్యతిరేకంగా పోరాటం చేసి అగ్రకులాల చేతిలో హతమార్చబడ్డారు.

ఎల్లన్న చిన్నతనంలోనే కులనాగు విషకాటుకు భయపడి పారిపోయాడు. ఆ పారిపోవడం నవల గమనంలో కీలక మలుపుకు కారణమయ్యాడు. కులాధిపత్యాన్ని ధిక్కరించిన నారయ్యను చంపడంతో తల్లితో కలిసి నాగన్న ఎన్నెలదిన్నకి దూరమయ్యాడు. ఎల్లన్న రాకతో ఆ ఊరికి దగ్గరయ్యాడు. ఆ ఊరికి ఆత్మగౌరవాన్ని నేర్పాడు. తవ్వాలసింది ఎంతో ఉందని, పూడ్చాల్సింది కూడా ఎంతో ఉందని చెప్పాడు. ఊరిలో నాటకం వేస్తే నిమ్మకులాలు ఎక్కడో దూరంగా ఉండి అగ్రకులాలకు కనబడకుండా చూడాలి. ఇది కళారంగంలో తీవ్రమైన వివక్ష. నాటకం ఆడటానికి వచ్చిన వారిని చూడడానికి వెళ్ళిన పసి ఎల్లన్నను కుల సమాజం తీవ్రంగా దాడి చేస్తుంది. ఏ నాటకం చూడడానికి వెళ్ళి దెబ్బలు తిని పారిపోయిన ఎల్లన్న ప్రధాన నాయకుడిగా నాటకం నేర్పుతాడు. అగ్రకులాలకు దీటుగా మాల మాదిగల పెద్దలను సగౌరవంగా ఆహ్వానిస్తాడు. ఆత్మగౌరవ పతాకంగా ఎగుతాడు. దళితులకు భూమి అవసరమని నమ్మి వ్యూహం ప్రకారం మాలోడి దిబ్బను ఆక్రమించుకునేలా పథకం పన్ని విజయవంతంగా పూర్తి చేస్తాడు. రెడ్లు పిల్లకరణం మధ్య జరుగుతున్న ఆధిపత్యాపోరును పావుగా వాడుకుంటాడు.

దళితుల్ని ఊరి మధ్య రచ్చకు పిలవరు. ఊరి చివరికి గముదు చెట్టు కిందే రచ్చ జరుపుతారు. ఇదో రకమైన వివక్ష, మాల మాదిగలను చెరోవైపు నిలబెడతారు. కలవనీయరు. ఎక్క ఊరిలో నాటకానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు అచ్చిరెడ్డి మామ మాల మాదిగలను పిలిచి ఆడవద్దని హెచరిస్తాడు. ఆట ఆడితే మాలా, మాదిగ పెద్ద పిలవకుండా ఆదమని చెబుతాడు. అలా కాదని ఆడితే రెండు పల్లెలను తగలబెడతానని బెదిరిస్తాడు. దాంతో వారు భయపడి ఆట ఆడవద్దంటారు. నాగన్న ఆత్మగౌరవమే కాదు. దళితుల ఆత్మగౌరవానికే భంగం వాటిల్లినట్లుగా భావించుకుని నాగన్న తన నిరసనను తీవ్రంగా తెలియజేస్తూ రాత్రంతా పాటలు పాడి పదాలు చెప్పి మరణిస్తాడు. నాగన్న కళాకారుడు కనుకే అతనికి స్పందించడం తెలుసు. అందుకే ఆత్మగౌరవం దెబ్బతిని అతని గుండే స్పందించలేక ఆగిపోయింది. ఇది కుల సమాజం చేసిన హత్యగానే పరిగణించాలి.

కుల ప్రాధాన్యత సమాజంలో కింది కులాల ఆత్మగౌరవంతో తలెత్తుకొని తిరగడం సమాజం సహించలేదు. తలెత్తుకున్నప్పుడల్లా ధాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తుంది.

కుమ్మరి కోటేశ్వరరావు హత్య ఇలాంటి సన్నివేశమేనని చెప్పవచ్చు. మాలబైరాగిగా మారిన ఎల్లన్నను కలుసుకోవడానికి కుమ్మరాయన బయలుదేరాడు. (పు.91) బ్రాహ్మణ బజారులో నడిచి వెళ్తున్న కుమ్మరాయన్ని ఆటకాయించారు. విషయం తెలుసుకుని ధర్మ పూనకంతో ఊగిపోయారు. ఎల్లన్నను కలిసి ఆయన పాటల్ని లిఖించాడు. తనలో పాటు ఎవరూ న డవని దారికి నడక పరిచయం చేస్తూ ముందుకు సాగాడు. అగ్రవర్ణాలు కోటేశ్వరరావు పై దాడి చేసి చంపేశారు. మాల మాదిగ, యానాది పల్లెలు పుట్ట పగిలినట్లు వచ్చారు. అప్పటికే కుమ్మరి మరణించాడు.

ఈ నవల బహుజనులు (ఎస్సీ, ఎస్టీ,బి.సిలు)కలిసి కట్టుగా రావడం ఇదే మొదలు. ముందు ముందు మరి కొన్నిచోట్ల కలయిక కనబడుతుంది. వీరందరినీ మాల భైరాగి అనబడే పటేల్లడు కలపగలిగాడు. బ్రాహ్మణ పండితులు కాలికి బుద్ధి చెప్పారు. కుమ్మరి కోటేశ్వరరావు చితికి ఎల్లన్నే నిప్పు పెట్టాడు. అస్తికల మీద సమాధి కట్టారు. అది అలగాజనానినికి సందడి స్థలమైంది. అగ్రవర్ణాలు కలిస్తేపుణ్యక్షేత్రమై కృతిమం అవుతుందని అన్నాడు. కానీ అలగ జనాల పూజకేంద్రాలు ఆట, మాట, పాట కలిసిన సంస్కృతికి అద్దం పడుతుంది. ఈ స్థలంలో బహుజనులు ఎలాంటి వివక్షతలు లేకుండా కలిసి మెలిసి ఉ ంటారు. ఆ స్థలాలు సాంస్కృతిక కేంద్రాలకు ప్రతీకలుగా వర్ధిల్లుతాయి. కుల వ్యవస్థలకు సవాలుగా మారి బహుజనతత్వం మొగ్గ తొడగడానికి గొహదపడతాయి. ఆపనే ఈ నవలలో ఎల్లన్న చేయడం జరిగింది. అగ్రకులధిపత్యంలో ఆట ఆగిపోయిన తార్వత ఎల్లన్న ఉ ద్యమకారుడు మారతాడని అనుకుంటాం. కానీ ఎల్లన్న పాటగా ప్రకృతిలో ప్రయాణిచాడు. బహుజన భావాలు ప్రజవనంలో వెదజల్లాడు. ఆ భావాలు తర్వాత కాలంలో విప్లవోద్యమంగా మొగ్గతొడిగాయని చెప్పవచ్చు.

ఈ నవలలో సుభద్ర అగ్రకులాల అధిపత్యాన్ని తీవ్రంగా ఎదుర్కొంది. (పు.105) హతాత్రువైన అగ్రకులాలు సుభద్రకు దేవత పూనిందని ప్రచారం చేసి తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నించారు. కరువు కాలంలో కుల వ్యవస్థా వికృత రూపం దాల్చినట్లుగా చిత్రీకరించారు. రచయిత.

వికృతరూపం బకింగ్‌హోం కాలువ త్రవ్వకాల్లో శివయ్య శశిరేఖ పని అడిగారు. పేరు, కులమడిగారు, 'ఎన్నెలదిన్ని మాలోడ్నిడ' న అనగానే అగ్రకుల కూలీలందరూ శివయ్య దంపతులపై దాడి చేశారు. వారి చేతుల నుండి తప్పించుకుని దూరంగా పరిగెత్తారు. మార్టిన్ ఆధరణంలో వారు కోలుకున్నారు. " బకింగ్‌హోం కాల్వ కూలీ పనిలో తాము చేసేది కూలీ పని అయినా అగ్రకులాల కూలీలు మా మాదిగలు తమతో కలిసి పని చెయ్యడానికి ఒప్పుకోలేదు. శివయ్యని, శశిరేఖని తరిమినట్టే కూలి కోసం వచ్చిన ప్రతి మాల మాదిగను తరిమారు. కొట్టారు. పరిగెత్తి, ఆకలితో, అలసటతో, భయంతో ప్రాణాలు పోగొట్టుకున్న వాళ్ళున్నారు". (అ,ప:పు.133) పేదలందరూ ఒకే వర్గమని చెప్పే అగ్రకుల మార్క్సిస్టులకు కులతత్వాన్ని అర్థం చేసుకోవడానికి పై సన్నివేశాలు ఉదాహరణ మాత్రమేనని చెప్పవచ్చు.

కుల వివక్షత భరించలేక చిన్నోడు క్రైస్తవ మతంలోకి మార్టిన్‌గా రూపుదాల్చాడు. ఆ సాముల పొలాల్లో పని చేసే మాల, మాదిగ వెట్టి వారికి కూలికి గింజలు ఇచ్చేవారు. ఆ గింజలు కొలిచే బాటలు " కాపులింట గొడ్ల కొట్టాం చూరుల్లో వేరుగా వుండేవి. మామూలుగా వాడుకునే వాటిల్లో సగం వుండేవి". (పు.138) గింజలు లెక్క ప్రకారం ఇవ్వకుండా ఆ సగం బాటలతో కొలిచేవారు. కొలిచి ఇచ్చిన బాటలను ఇండ్లలోకి తీసుకెళ్ళకుండా గొడ్ల కొట్టాం చూరుల్లో పెట్టేవారు. ఇలా కుల వివక్షతలు పాటించేవారని తెలియజేశారు. కాపులు మాదిగ పల్లెలోకి వచ్చినప్పుడు మంచాల మీద మాదిగలు కూర్చొకూడదు. కానీ చిన్నోడు (మార్టిన్)

లేవలేదు. తనకి నచ్చని విషయంపై చిన్నోడు మూగగా తిరుగుబాటు చేస్తున్నాడు. కాపుల దాష్టీకాలు కింది కులాలపై ఏం ఉంటాయో ఈ ఘటనలో రచయిత తెలియజేశారు. చిన్నోడికి జరుగుతున్న సంఘర్షణ, క్రైస్తవ మతంలోకి మారడానికి పురికొల్పింది. అలా ఇక్కడ దళితులు కులవ్యవస్థ నుండి బయట పడడానికి అనేకానేక ప్రయత్నాల్లో మత మార్పిడి కూడా ఒక్కటిగా చెప్పవచ్చు. కానీ అగ్రకులాలు తమ ప్రయోజనాల కోసం మతం మారి శాస్త్రి, రెడ్డి, కమ్మ, క్రిస్టియన్స్ సరికొత్త అవతారమెత్తి క్రైస్తవమతానికి కులాన్ని ఆపాధించారు. మతం మారడంలో కొన్ని సంస్కరణలు వచ్చాయి. గొడ్డు మాంసం తింటున్నారని అప్పటి వరకు మాదిగలను దూరంగా పెట్టిన అగ్రకులాలు చచ్చిన గొడ్డు మాంసం తినమని తీర్మానించుకున్న మాదిగలను ఆ మాంసం తినమని బలవంతం చెయ్యడం చిత్రమైన అంశం చచ్చిన గొడ్లను తినడం మాని వేయమని చెప్పేముందు మార్టిన్ మాదిగలతో మాట్లాడుతున్న సందర్భంలో చచ్చిన గొడ్లను తీసుకోవడం మా హక్కని పెద్ద మాదిగ అన్నాడు. దాంతో “ క్రిష్ణానది పొలాలు కమ్మవాళ్ళ హక్కు, పెన్నానది పొలాలు రెడ్ల హక్కు, అక్కడా యిక్కడా చచ్చిన గొడ్లు మాత్రం మాదిగవాళ్ల హక్కు” (అ,వ:పు. 143) చెప్పడంలో మదిగల స్థితిని వాస్తవికంగా ఎరుకపరిచాడు. అందుకే చచ్చిన గొడ్డను మాదిగలు తినకపోతే వారపిఐ ఆధిపత్యం చేయడం కుదరదు. కనుక సినెం కడ్ని పూడ్చిన గొడ్డును తీసి తిన్నా ఎదవ నాకొడకా అన్నారు. గొప్ప ఆచారాన్ని తాము కాపాడినట్లుగా తలెత్తుకు వెళ్ళిపోయారు. వాస్తవిక సమాజంలో ఇలాంటి ఘటనలు ఎన్నో చచ్చిన, గొడ్లను తినమన్నందుకు అప్పుడు తిన్నారు. ఇప్పుడు బతికి గొడ్ల మాంసం తింటుంటే విశ్వవిద్యాలయాల్లో దాడులు చేస్తున్నాయి. పాలక కులాలు అప్పటికీ ఇప్పటికి ఎంత వైరుధ్యం.

మిషనరీల్లో కుల వివక్షతలు ఉన్నాయని ఈ నవల చెబుతుంది. మార్టిన్ భూమి విషయంలో దొరలతో మొరపెట్టుకున్నాడు. అగ్రకుల క్రైస్తవుల వల్ల ఆ భూమి రావడం ఆలస్యమైంది. ఆ భూమి చేతిదాక వచ్చిన తరువాత అగ్రకుల హత్యాకాండకు బలి అవుతాడు. ఈ దాడి ఆధునికకాలంలో జరిగిన అగ్రకుల దాడుల నేపథ్యం నుండి తీసుకోవడం జరిగిందనవచ్చు. మాల, మాదిగలు కుల వివక్షతల నుండి బయటపడి ఆత్మగౌరవంతో బతకడానికి క్రైస్తవ మతాన్ని తీసుకున్నారన్నాడు. మాదితలకు ఆ మార్పు దక్కకుండా చేయడానికి తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికి, తమ ఆధిపత్యాన్ని నిలుపు కోవడానికి క్రైస్తవ మతంలోకి మారారని దొరలతో వాదించేవాడు. దొరలు నమ్మే వారు కాదు. రూబేను డైరీ నిండా విప్లవకారుడిలా రాతలు ఉండేవి. బ్రిటీష్ కాలంలో కూడ బ్రాహ్మణులు ఆధిక్యత కొనసాగినట్లు అంటరాని వసంతం నిరూపిస్తుంది. ఈ నవల దళితుల జీవనంలోని చారిత్రక క్రమాన్ని వ్యాఖ్యానించింది.

దళితుల అడుగుతీసి అడుగు వేయాలంటే పోరాటం చేయాలి. అలాంటి స్థితినే ఈ నవల చెబుతుంది. ఆవలపాడులో కమ్యూనిస్టుల ప్రభావంతో చెరువు నీటి కోసం పోరాటం చేయవలసి వచ్చింది. ఈ పోరాటం రామిరెడ్డి, చాకలి వాళ్ళు మా పల్లెకి మద్దతుగా నిలబడ్డారు. ఆవలపాడు చెరువు నీళ్ళ సంఘటన ప్రకాశం జిల్లాలో కారుమంచిలో రెడ్డకు మాలలకు మధ్య జరిగిన సంఘర్షణను గుర్తుకు తెస్తుంది. అంబేద్కర్ మహద్ చెరువు పోరాటాల్ని జ్ఞప్తికి తెస్తుంది. పై ఘటనలతో పోలీసులు ఆవలపాడు పై నిఘా పెట్టారు.

అక్కడి ప్రజల్ని హింసించారు. పెద్ద నర్సింహాను గులాం భరంతో చిత్తుచిత్తుగా కొట్టడంతో చౌదుర్ల జొన్న చేలంతా మధ్యలో పీకేశార. దొంగతనం చేసిన బాలకొటడ్ని కొట్టడం, దొంగతనంగా గడ్డి కోస్తున్న ఆడవారిని చౌదరి బంధించడం, పల్లెలో ఆడ, మగలతో పాటు చాలకి, వాళ్ళను కూడా కూడగట్టుకుని వెళ్ళి విడిపించారు. పై ఘటనలన్ని అగ్రకులాలు తమ కు దురంహాంకారంతో చేస్తే మాల మాదిగ, చాకలి వాళ్ళు కమ్యూనిజ నేపత్యంలో ఐక్యంగా

ఎదుర్కొన్నారని చెప్పవచ్చు. ఆవలపాడు చైతన్యం యిమ్మానియేలును విప్లవోద్యమం వైపు నడిపించింది. శ్రీకాకుళ పోరాటంలో అతడు అమరుడయ్యాడు. కానీ స్పష్టమైన సమాధనాలతో కొడుకు జెస్సి కుల నిర్మూలన కోసం సాయుధ పోరాటం ఎంచుకున్నాడు. కుల నిర్మూలన, వర్గ నిర్మూలనలో భాగంగా జరుగుతుందని ఆశించాడు.

**4. 1. 4. విద్యావ్యవస్థ:**

తరతరాలుగా దళితులు విద్యకు దూరమయ్యారు. విద్యను పూర్తిగా బ్రాహ్మణులు సొంతం చేసుకున్నారు. విద్నఉ మతులో భాగం చేశారు. మంత్రాలు నేర్చుకోవడమే వద్యాని ప్రచారం చేశారు. ఆ ప్రచార సాధనాలన్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. అందుకు మనుస్మృతిని పావుగా వాడుకున్నారు. మనుధర్మం ప్రకారం దళితుల హక్కులను హరించింది. ముఖ్యంగా చదువుకునే హక్కు, ఆస్తి హక్కు, ఆయుధం, పట్టే హక్కులు లేకుండా చేసి ఊరికి దూరంగా ఉంచింది. ఊరికి దూరంగా ఉన్నవారికి ఎలాంటి సదుపాయాలు కల్పించకుండా వారిని నీచ పనులకు ఉపయోగించింది. ఊరంతటికి జ ఈతం లేని జీవితకాల పని మనుషులుగా తయారుచేసింది. బానిసవ్యవస్థ కంటే ఘోరంగా కులవ్యవస్థను రూపొందించింది. బానిసలకైనా విముక్తి దొరుకుతుందేమోగాని ఒక కులంలో పుట్టిన వాడికి పుట్టినా, చచ్చినా అదే కులంలో కొనసాగవల్సిందే కాబట్టి  కింది కులాల్లో పుట్టిన వారికి శాశ్వతంగా విద్య నిషేదించబడింది. మొదట తరంలోని వారికి విద్య పూర్తిగా దూరమయింది. ఈ నవలలో కుమ్మరి వెంకటేశ్వరరావు రాయడం వచ్చినట్లుగా మనం గమనించవచ్చు.

అయిన బసవ్విడ, బ్రహ్మంగారి ఆలోచనలు కలగలిపిన తత్వాలు రాసేవాడు. ఎల్లన్నను కిలిసిన సమయంలో ఎల్లన్న పదాలన్నింటికి అక్షరరూపం ఇచ్చాడని రచయిత తెలియజేశారు. కుమ్మరి వెంకటేశ్వరరావు బహుజన తత్వం నిండిన వ్యక్తిగా కనబడతాడు. శైవుల దగ్గర అక్షరాలు రాయడం, చదవడం నేర్చుకుని ఉండి వుండవచ్చు. బ్రిటిష్ వారు మిషనరీలు స్థాపించి, విద్య, వైద్యం అందరికి అందించారు. ముఖ్యంగా దళితులకు పాఠశాలల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించి చదువు నేర్పించారు. అందులో భాగం అనాధ  పిల్లలకు చదువు నేర్పించి సేవ చేశారు. ఈ నవలలో రూబేను అనాధ మిషనరీ బడుల్లో చదువుకున్నాడు. ఎల్లన్న కుటుంబం చదువు నేర్చుకున్న మొట్టమొదటి వ్యక్తి రూబేను, రూబేను తర్వాత యిమ్మానియేలు చదువు నేర్చుకున్నాడు. ఉపాధ్యాయుడిగా ఆవలపాడులో చదువు నేర్పుతున్నాడు. అవలపాడులో జరిగిన కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్రగా ఉన్నాడు. ఆ ఉద్యమం తర్వాత  తెలుగు ప్రాంతాన్ని ఒక ఊపు ఊపిన శ్రీకాకుళ పోరాటంలోకి వెళ్ళే చైతన్యాన్ని అందించింది చదువు.

యిమ్మానియేలు తర్వాత జేస్సి యిమ్మనియేలు వారసుడిగా దళితుల స్థితి గతులను ఆధ్యయనం చేశాడు. వారి విముక్తి కోసం రాజ్యాధికారం సాధించాలనే తపనలో అడివికి చేరువయ్యాడు. ఇంట్లో అందరి అనుమతితో పోరాటంలోకి వెళ్ళాడు. ఇలా తన తాత తండ్రులు వెతికి దక్కించుకోవాల్సింది. సాధించేందుకు బయలుదేరాడు. తాను చదివిన చదువుల విజ్ఞానంతో తన జాతి ప్రజల విముక్తి కోసం వెళ్ళాడు. అలా వెళ్ళిన వడు ఎల్లన్నలా ఒంటరిగా తిరగడం లేదు. పది మందితో కలిసి తిరుగుతున్నాడు.

**4. 1. 5. అంటరాని వసంతం–మాల మాదిగలపై క్రైస్తవ మత ప్రభావం:**

అంటరాని వసంతంలో మాల మాదిగలు క్రైస్తవ మతాన్ని పుచ్చుకొని అభివృద్ధి చెందిన క్రమాన్ని రచయిత వివరించాడు. క్రైస్తవ మతాన్ని పుచుకొనే ముందు ఒక్కడ వీరు అవమానాలు ఎదుర్కొన్నారు. అంతకు ముందు సమానత్వం కోసం బౌద్ధ మతం స్వీకరించారు. బ్రాహ్మణ వాదం బౌద్ధ మతాన్ని అణిచివేసింది. తర్వాత ఇస్లాం మతం వీరిని ఆకర్షించింది. కింది

కులాల్లో లనేకమంది ఇస్లాంలో స్వీకరించారు. కానీ అస్పృశ్యత సమస్యకు పరిష్కారం బ్రాహ్మణ మతం వదిలివేయాలని మనస్ఫూర్తిగా నమ్మారు. కానీ క్రైస్తవ్యం అంటరానితనానికి పరిష్కారం చూపలేదు. వారి సామాజిక, ఆర్థిక స్థితిలో కొంత మార్పు తీసుకువచ్చింది. చదువు చేర్పింది. ఆ విజ్ఞానంతో కుల నిర్మూలన కోసం క్రైస్తవ్యంలో విముక్తి లేదని పోరాటం ద్వారా అది నెరవేరుతుందని సాయుధ పోరాటాన్ని ఎంచుకునేలా చేసిందని ఈ నవల ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు.

భారతదేశంలోకి క్రైస్తవం, ఇస్లాం మతం కంటే ముందే ప్రచారంలోకి వచ్చింది. ఇస్లాం పుట్టిన తర్వాత కాలంతో పాటు క్రైస్తవ మతం తన మతాన్ని అంతకు ముందులా ప్రచారం చేసుకోలేక పోయింది. బ్రిటిష్ వారు భారతదేశంలో పాదుకొన్నాక క్రైస్తవ మతం క్రమం అభివృద్ధికి చెందింది. ఈ మతాన్ని ఎక్కువగా అస్పృశ్యులే తీసుకోవడం జరిగింది. ఈ విషయాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ‘ అస్పృశ్యులు క్రైస్తవీకరణం’ అనే వ్యాసంలో విపులంగా చర్చించారు. క్రైస్తవ మతం మొదటి ప్రచారకుడిగా సెయింట్ థామస్‌ను చెప్పుకోవచ్చు. మద్రాసు దగ్గర సెయింట్ థామస్ పర్వతం ఈ విషయానికి బలం చేకూర్చుతుంది. తర్వాత ఈజిప్టు నావికులు, అలెగ్జాండ్రియా క్రైస్తవులు ప్రచారం చేశారు. అలా భారదేశం వచ్చిన మొదటి వ్యక్తి పాంటియోనస్, ఈయన క్రీ.శ.“180–190 సంవత్సరాల మధ్య కాలంలో భారతదేశంలోని క్రైస్తవ మతస్థుల నుండి అలెగ్జాండ్రియ బిషపు విజ్ఞాపనను అందుకొని తర్వాత ఓ మిషనరీకి మరియు పాంటియానస్‌ను వారు కోరిన ప్రకారం పంపినాడు”. (అంబేద్కర్: 1994.533) డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచనలు–ప్రసంగాలు, సంపుటం–5లో చేప్పారు.

కానీ భారత భూభాగంపై మూడవ శతాబ్ది లో సువార్త ప్రగతి స్వల్పంగా సాగినట్లుగా తెలుస్తుంది. ఇది ఆరో శతాబ్ధి వరకు శాంతి పూర్వకంగా సాగించి ఇస్లాం ఉద్యమకారుల విజృంభణలో క్రైస్తవ మిషనరీల ప్రచారం కొన్ని శతాబ్దాల వరకు నిలిచిపోయింది. ‘1497లో వాస్కోడిగామా ఇండియాకు సముద్ర మార్గం కనిపెట్టడంలో క్రైస్తవ ప్రచారానికి నూతన శకం ప్రారంభమైంది. తర్వాత వివిధ మిషనరీలు పోటా పోటీగా విషనరీలు స్థాపించారు. 18వ వతాబపు రెండో అర్ధభాగంలో తిరుచునాపల్లి మరియు తంజావూరులో అంకిత భావం గల స్కోట్జ్ సాగిందని చెప్పవచ్చు. 1973లో కారి నాయకత్వంలో కలకత్తాకి బాప్టిస్తు మిషన్ వచ్చింది. 1813లో ఆంగ్లికన్ చర్చి ప్రవేశంలో మిషనరీల పనుల్లో వేగంతో పాటు నిరంతరం కొనసాగింది. ఈ విధంగా భారత దేశంలో క్రైస్తవ మతం ప్రచారం మొదలై వికసించిందని’ (పైదే) చెప్పుకోవచ్చు.

ఈ నవలలో శివయ్య, శశిరేఖలను కరువును తట్టుకోలేక ఎన్నెలదిన్ని గ్రామ వదిల పనుల కోసం బయలుదేరి బకింగ్ హోం కాలువ దగ్గరకు వస్తారు. అక్కడ అగ్రకులాలు వీరిపై దాడి చేస్తాయి. ఆ దాడిలో గాయపడిన వీరిని మార్టిన్ చేరదీస్తాడు. క్రైస్తవ్యాన్ని బోధిస్తాడు. అక్కడి నుండి క్రైస్తవులు మారపోతారు. అప్పటికే గ్రామల్లో పెత్తనం చేతులు మారి బ్రాహ్మణులు క్రమంగా తమ ఆస్తులు అమ్ముకొని పట్టణాలకు వలస వెళ్ళారు. తర్వాత రెడ్లు, కమ్మలు వారి స్థానాన్ని భర్తీ చేశారు. ఇలా పట్నలకు చేరిన బ్రాహ్మణులు తమ ప్రయోజనాలు కాపాడుకొవడానికి క్రైస్తవ్యం పుచ్చుకున్నారు. ఈ విషయాన్ని రచయిత. కళ్యాణరావు సమర్ధవంతంగా చిత్రీకరించారు. పిల్ల కరణం గ్రామ వదిలి పట్నంకు వలస వెళ్ళడం ఆయన అల్లుడు, కూతురు క్రైస్తవ మతాలకు మారడం, వారి ఆధిపత్యమే అక్కడా నడిచినట్లు తెలుస్తుంది.

అంతకు ముందు అఅగ్రకుల దాష్టీకాలు తుట్టుకోలేక చిన్నోడు మార్టిన్‌గా మారిపోయాడు. మారక ముందే చిన్నోడులో ఒక విధమైన మొండితనం ఉండేది. ఆ మొండి తనమే

తిరుగుబాటుగా రూపుదిద్దుకుంది. ఆ తిరుగు బాలే మతం మారడం. మతం మారినప్పటికీ తమ స్థితి గతుల్లో ఎలాంటి మార్పు రాలేదని గ్రహించడానికి అతనికి ఎంతో కాలం పట్టలేదు. భూమి కోసం ప్రయత్నాలు చేశాడు. కానీ క్రైస్తవులుగా మారిన అగ్రకులాలు ఆ భూమి దక్కకుండా చేశారు. చివరికి దొరల మద్దతుతో ఆ భూమి దక్కించుకున్న సమయంలో అగ్రకులాల మారణకాండకు తనతో పాటు వలసపాడు మొత్తం బలౌతుంది. మార్టిన్ క్రైస్తవ మతం మారిన తర్వాత మాదిగలతో చచ్చినగొడ్డు మాంసం తినాలని బలవంతం చేశారు. హింసించారని ఈ నవల చెబుతుంది. ఇవన్నీ క్రైస్తవమతం వైపే మాదిగలను తీసుకెళ్ళాయి.

కరువు అంటరాని వాళ్ళను క్రైస్తవ్యానికి దగ్గర చేసింది. వారిని చేరదీసింది. వారికోసం ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించింది. వారికి విద్య, వైద్య సౌకర్యాలు కల్పించింది. వారికి తమ చర్చిల్లోకి సాధారణంగా ఆహ్వానించింది. అంటరాని వరి జీవితాల్లో ఒక ఆశను కల్పించింది. ఆ ఆశే అంటరాని వారిని క్రైస్తవం వైపు నడిపించింది. మార్టిన్ మరణం తర్వాత సీయోను కొడుకు రూబేను మిషనరీ అనాధాశ్రమంలో అప్పటించి ఎటో వెళ్ళిపోతాడు. రుబేను ఆ ఆశ్రమంలోనే విద్యాబుద్ధులు నేర్చుకుని పెరిగి పెద్దవాడవుతాడు. క్రైస్తవ ప్రచారకుడిగా మారతాడు. కానీ అతడిలో తీవ్ర నిరాశ వ్యక్తం అవుతుంది. దాంతో అన్వేషిస్తూ గతాన్ని తెల్సుకుంటాడు. ఆప్పటికే క్రైస్తవ్యంలో అగ్రకులాల పెత్తానం పెరిగింది. అగ్రకులాల వారు క్రైస్తవంలోకి రావడంతోపాటు వారి కులవ్యవస్థను తీసుకు వచ్చారు. దీన్ని మార్టిన్ మాటల్లో ‘ అంటరాని తనానికి దూరం కావటానికి తాను క్రైస్తవుడయ్యాడు. కాని యిక్కడ క్రీస్తు అంటరాని వాడయ్యాడు”. (అం.వ: 143) అనంతో మార్టిన్ అగ్రకులతత్వాన్ని అవగాహాణను తెలియజేస్తుంది. క్రైస్తవ మతం కులవ్యవస్థకు వ్యతిరేకంగా పని చేయలేదు. వారు మతకోణంలోనే ఆలోచించారు. అందుకే భారతీయ క్రైస్తవంలోకి కులాలు నిరాటంకంగా ప్రవేశించాయి. అగ్ర కులాలు కోర్టులో కేసు వేశాయి. ఆ కేసును వాదిస్తున్న లాయర్ యిమ్మానియేలు శాస్త్రీని మార్టిన్ కలిసి ఆ భూమి వివరాలు చెప్పిన తరువాత “ మీరు నిలబడాల్సింది క్రైస్తవుల తరపేఉన”(పు.153)కోర్టులో కేసు వేసిన అగ్రకులాల వాళ్ళు క్రైస్తవులే కనుక నేను వారి తరపున వాదిస్తున్నానన్నాడు. కానీ వీళ్ళు పేద క్రైస్తవులు, మల మాదిగలు అన్నాడు మార్టిన్. అందుకు యిమ్మానియేలు “ క్రైస్తవుడన్న తర్వాత క్రైస్తవుడే. ఇక్కడ రెడ్డె, కమ్మా,బ్రాహ్మణ, మాల, మాదిగ, ఎవరైన కావచ్చు. అంతా క్రైస్తవులే. కాదని మీరు అనరు”. (పు.153) అలా అనడంతో మార్టిన్‌కు విషయం అర్ధమైంది. అగ్రకులాలు తమ స్వప్రయోజనాల కోసమే మతం మారారని ఈ సంఘటన మనకు ఋజువు చేస్తుంది. అగ్రకులాలు మతం మారినా“ తోక పోలా, శాస్త్రీ అట్టాగే ఉంది. జాన్ పావ్‌రెడ్డి, యోహాషువా చౌదరి... మతం మారినా కులం పోలా....” (పు.155) అనే చైతన్యం మార్టిన్ , సీయోన్ (శివయ్య)లో కలిగించాడు.

రూబేను క్రైస్తవుల్ని ద్వేషించాడు. **‘2** వాడు క్రీస్తు కోసం రాలేదు. పెత్తనం చెయ్యటానికొచ్చాడ” ని (పు.178) అనేవాడు. మిషన్ స్కూల్లో రెడ్డిని ప్రధానోపాధ్యాయుడిగా నియమించినప్పుడు “ ఏం మాల క్రిష్టియన్.... మాదిగ క్రిష్టియన్ కనిపించలేదా వీళ్ళకి, రెడ్డి క్రిష్టియన్ కావాల్సి వచ్చాడా”(పు.178) అని మిషన్ పెద్దలతో వాదించాడు. అది అతని డైరీ చూసినప్పుడు పాస్టర్ డైరీలా లేదు. ఉద్యమ కారుడి డైరీలా ఉంది. తిరుగు బాటు దారుడి భాష ఆ డైరీలో ఉంది. ఇదే విధంగా కొడుకు యిమ్మానియేలు డైరీలో కూడా మనం గమనించవచ్చు. యిమ్మనియేలు “ పాట పాడినా, వచనం చదివినా, ప్రార్ధన చేసినా అంకితమయ్యే” (పు.20) వాడు అలాంటి వాడు. నక్సలైట్‌గా మారాడు. తరతరాల తమ సమస్యలు తీరాలంటే క్రైస్తవ్యంతో వీలుకాదని సాయుధ పోరాట బాట పట్టాడు. అమరుడయ్యాడు. అందుకే రూబేను కొడుకు అమరుడ్యాడని గర్విస్తున్నానని “ క్రీస్తునా విశ్వాసం

పోరాటం నా అవసరం... ఓ మాలాడికి, మాదిగాడికి అది అలంకారం కాదు. అది ఆదర్శం కాదు. అవసరం, అంటరానివాడిగా పుట్టాను. సెంటు భూమి లేని వాడిగా పుట్టాను. విసిర వేయబడ్డాను. అన్నిటికీ నా బిడ్డ జవాబులు వెతికి ముందుంచాడు".(పు.211) అని స్పష్టం చేశాడు. ప్రశ్నించిన సి.ఐ చార్లెస్‌ను మొడలో సిలు తీసేయ్ అని కరుకుగా చెప్పాడు.

ఇదంతా ఒక విషయాన్ని సంకేతిస్తుంది. క్రైస్తవంలో కుల సమస్యకు పరిష్కారం దొరకలేదు. కనుకు యిమ్మనియేలు, జెస్సీలను సాయుధ మార్గం పట్టించాడు. కుటుంబంలో ఒకరు అమరుడైనప్పటికీ జెస్సీని కూడా అదే మార్గంలో ప్రయాణింప చేయడం, రచయితకు విప్లవం మీద ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తుంది. ఈ నవల ర ఆసే సమయానికి కుల సమస్యకు మార్క్సిజం పరిష్కారం చూపలేదని, అంబేద్కరిజం సరైన మందని అనేక మంది విప్లవ పార్టీల నుండి బయటకు వచ్చి ఉవ్వెత్తున ఉద్యమిస్తున్న సమయం నవలలో కారంచేడు, చూండూరు, మొ॥ మరణకాండలను రచయిత ప్రస్తావించినప్పటికీ ఆ ఉద్యమాన్ని నడిపిస్తున్న నాయకులు నమ్ముకున్న అంబేద్కర్ వాదాన్ని ఎక్కడా ప్రస్తవించకుండా దాటవేత వైఖరిని ప్రదర్శించాడని చెప్పవచ్చు.

క్రైస్తవం నేపథ్యంలో మాలల్లో కూడ తమ స్వప్రయోజనాల కోసం మతాన్ని వాడుకుంటున్న విషయాన్ని వందనం, రోజీ పాత్రల ద్వారా ఎరుక పరుస్తాడు. అగ్రకులాలను ఆదర్శంగా తీసుకొని దళిత క్రైస్తవులు దోపిడికి పాల్పడుతూ ధనిక వర్గంగా ఎదుగుతున్నారని ఆ పాత్రలను ప్రతీకాత్మకంగా రూపొందించాడు. ఈ విధంగా క్రైస్తవమత ప్రభావం వ్ల దళితులు ఎదుర్కొన్న లాభ నష్టాలను ఈ నవల తెలియజేసింది. దళితులకు క్రైస్తవ్యం వల్ల కొంత ఊరట లభించింది. ఆ మతం మద్దతులో చదువు నేర్చుకుని కుల వివక్షతలను బయట పడడానికి ప్రయత్నించి విఫలమైన విధం తెలియజేసింది. హిందూ మతం ఇతర మతాలను తనకు అనుకూలంగా మార్చుకునే విషయం నిశ్శబ్దంగా పనిచేస్తుందని చెప్పాడు. ఏ మతంకామతం ఇక్కడ మనలేదు. హిందూ మతం ప్రధానాంశం యినా కుల వ్యవస్థ ఆయా మాతాల్లో చొప్పించి ఆయా మతాలను హిందుమతం క్రమంగా బలహీన పరిచితనలో కలిపివేసుకుంటుంది. లేదా ఆమతాన్ని తన నమూనా మతంగా తయారు చేస్తుంది. ఇండియాలో ఉనికిలో ఉన్న అన్ని మతాల్లో కులం అనే అవలక్షణం కనబడుతుంది. ఎక్కడ కులం ఉంటుందో అక్కడ సమానత్వం, సోదరభావం వర్ధిల్లదు. కాబట్టి కుల నిర్మూలనకు మత పరిధిలో జరగదని సాయుధ పోరాటమే అంతిమ పరిష్కారమని ఈ నవల చెబుతుంది. క్రైస్తవంలో చేరిన తర్వాత కూడా అంటరానితనానికి ఎందుకు తమ జీవితాలు గురవుతున్నాయో తెలుసుకున్నారు. ఎంతో అధ్యయనం తర్వాత జెస్సి ఎంచుకున్న గమ్యం నల్లమల్ల కొండలు, ఒక్కడ పోరాటం కొనసాగి సాయుధ పోరాటమైంది. యిమ్మనియేలు, జెస్సీ పాత్రలు క్రైస్తవం గురించి ఎలాంటి వాఖ్యలు చేయవు అలాగే దళితుల పోరాటాల గురించి మాట్లాడతాయి. కానీ దళిత ఉద్యమాల గురించి దళిత నాయకుల గురించి దాట వేత దోరణిని అనుకరిస్తాడు రచయిత. రాబోయే శతాబ్దాన్ని మీ విజయానికి అంకితం చేస్తున్నాను". (పు.230) అని జెస్సికి ఉత్తరం రాయడం పూర్తిగా రచయితకు విప్లవోద్యమం పట్ల వున్న నమ్మకాన్ని తెలియజేస్తుంది.

**<u>4.1.6. అంటరాని వసంతం- గాంధీ-అంబేద్కర్:</u>**

ఈ నవలలో గాంధీతో పాటు అంబేద్కర్‌ను ఒక్కచోట రచయిత ప్రస్తావించాడు. రచయిత గాంధీ సిద్ధాంతాన్ని స్పష్టంగా తిరస్కరించాడు. అంబేద్కర్ మీద తన అభిప్రాయం చెప్పకుండా దాట వేత దోరణిని అవలంభించాడు లేదా కావాలనే నిర్లక్ష్యం చేసాడున. దళిత సమస్యలను చరిత్రలో జరిగిన అమమానాలు, వాటి పట్ల వారు వ్యక్తం చేసిన అనుభవాలు, దు:ఖాలు, కష్టాలు, నష్టాలు స్పష్టంగా రచయిత ఎరుకపరిచాడు. ఏడు తరాల జీవితాలు

భూమికి ఎలా దూరమయ్యాయి. బ్రాహ్మణుల తర్వాత శూద్రులైన రెడ్లు, కమ్మలు, భూ స్వాములుగా మారిన క్రమం నవలంత పరుచుకుని ఉంది. సమాజంలో వచ్చే మార్పులను రెడ్ల కంటే బ్రాహ్మణులు ముందే పసిగట్టారు. అందుకే మార్పులను పసిగట్టి రెడ్లకు, దళితులకు మధ్య భూ సమస్యలు సృష్టించి పట్టణాలకు వలస వెళ్ళారు.

ఎన్నెలదిన్ని తర్వాత దళితుల పోరాటానికి ఆవల పాడు వేదికయ్యింది. అక్కడ మల మాదిగలతో పాటు చాకలి వాళ్ళు కమ్యూనిస్లు రామిరెడ్డి అగ్రకులాలతో పోరాటంచేశారు. ఆవల పాడులో చెరువు నీటి కోసం పోరాటం, గాంధీజీ స్ఫూర్తితో హరిజనోద్యమం మొదలౌతుంది. కమ్యూనిస్టులైన రామానుజం హరిజన పదాన్ని తిరస్కరిస్తాడు. " మాలా మాదిగ పదాల కన్నా ఎందులో గొప్ప ఆ పదం" ని (పు.169) గాంధీని తిరస్కరిస్తాడు. అంతేగాక " ఈ బ్రాహ్మణీయ సమాజం మాలా మాదిగల్ని అంటరాని వాళ్ళని చేసింది. హిరజన పదంతో గాంధీగారు అనాధల్ని కూడా చేస్తున్నాడని" (పైదే) తీవ్రంగా స్పందిస్తాడు.

సంస్కరణోత్యమాలు దళితుల పట్ల కొంత ఆదరణ కలిగి వారి బాగుకోసం కొంత ప్రయత్నం చేశారు. ఏ అలవాట్లు చూఇ సమాజం వారిని దూరంగా ఉంచిందో వాటిని మాన్పించడానికి ప్రయత్నించారు. నవలలో ఈ ఉద్యమాన్ని రచయిత చిత్రీకరించలేదు. గాంధీ సంస్కరణోద్యమంగా మొదలు పెట్టిన హిరజనోద్యమాన్ని ప్రస్తవించి అది మొక్కుబడి ఎలా పని చేసిందో తెలియజేశాడు. ఈ ఉద్యమానికి భూస్వామ్య వ్యక్తులు ఎలా నాయకత్వం వహించారో, వారు చర్మలను విమర్శనాత్మకంగా నిరూపించాడు. ' శుద్ధి యజ్ఞమంటున్నారు. శుద్ధి ఎవరికి అగ్రకులాలకా, దళితునికా,'అని ప్రశ్నిస్తాడు.

క్రైస్తవులు మారి చచిచన గొడ్లను తినమంటే వాళ్ళ చేత బలవంగా తినిపించారు. ఇప్పుడేమో శుద్ధి ఉద్యమంలో భాగంగా మాంసం తినొద్దని అలా తినేవారు హిందువులు కారని చెబుతున్న విధానాన్ని హేతుబద్ధంగా ఎత్తి చూపాడు. "ఇది నిజంగా హిరజనోద్ధరణ కదు. హిందూమతాన్ని రక్షించుకోవడం బలమైన వర్గాన్ని దానికి దూరం కాకుండా కాపాడుకోవటం".(పు.172) మని స్పష్టంగా గుర్తించాడు. అంతేగాక బిర్లా కరుడు గట్టి హిందూ అని అతను అస్పృశ్యత వ్యతిరేక సమితికి అధ్యక్షుడు. ఇది మరి విచిత్రమని ప్రకటించాడు. అందుకే స్వాతంత్రోద్యమంలో గాంధీ మోసాన్ని గమనించే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వీళ్ళ మోసం చాలా స్పష్టంగా చెబుతున్నారు. ఆయన అన్నట్లు మాలా మాదిగలు మేకలుగా ఉన్నంత కాలం బలిపీఠం మీద నరకబడుతునే వుంటారు.పులులుగా బతకాల్సి ఉ ంది. గాంధీ వున్నాఉ. జాగ్రత్త" (పైదే) చెప్పినట్లుగా చెప్పబడింది. స్వాతంత్రోద్యమంలో భాగంగా పూణా ఒప్పందం తరువాత చేపట్టిన హరిజనోద్ధరణ కార్యక్రమాన్ని అంబేద్కర్ విమర్శించాడు.

రామానుజం, రూబేను చర్చిలో " మన కోసం ఈ శుద్ధి యజ్ఞాలు వద్దు. మన ఇళ్ళల్లో మంచి నీళ్ళు తాగి వాళ్ళేదో మనల్ని వుద్ధరిస్తున్నారనే పోజు వద్దు. ఎవడి కులం వాడికి గొప్పవాడికుంది. నేను వాడికి అంటరాని వాణ్ణయితే వాడు నాకు అంటరాని వాడే" (పు.173) అని ఆత్మగౌరవాన్ని ప్రకటించారు. అంతేగాక " మన కోసం పాడుబడ్డ దేవుడి గుళ్ళనీ ఉ ద్ధరించొద్దు. వీళ్ళ సంస్కరణలో నిజాయితీ ఉంటే వోచిన్న పని చెయ్యమనండి మాలడి దిబ్బను ఆనుకొని బోలెడు భూమి ఉంది. అది మాలా మాదిగలు అక్రమిస్తారు. చూస్తూ వూరుకొమనండి. చాలు ఆ మాట గాంధీ గారు మాట్లాడారు. ఈ హరిజన సేవా కార్యకర్తలూ మాట్లాడరు" (పైదే) గాంధీ మీద, హరిజనసంఘం కార్యకర్తలపై కపటత్వాన్ని ఎరుకపరిచాడు. గాంధీ వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని అంబేద్కర్ అంచనా వేస్తూ " హిందూయిజం, కుల వ్యవస్థ అలాగే ఉండాలని గాంధీ భావిస్తాడు. గాంధీకి అంటరానివారంటే ఎంతో దయ... వారి ఉ

ద్యమాన్ని నిర్మూలించాలని, హిందువుల నుండి వరు విడిపోయి పొందే స్వేచ్ఛను అడ్డుకోవాలని చూస్తున్నాడు. ఆయన అనుసరించిన అనేక పద్ధతులలో ఆయనను మేటి బూటకస్తుడిగా తేల్చిన హరిజన సేవాసంఘం ఒకటి" అని చెప్పారు. గాంధీ సమాజాన్ని అధాతదంగా ఉ ంచి దానికి కొన్ని మరమత్తులు చేయాలనుకున్నాడు. కానీ అంబేద్కర్ సమాజాన్ని పూర్తిగా పునర్నిర్మించాలని భావించాడు. అందుకు రాజ్యాధికారం కావాలని తెలియజేసాడు. కానీ ఇక్కడ రచయిత భూమి మీద హక్కుల కోసం ఆరాటపడ్డాడు.

దళితుల దేవాలయ ప్రవేశం కోసం ఊరిబయట శివాలయం బాగు చేయించారు. లింగారెడ్డికి ఆ సంఘానికి నాయకుడు రామానుజం కూడా ఊరే గింపులో వున్నాడు. ఊరి ప్రక్కనుండి శివాలయానికి వెళ్తుంది. ఊర్లో నుండి వెళితే ఊరి అంటు కాబట్టి బయట నుండే వెళుతున్నారు. రామానుజం ఊరేగింపును ఊర్లోకి తీసుకువెళ్ళి విష్ణాలయంలోకి తీసుకువెళ్ళమన్నాడు. అందరూ బిత్తరపోయి చూశారు. మా కార్యక్రమం శివాలయం అన్నాడు లింగారెడ్డి. కానీ మేము విష్ణాలయంలోకి వెళ్ళాలనుకుంటున్నామని ఊరేగింపును ఊళ్లోకి తీసుకు వెళ్ళారు. ఆలయం ఆవరణలోకి అడుగు పెట్టిన హరిజనులను కొత్త అనుభూతికి లోనయ్యారు. లింగారెడ్డి హరిజన పద గొప్పతనాన్ని వివరిస్తూ రామానుజాన్ని రెచ్చగొట్టాడు. ఆ పదం ర ఆమానుజానికి ఎందుకు ఇష్టంలేదో మాట్లాడమని సవాలు విసిరాడు. ఆ గందరగోళంలోనే హారతి, ప్రసాదం కాంపౌండ్‌లోకి పూజారి తీసుకువచ్చాడు. కాంపౌండ్‌లోనే దేవాలయ ప్రవేశం చేయించి అయిపోయిందనిపించారు. రాత్రికి వేద మంత్రాలతో గుడి శు ద్ధి చేయించాడు. దళితును గుళ్లోకి రాకుండా ముగించిన కార్యక్రమం విజయవంతమైందని ప్రచారం చేసారు. హరజనోద్యమాంలో భాగంగా నగ్నంగా బట్టబయలు చేశారనవచ్చు.

పూనా ఒప్పందం తార్వత దేశంలో చాలా దేవాలయాలు దళితులకు ప్రవేశం కల్పించినట్లు వర్తలు వచ్చాయి. కానీ అవన్నీ అభూతకల్పనలని అంబేద్కర్ పరిశోదనలో బయట పడ్డాయి. గాంధీ 1932 సెప్టెంబర్ 30న అఖిల భారత అస్పృశ్యతా వ్యతిరేక సంస్థ ఏర్పాటు చేసి తర్వాత హరిజన సేవక సంఘంగా మార్చాడు. ఈ సంస్థ ఆశయాలు ఎలా ఉ ండాలో అంబేద్కర్ సూచించాడు. కానీ అవి సూచలు గానే మిగిలినవి. ఈ నవలలో అంబేద్కర్‌ను రచయిత ఒక్క చోట మాత్రమే పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీకి ఎదురు నిలిచిన నాయకులు ఎవరు లేరు. అంబేద్కర్ గాంధీ రాజకీయాలకు ధీటుగా ఎదుర్కొన్నారు. తన సిద్ధాంతంతో అందుకే రచయిత అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని తెలియజేయవలసి వచ్చింది. ' గాంధీలున్నారు జాగ్రత్త'ని చెప్పించవలసి వచ్చింది. " మాల మాదిగల్ని హిందూ చట్రంలో బిగించే కార్యక్రమంగానే ఈ హరిజనోద్దరణ జరుగుతోంద"ని (పు.176) రామానుజం అన్నాడు. పెరియార్ దళితుల దేవాయ ప్రవేశం కోసం వైకం సత్యగ్రహంలో పాల్గొన్నాడు. కాంగ్రెస్ నాయకుల కపటత్వాన్ని ఎండగట్టాడు. అందుకే గాంధీ హరిజనోద్ధరణ, దేవాలయ ప్రవేశాలు అన్ని రాజకీయ డ్రామాలుగా ఈ నవలలో రచయిత నిరూపించారు. అందుకే రామానుజం చేత 'గాంధీ గారి మీద జనాలకున్న భ్రమలు నాకు లేవని'రామానుజం చేత చెప్పించాడు. పెరియార్‌ని, సోషలిజాన్ని సమర్ధించినందుకు మూడు సార్లు రచయిత పేర్కొని ఉండవచ్చు. 'స్వాతంత్ర్యదినోత్సవాన్ని పెరియార్ సంతాపదినంగా పాటించమని' పిలుపునిచ్చాడు. (పు.79) అని రామానుజం పాత్ర ద్వారానే చెప్పించాడు. ఇలా గాంధీ, అంబేద్కర్, పెరియార్, రామస్వామిల గురించి రచయిత తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని చెప్పవచ్చు.

**4.1.7. మాలామాదిగల జీవన చిత్రణ:**

కళ్యాణరావు నవలలో మాలా మాదిగలు కలిసి పోరాటం చేసినట్లు చిత్రీకరించినట్లు చిత్రీకరించాడు. సమాజ వాస్తవికత అందుకు భిన్నంగా ఉంది. వీరి ఐక్యత కాల్పనికత

కాకపోవచ్చు. కానీ వీరి మధ్య నవలలో పేర్కొన్నంతగా సహజీవనం లేదు. దీనికి కారణం పెద్ద కరణం లాంటి వాళ్ళు విభజించి పాలించడమే ప్రధాన కారణమనవచ్చు. నారయ్య, మాతయ్య మంచి స్నేహితులు, మాలా మాదిగ జనాంగాన్ని మోషే వలె వరద నుండి రక్షించారు. వారి ఆకలి తీర్చారు. నారయ్యలో ఆలోచన ఉంది. మాతయ్యలో ఆవేశం ఉంది. నారయ్య తాను చేయబోయేది చెబుతాడు. తన తోటి వారిని ఉత్సాహపరిచి, ఉద్రేకాన్ని కలిగిస్తాడు. మనిషిని కదిలించగల శక్తి నారయ్యది. మాతయ్య ఏదైన పనిని ఆవేశంగా పూర్తి చేస్తాడు. ఏమి మాట్లాడడు. మాట్లాడితే పని అయిన తర్వాతే. ఈ విషయం మనకు వరద సమయంలో వారి శరీరం మాటల ప్రవర్తన బట్టి అర్థం చేసుకోవచ్చు. వరద సమయంలో బయటకెళ్ళిన నారిగాడ్ని మాతయ్య శంగా మోసుకువస్తాడు. పుల్లల కోసం చేరో దారిలో వెళ్ళి తిరిగివస్తున్నప్పుడు వంక దారిలో నారిగాడు శవంగా పడి ఉన్నాడని చెప్పాడు. నారిగాడు గొడ్డలి తీసుకొని వాడు సావాలా.... అంటూ తిరుతూ మాయమయ్యాడు. ఈ నవలలో మాదిగ పాత్రలను ఆలోచన లేని వాడిగా, ఆవేశపరుడిగా చిత్రీకరించాడని మాదిగ సాహిత్యకారుల అభిప్రాయం.
అలాగే మార్టిన్ పాత్ర మాతయ్య పాత్రకు కొనసాగింపుగా ఉంటుంది. మార్టిన్‌లో కూడా ఆలోచనలతో పాటు ఆవేశం ఉంటుంది. ఆ ఆవేశంలోనే భూమి కోసం పోరాటం చేససి అగ్రకుల హత్యకాండకు బలి అవుతాడు. ప్రకాశం జిల్లాలో క్రైస్తవ మతాన్ని ఉద్యమస్థాయిలో మాదిగలు పుచ్చుకున్నారని క్లేదొర సతిమణి ఎమ్మా రోషంబు క్లౌ మాదిగల సాంఘీక జీవనం గురించి పరిశోదన చేసి రాసారు. ఆ పుస్తకం వి.వి.న.మూర్తి "చెప్పులు కుడుతూ' తెలుగులోకి అనువాదం చేశారు.అందులో ఆమె సమాజంఓల మాలా మాదిగలు " సమానంగా వెలివేయబడినవాళ్లే అయినా మాల మాదిగలు ఒకరికి ఒకరు విడిగా ఉంటారు. వాళ్ళ నూతులు వేరు. కలిసి తినరు. వాళ్ళ మధ్య పెళ్ళిళ్ళు జరగవు". **(మూర్తి.వి.వి.న.2011: 107)** అని ఇరవురి కుటుంబ జీవనం గురించి పరిశోధించి వ్యాఖ్యానించారు. అందుకు భిన్నంగా రచయిత మాలా మాదిగల మధ్య సంబంధ బాంధవ్యాలను చిత్రీకరించారు.

మాలల ఉరుముల నృత్యాన్ని చాలా గొప్పగా చిత్రీకరించడం జరిగింది. కనుమరుగు అయినా కళను గురించి రాయడం ఎంతైనా అవసరమే. అయితే సమస్త జనాన్ని ఉత్సాహ పరిచి చైతన్యాన్ని నింపుతున్నడప్పును గురించి కళ్యాణరావు ప్రస్తవించలేదు. ఇప్పుడు డప్పును క్రమంగా ఆధిపత్యా ఉద్యమాలను తమ సొంతం చేసుకుంటున్నాయి. ఉరుముల నృత్యం గురించి తెలుగు ప్రాంతంలో ఎవరికి పెద్ద పరిచయం లేదు. ఇది అంతరించి పోతున్న కళ అనంతపురం జిల్లాలోనే మిణుకు మిణుకు మంటు ఉంది. డప్పు ప్రపంచమై మారుమ్రోగుతుంది. రచయితకు మాదిగ డప్పు అంటరానిదయ్యింది. మాదిగల సాంస్కృతిక జీవనాన్ని రచయిత..... చిత్రీకరించలేదని విమర్శ ఉంది. నారయ్య, మాతయ్య స్నేహాన్ని వారి వారి కుటుంబాలు అందిపుచ్చుకున్నాయి. కాలంతో పాటు ఎన్నెలదిన్ని మాలా మాదిగ పన్నీటిని, కన్నీటిని సమంగా పంచుకున్నారు. మాలోడిదిబ్బకు నీళ్ళు మళ్ళించడం, మంచి నీళ్ళ బావిలో నుండి నీళ్ళు అర్ధరాత్రి సమయం దొంగతనంగా తెచ్చుకోవడం కలిసే చేసేవారు. నీళ్ళ కోసం దొంగల్ని చేసింది. ఈ కుల సమాజమని రచయిత వాస్తవిక పరిస్థితిని ఎత్తి చూపాడు.

**4.1.7. అంటరాని వసంతం- కరువు చిత్రణ:**

కరువు చిత్రణ నవలను మలుపు తిప్పింది. మాలా మాదిగల్ని క్రైస్తవ మతానికి దగ్గర చేసింది. కరవు రోజుల్లో మిషనరీ సేవలకు గాను ఉద్యమస్థాయిలో క్రైస్తవమతంలో మాదిగలు చేరినట్లు ఎమ్మా రొషాంబు క్లౌ తెలియజేశారు. ఆ కరువును (1876-78) ఒక గొప్ప సంక్షోభం అనే పేరుతో తెలియజేశారు. "1876-78ల మధ్య కరువులో జీవించిన అనేక మంది నాకు తెలుసు. ఆ రోజులోని పిల్లల్లో చాలా మందికి సరైన ఎదుగుదల లేకపోయింది.

కొందరి ముఖాల మీదకి అకాల వృద్ధాప్యం వచ్చేసింద.... ఆ కరువులో జీవించిన అనేక మంది నాకు తెలుసు. ఆరోజులోని పిల్లల్లో చాలా మందికి సరైన ఎదుగుదల లేకపోయింది. కొందరి ముఖాల మదకి అకాల మృద్ధాప్యం వచ్చేసింది. ఆ కరువలో మనుషులు మనుషలను తినేవారని అందరూ అనేవారు." (మూర్తి.వి.వి.న: 2011. పు.129) కానీ క్లౌ దొర దృశ్యాలు తను చూడలేదని చెప్పినట్లు ఎమ్మా రొషాంబు క్లౌ తెలియజేశారు. కానీ " ఒకామె నాతో చెప్పింది. ఆమె తల్లి పొరుగింటి మనిషి, ఒక ఆడమనిషి తన బిడ్డను కుండలో పెట్టి ఉ డకబెట్టడం చూశానని చెప్పిందట"(పు.129) ఈ వాక్యాలు ఆనాటి కరువు కరాళ వికృత రూపాన్ని స్పష్టంగా పేర్కొంటున్నారు.

ఈ నవలలో ధాతు కరువు " ఎన్నెలదిన్నిని తాకీ తాకనట్లు తాకుతుంది.... అబ్బిరెడ్డికే యిబ్బందికరంగా ఉంది. కింది రెడ్డ పరిస్థితి దిగజారుతుంది.... మాలా మాదిగల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఆకలి చావులు ఎన్నెలదిన్నినీ చుట్టు ముట్టాయి. ధాతు కరువు దక్షణాది భారతంలో లక్షలాది మందిని బలి తీసుకుంది. వర్షాల్లేవు. పంటల్లేవు. నెర్రెలు బారిన నేల మీద పనీ పాటా లేదు. ఆకులు తిన్నారు. ఆములు తిన్నారు. బొంతకాయలు ప్రాణాలు నిలబెట్టలేదు.... నాగజెముడు కడుపులో మంటలు రేపింది. బురదనీళ్ళు ప్రాణం పోస్తాయనే తాగారు. అయినా ఆకలి చావులు తప్పలేదు. కాళ్ళుకొట్టుకొంటూ చచ్చారు. కడుపు బిగదీసుకొని చచ్చారు. విరోచనాలు పట్టుకొని చచ్చారు. ఎండిన డొక్కల్ని మాడ్చి మాడ్చి మరీ చచ్చారు. దానికి తోడు దూము తోడైంది". (అం.వ:పు.117) కరువు చావులను కళ్లకు కట్టినట్లు రచయిత వర్ణించాడు. దళితులు ఆకలికి మాడినట్లు " ఆకలితో బక్కచిక్కిన ఆ పశువుల దుమ్ములని అంటుకొని ఉన్న మాంసంతో మాదిగలకి అప్పుడప్పుడు తిండి దొరికేది. కలబంద మొక్కల ఎర్రటి వళ్ళు తిండి అయ్యాయి. చాలా మంది ఆకులూ, అలములూ తినసాగారు"(మూర్తి.వి.వి.న:2011.129) . అని తన పరిశోధనలో రొషాంబు క్లౌ తెలియజేసిన చారిత్రకాంశాలు ఈ నవలలో వాస్తవికంగా చోటు చేసుకున్నాయి.

ఎన్నెలదిన్నిలో బతకడం కష్టమని తల్లిదండ్రులను సమాధి చేసి శివయ్య శశిరేఖలు బకింగ్ హాం కాలువ పనులకు బయలు దేరారు. దారిలో అనేక పాట్లు పడుతూ ప్రయాణం కొనసాగించారు. ఆ ప్రయాణంలో కరువు విశ్వరూపాన్ని రచయిత వర్ణించాడు. కరవులో నడక ఎంత భారమో చెప్పాడు. మధ్యలో బయ్యారం మాదిగ జింకోడు మూగపిల్లతో కలిశాడు. జింకోడుతో కలిసి కూడు దొంగతనంలో పాల్గొన్నాడు. చచ్చిన ముసలాడు సగం తిని వదిలేసిన కూడు కోసం జింకోడు ముసలిదానితో పోరాటం చేసి దక్కించకున్నాడు. కరువు వర్ణనలో హృదయవిదారకమైన సన్నివేశమిది. ఆకలి ఎంతపనైనా చేయిస్తుంది. జింకోడు ఎవరికోసమైతే దొంగతనం చేశాడు ఆమె ఆ కూడు తిని విరోచనాలతో మరణిస్తుంది. తాను బతికుంటే బకింగ్ హాం కాలువ పనుల్లో కలుస్తానని శివయ్య దంపతులను వెళ్ళమాన్నాడు. ఎవరి ప్రాణం కోసం వారు తపన పడుతున్న కరువు కాలంలో జింకోడు తనకు దారిలో పరిచయమైన మూగామెకోసం దొంగతనం చేయడం ఆమెకు సఫారీలు చేసినప్పటికి మరణించటం జరిగింది. పరస్పరం ఇచ్చుకున్న మాట ప్రకారం ఆమెను సమాధి చేసి చావు బతుకుల సమయంలో కూడా జింకోడు మానవత్వాన్ని ప్రదర్శించాడు.

కానీ సాటి మనిషిని అగ్రకులాలు మనిషిగా గుర్తించకుండా ఎన్నెలదిన్నె మాలోడు అని తెలిసిన శివయ్య దంపతుల మీద దాడి చేసి కాలువ పనుల దగ్గరకు రానివ్వకుండా తరిమేశారు. క్రైస్తవమతం పుచ్చుకుని సేవాచేస్తున్న మార్టీను, శారమ్మ ఆధరణతో బంకింగ్ హాం కాలువ తవ్వకాల దగ్గరలోని వలసపాడులో కుదురుకున్నారు. కరువు నుండి ప్రజలను రక్షించడానికి బ్రిటీష్ ప్రభుత్వం పూనుకుంది. ప్రజలకు పని కల్పించి వారి ఆకలిమంటలు

చల్లార్చడానికి బకింగ్‌హాం కాలువ తవ్వకాలు మొదలు పెట్టింది. కానీ భారతదేశంలో ప్రతి వ్యక్తికి ఆ వ్యక్తి చేసేపనికి కులం ఉంటుంది. చివరికి కూలీ పనికి కూడా ఆ కులమేమ ఉండి శివయ్య దంపతులను తరిమేసింది. ఇలా తరమడం వీరికి వీరి కులానికి కొత్తకాదు. అప్పటికే క్రైస్తవమతంలో మారిన చావులు మిషన్ కాంపౌండ్‌లోనే జరుగుతున్నాయి. వీటిని చూసిన " తవ్వకానికి మిషనరి ఒక కాంట్రాక్ట్ తీసుకుంది. రాజుపాలెంకు వస్తే కూలీ సంపాదించుకుని తగినంత తిండి తెచ్చుకోవచ్చు. ఆంగ్ల ప్రభుత్వం అనేక సహాయ చర్యలు చేపట్టింది. మద్రాసు నుండి  ఉత్తరంగా బెజవాడ వరకు బకింగ్‌హాం కాలువ నిర్మాణం ద్వారా పెద్దఎత్తున సహాయ చర్యలు ఆరంబించింది. ఈ కాలువ మూడు మైళ్ళభాగం తవ్వడానికి ఒంగోలు మిషనరీ కాంట్రాక్ట్ తీసుకుంది. ఒంగోలుకు పదిమైళ్ళ తూర్పున సముద్రం ఒడ్డుకి దగ్గరకు రాజు పాలెంలో సహాయ శిబిరం ఏర్పాటైంది"(మూర్తి.వి.వి.న:2011.130). ఆ క్యాంపులో ముఖ్యంగా మతం మారిన కింది కులాలకు ఉద్దేశించింది. మూడు మైళ్ళ తవ్వకం మిషనరీ తీసుకుంది. ఆ మిషనరీని క్లౌదొర విజయవంతంగా నడిపించాడు. ఈ క్యాంపు తర్వాత అనేకమంది క్రైస్తవ మతంలోకి మారిపోయారు. ముఖ్యంగా మాదిగలు ఈ మతాన్ని తమదిగా భవించారు. ఒక ఉద్యమంగా మతమార్పిడి కొనసాగింది. కానీ బలవంతపు మత మార్పిడి కాదని ప్రజలు స్వచ్ఛందంగా తమకు బాప్టిజం ఇవ్వమని కోరుతున్నారని రొషాంబు క్లౌ తన పరిశోధనలో (పైదే) అని తెలిపారు.

శివయ్య సీయోనుగా మారిపోవడానికి కారణం క్రైస్తవుడిగా మార్టిన్, శారాలు చూపించిన ఔదార్యం మాటల ద్వారా కాకుండా చేతల ద్వారా చూపించారు. క్రీస్తును బోధించారు. ఇంతకు ముందు దళితులు ఏమతం ఇంత సన్నిహితంగా రానివ్వలేదు. కరువు దళితులకు క్రైస్తవం దగ్గరవ్వడానికి మార్గం సుగమం చేసింది. ఈ నవలలో కరువులో దళిత అగ్రకులాల మధ్య ఎలాంటి సంబంధాలు కొనసాగాయో తెలియజేసింది. కూలీ పనుల్లోకూడా అగ్రకులాలు కింది కులాలను రాన్వికపోవడం, చంపడానికి కూడా వెనుకాడని పరిస్థితులను రచయిత తెలియజేశారు. అగ్రకులాలు తాము ఎంత ఆర్థికంగా దిగజారినప్పటికి లేదా పేదలు మారినప్పటికీ కింది కులాలను అంటరానివారిగానే చూసాయని చారిత్రక వాస్తవాన్ని రచయిత జి. కళ్యాణరావు ఎత్తి చూపాడు.

**ముగింపు:**

అంటరాని చరిత్రకు రూపమిచ్చింది అంటరాని వసంతం.ఏడుతరాల చరిత్రను వారి జీవితాల్లోని సంఘర్షణను, సంస్కృతిక జీవనాన్ని, మత, ఆర్థిక, రాజకీయ, కోణాలనుండి ఈ నవల విశ్లేసించింది. ఏడుతరాల చరిత్రలో లింగాలు, ఎర్రెంకదు, భూదేవి, వెంకటనర్సు, నారిగాడు, మాతయ్య, నాగన్న, ఎల్లన్న, సుభద్ర, పిట్టోదు, పోలయ్య, శివయ్య, శశిరేఖ, మార్టిన్, శారమ్మ, రూబేను, రూతు, యిమ్మనియేలు,మేరిసువార్త ,జెస్సీ, రూబీలు ఏడు తరాలకు ప్రతినిధులు.

ఈ నవలలో చైతన్యానికి నారిగాడు, మాతయ్యలు భూమి దున్నారు. నాగన్న విత్తనాలు చల్లాడు,ఎల్లన్న మొలకెత్తాడు. మొలకగానే పరిమలించి, ఆ పరిమళాన్ని చుట్టూ ఉన్న ప్రదేశాల్లో ఎదజల్లాడు. ఆ పరిమళమే రూబేన్.ఆ పరిమళచైతన్యమే యిమ్మనియేలు. ఆ చైతన్య స్థిరత్వరూపమే జెస్సీ,రూబీలు. బ్రాహ్మణులు, రెడ్ల పెత్తందారితనం, దళితుల ఆత్మగౌరవ పోరాటం, జానపద కళలు, కరువులో క్రైస్తవం, స్వాతంత్రోద్యమంలో గాంధీయ వాదం, కమ్యూనిజం ఇక్కడి మాలమాదిగలతో ముడిపడిన తీరును చిత్రించింది. నవల దళితుల వివక్ష, విముక్తికి సాయుధ పోరాటమే మార్గమని విరసరం ప్రచురించిన నవల ఇది. అంతవరకు అయితే ఫర్వాలేదు. రచయిత మాల కులానికి చెందినవాడు. అప్పటికే వామపక్ష ఉద్యమాలను

అగ్రకులాల చేతుల్లోనే ఉంచుతున్నారని దళితులు కమ్యూనిస్టుల నుండి వేరుపడుతున్న సందర్భమది. దండోరా ఉద్యమం నేపథ్యంలో దళితుల్లో సమాన పంపిణి కోసం ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న సమయమది. ఆ సమయంలో వచ్చిన అంటరాని వసంతం వనలలో అంబేద్కరిజాన్ని పూర్తిగా విస్మరించింది. కంచికచర్ల, కారంచేడు. చుండూరులలో దళితుల మీద జరిగిన మరణకాండలను ప్రస్తవించింది. ఆ మరణ కాండలను నిరసిస్తూ అంబేద్కరిజం నేపథ్యంలో పనిచేస్తున్న దళిత ఉద్యమాల్ని మాటవరసకు కూడా గుర్తుకుతెచ్చుకోలేదు. దళిత ఉద్యమాల పట్ల దాటవేత వైఖరి అవలంభించింది. హనుమంతుడిలా అంగలు వేసుకుంటూ మధ్యలో సముద్రమంతా విస్తరించి ప్రజాస్వామ్య పద్ధతులలో రాజ్యాధికారాన్ని చేపట్టడానికి దళిత ఉద్యమం సమాయక్తమౌతున్న సమయంలో వచ్చిన నవలగా సాహితచరిత్రలో స్థానం సంపాదించుకుంది. కానీ విప్లవోద్యమాల అస్తమయ సమయంలో దళిత సమస్యలకు పరిష్కారం తుపాకి గొట్టం ద్వారానే సాధించవచ్చని దళితుల్ని సాయుధ యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునివ్వడం చర్చనీయాంశంగా అయ్యింది. ఈ నవల దళిత సమస్యల గురించి మార్క్సిస్టు దృష్టి నుండి ఏర్పడుతుంది.

ఈ నవలలో రచయిత ఫ్యూడల్ భూస్వామ్యం నుండి స్వాతంత్ర్యానంతరం వరకు సమాజంతో పాటు దళితుల్లో వచ్చిన మార్పులను చర్చించడానికి నూటయాభై సంవత్సరాల కాలాన్ని చిత్రించాడు. రచన కవిత్వంలా ఉంటుంది. వాస్తవికంగా ఉంటూనే ఒక భ్రమలాగా నవల సాగుతుంది. కమ్యూనిస్టులు 1.ధనిక వర్గం 2.పేద వర్గం ఉన్నాయని గుర్తిస్తారు. వర్గానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి కులాన్ని ద్వితీయంగా భావిస్తారు. కానీ ఈ నవలలో కులం ప్రథమం, వర్గం ద్వితీయమైంది. బకింగ్‌హోం కాలువ పనుల్లో అగ్రకుల కూలీలు, మాదిగ కూలీలను పనికి రానివ్వకుండా బాగా కొట్టి వెళ్ళగొడతారు. అందుకే అంబేద్కరిజం కులమే పునాది అంటుంది. మార్క్సిస్టులు ఆర్థికాంశాలు పునాది అంటారు. అంబేద్కరిజం పార్లమెంటరి ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా బహుజనులు ఐక్యమై రాజ్యాధికారం సాధించాలని పిలుపునిస్తుంది. అందుకు అనుగుణంగా అంబేద్కర్ స్వయంగా రాజకీయ పార్టీని స్థాపించాడు. మార్క్సిస్టులకు బ్యాలట్ మీద నమ్మకం లేక వారికి బుల్లెట్ ద్వారానే (సాయుధ పోరాటం) రాజ్యాధికారం సాధించాలని నమ్ముతారు. "మిలిటెంట్ దళితనాయకత్వం లేకుండా దళిత బహుజనులను రాజ్యాధికారం ఊక దంపుడు నినాదమే" (కళ్యాణరావు,జి(సంపా) కేశవ కుమార్:1995. 3)' విప్లవ సాహిత్యోద్యమంలో విరసరం పాత్ర'. విరసం ప్రచురణ. కావాలి) అని అంటాడు.

దళితుల కళలు ఎలా దోపిడికి గురయ్యాయో ఎల్లన్న, పెద్ద కోటీశ్వరరావు. యానాది రమణయ్య పాత్రల ద్వారా విపులీకరించాడు.ఆ కళలని చివరి వరకు గుర్తుచేసుకుంటూ నవలంతా వచన కవిత్వమా అన్నట్లు సాగుతుంది. నవలలో చెప్పిన చారిత్రకాంశాలు వాస్తవానికి దగ్గరగా, పాత్రలు కాల్పనీకరణకు దగ్గరగా ఉంటాయి. శిశిరం, గ్రీష్మం, తర్వాత వసంతం వస్తుంది. శిశిరం ఆకులురాల్చు కాలం. గ్రీష్మం ఎండలు మండే కాలం. దళితుల జీవితాలు చరిత్రలో ఆకులు రాలుస్తూ, వివక్షతలు అనే కష్టాల ఎండలను అధిగమించడానికి సాయుధమై పోరాటం చేసినప్పుడే వసంతం వస్తుందని ప్రతీకాత్మకంగా తెలియజేసారు.

భూమి సమస్య ప్రధానంగా నవలలో కొనసాగుతుంది. భూమి ప్రాధాన్యతను నాగన్న గుర్తించి, మాలాడి దిబ్బ నుండి అచ్చిరెడ్డి పొలం వరకు మన పొలాలు గట్లు పడాలని చెబుతూ " అది అచ్చిరెడ్డి అబ్బ సొమ్ముకాదు. కరణం లెక్కలోకి రాదు". (అం.వ:84) అని చెప్పడం భూప్రాధాన్యతను గుర్తించడంగా చెప్పవచ్చు. తర్వాత మార్టిన్ భూమి గురించి మాట్లాడుతూ " తలెత్తుకు తిరగడానికి మడి చెక్క కావాలి. ఈ వంటికింత తిండి సొంతంగా...

రెండూ కావాలీ. రెడ్డికి రెండూ ఉన్నాయి. చౌదరికి రెండూ వున్నాయి" (పు.154) అని దళిత వెనుకబాటు తనానికి కారణం ఆర్థికాంశమని గుర్తిస్తాడు. ఇంకా కృష్ణా, పెన్నా నదుల మధ్య పొలాలు అగ్రకులాలు పంచుకుంటే మాదిగలు మాత్రం చచ్చిన గొడ్లమీద హక్కుల గురించి మాట్లాడుకోవడాన్ని ఎత్తి చూపుతాడు.

తమ తాత తండ్రుల ఆరాటం తెలుసుకున్నాడు రూబేను. " నా పూర్వీకులు పోగొట్టుకొన్న దాన్ని వెతుకుతున్నాను నేను. నానమ్మ చెప్పింది. మీతాత యిట్టాగే వెతికాడని, అమ్మ అంది మీ నాన్న వెతుకుతూనే వెళ్ళిపోయాడని, తర్వాత నానమ్మా వెతికింది. అమ్మా వెతికింది... నాతో పాటు నా వాళ్ళంతా వెతకటం మొదలు పెట్టారు. వెతగ్గా వెతగ్గా భూమంతా వెతగ్గా ఆ అంచు నుంచి ఈ అంచు కొచ్చాక నా వాళ్ళు పోగొట్టుకొన్న భూమి లెక్కతేలింది". (పు.173) అని రూబేను డైరీ రాసుకున్నాడు. ఈ పేర రూబేను చైతన్యాన్ని పట్టి చూపుతుంది. తమ పూర్వీకులు దేనికోసం ఆరాటపడ్డారో స్పష్టంగా తెలుసుకున్నాడు. తెలుసుకున్న విషయాల్ని తన తర్వాతి తరం వారికి అప్పగించాడు. వాళ్ళు భూసమస్యతో ఆత్మగౌరవ పరిష్కారం అధ్యాయనం చేసి సాయుధ పోరాటం వైపు మొగ్గు చూపారు. వీరికి కులస్పృహ ఉన్నప్పటికి వారిది ప్రధానంగా వర్గ దృష్టి. దళితుల్లో కూడా వర్గం తయారవుతున్నరని తెలియజేయాడానికి రోజీ, వందనం పాత్రలను సృజించాడు. దళిత ఉద్యమాల కాలానికి చెందిన జెరెస్ర కూడా సాయుధ పోరాటాన్నే నమ్మాడు.

కళ్యాణరావు నవలలో దళిత జీవన సౌందర్యాన్ని తెలియజేసాడు. నవలను కవిత్వంలో వడించాడని అనుకునేంతగా కవితాత్మక వాక్యాలే నవలంతా పరచుకుని పాఠకులకు కనువిందు చేస్తాయి. రచయిత కథనం ఉత్తమ పురుష. సర్వసాక్షి దృష్టికోణాల నుండి కొనసాగింది. ఈ నవల ఒక చారిత్రక ఘట్టం వద్ద మొదలై మరొక ప్రధాన చారిత్రక ఘట్టం వద్ద ఆగుతుంది. అంటరాని వసంతం దళితులల అంటరాని తనం వద్ద ప్రారంభమై సాయుధ పోరాటమే పరిష్కారమార్గమని చెప్పడంతో ముగుస్తుంది. ఈ రెండూ చారిత్రక ఘట్టాలే. ఈ రెండు ఘట్టాల మధ్య ధాతు కరువు, సి.పి, బ్రేన్‌ప్రస్తవన, బకింగ్‌హాం కాలువ, రాజు పాలెందగ్గర దళితుల తవ్వకం, క్రైస్తవమతం వృద్ధి, వైకం సత్యాగ్రహం, పె రియార్ పోరాటం, తెలంగాణ పోరాటం, గాంధీ హరిజనోద్యమం, అంబేద్కర్ పరాటం, సాధారన ఎన్నికలు, కారం చేడు, చూండూరు మరణ కాండల ప్రస్తవన, శ్రీకాకుళోద్యమం, నక్సలైట్ ఉద్యమం, సాయుధ పోరాటం అనే చారిత్రక విషయాలను తీసుకుని ముఖ్యమైన పాత్రలకు వాటిని అనుసంధనిస్తూ రచయిత ఎంతో చాకచక్యంగా కథను నడిపారు. ఇది విప్లవోద్యమ నవల అయినప్పటికి దళితులందరూ దళిత నవలగా పరిగణించారు. కానీ వాస్తవానికి అంటరాని వసంతం నవల దళిత నవల కాదు. ఇందులో దళిత జీవితం ఉంది. దళితుల పోరాటం ఉంది. కానీ దళిత వాదం ఎక్కడా ప్రస్తవించబడలేదు. అంతేగాక అంబేద్కరిజ ఆలోచన విధానం అసలే లేదు. అంబేద్కర్ సాయుధ పోరాటాల వైపు ఎప్పుడూ దృష్టి సారించలేదు. దళితులు సాయుధలై ఉండమన్నాడు. కానీ సాయుధ పోరాటం ద్వాఆర రాజ్యాధికారాన్ని ఆయన ఎన్నడూ కోరుకోలేదు. అంబేద్కర్ పార్లమెంటరీ ప్రజాసామ్య పోరాటాన్ని ఎన్నుకున్నాడు. ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుందామని బహుజనులకు పిలుపునిచ్చాడు. ' ప్రజాస్వామ్యంలో రాజకీయ అధికారమనేది మాస్టర్ కీ... దళితులకు కావాల్సింది పదవి కాదు. అధికారం'మని అన్నాడు.

ఈ నవలలో రచయిత దళిత సమస్యలకు సాయుధ పోరాటమే పరిష్కారమన్నాడు. ప్రజాస్వామ్య పద్ధతులపై నమ్మకం లేకే సాయుధ పోరాటం మీద నమ్మకం ఉంచుతారు. ఆ నమ్మకాన్నే రచయిత కనబరిచాడు. దళితుడు రాసినంత మాత్రాన దళిత సాహిత్యం కాదు.

అందులో అంబేద్కరిస్టు చూపు తప్పక ఉండాలి. అలా ఉన్నప్పుడే అది దళిత సాహిత్యం అవుతుంది.అందుకే ఈ నవలను దళిత నవలగా అంగీకరించలేమనవచ్చు. ఈ నవలలో దళిత జీవనం, దళిత సమస్యలు, వేధనలు ఉన్నాయి. వాటికి పరిష్కారాలు మార్క్సిజంలో వెతికారు. అందుకే ఈ నవలను విప్లవ నవలగానే పరిగణించాలని చెప్పవచ్చు.

## 4.2.నల్లమిరియం చెట్టు - దండోరా ఉద్యమం మాదిగ చైతన్యం:

గత మూడు దశాబ్దాల తెలుగు దళిత జీవితమే ఈ నవల. ముఖ్యంగా దళిత కులాల జీవితం, వాటి వ్యాప్తి, దళిత స్త్రీవాద ఉద్యమాలు, తిరోగమనం, కులద్రోహాలు, ప్రాంతీయ చరిత్రలు, దళిత ఉద్యమాల జననాలు వాటి పరివ్యాప్తులు, వర్గీకరణ సంఘర్షణలు, ఆర్థిక స్థాయిలో మార్పులు, దళితుల్లో వర్గాలు ఏర్పడడం - ఆయా వ్యక్తులు వ్యవస్థలను శాసించడం - దళిత ఉద్యమాల సమయంలో పేదస్థాయి నుండి పెను ఆర్థిక స్థాయికి ఎదిగి తాను పుట్టి, పెరిగిన కుల సంస్కృతిని, అలవాట్లను అసహ్యించుకోవడం, దానివెంట నడవకుండ అధికారం కోసం పడరాని పాట్లు పడడం, చివరికి తల్లి చావులో మనసారా ఏడ్వలేక పోవడం, చివరకు హత్య రాజకీయాలకు దిగి సొంత తమ్ముడ్ని పది సంవత్సరాల పసి పిల్లవాడ్ని కూడ చంపి రాజకీయ జంతువుగా మారిన విషయాలు సూక్ష్మాతి సూక్ష్మంగా వివరింపబడి, చర్చింపబడి - పై విషయాలను కూలదోయడానికి మళ్ళీ యువత మేల్కొని, నడుం కట్టి లేదా బలమైన అసంతృప్తిని నిరసన తెలియజేయటానికి ఆత్మహుతి దాకా (రాజయ్య కొడుకు) ప్రయాణించడం గ్రేస్ కమల అనే పాత్ర ద్వారా తెల్పిన అనేక అనేక విషయాల నేపథ్యమే ఈ నవల.

### 4.2.1.డాక్టర్ వి. చంద్రశేఖరరావు పరిచయం:

**రచయిత పేరు:** డా. వి. చంద్రశేఖరరావు.

**పుట్టిన తేది:** 14-04-1959.

**స్వగ్రామం:** మైనంపాడు గ్రామం, ప్రకాశం జిల్లా.

**విద్యాభ్యాసం:** M.B.B.S., యం.యస్సీ (సైకాలజీ).

**ఉద్యోగం:** IRAS (ఇండియన్ రైల్వేస్)లో<br>ADRM, గుంటూరు.

**ప్రచురణలు:**

**కథా సాహిత్యం: (కథా సంకలనాలు)**

1. జీవని (1994). (జీవని కథ నాటకంగా ఆల్ ఇండియా రేడియోలో ప్రసారం అయింది. ఆ పోటీలో ఉత్తమ నాటకంగా ఎంపికయ్యింది).
2. లెనిన్ ప్లేస్ (1998) - (16 కథలు).
3. మాయాలాంతరు (2003) - (21 కథలు).
4. ద్రోహవృకం (2001) - (20 కథలు).
5. చిట్ట చివరి రేడియో నాటకం (2014) - (31 కథలు). (పై నాలుగు సంకలనాల నుండి ఎంపిక చేసిన 31 కథలసంకలనం).

**నవలా సాహిత్యం:**

1. ఐదు హంసలు (1999).
2. ఆకు పచ్చని దేశం (2009).
3. నల్ల మిరియం చెట్టు (2012).

**పురస్కారాలు:**

1. సాహిత్య పురస్కారం - తెలుగు విశ్వవిద్యాలయం.

2. నూతలపాటి గంగాధరం సాహితీ సత్కారం.
3. కథా ఢిల్లీ సత్కారం.
4. ఇస్మాయిల్ సాహితీ సత్కారం.
5. కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారం.
6. ఆటా సత్కారం.

**4.2.2. నల్లమిరియం చెట్టు కథాపరిచయం:**

రాజు సుందరం కుటుంబ నేపథ్యంగా గ్రేస్ కమల చెబుతున్నట్లుగా నవల మొత్తం నడుస్తుంది. కమ్లీ ద్వారానే మనం అన్ని చూస్తాం, వింటాం, స్పందిస్తాం, దుఃఖిస్తాం. వృత్తి కళాకారులైన మాదిగలు – మాదిగ దండోరా దాకా ఎలా ప్రయాణించారో చెబుతుంది. దండోర ఉద్యమం ఒక ఆశ, ఒక ఆత్మవిశ్వాసమై, బానిసత్వాన్ని నిరాకరించడం నేర్పి, దండోర ఒక మతంగా రూపుదిద్దుకున్న వైనాన్ని తెలియజేస్తుంది. "దండోర ఉద్యమంతో ఒక మార్పు వస్తుంది. నలుగురు కలుస్తున్నారు. ధైర్యంగా తలెత్తి మాట్లాడుతున్నారు. పిల్లల్లో ఎంత మార్పు" (పు.193) అని ఒక సమయంలో కాంతం పాత్ర అంటుంది.

గ్రేస్ కమల (కమ్లీ) మొదటిసారిగా దండోర సమావేశంలో పాల్గొనే సన్నివేశంలో నవల ఆరంభం. గ్రేస్‌కమల నాన్న రాజయ్య అధికార పార్టీలో సభ్యుడు. అతడికి, పార్టీకి దండోర మీద సదాభిప్రాయం లేదు. పార్టీకి సదాభిప్రాయం లేదు కాబట్టి ఇతను మాదిగ కులస్తుడైన దండోర ఉద్యమాన్ని వ్యతిరేకిస్తాడు. కానీ ప్రముఖ దళితనాయకుడు ఇంట్లో క్రమశిక్షణ పేరుతో పిల్లల్ని, పిల్లల్ని సరిగ్గా పెంచలేదని భార్యను తీవ్రంగా కొడుతుంటాడు. ఈ క్రమంలో అతడి కొడుకైన రూమీ దండోర ఉద్యమంలో పాల్గొని దాన్నొక తిరుగుబాటు సాధనం భావిస్తాడు.

రాజసుందరం తిరుపతయ్య – ఆదెమ్మలకు లేకలేక కలిగిన కొడుకు. ఆదెమ్మ రాజయ్యను అల్లారుముద్దుగా పెంచింది. రాజయ్య తర్వాత కరుణకుమార్ పుట్టాడు. పుట్టుకతోనే రాజయ్యకు కరుణ మీదకోపం. ఆదెమ్మ రాజయ్యను మిషనరీ స్కూల్లో చదివించింది. ఆ స్కూల్ నుండి వచ్చిన తర్వాత మాదిగ సంస్కృతిని, ఆచారాలు, అలవాట్లను అసహ్యాయించుకునేవాడు. ఒకానొక సమయంలో ఎందుకు చదివించానా అని తల్లి దిగులు పడేది. చదువు అయిన తర్వాత టీచర్‌గా ఉద్యోగం సంపాదించాడు. టౌన్‌లో పెళ్ళిచేసుకుంటూ తల్లికి కబురు పెట్టాడు. అయినా ఆమె మలేరియా జ్వరంతో వెళ్ళలేకపోయింది. నెల రోజులకు ఊరికి భార్యను తీసుకువచ్చాడు. అత్తా కోడళ్ళు ఇద్దరు కలిసిపోయారు. ఆదెమ్మ కోడలిని గుండ్లకమ్మకు తీసుకువెళ్ళి పూజలు చేయించాలని ప్రయత్నించింది. కోడలు సున్నితంగా తాను బాప్తిజం తీసుకున్నానని పూజలను తిరస్కరించింది. ఈ విషయం తెలిసి రాజయ్య తల్లిని కోపగించుకున్నాడు. తల్లి కొడుకును తన ఇంటి నుండి వెళ్ళిపొమ్మంటుంది. అక్కడి నుండి గుంటూరు చేరిన రాజయ్య రాజుసుందరంగా ఎదుగుతాడు. ఈ ఎదుగుదల సమయంలో ఆల్ ఇన్ వన్ గైడ్స్ తయారీ వ్యాపారం, రియల్‌స్టర్‌గా ఎదిగి జెడ్పీ చైర్మన్‌గా రాజకీయాల్లో చేరతాడు.

మొదట్లో చిన్న పెంకుటిల్లు నుండి అపార్ట్‌మెంట్‌కు అక్కడ నుండి విశాలమైన సొంత ఇంటికి మారడం. ఈ క్రమంలో పావురాళ్ళను పెంచడం, చంపివేయడం జరుగుతుంది. అంటే క్రమంగా స్వేచ్ఛను కోల్పోడం. (మూడు తరాల దళితుల జీవితాలను మన కళ్ళ ముందు ఉంచుతాడు రచయిత)గ్రేస్ కమల ఒకసారి అమ్మతో (విజయ) ఊర్లో చనిపోయిన వ్యక్తిని చూడడానికి వెళ్ళి ఆ వ్యక్తి జీవితాన్ని శారా అనే చిన్న అమ్మాయి ద్వారా తెలుసుకుంటుంది. అక్కడ నుండి ఒక చిన్న తప్పెట తెచ్చుకుంటుంది. అది చైతన్యాన్ని మేల్కొలుపుతూ ఉ

ంటుంది. ఆ ఊర్లో (టౌన్‌కి భిన్నంగా) చావు సామూహిక దుఃఖంగా – ఆత్మీయంగా వాతావరణంతో ఉంది. చావు ఆ రోజు కది అందరి దుఃఖం. ఊర్లో గ్రేస్ అమ్మ విజయ భాషలో, యాసతో ఆత్మీయంగా మారిపోతుంది. రెండు గ్లాసుల పద్ధతి గురించి గ్రేస్ తెలుసుకుంటుంది. చనిపోయిన వ్యక్తి జ్ఞాపకాల్ని శారా చెబుతుంటే రాసుకుంది.

గ్రేస్ అమ్మది క్రిస్టియన్ బ్యాక్‌గ్రౌండ్ ఫ్యామిలి. రాజయ్య పెళ్లైన మొదట్లో చర్చికి విజయతో కలిసి వెళ్ళేవాడు. తర్వాత ఈ మతం మనపై బలవంతంగా రుద్దిన కలోనియల్ లేగసీ అంటాడు. రాజయ్య ఎమ్మెల్యే (రిజర్వ్‌డ్) టిక్కెట్ కోసం ప్రయత్నిస్తూ యం.పి. ఇంటికి తన కుటుంబంతో భోజనానికి వెళతాడు. అక్కడ యం.పి. కొంతసేపు మాట్లాడి బయటకు వెళ్ళిపోతాడు. యం.పి. కూతురు రాజయ్య కుటుంబానికి ఇల్లు మొత్తం (అమ్మగది, పూజ గది తప్ప) చూపించి వెళ్ళిపోతుంది. రాజయ్య కుటుంబం ఒంటరిగానే భోజనం చేసి పని మనుష్యులకు బై చెప్పి వెళ్ళిపోతారు(1996లో) పరీక్షలు రోజుల్లో మేనత్త రాణమ్మ కొడుకు రవిని పోలీసులు అరెస్టు చేసారని విడిపించమని వచ్చింది. నక్సలైట్ కొరియర్ అని పోలీసులు రవిని అరెస్టు చేశారు. గ్రేస్‌తో రవి “మీ నాన్న ఒక ద్రోహి... ...ప్రపంచం కోసం ఏం చేశాడు” అనేవాడు. “దేవుడున్నాడు మీ వాడికి ఏమి కాదు నేను ఉన్నాను” అని రాజయ్య రాణమ్మను ఓదార్చాడు.

ఇదే సమయంలో దండోరా ఉద్యమం ఊపందుకుంది. రాజయ్య సన్మానం కోసం గ్రేస్ వాళ్ళు తాతయ్య ఊరికి కారులో బయలుదేరారు. మధ్యలో రోడ్డుకి అడ్డంగా దండోరా సభ. నాన్న కొనిచ్చిన పక్షులను రూమీ స్వేచ్ఛకు ప్రతీకగా దండోర నాయకులకు ఎగురవేయడానికి ఇచ్చాడు. కాబోయే ఎమ్మెల్యేగా రాజయ్యకు అనుమానాలు ఎదుర్కొన్న ఊర్లోనే సన్మాన కార్యక్రమం. కరుణ, ఖాజావలి చిన్ననాటి మిత్రులు ఆ వూరు పెద్దల నేతృత్వంలో జరగబోతుంది. ఆ సన్మాన సభలో కరణ భార్య కాంతం రాజసుందరం మీద ఉగ్రరూపం చూపింది. నా కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు రాలేని రాజ్యయ్య ఊరికి ఉపకారం ఏమి చేస్తాడని విరుచుకుపడింది. కానీ రాజయ్య పూర్తి రాజకీయ మనిషిగా రూపుదాల్చాడు. కావున కాంతం సభాపూర్వకంగా చెప్పిన విషయాలు ఎవరు పట్టించుకోలేదు. సభనాంతరం భారీ ఎత్తున విందు జరిగింది. జడ్జి నాగభూషణం ఆత్మహత్య చేసుకోవడం, రాజయ్య జడ్జికి సంతాపసభ జరపడం. ఆ సభలో గొప్ప వక్తగా రాజయ్య మాట్లాడారు.

కరుణ చిన్నప్పటి నుండి వ్యవస్థలోని లోపాలను ఎదిరించి ప్రశ్నించేవాడు. మొదట్లో కూలీ రేట్ల కోసం ఉద్యమించి విజయం సాధించి, ఆ ఊరి కమ్యూనిస్టు నాయకుడి అనుచరుడిగా మారాడు. స్కూల్లో దళితుల్ని కులం పేరుతో తిట్టిన ఉపాధ్యాయుడ్ని స్కూల్లోనే తిట్టి వస్తాడు. క్రమంగా కమ్యూనిస్టు పార్టీ నుండి నక్సలైట్‌గా మారి ఉద్యమంలో అజ్ఞాతంలోకి వెళతాడు. కాంతం పరిచయంతో వివాహం చేసుకుంటాడు. ఇద్దరు పిల్లల్ని కంటారు. కాంతం కరుణ నక్సలైట్ ఉద్యమంలో పనిచేస్తున్న సమయంలో అనేక కష్టాలు అనుభవించింది. కరణ గురించి ఎలాంటి వార్త వినవలసి వస్తోందనని ఎప్పుడు ఆందోళనతో ఉండేది కాంతం. మొదట్లో ఆ ఆందోళనను అలంకరణతో, సినిమాల మోజులోపడి కరుణ గురించి దిగులు తగ్గిపోయింది. సినిమా ప్రపంచ మాయలో పడి ఊర్లో హొటల్లో రెండుగ్లాసుల పద్ధతిని ప్రశ్నించి హొటల్ యజమాని చెంపపగల కొడుతుంది.

తర్వాత ఊరు మొత్తం ఏకమైన పల్లె తరపున కరుణ ముందు నిలబడి ఆ దాడిని ఐక్యంగా ఎదుర్కొంటాడు. దానితో సినిమా ప్రేమకు నిజ ప్రేమకు మధ్య గీతను కాంతం తెలుసుకుంటుంది. తర్వాత కరుణ అజ్ఞాతంలో ఉన్న సమయంలో కాంతం చర్చికి వెళ్ళి ఉ పశమనం పొందుతుంది. కమ్యూనిస్టులు వర్గంలో కులాన్ని కలిపి వేసి, కులాల ఉనికి గుర్తించ

నిరాకరించినప్పుడు కరుణ నక్సలైట్ ఉద్యమం నుండి బయటకు వచ్చి దండోర ఉద్యమంలో చేరి నాయకుడిగా ఎదుగుతాడు. దండోరా ఉద్యమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్తాడు. ఆదెమ్మ హృద్రోగంతో బాధపడుతున్నప్పుడు ఆమెకు కరుణ కుటుంబం దగ్గరుండి సపర్యలు చేస్తోంది. ఇదే సమయంలో గ్రేస్, రూమీ నానమ్మను చూడడానికి వచ్చి దండోర ఉద్యమ గమనాన్ని అర్థం చేసుకుంటారు. ఆదెమ్మ ఆరోగ్యం బాగులేదని డాక్టర్లు చెబుతారు. ఆ రోజు రాత్రి కరుణ ఇంట్లో కుటుంబవిందు జరుగుతుంది. ఆ సమయంలో ఆదెమ్మ గుండ్లకమ్మలో మొసళ్ళ కథ చెబుతుంది. ఆదెమ్మ అనేక విషయాలు చెబుతూ నిద్రపోతుంది. ఆ నిద్రలోనే కన్నుమూస్తుంది. ఆదెమ్మ చావుతో గ్రేస్‌కు కన్నీరు కార్చలేకపోతుంది. పల్లె మొత్తం కన్నీరు పెడుతుంది. ఆదెమ్మ అందరికి అమ్మ కనుక ఘన వీడ్కోలుకు దండోర సిద్ధమౌతుంది. ఆ సమయంలో రాజుసుందరం వచ్చి దండోర మీద కోపంతో తమ్ముడైన కరుణ మీద గొడవ పెట్టుకొని రూమీ, గ్రేస్‌లను బలవంతంగా తీసుకువెళతాడు. తల్లి చావును రాజకీయం చేసినవాడిగా తమ్ముడ్ని చిత్రీకరించాలని చూస్తాడు.

గుంటూరులో దండోర కల్చరల్‌సెంటర్ కుర్రోళ్లు దేవూ, ఢిల్లీ, తబిత, కాలిబ్ మొ॥ వారితో రూమీ, గ్రేస్‌కి పరిచయం ఏర్పడుతుంది. వీరిలో కవులు, చిందు, తప్పెటకొట్టేవాళ్ళు ఉన్నారు. వీరిలో దేవూ, ఢిల్లీలు ప్రత్యేకం. వీరు దండోర ఉద్యమంలోకి వచ్చిన తర్వాత తల్లిని ప్రేమించడం, తన జాతిని ప్రేమించడం నేర్చుకొని తమ జాతి కోసం ప్రాణాన్ని ఆత్మహుతి చేసుకున్న వైనం ఈ నవలలో చెప్పబడింది. కరుణ దండోర ఉద్యమ నేపథ్యంలో నాయకుడిగా ఎదిగే క్రమంలో ఎన్నికల బహిష్కరణకు పిలుపు ఇస్తాడు. ఆ పిలుపు అందుకొన్న కార్యకర్తలు ఓటింగ్‌లో పాల్గొనకుండా, (పాల్గొన్న వారు 16 మంది దండోర ఆశయాన్ని తెలియజేసే విధంగా చీటిలు రాసి బ్యాలెట్ బాక్స్‌లో వేస్తారు.) విజయవంతంగా ఎన్నికల బహిష్కరణను పూర్తి చేస్తారు. దండోర ఉద్యమానికి నక్సలైట్స్ మద్దతు తెలియజేస్తారు. ఎన్నికల బహిష్కరణతో అధికార పార్టీ దండోర ఉద్యమాన్ని గుర్తించి కరుణకుమార్‌ను మార్కాపురము ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తారు. దాంతో అసంతృప్తికి లోనైన రాజయ్య దళితుడిగా తన బాధలు, అగ్రకులాలకు చెంచాలుగా ఎలా పని చేస్తారో తెలియజేస్తాడు.

దండోర ఉద్యమ క్రమంలో కరుణ ఉండే మాదిగపల్లె అనేక సాంఘిక వెలివేతలను ఎదుర్కొంటుంది. ఆ సమయం దండోర కుర్రోళ్ళు పల్లెకు కావాల్సిన సామాగ్రిని సమకూర్చి పెడతారు. చుట్టుప్రక్కల మాదిగపల్లెలోని జనం ఈ పల్లె కోసం ఆహార పదార్థాలు తీసుకు వచ్చి పెడతారు.

కరణకుమార్‌ను ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకటించడంతో రాజయ్య రాజసుందరంగా మారి మళ్ళీ రాజకీయ జంతువుగా కురిచేడు సభ మార్గంలో కరుణకుమార్‌ను హత్య చేయిస్తాడు. ఒక నెల రోజుల తర్వాత తన రాజకీయ జీవితాన్ని తిరిగి ప్రారంభించి, తన పార్టీకి, పదవికి రాజీనామా చేసి దండోర ఉద్యమానికి న్యాయకత్వం వహిస్తాడు. ఇదే సమయంలో కరుణను హత్య చేసింది రాజయ్యేనని పట్టుబడిన హంతకులు చెబుతారు. కానీ ఆ విషయం బయటకు రాదు. కరుణ భార్య కాంతంకు, భార్య విజయ్మకు తెలిసిపోతుంది. దీంతో రాజయ్య ఇంట్లో శ్మశాన వైరాగ్యం ఏర్పడుతుంది. రూమీ, విజయలు యాంత్రికం మారిపోతారు. రాజయ్య వాళ్ళను చూసి అసహనం, కోపం వ్యక్తం చేస్తుంటాడు.

కరుణ హంతకుడు రాజయ్య అని తెలియక ముందు వర్గీకరణ కోసం నిరాహార దీక్ష చేస్తున్న సభ ప్రాంగణంలో పది సంవత్సరాల పసిపిల్లవాడు కిరోసిన్ పోసుకొని తగుబెట్టుకుంటాడు. ఆ సమయంలో రూమీ, గ్రేస్ అక్కడే ఉంటారు. పసివాడి చేతికి కిరోసిన్ డబ్బా ఎలా వచ్చిందని రూమీ ప్రశ్నించుకుంటాడు. (ఇదే ఈ నవలలో కీలక విషయం)

గ్రేస్‌కు కరణ, పసిపిల్లవాడి శవాలు కలలో వచ్చి జరిగిన విషయాల్ని పదే పదే గుర్తుకు తెస్తుంటాయి. ఆ సమయంలో మహిమగల తప్పెట తీసి వాయిస్తూ ఏడ్చి, కొంత ఉపశమనం పొందుతూ ఉంటుంది.

రాజయ్య ఇల్లు పూర్తిగా మారిపోయింది. రాజయ్య వర్గీకరణ విషయం మీద ఊరూరు సుడిగాలిలా చుట్టి వస్తుంటాడు. మాదిగల మీద హుడిని మాంత్రికుడిలా వర్గీకరణ మంత్రాన్ని ప్రయోగించి మంత్ర ముగ్ధుల్ని చేస్తుంటాడు. ఒక రోజు ఉదయం రాజ సుందరం పుట్టిన (పెళ్ళి) రోజు సందర్భంగా ఇల్లు అలంకరింపబడి ఉంటుంది.

రాజయ్య భార్య ఇంటి నుండి కాంతం దగ్గరకు వెళ్ళాలని నిర్ణయించుకొని బయలుదేరుతుంది. రూమీ ఈ ఇల్లు చనిపోయిందని, గ్రేస్‌ను కూడ అమ్మ దగ్గరకే వెళ్ళమని చెబుతాడు. రాజయ్య కార్యకర్తల జేజేలు, పొగడ్తలమధ్య ఉండి, వర్గీకరణ సాధన కోసం ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి సాధిస్తానని చెబుతుంటాడు. ఆ సమయంలో రూమీ జన సమూహాన్ని చీల్చుకొని వచ్చి మీ డ్రామాలు ఆపండి సార్. దండోరాను మరోసారి చంపకండి, దండోరాని మీ రాజకీయ నిచ్చెనగా చెయ్యవద్దు. దండోర మాకు మతం అయింది. ... మీకు ఏమి కావాలి సార్ పదవులా, డబ్బా, పోనీ మా ప్రాణాలా... అంటూ పెట్రోలు పోసుకొని తగలబెట్టుకుంటాడు. గ్రేస్‌ను ఎవరో వెనుకకు లాగివేశారు. గ్రేస్ మనకిక పునరుత్థానం లేనట్లుగా ఏందిరా చావు అని బాధపడుతుంటే నవల ముగుస్తుంది. దండోర పేరుతో ఎదిగి ఉద్యమాన్ని నిచ్చెనమెట్లు చేసుకొని, ఆ నిచ్చెన మెట్లను కూల్చివేస్తూ పై స్థాయికి ఎదిగిన నాయకులకు బుద్ధి చెప్పాలని అందుకు యువత మేల్కొని నడుంకట్టి లేదా తమ నిరసన తెలియడానికి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టాలని, మరికొన్ని త్యాగాలకు సిద్ధమవ్వాలని రచయిత తెలియజేశారు.

### <u>4. 2. 3. పాత్రల విశ్లేషణ:</u>

ఈ నవలలో చంద్రశేఖరరావు గారు దండోర నేపథ్యాన్ని అది అందించిన చైతన్యాన్ని తెలియజేశారు. అంతే కాకుండా మాదిగల సామాజిక సాంస్కృతిక, ఆర్థిక, మత పరిస్థితులను వివరించారు. ఈ నవలలో క్రైస్తవ మత ప్రభావంతో ఎలా అభివృద్ధి చెందారో చర్చించారు. మాదిగల పురాతన పూజా పద్ధతులను, వారి నమ్మకాలను, సందర్భానుసారంగా వివరించారు. ముఖ్యంగా రాజయ్య పాత్రలో అనేక కోణాలను వ్యక్తీకరించారు. ఆర్థికంగా బలపడుతూ మనిషిగా పతనమైన క్రమాన్ని స్వయంగా కూతురు కమ్లీ మేల్ ఎనిమల్‌గా ఆయన్ని వర్ణిస్తుంది. స్త్రీల పాత్రలను చైతన్య పాత్రలుగా తీర్చిదిద్దాడు. ఇందులో రాజయ్య పాత్ర తప్ప మిగిలిన పాత్రలన్ని చైతన్యవంతమైన పాత్రలేనని చెప్పవచ్చు.

#### <u>ఆదెమ్మ:</u>

ఆదెమ్మ తిరుపతయ్య భార్య. రాజయ్య, కరుణల తల్లి. ఆదమ్మె అంటే అందరికి అమ్మ లాంటిదని అంటారు. ఆదెమ్మ తిరుతయ్యను ఇష్టపడి నులకమంచం, జర్మన్ సిల్వర్ బిందె కట్నంగా ఇచ్చి పెళ్ళి చేసుకున్నది. తిరుపతయ్యతో వెట్టి మాన్పించి తోళ్ళ వ్యాపారం పెట్టించింది. భర్త తోళ్ళు తీసుకువస్తే, వాటికి ఉప్పుపెట్టి నిల్వచేసేది. ఆదెమ్మకు మూడుసార్లు కడుపు పోయింది. నాలుగోసారి కడుపు వస్తే, సోది చెప్పే ఆమె మగపిల్లవాడు పుడతాడని చెబితే పోతురాజు గుడిలో పోతుదూడను బలి ఇచ్చింది. ఆదెమ్మ మగపిల్లవాడ్ని కని అల్లారు ముద్దుగా పెంచింది. రాజయ్య అనే పేరుపెట్టి వాడి చదువుకోసం ఆరాటపడింది. ఆదెమ్మ దంపతులిద్దరు చర్చిలో బాప్తిజం తీసుకున్నారు. రాజయ్యని మిషనరీ స్కూల్లో చేర్చారు. భర్త తిరుపతయ్యను విష ప్రయోగం చేసి దాయాదులు చంపుతారు. ఆ విషయం తెలిసి వారి దాయాదుల ఇళ్ళ మీద రాత్రిపూట ఆడవాళ్ళతో కలిసి దాడి చేసేది. ఆదెమ్మకు తల పొగరు మనిషి, గయ్యాళిగా

పేరు, అందరూ మగరాయుడు అని పిలిచేవారు.

భర్త చనిపోయిన తర్వాత ఒక ఉదయం పూట పిల్లలిద్దరినీ పొలం దగ్గరకు తీసుకెళ్ళింది. ఆ పొలం కోసం ఎలా కష్టపడిందో వివరించింది. తను చనిపోయినా ఆ పొలాన్ని నిలుపుకోవాలని, పొలం లేకపోతే ఎవరూ తమను పట్టించుకోరని చెప్పింది. అప్పుడే కులం, దాని వల్ల కలిగే అవమానాల్ని వివరించింది. రోజూ తల్లిబిడ్డలకు ఇదే సంభాషణ. పిల్లలు విసుగుగా ముఖంగా పెట్టినా పట్టించుకునేది కాదు. పిల్లల్ని ఒంటరిగా ఎక్కడికి పంపేది కాదు. ఆడుకునేటప్పుడు కూడా వాళ్ళ పక్కనే నిలబడి ఉండేది. ఆదెమ్మకు పిల్లల చదువు పిచ్చిలా అయిపోయింది. రాజయ్య కళ్ళలో స్పార్క్ చూసిన ఫాదర్ హాస్టల్లో చేర్పించుకున్నాడు. ఆరు నెలల్లో పిల్లాడి రూపురేఖలు మారిపోయాయి. (అప్పటి నుంచే రాజయ్యలో మార్పు మొదలైంది) చివరకు ఆదెమ్మను చింపిరి జుట్టుతో, చిరిగిపోయిన కోకలతో ఎందుకు తిరుగుతావని రాజయ్య కసురుకునే వాడు. పిల్లవాడు ఎదిగే కొద్దీ ఆదెమ్మలో వింతగర్వం పొడచూపేది. స్కూల్ ఫైనల్ తర్వాత పల్లెకు రావడం అంటే రాజయ్య ఇష్టపడలేదు. కొడుకు కాలేజీ చదువు కోసం గేదెల్ని అమ్ముకోవాల్సి వచ్చింది. అందుకు ఆనందంతో పాటు ఆదెమ్మ కళ్ళల్లో దిగులు ఉండేది.

రాజయ్య టౌన్‌లో పెళ్ళి చేసుకొని భార్యను తీసుకువస్తే కోడలితో కల్సిపోయింది. గుండ్లకమ్మకు తీసుకువెళ్ళి కోడలితో పూజ చేయించడానికి ప్రయత్నించింది. రాజయ్య కసురుకోవడంతో కొడుకును తిట్టి ఇంట్లోంచి పంపించి వేసింది. అప్పటి నుండి తన పొలంలో గుడిసె వేసుకొని ఒంటరి జీవితం గడుపుతుంది. కోడలికి గర్భస్రావం అయిందని తెలిసి కోడలు దగ్గరకు వెళ్ళి టౌన్‌లో ఒక వారం రోజులు ఉంది. రెండోసారి కడుపు పోయిందని తెల్సినపుడు ఒక నెల రోజులు ఉంది. పోతురాజుకు మొక్కు చెల్లించుకుంది. మూడోసారి కోడలి కడుపు పండి ఆడబిడ్డ పుట్టితే సంతోషపడింది. తన భర్త పేరు పెట్టాలని ఆశ పడింది. మరుసటి సంవత్సరము మగపిల్లవాడు పుట్టాడు. రెండో యేట వాడికి జబ్బు చేసింది. ఆదెమ్మ మంత్రించిన తాయత్తు తెచ్చి పిల్లాడి మెడలో వేసింది. రాజయ్య ఎప్పటిలాగే పెద్దగా అరుస్తూ తిట్టాడు. ఆదెమ్మ మనస్సు విరిగిపోయింది. అప్పటి నుండి రాజయ్య ఇంటికి ఆదెమ్మ ఎప్పుడు రాలేదు. ఆదెమ్మ దగ్గరకు రాజయ్య కూడ రాలేదు. ఆదెమ్మకు ఓపిక ఉన్నంతకాలం గుండ్లకమ్మ దేవతకు పూజి చేసి, తమ పిల్లల్ని మనుమళ్ళను చూసి సంతోషపడింది. వాళ్ళకు పున్నీళు ళ్ళ కలిపి ఇచ్చింది. రాజయ్య పంపిన చీరలను కోడలు పంపిన డబ్బులు తిప్పి పంపింది. కొడుకు సన్మానసభకు ఆశ్చర్యకరంగా హాజరయ్యింది. చనిపోయే ముందు వరకు ఒంటరి జీవితమే గడిపింది. చనిపోయే ముందు రోజు కూడ గుండ్లకమ్మ దేవతకు పూజ, ప్రార్థనలు చేసింది. ఆ సమయంలో చూసిన వాళ్ళకి ఆదెమ్మ గుండ్లకమ్మ దేవతలా తోచింది. చనిపోయే ముందు రోజు రాత్రి మొసళ్ళ కథ చెప్పింది. చిన్నకొడుకు కరణ కుమార్ ఇంట్లో ప్రశాంతంగా నిద్రలోనే కన్ను మూసింది. కరుణ తన తల్లికి ఘనంగా (వీడ్కోలు) సమాధి చేశాడు.

**<u>రాజయ్య (రాజసుందరం):</u>**

ఆదెమ్మ, తిరుపతయ్యల పెద్దకొడుకు. విజయమ్మ భర్త, కరుణకుమార్‌కు అన్న. రూమీ, గ్రేస్ కమలల తండ్రి. ఆదెమ్మ దంపతులకు లేకలేక పుట్టినవాడు. అల్లారుముద్దుగా పెంచబడ్డాడు. నల్లగా గుండ్రంగా, రుబ్బురోలులా ఉండేవాడు. తండ్రిలాగా రాజయ్య కూడా భోజనప్రియుడు. రాజయ్యను బడికి పంపడం ఒక ప్రహసనం అయింది. రాజయ్య చదువు గురించి పల్లెలో కథలుగా చెప్పుకునేవారు. సంవత్సరం పాటు అ, ఆ, ఇ, ఈలే దిద్దేవాడట. సుమారు 50 పలకలు పగిలాయట. ఊళ్ళో బడిని కాదని 4 కిలో మీటర్లు అవతల మిషనరీ స్కూల్లో చేర్పించారు. ఆ స్కూల్లో ఫాదర్‌కి రాజయ్య కళ్ళల్లో స్పార్క్ బాగా నచ్చింది. బాప్తీజం ఇచ్చి

తనే చదివించుకుంటానంటే ఆదెమ్మ భయపడింది. ఆ స్కూల్లో రాజయ్య రూపురేఖలు మారి దొరబాబులా, మాదిగపల్లె అలవాట్లను అసహ్యించుకోనేలా మారిపోయాడు. పల్లెలో పదో తరగతి చదువుకున్న మొదటి వ్యక్తి రాజయ్య. స్కూల్ ఫైనల్ నాటికి రాజయ్య కొత్త మనిషిలా మారిపోయాడు. కాలేజీ చదువుకోసం ఆదెమ్మ గేదెలు అమ్ముకుంది. పల్లె మిగిలిన పిల్లల కళ్ళలో కనబడే వెలుగు, హుషారు రాజయ్య పోగొట్టుకున్నాడు. రాజయ్యకు స్కూల్ టీచర్ ఉద్యోగం వచ్చింది. సంవత్సరం దాటినా పల్లెకు రాలేదు. పూర్తిగా మారిపోయాడు. కరుణతో వీడు మన మనిషి కాదురా అనేది ఆదెమ్మ.

రాజయ్య ఆరు నెలల తర్వాత పెళ్ళికి రమ్మని ఆదెమ్మకి కబురు. ఆదెమ్మ మలేరియా జ్వరం వల్ల వెళ్ళలేకపోయింది. పెళ్ళి అయిన నెల రోజులకు భార్యతో ఆదెమ్మ వద్దకు వచ్చాడు. అత్త కోడళ్ళు త్వరగానే కల్సిపోయారు. కానీ కొడుకు ప్రవర్తనతో వెగటు కలిగిన ఆదెమ్మ నీ భార్యను తీసుకొని వెళ్ళిపొమ్మంది. అప్పటి నుండి రాజయ్య ఆదెమ్మ ఇంటికి రాలేదు. ఆదెమ్మ చావు సమయంలో కూడ తమ్ముడు కరుణతో గొడవపడి వెళ్ళిపోయాడు.

రాజయ్య ఆల్ ఇన్ ఒన్ గైడ్స్ వ్యాపారం, టెక్స్‌బుక్స్ ముద్రణ, చిట్‌ఫండ్స్ వ్యాపారం, తర్వాత రియల్టర్ గా మారి బాగా సంపాదించాడు. మొదట్లో చిన్న పెంకుటింటిలో ఉండేవాడు. ఇప్పుడు ఇండిపెండెంట్ హౌస్‌కి మారిపోయాడు. మొదట్లో పావురాలు పెంచుతూ వాటికి కవిత్వం, కబుర్లు, ఉపన్యాసాలు చెప్పేవాడు. ఇప్పుడు పావురాల గూడులు కూల్చివేసి కొత్త గదులకు ప్లానులు వేస్తున్నాడు. అధికార పార్టీ జెడ్‌పి చైర్మన్ పదవితో పూర్తిగా రాజకీయ మనిషిగా మారిపోయాడు. రాజయ్య రాజసుందరంగా మారిపోయాడు. ప్రస్తుతం ప్రముఖ దళితకాలమిస్టు, మానవహక్కుల సంఘంలో సభ్యుడు, మానవహక్కుల సంఘం ప్రచురించే పత్రికా సంపాదకుడు. మానవ హక్కులు ఇంట్లో వాళ్ళకి అవసరం లేదని తన చేతల ద్వారా భార్య పిల్లలను చితకబాదడంతో నిరూపిస్తాడు.

పిల్లల్ని పార్టీలకు తీసుకుపోయి అక్కడి హైక్లాసు కల్చర్‌ను పరిచయం చేయడం, అక్కడి పిల్లలు ఎంత డిగ్నిఫైడ్‌గా ఉన్నారో లెక్చర్ ఇస్తాడు. ఆశ్చర్యకరంగా మానవహక్కుల గురించి పిల్లలతో ఎప్పుడూ మాట్లాడడు. అవన్నీ పిల్లలకు అవసరం లేని విషయాలని చెబుతాడు. దండోరాను రాజయ్య పార్టీ వ్యతిరేకిస్తుంది. కాబట్టి రాజయ్య మాదిగ అయిన తాను వ్యతిరేకిస్తాడు. దండోర సభలో పాల్గొన్న తన పిల్లలను తరచు మార్కులు బాగా రాలేదని దండిస్తాడు. పిల్లలను క్రమశిక్షణతో పెంచడంలేదని ఒకసారి భార్యను కొట్టాడు. మరోసారి గ్రేస్ క్రమశిక్షణ తప్పిందని కొట్టాడు. వారిద్దరూ ఆసుపత్రి పాలులయ్యారు. రాజయ్య హింసలను తట్టుకోలేక చివరకు భార్య విజయ ఇల్లు విడిచి తోడికోడలు కాంతం వద్దకు వెళ్ళిపోతుంది.

రాజయ్య రాజకీయ ఎదుగుదలకు ఊర్లో చిన్ననాటి మిత్రులు, పెద్దలు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. ఈ కార్యక్రమం ఉపన్యాస ప్రతి రాజయ్య మిత్రుడు ఖాజావలి, తమ్ముడు కరుణ తయారు చేస్తారు. ఆనాటి సభ రాజయ్య కాబోయే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడానికి సంబంధించినది.ఆ సభలో దళితులు మైనార్టీల సంబంధాలు గురించి చెబుతూ రాజయ్య ఎమ్మెల్యే అయితే ఈ ఊరు వారికి చెయ్యబోయే పనులు ఖాజావలి చెబుతూ ఉంటాడు. రాజయ్య తమ్ముడి భార్య స్టేజి మీదకి వచ్చి మేం కష్టాల్లో ఉన్నపుడు ఆదుకోలేనోడు ఊరికి ఏమి చేస్తాడు, అంటూ విరుచుకుపడింది. ఆ తర్వాత సభలో ఏమి జరగనట్లు రాజకీయసభలో వక్తలు ప్రసంగించి ముగించారు. సభ తర్వాత భారీ ఎత్తున విందు జరిగింది.

జడ్జి నాగభూషణం కుల అవమానాల వల్ల అగ్రకులతత్వ వల్ల ఉరిపోసుకొని మరణిస్తాడు. అతడి చావు తర్వాత ఎక్కడ పూడ్చాలో అనే దానిపై వివాదం వచ్చింది. రాజయ్య పలుకుబడితో ఆ వివాదం సమసిపోయింది. జడ్జి సంతాపసభ రాజయ్య రాజకీయ

ఎదుగుదలకి నిచ్చెనగా ఉపయోగించుకొని దాన్ని అసెంబ్లీలో చర్చాంశంగా మార్చాడు.

ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ఎం.పి. ఇంటి భోజనానికి వెళ్ళడం. ఇంట్లో ఎవరు లేకపోయిన ఒంటరిగానే కుటుంబంతో భోజనం చేసి రావడం. తల్లి చావును కూడ రాజకీయ కోణంలోనే చూడడం. దండోర కార్యకర్తల వ్యతిరేక నినాదాలు చేయడంతో వెనుదిరగడం. తన పిల్లలను బలవంతంగా తీసుకువెళ్ళడం. తల్లి చావును రాజకీయం చేసాడని తమ్ముడ్ని నిందించడం. దండోరకు వ్యతిరేకంగా వ్యాసాలు రాయడం. పోలీసులకు అనుకూలంగా పని చేయడం చివరకు తన రాజకీయ జీవితం కోసం సొంత తమ్ముడ్ని కిరాయి హంతకులతో హత్య చేయించడం. ఒక పది సంవత్సరాల పసి పిల్లవాడ్ని తగులబెట్టుకొని చనిపోయేలా చేయడం. తమ్ముడి చావు తర్వాత దండోర నాయకుడిగా ఎదగడం. మాదిగల మీద వర్గీకరణ అనే స్వప్నాన్ని మాంత్రించి వదలడం. తన కొడుకు రూమీ రాజయ్య చర్యలతో విసిగి వేసారతాడు. దండోర ఉద్యమాన్ని తిరుగుబాటుకు ప్రతీక తీసుకొని తండ్రికి వ్యతిరేకంగా పెట్రోలు పోసుకొని ఆత్మహుతి చేసుకొని మరణిస్తాడు.

<u>**విజయమ్మ:**</u>

రాజయ్య  భార్య. గ్రేస్ కమల, రూమీల తల్లి, భర్త చాటు భార్య. భర్త పిల్లల మధ్య నలిగిన ఇల్లాలు. రాజయ్యను ప్రేమించి పెళ్ళాడిన యువతి. మొదట్లో రాజయ్య విజయ సంసారం చక్కగా సాగింది. ఆర్థిక స్థాయి పెరిగే కొద్ది రాజసుందరం ప్రవర్తనలో మార్పు వచ్చింది. పిల్లల క్రమశిక్షణ పేరుతో విజయను చిత్రహింసలు పెట్టేవాడు. విజయమ్మ నవ్వు ఎంతో బాగుంటుంది. విశాలమైన నల్లటికళ్ళు. కాఫీ రంగు ముఖం, ఆ కళ్ళు వాసన పువ్వుల్లా ఉంటాయి. పువ్వు విచ్చుకున్నట్లుగా విజయమ్మ నవ్వు ఎంతో అందంగా ఉంటుంది. కానీ రాజయ్య ప్రవర్తనతో విజయమ్మ నవ్వులో, మొహంలో జీవం లేదు. విజయ ఊరికి పోయినప్పుడు ఆమె భాష వింతయాసలో ఆత్మీయంగా ఉంటుంది. విజయది క్రిస్టియన్ ఫ్యామిలీ. రాజయ్యను చర్చిలో పెళ్ళి చేసుకుంది. రాజయ్య పెళ్ళయిన కొత్తలో విజయతో కలిసి చర్చికి వెళ్ళేవాడు. ఆర్థికస్థాయి పెరిగే కొద్దీ కలోనియన్ లెగసీగా క్రిస్టియన్ మతాన్ని తీసిపారేస్తూ విజయను చర్చికి వెళ్ళనీకుండా చేశాడు. విజయకు చర్చికి వెళ్ళాలని  కోరిక. దానితో రాజయ్య ఇంట్లో (ఊర్లో) లేనప్పుడు పిల్లలు కూటమి పెట్టించారు పిల్లలు. విజయమ్మ సంతోషపడింది.

ఈవ్ టీజింగ్‌తో బాధపడుతున్న కమలతో భయపడకూడదని గ్రేస్‌కు ధైర్యం చెప్పింది. ఆ సమయంలో గ్రేస్‌కు నాన్న హింసలకు గురవుతున్న విజయమ్మేన అని అనుమానం కలిగింది. అత్తతో, తోడికోడలు మంచి సంబంధాలను పెంపొందించుకుంది. పల్లెపై కోమటులు దాడి చేసినప్పుడు రాజయ్య పారిపోయి చెరువులో దాక్కొన్నాడు. కానీ విజయమ్మ మాత్రం క్షతగ్రాతులను తల్లి లాగా కాపాడింది. పోలీసులతో పోట్లాడి మరి క్షతగాత్రుల కోసం ఆరితేరిన నాయకురాలిగా పల్లెనంత నడిపించింది. చర్చి ఫాదర్‌ను కూడ నిలదీసిందట
. కానీ తోడికోడలు మాత్రం నా హీరో అని చెబుతుండేది. భర్త చాటు భార్యగా ఉండి చిత్ర హింసలు అనుభవిస్తు ఉంటుంది. పిల్లల యందు బాధ్యతగా ప్రేమగా ఉంటుంది. పిల్లలకు ఎటువంటి కష్టం రాకుండా బాగా చూసుకుంటుంది. కాల క్షేపానికి పావురాల పెంపకం లాంటివి చేపడుతుంది. మరిది ఆకారణ మరణంతో బాగా కుంగి పోయింది. మరిది హంతకుడు తన భర్తే నని తెలిసిన తరువాత ఇంటిలో నుండి బయటికి వెళ్ళి పోవాలని నిశ్చయించకుంది. ఆ నిర్ణయంతో తోటి కోడలు దగ్గర ఉండి కాన్వెంట్ టీచర్ పని చేయడానికి అటో ఎక్కి పెళ్ళి రోజే రాజా సుందరం నుండి దూరంగా వెళ్ళిపోయింది.

<u>**గ్రేస్ కమల:**</u>

ఈ నవలలో ప్రతి మాట కమ్లీ ద్వారానే వింటాం. అమే ఈ కథకు సాక్షిబూతం.

దండోర సభ నేపథ్యంగా నవల మొదలు అవుతుంది. కవ్లీ, రూమీ మొదటి నుండి చివరి వరకుండే పాత్రలు, దండోర సభను గురించి, దాని వ్యవహారాలను గురించి గ్రేస్ రూమి ద్వారా తెలుసుకుంటుంది. బయట ప్రపంచ విషయాలన్నీ రూమీ గ్రేస్‌కు వివరిస్తుంటాడు. తండ్రి రాజయ్య అడుగు జాడల్లో కాకుండా దండోర దారుల్లో నడుస్తున్నందుకు చీటికి మాటికి దండనకు ఇద్దరూ గురి అవుతుంటారు. తండ్రి రాజయ్య ఏలాంటి సౌకర్యాలు లేని రోజుల్లో చదువుకొని పై స్థాయికి వచ్చాడు. పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పించి చదువుకొమ్మంటే సరిగా చదవడం లేదని బెత్తంతో దండిస్తుంటాడు. మానవ హక్కులు పిల్లలకు అవసరం లేదని పిల్లలతో ఆ విషయాలు చర్చించడు. గ్రేస్ వాళ్ళ అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి నప్పుడు అక్కడ చావును సమూహిక దు:ఖంగా అనుభవించడం కొత్తగా అనిపించింది. చనిపోయిన వ్యక్తి  జ్ఞాపకాలను సేకరిస్తు మహిమల గల తప్పెటగా చెప్పుకునే దాన్ని తీసుకుంటుంది.

కరుణ బాబాయి అంటే రాజయ్య పిల్లలిద్దరికి ఇష్టం. గ్రేస్‌కు ఎక్కువగా పీడ కలలు వచ్చేవి. వాళ్ళ మేనత్తతో, అమ్మ మాట్లాడుతూ ఉంటే గ్రేస్‌కు వింతగా అనిపించేది. నానమ్మ ఆదెమ్మ అంటే ఇష్టం. గుండ్లకమ్మ దారిలో మోహిని రియాల్టర్‌ని కలవడం. రాజయ్య సన్మానం కోసం సొంత వూరికి వెళ్ళడం, నానమ్మ ప్రేమను ఆత్మీయతను పొందడం. కాంతం పిన్ని గురించి తెలుసుకోవడం, బాబాయి కరుణ గత వర్తమాన జీవితాలను గుర్తు చేసుకోవడం. దండోర కల్చరల్ కుర్రాళ్ళ స్నేహంతో దండోరాతో  బందం ధృఢమైంది. మొదటి సారి ఊరికి వెళ్లినప్పుడు గుండ్లకమ్మ ఒడ్డును మోహినితో రాజయ్య రాజకీయ స్వరూపం తెలుసుకుంటుంది. రెండో సారి ఊరికి వెళ్ళినప్పుడు చావుల్లో మాదిగల సామూహిక దు:ఖం, మాదిగల సాంస్కృతిక అంశాలు తెలుసుకుంటుంది. మూడవసారి దండోర ఉద్యమ ఉధృతిని స్పష్టంగా తెలుసుకుంటుంది. వర్గీకరణతోనే తమ బతుకులు ముడి పడి ఉన్నాయని మాదిగలు అనుకుంటున్నారని గ్రేస్‌కు అర్థం అయ్యింది.వర్గీకరణ సాధనకు దేవూ ఆత్మహుతి చేసుకున్న విషయం తెలుసుకుని ఏడుస్తుంది. తల్లి విజయతో అన్ని విషయాలు చెప్పుకుంటుంది. దేవూ ఆత్మహుతికి నిరసనగా జరుగుతున్న దండోరా బంద్‌ను చూడడానికి నాజ్ సెంటర్‌కి వెళ్ళింది. గుంటూరులో బయటికి వెళ్ళి పోలీసుల అత్యాచారయత్నానికి గురై తృటిలో తప్పించుకుంటుంది. బడిలో ఈవ్‌టీచింగ్‌కు గురై వ్యక్తిత్వ పోటీలలో 'నేను ప్రధాని కాను ఒక తుపాకిని అవుతానంటుంది'. తమ్ముడు రూమీ అంటే అమితమైన ప్రేమ. తమ్ముడు అక్క ఎక్కడికెళ్ళినా కలసే వెళ్తుంటారు. తండ్రి రాజయ్య కదలికలను ఇద్దరు గమనిస్తు మాట్లాడుకుంటుంటారు. బాబాయి కరుణకు పూర్తి మద్దతుగా ఉంటారు. తండ్రి దండోరాకు వెళ్లకూడదని చెబుతున్న వినకుండా వెళ్తుంటారు. దండోర సభ (బంద్)లో  గ్రేస్ పాల్గొన్నందుకు రాజయ్య విపరీతంగా కొట్టి ఆసుపత్రిలో చేర్చినా దేవూ ఆత్మహత్యను విని దు:ఖిస్తుంది. కరుణ సంతాప సభ నాటికి రాజయ్య దండోరకు మద్దతు ప్రకటిస్తాడు. ఆ సంతాప సభలో గ్రేస్ మహిమగల తప్పెటలో గంటల కొద్ది పాటలు పాడుతుంది. కరుణ హత్య చేయించినది  తండ్రే అని తెలిసిన తర్వాత ఇల్లు మౌనంగా  మారిపోతే, వారి తరుపున మనకు ప్రతి విషయాన్ని తెలియజేస్తుంది. తల్లి ఇంట్లోనుండి వెళ్తుంటే వీడ్కోలు పలుకుతుంది.రాజకీయ జంతువుగా రాజయ్య మారిపోకుండా ఉంటే బాగుంటుందని అనుకుంటుంది. గ్రేసుకు రూమి ఇల్లు చనిపోయింది. ఇక నీవు ఇక్కడ ఉండవద్దని చెప్పి అమ్మతో పంపించడానికి ప్రయత్నిస్తాడు. తమ్ముడి రూమీ తగల పడిపోవడం చూసి తట్టుకోలేకపోయింది, ఎందుకిలా చేశావు? రూమీ మనకిక పునరుత్థానం లేనట్లేనని బాధపడుతుంది. మొత్తం మీద గ్రేస్ నవల అంతా తానై మనల్నీ నవలా కాలానికి, గత, వర్తమాన కాలానికి తీసుకు వెళ్ళి దండోర మాదిగలలో ఏలాంటి చైతన్యం నిలిపిందో ఆ చైతన్యాన్ని రాబోయే యువత పక్క దారి పట్టకుండా ఏలా నిలుపుకోవాలో తెలియజేసింది.

**రూమీ (రావెల రాజశేఖర్):**

రాజయ్య, విజయల కుమారుడు. గ్రేసుకు తమ్ముడు. దండోర సభలలో పాల్గొన్నందుకు తండ్రి రాజయ్య దండిస్తాడు. అయినా రూమి దండోర సభలలో పాల్గొంటూ ఉంటాడు. దండోర సభలలో జరిగే విషయాలను అక్క గ్రేసుకు సాయంత్రం చేరవేస్తాడు. పావురాల పెంపకమంటే ఇష్టం. గిఫ్టుగా తండ్రి కొనిచ్చిన పావురాలను సభకు పత్రిక దండోర నాయకుల చేత ఎగురవేయిస్తాడు. పల్లెలో తండ్రి సన్మాన సభలో ప్రసంగిస్తానంటాడు. పల్లెలో ఉన్నప్పుడు దండోర కార్యక్రమాల్లో పాల్గొంటాడు. కరుణ బాబాయి అంటే ప్రేమ, గౌరవం. తండ్రి చర్యలన్ని రాజకీయ చేష్టలని గ్రేస్తో చెబుతుంటాడు. క్రమశిక్షణ పేరుతో తండ్రి దండిస్తున్నా దండోరా ఉద్యమంలో పాల్గొంటాడు. తను చేయాలనుకున్న పనుల్లో దేనిలో వెనకడుగువేయడు. బాబాయి, పిన్నిలతో సన్నిహితంగా మెలుగుతాడు. ఉద్యమంలో క్రమశిక్షణతో పనిచేస్తాడు. మాదిగల హక్కుల కోసం  అహర్నిషలు శ్రమిస్తాడు.

బాబాయ్ హత్యానంతరం తండ్రి నాయకత్వంలో దండోరలో పనిచేయడానికి ముందుగు వస్తాడు ఆ సమయంలో గ్రేస్ తండ్రి పట్ల అనుమానంగా ఉన్నప్పటికీ రూమీ మాత్రం తండ్రిపై పూర్తి నమ్మకంతో దండోరలో పనిచేస్తాడు. తగులబడిన పసిపిల్ల వాడికి పెట్రోలు డబ్బా ఏలా వచ్చిందని ప్రశ్నించుకొంటాడు. బాబాయ్ని చంపించిన వాడు తండ్రి అని తెలిసి ఏమి చేయలేని స్థితిలో మౌనంగా తిరుగుతుంటాడు. తండ్రి పుట్టిన రోజు పెళ్ళిరోజుల నాడు అమ్మ చేతి వంటతిని, అమ్మను కాంతం పిన్ని వద్దకు వెళ్లమని టాక్సీ వెక్కిస్తాడు. అక్క గ్రేస్కు ఇల్లు శవాల వాసన కొడుతుంది. ఇక్కడ ఉండవద్దు. నీవు కూడా అమ్మ వద్దకు వెళ్ళమని చెబుతాడు. దండోర నాయకుడుగా తండ్రి  కార్యకర్తలతో అమరణ నిరాహారదీక్ష చేస్తానని, చెబుతున్న సమయంలో కార్యకర్తలను చీల్చుకోని తండ్రి ఎదురుగా వచ్చి ఆపండి సార్ డ్రామాలు మీకు ఏమి కావాలి ? పదవులా, డబ్బు.... మా ప్రాణాల అని చెప్పి దండోర ఇప్పుడు మాదిగల మతం అయింది. దాన్ని మళ్ళీ చంపకండి సారని, చెప్పి పెట్రోలు పోసుకోని ఆత్మహుతి చేసుకుంటాడు.దండోరను రాజకీయ జంతువుల చేతుల నుండి విడిపించుకోవాలని, యువతకు సందేహమిచ్చినట్లు  భావించాలి.

**కరుణ కుమార్:**

ఆదెమ్మ, తిరుపతయ్య రెండవ కోడుకు. సూర్యకాంతం భర్త. రవి. అరుణల తండ్రి. కరుణ పుట్టినప్పుడే అన్న రాజయ్యకు ఇష్టం లేనివాడు. చిన్నతనం నుండే వ్యవస్థలలో ఉన్న లోపాలను సరి చేయడానికి సంకల్పించినవాడు. కులం పేరుతో తిట్టిన పంతుల్ని స్కూల్లోకి వెళ్ళి తిట్టి వస్తాడు. చిన్నతనం నుండి హుషారుగా పందెపు గిత్తలా ఉండేవాడు. స్కూల్ ఫైనల్లో చదువు ఆపేసి ఆదెమ్మ (తల్లి)కి పొలం పనుల్లో సహాయం చేసేవాడు. పల్లెలో కుర్రకారుకు కరుణ చిన్న సైజు హీరో. ఏ పనికైన ముందుండేవాడు. పదహారు ఏళ్ళప్పుడు పల్లెలో కూలీ రేట్లకోసం ఉద్యమం చేశాడు. కూలీ రేట్లు పెంచేట్లుచేసి పేదలకు అండగా నిలిచాడు. అప్పుడే కరుణకు కమ్యూనిష్టులతో పరిచయం అయ్యింది. అన్న రాజయ్య సస్పెండ్ అయి పల్లెలో కుర్రాళ్ళతో జులాయి తిరగుతున్నప్పుడు కమ్యూనిష్టులతో (సిపిఐ) డిఇవో చెప్పించి ఉద్యోగం ఇప్పించాడు. వ్యాపారస్తులు గుండాలతో మాదిగ పల్లెపై దాడి చేసినప్పుడు కుర్రోళ్ళను పోగు చేసి రాత్రికి రాత్రి వ్యాపారస్తుల ఇండ్లపై దాడి చేయించాడు. ఆ సమయంలో అన్న రాజయ్య భయపడి చెరువులో దాక్కున్నాడు. మొదట కమ్యూనిష్టుగా, తరువాత నక్సలైట్గా తరువాత దళిత నాయకుడిగా కరుణ పనిచేశాడు. అందరం ఒక్కటేనని కులం, అంటరానితనం లేని రోజులు వస్తాయని చెప్పేవాడు.

కాంతంను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆమెను చాలా ప్రేమగా చూసుకునేవాడు.

ఆమెను ఒక్క మాట అనేవాడు కాడు. ఆమె గర్భవతి అయినప్పుడు అన్ని పనులు తానే చూసుకునేవాడు. ఆమెకు ఎటువంటి కష్టాలు రానివ్వకుండా చూసుకున్నాడు. తల్లి మీద ప్రేమ, గౌరవంతో ఉండేవాడు. తల్లి అనారోగ్యంతో ఉంటే ఆసుపత్రిలో చూపించేవాడు. ఆమె చావు తరువాత వీడ్కోలు ఘనంగా చేశాడు. అలా చేయడం అన్న రాజయ్య రాజకీయం అంటాడు. అన్న పిల్లలపై అమితమైన ప్రేమను చూపిస్తాడు. వారిలో తనదైన చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపుతాడు. వారికి అవసరమైన విషయాలు చెబుతాడు. వారు నడువవలసిన త్రోవలో వారిని నడిపిస్తాడు. పిల్లలను అన్న దండించి, ఆసుపత్రిలో చేర్చినప్పుడు వారిని తన (దగ్గరకు) పల్లెకు తీసుకుపోతాడు. వదిన విజయకు మరిదిపై గౌరవం. దండోర రాజకీయవ్యూహంలో భాగంగా ఎన్నికల బహిష్కరణకు కరుణ పిలుపునిస్తాడు. అది విజయవంతం అవుతుంది. అనుకోని విధంగా మఫ్టీ పోలీసులు కరుణ ఇల్లు సోదా చేసి కరుణను అరెస్టు చేసి తీసుకువెళతారు. కరుణను విడుదల చేయాలని దండోర కుర్రాళ్ళు బంద్ చేస్తారు. దీంతో అధికార పార్టీకి దండోర ఉద్యమాన్ని పట్టించుకోవడం తప్పని సరైంది. దీనిలో భాగంగా అధికార పార్టీ కరుణకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని ప్రకటిస్తుంది. కరుణ మొదట టిక్కెట్ నిరాకరించి, కార్యకర్త బలవంతంపై అంగీకరిస్తాడు. ఎమ్మెల్యే టికెట్‌కు తమ్ముడు అడ్డం వచ్చాడని రాజయ్య తమ్ముడిని హత్య చేయిస్తాడు. దీనితో కరుణ కుమార్ పాత్ర ముగిసిపోతుంది.

**<u>సూర్య కాంతం:</u>**

ఆదెమ్మ కోడలు, కరుణ భార్య. నవలలో ఆదెమ్మ తరువాత చెప్పుకోదగ్గ పాత్ర. అందుకే కాంతం నా హీరో అని విజయమ్మ అంటుంది. ఈ నవలలో ముఖ్యమైన పాత్రల్లో ఒక్కటి. ఆరుగురి అమ్మాయిల్లో కాంతం చివరి అమ్మాయి. చిన్నప్పుడు గొడ్డలిపడి పాదం రెండుగా చీలిపోయింది. కుంటి పాదం వల్ల బాల్యం అంతా పిల్లలతో ఆడలేకపోయింది. ఎనిమిది సంవత్సరాల నుండే పొలం పనులు చేసేది. కాంతం 6వ తరగతి వరకు చదివింది. ఒక్కసారి వింటే మర్చిపోయేది కాదు, జ్ఞాపకశక్తి ఎక్కువ. కాంతం శరీరం రంగు వెన్నెల రంగులో ఉండేది. ముఖం కళగా ఉండేది. కాంతం తండ్రి ఏపని దొరికితే ఆ పని చేసేవాడు. తల్లి ఆసాముల ఇండ్లలో అంట్లు తోమేది. నలుగురు అక్కలకు పెళ్ళి చేశారు. ఒక అక్క టిబితో చనిపోయింది. కాంతం ఇంటిపనులు బాగా చేసేది. మినుగురులు అంటే బాగా ఇష్టం. సిమోటీ కష్టాలు కాంతానివి. పల్లెలో చర్చి రాక కాంతానికి కొత్త ఉత్సహాన్ని ఇచ్చేది. ఆ పాటలు కాంతానికి ఎక్కడ లేని ధైర్యాన్ని ఇచ్చేవి. రూపం లేని దేవుడు వెన్నంటి ఉన్నట్లు అనిపించేది.

ఆలాంటి సమయంలో కాంతానికి కరుణ పరిచయం అయ్యాడు. అతను కూడా తనదైన పాటలను వెంట పెట్టుకోని వచ్చాడు. ప్రజలు పాఠాలు చెప్పాడు. చర్చి పాటలతో ఈ పాటలను కాంతం పాడుకోవడం మొదలు పెట్టింది. కాంతం కరుణను ప్రేమించింది. ఇద్దరు కలిసి నడిచేటప్పుడు కాంతానికి అంగ వైకల్యం ఉన్నదానిలా కాకుండా మాములుగా నడిచేది. ఇద్దరు పెళ్ళి చేసుకున్నారు. కరుణ అజ్ఞాతంలోకి వెళ్ళాడు. ఒంటరితనంలో అలంకరణ మీద, సినిమాలు పిచ్చిపిచ్చిగా చూసి, ఆ మాయాలోకంలోనే విహరించేది. రెండు గ్లాసుల పద్ధతిని ప్రశ్నించి, హొటల్ వాడిని కొడుతుంది. ఆ ఘటన నుండి కరుణ అండతో బయట పడింది. కాంతాన్ని కరుణ ఎప్పుడు ఒక్క మాట అనలేదు. ఏ దురలవాటు లేని భర్తను ఎలా వేధించాలో తెలియక ఇబ్బంది పడుతూ ఉండేది. ఒక్కసారి అత్త ఆదెమ్మతో కరుణ గురించి గొడువ పెట్టుకునేది.

కరుణ నక్సలైట్స్‌తో చేరే సమయానికి ఇద్దరు పిల్లలు. గర్భవతి అయినప్పుడు కరుణ

కాంతంను కంటికి రెప్పలా చూచుకున్నాడు. అన్ని పనులు తానే చుచుకున్నాడు. కరుణ అజ్ఞాతంలోకి వెళ్ళినప్పుడు కాంతం కూలిపనులకు వెళ్ళేది. ఇంట్లోనే పలకలు తయారు చేసేది. చాలా ఏళ్ళ తర్వాత చర్చికి వెళ్ళడం మొదలు పెట్టింది. జీవితం తలపై ముళ్ళకిరీటంలా ఉన్న ఎవర్ని నిందించలేదు. పోలీసుల బెదిరింపులకు భయపడలేదు, బెదరలేదు.

అంగన్ వాడీ బడిలో ఆయాగా ఉద్యోగం వచ్చినాక ఇంటి పరిస్థితి కొంత మెరుగైంది. కరుణ ఎన్‌కౌంటర్ అయ్యాడని వార్తవచ్చినా అతడి శవం కోసం వెళ్ళలేదు. కర్మకాండలు జరుపలేదు. తన పనికి, తన పిల్లలను బడికి పంపింది. అందుకే విజయ ' కాంతాన్ని అవి చాలా గొప్ప మనిషి' అంటుంది. ఊర్లో రాజయ్య సన్మానసభలో స్టేజి ఎక్కి ఏడుస్తూ "ఆరేళ్ళ నరకంతో ఏమయ్యాడండీ ఈ నాయకుడు" అంటూ ఉపన్యాస కాగితాలు విసిరి వేసి స్టేజీ దిగిపోతుంది.

ఉద్యమంలో చురుకుగా పాల్గొనె దండోర కుర్రోళ్ళకు వంట చేసి పెట్టింది. బావ రాజయ్య పిల్లలను ప్రేమగా చూసేది. అత్త ఆదెమ్మతో సవ్యంగా నడుచుకునేది. తోడి కోడలకు ఆదర్శవంతంగా నిలిచింది. పిల్లలకు మంచి తల్లిగా, మంచి భార్యగా ఉంది. కరుణ కుమార్ ను మఫ్టీ పోలీసులు అరెస్ట్ చేసినప్పుడు దండోర కుర్రోళ్ళు రాక ముందే ధైర్యంగా – నేను దండోర మనిషినే నన్ను అరెస్ట్ చేయండి అని ఎదురుతిరిగింది. పోలీసులు నిర్ఘాంతపోయిన ఆమెను కొడుతున్నప్పుడు 'మాదిగలను చంపండిరా' అంటూ ఎదురు తిరిగింది. కరుణ అరెస్ట్‌ను నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేసి విడిపించుకుంది. అలాగే ఇంట్లో పనులు చక్కగా చేసుకుంటుంది. దండోర మాదిగలలో ఒక రకమైన గుండె ధైర్యం తీసుకు వచ్చిందని భావించింది. మాదిగలలో వచ్చిన మార్పును గుర్తించి ఆ మార్పు కోసమైన దండోర అవసరమని చెప్పింది. రాజయ్య మూర్ఖుడు కాదు, చదువు కున్నవాడు. దండోరకు ఎందుకు వ్యతిరేకమో తెలియడం లేదని ఏమి చెబితే అర్థం అవుతుందని అనుకుంది. ఆదెమ్మ చనిపోతే దు:ఖించింది. పిల్లలకు నానమ్మ తన పూర్వీకుల దగ్గరకు వెళ్ళిందని చెప్పి ఓదార్చింది. ఆమె ఇక రాదని చెప్పి ఆమెకోసం పిల్లలను దు:ఖించమంది. అత్త ఆదెమ్మ మరణిచక ముందు గుండ్లమ్మ ఒడ్డుకు తీసుకు వెళ్ళి పూజలు చేయించింది. మరణానికి ముందురోజు అత్తకు మంచి విందు చేసింది. కరుణ హత్య తర్వాత దండోర వారు ఇచ్చిన 10 లక్షల చెక్కును, రాజయ్య ఇచ్చిన 2 లక్షల చెక్కును సున్నితంగా తిరస్కరించిన ఆత్మ గౌరవం గల వ్యక్తి.

**<u>జడ్జి నాగభూషణం:</u>**

దళిత జడ్జి, రాజయ్యకు మంచి స్నేహితుడు, దూరపు బంధువు. నిజాయితీ గుండె ధైర్యం గల జడ్జిగా ఆయనకు పేరు. జడ్జి జీవితంలో సంఘటనలు ఏమికావు. అన్ని అవమానాలే, భయం గొలిపే ఒంటరి తనం, నాగభూషణం గొప్ప భక్తుడు. హింస నుంచి విముక్తి దొరుకుతుందేమోనని చర్చికి వెళ్ళేవాడు. కాని అలాంటిదేమి దొరకలేదు. ప్రభువు కూడా ఆయన్ని రక్షించకపోయాడు. చదువులో, ప్రతిభకు విలువ ఉంటుందేమోనని గొప్ప గొప్ప చదువులు చదివాడు. అయిన కూడ అంటరానివాడు గానే మిగిలిపోయాడు. ఒక పలకరింపు ఉండదు, చిరునవ్వు ఉండదు. ప్రతిభకు గుర్తింపు లేదు. ఒక ఆకు పచ్చ మొక్కకు నీళ్ళకు బదులు నిప్పులు పోస్తుంటే అది ఎన్నాళ్ళు బ్రతుకుంది. చివరకు జడ్జి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎక్కడ ఖననం చెయ్యాలనేది ప్రశ్న. చర్చి బరియల్ గ్రౌండ్‌లోనే పూడ్చాలని భార్య, పిల్లలు అన్నారు. అందుకు పూర్వలని చర్చి వాళ్ళు ఒప్పుకోలేదు. తల్లిదండ్రులు తమ ఊరికి తీసుకువెళ్ళాలని గొడవ. చివరకు రాజయ్య జోక్యంతో సమస్య తీరింది. చర్చి బరియల్ గ్రౌండ్‌లోనే ఖననం చేశారు. నాగభూషణం సంతాప సభలో రాజసుందరం ఉ

పన్యాసమిచ్చాడు. ఆ
ఆ ఉపన్యాసంలో జడ్జి ఎదుగుదల, వివక్షతలను పూసగుచ్చినట్లు వివరించాడు. దళితుల సమస్త వివక్షతకు నాగభూషణం పాత్ర ప్రతీక.

.**<u>మరియమ్మ:</u>**

జడ్జి నాగభూషణం భార్య, భర్త చాటు భార్య, ఒక అమ్మాయికి తల్లి. చాలా అమాయకమైన మనిషి, భర్త చావును జీర్ణించుకోలేక పోయింది. భర్త జ్ఞాపకాలతో ఒక ముద్ద కూడ ముట్టలేదు. గ్రేస్, విజయలు వాళ్ళకు తోడుగా వారం రోజులు వాళ్ళ ఇంటిలో గడిపారు.

**<u>సరోజ:</u>**

జడ్జి కుమార్తె. ఒక్కతే కూతురు. ఇంటర్ చదివింది. అమ్మ కంటే కాస్త ధైర్యంగా ఉంది. అర్ధరాత్రి పెద్దగా ఏడుస్తున్నట్లుగా ఉండేది. పగలు సరోజ మౌనంగా ఉండేది. జడ్జి మరణించక ముందు గలగల మాట్లాడేది. గార్డెన్‌లోకి తీసుకువెళ్ళి పూల చెట్లు చూపించేది. ఇప్పుడు చాలా మౌనంగా అయిపోయింది. సర్వస్వం కోలుపోయిన దానిలా మారిపోయింది.

**<u>రాణమ్మ:</u>**

రాజయ్య చెల్లెలు. రవి అనే ప్రైవేట్ లెక్చరర్ తల్లి. కోడుకును పోలీసులు అరెస్టు చేసారని విడిపించమని అన్న దగ్గరకు వచ్చింది. దేవుడు మీద భారం వేయమని రాజయ్య ఓదార్చాడు.

**<u>రవి:</u>** రాణమ్మ కొడుకు. ఎస్సీ (టెంపరరీ) లెక్చరర్, నక్సల్స్ కోరియర్ అని పోలీసులు అరెస్టు చేశారు. మీ నాన్న ద్రోహి... ప్రపంచం కోసం ఏమిచేశాడు. పెద్దదానివవుతున్నవు. ఈ ఇల్లు, మీ నాన్న సర్వపరిష్వంగం లాంటివి, బయటకొచ్చి ప్రపంచాన్ని చూడు అని చెప్పేవాడు. రవి కూతుర్ని గ్రేస్ 'అంగారం' అని పిలుస్తు ఉందేది. రవి ఆధునిక భావాలు కల యువకునిగా ఈ నవలలో చంద్రశేఖర్‌గారు చిత్రీకరించారు. ఈ పాత్ర చాల తక్కువ నిడివిలో ఉంటుంది.

**<u>శారా:</u>**

గ్రేస్ అమ్మమ్మ ఊరిలో చిన్న అమ్మాయి గ్రేస్‌కు దగ్గరుండి ఊరంతా చూపింది. మాదిగ పల్లెలో మరణించిన కళాకారుడు గురించి, ఆయన అలవాట్లు గురించి గ్రేస్‌కు తెలియజేస్తుంది. గ్రేస్ ఆయన తప్పెట తనతో పాటు తెచ్చుకుంది. ఆ తప్పెట నవలలో దళిత చరిత్రకు, చైతన్యానికి ప్రతీక. ఆ చైతన్యమే గ్రేస్‌ను ఎడిపించింది. నడిపించింది.

**<u>డేవిడ్ (దేవూ):</u>**

దేవూ చదువుకునే సమయంలో తల్లిని పట్టించుకోలేదు. తల్లితో ఎప్పుడూ గొడవ పడుతుండేవాడు, వాదించేవాడు. తల్లికి పిచ్చిపట్టిందని చెప్పేవాడు. తండ్రి ఎటో వెళ్ళిపోయినా తల్లి కష్టపడి చదివించింది. తల్లికి గర్భాశయ క్యాన్సర్, దేవూ ప్రేమ విఫలమై మైగ్రేన్ తలనొప్పితో బాధపడేవాడు. దండోర ఉద్యమంలోకి రావడంతో ఆత్మీయుల ప్రేమలో అతడిలో మార్పు వచ్చింది. ఇప్పుడతడికి తల్లి ప్రియమైన వ్యక్తి. రోజు తల్లికి సపర్యలు చేస్తాడు. తల్లికి మరణం రాకుండా చాలా జాగ్రత్తగా చూచుకుంటున్నాడు. అయినా బొంబాయిలో ఆసుపత్రికి చికిత్సకి తీసుకెళ్ళినా ఆమె బ్రతకలేదు. దండోర ఉద్యమంలో చురుకైన కార్యకర్త. తల్లి మరణంతో కృంగిపోయాడు. ఒక వైపు తల్లి చావుతో పిచ్చివాడు అయ్యాడు. ( ఆహారం లేక) సి.యం. అసెంబ్లీలో దండోరాను తెలివి తక్కువ ఉద్యమంగా అన్నందుకు విస్కీ తాగి తాగి ఆహారం లేక కలెక్టర్ ఆఫీసు ముందు మా అవమానాన్ని ఎటూ తీసేయలేరు ఇప్పుడు ఈ పిడికెడు మెతుకుల్ని కూడా తిరస్కరిస్తున్నారు. అంటూ ఎలుగెత్తి నినాదాలు చేస్తూ ఒంటిపై కిరోసిన్ పోసుకోని దండోర కోసం ఆత్మహుతి చేసుకుంటున్నా అని ప్రకటిస్తూ మంటల్లో ఆహుతయ్యాడు. 'కాలిపోయాడు, దేవుడు చనిపోయాడు' అని దండోర కుర్రోళ్ళు బంద్ చేశారు.

**దిలీఫ్ (డిల్లీ):**

ఎం.ఫిల్‌లో పరిచయమైన స్నేహితురాలిని ప్రేమించాడు. పెళ్ళి చేసుకుందామనుకున్న అమ్మాయి 2 సంవత్సరాలలో ఉద్యోగం సంపాధించలేదనే నెపంతో అతన్ని వదిలేసింది. వేరే పెళ్ళి చేసుకుంది. ఆ దు:ఖంతో తనను తాను పోగొట్టుకున్నాడు. అతని గాయం బాగా లోతైంది. కత్తి అతని శరీరంలో భాగమైంది. తనను తాను యోధుడనుకుంటాడు. అతనిప్పుడు స్త్రీలను గాయపరిచే పనిలో పడ్డాడు. దండోర ఉద్యమంలోకి వచ్చిన తరువాత ప్రేమకు మరో రంగు ఉందని అర్థం చేసుకున్నాడు. ప్రేమ నిరంతర గాయమని తెలుసుకున్నాడు. ఉద్యం అతన్ని మళ్లీ ప్రేమ జీవిని చేసింది. ప్రజలను ప్రేమిస్తున్నాడు. తనను తాను ప్రేమించుకుంటున్నాడు.

**తబిత (సబిత):**

అసలు పేరు సబిత, కవిత్వం చదువుతుంది. కొంచెం సిగ్గు ఎక్కువ. దండోర కల్చరర్ సెంటర్‌లో కవిత్వం చదువుతుంది. దండోర ఉద్యమంలో చురుకుగా పాల్గొంటుంది. దండోర సభల్లో పాటలు పాడుతుంది.

**కాలిక్ (క్రిష్టోపర్):** దండోర కల్చరల్ సెంటర్ కుర్రాడు. మంచి డ్యాన్సర్.

**కనకయ్య:**

చిందు కళాకారుడు, పల్లెటూరు మనిషి. వేషం రాయలసీమ ప్రాంతం యాస, చిందు ప్రదర్శన అద్భుతం. అతని చేతికి రెండు వేళ్ళు నరికేశారు. మాదిగ హక్కులుగా భావించాలి.

**సుబ్బమ్మ:**

చేతికర్రతో వణికే శరీరంతో ముడుతలు తేలి పెట్లి పోయింది. గుంటూరులో 20 సంవత్సరాలుగా ఉంటుంది. భర్త పోయాడు. భర్త పింఛన్‌తో బ్రతుకుతుంది. లంచం అడిగితే కత్తితో బెదిరిస్తుంది. ఈ రోజు బస్సులో పరుసు మీద చేయి వేసినవాడి చెయ్యి కోశాను. మొండిదాన్ని ఎవరకి భయపడేదాన్ని కాదు. దండోర పిల్లలు నీ గురించి చెప్పింది నాకు నచ్చింది. నేను ఇప్పుడు దండోర కార్యకర్తను " ఇవాళ నుంచి ప్రతిరోజు నీ ఆఫీసుకు వస్తాను. నీ గది ముందే నిరాహారంగా కూర్చుంటాను. నువ్వు మారేదాక" అని రాజయ్యను హెచ్చరించింది. ఆమె చెప్పినట్లే రోజు ఆఫీసు ముందు ప్రత్యక్షం అయ్యేది. ఆమెను చూస్తేనే రాజయ్య ఆఫీసుకు వెళ్ళాలంటే భయపడుతున్నాడు.

**ముసలి వాళ్ళు (ఇద్దరు):**

విజయమ్మ చిన్నమ్మలు, అంత ఎత్తు, లావు ఉండేవారు. ప్రత్యేకంగా సృష్టించినట్లు ఉన్నారు. ఒకామె ఇప్పటికీ పొలం పనులు చేస్తుంది. ఆడవాళ్ళు అంత ఆరోగ్యంగా బలంగా ఉండటం గ్రేస్‌కు ఆశ్చర్యం. గరకుగా, మొరటుగా ఉన్న ఆ ముఖాల్లో ఒక ధీమా ఏవరిని లెక్క చెయ్యనితనం కనపడింది. అతి సాదారణమైన విషయాలు కూడా గంటలు గంటలు మాట్లాడుకుంటుంటే గ్రేస్‌కు వినాలనిపిస్తుంది. వాళ్ళు సాధారణ విషయాలను కూడ ఆసక్తికరంగా మాట్లాడుకుంటారు. రాజయ్యని సహాయం కోరడానికి వచ్చారు.

**మోహిని:**

మాజీ నక్సలైట్, రియాల్టర్, గుండ్లకమ్మ నది ఒడ్డున గ్రేస్‌కు కనపడింది. సెజ్ భూమి సర్వేకు వచ్చింది. ఖరీదైన చీర నగలలో దేవకన్యలా ఉంది. గ్రేస్‌ను రాజసుందరం కూతురని గుర్తు పట్టింది, పలకరించింది. రాజయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారం గురించి గ్రేస్‌తో చెపింది.

**పల్లెలో ముసలి వాళ్ళు:**

ఆదాం తాత, మాంసం కూర తెచ్చిన ముసలామె. ప్రేమతో దున్నకూర తీసుకువచ్చి పెట్టింది. మాదిగ పల్లెను బహిష్కరించినప్పుడు గుండ్లకమ్మ ఒడ్డున గ్రేస్‌కు కత్తిపోటులకు

గుర్రైన వ్యక్తి ( మాదిగలకు ప్రతీక) కనిపించాడు. ఆ నది ఒడ్డునే మరొక స్త్రీ కనబడింది. అక్కడ గొప్ప దండోర సభ జరుగబోతుందని చెప్పింది.

**అనిల్:**

దండోర కార్యకర్త. బొమ్మలు గీస్తాడు. ఆదెమ్మ బొమ్మను క్షణాల్లో పెన్సిల్‌తో గీసి రూమీకి బహుమతిగా ఇచ్చాడు.

## 4.2.4. దండోర నేపథ్యం :

మాదిగలు ఘనమైన చరిత్ర కలిగినవారు. పెద్దింటి వారుగా పిలువబడుతున్నారు. లెక్కకు మించి ఉన్న కులాలలో అతిపెద్ద సంఖ్యాబలం కల ఏకైక కులాల్లో మాదిగ కులం ఒకటి. గతమెంతో ఘనమైన వారిగా ఉప కులాలతో కీర్తించబడుతున్న మాదిగలను బ్రాహ్మణీయ భావజాలం అట్టడుగుకు తొక్కింది. అంబేద్కర్ రాజ్యాంగరచనతో ఎస్సీ, ఎస్టీలలో కొన్ని మార్పులు అనివార్యమయ్యాయి. ఆ మార్పును ఎస్సీలలో మాలలు అగ్రకులంగా ఎదగడానికి దోహదపడింది. బ్రిటిష్ వారి రాకతో దేశంలో అంతకు ముందు లేని కొన్ని సౌకర్యాలు కింది కులాలకు చేరువయ్యాయి. వాటిని మాలలు ముందుగా అందిపుచ్చుకున్నారు. అందులో చదువు ముఖ్యమైనది. ఆ చదువు అందిపుచ్చుకున్న కొంతమంది మాదిగలు క్రైస్తవ్యానికి దాసోహమన్నారు. ఆ నేపథ్యం నుండే సమాజాన్ని అర్థం చేసుకున్నారు. ప్రశ్నించడానికి బదులు ప్రార్థించడం వరకే వారు పరిమితమయ్యారు.

"గత అరవై ఏళ్ళలో మాదిగల్లో చదువుకున్నది కొద్దిమందే అయినప్పటికీ చెప్పులు కుట్టినంత మామూలుగానే అక్షరాతో గేయాలు, పద్యాలు, కావ్యాలు, ఖండకావ్యాలు సృజించారు. ఉదా॥ జాషువా "గబ్బిలం" ఒకటి" (క్రైతునకల దండెం :2008.6) ఈ రచన ప్రేరణతో అనేక మంది కవులు అంటరానితనంను వస్తువుగా ఎంచుకొని కావ్యాలు రాశారు. దానికంటే ముందు మాదిగల ప్రాచీనతను తెలియ చెప్పేదే జాంబవ పురాణం. ఆది జాంబవులు, కర్దమ, మాదంగ మమామునులు, అరుంధతి, మొ॥లైన మహాదిగుల గురించి వివరిస్తుంది. మాదిగులకు విశిష్టమైన గతం ఉన్నప్పటికీ వారు అన్ని రంగాల్లో నిరాదరణకు గురయ్యారు. అందుకు కారనం వారిలో అనైక్యత, నిచ్చెనమెట్లు కులవ్యవస్థ. "నిచ్చెనమెట్ల వ్యవస్థ ప్రత్యేక లక్షణాలైన వర్ణశ్రేణి, అంతర్వివాహం, సాంప్రదాయవృత్తి, సహపంక్తి ఆచారాలపై నిషేదాలు, వేరు వేరు నివాస ప్రాంతాలు, వేరువేరు నీటి బావులు, వేర్వేరు గుడులు, కులాంతర వివాహాలపై నిర్బంధాలు….. మొదలైన క్రమశ్రేణి విలువలతో మాల మాదిగలు ఎన్నడో విభజించి బడివున్నారు. ఈ నిచ్చెన మెట్ల వ్యవస్థే మాదిగలు, రెల్లి, మెహతార్ వంటి దళిత కులాలకు రిజర్వేషన్ల ఫలితాలు అనుభవించకుండా, తమ వాటా దక్కకుండా చేసింది అని" ప్రొ. ముత్తయ్య ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?( ముత్తయ్య :2007.6) అనే వ్యాసంలో అభిప్రాయపడ్డారు. పై అభిప్రాయాన్నే Protection and inequadity among backward groupsఅనే వ్యాసంలో 1986(EPW(Economics and Political Weekly)లో ఉమారామస్వామి అనే సామాజిక శాస్త్రవేత్త తెలియజేసారు.

మాల మాదిగల మధ్య వ్యత్యాసాలు, కుల పట్టింపులు చరిత్రలో నమోదయ్యాయి. భాగ్యరెడ్డి వర్మ కుల పక్ష వైఖరికి వ్యతిరేకంగా అరిగె రామస్వామి(మాల) మాదిగల సంక్షేమం కొరకు అరుంధతీయ మమాసభను ఏర్పాటు చేశారు. " స్వాతంత్ర్యపోరాటంలో ఇటు అంబేద్కర్, అటు గాంధీ రంగప్రవేశం చేయడంతో ఎన్నో ప్రయోజనాలు సిద్ధిస్తాయని అందరితో పాటు మాదిగలు ఆశించసాగారు. అటు అంబేద్కర్, ఇటు జగజీవన్‌రాం తవ్వి రత్నాల రాసుల తమ నెత్తి కెత్తుతారని మాదిగలు ఎదురు చూశారు. సంజీవయ్య ముఖ్యమంత్రి కాగానే తమ పనులు బాగా జరుగుతాయనీ నిరీక్షించారు" (ఇనాక్ : 2013. దండోరా) కుడి ఎడమల

దగా దగా అనే వ్యాసంలో అభిప్రాయపడ్డారు. మాదిగలకు నిరీక్షణే మిగిలింది. ఆ నిరీక్షణ నుండి "1972 నాటి మంత్రి టి.ఎన్.సదాలక్ష్మి మాదిగలకు అన్యాయం జరుగుతూ ఉందని తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు బి.సి.ల మాదిరిగా యస్.సి.ల రిజర్వేషన్ వర్గీకరించవలసిందిగా డిమాండ్ చేశారు" (పైదే).

అంతకు ముందు భారత ప్రభుత్వం 1965లో నియమించిన లోకూర్ కమీషన్ షెడ్యూల్ కులాల్లో 28 కులాలు రిజర్వేషన్ల వలన లబ్ధిపొంది అభివృద్ధి చెందాయని వాటిని యస్.సి. జాబితా నుండి తొలగించాలని ఇచ్చిన రిపోర్ట్‌లో ఆంధ్రప్రదేశ్ నుండి మాలలు ఉన్నారు. 80వ దశకంలో బహుజన సమాజ్ పార్టీలో మాదిగలకు సముచిత స్తానం కల్పించలేదు. ప్రజా ఉద్యమాల్లో మాలలో కలిసి పనిచేసిన మాదిగలు కార్యకర్తలుగానే మిగిలిపోయారు. మాలలు నాయకులుగా ఎదిగారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లోనే కాక మిగిలిన అన్ని విషయాల్లో మాలలే లబ్ధిపొందుతున్నారని మాదిగలు గమనించారు. మాదిగల్లో నిరుద్యోగం పెరిగింది. దాంతో వారిలో అసంతృప్తి తీవ్రమైంది.

1970లో రాష్ట్రంలో వెనుకబడిన 93 కులాల వర్గీకరించడంతో మాదిగలు చైతన్యవంతమయ్యారు. దాంతో అప్పటి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని 80వ దశకంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వాన్ని మాదిగలు ఎస్సీలను వర్గీకరించాలని డిమాండ్ చేశారు. 1980లో ప్రత్యేక రిజర్వేషన్ల ఉద్యమానికి నాంది ప్రస్తావన చేశారు. ముదిగొండ మాధవరావు తన పేరు చివర మాదిగ అనే కులం పేరు పెట్టుకున్నారు. మొట్టమొదటిసారిగా మాదిగ అనేక కులం పేరుతో "ఆంధ్రప్రదేశ్ మాదిగ సంఘం 1982లో డా. బి.విద్యాకుమార్ నాయకత్వంలో ఏర్పడింది. మాదిగలకు ప్రత్యేక రిజర్వేషన్లు కావాలని ఒక సాహసవంతమైన ఉద్యమాన్ని అసెంబ్లీ జరుగుతుండగా అసెంబ్లీలో కరపత్రాలు విసిరి ఒక పోరాట దశకు పునాది వేసింది" (ముత్తయ్య : 2007.15) దాంతో పన్నెండు మంది మాదిగ కార్యకర్తలకు సుమారు నెల రోజులు రాష్ట్ర అసెంబ్లీ జైలుశిక్ష విధించింది. ఈ సంఘటన మాదిగలకు వర్గీకరణ మీదున్న ప్రగాఢ వాంఛను దాని సుదీర్ఘచరిత్రకు నిలువెత్తు సాక్ష్యం గా రికార్డు అయింది.

ఈ నేపథ్యం నుండి దళితులంటే మాలలే కాదు మాదిగలు, మిగిలిన ఉపకులాలు కూడ దళితులే. మేమెంతో మాకు అంత వాటా రావాలని నినదిస్తూ మాదిగలుగా దండోరా ముందుకు వచ్చింది.

### 4.2.5. మాదిగ దండోరా ఉద్యమ ఆవిర్భావం - వికాసం :

పైన పేర్కొన్న విషయాలన్ని దండోరా ఉద్యమానికి నేపథ్యం అయ్యాయి. "గతంలో కొనసాగిన వర్గపోరాటలు, దళిత ఉద్యమాలు మాదిగల కనీస సమస్యలను గుర్తించలేక పోయాయి. పరిష్కారాన్ని ఇవ్వడంలో జరిగిన వైఫల్యాలు కూడా దండోరా ఉద్యమ ఆవిర్భావానికి కారణమైనాయి" (కృపాకర్ మాదిగ. 2001.15) అని తెలియజేసారు. అంతేగాక, "మమ్మల్ని మా కూడు తిననివ్వండి. మా యింట్లో ఉండనివ్వండి. మా గుడ్డ కట్టుకోనివ్వండి, మా కూడు, గూడు, గుడ్డ దోచుకోవద్దండి" (ఇనాక్ : 2013.15) అని 'దండోరా సోదరత్వం' వ్యాసంలో చెప్పారు. 1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో 20 మంది మాదిగ యువకులతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావం జరిగింది.

తమ హక్కుల సాధన కోసం "మాదిగ యువకులు ఒకవైపు సవర్ణులతో సతమతమవుతూ, మరోవైపు మాల సోదరుల పోటీకి తట్టుకొని నిలబడలేకపోయినందువల్ల వాడ వాడా, ఊరూరా, ప్రతి జిల్లాలో రాష్ట్ర వ్యాప్తంగా ఆవేదన పడుతున్న నేపథ్యంలో దండోరా పుట్టింది. మాదిగల వైయక్తిక చైతన్యం సామాజిక చైతన్యంగా మార్చడానికి ఎనభై ఏళ్ళ" (ఇనాక్: 2013.30)

సమయం పట్టిందన్నారు. దండోరా ఆవిర్భావం తర్వాత ప్రకాశంలో వెలిగి రాష్ట్రమంతట వెలుగును ప్రసరింపజేసింది. రాష్ట్రస్థాయి నుండి వాడస్థాయి వరకు కమిటీగా ఏర్పడి మాదిగలు ఉద్యమించారు. యం.ఆర్.పి.యస్.కు అనేక అనుబంధ సంఘాలు ఏర్పడి వాడివాడిగా అడుగులు వేస్తూ ఉద్యమించారు.

దండోర ఉద్యమానికి ఆలంబనగా దళితకవుల నుండి మాదిగ కవులు విడివడి సాహిత్యవేదికలతో ఉద్యమానికి మద్దతు పలికారు. కవిత, కథ, పాటలతో ఉద్యమానికి బాసటగా నిలిచారు. అందులో భాగంగా నాగప్పగారి సుందర్రాజు ఆధ్వర్యంలో హైదరాబాదు విశ్వ విద్యాలయం నుండి మాదిగ సాహిత్య వేదికను స్థాపించి "మాదిగలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక రాజకీయాది రంగాలలో అన్యాయం జరిగింది, జరుగుతున్నది.... మాలల తర్వాత మాదిగలు కూడా కాస్తో కూస్తో రాజ్యాంగబద్ధమైన అవకాశాలను ఉపయోగించుకొని అభివృద్ధి చెందారు. ..... నామకావాస్తి ప్రాతినిధ్యం లేని డొక్కలాది కులాలు చాలా ఉన్నాయి" (సుందర్‌రాజు, నాగప్పగారి : 1997.11) యస్.సి.లలో పై కులాలు ఐకమత్యమనే పేరుతో కింది కులాలకు అవకాశం ఇవ్వకపోగా అణచి వేసి ఉంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. "ఎవరు ఎంత గింజుకు చచ్చినా అనివార్యమైన చారిత్రాత్మక న్యాయమైన మాదిగల ఉద్యమం ఆగదు. ఆపడం ఎవరి తరంకాదు. 'రక్తాన్నైనా చిందిస్తాం, ఏ.బి.సి.డిలు సాధిస్తాం. మా తలలు తెగిపడ్డ చోటే మేము మొలకెత్తుతాం. అస్థవ్యస్థంగా లోపభూయిష్టమైన ఈ వ్యవస్థ స్థానే నూతన సమత సమాజాన్ని స్థాపిస్తాం. ఇది మాదిగ నినాదం. మహోన్నతమైన ఈ ఆశయ సాధనలోనే మాదిగలు అవిశ్రాంతంగా పరిశ్రమించాల్సి ఉంది" అని మాదిగలకు దిశ నిర్దేశం చేశారు.

అదే సంకలనంలో కొల్లూరి చిరంజీవి మాదిగ కవులకు మార్గ నిర్దేశం చేశాడు. "Madiga Sahiya Vedika (MSV) should be by Madiga Poets, of the Madiga poets, but not for Mediga poets. M.S.V. should be for Mediga poets and as well for entire Bahujan Samaj. చరిత్రలోని వాస్తవాలను వెలికితీస్తూ కర్తవ్య నిర్వహనలో తమవంతు బాధ్యతను తెలియజేస్తూ, సోదర మాదిగలకు ఆత్మస్థైర్యాన్ని నూరిపోస్తూ, అడుగడుగున అండగా నిలుస్తూ, తమ గమ్యం నుండి ఏమాత్రం ప్రక్కకు తొలగక ముందుకు సాగిపోవాల్సిన అవసరాన్ని ఎల్లవేళలా గుర్తుంచుకుంటూ మాదిగ కవులు ముందుకుపోతారని, కులాన్ని కులాల చరిత్రను, కులాల psylosophy, psychology, scoikology\ను లోతుగా విశ్లేషిస్తూ బ్రాహ్మణిజం యొక్క ప్రభావానికి ప్రత్యామ్నాయాన్ని స్పష్టంగా ప్రతిపాదించడం"(సుందర్రాజు, నాగప్పగారి:1997) అలవరచుకోవాలని చివరిమటలో మాదిగల కవులకు కర్తవ్యబోధ చేశారు.

అందుకు అనుగుణంగా దండోరా ఉద్యమం మాదిగలకు సాహిత్యంతో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొని, మరుగునపడిన మాదిగ కళా సంస్కృతి రూపాన్ని వెలికి తీసే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా ఎండ్లూరి సుధాకర్, వేముల ఎల్లయ్య, నాగపుగారి సుందర్‌రాజు, కొలకలూరి ఇనాక్, రావినూతల ప్రేమ్‌కిషోర్, జూపాక సుభద్ర, జాజులగౌరి, గోగుశ్యామల, చిత్రం ప్రసాదు, దర్భనం గౌతం, మాస్టార్జీ, కొల్లూరి చిరంజీవి, దార్ల వెంకటేశ్వరరావు మొదలైన కవులు తమ గళం, కలం విప్పారు. నిద్రణమైన మాదగ జాతికి నిరంతం జవసత్వాలు ఊదారు. దండోరా ఉద్యమం దారితప్పుతున్న సమయం దిశానిర్దేశం చేశారు. చాండాల చాటంపు, మాదిగోడు (కథలు), మాదిగ చైతన్యం, మల్లెమొగ్గల గొడుగు(మాదిగ కథలు), దండోరా వ్యాసాలు, వర్గీకరణం, గుండెదరువు, డెడ్డెనక, డెడ్డెనక, బ్రాహ్మణత్వ మాలిత్వమా, మానవత్వ అంబేద్కర్వ్త్వమా (వర్గీకరణపై చర్చ), ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?, దండోర దరువు, కైతునకల దండెం,

నల్లరేగడిసాల్లో మాదిగపొద్దులతో పాటు వివిధ పత్రికల్లో సాహిత్య, సామాజిక, రాజకీయ వ్యాసాలతో వర్గీకరణ అంశాన్ని చర్చించి అందులో లోతుపాతుల్ని తెలియజేశారు. దండోర ఉద్యమం, సాహిత్యోద్యమం కలగలసి మాదిగల రిజర్వేషన్ పోరాటాన్ని ముందుకు నడిపించడానికి తమవంతు పాత్రను సక్రమంగా నిర్వర్తించాయని చెప్పవచ్చు.

**4.2.6. నల్లమిరియం చెట్టు – దండోర రాజకీయాలు :**

ఈ నవలలో మాదిగల న్యాయమైన కోర్కెగా భావించబడుతున్న వర్గీకరణ ర్యాలీ నేపథ్యంగా మొదలై చివరిలో సమావేశంతోనే ముగుస్తుంది. రచయిత పాఠకుడ్ని తనతోపాటుగా తీసుకెళ్ళి పాత్రల మనోవికారాలు, శారీరక, మనఃస్థితిని స్పష్టంగా చిత్రీకరిస్తాడు. నవల ప్రారంభంలోనే వాతావరణాన్ని వర్ణిస్తాడు. ఒక్కపక్క ఎండ, వాన కలగలసిన సాయంత్రం ఇబ్బందికరమైనది. ఉక్కతో చెమట, పైనుండి వాన, గ్రేస్ కమ్లీ లాస్ట్ పిరియడ్ ఎగ్గొట్టి “కాలేజీ బ్యాగ్‌తో దాసుకున్న ప్లకార్డును బయటకు తీసాను. ‘దండోరా, మన కొత్తవెలుగు’ ప్లకార్డును పైకెత్తి పట్టుకున్నాను. ఈ కొత్త అనుభవం అద్భుతంగా ఉంది” (పు.30) నిన్న రాత్రి తమ్ముడు తూమీ దండోర ఊరేగింపు గురించి చెప్పాడు. “దండోరా అంటే ఏమిటని అమాయకంగా అడిగాను. చాలాసేపు వివరించాడు. కొంత అర్థమైంది. కొంత కాలేదు. కానీ నాన్నకు ఇష్టం లేదన్న విషయం మాత్రం అర్థమైంది. భయం, వణుకు, అంతలోనే తిరుగుబాటు చెయ్యాలనే తీవ్రమైన కోరిక”(పైదే) తమపై అన్ని రకాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్న వారి నుండి విడివడి స్వేచ్ఛగా ఎదగాలనే దండోరా ఏర్పాటుకు మూలం. అందుకు కమ్లీ, రూమీ ఆ చైతన్యాన్ని అందిపుచ్చుకోవడానికి సిద్ధమయ్యారు. అందుకే భయం, వణుకు ఉన్న ముందడుగు వేయడానికి సిద్ధపడి దండోర ఊరేగింపులో పాల్గొన్నారు. ప్లకార్డు చేబూనారు. రూమీ చేతిలో ‘మమ్మల్ని విభజించండి, ఇప్పుడే, ఇక్కడే’ ప్లకార్డును పట్టుకొని ఉద్రేకంగా అరుస్తున్నాడు. మాదిగ దండోరా సమయంలో ఆ సభలకు ఎలా వెల్లువలా ముఖ్యంగా ఎలా వచ్చారో పై సంఘటన ద్వారా చెప్పవచ్చు.

రూమీ, కమ్లీలు రాజయ్య, విజయమ్మల పిల్లలు. రాజయ్య టీచర్‌గా ఉండి, పుస్తకాలు ముద్రించి అమ్మి, రియల్టర్‌గా మారి డబ్బు సంపాదించాడు. అధికార పార్టీ అండతో జెడ్.పి. చైర్మన్‌గా ఎదుగుతాడు. అక్కడ నుండి రాజయ్య రాజసుందరంగా మార్పు చెందుతాడు. “మా సన్నిహిత సమాజంలో ఆయనో కొత్త దేవుడు. నల్లగా, భూమిపుత్రుడులా ఉండే మనిషి ఆధునిక మానవుడిగా అవతరించాడు… ఇప్పుడు ఆయన మాట్లాడే భాష కూడా మారిపోయింది” (పు.32) అధికార పార్టీ దండోరాకు వ్యతిరేకం. దాంతో రాజసుందరం అధికార పార్టీ రాజకీయాల్లో భాగంగా మాదిగ కులస్తుడైనప్పటికీ దండోరాను తీవ్రంగా వ్యతిరేకిస్తూ పత్రికల్లో వ్యాసాలు రాస్తాడు. ఆ పేరుతో పిల్లల్ని దండిస్తాడు.

1970, 80 దశకాల్లో వర్గీకరణ కోసం చేసిన డిమాండ్ అప్పటి అధికార పార్టీలేవి పట్టించుకోలేదు. కానీ ఆరోజు ఆలోచించడానికి కూడ ముందుకు రాని రాజకీయ పార్టీలు ఇప్పుడు మాదిగల డిమాండ్‌లో న్యాయం ఉందని ముందుకు వచ్చి మద్దతు ప్రకటించటానికి పోటీ పడ్డాయి. అప్పటి ఇప్పటి మాదిగల రాజకీయ ధోరణుల్లో పెనుమార్పులు దండోర ఉద్యమంతో సంభవించాయి. ఆ మార్పుల్ని రచయిత పట్టుకొన్నాడు. మార్కాపురం డివిజన్‌లో మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను బహిష్కరిస్తున్న దండోర తరపున కరుణకుమార్ ప్రకటించాడు. దండోరకు వ్యతిరేకంగా రాజయ్య ప్రచారం చేసి డబ్బులు కూడా పంచాడు. ఆరోజంతా వాన పడుతూనే ఉంది. ఓటర్లు ఎవరూ రావడం లేదు. ఏజెంట్లు కంగారుగా అందరికి ఫోన్లు చేశారు. “పన్నెండు గంటల వేళ, మొదటి ఓటరు వచ్చాడు. పోలింగ్ బూత్‌లో అందరిముఖాల్లో కాస్త వెలుగు వచ్చింది. గొడుగు పక్కన పెట్టి… ఓటరు లోపలికి వచ్చాడు. యాభై దాటి ఉ

ంటాయి. బలంగా ఉన్నాడు. తన ఐడెంటిటీ కార్డు చూపించాడు.... ఎట్లా వెయ్యాలో అతనికి వివరించారు. చాటుకు వెళ్ళి ఓటు గుర్తుపై ముద్ర వేయడానికి బదులు 'దండోరా వర్ధిల్లాలి' అని రాసి, నాలుగు వైపులా మడిచి ఓటు బాక్సులో వేశాడు" (పు.170) అలాగే మరొక ఓటరు చేశాడు. వచ్చిన కొద్దిమంది మొత్తం అదేపని చేశారు. సాయంత్రం కొంతమంది బయటే నిలబడి దండోరాకు అనుకూలంగా నినాదాలు చేసి వెళ్ళిపోయారు. ఓటర్ల కోసం పోలింగ్ మరో గంట పొడిగించారు. పోలింగ్ అయిపోయినా ఐదు నిమిషాల్లో "దండోరా జైత్రయాత్ర వీధుల్లో మొదలైంది. వందలాది జనం రోడ్లపైకి వచ్చారు. సన్నటి జల్లు పడుతున్నా లెక్క చేయలేదు. నేల నుండి వేలాది గొడుగులు మొలుచుకొచ్చినట్లుగా, అదొక ఆశ్చర్యం. ప్రపంచమంతా ఉలిక్కిపడింది. రాజకీయ నాయకులు, మొదటిసారి దండోరా గురించి సీరియస్‌గా ఆలోచించడం మొదలు పెట్టారు" (పు.170). దాంతో ఐక్యత గల దండోరాను ఓటు బ్యాంకు రాజకీయాలకు పావులుగా మార్చుకోవడానికి "అధికారాన్ని చేపట్టాలనుకునే ఏ పార్టీ కూడా అధిక జన సంఖ్య కలిగి దండోరా ఉద్యమం ద్వారా ఒక శక్తిగా ఎదిగి, ఒక స్థిర ఓటు బ్యాంకుగా ఉన్న మాదిగలను, వారి డిమాండ్‌ని విస్మరించి రాజకీయ చదరంగంలో పావులు కదపడం అంత సులువు కాదు. అందుకే వర్గీకరణను బలపరచవలసిన 'గత్యంతరం' ఆ రాజకీయ పార్టీలకు పట్టింది" (సాంబయ్య, గుండిమెడ : 2006, పు. 27) అభిప్రాయం వ్యక్తం చేసారు.

ఎన్నికల బహిష్కరణతో కరణ్‌ను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసారు. భార్య కాంతం పోలీసులను గట్టిగా ఢీకొంది. అయినా కరణ్‌ను మాజీ నక్సలైట్‌ని విచారణ నిమిత్తం అదుపులో తీసుకున్నామని చెప్పారు. భార్య కాంతం స్టేషన్ ఎదుట దీక్షకు కూర్చొంది. దండోరా మరసటిరోజును జిల్లా బంద్‌గా ప్రకటించారు. కరణ్‌ను విడుదల చేశారు. ఉద్యమాన్ని ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఎగతాళి చేసి మాట్లాడినందుకు 'దేవా' కలెక్టరాఫీసు ముందు 'దండోరా కోసం ఆత్మాహుతి చేసుకుంటున్నా' అని ప్రకటించి పెట్రోలు మంటల్లో కాలిపోయాడు. దండోరా ఉద్యమం మరింత ఊపు అందుకుంది. 'రూమీ ఫుల్‌టైం దండోరా కార్యకరతష్ఠఆ మారిపోయాడు' (పు.201) పిల్లల నుండి ముసలివాళ్ళ వరకు ఉద్యమంలో పాల్గొంటున్నారు. రాజసుందరం ఆఫీసుకు "ప్రతిరోజు ఒక ముసలమ్మ వెళుతుంది.... నా పేరు సుబ్బమ్మ. దండోరా పిల్లలు నా దగ్గరకు వచ్చారు. వాళ్ళు చెప్పింది నాకు నచ్చింది. నేను ఇప్పుడు దండోరా కార్యకర్తను. ఇవాళ నుండి ప్రతిరోజూ నీ ఆఫీసుకు వస్తాను. నీ గది ముందే, నిరాహారంగా కూర్చుంటాను. నువ్వు మారేదాక" (పు. 203) అని తన నిరసనను తెలిపింది. రాజసుందరం భయపడిపోయాడు. ఆఫీసుకు వెళ్ళడం మానేశాడు.

హైదరాబాదులో దండోరా మహార్యాలీ ఏర్పాటు చేశారు. పోటీగా రాజసుందరం మరో సభలో రాజసుందరం ఏర్పాటు చేశాడు. అతడు ఎమ్మెల్యే రిజర్వుడ్ సీటు కోసం అగ్రకులం యం.పి. చుట్టు తిరుగుతున్నాడు. తనను తాను కాబోయే ఎమ్మెల్యే ప్రచారం చేసుకున్నాడు. అంతకు ముందు మనిషిగా ఉన్నవాడు రాజకీయ జంతువుగా మారిపోయాడు. తన పదవి కోసం ఎంతకైనా సిద్ధంగా ఉన్నాడు. గ్రేస్ కమ్లీకి కలలో నాన్నముఖం మోసుకు తిరుగుతున్నాను. "నాన్న ముఖాన్ని నాన్నకు ఇచ్చివేద్దామని, నాన్నకోసం వెతుకుతున్నాను. పెద్ద మైదానంలో, మనుషులు, రాజకీయపు మనుషులు, వాళ్ళలో నాన్న కోసం వెతకగా అందరూ నాన్నలాగే ఉన్నారు" (పు. 206) మనదిప్పుడు చదువుకున్న, డబ్బులున్న దళిత రాజకీయ కుటుంబమని చెప్పాడు. కానీ మనం ఎంతగా మారిన ఈ కుల సమాజం మనల్ని కులం ముద్రతోనే గుర్తిస్తుంది. వాస్తవిక పరిస్థితిని తెలియజేశాడు.

అగ్రకుల రాజకీయ పార్టీలలో దళిత రాజకీయ నాయకుల పరిస్థితిని రాజసుందరం

పాత్ర ద్వారా రచయిత ఆవిష్కరించాడు. దళితులు రాజకీయాల్లో అగ్రకుల చెంచాలుగా ఎలా ప్రవర్తించారో కళ్ళకు కట్టినట్టుగా వర్ణించాడు. పల్లె నుండి పట్నం వచ్చినప్పుడు ఎవరూ ఇల్లు అద్దెకు ఇవ్వలేదు. మాటకు ముందు మీరేవుట్లూ? అని అడిగేవారు. నేను టీచర్నీ అయినా తల వంచుకు తిరిగేవాడ్ని. "నేను ఇంగ్లీషు భాష నేర్చాను. ... నాగరికత నేర్చాను. రాజకీయం నేర్చాను. అయినా నేను దళితుణ్ణి. మనం దళితులమే" (పు. 206) అని మనువాద అగ్రకుల పార్టీల్లో, పట్టణాల్లో దళితుల పరిస్థితి వివరించాడు. రాజకీయాల్లో నటించడం గురించి తెలియజేస్తూ....

రాజకీయాల్లో "నటించడం అవసరం. రాజకీయాల్లో చేరిన కొత్తల్లో, మంత్రుల కాళ్ళ దగ్గర కూర్చొనే వాణ్ణి. ఒకానొక ఎమ్మెల్యేకి మందు గ్లాసులు అందించి, రాత్రంతా వాడి కాళు ్ళ పిసుకుతూ గడిపాను" (పు. 207) చెప్పాడు. పై మాటలను బట్టి గ్రామాల్లో వెట్టి పన చేసే దళితులకి, దళిత రాజకీయ నాయకులకు పెద్ద తేడా లేదు. పార్టీలో ఏ కొంచెం తెలివి చూపించిన దగ్గర తీయరు. అత్యంత వినయంగా కనబడాలి. "వీడో బానిస, మన పెరట్లో కట్టి వేసిన కుక్క" (పైదే) అనుకునేలా ప్రమాదం లేని వ్యక్తిలా ప్రవర్తిస్తేనే వాళ్ళు దగ్గరకు తీస్తారు. "మన ఆత్మవిశ్వాసం వద్దు. మన ఓట్లు కావాలి. మన ఆత్మగౌరవం అవసరం లేదు. వీడు విశ్వాస పాత్రుడైన దళితుడు అని లేబుల్ వేసి మనకు కాస్త అధికారాన్ని విసిరి వేస్తాడు" (పైదే) అక్కడ దళితులకు సొంత ఆలోచనలు నిషిద్ధం. పార్టీ మాటలకు తల ఊపే గంగిరెద్దును, కుక్కను. నన్ను చూసి అందరూ ముఖం చిట్లిస్తారు. నన్ను నా మూలాల నుంచి వేరు చేస్తారు.

"నిన్నటి వరకూ ఎమ్మెల్యేని చేస్తామన్నారు. మాదిగల పోరాటం గురించి మాట్లాడవద్దన్నారు. దండోరాకు వ్యతిరేకంగా పనిచేయమన్నారు.... ఇవాళ దండోరాను సమర్థిస్తూ పార్టీ తీర్మానం చేసింది. ఇవాళ నుంచి నన్ను దండోరాకు జై అనమంటోంది. మాదిగల ఓట్లకు గాలం వెయ్యమంటుంది. ఇప్పుడు నేనూ మీతో పాటు దండోరా సభల్లో పాల్గొంటున్నాను... ఈ ఊబిలోకి బాబాయిని దించుతున్నారు. వాడి ప్రజాబలాన్ని లాగేసుకోవాలని వాడికి ఎమ్మెల్యే సీటు ఇస్తామని ఆశచూపుతున్నారు" (పు. 208) దండోరా నాయకత్వానికి పార్టీలు అనేకసార్లు పదవులు ఆశచూపారు. కానీ నాయకత్వం ఉద్యమానికే మొగ్గు చూపారు. కానీ "సామాజిక ఉద్యమమైన దండోరా రాజకీయ స్వభావం సంతరించుకోవడం అనివార్యమైన అవసరం" (ఇనాక్. 2013) దండోరా మని మేల్కొంటే విజయం ఖాయమని ఇనాక్ తెలియజేసారు. అదే వ్యాసంలో దండోరా నాయకులు ఒంటరిగా పోటీ చేసినప్పుడల్లా ఓడిపోతున్నారు. కనుక ఏదో ఒక పార్టీతో కలిసి పోటీ చేసి రాజకీయంగా ఎదగాలి. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వర్గీకరణను సాధించాలని ఆకాంక్షించారు.

కానీ నల్లమిరియం చెట్టు నవలలో ప్రధాన పాత్ర రాజసుందరం ఎమ్మెల్యే పదవికి అడ్డని సొంత తమ్ముడ్ని కిరాయి హంతకులతో హత్య చేయిస్తాడు. దండోరా నాయకత్వాన్ని చేపట్టి జాతికోసం పాటు పడుతున్నట్లు రాష్ట్రం మొత్తం సుడిగాలి పర్యటన చేస్తాడు. కుటుంబంతో పాటు రాష్ట్రం మొత్తం అతడి రాజకీయ స్వభావాన్ని గుర్తించలేదు. తన రాజకీయ ఎదుగుదల కోసం పది సంవత్సరాల పిల్లవాడ్ని ఆత్మహత్యకు కారణమని రూమీ అర్థం చేసుకోవడం. కరణ్‌కుమార్ హంతకుడు కూడ రాజ సుందరమని ఇంట్లో తెలిసిపోతుంది. భార్య విజయ పెళ్ళిరోజే ఇల్లు విడిచి తోడికోడలు కాంతం వద్దకు వెళిపోతుంది. రూమీ ఇల్లు చనిపోయిందని, ఈ ఇంట్లో ఉండవద్దని అమ్మ వద్దకు వెళ్ళిపొమ్మని గ్రేస్‌కు చెబుతాడు. రాజసుందరం రాజకీయోపన్యాసం చేస్తున్న సమయంలో రూమీ ఓ జనసమూహాన్ని చీల్చుకొని వెళ్ళి "సార్ ఈ డ్రామాలు ఆపండి సార్. దండోరాను మరోసారి చంపకండి సార్. ఇన్నేళ్ళ ఎదురు చూపు

తర్వాత, ఒక ఉద్యమం, ఒక ఆశ, ఒక ఆత్మ విశ్వాసం, దీన్ని ధ్వసం చెయ్యవద్దు. దండోరాని మీ రాజకీయ నిచ్చెన చెయ్యవద్దు. దండోరా మాకు ఒక మతం అయింది. బానిసత్వాన్ని నిరాకరించడం నేర్పించి, వందలాది బాహువులు కలిసి ఒక కౌగిలింతగా మారిన సందర్భం ఇది. సార్, మరోసారి మమ్మల్ని మోసం చెయ్యకండి" (పు.243) అని ఉద్వేగంగా "మీకేం కావాలి సార్, పదవులా, డబ్బా, పోనీ మా ప్రాణాలా" (పు. 244) అంటూ వంటిపై పెట్రోలు పోసుకొని దండోరాను బతికించుకోవడంలో భాగంగా ఆత్మహుతి చేసుకొని అమరుడయ్యాడు.

## రూమీ దండోరా చైతన్యం

నల్లమిరియం చెట్టు నవలలో రూమీ అత్యంత ప్రాధాన్యత గల పాత్ర. దండోరా నేపథ్యాన్ని అర్థం చేసుకొని దానిలో మమేకం అయ్యాడు. తన అక్క గ్రేస్ కమ్లీకి కూడ దండోర ఉద్యమ గమనాన్ని తెలియజేసి కన్విన్స్ చేసి దండోర సభకు వచ్చేలాగ చేయడంలో విజయవంతం అయ్యాడు. ఈ నవలలో తొలి నుండి తుది వరకు కమ్లీ మాటల ద్వారా రూమీతో నడుస్తాం. రూమీ దండోర ఉద్యమంలో క్రమక్రమంగా మమేకం అవుతూ పూర్తి కాల కార్యకర్త మారిపోతాడు. దండోర చైతన్యంగా రూపొందుతాడు. దండోరను తిరుగుబాటు సాధనం ఎంచుకొని తండ్రిపై పోరాటం చేస్తాడు. తండ్రి అమానవీయ ప్రవర్తనకు సమాధానంగా దండోర కార్యకర్తగా ఎదుగుతాడు. ఆ క్రమంలో పల్లె మాదిగలు ఎదుర్కొంటున్న వివక్షలు చూస్తాడు. పట్టణాల్లో మాదిగ యువకుల దయనీయ పరిస్థితులు తెలుసుకుంటాడు. దండోర ఉద్యమంతో మాదిగ యువకుల్లో వస్తూన్న మార్పుల్ని కల్చరల్ సెంటర్‌లో చూస్తాడు. కల్చరల్ సెంటర్ కుర్రోడు ఆత్మహత్య చేసుకుంటే దుఃఖిస్తాడు.

నవల ప్రారంభంలోనే రూమీ "మమల్ని విభజించండి, ఇప్పుడే, ఇక్కడే" అనే ప్లకార్డు చేబూని దండోరా ఊరేగింపులో అక్కతో పాల్గొంటాడు. పూనకం వచ్చిన వాడిలా నినాదాలు చేస్తాడు. అంతకు ముందు కమ్లీ రూమీని అలా చూడలేదు. ఆ రోజు రాత్రి తండ్రి 'సాయంకాలం ఎక్కడికి వెళ్ళావురా' అన్ని ప్రశ్నించాడు. 'దండోరా ఊరేగింపుకు వెళ్లాను', దండోరా అంటే మీకెందుకు ఇష్టం ఉండదని, తండ్రినే ప్రశ్నిస్తే ఆయన కోపంతో ఊగిపోయాడు. ఇది కొత్తకాదు. పావురాల పెంపకం విషయంలో రూమీకి బెల్టుతో తండ్రి తీవ్రంగా కొట్టాడు. అప్పటి నుండి తింండ్రి చీకటి మాటికి క్రమశిక్షణ పేరుతో పిల్లల్ని రాజయ్య తీవ్రంగా దండిస్తాడు. మానవహక్కుల గురించి బయట మాట్లాడే రాజయ్య ఇంట్లో భార్య, పిల్లల హక్కులు హరిస్తాడు. ఒక్కసారి రూమీ స్కూల్లో డిబేట్‌లో ఫస్ట్ ప్రైజు వచ్చింది. రాజయ్య ఉత్సాహానికి అంతులేదు. "ఇది మొదలు మాత్రమే. ఈ స్పిరిట్ ఇట్లాగే మెయిన్‌టైన్ చెయ్యి. డిగ్రీ తరువాత నువ్వు ఐ.ఎ.యస్. పరీక్ష రాయాలి. ఊరి నుంచి వచ్చినాక నిన్ను జిల్లా కలెక్టర్ దగ్గరకు తీసుకువెళతాను వాళ్ళ దగ్గరనే నువ్వు ఇన్పిరేషన్ పొందాలి". (పు.68) అని ఉత్సాహపడ్డాడు. గిఫ్ట్‌గా పక్షుల్ని కొనిచ్చాడు. రూమీ దారిలో దండోరా సభ జరుగుతుంటే రాజయ్య ఎదుటే ఆ పక్షుల్ని దండోరా నాయకుడి చేత గాల్లోకి ఎగర వేయించాడు. దండోరా ఉద్యమం స్వేచ్ఛ కొరకు జరిగే పోరాటం, జీవించడం కోసం జరిగే పోరాటం. "హక్కులను సాధించుకునే పోరాటం, ఆత్మ గౌరవాన్ని నిలుపుకునే పోరాటం, మన పోరాటానికి సింబాలిక్ ఈ కుర్రవాడు, తెచ్చిన పక్షులను మన నాయకుడు ఆకాశంలోకి ఎగురవేస్తాడు" (పు.70) అని ప్రకటించారు. దండోర నాయకుడు పక్షులను గాల్లోకి ఎగురవేశాడు. రూమీ "ముఖంలో ఎప్పుడూ చూడని కొత్త వెలుగు" (పు.71) తండ్రి ముఖం కందగడ్డలా మారిపోయింది.

పల్లెలో రాజయ్యను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రమోట్ చేయడానికి సభ ఏర్పాటు. ఉ పన్యాస ప్రతి సిద్ధం చేస్తున్నారు. ఆ సమయంలో రూమీ "తయారవుతున్న ఉపన్యాసం వైపు అసహనంగా చూస్తున్నాడు. వాడి లోపల సంచలనం ఏదో రేగుతుంది. ఉప్పెనను మోస్తున్న

వాడిలా, గాఢంగా ఊపిరి తీస్తున్నాడు. పదహారేళ్ళు వయసు. పొడవుగా, బలంగా శరీరమంతా శక్తి మండలంలా తయారవుతున్న సందర్భము... నాయకుడికి ఉండే తీక్షణత, సాంద్రత, వాడి ముఖంలో ఉన్నాయి. వాడికి గొప్ప ధారణ శక్తి ఉంది. (వందలాది జాషువా పద్యాలు వాడికి కంఠతా వచ్చు... 'మీటింగ్‌లో నేనూ మాట్లాడతాను బాబాయి' అన్నాడు. గట్టి నిర్ణయమేదో తీసుకున్న వాడిలి.... నువ్వు మాట్లాడే రోజులు చాలా ఉన్నాయిలేరా' లేదు, 'నేను మాట్లాడతాను. నాకు తెలిసిన నాన్న గురించి మాట్లాడతాను' అన్నాడు స్థిరంగా (పు. 97) ఈ మాటల్లో రూమీ దండోర ఉద్యమ నేపథ్యం నుండి సమాజాన్ని, ముఖ్యంగా తండ్రిని నిశితంగా గమనిస్తాడని అర్థం చేసుకోవచ్చు.

ఇంకా సభ ప్రారంభం కాకముందే ఆ రోజును గుర్తు పెట్టుకోమంటున్నాడు. "అన్ని సున్నితమైన భావాల్ని వదిలివేసి, నాన్న కొత్త రాజకీయ జంతువుగా అవతారమెత్తుతున్న రోజు. ఈ సన్మానం ఒక సాకు. బహుశ ఇదొక ప్రయాణానికి సిద్ధ పడటం అనుకుంటాను. భాజావలి మామ ఒట్టి బొమ్మ. వెనకనున్న వ్యూహం నాన్నదే. ఈ రాజకీయపు నాన్న, మనం కథలు కథలుగా చెప్పుకోవాల్సిన ఒక సంగతి కాబోతున్నాడు. ఈ సన్మానం నాన్నకు కృత్రిమ రెక్కల్ని అమరుస్తుంది. తెల్లటి దేవతా వస్త్రాన్ని కప్పుతుంది. ఆయన్నొవ మిత్‌గా ప్రపంచానికి చూపుతుంది. ఆయన మహత్యాన్ని మనమందరం నమ్ముతాము... అక్కా, నాన్నను మనం రక్షించాలి" (పు. 100) అని భవిష్యత్తును కళ్ళముందు ఉంచుతాడు. అక్క గ్రేస్ ఆశ్చర్యపోతుంది.

జడ్జి నాగభూషణం చనిపోయిన తర్వాత సంతాపసభ రాజయ్య పెద్ద ఎత్తున ఏర్పాటు చేశాడు. ఆ సభలో వందలాది మంది పాల్గొన్నారు. మెస్మరిజంతో గంట ఇరవై నిమిషాలు ఉపన్యసిస్తూ "ఊహించండి ఒక ఆకుపచ్చని మొక్కకు నీళ్ళకు బదులు నిప్పులు పోస్తూ ఉంటే అది ఎన్నాళ్ళు బ్రతకగలుగుతుంది. ఇది నాగభూషణం గారి సంగతి కాదు. ఒక్కసారి మీలోకి మీరు చూసుకోండి, ఇది మనందరి పరిస్థితి" (పు. 134) అని పండు వలిసి నోట్లో పెట్టినట్లు సమస్యను వ్యవస్థీకరించాడు. ఆ ఉపన్యాసాన్ని విన్న రూమీ "ఇదంతా ఒక సైకలాజికల్ గేమ్. ఈయనకి నాగభూషణం పైన నిజంగా ప్రేమ లేదు. ఇక్కడున్న జనాన్ని తన ఓట్ బ్యాంక్‌గా మార్చుకోవడానికి చేసిన ఒక మ్యాజిక్ ఫీట్" (పు. 136) అని తేల్చి పడేశాడు. దండోర చైతన్యంతో తండ్రిని అంచనా వేసుకొని తనకు తాను ఒక జడ్జిమెంట్‌ను తయారు చేసుకొని చెప్పగలుగుతున్నాడు.

నాన్నమ్మకి ఆరోగ్యం బాగలేకపోతే చూడడానికి పల్లెకు వచ్చారు. పల్లెలో కరణ బాబాయి దండోర నాయకుడయ్యాడు. మెల్లగా రూమీ దండోరా కుర్రవాళ్ళతో కలిసిపోయాడు. " ఆ పగలంతా రూమీ కనబడలేదు నాకు. దండోరా ఉద్యమంలో, ముఖ్య కార్యకర్త అయ్యాడు. తాలుకా ఆఫీసు ముందు నిరాహార దీక్షా శిబిరంలో మధ్యాహ్నం దాకా కూర్చున్నాడు. ఆ తర్వాత దగ్గరలో ఉన్న గ్రామాలకు మిగిలిన కుర్రవాళ్ళతో పాటు వెళ్ళారు. గ్రామాల్లో యువకులందరూ ఒకచోట చేరి, ఆ వూరి సమస్య గురించి చర్చించుకోవడం, ముందుగా ఆ వూరి (మాదిగ పల్లెల్లో) ఎంత మంది చదువుకున్న వాళ్ళు వున్నారు. వాళ్ళ స్థితిగతులు, వగైరా మాట్లాడటం, ఆ తరువాత ఆవూరి ప్రత్యేక సమస్యలను చర్చించడం, కూలీ రేట్లుగానీ, ప్రభుత్వ పథకాల అందుబాటు గురించి కానీ, మరింకేదైనా ప్రత్యేక సమస్యలు (కులం పేరుతో అవమానించడం వగైరా) గానీ రూమీకి ఇదంతా కొత్త అనుభవం. పల్లె జీవితాన్ని దగ్గరగా చూడటం ఇదే మొదటిసారి. ఒక్కసారిగా వాడికి కొత్తచూపు వచ్చినట్లుగా అనిపించింది. ఆ సాయంకాలం వాడు నా ప్రక్కన కూర్చొని నాకు దండోరా ఉద్యమం గురించి లెక్చరు ఇచ్చేంతగా ఎదిగాడు"(పు. 141) రూమీ ఎక్కడికి వెళ్ళినా ఎంతో కొంత నేర్చుకొని దాన్ని జీవితానికి అన్వయించుకొని ముందుకు వెళ్ళే క్రమంలో మాదిగలతో తిరగడం, వారి సమస్యలను ప్రత్యక్షంగా

చూడడం వాటిని అర్థం చేసుకొని ఆ సమస్యలను తన సోదరికి విడమరచి చెప్పే స్థాయిలో అర్థం చేసుకున్నడని పై వాక్యాలే ఉదాహరణ.

తల్లి చావును రాజసుందరం రాజకీయం చేశాడు. ఖననం ప్రక్రియలో పాల్గొనకుండా పిల్లలిద్దర్ని బలవంతంగా టౌనుకు తీసుకువచ్చాడు. బాబాయ్‌తో గొడవపడ్డ విషయం మర్చిపోలేక పోతున్నాడు. 'తల్లి చావును కూడా రాజకీయం చేశాడు వెధవ' అంటూ బుసలు కొట్టాడు. 'బాబాయి చేసిందాట్లో తప్పేముంది'. అని తండ్రిని రూమీ ఎదురు ప్రశ్నించాడు. దండోర ఉద్యమంలో యాక్టివ్‌గా తిరిగినందుకు పిల్లలిద్దర్ని బెత్తంతో శిక్షించాడు. అయినా రూమీ, గ్రేస్ బెదరలేదు. సెంట్రల్ యూనివర్శిటీ స్టూడెంట్లు 'మాదిగచైతన్యం' అనే సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనడానికి రూమీ వెళ్ళాడు. అక్కడ నుండి కరపత్రాలు, క్యాసెట్లు, పుస్తకాలు కొనుక్కొని వచ్చి జాగ్రత్తగా "వాటిని పవిత్రమైన ఆస్తిలాగా దాచడం నాకు ఆశ్చర్యం వేసింది... నిజానికి వాడి వయసుకి, ఉద్యమం వెనుకనున్న రాజకీయం (రిజర్వేషన్లు, అందులో వర్గీకరణలు) వాడికి అర్థం కాలేదేమో అనిపించింది. కానీ ఆ ఉద్యమాన్ని ఒక గాఢమైన ఇష్టంగా, బహుశా ఒక తిరుగుబాటుకు సింబల్‌గా దాన్ని ఇష్టపడుతున్నాడేమో అనిపించింది" (పు. 153) కానీ ఆ తిరుగుబాటు నాన్న పైనా, సమాజంపైనా అనేది నవల చివరి పేజీలో స్పష్టమవుతుంది. పూర్తిగా తండ్రి మీద, సమాజం మీద అమానవీయ ప్రవర్తన మీదే రూమీ దండోరా చైతన్యంతో తిరుగుబాటు బావుటా ఎగురవేశాడు. పల్లె, టౌన్ వీధుల్లో దండోరా జెండాగా రెపరెపలాడాడు.

కల్చరల్ సెంటర్ దండోరా యువత స్నేహం రూమీ దండోరా చైతన్యాన్ని నింపారు. మాదిగ కవితలను పూర్తిగా తమలోకి అవగాహన చేసుకున్నాడు. ఆ కవిత్వం వింటే కోపం రగలాలి, ఆవేశం రావాలని అంటాడు. దండోరా ఇచ్చిన బంద్ పిలుపు విజయవంతమైంది. కల్చరల్ సెంటర్ యువత ఉత్సాహంగా ఉన్నారు. రూమీ బంద్ ఎలా తిరిగాడో చెబుతున్నాడు. నువ్వు నాయకుడివి కూడా అయ్యావా? అని రూమీ రూంకి పిలిచి అడిగాడు. నువ్వేనే మీ అక్క కూడ దండోరాలో తిరుగుతుందా? అని ప్రశ్నించాడు. "అవును, నేను అక్కా దండోరా ఉద్యమంలో తిరుగుతున్నాము. అవసరమైతే కాలేజీ కూడా మానేస్తాము. ఇది మాకు ముఖ్యమైన విషయం. ఇది మేము ఆత్మగౌరవ ప్రకటన అనుకుంటున్నాము" (పు. 179) అని చెప్పాడు. రాజయ్య క్షణం సేపు షాక్ తిన్నాడు. ఉన్మాదిలా రూమీని కొట్టాడు. అడ్డం వెళ్ళిన గ్రేస్‌ను కూడ సొమ్మసిల్లి పోయేలా కొట్టాడు. రూమీ తండ్రి దెబ్బలు తినడానికి భయపడడం లేదు. దండోరాను ఆత్మగౌరవ అంశంగా భావించాడు. అందుకోసం చదువును ఆపివేయడానికి కూడ సిద్ధపడ్డాడు.

రూమీ మూడోసారి స్వగ్రామం వెళ్ళినప్పుడు "ప్రముఖ కార్యకర్తలా ఫీలవుతున్నాడని" (పు. 189) గ్రేస్ తమ్ముడ్ని అంచనావేసి అభిప్రాయపడింది. అక్కడనుండి వచ్చిన తరువాత రూమీ "కాలేజీ మానివేసి పూర్తికాలం కార్యకర్త అయ్యాడు. పాంఫ్లెట్లు రాసుకుంటూ, పాట ప్రాక్టీసు చేసుకుంటూ" (పు. 201) దండోరా చైతన్యాన్ని పూర్తిగా నింపుకుంటూ ఎదుగుతున్నాడు. దండోర ఉద్యమ సమయంలో అనేకమంది కార్యకర్తలు వర్గీకరణ కోసం పూర్తిగా అంకితం అయ్యారు. రూమీ మారుపేరుతో యూనివర్సిటీలోకి ప్రవేశించి, ధర్నాచేస్తుంటే పోలీసులు ఆపారని, వి.సి. ఆఫీసుపై రాళ్ళు రువ్వారని అరెస్టు చేశారు. గ్రేస్ విడిపించడానికి ప్రయత్నించగా రాజయ్య వచ్చి విడిపించి తీసుకువెళతాడు. కానీ రూమీ మధ్యలోనే కారు దిగి ఒరిస్సాలో క్రిష్టియన్ మిషనరీల మీద దాడులకు నిరసనగా జరుగుతున్న ఊరేగింపులో పాల్గొంటాడు. రూమీ అణిచివేతలకు గురవుతున్న అందరిపట్ల సానుభూతిలో ఉన్నట్లుగా అంతేకాకుండా ఊరేగింపులో పాల్గొని తన సంఘీభావాన్ని తెలియజేస్తాడు. రూమీ బాబాయ్ కరుణ్‌కు ఎమ్మెల్యే టిక్కెట్ ఖరారు కావడం ఆయన అంగీకరించడంతో రాజకీయ రూపురేఖలు

మారిపోయాయి. దాంతో కరుణ్ హత్యకు గురవుతాడు.

కరుణ హత్యతో రూమీ రూం దాటి బయటకు రావడంలేదు. పూర్తిగా నిస్తేజంగా మారిపోయాడు. దాదాపు ఉద్యమం పరిస్థితికూడ అంతే. రూమీ బద్దలయ్యే అగ్నిపర్వతంలాగ ఉన్నాడు. కరుణ్ విగ్రహావిష్కరణ సభలో తండ్రి మాట్లాడకుండా ఆపాలని రూమీ ప్రయత్నించాడు. కానీ కుదరలేదు. బహిరంగసభలో రాజయ్య ప్రసంగించాడు. భిన్నమైన స్పందన కార్యకర్తల నుండి వచ్చింది. రూమీ కాంతం పిన్ని వాళ్ళతో ఆసుపత్రికి తోడుగా వెళుతున్నాడు. క్రమంగా రూమీ కరణ హత్యనుండి కోలుకుంటున్నాడు.

అదే సమయంలో రాజయ్య పార్టీకి రాజీనామా చేసి దండోరా ఉద్యమంలో చేరాడు. 'మాదిగ మహాగర్జన' పేరుతో నిరాహారదీక్ష చేస్తున్నట్లుగా ప్రకటించాడు (పు. 231). రూమీ రాజయ్య మార్పును గట్టిగా నమ్మాడు. అందుకే గోడలపై నినాదాలు రాస్తున్నాడు. రాజయ్యకు పార్టీ టిక్కెట్ నిరాకరించి ఉంటుందని అందుకే ఈ వేషాలు వేస్తున్నాడని గ్రేస్ భావించింది. రాజయ్య దీక్షను ఒక బూటకంలా ఆమె భావించింది. రూమీ నుంచి నేర్చుకున్న దండోరా రాజకీయకోణం నుండి ఆమె ఆలోచనచేసి విజ్ఞాన్ని అవగాహన చేసుకుంది. కానీ రూమీ తాత్కాలికంగా తండ్రి వలలో మిగతా మాదిగలానే చిక్కుకున్నాడు. ఆ సభలో పది సంవత్సరాల పసివాడు పెట్రోలు పోసుకొని తగలబడ్డాడు. రూమీ ఆపాలని ప్రయత్నించినా వీలుకాలేదు. రాజసుందరం ఆ పిల్లవాడి చావును రాజకీయం చేయాలని ప్రయత్నిస్తున్నాడు. మాదిగల్ని ఉద్రేకపరచాలని చూస్తున్నాడు. కానీ రూమీ "అసలు వాడి దగ్గరకు పెట్రోలుడబ్బా ఎట్లావచ్చింది?" (పు. 236) అని ఆలోచన చేశాడు. అప్పటిదాక రూమీ అనాలోచితంగా ఉన్నట్లుగా భావించవచ్చు. దండోర చైతన్యంతో ఘటనను ఆలోచన చేసి నిజానిజాలను తెలుసుకున్నాడు. కానీ శిల్పరీత్యా రచయిత ఆ విషయాన్ని ముగింపులో తెలియజేస్తాడు. తల్లిని స్వగ్రామానికి ఆటో ఎక్కిస్తాడు. అక్కని కూడ అమ్మ దగ్గరకే వెళ్లు ఈ ఇల్లు శవాల కంపు కొడుతుందని చెబుతాడు.

రాజయ్య పుట్టినరోజును పురస్కరించుకొని 'ఆమరణ నిరాహారదీక్ష మొదలు పెడుతున్నాడు. నా చావో, వర్గీకరణో ఏదో ఒక జరగాలి" (పు. 243) అని ఉపన్యసిస్తున్నాడు. అంతలో రూమీ "సార్, ఈ డ్రామాలు ఆపండిసార్. దండోరాను మరోసారి చంపకండి (ఇంతకుముందు కరణ హత్యతో దండోర ఉద్యమాన్ని చంపించాడని). ఇన్నేళ్ళ ఎదురుచూపు తర్వాత, ఒక ఉద్యమం, ఒక ఆశ, ఒక ఆత్మవిశ్వాసం: దీన్ని ధ్వంసం చెయ్యవద్దు. దండోరాని మీ రాజకీయ నిచ్చెన చెయ్యవద్దు. దండోరా మాకు మతం అయ్యింది. బానిసత్వాన్ని నిరాకరించడం నేర్పింది'' (పు. 243) అని ఉద్రేకంగా, ఉద్వేగంగా మాట్లాడుతున్నాడు. రాజయ్యతోపాటు అందరూ నివ్వెరపోయి చూస్తున్నారు. "మీకేం కావాలి సార్, పదవులా, డబ్బా, పోనీ మాప్రాణాలా....'' (పు. 244) అంటూ పెట్రోలు పోసుకొని క్షణాల్లో తగులబడిపోయాడు. నాయకుల రాజకీయాలతో దారితప్పుతున్న ఉద్యమానికి ఊపిరిపోయాలనే తపనతో రూమీ ఆత్మహుతి చేసుకున్నాడు. ఈ నవలలో దేవూ ఉద్యమంకోసం ఆత్మహుతి చేసుకొని మరణిస్తాడు. కానీ పది సంవత్సరాల పసివాడ్ని రాజకీయ లబ్ధికోసం రాజసుందరమే ఆత్మహుతికి ప్రోత్సహించినట్లుగా భావించాలి. దండోరాను మెట్లుగా చేసుకొని రాజసుందరం ఎదగాలని ప్రయత్నాలు ప్రారంభించాడు. సూక్ష్మగ్రాహి అయిన రూమీ విషయాన్ని పసిగట్టి ఉద్యమాన్ని బతికించడం కోసం నాయకుడైన తండ్రిని సమావేశం మధ్యలోనే నిలదీసి ఆత్మహుతి ద్వారా తన తీవ్రమైన నిరసనను తెలియజేయడంతో నవల ముగుస్తుంది. ఇది రూమీ దండోర మామూలుస్థాయినుండి పూర్తిస్థాయి కార్యకర్తలా మారి దండోర చైతన్యంతో తప్పుదారి పట్టిస్తున్న ఉద్యమ నాయకత్వం నుండి విముక్తి ప్రాణాలను తృణప్రాయంగా వదలడంతో నవల

ముగుస్తుంది. ఆత్మహుతి సమర్థించలేముకానీ రూమీ త్యాగానికి గుర్తింపు దండోర లక్ష్యాన్ని సాధించినప్పుడే నెరవేరుతుంది. అందుకే రూమీ మరణం నవల ముగింపుకాదు. కొత్త ఉద్యమానికి ఆరంభంలా భావించవచ్చు.

### 4.2.7. కరుణకుమార్ – విప్లవ, దండోరాల్లో నాయకుడైన క్రమం:

'నల్లమిరియంచెట్టు'లో కరుణకుమార్ పాత్ర ఆదర్శవంతమైన పాత్ర. నిరంతరం సంఘర్షణ పడుతూ సమాజ మార్పుకు తోడ్పడిన పాత్ర. తన చర్యలతో చుట్టూ సమాజాన్ని ప్రభావితంచేసి మార్గదర్శకత్వం వహించేపాత్ర. చిన్నతనం నుండి ఆత్మగౌరవంతో ఎదిగిన పాత్ర. తాను కోరుకున్న సమాజం, లేదా తన ప్రజలకోసం ప్రాణాలు సైతం ఫణంగాపెట్టే పాత్రగా రచయిత చిత్రీకరించాడు. స్త్రీలమీద అపార గౌరవాన్ని చూపుతాడు. చిన్నపిల్లలయందు ప్రేమతో ఉంటాడు. అన్న రాజసుందరానికి మార్గదర్శనం కోసం మూడుసార్లు లేఖలు రాస్తాడు. చివరకు తన రాజకీయ జీవితానికి అడ్డువస్తున్నాడని సొంత అన్న హత్యారాజకీయాలకు బలి అవుతాడు.

కరుణకుమార్ పాత్ర ఈ నవలలో అన్న రాజయ్య స్వగ్రామం వచ్చినప్పుడు మనకు పరిచయం అవుతుంది. ఖాజావలితో కలిసి సభ ఉపన్యాస ప్రతిని తయారుచేస్తాడు. పదేళ్ళ క్రితం చూసిన కరుణ బాబాయ్‌కి ఇప్పటికీ ఎంతో తేడా ఉంది. గతంలో కరుణను చూస్తే కథల్లోని గొప్పపాత్రలా ఉండేవాడు. రూమీ, గ్రేస్‌లకు చిన్నతనంలో బాబాయ్‌దే లోకం. పల్లె జీవితం బాగా తెలిసినవాడు. "తాటితోపుల వెంట, జామతోపులవెంట తిరిగిన రోజులు ఇంకా గుర్తున్నాయి. తాటి ఆకులతో అందమైన బొమ్మలు అల్లేవాడు... తాటాకు గిన్నెలు, పెట్టెలు,.... బాతుగుడ్లు, చెరువులో పట్టిన జెల్లలు, చింతచెట్లపైని తేనెపట్టు నుంచి పిండిన తేనె, కాగితాలతో చేసిన పెద్ద పడవలు, అంతా అద్భుతమైన ప్రపంచము" (పు. 73) పిల్లల కళ్ళముందు సాకాత్కరింపజేసేవాడు. పై విషయాలన్నీ కరుణ ఎంతో సజీవమైనవాడో తెలియజేస్తున్నాడు. గ్రామీణ వాతావరణంలో పెరిగిన మనుష్యులు ఎంత ఆత్మీయంగా ఉంటారో తెలియజేస్తున్నాయి. అందుకే పిల్లలకు కరుణ బాబాయి అంటే మక్కువ ఎక్కువ. కానీ ఇప్పుడు కరుణను చూసిన గ్రేస్ "కథల పుస్తకంలోంచి, జీవితంలోకి తోసివేయబడ్డ వాడిలా, ముఖం ఎంతగా పీక్కుపోయింది" (పు. 73) అని బాధపడుతుంది.

కరుణ పుట్టినప్పటినుండే అన్న రాజయ్యకు ఇష్టంలేదు. రాజయ్య ఎప్పుడూ సీరియస్‌గా, ఒక తాత్వికుడిలా కనిపించేవాడు. కానీ కరుణ అందుకు భిన్నంగా ఎప్పుడూ హుషారుగా పందెపుగిత్తలా ఉండేవాడు. స్కూల్ ఫైనల్ దగ్గర చదువు ఆపి ఆదెమ్మకు పొలంపనుల్లో సహాయం చేసేవాడు. పల్లెలో కుర్రకారుకు కరుణ చిన్నసైజు హీరో. ఎందుకంటే "పదహారో యేటనే పల్లెలో చిన్నసైజు ఉద్యమం లేవదీశాడు" (పు. 85). అప్పుడే కమ్యూనిస్టు నాయకులతో పరిచయం అయ్యింది. కూలీ రేట్లు పెంచారు. దాంతో గుండెగల మనిషిగా పేరు వచ్చింది. అప్పటి నుంచి పార్టీలో చేరాడు. పూర్తిస్థాయి కార్యకర్తలా మారాడు. కరుణ సిద్ధాంతకర్తకాదు. ఒట్టి అనుచరుడే. ఆ రోజుల్లో ఇంటిపై ఎర్రజెండా ఎగురవేసినవాడు. ఊర్లో ప్రముఖ కమ్యూనిస్టు అనుచరుడు. కరుణ పల్లెలో అనేకమందికి ఆదర్శం అయ్యాడు. అందుకే గ్రేస్ బాబాయి నా హీరో అని చెబుతుంటుంది.

ఐదేళ్ళక్రితం కరుణ నక్సలైట్ ఉద్యమంలోకి వెళ్ళాడు. కాంతంను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. అప్పటినుండి కాంతానికి కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. కాంతానికి కరుణ గురించి ఎప్పుడు ఏ వార్త వినవలసివస్తుందోనని భయపడింది. కరుణ కాంతం గర్భవతిగా ఉన్నప్పుడు చాల జాగ్రత్తగా దగ్గరుండి చూచుకొన్నాడు. ఊర్లో హొటల్లో రెండుగ్లాసుల పద్ధతిని ప్రశ్నించి హొటల్ వాడిని కాంతం కొట్టినప్పుడు ఆమెను కంటికి రెప్పలా

కాపాడుకున్నాడు. కోమట్లు పల్లె గూండాలతో దాడిచేస్తే, రాత్రికి రాత్రే కుర్రోళ్ళను పోగుచేసి కోమట్లపై తిరిగి దాడిచేయించాడు. ఆ సమయంలో గ్రేస్ అమ్మపల్లెను ఆరితేరిన నాయకురాలిలా నడిపించిందని కరుణ అనేవాడు. దేవుళ్ళందరూ అమ్మలుగా మారి మన మధ్య తిరుగుతుంటారు. తల్లిపట్ల అపార ప్రేమ, గౌరవాన్ని చూపేవాడు. తల్లి మరణాన్ని తట్టుకోలేక గుండె అవిసేలా దుఖించాడు. తల్లికి ఘనంగా (అంతిమయాత్ర) వీడ్కోలు చెప్పాడు. దీన్ని అన్న రాజకీయం చేసి పిల్లల్ని తీసుకొని వెళ్ళిపోతాడు. ఆ సమయంలో దండోరా కుర్రోళ్ళు నినాదాలుచేస్తే కరుణ వారిని వారిస్తాడు. కరుణ తన బాధ్యతలనుండి ఎప్పుడు పారిపోలేదు. వాటిని ఎదుర్కొని ధైర్యంగా నిలబడ్డాడు.

అందుకే చిన్నప్పటినుండి సమస్యల పరిష్కారంకోసమే ప్రయత్నించేవాడు. దండోరా మున్సిపల్ ఎన్నికల్ని బహిష్కరించాలని జిల్లా నాయకుడిగా పిలుపునిచ్చాడు. ఎన్నికల బహిష్కరణ విజయవంతం అయింది. కానీ వాస్తవంగా ఉద్యమం ఎప్పుడూ ఎన్నికల బహిష్కరణకు పిలుపు ఇవ్వలేదు. ఎన్నికల్లో తటస్థ విధానం అవలంభించింది. కానీ నవలలో వ్యూహం ప్రకారం ఎన్నికల బహిష్కరణను కార్యకర్తలు విజయవంతం చేశారు. ఓటింగ్‌కు వెళ్ళిన కొంతమంది దండోరా నినాదాలు రాసి బ్యాలెట్‌బాక్స్‌లో వేసివచ్చారు. దాంతో రాజకీయ నాయకులు మొదటిసారిగా సీరియస్‌గా ఆలోచించడం మొదలుపెట్టారు. నక్సలైట్స్ కూడ దండోరా ఉద్యమానికి మద్ధతునివ్వడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి, కరుణకుమార్‌కు ఎమ్.ఎల్.ఎ సీటు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి వరకు రాజయ్య ఎమ్.ఎల్.ఎ సీటుకోసం తీవ్రప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. అగ్రకుల నాయకులకు చెంచగా పనిచేస్తూ నమ్మినబంటుగా ఉన్నానని రాజయ్యే స్వయంగా చెబుతాడు.

రాజకీయాలలో రాజయ్య ఆరేళ్ళ రొమాన్స్ ఒక ఫెయిల్యూర్‌గా రాజయ్య భావించాడనవచ్చు. ఆ ఫెయిల్యూర్‌ను అధిగమించడానికి సొంత తమ్ముడ్ని కిరాయి హంతకులతో హత్యచేయిస్తాడు. ఈ హత్యకు ముందు గ్రేస్ కరుణ రాజయ్యకు రాసిన ఉత్తరాలద్వారా కరుణ కుమార్ విప్లవ, దండోరా చైతన్యాన్ని అంచనా వేయవచ్చు. కమ్యూనిస్టుగా, నక్సలైట్‌గా, దండోరా నాయకుడిగా కరుణ చైతన్యాన్ని ఆ ఉత్తరాల్లో వివరించబడుతుంది. కమ్యూనిస్టు కరుణగా అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నాడు. కమ్యూనిస్టులలో ఉండే దూకుడు, మాటల్లో పదును, భావోద్వేగాలను రెచ్చగొట్టే సంభాషణ ఆ ఉత్తరంలో కనబడుతుంది. మరొక ఉత్తరం అజ్ఞాతంలో ఉన్నప్పటిది. అడవిలోకి వెళ్ళిన తర్వాత పుస్తక జ్ఞానంతో, లోపల దాగిన వెలుగు బయటపడింది. ఆఫ్రికన్ రైటర్స్ పుస్తకాలు చదవడంతో కరుణలో స్పష్టమైన మార్పువచ్చింది. అందుకే దళిత సాహిత్య రచన ఒక ఉద్యమంగా రావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాడు. అంటే కరుణ అజ్ఞానంలో ఉన్నసమయంలో దళిత సాహిత్యం అప్పటికే మొదలవుతున్నట్లుగా భావించాలి. ఇంకో ఉత్తరం కరుణ నక్సలైట్ ఉద్యమం నుండి జనజీవన స్రవంతిలో కలిసి దండోరాకు నాయకుడిగా ఎదుగుతున్న క్రమంలోది. ఈ ఉత్తరమే గ్రేస్ మొదట చదువుతుంది.

దండోరా నాయకుడిగా ఉద్యమంలోకి అడుగుపెట్టకముందు కరుణ తన అనుభవాన్ని జ్ఞాపకం చేసుకొని, తనకు తాను ప్రశ్నలు వేసుకొని, చాన్నాళ్ళపాటుగా ఉంటున్న నిశ్శబ్దాన్ని బద్దలుకొట్టుకొని రాస్తున్న ఉత్తరంగా చెప్పవచ్చు (పు. 211). దండోరా 16మంది కుర్రాళ్ళను అరెస్టుచేసి గొడ్డును బాదినట్లు బాదడంతో ఏమిచేయాలో తెలియక గుండెలవిసేలా ఏడ్చాడు. ప్రశ్నించిన కరుణను ఎస్.ఐ అసహ్యకరమైన బూతులుతిడుతూ మెడమీద చెయ్యివేసి బయటకు తోశాడు. కరుణ గతానికి భిన్నంగా వ్యవహరించడం అనేది దండోర చైతన్యంతో అలవడి ఉండవచ్చు. పదో బడి మానివేయడానికి అగ్రకుల దురహంకారం, కారణమన్నాడు. కాబట్టి

ఆత్మను నిద్రలేపు. నిప్పు రాజెయ్యమని చెప్పాడు. అంటే దండోరా చైతన్యాన్ని మనస్సునిండా నింపుకొమ్మని వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేయమని పిలుపునిచ్చాడు. అంతేగాక అన్నదమ్ములు రెండు దారులుగా విడిపోయినా విషయాన్ని గుర్తుచేశాడు. దళిత పోరాటాల గత, వర్తమాన, భవిష్యత్తులను రాబోయే తరాలకు అందించిన విషయాన్ని గుర్తుచేస్తూ ఇది మా తండ్రుల పుస్తకమని మన పిల్లలు తెరిస్తే వారిముందు ఎన్నో ప్రశ్నలు “అణచివేత, అవమానం, చెరసాలలు, ఉరికొయ్యలు, ఓట్ల రాజకీయం, దళిత బ్రహ్మలు, దళిత ఎలైట్‌లు, మనం నడిచిన దారులు, మనకన్నీళ్ళు, భవిష్యత్తును మనం ఎలా దర్శించాము సమస్తాన్ని వాళ్ళు చూస్తారని” (పు. 216) చెప్పి ముగిస్తూ “అందరం కలిసి అణిచివేతను తిరస్కరిద్దాం. బానిసలంకాదు రేపటి నాయకులమని” (పు. 217) గొప్ప ఆత్మగౌరవ ప్రకటన చేశాడు. అంబేద్కరిజం చెప్పే అధికారాన్ని చేజిక్కించుకోవడమే కరుణ అంతిమ లక్ష్యంగా ప్రకటించటం చెప్పుకోదగ్గ విషయం. కరుణ కమ్యూనిస్టుగా, నక్సలైట్‌గా, దండోరా నాయకుడిగా ఎదిగే క్రమంలో అనేక మార్పులకు గురవుతాడు. దండోరా నాయకుడిగా తన జాతి ఎదుర్కొంటున్న వివక్షతకు చలించిపోతాడు. తమ వివక్షతను విముక్తి చెందాలంటే భవిష్యత్తు నాయకులుగా ఎదిగి రాజ్యాధికారాన్ని చేపట్టడమే పరిష్కారములుగా భావించాడనవచ్చు. అందుకు దండోరా ఉద్యమాన్ని తొలిమెట్టుగా భావించినట్లుగా చెప్పుకోవచ్చు.

**4.2.8. నల్లమిరియం చెట్టు – మాదిగల కుటుంబ జీవనం:**

నల్లమిరియంచెట్టు నవలలో మాదిగల కుటుంబ జీవనం గూర్చి రచయిత విపులంగా వివరించారు. ఒకే కుటుంబంలోని మూడు జంటల జీవనం చిత్రించారు. మొదటిజంట ఆదెమ్మ, తిరుపతయ్యలు; రెండోజంట రాజయ్య, విజయలు; మూడోజంట కరుణకుమార్, సూర్యకాంతం. మూడు జంటలు ప్రేమవివాహాలు చేసుకుంటాయి. ఆదెమ్మ, తిరుపతయ్య జంట స్వతంత్ర్యంరాక పూర్వం వివాహం చేసుకుంటారు. పదహారు రూపాయలు ఓలి ఇచ్చి పెళ్ళి చేసుకున్నాడు. ఆదెమ్మ నులకమంచం, జర్మన్ సిల్వర్ బిందె కట్నంగా తీసుకువచ్చింది (పు. 80). అంటే ఆరోజుల్లో కింది కులాల్లో ఓలి (కన్యాశుల్కం) ఇచ్చి పెళ్ళి చేసుకోవడం కనబడుతుంది. పాలేరుపనిచేస్తున్న తిరుపతయ్యకు పిల్లనివ్వడమా అని ఎగతాళి చేస్తుంటే ఆదెమ్మ పట్టుపట్టి పెళ్ళిచేసుకుంది.

ఆదెమ్మతో పెళ్ళి తరువాత తిరుపతయ్యతో తోళ్ళ వ్యాపారం పెట్టించింది. భర్త తోళు ్ళ సేకరిస్తే ఆమె వాటిని శుభ్రం చేసేది. వాటిని ఒంగోలులో అమ్మేవారు. ఇలా మాదిగలు తోళ్ళ వ్యాపారంచేసి సంపాదించేవారు. వచ్చిన సంపాదనతో అరెకరం పొలంకొన్నారు, ఇళ్ళు కట్టుకున్నారు. “చారిత్రాత్మకంగా పరిశీలిస్తే మాదిగలు అనేక వృత్తులు చేసినట్టు కనిపిస్తుంది. విజయ నగరకాలంలో మాదిగలు చెప్పులు కుట్టేవారని, ..... పల్లవుల కాలంలో చర్మకారులుగా పనిచేసేవారు. ఇతర ప్రధాన కులాలతోబాటు పన్నులు కూడా చెల్లించారని...... తూర్పు చాళుక్యుల కాలంలో మాదిగవారు చర్మకార వృత్తిలో ఉన్నట్లు, వీరికి మాన్యాలు ఉ న్నట్లు తూర్పు చాళుక్య శాసనంలో ఉంది” (శ్రీనివాసరావు, చిలుమూరి. 2011: 143).

ఈ నవలలో పేర్కొనట్టు తోళ్ళ పరిశ్రమ మొదట్లో మాదిగ పల్లెల్లోనే ఉండేది. ఆదెమ్మ తోళ్ళను శుభ్రం చేసేది. “తోలును శుభ్రపరిచే ప్రక్రియను తోలూనుట అంటారు. చర్మం శు భ్రం చేయడానికి కరక్కాయలు, సున్నం, తుమ్మచెక్క, తంగేడుచెక్క కావాలి...... ఒక్క పశువు చర్మాన్ని శుభ్రం చేయడానికి.... 13 కిలోలు సున్నం పడుతుంది. అది సున్నంలో 15రోజులు నానాలి..... చర్మాన్ని శుభ్రమైన నీటిలో కడుగుతారు. కడిగిన తోలును నీటిలో 2రోజులు నానబెడతారు. ఆ తరువాత తోలు పలుచబడేందుకు చర్మాన్ని రాయిమీద లేదా మొద్దుమీద రాకుతారు....... అందంగా మెరిసేటట్లుగా చేయాలనుకున్నప్పుడు కరక్కాయ దంచి నీటిలో

ఉడకబెట్టి తోలుకు పట్టిస్తారు" ( శ్రీనివాసరావు, చిలుమూరి. 2011: 144). సున్నం, తంగేడుచెక్క, కరక్కాయలు తోలును రసాయన ప్రక్రియకు గురిచేస్తుందని మాదిగలు వేల సంవత్సరాల పూర్వమే కనుగొన్నారు. అందుకే కంచ ఐలయ్య మాదిగలను మొదటి రసాయనవేత్తలుగా తెలియజేశారు.

ఆదెమ్మకు మూడుసార్లు అబార్షన్ అయింది. తిరుపతయ్య మరోపెళ్ళి చేసుకొమ్మనమని బంధువులు కోరేవారు. పిల్లలు లేకపోతే ఏం ఆదెమ్మకు సవతి పోరే వద్దేవద్దు అని చెప్పేవాడు. అంతేగాక వెన్నెలరాత్రుల్లో ఇద్దరూ డప్పుమీద దరువువేస్తూ కూనిరాగాలు తీసేవారు. ప్రకృతే వారికి ఆట పాటలకు ప్రేక్షకురాలు. కోడికూసే సమయానికి తిరుపతయ్య ఒకవైపు తప్పెట, గుండెలమీద ఆదెమ్మ ఉండేవారు. మాదిగలు తప్పెటకు భార్య తర్వాతి స్థానం ఆ రోజుల్లో ఇచ్చేవారు. ఆదెమ్మ జంట ప్రేమగురించి పల్లెలో పాటలుకట్టుకొని పాడుకునేంత ఆదర్శవంతమైన జీవనం వాళ్ళు సాగించారు. ఆదెమ్మకు గుండ్లకమ్మలో స్నానం చేయడం ఇష్టం. అప్పుడు తిరుపతయ్య 'అప్పుడే ఈనిన దూడలా నిగనిగలాడుతున్నావ్' అని సరస మాడేవాడు. అలా సరసంగా ఉన్నప్పుడు ఊళ్ళో వాళ్ళు చోద్యంగా చూడడం ఆదెమ్మకు ఇష్టంగా ఉండేది.

కానీ వీరి సంసారం ఎక్కువకాలం కొనసాగలేదు. తిరుపతయ్యపై తమ్ములిద్దరూ విషప్రయోగం చేసి చంపారు. దాంట్లో ఊరి కరణం కూడ పాలుపంచుకున్నాడు. ఆదెమ్మ వారందరి మీద ఆడవాళ్ళను కూడగట్టి రాత్రుళ్ళు దాడిచేసేది. చనిపోవాలనుకుంది. కానీ పిల్లలు అనాథలవుతారని ఆగిపోయింది. భర్త చనిపోయిన విషయం మార్చిపోయి ప్రతిరోజూ ఆయనకోసం పీటవేసి, కంచంపెట్టేది. బట్టలు ఉతకడానికి వెళ్ళినప్పుడు "ముసిలోడు చొక్కాల్లో పుగాకు పెట్ట అట్టాగే వదిలివేస్తుంటాడు. అవి నీళ్ళలో నాని మరొకలైనయి" (పు. 79) అని ప్రక్కవాళ్ళతో చెబుతుండేది. అలాగని ఆదెమ్మ మతిలేనిదికాదు. పిల్లల చదువు ఆమె ఒక పిచ్చిలా అయిపోయింది. చదువుకొని ఉద్యోగం చేస్తున్న ఆదాం మాష్టారి పిల్లల్లా తన పిల్లలు ఉండాలనుకొంది. అప్పటికే మాదిగల్లో చదువుకొని, ఉద్యోగుల్లో స్థిరపడ్డారని ఆదాం మాష్టారు ద్వారా తెలుస్తుంది.

అంతేగాక ఆదెమ్మ భూమి విలువను కూడ తెలుసుకుంది. ఒకరోజు పిల్లలిద్దర్ని పొలానికి తీసుకువెళ్ళి మధ్యలో నిలబడి తాము ఆ పొలాన్ని ఎలా కష్టపడి సంపాదించింది వివరించింది. "తను చనిపోయినా ఆ పొలాన్ని నిలుపుకోవాలని కోరింది. పొలం లేకపోతే, తమను ఎవరూ పట్టించుకోరని, తాము బానిసలమేనని వివరించింది. అప్పుడే తమకులాన్ని గురించి, తమ అవమానాన్ని గురించి కూడా వివరించింది. తల్లీబిడ్డల మధ్య రోజూ ఇదే సంభాషణ" (పు. 83). దాంతో పిల్లలిద్దరూ పెరిగిన తర్వాత కూడ రాజయ్య ఆస్తి సంపాదించాడు. కరుణ ఆత్మగౌరవంకోసం బతికినన్ని రోజులు పోరాటం చేశాడు. ఆదెమ్మ కూడ చనిపోయేవరకు కొడుకులిద్దరి వద్దకూ వెళ్ళకుండా తను సంపాదించిన పొలంలోనే ఆత్మగౌరవంతో బతికింది. ఆదెమ్మ మొదటితరం దళితపాత్రకు ప్రతీక. ఆత్మగౌరవానికి నిలువెత్తురూపం ఆమెది.

రెండోజంట రాజయ్య, విజయాలది. ఇది విభిన్నమైన కుటుంబ జీవనంగా చిత్రీకరించాడు. రాజయ్య మిషనరీ స్కూల్లో చదువుకొని టీచరు ఉద్యోగం సంపాదించాడు. విజయను ప్రేమించి చర్చిలో పెళ్ళిచేసుకున్నాడు. విజయది క్రిస్టియన్ నేపథ్యంగల కుటుంబం. రాజయ్యది హిందూ, క్రైస్తవ సంప్రదాయాలు కలగలసిన కుటుంబనేపథ్యం. మిషనరీ స్కూల్లో చదివినప్పటికీ క్రైస్తవమతాన్ని 'కలోనియల్ లెగసీ'గా బ్రిటిష్ వాళ్ళు మనమీద బలవంతంగా రుద్దినదిగా కొట్టిపారేస్తాడు. అందుకే కొడుకు రూమీ రాజయ్యను ఆర్.ఎస్.ఎస్ మనిషి కాదు కదా! అని సందేహం వెళ్ళబుచ్చుతాడు. పిల్లలు గ్రేస్ కమల, రూమీ భవిష్యత్తుకోసం కలలు

కంటుంటారు. అమ్మాయిని డాక్టర్ని, అబ్బాయిని ఐ.ఏ.ఎస్ చేయాలని అనుకుంటారు. విలాసవంతమైన జీవితం కోసం రాజయ్య పాత్ర క్రమంగా పతనంవైపు ప్రయాణిస్తుంది. ఆ పతనం కుటుంబ పతనంగా మారిపోతుంది.

టీచర్‌గా వృత్తిని మొదటపెట్టి, కవిగా, రచయితగా, వ్యాసకర్తగా, యూనియన్ నాయకునిగా ఎదుగుతున్న క్రమంలో రాజయ్య నైతకంగా పతనమౌతాడు. బయట పౌరహక్కుల నేతగా పేరొంది, ఇంట్లో పిల్లల్ని, భార్యను క్రమశిక్షణ పేరుతో చావగొడతాడు. ఇతని నైతిక పతనాన్ని తట్టుకోలేక తల్లి కూడ ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంటుంది. తల్లిచావును కూడ ప్రశాంతంగా దు:ఖించలేని రాజకీయ జంతువుగా మారిపోతాడు. ప్రతిచిన్న విషయాన్ని తనే రాజకీయం చేస్తూ, ఇతరుల మీదకి ఆ నెపాన్ని నెడుతుంటాడు. ఏమి చేయలేని నిస్సహాయతలో భార్య, పిల్లల మీద తన ప్రతాపాన్ని చూపిస్తుంటాడు. ఏమి చేయలేని నిస్సహాయతలో భార్య, పిల్లలమీద తన ప్రతాపాన్ని చూపిస్తుంటాడు. యిరుకు పెంకుటిల్లు నుండి విశాల భవంతిలోకి మారినప్పటికీ అతని మనస్సు యిరుకుగానే ఉంటుంది. తమ్ముడు కరుణ అంటే పుట్టినప్పుడు నుండే అతనికి చులకనభావన. రాజకీయంగా తన దారికి తమ్ముడు కరుణ అడ్డువచ్చేడని అతడ్ని అంతమొందిస్తాడు. దండోర ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. కానీ చివర్లో దండోర నాయకుడి అవతారమెత్తి, వర్గీకరణ మంత్రాన్ని మాదిగల మీద ప్రయోగిస్తాడు. ఆయన మాయలో కొడుకు, కూతురు కూడ పడిపోతారు. చివరకు కరుణ హంతకుడు రాజయ్యేనని కుటుంబానికి తెలుస్తుంది. దాంతో భార్య విజయ తోడికోడలు కాంతం వద్దకు వెళ్ళిపోతుంది. కొడుకు రూమీ అక్కను కూడ అమ్మవద్దకే వెళ్లమని చెబుతాడు. పుట్టినరోజు ఉపన్యాసం చేస్తున్న రాజయ్య ముందుకువెళ్ళి ఇక ఆపండి మీ డ్రామాలు అని చెప్పి పెట్రోలు పోసుకొని, నిప్పు అంటించుకొని దండోర ఉద్యమాన్ని బ్రతికించుకోవడానికి ఆత్మహుతి చేసుకుంటాడు.

దళితుల్లో కూడ వర్గం తయారవుతుందని ఈ పాత్ర చెప్పకనే చెబుతుంది. కానీ ఈ వర్గం తన జాతికి ఎలాంటి మేలులు చేయదు. తన జాతి ద్వారానే లబ్ధిపొందాలని చూస్తుంది. అందులో భాగంగానే ప్రముఖ పార్టీలలో సెల్ నాయకులుగానే మిగిలిపోతారు. టిక్కెట్‌కోసం అగ్రకులాల కాళ్ళు పట్టుకోవడానికి కూడ వెనుకబడని స్థితిని ఆ పాత్ర ద్వారా (స్వగతంలా) రచయిత పలికిస్తాడు (పు. 206). రాజయ్య కుటుంబంలో రోజువారీ జీవితం యాంత్రికంగా ఉంటుంది. అందుకే రాజయ్య పిల్లలు పల్లెకు వచ్చినప్పుడు అసలైన జీవితం గురించి తెలుసుకున్నారు. పల్లెల్లో మనుష్యులు వారి ప్రేమలు, ఆప్యాయతలు, కులం దాని విరాట్ స్వరూపంను అవగతం చేసుకున్నారు. టౌన్‌కు బయల్దేరే ముందు జైలుకు వెళుతున్న ఖైదీల్లా భావించుకున్నారు. మొత్తం మీద చూస్తే రాజయ్య వైఫల్యాల పాత్రగా కనబడతాడు. కుటుంబపరంగా ఎప్పుడైతే పతనం ప్రారంభమౌతుందో రాజయ్య పాత్ర అన్నివిధాలా పతనం అవుతుంది. మాదిగలు మాతృస్వామ్య కుటుంబ వ్యవస్థనుండి పితృస్వామ్య కుటుంబ వ్యవస్థలోకి మారే క్రమంలో కుటుంబ వ్యవస్థ పతనం తమ జాతి పతనానికి దారి తీస్తుందని తెలియజేస్తుంది. అలా పతనం వైపు ప్రయాణించకుండా యువత నడుము బిగించాలని గ్రేస్, రూమీ, దేవూ పాత్రల ద్వారా తెలియజేశారు.

మూడోజంట కరుణకుమార్, సూర్యకాంతంలది. ఈ నవలలో ఈ జంట ఆదర్శవంతమైనది. ఇద్దరు పిల్లలు (రవి, అరుణ) పట్ల బాధ్యతగా ఉంటారు. ఈ జంట కూడ ప్రేమ వివాహం చేసుకుంటారు. ఇద్దరు చిన్నప్పటి నుండి కష్టపడి బతికే మనస్తత్వం గలవారు. కరుణ ఆత్మగౌరవంగల వ్యక్తి. ఆత్మగౌరవం కోసం ఎంత పోరాటం చేయడానికి కూడ వెనుకాడనివాడు. అందుకే కమ్యూనిస్టుగా, నక్సలైట్‌గా, దండోరా నాయకుడిగా మార్పుచెందుతాడు. కాంతం గొడ్డలిదెబ్బతో వికలాంగురాలిగా మారుతుంది. కరుణ

పరిచయంతో ఆ విషయం మారిపోతుంది. కరుణ నక్సలైట్‌గా మారి అడవుల్లో వున్న కాలంలో చీరల అలంకరణ, సినిమాలు చూస్తూ గడిపింది. ఆ మాయలో ఉండి ఊర్లో రెండు గ్లాసులపద్ధతి పాటించే హెూటల్ యజమాని చెంపపై కొడుతుంది. కరుణ ఆ ఘటనపై పోరాటం చేస్తాడు. ఆమెపై తన ప్రేమను ఆ పోరాటం ద్వారా వ్యక్తంచేస్తాడు. కాంతం కడుపుతో వున్నప్పుడు అన్నిపనులు తానే దగ్గరుండి చేస్తాడు. తర్వాత మామూలుగానే పార్టీపనుల్లో మునిగిపోయేవాడు. దాంతో అత్తతో కూడ భర్త గురించి పోట్లాట పెట్టుకునేది కాంతం. కరుణకి ఇవన్నీ పట్టేవి కావు. "తాగుబోతు అయినా బాగుండనిపించేది. పల్లెలో మిగిలిన మగవాళ్ళలా రోజూ పెళ్ళాన్ని బాదేవాడయినా బాగుండనిపించేది. అందరిలా కాకుండా అతడలా ప్రత్యేకమైన మనిషిలా ఉండడం" (పు. 114) కరుణ కుమార్ పాత్ర ప్రత్యేకత.

కరుణకు ఈ ప్రత్యేకమైన వ్యక్తిత్వం మాతృస్వామిక, పితృస్వామిక లక్షణాలు కలగలిసిన మాదిగల కుటుంబ జీవనం వలన సంక్రమించాయి. కరుణ, కాంతంలు ఎప్పుడూ కాడెద్దులా కలిసిమెలిసి ఉన్నారు. కాబట్టే వారిద్దరి మధ్య ప్రేమభావం వెల్లివిరిసింది. ఆ ప్రేమ భావమే వారి అన్యోన్య దాంపత్యానికి దారులు వేసింది. దండోరా ఉద్యమ క్రమం ఆ ప్రేమభావం మరింత వికసించింది. పల్లెను ఊరు వెలివేసినప్పుడు దండోరా చైతన్యంతో దాన్ని కరుణ కుటుంబం అధిగమించింది. దండోరా చైతన్యంతో మాదిగలంతా ఒకే కుటుంబంగా ఆ వివక్షతను ఎదుర్కొనట్లుగా నల్లమిరియం చెట్టు నవలలో రచయిత చిత్రీకరించారు.

**<u>4.2.9..మాదిగల ఆచారాలు, నమ్మకాలు :</u>**

ప్రతి కులానికి తమవైన ఆచారాలు, నమ్మకాలు ఉంటాయి. అలాంటి ఆచారాలు, నమ్మకాలు మాదిగల్లో కూడా ఉన్నాయి. కులాచారాల్లో మతం, సాంస్కృతిక జీవనం ప్రధానాంశం. ఆదెమ్మకు మూడుసార్లు గర్భస్రావం అయింది. నాలుగోసారి ఎరుకలసాని సోది చెప్పింది. పండంటి మగపిల్లాడు పుడతాడని, అయితే పోతురాజుకు పోతుదూడను బలి యివ్వాలని చెప్పింది. అలాగే చేసింది. పోతురాజు దయతో పుట్టాడని రాజయ్య అని పేరుపెట్టారు. క్రిస్టియన్ ఫాదర్ ఆశీర్వదించడం వలనే రాజయ్య పుట్టాడని తిరుపతయ్య అందరికీ చెప్పాడు. పిల్లాడు పుట్టిన సందర్భంగా ఊరంతటికీ పెద్ద విందుచేశాడు. కొడుకు రాజయ్యకు ప్రతిరోజు రాత్రి ఆదెమ్మ దిష్టితీసేది. మాదిగలు పిల్లకు, పెద్దలకు "చెడు ప్రభావాలు పడకుండా దిష్టితీస్తారు..... దిష్టి పోవడానికి వ్యక్తి చుట్టూ ఉప్పు, మిరపకాయలు, తిప్పి నిప్పులో వేస్తారు. ఆ వ్యక్తికి దుష్టశక్తులు సోకి ఉంటే మంటలనుండి పెద్ద చప్పుడు వస్తుంది" (శ్రీనివాసరావు, చిలుమూరి. 2011: 109) అప్పుడు దిష్టిపోతుందని మాదిగలు నమ్ముతారు. "మాదిగల్లో పిల్లలకోసం, ఇతర కోరికలు తీరటానికి దేవుళ్ళకు మొక్కుకొని అవి తీరిన తర్వాత మొక్కు తీర్చుకోవటం, తలనీలాలివ్వడం వంటివి చేస్తారు. గృహప్రవేశ సమయాన ఇంటివాకిట గుమ్మడికాయను పగులగొట్టడం, పాలు పొంగించటం గోవును ఇంట్లోకి తీసుకెళ్ళడం, వ్రతం చేయడం పూజలు జరిపించటం, చిన్నపిల్లలకు జ్వరాలు వస్తే తాయెత్తులు కట్టడం, దిష్టితీయడం మాదిగలలో పాటిస్తున్న కొన్ని ఆచారాలు" (శ్రీనివాసరావు, చిలుమూరి. 2011:110).

రాజయ్య భార్య విజయకు ఆదెమ్మకు లాగే రెండుసార్లు గర్భస్రావం అయింది. ఆదెమ్మ సోది చెప్పించుకుంది. పోతురాజుకు బలి ఇవ్వలేదని, శాపం వెంటాడుతుందని శాంతి చేయించమని ఎరుకలసాని చెప్పింది. కోడలకు ఆ విషయం చెబితే అలాంటి పూజలు చేయలేనంది. ఆదెమ్మ పల్లెకి వచ్చాక, ఉపవాసాలుంది. పోతురాజుకు మేక బలి ఇచ్చింది. మూడోసారి విజయ గర్భం నిలబడింది. ఆడపిల్ల పుట్టింది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మాదిగలు సోది చెప్పించుకుంటారు. విజయకు రెండో కాన్పులో మగపిల్లాడు పుట్టాడు. వాడికి న్యుమోనియాతో చనిపోతాడని అనుకున్నారు. ఆదెమ్మ మంత్రించిన తాయెత్తును తెచ్చి

మనవడి మెడలో వేసింది (పు. 89). తాయెత్తులు కట్టుకుంటే భూత, ప్రేత, పిశాచాలు సోకవని మాదిగలు నమ్ముతారు.

**4.2.9.1. మాదిగల మతం – పూజలు:**

మాదిగలు ద్రావిడులు. మూల భారతీయ నాగరికత సింధు నాగరికత ప్రజలు పూజవిధానం మాదిగల్లో కనబడుతుంది. జనాంగాలను, ప్రకృతిని, మాతృదేవతలను పూజించడం మాదిగల ఆరాధనలో ప్రధానాంశం. 'మతం విషయంలో మాదిగలు ప్రకృతిని దైవంగా భావించారు. మాదిగలు, మాతంగి, ఎల్లమ్మ, గంగమ్మ, పోచమ్మ, మైసమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ, పైడితల్లి అనే గ్రామదేవతలను పూజిస్తారు. హిందూమతంను ఆచరించే మాదిగలు ఎక్కువగా మాతంగిని, ఎల్లమ్మను పూజిస్తారు' (శ్రీనివాసరావు, చిలుమూరి. 2011: 131). ప్రకాశంజిల్లా మాదిగలు నజరయ్య మతాన్ని కూడ అనుచరించారు. తర్వాత క్రైస్తవ్యాన్ని స్వీకరించారు.

మాదిగలది పలానామతం అని ఖచ్చితంగా చెప్పలేము. మాదిగలు హిందూ, క్రైస్తవ, బౌద్ధ, ఇస్లాం, బ్రహ్మంగారి మతాన్ని పాటిస్తున్నారు. ఆంధ్ర ప్రాంతం మాదిగలు ఎక్కువగా క్రైస్తవమతాన్ని పాటిస్తున్నారు. రాయలసీమ, తెలంగాణలో ఎక్కువగా హిందూ మతంలోనే మాదిగలు ఉన్నారు. సమానత్వ అన్వేషణలో భాగంగా మాదిగలు సర్వమతాలను అక్కున చేర్చుకున్నారు. కానీ ఏ మతం వీరి సమస్యలకు పరిష్కారం చూపలేదు. ఆ విషయాన్నే నవలలో చంద్రశేఖరరావు చర్చించారు. ఏ పూజావిధానం, ప్రార్థనలు మాదిగల సమస్యకు పరిష్కారం చూపలేదు. అయితే ఈ నవల ప్రకాశం, గుంటూరు జిల్లాల నేపథ్యం సాగుతుంది. పల్లె నేపథ్యం ప్రకాశం జిల్లా గుండ్లకమ్మ ఒడ్డున, టౌన్ నేపధ్యమంతా గుంటూరులో సాగుతుంది.

ఆదెమ్మ, తిరుపతయ్యలు హిందూ, క్రైస్తవ సమ్మేళనంలోని పద్ధతులు పాటిస్తారు. అందుకే కొడుకు పోతురాజు పేరుమీద రాజయ్యగా పిలుచుకుంటారు. ఆదెమ్మ ప్రకృతి ఆరాధనకు ప్రాముఖ్యత ఇచ్చింది. తిరుపతయ్య క్రైస్తవ ఫాదర్‌తో ప్రార్థన చేయించడం వలనే కొడుకు పుట్టాడని చెప్పడంబట్టి తిరుపతయ్య క్రైస్తవమతానికే మొగ్గుచూపినట్లు తెలుస్తుంది. కోడలికి గర్భస్రావం జరిగిందని తెలిసి గుండ్లకమ్మకు పూజచేయమని విజయని అడిగింది. కానీ విజయ నేను బాప్తీజం తీసుకున్నాను. నేను ఆ పూజలు చేయనని సున్నితంగా తిరస్కరించింది. టౌన్ నుండి వచ్చిన తర్వాత ఆదెమ్మ ఉపవాసం ఉండి, పోతురాజుకు మేకను బలిచ్చింది. కోడలు గర్భవతి అయ్యింది.

ఆదెమ్మ చివరి రోజుల్లో నడవలేని స్థితిలో కూడ గుండ్లకమ్మకు కర్ర ఊతంతో వెళ్ళింది. "ఆదెమ్మచెప్పే గుండ్లకమ్మ దేవతగుడి. నాలుగైదు రాళ్ళతో కట్టిన ప్రదేశం, ఆ చీకట్లో అదో రాతి గుట్టలా ఉంది. లోపల విగ్రహం కనబడడం లేదు (పు. 142). అక్కడికి వెళ్ళిన ఆదెమ్మ తలచుట్టూ చీరకొంగు కప్పుకొని కూర్చుంది. తల ముందుకువంచి, నేలతో ముద్దుపెట్టుకున్నట్లుగా, గుడిముందు మోకరిల్లింది. దేవతలతో నేరుగా ఏదో మాట్లాడుతున్నట్లుగా గుసగుసలాడింది. గుళ్ళకమ్మవైపు తిరిగి దండం పెట్టుకుంది. ఈరోజు వరకు బతికించినందుకు, సూర్యకాంతికి కృతజ్ఞతలు చెబుతూ పురాతనమైన తెలుగు భాషలో మంత్రాల్లా దేవతతో మాట్లాడింది. "నిజానికది, పూజేమీకాదు. ఆత్మతోటి, జ్ఞాపకాలతోటి చేసే సంభాషణ దేవాలయాల్లోకి రానివ్వని రోజుల్లో సృష్టించుకున్న గ్రామదేవతల్లో ఒకరు గుళ్ళకమ్మ దేవత. ప్రత్యేకమైన పూజావిధానం ఏమీ ఉండదు. పూజారులంటూ ఎవరూ ఉండరు. దీపం వెలిగించి, కాస్త నైవేధ్యంపెట్టి (ఒకప్పుడు జంతుబలులుండేవట) తన మనసులోని విషయాన్ని పంచుకోవటమేనట, అందరూ సుఖంగా ఉండాలి. మనమళ్ళు, పిల్లలు బాగుండాలి లాంటి కోరికలు కోరటం" (పు. 143). ఆ పూజా విధానం ప్రకృతితో మాట్లాడడమే ప్రత్యేకత. తమ

పూర్వీకుల త్యాగాల్ని గుర్తుచేసుకోవడం లాంటిది ఆ పూజ. “వందేళ్ళక్రితం ఆదెమ్మ పూర్వీకులు శరీరాల్ని కప్పుకోను వస్త్రాలు లేనిరోజుల్లో, నివశించడానికి ఇళ్ళుకూడా లేని రోజుల్లో ఒక ఆటవికమైన సామాజికమైన వెలివేతపై ఎట్లా పోరాడి ఉండేవాళ్ళు, బహుశ బ్రతకటం ఓ పోరాటంగా జీవించి ఉంటారు. ఆ పోరాటస్ఫూర్తి కోసమే బహుశ ఆదెమ్మ తమ పూర్వీకులను స్మరించుకునేది” (పు. 146).

తమ పూర్వీకులను స్మరించుకోవడం, వారి త్యాగాలకు విలువనివ్వడం లాంటిది. అలాంటి పూర్వీకులలో మాతంగి ఒకరు. పౌరాణిక గాథలలోకంటే ఆమె ధైర్యవంతురాలుగా, ఒక తెగకు యోధురాలుగా కనబడుతుంది. క్రీ.శ. 1338లో మూడవ మహమ్మద్ కర్ణాటకలో కంపుల ఆక్రమణలో కుమార రామ నాయకత్వంలో యుద్ధం చేసిన తెలుగు యోధుల్లో ఆమె ఒకరు. కానీ యుద్ధం మధ్యలో మహమ్మద్ పక్షం వహించి, కుమార రాముని వధించి, అతని తలను ఢిల్లీకి తీసుకువెళ్ళింది (మూర్తి. వి.వి.న. 2011: 50) అని ఎమ్మాశొషాంబుక్లొ 1899లో పరిశోధనచేసి తెలియజేశారు. మాదిగలు “పూజలు ఆరంభించటానికి దారితీసిన కారణాలను మరిచిపోయినా మాదిగలు స్థలదేవతలను పూజిస్తూనే ఉంటారు.... మరణించిన మగగాని ఆడగాని ఆత్మలు అశాంతితో సంచరిస్తుంటాయని ఒక వేపచెట్టుని నివాసం చేసుకుంటాయని తరతరాలుగా నమ్ముతున్నారని.... చెప్పగలను. పురాతన ద్రవిడ కర్మ కాండలననుసరించి ఒక రాతిని ఆ చెట్టుకింద ఉంచి దానికి కుంకుమపూసి ఎర్రటి చుక్కలతో అలంకరించి పూజిస్తారు” (మూర్తి. వి.వి.న. 2011: 55) అని ఎమ్మారోషాంబు క్లొ తెలియజేశారు. అంతేగాక మాదిగలు పేరంటాలు పేరుతో పూజించే ఆచారం ఇంటింటా ఉంది. పేరంటాలు అంటే శుభమూ, అదృష్టమూ యిచ్చే స్త్రీ. మాతంగి, పేరంటాలు పూజ విధానంలో పసుపు దాని మీద ఎర్రచుక్కలు కనబడతాయి. దీన్ని నరబలికి ప్రతీకగా చెప్పుకోవచ్చని ఆమె తెలియజేశారు.

పై పూజ విధానమే మనకు నల్లమిరియంచెట్టు నవలలో కనబడుతున్నట్లుగా చెప్పుకోవచ్చు. ఆదెమ్మ ఈ నవలలో క్రైస్తవమతం కంటే తన పురాతన పూజ విధానంమీద నమ్మకం ఉంచింది. తన కోడలు విజయను ఆ పూజ విధానము కొనసాగించమని కోరింది. ఆమె అత్త కోరికను బాప్తీజం తీసుకున్నానని విగ్రహారాధన చేయనని సున్నితంగా తిరస్కరించింది. కొడుకు రామయ్య మిషనరీ స్కూల్లో చదువుకొన్నాడు. కనుక మొదట్లో ఆ మతాన్ని అంగీకరించినట్లుగా కనబడతాడు. తన వివాహాన్ని చర్చిలో జరుపుకుంటాడు. పెళ్లైన కొత్తలో భార్య విజయతో చర్చికి వెళ్ళాడు. కానీ తర్వాత క్రైస్తవ మతాన్ని బ్రిటిష్ మన మీద రుద్దిన ‘కలోనియన్ లెగసీ’గా అభిప్రాయపడతాడు. కానీ విజయ క్రైస్తవ మత విశ్వాసంతో ఉన్న కుటుంబంనుండి వచ్చింది. అందుకే ఆ మతాన్ని పూర్తి విశ్వాసంతో ఆచరించినట్లుగా తెలుస్తుంది. కష్టాలు ఎక్కువైనకొద్దీ ఆమె పూర్తిస్థాయి భక్తురాలిగా మారిపోతుంది. తమ కుటుంబంకోసం, దండోరాకోసం, సమాజం బాగుకోసం విజయ కన్నీటితో ప్రార్థనలు చేస్తుంది. కానీ ఆమె సమస్యలకు ఎలాంటి పరిష్కారాలు లభించవు. గ్రేస్ కమల, రూమీ కూడ క్రైస్తవమతంపై విశ్వాసం ఉంచారు. రాజయ్యలేని సమయంలో ఇంట్లో కూటమి ఏర్పాటుచేశారు. విజయను ఊరి చివరిచర్చికి తీసుకువెళ్ళేవారు.

కరుణకుమార్‌కు ఏ మతంమీద నమ్మకం ఉన్నట్లుగా కనబడదు. అతని భార్య సూర్యకాంతం మాత్రం క్రైస్తవమతంపట్ల విశ్వాసాన్ని ఉంచింది. ఆమె చర్చిలో ముఖ్యమైన సభ్యురాలుగా ఉంటుంది. కరుణ పరిచయమైన తర్వాత చర్చికి వెళ్ళడం మానివేస్తుంది. కానీ కరుణ ఉద్యమంలోకివెళ్ళి దూరమైనప్పుడల్లా చర్చికివెళ్ళి ఉపశమనం పొందుతుంది. జడ్జి నాగభూషణం కుటుంబం వివక్షతలనుండి విముక్తికొరకు చర్చికి వెళుతుంటారు. కానీ

కులవివక్షతలకు చర్చి పరిష్కారం చూపకపోవడంతో జడ్జి నాగభూషణం తీవ్ర మానసిక ఆందోళనతో ఆత్మహత్య చేసుకుంటాడు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న జడ్జి నాగభూషణం వివక్షత ఎదుర్కొంటే సామాన్యప్రజల సంగతి చెప్పేదేముంది. అందుకే మానసికంగా బలహీనంగా ఉన్నవారికి మతం వలన కొంత ఉపశమనం దొరుకుతుందేమో. కానీ పూర్తి పరిష్కారం లభించదని ఈ నవలలోని సంఘటనల ద్వారా రచయిత తెలియజేసి సమస్యల పరిష్కారంకోసం పోరాటం చేయాలని చెప్పారు. ఆ పోరాట స్ఫూర్తిని దండోర ఉద్యమం రగిలించింది. అందుకే రూమీ ఆత్మహత్యకి ముందు "దండోరాను మరోసారి చంపకండి సార్..... ఒక ఆశ, ఒక ఆత్మవిశ్వాసం: దీన్ని ధ్వంసం చెయ్యవద్దు. దండోరాను మీ రాజకీయ నిచ్చెనగా చెయ్యవద్దు. దండోరా మాకు ఒక మతం అయ్యింది. బానిసత్వాన్ని నిరాకరించడం నేర్పింది" (పు. 243) అని చెప్పి ఆత్మహుతి చేసుకొని చనిపోతాడు. ఒక మతంలా మారిన దండోరా ఉద్యమాన్ని స్వార్థ రాజకీయాలకు నిచ్చెనమెట్లుగా ఉపయోగపడకుండా యువత నడుము బిగించాలని సందేశమిచ్చి రచయిత ముగించారు. వాస్తవానికి అది నవల ముగింపుకాదు. ముగింపులా కనబడే ఒక ఆరంభం అని చెప్పుకోవచ్చు.

**<u>4.2.9.2. మాదిగల ఆహారపు అలవాట్లు :</u>**

భారతీయ సమాజం కుల ప్రాధాన్య సమాజం. ఏ కులానికి ఆ కులం తమవైన ఆహారపు అలవాట్లు ఉన్నాయి. అలాగే మాదిగలకు ప్రత్యేకమైన ఆహారపు అలవాట్లు ఉన్నాయి. ఆ అలవాట్లు వారిని సమాజం నుండి వెలివేసేందుకు దోహదం చేశాయి. అయినా మాదిగలు తమ ప్రత్యేక ఆహారపు అలవాట్లును మార్చుకోలేదు. అదే అంటరానితనానికి దోహదపడిందని 'అస్పృశ్యత – పుట్టు పూర్వోత్తరాలు' అనే వ్యాసంలో డా. బి.ఆర్. అంబేద్కర్ నిరూపించారు. మాదిగల ఆహారపు అలవాట్లు సమాజానికి భిన్నమైనది. ఎర్రకారం, గొడ్డుకారం, పచ్చిపులుసు, గొడ్డుమాంసం, చీకులు, చేపల పులుసులలో ఉన్న రుచేవేరు. తినేది సంగటి తునకలుకూర, సద్ది, పున్నీళ్ళకూడు అయినా ఆ రుచే అనిర్వచనీయమని మాదిగలు చెబుతుంటారు.

నల్లమిరియం చెట్టు నవలలో మాదిగల ఆహారపు అలవాట్లు రచయిత సందర్భానుసారంగా తెలియజేశారు. పల్లెలో, టౌనులో వేరువేరుగా మాదిగలలో ఆహారపు అలవాట్లు తెలియజేశారు. గుంటూరుకు పల్లెనుండి బంధువులు వచ్చినప్పుడు రాజయ్య ఇంట్లో పిల్లలకు ఇష్టమైన గోంగూర మాంసం తినేవారు. రాజయ్య పుట్టినప్పుడు తండ్రి తిరుపతయ్య ఊరంతటికి ఎంతోకాలం గుర్తుండిపోయే డిన్నర్ ఇచ్చాడు. ఆ విందులో నాలుగు మేడలు, కుండలు కుండలు సారాయి, ఒంగోలునుండి రంగుసారాయి (బ్రాందీ)తో ఘనంగా విందుచేశాడు. తిరుపతయ్య కండలు తిరిగిన బలిష్టమైన శరీరం కలవాడు. తప్పెటకొట్టి చిందులువేసేవాడు. రెండు కంచాలు కూడా ఆయనకు సరిపోయేవికావు. కుస్తీపోటీల్లో ఆయనే ఫస్టు. రెండు కుండల కల్లు తాగి, నిద్రలోనే మరణించాడు. రాజయ్య కూడ తండ్రిలాగే భోజన ప్రియుడు.

కానీ రాజయ్య మిషనరీ స్కూల్లో చదువుకుంటూ కొత్తమనిషిలా మారిపోయాడు. పల్లెకి, ఇంటికి రావాలంటే విసుగుగా వుండేది. ఇంట్లో చేసే ఆహారం సద్దికూడు, ఉల్లిపాయ, ఎండుమాంసం ముక్కలకూర వద్దనేవాడు. అవి తినడం అనారోగ్యమని తల్లిమీద విసుక్కునేవాడు (పు. 85). టీచర్ ఉద్యోగం వచ్చాక, రాజయ్య పల్లెకు రావడం తగ్గించి సంవత్సరం తర్వాత వచ్చాడు. గొడ్డుమాంసంతెచ్చి ఆదెమ్మ విందుచేసింది. "ఇంకా ఈ మాంసం తింటామా అని విసుక్కున్నాడు" (పు. 86). బీఫ్ తినడం పల్లెల్లో సర్వసాధారణం, అది రాజయ్యకు నచ్చలేదు. బీఫ్ తినడం వల్ల ఊరివాళ్ళు మాదిగల్ని వెలివేస్తున్నారని అనేవాడు. "ఇంటిముందు ఎండబెట్టిన

మాంసం (రిబ్బనులా పొడవుగా ఉండేవి), ఎండుచేపల్ని చూసి ముఖం చిట్లించేవాడు" (పు. 86). అందుకే ఆదెమ్మ 'మనమనిషి కాదురా' అనేది. కానీ రాజయ్య భార్య విజయ "ఎండు తునకల కూర (గోంగూరతో కలిపి చేసింది) తనకెంతో ఇష్టమని, అత్తతో చెప్పిమరీ వండించుకునేది" (పు. 87). రాజయ్య బ్రాహ్మణీయ భావజాల ప్రభావంతో గొడ్డుకూర తినడం నామోషీగా భావించాడు. అందుకే విసుక్కున్నాడు. సమాజం గొడ్డుకూర తినేవారిగా, తిననివారిగా విడిపోయింది. గొడ్డుకూర తింటారనే కారణంతో దళితులను నిత్యం వివక్షతకు గురిచేస్తారు. కానీ వేదకాలంలో యజ్ఞయాగాదుల పేరుతో బ్రాహ్మణులు అనునిత్యం గోమాంసం తినేవారని డా. బి.ఆర్. అంబేద్కర్ సప్రమాణికంగా పరిశోధించి నిరూపించారు.

దున్నకూర తినడం వెనకబాటుతనం అనడాన్ని వివిధ విశ్వవిద్యాలయాల్లో మాదిగ, ముస్లిం విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. కూరగాయలు మరియు ఇతర ఖరీదైన మాంసం కొనలేని దళిత విద్యార్థులకు చవకగా దొరికే పోషకాహారం దున్నకూరే. కాబట్టి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రతిసంవత్సరం జరిగే సుమూన్‌లో(2006) దళిత సంస్కృతిని ప్రతిబింబించే 'బీఫ్ బిర్యానీ స్టాల్' అనుమతి కోరారు. అధికారులు నిరాకరించారు. 'దళిత విద్యార్థి సంఘం' పోరాటంతో బీఫ్ బిర్యానీ స్టాల్‌కి అనుమతి లభించింది. అంతకుముందు మాదిగ విద్యార్థులు ప్రతిసంవత్సరం నూతన మాదిగ విద్యార్థులకు స్వాగతం పలికే సందర్భంగా బయటవారికి తెలియకుండా గొడ్డుకూరను తినేవారు. 2006 తర్వాత గొడ్డుకూర తినడం ఎలా వెనుకబాటు తనమని ప్రశ్నిస్తూ, ఆహార అలవాట్లను నిచ్చెనను మేధోపరమైన విమర్శకు గురిచేసి, హైదరాబాదు విశ్వవిద్యాలయ నడిబొడ్డు (అంబేద్కర్ ఆడిటోరియం)లో చర్చించి, బహిరంగ ప్రదేశాల్లో గొడ్డుకూర తినడం ఆరోగ్యమని చాటుతున్నారు. ఆ కూర తినడంపట్ల ఉన్న అసహ్యాన్ని కనుమరుగు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఇఫ్లూ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీల్లో గొడ్డుకూర బహిరంగంగా తినడం ఒక ఉద్యమరూపంగా మారింది.

కానీ ఈ నవలలో మాదిగలు గొడ్డుకూర తినని మాదిగలను పరాయివాళ్ళుగా చూస్తారు. గొడ్డుకూర తినకపోతే నువ్వేమి మాదిగోడివిరా అని అవహేళన చేస్తారు. ఆ కూర తినకపోతే మాదిగలు ఎదుర్కొనే అవమానాలు, ఆగవని మనుష్యులుగా పరిగణిస్తారనే గ్యారంటీలేదు. అందుకని గొడ్డుకూర తినడం మాదిగలు మానితే తమను తాము అవమానించుకోవడమే. అది మన ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంది. మన సాంప్రదాయాలు, అలవాట్లును పాటించి గర్వపడడం, వాటికి మనమెంత విలువనిస్తున్నామో బహిరంగంగా తెలియజేయడం మాదిగల్లో వచ్చిన ఆధునిక చైతన్యం. అందుకే ఆదెమ్మ గొడ్డుకూరను అసహ్యించుకున్న రాజయ్యను "ఈడు మన మనిషి కాదురా" (పు. 86) అని పరాయివాడిగానే కన్నకొడుకును భావించింది.

కానీ రాజయ్య పందిమాంసం ఎంతో ఇష్టంగా తినేవాడని భార్య విజయ ప్రత్యేకంగా వండేది (పు. 153). రాజమండ్రి నుండి పులసచేపలు తెప్పించి వండించుకు తినేవాడు. దున్నమాంసం తినడం నామోషీగా భావించాడు. కానీ కోడి, పంది, చేపలు తినడం స్టేటస్ సింబల్‌గా భావించి ఉండవచ్చు. ఆదెమ్మ చనిపోయేముందు రాత్రి, ఎండుచేపల పులుసు, సజ్జబువ్వను కోడలు కాంతం తినిపిస్తే ఇష్టంగా తినింది (పు. 143). ఆదెమ్మ చూడడానికి రూమీ, గ్రేస్ వచ్చినప్పుడు వారికి ఆప్యాయంగా కోడిగుడ్డు ఆమ్లెట్‌వేసి యిచ్చింది శెనక్కాయలు బెల్లం తినడానికి ఇచ్చింది. తాను గ్లాసుడు కాఫీ ఇష్టంగా తాగింది. ఆరోజు ఉంటే కోడినికోసి, విందు చేస్తానని చెప్పింది. కానీ రూమీ పున్నీళ్ళు అడిగాడు "కుండలోని పున్నీళ్ళు రెండు గ్లాసులతో తెచ్చింది. కుండబాగా కుదిపి (లోపలి మెతుకులు వచ్చేలా), పుల్లటి వాసన గుప్పుమంది. కొత్తగా ఉందా రుచి, పుల్లపుల్లగా" (పు. 93). రూమీ, గ్రేస్‌లకు, ఆ రుచిని

ఆస్వాదించారు. పున్నీళ్ళు గురించి ఏకుల వెంకటేశ్వర్లు రాసిన 'ఎన్నెలనవ్వు' నవలలో విపులంగా వివరించారు. ఈ రెండు నవలల్లో పున్నీళ్ల గురించి చెప్పబడింది. మాదిగలు, యానాదులు పున్నీళ్ళకుండను ఆకలి తీర్చే అక్షయపాత్రగా పవిత్రంగా భావించుకుంటారు. అందుకే మంగళ, శుక్రవారాలలో పున్నీళ్ళ కుండను తాకరు. ఎవరికీ ఇవ్వరు. పై విధంగా మాదిగల అలవాట్లను చంద్రశేఖరరావు తెలియజేశారు. ఆధునిక పోకడలతో మాదిగలు తమ ఆహార అలవాట్లు దూరమౌతున్నట్లు రాజయ్య పాత్రతో చెప్పారు.

**4.2.10 . పిల్లలు, స్త్రీలపై హింస :**

పితృస్వామ్య కుటుంబ వ్యవస్థలో స్త్రీలు అణిచివేత, వేధింపులకు గురవుతారు. పిల్లలు అందులో భాగంగా హింసలకు గురవుతుంటారు. ఈ నవలలో పౌరహక్కుల నాయకుడిగా చెలామణి అవుతున్న రాజయ్య తన భార్య, పిల్లలపై రకరకాల హింస పద్ధతులు ప్రయోగిస్తుంటాడు. బయటకు మాత్రం మానవహక్కుల ఉద్యమకారుడిలా ప్రవర్తిస్తుంటాడు. మానవహక్కుల గురించి పిల్లలతో ఎప్పుడూ మాట్లాడడు. అవన్నీ పిల్లలకు అవసరంలేని విషయాలుగా కొట్టిపారేస్తాడు (పు. 33). అంతేకాక పార్టీలకు తీసుకువెళ్ళి అక్కడి అగ్రకులాల పిల్లలు "ఎంత డిగ్నిఫైడ్‌గా ఉన్నారో, ట్రైటు బిహేవ్ లైక్ డీసెంట్ పీపుల్" (పు. 33) అని లెక్చర్ ఇస్తాడు. తను చిన్నతనంలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా చదువుకున్నాను. కాబట్టి మీరు మొదటి ర్యాంక్‌లు తెచ్చుకోవాలంటాడు. ర్యాంక్‌లు రావడం వేరంటూ పిల్లలను ఫెమ్‌బెత్తంతో తీవ్రంగా దండిస్తాడు. అడ్డువచ్చిన భార్యను తీవ్రంగా హింసిస్తాడు.

రాజయ్య ఊర్లో లేనప్పుడు పిల్లలు విజయ మనశ్శాంతికోసం కూటమి పెట్టించారు. ఆ విషయం తెలిసి భార్యను నిలదీయడం జరిగింది. గ్రేస్‌కు తల్లి వీపుపై వాతలు గుర్తొచ్చి అడ్డం వెళుతుంది. "ఎందుకు నాన్నా మీరిలా డిక్టేటర్‌లా బిహేవ్ చేస్తారు" (పు. 47) అని తండ్రి నిలదీసింది. గ్రేస్ ప్రతిఘటనను ఊహించని రాజయ్య గ్రేస్ చెంపపగలగొట్టాడు. ముఖంపై పొట్టపై అందినచోటల్లా, దెబ్బలు. తట్టుకోలేని బాధతో గ్రేస్ అరిచింది. అడ్డంవచ్చిన భార్య విజయకు రెండు దెబ్బలు పడ్డాయి. తర్వాతరోజే ఎం.పిగారి ఇంటి భోజనానికి వెళ్ళాలని అన్నాడు. భార్య నీరసంగా ఉంది ఇంకోసారి వెళ్దాం అంది. రాజయ్య ముఖం ఎర్రగా మారిపోయింది. ఎం.పి ఇంటికి వెళ్ళితే ఆయన కూతురు ఇల్లుమొత్తం చూపించింది. కానీ ఎం.పి భార్య గది చూపించలేదు. ఆమెను పరిచయం చేయలేదు. ఆమెకూడా విజయలాగే శపించబడ్డ దేవతే అయ్యుంటుందని గ్రేస్ భావించింది. అంటే సమకాలీన స్త్రీలందరి దుస్థితిని తెలియజేశారు.

ఎం.పి గారి ఇంట్లో భోజనం చేసివచ్చిన రాత్రి కూడ రాజయ్య భార్యను తీవ్రంగా కొట్టాడు. ఆ హింస తట్టుకోలేక ఆమె శోషవచ్చి నేలపైపడిపోయింది. ఆసుపత్రిలో చేర్చడంతో రెండురోజులకుగానీ ఆమె కోలుకొని ఇంటికి రాలేదు.

రూమీ, పల్లెలో దండోరా కార్యకర్తలతో యాక్టివ్‌గా తిరిగాడు. ఖాజావలి ద్వారా విషయంతెలిసి "నా పిల్లలు నాకిష్టమైనట్లుగానే ఉండాలి. వాళ్ళు నడవడిక నాకు పేరు తెచ్చేలా ఉండాలి. నేను చాలా హర్ట్ అయ్యాను. నా పెంపకంలో ఏదో లోపం" (పు. 151) ఉందని ఫేమ్‌బెత్తంతీసి చెరో ఐదు దెబ్బలు రక్తం కనబడేలా కొట్టాడు. తర్వాత డాక్టర్ చేత వైద్యం చేయించాడు. దండోరా బంద్‌లో పాల్గొన్నందుకు గ్రేస్‌కు రాజయ్య కౌన్సిలింగ్‌లో భాగంగా గ్రేస్‌ను వంటగదిలోకి తీసుకువెళ్ళి అట్లకాడలు రెండు స్టవ్‌మీద వేడిచేసి అరికాళ్ళమీద వాతలు పెట్టాడు. 'ఏమిటిది నాన్నా' అంటే "తప్పదు, నువ్వు బాగుపడాలంటే ఇంతకన్నా మార్గంలేదు" అన్నాడు. కూతురు అరుపులను విని విజయవచ్చి నిలదీస్తే రాజయ్య కళ్ళల్లో నీళ్ళతో "నేను కూడా బాధపడుతున్నాను. కానీ తప్పదని" (పు. 165) సమర్థించుకున్నాడు.

డాక్టర్‌ను పిలిపించి వైద్యం చేయించాడు.

దండోరా ఉద్యమంలో ఎందుకు తిరుగుతున్నావు. రూమీని నువ్వు నాయకుడివి అయ్యావా? అని, నువ్వేనా, మీఅక్కగారు కూడ ఇందులో తిరుగుతుందా అని ప్రశ్నించాడు. అవును మేము "దండోరా ఉద్యంలో తిరుగుతున్నాము. అవసరమైతే కాలేజీ కూడా మానేస్తాము. ఇది మాకు ముఖ్యమైన విషయం. ఇది మేము ఆత్మగౌరవ ప్రకటన అనుకుంటున్నాము" (పు. 179) అన్నాడు రూమీ. రౌద్రమూర్తి అయిన రాజయ్య రూమీని శిక్షిస్తుంటే గ్రేస్ అడ్డుగా చేతుల్ని చుట్టింది. రాజయ్య కోపంహెచ్చి బూటుకాలితో గ్రేస్‌ను బలంగా తన్నడం మొదలు పెట్టాడు. బూటుకున్న ఇనుపనాడా ఆమె మెత్తటి శరీరాన్ని నుజ్జునుజ్జు చేసింది. అయినా రాజయ్య దాడిని ఆపలేదు. ఆ దెబ్బలకు తట్టుకోలేక గ్రేస్ నేలంతా రక్తమయం అవడంతో సొమ్మసిల్లి పడిపోయింది. ఎప్పటిలాగే ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. ఈ సారి తమ్ముడు కరుణకుమార్ రాజయ్య చర్యలను తీవ్రంగా ఖండించి, పిల్లలను పల్లెకు తీసుకువెళ్ళాడు.

ఆదెమ్మ పిల్లలకు తను పదేళ్ళ వయస్సులో గ్రామంలో జరిగిన గొడవల్లో కర్రతీసుకొని పోట్లాటకు వెళ్ళిన సంగతి చెప్పింది (పు. 140). పదహారేళ్ళ వయస్సులో అందమైన ఆదెమ్మకు కష్టాలు ఎక్కువగా ఉండేవి. "కంది చేల మధ్యన ఆదెమ్మను కిరాతకంగా రేప్‌చేసిన సంగతి" (పు. 166) చెబితే "బలిసిన లంజా.... నువ్వే ఎగబడి" (పు. 166) ఉంటావని దూషించారు. కాలేజీలో గ్రేస్‌ను నల్లమందారమా? నా వర్జిన్ మేరి" అని ఈవ్ టీజింగ్ చేశారు. ఆ విషయం తల్లికి తెలిసి టీజింగ్‌ను ఎలా ఎదుర్కోవాలో గ్రేస్ చెప్పింది. కాలం మారింది, హింసించే పద్ధతులు అవే, సంఘటనలు అవే అని గ్రేస్ అనుకుంది. బంద్‌లో పాల్గొనడానికి బయటకు వచ్చిన గ్రేస్‌మీద పోలీసులు మూకుమ్మడిగా ముద్దులతో లైంగికదాడి చేశారు. అదే బంద్‌లో మరో అమ్మాయి పోలీసులు రేప్‌చేసిన వార్త పత్రికల్లో వచ్చింది. అందుకే గ్రేస్ పోలీసులను చూస్తేనే చిగురుటాకులా వణికిపోయింది.

కాంతాన్ని కరుణ ప్రేమగా చూచుకుంటాడు. కానీ ఉద్యమాలతో ఆమెను, కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. కాంతం చిన్నతనం నుండి అనేక కష్టాలు అనుభవించింది. వాటిని తట్టుకొని నిలబడింది. కరుణకోసం పోలీసులతో పోరాటానికి దిగింది. గొప్పధైర్యం ఉన్న కాంతం కూడా దిగులుపడింది (పు. 194). అందుకే గ్రేస్ ఈ విషయాలన్నీ గమనించి ఆడవాళ్ళ కథలన్నీ యింతేనా అని విచారించింది. విజయ అయితే దేవుడు మన పక్షానలేడు. మనం దేవుడు వదిలేసిన అనాథలమని బాధపడింది (పు. 239).

దండోరా ఉద్యమంలో అభంశుభం తెలిసిన పది సంవత్సరాల పసిపిల్లాడిని తగులబెట్టడం (పు. 235)తో నవల మలుపు తిరుగుతుంది. తల్లి హింసించే దేవూ, ప్రేమలో మోసపోయిన మరోవ్యక్తి ఉన్మాదిలా స్త్రీలపై దాడి చేస్తుంటారు. వీరిద్దరూ దండోరా ఉద్యమంలో చేరి అసలైన ప్రేమను తెలుసుకుంటారు. దేవూ తల్లిని కంటికి రెప్పలా చూచుకుంటాడు. ప్రేమ విఫలంతో సైకోగా మారినవ్యక్తి దండోర ఉద్యమంతో ప్రేమ నిరంతర కథాగానమని తెలుసుకుంటాడు (పు. 162). ఇప్పుడు ప్రజల్ని ప్రేమిస్తున్నారు. దేవూ దండోరా కోసం ఆత్మహత్య చేసుకొన్నాడు. అంతగా దండోర ఉద్యమం చైతన్యంతో ప్రేమజీవులుగా మారితే, రాజయ్యలాంటి వాళ్ళు దండోరాను వ్యతిరేకించి కొత్తకొత్త హింస పద్ధతులు ప్రయోగించడం రచయిత చిత్రీకరించారు.

### 4.2.11. విద్యావ్యవస్థ:

నల్లమిరియంచెట్టు నవలలో రచయిత మిషనరీ పాఠశాలలు, వీధిబడులలో ఉపాధ్యాయుల కులవివక్షతలు, సౌకర్యాలలేమిని, మిషనరీ స్కూల్లో చదువుకున్న విద్యార్థులు యాంత్రికంగా మారడం గురించి తెలియజేశాడు. దళిత ఉపాధ్యాయులు యూనియన్

నాయకులుగా పనిచేస్తున్నారని సస్పెండ్ చేయడం. రాజకీయ నాయకుల అండదండలతో మరల విధుల్లో చేరడం. ఆల్ ఇన్ వన్ గైడ్స్ వ్యాపారం చేయడం, గవర్నమెంట్ పుస్తకాలు నకిలీవి ముద్రించడం, ఆ స్కాం నుండి బయటపడడం, ఉన్నతచదువు చదువుకొని, ఉన్నతమైన పదవుల్లో ఉన్నా సమాజంలో కులవివక్షతలకు గురికావడం. విశ్వవిద్యాలయాల్లో ఉన్నతచదువు చదువుకున్న విద్యార్థులు ఉన్మాదులుగా మారినట్లు చెప్పబడ్డారు. దండోరా ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ (100 మందికి) టి.సి. ఇచ్చి పంపడం మొదలైన అనేక సంఘటనలు రచయిత విద్యావ్యవస్థను ప్రతిభావంతంగా చిత్రీకరించారు.

**4.2.11.1.పాఠశాల చదువులు:**

ఆదెమ్మ, తిరుపతయ్య కుటుంబంలో చదువుకున్న మొదటివాడు రాజయ్య. రాజయ్యను బడికి పంపడం ప్రహసనంలా సాగింది. రాజయ్య బడికి వెళ్ళినప్పుడు ఆదెమ్మ బడిముందే కూర్చొనేది. సంవత్సరంపాటు రాజయ్య కేవలం అ ఆ ఇ ఈ లే దిద్దాడు. అక్షరాలు నేర్చుకోవడానికి సుమారు యాభై పలకలు పగులగొట్టాడు. రాజయ్య చదువు గురించి పల్లెలో కథలు కథలుగా చెప్పుకొన్నారు (పు. 82). వీధిబడుల్లో పంతుళ్ళు సరిగా చదువు చెప్పట్లేదని ఆదెమ్మ రాజయ్యను మిషనరీ పాఠశాలలో (నాలుగు కిలోమీటర్ల దూరంలో) చేర్పించింది. ఆదాం మాష్టారు పిల్లలులా తన పిల్లలు ఖరీదైన బట్టలు ధరించి, ఇంగ్లీషులో మాట్లాడుతూ తిరగాలని ఆశపడేది (పు. 84). దీనిని బట్టి ఆరోజుల్లో మాదిగలకు తమ పిల్లల్ని మంచి చదువు చదివించాలని నలుగురిలో గౌరవంగా తిరగాలని ఆశపడేవారని భావించవచ్చు.

మిషనరీ పాఠశాలలో ఫాదర్ సంతానంకు రాజయ్య నచ్చాడు. బాప్తీజం ఇచ్చి చదువు చెబుతామని చెప్పాడు. ఆదెమ్మ భయపడింది. రాజయ్యను కూడ ఫాదరీని చేస్తారేమోనని ఫాదరీ హామీతో హాస్టల్లో చేర్పించింది. ఆరు నెలల్లో రాజయ్య రూపురేఖలు మారిపోయాయి. దాంతోపాటు రాజయ్యలో కూడా పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఆదెమ్మ రాజయ్య మార్పును చూసి ముచ్చటపడింది. పల్లెలో పదో తరగతి చదివిన మొదటివ్యక్తి రాజయ్యే. ఆదెమ్మ వారం వారం కొడుకుకోసం జున్నుపాలు, తినుబండారాలు స్కూలుకి వెళ్ళి ఇచ్చేది. తినుభండారాలు తీసుకురాకూడదని టీచర్లు చెప్పినా పట్టించుకునేదికాదు. రాజయ్యకు మాత్రం మిషనరీ చదువులతో పల్లెంటే అయిష్టం, చివరకు చింపిరి జుట్టుతో, చిరిగిన కోకలతో ఎందుకు తిరుగుతావని ఆదెమ్మను విసుక్కునేవాడు. కొడుకును కాలేజీలో చేర్పించడానికి ఆదెమ్మ గేదెలను అమ్ముకోవాల్సి వచ్చింది. కొడుకు కాలేజీలో చేరాడన్న ఆనందమే. కానీ పల్లెలో పిల్లల కళ్ళలో కనబడే వెలుగు, హుషారు రాజయ్య కళ్ళల్లో కనబడేదికాదు. మిషనరీ స్కూల్లో ఎందుకు చదివించానా అని బాధపడేది. మాదిగల ఆచార వ్యవహారాలను, ఆహారపు అలవాట్లను అసహ్యంగా భావించి విసుక్కొనేవాడు. దాంతో ఆదెమ్మ 'ఈడు మనవాడు కాదురా' అని కొడుకుమీద ఆశలు వదులుకుంది. చదువు మాదిగల పిల్లల్ని యాంత్రికంగా తయారుచేసి మానవసంబంధాలకు దూరం చేసిందని రాజయ్య పాత్ర ద్వారా అర్థం చేసుకోవచ్చు.

పై విషయాలన్నీ ఒకే విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి. మిషనరీ పాఠశాల విద్య కింది కులాల పిల్లలను తమ ఆచార వ్యవహారలు, ఆహార అలవాట్లును, సాంస్కృతికాంశాలపట్ల వ్యతిరేకత పెంపొందించాయని భావించవచ్చు. అంతేగాక విద్యార్థులను యాంత్రికంగా తయారు చేశాయనవచ్చు. అయితే ఇంకోరకంగా మిషనరీ పాఠశాలలు దళిత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాయి. వారి భవిష్యత్తును తీర్చిదిద్దాయి. రాజయ్య మిషనరీ పాఠశాలలో చదివినప్పటికీ క్రైస్తవమతం మీద గౌరవభావంలేదు. ఆ మతాన్ని బ్రిటీష్‌వారు మనమీద బలవంతంగా రుద్దిన 'కలోనియం లెగసీ'గా భావిస్తాడు. అస్పృశ్యతనుండి బయటపడాలంటే దళితులు తమ అలవాట్లను, ప్రవర్తనను మార్చుకోవాలని భావించే రాజయ్య

తనకు తెలియకుండానే బ్రాహ్మణీయ భావజాలానికి ప్రభావానికి గురవుతుంటాడు. అందులో భాగంగానే రాజయ్యలో ఆధిపత్య కులాలకు అనుగుణంగా మార్పులకు తలవంచుతున్నట్లుగా భావించవచ్చు.

కరుణకుమార్‌ను పదో తరగతిలో డ్రాపవుట్ అయ్యాడని రాజయ్య తమ్ముడ్ని తిడుతుంటాడు. కరుణ బడిమాని వేయడానికి అసలు కారణం కులవివక. సుందరమాష్టారు కరుణను క్లాసులో 'మాదిగ లంజకొడకా' అని తిట్టాడు. పట్టలేనంత కోపం వచ్చింది. హెడ్‌మాష్టారుకి పిర్యాదు చేస్తే విని విననట్లు ఉండిపోయాడు. తల్లికి చెబితే శాపనార్థాలు పెట్టి ఊరుకింది. కరుణకోపం చల్లారలేదు. రాత్రి పంతులు ఇంటిపై రాళ్ళు వేశాడు. అయినా కోపం చల్లారలేదు. తర్వాతరోజు పంతులు క్లాసులో ఉన్నప్పుడు వెళ్ళి 'సుందరి నాకొడకా' అని మొదలుపెట్టి కరుణకు వచ్చిన బూతులన్నీ తిట్టి, ప్రశాంతంగా నిక్కరు జేబులో చేతులు పెట్టుకొని హీరోలా నడుచుకుంటూ వచ్చాడు. అప్పటికి గానీ కరుణకు మనస్సు శాంతించలేదు (పు. 212). పై సంఘటన బట్టి కిందికులాలను పంతుళ్ళు కులం పేరుతోదూషించి, వారు చదువును మధ్యలోనే అర్థాంతరంగా ఆపేలా ప్రవర్తించేవాళ్ళని భావించవచ్చు. ముఖ్యంగా ప్రశ్నించే తత్వము ఉన్న కరుణలాంటి పిల్లల్ని కులంపేరుతో వేధించేవారని అర్థం చేసుకోవచ్చు.

ఆడపిల్లలు చదువుకోవడంపై ఆంక్షలు ఉండేవని కాంతం చదువు విషయంలో అర్థంచేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలలు దళితులకు అందుబాటులో ఉండేవికావు. అందుకే అమ్మాయిలు చదువుకోవాలంటే ఎంతో ప్రయాస పడవలసి వచ్చేది. అందుకే అమ్మాయిలు చదువును మధ్యలోనే ఆపివేసేవారు. కాంతం ఆరో తరగతిలో పై కారణాలతో చదువు మానివేసింది. ఇందుకు విజయ పాత్ర భిన్నమైనది. అప్పటికే విజయకుటుంబం క్రైస్తవ మిషనరీలలో విద్యాసౌకర్యాలు అందిపుచ్చుకొంది. ఆ ఫలాలను విజయ అనుభవించింది. కాలేజీలలో ఆడపిల్లల మీద అగ్రకుల విద్యార్థులు లైంగిక వేధింపులకు గురిచేసేవాళ్ళు. "మూడో సెక్షన్ కుర్రాడు ఒకడు సీరియస్‌గా నాదగ్గరకు వచ్చి గులాబీపువ్వు ఇచ్చాడు..... 'ఫరవాలేదు. తీసుకో, నాకు కులాల పట్టింపులు లేవు. నావల్ల మందారం ఐలవ్‌యూ..... ఇంతకీ నువ్వు వర్జిన్ మేరీవేనా' కళ్ళలో నీళ్ళు తిరిగాయి" (పు. 121). ఏమి చేయాలో తెలియలేదు. వక్తృత్వం పోటీలో మాట్లాడడానికి స్టేజీపైకి వెళ్తుంటే "వాడు చెయ్యి వూపుతున్నాడు. వేళ్ళతో సెక్స్‌ను సూచించే సంకేతాన్ని చూపాడు'' (పు. 122). కోపంతో గ్రేస్ నేను ప్రధానిని కావాలనుకోవడంలేదు. తుపాకీని కావాలనుకుంటున్నాను అనిచెప్పి స్టేజీ దిగింది.

గ్రేస్ ఈవ్‌టీజింగ్ విజయకు తెలిసి, కూతుర్ని ఓదార్చింది. ఈవ్ టీజింగ్‌లను ఎలా ఎదుర్కోవాలో తెలియజేసింది. పోకిరి కుర్రాళ్ళు అమ్మాయిలను ముఖ్యంగా క్రింది కులాలవాళ్ళను వేధింపులకు ఎలా గురిచేస్తారో ఎలా చులకనగా మాట్లాడతారో చంద్రశేఖరరావుగారు వాస్తవికంగా తెలియజేశారు. సమాజంలో ఎంతో మార్పు వచ్చిందని ఇప్పుడు కులాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రచారం చేస్తున్నారు. దళితులు చదువుకోనడంతో ఉద్యోగాలతో ఆర్థికంగా స్థిరపడి సమాజంలో అగ్రకులాలతో గౌరవింపబడుతున్నారనే ప్రచారం ఉంది. చదువే అన్ని మార్పులకు మూలమని నమ్మాడు జడ్జి నాగభూషణం. కానీ "కిరోసిన్ దీపం మాత్రమే ఉన్న గుడిసెలో చదువుకున్న కుర్రవాడు. స్కూల్ ఫైనల్ ఎగ్జామ్‌లో జిల్లాలోనే ఫస్ట్‌వచ్చి..... ఒక జత బట్టలు, ఒకపూట అన్నం, సెలవల్లో పొలం పనులు, ఆ కుటుంబంలో ఆరుగురు కష్టపడి, ఒక్కణ్ణి చదివించారు" (పు. 133). నాగభూషణం కుల వివక్షతల నుండి విముక్తి దొరుకుతుందని ఉన్నత చదువు చదువుకున్నాడు. జడ్జిగా ఉద్యోగం, అయినా "ఒక పలకరింపు ఉండదు, చిరునవ్వు ఉండదు. ప్రతిభకు గుర్తింపు ఉండదు..... ఆకుపచ్చని మొక్కకు నీళ్ళకు బదులు నిప్పులుపోస్తూ ఉంచే ఎన్నాళ్ళు బ్రతుక గలుగుతుంది" (పు. 134).

కులహింసల నుండి బయట పడడానికి చర్చికి కూడా వెళ్ళేవాడు. ప్రభువు కూడా ఆయన్ని రక్షించలేకపోయాడు. జడ్జి అనుమానాలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఉన్నత చదువులు, ఉద్యోగాలతో కులపట్టింపులు ఉండవనే వారికి జడ్జి నాగభూషణం పాత్రద్వారా వాటి తీవ్రతను తెలిపి కుల వాస్తవికతను సమర్థవంతంగా చంద్రశేఖరరావు చిత్రీకరించాడు. విశ్వవిద్యాలయ విద్య దళితుల్ని విముక్తుల్ని చేస్తుందంటారు. కానీ ఈ నవలలో దేవూ, దిలీప్‌లు ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలురాక, ఉన్మాదులు మారతారు. వీళ్ళు దండోర ఉద్యమ చైతన్యంతో మనుష్యులను ద్వేషించే స్థితి నుండి ప్రేమించేవారుగా మారు మనస్సు పొందుతారు. తమజాతి సంకల్పంకోసం దేవూ పెట్రోలుపోసుకొని సమానవాటాకోసం ఆత్మహుతి చేసుకొంటాడు. దండోర ఉద్యమంలో పాల్గొన్నందుకు పల్లెలో వందమంది మాదిగ విద్యార్థులకు మూకుమ్మడిగా టి.సి.లు ఇచ్చి స్కూలునుండి బయటకు పంపించివేస్తారు. పై సంఘటనలు సమాజంలో దళితులమీద ఎక్కడో ఒక్కచోట జరుగుతూనే ఉన్నాయి. వీటికి ఎదుర్కోవాలంటే పోరాటం తప్పనిసరి. అది ప్రజాస్వామిక పద్ధతుల్లోనే జరగాలని రచయిత తెలియజేశారనవచ్చు.

**4.2.12. నల్లమిరియంచెట్టు – కులవ్యవస్థ:**

కులవివక్ష ఎంత భయానకంగా ఉంటుందో చంద్రశేఖరరావుగారు ఈ నవలలో తెలియజేశారు. కులసమాజం ఎంత భయపెట్టాలని చూసినా కరుణలాంటి పాత్రలు నిరంతరం ఉద్యమాలతోపాటు పోరాటంచేసి దానిని అధిగమించడానికి ప్రయత్నంచేశారు. రాజయ్య అవకాశవాదిగా ఉంటూ కులసమాజానికి అనుగుణంగా నిరంతరం మార్పుచెందుతూ ఉంటాడు. జడ్జి నాగభూషణం కులహింసను భరించలేక ప్రాణాలు తీసుకుంటాడు. యువత మాత్రం సమానావకాశాలు అనే నినాదంతో అవి సాధించుకునే క్రమంలో ఆత్మార్పణ చేయడానికి కూడ వెనకడుగు వేయరు. పురాతన కాలం నుండి మాదిగలు కులవ్యవస్థ నిర్మూలన కోసం పోరాటంచేసి, ప్రాణాలు పోగొట్టుకున్నట్లు ఆదెమ్మ తమ పూర్వీకులను స్మరించుకోవడం ద్వారా తెలియజేశారు.

మనువాదంలో దళితులు ఆస్తిహక్కు, చదువుకునే హక్కు, ఆయుధంపట్టే హక్కులను కోల్పోయారు. వలసపాలనలో కింది కులాలకు చదువుకునే హక్కు ఇవ్వబడింది. ఇదంతా బ్రిటిష్‌వారు తమ మతాన్ని విస్తరించుకునే భాగంగానే మిషనరీలు స్థాపించి, విద్యా, వైద్యసేవలు అందించారు. వలసానంతరం ఆ సేవలు కొనసాగించారు. మిషనరీ సేవలతో దళితులలో ఎక్కువమంది చదువుకొని ఉద్యాగాలు పొందారు. కానీ పాఠశాలల్లో కులవివక్షత కొనసాగి దళితులు అర్థాంతరంగా చదువు మధ్యలోనే ఆపివేయడం జరిగిందని కరుణపాత్రద్వారా తెలియజేశారు (పు. 212). దళితులకు పాఠశాలలు అందుబాటులో లేక కాంతం ఆరో తరగతిలోనే చదువు మానివేస్తుంది. దండోర సభలో పాల్గొన్నందుకు వందమంది విద్యార్థులకు టీ.సీలు ఇచ్చి పంపుతారు. రూమీ దండోరా ఉద్యమంలో తిరుగుతున్నాడని అగ్రకుల స్నేహితులు అతడితో మాట్లాడకుండా దూరంగా ఉంచుతారు (పు. 50). గ్రేస్‌ను కాలేజీలో అగ్రకుల యువకుడు నల్లమందారమా! ఐ లవ్ యూ, నీవు వర్జిన్ మేరీవేనా’ అని ఈవ్ టీజింగ్ చేస్తాడు. అలాగే ఆదెమ్మ పదహారో ఏట రేప్‌కి గురవుతుంది. విజయ మేనత్తలు తమ చేయి పట్టి లాగినవాడ్ని చచ్చిపోయేలాగ కొడతారు. కులవివక్షను ధైర్యంగా ఎదుర్కొంటారు.

పల్లెమీద దాడిచేసిన కోమట్లను కరుణ నాయకత్వంలో ఎదుర్కొంటారు. విజయ ఆరితేరిన నాయకురాలిలాగా పల్లెలో మాదిగల పక్షాన నిలబడిపోరాటం చేసింది. చివరకు ఫాదర్నికూడ నిలదీసింది. రెండు గ్లాసుల పద్ధతిని ప్రశ్నించి, కాంతం హెూటల్‌వాడి చెంప చెళ్ళు మనిపించింది. ఆ సంఘటన ఊళ్ళో పెద్ద సంచలనం. కరుణ విజయవంతంగా తిప్పికొట్టాడు.

రాజయ్య టౌనుకు వచ్చిన మొదట్లో ఇల్లు అద్దెకు అడిగితే ముందుగా మీరేవుట్లా? అని ప్రశ్నిస్తారు. దాని సమాధానం తలదించుకోవడమే (పు.206). అవమానాలను మర్చిపోయి కొత్తజీవితంకోసం గతం గుర్తులేని వాడిలా నటించేవాడు. రాజకీయాల్లోనూ కులం ఉంది. దళితులకోసం అగ్రకుల పార్టీలు ప్రత్యేక నియోజకవర్గాలు, ప్రత్యేక సెల్‌లు ఏర్పాటుచేస్తాయి. వాటికోసం దళితులు స్వంత ఆలోచనలు చేయడం నిషిద్ధం. పార్టీ చెబితే తల ఊపే గంగిరెద్దులా, పెరట్లో కట్టి వేసిన కుక్కలా జీవించాలి (పు.207). ఏ పదవిలో ఉన్నా దళితులుగా మాత్రమే జీవించాలి. అగ్రకుల పార్టీలలో పనిచేసే దళితులకు మెదడు ఉండడంనేరం. అందుకే కాన్షీరాం అగ్రకుల పార్టీలతో పనిచేసే దళితులను చెంచా నాయకులుగా అభివర్ణించారు.

దండోరా చైతన్యంతో మాదిగ పల్లెలను సామాజిక వెలివేతకు గురిచేసారు. ఈ సంఘటనలు ఎక్కువగా రాయలసీమ ప్రాంతంలో జరిగినట్లు పొనుగోటి కృపాకర్ మాదిగ తెలియజేశారు. సామాజిక వెలివేత ఎదుర్కోవడానికి క్యాంపులు నిర్వహించినట్లు కూడ చెప్పారు. ఈ నవలలో కాంతం "మన వీధులకు కరెంటు సప్లై ఆపేస్తామని, నీళ్ళుబంద్ చేస్తామని బెదిరిస్తున్నారు. అసలు మాదిగ పల్లెనే బాయ్‌కాట్ చేస్తాం. మీ అర్జీలు ఎవరూ తీసుకోరు. మీయిళ్ళలో దొంగతనాలయితే పోలీసులు ఎవరూరావు. ఆఖరికి మీ చావు పుట్టుకల్ని నమోదు చేసుకోము" (పు. 194) అని బెదిరించారు. దండోరా సభలో పాల్గొనందుకు పైన పేర్కొన్నవన్నీ ఆపివేశారు. పల్లెతో కలిసే మెయిన్‌రోడ్‌ను ఇటుకలతో బారికేడ్లతో రవాణా సౌకర్యాలు అందకుండా చేశారు (పు. 198). కానీ కరుణ నాయకత్వంలో పల్లె ఆ సామాజిక వివక్షతను సమర్థవంతంగా ఎదుర్కొంది. దండోరా చైతన్యంతో గ్రేస్ "నాకూ, నా సమాజానికి మధ్యన కులం అనే ఒక సరిహద్దు" (పు. 156) స్పష్టంగా గుర్తించింది. అందుకే వివక్షతలను గ్రేస్ బేషరతుగా ఆహ్వానించింది. దండోర సభలో పాల్గొన్న మాదిగలను 'ట్రబుల్స్ మేకర్స్' అని విచక్షణ రహితంగా దాడిచేశారు. ముండలకు షోకులు కూడా అని అవమానకరమైన తిట్లతో దాడిచేశాడు. వాటన్నింటిని దండోరా చైతన్యంతో కాకులగుంపుల్లా ఎదుర్కొన్నారు మాదిగలు (పు. 163). చిందు కళాకారుడు రాయలసీమ కనకయ్య మాదిగ చేతివేళ్ళు నరికివేశారు. అయినా అతని కళ్ళముందు కుల వివక్షతలన్నీ తీసికట్టుగా మారాయి (పు. 205). వివక్షతలను మాదిగ యువకులు సాహిత్య, సాంస్కృతిక కేంద్రాన్ని స్థాపించి అధిగమించడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఉన్మాదులుగా ఉద్యమంలోకి వచ్చిన యువకులు దండోరా చైతన్యంతో ప్రేమతత్వంతో మానవత్వవాదులు మారిపోయారు. మాదిగ హక్కులే మానవ హక్కులుగా నినదించారు. దండోరా ఉద్యమాన్ని తెలివితక్కువ ఉద్యమమన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా ఆత్మహతి చేసుకొన్నాడు. మాదిగలు విముక్తిలో భాగంగా వర్గీకరణను తొలిమెట్టుగా భావించారనవచ్చు. వర్గీకరణ తర్వాత మాదిగలు అభివృద్ధిలో ముందుకు వెళతారని, రాజ్యాధికారం దిశగా అడుగువేయాలని అప్పుడే అందరం ఒక్కటవుతామని, "కులం, అంటరానితనం లేని రోజులు వస్తాయని" (పు. 113) కరుణ ఆశాభావం వ్యక్తంచేశాడు. కులనిర్మూలన ఉద్యమంలో భాగంగానే వర్గీకరణ ఉద్యమాన్ని చూడాలి. అందరికీ అవకాశాలు సమంగా పంపిణీ చేసినప్పుడే అభివృద్ధి సాధ్యం

### .4.2.13. దండోరా – ఆత్మహత్యలు:

దండోరా ఉద్యమం మొదలై తనదైన చైతన్యాన్ని మాదిగల్లో కలగజేసింది. మాదిగలు తమ హక్కులను సాధించుకునే క్రమం ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ నిరసనను తెలియజేసింది. తెలుగునేలమీద ఆధునిక కాలంలో రెండు గొప్ప ఉద్యమాలు జరిగాయి. 1. కారంచేడు, చుండూరు మారణకాండలపై పోరాటం చేసిన 'దళిత మహాసభ' ఆధ్వర్యం దళిత ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. 2. మాదిగ హక్కుల దండోరా ఉద్యమం. దండోరా ఉద్యమం హక్కులను

మాదిగలకు ఎరుకపరచి, మాస్‌మేనర్, ప్రజాస్వామికంగా మరియు శాంతియుత పద్ధతుల్లో జరిగింది. ఎప్పుడూ హింసాత్మకంగా మారలేదు. హింసాత్మక చర్యలకు పాల్పడి చట్టాన్ని ఎప్పుడూ చేతుల్లోకి తీసుకోలేదని దండోరా నాయకులు వివరించారు. మాదిగలు సంఖ్యాబలం కలిగిన కులం. కానీ రిజర్వేషన్లలో తమకు రావలసిన వాటా తమకు దక్కడంలేదని ఉ ద్యమించారు. ఉద్యమకాలంలో మాదిగ హక్కులే మానవ హక్కులని, మమ్మల్ని మనుష్యులుగా గుర్తించండి, గౌరవించండి అని నినదించారు. అందుకు సంఘీభావంగా తెలుగు సమాజమంతా ముక్తకంఠంతో మద్దతు ప్రకటించింది. ఉద్యమ ప్రభావంతో ప్రభుత్వం దిగివచ్చి, రామచంద్రరాజు కమిటీ నియమించింది. ఆర్డినెన్స్ ద్వారా చట్టంచేసింది. 2004లో సుప్రీంకోర్టు రాష్ట్రం చట్టం చేయడం చెల్లదని, పార్లమెంట్ మాత్రమే చట్టం చేయాలని కొట్టివేసింది. ఆ చట్టం చేయకముందు వర్గీకరణ సాధించుకునే క్రమంలో అనేక మంచి త్యాగాలు చేయడం జరిగింది. ఆ త్యాగాల్లో ఆత్మహుతి చేసుకొని అమరులైనవారు ఉన్నారు.

వర్గీకరణ చట్టం చేయకముందు ఆత్మహుతి చేసుకున్నవారిలో మొదటివాడు. తెల్లబండ్ల రవి, (తాడిపత్రి, అనంతపురం జిల్లా) కలెక్టరేట్ ముందు కిరోసిన్ పోసుకొని తగలబెట్టుకున్నాడు. నిమ్స్ ఆసుపత్రిలో ప్రాణాలు వదిలాడు. దండోరా ఆత్మహుతుల పరంపరలో మొదటిదిగా రికార్డు అయింది. వర్గీకరణ చట్టం సుప్రీంకోర్టు తిరస్కరణకు గురైన తర్వాత ఉషామెహ్రా కమీషన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆ కమీషన్ కూడ వర్గీకరణకు అనుకూలంగా నివేదిక సమర్పించింది. ఆ నివేదికను అనుసరించి పార్లమెంట్‌లో చట్టం చేయాలని దండోరా కార్యకర్తలు హైదరాబాదు గాంధీభవన్ కాంగ్రెస్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సమయంలో సురేందర్, దామోదర్, మహేష్ అనే యువకులు ఆత్మహుతి చేసుకొని అమరులయ్యారు. కానీ వర్గీకరణ చట్టంగా మారలేదు. వారి ఆత్మబలిదానాలు వృధాగా మిగిలిపోయాయని దండోరా నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నవలలో మాదిగ చైతన్యం ఎలా ఎదిగిందో తెలియజేశాడు. దండోరా ఉద్యమంలో మాదిగలు పరస్పర సహకారం, సమన్వయంతో పోరాటం చేశారు. తమను తాము ఉ ద్యమంకోసం బలి చేసుకున్నారు. కానీ ఇతరులకు ఎలాంటి హాని కలుగచేయలేదు. నవలలో మూడు ఆత్మహుతులు పేర్కొన్నాడు రచయిత. మొదటి ఆత్మహుతి దేవూ అనే ఉన్నత విద్యావంతుడు చేసుకుంటాడు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి దండోరా ఉద్యమాన్ని తెలివితక్కువ ఉద్యమంగా పేర్కొన్నందుకు నిరసనగా కలెక్టరేట్ ఎదుట పెట్రోలు పోసుకొని "దండోరా కోసం ఆత్మహుతి చేసుకుంటున్నా" (పు. 183) అని ప్రకటిస్తూ అక్కడికక్కడే మంటల్లో కాలిపోయాడు. దేవూ దండోరాను తన ప్రాణంకన్నా మిన్నగా భావించాడు. కనుకే ఆత్మబలిదానం చేశాడనవచ్చు. రెండో ఆత్మహుతి కరుణను హత్య చేసిన రాజయ్య దండోరా నాయకుడిగా ఎదిగే క్రమంలో నిరవధిక నిరాహారదీక్షలో పది సంవత్సరాల పసిపిల్లవాడు పెట్రోలు పోసుకొని తగలబడిపోయాడు (పు. 235). దండోరా ఉద్యమంకోసం ఆత్మహుతి చేసుకునే వయస్సు ఆ పసివాడికి లేదు. వాడిని ఎవరో ప్రేరేపించి ఉంటాడని భావించవచ్చు. అప్పటివరకు తండ్రిని అనుసరించిన రూమీకి ఆ పసివాడికి పెట్రోలు డబ్బా ఎలా వచ్చిందని ప్రశ్నించాడు (పు. 236). ఇదే కథలో కీలకమైన మలుపుగా చెప్పుకోవచ్చు.

పసివాడిచావుతో తండ్రి రాజకీయ స్వభావాన్ని అర్థం చేసుకున్నాడు. బాబాయ్ కరుణను కూడ రాజయ్యే హత్య చేయించాడని తెలియడంతో రూమీ నిస్తేజంగా మారిపోయాడు. "సమాధిని తవ్వి, ఒక చావుకోసం ఎదురు చూస్తున్న వాడిలా" (పు. 238) రూమీ మారిపోయాడు. కానీ ఆ నిస్తేజం నుండి గతంలో దండోరా చైతన్యంతో జరగబోయే ఉపద్రవాన్ని భవిష్యత్తు చిత్రాన్ని ఊహించాడు. రాజయ్య నాయకులతో దండోరా వారికి రాజకీయ నిచ్చెనగానే ఉ

పయోగపడుతుందని గ్రహించాడు. వర్గీకరణకోసం ఎదురు చూస్తున్న లక్షలమంది మాదిగలు అన్యాయం జరుగుతుందని రూమీ ఆలోచన చేసి ఉండవచ్చు. రాజయ్యలాంటి రాజకీయ నాయకుల కబంధహస్తములనుండి దండోరాకు విముక్తి కలిగించాలని భావించాడు. అందుకే సముద్రాన్ని చీల్చిన మోజెస్‌లా జనాల్ని చీల్చుకుంటూ తండ్రి రంజయ్య ఎదురుగా నిలబడ్డాడు. మీ డ్రామాలు ఆపండి. దండోరాను మీ రాజకీయ నిచ్చెనగా చెయ్యవద్దు. దండోరా మాకు ఒక మతం అయింది. బానిసత్వం నిరాకరించడం నేర్పిందని చెప్పి పెట్రోలు పోసుకొని ఆత్మహుతి చేసుకున్నాడు. ఆత్మహుతి అనేది నిరసన కార్యక్రమాల్లో చిట్టచివరి అస్త్రం. ఆత్మహుతి చేసుకునే వ్యక్తి తను నమ్మిన సిద్ధాంతంకోసం ప్రాణాలు సైతం ఫణంగా పెట్టడం అసాధారణమైన విషయం. ఉద్యమం ప్రక్కదారులు పడుతున్నప్పుడు, లేదా ముఖ్యంగా ప్రభుత్వం తమ న్యాయమైన హక్కులు పట్టించుకోనప్పుడు ఆత్మహుతులద్వారా ఉద్యమకారులు ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తారు. తమ ఉద్యమ ఆకాంక్షను బలంగా వ్యక్తంచేయడానికి వేరేమార్గం లేక ఆత్మహుతి మార్గాన్ని ఎంపిక చేసుకుంటారు. కానీ ఈ నవలలో రూమీ హుడినీ మాంత్రికుడిలాంటి రాజయ్య స్వభావం తెలిసి, ఆయన నుండి ఉద్యమాన్ని రక్షించడానికి తన తీవ్ర నిరసనను ఆత్మహుతిరూపంలో వ్యక్తం చేస్తాడు. దండోర కార్యకర్తలను మరో నాయకత్వానికి యువత నడుం బింగించాలని ప్రతీకాత్మకంగా తెలియజేస్తున్నట్లుగా రూమీ పాత్రద్వారా రచయిత తెలియజేశారనవచ్చు.

కులవ్యవస్థలో అందరూ బానిసలేనని ఈ బానిసలందరికీ సమాన హోదా లేదంటారు అంబేద్కర్. దీన్ని మాదిగ, మాదిగ ఉపకులాలు తమకు తామే అన్వయించుకున్నాయి. ఎస్.సి.లలో అగ్రకులంగా వ్యవహరిస్తున్న మాలలతో ఏ రంగంలో కూడ పోటీ పడలేమనే ఆత్మన్యూనత భావం దండోర ఉద్యమానికి మూలమైంది. ఈ ఉద్యమ ఫలితంగానే మాదిగలతోపాటు మిగతా కులాలన్ని తమని తాముగా గుర్తించడం కోసం ఉద్యమిస్తున్నాయి. దండోర ఉద్యమం ముందు వరకు ఎస్సీ (విద్యార్థులు)లు ఎక్కువగా కులం పేరు చెప్పుకునే సాహసం చేయలేదు. తప్పని సరైతే 'క్రిస్టియన్స్'గా చెప్పుకున్నారు. అలా చెప్పుకున్న చిన్నచూపే. దండోర ఉద్యమ చైతన్యంతో నేను మాదిగ, మాల అని ముందుకు వస్తున్నారు. అయితే ఉ ద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్న నాయకులే కులంపేరు పెట్టుకున్నారు. దీన్ని కొంతమంది విలోమ చైతన్యంగా విమర్శించారు. కానీ ఇది ఇతర కులాలకంటే తమ కులం తక్కువ కాదనే. ఆత్మన్యూనతకు తగ్గించుకోవడానికే కాని, కులాన్ని, కులతత్వాన్ని స్థిరపర్చడానికి కాదనేలేనిదని విమర్శకులు గమనించాలి.

ఒక కొత్తపుట్టుక కోసం మాదిగలు ఎక్కడ తప్పటడుగులు వేస్తున్నారో అవగాహన చేసుకొని దానికి అనుగుణంగా వేదికలు ఏర్పాటుచేసుకొని ఉద్యమించారు. ఈ క్రమంలో 'బోధించు, సమీకరించు, పోరాడు' అనే అంబేద్కరిజ త్రిసుత్రాన్ని దండోర ఉద్యమానికి అన్వయించుకొన్నారు. సామాజిక న్యాయంకోసం సమన్వయ వాదాన్ని, జనాన్ని ప్రాతిపదిక ప్రకారం వాటాలను పంచాలని డిమాండ్ చేసింది. సమన్వయ వాదంతో ఏకీభవించి అన్ని రాజకీయ పార్టీల ప్రజాసంఘాలు దండోర ఉద్యమానికి మద్దతునిచ్చాయి. ఎస్.సిల రిజర్వేషన్ ఫలాలు అన్ని ఉపకులాలకు సమంగా పంచింది. దీన్ని ఎస్.సి.లలో ఆధిపత్య కులమైన మాలలు వికృత వాదంతో వ్యతిరేకించారు.

మాదిగలు ఎస్.సి.లలో అణగారిన కులాలకు హక్కులకు బోధించి, సమీకరించి, సమన్యాయం కోసం పోరాటంచేసింది. వర్గీకరణ వ్యతిరేకవాదులు ఎస్.సి.లలో సమన్యాయానికి ఒప్పుకోక ఐక్యత పేరుతో వర్గీకరణ అగ్రకులాల రాజకీయ పార్టీల కుట్రనీ ఇది దళిత ఐక్యతకు గొడ్డలి దెబ్బని ఐక్యతా వాదులుగా ముందుకొచ్చారు. మాదిగలను

దళిత ద్రోహులుగా, అగ్రకుల రాజకీయ పార్టీల ఏజెంట్‌లుగా ప్రకటించి 'మాలమహానాడు' పేరుతో వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించారు. ఈ అంతర్గత ఉద్యమాలలో మాదిగలు చైతన్యవంతమై ఐక్యంగా ఒక సామాజిక శక్తిగా ఆవిర్భవించారు. ఈ ఉద్యమాలలో మాదిగ, మాలలు ఉమ్మడి శత్రువుని విస్మరించి తమలో తాము కలహించుకోవడం సరికొత్త అనుభవాన్నిచ్చింది. వెలుపల ఉన్న అగ్రకుల రాజకీయ పార్టీలు దళితులను గుత్తే ఓట్ భ్యాంకు మార్చుకోవాలని ప్రయత్నించి కొంతవరకు సఫలత సాధించుకున్నాయి.

అయితే మాదిగలు ఒక సామాజిక శక్తిగా ముందుకు వచ్చినప్పటికీ స్థిరమైన ఓట్ బ్యాంక్‌గా ఏర్పడే కులచైతన్యం చెందలేదు. అందుకే రాజకీయ పార్టీలన్నీ వర్గీకరణకు మద్దతు ప్రకటించిన రాజ్యాంగ భద్రతకు (చట్టసవరణకు) చిత్తశుద్ధి చూపించడం లేదు. కనుక మాదిగ ఉపకులాలు రాజకీయ నిర్లాయకశక్తిగా ఆవిర్భవించవలసి ఉంది. గత వర్గీకరణ ఉద్యమంలో సామాజిక శక్తిగా ఎదిగి వర్గీకరణ ఆర్డినెన్స్ సాధించింది. చట్ట సవరణకోసం మాదిగ, ఉపకులాలు నేటి వర్గీకరణ ఉద్యమంలో రాజకీయ నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి.

దండోర ఉద్యమంలో దళితుల ఐక్యత విఘాతమైందని కల్లబొల్లి కబుర్లు మాలలు వర్గీకరణకు అడ్డు చెబుతున్నారు. నిజానికి దండోరా ఉద్యమంతో కింది కులాల్లో ఎవరికి వారే తమ హక్కులకోసం ఉద్యమించడం చెప్పుకోదగిన పరిణామం. ఎస్.సి.లలో అణగారిన కులాలకు సామాజిక న్యాయం సమంగా అందేలా స్ఫూర్తి నిచ్చి సామాజిక ఉద్యమాల్లో మైలురాయిగా నిలబడింది.

ప్రతి అణచబడిన కులం చైతన్యవంతమై తమ హక్కులకోసం పోరాడినప్పుడే వారి అభివృద్ధి సాధ్యమౌతుంది. అభివృద్ధి ఫలాలను సామాజిక న్యాయపరంగా పంపకాలు జరగాలి. సామాజిక హక్కులు సమంగా పంచుకోవడమంటే అనైక్యత కాదు. అది బాధ్యతతో కూడిన ఐక్యత. హక్కులు సమంగా పంచబడినప్పుడే ఐక్యత సుసంపన్నం.

దండోర ఉద్యమం గత 14సంవత్సరాలు సామాజిక న్యాయంకోసం పోరాడుతున్నారు. పోరాట ఫలితంగా రాష్ట్రపతి ఆర్డినెన్స్‌తో నాలుగు సంవత్సరాలు వర్గీకరణ ఫలాలు అందాయి. మాదిగ, ఉపకులాలకు 50 సంవత్సరాల్లో 20వేల ఉద్యోగాలు వస్తే ఆర్డినెన్స్ అమలులో ఉన్న నాలుగు సంవత్సరాల్లోనే 20వేల ఉద్యోగాలు వచ్చాయి. వర్గీకరణతో అదనపు ఫలాలు అందక మాలలు ఎస్.సి.లలో అణగారిన కులాలకి అందాల్సిన, అందుతున్న రిజర్వేషన్ ఫలాలను రాజ్యాంగంలోని సాంకేతిక కారణాలను సాకుగా చూపించి, మాల, మాదిగల మధ్య ఐక్యత మొగ్గ తొడుగుతున్న దశలో వర్గీకరణను సుప్రీంకోర్టు ద్వారా రద్దు చేయించింది. అయితే సుప్రీంకోర్టు వర్గీకరణను తప్పుబట్టలేదు. వర్గీకరణను రాష్ట్రప్రభుత్వం (రాష్ట్ర అసెంబ్లీ) చేయడాన్ని రాజ్యాంగ విరుద్ధమని పార్లమెంట్ ఆమోదంవల్ల జరిగే చట్ట సవరణతో వర్గీకరణ సాధ్యమౌతుందని అణచబడిన కులాలకోసం ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని తీర్పునిచ్చింది.అందుకు అనుగుణంగా దండోరా ఉద్యమాన్ని పోరుబాట ఉధృతమయింది.

## 4.2.14. మాదిగ దండోరా ఉద్యమ క్రమం

| | |
|---|---|
| 1994 జూలై 7 | ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావం |

1994 ఆగస్టు 25 ఒంగోలులో 5వేల మందితో డివిజన్ ర్యాలీ, సదస్సు
1994 సెప్టెంబరు 28కందుకూరులో 20వేల మందితో ప్రదర్శన, బహిరంగసభ
1994 సెప్టెంబర్ 30 కనిగిరిలో 5వేల మందితో తాలూకా ర్యాలీ, సదస్సు – ఎన్నికల్లో తటస్థం – డిమాండ్ల ప్రచారం – నిర్మాణం
1995 మే 31 ఒంగోలులో 70వేల మందితో భారీ ఊరేగింపు, బహిరంగ సభ
1995 సెప్టెంబర్ 28విశాఖపట్నంలో 40వేల మందితో ర్యాలీ, బహిరంగసభ
1995 అక్టోబర్ 25 నెల్లూరులో 25వేల మందితో ర్యాలీ, బహిరంగసభ
1995 నవంబర్ 25 విజయవాడలో 30వేల మందితో ర్యాలీ, బహిరంగసభ
1996 జనవరి 8 కర్నూలులో 70వేలమందితో భారీర్యాలీ, బహిరంగసభ
1996 ఫిబ్రవరి 18 హైదరాబాదులో ఎస్.సి. వర్గీకరణపై సెమినార్
1996 మార్చి 2 చలో హైదరాబాద్ 3 లక్షల మందితో భారీ ప్రదర్శన, నిజాం కాలేజిగ్రౌండ్‌లో బహిరంగసభ
1996 మార్చి 11–17అన్ని జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు
1996 మార్చి 14 అసెంబ్లీ లాబీల్లో దండోరా ప్రదర్శన
1996 మార్చి 18 అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు, ఊరేగింపులు
1996 మార్చి 25 హైదరాబాద్‌లో మాదిగల ఆత్మగౌరవ ప్రదర్శన, బహిరంగసభ – ముఖ్యమంత్రి, మంత్రుల హాజరు
1996 జూలై 8–16 రోడ్డుమీద దండోరాలు (రాస్తారోకోలు)
1996 జూలై 17 మాదిగ ఎమ్.ఎల్.ఏ.లు ముఖ్యంత్రిని కలిసి వర్గీకరణకు విజప్తి
1996 ఆగస్టు 4 ఖమ్మంలో రాష్ట్రకార్యకర్తల సమావేశం
1996 ఆగస్టు 23 హైదరాబాద్‌లో బాలబాలికల దండోరా
1996 సెప్టెంబర్ 2 చలో అసెంబ్లీ, భారీ ర్యాలీ, బహిరంగసభ – ఎస్.సి. ల వర్గీకరణకోసం కమీషన్‌ను నియమిస్తున్నట్లు శాసనసభలో ముఖ్యమంత్రి ప్రకటన
1996 అక్టోబర్ 8 యాదగిరిగుట్టలో మాదిగ మహిళా దండోరా రాష్ట్ర సదస్సు
1997 జనవరి 10 ప్రజాగాయకుడు గద్దర్ కన్వీనర్‌గా మాదిగ దండోరా సంఘీభావ సమితి ఆవిర్భావం
1997 జనవరి 12 మాదిగ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు – హన్మకొండ
1997 ఫిబ్రవరి 27–28నాగర్ కర్నూర్‌లో మాదిగ యువసేన రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం

1997 మార్చి 2 ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాదిగ విద్యార్థుల రాష్ట్ర సదస్సు
1997 మార్చి 3 విశాఖపట్నం జిల్లా కె. కోటపాడులో రాష్ట్ర కార్యవర్గ సమావేశం
– మహాపాదయాత్ర చెయ్యాలని, నాయకత్వంలో నంబర్ – 1, నంబర్
– 2ల సిద్ధాంతం, బాధ్యతల విభజన
1997 ఏప్రిల్ 14 నారావారిపల్లె నుంచి మహాపాదయాత్ర ప్రారంభం
1997 మే 18 హైదరాబాద్‌లో మాదిగ కవుల, రచయితల సమావేశం
1997 అక్టోబర్ 6 ఉప్పలగుప్తం మండలం చింతల చెరువులో చెల్లూరి మీరాసాహెబ్ మాదిగపై మాలలు దాడిచేసి చంపారు
1997 అక్టోబర్ 15–20 అన్ని మండలాల్లో రిలే నిరాహార దీక్షలు
1997 అక్టోబర్ 21 అన్ని మండలాల్లో ఊరేగింపులు ధర్నాలు
1998 ఏప్రిల్ 6 ఒంగోలులో రాష్ట్ర కమిటీ సమావేశం – ఢిల్లీలో ఊరేగింపు, ధర్నా

చెయ్యాలని, హైదరాబాదులో ఆమరణ నిరాహార దీక్ష చెయ్యాలని నిర్ణయం

1998 ఏప్రిల్ 21 అసెంబ్లీలో మహిళా కార్యకర్తల ధర్నా, లాఠీఛార్జి, అరెస్టులు

1998 మే 4 ఎస్.సి, ఎస్.టి జాతీయ కమీషన్‌కి రాతపూర్వక, వాదన సమర్పణ

1998 మే 5 ఢిల్లీలో ఊరేగింపు, ధర్నా, జాతీయ ఎస్.సి, ఎస్.టి కమీషన్‌కి డిమాండ్ల పత్రం సమర్పణ

1998 జూన్ 5 ఆమరణ నిరాహారదీక్ష

1998 జూన్ 6, 8 జాతీయ కమీషన్‌కు లేఖ

1998 జూన్ 16 వర్గీకరణకోసం ఆత్మాహుతి చేసుకున్న తెల్లబండ్ల రవి అమరత్వం

1998 నవంబర్ 17 రాష్ట్రపతికి విజ్ఞాపన

1998 నవంబర్ 28 డిమాండ్లను నెరవేర్చకపోతే అక్టోబర్ 2 న ఆత్మాహుతి హెచ్చరికచేస్తూ ముఖ్యమంత్రినికలిసి డిమాండ్ల పత్రం సమర్పణ

1998 అక్టోబర్ 16 ముఖ్యమంత్రిని కలిసి డిమాండ్ల పత్రం సమర్పణ

1998 డిసెంబర్ 24 ముఖ్యమంత్రిని కలిసి డిమాండ్ల పత్రం సమర్పణ

1999 ఏప్రిల్ 5 –14 ఆమరణ నిరాహారదీక్ష

1999 జూన్ 10–30 జిల్లాల పర్యటన

1999 ఆగస్టు 6 రాష్ట్రసదస్సు – ఎన్నికల్లో తటస్థవైఖరి

1999 నవంబర్ 15 హైదరాబాద్‌లో ధర్నా

1999 నవంబర్ 25 హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగల ఆత్మకథలు పుస్తకావిష్కరణ సభ

1999 డిసెంబర్ 4 దండోరా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసింది

1999 డిసెంబర్ 12 కొత్త రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

2000 మార్చి 20 మంత్రులు, యమ్.ఎల్.ఏ.లకి విజ్ఞాపన

2000 మార్చి 27 వర్గీకరణచట్టంకోసం హైదరాబాదులో దండోరాధర్నా

2000 ఏప్రిల్ 2 దండోరా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపింది.

## 4.2.11. ఎస్సీల వర్గీకరణ క్రమం

10–9–96 జస్టిస్ రామచంద్రరాజు కమీషన్ నియామకం

26–5–97 జస్టిస్ రామచంద్రరాజు కమీషన్ నివేదిక సమర్పణ

7–6–97 షెడ్యూల్డ్ కులాలను ఎ.బి.సి.డి గ్రూపులుగా వర్గీకరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ. ఎం.ఎస్. నెంబర్లు 68, 69లు జారీ

21–7–97 68, 69 జి.ఓ.లను హైకోర్టు సింగిల్‌జడ్జి కొట్టివేత

22–7–97 హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు

18–9–97 ప్రభుత్వ ఉత్వర్వులను హైకోర్టు ఫుల్‌బెంచ్ కొట్టివేత

13–10–97 సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటీషన్ ద్వారా అప్పీలు

13–12–97 ఎస్.సి.ల వర్గీకరణకు ఆమోదం తెలపాల్సిందిగా జాతీయ ఎస్.సి, ఎస్.టి కమీషన్‌కు రాష్ట్రప్రభుత్వం అభ్యర్థన

31–12–97 సుప్రీంకోర్టులో దాఖలు చేసిన ఎస్.ఎల్.పి. ఉపసంహరించుకోవాల్సిందిగా జాతీయ కమీషన్ రాష్ట్రానికి సూచన

24–1–98 ఎస్.ఎల్.పి. ఉపసంహరణకై సుప్రీం అనుమతి

7–3–98 వర్గీకరణకు ఆమోదం తెలపాల్సిందిగా జాతీయ కమీషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ

అభ్యర్ధన

13-4-98 జాతీయ కమీషన్‌కు ముఖ్యమంత్రిలేఖ

22-4-98 షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ విధానాన్ని బలపరుస్తూ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది

29-4-98 అసెంబ్లీ తీర్మానాన్ని ముఖ్యమంత్రి స్వయంగా జాతీయ కమీషన్‌కు తెలిపారు

26-5-98 మరింత సమాచారానికై జాతీయ కమిషన్ రాష్ట్రాన్ని కోరింది

9-6-98 రెండువారాల్లో సిఫారసులు పంపాల్సిందిగా జాతీయ కమీషన్‌ను ఆదేశించాలని రాష్ట్రప్రభుత్వం హైకోర్టులో రిట్ దాఖలు చేసింది

15-6-98 జాతీయ కమిషన్ కోరిన వివరాల సమర్పణ

23-6-98 31-7-98 లోపల జాతీయ కమీషన్ అంశాన్ని పరిష్కరించాలని హైకోర్టు ఫుల్‌బెంచ్ ఆదేశాలు

25-8-98 రాష్ట్రపతి నోటిఫికేషన్ సమరించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారాలు లేవని వర్గీకరణ చెల్లదని జాతీయ కమిషన్ నిర్ధారణ

1-9-98 వివిధ ప్రత్యామ్నాయాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చ

4-9-98 అఖిలపక్షాలతో ముఖ్యమంత్రి సమావేశం

8-9-98 మరోసారి క్యాబినెట్‌లో చర్చ

1-10-98 ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్.సి వర్గీకరణ పాటించడానికి ఆర్డినెన్స్ జారీచేయాలని మంత్రివర్గ నిర్ణయం

17-10-98 ముసాయిదా ఆర్డినెన్స్‌కు క్యాబినెట్ ఆమోదం

22-10-98 రాష్ట్రపతి సూచనలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ అభిప్రాయం

25-10-98 అఖిలపక్ష సమావేశం-మంత్రివర్గ సమావేశం-గవర్నర్ అభిప్రాయం మేరకు రాష్ట్రపతి సూచనలకై వీలుగా కేంద్రాన్ని కోరుతూ క్యాబినెట్‌లో తీర్మానం

29-10-98 ముసాయిదా ఆర్డినెన్స్, గవర్నర్ అభిప్రాయం ఇతర వివరాలతో కేంద్ర హోంశాఖకు నివేదన

25-1-99 ఈ విషయంపై తొందరగా నిర్ణయం తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి కేంద్ర హోంమంత్రికి లేఖ

29-1-99 కేంద్ర హోంమంత్రి జవాబు

10-4-99 తొందరగా నిర్ణయం తీసుకోవాలని ప్రధానమంత్రి, కేంద్రహోంమంత్రికి ముఖ్యమంత్రి ఫాక్స్ సందేశం

12-4-99 ప్రధానమంత్రి జవాబు

30-11-99 వర్గీకరణకై రాష్ట్రపతి ఆమోదం

1-12-99 ఆర్డినెన్స్ జారీకై మంత్రిమండలి గవర్నర్‌కు సిఫారసు

9-12-99 గవర్నర్ ఎస్.సి వర్గీకరణ ఆర్డినెన్స్‌ను జారీచేశారు

1-4-2000 రాష్ట్ర అసెంబ్లీ ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల (రిజర్వేషన్ల హేతుబద్దీకరణ)చట్టాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది(కృపాకర్ మాదిగ, 2001)

**4.3. ఎన్నెల నవ్వు-సంచార తెగ సంస్కృతి/ చైతన్యం:**

ఈ నవలలో రచయిత యానాదుల సాంస్కృతిక జీవనాన్ని చక్కగా వర్ణించారు. వారి అలవాట్లు, ఆచారాలు, వారి వెనుకబాటు తనానికి తగిన కారణాలను తెలియజేశాడు. కుల సమాజం యొక్క వికృత రూపాన్ని చర్చించాడు. అగ్రకులాలు కింది కులాల స్త్రీలను ఏ విధంగా లైంగికంగా ఉపయోగించుకుని వదిలేస్తారో చెప్పారు. చెంచులు ఏ విధంగా కుల

వ్యవస్థను అర్థం చేసుకుని దాని నిర్మూలనకు ప్రయత్నించడమే కాక విప్లవ ఉద్యమంలో పాల్గొన్న తరువాత అంబేద్కర్ మార్గంలో ప్రయాణం చెయ్యడానికి సమాయత్తం అయినట్లుగా రచయిత ప్రత్యేకాత్మకంగా ముగింపు ఇచ్చారు.

**4.3.1. ఏకుల వెంకటేశ్వర్లు పరిచయం:**

**రచయిత పేరు:** ఏకుల వెంకటేశ్వర్లు (ఇ.వి)

**తల్లిదండ్రులు:** ఏకుల పద్మ, సుబ్బారావు

**పుట్టిన తేది:** జూన్ 10, 1962

**కులం:** యానాది (ఎస్.టి)

**చదువు:** ఇంటర్మీడియట్ (ఫెయిల్)

**స్వగ్రామం:** కాకుటూరి వారి పాలెం, యానాది కాలనీ.

**చిరునామా:** టంగుటూరు (మండలం), ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**రచనలు:** యానాది జీవన చిత్రం,

ఎన్నెల నవ్వు (2011) నవల మొదటిసారి 'బహుజన కెరటాలు' మాస పత్రికలో సీరియల్‌గా అచ్చయింది.

**రచయిత వ్యక్తిత్వం:** నటుడు, గాయకుడు, రచయితగా ఎదిగారు.

**ప్రస్తుతం:** 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యానాది సంఘం' అధ్యక్షుడుగా పని చేస్తున్నారు. ఏకుల వెంకటేశ్వర్లు అందరికీ ఇ.వి గానే పరిచయం. మార్క్సిస్టు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని 'జననాట్య మండలి'లో చాలా కాలం పాటు పనిచేశారు. 'ప్రజా కళా మండలి'లో కూడా పనిచేశారు. ఈ క్రమంలో 'ఒంగోలు గద్దరు'గా పేరుగాంచారు. షెడ్యూలు తెగల గురించి అనేకమంది రచనలు చేశారు. వారిలో డా. కేశవరెడ్డి ముందు వరుసలో ఉంటారు. ఆయనే యానాదుల జీవన చిత్రాన్ని 'చివరి గుడిసె' పేరుతో ఆవిష్కరించారు. కానీ షెడ్యూల్ తెగల నుండి రచయిత ఎవరూ తమ స్థితి తెలియజేస్తూ ఎవరూ నవల రాయలేదు. ఆ లోటును తీరుస్తూ షెడ్యూల్ తెగల నుండి తొలి నవలను ఏకుల వెంకటేశ్వర్లు రాశారు. అంతేగాక యానాదుల సామాజిక జీవ చిత్రణను తెలుగు సాహిత్యానికి పరిచయం చేశారు. అస్తిత్వ ఉద్యమ నేపథ్యంలో యానాదులు జీవన స్థితిగతుల గురించి లోతుగా చర్చించారు. యానాదుల కోసం యానాది తెగ నుండే వచ్చిన 'తొలి నవల'గా ఎన్నెల నవ్వు గుర్తింపు పొందింది. నవలలో మూడు తరాల యానాదుల జీవితాన్ని నేటి అస్తిత్వ ఉద్యమ నేపథ్యం వరకు వర్ణించే ప్రయత్నం చేశాడు. ఇ.వి గా పేరు పొంది, క్రమంగా అంబేద్కరిజం వైపు ఆకర్షితమౌతూ ఏకుల వెంకటేశ్వర్లుగా రూపాంతరం చెందారు.

ఇ.వి. కి ఎవరి పరిచయం అక్కరలేదు. ప్రకాశం జిల్లాలో అరుణ పతాకతో విప్లవోద్యమాన్ని శ్వాసించిన సాంస్కృతిక సమర యోధుడు. పాటలతో కదం తొక్కిన ప్రజా పక్షం వహించిన ప్రజా వాగ్గేయకారుడు. 'ఒంగోలు గద్దర్'లా అనేక సభా వేదికలపై విప్లవ తాండవం చేసిన ఉద్యమవీరుడు. ప్రయోగాత్మకమైన, జానపద కళాభరితమైన వీధి నాటకాలను రూపొందించి, కరుడు గట్టిన సామాజిక సమస్యల తీరు తెన్నులను శాస్త్రీయంగా చర్చించి జన జాగృతి కలిగించిన విలక్షణ ప్రయోక్త ఇ.వి.. విప్లవోద్యమం వెలుగుదారిలో రెండు దశాబ్దాల పాటు పాటలు పాడిన ఇ.వి. వెనుదిరిగి తన అడుగుజాడలను సరిచూసుకున్నాడు. వర్గ సమాజం నిర్మూలనే అన్ని సమస్యలకు పరిష్కారమని చెప్పే సిద్ధాంత కర్తలను కులతత్వం గురించి అనుభవ పాఠం నుంచి ప్రశ్నించాడు. సరైన జవాబులు చెప్పకపోవడంలో బాధ పడ్డాడు. విప్లవ ఉద్యమంలో పని చేసినప్పటికీ తమ జాతి అణగారి పోతుండడంతో అస్తిత్వం కోసం పాకులాడాడు. విప్లవోద్యమానికి, అస్తిత్వానికి రాజీ కుదరక నిరంతరం ఘర్షణ పడ్డాడు.

ఈ సంఘర్షణ ఎరుకతో దళిత ఉద్యమ చైతన్య ప్రభావంతో 'అరుణ పథం' నుండి 'ఆత్మ గౌరవ బాట' వైపు మలుపు తిరిగాడు. ఈ మలుపుతోనే ఇ.వి. ఏకుల వెంకటేశ్వర్లుగా వెలుగులోకి వచ్చాడు. "ఉపరితలంపై ఊగిసలాడే పిల్లవేరులను విడచిపెట్టి, ఉనికికి ఊపిరిపోసే తన తల్లి వేరు ఒడిసి పట్టుకుంటున్నాడు. ఈ తల్లి వేరు రక్తం పంచుకొని, బతుకు పేగు తెంచుకొని పుట్టిన యదార్థ దృశ్యమే ఎన్నెలనవ్వు" (కోయి కోటేశ్వరరావు – ఎన్నెల నవ్వు, ముందుమాట)గా పేర్కొన్నాడు.

గుణాత్మకమైన ఈ తాత్విక పరివర్తనతో మౌలికంగా గాయకుడైన ఇ.వి. నాయకుడై యానాది జాతి మూలాలను ముద్దాడి, పునాది సృజనకు పూనుకున్నాడు. జాతుల గురించి రాయకపోవటం ఒక నేరమని ఆత్మ విమర్శ చేసుకొని, తన సొంతతనాన్ని తనివితీరా నెమరవేసుకున్నాడు. "ఇ.వి ఎన్నెలనవ్వును సృష్టించలేదు. యానాదుల నివాస కేంద్రమైన 'తోపుసంగం'లో జరిగిన యదార్థ సంఘటనలు, అణచివేత, కులాధిపత్యం, దు:ఖం, ఆనందం కలగల్పిన జీవన వాతావరణాన్ని ఎన్నెలనవ్వుతో పాఠకులకు ఎంతో నేర్పుగా పరిచయం చేశాడు ఇ.వి.. నవ్వులు, ఇంక అమాయకమైన నవ్వులు యానాదులకు ఎంతో యిష్టం. వాళ్ళ ప్రకృతిలోని ప్రతి అంశాన్ని చూసి దాని సొగసుకు ముచ్చటపడి మనసార నవ్వుకుంటారు. దానిలో భాష కూడ ఒక భాగమే. ఇతరులు యానాదుల వేషభాషలకు ఎగతాళితో తక్కువ చేసి మాట్లాడినా వాళ్ళు మాత్రం తమ మాటల్లో హాస్య చతురతను వ్యక్తం చేసి హృదయ పూర్వకంగా నవ్వుకుంటారు, నవ్విస్తారు. ఆ కవి సమయంలో కూడ హాస్యాన్ని పండిస్తారు. ఇలాంటి హాస్య సన్నివేశాలతో పాటు హృదయాన్ని హత్తుకొనే అనేక సంఘటనలు ఈ నవలలో విరివిగా ఉన్నాయి. వాటి గురించి తర్వాత విశ్లేషిస్తాను.

**4. 3. 2. గిరిజనులు – పరిచయం:**

గిరిజనులు అంటే పదంలోనే అర్థం ఉంది. గిరులపై నివసించేవారు గిరిజనులు .గిరి అంటే కొండ, కొండ మీద నివసించేవారని అర్థం. వీరిని ఆదివాసులుగా పిలుస్తారు. గిరిజనులు అనే మాట కన్నా ఆదివాసులు అనే మాటను చారిత్రకార్థంలోను గౌరవార్థంలోను విస్తృతంగా సామాజిక వేత్తలు వాడతున్నారు. ఈ దేశంలో ఆది నుంచి నివసిస్తున్న వారుగా భావిస్తున్నారు. అడవి ప్రాంతాల్లో నాగరిక సమాజానికి దూరంగా నివసిస్తున్న వారిని గిరిజనులుగా భారత రాజ్యాంగం గుర్తించింది. కాని కేవలం నాగరిక ప్రపంచానికి దూరంగా అడవుల్లో లేదా కొండల్లో నివసిస్తే గిరిజనులు అవుతారా? అనే ప్రశ్న రావచ్చు. కానీ జాతిపరంగాను, సాంస్కృతిక పరంగాను, భాషా పరంగాను, ఆహారపు అలవాట్ల పరంగాను వీరికంటూ కొన్ని ప్రత్యేక ఆచార వ్యవహారాలు, నమ్మకాలు ఉన్న వారిని గిరిజనులు అంటారు.

గిరిజనులు నేటికి కొందరు ఆహారాన్ని ఏరుకోని జీవనం గడిపే దశలోనే ఉన్నారు. " గిరిజనులకు శాశ్వత నివాసాలు లేక వీళ్ళు సాంఘికాభివృద్ధి కొరకై, చారిత్రకంగా ఎన్నో బాధలను ఎదుర్కొని జీవిస్తున్నారు. వీరిని ఒకప్పుడు దాస్యులనీ, శబరులనీ, నిషాదులనీ, రాక్షసులనీ అనేక పేర్లతో పిలిచేవారు" (లలిత, వకుళాభరణం. 2000:2)

గిరిజనులు నేటికి అడవుల్లో సంచార జీవనం గడుపుతూ, అడవిలో దొరికే ఆకులు, అలములు, గడ్డలు, మొదలైన ఆటవిక సంపదపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ప్రస్తుతం కొన్ని గిరిజనతెగల పరిస్థితి కొంత మెరుగు పడింది. వారు స్థిర నివాసాలు ఏర్పరుచుకొని వ్యవసాయం, పశుపోషణ మొదలైన వృత్తులు చేసుకుంటూ జీవిస్తున్నారు.

భారతదేశంలో ఆదిమజాతులు కొన్ని వేల సంవత్సరాలుగా కొండ కోనలకే పరిమితమై మైదాన ప్రాంత ప్రజలతో నాగరికతకు కేంద్రంగా ఉన్న పట్టణాలతో నామమాత్రంగానే సంబంధాలు పెట్టుకున్నారు.(హెమెన్‌డార్ఫ్ 1977) కథనం ప్రకారం అధిక జనాభా వత్తిడి

లేకపోవడం వల్లనో, హిందు నాగరికత ప్రభావానికి వెలుపల ఉండటం వలనూ నాగరిక ప్రజలు తమ విలువలను గిరిజనులపై రుద్దడం అనవసరమని భావించారు. నదింహస్‌నైన్ 'భారతీయ గిరిజనులు' అనే గ్రంథం ముందు మాటలో పేర్కొన్నారు.

మన దేశంలో గిరిజనుల పై గిరిజనేతరుల ప్రభావం బ్రిటీష్ వారు వచ్చిన తరువాతనే జరిగింది. బ్రిటిష్ ప్రభుత్వ పాలనపై పట్టుబిగించేందుకు తమ స్వార్థ ప్రయోజనాలకోసం గిరిజన ప్రాంతాలను వాడుకోవడం జరిగింది. దీంతో బ్రిటిష్ వారితో పాటు బ్రిటీషేతరులు కూడా గిరిజనుల భూములను ఆక్రమించుకొన్నారు.తెలుగుప్రాంతంలోని బడుగు వర్గాల్లో గిరిజనులు ఒక్కరు. నేడు రాష్ట్రంలో అన్ని తరగతుల కన్నా అన్ని రకాలుగా వెనుకబడిన వారు గిరిజనులే. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, ఆహార, ఆరోగ్య విషయాల్లోనూ తక్కిన పేద తరగతుల స్థాయికి కూడా వీరు నోచుకోలేదు. ఏ ఇబ్బంది వచ్చినా, కష్టం వచ్చినా మొదట బలయ్యేది గిరిజనులే.

తెలుగు ప్రాంతంలో గిరిజనులు అన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉన్నారు. అయితే "అందులో 95 మంది గిరిజనులు దుర్భర దారిద్రంలో జీవిస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం వీరిని గిరిజనులుగా గుర్తించి రిజర్వేషన్ సౌకర్యం కల్పించి వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. అయితే సామాజికంగా వీరి జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదు" (బీమానాయక్, యన్. 2008:12).

**4.3.2.1.గిరిజన తెగలు:**

తెలుగు ప్రాంతంలో గిరిజన తెగలు మొత్తం 35 ఉన్నట్లు గుర్తించారు. ఆయాతెగలను వృత్తులు, జీవన రీతులను ఆధారంగా చేసుకోని వర్గీకరించారు. ఈ తెగలలో కొన్ని తెగలు నేటికి ఆహారాన్ని ఏరుకుని తినే దశలోనే ఉన్నాయి. కొన్నితెగలు స్థిర నివాసం ఏర్పరుచుకొని వ్యవసాయం, పశుపోషణ వంటి వృత్తులు చేస్తూ జీవనం గడుపుతున్నాయి. అయితే 2002కి పూర్వం 33 తెగలు ఉన్నాయి. అయితే 2002లో రెండు తెగలను గిరిజన జాబితాలో చేర్చడం జరిగింది. "34వ తెగ నక్కల వారు" (గిరిజన సంస్కృతి, మాస పత్రిక, సే. 2008) 35వ తెగ "దూలియగా" గుర్తించారు.

**తెగలు:**

1. ఆంధ్, 2. ఎరుకలు, 3. కొండ కమ్మర, 4. కొండదొర, 5. కొండరెడ్డి, 6. కొలాము, 7. కోయ, 8. కొండు. 9. కోటియా, 10. ములియ / కులియ, 11. గదబ, 12. గోండు, 13. గౌడు, 14. చెంచు, 15. తొటీలు. 16. నాయక్పోడు / నాయక్, 17. ప్రధానులు, 18. పొరజాలు, 19. బగతలు, 20. భిల్లులు, 21. మన్నె దొరలు, 22. మాలిలు, 23. ముక దొరలు, 24. యానాదులు, 25. రెడ్డి దొర, 26. వాల్మీకులు, 27. సవరలు, 28. సగాలీలు, 29. కోందులు / జాత్‌పుట్ / సామంత, 30. బెంధో (బరితు), 31. రోన, 32. బట్టునాయికన్, 33. కొండకాపు, 34. నక్కలవారు. 35. ధూలియా (వెంకటరావు, పోన్నాడా. 2008:1-3)

గిరిజనులను మైదాన ప్రాంత గిరిజనులు ఏజెన్సీ ప్రాంత గిరిజనులు అని విభజించారు. అందులో 68 శాతం గిరిజనులు షెడ్యుల్డ్ ప్రాంతాల్లో నివసిస్తుండగా మిగిలిన 32 శాతం మంది గిరిజనులు గిరిజనేతరులతో కలసి మైదాన ప్రాంతంలో నివసిస్తున్నారు ( హస్‌నైన్, నదీమ్. 1995: 142).

**ఏజెన్సీ ప్రాంత గిరిజనులు:**

కొండ ప్రాంతాల్లో, దట్టమైన అడవుల్లో పరిసర పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులను ఏజెన్సీ ప్రాంత గిరిజనులు అంటారు. చెంచులు గదబలు, గోండులు, గౌడులు,

కమ్మరులు, అందులు, బగతులు, బిల్లులు, ఖోండులు, కొలావులు, కొండదొరలు, కొండరెడ్లు, కోమ్మరులు, కోయవారు, మాలిలు, మన్నెదొరలు, వాల్మీకులు, నాయక్పోడులు, రెడ్డిదొరలు, మూకదొరలు, మొదలైనవారు నివసిస్తున్నారు.

**<u>మైదాన ప్రాంత గిరిజనులు:</u>**

మైదాన ప్రాంతాల్లో, గ్రామాల్లో నాగరిక సమూహాలకు దగ్గరగా గిరిజనేతరులతో కలసి నివసించే గిరజనులను మైదాన ప్రాంత గిరిజనులు అంటారు. లంబాడీలు లేక సుగాలీలు, ఎరుకల, యానాదుల మొదలైన గిరిజన తెగల వారు మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్నారు.

**<u>తెగ – నిర్వచనాలు:</u>**

1. కొన్ని కుటుంబాలు లేదా కొన్ని కుటుంబ సముదాయాల మధ్య సమైక్యత ఉండి ఒకే పేరుతో వ్యవహరింపబడుతూ వారందరు ఒకే నిర్ణీత ప్రదేశంలో నివసిస్తూ ఒకే భాషా మాట్లాడుతూ ఒకే రకమైన వైవాహిక నియమాలని పాటిస్తూ, ఒకేరకమైన ఆహారాన్ని అవలంబిస్తూ పరస్పర సహకారభావం కలిగిఉండి
వారి మధ్య పరస్పర అనుబంధం ఉండే సమూహాన్ని తెగ అనవచ్చు. ఒక తెగ సామాన్యంగా అంతర్వివాహ సముదాయం అంటే ఒక తెగలోని వారు ఆ తెగలోని వారితోనే వైవాహిక సంబంధాల్ని ఏర్పరుచుకుంటారు. (సూర్యనారాయణ, ఎమ్. 2007).

2. తెగ: ఒకే పేరున్న కొన్ని కుటుంబాల సమూహం, తెగలోని వారు ఒకే మాండలికాన్ని మాట్లాడుతూ ఒకే ప్రాంతంలో నివసిస్తామని చెబుతుంటారు. గతంలో వీరు తమ తెగలోనే పరస్పరం వివాహం చేసుకున్న ప్రస్తుతం సాధారణంగా తమ తెగలోని వారిని వివాహం చేసుకోరు. (ఇంపీరియల్ గెజిట్ ఆఫ్ ఇండియా)

3. తెగ: ఆటవిక ఆదిమ ప్రజల సమూహం. వారు తమకు ఆదిమ పురుషుడు ఒక్కడే అని భావిస్తారు. ఒక నాయకుడిని, అధికారాన్ని వారు అంగీకరిస్తారు (ఆక్స్ఫర్డ్ నిఘంటువు). నదీమ్, హస్నైన్ గారి 'భారతీయ గిరిజనులు' అనే గ్రంథంలో తెలియజేశారు.

తెగల గురించి అధ్యయనం చేసే సామాజిక శాస్త్రవేత్తలు తెగలను నిర్వచించడలో సరియైన ఏకాభిప్రాయం వ్యక్తం చేయలేదు. నేటి కాలంలో గిరిజన తెగకు ఈ నిర్వచనాలు వర్తించవు. కొందరు గిరిజనులు ఒకే ప్రాంతంలో నివసించడం లేదు. తెగ వాళ్ళ భాషకు, వారి సంస్కృతికి, వేషధారణకి ఒక ప్రత్యేక గుర్తింపును ఇస్తుంది. ఈ విధంగా కొన్ని కుటుంబాలు ఒకటిగా కలసి ఒకేపేరుతో ఒకే వృత్తిని చేపట్టి ఒకే భాషను మాట్లాడుతూ అంతర్వివాహ సంబంధాలు కలిగి ఒకే ప్రాంతంలో నివసిస్తున్న వారిని తెగగా గుర్తించవచ్చు.

**<u>గిరిజన సంస్కృతి:</u>**

తెలుగు ప్రాంతంలో గిరిజనులు విభిన్న సంస్కృతుల మేలు కలయిక. ఒక్కో తెగకు ఒక్కో సంస్కృతి ఉంటుంది. సంస్కృతి అంటే జీవన విధానం, ఆట, పాట, వేషం, నృత్యం లాంటివి మాత్రమే కాదు. భాషా, సామాజిక వ్యవస్థా, ఆర్థిక విధానాలు, మతం, విద్యా, ఆహారపు అలవాట్లు మొదలైనవి కూడా సంస్కృతిలో భాగంగా చెప్పవచ్చు. గిరిజనుల సంస్కృతి ప్రత్యేకంగా ఉంటుంది. అడవుల్లో ఉంటూ వారి జీవన విధానం, వేష భాషలు, ఆహారపు అలవాట్లు, పెళ్ళిల్లు మొదలైనవి వారి సంస్కృతికి అద్దం పట్టేవిధంగా వీరి సంస్కృతి చాలా పురాతనమైనదిగా ఉంటాయి.

**<u>4.3.3. ఎన్నెల నవ్వు కథాపరిచయం:</u>** మంగమ్మ కూతురు అలివేలు. మంగమ్మను పద్మశాలి కులస్తుడు భావనారాయణ వాడుకోని, కడుపు చేసి వదిలేస్తాడు. మంగమ్మ అలివేలుకు జన్మనిస్తుంది. వరికోతలకు దక్షిణాదికి ( నెల్లూరు జిల్లా) వెళ్ళినప్పుడు పోలయ్య, మంగమ్మ, ఒకరినొకరు ఇష్టపడి జంట అవుతారు. కాలంతో పాటు అలివేలు పెరిగి పెద్దదయ్యింది. 4వ

తరగతి వరకు చదువుకుంది. అలివేలు అందంగా అలంకరించుకోవడంలో శ్రద్ధ చూపుతుంది. పొగాకు గ్రేడింగ్ పనులకు వెళ్తుంది. అక్కడ కోటిరెడ్డి కోరికకు ఇష్టంగానే చిక్కుకుంది. అలివేలు కోటి రెడ్డిల విషయం తెలిసి మంగమ్మ, పోలయ్యలు అలివేలుకి తన తమ్ముడి కొడుకైన మునెయ్యతో పెళ్ళి చేయాలని భావించారు. మునెయ్య అమ్మనాన్నలు రావడం, సంబంధం కుదుర్చుకొని వెళ్ళడం జరిగింది. పెళ్లికి ముందు రోజు దరువు సంఘం నుండి చింత తోపు సంగానికి పతానం వచ్చింది. పతానం పెద్దలకు భోజనం పెట్టడానికి డబ్బులు లేక మంగమ్మ చౌదరి గారి ఇంటికి డబ్బులకోసం వెళ్ళింది. చౌదరిభార్య చెప్పిన పని చేస్తుంది. చౌదరి రాలేదని, ఊళ్ళో అరుగు వద్దకి వెళ్ళి డబ్బులు అడుగుతుంది. చౌదరి అందరిముందు యానాదుల సంబంధాలను ఎగతాళిగా మాట్లాడి, రూ. 25-/ తీసుకొమ్మని చెప్పాడు. సరుకులు తీసుకోని సంగం వస్తే అక్కడ రైకల దగ్గర గొడవ చూసి వాళ్ళకి నచ్చజెప్పింది.

దొరువు సంఘం పెద్ద లింగప్ప నాయుడు. దొరువు సంఘంలో అన్ని పెళ్ళిల్లకు తాళిబొట్లు నాయుడే ఇస్తాడు. నాయుడి దగ్గర తాళిబొట్లు తీసుకోని, గడ్డపార ముహుర్తానికి అలివేలు మునెయ్యల వివాహాన్ని చిటికలోడు పూజారిగా ఉండి జరిపిస్తాడు. పెళ్ళి తర్వాత రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో దుబ్బాంగ్ దరువుతో పాటు 'పులంకి పిట్ట' ఆట, సిన్నబ్బి, చిటికలోడు కలసి ఆడుతారు. ఎన్నెలలో యానాదులంతా విరగబడి నవ్వుతుంటే, పెళ్ళి సంబరాలు ముగుస్తాయి.కొన్ని నెలల తర్వాత చింతతోపు సంఘంలో పోలేరమ్మ కొలుపులకు మునెయ్య, అలివేలు మా నర్సయ్యలతో వస్తుంది. కొలుపుల తర్వాత మునెయ్య. సిటికలోడు, పోలయ్య, నర్సయ్య, వెన్నెల్లో చేపల వేటకు వెళతారు. పొద్దున్నే నర్సయ్య ఊరికి వెళ్ళిపోతాడు. యానాదుల మీద దొంగతనం నేరము మోపి, గుడి దగ్గర చెట్టుకి కట్టి వేసి, కమ్మకుల యువకులు కొడతారు. మంగమ్మ కాళ్ళ వేళ్ళ పడిన వదిలి పెట్టలేదు. అవమానంతో మునెయ్య మరణిస్తాడు. పోలేరమ్మ కొలువులకు వచ్చినందుకు గర్భవతి అయిన అలివేలు మొగుడ్ని అగ్రకులాలు పొట్టన పెట్టుకున్నాయి.

కొన్ని నెలల తర్వాత అలివేలుకి కొడుకు పుట్టాడు. మంగమ్మ మనవడికి చెంచులు అని తన తండ్రి పేరు పెట్టుకుంది. అలివేలు తన పుట్టింటిలోనే ఉండి పొగాకు గ్రేడింగ్కు వెళ్తుంది. అంజయ్య, రత్తమ్మ, పోలయ్య, మంగమ్మ చేపల వేటకు వెళ్ళారు. కోటి రెడ్డితో అలివేలు సంబంధం మరల కొనసాగించింది. కోటిరెడ్డి మోసం తెలియడంతో అలివేలు, మంగమ్మ మందలింపుతో ఇంటిలో నుండి వెళ్ళిపోతుంది. వెళ్ళే క్రమంలో సినిమా హాల్ వాచ్మెన్ దగ్గర ఉన్నప్పుడు కృష్ణమూర్తి కన్నుల్లో పడుతుంది. మంగమ్మ మనవడి ఆలన పాలనా చూచుకుంటుంది. చెంచులకు బుద్దెమ్మ దీపం కథ చెబుతుంది.

బ్రాహ్మణ పంతులు ఇంట్లో పనికి వెళ్ళినప్పుడు అలివేలు గురించి వెటకారంగా, చులకనగా, వ్యంగ్యంగా మాట్లాడాడు. కాని చివరలో చెంచుల్ని బడికిపంపి, చదివించమని సలహా ఇచ్చాడు. పంతులు మాటలకు కోపంగా ఉన్న మంగమ్మకి చెంచుల్ని చదివించమనే సలహా బాగా నచ్చింది. ఆ సహాయం చేసి పెట్టమని అడిగింది. చెంచులకు మాత్రం పంతులు తల్లి గురించి చెడుగా మాట్లాడిన మాటలు గుర్తుకు వచ్చాయి.

సిటికలోడు పనికి వెళ్ళాడు. పని నుండి అతడికి వస్తే పెట్టడానికి ఇంట్లో ఏమి లేదు. రత్తమ్మని అడిగి సద్దికూడు తెచ్చుకుంది. పని నుంచి వచ్చిన భర్తకు, పిల్లలకు కూడు పెట్టింది. తిని సిటికలోడు నిద్రపోయాడు. చౌదరి ఇంట్లో పాము దూరిందంటే అంజయ్య లేడని, సిటికలోడిని తీసుకెళ్ళారు. పామును పట్టేటప్పుడు పాము కాటుకు గురయ్యాడు.అయిన విషయం అక్కడి వాళ్ళకు చెప్పకుండా పామును కుండలో మూత పెట్టి పట్టుకు వచ్చి సాయంత్రం ఆసామి ఇంటికి వెళ్ళి బియ్యం తెచ్చుకోమన్నాడు. భార్యతో కడసారి ప్రేమగా మాట్లాడి పిల్లలిద్దర్ని

చివరిసారిగా చూసుకొని, బ్రహ్మంగారి చింతతోపులో వెళ్ళిపోయాడు.

పొద్దున్నే బుద్దమ్మ ఏడుపు విని అందరు ఆమెను ఓదార్చారు. అంతలో మాదిగ అయ్యన్న వచ్చి, గుడి దగ్గర సిటికలోడి పరిస్థితి దారుణంగా ఉందని చెప్పాడు. సిటికలోడ్ని దోతి కట్టుకొని తీసుకువచ్చారు. బుద్దమ్మ ఏడుస్తూ ఉంది. చిటికెలోడు అందరికి మంచి మాటలు చెప్పి తన కుటుంబాన్ని చక్కగా చూసుకొమ్మని చెప్పి చిరునవ్వుతో కన్ను మూసాడు. పిల్లలు సిటికెలోడి సమాధి వద్దకు వెళ్ళి పిలిస్తే పలకలేదు. వారి అరుపులకు మంగమ్మ వాళ్ళు వచ్చి పిల్లల్ని తీసుకు వెళ్ళారు. చెంచులకు మంగమ్మ భయపడేలాగ దయ్యాల కథలు చెప్పింది. మాలల్లో సింగయ్యను కాకులబడ్డ మీద కూర్చోన్నడని దేవుడి శేషయ్య కాలితో తన్నాడు. సింగయ్య యానాదుల బుజ్జమ్మ నీళ్ళు పోస్తే తాగి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. సింగయ్యను శేషయ్య ఎందుకు తన్నాడో చెంచులకు అర్థంకాక మంగమ్మను అడిగితే అగ్రకులాల అహంకారం, ఆధిపత్యాన్ని చెప్పింది. అగ్ర కులాలవారికి ఉండే అహం చెంచులు అర్థం చేసుకున్నాడు.

యానాది సంగం నుండి మొదటిగా స్కూల్‌కి వెళ్ళిన వ్యక్తి చెంచులు. చదువులతోపాటు అన్నిట్లో ఫస్టు వచ్చేవాడు. మాదిగ పౌలు పంతులు చెంచులకు సహాయం చేసేవాడు. అందుకు బదులుగా పంతులుకి ఇంటి పనుల్లో చెంచులు సహాయం చేసేవాడు. ఒక్కోసారి బడికి ఆలస్యమైనందుకు బయట నిలబెట్టేవారు. అలా నిలబెట్టడం చెంచులకి అవమానకరంగా ఉ ండి, బడి మానివెయ్యాలనుకున్నాడు. అమ్మమ్మ ఓదార్పు మాటలు చెప్పేది. యానాదుల బతుకులు బాగుపడాలని చెంచులు కోరుకునేవాడు. మంగమ్మ చెంచులకి వెన్నెల్లో మంచాలు వేసుకొని కథలు చెప్పేది. సిటి యాక్ట్ వల్ల యానాదులు అనుభవించిన బాధలు చెప్పేది.

దీపావళి పండుగకి తుపాకీ కొనిస్తేనే బడికి వెళతానని, చెంచులు మారాం చేశాడు. చెంచులు పొగాకు పనికి వెళ్ళగా రూపాయి కూలీ వస్తుంది. ఆ కూలీ డబ్బులతో తుపాకీ కొనివ్వలేదని అలుగుతాడు. పండుగల వెనుక ఉన్న అగ్రకులతత్వాన్ని పోలయ్య చెంచులకి వివరిస్తాడు. కరువు కాలంలో యానాదులు ఆకులు, అలములు తిని ఎలా బతికారో అంజయ్య చెప్పాడు. ధూమ్ తగిలి మంగమ్మ అయ్య చనిపోవడం గురించి చెప్పాడు. పోలయ్య చెంచులు కోసం దీపావళికి తాటి గిలకలు తయారు చేస్తున్నాడు. చెంచులు, సిటికలోడి పిల్లలు పండుగరోజు చేపల వేటకు వెళ్ళారు. చేపల వేటకు వెళ్ళి వచ్చిన చెంచులకు పోలయ్య మందలించి స్నానం చేయించాడు. ప్రెసిడెంట్ ఇంటికి వెళ్తే ఆయన భార్య నిష్టూరపడింది. కృష్ణమూర్తి పంతులు ఇంటికి వెళ్తే వాళ్ళు చెంచులు వద్దన్న టపాసులు ఇచ్చారు. కొన్న టపాసులుతో, తాటి గిలకలతో యానాదులు ఆనందంగా దీపావళి జరుపుకున్నారు.

చెంచులు హైస్కూల్లో చేరాడు. తన కులానికి జరుగుతున్న అవమానాలు నిస్సహాయంగా చూస్తూ పెరుగుతున్నాడు. సాంస్కృతిక కార్యక్రమాల్లో చెంచులు చురుగ్గా పాల్గొనేవాడు. పిల్లలందరితో స్నేహభావంతో ఉండేవాడు. చెంచులుతో అనసూయకి స్నేహం ఉండేది. చెంచులంటే అనసూయకు ఇష్టం. బడికి రాకపోతే ఆమె చేతితో చెంచులుకి దెబ్బలు పడేవి. ఆమె ఏమన్నా చెంచులు నవ్వుతూ ఉండేవాడు. అలా వాళ్ళు నవ్వుకుంటూ ఉంటే ఎన్నెల నవ్వినట్టుండేది. అనసూయ మామయ్య చెంచులతో తిరగవద్దని హెచ్చరించినట్లు చెంచులకు చెబుతుంది. దానికి యానాదులు మనుష్యులు కాదా? మీలా మేం చదువు కోవడం లేదా? అని ఆమెను ప్రశ్నించాడు. చెంచులు అమ్మమ్మకి ఈ విషయం చెబితే చాలా తేలికగా కొట్టి పారేసింది. ఆసాముల అమ్మాయిలతో స్నేహంగా ఉండకూడదని చెప్పింది. అలా ఎందుకు స్నేహం చేయకూడదంటే, వాళ్ళది ఎక్కువ కులం, మనది తక్కువ కులమని వివరించి చెప్పింది.

అప్పటి నుండి చెంచులుకి కులవ్యవస్థ మీద కోపం ఎక్కువయింది. చెంచులు లక్ష్యం కులం పోవాలి. ఎలా పోతుంది. ఎప్పుడు పోతుంది? బడిలో ఎవరితో మాట్లాడింది లేదు.

చివరకు అనసూయతో కూడా కమ్యూనిష్టుల ప్రసంగాలు చెంచుల్ని ఆకట్టుకున్నాయి. కష్టజీవుల రాజ్యంలో కుల వైషమ్యాలు ఉండవని అంటే ఆదారి వెంట చెంచులు నడక ప్రారంబించాడు. కానీ చెంచులకి కులం గురించి కొత్త ప్రశ్నలు ముసురుతున్నాయి. చెంచులు కోసం విద్యార్థి సంఘ నాయకుడు కేశవరావు వచ్చాడు. అతడు చెంచుల్ని తీసుకు వెళ్ళి ఒక అపరిచిత వ్యక్తికి పరిచయం చేశాడు. అతడ్ని చెంచులు కులనిర్మూలన గురించి అడిగాడు. అతడు పునాది మారితే ఉపరితలం దానికదే మారి కులం పోతుందని చెప్పాడు. సాయుధపోరాటం ద్వారానే అది సాధ్యమౌతుందని చెప్పాడు. చెంచులు ఎల్లుండి పరీక్షలు ఉన్నాయంటే, జాతికోసం స్వార్థంగా కాకుండా త్యాగం చేయాలని చెప్పాడు. ఆలోచించి చెబుతానని చెంచులు చెప్పాడు. కేశవరావు ఎగతాళిగా ఏం మాట్లాడుకున్నారని ప్రశ్నించాడు. యానాదులకు ప్రశ్న వేయడమంటే ఇష్టముండదు. అందుకే చెంచులు జవాబు చెప్పలేదు. కేశవరావు నిష్టూరంగా మట్లాడతాడు. దాంతో  మా కోసం మీరేంది పోరాడేది. తనకి ఎంత నష్టం జరిగినా క్యాంప్‌కి వెళ్ళడానికి చెంచులు సిద్ధ పడ్డాడు. చివరకు కేశవరావుతో చెంచులు క్యాంప్‌కు వస్తానని చెప్పాడు.

తిరిగి ఇంటికి వచ్చిన చెంచుల్ని మంగమ్మ ప్రశ్నలతో ఆరాతీసింది. డ్రామా వేస్తుంటే చూడడానికి వెళ్ళామని అబద్ధం చెప్పాడు. చెంచులు మౌనంగా ఉండటాన్ని చూసి మంగమ్మ, పోలయ్య 'బుగ్గ దిష్టి' తీశారు. కనపడకుండా పోయిన అలివేలు తిరిగి వచ్చింది. మంగమ్మ అలివేలు ని చూసి గుండెలవిసేలా రోదించసాగింది. యానాదులు మంగమ్మను ఓదార్చారు. కోటిరెడ్డి నా బిడ్డ బ్రతుకును నాశనం చేశాడని మంగమ్మ కాసేపు తిట్టింది. అలివేలు గురించి చెంచులకు తర్వాత చెప్పాలని నిర్ణయం తీసుకుంది. అలివేలును తిడుతూ దెబ్బ మీద దెబ్బ వెయ్యడం కాదు ఓదార్చాలి అని పోలయ్య మంగమ్మతో అన్నాడు.

చెంచులు టూర్‌కి వెళతానన్నాడు. టూరులో బుద్ధిగా ఉండి నలుగురిలో మంచి పేరు తెచ్చుకోమ్మని చెంచులకి మంగమ్మ చెప్పింది. పోలయ్య ఇచ్చిన రూ. 5/–లు తీసుకొన్నాడు. గుడిసెలో పడుకోని ఉన్న అలివేలు తన తల్లి అని చెంచులుకి తెలియక క్యాంప్‌కి బయలుదేరి వెళ్ళాడు. రైల్వేస్టేషన్‌లో కేశవరావు రమణారెడ్డిని, మిగతావారిని పరిచయం చేశాడు. అందరికి మారు పేర్లు పెట్టబడ్డాయి. చెంచులకు రాజు అనే పేరు పెట్టారు. అందరు ఒక ఊరు చేరారు. అక్కడి వారందరిని పరిచయం చేసి విశ్రాంతి తీసుకొమ్మని చెప్పి ఒక యువకుడు వెళ్ళి పోయాడు.

రమణారెడ్డి క్యాంప్‌లో అందర్ని గుండ్రంగా కూర్చో బెట్టుకొని క్రమశిక్షణతో ఐక్యత, గౌరవంగా ఉండాలని చెప్పాడు. ఎక్కడ నుండి వచ్చారో చెప్పకూడదని, అసలు పేర్లతో పిలుచుకోవద్దని చెప్పారు. మీకు తెలియని విషయాలు ఉంటే తననే అడగాలని చెప్పాడు. పాటలు వస్తే పాడాలని, రాకపోతే నేర్చుకోవాలని చెప్పాడు. రాజన్న పేరుతో కొత్త వ్యక్తి వచ్చాడు. రాజన్న ఉపన్యాసంలో అమరవీరులకు జోహార్లు, వాళ్ళ ఆశయాలు కొనసాగిద్దాం. కష్టాలు కన్నీళ్ళ దారిలో వెళుతున్నాం. అయినా ముందుకెళదాం. మీ భాగస్వామ్యం ఎంతో అవసరం. మిమ్ములను నిరంజన్ నడిపిస్తాడు. ఏమైనా అనుమానాలు ఉంటే అడగమన్నాడు. చెంచులు 'మాకు ఆకలి, దరిద్రం, పేదరికం కొత్తకాదు. కులం ఏందన్నా? ఇది పోదా? దీన్ని నాశనం చెయ్యలేమా'? తన మనస్సులోని మాట బయట పెట్టాడు. మా వర్గం అనే చెట్టుకు కొమ్మ లాంటిది కులం దీన్ని కూకటివేళ్ళతో సహా పీకివేస్తేనే పోతుంది. అందరు సమానంగా బ్రతికే సమాజం కోసం పోరాడుతున్నామని' చెప్పాడు. పోలీసులు ప్రశ్నిస్తే విద్యార్థులమని అల్లూరి తిరిగిన ప్రాంతాన్ని చూడడానికి వచ్చామని చెప్పమన్నారు.

తర్వాత బస్సు ఎక్కారు. వాళ్ళు ఎక్కడికి వెళుతున్నారో తెలియదు. బస్సు కండక్టర్‌కి వీళ్ళవాలకం చూసి అనుమానం వచ్చింది. క్యాంప్ రంపచోడవరం పూరి పాకల్లోకి వెళ్ళారు.

అక్కడివారు యానాదులకన్నా దారుణంగా ఉన్నారు. మన్యంలో గిరిజనుల పరిస్థితులు దారుణంగా ఉన్నాయని చెంచులు అర్థం చేసుకున్నాడు.చెంచులకి అంత అయోమయంగా ఉంది. ఆగుడిసెల మద్య క్యాంప్‌ను అర్ధరాత్రి వరకు మంటల మధ్య కొనసాగించారు. గిరిజనుల దోపిడి, హక్కుల గురించి చెబుతున్న సమయంలో పోలీసులు వచ్చారు. రాత్రంతా పోలీస్ స్టేషన్‌లో ఉంచి, విద్యార్థులని సి.ఐ వదిలివేస్తున్నానని చెప్పాడు. కానిస్టేబుల్ వారితో రాజమండ్రి దాకా వచ్చి ట్రైన్ ఎక్కించి వచ్చాడు.

మంగమ్మ అలివేలుకి అన్నం తినిపించాలని ప్రయత్నించింది. అలివేలు చెంచులు గురించి అడిగింది. స్నేహితులతో ఎక్కడికో వెళ్ళాడని వస్తాడని చెప్పింది. అలివేలును ఓదార్చింది. నోట్లో ముద్ద పెట్టుకుంటే పొరబోయి దగ్గడంతో మంగమ్మ ఏడుపుకు యానాదులంతా వచ్చారు. చెంచులు కోసం మరల అంజయ్యను అలివేలు అడిగింది. పోలయ్య కన్నీళ్ళు ఆపుకోలేక పోయాడు. ముగ్గురిని అంజయ్య ఓదార్చాడు. అలివేలు ఆరోగ్యం క్షణక్షణానికి క్షీణిస్తుంది. ఉదయం నుండి ఎంగిలి పడని వాళ్ళు ఇంటికి వెళ్ళి తినడానికి మనస్కరించక తిరిగి వచ్చారు. అర్ధరాత్రికి అలివేలు పరిస్థితి విషమించింది. అలివేలును చూసిన బహుజన కులాల వారు ఆమె స్థితికి కారణమైన కోటిరెడ్డిని తిట్టుకొని, శాపనార్థాలు పెట్టారు.

చెంచులు వస్తున్న విషయం సిటికెలోడి కొడుకు కోటేసు చెప్పాడు. చెంచులు వైపు చూస్తే లీలగా కనిపించగా లేవబోయిన అలివేలు అమ్మా అని కేక పెట్టి కూలబడి ప్రాణాలు విడిచింది. నీ కోసం ఎదురు చూసి చనిపోయిందని చెంచులుకి చెప్పారు. మంగమ్మ రోధిస్తుంటే ఎవరూ ఆపలేక పోయారు. చెంచులు అలాగే నిలబడిపోయాడు వయస్సులో చెడతిరిగి చచ్చిన దానిగురించి ఎందుకు ఏడుస్తున్నారంటూ కమ్మోళ్ళ ముత్తైదువా అని ఒకామె వెటకారంగా మాట్లాడింది. బాధలో ఉన్న యానాదులను ఆ మాటలు మరింత బాధించాయి.చెంచులు ముందున్న లక్ష్యం ఒక్కటే యానాదులంతా నవ్వుకునే రోజులు రావాలి. అవి రావాలంటే కులం పోవాలి. ఆరోజులు రావు, తీసుకు రావాలి. దూరం నుండి ఉద్యమపాటలు వినబడ్డాయి. వెన్నెల్లో యానాదులు నవ్వుకుంటున్నారు. ఆడుకుంటున్నారు. ప్రజాగాయకుడి పాటలో చెంచులు కలిసి పోతున్నాడు. యానాదుల బంగారు భవిష్యత్ కోసం ఆకాశమంత నీలిరంగు పులుముకుంది. ఆ దారిలో నడవడానికి చెంచులు సిద్దపడ్డాని రచయిత ప్రతీకాత్మకంగా నవలను ముగించాడు.

### <u>4.3.4. ఎన్నెల నవ్వు – పాత్రల పరిచయం</u>

#### <u>మంగమ్మ:</u>

చెంచులుకు అమ్మమ్మ, అలివేలుకు అమ్మ. పోలయ్య భార్య. ఈ నవలలో ప్రధానమైన పాత్ర. ప్రతి సంఘటనలో ఈ పాత్ర ఉంటుంది. మంగమ్మ యుక్తవయస్సులో ఉన్నప్పుడు పద్మశాలి కులస్తుడు భావ నారాయణ ఆమెను దగ్గరకు తీశాడు. ఆమెను గర్భవతిని చేసి కూతురు పుట్టిన తరువాత వదిలివేశాడు. అప్పటి నుంచి మంగమ్మ మగవారి కోరికలకు బలై చివరకు వరికోతలకు వెళ్ళింది. అక్కడ పోలయ్యతో పరిచయమై ఒకరి గురించి ఒకరు తెలుసుకోని పరస్పర అంగీకారంతో ఒక్కటౌతారు. అప్పటినుంచి చాలా అన్యోన్యంగా ఉంటారు. మంగమ్మ తన కూతురు అలివేలు బతుకు తన బతుకులా అన్యాయం కాకూడదని నాల్గవ తరగతి వరకు చదివించింది. పొగాకు గ్రేడింగ్ పనిలో సూపర్ వైజర్ కోటిరెడ్డి వలలో అలివేలు ఇష్టంగా చిక్కుకుంటుంది. అది తెలిసి మంగమ్మ మునయ్యతో పెళ్ళి చేస్తుంది. మునయ్యపై దొంగతనం నేరం చూపుతారు. దాంతో అతడు అనుమానంతో చనిపోతాడు. అప్పటికే గర్భవతి అయిన అలివేలుకు కొడుకు పుడతాడు. కోటిరెడ్డితో మరలా సంబంధం కొనసాగిస్తున్న అలివేలును మంగమ్మ మందలిస్తుంది. దాంతో అలివేలు ఇంటినుండి

వెళ్లిపోతుంది. అప్పటినుండి మంగమ్మ మనువడిని అల్లారుముద్దుగా పెంచుతుంది. అతడ్ని పదవ తరగతి వరకు చదివిస్తుంది. మనువడికి ఎప్పటికప్పుడు కులం, సమాజం, దాని పర్యావసానాలు చెబుతుంది. పోలయ్యతో చేపల వేటకు వెళ్ళి చేపలు అమ్ముకు వస్తుంది. ఆసాముల ఇండ్లలో పాచిపనిచేసి, కూలీ పనులకు వెళ్ళి కుటుంబాన్ని నెట్టుకు వస్తుంది. మంగమ్మ మందలింపుతో ఇంటి నుండి వెళ్ళిపోయిన అలివేలు తిరిగి వచ్చినప్పుడు తట్టుకోలేకపోతుంది. కూతురి పరిస్థితికి కారణమైన అగ్రకులతత్వాన్ని (కోటిరెడ్డిని) తిట్టుకుంటుంది. కూతుర్ని కూడా తిడుతుంది. పోలయ్యతో ఎప్పుడూ మాట మాటకు ఎదురు చెప్పినట్టు కనిపించిన వాళ్లిద్దరి ప్రేమను గొప్పగా చిత్రీకరించబడింది. మంగమ్మకు కూతురు అలివేలుపై ప్రేమ తెలియజేయబడింది. మనుమడు అంటే ఎంత ప్రేమో ఈ నవల అంతా పరుచుకోని ఉంది.

**<u>పోలయ్య:</u>**

మంగమ్మ భర్త. దక్షాది వరికోతలలో పోలయ్యకు పరిచయం అయింది. పోలయ్య మొదటి భార్య కాన్పు సమయంలో కనలేక చనిపోయింది. అప్పటికే పోలయ్యకు ఇద్దరు పిల్లలు. మంగమ్మ పరిచయం అయిన తరువాత ఒక్కరి గురించి మరొకరు తెలుసుకోని జంట అవుతారు. అప్పటినుంచి ఒకరి పిల్లలను ఒక్కరు తమ పిల్లలలాగానే భావించుకోని తమ పిల్లలా చూసుకుంటారు. పోలయ్య మంగమ్మకు మధ్య చివరికి అనేక విషయాల దగ్గర గొడువ పడినట్లు కనిపించినా, ఒకరు మీద ఒకరు ప్రేమను చూపించుకునే క్రమంలోనే వారి మధ్య మాటలు జరుగుతుంటాయి.అలివేలుకి పెళ్ళి చేయడంలో, మనుమడు చెంచుల్ని ప్రేమగా చూసుకోవడంలోబాధ్యతగా వ్యవహరిస్తాడు. అలివేలు ఇంటినుండి వెళ్ళిపోయి, తిరిగి వచ్చిన క్రమంలో జబ్బు పడి చావుకు దగ్గరగా ఉన్న అలివేలును చూసి ఏమి చేయలేక కన్నీరు కారుస్తాడు. అన్ని విషయాల్లో మంగమ్మకు చేదోడు వాదోడుగా ఉంటాడు.

**<u>అలివేలు:</u>**

మంగమ్మ కూతురు. పద్మశాలి కులస్థుడైన భావ నారాయణ మంగమ్మను మోసం చేసి, గర్భవతిని చేసి అలివేలును కన్న తరువాత వదిలివేశాడు. అప్పటినుండి మంగమ్మ కష్టపడి కూతుర్ని పెంచి పెద్ద చేసింది. అలివేలుని 4వ తరగతి చదివిస్తుంది. పెరిగి పెద్దైన అలివేలు యానాదుల్లో అందంగా, సినిమా తారలాగా అలంకరించుకొని మురిసిపోతుంది. పొగాకు గ్రేడింగ్ పనిలో సూపర్ వైజర్ కోటిరెడ్డి ఆమెను లోబరుచుకొని తన కోరికను తీర్చుకుంటాడు. వీరి సంబంధం తెలిసిన మంగమ్మ అలివేలుకు మేనబావ మునయ్యతో పెళ్ళి చేస్తుంది. మునయ్యపై దొంగతనం నేరం మోపగా అతడు అవమానంతో చనిపోతాడు. అప్పటికే గర్భవతి అయిన అలివేలు చెంచులకు జన్మనిస్తుంది. ఆ తరువాత మరల గ్రేడింగ్ పనులకు వెళ్తూ కోటిరెడ్డితో అక్రమ సంబంధం కొనసాగిస్తుంది. ఇద్దరిని జంటగా చూసిన మంగమ్మ దంపతులు అలివేలును మందలిస్తారు. మాట వినకపోయే సరికి ఇంట్లోనుంచి బయటకి వెళ్ళిపొమ్మని అలివేలుకు చెబుతారు. అలివేలు కోటిరెడ్డికి ఆ విషయం చెప్పి సహాయం కోరుతుంది. సహాయం చేస్తానని కోటిరెడ్డి అలివేలును మోసం చేస్తాడు. అలివేలుకి కోటిరెడ్డి విషయం అర్ధమై ఎటో వెళ్ళిపోతుంది. నవల ముగింపులో కొడుకు చెంచుల కోసం ఇంటికి వస్తుంది. అప్పటికే ఆమె ఆరోగ్యం పూర్తిగా పాడవుతుంది. మంగమ్మ అలివేలును చూసి మొదట తిడుతుంది. ఆ తరువాత భర్త పోలయ్య, అంజయ్య మంగమ్మకు సర్ది చెబుతారు. పరిస్థితి చూసి మంగమ్మ గుండెలు అవిసేలా ఏడుస్తుంది. అలివేలు కొడుకును చూపించమని అడుగుతుంది. చెంచులు స్నేహితులతో టూరుకు వెళ్ళాడని, త్వరలోనే వస్తాడని చెబుతారు. టూర్నుంచి తిరిగి వస్తున్న చెంచులును చూసి ఆమె కన్నుమూస్తుంది.

**<u>మునెయ్య:</u>**

అలివేలు భర్త, మంగమ్మ అన్న కొడుకు. అలివేలును పెళ్ళి చేసుకోని తోపు సంగంలో కొలుపుల కోసం వస్తారు. కొలుపులు అయినరోజు రాత్రి చేపల వేటకు పోలయ్య, అంజయ్య, సిటికలోడితో మునెయ్య, నర్సయ్య కలసి వెళ్తారు. తరువాత రోజు పొద్దున్నే అగ్రకుల యువకులు తోపు సంఘం పైకి వచ్చి పోలయ్యతో పాటు మునయ్యపై దాడిచేసి దొంగతనం చేశారని గుడివద్ద చెట్టుకికట్టి కొడతారు. మంగమ్మ ఆసాములను ఎంతగా బతిమలాడిన వినిపించుకోకుండా రేపటిలోగా గొలుసు తెచ్చి ఇవ్వకపోతే చంపి వేస్తామని బెదిరిస్తారు. భయపడిపోయిన మునయ్య చనిపోతాడు.

**<u>చెంచులు:</u>**

మంగమ్మ మనువడు. అలివేలు మునయ్యల కొడుకు. మునయ్య చనిపోయే నాటికి అలివేలు గర్భవతి, అలివేలు కొడుకుకి మంగమ్మ తన తండ్రి చెంచులు పేరు పెట్టుకుంటుంది. చెంచులు పుట్టిన తరువాత అలివేలు కోటిరెడ్డితో సంబంధాన్ని మరలా కొనసాగిస్తుంది. ఆ విషయం తెలిసి మంగమ్మ అలివేలును మందలిస్తుంది. అలివేలు కొడుకును మంగమ్మ వద్ద వదిలేసి కోటిరెడ్డిపై నమ్మకంతో ఇల్లు వదిలిపోతుంది. కోటిరెడ్డి మోసం చేస్తాడు. కొటిరెడ్డి మోసం తెలిసి అలివేలు ఏటో వెళ్ళి పోతుంది.

తరువాత మంగమ్మ చెంచులను అల్లారుముద్దుగా పెంచుతుంది. తనతోపాటు పాచిపనులకు తీసుకువెళుతుంది. కృష్ణమూర్తి పంతులు అలివేలును గురించి చెడుగా మాట్లాడుతాడు. చిన్నారి చెంచులను ఆ మాటలు గాయ పరుస్తాయి. కృష్ణమూర్తి పంతులు సలహాతో మంగమ్మ చెంచులను చదివిస్తుంది. తోపు సంఘంనుండి బడికి వెళ్ళిన మొదటివాడు చెంచులు. మంగమ్మ చెంచులకి వెన్నెల రాత్రుల్లో కథలు చెబుతుంది. ఆ కథలలో బుడ్డెమ్మ (దీపం కథ), సిటి యాక్ట్ కథలు ఉన్నాయి. చెంచులు పెద్దవాడు అవుతున్న క్రమంలో కులం, కులసమాజం గురించి మంగమ్మను అడిగి తెలుసుకుంటూ ఉంటాడు. కంకుల బండమీద కూర్చున్న మాలసింగయ్యను దేవుడి శేషయ్య కాలితో తంతాడు. ఆ దెబ్బకు అతడు కింద పడతాడు. అక్కడ ఉన్న యానాదులు మాలతనికి నీళ్ళు పోసి, సానుభూతి వ్యక్తం చేస్తారు. దేవుడి శేషయ్య బండ మీద కూర్చున్న మాలతన్ని ఎందుకు కాలితో తన్నాడో చెంచులకు అర్థంకాలేదు. మంగమ్మను అడిగితే పెద్ద కులపోల్ల ముందు మనం కూర్చోకూడదని చెబుతుంది. అలా ఎందుకు కూర్చోకూడదో చెంచులకు అర్థం కాలేదు. పెద్దయిన తరువాత దేవుడి శేషయ్యను తన్నాలని చెంచులు అనుకుంటాడు. ఈ సంఘటనతో కులహంకారం గురించి మనస్సులో ముద్ర పడిపోతుంది. చెంచులు దీపావళి పండుగకి తుపాకీ కోసం మారం చేస్తాడు. చెంచులు కూలికి వెళ్ళిన డబ్బులతో కొనుక్కోవాలనుకుంటే, మంగమ్మ వాటితో సరుకులు కొంటుంది. చెంచులు తనకి తుపాకీ కొనలేదని కోపంగా వెళ్ళిపోతాడు. కృష్ణమూర్తి ఇచ్చిన మతాబులు, పోలయ్య చేసిన తాటి దివ్వెలతో దీపావళి జరుపుకుంటారు యానాదులు. ప్రాథమిక పాఠశాల చదువులో మాదిగ పౌలు పంతులు చెంచులకు సహాయం చేసేవాడు. మాదిగ పౌలు పంతులు ఇంట్లో చెంచులు సహాయం చేసేవాడు. హైస్కూల్ చదువులో చెంచులు అన్ని సాంస్కృతిక పోటీల్లో పాల్గొని, అందరి మన్ననలు పొందేవాడు. స్కూల్‌లో అనసూయ చెంచులతో స్నేహంగా ఉండేది. అనసూయ అన్ని విషయాల్లో చెంచులకు చేదోడు వాదోడుగా ఉండేది. కుల పట్టింపు కారణంగా పెద్దల మందలింపుతో అనసూయ చెంచులతో మాట్లాడటం మానివేసింది. ఎందుకు మాట్లాడటం లేదంటే యానాదులతో అగ్రకులం వారు స్నేహం చేయరాదని మామయ్య మందలించాడని చెబుతుంది. ఏమైన మాట్లాడాలంటే ఏవరు చూడకుండా మాట్లాడమని చెప్పింది. అప్పటి నుండి చెంచులకు సమాజతీరుపై, కుల వ్యవస్థ పై కోపం వచ్చింది. ఆ

రోజంతా ఎవరితో మాట్లాడలేదు. ఎవరితో కలవకుండా వేరుగా స్కూల్‌కి రావడం చేసేవాడు. ఈ సమయంలో కమ్యూనిష్టుల ఉపన్యాసాలు చెంచుల్ని ఆకర్షించాయి. కేశవరావు అనే స్టూడెంట్ నాయకుడి ప్రోద్భలంతో చెంచులు అపరిచిత వ్యక్తితో మాట్లాడతాడు. అతడు కులం పోవాలంటే పునాది కూల్చాలని చెబుతాడు. ఆయన మాటలకు ఆకర్షితుడై ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు సేవ చేయడానికి రెండు రోజుల్లో టెంత్ క్లాస్ పరీక్షలు ఉన్నా రాయకుండా వాళ్ళతో బయలు దేరాతాడు. బయలు దేరే సమయంలో ఇంట్లో నుండి వెళ్లిపోయిన తల్లి అలివేలు అనారోగ్యంతో వస్తుంది. ఆమె తన తల్లి అని చెంచులకి తెలిదు. అమ్మమ్మ మంగమ్మ కూడా చెప్పదు. స్నేహితులతో టూర్ వెళ్తున్నాని చెప్పి ఉద్యమంలో పనిచేయ్యడానికి వెళ్తాడు. రైలులో రాజమండ్రికి, అక్కడి నుండి ఏజెన్సీ ప్రాంతంలోకి వెళ్తాడు. అక్కడికి చెంచులు లాంటి వాళ్ళను అనేక మంది ఉద్యమంలోకి వస్తారు. అడవుల్లో ఉన్న గిరిజనుల పరిస్థితి యానాదులకన్న ఘోరంగా ఉన్న విషయం చెంచులు అర్ధం చేసుకుంటాడు. అక్కడికి వచ్చిన వారు మారు పేర్లతో పిలుస్తున్నారు. చెంచులకి ఈ విషయం అర్ధం కాలేదు. క్యాంప్‌కు వచ్చిన వారందరు రాత్రిపూట పాటలు పాడుతుంటే పోలీసులు పట్టుకెళ్ళి విచారించి, స్టూడెంట్‌లని నిర్ధారించుకోని, పంపించి వేస్తారు. చెంచులు ఇంటికి వచ్చేసరికి తల్లి అలివేలు చెంచుల్ని వచ్చే దారిపైపు చూస్తూ మరణిస్తుంది. చెంచులు అక్కడ ఉన్న యానాదులు దీనమైన ముఖాలను తల్లి శవాన్ని చూస్తూ అలాగే నిల్చుండి పోయాడు.

యానాదులంతా నవ్వుకొనే రోజులు రావాలి. వెన్నెట్లో ఊసులాడుకునే రోజులు రావాలి. అవి రావాలంటే కులం పోవాలని, కులం దానికదే పోదని, పోయేలా పోరాటం చేయాలని చెంచులకు అర్థమై కుల నిర్మూలన పోరాటాల (అంబేద్కరిజం) వైపు ఆకర్షితుడైనట్లు ప్రతీకాతకంగా రచయిత చెప్పాడు.

**<u>సిటికలోడు:</u>**

'ఎన్నెల నవ్వు'లో ప్రధానమైన పాత్ర. అగ్రకులాల వారికి సేవ చేస్తూ తన ప్రాణాన్ని సైతం నవ్వుతూ ఎలా బలి చేసుకున్నాడో తెలియజేస్తుంది. యానాదులు కూడ మనుష్యులేనని వారికి మంత్రతంత్రాలు ఏమీ తెలియవని తెలియజేసే పాత్ర. యానాదుల భార్యాభర్తల బంధం యెక్క గొప్పతనాన్ని తెలియజేసే పాత్ర. యానాది కళాకారులకు ప్రకృతే పాఠశాల అని తెలియజేస్తూ పుల్లంకి పిట్ట ఆట ఆడి యానాదులకు వినోదాన్ని అందించిన పాత్రగా చెప్పవచ్చు. ఎన్నెల నవ్వులో కరుణా రసాత్మకమైన పాత్ర సిటికలోడిది. అలివేలు పెళ్ళిచూపుల సందర్భంలో సిటికలోడి పాత్ర మొదలై పెళ్ళిలో యానాదుల ఆహారపు అలవాట్ల గురించి తెలియజేస్తుంది. పెళ్ళి తర్వాత ఎన్నెల్లో ఆడ పున్నంగి పిట్టలా ఆడి యానావులను నవ్విస్తాడు. సిటికలోడు కట్టెలు పగులకొట్టిస్తాడు. బుడ్డమ్మ రత్తమ్మ దగ్గర అడిగి తీసుకు వచ్చిన కూడు భర్తకు, పిల్లలకు పెడుతుంది. సిటికలోడు తిని నిద్ర పోతాడు. చౌదరి ఇంట్లో పాము దూరిందని చౌదరి పనివాడు అంజయ్య కోసం వస్తాడు. లేదని తెలిసి సిటికలోడిని బతిమలాడి తీసుకు పోతాడు. ఆకలి తీర్చుకోవడంలో భాగంగా నాలుగు డబ్బుల కోసం ఆశపడి, సిటికలోడు ప్రాణాలు ఫణంగా పెట్టి పామును పట్టుకోవడం కోసం దూలం ఎక్కాడు. ఇల్లు చీకటిగా ఉంది పామును పట్టుకునే ప్రయత్నంలో రెండు సార్లు పాముకాటుకు గురి అయ్యాడు. ఆ విషయం అక్కడ ఎవరికి చెప్పకుండా పామును కుండలో పెట్టుకుని ఇంటికి తీసుకు వచ్చాడు. చనిపోతానని తెలసి చివరిసారిగా పిల్లలను చూచుకుని, భార్యతో చివరి సారిగా ప్రేమతో మాట్లాడి బ్రహ్మంగారి గుడి వరకు నడిచి వెళ్ళాడు. మాదిగ అయ్యన్న సిటికలోడి పరిస్థితి దారుణంగా ఉందని పోలయ్య, అంజయ్యను తీసుకువెళ్ళాడు. అక్కడ నుంచి సిటికలోడ్ని డోలీ కట్టుకు వచ్చారు. అయితే సిటికలోడు చనిపోతున్న బాధను దిగమింగుకుని నవ్వుతూ పిల్లల కన్నీరు తుడిచాడు.

గుండెలవిసేల ఏడుస్తున్న బుడ్డమ్మ చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకొమ్మని మంగమ్మకు, రత్తమ్మలకి చెప్పాడు. తగాదాలు పెట్టుకోకుండా కలిసిమెలసి ఉండమని అందర్ని చూస్తు నవ్వుతూ ప్రాణాలు వదిలాడు.సిటికలోడికి తాను చనిపోతున్నాని బాధ లేదు. నవ్వుతూ చనిపోయాడు. అందరూ నవ్వుతూండాలనే కోరుకునే గొప్ప ఆశావాది సిటికలోడు.

**<u>బుడ్డమ్మ:</u>**

సిటకలోడి భార్య. భర్త అంటే ఎనలేని ప్రేమ గలది. భర్త పిల్లల కోసం తాను తినకుండా ప్రక్క ఇంట్లో అడిగి తెచ్చిన కూడు పిల్లలకు, భర్తకు పెట్టితాను పస్తులు ఉంటుంది.పాము కాటుకి గురైన భర్త ప్రవర్తనలో మార్పు కనిపెట్టినా అడగలేక పోతుంది. భర్త రాత్రికి ఇంటికి రాకపోతే ఎక్కడికెళ్ళాడోనని బాధ పడుతుంది. పాముకాటుకు గురై చనిపోతుంటే గుండెలవిసేల ఏడ్చింది. భర్త చనిపోయిన ధైర్యంగా పిల్లల కోసం బతుకు పోరాటం చేస్తుందీ పాత్ర.

**<u>అంజయ్య:</u>**

అంజయ్య రత్తమ్మ భర్త. పోలయ్యకు వరుసకు అన్న. పోలయ్య సవాసగాడు. తోపు సంగంలో పెద్దమనిషి. పోలయ్యతో పాటు పని పాటల్లో ఉండేవాడు. పోలయ్య, అంజయ్య జంటలు చేపల వేటకోసం వెళతారు. అలివేలు కోటిరెడ్డిలను చూసి పోలయ్యకు తెలియజేస్తారు. అలివేలు పెళ్ళి చూపుల, పెళ్ళి సమయంలో ముందుండి కార్యక్రమాలు జరిపిస్తాడు. సిటికలోడి చావు సమయంలో, అలివేలు చివరి క్షణాల్లో వారి దగ్గర ఉండి బాగోగులు చూసుకుంటారు. ఈ నవలలో ఉదాత్తమైన పాత్రలలో ఇది ఒకటి.

**<u>రత్తమ్మ:</u>**

అంజయ్య భార్య. భర్తకు చేదోడు వాదోడుగా ఉంటుంది. తోపు సంగంలో మంగమ్మ, బుడ్డమ్మ మొదలగు పాత్రలకు సహాయం చేస్తుంది. అలివేలు పెళ్ళిచూపులప్పుడు ఆమెకు అలంకారం చేస్తుంది. చేపల వేటకు భర్త అంజయ్యతో పాటు వెళ్ళి అక్కడ పుల్లలు ఏరుకుని పట్టిన చేపలు ఊళ్ళో ఆసాములకు అమ్మి డబ్బులు ఇవ్వలేదని మంగమ్మతో చెబుతుంది. మంగమ్మ దళితులకు, ఆసాములకు మధ్య ఉన్న తేడాలు వివరించినప్పుడు ఆ తేడాలను రత్తమ్మ తెలుసుకుంటుంది. తోపు సంగం సుఖదు:ఖాల్లో రత్తమ్మ భాగం పంచుకుంటుంది.

**<u>ఏకుల నర్సయ్య, పర్వతాలు:</u>**

ఇద్దరు భార్యభర్తలు. మునెయ్య తల్లిదండ్రులు, మంగమ్మ వదిన అన్నలు. అలివేలు అత్తమామలు. అలివేలు పెళ్ళి సమయంలో ఈ పాత్రలు మనకు పరిచయ మౌతాయి.

**<u>పక్కెలోడు, బుర్రెమ్మ:</u>**

ఇద్దరు భార్యభర్తలు. ఎర్రగుంట్ల(దొరువు సంఘం) సంఘంలో పెళ్ళిళ్ళ పూజారి పక్కెలోడు. యానాది పురోహితుడికి, వేద (బ్రహ్మణ) పురోహితుడికి వ్యత్యాసం ఈ పాత్ర ద్వారా రచయిత వ్యక్తపరిచాడు. బ్రాహ్మణత్వాన్ని ధిక్కరించే ధిక్కార స్వరమే పక్కెలోడు. పక్కెలోడు యానాదుల ఆత్మగౌరవ పతాక. పక్కెలోడు పేరు వెనుక ఒకకథ వుంది. ఆ కథను అంజయ్య రత్తమ్మకు చెప్పాడు. పక్కెలోడు అసలు పేరు రాముడు. పక్కెలోడు చేపలు పట్టి అమ్మాడు. పక్కెలు అమ్మగా వచ్చిన డబ్బులతో నూకలు తెచ్చాడు. మిగిలిన పక్కెలు, నూకలు బుర్రెమ్మ కిచ్చి నూకలు కూడుకాయి. దానిలోకి పక్కిల చారు వండమని ఇచ్చాడు. ఆమె వండింది. కూడు పెట్టమని అడిగిన పక్కలోడికి కూటికుండ ముందుపెట్టింది చాపల చారేది పిల్లా అంటే అన్ని కూట్లోనే వున్నాయిలే తినమంది. నోట్లో పెట్టుకున్న కూడు తుపుక్కుమని ఊశాడు. అమ్మే బుర్రె కూర ఎట్టవండావే అంటే నువ్వు చెప్పినట్టే వండాను. చాపలు కడిగి ఉప్పు,కారం, పసుపు అన్ని కూటిలోనే కలిపి వండా ఏమి బాగా లేదా అంది. అంతే ఆశగా తెచ్చుకున్న చేపల కూర నాశనం చేసిందని అయ్యమ్మని బాగా తన్ని బుర్రెమ్మ నెత్తికి పులిమి

తరిమివేశాడంట. అప్పటి నుండి రాముడు కాస్త పక్కలోడు అయ్యాడు. పక్కలోడు పెళ్ళిలో తన ఇష్టం వచ్చినట్లు మంత్రాలు చదివి అలివేలు, మునెయ్యల పెండ్లి జరిపించాడు. పెండ్లి తర్వాత అరుంధతి నక్షత్రాన్ని చూపించి పెళ్ళివంతు ముగించాడు.

**<u>భావ నారాయణ:</u>**

పద్మశాలి కులస్తుడు. మంగమ్మ వయస్సులో ఉన్నప్పుడు దొంగ కాపురం వెలగబెట్టాడు. పాపం మంగమ్మ అతను తనతో కాపురం నిజమనుకున్నది. అలివేలును కన్నది. అలివేలు అచ్చుగుద్దినట్లు తండ్రి పోలికే. దొంగ కాపురం విషయం భావనారాయణ ఇంట్లోతెలిసింది. ఇంతకు ముందే భార్యపిల్లలు కలిగిన భావనారాయణపై ఇంట్లో వత్తిడి పెరగడంతో ముఖం చాటువేశాడు. మంగమ్మ అడబిడ్డతో బజారున పడింది.

**<u>కోటిరెడ్డి:</u>**

పొగాకు కంపెనీలో సూపర్ వైజర్. తన అధికారంలో స్త్రీలను లొంగ తీసుకుని తన అవసరాలకోసం వారిని వాడుకుంటూ ఉంటాడు. అలివేలుకి సహాయం చేసి ఆమెను ఆకర్షించి లోబర్చుకున్నాడు. ఇద్దరి ఇష్టప్రకారం కోరిక తీర్చుకుంటాడు. అలివేలు పెళ్ళి తర్వాత భర్త మునెయ్య దొంగతనం నేరం మోపగా అనువమానంతో మరణిస్తాడు. తల్లి దగ్గరే ఉండి గ్రేడింగ్ పనులకు వెళ్తున్న అలివేలుతో మరల సంబంధాన్ని కొనసాగిస్తాడు. మంగమ్మ కోటిరెడ్డిని అలివేలుతో సంబంధాన్ని ప్రశ్నిస్తుంది. అతడు ఏమి సమాదానం చెప్పకుండానే వెళ్ళిపోతాడు. మంగమ్మ అలివేలును మందలించి, కోటిరెడ్డితో సంబంధం మానుకోక పోతే ఇంట్లోంచి వెళ్ళిపొమ్మని చెబుతుంది. కోటిరెడ్డికి అలివేలు జరిగిన విషయం చెప్పి ఆదుకోమని చెబుతుంది. కోటిరెడ్డి ఆదుకుంటానని చెప్పి అలివేలును మోసం చేస్తాడు. అలివేలు కనబడకుండా పోతుంది. తీవ్ర అనారోగ్యంతో ఇంటికి వచ్చిన అలివేలు పరిస్థితిని చూసి ఆ స్థితికి కారణమైన కోటిరెడ్డిని అందరూ కసిదీర తిట్టుకుంటారు.

**<u>పెంచలమ్మ:</u>**

పర్వతాలు చెల్లెలు. అలివేలు పెళ్ళికి వస్తుంది. జాలమ్మ చెట్టు సంఘం. భర్త కప్పలు అమ్మడానికి ఉత్తరాది వెళ్ళి తిరిగి రాలేదు. అప్పటినుండి ఆ రెడ్డి ఇంట్లో పని చేస్తూ, ఆ రెడ్డి శరీరపు వాంఛలకు బలై ఉంపుడుగత్తెగా ఉంటుంది. అది తప్పు అని కూడ ఆకులానికి పట్టింపు లేదు. పెళ్ళిలో నలుగు పాట పాడింది.

**<u>మేకల చెంచయ్య:</u>**

తోపు సంగం ముదాం ఆ సంగం పెద్ద, మంచికి చెడ్డకి ఆయనే ముందుంటాడు. పెళ్ళి, చావులకు యానాదులను ఒక్క చోట చేర్చి జరగవలసిన పనులు దగ్గరుండి జరిపిస్తాడు. అలివేలు పెళ్ళిచూపుల సమయం ఇరు కుటుంబాలను రకరకాల ప్రశ్నలడిగి అందర్ని నవ్విస్తూ ఆ కార్యాన్ని ముగిస్తాడు.

**<u>కల్లయ్య:</u>**

ఎర్రగుంట్ల దరువు సంగం వ్యక్తి, అలివేలు, మునెయ్య పెళ్ళిలో హడావుడి చేస్తున్నాడు. పెళ్ళిలో నర్సయ్య పరిస్థితి చూసి కొండకు ఎదురు నడకల విషయంలో దేవుడు ఇక్కడే ఉ న్నాడని ఇక్కడే పెళ్ళి కొడుకు చేత కొబ్బరికాయ కొట్టిస్తే చాలని కొండకు ఎదును నడకను సర్దుబాటు చేశాడు. నర్సయ్యకు వంట పనిలో కల్లయ్య చతుర్లాడతాడు. దక్షాది యానాదులు వచ్చి, చేస్తేనే మీకు పనులు అవుతున్నాయని చమత్కారంగా మాట్లాడుతున్నాడు.

**<u>వెంకాయమ్మ:</u>**

వెంకీ, పెద్ద ముత్తయిదువ. దరువు సంగం పెద్దావిడ. దరువు సంగంలో దాదాపుగా ఆవిడ చేసినవే కాన్పులు. పెళ్ళి కొడుకు తండ్రి నర్సయ్యకు కూడ ఈమె పురుడు పోసింది.

ఆమె మంత్రసానిగా చేసిన పురుడ్లు అన్ని సుఖంగా జరిగాయి. అందుకే ఆమె అంటే అందరికి గౌరవం. ఆమె చేయి చల్లనిదని అందరి నమ్మకం పెళ్లైన కొత్తలో భర్త కాపురానికి రమ్మంటే వెళ్ళలేదు. దొరవు సంగంలోనే వుంటేనే కాపురం చేస్తానంది. దానికి ఆమె భర్త ఒప్పుకోలేదు. అదే వాళ్ళు విడిపోవడానికి కారణం. దోరువు సంగంలో ఆమె మాటకు ఎవరు ఎదురు చెప్పరు. సంగంలో అందరు ఆమెను 'పెద్దామ్' అని పిలుచుకుంటారు. అసలు పేరు వెంకాయమ్మ కానీ ఊళ్ళో వాళ్ళు మాత్రం ఎంకీ అనిపిలుస్తారు. ఎవరు ఎలా పిలిచిన పలుకుతుంది. ఆ పెద్ద ముత్తయిదు నాయుడిగారి దగ్గర తాళిబోట్టుకోసం వెళుతూ అక్కడ ఎలా మెలగాలో చెబుతుంది. నాయుడి గారి భార్యతో మాట్లాడుతుంటే లింగప్పనాయుడు వచ్చాడు. నాయుడు ప్రశ్నలకు పెద్దముత్తయిదు సమాధానాలు చెప్పి, పెళ్ళికూతుర్ని చూపించి, సమయానికి తాళిబొట్టు తీసుకు వచ్చింది. పెళ్ళి తంతును పూర్తి చేయడానికి సహకరించింది.

**<u>యానాది నర్సయ్య:</u>**

ఎర్రగుంట చెరువు (దొరువు) సంగంలో యానాది. (చెరువు గట్టున తాటి తోపులో మంచినీళ్ళ బావి. ఊరందరికి అదే బావి నీళ్ళే తాగడానికి. వూళ్ళో అన్ని కులాలు దూరంగా ఉన్న మంచినీళ్ళకు మాత్రం అక్కడికి రావాల్సిందే. కానీ మాల, మాదిగలకు ఆ బావి ఎక్కి నీళ్ళు తోడుకునే అర్హత లేదు. వాళ్ళు అంటరాని వాళ్ళు కనుక వాళ్ళకు ఆ బావిని తాకే అర్హత లేదు. మాల, మాదిగల పరిస్థితి దయనీయం. బావికి దూరంగా ఖాళీ బుంగలు పెడితే ఎవరన్న దయతలచి నీళ్ళు తోడి పోస్తారు. యానాది నర్సయ్య మాల మాదిగల విషయంలో ఆత్మీయ బంధువు, ఆ పల్లెలనుండి పసిపిల్లవాడు వచ్చి పిలిచినా ఓపికతో బావికి వచ్చి నీళు ్ళ తోడి పోస్తాడు. అందుకే మాల మాదిగలు నర్సయ్యని, మిగిలిన యానాదులను ఆత్మీయంగా చూస్తారు.

**<u>సిన్నబ్బి (పొట్టినారాయణ) :</u>**

డుబ్బాంగ్ మేళం అంటే యానాదులకు మహా ఇష్టం. డుబ్బాంగ్ కళాకారుడు సిన్నబ్బి మేళం కాక పెట్టుకుంటున్నాడు. సిన్నబ్బి అసలు పేరు నారాయణ పొట్టిగా ఉంటాడు. కాబట్టి పొట్టినారాయణ, సిన్నబ్బి అంటారు. హుషారైనవాడు.. అన్ని పనులు చేస్తాడు. నారాయణ పెళ్ళాం వెంకాయమ్మ, ఎంకాయ్ అని కులపోళ్ళు, ఎంకీ అని అగ్రకులపోళ్ళు పిలుస్తారు. సిన్నబ్బి అంటే వెంకాయమ్మకి అమితమైన ప్రేమ, ఆలు మొగలిద్దరు తమ పనుల్లో సగం సగంగా ఉంటారు. ఒకరి కోసం ఒకరు పుట్టినట్లుగా ఉంటారు. అద్భుతమైన దాంపత్యం వారిది. దీపం మసి పొయ్యిలో బూడిదతో సిన్నబ్బి మేకప్ వేసుకోని వింతగా వచ్చిండు. ఆటా ఆడలంటే, కట్నం ఇచ్చుకోవాలన్నాడు. దారిలో యానాదులు దొరువు సంగం తీసుకొమ్మని అన్నారు. సిన్నబ్బి వుల్లంకి పిట్ట ఆడాడు. పెళ్ళికి వచ్చిన జనం అందరూ సిన్నబ్బిని మెచ్చుకొని, నవ్వుకున్నారు. సిన్నబ్బికి తోడుగా సిటికెలోడు ఆడాడు. నవ్వులతో పెళ్ళి ముగిసింది. యానాదులకు జీవితమే ఆట వస్తువు. ఆహార సేకరణ వాళ్ళకు కళలు నేర్పింది. యానాది కళాకారులు ఆకలి తీర్చుకునే ఆచరణలో కల్తిలేని సజీవమైన కళా రూపాలకు సృష్టికర్తలు. చెట్టు, పుట్ట, పాము, పక్షి, చేప, జెల్ల మొదలగు సమస్త జీవులు యానాదులకు గురువులే. ఆ కళలను వాళ్ళు తర్వాత తరాల వారికి అందజేయ బడుతున్నాయి. ఈ క్రమంలో అక్షరం వారిదే, పాట వారిదే, పదము వారిదేనని చెప్పవచ్చు.

**<u>సుబ్బయ్య:</u>**

పొగాకు కంపెనీ వాచ్‌మెన్. అలివేలు, కోటిరెడ్డి వ్యవహారం పసిగట్టినవాడు, రెండోసారి అలివేలు కోటిరెడ్డికోసం చూస్తుంటే పిలుస్తాను ఉండు అన్నాడు. ఏం పిల్లలో పిదపకాలము, పిదప బుద్దులు అంటూ లోపలికి వెళ్ళి కోటిరెడ్డిని పిలిచాడు.

**విశ్వనాథం:**

సినిమాహాల్‌లో వాచ్‌మెన్ అలివేలు మొదటి ఆట సినిమాకొచ్చి కోటిరెడ్డి కోసం కంపెనీకి వెళ్తున్నప్పుడు విశ్వనాథం గేట్ తీసి బయట చీకటిగా ఉంది జాగ్రత్తగా వెళ్ళమ్మా అని చెప్పి పంపించాడు. అలివేలు విశ్వనాథాన్ని మీది ఏకులం అని అడిగింది. న మేం యాందోళ్ళమమ్మ అని చెప్పాడు. అలివేలు వరసలు కలుపుకొంది. ఇంత చీకటిలో ఊరికి వెళ్ళోద్దు పోద్దున్నే పోదువుగాని లే.. ఈ పూటకు ఈడే ఉండు దాదా... అని విశ్వనాదం గుక్క తిప్పుకోకుండా మాట్లాడి అలివేలును ఆహ్వానించాడు. కోటిరెడ్డి కోసం గ్రేడింగ్ కంపెనీకి వెళ్ళి అతడు కనిపించాక రెండో ఆట సమయానికి అలివేలు సినిమాహాల్ వద్దకు వచ్చింది. ఇంటికి తీసుకు వెళ్ళి భార్య తులసమ్మను పరిచయం చేసి విషయం చెప్పాడు. అన్నం తినమంటే తినకుండా కూర్చుంది. విశ్వనాథం బతిమాలాడుతుంటే భార్య అనుమానంగా చూసింది. నీతోనే గెలవలేక తంగిరిబింగిరి అవుతుంటే నా ముఖానికి ఇంకొకటి అని నవ్వుకున్నాడు. ముక్కు మొకం తెలియకపోయిన ఆదరించే వాడుగా విశ్వనాథం ఈ నవలలో కనబడతాడు.

**కృష్ణమూర్తి:**

టూరింగ్ టాకీస్ మేనేజర్. విశ్వనాధంను పిలిస్తే అలివేలు కంగారుగా లేచింది. అలివేలు రూపం ఇట్టే కృష్ణమూర్తిని ఆకర్షించింది. అలివేలు వివరాలు విశ్వనాథం దగ్గర కనుక్కొని ఈ దోమల మధ్యలో ఏలా పడుకుంటుందని రెండో ఆట అయిన తర్వాత సినిమా హాలు బెంచీలు మీద పడుకోమన్నాడు. అలివేలు వైపు ఆశగా చూస్తు వెళ్ళిపోయాడు.

**కృష్ణమూర్తి పంతులు:**

మంగమ్మ పాచి పని చేసే ఇంటి యజమాని, చెంచుల తల్లి గురించి ఆరా తీసి వెటకారంగా మాట్లాడతాడు. అవునే.. అది... ఇప్పుడు ఎక్కడున్నదే... తిరిగితే తిరిగిందిలే... ఏమన్నా సంపాదిస్తుందా.. లేదా.. అన్న పంతులు గారి మాటలు మంగమ్మ మనస్సును చివుక్కుమనిపించాయి.ఆ పోతే పోయిందిలేవే... పిల్లవాడు చక్కగా ఉన్నాడు. బడికి పంపించు అని ఉచిత సలహా ఇచ్చాడు. ఆ ఒక్క మాటతో మంగమ్మ అప్పటివరకు అనుభవించిన అవమాన భారం తుడిచిపెట్టుకుపోయింది. దీపావళి పండుగ సమయంలో మతాబులు ఇస్తుంటే వద్దండి మా అమ్మమ్మ కొనిందని చెంచులు తీసుకోలేదు. మంగమ్మ ఇటియ్యి నాయనా అంటూ ఆ కాకరోత్తుల పెట్టిని అందుకోని వత్తాసామి అంటు చెంచుల్ని తీసుకోని ఇంటి దారి పట్టింది. కృష్ణమూర్తి పంతులు తన ఇంట్లో పనిని పనివాళ్ళ చేత చేయించుకోవడానికి చాకచక్యంగా వ్యవహరించే తత్వం కలవాడు.

**మాదిగ పౌలు పంతులు:**

చెంచులకి పాఠశాలలో సహాయం చేసేవాడు. పై చదువులను గురించి వివరించేవాడు. మిషనరీ చదువులతో యానాదులకంటే మాదిగలు చదువుల్లో ముందుండి ఉద్యోగాల్లో చేరారని పౌలు పంతుల పాత్ర ద్వారా తెలుస్తుంది.

**దేవుడి శేషయ్య, మాలల్లో సింగయ్య:**

మాలల్లో సింగయ్య గడ్డిమోపు మోస్తూ అలసిపోయి సిటికలోడి ఇంటిముందు దాన్ని పడవేశాడు. అలుపు తీర్చుకోవడానికి కంకులు బండమీద కూర్చున్నాడు. బుడ్డమ్మను తాగడానికి నీళ్ళు అడిగి, చింతచెట్టు కింద సేద తీరుతూ కూర్చున్నాడు. ఆ దారంటే దేవుడు శేషయ్య బర్రె గొడ్లను అదిలించుకుంటూ వస్తున్నాడు. దేవుడి శేషయ్య నఖశిఖ పర్యాంతరం కమ్మకుల అహంకారం వంట బట్టించుకొన్నాడు. నీళ్ళు తాగడానికి పైకిలేవడానికి ప్రయత్నిస్తున్న

సింగయ్యను బలంగా వీపుపై తన్నాడు. సింగయ్య బోర్ల పడ్డాడు. గావు కేకలు వేశాడు. ఆ కేకలకు యానాది సంగం బిత్తర పోయింది. 'మాల నాకొడకా బండెక్కి ఠీవిగా కూర్చోన్నావు గదరా లంజకొడక ఈ మద్దెల నా కొడుకులారా మరీ బలసి కోట్టుగుంటున్నార్రా మీరు. ఇవతల మనిషి వస్తున్నా, లెక్క లేకుండా నీలుక్కోని కూసున్నావే... అంత కళ్ళు నెత్తి కెక్కినయ్యంట్రా? నాయాల'... అన్నాడు. 'కాపా.. సూడలేదయ్య. సింగయ్య దండం పెడుతూ వణికి పోతున్నాడు. 'జాగర్త నా కొడకలారా' అంటూ అక్కడ నుండి శేషయ్య వెళ్ళి పోయాడు. ఆడవాళ్ళతో సింగయ్య నేను ఆయన్ని సూడలేదంటు అని వంటికున్న దుమ్ము విదిలించుకోని లేచి, గడ్డి మోపు తీసుకోని వెళ్ళిపోయాడు. ఈ సంఘటన ఆదిపత్యాకులాల్లోని కులస్వభావానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు.

**<u>చాకలి ముసలయ్య:</u>**

పొగాకు నారేతలకు కూలీలను తీసుగు వెళ్ళి, నాట్లు వేయించే ముఠా మేస్త్రీ. చెంచులను పనికివస్తే తుపాకీ కొనుక్కోవడానికి డబ్బులు ఇస్తానని చెప్పి తీసుకువెళ్ళాడు. అదే విధంగా చెంచులకి ఒక్క రూపాయి కూలీ ఇస్తాడు. బిసి కులానికి చెందిన ముసలయ్య కింది కులాలను కూడగట్టి పనులు చేయిస్తుంటాడు.

**<u>చౌదరి:</u>**

తోపు సంగం యానాదులు డబ్బులు అవసరానికి చౌదరి గారి దగ్గరకి వెళ్ళేవారు. మంగమ్మ కూడా పతానం సమయంలో డబ్బులు అడగడానికి చౌదరి ఇంటికి వెళ్ళింది. చౌదరి లేడు, గొడ్ల సావిడిలో పుల్లలు తీసుగువస్తే డబ్బులు ఇస్తానని చౌదరి భార్య ఆశ చూపింది. పని చేసిన తర్వాత చౌదరిగారు ఇంకా రాలేదని రచ్చబండ దగ్గర ఉంటారు వెళ్ళమని చెప్పింది. అక్కడకి వెళ్ళి చౌదరికి మంగమ్మ విషయం చెప్పి డబ్బులు అడిగింది. చౌదరి యానాదుల పెళ్ళిళ్ళ గురించి ఎగతాళిగా మాట్లాడాడు. మంగమ్మకు కోపం వచ్చింది. కానీ తమాయించుకుంది. యానాదులు ఇప్పుడు మనల్ని చూసి మారిపోయారు. అని చెప్పి మీ అమ్మగార్ని అడిగి పాతిక రూపాయలు తీసుకు వెళ్ళమన్నాడు. దార్లో కంసాల బత్తుడ్ని పిలిచి వెళ్ళమని చెప్పాడు. దారిలో కంసాల బత్తుడికి కబురు చెప్పింది. చౌదరి భార్యకి డబ్బుల విషయం చెప్పగా తాఫీగా ఇంట్లోకి వెళ్ళి డబ్బులు తీసుకు వచ్చి మంగమ్మకిచ్చింది. చౌదరి దొంగతనం నేరం య ఆనాదులపై మోపి కోడుతున్నప్పుడు మంగయ్యాని న్యాయం చేయమని అర్థించింది. కానీ చౌదరి మునెయ్యను చెట్టుకు కట్టించి మరి కొట్టించాడు. సాయంత్రంలోపు నగను తెచ్చిమ్మని హెచ్చరించాడు. చౌదరి ఇంట్లో పామును పట్టుకుంటూ సిటికెలోడు పాము కాటుకు గురై మరణిస్తే, కనీసం సానుభూతి కూడా వ్యక్తం చెయ్యడు. చౌదరి మానవత్వం లేనివాడిగా చిత్రించబడ్డాడు.

**<u>లింగప్ప నాయుడు:</u>**

ఎర్రగుంట చెరువు పెత్తందారు. ఆ ఊరు జనం నాయుడు గారు అని గౌరవంగా పిలుచుకుంటారు. ఎత్తైన విగ్రహం గుబురు మీసాలు, సువ్వల్లా నిక్కబొడుచుకొని ఉన్న తలకట్టు నాయుడిది. మనువు ధర్మాన్ని తరతరాలుగా అమలు చేస్తున్న కుటుంబం నాయుడిది. అందుకే నాయుడు పుట్టిన కులంలో పుట్టినందుకు ఆ కులంవారు గొప్పగా భావిస్తారు. పేదలకు నాయుడంటే భయం.ఆ గ్రామం కుర్రాళ్ళకు నాయుడు ఆదర్శం. కింది కులాల ఇంటికి ఎవరొచ్చిన నాయుడు అనుమతి అవసరం. శుభకార్యం జరిగితే మొదటి తాంబాలం ఆయనకే ఇవ్వాలి. ఆయన ఇంటిలో ఏ శుభకార్యం జరిగినా అన్ని కులాల వారు పని చెయ్యాలి. పని చేయకపోతే నాయుడి గారి ప్రత్యేక చూపు వారిపై ఉంటుంది. నాయుడు ఇచ్చిన తాళిబొట్టు తీసుకొనే పెళ్ళి చేసుకోవాలి. అలా జరగని పక్షంలో అదను చూసి వారి పనిబడతాడు.

అందుకే నాయుడిచ్చే తాళిబొట్టు కోసం పెద్ద ముత్తయిదువ నాయుడికి దండం పెట్టింది. 'పూ... ఎందే యానాది అందరు కట్టకట్టుకొనోచ్చారు'. అన్నాడు. 'అయ్యా ఇయ్యాల మీ యానాది నర్సిగోడి కొడుకు పెల్లయ్య, తమర్ని తాళిబొట్టు అడుక్కుందామని వచ్చాంబాబో' అంది. పెళ్ళి కూతురు వివరాలు అడిగి భార్యతో తాళిబొట్టు ఇచ్చి పంపించాడు నాయుడు. అప్పటికే ఆలస్యమైందని 'ఆ ఇంటి గోడ మెత్తలు పట్టుకోని వూగులాడకపోతే మనం సేపిచ్చుకోలేక పోయామంటే' అని మునెయ్య అంటే దానికి ప్రతిగా తండ్రి నర్సయ్య 'మాట్లాడేటప్పుడు కాస్త వెనక ముందు చూస్కోని మాట్లాడాలి. ఊర్లో జనమంతా వారికి గతి లేక ఆయన ఇచ్చే తాళిబొట్లు తీసుకోండ్రా, తీస్కోక పోతే ఏమి జరుగుద్దో నీకు తెలుసా... పిల్ల కాకివి బువ్వలో బొచ్చేరుకోలేనోళ్ళం మన మెంతరా వాళ్ళ ముందు పిల్ల మాటలు మాట్లాడకుండా కాస్తా నోరు ముయ్యని' చెప్పాడు.

<u>**నాయుడి భార్య:**</u>

నాయుడికి తీసి పోని ధర్మం, నిండైన నిగ్రహం ఆమె నడుస్తుంటే కదిలి వస్తున్న కనక మహాలక్ష్మి లాగుంటుంది. పెద్ద ముత్తయిదువ తాళిబొట్టు కోసం పెళ్ళి కూతురితో నాయుడి ఇంటికెళ్ళినప్పుడు మొదట ఆయన భార్య ఎక్కడ నుండి వస్తారే... మీ... అలగా జనానికందరికి తాళిబొట్లని నిష్టూరంగా మాట్లాడింది. వస్తాడ్లే అని కొంచెం సేపు ఆగి అదే గొంతు వినిపించింది. నాయుడు తాళిబొట్టు ఇవ్వమని చెప్పిన తర్వాత పెళ్ళి కూతుర్ని చూసి పిల్ల బాగుందే ఏం పేరే నీది అని పేరు చెప్పించుకోని తాళిబొట్టు కుడి చేతితో అక్షింతలున్న పల్లెంలో వేసింది.

<u>**సంజీవ కథ సిటి యాక్ట్:**</u>

సిటి యాక్ట్ రోజుల్ని మంగమ్మ, రత్తమ్మ గుర్తు చేసుకుంటున్న సందర్భంలో చెంచులు మంగమ్మను యాక్ట్ సంగతి చెప్పమని అడుగుతాడు. మంగమ్మ నాయన ( చెంచులు తాత) కుర్రోడుగా ఉన్నప్పటి మాట చెబుతుంది. ఆరోజుల్లో యానాదులను దొంగలుగా చూసేవారు. దొంగతనం జరిగితే యానాదులనే మొదట విచారణ చేసేవారు. ప్రతిరోజు స్టేషన్‌కి వెళ్ళి కనిపించి రావాలి. ఎప్పుడన్న స్టేషన్‌కి రాకపోతే మరుసటి రోజు పోలీసులు వచ్చి తీసుకు వెళతారు. పనిమీద పక్క ఊరికి వెళుతుంటే పోలీసుల చేత చీటీ రాయించుకోని ఆవూరి మనబూపుకి చూపించాలని లేకపోతే తీసుకుపోయి సెట్ల మెట్లు పెట్టి చచ్చి పోయేదాక ఆడేవుంచేవాళ్ళు. అలాంటి వాళ్ళు ఏవరున్న వుండరా చెంచులు అని అడిగాడు. 'ఆ.... సంజీవ అనే ఆయన ఉండేవాడు. ఆయన మీద సీటాకు ఉండేది. రోజు స్టేషన్‌కి వెళ్ళి వేలిముద్ర వేసి వచ్చేవాడు. ఒక రోజు జ్వరంతో వెళ్ళలేకపోయాడు. మరుసటి రోజు పొద్దున్నే పోలీసువాడు వచ్చాడు. సంజీవ జ్వరం వల్ల రాలేకపోయానని పోలీసుకు సమాధానం చెప్పగా, వాడు సంజీవను ఊర్లోకి సిగరెట్లకోసం పంపించారు. పోలీసు సంజీవ భార్యను పట్టుకున్నాడు. అది చూసిన సంజీవ పోలీసును గోరసకత్తితో ఒక్క వేటుతో తల నరికాడు. పాపం సంజీవను పట్టుకుపోయి జైల్లో వేశారు. పెళ్ళాం, పిల్లలు దిక్కులేనోళ్ళు అయ్యారు. అంటూ మంగమ్మ చెబుతుంటే చెంచులు నిద్రలోకి జారుకున్నాడు.

<u>**4.3.5. యానాదులు చారిత్రక నేపథ్యం:**</u>

యానాదులు ఆంధ్రదేశంలోని అన్ని ప్రాంతాల్లో మీకు కనిపిస్తారు. అడవులనుండి నెల్లూరు సముద్ర తీరం వరకు విస్తరించి ఉన్న సంచార గిరిజన తెగ యానాదులు. సామాజిక పరిమాణంతో ఆహార సేకరణకు చెందిన జాతి. వారి చుట్టు సమాజం వివిధ దేశాలను దాటుకుంటూ స్థిర వ్యవసాయ జీవితంలోకి స్థిరపడిన వందల ఏళ్ల తరువాత కూడా యానాదులు తమ ప్రాచీన విశ్వాసాలను అంటిపెట్టుకొని ఉండిపోయారు అని వాడ్రేవు చినవీరభద్రుడు 'చివరి గుడిసె' నవల ముందు మాటలో పేర్కొన్నారు. ఈ విధంగా నేటికి యానాదులు, తమ

ప్రాచీన విశ్వాసాలను వదిలిపెట్టక గిరిజనులేతరుల చేత అనేక విధాలుగా దోపిడికి గురౌతూనే ఉన్నారు. నెల్లూరు జిల్లాలో వీరి సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంది.

యానాదులు భారతదేశంలో ఆర్యులు రాకముందే కొన్ని లక్షల సంవత్సరాల ముందునుంచే తమ పుట్టుపూర్వోత్తరాలు తెలియక అమాయకులుగా అనాదిగా నివసిస్తున్నారు. ఈ విధంగా వీరిని అనాదినుంచి 'అనాదులు' అని తదనంతరం వీరిని వాడుక భాషలో అనాదులే 'యానాదులు' అయినారు. మొలువని మీసాలు, మేక గడ్డాలతో గోచిపాతలు ధరించి విల్లంబులు చేత బూని గూచికర్రలతో ఎలుక కలుగుల్ని తవ్వుకుంటూ, చేపలు పట్టుకుంటూ, ఆకులు, అలములు తింటూ జీవనం గడిపేవారు (రాఘవయ్య, వెన్నెలకంటి. 1974:1).

వెనుకటికి అంబికేశ్వరుడనే ఋషి కృష్ణానది దక్షిణ దేశానికి వారణాసి నుండి వచ్చి ఈ దీవిలో ఆశ్రమాన్ని ఏర్పరుచుకొని ఉండెను. ఆయనకు యానాదులు అడవి పండ్లను, తేనెను తెచ్చి ఇచ్చుచుండిరి. ఒక నాడు ఋషి ప్రశ్నించగా తమ ఉనికి పట్ల ఒక బ్రహ్మాండమైన సర్పం ఉందని దానిని సంహరించే ఉపాయం ప్రసాదించమని కోరగా ఆ ఋషి తగిన సలహాలు ఇచ్చి కొన్ని మంత్రాలు ఉపదేశించి స్వస్థలానికి తిరిగి వెడలి పోయేను. ఈ కథ ఎంతవరకు నిజమైనను 60 మంది యానాదులు ఆంధ్రదేశపు కోస్తాను ఆక్రమించి నేడు రెండు లక్షలకు పెరిగారనే వాదం చెల్లనేరదు. అయినప్పటికి శ్రీహరికోటలో ఒక పాము పుట్ట, దానికి పూజలు చేసే ఒక యానాది కుటుంబం ఉన్న సంగతిమాత్రం నిజం (రాఘవయ్య, వెన్నెలకంటి:1974.25). యానాదులకు చెంచులకు పూజ పురస్కారాలకు వచ్చిన దేవుడు కర్నూలు జిల్లాలోని అహోబిళంలో వెలసిన నర్సింహాస్వామి. చెంచు యానాదుల ఆడపడచు చెంచులక్ష్మిని ఆమె తండ్రి చెంచు నాయకుడి వద్దనుండి రాజధానికి తీసుకుపోయిన పిదప పెదభార్య శ్రీదేవి తోడికోడలిని మర్యాద చేయనందున ఆహోబిలదేవాలయంలోని గర్భగుడి వెలుపలనే చెంచులక్ష్మి విగ్రహం ఉండవలసి వచ్చిందని ఆమె నమిలిత నేత్రాలతో బొటన వేలును నేల రాస్తూ ఇకపైన చెంచు పడుచులు కురూపులౌతారని శపించిందట ( రాఘవయ్య, వెన్నెలకంటి :1974. 54).ఈ విధంగా యానాది పడుచులు పాటరూపంలో పాడుకుంటు ఉంటారని యానాదుల గురించి వెన్నెలకంటి రాగవయ్య తన గ్రంథంలో పొందుపరిచారు.

**<u>యానాదులు :</u>**

వీరిని చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, క్రిష్ణ, గోదావరి జిల్లాలో యానాదులని పిలుస్తారు. నల్లమల్ల అడవుల్లో వీరిని చెంచులు అని పిలుస్తారు. 'చెంచు కొండ దిగి యానాది అయినాడు'. వెన్నలకంటి రాగవయ్యగారు పేర్కొన్నట్లు యానాదులకు, చెంచులకు కొంత బేధం ఉన్నప్పటికీ పోలికలే ఎక్కువ అని 31 అంశాలతో వారిరువురి మధ్య పోలికలు చెప్పాడు. అదే విధంగా కొంత వరకు భేదం కూడా ఉందని తన యానాది గ్రంథంలో తెలియజేశాడు. ఆ విధంగా చెంచులు అడవుల్లో వేటలో పురోగమించిన యానాది అడవి బయట సమాజంలో చేతనైన జంతువుల స్థాయిలోనే వేటాడి జీవించడానికి అలవాటు పడ్డాడు.

యానాదుల్లో మనకు 4 తెగలు ప్రధానంగా కనిపిస్తాయి. అవి 1. రెడ్డి యానాదులు, 2. చెల్ల యానాదులు, 3. అడవి యానాదులు, 4. తూర్పు యానాదులు.

1. రెడ్డియానాదులు వ్యవసాయం, కూలి పనిచేస్తు జీవనం సాగిస్తున్నారు. 2. చెల్ల యానాదులు సంచార జాతిగా ఉండి చిన్నచిన్న గుడిసెల్లో నివసిస్తున్న అమాయకులుగా ఉంటారు. నేరం చేసే స్వభావం వీరిలో కొంత మందికి ఉంది. భూస్వాముల దగ్గర వెట్టి చాకిరి చేస్తూ జీవిస్తున్నారు.3. అడవి యానాదులు అడవుల్లో, సమీప ప్రాంతాల్లో జీవనం గడుపుతున్నారు.4. చల్ల యానాదులు పాకీ పనులు కూడా చేస్తుండేవారు. వీళ్ళ అమాయకత్వాన్ని బట్టి ఎంగిలి ఆకుల్లో మెతుకులు ఏరుకు తినడాన్ని బట్టి గ్రామాల్లో ఒక పాటకూడా వ్యవహారంలో

ఉంది.

" యానాదులో ఎర్రగడ్డలో
జిల్లేడు చెట్టుక్రింద పుల్లాకులో"

అంటే కేవలం ఎర్రగడ్డను చద్ది అన్నంలో నంజుకొని తింటూ అతి సామాన్యమైన జీవితాన్ని గడిపేవారు యానాదులు( గిరిజన సంస్కృతి, మాస పత్రిక, ఏప్రిల్, 2009:11).

**యానాదుల ప్రత్యేకత:**

దేశంలోని ఇతర గిరిజనులకున్నట్లు యానాదులకు ప్రత్యేక భాషలేదు. వీరికి ప్రత్యేకమైన దేవుళ్లు, చరిత్ర లేదు. ఎక్కడినుండి వలస వచ్చారో వారికి తెలియదు. ఎవరితోనూ యుద్దాలు చేసినట్టు ఆధారాలు లేవు. గోత్రాలంటూ, శాఖలంటూ కట్టుబాట్లంటూ కుల పెద్దలంటూ లేరు. ఎవ్వరికి వారే యమునాతీరే అన్నట్లు ఏకాకి జీవితాన్ని వారు గడుపుతున్నారు. అంత మాత్రాన వీరికి ప్రత్యేకత లేకపోలేదు. (రాఘవయ్య, వెన్నెలకంటి, 1974: 2) యానాదులకు ప్రత్యేకంగా భాషాలేదు. వీరు తెలుగు భాషనే మాట్లాడతారు. అయితే సంస్కృత భూయిష్టమైన తెలుగు కాక అచ్చమైన తెలుగును మాట్లాడతారు. యానాదుల గ్రామాలలో చిన్న చిన్న గుడిసెలు వేసుకోని జీవనం కొనసాగిస్తారు.

**4. 3. 6. ఎన్నెలనవ్వు- విశ్లేషణ:**

ఈ నవలలో కుల వ్యవస్థ వల్ల యానాదులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కున్నారో తెలియజేశారు. వారిని కులం పేరుతో ఎలాంటి ఎగతాలులకు గురిచేసేవారో తెలియజేశారు. వారితో మాట్లాడే వారిని కట్టడి చెయ్యడం వారిని దొంగలుగా చిత్రీకరించడం కనబడుతుంది. కాబట్టి కథానాయకుడైన చెంచులు చిన్న తనం నుండి కుల నిర్మూలన కోసం కలలు కంటున్నట్లుగా చెప్పబడింది.

**4. 3. 6. 1.ఎన్నెలనవ్వు - కులవ్యవస్థ:**

ఏకుల వెంకటేశ్వర్లు ఎన్నెలనవ్వు నవలలో కులవ్యవస్థ స్వభావాన్ని స్పష్టంగా ఎరుక పరిచారు. అగ్రకులాలు కింది కులాలను ఎలా దోపిడీకి గురిచేస్తున్నాయో తెలియజేశాడు. మంగమ్మ, అలివేలు అగ్రవర్ణ లైంగిక చర్యలకు ఎలా బలయ్యారో, పర్యవసానంగా ఆ కుటుంబం ఎలా చితికిపోయిందో చూపించారు. పెంచలమ్మ రెడ్డి లైంగికదోపిడికి గురవుతున్నా, ఆ దోపిడీని గుర్తించలేని స్థితిని తెలిపాడు. కింది కులాల్లోని స్త్రీలపై లైంగిక చర్యలను సమాజానికి ఎత్తిచూపాడు. ముఖ్యంగా కృష్ణారెడ్డి అలివేలును లొంగదీసుకోవడంతో ఆమె "అవివేకం, అమాయకత్వం, పసితనం, చుట్టూ మారుతున్న సమాజపుతీరు అన్నీ అలివేలుపై దాడి చేశాయని" (పు. 21) రచయిత అభిప్రాయం సరైనదే అనవచ్చు. కులసమాజ వైఖరి తెలిసిన మంగమ్మ "తన బ్రతుకులాగ బిడ్డ బతుకు కాకూడదని" (పు. 22) అలివేలుకు పెళ్ళిచేయాలని నిశ్చయించుకుంది. అలాగే తన అన్న కొడుకు మునెయ్యతో పెళ్ళిచేసింది. సింతతోపు సంగం ఉన్న ఊర్లో కొలుపులకు మునెయ్య, అలివేలు వచ్చారు. కొలుపులు అయిన తర్వాత మునెయ్యపై దొంగతనం నేరంమోపి ఇష్టం వచ్చినట్లు కమ్మకుర్రోళ్ళు చితకబాదారు. మంగమ్మ కాళ్ళవేళ్ళ పడుతుంటే "ఓసే... నీయమ్మ ముందు ఆ లంజేడుపు ఆపవే... రాతిరి కరణంగారి పెళ్ళాం మెడలో దండతెంపుకొనిపోయారు" (పు. 66) అని చెప్పి, సాయంత్రానికి దండ తీసుకువచ్చి ఇవ్వాలని చౌదరిగారు తీర్పుచెప్పాడు. దాంతో భయపడిన మునెయ్య బయటకు వెళ్ళాడు. ఇక తిరిగిరాలేదు. "పోలేరమ్మ కొలుపులకి వచ్చినందుకు అలివేలుకి మొగుడు దూరమయ్యాడు" (పు. 68). కానీ కరణం కొడుకే పేకాటకోసం దండ దొంగతనం చేశాడు. ఆ నేరం అమాయకులైన యానాదుల మీదకినెట్టి వారిని దొంగలుగా చిత్రీకరించింది ఈ అగ్రకుల సమాజం.

కొలువు సమయంలో కిందికులాలకు వేరువేరు కుండల్లో వండుతారు. ఒక కుండలో "తాము, తమ బంధువులు తినడానికి ఎముకలులేని కండతో కూడిన మాంసం ఒక కుండలో ఉడుకుతుంది. తోళ్ళతో కూడిన చారు మరోకుండలో ఉడుకుతుంది. పని చేసేవాళ్ళకు ఈ కుండ మాంసం వేస్తారు. పిండి వంటలు రెండు రకాలుగా వండుతారు. తమ ఇంట్లోకి ఒక సైజు, పనివాళ్ళకు మరొక సైజు వండుతారు" (పు. 61). చాకలి, కుమ్మరి, మంగలి, మాల, మాదిగ, యానాది వారివారి ఆసాముల ఇండ్లకు వెళ్ళి పనిచేసి వారు పెట్టింది తెచ్చుకుతింటారు. దానికే ఆసాములను ధర్మప్రభువులు, దాతలని పొగుడుతుంటారు. గ్రామీణ ప్రాంతంలో కులవ్యవస్థ ఎంత వేళ్ళూనుకుపోయిందో నవలలో కొలుపు సందర్భంగా వివరంగా అర్థమౌతుంది.

మాలల శింగయ్య గడ్డిమోపు మోసుకొనివస్తూ అలిసిపోయి యానాదిసంగంలో నీళు ళ్ళ అడిగి కంకులబండపై కూర్చున్నాడు. బరెగొడ్లను తోలుకొని చేవుడి శేషయ్య "నిన్ను మాదిగోడుగొయ్య" అని వాణ్ణి తిట్టుకుంటూ వస్తున్నాడు. కూర్చొన్న సింగయ్యను చూసి వీపుపై కాలితో తన్నుతన్నాడు. "ఈమద్దెల నా కొడకలారా మరీ బలిసి కొట్టుకుంటున్నార్రా మీరు. ఇవతల మనిసి వత్తున్నా లెక్కలేకుండా నీలుక్కొని కూసున్నావే... అంత కళ్ళు నెత్తి కెక్కయ్యంట్రా నాయాల...." (పు. 78) అంటూ తంతునే ఉన్నాడు. చూడలేదు దొరా అని చెప్పినా వినిపించుకోలేదు. అక్కడే వుండి గమనిస్తున్న చెంచులకు ఎందుకు తన్నాడో అర్థంకాలేదు. మంగమ్మను అడిగితే కంకుల బండ మీద ఆసాములముందు కూర్చోకూడదని చెప్పింది. అయితే చెంచుల లేతమనస్సులో అనేక సందేహాలు మన మంచం మీద మనం కూసున్నా తంతారా అని అమాయకంగా అడిగాడు. అందుకే ఆసాములు పెద్ద కులపోల్లు. వాళ్ళువస్తుంటే మన మంచాలని తిరగేసి పడిమంచం మీదే కూర్చోవాలి. కానీ చెంచులు ఆసాములు తప్పుచేస్తే ఎవరు తంతారే అని ప్రశ్నించాడు. పై సంఘటనలో, సంభాషణలో కులం ఎంత బలీయంగా గ్రామాల్లో ఉందో అవగతమౌతుంది. అగ్రకులంవాళ్ళు ఎలా అమానవీయంగా ప్రవర్తించారో వివరించారు. బరెగొడ్లు మాట వినకపోతే నిన్ను మాదిగోడు కొయ్య, దెంగ అనే పదాలు సర్వ సాధారణంగా వచ్చే మాటలు. ఆ మాటలతోనే దేవుడు శేషయ్య యొక్క లేదా అగ్రకులాల యొక్క కులతత్వాన్ని రచయిత స్పష్టంగా తెలియజేశాడు.

బ్రాహ్మణపంతులు ఇంట్లో పాచిపనులు చేయడానికి మనవడ్ని వెంటతీసుకువెళ్ళింది మంగమ్మ. అరుగుమీద ఎక్కబోయిన చెంచుల్ని చూసి మంగమ్మ తత్తరపడింది. "ఓరే... అరుగుమీద కాదు కూసునేది. తప్పు.... పెద్దోళ్ళు కొడతారు.... ఇదిగో... ఈ... డ కూసో.... అంటూ గోడపక్క ఒకమూల కూసోబెట్టి" (పు. 87) వెళ్ళింది. విద్య నేర్పించే గురువులు కూడ అంటరానితనం పాటించేవారని చెప్పవచ్చు. అదే కృష్ణమూర్తి పంతులు అలివేలు గురించి "అవునే... అది... ఇప్పుడు... ఎక్కడున్నదే.... తిరిగితే తిరిగిందిలే... ఏమన్నా సంపాదిస్తుందా" (పు. 87) అని చులకనగా మాట్లాడతాడు. ఇలా కింది కులాలను ఎగతాళి, వెటకారంగా మాట్లాడడం అగ్రకులాల అదోరకమైన వికృతానందంగా భావించవచ్చు. సిటికలోడు చౌదరి ఇంట్లో పామును పట్టుకుంటూ దాని కాటుకుబలై మరణిస్తాడు. వాడు చనిపోయినందుకు కిందికులాలు సానుభూతి ప్రకటించాయి. కానీ చౌదరి కుటుంబం కనీసం చిటికలోడి ఇంటికివచ్చి వాడిభార్యను పరామర్శించడం, లేదా సానుభూతి తెలియజేయడం కూడ చేయలేదు. యానాదోడి చావు వారికి చీమకుట్టినట్లుగా కూడలేదు. ఎందుకంటే నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో అట్టడుగున ఉన్నవారి చావు లెక్కలోనిది కాదని భావించి ఉండవచ్చు.

ఎర్రగుంట్లలో మనుధర్మాన్ని తు.చ తప్పకుండా అమలు జరిపే వ్యక్తి లింగపనాయుడు. ఆ వూళ్ళో మంచినీటి బావి ఒక్కటే. అక్కడ మాల, మాదిగలు నీళ్ళు తోడుకోవడానికి వీల్లేదు.

కనీసం ఆ బావి గట్టు కూడ తాకడానికి వీలులేదు. పొరపాటున ఎవరైనా తాకితే నాయుడి చేతిలో వాడికి చావుమూడినట్లే. కాబట్టి ఎవరైనా దయతలచి నీళ్ళుపోస్తేనే వారి కడవలు, బుంగలు నిండేది. అగ్రకులాలవారు కూడ వీళ్ళకు నీళ్ళు పోసేవారుకాదు. నీళ్ళు తోడిపోసే యానాది నర్సయ్య దేవుడేకాదు, ఆత్మబంధువు కూడా. అయితే "యానాదులు మాత్రం మాల, మాదిగ ఇండ్లల్లో భోజనం చేయరు" అలాగే "శుభ్రంగా ఉండరని, తినేసిన ఎంగిలిస్తరాకుల్లో అన్నం తింటారని మాలలు, మాదిగలు కూడా యానాదులను హీనంగానే" (పు. 39) చూస్తారని విషయాన్ని వాస్తవికంగా తెలియజేశారు. అంతేగాక నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ప్రతికులం ఇంకో కులానికి అంటరానిదేనని మనువాద భావజాలాన్ని స్పష్టంగా ఎరుకపరిచాడు.

కులవ్యవస్థ వల్ల కలుగు అనర్థాలు స్పష్టంగా అర్థం చేసుకున్న చెంచులు ఆ కులవ్యవస్థ పోయి హాయిగా యానాదులు అందరితో కలిసిమెలిసి నవ్వుకునే రోజులు రావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాడు. ఆ దిశగా అడుగువేశాడు.

## 4. 3. 6. 2. చెంచులు – కులచైతన్యం:

ఎన్నెలనవ్వులో మూడుతరాల యానాదుల జీవితాలను రచయిత వస్తువుగా తీసుకొన్నాడు. మొదటితరంలో మంగమ్మ, పోలయ్య. రెండోతరం అలివేలు, మునెయ్యలు. మూడోతరంవాడు చెంచులు. చెంచులు బాల్యంనుండి కులసమాజపు వికృతరూపాన్ని దాని వికృతచేష్టల్ని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. కులం యానాదులను స్వేచ్ఛగా నవ్వుకునే స్థితినుండి దూరం చేసిందని భావించాడు. అందుకే కులం నిర్మూలించబడాలని ఆకాంక్షించాడు. ఆ ఆకాంక్షను నిజంచేసుకునే క్రమంలో తన చదువును అర్థాంతరంగా ఆపివేసి కులనిర్మూలన కొరకు కమ్యూనిస్టు ఉద్యమ శిబిరంలోకి అనుకోకుండా చేరువవుతాడు. పోలీసుల అరెస్టులతో తమ సంగానికి తిరిగివచ్చి, విప్లవ మార్గం నుండి కులనిర్మూలన వాదమైన అంబేద్కరవాదం ప్రయాణం చేయడానికి సిద్ధమైనట్లు రచయిత ఏకుల వెంకటేశ్వర్లు తెలియజేశారు. వాస్తవానికి ఈ నవలలో చెంచులు పాత్ర రచయితదే. ఆయన అనుభవాల సారమే ఎన్నెలనవ్వు. రచయిత పొందిన చైతన్యమే చెంచుల చైతన్యమని చెప్పవచ్చు.

చెంచులు బాల్యం అంటే బడికి వెళ్ళి ముందు కులసమాజ స్వభావాన్ని మంగమ్మద్వారా మరియు అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాడు. కంకులబండమీద కూర్చొన్న మాలల్లో శింగయ్య దయలేకుండా కమ్మోల్ల దేవుడి శేషయ్య తిడుతూ కాలితో ఇష్టమొచ్చినట్లు తన్నాడు (పు. 78). అలా శేషయ్య ఎందుకు తన్నాడో చెంచులు మంగమ్మను అడిగి, పెద్దకులంవాళ్ళు చిన్నకులపోళ్లు తప్పుచేస్తే తన్నవచ్చునని తెలుసుకున్నాడు. మరి పెద్దకులాలవాళ్ళు తప్పుచేస్తే ఎవరు తన్నుతారు. అని ప్రశ్నించుకున్నాడు. దానికి సమాధానంగా తాను పెద్దయ్యాక ఆసాముల్ని తన్నాలని నిర్ణయించుకొని నిద్రపోయాడు. చిన్నారి చెంచులు శేషయ్య, శింగయ్యను తన్నడం తప్పుగా భావించాడు. అందుకే ఆసాములు తప్పుచేస్తే ఎవరు తంతారని అమ్మమ్మ మంగమ్మను ప్రశ్నించాడు. ఆమె సమాధానం చెప్పకపోయే సరికి తానే తన్నాలని నిర్ణయించుకున్నాడు. ఇది చెంచులు పాత్రలో బాల్యంలోనే వచ్చిన చైతన్యంగా భావించవచ్చు.
బ్రాహ్మణ కృష్ణారావుపంతులు ఇంట్లో పాచిపనికి వెళుతూ మంగమ్మ చెంచుల్ని తీసుకువెళ్ళింది. ఆ పసివాడు అరుగు ఎక్కి కూర్చొంటే అలా ఎక్కకూడదని గోడవారగా చెంచుల్ని కూర్చోబెట్టింది. కృష్ణమూర్తిపంతులు అలివేలును వ్యభిచారంచేసి, సంపాదిస్తుందని చులకనగా మాట్లాడేడు. అప్పుడప్పుడే ప్రపంచాన్ని చదవడానికి ప్రయత్నం చేస్తున్న చెంచులుకు కులస్వభావం అర్థమై సిగ్గుతో తలదించుకున్నాడు. సి.టి. యాక్ట్ సంజీవకథతో యానాదులను దొంగలుగా ఎలా సమాజం ముద్రవేసి బాధిస్తుందో అవగాహన చేసుకున్నాడు (పు. 116). కరువు సమయంలో యానాదులు పడిన ఇబ్బందులు, అగ్రకులాలు యానాదులపట్ల ప్రవర్తించిన తీరును పోలయ్య

అంజయ్యకు చెబుతున్నప్పుడు తెలుసుకున్నాడు. దీపావళి పండుగప్పుడు ఆ పండుగ వెనకున్న అగ్రకుల తత్వాన్ని పోలయ్య మాటల్లో అర్థం చేసుకున్నాడు. ఊరు దీపావళికి, యానాదుల దీపావళికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా అవగాహన చేసుకున్నాడు. బడిలో స్నేహంగా, ఆసరాగా ఉండే అనసూయ తనతో మాట్లాడకుండా దూరంగా పెట్టినప్పుడు చెంచులు ఎంతో ఆవేదన చెందాడు.

చెంచులు, అనసూయ తనతో ఎందుకు మాట్లాడటంలేదో ఆ అమ్మాయినే నిలదీసాడు. నేను నిన్ను ఏం చేసాను. నాతో ఎందుకు పలకడంలేదని అడిగాడు. రేయ్... నేను, నువ్వు కలిసి తిరగడం మా మామయ్యకు నచ్చలేదు "ఆ యానాదోడితో నీకేందే సావాసం" (పు. 142) తిట్టాడు. నాతో సావాసంగా ఉండే వాళ్లకేందంటా? అన్నాడు చెంచులు. "నువ్వు తక్కువ కులపోడివంటా... మేము పెద్దకులపోలమంట... నేను బడికి వచ్చినా.... పోయినా మా కులపోల్లతోనే వుండాలని ఇంకొక్కసారి నీతో మాట్లాడినా... కలిసి తిరిగినా... సంపేత్తామన్నార్రా... ఇక నుంచి నాతో మాట్లాడమాక" (పు. 142) అని జరిగిన విషయం చెప్పింది. దాంతో చెంచులకి ఏమి అర్థం కాలేదు. జరిగిన విషయమంతా మంగమ్మకి చెప్పాడు. ఆమె ఆ విషయాన్ని తేలికగా తీసుకుంది. మనం వారి నీడలో బతికేవాళ్ళము వాళ్ళతో మనకు సావాసం ఎందుకు. ఈడు వచ్చిన అమ్మాయిలతో స్నేహం చేయకూడదని సముదాయించింది. కానీ చెంచులు పసిమనసుపై కుల అహంకారం చేసిన గాయం మాయని మచ్చగా మిగిలిపోయింది. ఆ గాయాన్ని నిర్మూలించాలంటే ఏమిచేయాలో తెలియక సమాజాన్ని వెలివేసినట్లు ప్రవర్తించసాగాడు. కులమంటే అసహ్యంవేసి అందరూ నడిచేదారిలో నడవకుండా, అగ్రకుల పిల్లలతో కలవకుండా బడికి వెళ్ళేవాడు. కానీ ఎలాగైనా కులంపోవాలి. దాని మార్గం ఏమిటి? ఆ లక్ష్యంకోసం ఏమిచేయాలనే ఆలోచనతోనే చెంచులు గడిపాడు (పు. 143).

కులంలేని సమాజాన్ని స్వప్నిస్తున్న చెంచులుకి కమ్యూనిస్టు ఉపన్యాసాలు ఆకర్షించాయి. బడిలో చెంచులు పాటలు, డాన్సు చేస్తాడు. దానికి అనుగుణంగా అభినయిస్తాడు. అందుకే చెంచులంటే పిల్లలతోపాటు ఉపాధ్యాయులకి చెంచులంటే ఇష్టం. ఉపాధ్యాయులందరిని గౌరవిస్తాడు. అందుకేనేమో కేశవరావు చెంచులు చురుకుదనం చూసి విప్లవోద్యమంలోకి ఆహ్వానిస్తాడు. అజ్ఞాత నాయకుడ్ని పరిచయం చేస్తాడు. పరిచయంచేసే ముందు ఎక్కడికి తీసుకువెళుతున్నాడో, ఎందుకు తీసుకువెళుతున్నాడో తెలియజేయడు. "యాడకన్నా మనం పోయేదే... మళ్ళీ అడిగాడు చెంచులు. చెంచులూ.... అన్నీ చెబుతాగానీ... కాసేపు గమ్మగా కూర్చో" (పు. 146) అని అజ్ఞాత నాయకుడికి పరిచయం చేశాడు. ఆ నాయకుడితో మాట్లాడుతున్న సమయంలో కులం, దాని నిర్మూలన గురించి చెంచులు ప్రశ్నించాడు. దానికి ఆ నాయకుడు ప్రభుత్వాన్ని భూస్వాములూ, అధికారులూ చట్టాలను తమ చేతుల్లో పెట్టుకొని పేదలను పీడిస్తున్నారు. అందుకే "కామ్రేడ్ ముందు మనం ఈ పీడకుల్ని పాతరపెట్టాలి. దోపిడీ సమాజం అనే పునాదిని మార్చివేయాలి. ఇక ఈ కులమనే ఉపరితలం దానంతట అదే నాశనం అవుతుందని" (పు. 150) సాయుధ పోరాటం చేస్తే ఈ సమాజం సంపూర్ణంగా మారుతుందని, ఆ పోరాటంలోకి చెంచుల్ని ఆహ్వానించాడు.

దానికి చెంచులు నాకు ఎల్లుండి నుండి పదోతరగతి పరీక్షలు ఉన్నాయి. చదువుకోవాలని చెప్పాడు. ఎవరికి వాళ్ళు తమ స్వార్థంకోసం ఆలోచిస్తే సమాజానికి ద్రోహం చేయడమని, బాధ్యతగా ఆలోచించు, నీ జాతి, నీ ప్రజలు నీ త్యాగంకోసం ఎదురుచూస్తుంది. చెంచులను విప్లవోద్యం వైపు కార్యోన్ముఖుని చేయాలని ప్రయత్నంచేశాడు. కేశవరావు కూడా చెంచులు మనసు తెలుసుకోవాలని ప్రయత్నంచేశాడు. ఎలాగైనా చెంచుల్ని విలేజ్ క్యాంప్‌కు

తీసుకువెళ్ళాలని అతడి ప్రయత్నం. కానీ చెంచులకి ప్రశ్నించడం నచ్చలేదు. కానీ కేశవరావు చెంచుల్లోని భావోద్వేగాల్ని రెచ్చగొట్టాడు. రాజమండ్రి ఏజెన్సీ క్యాంపుకు సిద్ధంచేశాడు. చెంచులు కులంపోవడానికి పోరాటం అనేది అవసరం అనుకున్నాడు. కేశవరావుది ఆదర్శంకోసం అడవులకు వెళ్ళకుండా చెంచులులాంటి వారికోసం అన్వేషించివారి భావోద్వేగాలు రెచ్చగొట్టి అడవులకు పంపించడంలో నేర్పరితనం కలవాడుగా చెప్పుకోవచ్చు. "సామాజికంగా అగ్రవర్ణానికి చెందిన కేశవరావు, చెంచులు, హైస్కూలులో లీడర్. అడవిలోకి తీసుకువెళతాడు" (వెంకటేశ్వరరావు, దార్ల. 2002: 50. బహుజన సాహిత్య దృక్పథం. సొసైటీ ఎడ్యుకేషన్ ట్రస్టు ప్రచురణ, హైదరాబాదు). విప్లవ పార్టీకి చెందిన అజాతవ్యక్తితో జరిగిన సంభాషణలో కిందికులాలవారి భావోద్వేగాలను రెచ్చగొట్టి ఎలా పోరాటంలో చేర్చుకుంటారో రచయిత చాలా స్పష్టంగా వివరించారనవచ్చు.

చెంచులు రాజమండ్రి క్యాంపులో ఆదివాసీల వెనుకబాటుతనాన్ని గుర్తించాడు. అడవుల్లో పాకల మధ్యకు వెళ్ళినప్పుడు అక్కడిజనం పోగయ్యారు. చెంచులు వారిని చూసి "తన యానాది జనంకన్నా దారుణమైన బ్రతుకులు బతుకుతున్నట్లు గమనించాడు చెంచులు. వంటి మీద గుడ్డలేక, వెన్నుపూస కానుకొని వున్న డొక్కలుతోటి, సమురుచుక్కకి నోచుకోని చింపిరి జుట్టుతోవున్న పసిబిడ్డల్ని, మందుమాకుకు నోచుకోక గుడిశ సూరుకింద సుట్టుకొని పడుండ రోగిష్టులను చూసి కలవరపడ్డాడు చెంచులు. ఈళ్ళు కూడ యానాదోళ్ళే కావాలనుకున్నాడు" (పు. 169). కాబట్టి వారికోసం అడవుల్లో పనిచేయాలని నిర్ణయించుకొన్నాడు. కానీ అజ్ఞాతంగా పనిచేస్తే ఏమిలాభమని కూడ ఆలోచించినట్లుగా భావించవచ్చు. అందుకే పోలీసులు అరెస్టుచేసి విద్యార్థులని తెలిసి ఎవరిఊళ్ళకి వాళ్ళను పంపించివేస్తారు. ఇదే క్యాంపులో "ఆకలి, దరిద్రం, పేదరికం కొత్తవేమీ కాదన్నా, ఈ కులమేందన్నా, ఇది పోద. దీన్ని నాశనం చెయ్యమా" (పు. 168) అని చెంచులు నాయకుల్ని ప్రశ్నించాడు. దాంతో "కులం, సాంప్రదాయం, సంస్కృతి, అనేవి దోపిడి వ్యవస్థ అనే చెట్టుకి కొమ్మలు. అందుకే మనం దోపిడి వ్యవస్థ అనే చెట్టును వేళ్ళతోసహా కూల్చివేస్తే ఆ చెట్టు కొమ్మలు ఎక్కడుంటయ్... ప్రశ్నించాడు రాజన్న.... ఇంకెక్కడుంటయ్ నేలమీదంటాయ్గా.... సమాధానం చెప్పాడు చెంచులు" (పు. 168) కానీ అంబేద్కర్ వాదన ప్రకారం పునాది ధ్వంసం చేయాలంటే ముందుగా ఆ పునాది మీద ఉన్న భవంతిని (ఉపరితలాన్ని) కూల్చివేయాలి. అలా కూల్చివేయకుండా పునాదిని తీసెయ్యడమంటే అది ఆచరణ సాధ్యం కాదు. కాబట్టి పునాది, ఉపరితలం అనే సిద్ధాంతం ఆచరణలో దారుణంగా విఫలమైందని భావించవచ్చు. "అస్తిత్వ ఉద్యమ చైతన్య రచనల్లో కులమనేది ఉపరితలానికి చెంచిన అంశమనీ, పునాది ఆర్థికమనీ, పీడితులు, పీడింపబడే వాళ్ళే తప్ప కులం కూడా దీనిలోనే వస్తుందని పైకి మాత్రమే చెప్తూ ఈ విప్లవ సిద్ధాంతాన్ని ప్రచారం చేసేవాళ్ళు దాన్ని ఆచరించకుండా కులదృష్టితో సమస్యల్ని పరిష్కరించకుండా తప్పించుకొంటూ, మళ్ళీ కులాధిపత్యాన్నే ప్రదర్శిస్తూ, నాయకత్వంతో వాళ్ళే కొనసాగిస్తున్నారనే విమర్శ ఉందని" (వెంకటేశ్వరరావు, దార్ల. 2002:50) ఈ నవల పట్టి చూపించింది. అంతేగాక చెంచులు పాత్ర ఎప్పటికప్పుడు ఆత్మగౌరవంకోసం తపన పడినట్లుగా చెప్పవచ్చు. కృష్ణామూర్తి పంతులు చెంచులు తల్లి తిరుగుబోతని తిట్టినప్పుడు, దీపావళి పండుగరోజు టపాసులు ఇవ్వకపోతే పంతుల దగ్గర నుండి వాటిని తీసుకోక ఆత్మగౌరవ ప్రకటన చేసి చెంచులు వద్దన్నాడు. కానీ వాస్తవానికి అప్పటి వరకు చెంచులు పోలయ్య, మంగమ్మలను టపాసులకోసం ముఖ్యంగా తుపాకీకోసం పదేపదే విసిగించాడు. అయినప్పటికీ చెంచులు పంతులు ఇచ్చే టపాసులు తీసుకోకపోవడం ఆత్మగౌరవంలో భాగమేనని చెప్పవచ్చు. బ్రాహ్మణ పంతులు ఇంటిలో దూరంగా కూర్చొనే చెంచులు మాదిగ పౌలుపంతులు ఇంట్లో చొరవగా కలిసిమెలసి, వారి

పిల్లల్ని కూడ ఆడించేవాడని తెలియజేశాడు. కిందికులాల్లో చదువుకున్న తరం భవిషత్తు తరాలను చేయూతనందించే వారని భావించవచ్చు. నవల ముగింపు "ఆకాశాన సూర్యుడు పడమట కొండల్లో దూకేసాడు, రేపటికోసం సిద్ధపడాలని కాబోలు. రేపటి యానాదుల బంగారు భవిష్యత్తుకోసం ప్రజాకళాకారుని పాటలో కదిలిపోతున్నాడు చెంచులు. ఆకాశమంతా నీలిరంగు పులుముకుంది" (పు. 180) అనే వాక్యాలతో ముగుస్తుంది. "సూర్యుడిని విప్లవానికి, నీలిరంగు దళిత చైతన్యానికి ప్రతీకలుగా భావిస్తే గిరిజనులు కూడా క్రమేపీ విప్లవ పార్టీలకంటే కుల అస్థిత్వ ఉద్యమాల ద్వారానే ప్రజాస్వామికంగా తమ హక్కుల్ని సాధించుకోవాలనే మార్గంలో పయనిస్తున్నారనుకోవచ్చు" (వెంకటేశ్వరరావు, దార్ల. 2012: 49. ఎన్నెలనవ్వు – యానాదుల సంస్కృతి) అనే దార్ల అభిప్రాయంతో ఏకీభవించవచ్చు.

చెంచులలో కులచైతన్యం, ఆత్మగౌరవ ప్రకటన బాల్యంనుండి అమ్మమ్మ మంగమ్మ, తాత పోలయ్య పెంపకంలో రూపుదిద్దుకున్నాయి. చెంచులు సంధించే ప్రశ్నలకు వారు ఓపికతో సమాధానాలు చెప్పి, తమ అనుభవ సారాన్ని చెంచులకు ఎరుకపరచారు. బడిలో కంటే ముందే సమాజాన్ని చదివాడు. అందుకే రచయిత "చెంచులు యానాదోడు స్కూల్లో అక్షరాలే కాదు... సమాజాన్ని మనుషులను, మనస్తత్వాలను, తనచుట్టూ ఉన్న కులాలను, వాటి కుటిలతత్వాన్ని వాటి కాఠిన్యతను అధ్యయనం చేస్తున్నాడీ సరికొత్త యానాది చెంచులు" (పు. 153) అని చెబుతూ, విప్లవపార్టీలలో పనిచేస్తున్న (నాయకులకి) కేశవరావు "పుస్తకాలను, సిద్ధాంత పరిజ్ఞానాన్ని పెంచుకున్నవాడే, కానీ, ఈ సమాజ కాఠిన్య కొలిమిలో కాలినవాడుకాదు. అవమాన సమ్మెటదెబ్బలు తిన్నవాడుకాదు. ఆకలి, అవమానాలు అనుభవించినవాడుకాదు. చెంచులు అలాకాదు. పొత్తిళ్ళలోనే జీవితమనే ఓనమాలు అనుభవ పూర్వకంగా నేర్చుకున్నవాడు. దగా, దౌర్జన్యాలను కళ్ళారా చూసినవాడు. సమాజ అసహ్యతను చవిచూసినవాడు. అగ్రకులదోపిడీ సమాజం విసిరిన, రేపిన అనేక ప్రశ్నలహారాన్ని మెడలో వేసుకొని జవాబులకోసం అశగా, కసిగా అన్వేషిస్తున్నవాడు. తనను తాను పదును పెట్టుకుంటున్నవాడు చెంచులు" (పు. 153) అని రచయిత తన జాతి హక్కులకోసం విప్లవోద్యమంనుండి క్రమంగా అంబేద్కరిజంవైపు అడుగులు వేస్తుందని తెలియజేస్తూ చెంచులు పాత్ర యొక్క కులచైతన్యాన్ని స్పష్టపరిచాడు.

### 4.3.6.3. విద్యావ్యవస్థ:

అనాదిగా ఈ దేశంలో యానాదులు అనాధులుగా ఉన్నారు. వారికి కనీస జీవన సౌకర్యాలు పాలకులు అందజేయలేకపోయారు. 1952కు పూర్వం వీరు షెడ్యూల్ తెగల జాబితాలోనే లేరు. 50వ దశకంలో వీరికి రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు కల్పించడం జరిగింది. విద్యా ఉద్యోగరంగాలతోపాటు వారికి రాజకీయ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. కానీ పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడంతో యానాదుల అభివృద్ధి, చదువుతోపాటు మిగిలిన అన్ని రంగాల్లో ఎక్కడవేసిన గొంగళి అక్కడేనన్నట్లు ఉంది. విద్యావ్యవస్థలో లోటుపాట్లను రచయిత ఏకుల వెంకటేశ్వర్లు వ్యక్తపరిచాడని చెప్పుకోవచ్చు.

నవలలో రెండోతరానికి చెందిన అలివేలు నాలుగో తరగతి వరకు చదివినట్లుగా తెలియజేశారు. అలివేలు వీధిబడిలో చదువుకుంది. అంటే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నట్లు భావించాలి. భావనారాయణ మంగమ్మను వదిలివేయడంతో అలివేలు చదువు నాలుగో తరగతిలోనే ఆగిపోయింది (పు. 16) అని అలివేలు చదువుగురించి చెబుతూ అక్షర జ్ఞానంతో ఆమె చక్కగా, స్పష్టంగా మాట్లాడడానికి ప్రయత్నిస్తుంది. కానీ ఆధునిక మార్పులకు అనుగుణంగా మారాలని తపన పడుతుంది. కృష్ణారెడ్డి మోసంనుండి బయటపడడానికి అలివేలుకు నాలుగో తరగతి ఎందుకు ఉపయోగపడలేదు. కృష్ణారెడ్డిని అమాయకంగా నమ్మి తల్లి మంగమ్మకన్నా

ఘోరంగా మోసపోతుంది.

మంగమ్మ మనవడు చెంచుల్ని ఆసాముల పిల్లల్లా చదివించాలని ఆశపడుతుంది. ఆ మాట పోలయ్యతో చెబితే "అట్నే... లేవే మన రోజులు బా... గుండాలేగాని నీ మనవడ్ని కలకటేరునిం చేద్దువుగానిలే" (పు. 86) అని నవ్వుతాడు. యానాదులు చదువుకుంటే మంచి కొలువులు చెయచ్చునన్న స్పృహలో ఉన్నారన్న విషయం పై మాటలనుబట్టి అర్థమవుతుంది. మంగమ్మ ఆశకి తగ్గట్టుగా బ్రాహ్మణ కృష్ణమూర్తిపంతులు కూతురి గురించి ఎగతాళిగా మాట్లాడిన మనవడ్ని బడికి పంపించి, చదివించమన్నప్పుడు మంగమ్మకు కోపం స్థానంలో పంతులుపై గౌరవభావం పెరిగింది. చింతతోపు యానాదిసంగం నుండి పలకపట్టుకొని బడికిపోయినవాడు చెంచులే. బిడ్డను బడికిపంపిన ఘనత మంగమ్మదేనని చెప్పవచ్చు. చదువుకుంటే ఆసాముల పిల్లల్లో స్వేచ్ఛగా బ్రతకవచ్చని మంగమ్మ ఆలోచన. అందుకే చెంచులు చదువుకోవాలని ఆరాటపడింది. పుస్తకాలు కొనలేక ఆసాముల పిల్లలు దగ్గర పాతవి అడిగి మనవడికిచ్చేది. చెంచులు పెద్దయ్యేకొద్దీ వాటిని తీసుకోవడం అవమానకరంగా భావించేవాడు. పుస్తకాలు కొనలేని దారిద్ర్యాన్ని యానాదుల ఆర్థిక పరిస్థితిని వివరించాడు. కానీ చెంచులకు ఇవేమీ అడ్డురాలేదు. తరగతిలో ఎప్పుడు తానే మొదటి స్థానంలో ఉండేవాడు. దాంతో ఉపాధ్యాయులు చెంచులుపట్ల అభిమానంతో ఉండేవారు. చెంచులు చదువుపట్ల చూపుతున్న శ్రద్ధకి మాదిగ పౌలుపంతులు పిల్లల్ని ఎత్తుకునేవాడు. పనుల్లో సాయం చేసేవాడు. బ్రాహ్మణ కృష్ణమూర్తిపంతులు కులవివక్షతో తల్లిగురించి ఎగతాళిగా మాట్లాడితే, మాదిగపౌలుపంతులు మాత్రం ఆదరణ చూపించాడు. సహాయంగా నిలిచాడు. హైస్కూల్లో చేరడానికి తనవంతు సహాయం అందించాడు. తనలాగే వివక్షతలను ఎదుర్కొంటు అణచబడిన కులానికి చెందిన చెంచులు చదువుకొని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించినట్లు భావించవచ్చు.

హైస్కూలు కోసం ప్రక్కఊర్లోకి రోజూ రెండు కిలోమీటర్లు నడిచి వెళ్ళాలి. ఆసాముల పిల్లలు సైకిల్‌మీద వెళతారు. చెంచులు స్కూలుకి వెళ్ళేసరికి మొదటి పిరియడ్ జరుగుతూ ఉండేది. ఆలస్యంగా వచ్చినందుకు పంతులు క్లాసుకు రానిచ్చేవాడు. బయట నిలబెట్టి శిక్షించేవాడు (పు. 112). పాఠశాలల్లో ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పంతుళ్ళు చిన్నచిన్న శిక్షలు విధించేవారని తెలుస్తుంది. పాఠశాలలో పెద్దకులంవారిని 'ఎట్టంటే అట్ట పిలవకూడదని' చెప్పేది మంగమ్మ. చదువు నేర్చుకోవడంతో చెంచుల్ని "ఎవరీ పిల్లోడు... ఎవరీ పిల్లోడని ఎంతోమంది నోరెల్లబెట్టి సూత్తుంటారు... యానాది మంగమ్మ మనవడిని తెలుసుకొని ఊళ్ళో ఆసాములు కూడ ఆ ...శ్చిరిపోతుండారు. నువ్వింకా పెద్దోడివయ్యి... ఏదేని ఉద్దేగంసేత్తే... మన కులపోల్లల్లో నీకు, మాకు ఎంతగొప్ప సేప్పు..." (పు. 113) అని చెంచులుకి చదువుపట్ల ఆసక్తి కలిగించేలా మంగమ్మ ఉత్సాహపరిచేది. అంతేగాక కులసమాజం పట్ల మెలగవలసిన జాగ్రత్తలు చెబుతుండేది.

హైస్కూలులో కమ్మకులం అమ్మాయి అనసూయతో స్నేహం కుదిరింది. ఇద్దరూ కలిసే రోజూ స్కూలుకి వెళ్ళి వచ్చేవారు. మధ్యాహ్న భోజన సమయం చెంచులకి తాను తెచ్చుకున్న క్యారేజీ సగం ఇచ్చేది. ఇలా కలిసి మెలిసి స్నేహంచేస్తున్న వారిని కులంపేరుతో విడదీయడం జరిగింది. యానాదోడితో నీకు స్నేహం ఏమిటని పెద్దలు అనసూయను భయపెట్టారు (పు. 140). అప్పటినుండి అనసూయ చెంచులతో మాట్లాడలేదు. చెంచులకు ఆమె ఎందుకు మాట్లాడడం లేదో అర్థంకాక ఆమెను నిలదీసేసరికి నువ్వు తక్కువ కులపోడివి. నీతో కలిసి తిరిగినా.... మాట్లాడినా సంపేత్తామన్నారని చెప్పింది. గ్రామీణ జీవనంలో కింది కులం వారితో స్నేహం చేయకుండా అగ్రకులం వాళ్ళు వారి పిల్లలను భయభ్రాంతులకు గురిచేసి, చిన్నతనం నుండే కులవివక్షను నూరిపోసేవాళ్ళని పై సంఘటన ఆధారంగా అర్థం చేసుకోవచ్చు.

పాఠశాలలో విద్యార్థి సంఘాలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయని చెప్పవచ్చు. సామాజిక స్పృహ ఉన్న చెంచులులాంటి వారిని గమనించి విప్లవోద్యమంలోకి ఆహ్వానించడానికి వారి భావోద్వేగాలను రెచ్చగొట్టేవారని అర్థంచేసుకోవచ్చు. 'గ్రామాలకు తరలిరండి' కార్యక్రమాలు ఏర్పాటుచేసి, అక్కడ జరుగుతున్న విషయాలు వారికి తెలియజేయకుండా గోప్యంగా ఉంచేవారు. మంగమ్మలాంటి వాళ్ళు తమ పిల్లలు చదువుకొని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకుంటారని అనుకుంటే, అమాయకులైన చెంచులులాంటి వారిని విప్లవోద్యమం పేరుతో వారి చదువులను అర్ధాంతరంగా ఆపివేసేలా చేసారనవచ్చు. కిందికులాలు చదువుకొని, అభివృద్ధిలోకి రాకుండా నిరోధించారని చెప్పవచ్చు.

**4.3.7. ఎన్నెలనవ్వు – యానాదుల సామాజిక, సాంస్కృతిక జీవన చిత్రణ:**

ఎన్నెలనవ్వులో ఏకుల వెంకటేశ్వర్లు యానాదుల సమగ్ర జీవనాన్ని చిత్రీకరించాడు. గిరిజనుల గూర్చి గిరిజనేతరులు నవలను సృజించారు. చివరి గుడిసె నవలలో యానాదుల బ్రతుకుల గురించి కేశవరెడ్డి తెలియజేశారు. ఆయన గురించి నేడు ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. కానీ ఇ.వి గురించి ప్రత్యేకంగా ఎందుకు చెప్పుకోవాలంటే "ఇప్పటివరకు గిరిజన నేపథ్యంలో గిరిజన రచయిత రాసిన నవల తెలుగులో లేదు. ఎన్నెలనవ్వు ద్వారా ఆలోటును తీరుస్తున్నాడు ఇ.వి. ఈ విధంగా ఎన్నెలనవ్వు నవలకు తెలుగు సాహిత్యంలో గొప్ప చారిత్రక ప్రాధాన్యత" (కోటేశ్వరరావు, కోయి. 2011. యానాది బతుకు పేగు తెంచుకుపుట్టిన చారిత్రాత్మక నవల. ఎన్నెలనవ్వు. బహుజన కెరటాలు. ప్రచురణ. ఒంగోలు. ముందుమాట) ఉందన్నారు కోయి కోటేశ్వరరావు.

కోయి కోటేశ్వరరావు వ్యాఖ్యానాన్ని రుజువుచేసే అనేక అంశాలను ఇ.వి తీసుకొని లోతుగా చర్చించాడు. "యానాదుల ఆర్థిక, సామాజిక, జీవన స్థితిగతులను ఇ.వి. పరిశీలనాత్మకంగా సమీక్షించాడు. యానాదుల సాంస్కృతిక ఔన్నత్యాన్ని, వారి ఆచార వ్యవహారాల్లోని విశిష్టతను, ఆటపాటలను, ఆత్మగౌరవ స్ఫోరకంగా రచయిత నిరూపించాడు. పేదరికానికి అనుగుణంగా యానాదులు తమ కట్టుబాట్లను, ఆహారపు అలవాట్లను మలచుకొనే విధానాన్ని రచయిత ఈ నవల్లో సూక్ష్మ వివేచనచేసి ఎరుకపరచాడు.

ఈ నవలకు రచయిత ఎన్నెలనవ్వు అనే పేరుపెట్టడం వెనుక నేపథ్యం ఏమిటంటే యానాదులకు నవ్వంటే ఇష్టం. వారి రోజువారీ కార్యక్రమాల్లో హాస్యం వెల్లివిరిసే సంభాషణలు ఎక్కువగా ఉంటాయి. అందుకే యానాదుల నవ్వులను చూసి 'తాటాకులపై ఇసుకపోసి యానాదులు నవ్వుకుంటారని' ఎగతాళిచేస్తుంటారు. ఇది ఎగతాళి అయినప్పటికీ యానాదులు చిన్నచిన్న విషయాలకు కూడ హాయిగా నవ్వుకోవడం గమనించవచ్చు. ఎన్నెలలాంటి నవ్వులకోసం రాజ్యాధికారంకోసం అంబేద్కరిజ మార్గంలో పయనించాలని చాటాడు.

**ఆచార వ్యవహారాలు:**

**పుట్టుక:**

ఈ నవలలో చెంచులు పుట్టినప్పుడు ఎలాంటి ప్రత్యేక ఆచారాలు చేసినట్లుగా రచయిత చెప్పలేదు.యానాదులలో బిడ్డ పుట్టినప్పుడు ఎటువంటి ఆర్భాటాలు చేయరు. ఒక వేళ యానాదులకు పిల్లలు పుట్టకపోయిన బాధపడరు. సంతానం ఎక్కువైన వారు బాధపడరు. వారికి సంతానం కలిగిన, కలుగకపోయిన తేడా ఏమి ఉండదు. వారికి తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు లేనందున వారు పిల్లల గురించి ఆలోచించే అలవాటు వారిలో కనిపించదు.

**పెళ్ళి:**

అలివేలు, మునెయ్యల పెళ్ళి సందర్భంగా యానాదులు పెళ్ళిలో పాటించే ఆచార వ్యవహారాలు పెళ్ళిచూపుల నుండి పెళ్ళివరకు వర్ణించారు. ఆదిమ జాతి అయిన యానాదులలో

వివాహానికి సంబంధించిన ప్రత్యేకమైన కట్టుబాట్లు, సాంప్రదాయాలు కనబడవు. తాళిబొట్టు, పురోహితుడు, ముహూర్తం, బంధువులకు ఆహ్వానాలు పంపడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు వీరిలో కనబడవు. యానాదుల పెళ్ళిళ్ళ గురించి రాఘవయ్య ఈ విధంగా చెప్పారు.

యాన్దోళ్ళ పెళ్ళిళ్లు, ఎంత మంచి పెళ్ళిళ్ళు
బొట్టుతో పనిలేదు, బోనాలక్కరలేదు
కొత్త చీరలొద్దు, అత్త పోర్లు వద్దు
చుట్టాలు రావద్దు, చూడనైనా వద్దు
కలుసుకుంటె చాలు మురుసుకుంటుండోచ్చు
అల్లుళ్ళ పోరొద్దు, ఆస్తిపాస్తులొద్దు
మేళతాళాలు వద్దు, మంత్ర తంత్రాలు వద్దు
ముంగమారు దేవుడికి మ్రొక్కుకుంటే చాలు
గోత్రాలు మాకేల, గీత్రాలు మాకేల
నేత్రాలు ఒక్కటైతె, సూత్రాలెందుకయ్యా, మంగళసూత్రాలెందుకయ్యా
తినడానికి తిండి లేదు, కట్టడానికి పంచ లేదు.
ఎందుకయ్య పెండ్లి, ఎందుకయ్య మాకు ( రాఘవయ్య, వెన్నెలకంటి. 1974: 200)

. ఈ విధంగా యానాదుల పెళ్ళి గురించి పాటరూపంలో చెప్పారు. వారికి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇల్లు లేక స్త్రీపురుషులు కలసి ఇష్టపడి కలిసి దాంపత్య జీవనం గడుపుతారు. ఈ విధంగా యానాది దంపతులు కలసి ఉన్నన్నాళ్ళు వీరి ప్రేమను ఎవరూ ఏమి చేయలేరు. భర్త జైల్లో శిక్ష అనుభవిస్తున్న రోజుల్లో భార్య వేరొకరితో వెళ్ళిపోవచ్చు. భర్త వచ్చిన తరువాత తిరిగి రావచ్చు. ఇలా రావడాన్ని యానాది సంగం ఒప్పుకుంటుంది. అలివేలు నడవడిక బాగాలేదని గమనించిన మంగమ్మ సిన్నాయన కొడుకులతో పెళ్ళిచేయడానికి నిర్ణయించుకున్నారు. అలివేలుకి పెళ్ళిగురించి తెలియజేస్తారు (పు. 22). యానాదులలో మేనరిక వివాహాలు ఉన్నాయి. పెళ్ళికిముందు అమ్మాయి అభిప్రాయం తెలుసుకుంటారని చెప్పవచ్చు. పెళ్ళిచూపుల సమయంలో యానాదిసంగం మొత్తాన్ని పిలిచారు. పెళ్ళికొడుకు వాళ్ళు మంచిరోజు చూచుకొని అమ్మాయిని చూడడానికి వచ్చారు. మేకల చెంచయ్య ఆ సంగానికి పెద్ద, ముదాము. అందర్నీ పిలిచి పెళ్ళి సంబంధం చతుర్ల మధ్య మాట్లాడుకున్నారు. పెండ్లికొడుకుకు బట్టలు పెట్టడమే కట్నం. అమ్మాయికి అత్త పర్వతాలు ముక్కుపుడక పెట్టింది. అమ్మాయి, అబ్బాయిలు మావోళ్ళు అనిపించుకున్నారు. తమలపాకుల పళ్ళేలు మార్చుకున్నారు. పెద్దలు అక్షింతలు వేసి దీవించారు. పై విధంగా యానాదుల పెళ్ళిచూపులు, నిశ్చితార్థం నిడారంభంగా జరుగుతుంది.

పెళ్ళికిముందు ప్రధానం, పెళ్ళికొడుకు ఇంటినుండి పెళ్ళికూతురు ఇంటికి తీసుకువస్తారు. పతాణంతో వచ్చిన వారికి అన్నంపెట్టాలంటే ఇంట్లోబియ్యంలేవు. ఇది యానాదుల ఆర్థిక పరిస్థితి. ఏ పూటకి ఆ పూట సంపాదించుకోవడమే యానాదులకు తెలుసు. అప్పుకోసం చౌదరి ఇంటికివెళ్ళితే ఆయన భార్య ఎగతాళిగా మాట్లాడి పని చేయించుకుని డబ్బులు అప్పుగా అడిగితే లేవని, చౌదరిని అడగమంటుంది. చౌదరి ఊర్లో రచ్చబండ దగ్గర నలుగురిలో మంగమ్మను (యానాదుల పెళ్ళిని) ఎగతాళిచేసి డబ్బులిస్తాడు. పతాణం పదకొండు వస్తువులు రాలేదనని, గొడవనుఆపి, అందరికీ వండి పెడుతుంది. యానాదులపెళ్ళి అబ్బాయి ఇంటి దగ్గర జరుగుతుంది. అలివేలును పతాణం చీరతో అలంకరించి పెళ్ళి విడిదికి తీసుకువస్తారు. పెళ్ళికి వచ్చేవారు తమ తాహతుకు తగ్గట్టుగా పెళ్ళి సరుకులు సమకూర్చారు. ఇది యానాదులతో ఉన్న సజీవ సంబంధాలను తెలియజేస్తుంది.

యానాదుల పెళ్ళికి ఇంటిముందు పందిరి ఏర్పాటుచేస్తారు. పెళ్లిపందిట్లో కల్లాపిచల్లి ముగ్గువేస్తారు. ఆ ముగ్గుమీద పీటవేసి పెళ్ళికొడుక్కి నలుగుపెడతారు. నలుగులో పాటలు పాడకపోతే యానాదులకు నలుగు పూర్తయినట్టు కాదు. అందుకే “ఓ రామా... జైరామా/ సీతా... మా..నో(హెూ)కారా.../ కారుణ్యా... గుణ... కారా.../ ఈ కమలా.../ కనతల్లీ... వాకీటా/ మరి పీటా...లేపిచ్చీ అనే పాటను మునెయ్య నలుగుపాటగా పెంచలమ్మ, పర్వతాలు శ్రావ్యంగా పాడారు. పెళ్ళిలో నలుగు లేకుండా పెళ్ళి పూర్తికానట్లేనని చెప్పవచ్చు.
గంజికావిడి ఆచారం: పెళ్ళికూతురొచ్చిందని తెలిసి పిల్లా, పెద్దలందరూ అక్కడికి వెళ్ళారు. వారితోపాటు గంజికావిడి తీసుకెళ్ళారు. ఒక బుంగలో గంజిబువ్వ, మరోదాంట్లో నీళ్ళు ఉంటాయి. మాకు కలిగింది గంజిబువ్వే. ఆ గంజినీళ్ళే నీవు తాగాలి. ఆచరణ రూపం యానాదులు తెలియజేయడానికి ప్రతీకాత్మకం తమ స్థితిగతులను పెళ్ళికూతురికి, పెళ్ళికి వచ్చిన వారికి తెలియజేయడమే అంతిమంగా యానాదులు చెప్పదలుచుకున్న అంశం.
గడ్డపార ముహూర్తం: యానాదులు గడ్డపార ముహూర్తంలో పెళ్ళిచేసుకుంటారు. గడ్డపార ముహూర్తం అంటే గడ్డపార నీడ భూమిపై ఎప్పుడు నిలవదో అప్పుడే తాళిబొట్టుకట్టాలి. అంటే మిట్ట మధ్యాహ్నం అన్నమాట. ఆ ముహూర్తానికి సీతా, రాముల పెళ్ళి ముహూర్తమని యానాదులు చెప్పుకుంటారు, నమ్ముతారు. అందుకే వారు ఆ ముహూర్తాన్ని పవిత్రంగా భావిస్తారు. అందుకే “ఇనుప గడ్డపారను నీళ్ళతో పొడిలేకుండా కడిగారు. అలికినచోట మధ్యలో గడ్డపారని వేశారు. గడ్డపారచుట్టూ ముగ్గుపెట్టారు” (పు. 40). సరిగ్గా గడ్డపార నెత్తిమీదకి పొద్దు వచ్చినప్పుడు అందరూ హడావుడి చేసి పెళ్ళి జరిపించారు. యానాదుల పెళ్ళిళ్ళు బ్రాహ్మణ పంతుళ్ళు చేయరు. కనుక యానాదుల్లో ఎవరోఒకరు పెళ్ళితంతు జరిపిస్తారు. పక్కలోడు అలివేలు మునెయ్య పెళ్ళి జరిపించాడు. ఈ పెళ్ళి సమయంలో పక్కలోడు వచ్చీరాని మంత్రాలతో పెళ్ళి జరిపించాడు. బ్రాహ్మణత్వాన్ని ధిక్కరించే స్వరమే పక్కలోడు. అది అధిక్షేప ధోరణిలో రచయిత పక్కలోడు పాత్రతో పలికింపచేశాడు. యానాదులు పెళ్ళిలో అరుంధతి నక్షత్రం చూపిస్తారు. అలాగే యానాదుల నవ్వుల మధ్య చతుర్లతో అరుంధతి నక్షత్రం చూపించి పెళ్ళి ముగించాడు పక్కెలోడు.

పెళ్ళితంతును చూస్తే హిందూమత ప్రభావం ప్రస్ఫుటంగా కనబడుతుంది. పెళ్ళికి బ్రాహ్మణులు ముహూర్తాలు చూడరు, పెట్టరు. కాబట్టి యానాదులు గడ్డపార ముహూర్తాన్ని ఎన్నుకొని, దాన్ని పరమ పవిత్రంగా పాటిస్తున్నట్లు భావించవచ్చు. పెళ్ళిలో మంత్రాలు చదవడం, అరుంధతిని దంపతులకు చూపించడం, ఇవన్నీ బ్రాహ్మణీయ భావజాల ప్రభావమేనని చెప్పవచ్చు. బ్రాహ్మణీయ భావజాల ప్రభావంనుండి యానాదులు బయటపడాలని రచయిత ఆకాంక్షగా  భావించవచ్చు

**మరణం:**

యానాదులలో మంత్రతంత్రాలు, తాయత్తులు, ఖర్మకాండలు మొదలైన వాటిని ఆచరించే వారు కూడా ఉన్నారు. యానాదులకు వీటిపై కూడా నమ్మకం ఉంది కానీ ధన బలం లేనందున ఆచరించరు. మానవుడు మరణించిన పిదప ఏమవుతాడనే ప్రశ్న, యానాదుల్ని కలలో కూడా బాధించదు. బతికి ఉండగా సుఖం అనుభవిస్తే కదా చచ్చినపుడు వచ్చే కష్టాలను తలచుకోని తారు మారు కావడానికి అతని ప్రాణానికి చావుకు మధ్య ఉండేడి పాడె పుల్లలు, మోసేవాండ్లు నోచుకోక  శవానికి చుట్ట చుట్టిన చినిగిపోయిన ఈతాకుల చాపే కదా ! యానాదుల మరణం సమీప కాలంలో బంధువులని, కొరివి పెట్టే వారసులను, ఆత్మీయులనే వారు తరచుగా ఎవ్వరు ఉండరు. పొలాల కావిళ్ళలోని శవం అట్లనే శిథిలమయ్యే దృశ్యాలు లేకపోలేదు. బంధువులకు తంతులు పంపడం, ముందుగా జాబులు రాయడం జరుగదు.

హత్య, తాహతు గలవాడు కర్మ చేస్తాడు. లేని వారికి అదికూడా ఉండదు. ఊపిరిపోయిన తరువాత చేయబడే కర్మల వల్ల వల్లెవేసే మంత్రాల వల్ల అతని ఆత్మ ఒక్కొక్క అంతస్థు దాటి పైకి ఎక్కడికో పోతుందనే నమ్మకం యానాదికి లేనే లేదు (రాఘవయ్య, వెన్నెలకంటి. 1974: 198). యానాదులలో చావు, పుట్టుక పెళ్ళి విషయాలలో ఏమాత్రం ఆర్భాటాలు కనిపించవు, చాలా సామాన్యంగా పుట్టుక, పెళ్ళికి చావుకు జరిగే వేడుకలు వీరి సమాజంలో జరుపుకోరు. ఈ మధ్య కాలంలో ఆర్థిక పరిస్థితులు కొంతవరకు మెరుగు పడటంతో, స్థిర నివాసాలు ఏర్పరుచుకోవడం పండుగలు, వేడుకలు చేసుకుంటున్నారు.

**విందులు, ఆహారపు అలవాట్లు:**

యానాదులు ఆహారపు అలవాట్లు ప్రత్యేకమైనవి. వాటికి మారుపేర్లు పెట్టుకొని ఇతరులకు అర్థంకాకుండా పిలుసుకుంటారు. యానాదుల వారు అడవుల్లో కొండ ప్రాంతాల్లో ఒకప్పటి సంచార జీవులైన వీరు అడువుల్లో దొరికే ఆహారం, వివిధ కందమూలాలు, ఆకులు, అలములు తింటూ జంతువులను వేటాడుతూ, వాటి మాంసాన్ని ఆహారంగా సేకరించేవారు. కుందేళ్లను, నెమళ్లను, నేల తాబేళ్ళ, ఉడుములు, ఉడుతలు, అడవి పందులు, అడవికోళ్ళు, జింకలు, దుప్పులు, కొంగలు, నీటికాకులు, ఎలుకలు, కొండగొర్రెలు, చేపలు, రొయ్యలు మొదలైన వాటిని ఇష్టంగా తింటారు. ఎన్నెలనవ్వు నవల ఏకుల వెంకటేశ్వర్లు చిటికలోడు పాత్ర ద్వారా వివరించాడు.

వారి అటవిక జీవితానికి అనుగుణంగానే వారి ఆహారం ఉంటుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని యానాదులు వివిధ జంతువుల మాంసం తింటారు. ఎన్నో నెలల పాటు చెడిపోకుండా ఉండే నల్లగడ్డ, చామగడ్డ, మొ. అనేక రకాల దుంపలు, ఆకు కూరలు వీరికి ప్రధాన ఆహారం బొద్ది ఆకు, చెంచెలకూర, ఇసుక దాసరాకు, అటిక మామిడి ఆకు, కోడిజుట్టు ఆకు, సాత్రాసి ఆకు, తూటాకు, తూటి ఆకు, పొన్నగంటి ఆకు, పాల పరికాకు, గురుకు ఆకు, దేవదారు ఆకు, తోటాకు, పెరుగు ఆకు, తిమ్మిఆకు, పాలాకు మొదలైనవి. కలెపండ్లు, నాగజేముడు పండ్లు, ఊటిపండ్లు, కామంచిపండ్లు, నక్కెరి పండ్లు, అడవి దొండపండ్లు, పాలపండ్లు, బిక్కిపండ్లు, బీరపండ్లు, తోడింద్రపండ్లు, మొదలైనవి. వారికి అడవుల్లో ఉచితంగా లభించే పండ్లు. వీటన్నింటి కంటే యానాదులకు అత్యంత ప్రీతిపాత్రమైన ఆహారం ఎలుకల మాంసం అంటే వారికి చాలా ఇష్టం. యానాదుల ఆహారపు అలవాట్లు ' ఎన్నెలనవ్వు'లో సిటికలోడు అలివేలు మునెయ్య పెళ్ళి. "భోజనాలు దగ్గర కూర్చున్న వాళ్ళు ఎవరి పాటికి వాళ్ళు భోంచేస్తున్నారు. ఓ… రే… బాపనోల్ల బంతాలవుంది గదర ఇదే… ఆ మాటకు తింటున్న వాళ్ళు తలెత్తి చిటికిలోడువైపు చిత్రంగా చూస్తున్నారు. ఈ పప్పు,గోంగోర… మనింటికాడ వండుకోమంటడు… ఏంకావాలో… ఏందో సెప్పరాదో… ….ఏందే ఈ సప్పిడి పప్పేంది. ఆ గోంగోర తొక్కేంది.. మన యాందోళ్ళ బంతంటే నాయాల్ది ఎట్టుండాల తంగేడు జింకల కూరేది. కనీసం గెనింకేకర సారన్నావండొద్దంటా… యానోదుల బంతి భోజనాలు ప్రత్యేకంగా వుండాలన్నట్లు….. నిజానికి తంగేడు జింకలంటే ఎలుకలని, గెనంకేకర కాయలంటే ఎంద్రకాయలని, సెవల పిల్లులంటే కుందేళ్ళని" (పు. 55) యానాదులకే అర్థమౌతుంది. ఇలా ఎందుకు తమ ఆహార పదార్థాలకు మారుపేర్లు పెట్టుకున్నారు. బ్రాహ్మణీయ వాద సమాజం ఈ ఆహారలవాట్లును హీనంగా చూస్తుంది. ప్రచారం చేసింది.

పోలయ్య ఏటికి వెళ్ళడానికి సిద్ధమయ్యి సద్దెనీళ్ళు పొయ్యమన్నాడు. మంగమ్మ "మొఖం కడుక్కొని వచ్చి పున్నీళ్ళ కుండలో కుడిచేయి పెట్టి దానిలో అడుగున ఉన్న కాస్త కూడు తీసి కంచంలో ఏసి పోలయ్యకి ఇచ్చింది. కాత్త ఉల్లిపాయుంటే ఇటియ్యే… అడిగాడు పోలయ్య" (68) ముక్కలుకోసి ఇచ్చింది.

పున్నీళ్ళకుండ యానాదులకు ఆకలి తీర్చే అకయ పాత్రలాంటింది. పున్నీళ్ళకుండ కిందికులాల వారు దైవం భావించి పవిత్రంగా చూసుకుంటారు. "రాత్రిపూట అన్నం మిగిలితే అన్నం, గంజి ఆ కుండలో ఉంటయ్ కాబట్టి ఆ నీల్లు పుల్లగ పుసుస్తయ్. పులిసిన నీల్లని పున్నీళ్ళని, ... అన్నాన్ని పున్నీళ్ళ బువ్వని బువ్వని పిలుచుకుంటారు. అన్నం లేనప్పుడు ఆ పున్నీళ్ళ కుండే వాళ్ళ ఆకలి తీర్చుతుంది. అందుకే యానాదులు ఆ కుండను పూజిస్తారు.... మంగళ, శుక్రవారాల్లో ఆ కుండను తాకరు. ఆ రోజు ఎవరికీ పున్నీళ్ళు పొయ్యరు. చాల పవిత్రంగా చూసుకుంటారు" (పు. 69). "మంగమ్మ పోలయ్య తెచ్చిన చాప ముక్కల్ని తీసింది. ఆ ముక్కలతోపాటు మొయ్య చాపల బొడ్లు కూడ ఉండాయ్. ఆ బొడ్లంటే చెంచులికి చాల ఇష్టం. వాటిని చీపురు పుల్లకి గుచ్చి అబ్బాయ్.... ఇదిగో తాత సేత కాలిపిచ్చుకో...." (పు. 73) అని చెంచులకు ఇచ్చింది. మునెయ్య పెళ్ళిలో పప్పు, గోంగూర చూసి చిటికలోడు బాపనకూడుగా అభివర్ణిస్తాడు. యానాదుల బంతంటే తంగేడు జింకలకూర, గెనింకేకర కాయలచారు, సెవులపిల్లులతో బంతి ఉండాలని చెప్పాడు. తంగేడు జింకలు అంటే ఎలుకలు, గెనంకేకర కాయలు అంటే ఎండ్రకాయలు సెవుల పిల్లులంటే కుందేళ్ళు అని యానాదులకు తెలుసు. మిగిలిన వారికి తెలియదు. అలా ఎందుకు మారుపేర్లు యానాదులు పెట్టుకోవాల్సి వచ్చిందంటే ఒకరి ఆహారపు అలవాట్లను మరొకరు విలువ ఇవ్వరు. అంతేకాక అసహ్యంగా చూసి అంటరానితనం పాటిస్తారు. కిందికులాల ఆహారపు అలవాట్లను బ్రాహ్మణీయ సంస్కృతి హీనమైనది ప్రచారం చేస్తారు.

యానాదులు నలుపుడు కారం ఇష్టంగా తింటారు. పున్నీళ్ళను ప్రాణపథంగా చూసుకుంటారు. పున్నీళ్ళ కుండను పరమ పవిత్రంగా చూసుకుంటారు. యానాదులు చేపల కూరంటే ఇష్టంగా తింటారు. మొయ్యచాపలబొట్లు యానాది పిల్లలు ఎంతో ఇష్టంగా కాల్చుకుతింటారు. చెంచులు కూడా మొయ్య చేపలబోడ్లును చీపురుపుల్లకి గుచ్చి కాలిపించుకు తిన్నాడు (పు. 73). యానాదులు చేపలతోపాటు ఎలుకలు, ఎండ్రకాయలు, కుందేళ్ళ కూరలంటే ఇష్టంగా తింటారు. పాచిపని చేసి రాత్రి పాచిపోయిన అన్నాన్ని పడవేయకుండా పరమాన్నంగా భావిస్తారని రచయిత దీపావళి పండుగ నేపథ్యంలో వివరించాడు. దీపావళి పండుగరోజు పాచిపోయిన అన్నాన్ని ఆకలికి తాళలేక, పడవేయకుండ పరమాన్నంగా మంగమ్మ కుటుంబమంతా తింటారు. డబ్బులనుబట్టే పండుగలు డబ్బులులేని వారికి పండగ అయినా ఎండగైనా ఒక్కటేనని చెప్పుకోవచ్చు. అయితే పేదోళ్ళ కూరలకి చాలాపేర్లు ఉంటాయి. "నలుపుడుకారం, బొటేలుచారు, దరువు, అర్జంటు"(పు.114) అని రకరకాల పేర్లుతో పిలుచుకొని యానాదులు నవ్వుకుంటారు. ఎంత కష్టమొచ్చినా యానాదిమోహంలో నవ్వు చెరిగిపోదు. అందుకే యానాదులు ఆకలి సమయంలో కూడ హాస్యమాడుకొని హాయిగా నవ్వుకుంటారు. ఆ నవ్వులలో ఆకలిని మర్చిపోవడానికి ప్రయత్నం చేస్తుంటారనవచ్చు.

**<u>పండుగలు:</u>**

"యానాదుల దసరా పండుగల్లో నెల్లూరు జిల్లా యానాదుల ఆనందానికి అడ్డు ఆపు ఉండదు. మగవారు స్త్రీ వేశంలో కృష్ణుడు, గోపిక, శ్రీరాముడు, సీతమ్మ, వంటి పౌరణికా పాత్రలను ధరించి అంగళ్లలో తెలిసిన వారి దగ్గర పుర ప్రముఖుల వద్ద చిందులు తొక్కి వస్త్రాలను, తిండి గింజలను బహుమానంగా సంపాదిస్తారు. ఈ సమయంలో అభినయిస్తు రంగులుపూసుకొని కూని రాగాలు తీస్తూ వీధుల వెంబడి పురుషులు ఆడుతుంటారు" (రాఘవయ్య, వెన్నెలకంటి. 1974: 147). వీరి నృత్యాన్ని చిందు నృత్యం అంటారు. వీరు చిందు భాగవతులు వేయడంలో ప్రసిద్దులు.దీపావళి పండుగకుముందు చెంచులు తుపాకీకోసం మంగమ్మను విసిగించాడు. తుపాకీకోసం పొగనారు వేయడానికి వెళ్ళాడు. కానీ వచ్చిన

రూపాయి కూలీతో మంగమ్మ తుపాకీ కొనకుండా సరుకులు కొనుక్కొంది. ఆకలి తర్వాతే మిగిలిన అవసరాలు తీర్చుకోవడంగా దీన్ని భావించాలి. కానీ చెంచులు తనకు తుపాకీ కావాలనే మంకుపట్టు విడవలేదు. ఆర్థిక పరిస్థితులు బాగాలేక పండగరోజు పాచిపోయిన అన్నమే తిన్నారు. ఇది యానాదుల దయనీయ పరిస్థితికి అద్దం పట్టింది. టపాసులు కొనలేక పోలయ్య తాటిగిలకలు తయారుచేసి యానాది సంగానికంతా అందించి, అందరూ దీపావళిలో భాగస్వాములను చేశాడు. అందుకు యానాదులందరూ పోలయ్యను మెచ్చుకున్నారు. దీపావళి అంటే దీపాలపండగ ఆరోజు దీపాలే వెలిగించాలని కాలుష్యరహిత గిలకలను తయారుచేసి సాంప్రదాయ బద్ధంగా దీపావళి పండుగ చేసుకొని ఆనందించారు. అంతకముందు దీపావళి అగ్రవర్ణ పండుగగా రచయిత పోలయ్య నోటిద్వారా పలికించాడు. పోలయ్యపాత్రకి ఆ చైతన్యం ఉన్నట్లుగా మనకు ఈ నవలలో ఎక్కడా కనబడదు.

**<u>యానాదులు భాష:</u>**

వీరు తెలుగు భాషను మాట్లాడుతున్నారు. వీరికి ప్రత్యేక భాష లేకపోవడానికి ముఖ్యకారణం ఏ భాషా ఎరుగని అత్యంత పురాతన అనాది జాతి. తర్వాత మూల ద్రావిడ పలుకుబడి వీరి భాషలో కనబడుతాయి. అందువల్లనే వారి మాటల్లో మనం అచ్చతెలుగని అనుకోని ఆరవ పదాలు కూడా ఉండటం సంస్కృత పదాలు లేకపోవడం. లేకుంటె ద్రావిడులకు పూర్వం ఏదో ఒక భాష ఉండి దానిని వదులుకోనైనా ఉండోచ్చు. అట్టి భాష లిపి ఏర్పడకముందు ఉండిన గీత, సైగ భాషగా ఉండి క్రమేణా ఏదో ఒక రూపాన్ని పొంది యుండవచ్చు. కాలగర్భంలో మాసిపోయి యుండవచ్చు.

**<u>యానాదులు ఇతరులతో వ్యవహరించే విధానం:</u>**

యానాదుల వారు పూర్వం సంచార జీవనం గడుపుతూ ఉండేవారు. ఇప్పుడు వారు మైదాన ప్రాంతంలో గిరిజనేతరులతో కలసి గ్రామాలలో, గ్రామ చివరన చిన్న చిన్న గుడిసెలు ఏర్పాటు చేసుకోని జీవనం గడుపుతున్నారు. వీరు ఇతరులతో కలిసి ఉండరు. కానీ మంచి తనం ఉన్న వాళ్ళను వారిలో కలుపుకుంటారు. ఎర్రటిఎండలో మాలోల్ల సింగయ్య, పొలం నుండి గడ్డి మోసుకువస్తూ బుడ్డమ్మా బుడ్డమ్మా మంచి నీళ్ళు అడిగి గడ్డి మూటను కిందవేసి కంకుల బండ మీద కూర్చొన్నాడు. అది చూచిన కమ్మకులస్తుడైన దేవుడి శేషయ్య కాలితో బలం తన్నాడు. శింగయ్య బొర్లా పడ్డాడు. "మాల నా కొడకా బండెక్కి ఠీవిగా కూర్చున్నావు గదరా లంజాకొడక. ఈ మద్దెల నా కొడకలార మరీ బలిసి కొట్టుకుంటున్నారా మీరు" (పు. 78) అని మాట్లాడుతూనే తన్నుతున్నాడు. శింగయ్య కాపా... సూడలేదయ్యా అని బ్రతిమిలాడుతున్నాడు. కానీ శేషయ్య వినిపించుకోకుండా తన ధోరణితో అగ్రకులతత్వంతో తన్నుకుంటూ, తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు. తర్వాత యానాదులు "లేన్న... లే... ఈడి కాళ్లిరిగిపోను బండ మీనకూసుంటే ఈడెమ్మ సొమ్ము ఏ(అరిగిందో.... దొంగ నాబట్ట.... అంటు మంచినీళ్ళ చెంబుతో సింగయ్య దగ్గరకు చేరింది బుడ్డమ్మ. అబ్బావ్... ఈ దేవుడి శేషయ్యకి ఇంత తొందరేందమ్మే నోరెల్లబెట్టింది రత్తమ్మ. ఓ...మ్మేయ్... ఈడి పేరు దేవుడు శేషయ్య అని పెట్టకుండా... దెయ్యపు శేషయ్య అని పెట్టుంటే... బాగుండేదే" (పు.78) అని మెటికలు విరిసింది మంగమ్మ. సింగయ్య యానాదులు ఓదార్చి శేషయ్య తిట్టారు. బుడ్డమ్మ పోసిన నీళ్ళు తాగి గడ్డిమోపుతో వెళ్ళిపోయాడు.

చెంచులు తండ్రి మునెయ్యను చెయ్యని నేరానికి కమ్మోళ్ళ కుర్రోళ్ళు తోపు సంగం గుడిసెల ముందుకు వచ్చి గొడవ గొడవ చేశారు. ఆ గొడవకి యానాదులందరూ బయటకొచ్చారు. వారిలో మునెయ్య చూసి, లాక్కొని వెళ్ళి రాములవారి గుడి ముందున్న వేపచెట్టుకి పెడరెక్కలు విరగదీసి కట్టేశారు. చౌదరితోపాటు పెద్దలు వచ్చారు. చౌదరి దొంగతనం

చేసిన దండ సాయంత్రం లోపు తీసుకువచ్చి ఇవ్వమని తీర్మానం చేశాడు. "ఓరే యానాది నా కొడుకులారా మీ పుట్టుకే దొంగపుట్టుకరా.... నకరాలు పడకుండా నేరాన్ని వొప్పుకోండి లేకపోతే నిలువున తగలబెడతా" (పు. 66) నని చిత్ర వధ చేసించాడు. దాంతో "మునెయ్యి మనస్సంతా భయంతో వణికిపోతుంది. ఇక చంపేస్తారని, ఇక బ్రతక నీయరని ఆలోచిస్తూ పడుకోనుండాడు. చిన్నంగా వేసి చెంబు తీసుకొని బయటకని వచ్చాడు. సిన్నంగా అడుగులో అడుగేసుకుంటు చేల వైపు వెళ్ళాడు. వెళ్ళినవాడు ఇక తిరిగి రాలేదు. ఎన్నటికి తిరిగి రాలేదు" (పు. 67) అలా కుల సమాజం అలివేలు భర్తను బలి తీసుకుంది.

తర్వాత కరణం కొడుకే దొంగతనం చేసాడని తెలిసింది. కానీ ఎవరు పెదవి మెదపలేదు. ఇలా యానాదులు బయట వ్యక్తులతో మసులుకుంటారు.

ఈ యానాదులు ఏవరికి వారిగా ఉంటారు. కానీ కష్ట సుఖాలతో కలసిమెలసి ఉంటారు. తమ దగ్గర ఉన్నది నలుగురూ పంచుకొని తింటారు. కష్టం వచ్చిన మనిషి పట్ల మానవత్వంతో వ్యవహరిస్తారు. ఆర్థిక సహాయం చేయలేకపోయిన తమ దగ్గర ఉన్నది పెట్టి మాట సహాయం చేస్తారు.

**4.3.8. కళలు – యానాదుల ఆట పాట,వేషధారణ :**

యానాదుల ఆట, పాటలు, వేషదారణ, వినోదాలు ప్రత్యేకంగా ఉంటాయి.‘‘యానాదులకు తిరునాళ్ళన్నా, వీధిభాగవతాలన్నా తోలుబొమ్మలాటలన్నా, జాతరలన్నా, ఊరేగింపులన్నా భలే సంబరం. పండుగల సమయాల్లో యానాదుల ఆనందానికి, అడ్డు అదుపు ఉండదు. మగవారు స్త్రీ వేశాలతో కృష్ణుడు, గోపికవలెను, శ్రీరాముడు సీతమ్మవలెను పౌరాణిక పాత్రలు ధరించి బజార్లలో, అంగళ్ళలో ప్రముఖుల ఇండ్ల వద్ద చిందులు తొక్కుతారు. తిండి గింజలను బహుమానంగా సంపాదించుకుంటారు. ఇక యానాదుల చిందు, నృత్యం, ప్రసిద్ధి గాంచినదిగా చెప్పవచ్చు (రాఘవయ్య, వెన్నెలకంటి. 1974: 147). ఈ విధమైన ఆటలు, పాటలు, మొదలైన వాటిని గురించి 'ఎన్నెల నవ్వు' మునెయ్య పెళ్ళి సందర్భంలో చోడు చేసుకుంది. పుల్లింకి పిట్ట ఆట నవలలో ఒక చోట వర్ణించబడింది.

విడిది దగ్గర పెళ్ళి కుతుర్ని పెళ్ళికొడుకు ఇంటికి తీసుకువచ్చేముందు గంజికావిడి తీసుకువస్తారు. దానికి అర్థం రచయిత వివరిస్తూ "మేము పేదోల్లం, మాకు కలిగింది ఈ గంజిబువ్వే. ఈ గంజి నీల్లే మేం తాగుతాం... నువ్వు కూడ ఈ గంజినీళ్ళను సంతోషంగా పంచుకుంటాను అని అంగీకరిస్తే ఈ గంజినీల్లు తాగు అని తమ స్థితిని ఆచరణ ద్వారా పెళ్ళికూతురికి ఆమె తరపు వారికి స్పష్టంగా అర్థం చేయించే ప్రయత్నమే ఈ గంజికావిడి..... పిల్లా పట్టుదోసిలి... మేం ఏ పూట కాపూట కష్టం చేసుకునేటోల్లం. పూరిగుడిశల్లో బతికేటోల్లం. వంటినిండా సొమ్ములు లేవు.... వెండి పళ్ళాలు లేవు... ఇంటి నిండా పాత్రలులేవు.... మేం దోసిట్లో బువ్వతింటాం. అందుకు సమ్మతిస్తే దోసిలి పట్టి ఇష్టంగా తాగు.... అనే భావన దాగుందా దోసిట్లో" (పు.44) కుండలో కూడు తాగి, మరో కుండలోని నీళ్ళతో చేతులు కడుక్కొంది అలివేలు. యానాది మేళం 'డుబ్బాంగ్... భాంగ్... డుబ్బాంగ్' ఈ దరువు విన్న ఏ యానాది ఆట ఆడకుండ ఉండలేడు. సిన్నబ్బి ఉల్లంకి పిట్ట ఆడడానికి జనం మధ్యలోకి వచ్చాడు. వాడి ఆటకి జనం మెచ్చుకుంటున్నాడు. మరొక మూల నుండి సిటికలోడు లేచాడు. "సిటికలోడు ఆడపిట్టని, సిన్నబ్బి మొగపిట్టని.... ఎలా ఆకర్షిస్తున్నదో" (పు. 59) అలా ఆడుతున్నారు.

యానాదులకు "జీవితమే వాళ్ళ ఆటకు కథావస్తువు, ఆహార సేకరణే వాళ్ళకు కళాప్రక్రియ. సిన్నబ్బి, సిటికలోడు వీళ్ళేకాదు యానాది కళాకారులు ఆకలి తీర్చుకునే ఆచరణలో కల్తీలేని, సజీవమైన కళా రూపాలకు సృష్టికర్తలు.పుల్లంకి పిట్టాట, నెమిలాట, గుర్రమాట

అన్ని ఆటలకు మూలం ఆకలే. చెట్టు, పుట్ట, పాము, పకి, చేప, జెల్ల అన్నీ వాళ్ళకు గురువులే. తాతల నుండి అమ్మలనుండి.... తెలికగా పట్టుకున్నవి. అకరం వారిదే. అడుగు వారిదే. పాట వారిదే. పదము వారిదే. కాని సర్వం బ్రాహ్మణమయింది" (పు. 59). రచయిత అభిప్రాయం సరైనదని అనవచ్చు.వీరి నృత్యం తప్పెట దరువుకు అనుగుణంగా వేగవంతమైన చిందులతో ఉంటాయి. వివాహ సమయాల్లో, మరణించినప్పుడు నృత్యాలు చేస్తారు. వీళ్ళు చేసే నృత్యాలలో చెంచులక్ష్మి, గయోపాఖ్యానం ప్రధానమైనది. ఒకప్పుడు చారిత్రాత్మక కథలు కూడా ప్రదర్శించేవారు.

యానాదులు నృత్యాల్లో డప్పు, డోలు తప్పెట్లు ఉపయోగిస్తారు. పూర్వం వీరు గాలి తిత్తులను వాడేవారు. ఇపుడిప్పుడు యానాది భాగవతుల హరికథలు కూడా చెబుతున్నారు. ఎన్నెలనవ్వు నవలలో మునెయ్య పెళ్ళి సందర్భంగా పొట్టినారాయణ (సిన్నబ్బి), మగపొట్టుగా, సిటికలోడు ఆడపుల్లంకి పిట్టగా దుబ్బాంగ్ దరువు అనుగుణంగా లయబద్ధంగా ఆట ఆడతారు. మగపిట్ట, ఆడపిట్టను ఎలా ఆకర్షిస్తుందో అనుకరించి ఆడారు. వారి ఆటచూసి యానాదులు పడిపడి నవ్వుకున్నారు. అందుకే యానాదులకు జీవితమే ఆటవస్తువు. యానాది కళాకారులు ఆకలి తీర్చుకునే క్రమంలో ఆచరణలో అసలు సిసలైన సజీవ కళారూపాల సృష్టికర్తలని చెప్పవచ్చు. పుల్లంకిపిట్ట ఆటేకాదు. నెమలాట, గుర్రమాట అన్ని ఆటలకు మూలం ప్రకృతే. ప్రకృతిలో అన్ని జీవులు వారికి గురువులే. కానీ కళలన్నీ బ్రాహ్మణమయం అయ్యాయని రచయిత వెలిబుచ్చిన అభిప్రాయం సరైనదేననవచ్చు.

**<u>సి.టి. యాక్ట్:</u>**

యానాదులు నేటికి కూడా వరిచేలలో పరిగలు ఏరుకునే దశలోనే ఉన్నారని తెలుస్తుంది. యానాదుల ముఖ్య వృత్తి సాధారణంగా ఏరోజుకారోజు భత్యాన్ని సంపాదించుకోవడం. నెమలి ఈకలు, జిగురు, అడవి జంతువుల తోళ్ళు, కొమ్ములు, కుంకుడు కాయలు, వనమూలికలు, ఆకులు, పిట్టలు, తదితర అటవి సంపద సేకరణ, చేపలు పట్టడం, వేట, పశువుల పెంపకం వీరి ముఖ్య వృత్తి. యానాదుల వేట అంతా చిల్లర మల్లర జంతువులను పట్టడంలోనే . వీరు దుప్పి, జింక, కొండగొర్రె, ఉడతలు, కుందేళ్ళు, ఎలుకలు, వంటి జంతువులను వేటాడతారు. చేపలు పట్టడంలో యానాదికున్న పాండిత్యం మరే విద్యలోను లేదు. కొంత మంది వ్యవసాయ కూలీలుగా కూడా ఉన్నారు. వెదురు తీగలకు అల్లిన మావులు వారికి పనిముట్లు. వీటినే కొడుములు అని పిలుస్తారు. పందికొక్కులు, నీటికొళ్ళు, కొంగలు, తాబేళ్ళు, పిల్లులు కూడా పట్టుకుంటారు.

అంతే కాకుండా వారు పుట్టడమే దొంగలుగా పూడతారని, వీరి వృత్తియే దొంగతనమని, బ్రహ్మదేవుడు వీరికి దొంగతనం చేసి బతకండని రాశాడని చెబుతారు. కాని నిజానికి వీరు నేరస్తులు కారు. ఎందుకంటే యానాదులను స్థానికులు తమ పొలం వద్ద కాపలాదారులుగా నియమించుకుంటారు. అందుచేత వీరిని దొంగలనడం సబబుగా తోచదు.ఒక వేళ వారు ఆహార అన్వేషణలొ భాగంగా కొందరు వ్యక్తులు చిన్న చిన్న దొంగతనాలు చేసి ఉండవచ్చు. అంతమాత్రాన ఆ వ్యక్తులు చేసిన నేరాన్ని ఆ జాతి మొత్తానికి ఆపాదించడం ఎంతరవకు

సమంజసం. దీన్ని బట్టి చూస్తే గిరజనులందరు దొంగలేనా? అనే ప్రశ్న రావడం సహజం. ఒక జాతినే నేరాలు చేసే జాతని నిర్ణయించడం అర్థం లేని మాట. వ్యక్తులు నేరాలు చేస్తారు, గానీ ఒక జాతి జాతంతా ఎలా నేరగాళ్ళుగా ప్రకటిస్తారు. నిరూపణ లేకుండా చేయని నేరాలకు శికించడం అన్యాయం. న్యాయశాస్త్రానికే మచ్చ. "అందుచేతనే మద్రాసు హైకోర్టు సుప్రసిద్ధ చీఫ్ జస్టిస్ కీ.శే. శ్రీ ముక్త వెంకట సుబ్బయ్యగారు ఈ చట్టము న్యాయశాస్త్రానికే కళంకము" అని తీర్పు చెప్పారు (రాఘవయ్య, వెన్నెలకంటి. 1974:87).

ఈ విధంగా జైళ్ళపాలు చేసిన వందల కొలది యానాదులను, ఎరుకల అమాయకులను బాధించి, బంధించి, భయభ్రాంతులను చేసిన " క్రిమినల జాతుల సెటిల్ మెంట్స్"ను 1948-1951 సంవత్సరాల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసి పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుకుందనవచ్చు.

సెటిల్‌మెంట్ చట్టం యానాదులను నేరస్తులుగా పరిగణించింది. 1924 నుండి యానాదుల జవసత్వాలను, ధైర్య సాహసాలను, జాతి వికాసాన్ని హరించిన అపకీర్తి ఈ చట్టానికి దానిని అమలు జరిపిన ప్రభుత్వాలకు దక్కిందని చెప్పవచ్చు.మంగమ్మను చెంచులు సిటియాక్ట్‌ను, కథను అడిగిమరి చెప్పించుకున్నాడు. సీటాకు కథ చెబుతూ పూర్వం యానాదులను దొంగలని పిలిసేవారని చెప్పింది. అయితే మనం దొంగలమా అంటే కాదయ్యా. కానీ ఆ పేరు ఎందుకొచ్చిందో తెలియదు అంది. ఊళ్ళో ఎక్కడ దొంగతనం జరిగినా యానాదులను పిలిచి విచారించేవారు. ఎవరూ దొరకపోతే యానాదులనే ఆ కేసులలో నేరస్తులుగా పరిగణించేవారు. ఏదైనా పనిమీద పక్కఊరికి వెళ్ళాలంటే పోలీసులతో సీటి రాపిచ్చుకొని తీసుకపోయి ఆ వూరి మునుసూబుకి చూపించి అనుమతి తీసుకోవాలి. అనుమతి వున్న రోజుల్లో తిరిగి రాకపోతే సెటిల్‌మెంట్‌లో పెట్టేవాల్లు. చచ్చిపోయేదాక ఆడే వుంచేవాల్లు. మన చుట్టాలు అలా ఎవరైనా ఉన్నారా అంటే చాలామంది ఉన్నారని సంజీవ కథ చెప్పింది. సంజీవరోజు పోలీసుస్టేషన్‌లో వేలుముద్రవేసి వచ్చేవాడు. ఒకరోజు జ్వరమొచ్చి వెళ్ళలేకపోయాడు. పొద్దున్నే పోలీసువచ్చి విచారించి సంజీవను సిగరెట్లకోసం బయటకు పంపాడు. సంజీవభార్యను పాడుచేయాలని ప్రయత్నం చేశాడు. వెనక్కివచ్చిన సంజీవ పెళ్ళాన్ని పోలీసు గోలచేయడం చూసి, గోరసకత్తితో తలనరికి శిక్ష అనుభవిస్తున్నాడని చెప్పింది. సంజీవలాంటి వ్యక్తులు సెటిల్‌మెంట్ కేసులతో కుటుంబాలకు దూరమయ్యాం. వారి భార్యపిల్లలు దిక్కులేనివారయ్యారు.

సెటిల్‌మెంట్ చట్టాలతో యానాదులను దొంగలుగా ముద్రించిందీ సమాజం. అందుకే కరణం కొడుకు దండ దొంగిలించి, పేకాటలో పెట్టాడు. దండ దొంగిలించాడని కమ్మ యువకులు యానాది సంగం మీదపడి నానాబీభత్సం సృష్టించి మునెయ్యను ఇష్టం వచ్చినట్లు కొట్టారు. సాయంత్రానికి దండ తీసుకురావాలని తీర్పుచెప్పారు. కమ్మ యువకులు యానాదులను దొంగలుగా ముద్రవేయడానికి నేపథ్యం సెటిల్‌మెంట్ చట్టాలే. ఈ చట్టాలతో సమాజమంతా యానాదులను దొంగలుగానే చూసింది. అందుకే అగ్రకుల సమాజం యానాది మునెయ్యను దొంగగా ముద్రించి, అతడి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసారు. ఆత్మగౌరవం గల మునెయ్యవారి ఆరోపణలకు బాధపడి ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఈ నవలలో యానాది దంపతుల అన్యోన్య దాంపత్యం, మాతృస్వామ్య వ్యవస్థను తెలియజేశాడు. ఇంక పక్కెలోడుకథ, సిన్నబ్బికథ, పెంచలమ్మకథ, సిటికలోడు దయనీయచావు, బుడ్డెమ్మకథలను రచయిత సందర్భానుసారంగా చెప్పారు. నవలలో వాటిని అంతర్భాగంగా ఉండేలా సమర్థవంతంగా కూర్చారు. యానాదులు సామాజిక, సాంస్కృతికాంశాలను లోతుగా చర్చించాడు

## 4.4. వెండి మేఘం- ముస్లిం సాంస్కృతిక జీవన పరిశీలన

ముస్లింల జీవితాలను తెలిపిన తెలుగులో మొదటి నవల వెండి మేఘం. ప్రకాశం జిల్లాలో పేద ముస్లిం కుటుంబంలో పుట్టిన స్త్రీ ఎదుర్కున్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలను ధైర్యంగా ఎదుర్కోన్న తీరును తెలియజేశారు. ఇస్లాం మతం, సంస్కృతిని, నూరు భాషీయులు అనుభవిస్తున్న కష్ట, నష్టాలు ఎరుక పరిచారు.

**4.4.1.సలీం పరిచయం:**

**రచయిత పేరు:** సయ్యద్ సలీం

**జననం:** 01-06-1956.

**తల్లిదండ్రులు:** అన్వర్‌బీ, జాఫర్.

**స్వగ్రామం:** త్రోవగుంట, ప్రకాశం జిల్లా.

**విద్యాభ్యాసం:** బి.ఎస్సీ, కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల. ఎం.యస్సీ (టెక్నాలజీ) వాల్తేరు, ఆంధ్రవిశ్వవిదాయలయం, విశాఖపట్నం.

**ఉద్యోగం:** ఆదాయపు పన్ను శాఖలో అసిస్టెంట్ కమీషనర్ (ఐ.ఆర్.ఎస్), హైదరాబాదు.

**సాహితీ ప్రస్థానం:**

సలీం ఇంటర్ చదివే రోజుల్లోనే 'సమర సాహితి' అనే సంస్థకు కార్యదర్శి అయ్యారు. తొట్టతొలుత కవితల రూపంగా ప్రారంభమైన సలీం సాహిత్య ప్రస్థానం కథలు, నవలలుగా విస్తరిల్లింది.సలీం చలం, బుచ్చిబాబు, రావిశాస్త్రి, గోర్కి, డాస్టోవిస్కీ, టాల్‌స్టాయ్ వంటి ప్రసిద్ధ గ్రంథాలను చదివి ప్రభావితమయ్యారు.

**కవిత్వం:** సలీం భావకవిత్వంతో కవిత్వం మొదలు పెట్టారు.

1. లేచివస్తున్నాం (కవితా సంపుటిని తన మిత్రులతో కలసి ప్రచురించారు).
2. నీలోకి చూసిన జ్ఞాపకం (1999).
3. ఆకులు రాలే దృశ్యం (2005).

**కథా రచన:**

సలీం రాసిన మొదటి కథ 'మనిషి'. 1980లో ఆంధ్రభూమి వార పత్రికలో ప్రచురితమైంది. సలీంగారు 120 కథలు వరకు రచించారు. ఈవన్నీ ప్రముఖ దినపత్రికల్లో ప్రచురితమయ్యాయి. సలీం రచించిన సుమారు 15 కథలు పైగా కన్నడ భాషలోకి, 5 కథలు హిందీ, 2 మరాఠి, 01 ఒరియా మరియు 01 ఆంగ్లంలోకి అనువాదం అయ్యాయి.

**కథా సంపుటాలు:**

1. స్వాతి చినుకులు (1996).
2. నిశ్శబ్ద సంగీతం (1999).
3. రూపాయిచెట్టు (2004).
4. చదరపు ఏనుగు (2006).

**నవలా రచన:**

సలీంగారు ఇప్పటి వరకు వివిధ సామాజిక, సంఘ సంస్కరణ, మార్పులను ఉద్దేశించి మొత్తం నాలుగు నవలలు రచించారు.

1. జీవన భృతులు (2001).
2. వెండిమేఘం (2003).
3. కాంచన మృగం (2006).
4. కాలుతున్న పూలతోట (2006).

**పురస్కారాలు:**

1. వెండిమేఘం- తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారం (2005).
2. ఢిల్లీ తెలుగు అకాడమీ - రాష్ట్రీయ వికాస్ శిరోమణి.
3. మాఢభూషి రంగాచారి అవార్డు - రూపాయిచెట్టు (2004).
4. ధర్మనిధి పురస్కారం, ఆంధ్ర భాషాసంఘం (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-2003).
5. విశాలాంధ్ర గోల్డెన్ జూబ్లీ అవార్డు (2003).

6. ధర్మనిధి అవార్డు (కథా రచనకు) తెలుగు విశ్వవిద్యాలయం (2002).
7. పైన పేర్కొన్నవేగాక కవిత, కథ, నవలలకు మరెన్నో బహుమతులతో పాటు ఆటా, తానా మొదలైన సంస్థల నుండి బహుమతులు అందుకున్నారు.

**4.4.2. వెండి మేఘం కథాపరిచయం:**

అన్వర్ మీరాసాహెబ్ కూతురు. ఆమెకు సలీమున్ అనే అక్క, బద్రుద్దీన్, అమీర్, రహంతుల్ల అనే ముగ్గురు అన్నలు ఉన్నారు. వాళ్ళది చీరాల దగ్గర ఉన్న చిన్న గంజాం. సలీమును త్రోవగుంటలో భాషాకి ఇచ్చి నిఖా చేశారు. సలీమున్ కన్న అన్వర్ వయస్సులో చాలా చిన్నది. సలీమున్‌కు ఆరుగురు బిడ్డలు పుట్టి చనిపోయారు. సలీమున్‌కు మొదటి బిడ్డ పుట్టినప్పుడు వాళ్ల అమ్మకు ఒక ఆడపిల్ల పుట్టింది, ఆమే అన్వర్.

మీరాసాహెబ్ సాల్ట్ ఇన్‌స్పెక్టర్ దగ్గర ప్యూన్‌గా పనిచేస్తున్నాడు. సలీమున్ ఏడవ కాన్పుకోసం పుట్టింటికి వచ్చింది. చెల్లెలు తనకన్న చాలా చిన్నది కావడం చేత సలీమున్ చెల్లీని సొంతబిడ్డలాగా చూసుకునేది. సలీమున్ ఏడవ సారి మగ పిల్లాడిని కన్నది. వాడికి రఫీ అని పేరు పెట్టారు. 40వ రోజున చిల్లా వేడుక జరిపించారు. సలీమున్ భర్త బాషా చదువుకోలేదు. కానీ ఐఎల్‌టిడి కంపెనీలో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అది సీజనల్ పని ఆరు నెలలు పని ఉండదు. వారానికి ఒక్కసారి కూలీ ఇస్తారు. అతనికి సొంత ఇల్లు, మసీదు మాన్యం ఉంది.

బాషాకు భార్య మీద అనుమానం ఎక్కువ, హింసిస్తాడు. చిల్లా వేడుక తర్వాత సలీమున్‌కి మండ్రగబ్బ కుట్టి చనిపోయింది. అప్పటికి బాషాకి 36 సంవత్సరాలు అయినప్పటికి పదకొండేళ్ళ అన్వర్‌ని పెళ్ళి చేసుకుంటానన్నాడు. మీరాసాకు, రఫీ బాగుకోసమని చెప్పి భద్రుద్దీన్‌ను ఒప్పించాడు. తలిక్లి ఇష్టం లేదు. అన్వర్ తల్లికి ఇంట్లో ఏ మాత్రం విలువ లేదు. రహంతుల్ల ఎదురు తిరిగిన ప్రయోజనం లేకపోయింది. అన్వర్ ఇష్టాన్ని అసలు ఎవరు పట్టించుకోలేదు. అన్వర్‌కు బాషాతో నిఖా జరిపించారు. అన్వర్ నిద్రలో ఉన్నప్పుడు కబూల్‌హై అనిపించారు. అన్వర్‌కి నిఖా అంటే ఏమిటో తెలియని వయస్సు ఆమెది. బాషా తల్లి కుల్సుంబీ ఉత్తమ ఇల్లాలు. ఆమెకు బాషా అన్వర్‌ను పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. ఎంత చెప్పిన బాషా వినలేదు. అన్వర్‌ను కుల్సుంబీ కన్నబిడ్డ కన్నా ఎక్కువగా ఆదరించింది. అన్వర్ అక్క కొడుకు రఫీని తన కొడుకులాగే, అన్వర్ ప్రేమతో పెంచింది. అన్వర్ చాలా అందమైంది. ఆమెకు బాషా తగడని త్రోవగుంటలో అంటుంటారు. బాషాకు లద్దాఫ్‌తో అక్రమ సంబంధం ఉందని అన్వర్‌కి తెలిసింది. లద్దాఫ్‌లు అంటే సగం ముస్లింలు. నూర్ భాషాలను నిందార్థకంగా లద్దాఫ్‌లు అంటారు.

ఒక రోజు వాళ్ళ ఇంటికి అన్వర్ బాబాయి వచ్చాడు. ఆయనతో అన్వర్‌కి రంకు కట్టి బాషా నాన్న యాగీ చేశాడు. కుల్సుంబీ కొడుకును తిట్టి కోడలును మంచిదని బాషాను మందలించింది. అన్వర్ రఫీకి సవతి తల్లి అని, అతన్ని సరిగా చూడదని చెప్పి బాషా రఫీ మనసులో విష బీజాలు నాటాడు. బాషా ఉంపుడు గత్తె సైదబీ. ఆమె తమ్ముడు ఆదాం అన్వర్‌ను అక్కగా భావించి ఆమెకు సహాయంగా ఉండేవాడు. ఆదాం నూరు భాషీయులకు సేవ చేయలనేది అతడి తలంపు. అన్వర్ గర్భవతి అయ్యింది. ఆ సమయంలో కుల్సుంబీ తన కోడలుకి సపర్యలు చేసింది. అన్వర్ మదర్‌సాలో కురాన్ చదువుకున్నది. ఇస్లామ్ గురించి తనకు తెలిసిన సంగతులు ఆదాంకు చెప్పింది. నూరు బాషీయులకు ఇస్లామ్ మతధర్మాలు బోధించి ఆదాం నూర్ భాషీయుల్లో ఆత్మగౌరవం పెంపొందించడానికి పూనుకున్నాడు. షేక్ చిన్న మౌలాన, నాజర్‌లను కలిసి తమ జాతి అభ్యున్నతికి తోడ్పడమని అర్థించాడు. వాళ్ళు తమ సమ్మతిని తెలియజేశారు.

ఆదాం అక్క సైదాబీని నడవడిని మార్చుకొమ్మని చెప్పాడు. ఆమె మొండిగా ఎదురు తిరిగింది. తనకు పెళ్ళి చెయ్యమని ఆదాంని అడిగింది. అది జరిగే పనికాదని ఇద్దరికి తెలుసు. అన్వర్‌కి మగ బిడ్డ పుట్టాడు. జిలానీ అని పేరు పెట్టారు. అన్వర్ మేనమామ కొడుకు నజీర్ చుట్టపు చూపుగా వాళ్ళ ఇంటికి వచ్చాడు. అతనికి రైల్వేలో లైన్‌మెన్ ఉద్యోగం. అన్వర్, నజీర్ చిన్నప్పుడు కలసి మెలసి ఆడుకునేవారు. ఒకరు అంటే మరొకరికి గౌరవం. నజీర్ అన్వర్‌ని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. వివాహం చేసుకోకుండా ఉన్నాడు. అన్వర్‌కు నజీర్‌తో అక్రమ సంబంధం అంట గట్టి బాషా నానా యాగీ చేశాడు. బాషా అన్వర్‌ని కొట్టడం కూడా జరిగింది. కుల్సుంబీ కోడలుకి కట్టుకట్టి ఓదార్చింది. బాషా రఫీలు వేరుగా వంట వండుకుంటున్నారు. బాషా సైదాబీని నిఖా చేసుకుసుకున్నాడు. కొద్దికాలానికి బాషాకు క్షయ వ్యాధి వచ్చిందని, ఎక్కువ కాలం బతుకడని తెలిసి, తల్లిని బతిమలాడి ఏడ్చి ఆమె పేర ఉన్న మాన్యం పొలాన్ని రఫీ ఒక్కడి పేరిట హిబా రాయించాడు. ఇద్దరు పిల్లలకి రాస్తానని ఎంత చెప్పిన బాషా వినలేదు. బాషా చనిపోయాడు. అప్పటికి అన్వర్‌కి 21 సంవత్సరాలు బతుకు దెరువుకోసం అన్వర్ ఐఎల్‌టిడి కంపెనీ గ్రేడింగ్ పనిలో చేరింది. అక్కడ ఆదెమ్మ అనే మాలస్త్రీ పరిచయం అయ్యింది.

ఆదెమ్మ మాట కరుకైనా, మనస్సు వెన్న. అన్వర్ చదువు నేర్చుకొని ఉద్యోగం చేసుకోవాలనుకుంది. కుల్సుంబీ అందుకు ప్రోత్సహించింది. గ్రేడింగ్ చేస్తూనే ఊరిలో రాఘవయ్య పంతులు గారి దగ్గర మెట్రిక్‌లేషన్ పరీక్షలు రాసింది. రఫీ, జిలానీలకు ఖత్నా చేయించింది. అందుకోసం తనకున్న ఒక్క నగను అమ్మివేసింది. పిల్లల చదువు ఇంటిఖర్చులతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. అత్తతో చెప్పి తాను కౌలుకి ఇచ్చిన పొలాన్ని సాగుచేయడానికి నిశ్చయించుకుంది. వాళ్ళపొలం కౌలుకి తీసుకుంటున్న వెంకట్ రెడ్డి అన్వర్‌కు వ్యవసాయంలో సహాయం చేశాడు. ఆదాం, ఆదెమ్మలు కూడా పొలం పనుల్లో అన్వర్‌కి సహాయం చేశారు.

బ్రిటీష్ ప్రభుత్వం ఆడవారికి ఆస్తి హక్కు కల్పించడానికి పూర్వమే ఇస్లాం మతం స్త్రీకి ఆస్తి హక్కు ఇచ్చింది. కాని చదువు విషయంలో ఆడపిల్లలని ఖురాన్ చదవడానికే పరిమితం చేసింది. మనం ఆడపిల్లల్ని కూడా ఇంగ్లీష్ చదువులు చదివించే స్థాయికి ఎదగాలని అన్వర్ ఆదాంతో చెప్పేది. చుట్టు ప్రక్కల ఉన్న ఆడ పిల్లలకు అన్వర్ చదువు చెప్పేది.

నజీర్ అన్వర్‌ను నిఖా చేసుకోవాలని అనుకున్నాడు. ఆమె ఒప్పుకోలేదు. ఇస్లామ్‌లో మారు మనువు సమ్మతమైన ఆమె ఇష్టపడలేదు. తన చిన్ననాటి స్నేహితురాలు జమీలాను పెళ్ళి చేసుకునేలా అన్వర్ నజీర్‌ని ఒప్పించింది. జమీలాకు తన మొదటి భర్త తలాక్ చెప్పాడు. జమీలాకు నజీర్‌తో నిఖా జరిగింది. గుంటూరు జిల్లా నూరు భాషీయులు ఆదాంను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రఫీకి చదువు మీద శ్రద్ధ లేదు. రఫీ కరవదిలో జుబేదా అనే అమ్మాయి ప్రేమలో పడ్డాడు. సైదాబీ స్నేహితురాలు ఖుర్షీద్ కూతురు జుబేద. అత్త కుల్సుంబీ చనిపోయింది. జుబేదా ఖుర్షీద్‌లు మంచివారు కాదు. రఫీకి వాళ్ళతో సంబంధం వద్దని చెపితే అతను వినలేదు. విధి లేక జుబేదాతో నిఖా జరిపించింది. చేసిన మేలు మరచి రఫీ తన పొలం తనకు కావాలని అన్వర్‌తో పేచి పెట్టుకున్నాడు. తనకు అత్త వాటాగా వచ్చిన వంటింటితో సరిపెట్టుకొని ఆస్తిని రఫీకి ఇచ్చి వేస్తుంది అన్వర్ తన పొలం మీద మమకారంతో అన్వర్ రఫీ దగ్గరే ఆ పొలాన్ని కౌలుకు తీసుకొని సాగుచేస్తుంది.

ఒంగోలు శర్మ కాలేజీలో చదువు కుంటున్న జిలానీకి ఒక సమస్య ఎదురవుతుంది. హిస్టరీ క్లాస్‌లో గజిని మహ్మద్ పాఠం విన్న తరువాత అతని క్లాస్‌మెట్ హిందు మత అభిమానంతో జిలానీలాంటి ముస్లిం విద్యార్థులను దేశద్రోహులుగా ముద్రవేశారు. ముకర్రం అనే సహావిద్యార్థి ఆవేశపడ్డాడు. కొందరు వ్యక్తిగత అభిప్రాయాలను హిందువులందరి

అభిప్రాయాలు అనుకోవద్దని అభద్రతా భావంతో ఆందోళన చెందవద్దని జిలాని అతనికి నచ్చచెప్పాడు. ప్రభుత్వం నూర్‌భాషీయులను బీ.సీ –బి లుగా గుర్తించింది. జిలానీ బ్యాంక్ ఆఫీసర్ అయ్యాడు. హైదరాబాద్‌లో పోస్టింగ్ వచ్చింది. తల్లిని తరువాత తీసుకువెళ్ళాలని అనుకున్నాడు. పనిని దైవంగా నమ్మే అన్వర్ తాను ముస్లిం ఆడపిల్లలకు చదువు చెప్పేపని మానుకోని హైదరాబాద్‌కి రాలేనని చెప్పింది.పోరుగింటి అమ్మాయి రిక్షామస్తాన్ కూతురు రమీజాను కొడలిగా తెచ్చుకావాలనుకుంది అన్వర్. రమీజా ఎక్కువ చదువుకోలేదు. అంత అందగత్తె కాదు. అయిన తల్లి మాటకోసం రమీజాను నిఖా చేసుకున్నాడు.

పెళ్ళయిన మూడు సంవత్సరాలలో జిలానీకి ఒక పాప, బాబు పుట్టారు. మనుమరాలికి కుల్సుం అని అత్తగారి పేరు పెట్టుకుంది అన్వర్. మనుమరాలిని మనవడిని చూడటానికి హైదరాబాద్ వచ్చి  కర్ఫ్యూలో చిక్కుకుంటుంది. హిందు, మహ్మదీయుల మత కలహాలు అన్వర్‌ని ఎంతో బాధించాయి. మానవత్వం గల వాళ్ళు రెండు మతాలలో ఉన్నారని తనను రక్షించిన శంకర అనే పోలీసు ప్రవర్తనతో ఆమె గ్రహించింది. మత విద్వేషం చదువురాని మూర్ఖుల్లో, ఆవారా గాళ్లలో ఉంటుంది. కానీ చదువుకున్న వాళ్ళలో ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న వాళ్ళలో ఉండదని అన్వర్ రమీజాకు ధైర్యం చెప్పింది. అన్వర్‌కి 60 సంవత్సరాలు వచ్చాయి. మనమరాలు కుల్సుం డిగ్రీ పాస్ అయ్యింది. మంచి లాయర్ అయి ముస్లింల హక్కులకోసం పోరాడాలనుకుంది. రఫీ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. అన్వర్ జీవితం హాయిగా గడుస్తుంది. అన్వర్ పాత్ర కొనసాగింపు మనమరాలు కుల్సుంగా మనకు అవగతమవుతుంది. ముస్లీం స్త్రీల హక్కుల రక్షణ కోసం మనుమరాలు  ముందుకు వచ్చినందుకు, అత్తగారి ఆలోచనలు, తన ఆశయాలను నెరవేర్చినందుకు ఆమె ఎంతో సంతోషించింది

**4.4.3. పాత్రల విశ్లేషణ:**

ఈ నవల స్వతంత్ర్యానికి పూర్వం  1947కి పూర్వం మెదలై 1995 వరకు 60 సంవత్సరాలు ముస్లిం జీవితాలను వర్ణించింది. అందులో పేద ముస్లింల స్థితి గతులను ప్రధానంగా చర్చించింది. స్త్రీ పాత్రలను ప్రధానంగా తీసుకుని వారి సాధక బాధలను తెలియజేశారు. మైనార్టీలు వెనుకబడి పోవటానికి కారణాలుగా విద్యలేకపోవడం, మత ధర్మాలను పాటించడం ప్రధానంగా కనిపిస్తాయి.

**అన్వర్:**

ప్రధాన పాత్ర. తండ్రి మీరాసాహెబ్. బ్రిటిష్ వాళ్ళ దగ్గర తర్వాత సాల్ట్ ఇన్స్‌పెక్టర్‌కి ఫ్యూన్‌గా పని చేసాడు. చినగంజాం ఆమె పుట్టిన ఊరు. చిన్నతనంలోనే పెళ్ళి చేసారు. అక్క సలీమున్ మంద్రగబ్బ కుట్టి బాలింతగానే చనిపోతుంది. సలీమూన్ భర్త బాషా పిల్లాడి ఆలనా పాలనా కోసం అన్వర్ తల్లిదండ్రులను ఒప్పించి  పసిమొగ్గగా ఉన్న అన్వర్‌ను పెళ్ళి చేసుకుంటాడు. అన్వర్ ముగురన్నలల్లో రహ్మతుల్లా ఆ పెళ్ళి ఇష్టంలేక ఇంటినుండి బయటకు వెళ్ళి మిలట్రీలో చేరుతాడు.అన్వర్ పెళ్ళప్పుడు నిద్రపోతూ ఉంది. పెళ్ళి అయిన తర్వాత నిద్రపోతున్న అన్వర్‌ను బాషా అలాగే ఎత్తుకొని రైలులో ఎక్కాడు. అన్వర్ చిన్నపిల్ల జాగ్రత్తగా చూచుకొమ్మని చెప్పి ఆమె కుటుంబం సాగనంపింది. ఉదయం నిద్రలేచిన అన్వర్ అమ్మ దగ్గరకు వెళతానని ఒక్కటే ఏడుపు. బాషా తల్లి కుల్సుంబీ అన్వర్‌ను ఓదార్చి అక్కున చేర్చుకుంది. ఆమె వాత్సల్యంతో  అన్వర్ స్వాంతన పడుతుంది.  అన్వర్‌కి పెళ్ళి అయిన దగ్గర నుండి కష్టాలు మొదలవుతాయి.  బాషా అన్వర్ని చాలా ఇబ్బంది పెడతాడు.  అమ్మను మరిపించేలా ఆమె అన్వర్‌ను ప్రేమగా చూచుకొంది. కొడుకు బాషా కోడల్ని ఇబ్బంది పెట్టిన ప్రతిసారి అత్త కుల్సుంబీ అన్వర్‌కి కొండంత ధైర్యానిచ్చి అండగా ఉంది.

బాషా సైదాబీతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని తెలిసి అన్వర్ భర్తను

అడుగుతుంది. అన్వర్‌కి సమాధానం చెప్పకుండా తల్లి కుల్సుంబీ లేకుండా చేసి ఆమెపై అత్యాచారం చేస్తాడు. తర్వాత అన్వర్ని బుజ్జగిస్తాడు. రంజాన్ పండుగను అన్వర్ తన కుటుంబంతో ఆనంద ఉత్సాహాల మధ్య జరుపుకొంది. ఆరోజు సైదాబీ తమ్ముడు ఆదాంను భోజనానికి బాషా తీసుకువచ్చాడు. అప్పటి నుంచి ప్రతి విషయంలో ఆదాం అన్వర్‌కి సొంత సోరుడిలా అండగా నిలబడ్డాడు. అలాగే అన్వర్ కూడా సొంత సోదరుడిలా ఆదాంకి ఇస్లాం ఆచార వ్యవహారాలు, ఇస్లాం ధర్మాన్ని, ఉర్దూ భాషను నేర్పి, నూర్ బాషీయుల యందు ఆదరణతో ఉండేది.

బాషా అన్వర్ సొంత బాబాయ్ ఇంటికొస్తే అతనితో అన్వర్‌కి అక్రమ సంబంధం అంటగడతాడు. చిన్ననాటి మిత్రుడు, మేనబావ నజీర్ ఇంటికొస్తాడు. అతనికి అన్వర్‌కి అక్రమ సంబంధం అంటగట్టి నానా యాగి చేసి అతడ్ని కొట్టి, బయటకు పంపించి వేస్తాడు. బాషా తన కొడుకు రఫీకి నానమ్మ, అన్వర్‌పై ఈర్ష్య, ద్వేషాలను రగిల్చాడు. అప్పటి నుండి రఫీ అన్వర్, నానమ్మలపై ద్వేషాన్ని పెంచుకున్నాడు. అన్వర్, బాషాలకి పుట్టిన జిలానీని తన కొడుకు కాదని దూరంగా పెట్టాడు. బాషా సైదాబీని రెండో పెళ్ళి చేసుకున్నాడు. వేరు కాపురం అదే ఇంట్లో పెట్టాడు. కొంతకాలానికి బాషా క్షయవ్యాధితో మరణించాడు. క్షయతో మరణించే ముందు రఫీ పేరు మీదకి ఆస్తిని రాయమని కుల్సుంబీని అడిగాడు. కుల్సుంబీ ఒప్పుకోలేదు. అన్వర్ అత్తను ఒప్పించి ఆస్తిని రఫీ పేరు మీదకి రాపిచ్చింది. బాషా మరణం తర్వాత కుటుంబం గడవడం కష్టమైంది. పొగాకు గ్రేడింగ్ పనికి అన్వర్ వెళ్ళింది. ముస్లిం పెద్ద ఇమాం అలా వెళ్ళకూడదని అడిగారు. మా ఇంట్లో సంపాదించే మగవారు లేరు గనుక మా జీవనం కోసం వెళ్ళక తప్పదని కుల్సుంబీ అతడికి చెప్పి ఒప్పించింది.

అప్పటికే రఫీని బడిలో చేర్పించింది. అది కూడా పెద్ద గొడవైంది బాషాతో. తన చిన్న కొడుకు జిలానీ బడి చేర్పించే ముందు రాఘవయ్య పంతులుతో అక్షరాభ్యాసం చేయిస్తుంది. రాఘవయ్య పంతుల సలహాతో అన్వర్ మెట్రిక్యులేషన్ పరీక్షలకు సిద్ధమౌతుంది. పొగాకు గ్రేడింగ్ పనిలో పుల్లారావు లైంగిక వేధింపుల నుండి తప్పించుకోవడానికి ఆదెమ్మ సహాయం అందిస్తుంది. పొగాకు గ్రేడింగ్ పని సీజనల్ కాబట్టి కొండారెడ్డి కౌలుకు తీసుకున్న తమ ఇనాం మాన్యంలో రెండు ఎకరాలు వెనక్కి తీసుకొని వ్యవసాయం ప్రారంభిస్తుంది. వ్యవసాయ పనుల్లో అన్వర్‌కి కొండారెడ్డి, ఆదాం, ఆదెమ్మ సహాయం చేస్తారు. వ్యవసాయాన్ని అన్వర్ ఫల ప్రదంగా పూర్తి చేస్తుంది. ఇదే సమయంలో నజీర్ అన్వర్‌ను పెళ్ళి చేసుకొమ్మని ఒత్తిడి తీసుకువస్తాడు. అన్వర్ కోసమే ఒంగోలు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని త్రోవగుంటలో కాపురం ఉంటాడు. అన్వర్ కూడ అతని మీద చిన్నప్పుడు నుండి ప్రేమ ఉంటుంది. కానీ అన్వర్ నజీర్‌ను పిల్లాడిలా తను తల్లిగా ప్రేమిస్తానని ఇద్దరు బిడ్డల తల్లిగా నిన్ను నేను వివాహం చేసుకోలేను అని చెబుతుంది. తన చిన్ననాటి స్నేహితురాలి జమీలాని ఒప్పించి అతనితో వివాహం జరిపిస్తుంది.

నజీర్‌కి పెళ్ళి కాకముందు అతనితో అన్వర్‌కి అక్రమ సంబంధం ఉందని సైదాబీ ఊర్లో ప్రచారం చేస్తుంది. రఫీని ఖుర్షీద్ ఇంట్లో చూచానని ఆదాం అన్వర్‌కి చెబుతాడు. అన్వర్ రఫీని ఆ విషయం అడిగింది. రఫీ ఖుర్షీద్ కూతురు జూబేదాతో ‘నిఖా’ జరిపించి పెద్దరికం నిలుపుకొమ్మంటాడు. అన్వర్ రఫీకి ఖుర్షిద్ వాళ్ళు మంచి వాళ్ళు కాదని నచ్చ చెప్పటానికి ప్రయత్నించింది. కానీ రఫీ ఒప్పుకోలేదు. అందుకే రఫీకి దగ్గరుండి అన్వర్ పెళ్ళి చేయించింది. రాఘవయ్య పంతులుతో మాట్లాడి రఫీకి టీచర్ ఉద్యోగం ఇప్పించింది. పెళ్ళి తర్వాత రఫీ, అతని భార్య అన్వర్‌ని ఇంట్లోంచి వెళ్ళిపొమ్మనమంటారు. పొలంలో వచ్చిన ఆదాయం లెక్కలు చూపించమని గొడవ పెట్టుకున్నారు. పొలంలో వచ్చిన ఆదాయమంతా

కుటుంబానికే ఖర్చు పెట్టానని చెబుతుంది. రఫీ పొలం అతడికే ఇచ్చివేసి వాళ్ళ దగ్గర నుండే కౌలుకి తీసుకొని వ్యవసాయం చేయడం మొదలుపెడుతుంది. జిలానీ చదువు కున్న తర్వాత హైదరాబాద్‌లో ఉద్యోగం వస్తే కొడుకుతో పట్నం వెళ్ళలేదు. జిలానీని ప్రేమించిన రమీజాతో వివాహం జరిపించింది. తాను పల్లెటూర్లోనే ఉంటుంది. మెట్రిక్యులేషన్ పాస్ అయినందుకు ఐఎల్‌టిడి కంపెనీలో సూపర్‌వైజర్‌గా ప్రమోషన్ వస్తుంది. వ్యవసాయం చేసుకుంటు ఆనందంగా జీవనం సాగిస్తుంది. ఒక్కసారి హైదరాబాద్ వెళ్ళినపుడు కర్ఫ్యూలో శంకర్ పోలీసు ఆమెకు రక్షణగా నిలుస్తాడు. మత ఘర్షణలు రాజకీయ కోణంలో, బలవంతుల ప్రయోజనార్థం జరుగుతాయని అర్థం చేసుకొంటుంది. మతం ఆ ఘర్షణలో ఒక కోణం మాత్రమేనని అర్థం చేసుకొంటుంది. కొంతమంది స్వార్థంతోనే మత ఘర్షణలు సృష్టిస్తారని తెలుసుకొంటుంది. అందుకనే గ్రామీణ ప్రాంతాల్లో మత ఘర్షణలు జరగవని విశ్లేషణ చేస్తుంది. మనుమరాలికి కుల్సుం అనే పేరు పెడుతుంది. త్రోవగుంటకి వచ్చిన మనమళ్ళకి తాను కష్టపడి సంపాదించిన 15 ఎకరాల పొలాన్ని చూపిస్తుంది. తన మనమరాలు 'లా' పూర్తి చేసి ముస్లీం స్త్రీల హక్కుల కోసం పోరాటం చేస్తానని చెప్పడం ఆమెకు ఎంతో ఆనందాన్ని, తృప్తికి ఇస్తుంది. అన్వర్‌కి మనుమరాలు అభ్యుదయ భావాలున్న ముస్లీం స్త్రీగా కనబడుతుంది. తాను కన్న కలలు తప్పకుండా సాధించుకునే ఆధునిక తరానికి చెందినది యువతిగా భావిస్తుంది.

ఈ నవలలో అన్వర్ అనే పాత్రను రచయిత సలీం ఎంతో ఆదర్శవంతమైన పాత్రగా తీర్చిదిద్దాడు. ఒక మూసలో పోసినట్లుగా ఉంటుంది. ఒకవైపు సంప్రదాయాన్ని గౌరవించే స్త్రీగా, ఆధునిక భావాలు కలిగిన స్త్రీగా అన్వర్ మనకు కనబడుతుంది. చదువుతో ముస్లీం సమాజాన్ని మార్చవచ్చునని మొదట్లో అనుకుంటుంది. అందుకే మెట్రిక్యులేషన్ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించాలని అనుకుటుంది. కానీ వ్యవసాయం మొదలు పెట్టి దానిపై మక్కువతో ప్రభుత్వ ఉద్యోగాన్ని తిరస్కరిస్తుంది. తాను చదువు నేర్చుకోవడమేగాక తన చుట్టుప్రక్కల వారికి ఆ జ్ఞానాన్ని పంచుతుంది. ముస్లిం ఆడపిల్లలకు తన ఇంట్లోనే చదువు నేర్పుతుంది. అందుకోసం ఇంటి ప్రక్కనే స్థలం కొని అందులో బడి కట్టించింది. హైద్రాబాద్‌లో మతకలహాలు ఎవరు ఎందుకు చేస్తున్నారో విశ్లేషణ చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని మతాలు కలిసి సామరస్యంగా ఎలా జీవించగలుగుతున్నారో వివరిస్తుంది. త్రోవగుంట వచ్చిన మనమళ్ళకి పొలం చూపిస్తుంది. తన మనుమరాలు 'లా' పూర్తి చేసి అన్యాయాలకు బలి అవుతున్న ముస్లీం స్త్రీల తరుపున పోరాటం చేస్తానంటే ఎంతో సంతోషించింది. ఈ నవలలో మనుమరాలు కుల్సుం పాత్ర అన్వర్‌కి కొనసాగింపుగా చిత్రించబడింది.

**<u>బాషా :</u>**

అన్వర్ భర్త, కుల్సుంబీ కొడుకు. త్రోవగుంట నివాసి. అన్వర్ అక్క సలీమున్‌ను పెళ్ళి చేసుకున్నాడు. ఆమెకు పిల్లలు పుట్టడం లేదని మొదట హింసించే వాడు. ఆమెకు ఏడోసారి గర్భం నిలిచి కొడుకును కంటుంది. ఆమె బాలింతగా ఉన్న సమయం తల్లి ఇంట్లో బారసాల చేశారు. ఆరోజు రాత్రి ఆమెకు మంద్రగబ్బ కుట్టగా చనిపోతుంది. అన్వర్ పెద్దమనిషి అవడంతో బాషా కన్ను అన్వర్ మీద పడుతుంది. తాను మరల పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదని, పిల్లాడు రఫీ కోసమే చేసుకోవాలని అత్తమామలతో అంటాడు. సొంత వాళ్ళు అయితే రఫీని జాగ్రత్తగా చూచుకుంటారని, అన్న బద్రుద్దీన్‌కి చెప్పి ఒప్పిస్తాడు. ఆ విషయంపై అన్వర్ ఇంట్లో గొడవ జరుగుతుంది. బాషాతో పెళ్ళి ఇష్టం లేదని చెప్పిన అన్వర్ మూడో అన్న రహ్మతుల్లాను తండ్రి బయటకు వెళ్ళగొడతాడు. బాషా అన్వర్‌ను పెళ్ళి చేసుకొని త్రోవగుంటకు కాపురానికి తీసుకుపోతాడు. బాషా అన్వర్‌తో మొదట్లో మంచిగా ఉంటాడు. అన్వర్ వయస్సుతో పాటు అందంగా తయారు అవుతుంది. బాషా అక్రమ సంబంధాన్ని తెలుసుకొని అడిగిన అన్వర్‌ని

బాషా తదేకంగా చూస్తాడు. ఆమె అందానికి ముగ్ధుడైపోతాడు. తల్లిని కట్టెలకి బయటకు పంపి భార్య అన్వర్‌ను బలవంతంగా అనుభవిస్తాడు. అలా మొదటి కలయికలోనే ఆమెతో బాషా పశువులా ప్రవర్తిస్తాడు. తర్వాత కాలంలో అన్వర్ అందాలకు చుట్టుప్రక్కల యువకులు ఆ ఇంటి చుట్టు తిరుగుతున్నారని ఏమి చేయలేక ఆమె పట్ల అనుమానంతో ఉంటాడు.

చుట్టపు చూపుగా వచ్చిన అన్వర్ బాబాయితో అన్వర్‌కి రంకు కడతాడు. మేనబావ నజీర్ ఇంటికి వచ్చినపుడు అలాగే ప్రవర్తించి, తర్వాత బాషా పనికెళ్ళి ఇంటికి మధ్యలోనే వచ్చి ఇంట్లోనే ఉన్న నజీర్‌ను బయటకు లాగి కొట్టి అన్వర్‌ని రకరకాలుగా తిట్టి కొడతాడు. బాషా తల్లి, అన్వర్ అత్త కుల్సుంబీ అడ్డం తీసి కొడుకును తీవ్రంగా ఎదుర్కొంటుంది. అప్పటినుండి బాషా తన పెద్ద కొడుకు రఫీని తనవైపు తిప్పుకొంటాడు, అన్వర్, నానమ్మల మీద ఈర్ష్య, ద్వేషాలు పెంచుతాడు. బాషా భార్య, తల్లితో విడిపోయి అదే ఇంట్లో వేరుగా ఉంటారు. సైదాబీని రెండో భార్యగా ఇంటికి తీసుకువస్తాడు.

సైదాబీ వ్యక్తిత్వం మంచిది కాదని స్వయాన తమ్ముడైన ఆదామే చెబుతుంటాడు. తనకు సవతిని తీసుకురావడం అన్వర్‌కి నచ్చలేదు. ఏ పోరు అయినా పడవచ్చు. కానీ సవతి పోరు వద్దనుకుంది. చివరకు అది కూడా జరిగింది. బాషా తన కొడుకు రఫీని పథకం ప్రకారం అన్వర్‌కి దూరం చేసాడు. రఫీని బడిలో చేర్పించినప్పుడు బాషా ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. చిన్న కొడుకు జిలానీ తనకు పుట్టలేదని ఆ పసివాడ్ని దగ్గరకు కూడా తీసేవాడు కాదు. రఫీ తమ్ముడికి దీపావళి టపాకాయలు ఎంత ఏడ్చిన ఇవ్వలేదు. ఒకరోజు బాషా జ్వరంతో ఇంటికి వచ్చాడు. తగ్గిపోతుందని అనుకుంటే దానికితోడు విపరీతమైన దగ్గు. ఆచారికి చూపిస్తే క్షయ వ్యాధి బాగా ముదిరిపోయిందని మందులు ఇచ్చి బలమైన ఆహారం పెట్టమని చెప్పాడు. కనీసం ఆరు నెలలు మందులు వాడమని గుణం కన్పిస్తే కొత్త మందులు వాడాలని చెప్పి వెళ్ళాడు.

ఆ విషయం తెలిసి తల్లి కుల్సుంబీ బాధ పడుతుంది. అన్వర్ మనస్పర్ధలు మరిచి బాషా వద్దకు పరిగెత్తింది. ఎలా వుంది అని బాషాని అడిగితే "నాకేం సుబ్బరంగా ఉన్నాను. తొందరగా పోతానని కలలు కంటున్నావా? నేను.. పోతే ఆ నజీర్‌గాణ్ణి కట్టుకొని హాయిగా కులకవచ్చని ఆలోచిస్తున్నావేమో... నీ ఆటలు సాగనివ్వను... నిన్ను నేను ఏలుకోను... అలాగని తలాక్ కూడా చెప్పను. తలాక్ చెప్పేస్తే నీకు రెక్కలు మొలుస్తాయి. నువ్విలా నా ఇంటి ముందు కుక్కలా పడి ఉండాల్సిందే"(పు:180-181)నని అనుమానంతోనే మాట్లాడతాడు.

బాషా చనిపోయే వారం ముందు తల్లితో ఒట్టు వేయించుకొని ఇనాం భూమి, ఇల్లు పెద్ద కొడుకు రఫీ పేర ప్రాంసరీ పేపర్ మీద రాయించి ఇవ్వమని ఆఖరి కోరికగా అడుగుతాడు. అన్వర్ నచ్చజెప్పటంతో కుల్సుంబీ రఫీ పేర ఆస్తి రాసి ఇస్తుంది.

ఈ నవలలో బాషా పూర్తిగా స్వార్ధపరుడుగా కనబడతాడు. అనుమానపరుడుగా చిత్రీకరింకచబడ్డాడు. తన సుఖం కోసం ఎంతటి పనికైనా వెనకాడడు. సొంత తల్లి, భార్యపై అబద్దాలు చెప్పి వారి నుండి కొడుకును శాశ్వతంగా దూరం చేస్తాడు. చనిపోయే సమయంలో కూడా కుట్రపూరితంగా ఆలోచన చేస్తాడు. విచక్షణ లేకుండా పశువులా అక్రమ సంబంధాలు అంటగడతాడు. అలాంటి వాడు కనుకే తల్లి కుల్సుంబీ అతడిపై కత్తిపీటతో దాడి చేయడానికి కూడా వెనకాడదు. అందుకే బాషా పాత్ర ఈ నవలలో అవసరానికి మనుష్యులను వాడుకొని వదిలెసే వ్యక్తిగా రచయిత చిత్రీకరించారు.

**<u>కుల్సుంబీ:</u>**

బాషా తల్లి. అన్వర్ అత్త. ఈ నవలలో ఉదాత్తమైన పాత్ర ఎంతో శాంతమూర్తి,

ప్రేమమూర్తి. కోడలిని కూతురి కంటే ఎక్కువ ప్రేమగా చూచుకొనే అత్త. కుల్సుంబీ, అన్వర్‌ల మధ్య అత్త కోడళ్ళ సహజమైన వైరం ఈ నవలలో చూపించలేదు. కుల్సుంబీ మొదటి తరం స్త్రీల పాత్రలకి ప్రతీకగా రచయిత చిత్రీకరించారు. ఈ నవలలో రెండు రకాల స్త్రీ పాత్రలను రచయిత చిత్రీకరించారు. మొదటి రకం పాజిటివల్ క్యారెక్టర్స్, రెండో రకం నెగిటివ్ క్యారెక్టర్స్. మొదటి రకంలో పాత్రలలో కుల్సుంబీ పాత్ర ఎన్నదగినది. ఈ పాత్ర నవల కంతటికి వెన్నెముక లాంటిది. కుల్సుంబీ పాత్ర మాతృమూర్తిగా, ప్రేమమూర్తిగా, శాంతమూర్తిగా, రౌద్రమూర్తిగా మనకు కనబడుతుంది.

కొడుకు బాషా పెద్ద కోడలు సలీమున్‌తో ప్రవర్తించే తీరు కుల్సుంబీకి నచ్చలేదు. అందుకే పెద్ద కోడలకి మద్దతుగా నిలబడింది. సలీమున్ చనిపోయిన తర్వాత పసిమొగ్గ అన్వర్‌ను బాషా పెళ్ళి చేసుకోవడం ఆమెకు ఏమాత్రం ఇష్టం లేదు. అమ్మ కావాలని ఏడుస్తున్న అన్వర్‌ని ఓదార్చింది. అమ్మలేని లోటును అత్తగా తీర్చింది. బాషా అన్వర్‌ని బాధించిన ప్రతిసారి ఆమె తరపున అండగా నిలబడింది. తల్లికోడి పిల్లలను రెక్కల చాటున కాపాడుకుంటున్నట్లు కాపాడుకుంది. బాషా అన్వర్‌కి అక్రమ సంబంధాలు అంటగట్టినప్పుడల్లా ఆమెకు మద్దతుగా నిలబడి బాషాతో గొడవ పెట్టుకొంది. తినడానికి తిండి లేకపోయిన ఆమె ఎప్పుడు ఆత్మగౌరవాన్ని కోల్పోలేదు. కొడుకు బాషాకి క్షయ వ్యాధి సోకినప్పుడు కొడుకు ఎంత చెడ్డవాడైన బాషా కోసం బాధపడింది. ప్రార్థన చేసింది, దర్గాలు తిరిగింది. కొడుకు బాషా ఆఖరి కోరికైన రఫీకి ఆస్తిని రాసివ్వమంటే అన్వర్, జిలానీకి అన్యాయం చేసినట్టేనని భావించి సంతకం చేయలేను అంది. అన్వర్ మాట ప్రకారం తన ఆస్తిని రఫీకి రాసి ఇస్తుంది. కుల్సుంబీ భర్త 'జినాత్'లను చూసి భయపడి మంచం పట్టి చనిపోయాడు. అప్పటి నుండి ఆమె ఆత్మగౌరవంతో బతుకు గడుపుతుంది. కోడలు అన్వర్ పొగాకు గ్రేడింగ్ పనులకు వెళ్ళడానికి ఇమాంతో మాట్లాడి అనుమతి ఇచ్చేలాగ చేసింది. కోడలు మెట్రిక్యులేషన్ చదువు కోవడానికి సహకారం అందించింది. వ్యవసాయ పనులు చేస్తున్న అన్వర్‌కి సహాయం చేస్తానంది. అన్వర్ వ్యవసాయం చేస్తుంటే ఇంటి పనులు, పిల్లల్ని బడికి పంపడం లాంటి పనులు చేసేది.

నజీర్‌ను, ఆదాంను ప్రేమగా చూచుకొనేది. నజీర్‌ను తమ ఇంటిలోనే భోజనం చేయమని చెప్పేది. అతనితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడేది. కోడలు అన్వర్ కష్టపడుతుంటే చూడలేకపోయేది. అన్వర్ నజీర్‌ను పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని భావించింది. కానీ అన్వర్ తన స్నేహితురాలు జమీలా విషయం అత్తకు తెలియజేసి నజీర్‌తో ఆమెకు పెళ్ళి చేయబోతున్నట్లు చెప్పింది. అందుకు కుల్సింబీ బాధపడింది. అన్వర్ చేసుకుంటే బాగుంటుందని అనుకున్నది. కానీ నజీర్, జమీలాల పెళ్ళి చేసిన అన్వర్ తన దృష్టిలో చాలా ఎదిగిపోయిందని చెప్పింది.

కుల్సుంబీ ఆరోగ్యం క్షీణించింది. ఆచారికి చూపిస్తే పనుల ఒత్తిడి వల్లనని చెప్పాడు. విశ్రాంతి తీసుకుంటే తగ్గిపోతుందని చెప్పాడు. పనులు చేయనివ్వకుండా అన్వరే అన్ని పనులు చేస్తుంటే "అన్వర్! నా తత్వం తెలుసుకదా, నాకు సపర్యలు చేయించుకోవడం ఇష్టం ఉండదని" (పు. 292) చెప్పింది. తిరుగుతూ తిరుగుతూ చనిపోవాలని నా కోరికని తెలియజేసింది. బాషాతో నీ పెళ్ళి ఆపలేకపోయాను క్షమించమని అన్వర్ అడిగింది. అత్త కుల్సుంబీ, అలాంటి మాటలు మాట్లాడకుండ విశ్రాంతి తీసుకో అని అన్వర్ దుప్పటి కప్పి నిద్రపుచ్చింది. కుల్సుంబీ ఆ నిద్రలోనే ప్రశాంతంగా కన్నుమూస్తుంది.

**జమీలా:**

అన్వర్‌కి చిన్ననాటి స్నేహితురాలు. పెద్ద కుటుంబంలో పుట్టింది. పేదరికంలో పెరిగింది.

చినగంజాంలో అన్వర్, నజీర్‌లతో చిన్నప్పుడు కలిసి ఆడుకుంది. 'నజీర్ అంటే ప్రేమ. నజీర్ నడవడి, అందం గురించి పదే పదే అన్వర్‌కి చెప్పేది. అప్పుడు అన్వర్ నజీర్‌ను నేను పెళ్ళి చేసుకోకపోతే నీవే పెళ్ళి చేసుకో' అని ఆట పట్టిస్తూండేది. కానీ తర్వాత జమీలాకి వేరే వ్యక్తితో వివాహమవుతుంది. అతడినుండి విడిపోతుంది.

అన్వర్ భర్త బాషా చనిపోయిన తర్వాత నజీర్ తనని పెళ్ళి చేసుకొమ్మని ఒత్తిడి తీసుకువచ్చాడు. అందుకు అన్వర్ వారం, పది రోజుల్లో నిర్ణయం చెబుతానని నజీర్‌తో చెప్పింది. ఆలోపు జమీలా కోసం అత్త కుల్సుంబీని తీసుకొని చీరాల వెళ్ళింది. జమీలా పని చేసే బీడి కంపెనీకి వెళ్ళింది. అన్వర్ జమీలాను 'పదకొండేళ్ళ వయసులో చూసింది.... ఆడాళ్ళ మధ్యలోంచి బతికున్న శవంలా ఉన్న ఓ స్త్రీ లేచి వీళ్ళ వైపు అనుమానంగా చూసింది జమీలా. "అసలిలా ఉంటుందని తను కలలో కూడా అనుకోలేదు. జీవం లేని గాజుగోళీల్లా కళ్ళు, పీక్కుపోయిన మొహం, అణువణువునా పేరుకుపోయిన దిగులూ... ఓపిక లేనట్లు, వూగిపోతున్న కట్టెలాంటి శరీరం"(పు.284) తో ఉన్న జమీలాను అన్వర్ చూసింది. తను చిన్ననాటి స్నేహితురాలిగా అన్వర్ పరిచయం చేసుకుంది. అన్వర్ని చూసి జమీలాతో పాటు వారి కుటుంబ సభ్యులూ సంతోషపడ్డారు.

జమీలాను వాళ్ళ కుటుంబాన్ని కూర్చోబెట్టుకొని నజీర్‌తో పెళ్ళి విషయం చెప్పింది. జమీలా వాళ్ళమ్మ సంతోషపడింది. "జమీలాకు నిఖా చేయించి నువ్వెంత ఉపకారం చేస్తున్నావో నీకు తెలీదు. గుండెల మీది కుంపటిని తీసేసినంత హాయిగా ఉంది" (పు.286) అని జమీలా తల్లి చెప్పింది. కానీ పెళ్ళికి జమీలా ఒప్పుకోలేదు. నజీర్‌కి నువ్వంటేనే ప్రాణం. నన్ను చేసుకోవడానికి ఇష్టపడడు అంది జమీలా. దాంతో అన్వర్ "ఓ పది రోజులు నా దగ్గరుండు. మొహం చూచుకున్నావా? కళాకాంతులు లేకుండా ఎలా అయిపోయిందో. నిన్నిలాగే నిఖాలో కూచోబెడ్తాననుకున్నావా? నాకు నువ్వెంత స్నేహితురాలివో నజీర్ కూడా అంతే. మొదట అతనికి నచ్చే విధంగా నిన్ను తయారు చేశాకే షాదీ" (పుట 286) అని చెప్పింది. జమీలా మొహమాటపడ్తున్నా నజీర్‌ను వివాహం చేసుకోవడానికి ఆమె ఇష్టపడుతున్నట్లు" ఆమె కళ్ళలో చొచ్చుకొచ్చిన వెలుతురు సాక్ష్యం చెప్తోంది. ఆమె చాలా సంతోషంగా ఉందని" (పుట 286) అర్ధమౌతుంది. ముగ్గురూ కలిసి త్రోవగుంటకి వచ్చారు. జమీలాకు అన్వర్ బలమైన ఆహారం పెడుతుంది. "సాయంత్రాలు నజీర్ వచ్చినపుడు ఓ గంట ముగ్గురూ కూర్చొని కబుర్లు చెప్పుకునేట్టు ఏర్పాటు చేసింది. చినగంజాంలోని ఇసుకతిన్నెలు... దొరువుల్లో రాళ్ళు విసిరి చేసిన అల్లరి... పున్నాగ పూల కోసం పరుగు.. మొగిలి పొత్తులు... ఇసుక రేణువుల మీద పడి మెరిసే ఎండ" (పు.287) వారి కబుర్లల్లో గుర్తుకు తెచ్చుకున్నారు.

అన్వర్ కొన్ని రోజుల తర్వాత నజీర్, జమీలా కుటుంబాలకు ఉత్తరము ద్వారా పెళ్ళి విషయం తెలియజేసి నిరాడంబరంగా ఇద్దరికీ పెళ్ళి జరిపించింది. ఈ నవలలో జమీలా ప్రధానపాత్ర అయిన అన్వర్ స్నేహితురాలిగా, ఆమెను వేధిస్తున్న సమస్యకు 'నజీర్ పెళ్ళి' విషయాన్ని పరిష్కరించుకోవడానికి మరియు కష్టాల్లో ఉన్న స్నేహితురాలిని ఆదుకున్న స్నేహశీలి, త్యాగమూర్తిగా తీర్చిదిద్దడంలో జమీలా పాత్ర రచయితకు ఎంతో తోడ్పాటునిచ్చింది.

**<u>రఫీ:</u>**

అన్వర్ అక్క సలీమున్, బాషాలకు పుట్టినవాడు. రఫీ పెంపకం కోసమే పసి మొగ్గ అన్వర్‌ను బాషా వివాహం చేసుకొంటాడు. కానీ రఫీ బాషా మాటలు విని అన్వర్, నానమ్మ కుల్సుంబీలపై ద్వేషం పెంచుకున్నాడు. అన్వర్ రఫీని ఎంత ప్రేమగా చూచుకొన్న ఆమెను ద్వేషించేవాడు. ఆమెను సవతి తల్లిగానే చూచేవాడు. అన్వర్‌కి ఇష్టం లేకపోయినా జుబేదాను ఇచ్చి పెళ్ళి చేయమని బలవంతం చేస్తాడు. పెళ్ళి తర్వాత జుబేదా కావాలని అన్వర్‌తో గొడవ

పెట్టుకుంటే మందలించేవాడు కాదు. పొలంతో పాటు ఇల్లు తన ఆస్తిగా రాయించుకొన్న విషయాన్ని గుర్తు చేసి ఇంట్లోంచి బయటకు వెళ్ళిపొమ్మంటాడు. అయితే అన్వర్ రఫీ పేరుమీద ఉన్న పొలాన్ని వారికే అప్పజెప్పి, వాళ్ళ దగ్గర నుండి మరల ఆ పొలాన్ని కౌలుకు తీసుకొంటుంది. తర్వాత ఆదాం సన్మానంలో వేదిక మీద శాలువా కప్పించుకున్నందుకు కుటుంబాన్ని బజారుకీడుస్తుందని జుబేదా అన్వర్‌ని తిట్టిపోసింది. దానికి రఫీ "నా చిన్నప్పుడు పనికెళ్ళిందంటే అర్థముంది. ఇప్పుడు నేను ఉద్యోగం చేస్తుండగా, ఆమెకింత ముద్ద పెట్టలేనా? ఇదంతా నాకు చెడ్డపేరు తీసుకురావాలనే కదా, సవతి తల్లిని రఫీ చూడటం లేదనీ, ఇంత తిండి కూడా పెట్టటం లేదనీ పదిమంది అనుకోవాలనేగా ఆమె కుట్ర? నేనీ ఇంట్లో ఆమెనీ, వాణ్ణీ ఉండొద్దన్నానా? సవత్తల్లీ, సవత్తమ్ముడూ వంటగదిలో పడరాని పాట్లు పడ్తున్నా పట్టించుకోని దుర్మార్గుడు అంటూ నన్ను విలన్‌గా చిత్రించే ప్రయత్నం ఇదంతా. సభలూ, సమావేశాలకు వెళ్లొద్దని నేను కట్టడి చేస్తే వింటుందా? అయినా వయసొచ్చింది కదా... ఆ యింగితం ఆమెకుండాలి" (పు.337) అని వంతపాడుతాడు.

ఆ సమయంలో జిలానీ అక్కడికి వచ్చాడు. నీ ఉద్యోగం నీవు సంపాదించుకున్నది కాదు. అమ్మ రాఘవయ్య మాష్టార్ని బతిమిలాడి నీకు ఉద్యోగం ఇప్పించిందని జిలానీ చెప్పాడు. ఇంటి వసారాలో పిల్లలకి ట్యూషన్లు చెప్పవద్దని మొగుడు పెళ్ళాలు వారించారు. అన్వర్ ఐ.యల్.డి.టి. కంపెనీలో సూపర్‌వైజర్‌గా, వ్యవసాయం చేసి సంపాదించే డబ్బు చూసి అందరం కలిసి ఉందామని మరోసారి రఫీ, జుబేదా ముందుకు వచ్చారు. కానీ జిలానీ "అప్పుడు తరిమేసి, ఇప్పుడు సిగ్గులేకుండా అమ్మను కలిసి ఉండమంటున్నది ఆమె మీద గౌరవంతో కాదనీ, ఆమె సంపాదన మీద వ్యామోహంతోనని వూళ్లో పసిపిల్లాడినడిగినా చెప్తాడు. మీరు, మేమూ కల్సి ఉండడం ఎన్నటికీ జరగదు" (పు. 340) అని కరాఖండిగా చెప్పాడు. భార్య రెచ్చగొట్టే మాటలకు రఫీ మరింతగా రెచ్చిపోతాడు. అన్నదమ్ములు ఇద్దరు పోట్లాట పెట్టుకుంటుంటే ఆదాం, నజీర్ వచ్చి సర్ది చెబుతారు. అన్వర్ అదే సమయంలో జిలానీని అన్నతో గొడవ పెట్టుకోవద్దని "పోన్లేరా వాడి మనస్తత్వం అలాంటిది. ఏం చేస్తాం చెప్పు... వాడికన్నీ మీ నాన్న బుద్ధులే వచ్చాయి. నా ప్రేమతో, అనురాగంతో వాణ్ణి మంచివాడిగా తీర్చిదిద్దాలని శతవిధాలా ప్రయత్నించాను. కాని ఓడిపోయాను బాబూ... వాడిమీద నాన్న ప్రభావమే బలంగా ఉంది. (పు.340-341) అని చెబుతుంది. ఇంకా "వాడు అర్థాంతరంగా చదువాపేసి, తొందరపడి నిఖా చేసుకున్నాడు. పిల్లల్ని వరసగా కంటున్నాడే తప్ప ఆపరేషన్‌కి సుముఖంగా లేడాయె. ఉద్యోగమే లేకపోతే వాడూ, అభం, శుభం తెలీని వాడు ఏలా బతుకుతారు.... అలా కరుకుగా మాట్లాడటం వాడి స్వభావం... అంతే" (పు.349) నని అన్వర్ రఫీ ప్రవర్తనను, స్వభావాన్ని జిలానీకి తెలియజేసింది.

రఫీ మతం, సాంప్రదాయం పేరుతో కుటుంబ నియంత్రణ పాటించక మొత్తం ఏడుగురు సంతానం... మగపిల్లాడు కావాలనే కోరికతో సగం.... ఆపరేషన్ చేయించుకోవడం మతానికి వ్యతిరేకమే అభిప్రాయంతో సగం.... పిల్లల్ని కంటూ పోయారు. మొదట నలుగురూ ఆడపిల్లలు పుట్టారు. ఐదో కాన్పులో మగపిల్లాడే కావాలని మిన్నత్‌లు కోరితే ఆడపిల్లలు కవల పిల్లలు పుట్టారు" (పు.349). మగపిల్లాడి కోసం ప్రాకులాడడం. అందుకు మతాన్ని అడ్డుపెట్టుకోవడం వంటివి సర్వసాధారణంగా మన సమాజంలో కన్పించే అంశాలు. ఈ అంశాలనే రచయిత నవలలో శక్తివంతంగా తీర్చిదిద్దారు.

**జిలానీ:**

అన్వర్, బాషాల కొడుకు. తల్లి ఆశయాలకు అనుగుణంగా చదువుకొని బ్యాంక్‌లో ఉద్యోగిగా హైదరాబాద్‌లో స్థిరపడతాడు. జిలానీ బాగా చదువు కోవాలని రాఘవయ్య పంతులుచే

అన్వర్ అక్షరాభ్యాసం చేయిస్తుంది. అప్పటి నుండి జిలానీ చదువును నిర్లక్ష్యం చేయకుండా పట్టుదలతో చదువుకున్నాడు. అదే సమయంలో తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ ఇంటిపనులు కూడా చూసుకొనేవాడు. కాలేజీలో చేరి, చరిత్ర పాఠాలు విని రెచ్చగొట్టిన వారికి, తోటి స్నేహితుడు ముకర్రంకి చరిత్రని ఎలా చూడాలో, ఎలా అర్థం చేసుకోవాలో తెలియజేస్తాడు. చరిత్రను సెన్సారింగ్ చేయాలని ముకర్రం అంటే అందుకు జిలాని "నీ ఆలోచన సరికాదు ముకర్రం. హిస్టరీ అనేది జరిగిపోయిన సంఘటనల్ని క్రొనోలాజికల్‌గా రికార్డు చేయడం... గజనీ మహమూద్ హిందూ మతగ్రంథాన్ని అవమానించాడనేది వాస్తవం. అప్పటి సాంఘిక, రాజకీయ పరిస్థితులు వేరు. ఆ సంఘటనని ప్రస్తుతానికి అన్వయించి... ఒక ముస్లిం చేసిన తప్పుకి ఇప్పటి ముస్లింలందరూ... శిక్ష అనుభవించాలనే వాసులాంటి వ్యక్తుల ఆలోచనా ధోరణి మారాలి" (పు. 316) అని ముకర్రంకి చరిత్రను ఎలా చూడాలో, అర్థం చేసుకోవాలో తెలియజేస్తాడు. మనం స్వల్ప విషయాలకు భయపడుతున్నాం. వాసు మనల్ని ఈ దేశవాసులం కాదు. దేశద్రోహులమని పాకిస్తాన్‌కి వెళ్ళిపొమ్మని అన్నాడు. అది వాసు వ్యక్తిగత అభిప్రాయం. వాసు హిందూ ప్రజలందరికి రిప్రజెంటేటివ్ కాదు. మనం ఎందుకు పాకిస్తాన్ వెళ్ళాలి. అది నా శత్రుదేశం. "ఇప్పటికైనా మత విద్వేషాలకు మూలకారణం ఏమిటో అర్థమైందా? నీ లాంటి ఆవేశపరులు – వాసులాంటి అజ్ఞానులు. మనది లౌకిక రాజ్యం.... ఆవేశం తగ్గించుకొని ఆలోచిస్తే ఇందులో సమస్యే లేదని" (పు. 318) జిలానీ ముకర్రంకి తెలియజేస్తాడు.

జిలానీ మామయ్య రహ్మతుల్లా యుద్ధంలో వీరమరణం పొందాడు. అన్వర్ అన్న రహ్మతుల్లా కోసం బాధపడుతున్నప్పుడు "దేశం కోసం ప్రాణాలర్పించే అవకాశం... అంతగొప్ప అదృష్టం అందరికీ రాదు. మా.... రహ్మతుల్లా మామూ అమరుడైనాడు. లాల్ బహదూర్ శాస్త్రి జై జవాన్ – జైకిసాన్ అన్నారు కదమ్మా. ఇద్దరూ దేశానికి వెన్నెముక లాంటి వాళ్ళే. 'నా మేనమామ జవాన్ – నా కన్నతల్లి కిసాన్' ఇంతకన్నా అదృష్టం ఏమంటుంది మా" (పు. 319–320) అని దేశం పట్ల తన ఇష్టాన్ని, భక్తిని, గౌరవాన్ని చాటుకున్నాడు జిలానీ.

రఫీ, జుబేదాలు కలిసి అన్వర్‌తో గొడవ పెట్టుకుంటున్న సమయంలో జుబేదా, రఫీల మనస్సు తత్వాన్ని అర్థం చేసుకొని కష్టాల్లో ఉన్నప్పుడు వదిలివేసి, ఇప్పుడు కలిసిపోదామంటే కుదరదని మేము మీతో ఎప్పటికీ కలవమని ఖరాకండిగా రఫీకి చెప్పాడు. ఆ సమయంలో జిలానీ ఒక స్పష్టమైన వైఖరితో ప్రవర్తించాడు. తల్లి, ఆదాం, నజీర్‌లపై గౌరవంతో అన్నతో గొడవపడకుండా వెనుకకు తగ్గాడు. చదువు పూర్తయిన తర్వాత కష్టపడి బ్యాంకులో పి.ఒ.గా ఉద్యోగం సంపాదించాడు. తల్లిని వ్యవసాయం వదిలి పట్నం రమ్మన్నాడు. ఇక నీవు కష్టపడ వద్దని చెప్పాడు. కానీ ఆమె పల్లెను వ్యవసాయాన్ని, స్కూలును వదిలి ఎక్కడికి రాలేను అని చెబుతుంది. కొన్ని రోజులు ఆగితే నేనే స్కూలుకి కావాల్సిన ఏర్పాట్లు చేస్తానని చెబుతాడు. అన్వర్‌ను తనతోపాటు రావాలని కోరతాడు. ఎందుకంటే "మా! నాకు నువ్వు నీకు నేనూ తప్ప మనకెవరున్నారని?.... నన్ను హైద్రాబాద్ లాంటి నగరంలో ఒంటరిగా వదిలేస్తావా.... నా బాగోగులు ఎవరు చూసుకుంటారు. నా తిండి తిప్పలు ఎవరు చూసుకుంటారు... నువ్వు మంచి అమ్మవు. అలా నా మానాన నన్నొదిలి ఉండవద్దు" (పు. 343) అని మారాం చేస్తాడు.

అన్వర్ జిలానీ పెళ్ళి రిక్షా మస్తాన్ కూతురు రమీజాతో నిశ్చయం చేస్తుంది. జిలానీకి కూడా రమీజా అంటే ఇష్టమే. చిన్నప్పటినుండి వారిద్దరూ కలిసిమెలిసి పెరిగారు. అంతేగాక అన్వర్ వద్ద ఆ అమ్మాయికి చనువు వుంది. ఆ అమ్మాయికి ఏ ఇబ్బంది వచ్చినా అన్వర్‌కే మొదట చెప్పుకుంటుంది. (1985లో) జిలానీ పెళ్ళి రమీజాతో నిరాడంబరంగా జరిపించింది. పెళ్ళయిన మూడో సంవత్సరము కుల్సుం జన్మిస్తుంది. పాప పుట్టిన రెండో సంవత్సరానికి బాబు పుట్టాడు. తర్వాత జిలానీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నాడు.

హైదరాబాదులో సొంత ఇల్లు కొనుక్కొని స్థిరపడ్డాడు.

అన్వర్ అప్పుడప్పుడు జిలానీ వద్దకు వెళ్ళి వస్తూ వుంది. ఒకసారి కర్ఫ్యూ అని తెలియక హైదరాబాదు వెళుతుంది. శంకర్ అనే పోలీసు సహాయంతో ఇల్లు చేరుకొంటుంది. మత ఘర్షణలు రాజకీయ నాయకులు, భూ ఆక్రమణదారులు మొదలైన వారు వ్యక్తిగత ప్రయోజనాల కొరకే చేస్తారని అన్వర్‌కి జిలానీ చెప్పాడు. మత ఘర్షణల్లో మతం పాత్ర చాలా స్వల్పమని ఆమెకు తెలియజేస్తాడు. తన కూతురు కుల్సుంను నానమ్మ కుల్సుంబీ, అమ్మ అన్వర్ ఆలోచనలకు అనుగుణం తీర్చిదిద్దాలని తాపత్రయ పడుతుంటాడు. అందుకే తనకూతుర్ని, కొడుకునూ పల్లెటూరి స్థితిగతులను అధ్యయనం చేయడానికి త్రోవగుంటకు తీసుకు వచ్చేవాడు. అక్కడ అన్వర్ తన మనుమరాలు లక్ష్యం తెలుసుకొని ఆనందిస్తుంది.

**<u>వెంకారెడ్డి:</u>**

త్రోవగుంటలో వ్యవసాయదారుడు. కుల్సుంబీ ఇనాం పొలం కౌలుకి తీసుకొని వ్యవసాయం చేసేవాడు. వచ్చిన లాభంతో కొంత పొలాన్ని సొంతంగా కొన్నాడు. సాటి మనిషికి సహాయం చేసే మంచి గుణం గల వ్యక్తి. అన్వర్ని కన్నకూతురిగా చూచుకొన్నాడు. ఐదు సంవత్సరాలు వ్యవసాయం చేయడానికి ముందే కౌలు ఒప్పందం చేసుకున్నప్పటికీ అన్వర్ మీద జాలితో "నాకు ఆడకూతుర్లు లేరు. నీకు తెల్సుగా. ఓ రెండెకరాల పొలం తగ్గినంత మాత్రాన నా కొంపలేం కూలిపోవు... నీకు సాయంగా ఎవరైనా మగాల్లు ఉన్నారా? ఎగసాయం సేయటంలో నాకు తెల్వనిది లేదనుకో. అదంతా సెప్తాను... నేను ఏం పంట ఏత్తానో నువ్వూ అదే పంట ఏయి. నీకు సవుకర్యంగా ఉంటది. ఇత్తనాలు కొనాలన్నా, ఎరువులు కొనాలన్నా నీ పొలానికి కూడా కలిపి కొంటా. నాకూ సులువుగా ఉంటది" (పు. 238) అని కొండంత ధైర్యాన్నిచ్చాడు.

ఊర్లో వెంకారెడ్డి అన్వర్‌కి అక్రమ సంబంధం అంటగట్టారు. అయినా ఇరువురు పట్టించుకోలేదు. చివరకు ఊర్లో జనాల మాటలకు వెంకారెడ్డి పెళ్ళానికి అనుమానమొచ్చి ఆ తురకోళ్ళ పిల్లను రావద్దని చెప్పినట్లుగా అన్వర్‌కి చెబుతాడు. "నాకు ఆడకూతుర్లు లేరుగా. నిన్నే నా బిడ్డనుకుంటా" (పు.253) అని మనసారా వెంకారెడ్డి చెబుతుంటాడు. పంట చేతికి వచ్చిన తర్వాత తిండికి గింజలు ఉంచుకొని మిగిలినవి నాకు అప్పగిస్తే అమ్మేసి డబ్బు తెచ్చిస్తానని చెప్పాడు. మరి బాకీ వుందిగా... జమ చేసుకోరా అంటే "పిచ్చమ్మాయిలా వున్నావే. వచ్చిన డబ్బు నాకు జమకడ్తే మరలా పంట వేయడానికి పెట్టుబడి కావద్దూ... ఇలాగైతే నువ్వెలా నిలదొక్కుకుంటావు? రెండు మూడేళ్ళు నా బాకీ ఎవ్వారం పక్కన బెట్టు నేనేం వడ్డీ అడగన్లే అని పెద్దగా నవ్వాడు" (పు.259) కొండారెడ్డి అన్వర్‌ని తన కూతురిలా భావించి సహాయం చేస్తానన్నాడు. అందుకు అన్వర్ మీరు చేస్తున్న సాయానికి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలీటం లేదంటే "అప్పుడే వద్దు బూబమ్మా. నిన్ను నా అంత రైతుని చేశాక అప్పుడు చెప్పు" (పు.260) అని అన్వర్‌ని సాగనంపుతాడు. కొండారెడ్డి వారి భూమి కౌలు చెల్లించేవాడు. కానీ అది ఆర్థిక లావాదేవీల వరకే పరిమితమైనది కాదు. దానికి అతీతమైనది. మనిషికి మనిషి చేదోడు వాదోడుగా నిలబడే వాడిలా ఈ నవలలో కొండారెడ్డి పాత్రను చిత్రీకరించారు.

**<u>ఆదెమ్మ:</u>**

ఈ నవలలో అన్వర్‌కు సహాయం చేసే పాత్ర. మాల కులానికి చెందినది. పొగాకు గ్రేడింగ్ పనిలో సూపర్‌వైజర్ లైంగిక వేధింపుల నుండి అన్వర్ని రక్షించింది. వ్యవసాయ పనుల్లో తమ సొంత పొలంలో పని చేసినట్లు చేసింది, చేయించింది. పొగాకు గ్రేడింగ్ పనిలో అన్వర్ పక్కనే ఆదెమ్మ కూర్చొనేది. "ముప్పయేళ్ల వయసుంటుంది. కాయకష్టం చేసేదానికి గుర్తుగా శరీరం నల్లగా, బలంగా ఉంటుంది. మనిషి మొరటుగా కన్పించడమే కాదు మాట

కూడా కరుగ్గానే ఉంటుంది" (పు.195) అయిన ఆదెమ్మ కలుపుగోలుతనంతో తన ప్రక్కవాళ్ళతో మాట్లాడుతూ పని చేస్తూ ఉంటుంది. ప్రక్కన కూర్చొన్న "అన్వర్ ఎంత ముభావంగా ఉ ండటానికి ప్రయత్నించినా పట్టువదలకుండా పలకరిస్తూనే ఉంది"(పు.195). అన్వర్‌కి వున్న భయాన్ని తీసివేయడానికి ప్రయత్నిస్తూనే ఉండేది.

మాట్లాడుకుంటూ పనిచేస్తే శ్రమ తెలియదని చెప్పింది. "మాంసి వయసులో ఉ న్నావు. మైనం బొమ్మ మాదిరి ముద్దుగా ఉన్నావు. మన సూపరైసరు పుల్లారావుతో కూసింత జాగరతగా ఉండు. ఆడు నీ వైపు అదోలా సూట్టం నేను సాలామార్లు గమనించా"(పు.196) నని అన్వర్‌ని అప్రమత్తం చేస్తుంది. అన్వర్ మాల పల్లెమీదగా పొగాకు కంపెనీకి వెళ్ళాలి. అన్వర్ కోసం ఆదెమ్మ ఎదురుచూసి ఆమె వచ్చిన తర్వాతే ఇద్దరూ కలిసి వెళ్ళేవారు. మాటతేడా వస్తే చాలు పందెపు పుంజులా పోట్లాడేది. కోపం వస్తే ఆదెమ్మ నోటి నుండి బూతులు ప్రవాహంలా వచ్చేవి. ఆమె నోట్లో నోరు పెట్టడానికి కంపెనీలో అందరూ భయపడేవారు. కానీ అన్వర్‌కి ఆమె స్నేహం కొండంత ధైర్యాన్నిచ్చింది. "ఆదెమ్మ మాట కరుకైనా మనసు వెన్న అని అన్వర్‌కి తొందరగానే అర్థమైంది" (పు.196) ముస్లీంలలో మారు మనువులుండవా అని అడిగి "మావోళ్ళలో అయితే మొగుడొదిలేసినా అర్థాంతరంగా సచ్చిపోయినా ఆ పిల్లకు మారు మనువు శానా సులభమని" (పు.197) అన్వర్‌తో చెప్పింది. బహుభార్యత్వం గురించి అడిగి "మాలో అలా గనుక సేస్తే ఆడి కాళ్లు ఇరగ్గొట్టి పొయ్యిలో ఎడ్తాం" (పు. )అని చెప్పింది. వయస్సులో ఉన్నావు మారు మనువు చేసుకొమ్మని చెప్పింది". ఇంత సిన్న వయస్సులో నీకంత వయిరాగ్యం ఎలా అబ్బిందో? నిన్ను ఆ దేముడే కాపాడాల" (పు.199)ని తమలో మొగుడు చచ్చినా, వదిలి పెట్టినా మరో పెళ్ళి చేసుకోవడం సులభమని చెప్పింది. మాలో బహుభార్యత్వం ఉండదని వుంటే మేము ఒప్పుకోమని చెప్పింది.

అన్వర్ తినుబండారాల్ని కంపెనీలో అమ్మేది. కొంత మంది అప్పు తీసుకొనేవారు. ఆ "బాకీలు వసూలు చేసే బాధ్యత ఆదెమ్మ నెత్తిన వేసుకుంది..... ఎవరెంత బాకీ పడ్డారో ఆదెమ్మ చెవిన వేస్తే చాలు.... బాకీ వసూలు చేసి అన్వర్ చేతుల్లో పోస్తుంది" (పు.203). అన్వర్ చేసిన వంటలు, తినుబండారాలు తిని అన్వర్ చేతిలో అమృతం ఉందని పొగుడుతుంది. అత్త కుల్సుంబీని అన్వర్ మెచ్చుకుంటే ఆదెమ్మ తన అత్త గురించి "నా అత్తా ఉంది రాచ్చసి. నా మొగుడితో సంసారం కూడా సేయనీదు. గుడిసెలో మాతో పాటే లోపల పడుకొంటుంది. దాని సిగ్గొయ్య.... అందంటే మొగుడు సచ్చి ముండమోసిందాయె నాకున్నాడుగా... దాంది కోడి నిదర..... ఏం ఎక్కడ సుకపడిపోతామోనని రాతిరంతా కాపలా కాస్తుంది ముసల్ది" (పు.204) అని ఆడిపోసుకుంటుంది.

పుల్లారావు లైంగిక వేధింపులు అన్వర్ ఆదెమ్మ చెవులో వేసింది. "ఆ పుల్లారావుగాడు ఏమనుకుంటున్నాడు? ఇది పొగక్కంపెనీ అనుకుంటున్నాడా... లేక సానులుండే డౌన్సిట్ కొంపనుకుంటున్నాడా" (పు.208) అని తిట్లదండకం అందుకుంది. దాంతో పుల్లారావు పరారు అయ్యాడు. కానీ మరల పొగాకు గ్రేడింగ్ అన్వర్ సరిగ చేయడం లేదని స్టోర్ రూంలోకి రమ్మన్నాడు. ఆదెమ్మ అన్వర్ రాదని, పుల్లారావునే ఇక్కడికి రమ్మనమంది. వాడు వచ్చి సరిగా గ్రేడింగ్ అన్వర్ చేయడం లేదంటే, గ్రేడింగ్ సరిగా చేయకపోతే ఇక్కడే చూపించమని అడిగింది. "అన్వర్ చేసిన పనిలో ఏం తప్పుందో... పొగాకు బేళ్ళమద్దిన అది ఒంటరిగా ఉన్నప్పుడు సూపించేదేమిటో ఇక్కడ అందరి మద్దిన సూచించరా. అసలు నీకు గేడింగ్ గూర్చి తెలుసా... ఏ ఆడది లొంగుతుందా అని సొంగకార్చుకుంటూ తిరగడం తప్ప నీకు పన్లో గురెక్కడ ఏడ్సింది" (పు.210) అని కడిగి పారేసింది. అంతటితో పుల్లారావు అక్కడ నుండి జారుకున్నాడు.

తర్వాత పిల్లల 'ఖత్నా' కోసం పెళ్ళిలో అన్వర్ తల్లి ఇచ్చిన నగను అమ్మడానికి తోడు కోసం ఆదెమ్మ ఇంటికి వెళ్ళింది. ఆదెమ్మ అన్వర్‌ను చూసి "రా అన్వరా... మాంచి టయానికొచ్చావు. మాంసం కూర వండుతున్నా... గొడ్డుమాంసం కాదు. పొట్టేలు మాంసం.... యిసేసమా... పింగా. నీబావ మందేస్కొచ్చాడు. మందులోకి ముక్క లేకపోతే ముద్ద దిగదుగా..... నా రెక్కల కష్టమంతా ఈడి కల్లుకే సరిపోతుంది. ఈడి జిమ్మడి పోను" (పు.222) అని మొగుడ్ని ప్రేమగా తిట్టింది. వరన్నం వండాను తినమంది. వచ్చిన పని తెలుసుకొని ఇద్దరు కలిసి ఒంగోలు వెళ్ళి నగను అమ్మి డబ్బులు తీసుకువచ్చారు.

వ్యవసాయం చేయడానికి అన్వర్ ఆదెమ్మ సహాయం అడిగింది. దానికి ఆదెమ్మ "మన పొలంలో మనమే సాగు సేద్దామని....ఇంటానికే యింత కమ్మగా ఉంటే, సేస్తుంటే యింకెంత బావుంటుందో. ఇన్నాళ్ళు ఏరేవోల్ల పొలంలో కూలి సేసి సేసి యిసుగొచ్చింది. .... యిగ సుట్టబెడ్తా" (పు.246)టెంతో ఉత్సాహంగా అని చెప్పింది. పది మంది మంచి కూలీలు నా చేతి కింద ఉన్నారు. వాళ్ళ చేత పని చేయించే బాధ్యత నాదేనని, "అలాగని నేను ఉట్టినే కూసుంటాననుకోను. మన పొలం కదా. సెమటోడ్చి సేద్దిగం సేస్తా" (పు.247) నని అన్వర్‌కి మాటిచ్చింది. పొలం పనులు మొదలు పెట్టి రోజంతా పొలంలో పని చేస్తున్న అన్వర్ ఎండకు తెల్లటి ఆమె శరీరం కమిలిపోయినట్లు మారిపోయింది. మల్లెపూవులా తెల్లగా వుండే అన్వర్ రంగు మారడం చూసి "ఇసుమంటి సాకిరీ అంతా మా అసుంటోళ్లకి గానీ నీలాంటోళ్లకు కాదు" (పు.247) అని స్నేహితురాలికి అండగా నిలబడింది.

అన్వర్ వ్యవసాయం చేయడానికి పూర్తి సహాయం సహకారం అందజేసింది. అందుకే అన్వర్ అత్త కుల్సుంబీ, ఆదాం, నజీర్, కొండారెడ్డిలతో ఆదెమ్మను ఆత్మీయులగా గుర్తు చేసుకొనేలా ఈ పాత్ర తీర్చిదిద్దబడింది. దళితుల ఆహార అలవాట్లు, భాష, మనష్యుల యందు చూపించే అమాయకమైన ఆత్మీయత, శ్రమైక జీవనం ఆదెమ్మ పాత్రతో రచయిత సజీవంగా ఆవిష్కరించాడు.

**ఆదాం:**

ప్రధాన పాత్రకు పూర్తి సహాయ సహకారాలు అందించిన పాత్ర. మత మార్పిడితో అంటరానితనానికి దూరం కావచ్చని ముస్లీం మతం పుచ్చుకొన్నారు దూదేకులు. ఆదాం ముస్లీంలలో లద్దాఫ్ / దూదేకుల కులానికి చెందినవాడుగా ఆదాం ముస్లీంలుగా చూడబడుతున్న వారిలో ఒకడు. ఆ అవమానాలకు ఉర్దూ భాష , ఇస్లాం ధర్మం తెలియకపోవడమే కారణమని అనుకుంటాడు. తర్వాత దూదేకులు ఎవరికి తక్కువ కాదని వారిలో వున్న ఆత్మన్యూనత భావాన్ని పోగొట్టడానికి అన్వర్ సహాయం తీసుకున్నాడు. చివరకు నూర్ భాషీయుల పోరాట ఫలితంగా ప్రభుత్వం రిజర్వేషన్ కల్పిస్తుంది. దూదేకుల అభ్యున్నతి కొరకు పెళ్ళి చేసుకోకుండా అకుంఠిత దీక్షతో పని చేస్తాడు. అదే సమయంలో అన్వర్ చేసే ప్రతి పనిలో ఆదాం లేకుండా చేసేది కాదు. ఈ విధం గా నవలలో అన్వర్ ఆదాంల మధ్య సోదరభావం వెల్లివిరిసింది. దానికి కృతజ్ఞతగా ఆదాం తన సన్మానసభలో శాలువాతో ఆమెను సత్కరించుకొంటాడు.

ఆదాంను బాషా రంజాన్ పండుగ రోజు ఇంటికి భోజనానికి తీసుకువచ్చాడు. బాషా ఆదాంను అన్వర్‌కి పరిచయం చేస్తూ "దూదేకుల సాయెబు మదార్ కొడుకు – ఆదాం... భోజనానికి పిల్చుకొచ్చాను.... వీడికి భాష రాదు. లద్దాఫ్‌లు కదా" (పు.69) అని బాషా ఎగతాళి మిళితమైన స్వరంతో చెప్పాడు. ఆదాం బాధను అన్వర్ గమనించింది. అతనితో సహోదర భావంతో ప్రేమగా మాట్లాడింది. తరచు వస్తూ ఉండు ఉర్దూ, అరబ్బీ నేర్పుతానని చెప్పింది. దాంతో "నీ అంత ప్రేమగా, ఆదరంగా ఏముసల్మానూ మాట్లాడలేదక్కా. మమ్మల్ని అంటరానివాళ్లుగా కాక సమానంగా చూస్తారన్న కోరికతో, నమ్మకంతో మాతాత ఇస్లాం

మతాన్ని స్వీకరించాడు. అయినా మమ్మల్ని... తక్కువ కులం వాళ్ళు లాగా చూస్తారు. మా ఎదురుగానే పింజారీ వెధవలని ఎగతాళి చేస్తారు" (పు.71) అని అన్వర్‌తో చెప్పి ఆదాం చాల బాధ పడ్డాడు. "తాత మాదిగోళ్ల కులం. చెప్పులు కుట్టేవాడు. బాబా నాగూర్‌వలీ బోధనలు విని ఆ రోజుల్లో చాలా మంది మాలామాదిగోళ్ళు ఇతర నిమ్నకులాల వాళ్ళు ఇస్లాం మతం స్వీకరించారట" (పు.72) అని తన పుట్టు పూర్వోత్తరాలు అన్వర్‌కి చెప్పి అన్వర్ కుటుంబంలో ఒక్కడిగా కలిసిపోయాడు.

ఆదాం మరోసారి అన్వర్ని కల్సినప్పుడు బాషా, సైదాబీల సంబంధం గురించి చెప్పాడు. సైదాబీ తన అక్కేనని కూడ చెప్పాడు. అందుకే ఆదాం ఇంటికి వచ్చినా బాషా ఏమి అనేవాడు కాదని అన్వర్ గ్రహించింది. అన్వర్ ఇలాగే బాషాను నిర్లక్ష్యం చేస్తే, వారిద్దరు పెళ్లి కూడా చేసుకుంటారని భయంగా ఉందని ఆదాం చెప్పాడు. ఆ మాటలు విని పడిపోయిన అన్వర్ దగ్గరకు ఆచారిని పిలుసుకువచ్చాడు. ఆచారి అన్వర్‌ని పరీక్ష చేసి తల్లి కాబోతున్నదని చెప్పాడు. ఆదాంకు అన్వర్ ఉర్దూ, అరబ్బీ నేర్పించింది. హిందూ మత ప్రభావంలో దూదేకులు ఉంటారు. అందుకే ముస్లింలు దూదేకులను దగ్గరకు రానివ్వరు. కనుక మీవాళ్లను నీవే మార్చుకోమని ఆదాంకి ఇస్లాం గురించి, ఆ ధర్మం గురించి బోధించింది. దూదేకుల సంస్కరణ కోసం ఆదాం సమావేశం ఏర్పాటు చేస్తాడు. కానీ ఎవరూ హాజరు కారు. అదే విషయాన్ని అన్వర్‌కి చెబుతాడు. మళ్లీ ప్రయత్నించమని సలహా ఇస్తుంది. కుర్రోళ్ళను ఆటలని ఒక జట్టుగా చేసి పుజూ నమాజ్ గూర్చి తెలియజేస్తాడు. కొన్ని రోజులకు ఆ కుర్రోళ్ళు ఇంట్లో తమ వాళ్ళకు వుజూ నమాజ్ గూర్చి చెప్పేస్థాయికి ఎదుగుతారు. ఆదాం కృషిని అందరూ గమనించి మెచ్చుకుంటారు. దూదేకుల అభివృద్ధికి రిజర్వేషన్లు కోసం ప్రయత్నించాలని అందరూ అనుకుంటారు. ఆదాంను నాయకుడిగా ఎన్నుకుంటారు. దాంతో ఆదాం ఆ ఊర్లో ప్రముఖమైన వాడిగా ఎదిగిపోతాడు.

ముస్లిం పెద్దలు ఆదాంను పిలిచి మెచ్చుకుంటారు. శుక్రవారం నమాజ్‌కు దూదేకుల వారిని తప్పక వెళ్ళేలా ముస్లింలతో పాటు కలిసి నిలబడేలా అందర్ని ఒప్పించాడు ఆదాం. కానీ "ముస్లింలు తమను సమానంగా చూస్తారన్న నమ్మకం ఏమిటి?.....వాళ్లలో అవిద్య, అజ్ఞానం పోనంతకాలం తమను అంటరాని వాళ్లుగానే చూస్తారు" (పు.123) కనుక వాళ్ల ఆర్థిక పరిస్థితిని చక్కబడే మార్గాలు కనుక్కోవాలనుకున్నాడు. దూదేకులలో ఉన్న గొప్ప కళాకారులను గుర్తించి సత్కరిస్తే వారి ఆత్మగౌరవం ఇనుమడిస్తుందని అనుకొని, షేక్ చిన మౌలానా, నాజర్‌ను కల్సుకొన్నాడు. వారి సహాయం అర్థించాడు. త్రోవగుంటలో నాజర్‌తో బుర్రకథ చెప్పించాడు.

ఆదాం ఊరూరు తిరిగి దూదేకులను చైతన్యం చేశాడు. ప్రాంతాలను బట్టి దూదేకులలో తేడాలను గుర్తించాడు. దూదేకులుపై హిందూ మత ప్రభావం చాలా ఎక్కువగా ఉందని గ్రహించాడు. అందుకే వారి పద్ధతులను మార్చుకొమ్మని వారిపై ఒత్తిడి తీసుకురాలేదు. దూదేకులందరు ఒక ప్రత్యేక సమూహంగా అన్పించింది. 1940లో 'మద్రాస్ ప్రొవిన్షియల్ నూర్‌బాషా అసోసియేషన్'ను స్థాపించిన 'అబ్దుల్ ఖాదర్' ఆదాంకు ఆదర్శ వ్యక్తి. నూర్‌బాషీయులనే పదం గౌరవమైన పదంగా అన్పించింది. బయట ఆదాం ఎంత పేరు సంపాదించినా అక్క సైదాబీ ప్రవర్తన భరింపశక్యంగా ఉంది. ఆమెకు భయపడి తండ్రి కూడ ఏమీ అనడు. సైదాబీ గయ్యాళితనంతో భర్త పెళ్ళయిన రెండేళ్లకే ఆమెను వదిలేచి గోసాయిల్లో కల్సిపోయాడు. ఆమెను అదుపులో పెట్టమని నాన్నను కోరాడు. నాన్నను ఆమె లెక్క చేయలేదు. దాంతో ఆదాం ఆమెను నిలదీసాడు. అయితే ఇటువంటివి చేయను. నాకు పెళ్ళి చేయమని ఎదురుమాట్లాడింది. అందుకు ఆదాం మనసును అదుపులో ఉంచుకో. పెళ్ళి కాకుండా

అక్రమ సంబంధం కలిగి ఉండడం ఇస్లాం ప్రకారం నేరం. దానికి శిక్ష రాళ్ళతో కొట్టి చంపడం అని చెప్పాడు. దానికి సైదాబీ కొన్ని రోజులు ఆగు బాషా నన్ను పెళ్ళి చేసుకుంటాడని చెప్పింది. ఆ మాటతో ఆదాం అన్వర్‌కి అన్యాయం చేయవద్దని సైదాబీని బతిమాలుకున్నాడు.

రంజాన్ నెలలో మసీదులో నీళ్ళు, దీపం పెట్టడం కుల్సుంబీ వంతు. బాషా ఆ పనులేవి చేయడం లేదు. విడిపోయాడు. ఎలా చేయాలని ఆలోచిస్తున్న సమయంలో ఆదాం "ఆపా... రేపట్నుండీ మసీదులో నీళ్ళు పోసే వంతు మనది కదా. నేను కావిడేస్తాను" (పు. 173)దీపం పెడతానని చెప్పి వాళ్ళకి స్వాంతన కలిగించాడు. బాషా చనిపోయిన తర్వాత గ్రేడింగ్ పనిలో అన్వర్ చేరడానికి నైతిక బలాన్ని ఇచ్చాడు. ఆదాం వ్యవసాయ పనుల్లో అన్వర్కి సహాయ, సహకారం అందించాడు. ఆదాం దుక్కి దున్నడం నుండి మొదలై, కోత కోసే వరకు అన్వర్‌కి వెన్నంటి ఉండి సహాయం చేశాడు. నూర్ బాషీయుల అభివృద్ధికి ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించడం, గుంటూరు జిల్లాకు జనరల్ సెక్రటరీగా ఉన్న ఆదాంను గుంటూరు, ఒంగోలు జిల్లాల వారు కలిసి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమంలో అన్వర్ నన్ను తీర్చి దిద్దిన గురువని ఆమెను సభకు పరిచయం చేయడానికే ఈ సన్మానానికి ఒప్పుకొన్నాని చెప్పాడు. ఆ వేదిక మీద అన్వర్‌కి శాలువా కప్పి సన్మానం చేస్తూ "మన నూర్‌బాషీయులు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి చదువు అవసరమని చెప్పి, ఆ ప్రయత్నంలో నాకు అండగా నిలబడిన వ్యక్తి అన్వర్ ఆపా. ఆమె నాకు గురువు, మార్గదర్శకురాలు, ఆత్మబంధువు, అంతేకాదు. నా భుక్తికి ఓ మార్గం చూపిన దేవత కూడా" (పు. 334) అని సభకు తెలియపరిచాడు.

రఫీ కాలేజీకి వెళ్ళకుండా జుబేదా ఇంట్లో ఉన్న విషయం ఆదాం అన్వర్‌కి చెప్పి జాగ్రత్త పడమంటాడు. జిలాని, రఫీలు గొడవలు పెట్టుకుంటున్న సమయంలో ఇద్దరికి నచ్చచెబుతాడు. ఈ నవలలో ఆదాం పాత్ర అన్వర్‌కి పరిచయమైన దగ్గర నుండి ముగింపు వరకు ప్రతి పనిలో ఆమె సహకరిస్తూ ఆమెతో పాటుగా తాను ఎదిగే పాత్రగా కనబడుతుంది. ఆదాం తాను ఎదుగుతూ తన జాతి వారి బాగు కోసం పెళ్ళి కూడా చేసుకోనని చెబుతాడు. తన జాతి అభివృద్ధికి కావాల్సిన విషయాల గురించి తెల్సుకుంటూ వారి వెనుకబాటు తనానికి గల కారణాలు కుల వివక్ష, నిరక్షరాస్యత, పేదరికమని అర్థం చేసుకుంటాడు. వాటి నిర్మూలన ఆర్థికాభివృద్ధితోనే సాధ్యమౌతుందని చదువు దానికి తొలిమెట్టుగా భావిస్తాడు. ఆ దిశగా తన వారిని నడిపించడానికి సిద్ధమౌతాడు.

**<u>నజీర్:</u>**

చిన్నతనం నుండి అన్వర్‌ని ప్రేమించి వ్యక్తి. అన్వర్ మేనమామ కొడుకు. అన్వర్ పుట్టినప్పుడే నజీర్‌కి కాబోయే భార్య పుట్టిందని అందరు అనుకున్నారు. అన్వర్ కంటే ఏడు సంవత్సరాలు పెద్దవాడు. "సన్నగా, పొడవుగా, దృఢంగా ఉన్న శరీరం... కోర మీసం.... ఉంగరాల జుట్టు"(పు. )తో చూడముచ్చటగా కనిపించేవాడు. పదిహేడేళ్ళ వయస్సులో రైల్వే ట్రాక్‌మెన్ ఉద్యోగం వచ్చింది. ఆ వార్త అన్వర్‌కి చెప్పడానికి చినగంజాం బయలుదేరాడు. అన్వర్‌కే ముందు ఆ వార్త చెప్పాడు, ఇరవై రూపాయలు జీతమని నీవంటే నాకు ఎంతో ఇష్టమని తెలియజేసాడు. "అన్వర్‌కి నజీర్ అంటే ఇష్టం. తన కోసం మిఠాయిలు కొనుక్కొస్తాడని ఇష్టం" (పు. 143) కానీ సరిగ్గా సంవత్సరం తర్వాత బాషాతో అన్వర్ పెళ్లి జరిగింది. "అన్వర్‌కి బాషాతో పెళ్ళి జరిగిందని తెల్సినపుడు గుండె పగిలేలా ఏడ్చాడు నజీర్. కొన్ని వారాల వరకూ పిచ్చాడిలా తిరిగాడు". (పు. 143) తల్లిదండ్రులు మరో అమ్మాయిని పెళ్ళి చేసుకొమ్మంటే నేను అన్వర్‌ని తప్ప ఎవరిని చేసుకోనని తెగేసి చెప్పాడు. నీదేమైనా అమర ప్రేమనుకుంటున్నావా అంటే "అంతకన్నా గొప్పే"... అంతకు మించిన ప్రేమికుడు ఈ నజీర్. ఇక వాదన

అనవసరమని అతని తల్లిదండ్రులు వదిలేశారు.

అన్వర్‌కి పెళ్ళై ఐదు సంవతసరాల తర్వాత ఆమెను చూడటానికి త్రోవగుంట వెళ్ళాడు. ఆమెను చూసి పెద్దగా పసి పిల్లాడిలా ఏడ్చేశాడు. ఇరువురూ క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. నజీర్ తన ప్రేమను అన్వర్ దగ్గర వ్యక్తం చేశాడు. అలా మాట్లాడితే అసలు ఇంకెప్పుడూ రావద్దు. నేను మరొకరి భార్యను. నాకు భర్తతోడిదే లోకమని చెప్పింది. సాయంత్రం వరకు ఉండి చీరాల వచ్చాడు.

పది రోజుల తర్వాత మరల త్రోవగుంట వచ్చాడు. రెండురోజులు ఉన్నాడు. ఏ కష్టం వచ్చినా నేను నీకు తోడు ఉన్నానని మర్చిపోవద్దని చెప్పాడు. నజీర్ రావడం బాషాకిష్టం లేదు. ఇంకోసారి ఇంటికి వస్తే దొంగతనం గానీ మరో ప్లాన్ వేసి శాశ్వతంగా రాకుండా చేయాలని నిర్ణయించుకున్నాడు. అన్వర్‌కి బాబు పుట్టాడని చూడడానికి నజీర్ మూడోసారి త్రోవగుంటకి వెళ్ళాడు. చిన్నప్పటి ఆటలు జ్ఞాపకం చేసుకొని ఇరువురు నవ్వుకొన్నారు. అన్వర్ లాంటి అమ్మాయే పెళ్ళి చేసుకొనడానికి కావాలని అడుగుతున్న సమయంలో బాషా వచ్చి వారి మాటలు విన్నాడు. కొడుకు రఫీకి బఠానీలు కొనిచ్చి అన్వర్, నజీర్‌ల ముచ్చట్లు గురించి అడిగాడు. పిన్ని నన్ను లోపలికి రానివ్వకుండా బయట ఆడుకోమని పంపించిందని రఫీ చెప్పాడు. ఇంటికి వస్తూంటే రసూల్ తన గ్యాంగ్‌తో అన్వర్‌కి బాషా వల్ల పిల్లాడు కలగలేదు. నజీర్ అక్రమ సంబంధం వల్లే పుట్టాడని చెబుతాడు. అది విన్న బాషా తప్పకుండా అన్వర్, నజీర్‌లకి అక్రమసంబంధం ఉంటుందని నిర్ధారణకు వచ్చాడు.

ఒకరోజు రాత్రి అన్వర్‌ను నజీర్‌తో అక్రమ సంబంధం ఎప్పటి నుండి కొనసాగుతుందని నిలదీశాడు, కొట్టాడు. నజీర్ని ఇంటికి రావొద్దని చెప్పమన్నాడు. ఆమె చెప్పలేదు. తర్వాత రోజు పగలు అన్వర్‌పై అనుమానంతో డ్యూటీ నుండి అనుమతి తీసుకొని ముందే ఇంటికి వచ్చాడు. అత్త కుల్సుంబీకి రాత్రి బాషా నిర్వాకం చెబితే నా యింటికి వచ్చిన అతిథిని రావొద్దని చెప్పే సంస్కారం నాకు లేదు. నజీర్ మంచివాడు, అతడ్ని అనుమానిస్తే ఖుదా మెచ్చడని చెప్పింది. బాషా ఇంటికి వచ్చే సమయానికి నజీర్, అన్వర్‌కి చిన్ననాటి కబుర్లు చెబుతున్నాడు. వారిద్దరిని చూసిన బాషా కోపం ఆపుకోలేకపోయాడు. నజీర్‌ను ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. మీరు మమల్ని అపార్థం చేసుకున్నారు. దయచేసి అల్లరి చేయకండి అని నజీర్ బాషా కాళ్ళు పట్టుకొని ప్రాధేయపడ్డాడు. కానీ అతను వినలేదు. నజీర్‌ను బయటకు లాగి గొడవ గొడవ చేశాడు. ఇంకేం మాట్లాడినా గొడవ పెద్దదవుతుందని నజీర్ తల వొంచుకొని అక్కడ నుండి వెళ్ళి పోయాడు. కోడలికి అక్రమసంబంధాన్ని అంటగట్టిన కొడుకు మీదకి కత్తిపీటతో కుల్సుంబీ వెళ్ళింది. అప్పటి నుండి అత్త, కోడలు కలిసి వంటగదిలోనే ఉంటున్నారు. బాషా రఫీ వేరుగా అదే ఇంట్లో ఉంటూ సైదాబీని పెళ్ళి చేసుకొని కాపురం పెట్టాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు బాషా క్షయవ్యాధితో మరణిస్తాడు.

తర్వాత చాలా రోజులకి పొలంలో జొన్న తూర్పార పడుతున్న అన్వర్ దగ్గరకు నజీర్ వచ్చాడు. ఒంగోలు ట్రాన్స్‌ఫర్ అయిందని త్రోవగుంటలోనే ఉంటానని చెప్పాడు. త్రోవగుంటలో ఉండవద్దని అన్వర్ అంటే లేదు ఇక్కడే ఉంటానని నజీర్ చెప్పాడు. కానీ తర్వాత రోజు నిన్న తొందరపడి ఇక్కడే ఉంటానని చెప్పాను. నీకు యిష్టం లేకపోతే ఒంగోలులోనే ఉంటాను. నేనంటే నీకు ఇష్టం లేదా , అంటే ఇష్టమే. కానీ పెళ్ళై పిల్లలున్న స్త్రీ కోసం నువ్వు జీవితాన్ని బలి చేసుకోవడం నాకు ఇష్టం లేదని చెప్పింది. దానికి నజీర్ నేను మాట్లాడుతుంది. పెళ్లై భర్త చనిపోయిన స్త్రీ గురించి, ఆ స్త్రీలను వివాహం చేసుకోవచ్చని ఇస్లాం ధర్మం చెబుతుందని చెప్పాడు. అయిన ఆమె పెళ్ళికి ఒప్పుకోలేదు. తన పిల్లలతో పాటు నజీర్‌ను కూడ పిల్లాడిగా చూచుకొని తల్లి ప్రేమను మాత్రమే అందించగలనని అతనితో చెప్పింది.

నజీర్ త్రోవగుంటలో అద్దెకు ఉంటున్నాడు. అన్వర్ రాఘవయ్య పంతులు దగ్గర ట్యూషన్‌కి వెళ్ళి వస్తుంటే నజీర్ ఎదురు వచ్చి భోజనానికి ఆహ్వానించాడు. ఆమె అత్త కుల్సుంబీని తోడు తీసుకొని నజీర్ ఇంటికి వెళ్ళి భోజనం చేసి వచ్చింది. తర్వాత కొన్ని రోజులకి మరల అన్వర్ని నజీర్ భోజనానికి పిలిచారు. అన్వర్ అత్త నలతగా ఉందని రాలేనంది. దూదేకుల పేటలో నజీర్ ఇంటికి వచ్చి ప్రక్కనే ఉన్న ఆదాంను తోడుకు పిల్చింది. ఆదాం వచ్చి అక్క సైదాబీ బయట గొడవ పడడం విన్నాడు, ఇప్పుడే వస్తానని చెప్పి ఆదాం బయటకు వెళ్ళాడు. నజీర్ తనను పెళ్ళి చేసుకోమని మరల అన్వర్‌ని అడిగాడు. అన్వర్ కుదరదని చెప్పింది. నజీర్ ఇంటికి అన్వర్ రావడం సైదాబీ చూసింది. అన్వర్ నజీర్‌లకు అక్రమ సంబంధం ఉందని సైదాబీ ఊర్లో పుకార్లు పుట్టించింది. అంతకు ముందే సైదాబీ నజీర్‌ను ఇష్టపడితే అతను తిరస్కరించాడు. దాంతో కక్ష్యగట్టి వారిపై తప్పుడు ప్రచారం చేసింది. అన్వర్ మెట్రిక్యులేషన్ పాసైంది. శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చిన ఆదాం, నజీర్‌కి ఖీర్ ఇచ్చి, అత్తయ్యకి ఖీర్ తిన్పించింది. తర్వాత రోజు నజీర్ పొలానికెళ్ళి తన ప్రేమను వ్యక్తం చేశాడు. దానికి అన్వర్ "సరే ఓ వారం, పది రోజులాగు నీకు నా నిర్ణయం చెప్తాను" (పుట 283) అని తాను తీసుకున్న నిర్ణయాన్ని అత్తకు చెప్పి, ఆమెను తీసుకొని చీరాల వెళ్ళింది.

చీరాల నుండి చిన్ననాటి స్నేహితురాలు జమీలాను తీసుకువచ్చింది. జమీలాను పెళ్ళి చేసుకొమ్మని నజీర్‌కి చెప్పింది. దానికి నజీర్ "నువ్విలా అడుగుతావన్న భయం నీ ఇంట్లో జమీలాని చూసినప్పుడే కలిగింది. నేను నిఖా చేసుకుంటే అన్వర్‌నే చేసుకుంటాను. లేదా ఇలాగే ఒంటరిగా ఉండిపోతాను'' (పు.288) అని చెప్పాడు. మనిద్దరము పెళ్ళి చేసుకుంటున్నామా? లేదా అని నిలదీశాడు. నువ్వు జమీలాను నా మాట మీద గౌరవంతో పెళ్ళి చేసుకుంటే ఆ కృతజ్ఞతని జీవితాంతం గుండెల్లో దాచుకుంటాను కాదనకు అని అన్వర్ నజీర్‌ను ఒప్పించే ప్రయత్నం చేసింది. కానీ నజీర్ కోపంగా అక్కడి నుండి వెళ్ళిపోయి రెండు రోజులు వరకూ పత్తాలేకుండా పోయాడు. మూడోరోజు పొలం దగ్గరకు వచ్చి జమీలాతో పెళ్ళికి ఒప్పుకున్నాడు. జమీలా, నజీర్‌కి మరో వారానికి నిఖా జరిపించింది. పెళ్ళి తర్వాత నజీర్, జమీలాలు అన్వర్‌కి చేదోడు వాదోడుగా ఉండి ఆమెకు కావాల్సిన సహాయం అందిస్తూ ఉండేవారు.

ఈ నవలలో నజీర్ పాత్ర తన ప్రియమైన వ్యక్తి కోసం తాపత్రయపడి చివరకు ఆమె ఇష్టానికి ఆమోదం తెల్పి, తమ చిన్ననాటి మిత్రురాలు జమీలాను వివాహం చేసుకొంటాడు. ప్రధాన పాత్ర అన్వర్‌ను గౌరవపదమైన విశిష్ఠ పాత్రగా తీర్చిదిద్దడానికి నజీర్‌ను జవజీవాలు అందించాడు.

**<u>సైదాబీ:</u>**

ఆదాం సొంత అక్క, వ్యక్తిత్వం మంచిది కాదు. బాషాతో అక్రమ సంబంధం పెట్టుకొని రెండో వివాహం చేసుకుంటుంది. గయ్యాళి పాత్ర. ఈమె గయ్యాళి, తన స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తుంది. బాషాను వివాహం చేసుకొని మహారాణిలా జీవించాలని అనుకొంటుంది. కానీ బాషా క్షయవ్యాధి రావడంతో అక్కడ నుండి జారుకుంటుంది. అన్వర్, నజీర్‌లకు అక్రమ సంబంధం అంటగట్టి ప్రచారం చేస్తుంది. తన తమ్ముడికి తిరుగుబోతు అమ్మాయితో పెళ్ళి చేయడానికి ప్రయత్నం చేస్తుంది. ఆదాం తిరస్కరించే సరికి, రఫీకి అంటగడుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో అన్వర్ రఫీకి జుబేదాతో నిఖా చేస్తుంది. కోడలు జుబేదాను అత్త అన్వర్‌పై ఉసిగొల్పుతుంది. తాను అడగదల్చిన విషయాలన్ని జుబేదాతో అడిగించితృప్తి పొందుతుంది.

**4.4.4. ముస్లిం సమాజంలో కుల వ్యవస్థ:**

ఈ దేశంలో ముస్లింగా పుట్టడమైనా, జీవించడమైనా శాపంగా పరిగణించడం. ఈ లౌకిక దేశంలో ముస్లింగా పుట్టడం నేరం. పుట్టుకతోనే తీవ్రవాదిగా ముద్రవేయబడుతుంది. అనే నేపథ్యం నుండి ఖాదర్ మొహిద్దీన్ 'పుట్టుమచ్చ' ను (1991లో) ప్రచురించారు. అప్పటికే హిందూత్వ తీవ్రరూపాన్ని సంతరించుకున్నది. ముస్లింలను పరాయివారిగా చూడాలని ప్రచారాన్ని తీవ్రం చేసింది. భారతీయత అంటే హిందుత్వంగా ప్రచారం చేసింది. అందులో భాగంగానే ఈ దేశంలో జీవించాలంటే వందేమాతరం పాడాల్సిందే' అని నినాదం భారతీయ ముస్లింలలో అభద్రత భావానికి గురిచేసింది. రామజన్మ భూమి వివాదంతో అది తీవ్రరూపం దాల్చింది. 1992 డిసెంబర్ 6వ తేది బాబ్రీమసీదు కూల్చివేత ముస్లింలా ఆత్మస్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీసింది. దాంతో దళిత వాదంతో మమేకమైన ముస్లిం కవులు క్రమంగా ముస్లిం వాదంతో ముందుకొచ్చారనవచ్చు. ముస్లిం వాదం గురించి మందటి అధ్యాయంలో ముస్లిం వాద నవలను చర్చించినప్పుడు తెలియజేసాను గమనించగలరు.

దూదేకుల వాదం నేపథ్యం ఈ నవలలో రచయిత స్పష్టంగా చర్చించాడు. ఆదాం పాత్ర ద్వారా దూదేకులు ఎలా ముస్లిం సమాజంలో హీనంగా, అంటరాని వారిగా ఎ ంచ్చుబడ్డారో తెలియజేసి వారిని ముస్లింలు తమలో నిమ్నస్థాయి వారిగా చూడకుండా తమలో కలుపుకు వెళ్ళాలని చెప్పారు. దూదేకులు అనే వారు ఈ దేశంలోని కింది కులాల నుండి సమనత్వం కోసం ఇస్లాం స్వీకరించారు. కానీ భారతీయ కుల సమాజం ప్రభావంతో వారు మతం మారినప్పటికీ అంతకు ముందు కుల వృత్తుల గుర్తింపే స్థిరపడింది. అలా స్థిరపడి వచ్చిన పదమే దూదేకులు అని చెప్పవచ్చు. "భారతీయ ముస్లింలలో అత్యధికులు హిందూ సమాజంలోని శూద్రకులం నుంచి మతం మార్చుకున్నవారే. బలవంతపు మత మార్పిడీలన్నీ పెద్ద ఎత్తున, ప్రధానంగా ఐచ్ఛికంగా జరిగినవేనని, బలవంతంగా జరిగినవి కావని" (అస్ఘర్ అలీ ఇంజనీర్. 2005 .69) అని అభిప్రాయం వ్యక్తం చేశారు.

దూదేకులను, పింజరి, ఆధా ముసల్మాను, లాద్దాఫ్‌లు నూరు బాషీయులు అని పిలుస్తారు. పై వన్నీ దాదాపు వారి వారి వృత్తులను బట్టి పేర్లు నిర్ణయించబడ్డాయనవచ్చు. అత్త కుల్సుంబీని లద్దాఫ్‌లంటే ఎవరని ప్రశ్నించింది. సంగా ముసల్మానులని ఆమె చెప్పింది. సగం ముసల్మానులు కూడా ఉంటారని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేయగా "లద్దాఫలంటే మన మతం స్వీకరించిన వాళ్ళు, మనలాగే వాళ్ళు కూడా కల్మాలు చదువుతారు. నమాజు చేస్తారు. కానీ ఉర్దూ మాట్లాడలేరు. హిందూ పండగలు చేసుకుంటారు. ఇళ్ళల్లో హిందూ దేవుల్ల ఫొటోలు పెట్టుకుంటారు. అందుకనే వాళ్ళను ఆధా ముసల్మానులుంటారు." (సలీం. 2003. వెండిమేఘం. 52) అని దూదేకుల పదం గురించి రచయిత మనకు కుల్సుంబీ పాత్ర ద్వారా వివరించారనవచ్చు.

అన్వర్ లద్దాఫ్‌ల గురించి కల్సుంబీని వివరంగా చెప్పమని అడిగింది. వేరు మతం నుండి మన మతంలోకి మారిన వారిని లద్దాఫ్‌లు అంటారు. వాళ్ళలో ఎక్కువగా 'దూది ఏకే వృత్తిగల వాళ్ళు కాబట్టి వాళ్ళని దూదేకుల వాళ్లని కూడా పిలుస్తారు. పింజారీలన్నా కూడా లద్దాఫ్‌వే" (పు.58) అని తెలియజేసింది. మతం మారినా వారిని దూరం పెట్టడం, రకరకాల పేర్లతో ఎగతాలి చేయడం గురించి అన్వర్ స్పష్టంగా ప్రశ్నించింది. (పు.59) రంజాన్ పండగరోజు భాషా ఆదాంని భోజనానికి ఇంటికి పిలిచాడు. అన్వర్‌కి లద్దాఫ్ ముసల్మాన్‌గా పరిచయం చేశాడు. భోజన సమయంలో అదాంను తెలుగులో పిలిచాడు. "వీడికి మన భాష రాదు. లద్దాఫ్ కదా" (పు.69) అని ఎగతాలి మిళితమైన స్వరంతో అన్నాడు. లద్దాఫ్‌లకు భాష రాక పోవడంతో వారిని ముస్లింలు దూరంగా ఉంచుతున్నారని ఆరోపణ ఉంది. అన్వర్

ఆదాంకి భాష నేర్పుతాను నేర్చుకోమ్మని చెప్పింది. అలాగే అన్నాడు. ఆదాం కన్న అన్వర్ వయస్సులో చిన్నది అయిన 'ఆపా' (అక్క)గా ఆప్యాయంగా పిలిచేవాడు. అన్వర్ ఆదాంకి ముస్లిం ధర్మాలు, ఉర్దూ, నేర్పించింది. ఇస్లాం సాంస్కృతిక జీవనాన్ని మిగతా దూదేకులు కూడా పాటించేలాగా ఆదాంని తయారు చేసింది. దూదేకుల వెనుకబాటు తనానికి భాష రాకపోవడం, ముస్లిం ధర్మాలు పాటించకపోవటం వారిని ముస్లింలలో అంటరాని వారిగా తయారు చేసిందని రచయిత తెలియజేశారు.

ఇస్లాం మతంలో సమానత్వం, సోదరభావం, న్యాయం, అనే ప్రాథమిక సూత్రాల మీద ఆధారపడివుంది. తరతమ భేదాలు వుండవు. రాజైనా, పేదైనా అల్లా దృష్టిలో ఒక్కటేనని అన్వర్ చెప్పింది. అందుకు ఆదాం మతాతాది "మాదిగోళ్ళకులం, చెప్పులు కుట్టేవాడు. బాబా నాగూర్‌వలీ బోధనలు విని" (పు.72) ఆ ప్రభావంతో దళితులు అనేక మంది ఇస్లాం స్వీకరించారు. సమానత్వం కోసం మతం మారిన మమ్మల్ని దూదేకులని పిలిచి వేరుగా చూస్తారు. కేవలం మసీదులోనే కల్సుకోనిస్తారని, ముస్లింపేటలో కూడా కలుపుకోకుండా ఊరికి దూరంగా ఉంచుతారని దూదేకుల సజీవ పరిస్థితిని రచయిత వివరించాడు. అంతే కాక దూదేకులలో బిడియం, ఆత్మన్యూనతా భావంతో ఉండి ముస్లింలతో కలవలేకపోతున్నారని అన్వర్ పాత్ర ద్వారా తెలియజేసాడు. అసలైన ముస్లిం మ తం మారినా వాళ్ళను దూరంగ ఉ ంచారని తెలియజేసారు.

భారత ముస్లింలలో అత్యధిక శాతం హిందూ సమాజంలోని నిమ్మకులాల నుండి మతాంతీకరణ పొందిన వారే. సూఫీ గురువల శాంతియుత భోధనలూ, ఇస్లాం సమానత సిద్ధాంత ప్రేరణతో మతం మారారు. నిమ్మ కులాల వారు మత మార్పిడి సమయలో కుల వృత్తిని ఆచరించటంతో అంతకు ముందు కులంతోటే వారిని గుర్తించారు. అంటే ఏ కుల వ్యవస్థ నుండి బయట పడతామని మతం మారారో ఆ లక్ష్యం నీరుగారింది. కుల ప్రభావంతో ముస్లింలో కూడ ప్రధానంగా ఉత్తర భారతంలో అష్రాఫ్ (ఉన్నత) అజ్లాఫ్ (నిమ్న) ముసల్మానులుగా విభజించబడి ఉన్నారు. అష్రాప్ ముస్లింలు తమను ఉన్నతమైన ముస్లింలు భావించుకుంటారు. అజ్లాఫ్ ముస్లింలు భారతీయ సమాజంలోని నిమ్మ కులాల నుండి మతాంతీకరణ పొందారు. కాబట్టి బీరిని తక్కువగా వారిగా చూస్తారు. దక్షిణ భారతంలోఓ అష్రాఫ్, అజ్లాఫ్, పరంగా విభజన లేనప్పటికీ భౌగోళిక, సాంస్కృతిక, పరిస్థితుల ప్రభావంతో విభజనలు స్పష్టంగా కనిపిస్తాయి.

కానీ " ఆంధ్రప్రదేశ్‌లో షేక్, సయ్యద్, మొఘల్, పఠాన్, విభజనలు స్పష్టంగా కన్పిస్తాయి. కానీ వీరిలో అత్యధిక శాతం మందికి తమ పూర్వ చరిత్ర జ్ఞానం ఎంత మాత్రము లేదు. చాలా మంది మతాంతీకరణ పొందిన ముస్లింలు సాంఘీక హోదా కోసం తమను తాము షేక్‌లుగానో, సయ్యద్‌లుగానో, పఠానులుగానో వ్యవహరించుకుంటున్నారు. ఆధ్రప్రదేశ్‌లో గత రెండు మూడు దశాబ్దాల్లో ఇస్లాం పుచ్చుకున్న ముస్లింలను 'దూదేకుల ముస్లింలుగా పిలుస్తుంటారు. వీరినే పింజారీలని, లద్దాఫ్‌లనీ, నూర్‌బాషాలనీ వ్యవహరిస్తుంటారు. మొదట నేత పనిలో ఉండి ఇస్లాం పుచ్చుకున్న వారినే దూదేకుల వారుగా వ్యవహరించిన తర్వాత కొన్ని ఇతర మృత్తుల నుండి ఇస్లాం పుచ్చుకున్న వారికి కూడా దూదేకుల వారుగా పరిగణించినట్లు బ్రీటీష్ వారు చేపట్టిన జనాభా లెక్కల రిపోర్టులను పరిశీలిస్తే తేటతెల్లమౌతుంది. సాధారణంగా దూదేకుల ముస్లింలను తక్కువ చూపుతో చూడ్డం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతుంది..... దూదేకులలో వివాహ సంబంధాలను షేక్‌లు, సయ్యద్‌లు సాధారణంగా గర్హిస్తారు. దూదేకుల ముస్లింలకు ఉర్దూ రాదు. కాబట్టి భాషాంతరాన్ని బాగా పట్టించుకుంటారు. (స్కైబాబ. 2012: 144-145) ఛిద్రమైపోతున్న నెలవంక భారత ముస్లింలు-రిజర్వేషన్ల ఆవశ్యకత గురించి ముల్కిలో స్కైబాబ

అభిప్రాయపడ్డారు.

అంతేగాక ముస్లిం సమాజంలో ఉన్నత, నిమ్న కులాల మధ్య ముస్లింల సాంస్కృతిక జీవన విధానం కూడా వైవిధ్య భరితంగానే ఉంది. ఉన్నత కులాల ముస్లింలు పూర్వం ఇతగా ఇస్లామీకరించబడగా, నిమ్న కులాల ముస్లింలు పూర్తిగా ఇస్లామీకరించబడలేదు. వీరు ఇస్లాం ఆచారాలతో పాటుగా తమ పూర్వ హిందూ మత ఆచారాలను పాటిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దూదేకుల ముస్లింలు రంజాన్, బక్రీద్ లాంటి ఇస్లాం పండుగలతో పాటుగా దీపావళి, దసరా, మొ॥లగు పండుగలు కూడా చేస్తారు. హిందూ దేవుళ్లను కొలుస్తారు. శుభకార్యాలప్పుడు సన్నాయి మేళం పెట్టించడం, శుభలేఖలకు పసు పు పూయడం, పేడ నీళ్ళతో కళ్లాపు చల్లడం, బాబా కాళ్లకు మొక్కడం, తిరుపతి వెంకన్నకు మొక్కులు చెల్లించడం, బ్రహ్మంగార్ని సిద్దప్పను పూజించడం, వంటి హిందూ ఆచారాలను పాటిస్తారు. స్త్రీలు పరదాపద్దతి పాటించరు. ఇవన్ని దూదేకులను ముస్లింల నుండి వేరు చేసి చూపిస్తాయి.

ఆదాం చదువుతో పాటు ఇస్లాం ధర్మాలను, అన్వర్ వద్ద నేర్చుకుంటున్నాడు. అవన్నీ తోటి దూదేకుల వారికి నేర్పుతున్నాడు. ఇస్లాంలో చెప్పిన సమానత్వం గురించి వారికి తెలియజేస్తూన్నాడు. ఆటల పేరుతో దూదేకుల యువకులను కూడాగట్టాడు. (పు.118) వారందరికి నమాజ్ నేర్పించాడు. దూదేకుల పెద్దల మన్ననలు పొందాడు. మనల్నిల ముస్లింలు భాష రాకపోయేసరికి కించపరుస్తున్నారు. వారి మతంలోకి మార్చుకున్నా కూడా వారు మనకు భాష నేర్పరు. కానీ ఎతగాళి చేస్తారని మస్లింలని చెప్పుకుంటున్న వారి తీరును ఎండగడతాడు. అంతేగాక భాష రావడం, ముఖ్యం కాదని, ఇస్లాం ధర్మాన్ని ఆచరించడం ముఖ్యమని అందులో నమాజు చేయడం, కల్మాయి చదవటం, ఫాతిహా చదవడం ఇవన్ని ముఖ్యం. అల్లా ఒక్కడే దేవుడని, ఖురాన్ చెబుతుంది. అయితే దూదేకులు విగ్రహారాధనతో పాటు అల్లాను ప్రార్థిస్తారు. ఇదంతా చూసే ముస్లింలు మనల్ని ఆధా ముసల్మాన్‌లని ఎగతాళి చేస్తున్నారని ఆదాం పాత్ర ద్వారా దూదేకుల పట్ల ముస్లింల వివక్షతలకు కారణాలను రచయిత విశ్లేషణ చేస్తాడు.

ఆదాం దూదేకులకు ఇస్లాం ధర్మాలు చక్కగా నేర్పుతాడు. ముస్లింలతో సమానంగా మసీదులో నమాజ్ చేసేలా చేసి ముస్లిం ముల్లాలని మన్ననలు పొందుతాడు. దూదేకుల అభ్యున్నతి కోసం కృషి చేయాలని రచయిత అభిప్రాయపడతాడు. అందులో భాగంగా సంఘం ఏర్పాటు చేసి దూదేకులకు సహకారంతో రిజర్వేషన్ల కోసం పోరాటం మొదలు పెడతాడు. షేక్ చిన మౌలానా, నాజర్‌లను కలిసి మద్దతు కూడగడతాడు. నూర్‌బాషీయుల గుర్తింపు తెచ్చిన అబ్దుల్ ఖాదర్ని ఆదర్శవ్యక్తిగా భావించుకుంటాడు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని చుట్టు పక్కల ఊర్లలో కూడ దూదేకులను సంఘటితం చేస్తాడు. ఆదాం పాత్ర ద్వారా దూదేకుల అభ్యున్నతికి సంఘాలు స్థాపించాలని, నాయకులు ఆదాంలాగ నిబద్ధతతో పని చేసినప్పుడు వారు సంఘటితమై వారి న్యాయమైన కోర్కెలను సాధించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. అందుకే ఆదాం గుంటూరు జిల్లా నూర్ బాషీయుల సంఘానికి నాయకుడై ఉ ద్యమాన్ని నడిపించాడు. నూర్ బాషీయులకు రిజర్వేషన్‌ను సాధిస్తాడు. తన సన్మాన సభలో అన్వర్ని శాలువా కప్పి ఘనంగా సత్కరిస్తాడు. దాంతో పాటు ఆమె తనలో నూర్‌బాషీయుల స్థితిగతుల కారణాలు తెలియజేసి చైతన్యాన్ని, స్పృహను నింపి ఉద్యమ నాయకుడిగా తీర్చిదిద్దిందని తెలియజేస్తాడు. ముస్లింలు దూదేకులలో ఉన్న అవిద్య, అజ్ఞానం పోనంత వరకు అంటరాని వారిగా చూస్తారని, మతం మార్చుకున్న కులం మార్చుకోలేదని తెలియజేసాడు. ఇవన్నీ అన్వర్ తనకు తెలియజేసిందని చెబుతాడు.

ఆదాం దూదేకులలో మార్పు కోసం పర్యటనలు చేస్తున్న సమయంలో వివిధ ప్రాంతాలలో

దూదేకుల్లో ఉన్న వ్యత్యాసాలను గుర్తించాడు. "తెలంగాణ దూదేకులకు, రాయలసీమ, కోస్తాంధ్ర దూదేకులకూ స్పష్టమైన సాంస్కృతిక వ్యత్యాసాలున్నాయి.(స్కైబాబ.2005:145) కాబట్టి దూదేకుల ఆచారవ్యవహారాల్లో హిందూమత ప్రభావం ఎక్కువగా ఉందని తేల్చిచెప్పాడు. ముస్లింలు తమను సమంగా చూడాలంటే పూర్తిగా ఇస్లామీకరణ చెందడమే పరిష్కారమని చెబుతాడు. దాంతో పాటుగా చదువు నేర్చుకోవాలని చెబుతాడు. చదువు నేర్చుకోవడానికి ప్రభుత్వం దూదేకుల వారికి రిజర్వేషన్లు కల్పించాలని చెప్పాడు. కానీ నవలలో చెప్పినట్టుగా దూదేకులు అభివృద్ధి చెందినట్లు కనబడదు. అందుకే దూదేకుల వాదాన్ని తెలిపినప్పటికి రచయిత పూర్తిగా వారిని ఇస్లామీకరణ చెందాలని భావించాడు. కానీ కుల నిర్మూలన కోసం ముస్లింలలో అంటరాని వాళ్ళు దళజత బహుజనులతో కలిసి సంయుక్త ఐక్యత పోరాటాలు చేసినప్పుడే వారికి విముక్తి దొరుకుతుందని చెప్పవచ్చు. 'ఆంధ్ర ప్రదేశ్‌లో ముస్లింలలో 85 శాతం నుండి 90 శాతం మంది మతాంతీకరణ పొందినవారే.' (స్కైబాబ 2005:164) వీరిలో ఎక్కువ మంది మత కులవృత్తులు మాని వేయడంతో ముస్లింలుగా పరిగణించడబడుతున్నారు. అంతేగాక నిమ్న కులాలను చెందిన ముస్లింలు సామాజిక హోదా (సామాజిక ఊర్ధ్వ చలనం) కోసం తమ పేర్లకు ముందు 'షేక్'లాంటి అగ్రవర్ణ సూచకమైన ప్రిఫిక్స్‌లను పెట్టుకున్నారు'. (స్కైబాబ.2005:165) స్కైబాబ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ నవల స్త్రీ సమస్యలు ప్రధానంగా సాగినప్పటికీ దూదేకుల పట్ల హిందూ సమాజంతో పాటు ముస్లిం సమాజ వివక్షతకు గల కారణాలు తెలియజేశారు. వాటిని అధిగమించడానికి మత ధర్మాలను నేర్చుకోవడమే గాక విద్య, విజ్ఞానం ద్వారా వచ్చే తెలివిడితో పోరాడి రాజ్యాంగ పరహక్కులను సాధించుకోవాలని తెలియజేశారు. పోరాట క్రమం తమతో కలిసి వచ్చే వాకి శక్తియుక్తులను పొందాలని అన్వర్ పాత్ర ద్వారా రచయిత తెలియజేశారు.

**4.4.5. వెండిమేఘం–విద్యావ్యవస్థ:**

వెండిమేఘం నవలలో ముస్లింల సామాజిక జీవనంలో విద్యలో వెనుకబాటు తనం వల్ల వచ్చే అజ్ఞానాన్ని తెలియజేసారు. ముస్లిలంలో ఆధునిక విద్య పట్ల విముఖత ఉన్నట్టు తెలియజేసారు. చదువులో పురుషులతో పాటు స్త్రీలు వెనుకబడి ఉన్నారు. స్త్రీలు ఇంటి వద్ద ఖురాన్ చదువుకోవడానికి అరబ్బీ, ఉర్దూ నేర్చుకున్నట్లుగా అన్వర్ పాత్ర ద్వారా తెలియజేశారు. ఆ జ్ఞానంతోనే ఆమె ఇస్లాం మత ధార్మిక విషయాలు తెలుసుకుంది. ఇతరులకు తెలియజేసింది. అన్వర్ భర్త బాషాకి చదువు లేకపోవడంతో పొగాకు కంపెనీలో కూలీగానే పనిచేసేవాడు. అతడికి చదువు విలువ తెలియదు. కనుకే రఫీని బడిలో చేర్పిస్తానన్న అన్వర్ని " చదువుకుని వాడు వూళ్లేలాలా, రాజ్యాలేలాలా.. మా ఇంటా వంటా లేదు. మానాన్నకు అక్షరమ్ముక్క రాదు. నేను చదువుకోలేదు. మేము బ్రతకలేదా... పెళ్ళిళ్లు చేసుకుని పెళ్ళాం బిడ్డల్ని పోషించుకోవడం లేదా? వాడికి చదువొద్దు. చట్టుబండలొద్దు. హాయిగా ఆడుకోని.. పెద్దయ్యాక మా పొగాక్కంపెనీలోనే ఏదో ఒక పనికి కుదిరిస్తే సరిపోతుందని". (సలీం:2003.77) అని కోపగిస్తాడు. బాషా కోపం అజ్ఞానం నుండి వచ్చిందని చెప్పవచ్చు. చదువుకోని తెలివిడితో బతకడం వేరు. చదువులేకుండా ఏ కూలో నాలో చేసుకోని బతకుబండి లాగించడానికి ఎంతో తేడా ఉంది. అన్వర్ బాషాకి ఆ విషయం నచ్చ చెప్పాక అతడు "కిరస్తానీ చదువులు మనకు పడవు. కావాలంటే వాడికి ఉర్దూ, అరబ్బీ నేర్పించు" (పు.78) అని ఆధునిక చదువుల్ని కిరస్తానీ విద్యలుగా కొట్టిపడేస్తాడు. మదర్సాలోని విద్యకే బాషా మొగ్గుచూపుతాడు. అది అతడి వెనుకబాటుతనానికి నిదర్శనమని చప్పవచ్చు."క్రైస్తవులు నడిపే పాఠశాలలే అత్యుత్తమైనవిగాఉ న్నాయి." (అస్గర్ అలీ. 2005:75) అస్గర్ అలీ అభిప్రాయం సత్యదూరం కాదు.

అందుకే మనం " మన మాతృభాష నేర్చుకోవాల్సిందే. కాదనను కానీ భుక్తి కోసం, మనం కిరస్తానీ చదువులు చదవక తప్పదు. మన ముస్లింల వెనుకబాటు తనానికి కారణం చదువులేకపోవటమే నౌకరి కోసం కాదు. దునియాలో జరుగుతున్న విషయాలన్నీ తెల్సుకోవాలంటే చదువు అవసరం. మన రఫీ మొట్ట మొదటి విద్యార్థి అవుతాడు. ఈ వూరికి ఆదర్శ ముస్లిం అవుతాడు. వీరేమైనా అనండి నేను మాత్రం వీణ్ణి చదివించి తీర్తాను", (పు.78-79) అన్వర్ బాషాతో చెప్పింది. పై సంభాషణను బట్టి ముస్లింలనుండి ఒక వ్యక్తి కూడా బడికెళ్ళి చదువు నేర్చుకోలేదు. అలా బడికి వెళ్ళిన మొదటి విద్యార్థిగా రఫీని చెప్పవచ్చు. రఫీని బడిలో చేర్పించడానికి అత కుల్సుంబీ అన్వర్‌కి పూర్తి సహాయ సహకారాలు అందించింది. 'మన తాహాతుకు చదువులు సరిపడవని బాషా చదువువును తిరస్కరించిన అన్వర్ పట్టదలతో రఫీని చదవించింది. ఇలా చదువును అభివృద్ధికి మెట్టుగా ముస్లిం స్త్రీలు భావించాలని అన్వర్ పాత్ర ద్వారా సలీం తెలియజేశారు.

బడిలో రఫీ చేర్పించేటప్పుడు ఆమె నిర్ణయానికి రాఘవయ్య పంతులు అన్వర్ని అభినందిస్తాడు. ముస్లిం పెద్దలతో పిల్లలను బడి పంపించమని అనేక సార్లు అభ్యర్థించినట్లు చెప్పాడు. చివరకు ఆడపిల్లల్ని పంపక పోయినా ఫర్వాలేదు. కనీసం మగపిల్లల్ని అయినా పంపమంటే ఎవరు పంపలేదు. మీరు రఫీ బడిలో చేర్చి మంచి చేస్తున్నారు. కానీ బాషా ఆ చర్యను పూర్తిగా ఖండించి, గొడవ పెట్టుకున్నాడు. అక్రమ సంబంధాన్ని అంటగట్టాడు. త్రోవ గుంటలో ఐదు తరగతి వరకే పాఠశాలకే ఉంది. కానీ రఫీ చదువును నిర్లక్ష్యం చేసి కాలేజి చదువులను మధ్యలోనే ఆపివేశాడు. అన్వర్ రాఘవయ్య పంతులుతో మాట్లాడి ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చేలాగ చేసింది. రఫీ అన్వర్ కృషి వల్ల ఎంతో కొంత చదువుకొని త్రోవగుంట ముస్లింల నుండి మొదటి ఉపాధ్యాయుడిగా ఎదిగాడు.

అన్వర్ జిలానీ బడిలో చేర్పించే సమయానికి బ్రహ్మణవాదానికి దగ్గరవుతుంది. చెప్పవచ్చు. జిలానీని బడిలో చేర్పించడానికి ముందు రాఘవయ్య పంతులు చెప్పిన ముహూర్తం ప్రకారం అక్షరభ్యాసం చేయడానికి ప్రయత్నించింది. రాఘవయ్య పంతులు అన్వర్ ఇంటికి వచ్చి, జిలానీని 'దీర్ఘయుష్మాన్ భవ' అని దీవించాడు. రాఘవయ్య పంతులు "జిలానిని పక్కన నిల్పోబెట్టుకుని వాడి కుడి చేయి చూపుడు వేలు తీసుకుని బియ్యం మీద ' ఓం నమశ్శివాయ' అని రాయించాడు." (పు.216) బ్రాహ్మణ పంతులు ఆశీస్సులు తీసుకుంటే చదువులో రాణిస్తారని, ముస్లిం పేటలో అది ఉత్సాహాన్ని నింపుతుందని తెలియజేస్తుంది. అన్వర్ అన్ని విషయాలు తెల్సిందానిలా మాట్లాడుతుంది. కానీ అక్షరభ్యాసం హిందూ సాంప్రదాయం ప్రకారం జరిపించడం అనేది హిందూమతప్రభావమని చెప్పక తప్పదు.

చదువుకు వయస్సుతో పనిలేదని రాఘవయ్య పంతులు చెప్పడంతో అన్వర్ మెట్రిక్యులేషన్ పరీక్షకు సిద్ధమౌతుంది. రాఘవయ్య పంతులు అన్వర్‌కి చదువు చెప్పడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తాడు. చదువు కొని ఉపాధి సంపాధి సంపాదించి ఇద్దరు పిల్లల్ని పెద్ద చదువులు చదివించాలని ఆమె కోరిక. చదువు కొని పేద స్థాయి నుండి పైకి రావాలన్నా తాపాత్రయం అన్వర్‌లో కనబడుతుంది. మెట్రిక్యులేషన్ ఫస్టుక్లాసులో పాస్ అవుతుంది. కానీ ఉపాధ్యాయ వృత్తి కంటే వ్యవసాయం చేయడానికే మొగ్గు చూపుతుంది. ఇంటి వద్ద ముస్లిం బాలికల కోసం ట్యూషన్లు చెబుతుంది. బాలికలకు చదువు చెప్పడం వారిని అభివృద్ధి చేయడం కోసం కొడుకుతో పాటు హైదరాబాదు వెళ్ళడానికి నిరాకరిస్తుంది. కొడుకు జిలానీ చదువుకుని బ్యాంకు ఉద్యోగిగా స్థిరపడతాడు. డిగ్రీ చదువుకుంటున్నప్పుడు చరిత్ర పాఠ్యాంశాల విషయంలో హిందూ విద్యార్థికి వాసుతో జిలానికి అభిప్రాయ బేధాలు వస్తాయి. చరిత్రను అర్థం చేసుకోవడంతో పాటు అవగహాణ లోపం వల్లే హిందూ ముస్లింల మధ్య మత విద్వేషాలకు

కారణమని చెప్పుకోవచ్చు. గజిని మహ్మద్ భారతదేశంపై దండయాత్రలు చేయడానికి ఆర్థిక, రాజకీయా కారణాలు ప్రథమం. ద్వితియం మతమని చెప్పవచ్చు. గతంలో రాజ్యాలు పరిపాలించిన ముస్లిం నవాబులకు ప్రస్తుత ముస్లింలు ప్రతినిధులు కాదు, వారసులు అసలే కాదు. కానీ నేడు హిందూత్వవాదులు చరిత్రను వక్రమార్గం పట్టించి, గత దొపిడీలకు నేటి ముస్లింలే కారణమని ప్రచారం చేస్తున్నాయి. అందుకే చరిత్రను మత కోణం నుండి చూస్తే తప్పుడు అవగాహణకు దారితీయవచ్చునని పై సంఘటనతో రచయిత తెలియజేశారు.

ఈ నవలలో అన్వర్ మెట్రిక్క్యులేషన్ పాస్ అయి పొగాకు కంపెనీలో గ్రేడింగ్ చేసే స్థాయి నుండి సూపర్‌వైజర్ స్థాయికి ఎదుగుతుంది. తన మనమరాలు కుల్సుం పై చదువులు చదువుకోవాలని కోరుకుంటుంది. తన అత్త కుల్సుంబీ కోరిక ప్రకారం ముస్లిం స్త్రీల హక్కుల ప రిరక్షనకు లాయర్ చదువుతానని చెప్పినప్పుడు అన్వర్ సంతోషపడుతుంది. అన్వర్ మొదటి తరానికి చెందిన స్త్రీగా, కుల్సుంని ఆధునిక ముస్లిం స్త్రీలకు ప్రతీకగా రచయిత చిత్రీకరించారు. ‘ ఇల్లాలు చదువు ఇంటికి వెలుగు’ అని ఈ నవలలో అన్వర్ పాత్ర ద్వారా రచయిత సలీం నిరూపించారు. అన్వర్ తాను కాలిపోతూ తన వెలుగును పదిమందికి పంచి పెట్టింది. వెంటి మేఘం నవల చదివిన ముస్లిం స్త్రీలు ఆ పాత్రను ఆదర్శంగా తీసుకుని తమ పిల్లలను చదివించుకుని ముస్లిం సమాజాన్ని ముందుకు నడిపిస్తారనే ఉద్దేశ్యంతో రచయిత ఈ పాత్రను ఆదర్శ వంతంగా తీర్చిదిద్దారని చెప్పవచ్చు.

ముస్లింలలో అక్షరాస్యతా స్థాయి చాలా నిరాశ కలిగించే విధంగా ఉంది. కనుక ముస్లింలు విద్యవ ఇషయంలో జాగ్రత్త వహించాలి. లౌకిక విద్యను ముస్లింలు నిర్లాక్ష్యం చేశారు. వారు మత విద్యను మాత్రమే నేర్చుకున్నారు. కానీ మహ్మద్ ప్రవక్త ప్రతి ముస్లిం స్త్రీ, పురుషుడు విజ్ఞానాన్ని సంపాదించుకోవడం తప్పని సరని తెలియజేశారు. కానీ ముస్లి మౌల్వీలు, ముల్లాలు, అత్యధికులు ఉన్నత సామాజిక స్థితి నుండి వచ్చారు. వారు మదర్సా విద్యలకే మొగ్గు చూపారు. ఫలితంగా ముస్లింలు ఆధునిక విద్యకు దూరమయ్యారు. ముఖ్యంగా ఆధునిక విద్య బ్రాహ్మణులు మొదట్లో బోధించేవారు. వారు లౌకిక విద్య పేరుతో ఆధునిక విద్యలో హిందూ మతానికి అనుకూలమైన పాఠ్యంశాలు కూర్చి బోధించేవారు. ఆ బోధన విన్న ముస్లింలు ఒక రకంగా ఆ విద్యకు దూరమయ్యారని చెప్పవచ్చు.

మదర్సాల్లో విద్య బోధించడం వల్ల ముల్లాలకు ఆర్థికం ప్రయోజనకరమైనది. అది వారికి జీవనోపాధిని గుర్తింపును, అధికారాన్ని కల్పిస్తున్నాయని చెప్పవచ్చు. “ పట్టణ ప్రాంతాలలో ముస్లింలలో అత్యధికులు చేతివృత్తి పనివారు కనుక తమ పిల్లలు కూడా తమ వృత్తినే చేపట్టి కుటుంబ ఆదాయానికి వేడినీళ్ళలా తోడ్పాడాలని తల్లిదండ్రులు భావిస్తారు. అయినప్పటికీ వారు తమ పిల్లలను దమర్సాలకు పంపుతారు. అది తప్పని సరని వారు భావిస్తారు. అంతేగాక మున్సిపల్ లేదా ప్రభుత్వ పాఠశాలలో పోల్చుకుంటే మదర్సాలు అత్యంత సదుపాయంగా వుండే చోట నెలకొని వుంటాయి. వారి పిల్లల ఆర్థిక కార్యకలాపాలకు ఆటంకంగా ఉండవు. ఈ మదర్సాలలో పాఠ్య పుస్తకాలు ఉచితంగా యిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పాఠ్యాంశాలు హిందూ మత ప్రాతిపాదికన వుంటాయనే భావన ఉంది. అందువల్ల ముస్లింలు వాటికి దూరమౌతున్నారు.... ముస్లిం సంస్థలకు కూడా అరబ్ దేశాల నుండి సహాయం అందుతుంది. కానీ ముస్లింలు ఈ నిధులన్నింటినీ మదర్సాలు నడిపేందుకే వినియోగిస్తున్నారు.... ఆధునిక లైకిక విద్యపట్ల శ్రద్ధ వహించినప్పుడే మాత్రమే ముస్లింలు తమ వెనుకబాటు తనం నుంచి బయట పడగలుగుతారు.” ముస్లింలు ఆధునిక విద్యార్హతలు సంపాదించేందుకు అనువైన సదుపాయాలు కల్పించాల్సిన ఆవశ్యక ప్రభుత్వాలపై ఎంతైనా ఉంది. ఆ సదుపాయాల కోసం ముస్లింలు సంఘటితమవ్వాలి’ (అస్గర్ అలీ. 2005: 76)

అని అస్ఘర్ అలీ ఇంజనీరు అభిప్రాయం వ్యక్తం చేశారు... వెండిమేఘం స్త్రీల సమస్యలు చిత్రీకరణ, వెండి మేఘం నవల ప్రధానంగా రెండు అంశాలను చిత్రీకరించింది. స్త్రీల సమస్యల నేపథ్యం ప్రథమం, కాగా దూదేకుల పట్ల ముస్లిం సమాజం తీరుతెన్నులు విపులంగా చర్చించింది. స్త్రీల సమస్యలలో ముఖ్యంగా ఆ విద్య, వివాహం, విడాకులు, ఆర్థిక స్వతంత్ర్యం లేకపోవడం మొదలైన ప్రధానాంశాలు చిత్రీకరించింది. ఆన్వర్ పాత్ర కుటుంబాన్ని నడిపించిన తీరు చర్చించబడింది. ఈ నవలలో అన్వర్ కుల్సుంబీ, మహీలా, సైదాబా, జేబేదా, కుల్సం, రమీజా, మొదలైన పాత్రల గురించి ప్రధానంగా చెపుకొవాలి. వారి నేపథ్యాల నుండి నవలను విశ్లేషణ చేయాలి. ఈ నవల అవన్వర్ పదకొండు సంవత్సరాల ప్రాయం నుండి మొదలై అరవై సంవత్సరాల వయస్సు వరకు కొనసాగుతుంది. అంటే దాదాపు అరవై సంవత్సరాల కాలం నవలలో చర్చించబడింది. స్వాతంత్ర్యం వచ్చి దేశవిభజన జరుగుతున్న కాలంలో నవల మొదలౌతుంది ఆ కాలంలో స్త్రీల సమస్యలు ఎలా ఉన్నాయి. యాభై సంవత్సరాల కాలం ముస్లిం స్త్రీలలో వచ్చిన మార్పులు ఈ నవల ద్వారా అంచనావేయవచ్చు. అన్వర్ అక్క సలీమున్ ఏడుసార్లు గర్భస్రావానికి గురవుతుంది. అంటే స్వాతంత్ర్యానికి పూర్వం వైద్య సౌకర్యాలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేవని చెప్పుకోవచ్చు. అలాగే ఆమె మండ్రగబ్బ కుట్టి బాధపడుతున్న సమయంలో మంత్రగాడితో మంత్రం వేయిస్తారేగానీ వైద్య సహాయం అందించలేదు. దాంతో ఆమె మరణిస్తుంది. అంతకు ముందు భర్త ఆషా ఆమెను శారీరకంగా, మానసికంగా అనేక ఇబ్బందులకు గురిచేస్తాడు. పిల్లలు పుట్టడం లేదని రెండో పెళ్ళి చేసుకుంటానని బెదిరిస్తుంటాడు. కింది అంశాలలో స్త్రీ సమస్యలు అంచనవేయవచ్చు.

## 4.4.6. వెండిమేఘం-ముస్లింల ఆచార వ్యవహారాలు :

ముస్లింలకు ప్రత్యేకమైన ఆచారవ్యవహారాలు ఉన్నాయి. పుట్టినప్పుడు, అమ్మాయి పుష్పవతి అయినప్పుడు, అబ్బాయిలకు ఖత్నా చేసేటప్పుడు. వివాహాలప్పుడు, మరణించినప్పుడు, నిత్యజీవితంలో ప్రత్యేకమైన ఆచారాలు నమ్మకాలు ఉన్నాయి. ముస్లింలకు మతం ప్రధానమైనది. మత ధర్మాలకు బట్టి నమ్మకాలు, విశ్వాసాలు ఏర్పడ్డాయి. అయితే మతమార్పిడి, దళితులు, దూదేకులుగా మారిన సందర్భంలో పూర్వమత ఆచారాలు, నమ్మకాలు ప్రభావం అంతరంచకపోవడంతో, హిందూ ముస్లిం సమ్మేళనంలో కొత్త సాంస్కృతికాంశాలు రూపొందవచ్చు. తెలుగు ప్రాంతంలో ముస్లింలు ఎదో విధంగా ముస్లిం మతం పుచ్చుకున్నవారే అధికమని విమర్శకుల అభిప్రాయం. అందుకే దళితులకు-తెలుగు, ముస్లింల మధ్య సాంస్కృతిక సంబంద బాంధవ్యాలు మెండు. అందుకే మొదట్లో ముస్లిం కవులు, దళిత కవులుగా గుర్తింపు పొందారు.

**పుట్టుక:**

ముస్లిం కుటుంబాలు పిల్లలను దేవుడిచ్చిన వరంగా భావిస్తారు. కుటుంబ నియంత్రణ పాటించడం పాపమనుకుంటారు అని ప్రచారం ఉంది. " ముస్లింలందరూ నాలుగైదు పెళ్ళిళు ్ళ చేసుకుని కుటుంబ నియంత్రణకు విరుద్ధంగా పిల్లల్ని కని తమ జనాభాను విపరీతంగా పెంచుకున్నారనే ప్రచారం కూడా జరుగుతుంది. కానీ చరిత్రలో ఏ ఒక్క ప్రజాసముహా ప్రజాతి, ఏ దేశంలో, ఏ కాలంలో, ఇలా ఉద్దేశ్యపూర్వకంగా తమ మతస్థుల జనభాను పెంచుకున్న దాఖలాల్లేవు. భారత జనాభా గణన వార్తలు కూడా ఈ తప్పుడు ప్రచారాన్ని సమర్థించడం లేదు.... ముస్లిం ఆడవాళ్ళను బుర్ఖాలో దాచేస్తూ వాళ్ళకు విద్య, ఇతర హక్కుల్ని నిరాకరిస్తోన్న మూఢాచారాలు కుటుంబ నియంత్రణ గురించి వాళ్ళకుండే అనాసక్తి.... ఇవన్నీ ముస్లింలు... ప్రత్యేకత చాటుకోవడానికి సామూహికంగా కావాలని చేస్తోన్న కుట్రని

విధించబడుతోంది. కానీ ఇలాంటివి... సాంస్కృతిక, సాంఘీక, ఆర్థిక, విద్యారంగాలన్నింటిలో వెనకబడినట్టి జాతి లక్షణాలు" (రాజేందర్, జి 2005. ఈ దేశంలో ముస్లింల దుస్థితి. ముల్కి) అని చెప్పవచ్చు. ముస్లింలను పుట్టకముందే దేశద్రోహుల జాబితాలో చేర్చుతున్నారని ఖాదర్ మోహిద్దిన్ 'పుట్టుమచ్చ' కవిత సంకలనంలో ఆవేధన వ్యక్తం చేశారు. రఫీ పుట్టిన నాలుగు రోజుల తర్వాత ఛిల్లా (బాలసాల) వేడుక ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఘనంగా ఛిల్లా వేడుక జరిపించారు. జిలానీ పుట్టినప్పుడు ఇలాంటి వేడుక చేయలేదు. అప్పటికే అన్వర్ని, బాషా వేరుగా పెట్టాడు. కనుక అన్ని కాన్పులకు ముస్లింలు ఛిల్లా వేడుక చేసుకోరని, ఆర్థిక పరిస్థితిని బట్టి చేసుకుంటారని చెప్పవచ్చు.

**అక్షరభ్యాసం:**

ముస్లిం పిల్లలను మదర్సాలలో అక్షరభ్యాసం చేయిస్తారు. మత విద్యనే ప్రధానంగా నేర్చుకుంటారు. అయితే ఈ నవలలో అన్వర్ తన పిల్లలిద్దరికీ ప్రభుత్వ పాఠశాలలోనే విద్య నేర్పించింది. రెండో కొడుకు జిలానీకి హిందూ సాంప్రదాయంలో అక్షరభ్యాసం చేయించింది. బ్రాహ్మణ పంతులు చెప్పిన ప్రకారం ముహూర్తం నిర్ణయించి ఉన్నంతలో ఘనంగా జరిపించింది. ఆ పంతులుకి సంభావన కూడా సమర్పించింది. ఇలా చేయించడం ప్రధానంగా బ్రాహ్మణ వాద ప్రభావానికి ముస్లింలు కూడా లోను అవుతున్నారని రచయిత ఉద్దేశ్యమని చెప్పుకోవచ్చు. పెళ్ళి, విడాకుల గురించి ముందే చర్చించాను గమనించగలరు.

**వివాహం:**

సలీమున్ మరణం తర్వాత అన్వర్ పదకొండు సంవత్సరాలకు పుష్పవతి అవుతుంది. రఫీ అలాపాలనా కోసం బాషా అన్వర్ తండ్రిని వివాహం కోసం ఒప్పిస్తాడు. అప్పటికే బాషా వయస్సు 36 సంవత్సరాలు. పదకొండు సంవత్సరాల పసిమొగ్గ అన్వర్ని నిద్రలోనే పెళ్ళి చేసుకుంటాడు.

స్వాతంత్ర్యానికి పూర్వం ముస్లింలతో బాల్య వివాహాలు జరిగేవని చెప్పడానికి పై సంఘటన సాక్ష్యమనవచ్చు. ఏమి ఎరుగని పసి మొగ్గలకి పెళ్ళి చేసేవారని చెప్పవచ్చు. కుటుంబంలో స్త్రీలకి, వారి మాటలకి ఎలాంటి ప్రాధాన్యత ఇలాంటి విషయాల్లో లేవని అన్వర్ తల్లి పాత్ర ద్వారా చెప్పవచ్చు. ఆమె బాషాతో అన్వర్ పెళ్ళి వ్యతిరేకించినప్పటికీ భర్త మీరా సాహెబు ఆమె అభిప్రాయానికి ఎలాంటి విలువనివ్వడు. కాబట్టి స్త్రీలకు కుటుంబ వ్యవహారాల్లో ఎలాంటి విలువ లేదని చెప్పవచ్చు. ముస్లింలో బహుభార్యత్వం ఉంది. చిన్న గంజాంతో ఒక్క వ్యక్తికి నలుగురు భార్లను పెళ్ళి చేసకుఉన్నాడు. నిత్యం వారితో గొడవలు పడేవాడు. అందుకే అన్వర్ తనకు సవతి పోరు వద్దనుకుంది. కానీ అన్వర్తో గొడవపడిన బాషా లద్దాఫ్నీ సైదాబీని రెండో వివాహం చేసుకుంటాడు. బాషా అన్వర్కి విడాకులు ఇవ్వకుండా ఈ వివాహం చేసుకుంటాడు. ముస్లింలలో పురుషుడు రెండో పెళ్ళి చేసుకోవడానికి మొదటి భార్య అంగీకారం అవసరం లేదని పై సంఘటనతో చెప్పవచ్చు. లైకిక రాజ్యమని చెప్పుకుంటున్న మనదేశంలో మస్లిం పర్సనల్ లా పై అనేక సంస్కరణలు జరిగాయని రచయిత ఎత్తి చూపారు. " రెండో పెళ్ళి చేసుకునే ముందు మొదటి భార్య ఆమోదం పొందాలని, అంతే కాకుండా బలమైన కారణం లేకుండా రెండో పెళ్ళి చేసుకోకూడదని చట్టం చసింది." (వెండిమేఘం: 371) అని రచయిత తెలియజేశారు. ఇండియాలో కూడా ముస్లిం పర్సనల్లా లో సంస్కరణలు జరగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**విడాకులు:**

ఈ నవలలో విడాకుల ప్రస్తావన ఉంది. బాషా క్షయ వ్యాధికి గురైనప్పుడు అన్వర్ పలకరిస్తే నీకు తలాక్ చెప్పను తలాక్ చెబితే నీవు నీ ప్రియుడితో హాయిగా కులకవచ్చని

ఆలోచిస్తున్నావేమో... " నిన్ను ఏలుకోను... అలాగని తలాక్ కూడా చెప్పను. తలాక్ చెప్పేస్తే నీకు రెక్కలు మొలుస్తాయి. నువ్విలా నా ఇంటి ముందు కుక్కలా పడిఉండాల్సిందే" (వెండిమేఘం: పు.181) నని కోపగించుకుంటాడు. చిన్ననాటి స్నేహితురాలు జమీలా భర్త ఆమెకు తలాక్ చెప్పి వదిలివేస్తాడు. దాంతో ఆమె పరిస్థితి ధీనంగా మారిపోతుంది. ఇస్లాంలో విడాకులకు అవకాశం ఉంది. తలాక్ వల్ల అమాయకమైన స్త్రీ ఏ విధంగా ఇబ్బందులకు గురౌతున్నారో చిత్రీకరించాడు.

**మరణం:**

ముస్లింలు మరణాంతరం ఆత్మలకు అల్లా అంతిమ తీర్పు ఇస్తాడని నమ్ముతారు. అంతిమ తీర్పులో శిక్ష నుండి తప్పించుకొని స్వర్గానికి వెళ్ళాలంటే భూమి మీద మంచి కార్యాలు చేయాలని విశ్వసిస్తారు. బాషా క్షయ వ్యాధితో మరణిస్తాడు. అతడి శవాన్ని అంతిమ సంస్కరణలు ఇస్లాం ప్రకారం చేస్తారు. శవ సంస్కరణల గురించి మరణాంతర జీవితాన్ని ముస్లింలు నమ్ముతారు. అందుకే శవ సంస్కరణలు ఎంతో శ్రద్ధగా చేస్తారు. చనిపోయిన వ్యక్తి పాపాల్ని క్షమించమని ప్రార్థనలు చేస్తారు. చనిపోయిన వ్యక్తి స్వర్గానికే వెళ్ళాలని కోరకుంటారు.

**ఆహారం:**

ముస్లింలవి ప్రత్యేకమైన ఆహార అలవాట్లు, వారు ఎక్కువగా మాంసాహారాన్ని ఇష్టపడతారు. బిర్యానీ, పలావ్‌లను ప్రత్యేకంగా చేస్తారు. ఛిల్లా వేడుకల్లో బిర్యానీ, మేకపోతు మాసంతో విందు చేసినట్లుగా చెప్పబడింది. (పు.3) వరి అన్నం అప్పుడప్పుడు తినేవారని, జొన్న, సజ్జ, సంగటి రోజు తినేవారని తెలుస్తుంది. (పు.33) చేపల కూరంటే ముస్లింలు ఇష్టంగా తింటారు. రాగి నూకతో పిట్టు, రాగి అంబలి చేసుకుని తినేవారు. రంజాన్ పండగ సందర్భంగా సేమ్యాలు ప్రత్యేకంగా తయారు చేసుకుని తినేవారు. పలావ్ రంజాన్ రోజు ప్రత్యేకమైన వంటకం, పేదవారు, కూటికి జరగని వారు పున్నీళ్ళు కలుపుకుని, గొడ్డుకారం నంజుకుని తింటూఉంటారు. (పు.168) పున్నీళ్లు ప్రత్యేకమైన పానీయం. పుల్లటి రుచితో ఉంటాయి. తగిన కడుపు చల్లగా ఉంటుంది. పున్నీళ్ళు గురించి నల్లమిరియం చెట్టు, ఎన్నెల నవ్వు నవలల్లో తెలయజేయడం జరిగింది. ఆ నవలని చర్చించేటప్పుడు వివరించడం జరిగింది. గొడ్డుమాంసం ముస్లింలు తింటారు. కానీ ఈ నవలలో ఎక్కడా ఆ విషయం ప్రస్తవించలేదు. మాలస్త్రీ ఆదెమ్మ ఇంటికి పని మీద అన్వర్ వచ్చినప్పుడు అన్నం తినమని అడిగింది. అన్వర్ మరోసారి తింటానని చెప్పింది. " గొడ్డు మాంసం కాదులే అన్వరా... పొట్టేలు మాంసం" (పు.222) అని చెప్పడాన్ని బట్టి అన్వరు గొడ్డు మాంసం తినదని చెప్పుకోవచ్చు.

రఫీ, జిలానీల ఖత్నా సమయంలో " వేటమాంసం కూర, బిర్యాని, బగారే, బైగన్, దాల్చార్, గోంగూర పచ్చడి, పెరుగు చెట్నీ" (పు.230)ని విందులోకి వడ్డించారు. వడుగువైన పిల్లలకు బలమైన ఆహారంగా చపాతీలు, మటన్ కుర్మా, గోధుమలు, నెయ్యి బాగా పెడతారు. సున్ని ఉండలు మొదలైనవి ఇరవై ఒక్కరోజు తినిపిస్తారు. పై విధంగా ముస్లింల, దూదేకుల ఆహారపు అలవాట్లు సందర్భానుసారంగా రచయిత సలీం గారు తెలియజేశారు.

**వృత్తులు:**

ముస్లింలో ఎక్కువ మంది చేతి వృత్తుల మీదే ఆధారపడి జీవిస్తారు. ఆధునిక విద్యకు దూరంగా ఉంటారు. కనుక చిన్నతనం నుండి వారు పని సంస్కృతిలో పెరుగుతారు. ప్రతి ముస్లిం కష్టపడి పనిచేయటానికి ఆసక్తి చూపుతాడు. ఈ నవలలో బాషా, పొగాకు కంపెనీలో మార్కర్‌గా పనిచేస్తుంటాడు. చదువుమీద అతనికి గురిలేదు. కావున పిల్లలు చిన్న వయస్సులో హాయిగా ఆడుకోవాలని తన కొడుకిని బడికి పంపించడానికి ఆసక్తి చూపడు. పెద్దయిన తరువాత తనలాగే తన కొడుకుని పొగాకు కంపెనీలో ఎదో ఒక పనిలో పెడితే హాయిగా

బతుకు సాగిస్తాడని అతని ఆలోచన. ఇది అజ్ఞానం వలన వచ్చిన పొరపాటు అవగాహణగా మనం అర్థం చేసుకోవాలి. ఆ ఊరిలో కుర్రకారు ఎవరూ చదువుకోరు. “ జులాయిల్లా, ఆవారాల్లా తిరుగుతుంటారు. తండ్రితో కలిసి పొలం పనులకు వెళ్ళడమో లేకపోతే ఏ మెకానిక్ షాపులోనో, రిక్షాలాగే పనిలోనో, టైర్లకు పంక్చర్‌లు వేసే పనిలోనో చేరిపోతారు. తప్పా చదువుకోరు”. (పు.75) అమ్మాయిలను గోల చేస్తూ రోడ్ల వెంట తిరుగుతుంటారని రచయిత తెలియజేశారు. బాషా మరణాంతరం అన్వర్ గ్రేడింగ్ పనికి వెళ్ళింది. అక్కడ పనిచేసేవారందరు బహుజన కులాలకు చెందిన మాల, మాదిగ, ఎరుకల, యానాదులే. (పు.192) గ్రేడింగ్ పని సీజనల్‌గా ఆరు నెలలే ఉండేది. మిగిలిన ఆరు నెలలు పల్లె జనాలు వ్యవసాయం చేసేవారు. అన్వర్ కూడా వ్యవసాయాన్నే నమ్ముకుంది. ఆదాం, ఆదెమ్మ, వెంకట్‌రెడ్డి, తమ వంతు సహాయాన్ని అన్వర్‌కు అందించారు. వారికి ఆదాయంలో భాగాన్ని పంచింది అన్వర్. మెట్రిక్యులేషన్ పూర్తి చేసుకుని ఉపాధి చూసుకోవాలని రాఘవయ్య పంతులు సలహాతో చదువు మొదలు పెట్టింది అన్వర్. కానీ పాస్ అయిన తరువాత తన నిర్ణయాన్ని మార్చుకుని “ వ్యవసాయం ప్రారంభించకముందే ఉద్యోగం నా అధృష్టంగా భావించి స్వీకరించేదాన్నేమో ఇప్పుడాపని చేయలేను. పంట పండించటంలో ఉన్న శ్రమైక జీవన సౌందర్యం అర్థమైనదాన్ని. నా జన్మ సాపల్యం పంట పండించటంలోనే ఉంది”. (పు.280) అని రాఘవయ్య పంతులికి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసింది. బిడ్డ మీద తల్లికి ఉండే మమకారాన్ని అన్వర్ తన భూమి మీద పెంచుకుంది. అందుకే రఫీ గొడవ పెట్టుకుని తన పేరులో ఉన్న పొలాన్ని వెనక్కి తీసుకున్నప్పుడు ఆమె ఎంతో బాధపడింది. ఎవరికో కౌలుకివ్వడం ఎందుకని సొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసింది. అన్వర్ భూమిని నమ్ముకుని వ్యవసాయాన్నే వృత్తిగా చేపట్టి కుటుంబాన్ని ఒంటి చేత్తో నడిపించగలిగింది. అందుకే చదువుకున్న యువత ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో కాలయాపన చెయ్యకుండా తమకు తోచిన వృత్తిని స్వీకరించాలని చెప్తూ వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సందేశం ఇచ్చినట్లుగా చెప్పుకోవచ్చు.

**పండుగలు:**

ముస్లిం ముఖ్యంగా రంజాన్, మొహర్రం (పీర్ల) పండుగలు జరుపుకుంటారు. ముస్లింలకు రంజాన్ పవిత్రమైన మాసం, మొహర్రం పండుగను షియా ముస్లింలే జరుపుకుంటారు. కానీ తెలుగు ప్రాంతంలో ముస్లింలందరూ పీర్ల పండుగ ఉత్సావాల్లో పాల్గొంటారు. ముస్లింలతో పాటు ఇతర కులాల వారు పీర్ల పండుగ సంబరాల్లో పాల్గొంటారు. పీర్ల పండుగ సబ్బండ కులాల పండుగగా వేముల ఎల్లయ్య ప్రకటించారు. పీర్ల పండుగ పూర్తిగా తెలుగీకరించబడింది. ఈ నవలలో సలీం గారు రంజాన్, మొహర్రం, దీపావళి పండుగలను గురించి తెలియజేశారు. రంజాన్ పండుగ సమయంలో ఆనంతోత్సహాల మధ్య పండుగ జరుపుకున్నట్లు తెలియజేశారు. రంజాన్ పండుగ సమయంలో ఆనందోత్సహాల మధ్య పండుగ జరుపుకున్నట్లు తెలియజేశారు. కూటికి లేని వారు రంజాన్ సమయంలో ఎలాంటి బాధలు అనుభవించే వారో తెలియజేశారు.

దీపావళి పండుగ హిందువుల పండగైనా ముస్లింలు జరుపుకుంటారని తెలియజేశారు. ఇది మిశ్రమ సంస్కృతిలో భాగమే ముఖ్యంగా ముస్లింలు తక్కువగా ఉన్న ఊర్లో హిందూ ఆచార ప్రభావాలు ఎక్కువని అర్థం చేసుకోవచ్చు. దీపావళి పండుగ ఎక్కువగా పిల్లలు చేసుకుంటారు. పెద్దలు చూసి ఆనందిస్తారని చెప్పవచ్చు. హిందు పండుగలను దూదేకులు చేసుకుంటారు. హిందువు ఆచార వ్యవహారాలు వీరు పాటిస్తారు. దూదేకుల మీద రెండు మతాల ప్రభావం ఉంటుంది. కాబట్టి రెండు మతాలు పండగలను చేసుకుంటారు.

ముస్లింలు దీపావళి పండగను జరుపుకున్నట్లే హిందువులు మొహర్రం పండుగ సంబరాల్లో పాల్గొంటున్నారు. ఆ పండుగను తమ సొంతం చేసుకున్నారు. పీర్ల పండగ " ఏ ఇతర మతాల్లోని పండగ ఆకర్షించని విధంగా మొహర్రం ఆకట్టుకుంది. మొహర్రం పండుగలో అత్యుత్సాహంగా పాల్గొనడేమ కాకుండా దాన్ని తమ సంస్కృతీకరణం చేసి తమ కనువుగా, అనుగుణంగా మలచుకున్నారు. మొహర్రం పండగలోని పీర్లను దేవుళ్ళుగా భావించి మొక్కుతారు. తమ గ్రామ దేవతలకు జరిపే వేడకలను పీర్లకు కూడా జరుపుతారు. ముస్లిం మతంలోని మూల సిద్ధాంతాలను పాటిస్తూనే తమ ఆచార సాంప్రదాయాలకనుగుణంగా పీర్ల పండుగ చేసుకుంటారు." ( ప్రేమలత, రావి:2005, తెలుగోల్ల ముస్లింల సమైక్యతకు నిదర్శన మొహర్రం. ముల్కి పు.77) రాని ప్రేమలతగారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

"పీర్లు పుట్టుకుని నిప్పప గుండంలో నడవటం ముస్లింలే కాక వూర్లోని హిందువులు కూడా ఆసక్తిగా గమనిస్తారు. కొంతమంది హిందువులు తాము కూడా పీర్లు నడుముకు కట్టుకుని ' అలావలో నడుస్తారు. మాతం షీయాలే చేస్తారు. కానీ ఆంధ్రరాష్ట్రంలోని ఆ పల్లెటూరిలో షియా, సున్నీలన్న బేధంలేదు. అలాగే నిప్పుగుండంలో దూకటంలో హిందూ, ముస్లిం అన్న భేదము లేదు". (వె. మే:పు.137) అని చెరెప్పవచ్చు. ఇస్లాం సంవత్సర మొదటి మాసం మొహర్రం అంటే నిషేదించబడినది అని అర్థం. ఈ నెలలోనే మహ్మదు ప్రవక్త మనుమడు ఇమామ్ హుసేన్‌తో పాటు అతని 72 మంది పరివారం వీరమరణం పొందారు. వారిని స్మరించుకుంటు జరపబడే పండగే మొహర్రం. వారి పేరు మీదగా పీర్లను ప్రతిష్టించి ఊరేగించి విషాదభరితంగా పండుగను జరుపుకుంటారు. అందుకే మొహర్రంను పీర్ల పండగా, పంజా-కాఈబ్- ఆనే పేర్లతో పిలుస్తారు. 15వ శతాబ్ధం చివరి నుండి అరబ్ దేశాలలో ఈ పండగ చేయడం ఆచారమైంది. అప్పటి నుండే భారత దేశంలో మొహర్రం పండగను ప్రభుత్వ అధికార లాంచనాలతో బీజాపూర్‌లో, గోల్కొండ సుల్తాన్‌లు జరపడం ఆనవాయితీగా మొదలు పెట్టారు. ఆ సాంప్రదాయం నేటికి కొనసాగుతూనే ఉంది.

పీర్ల పండగకి గ్రామంలోని అన్ని కులాల వారు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారు. " చాకలి వారు పీర్ల కొట్టానికి సున్నం వేస్తారు. కంసాలి పీర్లను శుభ్రపరుస్తాడు. ఎరుకలి గుమ్మటాలను, కర్రలను బాగు చేయడమో, కొత్తవాటిని పెట్టడమో చేస్తాడు. పీర్లకు కట్టే దట్టీలకు అవసరమయ్యే దారాన్ని పద్మశాలి ఇస్తాడు. మట్కీ కుండలను కుమ్మరి ఇస్తాడు. పానకానికి లేదా శర్బతుకు అవసరమయ్యే బెల్లాన్ని కోమటి ఇస్తాడు. ఊరేగింపులో దప్పులను మాదిగలు వాయిస్తారు. పీర్ల పండగ చివరన చేసుకునే విందుకు కావలసిన బియ్యాన్ని ఊరి పటేల్ ఇస్తాడు. గౌడు కల్లుతో అందరిని తృప్తిపరుస్తాడు. పీర్లకు బలిగా ఇచ్చే మేకపోతును గొల్లలిస్తారు. విందులోని వంటలను మంగళి వండుతాడు. అందరికీ వడ్డిస్తాడు. ఇటా ఊళ్ళోని అన్ని వృత్తుల వారు పీర్ల పండుగలో పాలు పంచుకుంటారు." (ముల్కి పు.84) తెలుగువారు మొహర్రం పండుగను తమ స్వంతం చేసుకున్నారు. రాజకీయాలతో మతతత్వ శక్తులు ప్రజల మధ్య ఎన్ని విభేదాలు సృష్టిస్తున్నా పీర్ల పండుగ మాత్రం తెలుగు ప్రజల్లో సోదరభావాన్ని పెంపొందిస్తుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ పీర్ల పండుగ గొప్పతనాన్ని చక్కగా వివరించి త్యాగానికి ఉన్న శక్తిని తెలియజేసి మానవులంతా త్యాగనిరతితో ఉండాలని రచయిత తెలియజేశారనవచ్చు. ముస్లింలు జరుపుకునే వివిధ పండుగలను రచయిత సందర్భానుసారంగా నవలలో ప్రవేశపెట్టి వారి సాంస్కృతిక జీవనాన్ని చక్కగా వివరించారని చెప్పవచ్చు.

### 4.4.7. వెండిమేఘం-మతకలహాలు :

ఈ దేశంలో వందల సంవత్సరాలుగా అనేక మతాలు కలిసి మెలిసి సహజీవనం సాగిస్తున్నాయి. దాంతో బిన్నమైన సంస్కృతికి దారులు ఏర్పడ్డాయి. వలస పాలనలో జాతి

అనే భావనకు అంకురార్పన జరిగింది. ఆ భావన మొగ్గలు తొడగడానికి మత భావాలను రాజకీయనాయకులు ప్రచారం చేశారు. అందులో భాగంగానే గణేష్ ఉత్సవాలు గతాన్ని స్మరించుకోవటంగా మొదలై జాతీయ భావానికి దారితీసింది. ఆ నేపథ్యం నుండి జాతియవాదం, జాతీయ ఏకత్వమని సావర్కర్ లాంటి హిందువు నేతలు, హిందు ధర్మం పేరుతో ముందుకు వచ్చారు. ఆ భావనే తరువాత తరువాత హిందూత్వగా రూపుదాల్చింది.

దీనికి ముందు మనం హిందూ అనే పదాన్ని అర్థం చేసుకోవాలి. హిందువు అనే పదాన్ని అంబేద్కర్ కులనిర్మూలనా గ్రంథంలో హిందూ సొసైటీ ఈజ్ ఎ మిత్ అనే ఉపశీర్షికతో విమర్శనాత్మకంగా పరిశీలన చేశారు. " హిందూ అనే పదమే ఒక విదేశిపదం నుండి వచ్చింది. మహ్మదీయులు తమ ప్రత్యేకతను తెలియజేసకునేందుకు ఈ దేశపు ప్రజలకు హిందువులని పేరు పెట్టారు. మహ్మదీయ దండయాత్రలకు పూర్వం ఏ సంస్కృత గ్రంథలలోనూ హిందూ శబ్ధం కనిపించదు. ఈ దేశ ప్రజలు తమంతా జాతి అనే భావనతో లేరు. ఈ సమాజం ఎప్పుడు ఒకటిగా లేదు. కులాలుగా విభజించబడి ఉన్నాయి. సమైఖ్యంగా ఎప్పుడు లేవు. ఎప్పుడైనా హిందూ, ముస్లిం కొట్లాట సంభవించినప్పుడు తప్పా ఏ కులానికి మరో కులంతో అనుబంధం ఉన్నట్లు కనిపించదు.' (అంబేద్కర్: 1993డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు- ప్రసంగాలు, సంపుటం.1: కులనిర్మూలన, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ హైదరాబాద్) అని అంబేద్కర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

హిందూ శబ్దం 17వ శతాబ్దం నుండే విస్తృతంగా వాడుకలోకి వచ్చిందని చరిత్ర పరిశోధకుల అభిప్రాయం. అయితే బ్రాహ్మణ వాదులు హిందూ పదము మూలాలను సింధు పథంతో ముడిపెట్టారు. ప్రాంత, జాతి సంబంధ వాచకాలుగా ప్రచారం చేశారు. 'పర్షియన్ భాషలో సకారం లేదనీ, హాకారం మాత్రమే ఉందని కనుక పర్షియన్లు సింధూ పదాన్ని హిందూగా ఉచ్చరించారని నమ్మపలికారు. కానీ పర్షియన్ భాషలో సకారం ఉంది. హిందూ అనే శబ్దానికి పర్షియన్ భాషలో మూడు అర్థాలున్నాయి. 1) బానిస, 2) నల్లని వాళ్ళు, 3) పరాజితులు' అన్నారని జిలుకర శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. శ్రీనివాస్, జిలుకర.పు.8) మహ్మదీయ పాలకులు ఈ దేశ ప్రజలకు సంస్కృతి హీనులుగా భావించి హిందూ అనే పదాన్ని ఎంచుకున్నారు. సావర్కర్ ముందు వరకు ఉన్న హిందూ మత పండితులెవ్వరూ ఈ పదాన్ని అంగీకరించలేదు. ఎందుకంటే బ్రాహ్మణుల దృష్టిలో హిందువులంటే శూద్ర, అతిశూద్ర, ఆదివాసీలు, మాత్రమే మహ్మదీయుల మాదిరిగానే బ్రాహ్మణులు కూడా యూరేషియా ప్రాంతం నుండి ఈ దేశంలోకి చొరబడిన వాళ్లే. అందువల్ల బానిసత్వాన్ని, రంగు తక్కువతనాన్ని, ప్రదర్శించే హిందూ శబ్దాన్ని తిరస్కరించారని' (శ్రీనివాస్,జిలుకర.2012) జిలుకర శ్రీనివాస్ స్పష్టం చేశారు.

అయితే 1901 జనాభా లెక్కల సమయంలో అగ్రకులాల ప్రయోజనం కొరకు హిందువులంటే బ్రాహ్మణులు, బనియాలు, క్షత్రియులు అనే భావన బ్రీటీష్ వారికి కలిగించారు. ఆ జనాభ గణన బ్రాహ్మణులు 3శాతమేనని తేల్చింది.ముస్లింలకు అత్యధిక భాగం అయారు. దాంతో శూద్రులు అంటరానివారు, ఆదివాసీలను కూడా హిందువులుగా ప్రచారం చేశారు. ఆ నేపథ్యం నుండే హిందూత్వ భూవన రూపుదాల్చిందనవచ్చు. హిందూత్వ హిందు మతం కాదు. అది జీవన విధానం అసలే కాదు. అదోవిచ్ఛిన్న కర మత్రవా పాదికన జాత్యాంకారమని చెప్పవచ్చు. లౌకిక దేశమైన భారత్‌లో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందే, ఏమతం వారైనా హిందుస్థాన్‌లో ఉంటే హిందువులే అనే నినాదాలతో విద్వేషపూరిత ప్రచారాన్ని జోడించి సమాజంలో ముస్లిం వ్యతిరేకత పెంచారనవచ్చు. ఉగ్రవాదన్ని చూపించి, ముస్లింలను బూచిగా నిలబెట్టారు. మైనార్టీలుగా ఉన్న ముస్లింలను ఇంకా అణగద్రొక్కి తక్కువ స్థాయి

పౌరులుగా తీర్చిదిద్దడమే హిందూత్వ లక్ష్యం. అయితే ఇప్పటి రాజకీయులు చెప్పే “ హిందూత్వకు ప్రాతిపదిక లేదు, మతలక్షణాలు లేవు. దీనికి కుల ప్రాతిపదిక మాత్రమే ఉంది. బ్రాహ్మణీయ భావజాల కర్తలు మిగతా కులాలన్నింటిని తను ఆధిపత్యం కోసం క ఊడగట్టుకోవడమే హిందూత్వ అనవచ్చు. హిందూత్వం అనేది ఇవాళ కూడగట్టడానికో, వ్యతిరేకించడానికో వాడుతున్న ఒక రాజకీయ నినాదంగా చెప్పుకోవచ్చు. జీవన విధానాన్ని, జీవనశైలిని పరిగణలోకి తీసుకుంటూ దానికి ప్రత్యేక అస్తిత్వం ఉన్నట్లు లేదు’ని (ప్రతాపరెడ్డి, కాసుల 2005.50) కాసు లప్రతాపరెడ్డి తెలియజేశారు. అంతేగాక హజందూత్వనరు ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ సాంస్కృతికోద్యమాలు రావలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దళిత ముస్లి ఐక్యతతోనే ముస్లిం సమాజానికి లేదా భారతీయ సమాజానికి రక్షణనిస్తుందని సాహిత్యవిమర్శకుల అభిప్రాయం.

ముస్లింలు ఈ దేశంలో ఉండాలంటే తమ ప్రత్యేకత అస్తిత్వాన్ని వదులుకోవాలని, హిందూ మతాంతీకరణకు సిద్ధపడాలని చెబుతున్నది. లేకపోతే కనీసం పౌరహక్కులు కూడా ఇవ్వబడవని గోల్వాల్కర్ ‘మనము’ మన జాతీయతకు నిర్వచనం’ అనే గ్రంథంలో నిర్దేశించారు. అందులో భాగంగానే పరమతాల్ని భారతీయీకరించాలని ప్రకటించాడు. అంటే హిందూకరించడమేనని చెప్పుకోవచ్చు. ఇలా హిందూకరణ చేయడమంటే నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ నిర్మాణాన్ని వ్యవస్థీకృతం చేయడమేనని చెప్పవచ్చు. ఇతర దశాలలో మైనార్టీల సమస్యకు ఇక్కడ ముస్లిలం సమస్య భిన్నంగా ఉంది. వందల యేళ్ళుగా భారతీయ సమాజంలో కలిసిపోయి జీవిస్తున్న ముస్లింల మీద హిందూత్వశక్తులు దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తుంది. హిందూత్వ వ్యూహాత్మకంగా ముస్లింల మీదే దాడి చేస్తుంది. ఆ దాడులకు హిందూకరించబడిన ఎస్సీ, ఎస్టీ, బి.సి శక్తులనే వినియోగించుకుంటుంది. ముస్లింల మీద దాడిని రెండు మతాల మధ్య ఘర్షణగా లేదా ఒక సమూహానికి పరిమత అంశంగా ప్రచారం చేస్తుంది. దాంతో మిగిలిన సమూహాల నుండి ముస్లింలకు ఒంటరిని చేయడమనేది హిందూత్వ వ్యూహంలోని ఎత్తుగడని చెప్పవచ్చు. ఈ వ్యూహంలో భాగంగానే మత ఘర్షణలు గానీ దానికి సంబంధించిన అంశాలు బాబ్రీమసీదు కూల్చివేత, గుజరాత్ మరణకాండలను, హైదరాబాద్‌లో జరిగిన మతకలహాలను ఇందుకు భిన్నంగా చూడలేం.

ఈ నవలలో సలీలం గారు 1995లో జరిగిన మత కలహాల నేపథ్యాఇన్న విపులంగా వివరించారు. హైదరాబాద్‌లోనే మత కలహాలు ఎందుకు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎందుకు జరగడం లేదు. లనే అంశాన్ని ప్రధానంగా లేవనెత్తారు. మత కలహాల్లో ఇరు మతాలు పడుతున్న భయాందోనళలను, అమాయకులను బలితీసుకుంటున్న విధంను చర్చించారు. గ్రామీణ ప్రాంతం నుండి హైదరాబాదు వచ్చిన అన్వర్ మత ఘర్షణలను అనుభవపూర్వకంగా తెలుసుకుని వాటిని వ్యాఖ్యానించింది. హిందూ పోలీసు ‘మాజీ! భయపడకండీ. మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డేస్తాను” (పు.356)నని ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చాడు. అప్పటి వరకు అన్వర్ అతడ్ని ముస్లింగా భావించింది. పేరు తెలుసుకుని చదువు కున్న వారిలో, ప్రభుత్వధికారుల్లో మత మౌఢ్యం లేదని వ్యాఖ్యానిస్తుంది. (పు.362) పదిరోజుల పైనే మత ఘర్షణలు ఎక్కడో ఒక్క చోట జరుగుతూనే ఉండడంతో అన్వర్ చాల వ్యాకుల పడింది. మనోవేధనకు లోనైంది.

అన్వర్ మతఘర్షణలు కొత్త అనుభవాన్ని ఇచ్చాయి. మతం వల్ల సహనం, దయ, సానుభూతి పెరగాలి. సాటి మనిషిని మనిషిగా చూడలేని భక్తి దేశభక్తి కాదని బాధపడింది. అన్వర్ బాధను అర్థం చేసుకున్న కొడుకు జిలానీ మత ఘర్షణల వెనుకున్న రాజీకయ, ఆర్థిక కోణాన్ని వివరించి చెప్పాడు. “ ఇదంతా మతం రంగు పులుముకున్న రాజకీయం మా! ఇవన్నీ రాజకీయ దురుద్దేశంతో జరిగే హత్యలే” (పు.364)నని రచయిత వివరించడం సమకాలీన

రాజకీయ పరిస్థితులపై సలీంకు ఉన్న అవగాహనను ఎరుక పరుస్తుంది. రాజకీయ నాయకులు కుర్చీలాటలో మతాన్ని ఎలా వాడు కుంటున్నారో అవగతం అవుతుందనవచ్చు. జంట నగరాల్లో ల్యాండు మాఫియా అకృత్యాలను గురించి వివరించాడు. "అదంతా ల్యాండ్ మాఫియా అకృత్యాలను గురించి వివరించాడు. " అదంతా ల్యాడు మాఫియా ప్లాన్ మా!... యిది కోట్లలో జరిగే వ్యాపారమా! ముస్లిం తక్కువగా ఉన్న హిందూ ఇలాకా నుంచి ఆ ముస్లింలను భయపెట్టి, బెదిరించి ఇలాంటి మత కలహాలు సృష్టించి అభద్రతాభావానికి గురిచేసి, ఆస్తుల్ని తెగనమ్ముకుని పోయేలా చేస్తారు. "(పు.365) అలాగే ముస్లిం ప్రాంతాల్లో ఉండే హిందువులను వెళ్లగొడతారు. ఆ స్థలాలను తక్కువ రేట్లకు కొని ఎక్కువ రేట్లకు అమ్ముకుంటారని రచియత సరైన విశ్లేషణ చేశాడనవచ్చు. జిలాని చెప్పిన విషయాలను అవగహన చేసుకున్న అన్వర్ ముస్లింల వెనుకబాటు తనానికి దారిద్ర్యానికి, కష్టాలకు కరాణం చదువు లేకపోవడమేనని నిర్ణయాన్ని మార్చుకుంటుంది. ముస్లింలు రాజకీయ శక్తిగా ఎదగకపోవడమే అందుకు కారణమని అర్థం చేసుకుంది. " ఎంత చదువు చదివినా మతత్వాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకునే రాజకీయ నాయకులున్నంత కాలం కాసిని కాసుల కోసం వాళ్ళ చెప్పు చే తల్లో పనిచేసే కరుడు గట్టిన గూండాలున్నంత కాలం మన ముస్లింల స్థితి బాగుపడదని" (పు.365) ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె ఆవేదన చూసిన జిలాని " అంత నిరాశ దేనికి మా... ఇలాంటివన్ని హైదరాబాద్‌లాంటి నగరాలకే పరిమితం... ఒంగోల్లో మతకలహాలు జరగటం మనమెప్పుడూ విన్లేదు". (పు.366) అని ఓదార్చాడు. కానీ అన్వర్ ముందు చూపుతో మత కలహాలు గ్రామీణ ప్రాంతాలకు చోకకుండా మొదట్లోనే తుదముట్టించాలని భవిష్యత్తు దర్శనంతో ఆలోచన చేసింది. దానికి జిలాని ముస్లింలో సరియైన నాయకుడు లేకపోవడం మన దురదృష్టమన్నాడు.(పు.366) " పేద, వెనుకబడిన ముస్లింలను చైతన్య పరిచేందుకు నేడు వారికి (ముస్లింలకు) ఒక అంబేద్కర్ అవసరం. నేడు ముస్లింలకంటే దళితులు అనేక విషయాల్లో ముందున్నారు. వెనుక బడిన ముస్లింలు కూడా తమలోనే అలాంటి అంబేద్కర్‌ను తయారు చేసుకోవలసి ఉంది. అలా చేసిన అనంతరం కూడా వారు ముందకు సాగేందుకు క్లిష్టమైన , సుదీర్ఘమైన పోరాటాన్ని సాగించాల్సి ఉంది." ( అస్ఘర్ అలీ. 2005:76)అస్ఘర్ అలీ ఇంజనీర్ మహోన్నతమైన వ్యక్తిత్వం గల నాయకుల అవసరం ముస్లింలకు ఎంతైన ఉందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

అందుకే మానవ నాగరికత ఉచ్ఛస్థితికి ఇలాంటి ఘర్షణలతో తోడ్పాటునివ్వవని ఉత్తమ స్త్రీల ఉత్తమ సమాజ నిర్మాతలని మతం జీవితాన్ని ఆదర్శవంతంగా మల్చుకోవడానికి, దోహదపడుతుంది. దాన్నే గుడ్డిగా నమ్మితే పురోగమిస్తున్న కాళ్ళకు అడ్డం పడ్తుంది. స్త్రీ స్వతంత్ర్యం ప్రధానమని చెబుతూ " ఏ స్త్రీ అయినా స్వంత వ్యక్తిత్వం, ఆత్మగౌరవంతో బ్రతకాలి. ఈ రెండూ సాధించాలంటే పోరాడాలి" (పు.367) అని మనుమరాలికి కర్తవ్యాన్ని తెలియజేసి చైతన్యవంతం చేయడానికి తన కృషి చేసిందనవచ్చు. మతవిద్వేషం, జాతి పురోగతికి గొడ్డలి పెట్టులాంటిది. ఆ భావాన్ని రూపు మాపినప్పుడే దేశం ప్రగతి పథం వైపు ప్రయణిస్తుందని రచయిత తెలియజేశారు. మనిషిలోకి దానత్వానికి మతం కారణం అయితే ఆ మతమే వద్దంటానని లౌకిక దృష్టి ప్రదర్శించాడు. " ఇస్లాం అంటే శాంతి, జిహాద్ అంటే మనిషిలోపలి పశువ ప్రవృత్తితో చేసే... యుద్ధం" (పు.367) మన దానికి విరుద్ధంగా ఈ మత ఘర్షణలు జరుగుతున్నాయని అలా జరుగడం దేశ సమైఖ్యతకు గొడ్డలిపెట్టు అవుతుందని రచయిత తెలియజేశారు.

**ముగింపు:**

ఈ నవల కాలం 1947 పూర్వం నుండి మొదలవుతుంది. దేశవిభజన కాలంలో

దక్షిణాది ముస్లింల మనోభావాలు స్థూలంగా వ్యక్తం చేశారు. ముస్లింలలో అంటరాని వారు చూడబడుతున్న దూదేకుల జీవితాలను వాస్తవికంగా చిత్రీకరించారు. నవల అసాంతం ఏకపాత్ర ప్రాధాన్యతతో నడుస్తుంది. అన్వర్ 11 సంవత్సరాల వయస్సు నుండి 60 సంవత్సరాలు వచ్చే వరకు అంటే 50 సంవత్సరాల ముస్లిం జీవితాలను క్షుణ్ణంగా చర్చించారు. ముస్లిం మతంలో వివాదస్పదాంశాలుగా చూడబడుతున్న పెళ్ళి, విడాకులు, స్త్రీల అణిచివేతలను విపులంగా చర్చించారు. అన్వర్ మొదటి నుండి మతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించింది. నవల ముగింపులో మతం అనేది మానవాభివృద్ధికి దోహదం చేసే అంశం కావాలని చెప్పింది. అలా కాని పక్షంలో మతాలే అవసరం లేదంది. చదువులేకపోవడం ముస్లింల వెనుకబాటు తనానికి కారణం అనుకుంది. తాను చదువు నేర్చుకొని పది మందికి జ్ఞానాన్ని పంచిపెట్టింది. కానీ చదువుతో మనిషి వివేకవంతుడు కావాలని ఆత్మగౌరవంతో బతకడానికి పోరాటం చేయాలని అభిప్రాయ పడింది. చిత్త శుద్ధిలేని రాజకీయ నాయకులు ఉన్నంత కాలం ముస్లింలలో వెనుకబాటు తనం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేసింది.

ఈ నవల ఏకవ్యక్తి ప్రధానంగా సాగినప్పటికి అన్వర్ పాత్రకి అత్త కుల్సుంబీ, దూదేకుల నాయకుడు ఆదాం, పొగాకు కంపెనీలో అండనిలిచిన మాలస్త్రీ ఆదెమ్మ, వ్యవసాయ పనుల్లో సాయం చేసిన వెంకారెడ్డి, అనే రైతు, చదువు నేర్పిన బ్రాహ్మణ పంతులు రఘువయ్యల సహాయంతో అన్వర్ పరిపూర్ణ వ్యక్తిత్వంతో నిలిచింది. మనమరాలిని ముస్లిం స్త్రీ హక్కుల కోసం పోరాటం చేసే న్యావాదిగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించింది. సఫలం అయింది. " ముస్లిం స్త్రీలు కొందరిలోనైనా ఇలాంటి చైతన్యం రూపుదిద్దుకుంటే ఈ నవల ప్రయోజం నెరవేరినట్టే" (నవీన్, అంపశయ్య, 2012. పు.129)నని వ్యాఖ్యానించడం ఎంతో సముచితంగా ఉంది.

-0-

# 5. వలసానంతర బహుజన నవల పరిణామం - పరిమితులు

## 5.1. వలసానంతర బహుజన సాహిత్యం – నవల :

బహుజన నవల అత్యాధునిక రూపం. తెలుగు నవల తన పరిమితులు, పరిధులు గుర్తించక సంక్షోభంలో పడుతున్న సమయంలో ఒక సైద్ధాంతిక సంఘర్షణ జరిగింది. ఆ సంఘర్షణ లోంచి బహుజన నవల ఉద్భవించింది. ఆధునికత సంఘసంస్కరణ నవలకు మూలమైతే, ఆధునికానంతర స్థితి బహుజన నవలకు మూలభూతమైంది. వలస పాలనజ్ఞానం అగ్రవర్ణ సమాజాన్ని సంస్కరించుకొనే చైతన్యాన్ని కల్పించింది. ఆ చేతనలోంచి గోపాలకృష్ణమ శెట్టి మొదలు అనేకమంది నవలా రచయితలు నవలలు రాశారు. ఆ నవలల్లోకి బ్రాహ్మణీయ సంస్కృతిని ప్రతిభావంతంగా తీసుకొచ్చారు. తెలుగు నవల అంటే అగ్రవర్ణాల జీవితాలను చిత్రించినదే తప్ప ఇతర జీవితాలను చిత్రించితే అది నవలే కాదుపొమ్మనే స్థాయికి వెళ్లింది.

వలస పాలన కాలంలో బ్రిటీషు విద్యావిధానం నూత్న ఆలోచనలను అందించింది. క్రైస్తవ వ్యాప్తికోసమే బ్రిటీషువాళ్లు ఇంగ్లీషు చదువులు చెప్తున్నారని బ్రాహ్మణ మేధావులు భావించారు. ముఖ్యంగా అంటరానివాళ్లకు, స్త్రీలకు చదువు చెప్పటం ధర్మవిరుద్ధమని వాళు భావించారు. అలాంటి ధర్మవిరుద్ధ కార్యం మహాత్మ జోతిరావు పూలే చేపట్టినందుకు ఆయన్ని హత్యచేయించే కుట్రలకు పాల్పడ్డారు. అయితే, బ్రాహ్మణీయ సంఘసంస్కర్తలు అంటరానివాళ్ల, స్త్రీల చదువుల పట్ల తీవ్రమైన వ్యతిరేకతతో వున్నారు. లాల్–పాల్–బాల్ మొదలుకొని మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ వరకు, కందుకూరి నుంచి ఉన్నవ లక్ష్మీనారాయణ, విశ్వనాథ సత్యనారాయణ వరకు అంతా విద్యవ్యాప్తిని వ్యతిరేకించినవాళ్లే. తెలుగు నవలల్లో కూడా ఈ వ్యతిరేకత చాలా స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే, సంస్కరణోద్యమం యొక్క స్వభావం గురించి విమర్శనాత్మక పరిశీలన చేయాలి. ముఖ్యంగా కందుకూరి, ఉన్నవ వంటి వాళ్ల రచనల మీదే ఈ దృష్టి ఎక్కువగా ఉండాలి. నవలా సాహిత్యంలో ఈ ఇద్దరి ప్రభావం నేటికీ కొనసాగుతున్నది కాబట్టి కొత్త దృష్టి చాలా అవసరం.

“వీరేశలింగం వ్యాసాల్లోనూ, సృజనాత్మక రచనల్లోనూ కూడా బ్రాహ్మణుల్లోని దురాచారాల్ని గూర్చిన విమర్శలు కన్పిస్తూనేవుంటాయి. బాలవితంతువలకు పునర్వివాహాలు చెయ్యకపోవటంవల్ల, వాళ్ళు అవకాశవాదులైన ఒమగవాళ్ల మోసానికి గురై ఆత్మహత్యలకు పాల్పడటమూ, కొన్నిసార్లు వితంతువలకు పుట్టిన శిశువుల్ని చంపేయటమూ లాంటి అమానుషమైన చర్యలకు పాల్పడటాన్ని గురించి ప్రస్తావిస్తూ “ఓ కులమా! నీవెంత క్రూరమైన దానవుగా నున్నావు?” అని ఆవేదన చెందుతాడు వీరేశలింగం. మరికొన్ని సందర్భాల్లో వితంతువులుకన్న పిల్లలను ఎవరికో ఇచ్చివేయటం గురించి “అయ్యో! ఉత్తమకులమునందు బుట్టిన బిడ్డలు భోగస్త్రీలుగాను, చెప్పులు కుట్టువాడుగాను, పెంటలు బాగుచేయువారుగాను అగునట్లు చేయబడుచున్నారు. ఈ యనర్థములకన్నిటికిని కారణము కులాచారమే” అంటాడు. ఇవన్నీ ప్రధానంగా బ్రాహ్మణుల్లో మాత్రమే కన్పించే దురాచారాలు. వీరేశలింగం తన సంస్కరణలకు మద్ధతునివ్వమని బ్రాహ్మణవర్గాలకు విజ్ఞప్తి చెయ్యటమూ, పూర్వ ఔన్నత్యాన్ని గుర్తుతెచ్చుకొని, మళ్ళీ ఆ ఘనత సాధించమని పిలుపునివ్వటమూ వంటివి చూసినప్పుడు

కులనిర్మూలనకంటే, కుల సంస్కరణకే ఆయన ప్రాధాన్యతనిచ్చినట్టు కన్పిస్తుంది. ఆయన సృజనాత్మక రచనల్లోని అభ్యుదయవాదులంతా బ్రాహ్మణ కుటుంబాలవారే. "రాజశేఖర చరిత్రము"లో నారాయణమూర్తి, సత్యవతి వంటి వ్యక్తులు బ్రాహ్మణులే. ఆధునిక విద్యావంతులైన బ్రాహ్మణవర్గాలే సమాజ సంస్కరణలకు సమర్థులైన నాయకులనే దృక్పథం కన్పిస్తుంది" (కాత్యాయని.ఎన్, 1997:17-18).

ఇంగ్లీషు విద్యను వ్యతిరేకించటం సంఘసంస్కర్తల్లో ఎక్కువగా కన్పిస్తుంది. గాంధీలాంటి రాజకీయ నాయకులు కూడా ఇంగ్లీషు విద్యను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తెలుగు సంఘసంస్కర్తలైన ఉన్నవ, బాపిరాజు, చిలకమర్తి వంటివాళ్లు హిందూమతాన్ని జాతీయతగా వ్యవహరించటం గమనించొచ్చు. ఉన్నవ గుంటూరులో ఒక సభలో మాట్లాడుతూ సంస్కర్తల్లో కొందరు బ్రహ్మసమాజీకులుగా వుండి హిందూమతంపై కంటే క్రైస్తవంపై అభిమానం చూపారనీ, దానివల్ల చాలామంది ఆ ఉద్యమాలనుండి దూరమవ్వాల్సి వచ్చిందనీ అన్నాడు. ఉన్నవ లక్ష్మీనారాయణ మీద సామ్యవాద సిద్ధాంతాల ప్రభావం ఉందనీ, కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన మిత్రుడనీ, ప్రగతిశీలవాదనీ ఎన్నో రాతలు రాశారు. కానీ ఆయన దృక్పథం సనాతనం. "బుడబుక్కల జోస్యం" అనే రచనలో ఆయన "వేదశాస్త్రములు వెలిసిన రాజ్యం/ యజ్ఞయాగములు వెలిగిన రాజ్యం" అయిన భారతదేశంలో ఇంగ్లీష్‌వారి సంస్కృతి వల్ల "పరమతాలు" ప్రబలుతున్నాయని హెచ్చరిస్తాడు.

"ఇంగ్లీషు చదువుకున్నవాళ్ళు మంచి ఉద్యోగాలకోసం క్రైస్తవమతంలోకి మారేందుకు ఆసక్తి చూపేవాళ్ళని "మాలపల్లి"లో చెప్తాడు ఉన్నవ (లక్ష్మీనారాయణ ఉన్నవ-1, 1986:348). అలా ఉద్యోగం సంపాదించిన "పౌలు'ను రామదాసు ఈ నవలలో విమర్శిస్తూ ఉంటాడు. ఇలా మతంమార్చుకునే వాళ్ళలో ఎక్కువమంది అస్పృశ్యకులాల వాళ్ళేననీ, ఈ మతమార్పిడులకు వాళ్ళను ప్రోత్సహించే అంశాల్లో హిందూమతంలోని అంటరానితనం ఒక ముఖ్యకారణమని మాత్రం రామదాసు పట్టించుకోడు. మాల, మాదిగలు శుభ్రత పాటించకపోవటంవల్లా, వారి దురలవాట్లవల్లా మాత్రమే వారిని అగ్రవర్ణాలు అస్పృశ్యులుగా వుంచారనేది రామదాసు అభిప్రాయం" (ఎన్.కాత్యాయని .అముద్రిత సిద్ధాంత వ్యాసం, 1997: 35). ఈ రకంగా వలసపాలనా జ్ఞానం వల్ల లబ్ధిపొందిన సంస్కర్తలు అదే జ్ఞాన వ్యవస్థను సంప్రదాయ దృక్పథంతో వ్యతిరేకించటం కనిపిస్తుంది. సంస్కరణ నవల అగ్రవర్ణ సమాజంలోని పురుషులను మాత్రమే ఉద్ధరించే పనిపెట్టుకుంది. దీనికి భిన్నంగా వలసపాలన కాలంలోని బహుజన సంస్కర్తలు పూర్తి సంఘవిప్లవాన్ని కోరుకున్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవటానికి ఎంతో కష్టపడ్డారు. మహాత్మజ్యోతిరావు పూలే, తొలి భారత మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలేలు మహారాష్ట్రలో, హరిచంద్ ఠాకూర్, గిరిచంద్ ఠాకూర్‌లు మత్వాఉద్యమం ద్వారా బెంగాళ్‌లో, నారాయణగురు కేరళలో, రామసామి పెరియార్ తమిళనాడులో, మంగురామ్ పంజాబులో సాంఘిక విప్లవోద్యమానికి ఊపిరిపోశారు. మేదరిభాగయ్య, అరిగె రామస్వామి, బియస్ వెంకట్రావు, శ్యాంసుందర్ వంటి సంస్కర్తలు హైదరాబాదు రాజ్యంలో సంస్కరణోద్యమం నడిపారు. కులవ్యవస్థ దోపిడీకి వ్యతిరేకంగా కిందికులాలను చైతన్యం చేయటం, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడటం, బ్రాహ్మణ భావాజాలానికి వ్యతిరేకంగా పోరాడటం ఈ మహనీయులు చేశారు. పాఠశాలలు, హాస్టలు వసతి కల్పించి దళితుల విద్యావ్యాప్తికి కృషి చేశారు. డా॥ అంబేద్కర్ బ్రిటీషువాళ్లతో పోరాడి విద్యా, ఉద్యోగరంగాల్లో, రాజకీయరంగంలో హక్కు సాధించారు. దీంతో జ్ఞానం వలసానంతర కాలంలో ఎక్కువగా రాజ్యాంగం వల్ల అణగారినవర్గాలకు అందింది.

వలసానంతర జ్ఞానం ఆలస్యంగా విస్తరించింది. బహుజన మహాపురుషులు

వలసపాలనాకాలంలో మొదలుపెట్టిన సాంఘికవిప్లవం అనే భావన వలసానంతర కాలంలోగానీ తెలుగు సాహిత్యాన్ని చేరలేదు. తెలుగు సాహిత్యరంగం పూర్తిగా అగ్రవర్ణాల నియంత్రణలో వుండటమే దీనికి కారణం. గుర్రం జాషువా మొదలు ఇనాక్ వరకు సృష్టించిన నవలా సాహిత్యం వలసానంతర దళిత అవగాహనను చూపిస్తుంది. అయితే, వలసానంతరం సుమారు నాలుగు దశాబ్దాలకు గానీ స్పష్టమైన బహుజన చైతన్యం రూపొందలేదు. అంబేద్కరానంతర సాంఘికవిప్లవ కాలం ఒకటి మొదలైంది. మాన్యశ్రీ కాన్షిరాం బహుజన చైతన్యాన్ని ఒక రాజకీయ చైతన్యంగా తీసుకురావటంతో బహుజన సాహిత్యం దేశవ్యాప్తంగా రూపొందింది. మహారాష్ట్ర కేంద్రంగా వచ్చిన దళిత సాహిత్యం మీద కూడా కాన్షిరాం ఉద్యమప్రభావమే ఉంది. అయితే, 1984లో ఆయన బహుజన సమాజ్ పార్టీ ఏర్పాటు చేయటంతోనూ, 1995లో మాయావతిని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేయటంతో తెలుగు మాట్లాడే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా బహుజన చైతన్యం వ్యాపించింది. ఆ చైతన్యాన్ని అగ్రవర్ణాలు జీర్ణించుకోకపోవటం వల్లే కారంచేడు, చుండూరు మరియు ఇతర ప్రాంతాల్లో దళితుల మీద దాడులు జరిగాయి. ఊచకోతలు జరిగాయి. ఆ దారుణ మానవ హననాలనుంచి తెలుగు సాహిత్యంలో కులం గురించిన చర్చ చాలా బలంగా జరిగింది. కంచికచర్ల కోటేశు హత్యతో మొదలైన కుల చర్చ చుండూరు ఘటనతో పతాకస్థాయికి చేరింది. బహుజన రాజకీయాలు దేశంలో ఒకవైపు సాధికారతన సాధిస్తున్న సమయమది. కాన్షిరాం దక్షిణాదిలో విస్తృతంగా పర్యటిస్తున్న కాలం కూడా. ఆ బహుజన రాజకీయ వాతావరణంలో తెలుగులో సాహిత్య చర్చలు మలుపుతిరిగాయి. కుల వ్యవస్థను ధిక్కరిస్తూ, సమాజ స్వభావాన్ని అర్థం చేసుకొనే పద్ధతిని గురించి చర్చ మొదలైంది.

అద్దేపల్లి రామ్మోహన్ 'దళితసాహిత్యానికి నేపథ్యం ఏమిటి?' వ్యాసంలో ఈ విధంగా పేర్కొన్నారు. "దళితవాదం ఒక స్పృహగా 20వ శతాబ్దం మొదటి నుంచి తెలుగు సాహిత్యంలో కనిపిస్తున్నా, ఒక చైతన్యరూపంగా జాషువా నుంచి వికసిస్తున్నా, ఒక ప్రతిఘటన రూపంగా హేతువాద, నాస్తికవాద, సామ్యవాద ఉద్యమాల్లో పెంపొందుతున్నా 1980ల నుంచే పోరాట స్పృహ రగులుతూ వచ్చి, స్పష్టంగా 1990ల నుంచి ఒక సమగ్రవికాసాన్ని సాధిస్తున్నదని చెప్పవచ్చు. సాహిత్యంలో సంఘర్షణ ఒక వాదంగా రావడానికి, పునాదిలోనే బయల్దేరిన అసంతృప్తి ఎంతోకాలం రగిలిరగిలి, అనుకూలమైన ఒక సామాజిక బిందువు దగ్గర విస్ఫోటన చెందుతుంది. దళిత సాహిత్యానికి ఈ విస్ఫోటన దశ 1990 నుంచి ప్రారంభమై, ఎంతో వేగంగా సాహిత్య ప్రక్రియా రూపాలన్నింటినీ ప్రభావితం చేస్తున్నది. బొజ్జా తారకం, సత్యమూర్తి, సాంబశివరావు, కడలి వంటివారు ఇందుకోసం పత్రికలు ప్రారంభించారు" (రామ్మోహన్ రావు,అద్దేపల్లి :2004 :165) అని వివరిస్తారు. వర్గనిర్మూలన స్పృహ తెలుగు సాహిత్యంలో 1930ల కాలం నుంచే ఉందని, అయితే, సంస్కృతికి సంబంధించిన అంశాలను సరిగా అభ్యుదయ, విప్లవ రచయితలు పట్టించుకోలేదని, కేవలం వామపక్ష, విప్లవరాజకీయాలను చర్చించటమే సాహిత్య విషయంగా మారిపోయిన దశ ఒకటుందని అద్దేపల్లి రామ్మోహన్ వివరించాడు. కానీ, దళిత సాహిత్యం వచ్చిన తర్వాత సాంస్కృతిక అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత పెరిగిందని, కులనిర్మూలన చర్చ బలంగా ముందుకొచ్చిందని ఆయన అంగీకరించారు. అయితే, దళిత, బహుజన అనే రెండు కేటగిరీల పట్ల ఆయన స్పష్టమైన తేడాను చూశారు.

### <u>5.2. దళిత – బహుజన విభజన:</u>

"దళితులంటే అవర్ణులు మాత్రమే గాక, బహుజనులు కూడా అనేది ఒక రాజకీయ పోరాటానికి సంబంధించిందేగాని దళిత స్పృహకు సంబంధించింది కాదు. అందుకే దళిత సాహిత్యాన్ని గురించిన ఆలోచనల్లో కొంత గందరగోళం కనిపిస్తుంది. బహుజన రాజకీయం

సాహిత్యంలో ప్రతిబింబించే అవకాశం లేదు. బహుజన రాజకీయమే దళితస్పృహ అంటే, దళిత సాహిత్యానికి సంబంధించిన స్వీయముద్ర చెరిగిపోతుంది. రాజకీయాన్నీ, ఒక సాంస్కృతికాంశాన్నీ, సమాంతరంగా అంచనావేయడం కుదరదు. దళితస్పృహ కేవలం దళితుని జీవనానుభవం లోంచి మాత్రమే వచ్చింది. దళితుని అవమానం నుండి, దళితుడు తాను కోల్పోయిన వ్యక్తిత్వాన్ని సాధించుకొనే పరిధినుండి, తనకూ తనను అణిచివేసిన వరికీ మధ్యగల గీతని చెరిపేసే పట్టుదలలో నుంచీ, దళిత స్పృహ బయల్దేరింది. అందులో భాగమే దళితసాహిత్యం. ఇది ఆర్థికాంశానికీ, రాజకీయాంశానికీ విభిన్నమైన సాంస్కృతికాంశం. మిగిలిన వారు తమ బాధల్ని చెప్తే, అవి ఆర్థిక రాజకీయాంశాల్లో అంతర్భవించి, ప్రగతివాద సాహిత్యంకంటే భిన్నంగా కనిపించే అవకాశం లేదు" (అద్దేపల్లి రామ్మోహన్ 2004: 167) అంటాడు.

బహుజన రాజకీయం సాహిత్యంలో ప్రతిబింబించే అవకాశం లేదు కాబట్టి బహుజన సాహిత్యం అనే భావనను అద్దేపల్లి రామ్మోహన్ అంగీకరించలేదు. ఇది ఆయన ఊహ మాత్రమే. నిజానికీ దళిత సాహిత్యంఅనే దానిలో బహుజన రాజకీయమే ఎక్కువ ప్రతిబింబించింది. దళితులు రాసిన అనేక కవితల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకొని బ్రాహ్మణవాదం మీద తిరుగుబాటు చేయటం కనిపిస్తుంది. చిక్కనవుతున్నపాట, ఎరుపెక్కిన పాట, చిత్తరువు సంకలనాల్లో బహుజన దృక్పథమే కనిపిస్తుంది. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలు రాసిన సుమారు అన్నికథల్లో బహుజనల ఐక్యత, అగ్రవర్ణాల పీడన బహుజనుల మీద ఎలా ఉందన్న విషయమే చిత్రించారు. దళితులు, బీసీలు రాసిన నవలల్లో అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా బహుజనులు చేసిన రాజకీయ పోరాటమే చిత్రితమైంది. అంటే అద్దేపల్లి రామ్మోహన్ ఊహించినది నిజం కాదు. లేదా ఆయన సత్యాన్ని గుర్తించడానికి సిద్ధంగాలేడని అర్థం. నిజమే, దళితులకు,ఇతర కులాలకు మధ్య వైరుధ్యం ఉంది. కానీ, ఆ సాంఘిక వైరుధ్యానికి మూలమైన మనువాదాన్ని నిరాకరించి, ఆయా కులాలమధ్య ఐక్యతను ప్రతిపాదించే రచనలే అత్యధికం. కాబట్టి సాహిత్యరంగంలో బహుజనవాదం ప్రతిఫలించదు అనే నిర్ధారణ పొరపాటు. ఆయన పొరపాటు నిర్ధారణ వల్ల బహుజన సాహిత్యం అనే ఒక కేటగిరి లేకుండా పోయే ప్రమాదం ఉంది. దళితులు, బహుజనులు వేర్వేరని ఆయన భావన. బహుజనులు అనే శబ్దాన్ని ఆయన శూద్రులకు వర్తింపచేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అందరు కలిస్తేనే బహుజనులని అర్థం. అందువల్ల తెలుగు సాహిత్యంలో బహుజనవాదం రూపొందటం వెనక మనువాద వ్యవస్థకు వ్యతిరేకంగా బాధిత కులాలన్నీ చేసే వ్యక్తీకరణ సందర్భం ఒకటి ఉంది. అది సాంఘిక, రాజకీయ రంగాల్లో వచ్చిన చైతన్యం.

### 5.2.1. బహుజన నవల – గుర్తింపువాదం:

ఐడెంటిటీ మూవ్‌మెంట్స్‌ను తెలుగులో గుర్తింపు ఉద్యమాలంటారు. అస్తిత్వ ఉద్యమాలు లేదా గుర్తింపు ఉద్యమాలు వర్గవిచ్ఛిన్న ఉద్యమాలని మార్క్సిస్టు విమర్శకుల ఆరోపణ. మహాకథనాలకు కాలం చెల్లి, అనేక చిన్నచిన్న సమూహాలు ఉనికికోసం పోరాటం చేస్తున్నాయని ప్రసేన్ అంటాడు. వర్గపోరాటాలు, విప్లవాలు అనేవి కమ్యూనిస్టులు ప్రచారంలో పెట్టిన మహాకథనాలని ఆయన అంటాడు. రష్యాలో సోషలిజం కూలిపోవటంతో ఈ మహాకథనాలకు కాలం చెల్లిందని, మహాకథనాల గురించి చర్చించే కాలాన్ని ఆదునికత అంటారనీ, దానికి భిన్నంగా చిన్నచిన్న సమూహాల ఉనికి, గుర్తింపును రక్షించే అస్తిత్వఉద్యమాల కాలాన్ని ఆధునికానంతర కాలమని అంటారని ఆయన ఒక వ్యాసంలో పేర్కొన్నారు. అయితే, ఆధునికానంతర స్థితిలోకి దళితవాదం ఇమడదని సతీష్ చందర్ తెలిపారు. ఆధునికతలోకి దళితులు ఇంకా ప్రవేశించనే లేదు కాబట్టి ఆధునికానంతరవాదం అనే కేగిరిలోకి దళితవాదం

రాదని సతీష్‌చందర్ ప్రజాశక్తి సాహిత్య ప్రత్యేక సంచిక 'దర్పణం'లో పేర్కొన్నారు. కానీ హెచార్కే మాత్రం ఆధునికానంతరవాదం కాలవాచి కాదని అంటాడు. ఆధిపత్య విలువలకు వ్యతిరేకంగా పోరాడటం. కేంద్రాన్ని బద్ధలు కొట్టి, ఆనుషంగిక (పెరిఫెరీ)లకు ప్రాధాన్యతను ఇవ్వటం అవసరమని "సంబురం" వ్యాససంకలనంలో అంటాడు. ఏ విషయాన్నైనా కేంద్రబిందు దృష్టినుంచి కాకుండా దూరంగా వున్న బిందువుల నుంచి అర్థం చేసుకోవాలని అంటాడు. అదే ఆధునికానంతరవాదం కాబట్టి దళితవాదం కూడా ఆధునికానంతర పరిధిలోకి వస్తుందని అంటాడు. అయితే, సెంటర్‌ను సవాలు చేసిన ఉద్యమాలన్నీ పెరిఫెరీకి చెందినవి. సెంటర్ యొక్క ఆధిపత్యం నుంచి వాటి గుర్తింపును, ఉనికిని ప్రదర్శించేవీ, రక్షించుకొనేవీ. గుర్తింపులు అపురూపమైనవి కాబట్టి వాటిని రక్షించుకోవాలని గుర్తింపువాదం/అస్తిత్వవాదం అంటుంది. అదే ఆధునికానంతరవాదం. వ్యక్తిచైతన్యానికి ఎక్కువ ప్రాధానత్యనివ్వటం, చిన్నచిన్న గ్రూపులకు ఆమోదాన్నివ్వటం ఇందులోని విషయం. అంతేకాదు, అధికారం ఏ రూపంలోవున్నా, దానికి వ్యతిరేకంగా పోరాటం గుర్తింపు ఉద్యమాల లక్షణం. ఈ అన్ని కారణాలవల్ల బహుజన సాహిత్యం గుర్తింపు ఉద్యమం కాలేదు. అంతకన్న ముఖ్యంగా ఆధునికానంతరవాదంలోకి రాలేదు.

బహుజన సాహిత్యం కేంద్రాన్ని వ్యతిరేకిస్తుంది. అంతేకాదు, ఆ కేంద్రస్థానంలో కూర్చోవాలని దాని ఆశయం. ఆ స్థానాన్ని అధికారం ద్వారా మాత్రమే పొందగలం కాబట్టి, అన్నిరకాల అధికార రూపాలను అది నిరాకరించదు. అధికారాన్ని హస్తగతం చేసుకుంటే తప్ప ఆధిపత్యంలేని సమాజాన్ని నిర్మించలేమని బహుజనవాదం అంటుంది. కుల గుర్తింపులు శత్రువు కల్పించినవి. కులనిర్మూలన ద్వారా మాత్రమే శత్రువు రుద్దిన కులగుర్తింపులు తొలిగిస్తాం. కాబట్టి, ఇది గుర్తింపులకు వ్యతిరేకమైన ఉద్యమం. అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలని ఆరాటపడేది కాదు. ఆధిపత్య కులాలను ధిక్కరించి, వాటి పెత్తనాన్ని కూలదోసి, ఒక సమతా వ్యవస్థను నిర్మించే ఉద్యమమిది. ఈ చైతన్యాన్ని రాజకీయ రూపం తీసుకొని, అది అధికారాన్ని చేజిక్కించుకొని కొత్త మార్గాలు తెరిస్తే ఆధిపత్య మేధావులు చాలా సులువుగా గుర్తింపు ఉద్యమని బ్రాండ్ వేశారు.

ఇలాంటి ముద్రలు కమ్యూనిస్టులే వేశారు. మార్క్సిస్టు మేధావులే కులవ్యతిరేక రచనలను చూసి బాగా బెదిరిపోయారు. కులనిర్మూలన పోరాటాలను గుర్తింపు లేదా అస్తిత్వ ఉద్యమాలని రంగనాయకమ్మ విమర్శించారు. ఈ వాదనను డా॥ జిలుకర శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. "మార్క్సిస్టు సిద్ధాంత విశ్వాసులెవ్వరూ అస్తిత్వం, గుర్తింపు వంటి అమూర్త విషయాలను అంగీకరించరు. అస్తిత్వ ఉద్యమాలు రాజ్య ప్రాయోజితమైనవనీ, అవి విశాల ప్రజాపోరాటాలను విచ్ఛిన్నం చేస్తాయనీ వర్గ సమైక్యతావాదానికి అవిగొడ్డలిపెట్టనీ, సరళీకరణ రూపాల పట్ల కార్మికవర్గ మేధావులు అప్రమత్తంగా ఉండాలని విశ్వసిస్తారు. పార్టీ నిర్మాణ శ్రేణులకు ఆయా అంశాలపట్ల స్పందించాల్సిన వైఖరుల గురించి తగిన శిక్షణ కూడా మార్క్సిస్టులు అందిస్తూ ఉంటారు. అస్తిత్వ ఉద్యమాల పరిభాషను ఇంతగా ద్వేషిస్తున్న వర్గనిర్ణాయకవాదులు చరిత్రను మసిబూసి మారేడుకాయ చేస్తున్నారు. రంగనాయకమ్మ ప్రకారం అస్తిత్వం, గుర్తింపు వంటివి ఎస్సీ,ఎస్టీ,బిసీ, మైనార్టీలు తయారు చేసినవి. వాటిని స్వార్థప్రయోజనాల కొరకు ఉపయోగించుకొంటూ శ్యాతీకరిస్తున్నారు. ఇవి పూర్తిగా అసంబద్ధమైన వక్రీకరణలు. మహాత్మ పూలే, అంబేద్కర్, పెరియార్ రచనల్లో ఎక్కడా అస్తిత్వం, గుర్తింపు అన్న పరిభాష కనిపించదు. బ్రాహ్మణుల గుర్తింపుకోసం, వారి దయాదాక్షిణ్యాల కోసం పూలే, అంబేద్కర్, పెరియార్‌లు ఏనాడూ దేబిరించలేదు. బ్రాహ్మణ వ్యవస్థ నిర్మూలన కొరకు సైద్ధాంతిక పోరాటం నెరపిన మహనీయులు వారు. మరి దళిత ఉద్యమం ఎక్కడినుండి వచ్చింది? స్త్రీవాద ఉద్యమం వలె

బహుజన పోరాటం అస్తిత్వ ఉద్యమ పరిభాషలో ఎప్పుడు చిక్కుకుపోయింది? అస్తిత్వ ఉద్యమాలు 1960 దశకంలో ప్రారంభమైనవి. అందులో ప్రధానమైనది స్త్రీవాదం. 1848లో మొదలైన కులవ్యతిరేక బహుజనోద్యమం అస్తిత్వ ఉద్యమ పరిధిలోకి ఎలావస్తుంది? ఇది మౌలిక సమస్యకాదు. మౌలిక స్వభావానికి సంబంధించిన సమస్యని అంగీకరిస్తే సమస్త కులపీడన దోపిడీల నుండి సమాజ విముక్తిని ప్రతిపాదించిన బహుజనోద్యమం రాజకీయపోరాటానికి సమాజ సమూల పరివర్తనకూ మార్గం చూపుతున్న విప్లవ ఉద్యమం అవుతుంది తప్ప అస్తిత్వ ఉద్యమం ఎలా అయ్యింది? దాని విప్లవకర స్వభావాన్ని తగ్గించి అస్తిత్వ పరిభాషలో ఇరికించిన కుదింపువాదం ఎవరి మేధోమధన జనితం? దీనికి సమాధానం, బ్రాహ్మణవాదమే ఈ కుదింపువాదానికి బాధ్యత వహించాలి?" (డా॥ శ్రీనివాస్, జిలుకర 2012: 117-118)

నిజానికి స్థూలపద్ధతిలోనే బహుజనవాదం గురించి చర్చ ఎక్కువ జరిగింది. మరీ ముఖ్యంగా దళిత కవిత్వం, దళితవాదం గురించి విస్తృతంగా వాదోపవాదాలు జరిగాయి. కానీ, బహుజన నవల గురించి ఎక్కువ చర్చ జరగలేదు. ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీలు రాసిన నవలా సాహిత్యం మీద విమర్శకులు ప్రసరించిన వెలుగులు చాలా తక్కువ. విమర్శకులు ఎక్కువగా అగ్రవర్ణావాళ్లు వుండటమే ఈ లోపానికి కారణం. కొద్దిమేరకు జరిగిన చర్చలో వ్యక్తిగత రచనల మీదే చర్చ కేంద్రీకృతమైంది. ఉదాహరణకు, అంటరానివసంతం మీద విస్తృతంగా చర్చ జరిగింది. నేను పరిశోధనకు స్వీకరించిన ఏ నవలమీదా లోతైన, విస్తృమైన చర్చ లేదా అధ్యయనం జరగలేదు. అగ్రవర్ణ విమర్శకుల నిరాసక్తత ఒక కారణం, దీనికి. కానీ, బహుజన నవలను పఠించే పద్ధతి ఇతర పఠన పద్ధతులకన్న వేరుగా ఉండటం కూడా మరొక కారణం. ఒక మార్క్సిస్టు నవలను లేదా మనోవైజ్ఞానిక నవలను పఠించినంతగా ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ నవలలను చదవలేరు. దీనికి కులమనస్తత్వమే కారణం.

## <u>5.3. బహుజన నవల భాషావైవిధ్యం:</u>

బహుజన నవలల్లో ప్రయోగించిన భాష అర్థంకాకపోవటం వల్లే అవి పెద్ద చర్చను లేవనెత్తలేదనే వాదన కూడా ఉంది. తెలంగాణ ప్రాదేశికతనూ, దళిత సంస్కృతినీ ప్రతిబింబించే వేముల ఎల్లయ్య కక్క, సిద్ధి నవలలు రాశాడు. ఇందులో ఉపయోగించిన భాష నల్లగొండ జిల్లా మాదిగభాష. ఈ నవలలు చదవడానికీ, అర్థం చేసుకోవడానికీ కష్టంగా ఉన్నాయనీ, పాఠకునికి భాషాపరీక్ష పెడుతున్నాయని ఫిర్యాదు. ఇలాంటి ఫిర్యాదులకు సమాధానం ఫిర్యాదులే అవుతాయి. ఉత్తరాంధ్ర మాండలికంలో రాసిన నవలను తెలంగాణావాళ్లు చదివినప్పుడు, అలా చదవడం కోసం ఆ ప్రాదేశిక భాషలను ఏదోఒక మేరకు నేర్చుకొని చదివినప్పుడు ఇతర ప్రాంతాలవాళ్లుకూడా తెలంగాణ వ్యవహారాన్ని నేర్చుకోవాలనే వాదన వచ్చింది. నామిని చిత్తూరు కమ్మకులస్తుల మాండలికంలో రాస్తే వాటిమీద చర్చ జరుగుతుంది. కానీ, అదే బండినారాయణ స్వామి అనంతపురం వ్యవహారంలో రాస్తే ఎలాంటి చర్చ జరగలేదు. నామిని నవలలన్నీ కమ్మ స్త్రీల సాంస్కృతిక జీవితాన్ని చిత్రించాయి. కానీ, చిలుకూరి దేవపుత్ర, బండినారాయణ స్వామి వంటి బహుజన రచయితలు కులవ్యతిరేక రచనలు చేస్తే వాటిని అర్థం చేసుకోవటమెలాగో విమర్శకులకు తోచలేదు.

వర్గ సమాజంలో వర్గభాష వుంటుందని మార్క్సిస్టు విమర్శకులు ఒప్పుకుంటారు. అదే కుల సమాజంలో కులభాష ఉంటుందనే వాదనను అగ్రకుల పండితులు ఒప్పుకోరు. బహుజనులు రాసే రచనల్లో ఎలాంటి భాష ఉపయోగించాలి? అగ్రకులాలు మాట్లాడే సంస్కృతభూయిష్టమైన తెలుగు రచనాభాషగా స్వీకరించాలా? లేకా వివిధ ప్రాంతాల్లో బహుజనులు మాట్లాడే భాష తీసుకోవాలా? అన్న చర్చ జరిగింది. ఆధిపత్య ప్రాంతాల

భాషను ప్రమాణ భాషగా తీసుకొని నవలలు రాసినవాళ్లే ఎక్కువ. తెలంగాణ, కళింగాంధ్ర, రాయలసీమల్లో కూడా నవలా రచయితలు ప్రామాణిక భాషనే నవలాభాషగా ఉపయోగించారు. తెలంగాణాలోని ప్రముఖ నవలారచయిత నవీన్ 'అంపశయ్య', 'కాలరేఖలు', 'చీకటిరోజులు' వంటి నవలల్లో గుంటూరు, కృష్ణ జిల్లాల మాండలికంలో రాశారు. కళింగాంధ్ర నుంచి రచనలు చేసిన రావిశాస్త్రి మాత్రం ఉత్తరాంధ్ర మాండలికంలోనే రచనలు చేశారు. రాయలసీమ నుంచి తెన్నేటి సూరి రాసిన 'పెన్‌గంగ'లో కూడా ప్రామాణిక భాష వాడారు. అయితే, కిందికులాలు కవిత్వం, కథ, నవలల్లో వాళ్ల కులాలు మాట్లాడుకొనే భాషనే రాశారు. లేఖన భాషకు, మౌఖిక భాషకు మధ్య చాలా తేడా వుంటుంది. లేఖన (లోగోసెంట్రిక్) కేంద్ర రచనే ఎక్కువ తెలుగు సాహిత్యంలో కన్పిస్తుంది. కానీ మాట్లాడే భాష (ఫోనో సెంట్రిక్) కేంద్రంగా బహుజన రచయితలు రాశారు. అయితే డా॥ వి. చంద్రశేఖర్‌రావు ఇందుకు మినహాయింపు. ఈయన రచనలన్నీ ప్రధానస్రవంతి భాషలోనే ఉంటాయి.

భాషకు కులముందా? అనే చర్చ దళితకవిత్వం వస్తున్న రోజుల్లో జరిగింది. దళిత కవులంతా భాషకు కుల స్వభావం ఉంటుందని వాదించారు. అగ్రవర్ణ రచయితలంతా భాషకు కులముండదని ప్రతివాదన చేశారు. ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య భాషకు ఎలాంటి కుల స్వభావం ఉండదని వాదించాడు. "పరమ సంకుచితంగా ప్రవర్తిస్తున్న కులమతాలకూ, వర్ణవర్గాలకూ, స్త్రీ, పురుష భేదాలకూ అతీతమయింది. భాషావ్యవస్థ దాన్నుంచి ఉద్భమించే గొప్ప కవిత్వమూ, దాన్ని సాంధించడానికి ప్రయత్నం చేయటానికి బదులు భాషకూ కవిత్వానికీ కులమతాలను, స్త్రీ పురుష భేదాలను అంటగట్టే ప్రయత్నం భాషకూ, కవిత్వానికీ అపచారం మాత్రమే" **(సంపత్కుమారాచార్య, 2000: 188-189)** అని కోవెల సంపత్కుమారాచార్య పేర్కొన్నారు. భాష అనేక స్థాయిల్లో, అనేక అంతర్వుల్లో పనిచేస్తుందనీ, సమాజంలోని అన్నివర్గాల, అన్నికులాల, అన్నితెగల, అన్నిలింగాల భాగస్వామ్యంతో రూపొందింది కాబట్టి భాష అన్నింటినీ తనలో ఇముడ్చుకుంటుందని కూడా ఆయనే అంటారు. "భాష ఎవరి అభిప్రాయాల, అనుభవాల, అనుభూతుల, అభివ్యక్తీకరణకూ అసమర్థంకాదు. భాష ఎన్నెన్నో అంతస్తుల్లో, అంతర్వుల్లో ప్రవర్తిస్తుంది. అది వాచ్యం దగ్గరే ఆగిపోదు. అవసరాన్ని, సందర్భాన్నిబట్టి లక్షణ, తాత్పర్య, వ్యంజనశక్తులతో, వృత్తులతో విజృంభిస్తుంది" **(ఆంధ్రప్రభ, 30అక్టోబర్, 1995)** అంటాడు. భాష ప్రజాస్వామికము అని కూడా ఇదే వ్యాసంలో అన్నారు. సంపత్కుమార వ్యాసానికి బొజ్జాతారకం సమాధానం రాశారు. భాష అనేది నిరాకారమూ, నిర్గుణమూ కాదనీ, అది జనంలో ఉన్నది కాబట్టీ, ఆ జనాలు వేలాది కులాలుగా చీలిపోయి వున్నారని బొజ్జా తారకం అంటారు. ఇన్ని చీలికలతోనూ భాష పెరుగుతూ వస్తుందని ఆయన అంటాడు. ఒకరి భాష మరొకరికి నిషిద్ధం. ఒకరి భాష మరొకరికి అందదు అంటాడు.

"ఉన్న వాస్తవాన్ని ఒకసారి పరిశీలిద్దాం: ప్రధానంగా మనకు భాషలు రెండు- (1) పుస్తకంలోని భాష, (2) మాట్లాడే భాష. పుస్తకభాషలో మళ్ళీ గ్రాంథికమూ, సరళ గ్రాంథికమూ, వ్యవహారమూ. అదేవిధంగా మాట్లాడే భాషలో చదువుకున్నవారు మాట్లాడేభాష, చదువురానివారు మాట్లాడే భాష. దీనికంటే కొంచెం ముందుకువెళ్తే మళ్లీ మనకు రెండు భాషలు కనిపిస్తాయి: (1) తెలుగు, (2) సంస్కృతం. ఈ సంస్కృతం అనేది ఎవరు మాట్లాడతారో, ఎంతమంది మాట్లాడతారో, ఎంతమందికి అర్థం అవుతుందో అందరికీ తెలిసిందే! ఇది కేవలం బ్రాహ్మణుల భాష అంటే కోవెలవారికి కోపం రాకూడదు. దీనిని బ్రాహ్మణులు తప్ప వేరెవ్వరూ నేర్వకూడదనే నియమం అనేక శతాబ్దాలపాటు సాగిందనే సంగతి ఆచార్యులవారికి తెలియకపోదు. సంస్కృతం పలికితే నాలుకమీద నిప్పు అంటించడాలు, సంస్కృతం వింటే చెవిలో సలసల కాగే సీసం పోయటాలు కోవెలవారు వినకుండా ఉండరు. ఎప్పటి మాటో కాదు, ఇప్పటికీ కూడా ఎవరైనా

అతిశూద్రుడు సంస్కృతం నేర్చుకుంటానంటే 'నీకెందుకురా సంస్కృతం? గేదెల్ని కాసుకోక' అనే ఆచార్యులు ఈ దేశంలోనూ ఉన్నారు. బహుముఖ ప్రజ్ఞాశీలి, అశేష ప్రతిభాసమన్వితుడు అయిన డాక్టర్ అంబేద్కర్‌ను సంస్కృతం చదువుకోనివ్వకపోతే పర్షియన్ భాష నేర్చుకున్నాడు. వివరాలకు పోతే విషాదమే మిగులుతుంది కాబట్టి వాటి జోలికి పోకుండా సంస్కృతం అనేది రెండు లేదా మూడు శాతం ప్రజలలో ఒకటో, అరశాతమో మాట్లాడే భాష అని మాత్రం చెప్పుకోవాలి. దీనిని ప్రజల భాష అనలేము కదా! ఎవరికీ అర్థం కాకపోయినా ఆకాశవాణిద్వారా రుద్దటానికి చేస్తున్న ప్రయత్నం ఏ ప్రజలను సంతృప్తి పర్చటానికో మనకు తెలియనిదికాదు. 'సంస్కృతం ఈ దేశంలో మౌలిక' అన్నారు కోవెల. అది ఆ భాషమీద వారుకున్న అభిమానం తప్ప వేరేమీ కాదు. సంస్కృతంకంటే ముందు ఈ దేశంలో ఎన్నో రకాల భాషలు ఉన్నాయి. ఒక పక్క ద్రావిడభాషలు, మరోపక్క పాళీభాష గురించి కోవెలవారు ఏమంటారో? సంస్కృత లిపికంటే ముందు ఉన్న హరప్పా, మొహంజదారో లిపి గురించి ఆయన ఏమి సెలవిస్తారో? సంపత్కుమారాచార్యగారు ఎంతో అభిమానించే సంస్కృత కావ్యాలలో, నాటకాలలో రాజులు ఒక భాష; రాణులు, పరిచారికలు, సేవకులు, సేవికలు, దాసీలు వేరే భాష మాట్లాడటాన్ని ఆచార్యుల వారు మరిచిపోయారా? అంటే రాజులకొక భాష, దాసదాసీలకు మరో భాష ఉండేదనేగా దీని అర్థం? ఒకే వర్గానికి చెందిన రాజూ రాణీలు వేర్వేరు భాషలు ఎలా మాట్లాడుతారు? ఉత్తమ పాత్రలకు ఉత్తమమును, నీచపాత్రలకు తత్తదుచిత వ్యావహారసిద్ధ భాషను ఉపయోగింప వలయును. తత్తత్పాత్రోచిత భాషనుపయోగించినప్పుడే నాటకాదులు రసపుష్టిని కలించుచు సహృదయుల కాహ్లాదము కలిగించును. ఉత్తమ ప్రకృతులకు ఉదాత్తమైన భాషను, నీచులకు తగు హీన భాషను ప్రయోగింపవలయును" అని లాక్షణికులు నిర్ణయించిన సంగతి ఆచార్యులవారు మరచిపోయారా? వర్ణాలనుబట్టి వర్గాలనుబట్టి భాషను విభజించుకోలేదా? దేవభాష అని, పైశాచి భాష అని,రాక్షస భాష అనే మాటలు ఎలా వచ్చాయి? పండిత భాష, పామరుల భాష అని పేర్లు పెట్టుకొని భాషను ఈసడించలేదా? ఛండాలపు భాష అని భాషను తిట్టలేదా? భాషకు కులం అంటగట్టలేదా? అంత పాత సంగతులు ఎందుకుగాని, ఒకటిన్నర శతాబ్దం క్రితం ఆంగ్లేయ భాషను మ్లేచ్ఛ భాష అని నిరసించలేదా? అది ప్రభువుల భాష అయ్యేసరికి పరమ ఛాందసులకు సైతం అది శిరోధార్యం కాలేదా! ఈ వాస్తవాలను ఆచార్యులవారు మరిచిపోయారా?" (ఆంధ్రప్రభ, 27నవంబర్ 1995) అని బొజ్జా తారకం ప్రశ్నలు సంధించాడు.

కావ్యభాష ఆధిపత్యవర్ణాలు మాట్లాడే భాషలో రాశారు. నాటకాలు పాత్రోచిత భాష పేరుతో కులాన్నిబట్టి పాత్రల వ్యవహారతీరును నిర్ణయించారు. నవలాప్రక్రియలో మొత్తం నవల అగ్రవర్ణాలు మాట్లాడుకొనే తెలుగులో రాస్తూ, పాత్రల సంభాషణలు కులాన్నిబట్టి రాయటం తెలుగు నవల్లో కనిపిస్తుంది. ఈ పద్ధతికి విరుద్ధంగా బహుజన నవలారచయిత బ్రాహ్మణేతర భాషలో రాశాడు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బిసీ రచయితలు వాళ్ల కులభాషల్లో రాయటం మొదలుపెట్టారు. వేముల ఎల్లయ్య మాదిగ భాషను, భూతం ముత్యాలు మాలభాషను, ఏకుల వెంకటేశ్వర్లు యానాదుల భాషను, బండినారాయణ స్వామి శూద్ర భాషను నవలారచనకు తీసుకున్నారు. అయితే, వీళ్ల భాషలు ఆయా ప్రాంతాల వ్యవహారాలకు లోబడి వుంటాయని గ్రహించాలి. ఎల్లయ్య, ముత్యాలు తీసుకున్న భాష తెలంగాణ ప్రాంతానికీ, ఇనాక్, బండినారాయణ స్వామి, దేవపుత్రలు వాడిన భాష రాయలసీమ ప్రాంతానికీ లోబడి వుంటాయి. కళ్యాణరావు, డా॥ వి. చంద్రశేఖరరావు, ఏకుల వెంకటేశ్వర్లు, సలీంలు ఉపయోగించిన భాష ప్రకాశం జిల్లా యాస స్వభావం కలిగి కోస్తాంధ్ర భాషకు లోబడివుంటాయి.

ప్రాదేశిక కుల వ్యవహారాలు, నుడికారాలతో బహుజన నవల విలసిల్లింది. తెలుగు

భాషను విస్తృతం చేసిందని పేర్కొనవచ్చు. నిసర్గ భాషాసౌందర్యాన్ని పాఠకులకు అందించింది. బహుజనులు నవలలే రాయకుంటే ఇంత అందం వెలికివచ్చేది కాదు. అంటరాని వసంతం, మీరాజ్యం మీరేలండి, కక్క, సూర, అనంతజీవనం నవలలు మూడు ప్రాంతాల బహుజన నుడికారానికి భాషాకోశాగారాలయ్యాయి.

## 5.4. బహుజన నవల - కమ్యూనిస్టు రాజకీయాల వైఫల్యం:

బహుజన నవలల్లో కమ్యూనిస్టుల నిజాయితీ రాహిత్యాన్నీ, కులాన్ని కమ్యూనిస్టుపార్టీలు అర్థంచేసుకొన్న పద్ధతిమీద చర్చ కన్పిస్తుంది. వేముల ఎల్లయ్య రాసిన 'కక్క' నవలలో 'విప్లవరెడ్డి' పాత్ర ద్వారా కమ్యూనిస్టు ఉద్యమం వల్ల ఎవరు లబ్ధిపొందారనే సత్యాన్ని తెలుపుతాడు. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం వల్ల సాధారణ ముస్లిం కుటుంబాలను రజాకార్ల పేరుతో తరిమేసి వాళ్ల భూములను రెడ్డికులస్తులు ఆక్రమించుకున్న సంఘటనలను ఈ నవలలో రచయిత చిత్రించాడు. "కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి ఎంతోమంది పటేళ్ళు భూములెలా సంపాదించుకున్నారో ఎల్లయ్య రాశాడు. తమ బతుకులోంచి పుట్టిన కళల్ని 'జనపదాల' పేరుతో ఎలా కొల్లగొట్టారో రాశాడు. ఇవన్నీ చాలవన్నట్లు చాపకింద నీళ్ళలా 'ఆంధ్రోళ్లు, కమ్మోల్లు, తెలంగాణా పల్లెల్లోకి ఎలా ప్రవేశించారో, భూముల్ని సంపాదించుకోవడం మాత్రమే కాకుండా తిండిగింజల స్థానంలో పత్తిపొగాకు పంటల్ని ప్రవేశపెట్టి బతుకుల్ని ఎంతగా చిందరవందర చేశారో ఎల్లయ్య రాశాడు" (సాహితీ కాలుష్యంలో ఒక స్వచ్ఛమైన శ్వాస 'కక్క', ఆదివారం వార్త, 24సెప్టెంబర్, 2000) అని కలేకూరి ప్రసాద్ వ్యాఖ్యానించాడు.

బండి నారాయణ స్వామి రాసిన మీరాజ్యం మీరేలండి నవలలో మార్క్సిస్టు భావజాలం మీద తీవ్రమైన విమర్శ ఉంటుంది. శూద్ర అగ్రకులాలు మార్క్సిజాన్ని, నాస్తికవాదాన్ని తాత్విక స్థాయిలో చర్చిస్తారుగానీ, ఆ చర్చల అంతస్సారం ఆ కులాల ప్రయోజనాలు రక్షించుకోవటమని వ్యాఖ్యానిస్తాడు. కమ్మకులస్తులు కమ్యూనిస్టు రాజకీయాల గురించి మాట్లాడేతీరును, ఉద్యమాలు నడిపే రీతినీ వ్యంగ్యంగా రచయిత చెప్తాడు. "మనోహర్‌నాయుడు ఎవరయ్యా అంటే ఏమని చెప్పుదు లోకులకు? ఒక వ్యక్తి తాత్వికుడు అయ్యేదానికి ఎన్ని కారణాలుంటాయో, మార్క్సిస్టు కావడానికి అన్ని కారణాలుంటాయి. దొంగ సాధువు అయ్యేదానికి ఎన్ని కారణాలుంటాయో, చెడిపోయిన కమ్యూనిస్టు కావడానికీ అన్ని కారణాలు ఉంటాయి. కారణాలు మానసికమా, భౌతికమా? మానసిక కారణాలు భౌతికరూపం తీసుకుంటాయి. భౌతిక కారణాలు మనస్తత్వ నిర్మాణానికి దారితీస్తాయి. కానీ, కారణాలు మౌలికంగా ఏ మూలానికి సంబంధించినవి? అదంతా చిక్కుచిక్కు మహాచిక్కు! దశాబ్దాలుగా జడలు కట్టిన ఒక బైరాగి తలకట్టును చిక్కుతీయడం లాంటిది" ( స్వామి 2005: 130) అని మనోహర్ నాయుడు పాత్రను పరిచయం చేస్తాడు. వ్యవసాయదారులైన కమ్మకులంలో పుట్టిన వాళ్లు ఇంగ్లీషు చదువుల ద్వారా హేతువాద జ్ఞానాన్ని తెలుసుకున్నారు. మార్క్సిజం చదివి కళ్ళుబైర్లు కమ్మినవాళ్ళలో మనోహర్ నాయుడు ఒకడు. "అతడు మార్క్సిజాన్ని; తన సామాజిక జ్ఞానంలోకి ఒక భాగంగా స్వీకరించలేదు. దాన్నే సర్వస్వంగా స్వీకరించాడు. వర్గాలు మాత్రమే ఉన్న పాశ్చాత్య సమాజంలో మార్క్సిజమ్ పుడితే, ఆ మార్క్సిజాన్ని కులాలు తప్ప వర్గాలు లేని భారతీయ సమాజం మీద ఆరోపించాలని చూసినాడు. వర్గంలేని స్వర్గం కోసం అతడు కలలుగన్న భావోద్వేగం మాత్రం శంకింపరానిది. పాపం మార్క్సిజం చదువుకున్న ప్రతివాడూ పచ్చి నాస్తికుడు అయి ఉండాలని అతని రూలు! తాను నాస్తికుడు కావాలో, ఆస్తికుడు కావాలో ఎవనికి వాడు తన తత్వాన్వేషణ తీవ్రతనుబట్టి తెలుసుకుంటాడు. దాన్ని ఖచ్చితంగా నిర్ణయంచేసి వ్యక్తి అస్తిత్వంమీద రుద్దేదానికి మార్క్సిస్టు ఎవడు? గుళ్లో పూజారి ఎవడు? మనోహర్‌నాయుని మార్క్సిజమ్ ప్రజల్ని బాధించలేదు కానీ, అదేదో సామెత చెప్తారే.. లింగం పోటు కంటే జందెంపోటు జాస్తి అని;

ఆ విధంగా నాస్తికతే ప్రజల్ని బాధించడానికి ఉపయోగపడింది" (స్వామి. 2005:131) అని కమ్మవారి కమ్యూనిస్టు దృక్పథాన్ని అపహాస్యం చేస్తాడు.

మనోహర్‌నాయుడు అభ్యుదయవాది కాదనలేమనీ, శూద్రుల శ్రమను దోచుకుతిన్న బ్రాహ్మణులను చీల్చిచెండాటంలో తన అభ్యుదయ భావజాలాన్ని గొప్పగా వ్యక్తం చేస్తాడు. "ప్రస్తుతం నీ అగ్రకుల శూద్రభూస్వాములు పల్లెల్లో ఏంచేస్తున్నారో చెప్పు అని అడిగితే మాత్రం కులాలు గిలాలూ నాన్సెస్ అంటూ, తాబేలు చప్పున తన తలని డిప్పలోకి ముడుకున్నట్టు మార్క్సిజమ్ ముసుగులోకి సౌకర్యంగా తప్పుకుంటాడు. అంతమాత్రం చేత మనోహరనాయుడు తన కమ్మకులాన్ని వెనకేసుకువచ్చే పక్షపాతి అని నింద వెయ్యడానికి కూడా వీల్లేదు. అతడు తన కమ్మకులాన్ని బాగానే విమర్శిస్తాడు. కాకపోతే అప్పుడు తన గొంతులో బలం ఉండదు. పాపం, మార్క్సిజాన్ని పిడికిళ్ళు బిగించి ఏకరువు పెట్టేటప్పుడు అతని గొంతులో కదిలే బలం; అదివేరే! తల్లి తన కొడుకుని తిట్టొచ్చు కొట్టొచ్చు కానీ వేరేవాళ్ళు తన కొడుకుని కొట్టినా, తిట్టినా తల్లి భరించలేదు. అట్లాంటి తల్లి ప్రేమ ఉంది మనోహర్‌నాయుడుకు తన కులం మీద! తన కులాన్ని తిట్టినా తనే తిట్టుకోవల్లగానీ, ఇతరులు తిడితే మాత్రం సహించడు" (స్వామి. 2005:133) అని రచయిత చెప్తాడు.

బహుజనుల విముక్తికి మార్క్సిజం సరిపోదనే విషయాన్ని బలంగా రచయిత చెప్తాడు. మాదిగలు ఎన్నికల్లో పోటీ చేస్తే బోయకులస్తుడు మావోయిస్టుగా మారి తుపాకీపట్టి వాళ్ళకు అండగాఉంటాడు. మార్క్సిజం పరిమితులను గుర్తిస్తూనే, రాయలసీమ ఫ్యాక్షనిస్టు సంస్కృతిలో బహుజనులు కూడా హింసాపద్ధతులు అనివార్యమనే సంకేతం ఈ నవల్లో రచయిత వ్యక్తం చేస్తాడు. నిజాయితీలేని కమ్యూనిస్టుల మీద, కమ్యూనిస్టుపార్టీల్లో చేరి కిరాయిహంతకులుగా మారినవాళ్ల మీద రచయిత కొత్త చూపును తెరుస్తాడు.

అనంతపురం జిల్లాలో ఫ్యాక్షనిస్టుల రక్షణ కోసం మావోయిస్టు గ్రూపులు పనిచేయటం, ఫ్యాక్షనిస్టులు చంపలేనివాళ్లను మావోయిస్టులతో చంపించటం గురించి 'మీరాజ్యం మీరేలండి' నవలలో బండినారాయణ స్వామి రాస్తాడు. గోవిందు కమ్యూనిస్టు నాయకుడిగా మొదలై, ఆ తర్వాత మావోయిస్టు కార్యకర్తగా మారిపోతాడు. అందులోనూ ఇమడలేక చివరికి కాంట్రాక్టు హంతకుడిగా మారిపోతాడు. అయితే, స్వామి నిర్మించిన గోవిందు పాత్రను ప్రముఖ విమర్శకుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య విమర్శించాడు.

"గోవిందులాంటి లంపెన్‌లు కమ్యూనిస్టులలో ఉండవచ్చు. కానీ కమ్యూనిస్టులందరూ గోవిందులు కారు. గోవిందులాంటివాణ్ణి ఒక రాజకీయ నవలలోకి తీసుకువచ్చినప్పుడు అతనికి ప్రతిగా ఒక మంచి కమ్యూనిస్టు పాత్రను సృష్టించి, ఈ రెండుపాత్రలనూ కాంట్రాస్టు చేయవలసి ఉంది. అలా చేయకపోవటం రచయిత ప్రిజుడీస్‌కు చిహ్నం కావచ్చు. లేదా శిల్ప పరిజ్ఞానలోపం కావచ్చు. నవలలో భావాలు వస్తునిష్ఠంగా అభివ్యక్తం కావాలంటే రచయిత స్వయంగా కథనంలోకి అడ్డందారి వ్యాఖ్యానం చేయటం సాధ్యమైనంతగా తగ్గించుకోవాలి" (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి2006: 132) అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య అభ్యంతరం వ్యక్తంచేశాడు. వల్లంపాటి అభిప్రాయం ప్రకారం మరోమంచి కమ్యూనిస్టు పాత్రను సృష్టిస్తే అది నవల ఉద్దేశ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. మీరాజ్యం మీరేలండి అంటే బహుజన దృష్టితో మిమ్మల్ని మీరు అర్థం చేసుకోండనీ, మిమ్మల్ని మీరు పాలించుకోండనీ అర్థం. మంచి కమ్యూనిస్టు పాత్రను సృష్టిస్తే అది బహుజన దృష్టి ఎలా అవుతుంది. మార్క్సిస్టు సిద్ధాంతం ఇక్కడ పనికి రాదనీ, విప్లవం పేరుతో బయల్దేరినవాళ్లు చివరికి వ్యవస్థను రక్షించేవాళ్లుగా మారిపోతారని నిరూపించటం రచయిత ఉద్దేశ్యం. అంబేద్కరిజం, మార్క్సిజం రెండిట్లో బహుజనులు దేన్ని ఎన్నుకోవాలన్నదే ఈ నవలలోని సైద్ధాంతిక చర్చ. కానీ వల్లంపాటి

వెంకటసుబ్బయ్య మార్క్సిస్టు విమర్శకుడు కాబట్టి నవలలను ఆర్థిక సంబంధాల దృష్టితో చూస్తాడు. మార్క్సిస్టులో మంచివారిని గుర్తించి గౌరవించాలని ఆయన అభిమతం. అది విమర్శకుడి ఆలోచన. దాన్ని నవలాకర్త అంగీకరించొచ్చు. నిరాకరించొచ్చు. నవలను దాని స్కీంను బట్టీ, రచయిత దృక్పథాన్నిబట్టీ అర్థం చేసుకోవాలి. ఆ పద్ధతికి భిన్నంగా పఠించటం వల్ల నవలలో లోపం కన్పించిందాయనకు. నవలాశిల్ప పరిజ్ఞానం లేకపోవటం అనే లోపాన్ని కూడా రచయితకు వల్లంపాటి ఆపాదించాడు. చక్కటి శిల్పపుష్ఠితో వున్న ఈ నవలను అగ్రవర్ణ విమర్శకులు ఆహ్వానించలేకపోయారు.

'అంటరాని వసంతం' పూర్తిగా మావోయిస్టు స్ఫూర్తితో నడిచే నవల. కమ్యూనిస్టులు కులాన్ని పట్టించుకోలేదనే విమర్శకు ఈ నవల ద్వారా సమాధానం చెప్పే ప్రయత్నం చేశాడు, కళ్యాణరావు. నిజానికీ నవలలో మూడు ముఖ్యమైన విశేషాలు కన్పిస్తాయి. కథలోని పాత్రదారులంతా దళిత క్రైస్తవులు. కుల సమస్య చర్చాంశం. మావోయిజం పరిష్కార మార్గం. దళితుల విముక్తికి మార్క్సిజం, మావోయిజమే మార్గమని నిరూపించే రచన అంటరాని వసంతం. అందుకే, ఈ నవలను దళిత నవలగా గుర్తించడానికి ప్రొ॥ పురుషోత్తం నిరాకరించారు. కులం/వర్గం అనే చర్చను ఈ నవల్లో చాలా సౌకర్యంగా పక్కకు పెట్టడం కనిపిస్తుంది. కమ్యూనిస్టు పోరాటాలే దళితులకు మేలు చేశాయని చెప్పటం ప్రధానోద్దేశం. గాంధీ, కాంగ్రెసు పార్టీ దళితులను మోసం చేశారనీ, బిర్లా వంటి కరుడుగట్టిన హిందూవాదిని గాంధీ వెనకేసుకొచ్చాడనీ, గాంధీ హరిజనోద్ధరణ కార్యక్రమం మోసపూరితమైందనీ రచయిత ఉద్దేశం. ఈ విషయాలన్నీ డా॥ అంబేద్కర్ తన 'గాంధీ, కాంగ్రెసఅంటరానివాళ్ళకు చేసిందేమిటి'? అనే గ్రంథంలో పేర్కొన్నవే. జి.కళ్యాణరావు అక్కడక్కడా అంబేద్కర్ పేరుమాత్రమే ప్రస్తావిస్తూ ఉంటాడు. పెరియార్ రామస్వామి పేరును ఎక్కువసార్లు ప్రస్తావిస్తాడు. పెరియార్ రష్యా, క్యూబా వంటి కమ్యూనిస్టు దేశాలు తిరిగొచ్చిన తర్వాత ఇండియాలో కూడా విప్లవం రావాలని కోరాడు. రచయిత లక్ష్యానికి అనుకూలంగా వున్న అంశాలను పెరియార్ నుంచి తీసుకున్నాడు. ఆగష్టు15,1947 నాడు వచ్చింది స్వతంత్రమే కాదనీ, ఈ స్వతంత్రాన్ని బహిష్కరిస్తూ నిరసన తెలపాలని పెరియార్ అన్న సందర్భం ఈ నవలలో రామానుజం పాత్ర ద్వారా ప్రస్తావించబడుతుంది.

కమ్యూనిస్టుపార్టీ ఆనాడే మనకు సంపూర్ణ స్వతంత్ర రాలేదు కాబట్టి ప్రజలు వేడుకలకు దూరంగా ఉండాలని కోరింది. నిజమైన స్వతంత్రం కోసం పోరాడాలని పిలుపునిచ్చింది. ప్రజలు వీళ్లమాటలేవీ పట్టించుకోలేదు. అంబేద్కర్ కూడా అధికార బదలాయింపు పట్ల తీవ్రమైన అభ్యంతరం వ్యక్తం చేశాడు. కానీ, రాజ్యాంగ రచన ద్వారా ప్రజలకు నిజమైన స్వేచ్ఛను ఇవ్వాలని తలచాడు. కళ్యాణరావుకు రాజ్యాంగంపట్ల, రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల విశ్వాసం లేదు. రాజ్యాంగ యంత్రాంగాన్ని నియంత్రిస్తున్న కులాల మీదుండాల్సిన ఆగ్రహాన్ని ఆయన రాజ్యాంగం మీద వెళ్లగక్కుతున్నాడు. అందుకే, రాజ్యాంగం రాసే సమయంలో జరిగిన చర్చ, అంబేద్కర్ కాంట్రిబ్యూషన్ విషయాలు, ఆయన త్యాగాలేవీ ఈ నవల్లో చర్చకు రాలేదు. "ఈ దేశంలో పీల్చే గాలికి కులముంది తాగే నీటికి కులముంది పారేపంట కాల్వకి, పండేభూమికి కులముంది…మాటాలడే మాటకి కులముంది సాహిత్యానికి, సంస్కృతికి కులముంది రాజ్యానికి కులముంది, దాని చట్టానికి కులముంది న్యాయానికి, న్యాయస్థానానికి కులముంది, శవానికి, శ్మసాన వాటికకు కులముంది, దేవుడికి కులముంది, దెయ్యానికి కులముంది" (కళ్యాణరావు,జి 2008:197) అంటాడు. ఈ కుల సమస్యకు పరిష్కారం మాత్రం కమ్యూనిస్టు, నక్సలైటు పోరాటాలని రచయిత సంకేతిస్తాడు. ఈ నవలలో కుల సమస్యకు అంబేద్కరిజమే పరిష్కారమనే చర్చలేదు. అందమైన వాక్యాలమాటున అలవోకగా అల్లిన త్యాగాల కథతో పాఠకులను

మైమరిపించిన కళ్యాణరావు విప్లవోద్యమం యొక్క స్వభావ, స్వరూపాల మీద కిందికుల కార్యకర్తలు, రచయితలు లేవనెత్తిన చర్చను చాలా సుఖంగా విస్మరించాడు. కానీ, ఈ నవల వచ్చిన పది సంవత్సరాలకు ఏకుల వెంకటేశ్వర్లు 'ఎన్నెల నవ్వు' వెలువరించాడు. యానాది కులానికి చెందిన వ్యక్తి విప్లవోద్యమంలో పనిచేసి, త్యాగాలు చేసి ఈ దేశంలోని కుల సమస్యకు మార్క్సిజం పరిష్కారం కాదనే చర్చను శక్తిమంతంగా చేస్తాడు.

చెంచులు కులాన్ని పోగొట్టాలని ఆశయం. చెంచులుకు రమణారెడ్డి అనే నక్సలైట్ లీడర్ పరిచయం అవుతాడు. రమణారెడ్డి ఇతరులకు తనపేరు రాజన్న అని చెప్పుకుంటాడు. రహస్యోద్యమంలో ఇదొక పద్ధతి. క్యాంపెయిన్‌కు వచ్చిన యువకులకు రాజన్న చిన్నపాటి ఉపన్యాసం ఇస్తాడు. పేదలు, కష్టాలు, కన్నీళ్ళు వంటి మాటలు మాట్టాడుతాడు. ఎవరికైనా సందేహాలుంటే అడగమని రాజన్న అంటాడు. అప్పుడు చెంచులు అడుగుతాడు. "ఆకలి, దరిద్రం, పేదరికం కొత్తవేమీ కాదన్నా, ఈ కులమేందన్నా, ఇది పోద. దీన్ని నాశనం చెయ్యమా. మనసులోని మాటను బయటేశాడు చెంచులు. రాజు అంటూ చెంచులికి సమాధానం చెప్పడానికి సమాయత్తమయ్యాడు రాజన్న. కులం, సాంప్రదాయం, సంస్కృతి అనేది దోపిడీ వ్యవస్థ అనే చెట్టుకి కొమ్మలు. అందుకే మనం ఈ దోపిడీ వ్యవస్థ అనే చెట్టును వేళ్ళతో సహా కూల్చివేస్తే ఆ చెట్టుకొమ్మలు ఎక్కడుంటాయ్.. ప్రశ్నించాడు రాజన్న. ఇంకెక్కడుంటాయ్ నేలమీదుంటాయ్‌గా.. సమాధానం చెప్పాడు చెంచులు... బాగాచెప్పావ్. అందుకే ఈ వ్యవస్థనే పునాదిని కూల్చివేసి అందరూ సమానంగా బ్రతికే సమాజంకావాలని పోరాడుతున్నాం కామ్రేడ్ అర్థమయ్యిందా?" (వెంకటేశ్వర్లు ఏకుల. 2011:168). నవల ముగింపు వాక్యం, 'ఆకాశమంతా నీలిరంగు పులుముకుంది'. ఈ ఒక్క మాట ద్వారా చెంచులు ఎటువైపు పయనించబోతున్నాడో ప్రతీకాత్మకంగా రచయిత తెలుపుతున్నాడు. చెంచులుది కుల సమస్య. దాన్ని వదిలించుకోవటమే చెంచులు లక్ష్యం. కమ్యూనిజం వల్ల ఆ సమస్య పరిష్కరించబడుతుందని రాజన్న చెట్టు, కొమ్మలు ఉపమానం ద్వారా ఎరుకపడింది. కానీ, ఏదో ఒకరోజు పునాది, ఉపరితలం అనే రెండింటి గురించి బాబాసాహేబ్ అంబేద్కర్ చెప్పిన విషయాలు తెలుసుకుంటాడు. పునాది నిర్మాణమైన భవనాన్ని కూల్చేయకుండా పునాదిని కనీసం తాకలేరని డాక్టర్ అంబేద్కర్ చెప్పాడు. చెట్టు కొమ్మల్ని నరికేయకుండా, చెట్టును వేళ్ళతో సహా కూల్చేయలేరనే కనీస విషయాన్ని చెంచులు ఏదోఒక రోజు తెలుసుకుంటాడు. అప్పుడు ఆ ఉద్యమాన్ని వదిలేసి, బహుజనోద్యమం వైపు అడుగులేస్తాడు. ఈ నవలారచయితే ఇందులోని ప్రధాన కథానాయకుడు. చెంచులు ఇతడే. కుల సమస్యమీద మావోయిస్టు పార్టీ వైఖరిని వ్యతిరేకించి, బహుజన పోరాటంలోకి వచ్చాడు. ఈ పరివర్తనను ఆఖరి వాక్యం ద్వారా పాఠకులకు తెలియచేస్తున్నాడు.

చిలుకూరి దేవపుత్ర రాసిన 'పంచమం' నవల్లో కూడా కమ్యూనిస్టు రాజకీయాలుంటాయి. కానీ, ప్రధాన నాయకుడు వాటిని అభిమానిస్తాడుగానీ వాటిలో చేరడు. విద్యా, ఉద్యోగం, రాజకీయ పదవుల వల్ల దళితుల్లో మార్పు రాదనీ, స్వతంత్రమైన అధికారం సంపూర్ణంగా దళితుల చేతికి వచ్చినప్పుడే సమాజం మారుతుందని కథానాయకుడు భావిస్తాడు. ఈ ఎరుకతో నవల ముగుస్తుంది. కమ్యూనిస్టు రాజకీయాలను కేవలం ప్రస్తావించటమే తప్ప వాటిపట్ల పెద్ద ఆసక్తి రచయితకు ఉన్నదని భావించలేం.

'నల్లమిరియం చెట్టు' నవల్లో డా॥ వి. చంద్రశేఖరరావు కూడా కమ్యూనిస్టు, నక్సలైటు ఉద్యమాలను ప్రస్తావిస్తాడు. రాజాసుందరం తమ్ముడు కరుణకుమార్. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా మొదలవుతాడు. రాజాసుందరం సమాజం కోసం ఏమీ చేయట్లేదని విమర్శిస్తాడు. నక్సలైటు ఉద్యమంలో చేరి అడవుల్లోకి వెళ్లిపోతాడు. నక్సలైటు ఉద్యమం నుంచి బయటికొచ్చి, మాదిగ దండోర ఉద్యమం తీవ్రంగా రిజర్వేషన్ వర్గీకరణ పోరాటం చేస్తుంటే, కరుణకుమార్

చాలాకష్టపడి పనిచేస్తాడు. డబ్బుకు, అధికారానికి అన్న రాజాసుందరం అమ్ముడుపోతున్నాడని గ్రహించి నిలదీస్తాడు. దీంతో రాజాసుందరం సొంత తమ్ముణ్ని చంపించేస్తాడు. దండోరా ఉద్యమానికి మాజీ నక్సలైట్లు పనిచేసిన తీరును చెప్తాడు. నక్సలైటు ఉద్యమం పట్ల ఆసక్తిని కనబరుస్తూ రచయిత నవల నడిపినట్టు మనకు కనిపిస్తుంది. ఈ రకంగా బహుజన నవలల్లో కమ్యూనిస్టు ఉద్యమం, నక్సలైటు ఉద్యమం పట్ల సానుభూతి ఉంది. అయితే, మార్క్సిజం కులసమస్యను పరిష్కరించుకొనేందుకు తోడ్పడదనే ఎరుకను కూడా చర్చకు పెట్టింది. కమ్యూనిస్టుల, నక్సలైట్ల ఉద్యమాలను విమర్శనాత్మకంగా చూడటం బహుజన నవల్లో కనిపిస్తుంది.

**5.5. బహుజన సంస్కృతి చిత్రణ:**

నవలలో వాతావరణ చిత్రణ ఉంటుంది. అదే నవలను శిల్పఔన్నత్యస్థితికి చేర్చుతుంది. వాతావరణ చిత్రణ అంటేమిటి? ఒక సంఘటనను చిత్రించేటప్పుడు ఆ సంఘటన తాలూకు స్థల, కాలాలుంటాయి. అంటే నవలలో చిత్రితమయ్యే స్థలం ద్వారా కాలం కూడా పరోక్షంగా వ్యక్తమవుతుంది. అదేవిధంగా నవలలో వర్ణించే కాలం ద్వారా స్థలం కూడా వ్యక్తమవుతుంది. నిజానికి స్థలకాలాదులే వాతావరణం. వాతావారణం అంటే స్థలకాలాలే కాదు. ఇతర అనేక అంశాలుంటాయి. నవలలో రాజకీయ వాతావరణాన్ని చిత్రించకపోతే అది రాజకీయ నవల కాలేదు. అలాగే సాంఘిక పరిస్థితులను చిత్రించకపోతే అది సాంఘిక నవల కాలేదు. కులాన్ని చిత్రించకపోతే అది బహుజన నవల కాలేదు. వాతావరణ చిత్రణ పేరుతో ఆ సంఘటన జరుగుతున్న స్థలంలో కన్పించే చెట్లు, వాగులు, నదులు, ఇంటిపెరడు, రోడ్డుమీది దుకాణాలు, మేఘావృత ఆకాశం, పరిగెత్తే వాహనాలు మాత్రమే చిత్రించారు. కానీ వీటివల్ల నిజమైన వాతావరణం నవలలోకి రాలేదు. సమాజంలోని సంస్కృతిని చిత్రిస్తేనే ఆ స్థలంలోని వాతావరణం నవలలోకి వస్తుంది.

ఉదాహరణకు చెప్పులు తయారు చేసే దృశ్యాన్ని చిత్రించేటప్పుడు ఆ స్థలంలో వుండే లంద, ఎండుతున్న తోలు, దానిమీద వాలిన పురుగులు, వాటిమధ్య ఆరెతో చెప్పును కత్తిరిస్తున్న మాదిగ కళాకారుడి చూపు, పంటికింద నలుగుతున్న నాలుకా వంటివన్నీ చిత్రించాలి. కక్క నవలలో కక్కడు తాడు పేనుతున్నప్పుడు, పెద్దజీతగాడు ఎలాంటి పనులు చేయాల్సి వుంటుందో తెలిపే సందర్భంలో వర్ణించిన వాతావరణం అద్భుతంగా వుంటుంది. 'అంటరానివసంతం' నవలలో ఎల్లన్న పూనకం వచ్చినవాడిలో డప్పు దరువుకు చిందేస్తున్నప్పుడు ఊరంతా నిశ్చేష్టులై చూడటం అద్భుతంగా చిత్రించాడు రచయిత. "సాహిత్యం యొక్క ఒక ముఖ్య లక్షణం వర్తమానత. నిర్దిష్ట సమాజం యొక్క భౌతిక ఆధ్యాత్మిక అవసరాలను సమాజాభివృద్ధి యొక్క అవకాశాలను గుర్తించడమే వర్తమానత. వర్తమానతను గుర్తించిన సామాజికుడు పురోగామి శక్తులతో చేయిగలిపి తన కాలపు సమాజాన్ని ఉన్నతస్థాయికి తీసకెళ్ళేందుకు ప్రయత్నిస్తాడు. అదేవిధంగా వర్తమానతను గుర్తించిన సాహిత్యకారుడు సమాజాభివృద్ధికి అవసరమైన సాంస్కృతిక విలువలను ప్రతిపాదిస్తూ అవి సాధ్యాలేననే విశ్వాసాన్ని వ్యక్తం చేశాడు" (డా॥ సామాన్య, 2012: 111) అని సామాన్య అంటరానివసంతం గురించి చెప్తుంది. వర్తమాన సమాజాన్ని నవలలోకి తీసుకురావటమే వాతావరణ చిత్రణ. ఎమిలీ జోలా వలే వాస్తవికత పేరుతో సెట్టింగ్‌ను కచ్చితమైన కొలతలతో చిత్రించటం బహుజన నవలలో కనిపించదు. ఎమిలీ జోలను అనుసరించిన అగ్రవర్ణ రచయితలు పాత్రల రూపురేఖలను, చాతివైశాల్యాన్ని అంగుళాలతో సహా వర్ణించేవాళ్లు. ఈ పద్ధతి బహుజన నవలలో కనిపించదు. రవీంద్రనాద్ ఠాగూర్, బెంగాలీ రచయిత శరత్ రాసిన నవలల్లో వర్ణాణాత్మక పద్ధతి ఎక్కువ. అసహజమైన పాత్రాచిత్రణ, వాతావరణ చిత్రణను విమర్శకులు అంగీకరించరు. బహుజన నవలలో

వాతావరణ చిత్రణ విడిగా వుండదు. అది పాత్రల వ్యక్తిత్వంలో అంతర్లీనమై వుంటుంది. పరిసరాల పరికల్పన విడిగా ఉండదు. కథాపరిణామక్రమంలో పరిసరాల పరికల్పన రూపొందుతుంది.

"పూర్వం నవలల్లో చాలా వివరంగా స్థానికమైన అంశాలు పరంపరగా చిత్రితమయ్యేవి. అవడులు పర్వతాలు నదులు వీధులు ఇండ్లు గదులూ, గదుల్లో వస్తువుల అమరిక అన్నీ విపులంగా రచయిత పరిశీలనాశక్తికి నిదర్శనంగా సాగేవి. ఈ పద్ధతిలో ఈనాడు కొంతమార్పు వచ్చింది. రచనలో మధ్యమధ్య విరామవర్ణనలు వదిలేసి, క్లుప్తంగా వర్ణన అవసరంమేరకు అవలంభింపడుతూంది. ఈకాలంలోనూ పరిసరాలవర్ణనం తొలిగిపోలేదు. తొలగిపోవడానికి వీలూలేదు. కాని రచనలో ప్రయోజనం మేరకు లేదా విశేషదృష్టితో స్వీకృతమౌతుంది" (రంగారావు,మాదిరాజు :1984.1984: 47) అని మాదిరాజు రంగారావు తెలిపారు. అయితే, వాతావరణ చిత్రణ అంటే ఇలాంటి వివరణాత్మక, సంఖ్యాత్మక వర్ణన కాదనే విషయాన్ని ఆయన వివరిస్తారు.

"నవలాలక్షణాల్లో వాతావరణ చిత్రణ ఒకటి. ఇది కాలానికీ స్థలానికీ సంబంధించింది. కథాగమనంలోని కాలస్థల రూపమే వాతావరణం. ఒక కాలంలో ఒక స్థలంలో జీవించిన వ్యక్తుల జీవితగమనంలో అనుబంధంతో విడదీయడానికి వీలులేకుండాను ఉంటుంది. పూర్వభూమిక దృశ్యం, పరిసరాలు, వాతావరణం అన్నీ నిర్మితిలో స్వల్పమైన భేదంతో ప్రయుక్తమౌతుంది. వాతావరణం అనే మాట ప్రకృతిగతంగా, భౌతికంగా, మానసికంగా విస్తృతమైన అర్థాన్ని తనలో ఇముడ్చుకోగల పరిధి కలిగింది. ఇది నవల్లో ఇతివృత్తం పాత్ర ఉద్దేశానికి సంబంధించిన యోజనాపరమైన స్వరూపం చేత నిర్మాణ రూపాన్ని పొందుతుంది. సృజనాత్మక సాహిత్యంలో రనచలో ఇతరమైన అంశాలను పురస్కరించుకొని దీని ప్రమేయం, స్థానం నిర్ణీతమవుతుంది. కాలాన్నీ, స్థలాన్నీ ఆశ్రయించిన చిత్రణం వాతావరణ కల్పనలో ప్రాధానగుణం'' (రంగారావు,మాదిరాజు :1984.44) అని మాదిరాజు రంగారావు తెలుపుతాడు.

ఏకుల వెంకటేశ్వర్లు రాసిన 'ఎన్నెల నవ్వు' నవల యానాదుల జీవితాన్ని చిత్రిస్తుంది. యానాదుల వేషభాషలను రచయిత ప్రత్యేకంగా చిత్రించాడు. యానాదులు బతికే తోపులను కూడా ప్రత్యేకంగా వర్ణించాడు. పాత్రల చలనంతో పాటుగా అవి ప్రస్తావించబడుతాయి. యానాదుల నడుమ వుండి మనం కథను చూస్తున్నామనే అనుభూతిని రచయిత కలిగిస్తాడు. "ఆయ్.. అంటూ ఎగురుతున్న చాపల్ని చూసి చెంచులు ఆనందంగా ఎగురుతున్నాడు. పక్కెలు, మొయ్య చాపలు పడ్డయ్. అవి ఏరి బుట్టలో ఏస్కొని మళ్ళీ నీళ్ళలోకి దిగారు. ఇట్టా ఇద్దరూ వేటాడుతూ ముందుకు సాగుతున్నారు. ఏటి గట్టుపైన దుండిగచెట్టు గుట్టలో ఉన్న కంజుపిట్ట కిక్కలక్క... కిక్కలక్కం.. కిక్కలక్కం.. కిక్కలక్క.. మని అరిచింది. కంజుపిట్ట శబ్దం చెంచుల్ని ఆకర్షించింది. ఆ శబ్దం వచ్చిన దిక్కన చెంచులు చిన్నికళ్ళు వెదకసాగాయి. మళ్ళీ కంజుపిట్ట కిక్కలక్కం.. కిక్కలక్కం... కిక్కలక్కం.. కిక్కలక్కం..మంటూ అరిచింది. చెంచులు ఆ అరిచిన పిట్ట దుండిగచెట్టు గుట్టలో వుంది, అని పసిగట్టి అచ్చు కంజుపిట్ట అరిచినట్లుగానే తాను అరిచాడు. చెంచులు అరుపుని కంజుపిట్ట తన జాతిపిట్ట అరుపే అనుకుంది కాబోలు సమాధానంగా అది మళ్ళీ అరిచింది. అట్టా కంజుపిట్ట, చెంచులు కాసేపు పోటీపడి అరిచారు. చెంచులుతో పోటీపడలేక పాపం కంజుపిట్ట ఎగిరిపోయింది అరుసుకుంటూనే. యానాదోళ్ల బిడ్డలకు ప్రకృతే విశ్వవిద్యాలయం, పిట్టలు, జంతువులే వీళ్ళకు ఉపాధ్యాయులు'' ( వెంకటేశ్వర్లు,ఏకుల: 2011.70-71)

వాతావరణాన్ని నవలలోకి తీసుకురావట మంటే సంస్కృతిని నవలలోకి తీసుకురావటం.

ఆయా కుల సంస్కృతులను, ఆయా కులాల మానసిక, భౌతిక ప్రవర్తనను తీసుకురావటమే వాతావరణ చిత్రణ. అగ్రవర్ణ నవలాకర్తలు వాతావరణ చిత్రణను ప్రకృతికి పరిమితం చేశారు. సంస్కృతి అంటే మన సమాజంలో కులం. కుల సంస్కృతి వ్యక్తుల నడవడికను, నడతను నిర్ణయిస్తాయి. కులం వ్యక్తులు జీవించే పరిసరాలను నిర్ణయిస్తాయి. కులం వ్యక్తుల భౌతిక స్థలాన్ని నిర్ణయిస్తుంది. దళితులు ఊరికి దూరంగా జీవిస్తారు. మురికివాడల్లో బతుకుతారు. దళిత నవలాకారుడు ఆ ఊరికి దూరంగా వెలేయబడిన స్థలాన్ని, ఆ స్థలంలో ఆ వ్యక్తి ప్రవర్తనను చిత్రిస్తాడు. అగ్రవర్ణాలు బతికే ప్రాంతాలు విడిగా ఉంటాయి. అవి అధికార కేంద్రాలు. వాటి అధికార దర్పాణ్ని చిత్రికపడిడతేనే వాతావరణం నవల్లోకి ప్రవేశిస్తుంది. అగ్రవర్ణ స్థలాలకు దూరంగా, గ్రామ సామాజిక జీవనానికి దూరంగా జీవించే తెగలున్నాయి. వాటి సంస్కృతి వేరు. ఆ సంస్కృతిని నవలలోకి తీసుకొస్తేనే వాతావరణ చిత్రణ జరుగుతుంది. బహుజన నవల అణగారిన వర్గాల సంస్కృతిని నవల వాతావరణంలోకి తీసుకొచ్చింది.

**5.6 . బహుజన నవల బహుళత్వం:**

బహుజన నవల అనేకతల మీద నిర్మాణమైంది. బహుజన సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీలు నవలను రాయటం ఒక కొత్త విషయం. అయితే, ఆయా నవలల్లో సబండ కులాల మధ్యవున్న కులసంబంధాలను, మానవ సంబంధాలను చిత్రించటం ఒక కొత్త విషయం. కుల సమాజంలో సంబంధాలు అనేకంగా ఉంటాయి. ప్రతి కులం ఇతర కులాలతో అనుసంధానం చేయబడివుంటుంది. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో తన స్థానాన్నిబట్టి ఇతర కులాలతో అనులోమ, విలోమ సంబంధాలను కల్గివుంటుంది. అందుకే, ఆయా సంబంధాలను బహుళంగానే చిత్రించాలి. మనువాదం శత్రువైరుధ్యాలుగా నిర్మించిన సంబంధాలను, మిత్రసంబంధాలుగా చిత్రించాలి. పరస్పరం శత్రువులనుకొనే కులాల మధ్య మిత్రత్వం ఏర్పడాలి. అది సాంఘిక, రాజకీయ ఐక్యతకు దారితీస్తుంది. ఆ ఐక్యతే మనువాద రాజ్యాన్ని కూల్చేస్తుంది. ఈ భావన కక్క, సూర, అనంతజీవనం, మీరాజ్యం మీరేలండి, వెండిమేఘం, అంటరానివసంతం నవలల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

వేముల ఎల్లయ్య రాసిన 'కక్క' నవలలో శూద్రులు, మాదిగలు, ముస్లింలు ఐక్యమై రెడ్లను, ఆంధ్ర కమ్మోలను ఎదుర్కొంటారు. అదేవిధంగా భూతం ముత్యాలు రాసిన 'సూర'లో సూరని బోధనలతో చైతన్యవంతులైన శూద్రులు, ముస్లింలు కల్సి రెడ్డిని చంపేస్తారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ రాసిన 'అనంతజీవనం' నవలలో ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ ఐక్యత వ్యక్తమవుతుంది. రెడ్డిని బజారన్న తన్ని లాకప్‌లో వేయటం, యద్దిప్ప అన్నికులాల వాళ్లకు ఇండ్లు కట్టివ్వడంతో పాటు వాళ్ల మంచిచెడ్డలో పాలుపంచుకోవటం కనిపిస్తుంది. అంటరానివసంతం నవలలో అన్నికులాలు సాయుధ పోరాటంలోకి రావటం కనిపిస్తుంది. ఎన్నెల నవ్వులో యానాదులకు, ఇతర కులస్తులకు మధ్య వుండే సంబంధాలను చక్కగా వర్ణించాడు. కాలువ మల్లయ్య రాసిన సాంబయ్య చదువు నవలలో సబ్బండ వర్ణాల మధ్య ఐక్యతను, ఘర్షణను చిత్రించింది. రెడ్లు, వెలమలు చేసే కుట్రలను చిత్రించింది. ఈరకంగా బహుజన నవల సమాజంలోని అన్ని కోణాలను సృజించింది.

బహుజన నవల ప్రాంతాల వారిగా రావటం వల్ల ప్రాదేశిక బహుళత్వం వ్యక్తమైంది. అన్ని సామాజిక వర్గాల నిర్దిష్టతలను అది వ్యక్తీకరించటం వల్ల సామాజిక బహుళత్వం కనిపిస్తుంది. వేర్వేరు ప్రాంతాల, కులాల భాషా వ్యవహారాలను, సంస్కృతులను వ్యక్తం చేసింది కాబట్టి భాషాపరమైన, సాంస్కృతికమైన బహుళత్వం కనిపిస్తుంది. ఈ రకంగా వలసానంతర జీవితంలోని వైవిధ్యం, బహుళత్వం చాలా స్పష్టంగా బహుజన నవలలో కనిపిస్తుంది.

**5.7. బహుజన నవల – మాదిగ, మాల చైతన్యం:**

దళితవాదం, మాదిగవాదం రెండూ అటుయిటుగా ఒకేకాలంలో మొదలయ్యాయి. దండోరా ఉద్యమం అనేక విషయాలను చర్చకు తెచ్చింది. కొత్త విలువలను ప్రతిపాదించింది. ఆ ప్రేరణతో మాదిగ చైతన్యం పెరిగింది. సాహిత్యంలో మాదిగలు ప్రత్యేక శాఖగా రాయటం మొదలైంది. మాదిగ చైతన్యంలోంచే వేముల ఎల్లయ్య 'కక్క' నవల రాశాడు. మాదిగ చైతన్యమే లేకపోతే వేముల ఎల్లయ్య నవల రూపొందేది కాదు. మాదిగ దండోరా ఉద్యమంలోని తప్పులను, దండోర నాయకత్వంలోని నిజాయితీ రాహిత్య స్థితినీ, సున్నిత మనస్కుడైన, మానవతా విలువలెక్కువ వున్న రాజాసుందరం కొడుకు ఆత్మహత్య చేసుకొనేలా డా॥ వి. చంద్రశేఖరరావు 'నల్లమిరియం చెట్టు' రాసేవాడు కాదు. దండోరా ఉద్యమ నాయకత్వం తన స్వప్రయోజనాల కోసం అమ్ముడుపోతుందనీ, అలాంటి నాయకత్వం వల్ల మాదిగజాతి నాశనమైపోతుందనే అవగాహన ఆయనలో కనిపిస్తుంది. మాదిగల చైతన్యానికి ప్రతిస్పందనగా మాలలు రచనలు చేయటం ప్రారంభించారు. భూతం ముత్యాలు 'సూర' నవల ప్రతిస్పందన చైతన్యానికి సాక్ష్యం. ఈ నవలలో రిజర్వేషన్ వర్గీకరణను వ్యతిరేకించడు. కానీ, విద్యా, ఉద్యోగాల్లోకీ, రాజకీయాల్లో ప్రవేశిస్తేనే మాలలు, ఇతరులు అభివృద్ధి చెందుతారనే అవగాహన 'సూర' నవలలో కన్పిస్తుంది. మాదిగలు రాజ్యాధికారంలోకి రావాలని బండినారాయణ స్వామి 'మీరాజ్యం మీరేలండి' నవలలో చెప్తాడు. మాదిగలు, బోయలు ఇద్దరూ ఫ్యాక్షన్ గొడవల్లో పడి నాశనం కాకుండా, బహుజన రాజకీయాలు నెరపాలన్నది రచయిత ఉద్దేశం. అనంత జీవనంలో మాదిగల జీవితాలను లిఖించటంలో కూడా మాదిగ చైతన్యం కనిపిస్తుంది. దేవపుత్ర 'పంచమం' నవలలో కథానాయకుడు మాదిగ. దండోర ఉద్యమం పట్ల కాస్త విమర్శనాత్మక దృష్టి ఉన్నప్పటికీ అధికారంలేనిది ఏమీ చేయలేరని ఈ నవల చెప్తుంది. మాదిగ చైతన్యం ఊపుగా వచ్చింది. మాలలు తమ చైతన్యాన్ని దళిత సాహిత్యం పేరుతో వ్యక్తం చేశారు. ఇదొక సాంఘిక పరివర్తన ఉద్యమంలో మలుపు.

**ముగింపు:**

తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీల రచనలు వెలువడ్డాయి. కానీ, ఉత్తరాంధ్ర నుంచి మాత్రం దళిత నవలా రచయితలు లేరు. అదేవిధంగా, ఎస్టీ, బిసీ, మైనార్టీ నవలా రచయితలు పెద్దగా లేరు. అందుకే, ఉత్తరాంధ్ర సామాజిక, సాంస్కృతిక విషయాలు బహుజన నవలలోకి ప్రవేశించ లేదు. కృత్రిమ యాంత్రికతలో ఆధిపత్య కులాల నవల ఆగిపోయింది. వేలాది కులాల విశాలమైన అనుభవాన్ని, జీవన సారాంశాన్ని వ్యక్తం చేసే బహుజన నవలలు విరివిగా వచ్చే అవకాశం ఉంది.

–0–

# ఉపయుక్త గ్రంథసూచి


అంబేద్కర్.బి.ఆర్ :1994, డా.బాబా సాహెబ్ అంబేద్కర్ రచనలు–ప్రసంగాలు, తెలుగు విశ్వవిద్యాలయం,హైదరాబాద్

అస్ఘర్ అలీ. ఇంజనీర్ :2005 భారతీయ ముస్లింల వెనుకబాటుకు కారణాలు, ముల్కి, స్కైబాబ, వేముల ఎల్లయ్య(సం.) హెచ్‌బీటీ, హైదరాబాదు.

ఇనాక్, కొలకలూరి :2007 'అనంతజీవనం' జ్యోతి గ్రంథమాల హైదరాబాద్

ఇనాక్, కొలకలూరి :2010 తెలుగులో తొలి నవల శ్రీరంగరాజు చరిత్ర, జ్యోతిగ్రంథమాల,హైదరాబాద్

ఇనాక్. కొలకలూరి :2011 ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితి సమాలోచన, జ్యోతి గ్రంథమాల.

ఇనాక్, కొలకలూరి :2010 ఆధునిక విమర్శసాహిత్యసూత్రం, జ్యోతిగ్రంథమాల ప్రచురణ, హైదరాబాద్

ఇనాక్ కొలకలూరి :2013 దండోర జ్యోతి గ్రంథమాల. హైదరాబాద్

ఇనాక్, కొలకలూరి :2011,*రాయలసీమ జనజీవనాన్ని చిత్రించిన 'అనంతజీవనం'* (వ్యాసం), సాహితీ సమాలోచనం.

మాధవి,బి.టి :2011, ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితి, సమాలోచనం. 'రాయలసీమ జనజీవనాన్ని చిత్రించిన అనంత జీవనం. ఆచార్య కొలకలూరి ఇనాక్. సాహితీ సమాలోచనం.

ఎల్లయ్య, వేముల : 2000, 'కక్క'. గుంపు సాహితి సంస్థ, నల్లగొండ

ఎల్లయ్య వేముల,స్కైబాబ(సం) :2005, ముల్కి. ముస్లిం సాహిత్య ప్రత్యేక సంచిక. హైదరాబాద్ బుక్‌ట్రస్ట్. ప్రచురణ. హైదరాబాద్

ఎల్లయ్య, వేముల :2011, ముల్కి, గుంపు సాహితీ సంస్థ. నల్లగొండ

ఎల్లయ్య వేముల 2011 : ముల్కి. (కవిత్వం)పత్త .గుంపు సాహితీ సంస్థ ప్రచురణ. నల్లగొండ.

కళ్యాణరావు,జి :2008, అంటరాని వసంతం. విసరం. ఎపి

కాత్యాయనీ విద్మహే :2005, జండర్ స్పృహ. వరంగల్

కాత్యాయని విద్మహే :2013,ప్రాంతీయ చైతన్యం. తెలంగాణ సాహిత్యం. పాలపిట్ట బుక్స్. హైదరబాద్

కాత్యాయని.ఎస్ :1997, వలస పాలనలో విద్య, ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రభావాలు–స్పందనలు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం. (అముద్రిత పీహెచ్‌డీ వ్యాసం)

కృపాకర్,మాదిగ :2001, మాదిగ దండోరా. ఏడు వ్యాసాలు. దండోర ప్రచురణలు. హైదరాబాద్.

కృపాకర్ మాదిగ :2001, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్‌ల హేతుబద్ధీకరణ, దండోర ప్రచురణలు. హైదరాబాద్

కృపాకర్ మాదిగ, పోనుగోటి :2008, కైతునకల దండెం, దండోర ప్రచురణలు, హైదరాబాద్

కేశవకుమార్.జి :1995, విప్లవసాహిత్యోద్యమంలో విరసం పాత్ర.

కళ్యాణ్‌రావు (సం.) విరసం ప్రచురణ. కావలి
కోటేశ్వరరావు, కోయి : 2011. *యానాది బతుకు పేగు తెంచుకుపుట్టిన చారిత్రాత్మక నవల* ఎన్నెలనవ్వు.(ముందుమాట) బహుజన కెరటాలు ప్రచురణ,ఒంగోలు
చంద్రశేఖరరావు, వి : 2012 'నల్లమిరియం చెట్టు. హైదరాబాద్
దేవపుత్ర, చిలుకూరి : 2009, 'పంచమం' హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్
నళిని,ఎస్.ఎస్ :2009. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ. హైదరాబాద్
నవీన్, అంపశయ్య :2012. మనోవైజ్ఞానిక నవలల విశ్లేషణ. ప్రత్యూష ప్రచురణ. వరంగల్, పేద ముస్లింల జీవితాలను చిత్రించిన మొదటి తెలుగు నవల 'వెండి మేఘం'.
నారాయణ స్వామి, బండి :1998,మీరాజ్యం మీరేలండి, భగవాన్ ప్రచురణలు,అనంతపూర్
నిఖిలేశ్వర్ :1982, అస్తిత్వవాదం, ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, ఆంధ్రసారస్వత పరిషత్, హైదరాబాద్
ప్రసాద్, కలేకూరి :2012 పిడికెడు ఆత్మగౌరవం కోసం. బహుజన కెరటాలు. ప్రచురణ. ఒంగోలు
ప్రసాద్, కలేకూరి :2000, సాహితీ కాలుష్యంలో ఒక స్వచ్ఛమైన శ్వాస కక్క, ఆదివారం వార్త. 24 సెప్టెంబర్.
ప్రతాపరెడ్డి, కాసుల :2005, హిందూత్వకు విరుగుడు హేతువాదం కాదేమో?! ముల్కి, హెచ్‌బిటి. హైదరాబాదు.
ప్రేమలతా రావి :2005. తెలుగోల్ల ముస్లింల సమైక్యతకు నిదర్శనం మొహరం. ముల్కి.ఎచ్.బీ.టీ. హైదరాబాదు.
మధుజ్యోతి. కొలకలూరి :2009,ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యంపై విమర్శనం, జ్యోతిగ్రంథమాల. హైదరాబాద్.
మల్లయ్య, కాలువ :2001, 'కాలువ మల్లయ్య నవలలు' (సాంబయ్య చదువు,) తెలుగు వచనం ప్రచురణలు, కరీంనగర్
ముత్యాలు భూతం :2004, 'సూర' గుంపు సాహితీ సంస్థ, నల్గొండ
ముత్తయ్య.పి :2007 ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు, ఆంధ్రప్రదేశ్ మాదిగ మేధావుల పోరం. ఉస్మానియా యూనివర్శిటి హైదరాబాద్
మూర్తి, వి.వి.న :2011. *చెప్పులు కుడుతూ, కుడుతూ,* మనసు పౌండేషన్. బెంగుళూరు
మృణాలిని.సి :2012 నవ్యసాంప్రదాయోద్యమం, తెలుగులో కవితోద్యమం, తెలుగు అకాడమి హైదరాబాదు.
రంగనాథచార్యులు, కె.కె :1982, ఆధునిక తెలుగు సాహిత్యంలో–విభిన్న ధోరణులు. ఆంధ్రసరస్వత పరిషత్, హైదరాబాదు
రమేష్. జరుపుల :2011, అడవిలో వెన్నెల (గిరిజన పోరాట కథలు) సమగ్ర పరిశీలన, హైదరాబాదు
రంగారావు.మాదిరాజు :1984, నవల స్వరూప సమాలోచన, రసధుని ప్రచురణ,వరంగల్
రాఘవయ్య. వెన్నెల కంటి :1974, యానాది, ఆంధ్ర, రాష్ట్ర ఆదిమజాతి సేవాసంఘం, విజయవాడ.
రాజేందర్.జి :2005, ఈ దేశంలో ముస్లింల దుస్థితి,

ముల్కి హెచ్‌బీటీ, హైదరాబాదు.
రాజేశ్వరి తుర్లపాటి :2002,స్వాతంత్ర్యానంతర తెలుగు నవల. క్వాలిటీ పబ్లిషర్స్. విజయవాడ.
రామమోహనరావు. అద్దేపల్లి :2004, ఆవేశంతో కాదు అవగాహనతో విమర్శించాలి. దళిత సాహిత్యానికి నేపథ్యం ఏమిటి? దళితవాద వివాదాలు. విశాలంధ్రా పబ్లిసింగ్ హౌజ్, హైదరాబాదు.
లళిత.వకుళాభరణం :2009, ఆంధ్రప్రదేశ్‌లో విముక్త జాతులు. నేషనల్ బుక్‌ట్రస్ట్. ఇండియా
లక్ష్మినర్సయ్య.జి :1996,*దండిగా దూసుకొచ్చిన దళిత చూపు*, పదునెక్కిన పాట. దళిత సాన ప్రచురణలు.విజయవాడ
వరుణ్ కుమార్, ఎస్ :2011, కాన్షిరామ్ ఇలా మాట్లాడారు. సమాంతరపౌండేషన్. హైదరాబాద్.
వరప్రసాద్.బి :2011, అనంతజీవనంలోని జీవనతత్వం. ఆచార్య కొలకలూరి ఇనాక్, సాహితీ సమాలోచనం.
వెంకట్‌లాల్.జి :2011, తెలుగు నవలలో లంబాడీల జీవనచిత్రణ,ఖమ్మం
వెంకటేశ్వర్లు, ఏకుల :2011, 'ఎన్నెల నవ్వు' బహుజన కెరటాలు ప్రచురణ,ఒంగోలు
వెంకటేశ్వరరావు. దార్ల :2012, *ఎన్నెలనవ్వు-యానాదుల సంస్కృతి*, బహుజన సాహిత్య దృక్పథం. సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్. హైదరాబాద్
వెంకటేశ్వర్లు, గుడిపాటి :2012, *మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వం*, తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమీ, హైదరాబాదు
సత్యనారాయణ. ఎస్.వి (సం) :2001,దళితవాదవివాదాలు, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం
సంపత్కుమారాచార్య :2004,భాషకు కులమానాలు ఉంటాయా? నా భాషనీ, భావననీ వక్రీకరించారు. దళితవాద వివాదాలు, ఎస్వీ సత్యనారాయణ (సంప) పబ్లిషింగ్ హౌజ్ విశాలాంధ్ర
సలీం :2006, ' వెండి మేఘం',శ్రీవిజయలక్ష్మి పబ్లికేషన్, విజయవాడ
సాంబయ్య. గుండిమెడ :2006, బ్రాహ్మణత్వమాలత్వమా? మానవత్వ అంబేద్కరత్వమా? వర్గీకరణ సమస్యపై చర్చ, రాజ్యం ప్రచురణలు.

సామాన్య జి :2012 'అంటరాని వసంతం' విమర్శనాత్మక పరిశీలన, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్
స్వామి, బండి :2005 'మీరాజ్యం మీరేలండి,భగవాన్ ప్రచురణ, అనంతపురం
సుందర్‌రాజు. నాగప్పగారు (సం) :1997, మాదిగ చైతన్యం,మాదిగసాహిత్యవేదిక.హైదరాబాద్
సుబ్బయ్య, వల్లంపాటి :2006, రాయలసీమలో ఆధునిక సాహిత్యం, సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ

సుభద్ర, జూపాక, శ్యామలగోగు(సం.):2006, నల్లరేగడి సాల్లు, సాహిత్యాన్ని చెరిగిపోస్తున్న లేకి సాటలు, ముందుమాట, మైసమ్మ-సబ్బండ ప్రచురణ. హైదరాబాద్

శాస్త్రీ.వివిన్.వికె :2005, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి, పరివర్తన, గిరిజన సంస్కృతి పరిరక్షణ, శిక్షణా సంస్థ, గిరిజన సంక్షేమశాఖ. హైదరాబాద్

శిఖామణి :2013, *బి.సి.వాదకవిత్వం*, తెలుగులో కవిత్వోద్యమాలు, తెలుగు అకాడమీ, హైదరాబాదు.

శ్రీకృష్ణ, ఆకుల :2012, వర్షంలో అనంతపురం, ఆచార్య కొలకలూరి ఇనాక్, సాహితి సమాలోకనం. జ్యోతి గ్రంథమాల. హైదరాబాదు

శ్రీనివాస్, జిలుకర :2012,*పొతం మూలవాసి విమర్శ*, ఇండస్ పబ్లికేషన్, హైదరాబాదు.

శ్రీనివాసరావు, చిలుమూరి :2011, *మాదిగల చరిత్ర – సంస్కృతి*, జ్యోతి గ్రంథమాల, తిరుపతి

స్కైబాబ :2005, చిద్రమైపోతున్న నెలవంక, భారతీయ ముస్లింలు- రిజర్వేషన్‌ల ఆవశ్యకత. ముల్కి. హెచ్‌బిటి. హైదరాబాదు.

హస్నైన్. నదీం :1996, భారతీయ గిరిజనులు. ఓరియంటల్ లాంజ్మన్, హైదరాబాద్

## ఇంగ్లీషు గ్రంథాలు

Fredric Jameson: 1981, ***Realism and Desire****, Balzac and the problem of the subject*, The Political Unconscious – Narrative as a Socially Symbolic Act.

Fredric Jameson: 1981, **Identity and meaning in the Network Society**, Manuel Castells, 2000: Blackwell Publishers, Uk

Manuel Castells: 2000, ***Identity and meaning in*** *the Network Society*, Blackwell Publishers, Uk.

# వలసానంతర బహుజన నవలలు-విమర్శనాత్మక అధ్యయనం

వలసానంతర బహుజన నవలలు–విమర్శనాత్మక అధ్యయనం' అనే అంశాన్ని నా పరిశోధనాంశంగా ఎన్నుకున్నాను. నా ఎం.ఫిల్ పరిశోధనలో 'దళిత కవిత్వంలో పురాణ ప్రతీకలు' అనే అంశం మీద పరిశోధన చెయ్యడం జరిగింది. ఆ పరిశోధన తరువాత భిన్నమైన అంశంలో పరిశోధన చెయ్యడానికి బహుజన నవలలను ఎన్నుకోవడం జరిగింది. దానిలో భాగంగా తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రప్రాంతాలనుండి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీల నుంచి వచ్చిన నవలలను ఎంపిక చేయడం జరిగింది. తెలగాణ ప్రాంతం నుండి వేముల ఎల్లయ్య 'కక్క'. భూతం ముత్యాలు 'సూర', కాలువ మల్లయ్య 'సాంబయ్య చదువు' లలో వ్యక్తమైన బహుజన ఆలోచన విధానాన్ని పరిశీలించడం జరిగింది. రాయలసీమ నుండి చిలుకూరి దేవ పుత్ర 'పంచమం', కొలకలూరి ఇనాక్ 'అనంత జీవనం' బండి నారాయణ స్వామి 'మీరాజ్యం మీరేలండి' మరియు ఆంధ్రా ప్రాంతం నుండి జి.కళ్యాణరావు ' అంటరాని వసంతం', డాక్టర్ వి.చంద్రశేఖరరావు ' నల్లమిరియం చెట్టు, ఏకుల వెంకటేశ్వర్లు ' ఎన్నెల నవ్వు', సలీం ' వెండి మేఘం' మొదలగు నవలల్లో వ్యక్తమైన బహుజన చైతన్య వ్యక్తీకరణను పరిశీలించడం జరిగింది. పైన పేర్కొన్న రచయితలు అందరూ బహుజన కులాలకు చెందిన వారే. అంటే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు చెందినవారు. ఈ బహుజనులు తమ గురించి తాము ఎలా అక్షరీకరించుకున్నారో వారి చైతన్యం ఆ అక్షరాలలో ఏ విధంగా వ్యక్తం చెయ్యగలిగారో పరిశీలించడం నా పరిశోధన లక్ష్యం.

మొదటి అధ్యాయంలో వలసానంతరవాదనిర్వచనం, ఆవాద నేపథ్యం గురించి వివరించాను. బహుజన పదం నిర్వచనం, బహుజన పద నేపథ్యం ఆ పదం యొక్క ప్రాముఖ్యతను విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగింది. తెలుగు సాహిత్యంలో వివిధ వాదాల నేపథ్యంలో వచ్చిన నవలా పుట్టుక, వికాసం తెలియజేస్తూ ఆయా వాదాల్లో బహుజన ఆలోచనలను, చిత్రీకరణ విధానాన్ని స్థూలంగా తెలియజేయడం జరిగింది.వలసానంతర బహుజన నవల ఒక సైద్ధాంతిక అంశం. వలసానంతరం వచ్చిన బహుజన నవల అని అర్థం. బహుజన నవల అనేక సమూహాల వ్యక్తీకరణ. పీడిత లేదా పాలిత సమూహాల/ కులాలు, తెగల, మతాల నుంచి వచ్చిన సాహిత్య అభివ్యక్తి బహుజన నవల. అయితే, బ్రిటీషు వలస పాలన ప్రభావం తెలుగు సాహిత్యం మీద ఎలావుంది? బ్రిటీషు వలస పాలన ముగిసిన తర్వాత ఎలాంటి మార్పులు తలెత్తాయనే విషయాన్ని అధ్యయనం చేయటం వలసానంతరవాదం యొక్క స్వభావం. హోమి కె.బాబా, గాయత్రీ స్పివాక్, పార్థచటర్జీ వంటి విదేశాల్లో స్థిరపడిన లేదా అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రవాస మేధావుల ఆలోచనల వల్ల ఈ వాదం రూపుదిద్దుకుంది. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీలో ఎస్.ఎస్.నళిని వలసవాదానంతర సాహిత్యం గురించి విడమర్చి చెప్పారు. ఆమె ప్రకారం "వలసవాదుల పరిపాలనలో పెట్టుబడిదారీ సంస్కృతివల్లా, సాహిత్యంవల్లా ప్రభావితమైన వలసదేశాల సాహిత్యాన్నీ, సంస్కృతినీ వలసవాదానంతర సాహిత్యం అని ప్రస్తావిస్తూ ఉంటారు" (నళిని,ఎస్.ఎస్:2009.152). బహుజన అనే పదాన్ని బుద్ధుడు నేపథ్యం నుండి పరిశీలించాలి. ఎందుకంటే 'బహుజన' అనే పదాన్ని మొట్టమొదటిసారిగా 'బహుజన హితాయ, బహుజన సుఖాయ'గా చెప్పాడు. అంటే బహుజనులు సుఖంగా ఉండాలని దానర్థం. అయితే తెలుగు సాహిత్యంలో ఎస్సీ, ఎస్టీ, బి.సిలను ఉద్దేశించే పదాలు అంటరాని వారు, అస్పృశ్యులు, పంచములు, గిరిజనులు, ఆదివాసిలు,

హరిజనులు, అల్పాదాయ వర్గాలు, బడుగు వర్గాలు, అట్టడుగు వర్గాలు, దళితులు వంటి పారిభాషిక పదమే 'బహుజనులు' అనే పదము కూడా వృత్తులను బట్టి కులాల పేర్లు ఉన్నాయి. వృత్తులు ఒకటే అయినా వీరిని ఒక రాష్ట్రంలో ఎస్సీలు, మరోరాష్ట్రంలో ఎస్సీలు, బి.సిలుగా స్థానిక ప్రభుత్వాలు గుర్తింపునిచ్చాయి. కాబట్టి కులాన్ని బట్టి ఫలానా వారు దళితులు, ఆదివాసీలు, వెనుక బడినవారు అని స్పష్టంగా చెప్పలేని స్థితి. అందుకే అందర్నీ కలిపి 'బహుజనులుగా పిలవవచ్చు.

'బహుజన' అనే పదం 'బహుజన సమాజ్ పార్టీ' ఏర్పడిన (1984 ఏప్రిల్14)తర్వాత ప్రచారంలోకి వచ్చింది. మనువాద వ్యవస్థ వల్ల కష్టానష్టాలకు గురైన షెడ్యుల్ కులాలు, షెడ్యుల్ తెగలు, వెనుక బడిన తరగతులతో పాటు మత పరంగా అల్ప సంఖ్యకులంతా బహుజనులవుతారని బహుజన పార్టీ తన ప్రణాళికలో తెలియజేసింది. భారతదేశంలో అణగారిన కులాలు 6000 వరకు ఉన్నాయి. వీరంతా ఐక్యంగా పోరాటం చేసినప్పుడు కులవ్యవస్థ నిర్మూలించడం జరుగుతుంది. కానీ వీరంతా ఐక్యంగా లేరు కాబట్టి అల్ప సంఖ్యాకులుగా ఉన్నారు. కొందరు సంఖ్యలో అధికంగా ఉన్నారు. " వాళ్ళందరినీ కలిపితే ... వాళ్ళక పెద్ద మెజారిటీ వాళ్ళు భారతదేశ జనాభాలోనే 85 శాతం హిందీలో ఈ అధిక సంఖ్యాకులను మేము బహుజనులు అంటున్నాము" (వరుణ్ కుమార్, ఎస్: 2011, పు.19) అని కాన్షీరాం ప్రకటించారు. పై చర్చంతా ఎస్సీ,ఎస్టీ, బి.సి, మైనార్టీలను బహుజనులును కలిపి పిలుస్తారని తెలియజేస్తుంది. బహుజనులుగా కలిసి మెలిసి ఉన్నప్పుడే సహజీవనం చేయడానికి అవకాశం ఉంటుంది. అందుకే వలసపాలన తర్వాత బహుజనుల స్థితిగతులు తెలుగు ప్రాంతం ఏ విధంగా నవలల్లో వ్యక్తం చేశారో పరిశీలించాడో పరిశోదన చెయ్యడమే నా పరిశోధన ముఖ్యోద్దేశం.సంస్కరణోద్యమ సాహిత్యం నుండి విప్లవ సాహిత్యం వరకు వచ్చిన నవలలు ప్రధాన సాహిత్యస్రవంతి నవలలుగా పేర్కొనవచ్చు. ఆ తర్వాత వచ్చిన అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో దళిత,స్త్రీ వాదాలు బలంగా వచ్చాయి. దళిత వాదంలో మొదట కొనసాగిన బి.సి, గిరిజన,ముస్లిం రచయితలు క్రమంగా తల ఒక పాయగా విస్తరించారని చెప్పవచ్చు. వీరందరిని దండలో దారంలా కలిపి ఉంచేది బహుజన నేపథ్యం. కనుక ఆ బహుజన నేపథ్యంలో వచ్చిన దళిత బి.సి, ముస్లిం, గిరిజనులు తమ గురించి తాము స్వయంగా రాసుకున్న నవలలను బహుజన నవలగా పేర్కొనవచ్చు. బహుజనులైన వీరు తమ కులాల సాంస్కృతిక జీవనం, వారి సమస్యలను వాటి పరిష్కారాలను ఏ విధంగా చర్చించారో తరువాత అధ్యాయాల్లో ప్రాంతాల వారిగా పరిశీలించి విశ్లేషణ చేయటం జరుగుతుంది.

రెండవ అధ్యాయంలో వలసానంతర బహుజన నవల విమర్శనాత్మక అధ్యాయనంలో భాగంగా తెలంగాణ నవల గురించి పరిశీలించాను.తెలంగాణ ప్రాదేశికత ఒక సాంస్కృతిక సాహిత్య వస్తువుగా రూపొందటం వల్ల తెలుగు నవల రూపం విస్తృతి పెరిగింది. తెలంగాణ అనే ఒక 'ప్రాదేశికత' ఒక రాజకీయ భావనగా, సామాజిక భావనగా పరివ్యాప్తమై సాహిత్య ఉద్యమ స్థాయిగా ఎదిగింది. తెలంగాణ ప్రాంత వైశిష్ట్యం, జీవన ప్రత్యేకతను స్థాపిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును కాంక్షిస్తూ దాదాపు అన్ని ప్రక్రియల్లో రచనలు వచ్చాయి. తెలంగాణ నుంచి వచ్చిన రచనలన్నీ ఎంతో వైవిధ్యాన్ని సాహిత్య రంగంలోకి మోసుకొచ్చాయి. తెలంగాణ నవల ఏకరూపీనమైంది కాదు. అనేక కోణాలు దానికి వున్నాయి. తెలంగాణ వ్యక్తీకరణ కూడా ఏకముఖీనమైంది కాదు. దానికి అనేక స్వరాలు వున్నాయి. అనేక వైభిన్య రూపాలు వున్నాయి. తెలంగాణ ప్రాదేశిక నవల కేవలం సామాజిక అంతర్వుల్లో అగ్రవర్ణ వ్యక్తీకరణగా మాత్రమే అది మిగిలిపో లేదు. అణగారిన వర్గాల నుంచి ఎంతో వైవిధ్యపూరితమైన రచనలు వెలువడ్డాయి. బహుజన దృష్టి నుంచి తెలంగాణ ప్రాదేశిక జీవితాన్నీ, తెలంగాణ ప్రాదేశిక సాంఘిక మూర్తిమత్వాన్ని గమనించినప్పుడు సారంలో తెలంగాణ నవల చేరుకొన్న శిఖర స్థాయి బోధపడుతుంది.

తెలంగాణలో ఏకరూపీణమైన సాంఘిక, సాంస్కృతిక వ్యక్తీకరణ కనిపించదు. తెలంగాణ నవలాభాష గడీల నుంచి తీసుకోవాలా? లేక వెలివాడల నుంచి తీసుకోవాలా? అనే ప్రశ్న దళిత రచయితల ముందు నిలబడింది. అప్పటికే దళిత కవిత్వంలో సంస్కృతాధిపత్యంలో వున్న తెలుగును కాదని దళితులు మాట్లాడుకొనే భాషను విజయవంతంగా ప్రవేశపెట్టారు. తెలంగాణ దళిత నవలలో కూడా మరింత నిర్దిష్టతతో తెలంగాణ వెలిభాషను శక్తిమంతంగా అమలు చేశారు. తెలంగాణాలోని అంతర్వుల సామాజిక వ్యవస్థ నిర్మించిన భాషాపరమైన అంతస్తులను దళిత రచయితలు చాలా అద్భుతంగా వినియోగించారు. దీనికి ప్రధానకారణం తెలంగాణలోని సాంఘిక నిర్మాణమే దీనికి కారణం. అందువల్ల తెలంగాణ బహుజన చైతన్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఇక్కడి కుల వ్యవస్థ దోపిడీనీ, బహుజనుల ప్రతిఘటన రాజకీయాలను అర్థం చేసుకోవాలి. అంబేద్కర్ దృష్టితో చూస్తే తప్ప బహుజన నవల బోధపడదు. అస్పృశ్యులుగా వెలివేయబడిన మూలవాసుల్లో మాదిగలు ఒకరు. దళిత సాహిత్యం విరివిగా వస్తున్న సందర్భంలోనే మాదిగ సాహిత్యం కూడా వచ్చింది. దళిత సాహిత్యంతో పాటు మాదిగ దండోరా ఉద్యమం సమానంగా రావటమే దీనికి కారణం. నిర్దిష్టత ప్రత్యేకతను సంతరించుకొన్నది.

ఆ క్రమంలోనే మాదిగ సాహిత్యం ప్రత్యేకంగా రావటం మొదలైంది. తొలుత మాదిగ కవిత్వం, ఆ తర్వాత మాదిగకథ వచ్చాయి. అటు పిమ్మట మాదిగ నవల వచ్చింది. అలా వచ్చిన తొలి మాదిగ నవల 'కక్క'. కక్క నవలలో నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ఆఖరి మెట్టున ఉన్న మాదిగల గురించి రచయిత వేముల ఎల్లయ్య తెలియజేశారు. మాదిగల సాంస్కృతిక జీవనం గురించి చర్చించారు. ఈ నవలలో ప్రతినాయకుడు కులం, నయాక్షత్రియ కులమైన రెడ్డి కులస్తులు ఎలాంటి ఆధిపత్యాన్ని చలాయిస్తున్నారో తెలుపుతుంది. కులాధిపత్య రాజకీయాలను రెడ్డి, ఆంధ్ర కమ్మకులస్తులే నడుపుతారు. బాల్యాన్ని హరించిన కులవ్యవస్థ ఆనవాళ్లు ఈ నవలలో కనపడుతాయి. అగ్రకులాల పిల్లలు బాల్యాన్ని అనుభవిస్తే, కిందికులాల పిల్లలు మాత్రం బాల్యము ఒక శాపంగా ఎదుర్కొన్నారు.

సూర నవలలో అంబేద్కర్ సిద్ధాంత ప్రభావం ఈ నవల మీద స్పష్టం అవుతుంది. సమాజాన్ని అంబేద్కర్ దృష్టితో పరిశీలిస్తే దాని స్వభావం అర్థం అవుతుంది. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను విశ్లేషించడానికీ, వ్యాఖ్యానించడానికీ ఆర్థిక విధానం తగిన పద్ధతి కాదు. సూర నవలలో ఆర్థిక నిర్ణాయకవాదం యొక్క ప్రభావం శూన్యం. పునాది, ఉపరిత విధానం పద్ధతిలో నవలా రచయిత భూతం ముత్యాలు సమాజాన్ని వింగడించలేదు. కులం అనే ధాతువు సంఘశరీరంలో ఎలాంటి చలనాలకు కారణమవుతుందో తెలుసుకొనే కృషి ఆయన చేశాడు.సూరన్ని చంపాలని నాగిరెడ్డి ఆలోచించాడు. ఈ పన్నాగాన్ని అర్థం చేసుకొన్న గరీబు నాగిరెడ్డిని నరికిచంపాడు. ఈ మొత్తం అంతటా అంబేద్కర్ ఆలోచన కనిపిస్తుంది. అంబేద్కర్ హింసను ప్రతిపాదించలేదు. నాగిరెడ్డిని గరీబు చంపటం అనివార్యమైన సంకేతమని చూడాలి. రచయిత ఆలోచన పరిమితి ఇది. నాగిరెడ్డిని రాజకీయంగా హత్యచేయాల్సింది. అంటే, ఎన్నికల వ్యవస్థ కల్పించిన ఓటు ఆయుధం ద్వారా నాగిరెడ్డిని అధికార హీనున్ని చేయాల్సింది. కానీ మొత్తం నవలలో ఎక్కడా పార్లమెంటరీ రాజకీయాల గురించిన చర్చ రాలేదు. అంబేద్కరిజం అంటేనే పార్లమెంటరీ పాలిటిక్స్. అగ్రవర్ణాల ఆధిపత్య రహస్యం అధికారం. సూరని ఆలోచనా విధానం శాస్త్రీయ దృష్టితో రెడ్డి, వెలమ ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడటం వరకే పరిమితమైంది.

కాలువ మల్లయ్య 'సాంబయ్య చదువు' తెలంగాణ సమాజం యొక్క బహుముఖీనమైన చిత్రాన్ని ఆవిష్కరించిన నవల ఇది. శూద్రుల్లో చదువు పట్ల పెరిగిన అవగాహనను ఈ నవల చూపుతుంది. దళితుల పట్ల దొరల హీనభావనను, వారికి చదువులేకుండా చేసే దొరల కుట్రలను చూపుతుంది. శూద్రులు వ్యవసాయ రంగాన్ని విడిచి విద్యారంగంలోకి ప్రవేశించి, ఉద్యోగాలు చేసి స్థిరపడటం, తద్వారా ఆధునిక జీవితంతో పాటు, ప్రపంచీకరణ యుగంలో పోటీపడడానికి తగిన ఇంగ్లీషు విద్యను

తర్వాతి తరాలకు అందించే కృషిని ఈ నవల చూపిస్తుంది. పాత తరం కొత్త వ్యవస్థలో ఇమడలేక వ్యవసాయానికి కట్టుబడిపోయే పరిణామాన్ని కూడా ఈ నవల చూపిస్తుంది. "తెలంగాణ ప్రజలు నిజాం పరిపాలనలో ఎదుర్కొన్న కష్టాలు, పడిన చెప్పరాని కష్టాలు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రజాకార్ల హింస తొలిగినప్పటికీ బడుగు బలహీన వర్గాల బ్రతుకులు బాగుపడలేదనీ, దొరల దౌర్జన్యానికి, హింసకు ఇంకా బలిపశువులవుతున్నారనే వాస్తవం, కరువుకాటకాలు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఆ ప్రభావంతో ప్రజల్లో కలిగిన రాజకీయ చైతన్యం, రాజకీయ నాయకుల స్వార్థం కారణంగా ఉద్యమం నీరుగారిన తీరు మొదలైనవి ఈ నవలలో కండ్లకు కట్టినట్టు వర్ణించడం జరిగింది" అని 'కాలువ మల్లయ్య నవలలు' గ్రంథానికి రాసిన ముందుమాటలో ఆచార్య ఎన్ గోపీ వ్యక్తం చేసిన అభిప్రాయం సరైనది.

మూడో అధ్యాయం రాయలసీమ ప్రాదేశిక నవల, బహుజన చైతన్యాన్ని పరిశీలించడం జరిగింది. దళితుల అభివృద్ధి, విముక్తికి ఏది మార్గం అని పంచమం నవల అన్వేషిస్తుంది. శివయ్య పాత్ర ద్వారా రచయిత దళితుల్లో వస్తున్న మార్పును చిత్రించాడు. అయితే, తన సమస్యకు పరిష్కారం ఏమిటో శివయ్యకు కూడా బోధపడలేదు. శివయ్యకు ప్రగతిశీలవాది అయిన పురుషోత్తం, కమ్యూనిస్టు భావాలతో పనిచేసే సురేష్ పట్ల ఎంతో గౌరవం. ఈ రెండు పాత్రలను చైతన్యానికీ, ప్రతిఘటనకు ప్రతినిధులుగా రచయిత చిత్రించాడు. నిజానికీ, రచయితకు వామపక్ష ఉద్యమాల పట్ల ఎంతో సానుభూతి వుంది. దళిత ఉద్యమాల పట్ల కొన్ని అనుమానాలున్నాయి. అందుకే, రచయిత దృష్టి అంబేద్కరిజం వైపు వెళ్లలేదు. శివయ్య ఉన్నతోద్యోగి అయినా ఎందుకు నిస్సహాయుడయ్యాడో రచయితకే ఎరుకపడలేదు. ఉపముఖ్య మంత్రి దళితుడైనప్పటికీ తన ప్రజలకు ఎలాంటి ఎపయోగం లేదని రచయిత ఆ పాత్ర చేతనే చెప్పిస్తాడు. రచయిత రెండు ముఖ్యమైన విషయాలను చర్చకు పెట్టాడు. దళితులు విద్యావంతులైతే సమస్య పరిష్కారం సిద్ధిస్తుందనే వాదన నిజమే అయితే, శివయ్య ఉన్నత విద్యావంతుడైనప్పటికీ తన సమస్యకు తానే పరిష్కారం కనుక్కోలేకపోయాడు. దళితులు ఉద్యోగాల్లో చేరితే అది దళిత సమాజానికి ఉపయోగపడుతుందని మరోవాదం. ఇదే నిజమైతే, ఉన్నతోద్యోగం ఆర్డీవో అయినప్పటికీ తన జాతి ప్రజలకే తానేమీ చేయలేకపోయాడు. కాబట్టి, ఉద్యోగవాదం సరైనది కాదు. రాజకీయ అధికారమే అన్నింటికీ పరిష్కారమైతే ఉపముఖ్యమంత్రి పాత్ర తన నిస్సహాయతను వ్యక్తం చేసి బాధపడుతుంది. కాబట్టి రాజకీయాధికారం అన్నింటికీ పరిష్కారం కాదని రచయిత సంకేతిస్తున్నాడు. మరి పంచముల సమస్యకు పరిష్కారం ఏమిటి? ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించటమే పరిష్కారం. భూమి కోసం తపనపడిన నారాయణప్ప కూడా భూమిని కాపాడుకోవడానికి ప్రతిఘటనకు సిద్ధపడమని చాటింపు వేస్తాడు. చివరికి శివయ్య కూడా ప్రతిఘటన రాజకీయాల వైపు అడుగులేస్తాడు. "ఒక్క నిజం మాత్రం తప్పెట తనకు చేరువవుతున్న కొద్దీ బలపడుతోంది. స్పష్టమవుతుంది. అదేమిటంటే.. తన జాతికి కేవలం ఆఫీసులలోనో, విద్యాలయాల్లోనో, పరిపాలనల్లోనో రిజర్వేషన్లు కల్పించటం వలన రాజ్యాధికారం రాదనీ... శక్తిమంత కాదనీ.." (పు. 275) అని శివయ్యకు మదిలో కలిగిన అంతిమ సత్యాన్ని నవలలో తెలుపుతాడు. ఈ వాక్యాన్ని నిరూపించటం కోసమే రచయిత ఈ నవల రాశాడు. శివయ్య ఒక ఉద్యోగిగా తన నిస్సహాయతకు పరిష్కారం రిజర్వేషన్లు కాదని భావిస్తాడు.

అనంతజీవనం నవలలో వర్షం సమానత్వానికి ప్రతీక. అదేవిధంగా అది చైతన్యానికి ప్రతీక. రాయలసీమ ప్రజలను దోపిడీ చేస్తున్న, పీడిస్తున్న అగ్రకుల రెడ్ల ఆధిపత్యానికి ప్రతీక ఆ పాత బంగ్లా. అది పీడిత ప్రజల చైతన్యం వల్ల కూలిపోవాలని రచయిత ధ్వని. అనంతపురంలోని మాదిగ, మాల, బీసీకులాలు, ముస్లిం మైనార్టీలంతా రెడ్డికుల ఫ్యాక్షనిజంవల్లా, వాళ్ల పెత్తనం వల్ల బాధితులయ్యారు. అందుకే, ఈ బహుజనులంతా ఏకమై శిథిలస్థితిలో వున్న ఈ ఆధిపత్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమిస్తే కూలిపోతుందనీ, పీడితులంతా సమానులవుతారనీ ఆయన సంకేతిస్తున్నాడు. పోలీసు, న్యాయవ్యవస్థ, రాజకీయ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకొని, పాలెగాళ్లు ఏమైనా చేయొచ్చనే అహంకారంతో రెడ్డి వర్గం

రాయలసీమ సామాజిక జీవితాన్ని దుర్భరం చేసింది. వయసుడిగిన రాం.పి.రెడ్డి తన ఇంగ్లీషు భార్యతో కలిసి ఆ వర్షంలో ఒంటరిగా కోటలో భయంభయంగా ఉండటం, చివరికి చనిపోవడం అంతా సహజంగా జరిగిపోతుంది. అదేసమయంలో వర్షం వల్ల అణగారిన కులాలు కూడా ఇబ్బందిపడుతాయి. కానీ అది ప్రధానం కాదు. నీతి, నైతిక విలువలూలేక గోవిందరెడ్డి, రాం.పి.రెడ్డి పతనమైపోయిన తీరును రచయిత అద్భుతంగా చిత్రించాడు. రచయిత ఎక్కడా అక్కర్లేని సందేశాలిచ్చే పనిని చేయలేదు. పాత్రలు, సందర్భాలే కథను నడిపిస్తాయి. పాత్రలు, కథలోని వాతావరణం రెండూ వేర్వేరుగా ఉండవు. పాత్ర ప్రవర్తనే వాతవరణంగా, వాతావరణమే చాలాసార్లు ఒక పాత్రగా మారిపోవటం ఈ నవల ప్రత్యేకత. శిల్పపరంగా, కథాకథనం, ఎత్తుగడల రీత్యా ఈ నవల చాలా గొప్పదని విమర్శకుల అభిప్రాయం.

'మీ రాజ్యం మీరేలండి' నవలలో ప్రధాన ఇతివృత్తం ఫ్యాక్షనిజం గురించి ఉంది. అయితే, రచయిత భావవాదాన్ని, భౌతికవాదాన్ని రెంటినీ సమన్వయం చేసే ప్రయత్నం చేస్తాడు. ఈ వైఖరి పాఠకులను కాస్తా కంగారుపెడుతుంది. వాస్తవానికి కమ్యూనిస్టు ఉద్యమాలకీ, ఫ్యాక్షనిజానికా మధ్య అనుకోని సంబంధం ఏర్పాటు చేశారు. రెడ్డి కుల ఫ్యాక్షనిజాన్ని ఎదుర్కొనే క్రమంలో కమ్మకులస్తులు విప్లవకారులతో జతకట్టారు. ప్రత్యేక దళాలు ఏర్పాటు చేసుకొని తమను వ్యతిరేకిస్తున్న ఫ్యాక్షన్ గ్రూపులను నిర్మూలించే కృషి చాలా జాగ్రత్తగా చేశారు. అందువల్ల, ఈ వైరుధ్యం చర్చనీయాంశమైంది. రచయిత బండినారాయణస్వామికి మార్క్సిజమన్నా, వివేకానందుడి ఆధ్యాత్మికవాదమన్నా చాలా యిష్టం. శాస్త్రీయత గురించి ఎంత ఆలోచిస్తాడో, శాస్త్రానికి అందనిదాన్ని అసత్యం అనుకోవడాన్ని కూడా అంతే స్థాయిలో ఖండిస్తాడు. బైరాగి తత్వానికి రాయలసీమ సాహిత్యంలో చాలా ప్రాధాన్యత ఉంది.

నాలుగో అధ్యాయంలో ఆంధ్రారపాదేశిక నవల, బహుజన చైతన్య విశ్లేషణలో భాగంగా జి కళ్యాణరావు రాసిన అంటరాని వసంతం గురించి పరిశీలన చెయ్యడం జరిగింది. అంటరాని చరిత్రకు రూపమిచ్చింది అంటరాని వసంతం.ఏడుతరాల చరిత్రను వారి జీవితాల్లోని సంఘర్షణను, సంస్కృతిక జీవనాన్ని, మత, ఆర్థిక, రాజకీయ, కోణాలనుండి ఈ నవల విశ్లేసించింది. ఏడుతరాల చరిత్రలో లింగాలు, ఎర్రెంకడు, భూదేవి, వెంకటనర్సు, నారిగాడు, మాతయ్య, నాగన్న, ఎల్లన్న, సుభద్ర, పిట్టోడు, పోలయ్య, శివయ్య, శశిరేఖ, మార్టిన్, శారమ్మ, రూబేను, రూతు, యిమ్మనియేలు,మేరిసువార్త ,జెస్సీ, రూబీలు ఏడు తరాలకు ప్రతినిధులు.

కళ్యాణరావు నవలలో దళిత జీవన సౌందర్యాన్ని తెలియజేసాడు. నవలను కవిత్వంలో వడించాడని అనుకునేంతగా కవితాత్మక వాక్యాలే నవలంతా పరచుకుని పాఠకులకు కనువిందు చేస్తాయి. రచయిత కథనం ఉత్తమ పురుష, సర్వసాక్షి దృష్టికోణాల నుండి కొనసాగింది. ఈ నవల ఒక చారిత్రక ఘట్టం వద్ద మొదలై మరొక ప్రధాన చారిత్రక ఘట్టం వద్ద ఆగుతుంది. అంటరాని వసంతం దళితులల అంటరాని తనం వద్ద ప్రారంభమై సాయుధ పోరాటమే పరిష్కారమార్గమని చెప్పడంతో ముగుస్తుంది. ఈ రెండూ చారిత్రక ఘట్టాలే. ఈ రెండు ఘట్టాల మధ్య ధాతు కరువు, సి.పి, బ్రేన్‌ప్రస్తవన, బకింగ్‌హాం కాలువ, రా జు పాలెందగ్గర దళితుల తవ్వకం, క్రైస్తవమతం వృద్ధి, వైకం సత్యాగ్రహం, పె రియార్ పోరాటం, తెలంగాణ పోరాటం, గాంధీ హరిజనోద్యమం, అంబేద్కర్ పరాటం, సాధారన ఎన్నికలు, కారం చేదు, చూందూరు మరణ కాండల ప్రస్తవన, శ్రీకాకుళోద్యమం, నక్సలైట్ ఉద్యమం, సాయుధ పోరాటం అనే చారిత్రక విషయాలను తీసుకుని ముఖ్యమైన పాత్రలకు వాటిని అనుసంధనిస్తూ రచయిత ఎంతో చాకచక్యంగా కథను నడిపారు. ఇది విప్లవోద్యమ నవల అయినప్పటికి దళితులందరూ దళిత నవలగా పరిగణించారు. కానీ వాస్తవానికి అంటరాని వసంతం నవల దళిత నవల కాదు. ఇందులో దళిత జీవితం ఉంది. దళితుల పోరాటం ఉంది. కానీ అంబేద్కరిజ ఆలోచన విధానం అసలే లేదు. అంబేద్కర్ సాయుధ పోరాటాల వైపు ఎప్పుడూ దృష్టి సారించలేదు. దళితులు సాయుధులై ఉండమన్నాడు. కానీ సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారాన్ని ఆయన ఎన్నడూ కోరుకోలేదు. అంబేద్కర్ పార్లమెంటరీ

ప్రజాసామ్య పోరాటాన్ని ఎన్నుకున్నాడు. ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుందామని బహుజనులకు పిలుపునిచ్చాడు. ' ప్రజాస్వామ్యంలో రాజకీయ అధికారమనేది మాస్టర్ కీ... దళితులకు కావాల్సింది పదవి కాదు. అధికారం'మని అన్నాడు.

ఈ నవలలో రచయిత దళిత సమస్యలకు సాయుధ పోరాటమే పరిష్కారమన్నాడు. ప్రజాస్వామ్య పద్ధతులపై నమ్మకం లేకే సాయుధ పోరాటం మీద నమ్మకం ఉంచుతారు. ఆ నమ్మకాన్నే రచయిత కనబరిచాడు. దళితుడు రాసినంత మాత్రాన దళిత సాహిత్యం కాదు. అందులో అంబేద్కరిస్టు చూపు తప్పక ఉండాలి. అలా ఉన్నప్పుడే అది దళిత సాహిత్యం అవుతుంది. అందుకే ఈ నవలను దళిత నవలగా అంగీకరించలేమనవచ్చు. ఈ నవలలో దళిత జీవనం, దళిత సమస్యలు, వేధనలు ఉన్నాయి. వాటికి పరిష్కారాలు మార్క్సిజంలో వెతికారు. అందుకే ఈ నవలను విప్లవ నవలగానే పరిగణించాలని చెప్పవచ్చు .

డాక్టర్ వి .చంద్రశేఖరరావు నల్లమిరియం చెట్టు, దండోర చైతన్యం గురించి పరిశీలించడం జరిగింది. దండోర నేపథ్యంగా ఈ నవల కొనసాగింది. రూమి, దండోర చైతన్యంగా మారిన క్రమా క్రమాన్ని పరిశీలించాను దళిత రాజకీయ నాయకులు అగ్రకులాల రాజకీయ పార్టీలకు ఎలా చెంచాలుగా మారబడుతున్నారో చర్చించాను. కమ్యూనిస్టు ఉద్యమాలకు దళిత యువకులు ఎలా ఆకర్షణకు లోనయ్యారో పరిశీలించడం జరిగింది. మాదిగలపై క్రైస్తవ మత ప్రభావం, మాదిగల ఆచార వ్యవహారాలు, స్త్రీలు పిల్లలపై హింసా పద్ధతులు దండోర నేపథ్యంలో జరిగిన ఆత్మహత్యలు, అవమానాలకు గురౌన జడ్జి నాగభూషణం లాంటి ఉన్నత ఉద్యోగస్తుల ఆత్మహత్య గురించి పరిశీలన చెయ్యడం జరిగింది. దండోరా చైతన్యంతో మాదిగల్లో వచ్చిన మార్పులు దండోర ఉద్యమాన్ని ఆసరాగా చేసుకుని రాజకీయంగా ఎదగాలనే స్వార్ధ రాజకీయనాయకుల స్వభావాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగింది.

ఎన్నెలనవ్వులో మూడుతరాల యానాదుల జీవితాలను రచయిత వస్తువుగా తీసుకొన్నాడు. మొదటితరంలో మంగమ్మ, పోలయ్య. రెండోతరం అలివేలు, మునెయ్యలు. మూడోతరంవాడు చెంచులు. చెంచులు బాల్యంనుండి కులసమాజపు వికృతరూపాన్ని దాని వికృతచేష్టల్ని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. కులం యానాదులను స్వేచ్ఛగా నవ్వుకునే స్థితినుండి దూరం చేసిందని భావించాడు. అందుకే కులం నిర్మూలించబడాలని ఆకాంక్షించాడు. ఆ ఆకాంక్షను నిజంచేసుకునే క్రమంలో తన చదువును అర్ధాంతరంగా ఆపివేసి కులనిర్మూలన కొరకు కమ్యూనిస్టు ఉద్యమ శిబిరంలోకి అనుకోకుండా చేరువవుతాడు. పోలీసుల అరెస్టులతో తమ సంగానికి తిరిగివచ్చి, విప్లవ మార్గం నుండి కులనిర్మూలన వాదమైన అంబేద్కరవాదం ప్రయాణం చేయడానికి సిద్ధమైనట్లు రచయిత ఏకుల వెంకటేశ్వర్లు తెలియజేశారు. వాస్తవానికి ఈ నవలలో చెంచులు పాత్ర రచయితదే. ఆయన అనుభవాల సారమే ఎన్నెలనవ్వు. రచయిత పొందిన చైతన్యమే చెంచుల చైతన్యమని చెప్పవచ్చు.

మైనార్టీలకు ప్రాతినిధ్యం వహించే నవలగా సలీం వెండిమేఘం నవలను పరిశోధనాంశంగా తీసుకున్నాను. అందులో మైనార్టీ స్త్రీల సమస్యలను పరిశీలించడం జరిగింది. అవిద్య వలన ముస్లింలలో కొనసాగుతున్న దురాచారాలను పరిశీలించడం జరిగింది. విద్య అన్నిటికి పరిష్కారమని రచయిత భావించి ముఖ్య పాత్ర అయిన అన్వర్ ద్వారా చదువు విలువను తెలియజేసిన క్రమాన్ని పరిశీలించాను. ఈ నవల కాలం 1947 పూర్వం నుండి మొదలవుతుంది. దేశవిభజన కాలంలో దక్షిణాది ముస్లింల మనోభావాలు స్థూలంగా వ్యక్తం చేశారు. ముస్లింలలో అంటరాని వారు చూడబడుతున్న దూదేకుల జీవితాలను వాస్తవికంగా చిత్రీకరించారు. నవల అసాంతం ఏకపాత్ర ప్రాధాన్యతతో నడుస్తుంది. అన్వర్ 11 సంవత్సరాల వయస్సు నుండి 60 సంవత్సరాలు వచ్చే వరకు అంటే 50 సంవత్సరాల ముస్లిం జీవితాలను క్షుణ్ణంగా చర్చించారు. ముస్లిం మతంలో వివాదస్పదాంశాలుగా చూడబడుతున్న పెళ్ళి, విడాకులు, స్త్రీల అణిచివేతలను

విపులంగా చర్చించారు. అన్వర్ మొదటి నుండి మతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించింది. నవల ముగింపులో మతం అనేది మానవాభివృద్ధికి దోహదం చేసే అంశం కావాలని చెప్పింది. అలా కాని పక్షంలో మతాలే అవసరం లేదంది. చదువులేకపోవడం ముస్లింల వెనుకబాటు తనానికి  కారణం అనుకుంది. తాను చదువు నేర్చుకొని పది మందికి జ్ఞానాన్ని పంచిపెట్టింది. కానీ చదువుతో మనిషి  వివేకవంతుడు కావాలని ఆత్మగౌరవంతో బతకడానికి పోరాటం చేయాలని అభిప్రాయ పడింది. చిత్త శుద్ధిలేని రాజకీయ నాయకులు ఉన్నంత కాలం ముస్లింలలో వెనుకబాటు తనం ఉంటుందని  ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నవల ఏకవ్యక్తి ప్రధానంగా సాగినప్పటికి అన్వర్ పాత్రకి అత్త కుల్సుంబీ, దూదేకుల నాయకుడు ఆదాం, పొగాకు కంపెనీలో అండనిలిచిన మాలస్త్రీ ఆదెమ్మ, వ్యవసాయ పనుల్లో సాయం చేసిన వెంకారెడ్డి, అనే రైతు, చదువు నేర్పిన బ్రాహ్మణ పంతులు  రాఘవయ్యల సహాయంతో అన్వర్ పరిపూర్ణ వ్యక్తిత్వంతో నిలిచింది. మనమరాలిని ముస్లిం స్త్రీ హక్కుల కోసం పోరాటం చేసే న్యావాదిగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించింది. సఫలం అయింది. “ ముస్లిం స్త్రీలు కొందరిలోనైనా ఇలాంటి చైతన్యం రూపుదిద్దుకుంటే ఈ నవల ప్రయోజం నెరవేరినట్టే” (నవీన్, అంపశయ్య, 2012. పు.129)నని వ్యాఖ్యనించడం ఎంతో సముచితంగా ఉంది.

ఐదవ అధ్యాయంలో వలసానంతర బహుజన నవల పరిణామం, పరిమితులను గురించి పరిశీలించడం జరిగింది.బహుజన నవల అత్యాధునిక రూపం. తెలుగు నవల తన పరిమితులు, పరిధులు గుర్తించక సంక్షోభంలో పడుతున్న సమయంలో ఒక సైద్ధాంతిక సంఘర్షణ జరిగింది. ఆ సంఘర్షణ లోంచి బహుజన నవల ఉద్భవించింది. ఆధునికత సంఘసంస్కరణ నవలకు మూలమైతే, ఆధునికానంతర స్థితి బహుజన నవలకు మూలభూతమైంది. వలస పాలనజ్ఞానం అగ్రవర్ణ సమాజాన్ని సంస్కరించుకొనే చైతన్యాన్ని కల్పించింది. ఆ చేతనలోంచి గోపాలకృష్ణమ శెట్టి మొదలు అనేకమంది నవలా రచయితలు నవలలు రాశారు.వలసానంతర జ్ఞానం ఆలస్యంగా విస్తరించింది. బహుజన మహాపురుషులు వలసపాలనాకాలంలో మొదలుపెట్టిన సాంఘికవిప్లవం అనే భావన వలసానంతర కాలంలోగానీ తెలుగు సాహిత్యాన్ని చేరలేదు. తెలుగు సాహిత్యరంగం పూర్తిగా అగ్రవర్ణాల నియంత్రణలో వుండటమే దీనికి కారణం. గుర్రం జాషువా మొదలు ఇనాక్ వరకు సృష్టించిన నవలా సాహిత్యం వలసానంతర దళిత అవగాహనను చూపిస్తుంది. అయితే, వలసానంతరం సుమారు నాలుగు దశాబ్దాలకు గానీ స్పష్టమైన బహుజన చైతన్యం రూపొందలేదు. అంబేద్కరానంతర సాంఘికవిప్లవ కాలం ఒకటి మొదలైంది. మాన్యశ్రీ కాన్షిరాం బహుజన చైతన్యాన్ని ఒక రాజకీయ చైతన్యంనిజానికి స్థూలపద్ధతిలోనే బహుజనవాదం గురించి చర్చ ఎక్కువ జరిగింది. మరీ ముఖ్యంగా దళిత కవిత్వం, దళితవాదం గురించి విస్తృతంగా వాదోపవాదాలు జరిగాయి. కానీ, బహుజన నవల గురించి ఎక్కువ చర్చ జరగలేదు. ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీలు రాసిన నవలా సాహిత్యం మీద విమర్శకులు ప్రసరించిన వెలుగులు చాలా తక్కువ. విమర్శకులు ఎక్కువగా అగ్రవర్ణావాళ్లు వుండటమే ఈ లోపానికి కారణం. కొద్దిమేరకు జరిగిన చర్చలో వ్యక్తిగత రచనల మీదే చర్చ కేంద్రీకృతమైంది. ఉదాహరణకు, అంటరానివసంతం మీద విస్తృతంగా చర్చ జరిగింది. నేను పరిశోధనకు స్వీకరించిన ఏ నవలమీదా లోతైన, విస్తృమైన చర్చ లేదా అధ్యయనం జరగలేదు. అగ్రవర్ణ విమర్శకుల నిరాసక్తత ఒక కారణం, దీనికి. కానీ, బహుజన నవలను పఠించే పద్ధతి ఇతర పఠన పద్ధతులకన్న వేరుగా ఉండటం కూడా మరొక కారణం. ఒక మార్క్సిస్టు నవలను లేదా మనోవైజ్ఞానిక నవలను పఠించినంతగా ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ నవలలను చదవలేరు. దీనికి కులమనస్తత్వమే కారణంగా తీసుకురావటంతో బహుజన సాహిత్యం దేశవ్యాప్తంగా రూపొందింది.

బహుజన నవలల్లో ప్రయోగించిన భాష అర్థంకాకపోవటం వల్లే అవి పెద్ద చర్చను లేవనెత్తలేదనే వాదన కూడా ఉంది. తెలంగాణ ప్రాదేశికతనూ, దళిత సంస్కృతినీ ప్రతిబింబించే వేముల ఎల్లయ్య కక్క, సిద్ధి నవలలు రాశాడు. ఇందులో ఉపయోగించిన భాష నల్లగొండ జిల్లా మాదిగభాష. ఈ నవలలు

చదవడానికీ, అర్థం చేసుకోవడానికీ కష్టంగా ఉన్నాయనీ, పాఠకునికి భాషాపరీక్ష పెడుతున్నాయని ఫిర్యాదు. ఇలాంటి ఫిర్యాదులకు సమాధానం ఫిర్యాదులే అవుతాయి. ఉత్తరాంధ్ర మాండలికంలో రాసిన నవలను తెలంగాణావాళ్లు చదివినప్పుడు, అలా చదవడం కోసం ఆ ప్రాదేశిక భాషలను ఏదోఒక మేరకు నేర్చుకొని చదివినప్పుడు ఇతర ప్రాంతాలవాళ్లుకూడా తెలంగాణ వ్యవహారాన్ని నేర్చుకోవాలనే వాదన వచ్చింది. నామిని చిత్తూరు కమ్మకులస్తుల మాండలికంలో రాస్తే వాటిమీద చర్చ జరుగుతుంది. కానీ, అదే బండినారాయణ స్వామి అనంతపురం వ్యవహారంలో రాస్తే ఎలాంటి చర్చ జరగలేదు. నామిని నవలలన్నీ కమ్మ స్త్రీల సాంస్కృతిక జీవితాన్ని చిత్రించాయి. కానీ, చిలుకూరి దేవపుత్ర, బండినారాయణ స్వామి వంటి బహుజన రచయితలు కులవ్యతిరేకకావ్యభాష ఆధిపత్యవర్ణాలు మాట్లాడే భాషలో రాశారు. నాటకాలు పాత్రోచిత భాష పేరుతో కులాన్నిబట్టి పాత్రల వ్యవహారతీరును నిర్ణయించారు. నవలాప్రక్రియలో మొత్తం నవల అగ్రవర్ణాలు మాట్లాడుకొనే తెలుగులో రాస్తూ, పాత్రల సంభాషణలు కులాన్నిబట్టి రాయటం తెలుగు నవల్లో కనిపిస్తుంది. ఈ పద్ధతికి విరుద్ధంగా బహుజన నవలారచయిత బ్రాహ్మణేతర భాషలో రాశాడు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రచయితలు వాళ్ల కులభాషల్లో రాయటం మొదలుపెట్టారు. వేముల ఎల్లయ్య మాదిగ భాషను, భూతం ముత్యాలు మాలభాషను, ఏకుల వెంకటేశ్వర్లు యానాదుల భాషను, బండినారాయణ స్వామి శూద్ర భాషను నవలారచనకు తీసుకున్నారు. అయితే, వీళ్ల భాషలు ఆయా ప్రాంతాల వ్యవహారాలకు లోబడి వుంటాయని గ్రహించాలి. ఎల్లయ్య, ముత్యాలు తీసుకున్న భాష తెలంగాణ ప్రాంతానికీ, ఇనాక్, బండినారాయణ స్వామి, దేవపుత్రలు వాడిన భాష రాయలసీమ ప్రాంతానికీ లోబడి వుంటాయి. కళ్యాణరావు, డా॥ వి. చంద్రశేఖరరావు, ఏకుల వెంకటేశ్వర్లు, సలీంలు ఉపయోగించిన భాష ప్రకాశం జిల్లా యాస స్వభావం కలిగి కోస్తాంధ్ర భాషకు లోబడివుంటాయి.

ప్రాదేశిక కుల వ్యవహారాలు, నుడికారాలతో బహుజన నవల విలసిల్లింది. తెలుగు భాషను విస్తృతం చేసిందని పేర్కొనవచ్చు. నిసర్గ భాషాసౌందర్యాన్ని పాఠకులకు అందించింది. బహుజనులు నవలలే రాయకుంటే ఇంత అందం వెలికివచ్చేది కాదు. అంటరాని వసంతం, మీరాజ్యం మీరేలండి, కక్క, సూర, అనంతజీవనం నవలలు మూడు ప్రాంతాల బహుజన నుడికారానికి భాషాకోశాగారాలయ్యాయి. రచనలు చేస్తే వాటిని అర్థం చేసుకోవటమెలాగో విమర్శకులకుబహుజన నవలల్లో కమ్యూనిస్టుల నిజాయితీ రాహిత్యాన్నీ, కులాన్ని కమ్యూనిస్టుపార్టీలు అర్థంచేసుకొన్న పద్ధతిమీద చర్చ కన్పిస్తుంది. వేముల ఎల్లయ్య రాసిన 'కక్క' నవలలో 'విప్లవరెడ్డి' పాత్ర ద్వారా కమ్యూనిస్టు ఉద్యమం వల్ల ఎవరు లబ్ధిపొందారనే సత్యాన్ని తెలుపుతాడు. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం వల్ల సాధారణ ముస్లిం కుటుంబాలను రజాకార్ల పేరుతో తరిమేసి వాళ్ల భూములను రెడ్డికులస్తులు ఆక్రమించుకున్న సంఘటనలను ఈ నవలలో రచయిత చిత్రించాడు. అనంతపురం జిల్లాలో ఫ్యాక్షనిస్టుల రక్షణ కోసం మావోయిస్టు గ్రూపులు పనిచేయటం, ఫ్యాక్షనిస్టులు చంపలేనివాళ్లను మావోయిస్టులతో చంపించటం గురించి 'మీరాజ్యం మీరేలండి' నవలలో బండినారాయణ స్వామి రాస్తాడు. గోవిందు కమ్యూనిస్టు నాయకుడిగా మొదలై, ఆ తర్వాత మావోయిస్టు కార్యకర్తగా మారిపోతాడు. అందులోనూ ఇమడలేక చివరికి కాంట్రాక్టు హంతకుడిగా మారిపోతాడు. తోచలేదు. బహుజనుల విముక్తికి మార్క్సిజం సరిపోదనే విషయాన్ని బలంగా రచయిత చెప్తాడు.'అంటరాని వసంతం' పూర్తిగా మావోయిస్టు స్ఫూర్తితో నడిచే నవల. కమ్యూనిస్టులు కులాన్ని పట్టించుకోలేదనే విమర్శకు ఈ నవల ద్వారా సమాధానం చెప్పే ప్రయత్నం చేశాడు, కళ్యాణరావు. నిజానికీ నవలలో మూడు ముఖ్యమైన విశేషాలు కన్పిస్తాయి. కథలోని పాత్రదారులంతా దళిత క్రైస్తవులు. కుల సమస్య చర్చాంశం. మావోయిజం పరిష్కార మార్గం. దళితుల విముక్తికి మార్క్సిజం, మావోయిజమే మార్గమని నిరూపించే రచన అంటరాని వసంతం. అందుకే, ఈ నవలను దళిత నవలగా గుర్తించడానికి ప్రొ॥ పురుషోత్తం నిరాకరించారు. కులం/వర్గం అనే చర్చను ఈ నవల్లో చాలా సౌకర్యంగా పక్కకు పెట్టడం కనిపిస్తుంది. కమ్యూనిస్టు పోరాటాలే దళితులకు మేలు చేశాయని చెప్పటం ప్రధానోద్దేశం.కుల

సమస్యకు పరిష్కారం మాత్రం కమ్యూనిస్టు, నక్సలైటు పోరాటాలని రచయిత సంకేతిస్తాడు. ఈ నవలలో కుల సమస్యకు అంబేద్కరిజమే పరిష్కారమనే చర్చలేదు. అందమైన వాక్యాలమాటున అలవోకగా అల్లిన త్యాగాల కథతో పాఠకులను మైమరిపించిన కళ్యాణరావు విప్లవోద్యమం యొక్క స్వభావ, స్వరూపాల మీద కిందికుల కార్యకర్తలు, రచయితలు లేవనెత్తిన చర్చను చాలా సుఖంగా విస్మరించాడు. కానీ, ఈ నవల వచ్చిన పది సంవత్సరాలకు ఏకుల వెంకటేశ్వర్లు 'ఎన్నెల నవ్వు' వెలువరించాడు. యానాది కులానికి చెందిన వ్యక్తి విప్లవోద్యమంలో పనిచేసి, త్యాగాలు చేసి ఈ దేశంలోని కుల సమస్యకు మార్క్సిజం పరిచిలుకూరి దేవపుత్ర రాసిన 'పంచమం' నవల్లో కూడా కమ్యూనిస్టు రాజకీయాలుంటాయి. కానీ, ప్రధాన నాయకుడు వాటిని అభిమానిస్తాడుగానీ వాటిలో చేరడు. విద్యా, ఉద్యోగం, రాజకీయ పదవుల వల్ల దళితుల్లో మార్పు రాదనీ, స్వతంత్రమైన అధికారం సంపూర్ణంగా దళితుల చేతికి వచ్చినప్పుడే సమాజం మారుతుందని కథానాయకుడు భావిస్తాడు. ఈ ఎరుకతో నవల ముగుస్తుంది. కమ్యూనిస్టు రాజకీయాలను కేవలం ప్రస్తావించటమే తప్ప వాటిపట్ల పెద్ద ఆసక్తి రచయితకు 'నల్లమిరియం చెట్టు' నవల్లో డా॥ వి. చంద్రశేఖరరావు కూడా కమ్యూనిస్టు, నక్సలైటు ఉద్యమాలను ప్రస్తావిస్తాడు. రాజాసుందరం తమ్ముడు కరుణకుమార్. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా మొదలవుతాడు. ఉన్నదని భావించలేం. ష్కారం కాదనే చర్చను శక్తిమంతంగా చేస్తాడు.'నల్లమిరియం చెట్టు' నవల్లో డా॥ వి. చంద్రశేఖరరావు కూడా కమ్యూనిస్టు, నక్సలైటు ఉద్యమాలను ప్రస్తావిస్తాడు. రాజాసుందరం తమ్ముడు కరుణకుమార్. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా మొదలవుతాడు. రాజాసుందరం సమాజం కోసం ఏమీ చేయట్లేదని విమర్శిస్తాడు. నక్సలైటు ఉద్యమంలో చేరి అడవుల్లోకి వెళ్లిపోతాడు. నక్సలైటు ఉద్యమం నుంచి బయటికొచ్చి, మాదిగ దండోర ఉద్యమం తీవ్రంగా రిజర్వేషన్ వర్గీకరణ పోరాటం చేస్తుంటే, కరుణకుమార్ చాలాకష్టపడి పనిచేస్తాడు. డబ్బుకు, అధికారానికి అన్న రాజాసుందరం అమ్ముడుపోతున్నాడని గ్రహించి నిలదీస్తాడు. దీంతో రాజాసుందరం సొంత తమ్ముణ్ని చంపించేస్తాడు. దండోరా ఉద్యమానికి మాజీ నక్సలైట్లు పనిచేసిన తీరును చెప్తాడు. నక్సలైటు ఉద్యమం పట్ల ఆసక్తిని కనబరుస్తూ రచయిత నవల నడిపినట్టు మనకు కనిపిస్తుంది. ఈ రకంగా బహుజన నవలల్లో కమ్యూనిస్టు ఉద్యమం, నక్సలైటు ఉద్యమం పట్ల సానుభూతి ఉంది. అయితే, మార్క్సిజం కులసమస్యను పరిష్కరించుకొనేందుకు తోడ్పడదనే ఎరుకను కూడా చర్చకు పెట్టింది. కమ్యూనిస్టుల, నక్సలైట్ల ఉద్యమాలను విమర్శనాత్మకంగా చూడటం బహుజన నవల్లో కనిపిస్తుంది.

కులాన్ని చిత్రించకపోతే అది బహుజన నవల కాలేదు. వాతావరణ చిత్రణ పేరుతో ఆ సంఘటన జరుగుతున్న స్థలంలో కన్పించే చెట్లు, వాగులు, నదులు, ఇంటిపెరడు, రోడ్డుమీది దుకాణాలు, మేఘావృత ఆకాశం, పరిగెత్తే వాహనాలు మాత్రమే చిత్రించారు. కానీ వీటివల్ల నిజమైన వాతావరణం నవలలోకి రాలేదు. సమాజంలోని సంస్కృతిని చిత్రిస్తేనే ఆ స్థలంలోని వాతావరణం నవలలోకి వస్తుంది.వర్తమాన సమాజాన్ని నవలలోకి తీసుకురావటమే వాతావరణ చిత్రణ. ఎమిలీ జోలా వలే వాస్తవికత పేరుతో సెట్టింగ్‌ను కచ్చితమైన కొలతలతో చిత్రించటం బహుజన నవలలో కనిపించదు.వర్తమాన సమాజాన్ని నవలలోకి తీసుకురావటమే వాతావరణ చిత్రణ. ఎమిలీ జోలా వలే వాస్తవికత పేరుతో సెట్టింగ్‌ను కచ్చితమైన కొలతలతో చిత్రించటం బహుజన నవలలో కనిపించదు. బహుజన నవలలో వాతావరణ చిత్రణ విడిగా వుండదు. అది పాత్రల వ్యక్తిత్వంలో అంతర్లీనమై వుంటుంది. పరిసరాల పరికల్పన విడిగా ఉండదు. కథాపరిణామక్రమంలో పరిసరాల పరికల్పన రూపొందుతుంది.బహుజన నవల అణగారిన వర్గాల సంస్కృతిని నవల వాతావరణంలోకి తీసుకొచ్చింది.వేముల ఎల్లయ్య రాసిన 'కక్క' నవలలో శూద్రులు, మాదిగలు, ముస్లింలు ఐక్యమై రెడ్లను, ఆంధ్ర కమ్మోలను ఎదుర్కొంటారు. అదేవిధంగా భూతం ముత్యాలు రాసిన 'సూర'లో సూరని బోధనలతో చైతన్యవంతులైన శూద్రులు, ముస్లింలు కల్సి రెడ్డిని చంపేస్తారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ రాసిన 'అనంతజీవనం' నవలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యత వ్యక్తమవుతుంది. రెడ్డిని బజారన్న తన్ని లాకప్‌లో వేయటం, యద్దిప్ప అన్నికులాల వాళ్లకు ఇండ్లు కట్టివ్వడంతో పాటు వాళ్ల మంచిచెడ్డలో పాలుపంచుకోవటం కనిపిస్తుంది. అంటరానివసంతం

నవలలో అన్నికులాలు సాయుధ పోరాటంలోకి రావటం కనిపిస్తుంది. ఎన్నెల నవ్వులో యానాదులకు, ఇతర కులస్తులకు మధ్య వుండే సంబంధాలను చక్కగా వర్ణించాడు. కాలువ మల్లయ్య రాసిన సాంబయ్య చదువు నవలలో సబ్బండవర్ణాల మధ్య ఐక్యతను,ఘర్షణను చిత్రించిందిరెడ్లు, వెలమలు చేసే కుట్రలను చిత్రించింది. ఈరకంగా బహుజన నవల సమాజంలోని అన్ని కోణాలను సృజించింది.

బహుజన నవల ప్రాంతాల వారిగా రావటం వల్ల ప్రాదేశిక బహుళత్వం వ్యక్తమైంది. అన్ని సామాజిక వర్గాల నిర్ధిష్టతలను అది వ్యక్తీకరించటం వల్ల సామాజిక బహుళత్వం కనిపిస్తుంది. వేర్వేరు ప్రాంతాల, కులాల భాషా వ్యవహారాలను, సంస్కృతులను వ్యక్తం చేసింది కాబట్టి భాషాపరమైన, సాంస్కృతికమైన బహుళత్వం కనిపిస్తుంది. ఈ రకంగా వలసానంతర జీవితంలోని వైవిధ్యం, బహుళత్వం చాలా స్పష్టంగా బహుజన నవలలో కనిపిస్తుంది డా॥ వి. చంద్రశేఖరరావు 'నల్లమిరియం చెట్టు' రాసేవాడు కాదు. దండోరా ఉద్యమ నాయకత్వం తన స్వప్రయోజనాల కోసం అమ్ముడుపోతుందనీ, అలాంటి నాయకత్వం వల్ల మాదిగజాతి నాశనమైపోతుందనే అవగాహన ఆయనలో కనిపిస్తుంది. మాదిగల చైతన్యానికి ప్రతిస్పందనగా మాలలు రచనలు చేయటం ప్రారంభించారు. భూతం ముత్యాలు 'సూర' నవల ప్రతిస్పందన చైతన్యానికి సాక్ష్యం. ఈ నవలలో రిజర్వేషన్ వర్గీకరణను వ్యతిరేకించదు. కానీ, విద్యా, ఉద్యోగాల్లోకీ, రాజకీయాల్లో ప్రవేశిస్తేనే మాలలు, ఇతరులు అభివృద్ధి చెందుతారనే అవగాహన 'సూర' నవలలో కన్పిస్తుంది. మాదిగలు రాజ్యాధికారంలోకి రావాలని బండినారాయణ స్వామి 'మీరాజ్యం మీరేలండి' నవలలో చెప్తాడు. మాదిగలు, బోయలు ఇద్దరూ ఫ్యాక్షన్ గొడవల్లో పడి నాశనం కాకుండా, బహుజన రాజకీయాలు నెరపాలన్నది రచయిత ఉద్దేశం. అనంత జీవనంలో మాదిగల జీవితాలను లిఖించటంలో కూడా మాదిగ చైతన్యం కనిపిస్తుంది. దేవపుత్ర 'పంచమం' నవలలో కథానాయకుడు మాదిగ. దండోర ఉద్యమం పట్ల కాస్త విమర్శనాత్మక దృష్టి ఉన్నప్పటికీ అధికారంలేనిది ఏమీ చేయలేరని ఈ నవల చెప్తుంది. మాదిగ చైతన్యం ఊపుగా వచ్చింది. మాలలు తమ చైతన్యాన్ని దళిత సాహిత్యం పేరుతో వ్యక్తం చేశారు. ఇదొక సాంఘిక పరివర్తన ఉద్యమంలో మలుపు.

తెలగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీల రచనలు వెలువడ్డాయి. కానీ, ఉత్తరాంధ్ర నుంచి మాత్రం దళిత నవలా రచయితలు లేరు. అదేవిధంగా, ఎస్టీ, బిసీ, మైనార్టీ నవలా రచయితలు పెద్దగా లేరు. అందుకే, ఉత్తరాంధ్ర సామాజిక, సాంస్కృతిక విషయాలు బహుజన నవలలోకి ప్రవేశించ లేదు. కృత్రిమ యాంత్రికతలో ఆధిపత్య కులాల నవల ఆగిపోయింది. వేలాది కులాల విశాలమైన అనుభవాన్ని, జీవన సారాంశాన్ని వ్యక్తం చేసే బహుజన నవలలు విరివిగా వచ్చే అవకాశం ఉంది. కోస్తాంధ్ర ప్రాంతాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీల రచనలు వెలువడ్డాయి. కానీ, ఉత్తరాంధ్ర నుంచి మాత్రం దళిత నవలా రచయితలు లేరు. అదేవిధంగా, ఎస్టీ, బిసీ, మైనార్టీ నవలా రచయితలు పెద్దగా లేరు. అందుకే, ఉత్తరాంధ్ర సామాజిక, సాంస్కృతిక విషయాలు బహుజన నవలలోకి ప్రవేశించ లేదు. కృత్రిమ యాంత్రికతలో ఆధిపత్య కులాల నవల ఆగిపోయింది. వేలాది కులాల విశాలమైన అనుభవాన్ని, జీవన సారాంశాన్ని వ్యక్తం చేసే బహుజన నవలలు విరివిగా వచ్చే అవకాశం ఉంది.